# వెనుతిరగని వెన్నెల

నవల

- డా.కె.గీత



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 226

కౌముది మాసపత్రికలో

జనవరి 2015 సంచిక నుంచి డిసెంబర్ 2020 సంచిక వరకూ

వచ్చిన నవల

# (ప్రారంభం)

"యు హేవ్ ఎరైవ్డ్ యువర్ డెస్టినేషన్"

సమీర జీ.పీ యస్ ని ఆపి, కారు దిగింది. చుట్టూ పరికించి చూసింది.

"గ్రేట్ అమెరికా, ఈ జీ.పీ యస్లు లేకముందు అడ్రస్ లు అసలెలా కనుక్కునే వారో!" అని నిట్టూర్చి ఎదురుగా కనబడుతున్న ఇంటి నంబరు, "వాట్స్ అప్" లో ఉదయిని పెట్టిన నంబరు ఒకటో కాదో సరి చూసుకుంది.

సిలికాన్ వేలీ లో చక్కని రెసిడెన్షియల్ ఏరియా అది. ఆపిల్, గూగుల్ ఆఫీసులన్నీ చుట్టూ పదిమైళ్ల పరిధిలోనే ఉంటాయి.

వీధిలో ఇళ్లన్నీ దాదాపు ఒక్కలాగే ఉన్నాయి. ఇళ్ల ముందు గార్డెన్ల సైజు తో సహా.

గేట్లు లేని చదునైన లాన్లు, బాట కిరుప్రక్కలా అందంగా విరిసిన గులాబీ మొక్కలు, అంతకు రెట్టింపు అందంతో విరగకాసిన పొట్టి పొట్టి నిమ్మ చెట్లు, నారింజ చెట్లు.

"అయాం కమింగ్ హోమ్ లేట్ టు డే..." నడుస్తూ సాయికి టెక్స్ట్ చేసింది.

"వేర్ ఆర్ యూ?" రిప్లై చూసి చిన్నగా నిట్టూర్చింది.

డోర్ బెల్లు కొట్టే ముందు అమెరికా మర్యాదని అనుసరించి ఉదయినికి కాల్ చేసింది.

అప్పుడు గమనించింది. డోర్ మేట్ మీద "సహాయ" అని కుట్టి ఉంది. ఇంటి ముందు వేళ్లాడదీసి ఉన్న గల గల మోగే చిన్న అద్దాలతో గుండ్రంగా తిరుగుతున్న విండ్ బెల్ మధ్య, బాట పక్కగా ఉన్న చిన్న గులక రాళ్ల మీద, తలుపుకిరుపక్కలా చిన్న దీపపు కుందెల మీద అవే అక్షరాలు.

డోర్ పక్కగా ఉన్న అద్దాల వెనక నించి చిన్న అందమైన తెలుగు అక్షరాలు "సహాయ".

"ఇలా సంస్థ పేరుని "నేమ్ ప్లేట్" గా వేళ్ళాడ దీయ కుండా అన్ని చోట్లా అందంగా అమర్చడం భలే బావుందే" అనుకుంది సమీర.

తలుపు తెరుస్తూనే ఉదయిని "సమీరా.....దా, దా... "అంటూ కౌగలించుకుంది. తల స్నానం చేసి విరబోసుకున్న జుట్టు నించి మంచి ఆహ్లాదమైన సువాసన వస్తూంది.

చక్కని పలువరసతో నవ్వు, కళ్ళ చుట్టూ చిన్న గీతల కాటుకతో మంచి మెరిసే కళ్లు.

బొట్టు చిన్నగా ఉన్నా, చామన ఛాయగా ఉన్న అందమైన ముఖమ్మీద సరిగ్గా అమరినట్టున్న చిన్నచుక్క. మాములు ఆడవాళ్ళ కంటే కొంచెం ఎత్తు అన్పిస్తూన్న హుందాతనం. అన్నిటి కంటే ఆశ్చర్యకరమైన విషయం చక్కగా పొందికగా ఆమెని అల్లుకున్న లేత చందనం రంగు చీర.

అమెరికాలో ఇంత మోడ్రన్ యుగంలో ఇలా చక్కగా చీరతో ఎదురయిన ఉదయినిని చూసి సమీరకి తెలీని గౌరవమేదో కలిగింది. అంతకు మించిన ఆశ్చర్యమూ కలిగింది.

"మా అమ్మకు స్నేహితురాలంటే వేరేగా ఊహించుకున్నాను. మీరు నిజంగానే అమ్మ చెప్పిన "ఉదయిని ఆంటీ" అంటే నమ్మబుద్ధి కావడం లేదు. మీ వయసు నలభై లోపే. యామై కరెక్ట్?" అంది సమీర పెద్ద కళ్ళు చేసి ఆశ్చర్యంగా.

"అవన్నీ సరేలే. అంతా చెప్పే మాటలే. అయినా నువ్విలా ఇలా గుమ్మం దగ్గిర నిలబడి, పరాయి అమ్మాయిలా ఫోన్ చెయ్యక్కరలేదు." అంది ఉదయిని సమీర చేతిలో బేగ్ అందుకుంటూ.

తెల్లని గోడంతా పెద్ద పెద్ద పూలతో అల్లుకు పోతున్నట్లున్న వరుస పసుపు, నారింజ పూల పెయింటింగులు.

అందుకు తగ్గ మేచింగ్ ఫర్నిచర్. మూల గాజు బీరువా లో "సితార". అరల నిండా చక్కగా పేర్చి ఉన్న పుస్తకాల ముందు వరుసలో "అమృతం కురిసిన రాత్రి ".

"వావ్! యువర్ హోమ ఈజ్ సింపుల్ అండ్ నైస్ ... ఆంటీ" అని,

"నేను మిమ్మల్ని ఆంటీ అనొచ్చా?" అంది సమీర.

"తప్పకుండా అనొచ్చు. మీ మమ్మీ, రాజీ నాకంటే అయిదేళ్ళు సీనియర్. కానీ చాలా తమాషాగా మేమిద్దరం మంచి స్నేహితులమయ్యాం. వయసు మా మధ్య ఎప్పుడూ ప్రతిబంధకం కాలేదు. మేమిద్దరం ఒకటే సంవత్సరం లో పుట్టకపోయినా ఒకటే తారీఖున పుట్టాం. అదొక కారణమనుకుంటా మా గాఢ స్నేహానికి." అని

"అవునూ, ఎలా ఉంది తను? ఎప్పటికప్పుడు ఫోను చెయ్యాలనుకుంటూనే కాలం గడిచిపోతూ ఉంది." అంది ఉదయిని.

"మీ కంటే అయిదేళ్లే పెద్దదైనా.... అమ్మమ్మలా తయారైంది. ఒక హుషారు ఉండదు, ఏవీ ఉండదు. అమ్మకు ఎప్పుడూ ఏదో ఒక బెంగే." అని నిట్టూర్చింది సమీర.

"మీరేమో ఇంత కళాత్మకంగా ఉన్నారు. అమ్మకు, మీకు అసలు స్నేహం ఎలా కలిసిందా అని ఆశ్చర్యంగా ఉంది." అంది మళ్లీ.

"స్నేహమనేది గొప్ప విచిత్రమైంది సమీరా ! ఎప్పుడు ఎవరు ఎవరికి పరిచయమవుతారో, ఎందుకు స్నేహమవుతారో! కొన్ని స్నేహాలు చాలా త్వరగా కుదురుతాయి. కొందరు పరిచయస్థులుగానే మిగిలిపోతారు ఎప్పటికీ. స్నేహాలు ఎన్ని రోజులలో ఎంత త్వరగా కుదిరినా, మనతో ఎప్పటికీ వచ్చేవి అతి కొన్ని మాత్రమే. నాకు దొరికిన అతి కొద్దిమంది స్నేహితుల్లో రాజీ తో స్నేహం నేనెప్పటికీ మర్చిపోను. మా ఇద్దరికీ పరిచయం కూడా కాకతాళీయంగా జరిగింది.

హైస్కూల్లో మా డ్రిల్లు మాస్టారు నన్ను పిలిచి "అమ్మాయ్, అదుగో ఈ సీనియర్ల బేచ్ లో కుంటాట ఆడడానికి ఒకమ్మాయి తక్కువైంది. నువ్వాడతావా? అనడిగేరు.

నన్నే ఎందుకడిగేరో నాకప్పుడు తెలీదు.

రోజూ సీనియర్లంతా ఆడుతున్నపుడు చకచకా తప్పించుకుని మెరికలా పరుగెత్తే అమ్మాయి వైపు నేను భలే ఆరాధనగా చూసేదాన్ని.

ఆ అమ్మాయే నన్ను రికమండ్ చేసిందని నాకు చానాళ్ళ తర్వాత తెలిసింది".

"నన్ను చెప్పనివ్వండి. మిమ్మల్ని రికమండ్ చేసింది అమ్మే కదూ" అంది సమీర.

'ఊ.. బానే చెప్పేసేవు. కానీ నన్ను రికమండ్ చేసింది మీ అమ్మ కాదు, మీ అమ్మకు స్నేహితురాలు.

అయితే ఆ అమ్మాయికి సరిగ్గా ఆడాల్సిన సమయంలో కాలు మెలి పడి దెబ్బ తగిలింది. రోజూ ఆరాధనగా వీళ్ల ప్రాక్టీసు సెషన్ దగ్గర హాజరయ్యే నన్ను గమనించి, డ్రిల్ మాస్టారికి రికమండ్ చేసింది.

ఆ ఆటలో మా బేచ్ గెలవగానే మీ అమ్మ ప్రశంసా పూర్వకంగా నన్ను దాదాపు ఎత్తుకుంది. అలా మొదలైంది మా స్నేహం". అని ఒక్క క్షణం ఆగి

"అయినా మీ అమ్మకు కళాత్మకత లేదని ఎందుకు అనుకుంటున్నావు?"

"ఈ పుస్తకం చూడు" ఎదురుగా పుస్తకాల బీరువాలో ప్రత్యేకంగా ముందు వరుసలో పెట్టిన "గీతాంజలి" ని చూపించింది.

సమీర "ఇంత పాత పుస్తకాన్ని ఇంత జాగ్రత్తగా దాచారా?" అంది అందుకుంటూ.

మొదటి పేజీలో ముత్యాల్లాంటి అక్షరాలు.

"ప్రభూ! దయ అను ఈ అమ్మాయికి నన్ను స్నేహితురాలిని చేసావు. నీ దయతో నన్ను పునీతం చేసి నా "దయ" గా ప్రసాదించావు. ఉదయ మధ్యాహ్న సాయంత్రాల్ని “ఉదయిని”గా మార్చి నా జీవితాన్ని ఉదయింపజేసావు. ధన్య వాదాలు ప్రభూ! శతకోటి నమస్సులు!!"

–ఎప్పుడూ ప్రేమతో

నీ

రాజీ

"అమ్మ రాసిందా! ఇంత అద్భుతమైన వాక్యాలు!!" ఆలోచనలో పడింది సమీర.

పైకి అన్యాపదేశంగా "అమ్మలో ఇంత భావుకత ఉందని తెలీదు నాకిప్పటివరకూ. ఇప్పుడు అర్థమైంది, మీకు అమ్మ ఎందుకు స్నేహితురాలైందో." సాలోచనగా తలాడిస్తూ అంది సమీర.

“నన్ను మీ అమ్మ "దయ" అని పిలిచేది. అప్పటికి ‘చివరకు మిగిలేది’ మేమిద్దరం కలిసి మూణ్ణాలుగు సార్లు చదివేసి, ఆ పుస్తకంలోని ప్రతీ పాత్రతో విపరీతమైన ప్రేమలో పడిపోయాం. నీకో గమ్మత్తు విషయం చెప్పనా!

నేను రాజీని "రాజేశ్వరి" అని పూర్తి పేరుతో పిలిచినప్పుడు తన ముఖంలో విరిసే చిరు కోపం చూడాలి! తనకెందుకో అలా పూర్తి పేరుతో పిలవడం ఇష్టం ఉండేది కాదు. "మైదానం" తో ఏకీభవించకేమో.

అన్నట్లు ఆ రెండు పుస్తకాలు నువ్వు చదివేవా?!” అంది ఉదయిని.

లేదన్నట్లు తలాడించి “ మీరు చెప్తుంటే తప్పక చదవాలని అన్పిస్తూంది” అంటూ

"ఇదేవిటీ, ఎండిన మల్లెపూల మాల! ఈ మధ్య పేజీలో" అంది జాగ్రత్తగా పేజీని తిరగేస్తూ సమీర.

దాదాపు ముట్టుకుంటే పొడై రాలి పోయేట్లుంది.

"అది రాజీ నాకు పుస్తకంతో బాటూ ఇచ్చిన మల్లెపూల మాల. వాళ్ల పెరట్లోంచి గుప్పెడు మల్లెలు కోసి తీసుకు వచ్చి, మాల కట్టి నా తలలో తురిమి ఎంత మురిసిపోయిందో చెప్పలేను. నా ముఖంలోకి చూసి మెటికలు విరిచి, నా బుగ్గ మీద ముద్దుపెట్టడం ఇప్పటికీ జ్ఞాపకం ఉంది."

"వావ్ ఆంటీ, మీ ఇద్దరి స్నేహం చూస్తే అసూయగా ఉంది నాకు" అంది సమీర.

“అలాంటి మీ అమ్మతో సంవత్సరానికి ఒక్కసారి మాట్లాడడానికి కూడా ఈ స్నేహితురాలికి తీరిక లేదు చూసేవా? “అని నిట్టూర్చి

“నీ పెళ్లికి కూడా రాలేక పోయాను. ఆరు నెలలయ్యిందా మీ పెళ్లయ్యి?" అంది ఉదయిని.

సమాధానంగా తలూపింది సమీర.

“ఊ... వస్తూనే మా సంగతులన్నీ చెప్పేసేను. నీ గురించి ఒక్క మాట కూడా చెప్పనివ్వలేదు. చెప్పు... చెప్పు.. ఇక్కడ ఏం చేస్తున్నావు?” అంది ఉదయిని.

“ఈ సెమెస్టర్ తో ఎమ్మెస్ పూర్తి అయిపోతుంది ఆంటీ. ఇక ఉద్యోగం వెతుక్కోవాలి”. అని దీర్ఘంగా నిట్టూర్చింది.

“ఊ.. స్పెషలైజేషన్ ఏవిటీ, అంకుల్ మరో కొత్త కంపెనీ లో చేరే ఆలోచనలో ఉన్నారు. ఓపెనింగ్స్ ఉంటే చెప్తాను”.

అందుకు సమాధానం చెప్పి,“మీరెప్పుడొచ్చారు యూఎస్ కి? తెలుగు ఇంత బాగా, మర్చిపోకుండా మాట్లాడుతున్నారు?” అంది సమీర అంతలోనే.

"మన మాతృ భాషని మనం మర్చి పోవడం ఏవిటీ? నిజానికి ఇతర దేశాల్లో ఎన్నేళ్ళున్నా ఎవరూ స్వంత భాషని మర్చిపోరు. కొందరు అదేదో నామోషీ అనుకుని మాట్లాడరనుకుంటా. అన్నట్లు మేమెప్పుడొచ్చాం అనడిగావు కదా. దాదాపు పదేళ్లవుతూంది."

"మీ పాప ఇక్కడే పుట్టిందయితే"

ఊ.. అవును, "సహాయ" ఇక్కడే పుట్టింది.

"ఓ, అమ్మాయి పేరేనన్నమాట మీ సంస్థకి కూడా."

"మీరు "సహాయ" తో ఎంతో మంచి పని చేస్తున్నారాంటీ. ఐ రియల్లీ అప్రిషియేట్ యూ. ఇలా ఎవరైనా సహాయం చెయ్యక పోతే ఇంత దూరంలో, అమెరికా లో ఆడవాళ్లకి అనుకోని కష్టాలొస్తే ఎవరు ఆదుకుంటారు?" ప్రశంసా పూర్వకంగా అంది సమీర.

"నీ గురించి చెప్పు సమీరా, అమెరికా నీకు నచ్చిందా?"

"నచ్చడమంటే, ఇక్కడ అలవాటు పడితే ఇంత కంటే హాయి ఏముంది చెప్పండి. యా... డెఫినెట్లీ... ఐ లైక్ దిస్ కంట్రీ మరి మీకు?"

"వచ్చిన కొత్తలో ఎప్పుడు వెళ్ళిపోదామా అని ఉండేది. కానీ ప్రశాంత్ తన కెరీర్ ని ఇక్కడ ఎంచుకున్నాడు. అన్నిటికంటే 'కుటుంబమే ముఖ్యం' అన్నది నా భావన. ఇక నా ప్రపంచాన్ని ఇక్కడ నేనే సృష్టించుకున్నాను."

"భలే బావుంది, మీతో ఎంత సేపు మాట్లాడినా మాట్లాడాలని అనిపిస్తూంది. ప్రశాంత్ అంకుల్ ఎంతో అదృష్టవంతులు." అంటూ

"ఈ బొమ్మ ఎవరు వేసారు? మీ టేస్ట్ లో లేదు? అంది" దగ్గరగా వెళ్లి సమీర.

"మా అబ్బాయి క్రాంతి. ఇప్పటి కాలపు చిత్రలేఖనం ఇలానే ఉంటుందంటాడు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ఉన్నాడు. బొమ్మలు వేయడం వాడి హాబీ. "

"మీ అమ్మాయి పాటలు పాడుతుందా? " అంది సమీర.

"అవును, అంత కరెక్టుగా ఎలా చెప్పావు?"

"ఏం లేదు, మీకున్న కళలు మీ పిల్లలిద్దరికీ చెరొకటీ వచ్చి ఉంటాయని ఊహించా". అని నవ్వింది సమీర.

ఉదయిని సెల్ ఫోను మోగింది.

"ఒక్క నిమిషం సమీరా" అంటూ ఫోనందుకుంది ఉదయిని.

అంత వరకూ మమూలు గృహిణిలా ఉన్న తను హఠాత్తుగా ఒక ప్రొఫెషనలిస్టుగా మారిపోయింది.

అవతలి వాళ్లతో చక్కగా మంచి ఇంగ్లీషులో మాట్లాడుతూ మధ్య మధ్య నోట్ బుక్ లో చిన్నగా ఏదో నోట్ చేసుకుంటూ అపాయింట్మెంట్ వివరాలు చెబుతూంది.

తలూపుతూ మధ్య మధ్య తన వైపు చూస్తూ చెదరని చిర్నవ్వుతో మాట్లాడుతున్న ఉదయిని వైపే చూస్తూ ఉండాలనిపించింది సమీరకు.

మరీ బావుండదనిపించి కుర్చీలోంచి లేచింది.

హాలునానుకుని కనిపిస్తూన్న ఆవరణలో అందంగా పేర్చిన గుండ్రని రాళ్ళు, మధ్య పచ్చని లాన్, ఆ మధ్య చిన్న జలపాతాన్ని పోలిన నీటి ప్రవాహం. జలపాతమ్మీదికి అల్లిబిల్లిగా వాలిన పూలతీగల పందిరొకటి.

"జీవితంలో తనకేది కావాలో, ఎలా కావాలో.. అవన్నీ సమకూరడం ఎంత అదృష్టం" అనుకుంది సమీర.

లాన్ కి అని వైపులా గులక రాళ్లమీద పేర్చిన "సహాయ" అక్షరాలు.

"సహాయ" –ఎంత మంచి పేరు! " అనుకుంది సమీర.

అమ్మ తనని పట్టుబట్టి ఇక్కడికి ఎందుకు పంపించిందో ఉదయినిని, వాళ్ళ ఇంటిని చూసేక అర్థమైంది.

"సారీ సమీరా, చాలా సేపు పట్టింది" అంది ఉదయిని.

"అహాహా, అయాం ఒకే ఆంటీ, నేనే మీ వర్క్ సమయంలో వచ్చి ఇబ్బంది కలిగిస్తున్నానా?" అంది సమీర.

"భలేదానివి, నిన్ను చూస్తే మీ అమ్మను చూసినట్టే అనిపిస్తూంది. నువ్విలా రావడం నాకెంతో సంతోషంగా ఉంది తెలుసా?" అని

"నీ కిష్టమైన స్వీటేవిటి చెప్పు చేసి పెడతాను. కొంపదీసి రాజీ లాగా "సేమ్యా పాయసం" అని మాత్రం అనకు. తనెప్పుడూ అదే చెప్పేది" అని గలగల నవ్వింది.

నవ్వినప్పుడు కొసల్లో కొంచెం పెద్దగా ఉన్న పన్ను నవ్వుకి మరింత అందాన్ని తెచ్చి పెట్టింది.

అదే చెప్పింది ఉదయినితో.

"మీ మమ్మీ నన్ను ప్రతీ నిమిషం పొగడమని పంపిందా ఏవిటి?". మరలా నవ్వింది.

గది గోడ పొడవునా ఉన్న అద్దాల లోంచి వెలుతురు కిరణాలు ఏటవాలుగా హాలులోకి పడ్తున్నాయి.

ఒక కొత్త ఉత్సాహమేదో ఆవరించినట్లయ్యి గలగలా కబుర్లు చెప్తోంది సమీర.

"ఈ పెయింటింగులు మీరు వేసినవే కదూ.....?"

"సితార నాకెంతో ఇష్టం, మీరు నాకొక సారి వినిపించరూ....."

"అబ్బా హాయిగా ఇలా ఎవరింటికైనా వచ్చి ఎన్నాళ్లయ్యిందో....." గల గల మాట్లాడుతున్న సమీరని మందహాసంతో చూస్తూ

"మంచి కాఫీ తాగుతూ, అలా యార్డ్ లో కూచుందాం" పద అంది ఉదయిని.

"కాఫీ తాగడం మానేసానాంటీ " అంది చిన్నగా పొట్ట తడుముకుంటూ సమీర అప్పటి దాకా ఉన్న హుషారు తగ్గిపోయి కొంచెం నిరసించిన గొంతుకతో.

"ఏవిటీ, విశేషమా!" అంది దగ్గరగా వచ్చి ఉదయిని.

బదులుగా తలాడించి, "కాఫీ తాగడం ఇష్టంగా ఉండడం లేదీ మధ్య. అస్తమాటూ వామిటింగ్ సెన్సేషన్. మొదట రెండు నెలలు బాగా ఎక్కువగా అనిపించింది. కానీ ఇప్పుడు కాస్త నయమేలెండి. నాలుగు నిండేయి కదా. డాక్టరు చెప్పింది ఇక తగ్గుతాయని."

"ఒకే, బూస్ట్ నీకు, కాఫీ నాకు." అని ఇంకా దిగులుగా ఉన్నట్లున్న సమీర దగ్గిరకి వచ్చి

"ఇలా చూడు సమీరా! ఈ సమయంలో ఇలా దిగులుగా ఉండ కూడదు. నీకేం కావాలో చెప్పు?" అంది ఉదయిని.

"నాకు విడాకులు కావాలి ఆంటీ" నెమ్మదిగా తలెత్తి, స్ఫుటంగా అంది సమీర.

## 2

"ఏమైంది సమీరా?" అనునయంగా అడిగింది ఉదయిని దగ్గిరికి వచ్చి.

"ఏం చెప్పమంటారు ఆంటీ, ఒక కారణం అంటూ చెప్పలేనన్ని ఉన్నాయి. నేనివేళ్టి ఆడపిల్లని. నేనేదీ సహించాల్సిన అవసరం నాకు లేదు. అన్నిటికీ అతను చెప్పిన మాటే వినాలంటాడు. అతని ఇష్టాఇష్టాలు నాకు ముందే తెలిసి ఉండడానికి అతను నాకు ఇంతకు ముందు పరిచయస్తుడు కాదు. అతని బాగోగులు నేను ఆలోచించడానికి అతను నాకు స్నేహితుడు కాదు, అతనేం చేసినా ప్రేమగా

ఓర్చుకోవడానికి అతణ్ణి నేను ప్రేమించలేదు. ఇవన్నీ లేకుండా 'అతను నీకు తాళి కట్టిన భర్త' అనే చింతకాయ పచ్చడి డైలాగులు చెప్పేవాళ్ళంటే నాకు చిరాకు. " అని గబగబా అని

"సోరీ ఆంటీ, మీ సమయం అంతా తినేస్తున్నానా?" అంది సమీర.

"మళ్లీ మళ్లీ 'మీ సమయం' అంటూ వేరు పరచకు సమీరా! నీ జీవితం గురించి తెలియకుండా నేనెటువంటి సలహాలూ ఇచ్చి నిన్ను ఇబ్బంది పెట్టనులే, ముందీ పాలు పూర్తిగా తాగు..."

"ఆ.. అన్నట్లు నీకిష్టమని నేను దొండకాయ వేపుడు చేసి పెట్టేను." అంది ఉదయిని.

"దొండకాయ వేపుడు నాకిష్టమని మీకెలా తెల్సు?" ఆశ్చర్యంగా అంది సమీర.

"అదేమరి, కనిపెట్టా" అని చిర్నవ్వు నవ్వింది.

"అబ్బా, మీ చెదరని చిర్నవ్వు నాకు కాస్త ప్రసాదించండి ఆంటీ, సమస్యలన్నీ గట్టెక్కేస్తాను." అంది సమీర.

"ఊ, అసలేమైంది?" సాలోచనగా అడుగుతున్న ఉదయిని వైపు చూసి,

"ఎక్కణ్ణించి మొదలు పెట్టాలో అర్థం కావడం లేదాంటీ" అంది సమీర.

"అతను నీకు ముందు పరిచయం లేదన్నావు కదా" అంది ఉదయిని.

"ఊ.. ఈ పెళ్లి సంబంధం మొదలైందగ్గర్నుంచి చెప్తాను" అని వెనక్కు జారబడింది సమీర.

"నాన్న మ్యారేజి బ్యూరో ద్వారా వీళ్ల పెళ్ళి సంబంధం తెల్సుకుని, ఫోటోలు పరస్పరం నచ్చాక అతన్ని నేను మొదట స్కైప్ లో చూసేను. మేమిద్దరం యూ ఎస్ లోనే ఉన్నాం. అతను ఇల్లినాయిస్ లో. నేను టెక్సాస్ లో. పది నిమిషాల స్కైప్ లో మేం మాట్లాడుకున్నది ఇద్దరి చదువుల గురించే. మీకు తెలుసు కదా, నేను బాగా ఏంబిషియస్. అతను నన్ను రెండో ఎమ్మెస్ ఎందుకు చదువుతున్నావని అడిగేడు. నేను అతన్ని ఎమ్మెస్ ఎందుకు చెయ్యలేదని అడిగేను. అతను ఉద్యోగం బాధలేవో చెప్పేడు. నేను మరో సెమిస్టర్ లో ఎమ్మెస్ పూర్తి కావాల్సి ఉంది, ఇప్పుడు పెళ్లి ఆలోచన లేదని చెప్పేను. అతను ఇంకా సెటిలవ్వడానికి సమ్యం తీసుకోదలచుకోవట్లేదని అన్నాడు. ఇక మంచి సంబంధం ... అదీ ఇదీ అని మా ఇంట్లో ప్రెజర్సు..... ఇలా కాదు గానీ మీకు మా పెళ్ళి అయిన తర్వాత ఏం జరిగిందో చెప్తాను వినండి" అంది సమీర.

★★★

"మీ నాన్న కి ఎంత గర్వం... నిన్ను పొగడడం తప్ప వేరే పనిలేనట్లుంది" అన్నాడు సాయి రిసెప్షన్లో స్టేజీ మీద తమని ఆశీర్వదిస్తూ వస్తున్న వాళ్ల వైపు నవ్వుతూ చూస్తూ.

"మా నాన్న నన్ను పొగడుతున్నాడనా, నిన్ను పొగడట్లేదనా?" చురక అంటించి తనూ ఎటో చూస్తూ నవ్వింది సమీర.

"చూడు బాబూ, సమీర మా ఒక్కగానొక్క కూతురు. అమ్మాయైనా అబ్బాయైనా తనే అన్నట్లు పెంచాం. తన చదువు కోసమే మేం ఈ సిటీ కి వచ్చాం. నాకున్న ఈ అపార్ట్ మెంట్లు, పొలాలు... మా యావదాస్తులూ తనవే. ఇవన్నీ నా కష్టార్జితాలు. మీరిద్దరూ ఇంతకు మూడింతలు సంపాదించి పిల్లా పాపల్తో హాయిగా ఉండాల్నేదే నా ఆకాంక్ష." అన్నాడు ధనుంజయ.

సమీర ఏదో అనేలోగా పక్కనే కూచున్న సాయి, సమీరకు మాత్రమే వినిపించేలా "మీ నాన్నకు డబ్బు పిచ్చి బాగా ఎక్కువే" అన్నాడు.

మొదటి రాత్రి అంటూ అంతా చేసే హంగామా అసలు నచ్చలేదు సమీరకి.

"ఏవిటి, మాట్లాడితే 'మీ నాన్న' అంటూ..... ఒకటే లెక్చర్లు దంచుతున్నవు? మైండ్ యువర్ టంగ్"

సీరియస్ గా అంది దగ్గిరికి వచ్చిన సాయితో.

అతను ఇవేమీ వినిపించుకునే స్థితిలో లేనట్లు అడ్డదిడ్డంగా విజృంభించేసరికి అవాక్కైంది సమీర.

మర్నాడు భోజనాల దగ్గిర

"అత్తగారికి సహాయం చెయ్యాలని తెలీదా? వచ్చి టేబుల్ దగ్గిర కూచున్నావు?" అవహేళన నవ్వుతో అన్నాడు సాయి.

"నాకు మీ ఇంటి సంగతి తెలియదు, మా ఇంట్లో నేనెప్పుడూ ఇలానే చేస్తాను" అంది ఫోన్ తీసి మెయిల్స్ చెక్ చేసుకుంటూ అందరికీ వినపడేలా.

"అమ్మాయికి పద్ధతులేవీ నేర్పించలేదు. మనమే అన్నీ నేర్పించుకోవాలి ఖర్మ" అని వెనకే వంటింట్లోంచి వినబడింది.

"అసలు వీళ్ల నాన్ననిన్నంతా ఏమేం గొప్పలు పోయేడో తెలుసా అమ్మా, మా అమ్మాయి చదువుల సరస్వతి, ఆమె ఎక్కడ అడుగు పెట్టినా కనకపు వర్షం ... అదీ ఇదీ అని ఒకటే కూతుర్ని పొగడడమే ఎంత సేపూ... " అంటూ వెనకే తందాన తాన అంటూ పెద్దగా చప్పుడూ చేస్తూ చికెన్ బోన్ ని పరపరా నములుతూ అన్నాడు సాయి.

అలా శబ్దం చేస్తూ నమలడం చికాకు పుట్టించింది సమీరకి. అతని మాటలు అంతకంటే కంపరం పుట్టిస్తున్నాయి.

మరో గంటలో అక్కణ్ణించి బయటపడి ఒక ఉదుటున ఆటో ఎక్కి ఇంటికి వచ్చి పడింది సమీర.

" ఏవిటి సమీరా, అబ్బాయేడీ...." వెనక్కి చూస్తూ రాజీ అంటున్న మాటలు వినిపించుకుండా తన గదిలోకి విసవిసా నడిచింది సమీర.

నిక్కరు, టీషర్టు వేసుకుని మంచానికి అడ్డంగా పడుకున్న కూతురి దగ్గరకు వెళ్లి

"కొత్త పెళ్లి కూతురివి, ఇంకా చుట్టాలు కూడా వెళ్లలేదు. చీర కట్టుకోమ్మా..." బతిమలాడుతూ వెనకే వచ్చింది రాజీ.

కొత్తగా మాట్లాడుతున్న అమ్మని చూసి తల తిప్పుకుంది సమీర.

మరో గంట తర్వాత కూడా అలానే పడుకున్న సమీర దగ్గిరికి వచ్చి తల మీద చెయ్యి వేసింది రాజీ.

"అమ్మా, డైనింగ్ టేబుల్ దగ్గిర వండినవన్నీ తెచ్చి పెట్టే బాధ్యత పెళ్లైన అమ్మాయిదా, వాళ్ళింట్లో వాళ్ళదా?" రాజీని వాటేసుకుంటూ అడిగింది సమీర.

"ఈ డైనింగు టేబుల్ గురించెందుకు " అంటూ... ఏదో అర్థమైనట్లు తల పంకించి ".....లేమ్మా... ఇలా అన్నిటికీ మనింట్లో లాగా మారాం చెయ్యకూడదు. చూడు బయట హాల్లో సాయి కూచున్నాడు." అంది రాజీ.

సాయి ఏం చెప్పాడో ఏమో , అప్పుడే బయటి నుంచి వచ్చిన ధనుంజయ లోపలికి వచ్చి "ఏంటమ్మా, ఇలా చెప్పా పెట్టకుండా రావొచ్చా, అంతగా అయితే నాకు ముందు కాల్ చెయ్యొచ్చుగా." అన్నాడు.

తిరిగి వాళ్లింటికి వెళ్తున్నపుడు "ఇంకెప్పుడైనా ఇలా చెప్ప పెట్టకుండా మీ ఇంటికి వెళ్ళేవంటే ఇక నువ్వు జన్మలో మీ ఇంటి గడప తొక్కవు. మా ఇంట్లో ఈ విషయాన్ని సర్ది చెప్పుకునేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది." అన్నాడు సాయి.

ఆ మర్నాడు తిరుపతి ప్రయాణంలో "ఒక్క వారం ఓపిక పట్టు తల్లీ, అమెరికా వెళ్ళిపోతే ఇవన్నీ సర్దుకుంటాయి. పెళ్లయిన కొత్తలో ఇవన్నీ సహజం. అసలు దేనికి సమాధానం చెప్పకు." అనునయంగా అంది రాజీ చెమ్మగిల్లిన కళ్ళతో.

ఇద్దరూ యూ. ఎస్ కి వస్తూనే "నాకు కాలిఫోర్నియాలో జాబ్ వచ్చింది. నువ్వు నీ లాస్ట్ సెమిస్టర్ ని అక్కడే ఏదైనా యూనివర్శిటీకి ట్రాన్స్ఫర్ చేసుకోవాలి. అయినా నువ్వు చదివి ఇప్పుడెవరిని ఉద్ధరించాలి? నా సిన్సియర్ ఎడ్వైజ్ ఏవిటంటే, ఇక నువ్వు చదువు మానేసి శుభ్రంగా పద్ధతులు నేర్చుకో. వచ్చే నెల మా అమ్మ వస్తూంది ఎలాగూ." అన్నాడు సాయి.

"సమీరా, ఇప్పటి వరకు నువ్వు మా అమ్మాయివి మాత్రమే, ఇప్పుడు నువ్వు మరో ఇంటి అమ్మాయివి కూడా, మొదట్లో అవతలి వాళ్ల పద్ధతులు మనకు కొత్తగా అనిపిస్తాయి. కొంచెం ఓపిగ్గా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించమ్మా. ఇంత చదువుకున్నదానివి. నీకు అతన్ని, అతని కుటుంబాన్ని చదివి చూడమని వేరేగా చెప్పాలా? నువ్వు అక్కడ ఉదయినిని తప్పక కలువు......" అమ్మ మాటలు చెవిలో మార్మోగుతున్నాయి సమీరకి.

★★★

నిర్లిప్తంగా బయటి వెల్తుర్ని చూస్తూ "మీ దగ్గిరకి రావడానికి కూడా నేను చాలా రోజులు తాత్సారం చేసేను ఆంటీ... ఆలోచిస్తూనే ఉన్నాను. విడాకుల కంటే వేరే మార్గం తోచడం లేదు. మీరు మా అమ్మకు స్నేహితులు.. మిమ్మల్ని చూసేక నాకు మీతో ఇవన్నీ చెప్పాలన్న స్నేహ భావన కలిగింది. అతని దగ్గిర నాకిలా మనసు విప్పి మాట్లాడాలనే భావనే కలుగ లేదు." అని నెమ్మదిగా ఊపిరి తీసుకుంటూ అంది సమీర.

"ఊ..... ఇప్పుడతని తల్లిదండ్రులు ఇక్కడే ఉన్నారా?" సాలోచనగా అంది ఉదయిని.

"లేరాంటీ, వాళ్ళు నెల కిందటే వచ్చారు. కానీ డెలివరీ సమయమని ముందు ఈస్ట్ కోస్ట్ లో ఉన్న వాళ్ళ అమ్మాయి దగ్గిరికి వెళ్లేరు. అయినా అతనొక కీలుబొమ్మ. ఫోను లో ఇన్స్ట్రక్షన్స్ అన్నీ ఎప్పటికప్పుడు వస్తాయి." అని నిట్టూర్చి

"అమ్మ చెప్పినట్లు అతణ్ణి, అతని కుటుంబాన్ని చదివి చూడడానికి నేను ఈ ఆర్నెల్లు సమయం తీసుకున్నాను. కానీ ఎంత తరచి చూసినా ఇతనితో నా భావి జీవితం ఇంక ఇలాగే ఉండబోతుందన్న భయం పట్టుకుంది నన్ను. ఇంతలో ఈ పాపాయి...." అని పొట్ట తడుముకుని

"తనని కూడా ఇలాంటి వ్యక్తుల మధ్య పెంచడం నాకిష్టం లేదు." దృఢంగా అంది సమీర.

వెలుగు నీడలు దోబూచులాడుతున్నఅద్దాల వైపు చూస్తూ "జీవితాలు ఎంతో విచిత్రమైనవి సమీరా, అంత సులభంగా దేనినీ అర్థం చేసుకోలేం. కొన్నిసార్లు మనకు అంతా అర్థమైనట్లున్నా నిర్ణయం తీసుకునే సమయానికి ఏవీ అర్థం కాదు." అని మౌనంగా కూచున్న సమీర దగ్గరికి వచ్చి అనునయంగా భుజమ్మీద చెయ్యి వేసి,

"నీకు 'తన్మయి' కథ చెప్తాను. నీ విధిని నువ్వు నిర్వచించుకునే క్రమంలో సరైన నిర్ణయం తీసుకోవడానికి ఉపయోగపడ్తుందేమో" అంది ఉదయిని.

## 3

## ఉదయిని చెప్పిన తన్మయి కథ

"తెలివెన్నెల వేకువ లో తానమాడీ
అడవి దారి మలుపుల్లో అదరి చూసీ
కొండ తిరిగి.. కోన తిరిగి గుసగుసలాడి..

గల గల మువ్వల నవ్వుల నాట్యమాడీ..

తిరనాళ్లకు తరలొచ్చే కన్నెపిల్లలా

మెరుపులతో మెరిసిందీ వానకారూ

నీలిమెయిలు వాలుజడకు చినుకే చేమంతీ

కట్టుకున్న పచ్చదనం పట్టుపరికిణీ..."

రేడియోలో శ్రీరంగం గోపాల రత్నంగారి గొంతులో అలల్లా కదిలివస్తూంది ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారి పాట.

మొదటి సారి ఓణీ వేసుకుని డాబా మీదికి పరుగెత్తింది తన్మయి.

ఉదయపు తొలి పొగ మంచు తెరల్లోని తెల్లదనం ఓణీ రంగులో కలిసిపోయి తనూ ఒక నీహారికై ఆకాశంలో నుంచి అప్పుడే ఉద్భవించినట్లనిపించింది తనకి. పొగ మంచులో ఎవరూ తనని చూడలేరన్న ధీమాతో రెండు చేతులూ చాచి, ఆకాశం వైపుకి తల ఎత్తి గుండ్రంగా గింగిరాలు తిరిగింది. తనని జీవితమంతా ఆ పరవశం చుట్టుకుని ఉండాలన్నట్లు మురిసిపోయింది.

ఆ రోజు వాకిట్లో వంగి ముగ్గేస్తున్న తన్మయికి ఆ అద్భుత క్షణాలు మరలా గుర్తుకు వచ్చాయి.

"తెలి వెన్నెల వేకువలో..." లోపల్లోపల కూనిరాగం తీస్తూ ఈనెలు వేస్తూంది తన్మయంగా.

"అమ్మాయిగోరూ, బలేగా ఏసేస్తారమ్మా మీరు ముగ్గులు, నాకూ నేర్పించడమ్మా" అంది అటుగా వెళ్తూ చివరింటి పని మనిషి.

బదులుగా చిన్నగా నవ్వి, తీక్షణంగా సగం వేసిన ముగ్గు వైపు చూస్తూ "నీకు నేర్పించడం మాట అటుంచు, నేనిక్కడ ఒక చుక్క మర్చిపోయినట్లున్నాను" అంది తన్మయి.

అంతలోనే "అయినా ఫర్వాలేదులే, ఇవేళ ఈ చుక్కలతోనే కొత్త ముగ్గు కలుపుతాను చూడు" అని చకచకా కలపడం మొదలుపెట్టింది.

ఓణీ వేసుకున్న కొత్త రోజులేమో, అయిదు నిమిషాల కొకసారి పమిట సర్దుకుంటూ, ఆ సర్దుకునే సందట్లో ఒత్తైన జుట్టు వెనక నించి ముందుకు మాటిమాటికీ పడ్తూ, అలా పడే జుట్టుని ఎగదోసుకునే క్రమంలో చేతి వేళ్లకంటుకున్న ముగ్గు ముఖాన అంటుకుంటూ.... ముగ్గుల అవధానం చేస్తున్న తన్మయిని చూసి పకపకా నవ్వింది వనజ.

"వనా, అలా నవ్వక పోతే కాస్త ఈ జుట్టు గట్టిగా కట్టొచ్చుగా" అంది తన్మయి చిరు కోపం నటిస్తూ.

"ఏవిటి అమ్మాయిలకు ముగ్గులు తెమిలేయా, ఇంకా లేదా?" బయటికి వస్తూ నవ్వుతూ అడిగింది తన్మయి తల్లి జ్యోతి.

"మన ఇంటి దగ్గిర అయిపోవచ్చిందమ్మా, వనజ వాళ్లింటి దగ్గిర ఇప్పుడెళ్ళి వేయాలి" అంది తన్మయి కళ్ళు ఆర్పుతూ, వెలిగిస్తూ సంశయంగా పర్మిషన్ కోసమన్నట్లు.

"ఊ...నెలగంట పెట్టేక మీకిద్దరికీ ఇది అలవాటేగా, వెళ్ళి త్వరగా వచ్చేయి" అంది జ్యోతి.

"వనా, నువ్వు నాకంటే పెద్దదానివి కదా, ఇంకా నన్ను ముగ్గు పెట్టమని అడుగుతావేంటీ?" అంది తన్మయి పక్కన నడుస్తూ.

"ముగ్గులు బాగా పెట్టడానికి వయసుతో సంబంధంలేదు, అయినా నీలా అందంగా ఈను వెయ్యడం నాకు రాదోయ్, పైగా ఎక్కడైనా ఒక చుక్క తప్పిందంటే నీలా తెలివిగా ఆలోచించి ఏదో రకంగా ముగ్గుని సునాయాసంగా కలపడం నాకు రాదు తల్లీ" అంది వనజ.

పక్కన హుషారుగా నడుస్తూన్న తన్మయి వైపు పరికించి చూసి "అన్నట్లు ఏమంటున్నాడు మీ బావ?" అంది మళ్లీ.

అంతలోనే ఎరుపెక్కిన బుగ్గలలో సిగ్గుని దాచుకుంటూ "అతనేదో దూరపు చుట్టం, బావేం కాదులే" అంది తన్మయి.

"అదేలే, ఎంత దూరపు చుట్టమైనా వరసకి బావేగా!" అంది మళ్లీ కొంటెగా వనజ.

"చీపో.. వనా, నువ్వెప్పుడూ ఇంతే" అని, "ఊరికే ఉత్తరం రాసేడు" అంది నెమ్మదిగా తన్మయి.

"ఆ..ఏవిటేమిటీ, ఉత్తరాల వరకూ వచ్చిందన్నమాట." అని గట్టిగా నవ్వింది వనజ

"ఉష్...ఎవరైనా వింటారు....అరవకు" అంది ఒక్క ఉదుటున వనజ దగ్గరకంటా వచ్చి నోరు మూస్తూ.

“ఏం రాసేడు? ఏం రాసేడు?” అని ఉత్సుకతగా అడుగుతున్న వనజకి “అదేదో క్షేమ సమాచారాల ఉత్తరం. అంతే. అంతకు మించి విషయం ఏం లేదు.” అంది తన్మయి తడబడుతూ.

తన్మయి తడబాటు చూసి “సర్లే, నీకు చెప్పాలనిపించినప్పుడే చెప్పు” అంది మళ్లీ నవ్వుతూ వనజ.

ఆ రాత్రి అందరూ నిద్రపోయినా తన్మయికి నిద్ర పట్టలేదు.

లేచెళ్లి పుస్తకాల అరలో లెక్కల టెక్స్ట్ పుస్తకంలో దాచిన ఉత్తరాన్ని తీసి తెచ్చి, హాలులో జీరో బల్బు గుడ్డి వెల్తురులో చదవడం మొదలు పెట్టింది.

అక్షరాలన్నీ తప్పులే. తన పేరులో కూడా "మ" ఒత్తుకు బదులు "య" ఒత్తు రాసేడు.

తన్మయికి అందమైన అతని ముఖం గుర్తుకు వచ్చింది. పాలుగారే తెలుపు రంగు, అందంగా కొనదేరిన ముక్కు, చక్కని ఉంగరాలు జుట్టు, ఆ పైన గొప్ప అందమైన ఎర్రని పెదవులు. అతన్ని చూసి ఎవరైనా ఇష్టపడకుండా ఉంటారా?

తన్మయి తన్మయత్వంలో తేలిపోతూ తమ పరిచయాన్ని గుర్తుకు తెచ్చుకుంది.

★★★

"త్వరగా పడుకో పిల్లా, పొద్దున్నే ధవళేశ్వరం వెళ్లడానికి రెండు బస్సులు మారాలి" అంది నరసమ్మ.

చదువుతున్న "వెన్నెల్లో ఆడపిల్ల" పుస్తకం మూసి దిండు కింద పెట్టి, వెనక్కి తిరిగి “ మధ్యలో ఏంటి అమ్మమ్మా?” అంది విసుగ్గా తన్మయి.

“అసలీ ధవళేశ్వరం ఏవిటో, వాళ్ళెవరి పెళ్ళికో అమ్మమ్మ కూడా తను వెళ్లడవేమిటో” అనుకుంది లోపల్లోపల.

కొత్త ఊరు చూస్తున్నానన్న సంతోషం ఒక వైపు ఉన్నా, ఇలా కాలేజీ నుంచి వచ్చిన దగ్గర్నించి పడుకునే వరకు పుస్తకాలు చదువుకోవడానికి వీలు పడదని విసుగ్గా ఉంది తన్మయికి.

“త్వరగా పడుకో అంటున్నాను” అంది మళ్లీ నరసమ్మ.

"అలాగే అమ్మమ్మా, పొద్దున్న వేణ్ణీళ్లు కాచేక లేపు, నీతో బాటూ లేపకు" అంది తన్మయి కళ్లుమూసుకుంటూ.

పొద్దున్న కళ్ళముందు ఇంకా చీకటి కనిపిస్తూండగా "అప్పుడే లేపేసేవా, వేణ్ణీళ్లు కాచేక...." అనబోతున్న తన్మయితో.

"వెళ్ళి పొయ్యి రాజెయ్యి, నేను కిరసనాయిలు తెస్తాను. అయినా రేపో మాపో పెళ్లి కాబోయే పిల్లవి పనులన్నీ నేర్చుకోవద్దూ. ఈ మొద్దు నిద్ర ఏవిటీ ...రాగం తీసి” వీధి వైపు గది గొళ్ళెం తీసింది నరసమ్మ.

శీతాకాలపు చల్లని వాకిట్లో రాత్రి మంచుకి తడిసి సగం, అంతకు ముందు రోజు ఆర్పిన కట్టె పుల్లలు కావడం వల్ల ఆరని నీళ్ల వల్ల సగం ఆ కట్టె పుల్లలు అంటుకోవని రూఢిగా తెలిసిపోయింది తన్మయికి.

“అయినా కొత్త కట్టెలు తెచ్చి పొయ్యిలో పెడితే ఈ ముసలామె సొమ్మేం పోయిందో” అని లోపల్లోపల గొణుగుతూ, కళ్ళు నులుముకుంటూ... తపేలాతో నీళ్ళు తెచ్చి కట్టెల పొయ్యి మీద పెట్టి, పొయ్యిలో బూడిదంతా బయటికి లాగి శుభ్రం చెయ్యడం మొదలు పెట్టింది.

"అయ్యో రాత, ముందు నీళ్లెట్టుకుంటారా పొయ్యి మీద?" అని రాగం తీసింది అప్పుడే వచ్చిన నరసమ్మ.

ముందురోజు కాలిన వైపే కట్టెల్ని ఒక దానికొనకొకటి నిలబడేట్లు పెట్టి, కిందొక కాగితం, కాస్త కొబ్బరి పొట్టు, ఆ లోపల కిరసనాయిల్లో ముంచిన చిన్న గుడ్డ పేలికతో గప్పున వెలిగించింది పొయ్యిని తన్మయి.

“తెల్లారగట్ల నిద్రలేవడం కష్టంగా ఉంటుంది కానీ లేచాక ఎంతో బావుంటుంది కదా అమ్మమ్మా!” అంది తన్మయి అరచేతులకు వేడి కాగుతూ.

ఎక్కడో ఒక చోట విన్పిస్తున్న కోడి కూత, రాత్రి విరిసిన చంద్రకాంత పూల పరిమళం, చుట్టూ ఇంకా చిక్కగా అలుముకున్న చీకటిని తానొక్కతే పారద్రోలగలదన్నట్లు గర్వంగా ఎగిసిపడుతున్న కట్టెల పొయ్యి సెగలు.

తెలీని తమకంతో బుగ్గలని రెండు వెచ్చని అరచేతుల మధ్య దాచుకుంది తన్మయి.

మనవరాలి వైపు ప్రేమగా చూస్తూ, పక్కనే వేడి కాగేందుకు పీట లాక్కుని కూచుని “నా బంగారు తల్లివి, నీకెలాటి మొగుడొస్తాడో!" అంది మెటికలు విరిచి నరసమ్మ.

ఆ సాయంత్రం ధవళేశ్వరం పెళ్లిలో అటూ ఇటూ తిరుగుతున్న ఎవరో కుర్రాడు తన వైపే చాలా సార్లు చూస్తున్నట్లనిపించింది హఠాత్తుగా తన్మయికి.

చుట్టూ పరికించి చూసింది. అతను కనిపించలేదు. అంతా తన భ్రాంతి అని నవ్వుకుంది.

శ్రద్ధగా పెళ్లి తంతు చూస్తూ "జీలకర్ర, బెల్లం ఎందుకు పెడతారు అమ్మమ్మా?" అని అమ్మమ్మ చెవిలో అరిచింది ఒక పక్క గట్టిగా మంగళ వాయిద్యాలు మోగుతూండగా.

"నీకూ తెలుస్తాదిలే త్వరలో” అంది నవ్వుతూ నరసమ్మ.

సిగ్గుతో తల వంచుకుని అంతలోనే అప్రయత్నంగా పెళ్ళి కొడుకు తరఫు వాళ్ల బంధువుల వైపు చూసింది తన్మయి.

తన వైపే ఎప్పటి నుంచో చూస్తున్న అతను చప్పున కళ్ళని తిప్పుకోవడం గమనించింది.

"ఎవరితను ఇంత అందంగా ఉన్నాడు!" అనుకోకుండా ఉండలేకపోయింది. బహుశా: ఇరవై ఏళ్లుంటాయేమో.

అమ్మమ్మని అడగడానికి భయం వేసింది.

అయినా అతను తనని కాకుండా వెనక ఇంకెవరినైనా చూస్తున్నాడేమో, అనిపించి వెనుతిరిగి చూసింది మళ్లీ. వెనకంతా పెద్ద వాళ్ళే ఉన్నారు, తన ఈడు వాళ్ళెవరూ లేరు.

అతను తన వైపే చూస్తున్నాడని రూఢయ్యేసరికి అప్రయత్నంగా తన్మయి ముఖంలో నవ్వు విరిసింది.

భోజనాల దగ్గిర అమ్మమ్మ దగ్గిరికి వచ్చి "నాన్నమ్మ గారూ, నన్ను గుర్తు పట్టేరా, శేఖర్ నండి" అన్నాడు కూరలు వడ్డిస్తూ.

ఆ పలకరింపంతా తనకోసమే అని తన్మయికి అర్థమవుతూనే ఉంది.

"ఓ...దేవి కొడుకువా. గుర్తు పట్టలేదబ్బాయ్, ఎప్పుడో సిన్నపుడు సూసేను" అని నరసమ్మ

"ఆయ్.. ధవళేశ్వరం లోనే సెటిలయ్యేవండీ.... " అంటూ అతను ఏదో మాట్లాడుతున్నాడన్నమాటే గానీ ఒక్కటీ బుర్రకెక్కడం లేదు తన్మయికి.

దించిన కళ్ళతో నెమ్మదిగా తింటున్న తన్మయిని చూపిస్తూ "మా జ్యోతి కూతురు, ఇంటర్ సదువుతాంది" అంది గొప్పగా చెప్పి

"కాలేజీ సదువుతున్నావా?" అనడిగింది నరసమ్మ.

"లేదండి టెంత్ తర్వాత మానేసి వ్యాపారం చూసుకోమన్నారు నాన్నగారు" అన్నాడు.

కొంచెం బాధ వేసింది తన్మయికి. "అయ్యో, చదువు మానేసాడా! అయినా... తనకెందుకులే" అని అనుకుంది మళ్లీ.

ఇంటికి వచ్చిన వారం తర్వాత, పోస్ట్ మేన్ ఇంటి గుమ్మం లోకి విసిరిన ఉత్తరాలలో తన పేరు తో ఉత్తరం ఉండడం తో ఆశ్చర్యంగా చేతిలోకి తీసుకుంది తన్మయి. అటూ ఇటూ చూసి ఉత్తరం తీసుకుని డాబా మీదికి పరుగెత్తింది. దడదడా కొట్టుకుంటున్న గుండెతో ఇన్లాండ్ ఉత్తరాన్ని చింపింది. త్వరగా చింపడం వల్ల అంచులతో బాటు ఉత్తరం చివర కూడా కాస్త చిరిగిపోయింది.

కవరు మీద ఇంగ్లీషులో ఉన్న చక్కని దస్తూరీకి, లోపలి కొక్కిరి బిక్కిరి తెలుగు రాతకు సంబంధం లేదు. అయినా అవన్నీ పట్టించుకునే స్థితిలో లేదు తన్మయి.

"ప్రియమైన తన్మయికి,

ఇక్కడ నేను బాగున్నాను. అక్కడ నువ్వు బాగున్నావని తలుస్తాను.

నీకు ఇలా ఉత్తరం రాయడం తప్పయితే క్షమించు. నువ్వు నాకు నచ్చావు.

నీకు నేను నచ్చితే ఉత్తరం రాయి. ఇది నా ఫ్రెండు షాపు అడ్రసు. ఇక్కడికి ఉత్తరం వేయగలవు.

ఇట్లు

నీ బావ

శేఖర్"

అతి మామూలు ఉత్తరం లో "నువ్వు నాకు నచ్చావు", చాలా గొప్ప వాక్యంలా తోచింది తన్మయికి. ఇక– "ప్రియమైన","నీ బావ" పదాల సంగతి చెప్పనే అక్కరలేదు. పదే పదే అవే గుర్తుకొస్తున్నాయి.

అద్దంలో చూసుకుంటూ, "నేను అతనికి ఎందుకు నచ్చి ఉంటాను?" అని సాలోచనగా అనుకుంది.

"బక్క పలచని శరీరం, పల్చని చెంపలు, ఒక మోస్తరు రంగని కూడా చెప్పలేని ఒంటి రంగు. కాటుక కళ్ళు చలాకీగా ఉంటాయి. జుట్టు బావుంటుంది. కానీ అతని ముందు తనేమీ అందగత్తె కాదు. అది స్పష్టం." అనుకుంది మళ్లీ తన్మయి.

★★★

"పేర్లు కూడా సరిగా రాయడం రాదంటే టెంత్ పాసవ్వలేదన్నమాట" అంది ఉత్తరం మడిచి వనజ.

"ఊ..అనుకుంటా" అంది తన్మయి.

"అంతే కాదు, గమనించేవా? ఉత్తరం మీద అడ్రసు అతను రాసినది కాదు."

"ఊ.. సర్లే వనా, అతని రాత బాలేదని ఫ్రెండుతో రాయించి ఉంటాడు." అని ఆలోచనలో పడ్డ తన్మయి మనస్సు చదివినట్లు

"అతనికి నువ్వెందుకు నచ్చి ఉంటావో అన్న ఆలోచన మానెయ్యి, అయినా నీకేం తక్కువ. అంత:సౌందర్యం మెండుగా ఉన్న దానివి. తెలివిగలదానివి. అతను నీకెందుకు నచ్చాడో చెప్పు." అని

"అన్నట్లు రిప్లై ఇస్తున్నావా?" అంది వనజ.

## 4

**సా**యంత్రపు వెలుగు క్రమంగా మాయమవుతూ ఉంది. పక్షులు గూళ్ళకి చేరుతూ కిలకిలారావాలు చేస్తున్నాయి.

డాబా పైకి పాకిన సన్నజాజి తీగె, దానినల్లుకుని ఉన్న రాధాకృష్ణ తీగె పగలా రాత్రా అన్నట్లు పోటీ పడి విరబూసి ఉన్నాయి.

తన్మయి సన్నజాజి మొగ్గలు బుట్టలోకి కోసి వేస్తూ నిట్టూర్చింది.

పక్కనే ఉన్న వనజ "ఊరికే అదే పనిగా ఆలోచించి మనసు పాడు చేసుకోకు తనూ! శేఖర్ నిజంగానే నిన్ను ఇష్ట పడుతున్నాడేమో, లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అని కొంటెగా నవ్వింది.

తన్మయి "ఉహూ! నేనాలోచిస్తున్నది అది కాదు, అతను చదువుని ఎందుకు సీరియస్ గా తీసుకోలేదన్నది నాకింకా అర్థం కావడం లేదు. బహుశా ఇంటికి పెద్ద కొడుకు కావడం వల్ల బాధ్యతలు అడ్డు వచ్చాయంటావా?" అంది.

"నువ్వింకా అతని ఉత్తరం లో తప్పుల్ని నేను ఎత్తి చూపానని బాధ పడ్తున్నట్టున్నావ్, నా ఉద్దేశ్యం అది కాదు" అంది వనజ.

సన్నజాజులు కోయడం పూర్తి చేసి దారపు రీలు లోంచి ఒక పెద్ద ముక్క నోటితో కొరికి వనజ చేతికిచ్చింది. మాల కట్టడానికి వీలుగా రెండు రెండు పూలని వనజకి అందిస్తూ, వీధి చివర దుమ్ము రేపుకుంటూ వస్తున్న రెండెడ్ల బండిని, ఆ వెనుకే వస్తున్న మేకల మందని చూస్తూ "మనకంటే పశు పక్ష్యాదులు నయం. వాటికి ఏ బాధలూ లేవు కదూ! అంది తన్మయి.

పూలు అల్లి, మొదటి మాలని తన్మయి తలలో తురుముతూ "మనకీ ఏ బాధలూ లేవు" అని నవ్వింది వనజ.

★★★

వారం రోజులనించీ ఆలోచిస్తూనే ఉంది తన్మయి. శేఖర్ కి బదులివాలా, వద్దా అని. "ఇక ఈ సాయంత్రం కాలేజీ నించి రాగానే మొదలుపెట్టాలి" అనుకుంది.

మామూలుగానే తలకి బాగా కొబ్బరి నూనె పెట్టి, బిగించి రెండు జళ్లు వేసింది జ్యోతి తన్మయికి.

రెడీ మేడ్ పంజాబీ డ్రెస్సులు అలా వీధిలోకి వస్తే ఈ మధ్య రెండు ముదురు రంగులు కొంది జ్యోతి. ఎప్పుడూ టైలరు దగ్గర కుట్టించిన పరికిణీలు వేసుకునే తన్మయికి ఈ డ్రెస్సులు బాగా నచ్చాయి. అందులో ఎరుపు రంగు డ్రెస్సు తీసి వేసుకుందా రోజు తన్మయి.

కాలేజీ లోపలికి వెళ్ళబోతూ గేటు దగ్గిర పరిచయమైన ముఖం చూసి ఆశ్చర్యపోయింది. భయంతో పుస్తకాల్ని గుండెలకు ఇంకాస్త దగ్గరకు అదుముకుని అతన్ని పలకరించకుండానే లోపలికి వెళ్లిపోయింది.

క్లాసు రూముకి వెళ్లి పుస్తకాలలో తల దూర్చింది కానీ, ఏవీ వినిపిస్తున్నట్లు లేదు.

"అతను ఇక్కడికి ఎందుకు వచ్చేడు? ఉత్తరం రాయలేదని ఏకంగా వెతుక్కుంటూ వచ్చేసేడా? ఇదంతా ఇప్పుడు ఇంట్లో తెలిస్తే, అమ్మో! ఇంకేమైనా ఉందా? ముందెళ్లి అతన్ని ఇక మీదట ఇలా రావొద్దని చెప్పెయ్యాలి. అలా చెప్తే అతను బాధ పడ్తాడేమో." అని మనసు పరిపరివిధాలా ఆలోచిస్తూంది.

"అతనికి నచ్చినా, నచ్చక పోయినా ఇదొక పెద్ద గొడవ కాక ముందే, తనకి ఇలాంటివి నచ్చవని ఖరాఖండీగా చెప్పెయ్యాలి " అని నిశ్చయించుకుని క్లాసు మధ్యలో పర్మిషన్ అడిగి కాలేజీ బయటికి వచ్చింది తన్మయి.

తను ఊహించినట్లుగానే ఇంకా అక్కడే ఉన్నాడు అయితే ఈ సారి ఎదురుగా బడ్డీ కొట్టు బెంచీ మీద కూచుని, గేటు వైపే చూస్తూ కనిపించాడు.

తను బయటికి రావడం చూసి నడిచి ఎదురుగా వచ్చాడు.

చాలా మామూలుగా నవ్వుతూ "బావున్నావా?" అన్నాడు.

తన్మయి గొంతు పెగల్చుకునే లోగా "ఈ చుట్టుపక్కల ఊళ్లలో అమ్మే కోళ్ల దాణా కొనడానికి తరచు నాన్నగారు వస్తుంటారు. ఇప్పుడా డ్యూటీ నేను తీసుకున్నాను. ఎలాగూ వచ్చేను కదా, ఒక సారి నిన్ను చూసెళ్దామని వచ్చేను. అని "వస్తానూ.." అని సమాధానం కోసం ఎదురు చూడకుండా వెళ్లిపోయేడు.

తన్మయికి మనస్సు స్థిమిత పడింది. సమస్య తననుకున్నంత కాంప్లెక్సు కానందుకు.

"అతనన్నీ డైరక్టుగా చెప్తున్నాడు. మొన్న నిన్ను ఇష్ట పడ్డానని ఉత్తరం రాసేడు, ఇవేళ ఏకంగా నిన్ను చూడడానికి వచ్చేడు. మరి రేపేవిటో..."అంది కనుబొమలు ఎగరేస్తూ వనజ.

"ఈ బిగించిన కొబ్బరి నూనె జడలు, లూజు పంజాబీ డ్రెస్సు చూసి ఇక మళ్లీ రాడులే" అంది తన్మయి.

పైకి అలా అందే కానీ, అతను మరలా వస్తే బావుణ్నని అనుకుంది.

ఆ సాయంత్రమే ఉత్తరం రాసి పోస్టు చేసింది.

"ప్రియమైన శక్కూ!

ఉభయకుశలోపరి.

తెలి వెన్నెల వేకువలో నీ ఉత్తరాన్ని వందో సారి చదివేను. "నువ్వు నాకు నచ్చేవు" అన్న నీ అక్షరాలు నా మనస్సులో శాశ్వతంగా ముద్రపడిపోయేయి.

నా ఇష్టాలేవిటో చెప్పనా! మంచు ఉదయాన గాలికి తలలూపే గరిక పూలంటేనూ, ప్రతి పువ్వులోనూ ప్రపంచపు అందమంతా అల్లుకున్న దేవగన్నేరు పూలంటేనూ ఇష్టం. గులాబీ పూల రేకుల మీద ముత్యపు చినుకుల్లా నిలిచిన నీహారికలంటే మరీ మరీ ఇష్టం. అన్నిటినీ మించి శీతాకాలపు నును వెచ్చదనంలో లేత ఊదా రంగులో పొదలన్నీ నిండే డిసెంబరం పూలంటే ఇష్టం.

నువ్వెంత అదృష్టవంతుడివి! ఇంచక్కా పరవళ్లు తొక్కే గోదావరి సమక్షాన ఉన్నవు. నాకే గనుక అలాంటి అవకాశం ఉంటే గుండె ఘోషలన్నీ రోజూ గోదారమ్మతో కలబోసుకోనూ! అన్నట్లు నేను నిన్ను "శక్కూ" అని పిలవడం నీకు నచ్చకపోతే చెప్పు. నాకిలా ముద్దు పేర్లతో పిలవడం అంటే ఇష్టం.

అవునూ! హఠాత్తుగా అలా ప్రత్యక్షమయ్యే సరికి భయపడిపోయేను తెలుసా! మళ్లీ నిన్ను చూసేదెన్నడో అని మనసు ఘోషిస్తూంది, కానీ ప్రపంచపు భయం నన్ను వెనక్కు తగ్గమంటూంది. అందుకే ఏమీ మాట్లాడలేకపోయాను. క్షమిస్తావు కదూ!

మరో ఉత్తరంలో మరిన్ని-

నీ

తను(ఇది నా ముద్దు పేరు!)

ఉత్తరం పోస్టు చేసిన దగ్గర్నించీ అట్నించి వచ్చే ఉత్తరం కోసం ఎదురుతెన్నులు చూడడంతోనే సరిపోతూంది తన్మయికి. ఎందుకైనా మంచిదని ఉత్తరానికి మరో కాపీ రాసి దగ్గర పెట్టుకుంది. ఉత్తరానికి సమాధానం వచ్చినపుడు రెండూ దగ్గిర పెట్టుకుని చదువుకోవడం ఎంత బావుంటుంది!

ఉత్తరం వస్తే బావుణ్ణన్న సంతోషం ఒక పక్క నించీ, తీరా ఉత్తరం వచ్చేక ఎవరి కంటనైనా పడ్తుందేమోనన్న ఆదుర్దా ఒక పక్క నించీ నిలవనీయడం లేదు తన్మయిని.

ఒక పక్క చదువుమీద నించి దృష్టి పక్కకి వెళ్లిపోకూడదని మనసుని తమాయించుకుంటూన్నా తన వల్ల కావడం లేదసలు.

మొత్తానికి మరో పదిహేను రోజుల్లో ఎదురు చూస్తున్న ఉత్తరం రానే వచ్చింది.

కాలేజీ నించి ఇంటికి వచ్చి ముఖం కడుక్కొంటూండగా నరసమ్మ ఉత్తరం తెచ్చి రహస్యంగా ఇచ్చింది తన్మయికి.

తన్మయి ఆశ్చర్యంగా అమ్మమ్మ వైపు చూసి అంతలోనే అటు వస్తూన్న తల్లికి కనబడకుండా దాచింది.

ఉత్తరం పట్టుకుని లోపలికి పరుగెత్తుతున్న తన్మయిని చూసి ముసిముసిగా నవ్వుకుంది నరసమ్మ.

తడబడే వేళ్లతో ఉత్తరం చింపిన తన్మయికి రెండే రెండు వాక్యాలు కనిపించి హుషారంతా పోయింది.

"నీ ఉత్తరం నాకు సగం అర్థమైంది, సగం అర్థం కాలేదు. ముఖ్య విషయం నేను వచ్చేవారం మళ్ళీ మీ ఊరొస్తున్నాను.ఈ సారి ఇంటికే వస్తాను."

ఇదా ఎంత గానో ఎదురు చూసిన ఉత్తరం. అసలే విషయానికీ బదులు లేదు.

ఆ సాయంత్రం శేఖర్ రాసిన ఉత్తరం, వనజ తన ఉత్తరం కాపీ మార్చి మార్చి చూసి "నువ్వేమనుకోనంటే ఒక మాట చెప్తా. నక్కకూ, నాగ లోకానికీ ఉన్నంత తేడాగా ఉన్నాయి మీ ఇద్దరి ఉత్తరాలు." అని నవ్వుతూ

"అతనికి నువ్వు రాసిన ఉత్తరం అర్థం కాకపోవడంలో నాకైతే ఏవీ ఆశ్చర్యం లేదు" అంది మళ్లీ.

"అంటే ఏవిటి? అతను నాకు సరిజోడు కాదనా నీ ఉద్దేశ్యం?" అంది ఉక్రోషంగా తన్మయి.

"అలా కోపగించుకోకుండా ఉంటే నేనింకో మాట చెబుతాను. అతనిని నువ్వు ఇష్ట పడడం లో తప్పు లేదు. కానీ అతనికీ నీ హృదయం ఉంటుందని ఊహించుకోవడం లోనే తప్పు ఉంది" అంది వనజ సాలోచనగా.

"అవన్నీ సరేలే ఇప్పుడొక కొత్త సమస్య వచ్చి పడింది. అతను మళ్లీ వస్తానంటున్నాడు, పైగా ఇంటికి. అతని ఉద్దేశ్యం ఏవిటో నాకు అర్థం కావడం లేదు." అని తల పట్టుకుంది తన్మయి.

"సర్లే రానివ్వు. అతనికీ అర్థం కావాలిగా మీ ఇంటి పద్ధతులు. అయినా చుట్టాలబ్బాయి కదా వస్తే ఏమనుకోరని ధైర్యమనుకుంటా" అంది వనజ.

★★★

శేఖర్ వస్తానన్న రోజు తెల్లారిందగ్గర్నించీ గుండె వేగంగా కొట్టుకోవడం మొదలయ్యింది తన్మయికి.

కాలేజీ లో ఉదయం నించీ ఏవీ తలకెక్కడం లేదు.

మధ్యాహ్నం నించి తలనొప్పిగా ఉందని పర్మిషన్ తీసుకుని ఇంటికి వచ్చేసింది. ఎప్పుడూ చలాకీగా ఉండే తన్మయి ఎవరితో మాట్లాడకుండా ముభావంగా ఉండడమే కాకుండా ముసుగు పెట్టి పడుకోవడం చూసి జ్యోతి వచ్చి నుదుటి మీద చెయ్యి వేసి చూసింది.

మనస్సులో చెలరేగుతున్న ఘర్షణకి తలపోటు నిజంగా రావడం మొదలైంది తన్మయికి.

వాకిట్లో ఏ అలికిడి అయినా  అతనొచ్చాడేమో అని చెవులు రిక్కించి వింటూ ఉంది.

సాయంత్రం బయటి నించి వస్తూనే తన్మయి తండ్రి భానుమూర్తి "జ్యోతీ, అబ్బాయి వచ్చాడు చూడు" అనడం విని చప్పున మంచం దూకి బాత్రూం లోకి పరుగెత్తింది తన్మయి.

ముందు గదికి ఆనుకుని ఉన్న హాలులోకి వచ్చేసరికి తండ్రితో మాట్లాడుతూ తన వైపే చూస్తున్న శేఖర్ ని చూడగానే చప్పున తలుపు చాటున దాక్కుంది.

నరసమ్మ ఏదో అర్థమైన దానిలా పక్కకు వచ్చి “నీకోసమే వచ్చినట్లున్నాడు” అంది ముసి ముసిగా నవ్వుతూ.

అతనికి సరిగ్గా కనిపించేటట్లు నిలబడి ఓర కంట చూసింది తన్మయి. అతను ఇంకా ఇటే చూస్తున్నాడు.

జ్యోతి టీ పట్టుకొచ్చి హాలులో తచ్చాడుతున్న తన్మయిని చూసి “నువ్వు పట్టుకెళ్తావా” అని అడిగింది.

లోపల్లోపల పొంగుతున్న సంతోషంతో తలూపి, ట్రే పట్టుకెళ్లింది తన్మయి.

“ఇది మా అమ్మాయి” భానుమూర్తి శేఖర్ కి పరిచయం చేసేడు.

బదులుగా తలూపి “మొన్న పెళ్లిలో చూసేనండి”  అన్నాడు.

ఒక్క మాటా మాట్లాడే అవకాశం రాలేదు తన్మయికి.

వ్యాపారం పని మీద ఆ ఊరు వచ్చేనని అతను చెప్తూన్నా ఇంటిలో ఎవరికీ నమ్మాలనిపించడం లేదన్న సంగతి గ్రహించింది తన్మయి.

మరో గంటలో అతను వెళ్లిపోగానే జ్యోతి  సీరియస్ గా లోపలికి వచ్చి "అతనెందుకు వచ్చాడు?" అంది తన్మయితో.

బిత్తరపోయి సమాధానం లేనట్లు నేల చూపులు చూసింది తన్మయి. ఆ గొంతులో కూతురి ప్రమేయం లేకుండా పరాయి అబ్బాయి హఠాత్తుగా ఎందుకు వస్తాడనే గదమాయింపు ధ్వనిస్తూంది.

తన్మయికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కాలేదు.

ఇంతలో నరసమ్మ వంటింట్లో  నించి వచ్చి “అదేవిటి, ఆ కుర్రాడేమైనా పరాయి వాడా? మన దేవి కొడుకేగా. మొన్న పెళ్లి లో కనిపించినపుడు ఇటొస్తే వస్తూండమని నేనే చెప్పేను” అంది.

“ఊ. మనవరాలిని వెనకేసు రావడం కాదు, పిచ్చి పిచ్చి ఆలోచనలు మానేసి ముందు బాగా చదవమని చెప్పు" అని తన్మయి వైపు విసురుగా చూసి వెళ్లిపోయింది జ్యోతి.

తన్మయికి తను చేసిన తప్పేవిటో అర్థం కాలేదు. అలాగని అమ్మా, నాన్నలతో విడమర్చి మాట్లాడే ధైర్యమూ, అవకాశమూ లేదు.

అమ్మమ్మ నయమే బానే తప్పించబోయింది కానీ తనతో పరాయి అబ్బాయి గురించి చర్చించే ధైర్యం లేదు.

వనజ దగ్గరకు వెళ్లి గోడు వెళ్ళబోసుకుంది తన్మయి.

"ఊ...మీ ఇంట్లో అంత పోజిటివ్ గా రియాక్టవుతున్నట్లు లేరు. నువ్వు ఉత్తరాలు రాస్తున్నావని తెలిస్తే ఇంకాస్త మండి పడతారు. ముందు అతన్ని ఇలా వచ్చి కనబడొద్దని ఉత్తరం రాయి" అంది వనజ.

"మీ ఇంట్లో నుంచి ధవళేశ్వరం,  వాళ్ళ ఫ్రెండు షాపు కి ఫోను చేస్తేనో" అంది సాలోచనగా తన్మయి.

"అమ్మో, ఎస్.టీ.డీ కాల్ చేసేవంటే ఇంట్లో బిల్లు రాగానే చంపేస్తారు. పోనీ టెలీగ్రాము ఇవ్వు." అంది వనజ.

టెలీగ్రాము పుచ్చుకుని ఏమనుకున్నాడో ఏమో మళ్లీ అటు నించి ఎటు వంటి రెస్పాన్సు లేదు రెండు నెలల వరకు.

తన్మయి కాస్త స్థిమితపడింది. కానీ అతని గురించిన ఆలోచనలు వదలడం లేదు.

ఇంటర్మీడియేట్ పరీక్షలు అయిన వేసవిలో తన్మయి వనజ దగ్గరికి వెళ్లి, ఇంటికి వచ్చేసరికి ఇంట్లో హడావిడి కనిపించింది.

5

వనజ ఇంటి నుంచి తన్మయి వస్తూనే జ్యోతి "త్వరగా రా చీర కడతాను. కాస్సేపట్లో పెళ్ళి చూపులకి వస్తున్నారు" అంది.

ఆశ్చర్యపోయింది తన్మయి.

"తనకి పెళ్లి చూపులా?"

కానీ పైకి ఎవరూ, ఏవిటని అని అడిగే ధైర్యం కూడా లేదు తన్మయికి.

జడగంటలు వేస్తూ "అబ్బాయి కాకినాడ లో ఆర్. ఎం. పీ డాక్టరు. ప్రాక్టీసు బావుంటుందంట, బాగా సంపాదించి ఈ మధ్యే సొంతిల్లు కట్టుకున్నాడట. బాబాయి వాళ్లు చెప్పేరు" అని "కాస్త నవ్వుతూ మాట్లాడు ఏవైనా అడిగితే" అంది జ్యోతి కూతురితో.

తన్మయికి మతి పోతూంది. "ఇలా చెప్పా పెట్టకుండా హఠాత్తుగా పెళ్లి చూపులంటున్నారేవిటి? ఒక పక్క శేఖర్ వైపు తన మనస్సు ముడిపడిపోతూంది. ఇప్పుడిక్కడ ఈ పెళ్లి చూపుల్లో అవతలి వాళ్లకి తను నచ్చితే? తను ఒకరిని ఇష్టపడుతూ మరొకరికి భార్య కాగలదా?"

భానుమూర్తి లోపలికి వచ్చి వాళ్లొస్తున్నారని చెప్పేక గుండె దడ ఎక్కువైంది తన్మయికి.

అన్యమనస్కంగా ఇంత సేపూ ఎలా తయారు చేస్తే అలా ముస్తాబు చేయించుకుంది. అద్దంలో తనను చూసుకుంది. పీలగా ఉన్న శరీరానికి చీర కడితే కొయ్య బొమ్మకు కట్టినట్టు అనిపించింది. పెట్టుకున్న నగలు తన కంటే బాగా మెరుస్తున్నాయి. చుట్టుపక్కల తెల్సిన ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు వచ్చి జ్యోతికి వంటింట్లో సాయం చేస్తున్నారు.

పక్కింటి అత్తయ్య వచ్చి కనకాంబరం మాల తలలో తురిమి చెంపలు నిమిరి మెటికలు విరిచింది.

తన్మయికి శేఖర్ తన చుట్టూ పరిభ్రమిస్తూ మాట్లాడుతున్నట్లు అనిపించింది. ఏవిటిదంతా? అని తనని నిలదీసి అడుగుతున్నట్లనిపించింది.

"తనొక్కదానికీ ఆలోచించి బుర్ర పగిలిపోతూంది. వనజతో ఈ విషయం చెప్పే వాళ్లుంటే బావుణ్ణు." అంటూ పెదవి కొరుక్కుంటూ అలానే కూచుండి పోయింది.

అతను తల్లితో కలిసి వచ్చినట్లున్నాడు. కానీ అతనే అన్ని విషయాలూ మాట్లాడుకుంటున్నాడు.

తనని ఆ గదిలోకి తీసుకెళ్లి నిలబెట్టింది జ్యోతి. పక్క వాళ్లతో మాట్లాడుతూ తనవైపో సారి చూసి చూపు తిప్పుకున్నాడు.

తలెత్తి చూసిన తన్మయికి ఎందుకో నిర్వేదం వచ్చింది.

ఒక మోస్తరు కళగా కూడా లేని ముఖం. అతని వయస్సు 25 పైన ఉండొచ్చు. తన్మయికి తెలీని బాధగా అనిపించింది.

ఎప్పుడు తనని అక్కడి నించి పంపేస్తారా అన్నట్లు తల్లి వైపు చూసింది.

మిగతా వాళ్లెవ్వరూ తనని పట్టించుకోనట్లు అతని వైపే చూస్తున్నారు. పెళ్లి చూపులంటూ పెద్ద తతంగం జరలేదు. సరిగ్గా 5 నిమిషాలు అతనెదురుగా నిలబడి పేరేమిటో చెప్పి, వచ్చేసిందంతే.

నరసమ్మ మనవరాలిని లోపలికి తీసుకెళ్లింది.

మనవరాలి కళ్లలో దిగులు అర్థం చేసుకున్నా ఏవీ చేయలేని అసహాయతతో తల నిమిరి వెళ్లిపోయింది.

★★★

ఆ సాయంత్రం దిగులుగా కూచున్న మనవరాలి దగ్గరకి వచ్చి " రెండు లచ్చలు కట్నవడిగేరు. మీ అమ్మా, నాన్నా వొద్దని చెప్పేరు" అంది.

తన్మయి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. అప్రయత్నంగా అమ్మమ్మని కౌగలించుకుంది.

ఒక్క ఉదుటున డాబా మీదికి పరుగెత్తింది. చీకట్లో మెరుస్తున్న నక్షత్రాల్ని చూస్తూ రెండు చేతులూ జోడించి గుండెలకి అదుముకుని "థాంక్యూ..థాంక్యూ" అంది.

ఏదో ఒక గొప్ప రిలీఫ్ గా, గుండెల మీద బరువు తీరినట్లు హాయిగా అనిపించి గిరగిరా తిరిగింది.

కిందికి వచ్చి, మెట్ల పక్కనే పొద మీద మెరుస్తూ విరిసిన చిట్టి చంద్రకాంత పూవునొకదాన్ని చేతులోకి తీసుకుని లేత పరిమళాన్ని దీర్ఘంగా పీల్చి, మెత్తని రేకుల్ని అపురూపంగా తడిమి, మురిపెంగా తలలో తురుముకుంది.

తర్వాతి వారంలో శేఖర్ నించి మరొక ఉత్తరం వచ్చింది.

ఊర్లో ఏదో పెళ్లికి తల్లితో బాటూ వస్తున్నాడట, ఆదివారం ఇంటికి వస్తామని రాసేడు.

తన్మయి అతను వచ్చే సమయానికి ఇంట్లో లేకుండా వనజ దగ్గరికి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంది.

అదే పెళ్ళికి తనూ వెళ్లాల్సి వస్తుందని ఊహించలేదు.

అలా అనుకుందే కానీ పెళ్లిలో శేఖర్ కనిపిస్తూనే తన్మయికి తెలీని సంతోషం ముంచుకు వచ్చింది. అతని తల్లి దేవి తనని పరికించి చూడడం గమనించింది.

"ఇలా దగ్గరికి వచ్చి మాట్లాడు దేవి అత్తయ్యతో" నరసమ్మ మనవరాలి చెయ్యి పట్టుకుని ముందుకు లాగింది.

బిడియంగా "నమస్తే" అని చెప్పింది.

పరిచయంగా దగ్గిరికి తీసుకుని "ఇలా రామ్మా, నువ్వేనా తన్మయివి. మా శేఖర్ చెప్పేడులే" అంది నవ్వుతూ దేవి.

"ఏం చెప్పేడన్నట్లు" కుతూహలంగా దేవి వైపు తిరిగి, దూరంగా తన వైపే చూస్తున్న శేఖర్ వైపు కొంటె చూపు విసిరింది తన్మయి.

దూరం నించి నవ్వుతూ కన్ను గీటేడు శేఖర్.

అతన్ని, తనని ఎవరైనా చూసేరేమో అని భయంగా తల దించుకుంది.

"ఏవిటిదంతా సిగ్గే" అంది మళ్లీ దేవి.

మధ్యాహ్నం భోజనాలు కాగానే బయలుదేరుతూ "మాతో రండి మా ఇల్లు చూద్దురు గాని" అంది జ్యోతి తల్లి పోరు పడలేక.

ఇంట్లో మధ్య గదిలో పైన గోడ బల్లల మీద బోర్లించి ఉన్నఇత్తడి సామాన్ల వైపు దృష్టి వాల్చకుండా చూసింది దేవి.

"ఇవన్నీ మా అమ్మ నాకు ఇచ్చినవే. ఇవన్నీ మా తన్మయికి ఇచ్చేస్తాం" అంది నవ్వుతూ జ్యోతి.

దేవి ప్రశంసా పూర్వకంగా చూస్తూ "అయినా ఒక్కతే అమ్మాయి కదా, మీకంటే ఎక్కువగానే ముట్టచెప్పాలి మీ అమ్మాయికి మీరు. అవే కదా ఒదిన గారూ, పిల్లలకి పుట్టింటి ధైర్యాలు" అని సర్దింది.

పెద్దవాళ్ళు ఈ సామాన్ల గోలలో ఉండగా తన్మయికి శేఖర్ తో మాట్లాడే అవకాశం వచ్చింది.

పెరటి సందులో ఎదురెదుగా గోడలకి జేరబడి నిల్చున్నారు.

"ఏవిటీ, ఉత్తరాలు రాయడం లేదు" అన్నాడు.

"ఇంట్లో గొడవవుతుందేమోనని" అని నసిగింది కిందికి చూస్తూ తన్మయి.

"అమ్మకి చెప్పేను. నాకు నచ్చినట్లే తనకీ నువ్వు నచ్చితే మంచిది కదా" అని పెదవి బిగబట్టి చూసాడు తన్మయి వైపు.

అతనలా పెదవి బిగబట్టి కొంటెగా చూస్తే మరింత అందంగా ఉంటాడు.

"ఊ...ఇంకేవిటి విశేషాలు?" అన్నాడు.

"బోల్డు ఉన్నాయి. నాకు నీతో కలిసి వెన్నెట్లో గోదారి మీద విహారానికి వెళ్లాలని ఉంది. తీసుకెళ్తావా?" అంది.

"గోదారి మీద రాత్రి పూట పడవలు తిరగవనుకుంటా, పగలెళ్లొచ్చుకదా, చీకట్లో పడి గోదారెంట తిరగడమెందుకు?" అన్నాడు.

"చీకట్లో కాదు, వెన్నెట్లో..." అని సరి చేసింది ఉక్రోషంగా తన్మయి.

"అదేలే..ఏదో ఒకటి. సరిగా తినవా, ఇలా బక్క చిక్కి ఉంటావు?" అన్నాడు తేరిపార చూస్తూ.

తన్మయికి ఇంకాస్త ఉక్రోషం పెరిగింది.

అయినా తమాయించుకుని "నేనెంత తిన్నా ఇంతే" అనేదో చెప్పబోతూండగా

అకస్మాత్తుగా పరిచయంగా ముందుకి ఒకడుగు వేసి చప్పున బుగ్గని తట్టి"ఇక బయలుదేరుతాం మళ్లీ వొస్తానులే" అన్నాడు.

బుగ్గ మీది అతని అరచేతిని అలానే పట్టుకుని ఉండిపోవాలన్న తమకం కలిగింది తన్మయికి. ఒక్క సారిగా ఒళ్ళంతా పులకరింతతో వొణికింది.

శేఖర్ వైపు దిగులుగా చూస్తూ "అప్పుడేనా" అంది గొంతు పెగల్చుకుని.

"చాలా పనుందమ్మాయ్, నాన్న గారితో సాయంత్రం మరో పని మీద వెళ్లాలి నేను" అన్నాడు చాలా కాజువల్ గా.

బైటి నుంచి అప్పుడే వస్తూన్న తండ్రి గొంతు వినిపించేసరికి ఒక్క ఉదుటున లోపలికి పరుగెత్తింది తన్మయి.

★★★

తన్మయికి ఇంటర్మీడియేట్ లో చేరినప్పట్నించీ కాలేజీ లెక్చరరు కావడమంటే ఇష్టం పట్టుకుంది. అంతకు ముందు వరకూ తను పెద్దయ్యి ఏం కావాలో తనకి ఎటువంటి ఆలోచనా ఉండేది కాదు.

ఇంగ్లీషులో ధారాళంగా పాఠాలు చెప్తూ పిల్లలందరినీ ఆకట్టుకునే కృష్ణారావు మాస్టారంటే విపరీతమైన గౌరవం తన్మయికి.

ఆ మాస్టారు ఇంగ్లీషులో పీ.హెచ్.డీ చేసేరని విని తనెప్పుడు పీ.హెచ్.డీ చేస్తుందో అనుకుంది. బిడియంగా మాస్టారి దగ్గరకెళ్లి ధైర్యం చేసి అడిగింది ఒక రోజు.

లెక్చరరు కావాలన్న తన్మయి ఆలోచనకి ఎంకరేజింగ్ గా చూస్తూ "జూనియర్ కాలేజీ లెక్చరరు కావాలంటే పీ.హెచ్.డీ చెయ్యనవసరం లేదు. తత్సంబంధిత సబ్జెక్టులో ఎమ్మే చేస్తే చాలు. అయితే ఎంట్రన్సు పరీక్ష రాయాల్సి ఉంటుంది. అందుకు ఎమ్మేలో మినిమం సెకండ్ క్లాసు మార్కులు వచ్చినా సరిపోతుంది. నీకు తెలీనిదేవుంది. ఇది కాంపిటీషను కాలం. మంచి మార్కులు ఎప్పుడూ అవసరమే. ఇక పీ.హెచ్.డీ చేస్తే డాక్టరు అనిపించుకోవడమే కాదు. డిగ్రీ కాలేజీ లెక్చరరు పరీక్ష రాయడానికీ, యూనివర్శిటీలలో లెక్చరరు ఉద్యోగాల అర్హత పరీక్షలకూ పనికి వస్తుంది. ఇంటర్మీడియేట్ లోనే ఇవన్నీ తెలుసుకోవడం అనవసరమే అనుకో. కానీ ముందు ముందు ఏం చెయ్యాలనుకుంటున్నామో అదే విధంగా జీవితంలో స్థిర పడడానికి డిగ్రీలో నువ్వు తీసుకునే సబ్జెక్టుల మీద ఆధారపడి ఉండడం వల్ల తెలుసుకోవడం మంచిది. నువ్వు తప్పక లెక్చరరువవుతావు ఒక రోజు, ఇలా బిడియంగా మాట్లాడడం మానేస్తే" నవ్వారు మాస్టారు.

అవేళ్టి నుంచి ఇంగ్లీషు బాగా చదవడం మొదలు పెట్టింది తన్మయి. దానితో సమానంగా తెలుగు సాహిత్యం పట్లా ఇష్టం మొదలైంది. ఎందుకో రెండు భాషల పట్లా తీరని మక్కువ మొదలైంది. నిజానికి కాలేజీలో లెక్కల సబ్జెక్టులో తనకి ఎప్పుడూ ఎక్కువ మార్కులొస్తాయి. కానీ సాహిత్యంలో ఉన్నదేదో లెక్కల్లో లేనట్లు అనిపించసాగింది క్రమంగా తన్మయికి.

వేసవి సెలవులు కాగానే తన ఇష్టానికి సరిపడగానే డిగ్రీ కాలేజీ లో చేరి ఇంగ్లీషు లిటరేచరు తో చదవాలనుకుంది తన్మయి.

"అసలే రోజులు బాగా లేవు, అమ్మాయి కోసం అసలే ఆ కుర్రాడు తిరుగుతున్నాడు. హాస్టలులో పెట్టడం నాకిష్టం లేదు. మీరే ఏదో రకంగా సర్దిచెప్పండి అమ్మాయికి." అంది జ్యోతి.

"ఊర్లో డిగ్రీ కాలేజీ లేదు, నిన్ను హాస్టల్ లో  పెట్టి చదివించడం మాకు ఇష్టం లేదు. ప్రైవేటుగా బియ్యే చేసుకోమ్మా. కావాలంటే ట్యూషను పెట్టించుకో" అన్నాడు భానుమూర్తి తన్మయితో.

"ప్రైవేటుగా ఇంట్లో కూచుని ఇంగ్లీషు లిటరేచరు  చదవాలంటే కష్టమే, ఇదో నాలా డిగ్రీ మధ్యలో డిస్కంటిన్యూ చేయాల్సి ఉంటుంది. తెలుగు లిటరేచర్ చదువు పోనీ, నీకెలాగూ తెలుగు సాహిత్యమంటే ఇష్టమేగా" అంది వనజ ఆ సాయంత్రం.

"నిజమే వనా, కానీ తెలుగు లిటరేచరుతో పాలిటిక్సు, ఎకనామిక్సు గ్రూపు తప్పని సరిగా చదవాలనుకుంటా. నాకేమో హిస్టరీ లాంటి సబ్జెక్టులైతే బావుణ్ణని ఉంది." అంది తన్మయి.

"హేయ్, ఇది చూసేవా తెలుగు లిటరేచరు, ఇంగ్లీషు లిటరేచరు, హిస్టరీ" నీ పంట పండింది పో. నువ్వనుకున్న సబ్జెక్టులతో ఆంధ్రా యూనువర్శిటీ నీ కోసమే ప్రైవేటు డిగ్రీ ఆఫర్ చేస్తూంది." అంది వనజ కోర్సుల బ్రోచరుని చూపిస్తూ.

తన్మయి సంతోషంగా కిందికి పరుగెత్తింది.

★★★

తన్మయి బియ్యే మొదటి సంవత్సరంలో వుండగా అడపా దడపా సంబంధాలని ఎవరో అనడం, వాళ్లు ఇంటి వరకూ రావకపోవడం జరుగుతూనే ఉంది.

జ్యోతికి, భానుమూర్తికి అమ్మాయి పెళ్లి తొందర లేకపోయినా బంధువుల ఒత్తిడి, తన ఈడు వాళ్లందరికీ పెళ్లిళ్లు మొదలవడంతో వీళ్లకూ తొందర పట్టుకుంది.

ఇంతలో ముచ్చటగా మూడోసారి  ఓ సాయంత్రం శేఖర్ ఇంటికి వచ్చేడు.

భానుమూర్తి ఇంట్లో లేదు.

ఏదో మామూలుగా, చుట్టపు చూపుగా వచ్చానని అతనంటున్నా ఇంట్లో వాళ్లకి అనుమానం మరింత బలపడేలా అతని చూపులు చెప్తున్నాయి.

"తన్మయిని చూడడానికే  వచ్చానండీ" అన్నాడు ఉన్నట్టుండి ధైర్యంగా జ్యోతితో.

జ్యోతి కొంచెం ఇబ్బందిగా ముఖం పెట్టి, "పెళ్లి కావలిసిన పిల్ల,  నువ్విలా అమ్మాయి కోసం వస్తూ ఉంటే ఏం బావుంటుంది?" అంది ఇక రానవసరం లేదన్నట్లు కొంచెం గట్టిగా.

"అదే చెప్పడానికి వచ్చానత్తమ్మా, మీకు ఇష్టమైతే తన్మయిని నేను పెళ్లి చేసుకుంటాను." అన్నాడు శేఖర్.

లోపలి నుంచి చెవులొగ్గి వింటున్న తన్మయికి ఒక్క సారిగా గాలిలో గంతులేయాలనిపించింది.

నరసమ్మ ఈ మాట వింటూనే "ఇది పద్ధతి కాదు బాబూ, పెద్ద వాళ్లు వచ్చి అడగాలీ..." అంది లోపల్లోపల సంతోషపడుతూ.

"అలాగేనండి, మా పెద్ద వాళ్లని తీసుకుని వస్తాను" అన్నాడు.

"అబ్బాయి వాళ్లు మన బంధువులే గానీ, మనకు వీళ్ళ విషయాలు సరిగా తెలీదు. ఏం చేద్దామంటారు? అంది జ్యోతి భానుమూర్తితో రాత్రికి ఈ విషయం మాట్లాడుతూ.

"అబ్బాయి మన అమ్మాయిని ఇష్టపడుతున్నట్లున్నాడు. మనమ్మాయికీ ఇష్టమైతే పెళ్లి చేయడానికి నాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు భానుమూర్తి.

★★★

"పెళ్లి మాటలు మాట్లాడడానికి వాళ్ల పెద్దల్ని తీసుకు వస్తానన్నాడు. ఎంత ధైర్యంగా అడిగేసాడో తెలుసా?!" అంది సంతోషంగా తన్మయి వనజతో.

"ఇవన్నీ కాదు, నీకేమో పీ.హెచ్.డీ చేయాలనుందన్నావు, మరి ఇప్పుడీ పెళ్లి మాటలేవిటో" అంది వనజ నవ్వుతూ.

"అవన్నీ అతన్ని అడుగుతాను. ''పెళ్ళాయ్యాక చదువుకోనిస్తానంటేనే పెళ్లి అని ఖరాఖండీగా చెప్పేస్తాను." అంది తన్మయి. అందే గానీ అతను కాదంటే చేసేదేమీ లేదని కూడా తెలుసు తనకు. అయినా అతను తన మాట తీసెయ్యడని నమ్మకం.

"అయినా అతనంత ధైర్యంగా అడగడం ఎంత సంతోషంగా ఉందో చెప్పలేను. ఎదురుగా వెళ్లి అతనితో నేనొప్పుకుంటున్నానని గంతులేస్తూ చెప్పాలనిపించింది." అంది మళ్లీ ఇంకా మురిసి పోతూ.

"ఊ..అంతా బానే ఉంది. కానీ అతనేం చేస్తున్నట్లు? ప్రేమించడానికి ఈ వివరాలు అవసరం లేకపోయినా, పెళ్లంటే ఇవన్నీ ఆలోచించాలేమో" అంది వనజ.

అవన్నీ పట్టించుకునే స్థితిలో లేదు తన్మయి.

కాస్త చికాకుగా ముఖం పెట్టి "నువ్వెప్పుడూ ఇంతే వనా, హాయిగా నాలుగు నిమిషాలు ఉండనివ్వకుండా, సీరియస్ టాపిక్స్ మొదలెడతావు" అంది.

"పెళ్లంటే గాలిలో తేలడం మాత్రమే కాదమ్మడూ, అసలు విషయం పెళ్లయ్యాక గానీ అర్థం కాదులే" అంది వనజ.

"ఇలా లక్ష ఆలోచిస్తావు కాబట్టే, నీకింకా పెళ్ళి కాలేదు" అని చప్పున నాలుక కరుచుకుని "సోరీ, సోరీ " అంది నిశ్శబ్దమై పోయి, కిందికి చూస్తున్న వనజ ముఖాన్ని పైకి ఎత్తుతూ.

"లేదులే, ఏమో ఎందుకు కాలేదో ఎవరికి తెలుసు? నీకు తెలుసనుకున్నాను." అంది వనజ అంతలోనే తేలికగా నవ్వుతూ.

"నువ్వేమీ అనుకోలేదు కదా, ప్రామిస్" అంది తన్మయి మళ్లీ.

"అందుకే నువ్వంటే నాకిష్టం వనా, నీ స్నేహం లేకపోతే నాకివన్నీ ఎవరు చెప్తారు చెప్పు?" అంటూ ఆకాశం లోకి చూస్తూ "అదిగో, ఈ సంధ్య వేళ చందమామతో పాటూ ఉదయిస్తున్న గ్రహమీ్మద ఒట్టు, ఇంకోసారి నిన్ను బాధ పెట్టను" అంది.

"ఇక నీ ఒట్ల దండకం ఆపుతావా? శేఖర్ వాళ్ల నాన్నగారితో బాటూ కోళ్ల ఫారం చూసుకుంటున్నాడని చెప్పేదన్నావు కదా, అంటే నువ్వు పెళ్ళయ్యాక ఉమ్మడి కుటుంబంలో ఉండాలన్న మాట." అంది వనజ సాలోచనగా.

తల నిలువుగా, అడ్డంగా ఆడించి "అవుననుకుంటా...కానీ ఈ మధ్య వ్యాపారంలో నష్టం వస్తూందని అతన్ని వైజాగులో ఏదైనా ఉద్యోగం వెతుక్కోమని వాళ్ల తాతగారింటికి పంపించేరట. బహుశా: అదేమైనా సక్సెస్ అయితే నేను కన్న కలలన్నీ ఫలించినట్లే. ఇంచక్కా

ఆకాశాన్ని తాకే సముద్ర తీరంలో ఎగిసి పడే కెరటాల అందాలని ఆస్వాదిస్తూ జీవితాన్ని గడిపెయ్యొచ్చు. ఏవంటావ్?" అంది తన్మయి గాలిలోకి ఆశావహంగా చూస్తూ.

"నీ కళ్లలోని ఆత్మవిశ్వాసం చూస్తే ఇవన్నీ నిజం అయితే బావుణ్నని అనిపిస్తూంది. అయినా నువ్వు కాస్త కలల్లో బతకడం తగ్గించాలి." అంది వనజ నవ్వుతూ ముక్కు పట్టుకుని ఊపి.

"ఇంకో విషయం. నేను ఇంచక్కా అడ్డూ అదుపూ లేకుండా డైరక్టుగా యూనివర్శిటీలో చేరి ఎమ్మే, పీహెచ్ డీ చెయ్యొచ్చు" అంది రెట్టించిన ఉత్సాహంతో తన్మయి.

ఇంతలో కింది నించి జ్యోతి గట్టిగా అరిచింది "తన్మయీ, ఒకసారి కిందికి వస్తావా?" అంటూ.

## 6

హాలులో అంతా పెద్ద విషయం చర్చిస్తున్నట్లు అందరి సీరియస్ నెస్ చూడగానే అర్థమైంది తన్మయికి.

భయమూ వేసింది.

"నీకు శేఖర్తో పెళ్లి ఇష్టమో, కాదో అడుగుతున్నారు నాన్నగారు" అంది జ్యోతి.

ఒక్క సారిగా గొప్ప రిలీఫ్ అనిపించింది తన్మయికి.

తండ్రి ముఖంలోకి చూస్తూ "మీ ఇష్టమే నా ఇష్టం నాన్నా" అంది లోపల్లోపల ఉబికే సంతోషంతో.

"అబ్బాయి పెద్దగా చదువుకోలేదు, వ్యాపారాలన్నాక లాభ నష్టాలుంటాయి, నాకైతే ఇలా వ్యాపారస్తులకి చెయ్యడం ఇష్టం లేదు" అంది జ్యోతి.

శేఖర్ జ్యోతికి ఎందుకు నచ్చలేదో అర్థం కాలేదు తన్మయికి.

"మొదట్నించీ ఇంతే, ఏదో ఒకటి అంటూ అనుమానపడుతుంది" అనుకుంది మనసులో.

పైకి మాత్రం నిశ్శబ్దంగా తల్లి వైపు చూసింది.

"నాన్నగారు మాట్లాడేరు మిగతా వివరాలు, అబ్బాయికి వైజాగులో ఏదో ఉద్యోగం ఇప్పించే ప్రయత్నంలో ఉన్నారట.

అవన్నీ అయ్యాక, పెళ్లి చూపులకి శాస్త్ర ప్రకారం రమ్మని కబురు చేద్దామని అనుకుంటున్నాం." అంది జ్యోతి మళ్లీ.

ఇవన్నీ జరుగుతూండగానే తన్మయి డిగ్రీ రెండో సంవత్సరం లోకి అడుగు పెట్టింది.

ఇక ఇంట్లోనూ పెళ్లి కబుర్లే ఎక్కువయ్యాయి.

"నిశ్చితార్థాలు మాకు అచ్చి రావని మా అమ్మ చెప్పింది, అయినా "ఈ అమ్మాయి మాది" అనిపించుకోవడానికి రాక తప్పదుగా. లేకపోతే మీ వాళ్లు మళ్లీ సంబంధాలంటూ మరెవరి వెంటో పడతారు" అన్నాడు శేఖర్.

శేఖర్ని ఇప్పుడు రావొద్దని అడ్డుకునేవారెవరూ లేరు. జ్యోతి అప్పటి వరకూ తనకి నచ్చనిదేదీ లేదన్నట్లు శేఖర్ వచ్చినప్పుడల్లా అతి మామూలుగా మాట్లాడడం చూసి తన్మయికి చాలా ఆనందం వేసింది.

మొదట్నించీ తల్లికి నచ్చకపోవడం పెద్ద సమస్య అవుతుందని భయపడేది తన్మయి. ఈ సమస్య ఇంత మాములుగా పరిష్కారం అవుతుందని ఊహించలేదు.

కానీ ఆ రోజు భాను మూర్తి శేఖర్ తో "చూడు బాబూ! శాస్త్రోక్తంగా పెళ్లిచూపులు, నిశ్చితార్థం అవీ జరిగితే బావుంటుందని అనుకుంటున్నాం. అంత వరకూ ఇలా రావడం చుట్టూ చూసేవాళ్లకి..." అనేదో చెప్పబోయేడు.

శేఖర్ మధ్యలోనే అందుకుని "అలాగే మావయ్యా! కానీ నేను ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నానని మీకు తెల్సుగా. దొరకగానే మీ ఇష్టం, మీకెలా నచ్చితే అలా చేయండి. అంత వరకూ రావొద్దని అంటే మానేస్తాను." అన్నాడు ముఖం చిన్న బుచ్చుకుని.

జ్యోతి కల్పించుకుని "వచ్చే ఏడాది తన్మయికి డిగ్రీ పూర్తయ్యిపోతుంది కదా, అదే ఏడాది పెళ్లి చేద్దామని మేమూ అనుకుంటున్నాం. నీ ప్రయత్నాలన్నీ ఈ లోగా సక్రమంగా జరగాలని మేమూ కోరుకుంటున్నాం." అంది.

శేఖర్ వెళ్లడానికి లేచి "తన్మయికి చెప్పి వస్తానత్తమ్మా" అని లోపలికి వచ్చాడు.

ఇదంతా అప్పటి వరకూ లోపలి నించి విన్న తన్మయి పెరట్లోకి వచ్చి, వెను తిరిగి పూల చెట్ల వైపు, పాదుల వైపు చూస్తూ నిల్చుంది. కళ్లలోంచి బయటికి వెళ్లగక్కలేని బాధ మనస్సు నిండా పొంగి ప్రవహిస్తూంది. శేఖర్ ని చూడకుండా ఉండడం పెద్ద పరీక్షే. కానీ తప్పని పరీక్ష. సృష్టిలో వేటికీ లేని ఎడబాటు బాధ మనిషికే ఎందుకు? హాయిగా పూల చెట్టులా ఉన్నన్నాళ్లూ అందరికీ ఆనందాన్ని పంచి, గతించే సాదా సీదా జీవితం మనిషికి ఉండొచ్చు కదా? సాయంత్రం పెరటి చెట్టు మీదికి చేరిన పక్షులు ఆనందంగా ఒకదానినొకటి పలకరించుకుంటూ వేటి గూళ్లలోఅవి సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాయి. తనకీ, శేఖర్ కీ పెళ్లయ్యి తనదంటూ జీవితం ఎప్పుడు ప్రారంభమవుతుందో, ఈ మధ్యలో కనీసం ఒకరినొకరు చూసుకోలేని ఈ అగ్ని పరీక్షలేవిటో?

వెనక నించి "తన్మయీ!" అన్న పిలుపు విని కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా "శక్కూ! అంది.

నిలబడడానికి ఓపిక లేనట్లు నూతి పళ్లెమ్మీద కూలబడింది.

శేఖర్ ఎదురుగా వచ్చి నిలబడి "మళ్లీ వస్తానులే. ఇంట్లో బాగా చీకాకు గా ఉండి, ఇలా వస్తే మీ వాళ్లు ఇలా. ఏం చేస్తాం? నా టైము బాలేదు." అన్నాడు.

ఎదురుగా వంటింట్లోంచి తమనే గమనిస్తూ గమనించనట్లు పచార్లు చేస్తూంది జ్యోతి.

శేఖర్ కు మాత్రమే వినిపించేటట్లు "శక్కూ! ఉత్తరాలు తప్పకుండా రాయవూ" అంది తన్మయి.

అసలా మాటే వినిపించుకోనట్లు "అయినా నేనిలా వొస్తే మీ వాళ్లకొచ్చిన బాధేవిటీ, రేపు వైజాగు వెళ్తే మళ్లీ ఎప్పుడొస్తానో నాకే తెలీదు." అని

"సర్లే, ఏవన్నావ్, ఉత్తరాలు. రాస్తానులే. అయినా మీ ఇంట్లో ఓ ఫోను పెట్టించమని మీ నాన్నకు చెప్పరాదూ. సంపాయించిందంతా ఏం చేస్తారు." అన్నాడు వ్యంగ్యంగా.

తన్మయికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. తన మనస్సులో మెలితిప్పే బాధ అసలు ఇతనికి అర్థం అవుతుందా? సమాధానం చెప్పాలనిపించడం లేదు.

అయినా గొంతు పెగుల్చుకుని "మీరు టౌను లో ఉంటారు కాబట్టి మీకు ఫోను అవసరం. మాకీ పల్లెటూరులో అవసరమేవుందీ." అంది అన్యమనస్కంగా.

"పల్లెటూరులో ఉన్నారు కాబట్టే అవసరం. చటుక్కున ఏదైనా పనిబడి ఏం చెప్పాలన్నా ఇంకా టెలీగ్రాములు, ఉత్తరాలు..." అని గొణిగాడు.

అంతలోనే "అయినా ఇంట్లో మీ అమ్మ పెత్తనం కదా, నిజంగా ఆవిడకి అవసరం వస్తేనే మీ ఇంటికి ఫోను కనెక్షను వస్తుంది." అని మీ ఖర్మ ఇంతే అన్నట్లు నెత్తి కొట్టుకుని, "మా ఇంటి ఫోను నంబరు నీకు తెలుసు కదా. సెంటర్లో STD బూత్ నించి నువ్వైనా ఫోను చెయ్యొచ్చుగా. నేను లేకపోతే అమ్మకి చెప్పు ఏ విషయమైనా. మా అమ్మ మీ అమ్మ అంత కఠినురాలు కాదులే." అన్నాడు.

బొత్తిగా సరిగా సాగని ఆ సంభాషణ తన్మయికి అస్సలు నచ్చలేదు. అతనికి ఉన్న ఉక్రోషమంతా వెళ్లగక్కుతున్నాడు.

తను ఇంతగా ప్రేమిస్తున్న ఇతను తన తల్లిదండ్రుల్ని ఇలా ఈసడింపుగా మాట్లాడడం భరించలేదని తెలియదా. తెలిసీ చేస్తున్నాడా?

"అసలు నీ మాటలకు అర్థం లేదు. ఆలోచనలకూ అర్థం లేదు." అంది.

"సరే, అలాగే అనుకో. మళ్లీ ఉద్యోగం వచ్చాకే కనిపిస్తా." అని విసవిసా వెళ్లిపోయేడు.

తన్మయికి విపరీతమైన దు:ఖం వచ్చింది. కానీ పైకి ఏడవడానికి వీల్లేదు. తమ మధ్య సంభాషణ ఎవరికి తెలిసినా జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.

ఒక్క పరుగున డాబా మీదికి వెళ్లింది. అప్పటికే వీధి మలుపు తిరుగుతూన్న శేఖర్ కనిపించేడు.

కట్టలు తెంచుకున్న దు:ఖాన్ని ఆపుకోలేక డాబా మీద గుబురుగా పెరిగిన సన్నజాజి తీగె దాపున కూచుంది.

"ఇటువంటి సంభాషణలు తమ మధ్య భవిష్యత్తులో చోటు చేసుకోకుండా ఉండాలంటే ఏం చెయ్యాలో" అని చాలా సేపు ఆలోచించింది.

వనజతో ఇవన్నీ చెబ్దామంటే తనని వాళ్ల పెద్దమ్మకి ఒంట్లో బాలేదని సాయంగా వాళ్ల ఊరు పంపించేరు వాళ్లింటి వాళ్లు.

తనెప్పుడు వస్తుందో తెలీదు. వనజకి ఉత్తరం రాసి పోస్టు చేసింది. అడ్రసు తప్పో, ఏవిటో ఉత్తరం మరో వారంలో తిరిగి వచ్చింది. తన్మయికి దు:ఖం వచ్చింది. సగం శేఖర్ కోసం, సగం వనజ కోసం. రోజురోజుకీ ఎవరితో ఏమీ చెప్పలేని ఒంటరితనం వేధించసాగింది. ఆ రోజు యథాలాపంగా ఇంగ్లీషు లిటరేచర్ పుస్తకం తీసి కనబడ్డ మొదటి కవితని తెలుగులోకి అనువాదం చేసింది.

అది సర్ థామస్ వ్యాట్ రాసిన "ఐ ఫైండ్ నో పీస్" కవిత. సరిగ్గా తన మన: స్థితికి సరిపోయేటట్లున్న ఆ కవిత అనువాదం "నాకు శాంతి లేదు" పైకి చదువుకుంది.

"నా యుద్ధం ముగిసింది
అయినప్పటికీ నాకు శాంతి లేదు
నేను భయపడుతాను, ఆశపడుతాను
నేను నిలువెల్లా దహించిపోతాను
మంచులా గడ్డకట్టుకుపోతాను
నేను గాలి వాటున అల్లల్లాడగలను
కానీ కాళ్లూనుకుని ఎగురలేను.
.........నాకు శాంతి లేదు..."

అనువాదం చేసేక మనస్సు బాగా తేలిక పడినట్లు అనిపించింది తన్మయికి.

అప్పటి నుంచీ చదువుతున్న చదువే తనకు మంచి మిత్రుడూ, తోడూ అయ్యింది.

గంటల తరబడి ఆంగ్ల సాహిత్యాన్ని అర్థం చేసుకోవడం, వాటిని తెలుగులోకి అర్థం చేసుకుంటూ అనువాదం చెయ్యడం మొదలు పెట్టింది.

వాటితో బాటూ తెలుగు సాహిత్యం లో నచ్చిన రచనల్ని మళ్లీ మళ్లీ చదవడం హాబీగా మార్చుకుంది.

చూస్తుండగానే తన్మయి డిగ్రీ మూడో సంవత్సరం లోకి అడుగు పెట్టింది.

★★★

శేఖర్ నించి ఎటువంటి రిప్లై లేదు. కోపం వచ్చిందేమో అని మథన మొదలైంది తన్మయికి. చివరికి తెగించి ఒకరోజు సెంటర్ నించి శేఖర్ ఇంటికి ఫోను చేసింది.

అవతలి నించి శేఖర్ తల్లి దేవి నవ్వుతూ పలకరించింది.

"తన్మయీ! ఎలా ఉన్నావు?"అంటూ కుశల ప్రశ్నలయ్యాక

"అన్నట్టు నువ్వు ఫోను చేసేవా అని శేఖర్ అడిగేడు మొన్న. ఏమైనా చెప్పాలా శేఖర్ కి?" అంది దేవి.

"అత్తయ్యా! ఊరికే చేసేను. శేఖర్ని ఉత్తరం రాయమని చెప్పండి." అంది బిడియంగా ఇవతలి నించి.

"నీకో శుభవార్త. శేఖర్ నిన్నే ఉద్యోగంలో చేరేడు."అట్నించి నవ్వుతూ దేవి.

"థాంక్యూ అత్తయ్యా. మళ్లీ చేస్తానూ." అంది తన్మయి ఫోను పెట్టేస్తూ.

హుషారుగా ఇంటికి వచ్చి అమ్మమ్మని కౌగిలించుకుంది.

ఆ రోజంతా గొప్ప ఆనందంగా కబుర్లు చెప్పింది.

ఆ మర్నాడు సాయంత్రం

"డిగ్రీ పూర్తి చేసేలోగా పెళ్లి చేసెయ్యాలి అమ్మాయికి. నేను వాకబు చేసేను. అబ్బాయి ఉద్యోగంలో కుదురుకున్నాడు. అతని తమ్ముడు పనిచేసే షిప్పింగు కంపెనీలో కుదురుకున్నాడట." అన్నాడు భానుమూర్తి జ్యోతితో.

"ఊ.. అలాగే చేద్దాం. ఒక పక్క మా అమ్మ ఆరోగ్యం ఏమీ బాగో లేదు, మనవరాలి పెళ్లి చూసే వరకూ ఉంటానో లేదో అని ఒకటే బాధ పడ్తుంది." అంది జ్యోతి.

ఇక ఇంట్లో అబ్బాయి మీద నమ్మకం కుదిరేక అడ్డంకులు తొలగి పోయాయి తన్మయికి.

ఉద్యోగం లో చేరేక మొదటి సారి వచ్చేడు శేఖర్ ఆ రోజు.

"వైజాగు లో సముద్రం ఎలా ఉంటుంది?" అప్పటికి నాలుగు సార్లు అడిగింది తన్మయి.

అదే విషయాన్ని గుర్తు చేస్తూ "నీకు సముద్రం మీద ఉన్న ఇష్టం నా మీద ఉందా?" అన్నాడు శేఖర్.

ఇక ఈ సంభాషణ మరెక్కడికో దారి తీయడం ఇష్టం లేక "ఊ.. నీ ఉద్యోగం గురించి చెప్పు" అంది.

"ఏవుంది చెప్పడానికి. గుమస్తా ఉద్యోగం. మా ఓనర్ కి చేదోడు వాదోడుగా ఉంటూ డబ్బులు వసూలు చేయడం నా పని. అదేవిటో విచిత్రం డబ్బులు మన చేతిలో పొద్దుట్నించీ సాయంత్రం దాకా ఆడతాయి. కానీ ఒక్క పైసా మనది కాదు."

"మరి మా నాన్న నువ్వు అదేదో షిప్పింగు కంపెనీ లో పనొచేస్తున్నావని...." అని నీళ్లు నమిలింది తన్మయి.

"అదేలే, మా ఓనర్ కి ఫిషింగ్ బోట్లు ఉన్నాయి. కొన్ని అద్దెకి ఇచ్చేడు. ఆ లావాదేవీలు చూసుకోవడం నా పని. మా తమ్ముడు వాళ్ల సొంత బోట్లకి మనుషుల్ని కుదర్చడం, వచ్చిన సరుకుని మార్కెట్ కి అమ్మి పెట్టడం చేస్తున్నాడు. మీ వాళ్లలాగే నువ్వూ షిప్పింగు కంపెనీ లోనే పని చేస్తున్నానని చెప్పు ఎవరికైనా. కొంచెం మర్యాదగా ఉంటుంది." అన్నాడు శేఖర్.

"అన్నట్లు నేను వచ్చిన పని మర్చిపోయాను. మన పెళ్లికి ముహూర్తం పెట్టించమని మా వాళ్లకి చెబ్దామనుకుంటున్నాను. లాంఛనాలు మాట్లాడుకోవడానికి మీ వాళ్లకి కబురు చేస్తామని చెప్పేరు మా నాన్నగారు" అన్నాడు.

మొదటి సారి తల్లిదండ్రుల్ని తల్చుకుని తన్మయికి తెలీని దిగులు వచ్చింది.

అప్పటి వరకూ అమ్మా, నాన్నా, అమ్మమ్మ ల సంరక్షణ లో పెరిగింది. వీళ్లనిక్కడ వదిలేసి పెళ్ళయి కొత్త వాళ్లతో వెళ్లిపోవాలి అని బాధ పట్టుకుంది. అదే చెప్పింది శేఖర్ తో.

"చాలా బావుంది, నిన్నా మొన్నటి వరకూ మీ వాళ్లు, నువ్వూ ఉద్యోగముంటేనే పెళ్లని బుర్ర తిన్నారు. ఇవేళ నిజంగా పెళ్లి ప్రస్తావన చేస్తుంటే నువ్విపుడు కొత్త పాట మొదలెట్టకు." అన్నాడు చికాగ్గా.

తన్మయికి ఇంకాస్త బాధ పెరిగింది.

★★★

వనజ వచ్చిందని తెలిసి ఎంతో హుషారుగా పరుగెత్తింది తన్మయి ఆ మర్నాడు. ఇన్ని నెలలు మాయమైపోయినందుకు బాగా కోప్పడాలని నిశ్చయించుకుంది.

"నీకో గమ్మత్తు విషయం చెప్పనా, వచ్చే వైశాఖ మాసంలో పెళ్లి" " అంది వనజ ఆనందంగా, కొత్తగా సిగ్గు పడుతూ.

తన్మయి వనజ చేతులు పట్టుకుని గాలిలో ఊపి సంతోషంగా అడిగింది. "అమ్మ దొంగా, ఇన్నాళ్లు పెద్దమ్మ ఇల్లని ఆ ఊర్లో నువ్వు చేసిందిదన్న మాట." అంది.

"చాలా తమాషాగా మా పెద్దమ్మని చూట్టానికి వచ్చిన చుట్టాల్లో ఒకావిడకి నేను నచ్చడం, వాళ్ల అబ్బాయికి సంబంధం మాట్లాడుకోవడానికి రావడం, మా వాళ్లకీ నచ్చి ముహూర్తాలు పెట్టేయడం, చకచకా జరిగిపోయాయి తెలుసా." వనజ గుక్క తిప్పుకోకుండా అని

"నీకీ వార్త చెప్పాలని మనసు ఎంత తహతహ లాడిందో చెప్పలేను. అన్నట్టు ఒక్క ఉత్తరం రాయలేవా అమ్మాయ్, అంది చిరు కోపం నటిస్తూ."

"ఆహా, నువ్వు రాసేవా? అయినా నేను రాసిన ఉత్తరం తిరిగొచ్చిందిగా" అంది తన్మయి కూడా కోపంగా.

"అసలు తీరికేదీ, అక్కడ నిమిషం పని లేకుండా లేదు తెలుసా. హమ్మయ్య! మళ్లీ అమ్మా, నాన్నల దగ్గిరికి వచ్చేసేను మొత్తానికి" అంది ఊపిరి పీల్చుకుంటూ వనజ.

ఇద్దరూ సాయంత్రపు వెలుగుని చూస్తూ గంటల తరబడి తనివితీరా కబుర్లు చెప్పుకున్నారు.

"నీ పెళ్లి కి ముందే నా డిగ్రీ పరీక్షలు అయిపోతే బావుణ్ణు. హాయిగా నీ పెళ్లి లో స్థిమితంగా ఉండొచ్చు." అంది తన్మయి.

"ఊ.. నాతో బాటూ నీకూ పెళ్లయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక అమ్మాయి గారి చదువు అటకెక్కినట్లే" అంది వనజ ఏడిపిస్తూ.

"అదేం కాదు. నాకు మిగతా విషయాలేవైనా నా చదువు తర్వాతే." అంది దృఢంగా తన్మయి.

★★★

మరో వారంలో పెళ్ళి మాటలకు శేఖర్ ఇంటి నుంచి పెద్దవాళ్లు వచ్చారు. శేఖర్ తండ్రి బాలాజీ రాలేదు.

పెళ్లి మాటల్లో లాంఛనాలు, ఇచ్చిపుచుకొనే లావాదేవీలూ ఏవీ అతనికి సంబంధం లేనట్లే దూరంగా ఉన్నాడతను. తన్మయికీ అదే చెప్పేడు.

"అదేవిటీ, నీకు చెల్లెళ్లు లేరుగా, మీ అమ్మ గారి చెల్లెలి పిల్లలకు ఆడపడుచు లాంఛనాలు ఇవ్వమంటున్నారు మీ వాళ్ళు" అంది తన్మయి.

"ఇలా చూడు, మా పిన్ని పిల్లలకు అన్నయ్యలు మేమే. మాకు వాళ్లే చెల్లెళ్లు. మీ అమ్మా, నాన్నకీ నువ్వొక్కత్తెవే. వాళ్ళు మాత్రం ఈ ఆస్తి అంతా ఏం చేసుకుంటారు. మా పెద్ద వాళ్లేవో ముచ్చట పడుతున్నారు. నువ్వు మధ్యలో కల్పించుకోకు." అన్నాడు అతి మామూలుగా నవ్వుతూ శేఖర్.

తన తల్లిదండ్రులు ఏ విషయంలోనూ బాధ పడడం ఇష్టం లేదు తన్మయికి. ఇలా కట్నాలూ, లాంఛనాలూ అంటూ బేరసారాలు  నచ్చడం లేదు తన్మయికి.

కానీ "నేనంటే ఇష్టమన్నావ్, ఇప్పుడీ కట్నాలూ అవీ అవసరమా?" అని అడగలేకపోయింది.

"ఊ.. వీళ్లూ ఘనంగానే అడుగుతున్నారు" అని రాగం తీసింది వాళ్లు వెళ్లగానే జ్యోతి.

"ఇక కొన్ని తప్పవు, సర్లే ఇంతకు ముందు మాట్లాడిన సంబధాల కంటే నయమే. ఒక్కతే అమ్మాయి అనే సరికి ఆస్తి మొత్తం రాసివ్వాలని మాట్లాడడం లేదుగా వీళ్లు." అన్నాడు భాను మూర్తి.

నరసమ్మ ఆనందానికి అంతు లేదు. “అన్నీ బాగా జరిగి నీకు ఈ సంవత్సరం పెళ్లయ్యిపోతే ఆ సూర్యనారాయణ స్వామికి బూర్లు నైవేద్యం పెడతానని మొక్కుకున్నాను.” అంది మనవరాలితో.

పెళ్లి మాటలకు వాళ్లొక విడత వచ్చి మాట్లాడుకున్న బేరాలు శేఖర్ తండ్రికి నచ్చలేదట.

మళ్లీ ఇంకోసారి అన్నీ మాట్లాడుకోవాలి, ఈ సారి తన్మయి తరఫు వాళ్లని రమ్మని కబురు చేసేరు.

తన్మయికి తలపోటు పట్టుకుంది.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చి "ఎంత నిష్టూరంగా మాట్లాడిందో మహాతల్లి! మొన్న మన ముందు అన్నీ ఒప్పుకుంది, ఇవేళ భర్త ఎదురుగా మనమింకా ఏదో తక్కువ చేస్తున్నట్లు మాట్లాడుతూంది. పోనీండి పనికిమాలిన సంబంధం. వీళ్లు కాకపోతే మరొకరు వస్తారు మనమ్మాయికి." అంది జ్యోతి కోపంగా.

విషయం మళ్లీ మొదటికి వచ్చిందని అర్థమైంది తన్మయికి. తన తల్లిదండ్రులు ఇంతగా బాధ పడ్తూ తనకి పెళ్ళి చేయడం అస్సలు ఇష్టం లేదు.

“విసురుగా వెళ్ళి నాకు అసలు పెళ్ళే వొద్దు” అంది.

"వాళ్లనంటే నీకెందుకంత పౌరుషం ముంచుకొచ్చింది" అని కొరకొరా చూసింది జ్యోతి.

“తన మనస్సులో బాధ అవతలి వాళ్ల గురించా? తల్లిగా ఇదేనా తనను అర్థం చేస్యుకున్నది?”

తన్మయి కంట్లో కన్నీళ్లు సుడులు తిరిగాయి.

ఇంతలో భానుమూర్తి దీర్ఘంగా ఊపిరి పీల్చి, అక్కడన్నీ ఒప్పుకుని మనం కూడా వాళ్లలా మాటలు మార్చడం నాకిష్టంలేదు.

“సరేలే, వాళ్లవి ఎంత గొంతెమ్మ కోరికలైనా మనకి ఎంత సాధ్యమో స్పష్టంగా చెప్పేం కదా. ఇష్టమైతే వాళ్లే కబురు చేస్తారు.” అని

తన్మయి వైపు తిరిగి "అంత వరకూ ఆ అబ్బాయికి ఉత్తరాలవీ వేయకమ్మా" అన్నాడు.

7

"అమ్మమ్మకి అతనెందుకో మొదట్నించీ బాగా నచ్చేసేడు, కానీ అమ్మకి అతనంటే ఇష్టం ఉండదు." అంది తన్మయి ఎటో చూస్తూ సాలోచనగా వనజతో.

"అదేం కాదులే, మీ అమ్మ నీ మంచి కోరే వ్యక్తి. పైగా నువ్వు ఒక్కగానొక్క కూతురివి, నీ బాగోగులు ఆవిడకంటే ఎవరికి ఎక్కువగా తెలుస్తాయి? అయినా ఒక సారి మాట్లాడి చూడు, శేఖర్ నీకు సరైన జోడీ కాదని ఆవిడ నమ్మకమేమో" అంది వనజ.

"అమ్మో, ఇంకేవైనా ఉందా... అమ్మతో శేఖర్ గురించి మాట్లాడే ధైర్యం కూడా నాకు లేదు. అయినా నాకెందుకో ఒకసారి నిర్ణయం తీసుకున్నాక ఆలోచించుకోవడం ఇష్టం ఉండదు."

"అదే పని వాళ్లు చేస్తున్నారుగా, కట్నపు బేరసారాలతో" అంది వనజ నవ్వుతూ.

"నాకేమీ నవ్వు రావడం లేదు" అంది తన్మయి బుంగమూతి పెడుతూ."నిన్న మా వాళ్లని మళ్లీ మాట్లాడడానికి కబురు చేసేరుగా, వెళ్లొచ్చేరు".

"ఊ...ఏవైంది, ఏవైంది అమ్మ దొంగా ఇందాకట్నించీ చెప్పవేం, అంది"వనజ సంతోషంగా.

"కట్నం మరికాస్త పెంచేరు, ఆడపడుచు లాంఛనాలు ఇవ్వమని మా అమ్మ పట్టుబట్టిందట. కానీ చివరికి అదీ ఒప్పుకోక తప్పింది కాదు. ఇక మా వాళ్లు నాకు పెట్టే బంగారం తగ్గించుకోమందట శేఖర్ వాళ్ల అమ్మ. అంతా డబ్బు రూపేణా ఇచ్చెయ్యమని వాళ్లు, కాదు మా పిల్లకి భవిష్యత్తులో ఉపయోగపడాలని వీళ్లు.... అమ్మమ్మ చెప్తుంటే నాకు కళ్ల నీళ్లు ఆగలేదు" అని... కొంచెం ఆగి "మొత్తానికి పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకొచ్చేరు." అంది.

"ఆ... ఇలాగా చెప్పేది పెళ్లి విషయం, మొన్నటిదాకా పెళ్లోయ్ అని గోల చేసి, ఇప్పుడిలా బుంగమూతి ఏవిటి" అని తలమీద మెల్లగా మొట్టికాయ వేసింది వనజ.

ఊ.. అని దీర్ఘంగా ఊపిరి పీల్చి, "పెళ్లి మాటలు మొదలెట్టిన దగ్గర్నించీ జరుగుతున్న ఆర్థిక లావాదేవీల మాటలు నాకెందుకో విసుగ్గా అనిపిస్తున్నాయి. ఇద్దరు మనుషులు కలిసి బతకడానికి ఇవన్నీ తప్పని సరి అంటావా?" అంది తన్మయి సంధ్య వెలుగుని తదేకంగా చూస్తూ.

"ఇలా చూడు, మనకి పూర్తిగా ప్రేమ వివాహాలు చేసుకునే ధైర్యాలు లేవు, పెద్దవాళ్లు చేయాల్సి వచ్చినపుడు ఇవన్నీ మామూలుగా జరిగేవే. ఇంత వరకూ ఎన్ని పెళ్లిళ్లు చూడలేదు మనం. పెళ్లంటే బయటి నించి చూసే వాళ్లకి ఆర్భాటాలు మాత్రమే కనిపిస్తాయి. అందులో ఉన్న వాళ్లకి మాత్రమే ఈ కష్ట నష్టాలు అర్థమయ్యేది. అదే పనిగా ఇదే విషయం ఆలోచించుకోకు, అన్నీ సక్రమంగా జరుగుతాయిలే, ఇంతకీ ముహూర్తం ఎప్పుడు?" అంది.

"అదీ నాకు నచ్చనిదే, నీ పెళ్ళికి మర్నాడు ఉదయం." అంది తన్మయి బెంగగా.

"ఊ.. నువ్వు నా పెళ్లికి రావు, నేను నీ పెళ్లికి రానన్న మాట. పోనీలే. ఏం చేస్తాం. అంతా అయ్యాక మనందరం కలుసుకుందాం. నేను రాయచూర్ వెళ్లేక నన్ను మర్చిపోవుగా! ఇప్పుడైనా కాస్త నవ్వవోయ్. ఆర్థిక విషయాలు పెద్దవాళ్లకి వదిలెయ్. తేలికగా తీసుకో. లేకపోతే నీకు స్థిమితం ఉండదు, నీ చుట్టుపక్కల వాళ్లకి స్థిమితం ఉండదు." అంది వనజ.

★★★

"మేమిద్దరం రెండు మొక్కలం

ఒక వృక్షంగా మారాలనుకుంటున్నాం

ఎన్నో శాఖలతో

ఎన్నో ఆశీస్సులతో"

ఉదయం నించీ ఆలోచించి రాసుకొచ్చిన లైన్లని మళ్లీ మళ్లీ చదువుకుంది తన్మయి.

"ఆ టైముకి బానే వచ్చేవు. నాన్న గారు పెళ్లికి ఇన్విటేషన్సు వేయించేరు. చూడు" అంది జ్యోతి.

"ఇన్విటేషన్సు అప్పుడే ప్రింటింగు కూడా అయిపోయాయా, అందుకోసమే తను ఉదయం నించీ పదాలు పేరుస్తూంది."

పుస్తకాన్ని వెనక్కు దాచి ముభావంగా అందుకుంది ఇన్విటేషన్ ని.

"చి||ల||సౌ|| తన్మయి".... "చి|| శేఖర్" ....

అతి మామూలు పెళ్లి పత్రిక అది. తన చిన్నప్పటి నుంచీ ఎవరి పెళ్లికైనా అవే అక్షరాలు. పేర్లు మాత్రమే మారతాయి అంతే.

కార్డు కలరు తో సహా ఎక్కడా కొత్తదనం లేదు.

తనేదో గొంతు విప్పి అనేలోగా "ఊ...పెళ్లి పత్రికలకీ రేటు బాగా పెంచేసేరన్నమాట. ఏం చేస్తాం, మనింట్లో పెళ్లి వచ్చే సమయానికే అన్నీ ఖరీదులయ్యి కూచున్నాయి. అవతల కట్నాలూ పెంచేసేరు." అని రాగం తీసింది జ్యోతి.

తల్లి మాటిమాటికీ విసుక్కుంటూ పెళ్లి పనులు చేయడం చూస్తే తన్మయికి బాధ తన్నుకు వస్తూంది.

“తన వల్లే వీళ్లకి ఇలా మనస్తాపం కలుగుతూంది. అదేదో వీళ్లకి వీళ్లు సంబంధం చూసి పెళ్లి చేసి ఉంటే ఇవన్నీ జరిగేవి కావేమో” అని అపరాధ భావన మొదలైంది.

నోట్ బుక్ తో డాబా మీదికి నడిచింది తన్మయి.

"ఈ సంవత్సరం సంక్రాంతి పండగ ఇలా వెళ్లగానే అలా ఎండలు బాగా మొదలయ్యి పోయేయి. ఇంక మే నెల వచ్చేటప్పటికి ఎలా ఉంటుందో"

ఎదురింటి వాకిటి ముందు ముగ్గు పెడ్తూ ఇంటావిడ దారిన పోయే వాళ్లతో మాట్లాడుతూంది.

తనకి ఇష్టమైన సన్నజాజి పందిరి గూడు వైపు నడిచి చతికిలబడింది తన్మయి.

“శేఖర్ తో ఆ నాలుగు లైన్లు మాట్లాడితే బావుణ్ణు. వాళ్ల వైపు నించి పెళ్లి పత్రికలోనైనా వేస్తే” అనుకుని మళ్లీ తన ఆలోచనకి తనే నవ్వుకుంది.

“వైజాగులో ఉన్న శేఖర్ కి ఉత్తరం చేరేదెప్పుడు? పెళ్లి పత్రిక గురించి అతను వాళ్ల వాళ్లతో మాటాడేదెప్పుడు? ఇవన్నీ జరిగే పనులు కావులే.” అని సరిపెట్టుకుంది.

సాయంత్రపు వెలుగులో చిన్ని నక్షత్రాల్లాంటి పూల పందిరి మధ్య కూచుని రాసుకోవడమంటే తన్మయికి ప్రాణం.

చేతిలో ఉన్న పుస్తకాన్ని తెరిచి "ప్రియమైన అజ్ఞాత మిత్రునికి-" అని రాసింది.

“ఆ ఊహే ఎంతో బావుందసలు! ఎవ్వరితో ఏవీ చెప్పలేని విషయాలు ఇలా అజ్ఞాత మిత్రునికి చెప్పుకోవచ్చు కదూ.”

“మిత్రమా! నువ్వెలా ఉంటావో, ఎక్కడ ఉంటావో తెలీదు. అసలు నువ్వు నా రాతలన్నీ చదవవనీ నాకు తెలుసు. అయినా ఇవన్నీ నీకు చెప్పాలనే ఉంది. నేనిక్కడ ఒక చిన్న ప్రాణిని. సన్నజాజి పొదలో ఉద్భవించిన జాజి పూవుని.....” రాస్తూ ఉంటే తన్మయికి తెలీని తన్మయం కలగడం మొదలు పెట్టింది.

చకచకా నాలుగు పేజీలు రాసింది. ప్రతీ అక్షరంలోనూ  అజ్ఞాత మిత్రుడు తనతో సంభాషిస్తూన్నట్లే తన వ్యథంతా చెప్పుకుంది. చివరికి పెళ్లి పత్రికలో ఉండాలని ఊహించుకున్న లైన్లు రాసి," సెలవు మిత్రమా! ఇవేళ్టికి చాలు" అని రాసింది.

ఆ మరసటి వారం నించి డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు  ప్రారంభమయ్యాయి.

"జాగ్రత్త, పెళ్లి ఆలోచనల్లో పడి పరీక్షలు వెళ్లగొట్టకు" అని

" నీలో ఒక గొప్ప క్వాలిటీ ఉంది, తెలుసా! ఎన్ని ఆలోచనల్లో ఉన్నా చదువు దగ్గిర వేరే తలతో ఆలోచిస్తున్నట్లు తేలికగా రాసేసి మార్కులు కొట్టేస్తావ్" అంది వనజ నవ్వుతూ.

"నాకు పుస్తకాలు, చదువు ఇచ్చే ఊరట ఇంకేవీ కల్పించలేకపోవడం కారణమేమో". అంది చిరునవ్వుతో తన్మయి.

పుస్తకాల ముందు కూచుంటే తనకు నిజంగానే మరో విషయం జ్ఞాపకం రాదు. ఒక విధంగా తనకది వరం.

★★★

పెళ్లి బట్టలకి వెళ్ళే రోజు వచ్చింది. పెళ్లి కొడుకు బట్టలకి రెట్టింపు డబ్బులతో పెళ్లికూతురి బట్టలు కొనుక్కోవాలి.

వాళ్ళకి వీళ్లు, వీళ్లకి వాళ్లు బట్టలైనా కొనివ్వాలి, లేదా డబ్బులైనా ఇవ్వాలి.

అంతా కలిసి షాపింగుకి వెళ్లాలని అనుకున్నారు ముందు.

కానీ వెళ్ళే ముందురోజు "మా బట్టలు మేం తర్వాత కొనుక్కుంటాం. మీరు ఇంతే బడ్జెట్ లో కొనుక్కోండి." అని కబురు చేసారు.

జ్యోతి బట్టలు కొంటున్నంత సేపూ చికాకు పడుతూనే ఉంది.

"వీళ్ల బడ్జెట్టు లో మంచి చీరలే రావడం లేదు." అంటూ.

తన్మయికి బంగారం రంగు పట్టు చీరంటే చాలా ఇష్టం.

"అంటే, చీరంతా జరీ ఉండాలంటారు"  అన్నాడు సేల్స్ మేన్.

"ఊ... చీరంతా జరీతో కొంటే మేమెక్కడ ఇవ్వగలం అందులో సగం అబ్బాయికి" నిష్టూరంగా అంటున్న తల్లి వైపు, ముసి ముసి నవ్వులు నవ్వుతున్న సేల్స్ మేన్ వైపు నిశ్శబ్దంగా చూసింది తన్మయి.

బడ్జెట్ చీరల్లో చీర మొత్తం జరీ కాదు కదా,  కనీసం అరచేయి అంచున్న జరీ చీర కూడా రాలేదు.

ఇక చీర సెలక్షను జ్యోతికే అప్పగించి, ప్రేక్షకురాలిగా కూచుంది తన్మయి.

జ్యోతికి ముదురు రంగులంటే ఇష్టం. ఎప్పటిలానే ముదురు ఆకుపచ్చ రంగు చీరొకటి, ముదురు ఎరుపు రంగు చీరొకటి కొంది.

తన్మయికి లేత రంగులంటే ఇష్టం. గంధం రంగు చీర తియ్యమని అడగాలని నోటి చివరి వరకూ వచ్చినా అప్పటికే బాధపడ్తూన్న తల్లి మనస్సు ఇంకా బాధ పెట్టడం  ఇష్టం లేక ఊరుకుంది.

★★★

పెళ్ళి దగ్గర పడ్తూంది.

తన్మయికి పెళ్లై మరో ఇంటికి వెళ్లాలన్న దిగులు ఒక వైపు, శేఖర్ తో కొత్త జీవితం తాలూకు పులకరింత మరో వైపు కలుగుతున్నాయి.

ఎవరేం మాట్లాడినా తలూపుతుంది. కానీ తలలోకి ఏవీ ఎక్కినట్లు ఉండదు. మళ్లీ అడిగితే

"ఆ? ఏవిటి?" అంటుంది.

భోజనం దగ్గర కూచుని అన్యాపదేశంగా నవ్వుకుంటుంది. అటూ ఇటూ కలిపి సరిగా తినకుండా వదిలేస్తుంది.

పెళ్లికి పదకొండు రోజుల ముందు పెళ్లి పనుల రాట వేసినప్పటి నుంచీ ఇంకాస్త మనసు గాల్లో విహరించసాగింది తన్మయికి.

అదే సమయంలో వనజకీ పెళ్లి పనులు ప్రారంభించడంతో ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకునే అవకాశం రావడం లేదు.

అజ్ఞాత మిత్రునికి రాసిన ఉత్తరాల పుస్తకం నిండిపోవస్తూంది.

అజ్ఞాత మిత్రుణ్ణి తలచుకోగానే తన్మయికి పెదాల మీద అప్రయత్నంగా చిరునవ్వు వెలిసింది.

పుస్తకాన్ని తెరిచింది. నల్లని ఇంకు పెన్నుతో బాపూ గారి అక్షరాల్ని అనుకరిస్తూ తను నేర్చుకున్న రాతను మురిసిపోతూ చూస్తూ కూచుంది. ఇంకు పెన్ను కావడంతో పేజీకి ఒక్క వైపే రాసింది. బాల్ పాయింటు పెన్నులు అస్సలు నచ్చవు తన్మయికెందుకో.

“ఈ రాతలకు అనుగుణంగా కవితలో, బొమ్మలో ఇటు వైపు అతికిస్తేనో.... “

ఎదురుగా కనిపించిన ఆంధ్రజ్యోతి వీక్లీ చేతిలోకి తీసుకుని పేజీ తిప్పింది. రెండో పేజీలో కనబడ్డ ఈ వారం కవిత, కవితతో బాటూ ఉన్న బొమ్మ విపరీతంగా ఆకర్షించాయి.

బొమ్మతో బాటూ కవితని జాగ్రత్తగా కత్తిరించి మొదటి పేజీలో అతికించింది.

పుస్తకం లో అక్కడక్కడా ఒక్కో పేరా చదువుతూ, జ్ఞాపకాలు తలచుకోవడం ఎంతో హాయిగా, ఊరటగా ఉంది తన్మయికి.

"మిత్రమా! నీతో మాట్లాడకపోతే క్షణం మనసు ఊరట పడదు. ఆకాశం లో మాయమయ్యే సంధ్య వెలుగులో నా చెవిలో నువ్వు చెప్పే మాటలు వింటూ ఇలా రాయడం ఎంత బావుందో తెలుసా!!"

"నేస్తం! నా మాటలు నీకు విసుగనిపించడం లేదు కదూ!! ఎంతకీ పొద్దుపోని రోజులెన్ని గడపాలో....సముద్రమూ, ఆకాశమూ కలిసే చోట మళ్లీ నీతో మాట్లాడుతానూ!"

"నా చుట్టూ  గాలి స్తంభించినట్లు ఉక్కగా ఉంది. అయినా నీతో మాట్లాడుతూంటే గట్టు దిగువన పారే సెలయేటిలో కాళ్లు ముంచినంత హాయిగా ఉంది సుమా!.. నా మనసులో అల్లకల్లోలాలు నీకెందుకులే. మంచి కబుర్లు చెప్పు వింటాను."

★★★

పెళ్ళికి మూడు రోజుల ముందు పెళ్ళికూతుర్ని చేసేరు. పసుపు రాసి, తలారా స్నానం చేయించి, కొత్త చీర కట్టించేరు వరసకి అత్తలైన వాళ్లు.

కళ్లకి కాటుక పెట్టి, తిలకం సీసాతో కళ్యాణ తిలకం చేతికి వచ్చినట్లు పెట్టేరు. బుగ్గన కాటుక తో బుగ్గ చుక్క పెట్టేరు. అద్దంలో తనను తాను చూసుకుంది తన్మయి. ఆ అలంకారంలో పొందికతనం లేదు. అయినా ఎంత బావుంది తన ముఖం!

పొడవు జుట్టుకి జడగంటలు వేసి, ఆపైన పూల జడ కుట్టేరు అమ్మలక్కలు.

నరసమ్మ ఆనందంగా దగ్గరికి వచ్చి మనవరాలికి మెటికలు విరిచింది.

జ్యోతి వంట హడావిడిలో ఉండి “అంతా తయారు చేసేక పిలవండి” అని వంట వైపు వెళ్లిపోయింది.

పెద్దత్తయ్య తను తెచ్చిన చీరతోనే పెళ్ళికూతుర్ని చేయించింది. ముదురు నారింజ రంగు చీరమీద

చెమ్కీల మెరుపుల ప్రింటు. “ఈ చీర బంగారు రంగైతే ఎంత బావుణ్ణు!!! ఇవేళ్టి ఈ తయారీకి సరిగ్గా అతికినట్లు ఉండేది.” అనుకుంది మనస్సులో తన్మయి.

తన్మయికి అప్పటివరకూ చీరలు కట్టుకునే అలవాటు లేక కొంత, ఫాన్సీ చీర కావడం వల్ల కొంతా, చీర కట్టుకున్న దగ్గర్నించీ సర్దుకోవడమే సరిపోయింది.

బంధువులు ఒకటో రెండో తెచ్చిన కొత్త చీరలన్నీ ముదురు రంగులే.

తన్మయి అసంతృప్తిగా చూసింది వాటి వైపు.

దగ్గర బంధువులు, చుట్టుపక్కల వాళ్లు వచ్చి అక్షింతలు వేసెళ్లారు. దూరపు బంధువులు ఒకరూ, ఒకరూ రావడం మొదలెట్టారు.

సాయంత్రానికి ఇల్లంతా సందడిగా తయారైంది. చీటికీ మాటికీ ఏడుపు లంకించుకునే పసిపిల్లలు, వంటల దగ్గిర అలిసిపోతూ ఆడవాళ్లు, పేకాటల్లో మునిగి తేలుతూ మగవాళ్లు.

ఇందులో ఎందులో చేరని వాళ్లు అయిన దానికీ కాని దానికీ హడావిడిగా తిరుగుతూనూ.

ఊర్లో ఉన్న ఒక్కగానొక్క ఫోటో గ్రాఫరు స్థిమితంగా పదకొండు గంటలకు వచ్చేడు. అక్షింతలు వేస్తూన్న వాళ్లని పక్కకి నిలబడమని రెండు ఫోటోలు తీసేడు. అప్పటికే వచ్చిన వాళ్లు పెట్టిన కుంకం బొట్ల వల్ల తన్మయికి పెద్ద బొట్టు తయారైంది. ఎండ తీవ్రతకి అది కారి ముక్కంతా ఎర్రగానూ తయారైంది.

"ఎలా వచ్చిందో ఏవిటో ఫోటోలో. వనజ పక్కన ఉంటే ఇవన్నీ తుడిచి చక్కగా సర్దేది."

తన పక్కన "తోడు" కూచోబెట్టిన ఎనిమిదేళ్ళ తోడపెళ్లికూతురి వైపు చూసింది.

తనకంటే బాగా ఆనందంగా అక్షింతలు వేయించుకుంటూంది.

కాస్సేపాగి, "నువ్వొకసారి వనజ ఇంటికి వెళ్లి చూసొస్తావా?" అంది తన్మయి.

బదులుగా "వనజక్క ని ఇవేళే పెళ్లికూతుర్ని చేసేరు, తెలుసా!" అంది ఆ పిల్ల.

తెలుసన్నట్టు తలూపింది. "అందుకే నిన్ను వెళ్లమంటున్నాను. నన్నెలాగూ వెళ్లనివ్వరు." అని నవ్వింది తన్మయి.

ఆ పక్కనే ఎవరెవరు ఏం బహుమానంగా ఇస్తున్నారో రాస్తున్న పిన్ని వరసావిడ లేవబోతున్న తోడపెళ్ళికూతుర్ని రెక్క పుచ్చుకుని కూచోబెట్టింది మళ్లీ.

"అక్కడ శేఖర్ ని కూడా పెళ్లి కొడుకుని చేసి ఉంటారు. ఒక్కసారి చూస్తే బావుణ్ణు" అనుకుంది తన్మయి.

సాధారణంగా పెళ్లి కొడుక్కి తెల్ల బట్టలు తొడిగిస్తారు. తనకి ఫుల్ వైటు ఇష్టం ఉండదని అనేవాడు శేఖర్. మరి ఇప్పుడు ఎలా ఒప్పుకున్నాడో చూడాలి.

శేఖర్ తెల్లబట్టల్లో ఎలా ఉండి ఉంటాడో ఊహించుకోవడానికే ఎంతో బావుంది.

కాగితం తీసుకుని ఒక పక్కగా కూచుని రాసుకుందామంటే లేదు. రోజంతా కుర్చీలో కూచోవడమే పనైంది. పొరబాటున లేస్తే, నిమిషానికోసారి "తన్మయీ" అంటూ ఎవరో ఒకరు పిలవడం, మళ్లీ కుర్చీలో కూర్చోవడం అక్షింతలు వేయించుకోవడం పనిగా మారింది. ఉదయానే తడి తలతో బిగించి జడ వేసినందుకు, పైగా అస్సలు అలవాటు లేని చీర భారం, పూల జడ భారంతో సాయంత్రానికి తన్మయికి తలపోటు పట్టుకుంది.

ఇంటి నిండా చుట్టాలే. పడుకోవడానికి చోట్లు లేక అన్ని గదుల్లోనూ ఒకళ్ళ పక్కన ఒకళ్ళు వరసగా పడకలేసేరు.

తన్మయి అత్తయ్యలతో బాటూ డాబా మీద పడుకుంది. ఆకాశంలోకి చూస్తూ తన గుండె చప్పుడు తనకే వినిపిస్తూండగా తెలీని తమకం చుట్టుకుంది తన్మయికి. కళ్లు మూసుకుంటే తన్మయికి సముద్రం ఒడ్డున నింగి, నేలా సాక్షిగా మెత్తని ఇసుకలో శేఖర్తో తన పెళ్లి మండపం కనిపించింది. కానీ ఎందుకో ఉదయం నించీ తన గుండె చప్పుడు తనకి గట్టిగా వినిపిస్తూ ఒక రకమైన టెన్షన్ గా ఉంది.

తనకి చిన్నప్పటి నించీ  బాజాలూ, పెద్ద శబ్దాలూ విన్నప్పుడు అలాగే ఉండేది. ఉదయం నించీ చుట్టూ అంతా హడావిడిగా తిరుతుగూన్నందువల్లనేమో అనుకుంది.

ఆ మర్నాడూ అదే స్థితి కొనసాగింది.

"ఈ రోజే వనజ పెళ్లి. కనీసం పెళ్లి ఊర్లోనే అయితే అమ్మ వాళ్లయినా వెళ్లేవారు.  యాభై కిలోమీటర్లకవతల గుళ్లో పెళ్లి.  ప్చ్..ఎలా జరుగుతూందో, ఏమో" అని నిట్టూర్చింది తన్మయి.

శేఖర్ తరఫున రావలిసిన పెళ్ళి వాళ్లు కొందరు ఆ రోజు సాయంత్రం వచ్చేరు. దగ్గర వాళ్లెవరూ రాలేదు. మర్నాడు ఉదయం పెళ్లి.

“అబ్బాయి వాళ్లు మర్నాడు ఉదయమే ఏకంగా పెళ్లి సమయానికి వస్తారని” కబురు తెచ్చేరు.

జ్యోతి గాభరాగా మాట్లాడుతూంది. "ఇదేవిటీ, అన్నిటికీ ఒప్పుకున్నాం కదా, విడిదిళ్లు, భోజనాలు సిద్ధం చేసేక, ఇప్పుడు రేపే వస్తావని కబురు చేస్తే ఎలా?"

ఏదైతే వినకూడదని తన్మయి ఇన్నాళ్లూ భయపడిందో అదే జరుగుతూంది. శేఖర్ ఆ రోజు రాలేదు.

రాత్రి భోజనాలయ్యినా ఎక్కడా ఎవరూ పడుకునే ఛాయలు కనిపించడం లేదు. చిన్న పిల్లలు ఎక్కడికక్కడ నిద్రపోతూ ఉన్నా, ఎవరో ఒకచంటి పిల్ల లేచి ఏడుస్తూనే ఉంది.

కింద పెళ్లి కోసం స్వీట్ల తయారీ వంట నడుస్తూంది.

తన్మయికి కళ్లు గట్టిగా మూసుకున్నా నిద్రరాని ఒక విచిత్రమైన, తెలీని ఉద్వేగ స్థితి మొదలైంది.

"ఏదీ ఊహించుకోవద్దు, భయపడొద్దు, అన్నీ సక్రమంగా జరుగుతాయి..అన్నీ..అన్నీ సక్రమంగా జరుగుతాయి..."అని తనకు తాను సర్ది చెప్పుకోవడం మొదలు పెట్టింది.

8

మర్నాడు ఉదయమే  పెళ్లి. తన్మయి ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న పెళ్లి.

శేఖర్ వాళ్లు ఇప్పటికే వచ్చేయాలి. కానీ దేనికో అలిగి ఉదయం వస్తామన్నారు.

“వాళ్ల వైపు నుంచి నచ్చనివెన్నో  ఒప్పుకుని  తనవాళ్లు పెళ్ళి జరిపిస్తున్నారు. ఇంకా ఏం కావాలి వాళ్లకి?" తన్మయికి అస్సలు నిద్ర పట్టడం లేదు.

ఎటు ఒత్తిగిలినా ఇవే ఆలోచనలు. ఒక వైపు "పెళ్ళి" అనుకోగానే ఏదో తెలీని ఉద్వేగస్థితి గుండెని వేగవంతం చేస్తూంది. మరో వైపు అసలివన్నీ సక్రమంగా  జరుగుతాయో లేదో అని  భయం పట్టుకుంది.

డాబా మీద అందరితో కలిసి పడుకున్నా తెలీని భయం. పక్కనే ఉన్న అత్తయ్య తన అవస్థ గమనించినట్లు "పడుకోమ్మా! రేపు పెళ్లిలో ముఖం పీక్కుపోయినట్లవుతుంది" అంది.

మృదువైన అత్తయ్య చేతిని ఆనుకుని దగ్గరగా జరిగి పడుకుంది తన్మయి. రాత్రి ఎలా గడిచిందో తెలియలేదు.

తెల్లారగట్ల జ్యోతి వచ్చి కూతురిని లేపింది."తన్మయీ! పెళ్ళి వారొచ్చారు".

వెలిగి పోతున్న తన్మయి నవ్వు ముఖం చూసి అత్తయ్యలు ఆట పట్టించడం మొదలుపెట్టేరు.

ముందు శేఖర్ తల్లి దేవి మరికొందరు ఆడవాళ్లు వచ్చేరు. అప్పటికీ శేఖర్ రాలేదు.

పెళ్లి సమయానికి శేఖర్ తండ్రి తో కలిసి వస్తాడట. చుట్టాలు రహస్యంగా చెవులు కొరుక్కోవడం తన్మయి చెవిన పడింది. "ఇదేం విడ్డూరం! ఇప్పటికింకా పెళ్లి కొడుకు రాలేదూ!"

ప్రదానం కార్యక్రమం మొదలయ్యింది. ఆడవాళ్లు మాత్రమే పాల్గొనే కార్యక్రమం అది.

పక్కనేవో మంత్రాలు వినిపిస్తూండగా దేవి తన్మయి మెళ్లో పసుపు తాడు వేసి చెవిలో మూడు సార్లు "..... వారి కోడలు" అని చెప్పింది.

తన్మయి తల వంచుకుని మనసులో ఆనందం పల్లవిస్తూండగా తనిక "వీరి కోడలు" అని మెల్లగా తనలో తను అనుకుంది.

మరో గంటలో ముహూర్తం అనగా "పెళ్లి కొడుకు వాళ్లు ఊరి చివరి వరకూ వచ్చి ఆగి ఉన్నారు" అని కబురు వచ్చింది.

ఆఘమేఘాలతో మంగళ వాయిద్యాల వారు పరుగులు పెట్టారు.

వీధి మలుపు చివర పూలతో అలంకరించిన కారు, ముందు మంగళ వాయిద్యాలు, తోడు నడుస్తూన్న పెళ్లి వారిని కిటికీలోంచి చూసింది తన్మయి.

తన్మయి గుండె మరింత వేగంగా కొట్టుకోవడం మొదలైంది.

ముహూర్తానికి ఎక్కువ సమయం లేనందున వస్తూనే పెళ్లి కొడుకుని బట్టలు మార్పించేసినట్లున్నారు. శేఖర్ తెల్ల బట్టల్లో లేడు. తనకూ పాత లంగా ఓణీ వేసారు. మంగళ స్నానాలు పక్క పక్కన కూచో బెట్టి మొదలు పెట్టేరు. ముందు కాలి గోళ్ళు తీసి, తర్వాత పసుపులు రాసి తల మీంచి నీళ్లు పోసేరు.

ఒక పక్క ఎవరి మాట ఎవరికీ వినిపించని వాయిద్యాల గోల, చుట్టా పెద్ద వాళ్ల హడావిడి మాటలు, పిల్లల గందరగోళం. వీటన్నిటిలో తన్మయికి శేఖర్ ముఖం వైపు ప్రశాంతంగా చూసే అవకాశమే కలుగలేదు. పక్కన కూచోబెట్టగానే "ఏవిటింత ఆలస్యం" అంది తల వంచుకుని.

తన మాట వినబడనట్లు అట్నించి సమాధానం ఇవ్వలేదు శేఖర్.

ఇద్దరినీ లేవదీసి చెరో వైపుకి లోపలికి తీసుకెళ్లారు. సమయం ఎంతో లేనందున పెళ్ళి చీర గబగబా చుట్ట బెట్టేరు. ఒకరు జడ వేస్తూంటే మరొకళ్ళు పారాణి పెట్టేరు. పది నిమిషాల్లో తన్మయిని పెళ్ళి పందిట్లోకి తీసుకొచ్చేరు.

అసలు చీర ఎలా వచ్చిందో చూసుకోలేదు. పెళ్ళి బొట్టు, బుగ్గ చుక్కా సరిచూసుకోలేదు. అసలే తనకు నచ్చని రంగు పట్టుచీర. అందులోనూ పది నిమిషాలు స్థిమితంగా తయారయ్యే అవకాశం లేదు.

పెళ్ళి పీటల మీద శేఖర్ తెల్ల బట్టల్లో మిలమిలా మెరిసి పోతున్నాడు. తల ఎత్తి ఎక్కడా చూడొద్దని మేనత్త మరీ మరీ చెప్పింది. అందుకే క్రీగంట చూసింది తన్మయి.

తనకి పట్టు చీర మీద తెల్ల నూలు చీర ని క్రాస్ గా రెండు భుజాల మీద నుంచి కప్పేరు.

తడి తలమీద జడ గంటలు, ఆపైన బరువైన చేమంతి పూల జడ. మెడ వెనక్కి లాగేస్తూంది తన్మయికి. వేసవిలో పెళ్లి కాబట్టి మల్లెపూల జడ తెప్పించమని చెప్పింది తన్మయి. చేమంతిపూల జడైతే ఎక్కువ సేపు వాడిపోకుండా ఉంటుందని జ్యోతి అభిప్రాయం. చివరికి అదే తెచ్చేరు పూల జడకి వెళ్లిన వాళ్ళు.

పెళ్ళి పీటల మీద ఒక వైపు తన్మయి, జ్యోతి, భానుమూర్తి; మరో వైపు శేఖర్, అతని తల్లిదండ్రులు కూచున్నారు. మధ్య తెర అడ్డుగా పట్టుకున్నారు. కన్యాదానం సమయంలో తెర కింద నుంచి ఇత్తడి పళ్ళెంలో శేఖర్ పారాణి పాదాలు తెల్లగా దృఢంగా కనిపించాయి. తల్లి నీళ్ళ చెంబుతో నీళ్లు పోస్తూండగా తండ్రి కాళ్లు కడుగుతున్నాడు. తన్మయికి మనసులో ఏదో ఇబ్బంది కలిగింది. "ఇదేం ఆచారం? చిన్న వాళ్ల కాళ్లు పెద్ద వాళ్లు కడగడం? ఎప్పుడూ ఎవరి దగ్గరా తల వంచని తండ్రి తన కోసం ఒక కుర్రాడి కాళ్లు పట్టుకుంటున్నాడు."

తెర తీయక ముందే జీల కర్రా బెల్లం ముద్దలు ఇద్దరి తలల మీదా ఇద్దరి చేతా పెట్టించారు. అప్పుడే తీసిన తెర వెనుక నుంచి పున్నమి చంద్రుడిలా అద్భుతంగా కనిపించాడు శేఖర్. అతని తలమీద తన చేయి, తన తల మీద అతని చేయి. "ఎప్పటికీ నువ్వు నాతోనే ఉంటావు కదూ" అని ప్రమాణాలు చేసుకుంటున్నట్లు. ఈ తతంగమంతా కొత్తగా, బెరుకుగా, ఆనందంగా, తమకంగా, అర్థమయీ, అర్థం కాకుండా ఉంది తన్మయికి. కళ్లెత్తి తను చూసిన తొలి క్షణం నవ్వే కళ్లతో కన్ను గీటాడు శేఖర్. సిగ్గుగా తల దించుకుంది మళ్లీ.

మాంగల్యం కట్టడం కోసం అతను లేచి నిల్చున్న క్షణం మనసు వశం తప్పినట్లయ్యింది. ఎవరో జడను ఎత్తి పట్టుకున్నారు. మెడలో అతి చిన్ని మాంగల్యాలు రెండు వైపుల నించీ రెండు కట్టి మూడు ముళ్ళు వేసాడు శేఖర్. అక్కడా నిరాశే. తనకు పెద్ద కాసులంతటి మాంగల్యాలు ఇష్టం. ఇవేవిటి కనీ కనబడకుండా. బహుశా: ఇరు పక్షాల బేరాల్లో ఇంతకే కుదిరేయన్న మాట. ఆ తలంపు రాగానే ఉత్సాహం పోయింది తన్మయికి.

తలంబ్రాల సందడి, బిందెల్లో ఉంగరాల ఆట బాగా నచ్చాయి తన్మయికి. కానీ అంత మంది మధ్యలో కూచుని పసిపిల్లల్లా ఈ వినోదమేమిటో అని అనిపించింది.

చుట్టూ ఉన్న వాళ్లు వరసగా అక్షింతలు వేయడానికి రావడం డబ్బో, గిఫ్టో ఇచ్చి పక్కన నోటు పుస్తకాలు పుచ్చుకుని కూచున్న వాళ్లతో చెప్పి రాయించడం మరీ ఎబ్బెట్టుగా తోచింది తన్మయికి. అదేదో పద్దులు వసూలు చేస్తున్నట్లు.

ఒక పక్క పెళ్ళి తంతు పూర్తయీ కాగానే అంతా భోజనాల హడావిడిలో పడ్డారు. పెళ్ళి పీటల మీద నుంచి లేపి, పెళ్ళి పందిట్లో రెండు కుర్చీల్లో కూచోబెట్టారు ఇద్దరినీ. కానీ ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోవడానికి లేదు. నిమిషానికొకరు వచ్చి అక్షింతలు వేయడంతో సరిపోతూంది.

మొత్తానికి ఎలాగో శేఖర్ ని అడిగింది తన్మయి –ఎందుకు ఆలస్యమయిందని?

"అవన్నీ ఇప్పుడు అవసరమా?" అన్నాడు బదులుగా ఎటో చూస్తూ.

భోజనాలు కాగానే అప్పటికప్పుడు పెళ్లికూతుర్ని తమతో పంపేయమని వెళ్లిపోతామన్నారు శేఖర్ వాళ్లు.

సాయంత్రం వరకూ ఆగమన్నా వినిపించుకోలేదు.

జ్యోతి ముఖం పెళ్లి సమయమంతా అప్రసన్నంగా ఉండడం చూసి "ఏం గొడవ పడ్తారో" అని తన్మయికి కొత్త టెన్షన్ మొదలైంది.

అదృష్టవశాత్తూ తన్మయి తరఫు నించి ఎటు వంటి గొడవా చెయ్యలేదు.

అమ్మాయిని అప్పటికప్పుడు పంపించమంటే సారె సర్దడానికి రెండు గంటల వ్యవధి ఇమ్మని అడిగేరు.

త్వరత్వరగా తనకి రెండు జతల బట్టలు సర్ది పెట్టేరు. మర్నాడు శేఖర్ వాళ్లింట్లో రిసెప్షన్. మూడో రోజుకి మళ్లీ తిరిగి రావాలి.

కారు ఎక్కిన మరుక్షణం దు:ఖం పొంగుకొచ్చింది తన్మయికి. తల్లిని, తండ్రిని, అమ్మమ్మని వదిలి తను ఒక్కతే ఎక్కడికో దూరానికి వెళ్లిపోతూందన్న సత్యం మొదటి సారి బోధ పడినట్లయ్యింది.

శేఖర్ భార్యగా జీవితం మొదలయ్యిందన్న సంతోషం మచ్చుకైనా లేదు. దు:ఖం... దు:ఖం .. అంతులేని దు:ఖం.

ప్రయాణం మొదలయ్యి అరగంట దాటినా తన్మయి ఏడుస్తూనే ఉంది. పక్కనే కూచున్న శేఖర్ తన్మయి చెయ్యి పట్టుకుని, కారు ముందు సీట్లో కూచున్న అతని బాబాయితో కులాసాగా కబుర్లు చెప్తున్నాడు.

మధ్య మధ్యలో ఊరుకోమన్నట్టు చేతిని గట్టిగా ఒత్తేవాడు. కాస్సేపటికి ఇక ఓపిక పట్టనట్లు "ఒసేయ్, ఎందుకే ఇంత ఏడుస్తున్నావు మీ అమ్మానాన్నా రేపు రిసెప్షన్ కి వస్తున్నారుగా" అన్నాడు.

తన్మయి బిత్తరపోయి చూసింది "శేఖర్ తనని "తనూ" అని ప్రేమగా పిలుస్తాడనుకుంటే "ఒసేయ్" అని చెత్త పిలుపు పిలిచినందుకూ, అమ్మానాన్నల్ని ఒదిలి రాలేని తన బాధ అతనికి కాస్త కూడా అర్థం కానందుకూ."

వనజ జ్ఞాపకం వచ్చింది. "పెళ్ళయ్యాక నలుగురం కలుద్దాం." అన్న మాటలు చెవుల్లో వినిపిస్తున్నాయి. "వనజ ఏం చేస్తూందో! ఇంటికి తిరిగి రాగానే తనని ఎలాగైనా కలవాలి" అనుకుంది.

"ఏదీ తను అనుకున్నట్లు జరగని ఈ పెళ్ళి ఏవిటో" అన్న భ్రాంతిలో ఉన్న తన్మయి శేఖర్ మాటల్తో ఈ లోకంలోకి వచ్చిపడ్డట్లయ్యింది.

ఇంకాస్త దు:ఖం పెరిగింది. దు:ఖాన్నయితే బలవంతంగా ఆపుకుంది కానీ, బాధ పదింతలయింది.

మెల్లిగా శేఖర్ చేతిలోనుంచి తన చేతిని పక్కకి తీసుకుని కళ్ళు మూసుకుని వెనక్కి జేరబడింది తన్మయి.

అది గమనించి తనూ కాస్త దూరం జరిగేడు శేఖర్.

తన ఒళ్లంతా చేమంతి పూల వాసన చుట్టుముట్టి వికారం పెడుతూంది తన్మయికి. పట్టుచీర మీద వేసిన ఒడి గట్టు చీరలో కొంగున పోసి కట్టిన అయిదు కేజీల బియ్యం బరువు ఒకటి ఒళ్లో. తల మీద భారం, తల లోపల భారం.

కళ్లు మూసుకున్న తన్మయి మనస్సులోకి ఒక్కసారిగా అజ్ఞాత మిత్రుడి జ్ఞాపకం మెదిలింది.

"మిత్రమా! నాకు శక్తినివ్వు. ముందుకు అడుగువేసే చేయూతనివ్వు." అనుకుంది.

కళ్లు విప్పి కారు బయట పరుగెడుతున్న చెట్ల వైపు చూసింది. అద్దాల తలుపుల్లోంచి రివ్వున వీస్తున్న వేడిగాలి ముక్కు పుటాల్లో మంట పుట్టిస్తూంది.

దాహం వేసి మంచి నీళ్ళు అడిగింది శేఖర్ని. డ్రైవరుతో చెప్పి త్రోవ పక్క కొబ్బరి బొండాల కొట్టు దగ్గిర ఆపేడు శేఖర్ బాబాయి.

తన్మయి శేఖర్ వైపు చూసింది.

"నువ్వు దిగకు." అంటూ శేఖర్ కారులోంచి దిగబోయేడు. కానీ ఇద్దరికీ కలిపి కట్టిన బ్రహ్మ ముడి వల్ల కారు పక్కనే నిలబడాల్సి వచ్చింది.

అతనికి వీలయ్యేంత వరకూ తన కొంగుని జరిపి కళ్లు దించుకుంది తన్మయి. కొబ్బరి బొండాన్ని నిశ్శబ్దంగా తాగింది.

"హమ్మయ్య, ఏడుపు ఆపేవు మొత్తానికి" అన్నాడు మళ్లీ కారు బయలుదేరగానే.

"ఇదిగో మనిద్దరికీ కట్టిన ఈ చెంగు ఇవేల్టికి మాత్రమే, రోజూ నన్నిలా కొంగున కట్టేసుకుంటాననుకోకు" అన్నాడు మళ్లీ. కారులో ముందు సీట్లోంచి పకాలున నవ్వు వినబడింది.

తన్మయికి నవ్వు రాలేదు. నిస్తేజంగా మళ్లీ వెనక్కి జేరబడి కళ్లు మూసుకుంది.

"ఏవిటే బాబూ, రాత్రంతా నిద్రపోనట్లు ఇంత మొద్దు నిద్దర పోతున్నావు, అదుగో మా ఊరు వచ్చింది. ఇకలే" అన్నాడు శేఖర్ భుజాన తడుతూ.

"మిత్రమా! వెళ్ళి వస్తానూ, నాకోసం బెంగ పడకూ, రాలే పూల పందిరి దాపున వెక్కి వెక్కి పడకూ.." మనసులో అజ్ఞాత మిత్రునితో సంభాషిస్తూన్న తన్మయికి

శేఖర్ తన తలని ఆప్యాయంగా హత్తుకుని, "మనిద్దరి కలల ప్రపంచంలోకి కలిసి అడుగులేద్దాం రా నేస్తమా!" అంటే బావుణ్నని అనిపించింది.

మనసున జరుగుతూన్న సంభాషణకి, బయట జరుగుతూన్న సంభాషణకి పొంతన కుదరక అయోమయంగా చూసింది.

"ఆ ఎర్రని కళ్లేవిటి? మందు కొట్టినట్లు" అని పకాలున నవ్వేడు శేఖర్.

శేఖర్ తనని తల్లిదండ్రుల కంటే గారాబంగా చూస్తాడని ఆశించిన తన్మయికి అతనితో గడుపుతున్న మొదటి పూటే ఆశాభంగం అయ్యింది.

సాయంత్రం అత్తవారింట్లో అడుగు పెట్టేటప్పుడు గుమ్మం దగ్గిర దిష్టి తీస్తూ ఎవరైనా పాటలు పాడతారేమోనని చూసింది తన్మయి. అటువంటి ఛాయలు ఏవీ కనిపించలేదు.

"తమ బంధువుల్లో ఎవరింటికి కొత్త పెళ్లికూతురొచ్చినా గుమ్మంలోపలికి పెట్టే మొదటి అడుగు ఎంత విశిష్టంగా, గొప్ప అందంగా ఉండేది! ఆహ్వానం పలుకుతూ పాడే పాటలు, పారాణి పాదాలు, కాలికి మట్టెలు...ఓహ్! తనెన్ని కలలు కంది ఈ క్షణం కోసం!"

చీర కుచ్చెళ్లు పైకెత్తి కాలి మట్టెల వైపు, పిల్లేళ్ళ వైపు చూసుకుంది తన్మయి. అందమైన పొడవైన వేళ్లకి సరిగ్గా అమిరేయి.

అద్దంలో చూసుకుంది. పొద్దుటి నించీ జిడ్డు పట్టిన ముఖాన మెత్తిన కుంకుమ ముక్కు మీద కారుతూంది. నెత్తిన జీలకర్ర బెల్లంతో జుట్టు అట్టలు కట్టి  ఉంది. దారిలో కారు సీటుకి జేరబడేసరికి నలిగిపోయిన  పూలజడ ఒక పక్కగా జారి వేళ్లాడుతూంది.

"త్వరగా మొహం కడుక్కోండి, పెద్ద నాన్న గారు, చిన్నాన్న గార్ల ఇళ్లకి ఒడి బియ్యం చల్లడానికి వెళ్లాలి" అంది దేవి హాలులో కూచోబెట్టిన కొత్త జంట తన్మయి, శేఖర్ లతో.

ఇంకా ఒకరికొకరికి కలిపి కట్టిన కొంగుముడి ఉండడంతో తన వైపు చెంగు పక్కన కుర్చీ మీదికి వేసి బాత్రూములోకి వెళ్లింది తన్మయి.

ఒక్క సారిగా ఏడుపు తన్నుకు వచ్చింది మళ్లీ. ఆ ఇల్లు, ఆ మనుషులు... అంతా కొత్త వాళ్ల మధ్య అస్సలు ఉండాలనిపించడం లేదు. తనతో బాటూ తోడు వచ్చిన పిన్ని, బాబాయిలతో ఇంటికి వెళ్ళిపోదామని చెప్పాలనుకుంది.

ముఖం కడుక్కుని రాగానే పిన్ని "బంగారు తల్లి, ఎంత బాగున్నావో ఈ అలంకరణలో. ఏదీ బొట్టూ పెడతా" అని బుగ్గలు పుణికింది.

తన్మయి కళ్లలో నీళ్ళు చూసి" ఇలా చూడమ్మా, ఇక మీదట ఇదే నీ ఇల్లు. మొదట్లో ఇలాగే బాధ వేస్తుంది, తర్వాత అంతా మామూలయిపోతుంది" అంది పిన్ని.

బంధువుల ఇళ్లలో వడి బియ్యం చల్లి ఇంటికి వచ్చేసరికి నిస్సత్తువ వచ్చేసింది తన్మయికి.

శేఖర్ మంచి ఉత్సాహంగా కబుర్లు చెప్తున్నాడు.

ఎందుకో శేఖర్ తండ్రి అప్రసన్నంగా కనిపించాడు తన్మయికి. ఆయనకు తనంటే బొత్తిగా ఇష్టం లేదు కాబోలు అనుకుంది.

అందరి ఎదుటా తనతో మాట్లాడొద్దని శేఖర్ ఆర్డరు వేశాడు. తన్మయికి అసలేమీ తోచడం లేదు. ముందు రోజంతా సరిగా నిద్రపోలేదేమో, ఎప్పుడు కాస్త తిని మంచాన పడదామా అని ఆత్రంగా చూసింది.

పిన్ని నవ్వుతూ వచ్చి "శోభనానికి ముహూర్తం పెట్టేరు. ఎల్లుండి మీ ఇంట్లో" అని చెవిలో గొణిగింది.

తన్మయికి సిగ్గు ముంచుకు వచ్చింది. అయినా తనకు అర్థం కానట్లు మొహం పెట్టి నిశ్శబ్దంగా చూసింది.

రాత్రి భోజనాలయ్యి కొంగు ముడి తీసెయ్యగానే తన దోవన తను పిన్ని పక్కకి చేరి మొద్దు నిద్దర పోయింది ఆదమరిచి.

మర్నాడు శేఖర్ ఇంట్లో రిసెప్షన్. రిసెప్షన్ చీర కాస్త నచ్చింది తన్మయికి. మరీ అంత ముదురు రంగూ, లేత రంగూ కాని చిలకాకు పచ్చని పట్టుచీరకి గులాబీ రంగు అంచు.

శేఖర్ ఏదో నప్పని రంగు పాంటు, చొక్కా వేసుకున్నాడు. "అయినా సహజంగా అందగాడు కాబట్టి ఏ రంగైనా నప్పుతుంది అనుకుంది" అనుకుంది తన్మయి.

వచ్చే పోయే వాళ్లతో ఆ రోజల్లా హడావిడిగా గడిచిపోయింది. శేఖర్ తో ముఖాముఖీ మాట్లాడే అవకాశమే కలగడం లేదు. రిసెప్షన్ లో పక్క పక్కన కూచున్నపుడు మాట్లాడుదామంటే "ఇప్పుడు కాదు, తర్వాత" అన్నాడు శేఖర్.

9

ఉదయానే నిద్ర లేపింది తన్మయిని పక్కనే పడుకున్న పిన్ని.

"లేమ్మా...త్వరగా లేచి స్నానమదీ పూర్తి చెయ్యి. అత్తవారిల్లు కదా" అంది.

ముందు రోజు పెళ్లి తాలూకు బడలిక ఇంకా తీరనట్టే ఉంది తన్మయికి. నిద్రలో అసలు తను శేఖర్ వాళ్లింట్లో ఉన్న సంగతే మర్చిపోయింది.

"కలలో అంతా వనజా, తనూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. తనకు పెళ్లయ్యినట్లు గానీ, శేఖర్ గానీ తన కలలోకి రాలేదు. ఇదేం విచిత్రమో" అనుకుంది.

అదే విషయం పిన్నితో అంది. పిన్ని నవ్వుతూ "మొన్నటి వరకూ నీకు పెళ్లి కాలేదు గాబట్టి అతని గురించి ఆలోచిస్తూ ఉండి ఉంటావు. ఇక ఇప్పుడు పెళ్లయ్యాక అతనిక నీ పక్కనే ఉన్నాడన్న ధీమా వచ్చింది కదా." అంది చాలా తేలిగ్గా.

తను పడుకున్న గదిని ఆనుకుని మరో గది, ఆ పక్కన రేకుల కప్పుతో ఉన్న బాత్రూము. పెళ్లి వారిల్లు కాబట్టో ఏమో బాత్రూమంతా చిత్తడిగా ఉంది. బట్టలు మార్చుకోవడం కష్టమే అక్కడ. ఎలాగోలా మొత్తానికి కానిచ్చి త్వరగా తయారైంది తన్మయి.

మెడలో తడిసి ఒంటికి అంటుకుంటున్న పసుపు తాడు, కాళ్లకి ఆరని పారాణి. కొత్తగా అలవాటైన చీర.

అద్దంలో తన రూపం తనకే అపురూపంగా కనిపించింది. ఇలాంటి రూపం కోసం ఎన్ని నాళ్ళుగా కలలు కంది!!

తనంటే ఇష్టమని మరీ పెళ్ళి చేసుకున్న శేఖర్. అతన్ని తన జీవితాంతం ఎంతో ప్రేమగా చూసుకోవాలి తను.

"అజ్ఞాత మిత్రమా! నీకిక సెలవు. నా ప్రేమానురాగాలతో శేఖర్నే నిన్నుగా మార్చుకుంటాను." అప్రయత్నంగా నవ్వు వెలిసింది తన్మయి పెదవుల మీద.

మెల్లగా గదిలోంచి బయటకు వచ్చింది. అత్త వారింట్లో అంతా కొత్తగా ఉంది.

శేఖర్ ఎక్కడ ఉన్నాడో చూసే సాహసం చెయ్యాలనిపించలేదు.

బిడియంగా వంట గదిలో అడుగు పెట్టింది. అప్పటికే లేచి అందరికీ కాఫీలు పురమాయిస్తున్న దేవి తనను చూస్తూనే పలకరింపుగా నవ్వి " ఏమ్మా, సరిగా నిద్ర పట్టిందా? స్నానం కూడా చేసినట్లున్నావు." అంది.

"అవును అత్తయ్యా, నేనేదైనా సాయం చెయ్యనా?" అంది తన్మయి గొంతు పెగుల్చుకుని.

"ఇవేళ అప్పుడే ఏం చేస్తావులే. నాలుగు రోజులు కానీ. సాయంత్రం మీ రిసెప్షన్ కదా. వంట వాళ్లతో పని చేయించడమే ఇవేళ పని. శేఖర్ లేచేడేమో చూడమ్మా. కాఫీ ఇస్తాను. పట్టుకెళ్దువుగానీ.." అంది.

తన్మయి ముఖంలోకి ఒక్క సారిగా గొప్ప సంతోషం ముంచుకు వచ్చింది.

తన పక్క గదిలో శేఖర్ ఉన్నాడన్న స్పృహ కూడా లేకుండా మొద్దు నిద్దర పోయినందుకు తనలో తను తిట్టుకుంటూ మెల్లగా తలుపు తోసింది.

తల దగ్గర టేబుల్ ఫాను చప్పుడు చేస్తూ తిరుగుతూన్నా మెలకువ లేనంత గాఢంగా మొద్దు నిద్దర పోతున్నాడు శేఖర్. పక్కనే పది పన్నెండేళ్ల పిల్లవాడెవరో నిద్రపోతున్నాడు. పెళ్లికి వచ్చిన చుట్టాల పిల్లాడనుకుంటా. నిద్రపోతున్న శేఖర్ అందమైన ముఖాన్ని తనివితీరా చూస్తూ నిలుచున్న తన్మయికి వెనక నించి ఎవరో లేచి బాత్రూముకి వెళ్తున్న చప్పుడు వినిపించి, చప్పున వెనక్కి వచ్చేసింది.

ఇంట్లోని నాలుగు గదులు దాటుకుని పెరట్లోకి వచ్చింది. పెద్దగా పోషణ లేని పెరడు. ఏవేవో చెత్త సామాన్లతో నిండి ఉంది. ఒక పక్కగా కనకాంబరాల్లాంటి కాసిన్ని పూల మొక్కలున్నా ఒక్క పూవు లేదు ఏ చెట్టుకీ.

పిన్ని వెనకే ఎప్పుడు వచ్చిందో ఏమో. "మీ అత్తయ్యకి పూలంటే ఇష్టమంట. ఎక్కడ లేని పూలన్నీ తురిమి మాలలు కట్టి ఇంటినలంకరిస్తుంది. చూసేవుగా చెట్లకి ఒక్క పువ్వు లేదు." అని నవ్వింది.

దేవి తలలో ఎప్పుడూ గజం పూలు తురుముకుని ఉండడం గమనించింది తన్మయి.

ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ వరండాలలో, బయట వాకిట్లో మడత మంచాలు వేసుకుని పెళ్లి చుట్టాలు నిద్రపోతున్నారు.

అటు పల్లెటూరు, ఇటు పట్టణమూ కాని ఊరది. పెరటి గుమ్మం బయట మురుగు కాలువ రోడ్డు మీదికి వచ్చి పారుతూ పెరట్లోకి వస్తే చాలు దుర్గంధం ముక్కులు పగలగొడుతూ ఉంది.

ఇంట్లో తనకి నచ్చనివెన్నో కనబడుతూ ఉన్నాయి. ముఖ్యంగా వాళ్లింటికి తనకెంతో ఇష్టమైన డాబా లేదు. తన్మయికి తమ ఇల్లు జ్ఞాపకం వచ్చింది. ఇంటి మీద బెంగ పట్టుకుంది.

"అలా బెంగగా కూచోకమ్మా, సాయంత్రం రిసెప్షన్ కి అమ్మా, నాన్నా, మన బంధువులూ వస్తారు" అంది పిన్ని గదిలోకి వచ్చి.

తన్మయి మనసు ఆనందతాండవం చేసింది.

ఎప్పుడు లేచేడో ఏమో శేఖర్ గది గుమ్మం దగ్గిరికి వచ్చి "కొత్త పెళ్ళికూతురు లేచిందే" అన్నాడు కనుబొమ్మలెగరేస్తూ.

పిన్ని ఏదో పనున్నట్టు బయటికెళ్లి తమకు కనబడేట్టు వరండాలో కూచుంది.

శేఖర్ గదిలోకి ఒక్క అడుగు మాత్రం వేసి "మంచి చీర కట్టుకుని త్వరగా తయారవ్వు. మా పెద్దమ్మ వాళ్లు నిన్ను గుడికి తీసుకెళ్లాలంటున్నారు." అన్నాడు.

తను కట్టుకున్న చీర వైపు చూసుకుంది." ఇది మంచి చీరే కదా" అనుకుంది.

ఇంతలో దేవి వచ్చి "పాపం మీ ఆవిడకి కొత్త చీరలు కొననట్లుంది. ఈ పాత పట్టు చీర ఇచ్చి పంపింది వాళ్లమ్మ." అంది.

పిన్ని ఇదంతా రాద్ధాంతం కావడం ఇష్టం లేనట్లు "అదేం లేదు వదినా, మా అక్క హడావిడిలో తన కొత్త చీర నా పెట్టెలో పెట్టింది. అని పెళ్లిలో తనకి వాళ్లక్క పెట్టిన చీర చూపించింది."

తన్మయికి అక్కడ జరుగుతున్నది అర్థమయీ కాకుండా ఉంది.

అమ్మనడిగి తనకి ఇష్టమైన పట్టుచీరలు రెండు తన్మయి కావాలని తెచ్చుకుంది. పాతవే అయినా తనకి ఇష్టమైన అమ్మ చీరలవి.

లోపలికి రాగానే "మీ అత్తగారు ఇలా మాట్లాడుతుందని  మీ అమ్మకి తెలియదు. లేకపోతే నువ్వు అడిగినా పాత చీరలు ఇచ్చేది కాదు." అని నిష్ఠూర పోయింది పిన్ని.

తన్మయికి ఏడుపు తన్నుకు వచ్చింది.

"ఊరుకోమ్మా, కొత్త పెళ్ళికూతురివి, నీ కళ్లలో నీళ్లు ఎవరైనా చూసేరంటే బాగోదు, అయినా ఇవన్నీ సహజంలే." అంది తేలికగా పిన్ని.

బయలుదేరేటప్పుడు "టిఫిన్లు తినేసి  గుడికేవిటీ, వ్రతాలేవిటీ..." అని సణిగింది పిన్ని.

తన్మయి అవన్నీ పట్టించుకునేలోగానే "ఆటో రెడీ" అన్నాడు శేఖర్.

గుడి పేరుతో ఆటోలో కిక్కిరిసి కూచున్న పిల్లలూ, పెద్దల మధ్య ఆరు కిలోమీటర్లు తీసుకు వెళ్ళేరు.

కళ్ల ఎదురుగా చిన్న సైజు గుట్ట మీద కనిపిస్తున్న దాదాపు 200 మెట్లని, అక్కడెక్కడో కనిపిస్తున్న ఆలయాన్ని అబ్బురంగా చూసింది తన్మయి.

"మీ ఊళ్లో ఇంత అందమైన ఆలయం ఉందని ఎప్పుడూ చెప్పలేదేం?" అంది తన ముందే మెట్లు ఎక్కుతున్న శేఖర్ తో.

"ఊ.. ఈ మెట్లన్నీ ఎక్కి దిగేసరికి ఆ అందమేంటో తెలిసి పోతుందిలే" అన్నాడు.

వెనకే పకపకా నవ్వులు. తన్మయి మారు మాట్లాడకుండా చకచకా ఎక్కింది మెట్లన్నీ.

"పెద్దమ్మా, ఇంకా అక్కడే ఉన్నావా..?" అన్నాడు శేఖర్ పది మెట్ల కిందికి చూస్తూ.

"మీ ఆవిడ సన్నగా పుల్లముక్కలా ఉంది కాబట్టి నీతో బాటూ చకచకా ఎక్కేసిందిరా. నా వల్ల కాదు నాయినా మిమ్మల్ని అందుకోవడం.. నేను పెదనాన్నా వస్తాము గానీ ముందు వెళ్లి గుళ్లో వ్రతానికి  టిక్కెట్లు తీసుకోండి." అంది రొప్పుతూ.

"మీ పిన్ని కంటే మా పెద్దమ్మే నయం. ఆవిడింకా వెనక ఎక్కుతూంది." అని తన్మయి చేతిని తన చేతిలోకి తీసుకుని మెట్ల మీద ముందుకి నడిచేడు.

తన్మయికి నిజమైన సప్తపది ఇదే అనిపించి ఒళ్ళు పులకించింది.

శేఖర్ చేతిని గట్టిగా పట్టుకుని మనసులో "శక్కూ, నన్నెప్పుడూ ఇలాగే నడిపించవూ" అనుకుంది.

మెట్ల పక్కన విరగబూసిన దేవ గన్నేరు  వృక్షాల్ని, మెట్ల పైన  రాలి పడి సువాసనల్ని వెదజల్లుతున్న దేవ గన్నేరు పూలని అమితానందంతో చూస్తూ శేఖర్ తో నడుస్తున్నదల్లా  ఆగి ఒక్క పూవుని వంగి అందుకుని తలలో తురుముకుంది.

కలల్లో ఎన్నో సార్లు తనకి కనిపించిన దేవగన్నేరు చెట్ల గుబుర్లివేనన్న స్పృహ వచ్చి ఆశ్చర్యపోయింది.

"నేస్తం! నా కోసం నీ దోసిలి నిండా బంగారు దేవగన్నేరు  పుష్పాల్ని బహూకరించవూ" తనలో తను కలవరిస్తూ మెట్లు సునాయాసంగా ఎక్కింది తన్మయి.

ఇంటికి తిరిగి రాగానే హాలులో జ్యోతిని చూస్తూనే గాఢంగా కౌగిలించుకుంది తన్మయి.

చెల్లెలికి పెట్టిన చీర కూతురు కట్టుకుని ఉండడం గమనించి "ఇదేవిటీ, తెచ్చుకున్న పట్టుచీర" అనబోతున్న జ్యోతిని చెయ్యి పట్టుకుని గదిలోకి లాక్కు వచ్చింది తన్మయి.

గుడికి వెళ్ళిన అలసట కంటే అక్కడ తనకి కలిగిన అనుభూతి వల్ల తన్మయి మంచి హుషారుగా "అవన్నీ సరేలే అమ్మా, మేం గుడికెళ్లొచ్చాం. ఎంత బావుందో తెలుసా?" అంది.'

కూతురి ముఖంలో ఆనందం చూసి స్థిమిత పడింది జ్యోతి.

"రాత్రికి మనం మన ఊరు వెళ్ళిపోతామా?" అమాయకంగా అడుగుతున్న తన్మయి వైపు నవ్వుతూ చూస్తూ "మేం ఇవేళ రిసెప్షను కాగానే వెళ్లిపోతాం. నువ్వూ, అబ్బాయీ, మీరంతా రేపు ఉదయం వస్తారు." అంది జ్యోతి.

సాయంత్రం శేఖర్, తన్మయి పెళ్లి రిసెప్షన్ లో పక్కపక్కన కూచున్నారన్నమాటే గానీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి లేదు.

"ఇదంతా విసుగ్గా ఉంది." అనుకుంది తన్మయి.

అప్పుడప్పుడే శేఖర్ కుటుంబీకులు పరిచయమవుతున్నారు. ఇక ఈ రిసెప్షన్ లో బొత్తిగా తనకు తెలియని మనుషులే అంతా. శేఖర్ నవ్వుతూ నమస్కరిస్తూ పక్కన ఉన్న తనతో ప్రమేయం లేనట్లు అంతా సవ్యంగా చేసుకెళ్లిపోతున్నాడు. కనీసం వాళ్లెవరో తనతో చెప్పే ప్రయత్నం కూడా చేయడం లేదు. తన పని నిలబడి నవ్వుతూ నమస్కరించడం. అంతే.

ఆ పక్కగా నిలబడ్డ శేఖర్ తండ్రి అందరితోనూ కలుపుగోలుగా మాట్లాడుతూనూ, శేఖర్ తల్లి నవ్వుతూ నిలబడి కనిపించింది.

“తనంటే ఎవరూ తెలియదు కాబట్టి అలా నిలుచుంది. ఆవిడకు అంతా తెలిసిన వాళ్లేగా “అనుకుని

"అదేవిటీ మీ అమ్మగారు ఎవరితోనూ మాట్లాడకుండా అలా నవ్వుతూ నిలుచున్నారు నాలాగే" అంది మధ్యలో తన్మయి.

బయటికి నవ్వుతూ "ఆడవాళ్లు ఎలా నడుచుకోవాలో మా అమ్మని చూసి నేర్చుకో" అన్నాడు శేఖర్.

తన్మయి చప్పున తలెత్తి శేఖర్ వైపు చూసింది. ఇంకా అతను ఎటో చూస్తూ చిర్నవ్వు నవ్వుతూనే ఉన్నాడు.

"చక్కగా నవ్వుతూ నిలబడు. రేప్రొద్దున్న వీడియోలో బాగా ఉండాలి. గుర్తుంచుకో. అసలే ఈ వీడియోని మా చుట్టాలందరూ చూస్తారు" అన్నాడు.

రాత్రి పదకొండింటి వరకూ ఇంటి ముందు కట్టిన షామియానాలో రిసెప్షను జరిగింది. కాస్సేపు నిలబడి, కాస్సేపు కూచునీ ఆశీస్సులు అందుకుంటున్నారు శేఖర్, తన్మయి. అప్పటికీ ఒకటి అరా వస్తూనే ఉన్నారు ఊళ్లో జనం . "చూసేవా, మా బలగం.." అని గొప్పగా తన్మయి వైపు చూసి నవ్వేడు శేఖర్".

పక్కనే కూచుని పద్దులు రాస్తున్న శేఖర్ చిన్నాన్న "కాస్త వీళ్లకేవైనా పెట్టండర్రా" అనే వరకూవాళ్లకి భోజనాలు తినడానికి కుదరలేదు.

సాయంత్రమంతా రిసెప్షన్ పేరుతో అలిసిపోయినా ఉదయపు గుడి ప్రయాణపు ఆహ్లాదం, మర్నాడు ఇంటికి వెళతామన్న సంతోషం తన్మయి కళ్లల్లో కదలాడాయి.

★★★

మూడో రోజు ఉదయానికి ఇంటికి చేరుకున్నారు. వాకిట్లో నిలబెట్టి ఎర్ర నీళ్ళ తో దిష్టి తీసేరు అమ్మలక్కలు.

నరసమ్మ మనవరాలిని కౌగిలించుకుంది.

పాదాలకి నమస్కరించిన నూతన దంపతుల్ని ఆశీర్వదిస్తూ "చల్లగా నూరేళ్ళు ఉండండి" అంది ఆనందంగా.

మధ్యాహ్నం వనజ, సుధాకర్ వచ్చారు.

వనజని వాకిట్లో చూస్తూనే పరుగెత్తుకు వచ్చింది తన్మయి.

తనలాగే మెడలో పసుపు తాడు, కుంకుమ బొట్టు, చేతులకు నిండుగా గాజులు, పొందికైన చీరతో నడిచి వస్తున్న వనజ కొత్తగా కనిపించింది.

పక్కన సుధాకర్ వనజకి తగినంత ఎత్తుగా ఉన్నాడు. వనజ కంటే ఛాయ తక్కువగా ఉన్నా కళైన ముఖం. మొత్తానికి ఇద్దరి జంట చూడముచ్చటగా ఉంది.

అదే చెప్పింది వనజతో తన్మయి. "మీరిద్దరూఎంత బావున్నారో తెలుసా?"

“నీకు సరిగ్గా అదే చెబుదామనుకుంటున్నాను. నీ కలలు పండి శేఖర్ తో నువ్వు ఎప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను." అంది వనజ.

కొత్తగా తమ జీవితాల్లోకి వచ్చిన శేఖర్, సుధాకర్ లని ఒకరికొకరు పరిచయం చేసారు తన్మయి, వనజ.

స్నేహితురాలితో కలిసి ఎక్కువ సేపు కబుర్లు చెప్పుకునే ఏకాంతం లేకపోయినా, మాట్లాడిన కాస్సేపు తన్మయికి గొప్ప బలం వచ్చినట్లయ్యింది.

"రేపే వెళుతున్నాము రాయచూర్ కి. ఆయనకు సెలవు లేదు." అంది లేస్తూ వనజ.

తన్మయి సంతోషంగా స్నేహితురాలిని కౌగిలించుకుని "ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్" అంది.

"నీకు కూడా. ఉత్తరాలు రాయి. ఎప్పుడూ నీ ముఖంలో ఈ ఆనందం ఇలాగే ఉండనివ్వు. ఎంత కళగా ఉందో తెలుసా నీ ముఖం." అంది వనజ.

"సమయానికి వచ్చాడు ఫోటో గ్రాఫర్, ఒక్క నిమిషం ఉండు వనజా, నలుగురం ఫోటో తీసుకుందాం" అంది తన్మయి.

శేఖర్, సుధాకర్ బానే మాట్లాడుకోవడం గమనించి సంతోషించింది తన్మయి వాకిట్లోకి వెళుతూ.

★★★

ఆ రోజు సాయంత్రం తలారా స్నానం చేయించేరు ఇద్దరినీ.

శేఖర తల్లి పట్టుకొచ్చిన శోభనపు చీర చూసి ఆశ్చర్యపోయింది తన్మయి.

కోరా రంగు మీద పచ్చ చుక్కలు, పచ్చ అంచు ఉన్న పోలియెస్టర్ మిక్స్– మామూలు ఇంట్లో కట్టుకునేచీర అది.

తనెంత బాగా ఊహించుకుంది ఈ చీరని!!

బంగారు అంచు తెల్లని పట్టు చీర ఉండాల్సిన చోట ఈ చీర ఏవిటి?

అందునా తన దగ్గర మేచింగు పచ్చ రంగు జాకెట్టు కూడా లేదు.

అంత వరకూ కట్టుకున్న గులాబీ రంగు చీర మీద వేసుకున్న గులాబీ రంగు జాకెట్టు, తలలో రెండు మూరల మల్లె పూలు, నుదుటున అంతా కలిసి ఆశీర్వాదాల పేరుతో అద్దిన పెద్ద కుంకుమ బొట్టు.

తన్మయికి అద్దంలో తనను తను చూసుకుంటే అస్సలు నచ్చలేదు.

శేఖర్ తో తను గడపబోతున్న మధురమైన మొదటి రాత్రి తను ఇలా అడుగు పెట్టబోతూంది.

అలాగని నోరు తెరిచి ఏం మాట్లాడడానికి లేదు. "పెళ్లి కూతురు" గా అన్నిటికీ తల వంచుకుని ఉండాలి, తక్కువగా మాట్లాడాలి, అన్నిటికీ నవ్వుతూ ఉండాలి.. ఇలాంటివన్నీ తప్పని సరిగా నేర్చుకుంది ఈ మూడు రోజుల్లో.

అటు శేఖర్ చక్కగా పూర్తి తెల్ల బట్టల్లో మరింత అందంగా కనిపిస్తూ ఉన్నాడు.

తొమ్మిది గంటల ప్రాంతంలో ఇద్దరినీ గది లోపల మంచమ్మీద కూచోబెట్టి చుట్టూ పెద్ద వాళ్లు నిలబడి బొమ్మలతో ఆడించినట్లు బంతులాట మొదలు పెట్టేరు.

దంపతులకు తాంబూలాల పేరుతో  కొబ్బరి బొండాలని మంచం కిందికి దొర్లించడం వగైరా అన్నీ చాలా ఎబ్బెట్టుగా అనిపించసాగాయి తన్మయికి.

మొత్తానికి పదిన్నర సమయంలో  తమని ఏకాంతంగా వదిలి అంతా బయటికి వెళ్లేరు.

తన్మయి తడబడే కాళ్లతో తలుపు గడియ వేసి వచ్చింది.

శేఖర్ తన చేతిని అందుకోగానే ఎక్కడ లేని నిస్సత్తువ ముంచుకు వచ్చి అతని చేతుల్లోకి అలాగే ఒదిగి పోయింది.

అప్పటి వరకూ తనను ముట్టుకోవడానికి ఎంతో సంశయిస్తున్నట్లు ఎప్పుడూ ప్రవర్తించే శేఖర్ చాలా మొరటుగా తనని తోసి మీదికి వచ్చేడు.

హఠాత్తుగా శేఖర్ ని అలా చూసి నిర్ఘాంతపోతూ ఏదో చెప్పబోతున్న తన్మయి ముఖాన్ని తన ముఖంతో మూసివేసాడు.

తనకు ఏం జరుగుతుందో తెలిసే లోపల తన దారిన తను ఏవేవో చేసుకెళ్ళిపోతున్నాడు.

సుకుమారంగా అతని చేతుల్లో ఒదిగి పోయి, ఏవేవో తియ్యని కబుర్లు చెప్పుకుని, ప్రేమగా.... అంటూ.....ఏవేవో అనుకుని ఇన్నాళ్లూ కలలు కన్న మొదటి రాత్రి బాధ సుళ్ళు తిరగడం మొదలు పెట్టింది తన్మయికి.

మనసు అతని చేష్టలని వద్దని మొరాయిస్తూంది. అసలతన్ని నగ్నంగా చూడడానికి మనసు ఇష్టపడడం లేదెందుకో. కళ్ళు గట్టిగా మూసుకుని నిశ్శబ్దంగా భరించడం మొదలు పెట్టింది.

అప్పటిదాకా శరీరపు కలయికల గురించి ఏవేవో ఊహించుకున్నవన్నీ పటాపంచలు చేస్తూ శేఖర్ భయానక రూపం దాల్చాడు ఆ రాత్రి.

తొలిసారి కలయిక తో దారుణమైన బాధ మొదలయ్యింది.

పది నిమిషాలు గదిలో ఏదో తినడానికి అటూ ఇటూ తిరగడం, మళ్లీ మీద పడడం. తెల్లవారే లోగా శేఖర్ ఏడు సార్లు తన్మయికి నరకం చూపించాడు. తనెంత ప్రాధేయ పడ్తున్నా అర్థం చేసుకోకుండా బలవంతం చేస్తూనే ఉన్నాడు.

తన్మయికి మనసూ, శరీరం దారుణంగా గాయపడ్డాయి.

మొదటి రాత్రి  ఇంత భయానకంగా ఉంటుందని ఎవరూ చెప్పలేదేవిటి?

అతని ముఖం చూడడానికి కూడా భయం పట్టుకుంది.

తెల్లవారు ఝామున అతను నిద్ర పోయేడన్నాక శరీరం చచ్చిన భావనతో ముందు తలారా స్నానం చేసింది.

పెరట్లోకి వచ్చి ఆకాశంలోకి చూస్తూ పిచ్చి దానిలా దిక్కులు చూసింది.

ఇంతలో జ్యోతి లేచి వచ్చి "తన్మయీ! ఇక్కడేం చేస్తున్నావు?"  అనడిగింది.

తల్లిని చూడగానే  దు:ఖం ఆపుకోలేక పోయింది.

"ఉష్... చుట్టాలంతా చూస్తారు" అని గదిలోకి లాక్కు వెళ్లింది జ్యోతి.

"నేనిక ఆ గదిలోకి వెళ్లనమ్మా" దీనంగా అంది తన్మయి.

బాగా డీలా పడి వేళ్ళాడిపోతూన్న తన్మయితో "ముందు కాస్త పాలు తాగి, ఏదైనా తిని శుభ్రంగా నిద్రపో. కొత్తలో ఇలాగే ఉంటుంది." అని వెళ్లిపోయింది జ్యోతి.

తన ముఖం చూసి పిన్నిలు, అత్తయ్యలు ఆట పట్టించడం మొదలు పెట్టేరు.

ఇదంతా అతని భార్యగా తన బాధ్యత అని నమ్మలేక పోతూంది.

శేఖర్ పగటి వేళ చాలా మామూలుగా అందరితో హుషారుగా మాట్లాడుతూన్నాడు.

కొత్తల్లుడి హోదాలో అత్తవారింట అతనికి ఎక్కడలేని మర్యాద జరుగుతూంది.

చుట్టూ చుట్టాలంతా ఉన్నా తన వరకూ తను మధ్యాహ్నం భోజనాల సమయం వరకూ పడి నిద్రపోయింది తన్మయి.

శేఖర్ పక్కన కూచుని భోజనం చేస్తూ అతని వైపు చూసింది. అసలేమీ జరగనట్లు చిర్నవ్వు నవ్వేడు.

అందరి ఎదురుగా ఇంత మర్యాద గా ఉన్న ఇతను రాత్రి తనతో అలా ఎందుకు ప్రవర్తించాడు?

తన్మయికి ఏదీ అర్థం కావడం లేదు.

అతనితో ఈ రాత్రి గడపకుండా ఉండేదెలా అని కాసేపు ఆలోచించింది.

---

కాస్సేపటి తర్వాత "లాభంలేదు ఈ రాత్రి అతనితో గట్టిగా మాట్లాడాల్సిందే" అని నిర్ణయించుకుంది

---

10

తన్మయికి మొదటి రాత్రి కాళరాత్రిగా ముద్రపడింది. శేఖర్ భయానక ప్రవర్తన వల్ల అతనంటే భయం పట్టుకుంది.

ఇంటి నిండా చుట్టాల వల్ల తల్లితో ఎక్కువ సేపు మాట్లాడడానికి కుదరలేదు. మాట్లాడిన కాస్సేపూ కూతురికి నచ్చచెపుతూనే ఉంది జ్యోతి.

తన్మయికి అర్థమైంది ఇక ఎవరితో చెప్పీ, ఏవీ లాభం లేదు. అతని నుంచి తప్పించుకోవడానికి తనకున్నవి రెండే మార్గాలు. ఒకటి ఆ గదిలోకి ఎలాగైనా వెళ్లకుండా ఉండడం లేదా అతనితో మాట్లాడడం.

సాయంత్రం కాగానే ముస్తాబు సమయం మొదలయ్యింది. జడగంటలు, మల్లెపూలు.

అంతా ఏం చెప్తున్నా వినకుండా పంజాబీ డ్రెస్సు వేసుకుంది తన్మయి. పిన్నిలు, అత్తయ్యలు గుసగుసగా నవ్వేరు.

రాత్రి భోజనాల దగ్గిర తన్మయి అటూ ఇటూ కలిపి లేచి వెళ్లిపోయింది. శేఖర్ తో తను ఒక్క మాట కూడా మాట్లాడలేదని అంతా గమనిస్తున్నారేమోనని అనిపించింది. అయినా వెరవకుండా జ్యోతి ఇచ్చిన పాలు తాగి పుస్తకం పుచ్చుకుని శుభ్రంగా పక్క వేసిన గదిలోకి వెళ్లి కూచుంది. అంతా గుమ్మం వరకూ వచ్చి నవ్వులు మొదలెట్టేరు. పిన్ని మాత్రం తన బాధ గమనించినట్లు వచ్చి పక్కన కూచుని వెన్ను నిమిరింది.

"ఏంటమ్మా, అస్సలు అన్నం తినలేదు. రాత్రికి ఆకలేస్తేనో!?" అంది.

ఆ మాత్రపు ఆప్యాయతకే తన్మయికి కళ్లల్లోంచి బొటబొటా నీళ్లు వచ్చేయి.

ఇలారా, అంటూ పక్కకు తీసుకెళ్లింది పిన్ని."అయ్యో, ఇదేంటమ్మా, ఏవైంది?" అంది.

"ఏం కాలేదు పిన్నీ" అని కళ్లు తుడుచుకుంటూ అంది తన్మయి.

"నాకు అర్థమయ్యిందిలే...మీ అమ్మనొదిలి వెళ్లడానికేనా ఈ బాధంతా? అయినా ఎంత దూరం మీఅత్తగారి ఊరు? దగ్గరేగా, ఎప్పుడంటే అప్పుడు రావొచ్చు. కొత్త పెళ్ళికూతురివి, ఇలా ఏడవకూడదమ్మా" అంది పిన్ని.

"ఊ ..." అంటూ తలూపింది తన్మయి.

"అన్నట్లు పొద్దున్న నువ్వు నిద్ర పోతున్నపుడు మీ ఫ్రెండు వనజ చెల్లెలు వచ్చి ఇది నీకు ఇమ్మంది అని మడత పెట్టిన కాగితం చేతిలో పెట్టింది"

ఒక్కసారిగా తన్మయికి మనస్సులో ఉన్న బాధ మొత్తం తొలగిపోయినట్లయ్యింది.

ప్రియమైన తనూ!

ఎలా ఉన్నావు? నీతో ఎన్నో సంగతులు చెప్పాల్సినవి ఉన్నాయి. కానీ అతి తక్కువ సమయం ఉంది. ఇవేళ మేం బయలుదేరుతున్నాం. నువ్వు నాతో వచ్చేస్తే ఎంత బావుణ్ణు అని ఎన్ని సార్లు అనిపిస్తూందో తెలుసా? ఊ.. ఏం చేస్తాం? అవన్నీ జరిగేవి కావుగా. అన్నట్లు సుధా ఎంత మంచివాడో తెలుసా! అతనితో గడిపిన మొదటి రాత్రి అతనెంత ఉదాత్తుడో అర్థమైంది. అపరిచిత వ్యక్తితో ఎలా గడుస్తుందోనని నేను ఎంత భయపడ్డానో తెలుసా! నా భయాలన్నీ పటాపంచలు చేస్తూ అతను నాకు మంచి స్నేహితుడయ్యాడు. శేఖర్ తో నీ కలల జీవితం ఇంత కంటే గొప్పగా ప్రారంభమయ్యి ఉంటుంది. ఆ విశేషాలన్నీ వినాలని ఉంది. మనిద్దరం కొత్త ప్రపంచాలలోకి వెళ్లబోతూ ఉన్నాం. కొత్త జీవితాల్ని ప్రారంభించబోతూ ఉన్నాం. నాకు ఎంత ఉత్సాహంగా ఉందో చెప్పలేను. నీకూ అలాగే ఉంటుందని నాకు తెలుసు. సంతోషం వెలిగే నీ ముఖంలో మెరిసే కళ్లతో నువ్వు నాతో నీ కొత్త జీవితపు కబుర్లు చెబ్తూంటే వినాలని ఎంత కుతూహలంగా ఉందో చెప్పలేను. ఎప్పుడూ ధైర్యంగా ఉండు, నాతో ఎప్పుడు మాట్లాడాలనిపించినా ఉత్తరం రాయి. నీ నించి ఉత్తరం అందుకోగానే మళ్లీ రాస్తానూ-

ప్రేమతో

నీ

వన

ఉత్తరం మూసేక గొప్ప ధైర్యం, ఉత్సాహం వచ్చేయి తన్మయికి.

గదిలోకి ధైర్యంగా అడుగుపెట్టింది.

శేఖర్ వస్తూనే "ఇవేళ నాకు వొంట్లో బాలేదు". అని ఖరాఖండీగా చెప్పేసింది.

"సరే, శుభ్రంగా పడుకో, ఇప్పుడెవరు నా దగ్గిరికి రమ్మన్నారు?" అని నవ్వేడు శేఖర్.

"మరి... నిన్నెందుకు అలా వద్దన్నా వినిపించుకోలేదు?" అంది సీరియస్ గా.

"ఊ...అదన్న మాట సంగతి, ఇవేళంతా నాతో మాట్లాడకపోవడానికి కారణం" అన్నాడు ఇంకా నవ్వుతూ.

"నీకు తమాషాగా ఉంది. నువ్వంటే భయం పట్టుకుంది తెలుసా నాకు. అసలు....అసలు...." అంటూన్న తన్మయిని మధ్యలో ఆపి

"మొదటి రాత్రి గురించి మా స్నేహితులంతా గొప్పలు చెప్పుకుంటూ ఉంటారు. వాళ్లందరినీ నేనిప్పుడు అధిగమించాను." అని ఆవులిస్తూ "నీకేం, ఇంచక్కగా రోజల్లా నిద్రపోయావ్, నాకు బాగా నిద్రొస్తూంది." అని వెనక్కు తిరిగి పడుకున్నాడు శేఖర్.

తన్మయికి సిగ్గుతో చచ్చిపోయినట్లయ్యింది.

ఇతను స్నేహితుల ముందు గొప్ప చెప్పుకోవడం కోసం తనను అలా హింస పెట్టేడా?

"నా గురించి అసలు ఆలోచించేవా?" అని వెనుతిరిగి విసురుగా అడిగింది తన్మయి.

అప్పటికే శేఖర్ నిద్రలోకి జారుకున్నాడు.

అతని ఎదురుగా ముందు రోజు రాని దు:ఖం అప్పుడు వచ్చింది తన్మయికి.

కళ్ల నీళ్లు తుడుచుకునే ప్రయత్నం చేస్తున్నా ఆగని దు:ఖంతో సతమతమయ్యింది.

తెల్లవారి ఎర్రబారిన తన్మయి కళ్ళు చూసి ఇంట్లో అంతా వెనకే గుసగుసగా నవ్వుకోవడం చూసి విసుగు వచ్చింది తన్మయికి.

మూడు రాత్రుళ్లు కాగానే అత్తవారింటికి ప్రయాణం సన్నాహాలు మొదలయ్యాయి.

సారె కోసమని చలివిడి, స్వీట్లు, అరటి పళ్లు సర్దారు. తన్మయి తన సూట్ కేసులో వనజ తనకు పుట్టినరోజు బహుమతిగా ఇచ్చిన "అమృతం కురిసిన రాత్రి" మొదటగా పెట్టుకుంది. బట్టలతో బాటూ తన డైరీ, ఇష్టమైన పెన్నులు, చిన్న బుద్ధుడి బొమ్మ, నెమలి కన్ను సర్దుకుంది.

పుస్తకాల అరవైపు దిగులుగా చూసుకుంది. పెరట్లో మొక్కలన్నిటికీ దగ్గిరికి వెళ్లి వీడ్కోలు చెప్పింది. డాబా మీదికి వెళ్లి జాజి పొద దాపున కాసేపు కూచుంది. ఎందుకో బాల్యాన్ని ఆ ఇంట్లో వదిలి ఎక్కడికో వెళ్ళిపోతున్న దు:ఖం చుట్టుముట్టింది. నిస్త్రాణగా మోకాళ్ల మధ్య తల దాచుకుని వెక్కి వెక్కి పడింది. నిస్తేజంగా ఆకాశం మీంచి  భూమి వరకు పరికించింది.

"కింద చుట్టాల్ని పెట్టుకుని అత్తవారింటికెళ్ళే ముందు ఇలా తీరిగ్గా డాబా మీదికొచ్చేవిటి?" తల్లి గదమాయింపు విని కిందికొచ్చింది.

అత్తవారింటికి ఆ సాయంత్రం చేరుకోగానే "అలా కూచుంటావేంటి మా అమ్మ అక్కడ వంటింట్లో కష్ట పడ్తూ ఉంటే? వెళ్లు, సాయం చెయ్యి" అన్నాడు శేఖర్.

"రేపట్నుంచి చేస్తుందిలే, ఇవేళేగా వచ్చేరు" అంది దేవి మురిపెంగా కొడుకు వంక చూస్తూ.

"చెయ్యనియ్యి. వచ్చే వారంలో మేం వైజాగు వెళ్లిపోతాం కదే అమ్మా! నీకు కోడల్తో పనిచేయించే అవకాశం ఎక్కడ దొరుకుతుంది?" అన్నాడు శేఖర్.

తన్మయి శేఖర్ వైపు తెల్లబోయి చూసింది. వచ్చే వారంలో వైజాగ్ వెళ్తామన్న విషయం తనకు చెప్పనే లేదు.

"కొత్త కాపరానికి మంచాలు, కుంచాలు అవసరం రా.  మీ అత్తగారు లింగు, లింగుమని రెండు బిందెల సారె పెట్టి పంపించేసింది." దేవి నిష్టూరాలు మొదలు పెట్టింది.

తన్మయికి అక్కడ నిమిషం కూడా ఉండాలనిపించడం లేదు. బయలుదేరే ముందు పిన్ని చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. "అక్కడ  మీ అత్తగారు వాళ్లు ఏం పరుషంగా మాట్లాడినా విననట్లు ఉండు. పద్దవాళ్లెప్పుడూ చెడ్డవాళ్లు కాదు. అన్నిటికీ ఓపిక పట్టమ్మా".

నిశ్శబ్దంగా  దేవి అప్పగించిన చపాతీల పని చేయడం మొదలుపెట్టింది తన్మయి. తన పక్కనే ఉన్న దేవి చేతల్లో విసురుతనం తన మీద ఉన్న అయిష్టత అని స్పష్టంగా తెలుస్తూంది.

"సామాన్ల గురించి తనతో ఫోను మాట్లాడిస్తానులే...."  శేఖర్ తల్లితో మాట్లాడుతున్న మాటలు  బాధని కలిగిస్తున్నాయి తన్మయికి.

అక్కడున్న వారం రోజులూ ఉదయం నించి సాయంత్రం వరకూ దేవితో బాటూ వంటింట్లోనే  తన్మయి జీవితం. పగలల్లా శేఖర్ తండ్రితో బాటూ బయటికి వెళ్లిపోయే వాడు.

మధ్యాహ్న భోజనాలు కాగానే గిన్నెలు కడగడం, సాయంత్రం మళ్లీ రాత్రి వంటకి సన్నాహాలు.

మధ్యాహ్నం కాస్సేపు దేవి నిద్ర పోతుంది. ఆ సమయంలో తనకు దొరికే తీరికలో వనజకి ఉత్తరం రాసింది తన్మయి.

"పోస్టాఫీసు ఎక్కడుంది అత్తయ్యా?" అంది.

దేవి ఆశ్చర్యంగా చూసి "పోస్టాఫీసుకి మన ఇంట్లో ఆడవాళ్లు వెళ్లరు. శేఖర్ కి చెప్పి స్టాంపులు తెప్పించుకో. ఉత్తరం పోస్టు చెయ్యమని ఉదయం వాడికే ఇచ్చెయ్యక పోయావా?" అంది.

మర్నాడు పోస్టు చెయ్యమని శేఖర్ కి ఉత్తరం ఇచ్చింది. "ఇంత అర్జంటుగా స్నేహితురాలికి ఉత్తరాలు రాసెయ్యాలా? ఇక్కడున్నన్నాళ్లూ మా అమ్మకి సాయం చెయ్యడం తప్ప వేరే పని పెట్టుకోకు. ఈ ఉత్తరాలు రాయడాలివన్నీ మనం వైజాగెళ్లేక తీరిగ్గా చేసుకో" అన్నాడు చిరాగ్గా మొహం పెట్టి.

అదెందుకంత పెద్ద సమస్యో అర్థం కాలేదు తన్మయికి. కానీ ఒక విధమైన ఉదాసీనత అలవాటు కావడం వల్లన తిరిగి ఏదీ అడక్కుండా నిశ్శబ్దంగా ఊరుకుంది.

అత్తవారింట్లో సాయంత్రమయ్యి ఎంత పొద్దుపోయినా ఎవరూ నిద్ర పోరు.

తన్మయికి బాగా పెందరాళే నిద్ర పోవడం అలవాటేమో నిద్ర ఆపుకోవడం కష్టంగా తయారైంది.

రాత్రి భోజనాలయ్యేక ఇంటి ముందు బైకుల మీద కూచున్న మిత్రులతో గంటల తరబడి మాట్లాడుతూన్న శేఖర్ దగ్గిరికి ధైర్యం చేసి వెళ్లింది.

గేటు దగ్గిర తనని చూస్తూనే దగ్గిరికి వచ్చి "లోపలికి వెళ్లు, వస్తాలే" అన్నాడు మెల్లగా గొంతు తగ్గించి.

మరో గంట తర్వాత వచ్చి "నువ్వలా పిలిస్తే వచ్చేస్తాననుకున్నావా? నా స్నేహితులు నన్ను పెళ్లాం కొంగు చాటు మొగుణ్ణని అనుకోరూ? ఇంకెప్పుడూ అలా నేను స్నేహితులతో మాట్లాడుతున్నపుడు మధ్యలో రాకు. నీకు నిద్రొస్తే నువ్వు పడుకో." అన్నాడు.

"ముందు నేను పడుకోవచ్చా?" సందేహంగా అడిగింది తన్మయి.

"ఇంచక్కగా.. మా అమ్మ పర్మిషనిస్తే " అని వ్యంగ్యంగా నవ్వేడు.

మర్నాడు వైజాగు వెళ్తారనగా జ్యోతి, భానుమూర్తి కూతురి కొత్తకాపురానికి సంచులతో సామాన్లు తీసుకుని వచ్చేరు. మధ్యాహ్నం నించి భానుమూర్తి చెల్లెలు వరసయ్యే వాళ్లింటికి వెళ్లొస్తామని బయలుదేరేరు.

"మీ పెళ్లికి అందరూ చదివించిన స్టీలు బొచ్చెలేవో తెచ్చిచ్చింది మీ అత్తగారు. ఇంక వాటర్ ఫిల్టర్, కుక్కర్ లాంటివి ఇంట్లో వాడేసిన పాతవి గామోసు తెచ్చింది. ఒక్కగానొక్క కూతురి కొత్త కాపరానికి కొత్త సామాన్లు కొనడానిక్కూడా చేతులు రావడం లేదు వీళ్లకి, ఇంక మంచాలు, కుంచాలేం పెడతారో..." అని రాగం తీసింది దేవి వాళ్లలా వెళ్లగానే.

"ఇదుగో వినబడిందా? మరో వారం రోజుల్లో వైజాగుకి మంచం, డ్రెస్సింగు టేబుల్ నవతా లో పంపమని చెప్పు మీ వాళ్లకి" అన్నాడు శేఖర్.

సాయంత్రం ఊరెళ్లే ముందు కూతురితో చెప్పెళ్లడానికి వచ్చేరు తన్మయి అమ్మా, నాన్నా.

తన్మయికి బాధని ఎవరితో చెప్పాలో అర్థం కావడం లేదు. "అదేంటమ్మా, మంచం అవీ తేలేదు? శేఖర్ వాళ్లేమో...." అనేదో చెప్పబోతుండగా

జ్యోతి చప్పున చేతి గాజులు తీసి కూతురి చేతిలో పెట్టి "ఇదుగో తల్లీ! మా దగ్గిర ఇక ఈ వస్తువులే మిగిలేయి. ఇవమ్మేసి మీకేం కావాలో కొనుక్కోండి." అంది నిష్టూరంగా.

తన్మయి కళ్ళల్లో నీళ్ళు చూసి, భానుమూర్తి అనునయంగా "పిల్ల అసలే అత్తవారింట్లో బెంబేలుగా ఉంటే నీ వరసేవిటీ?"అని జ్యోతిని మందలించి "అవి మాట్లాడడానికే వెళ్లొచ్చేమమ్మా. మరో నాల్రోజుల్లో వైజాగులో మీ ఇంట్లో ఉంటాయి సామాన్లు. పరుపులూ గట్రా మీరు కొనుక్కోండి." అన్నాడు.

"ఏం? పరుపులు ఏవన్నా మా తాత ఊరికే ఇస్తున్నాడా? చవకబారు మనుషులు" అని చీదరింపుగా అన్నాడు శేఖర్ వాళ్లు వెళ్ళేక.

తన్మయికి దు:ఖ పడే స్థలం కూడా లేదు ఆ ఇంట్లో. మనసంతా బాధ పొరలు పొరలుగా పేరుకుపోతూంది.

తను కావాలని పట్టుబట్టి చేసుకున్న పెళ్లి గాబట్టి శేఖర్ తరఫు నించి ఏం బాధ వేసినా అంతా తనదే తప్పన్నట్లు ఆలోచిస్తున్న తల్లిదండ్రుల మధ్య, తనని చేసుకోవడం వల్లనేదో నష్టపోయామని సాధిస్తున్న శేఖర్ వాళ్ల మధ్య అడకత్తెరలో పోక చెక్కలా నలిగిపోతూంది తన్మయి.

వనజ గుర్తురాని క్షణం లేదు. తనూ ఇప్పుడే దూరంకావాలా తన దురదృష్టం కాకపోతే.

మిగిలిన ఒకే ఒక్క ధైర్యమయిన కాగితం తీసుకుని "అజ్ఞాత మిత్రమా! నన్ను ఈ బాధల నించి బయటకు తీసుకురా" అని రాసింది.

★★★

ఆ రోజు ఉదయపు రైలుకి బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటల వేళకి వైజాగు చేరుకున్నారు.

"తన కలల నగరపు" స్టేషనులో దిగి నేల మీద అడుగుపెట్టగానే విచిత్ర అనుభూతికి లోనయ్యింది తన్మయి.

ఆటోలలో సామాన్లతో శేఖర్ తాత గారి ఇంటికి వెళ్లేరు. ఆ సరికే మొహమంతా జిడ్డు పట్టినట్లయ్యింది తన్మయికి.

"ఇదేవిటీ, ఎంత తుడుచుకున్నా..." అంది అప్రయత్నంగా.

"వైజాగంటే ఏవిటనుకున్నావు మరి? ఉప్పుగాలి." అన్నాడు శేఖర్.

శేఖర్ చిన్న మావయ్య భార్య లోపలి నించి వచ్చి "రండి, ప్రయాణం బాగా జరిగిందా?" అని ఇద్దరినీ పలకరించింది.

పెద్ద కాంపౌండులో రెండు పోర్షన్ల ఇల్లు.

"ఇందులో ఒక పోర్షనులో మా చిన్న మావయ్య, ఒక పోర్షనులో తాత గారు ఉంటారు." అంటూ ఇంటి వెనకగా ఆనుకుని ఉన్న ఒంటిగది ఔట్ హౌసులో తెచ్చిన సామాన్లని పెట్టేడు శేఖర్.

"ఇదే మన ఇల్లు" అన్నాడు గదిని చూపిస్తూ.

తన్మయి చుట్టూ చూసింది. మాసి పోయిన గోడలు, బూజు పట్టిన దూలాలతో ఉన్న చిన్న పెంకుల గది అది.

ఒక పక్కగా వంటకి గట్టు వేసి ఉంది. అటు బయట గుమ్మం దగ్గిరే కామన్ బాత్రూము కావడంతో లోపలికి వచ్చే దారి చిత్తడిగా ఉంది.

తన్మయికి సామాన్ల వైపు తిరిగి చూసే సమయం కూడా ఇవ్వకుండా "మనమిలా వచ్చీ రాగానే గదిలో కూచుంటే బావోదు, నువ్వెళ్లి మా అత్తయ్యతో మాట్లాడుతూండు. నేను స్నానం చేసి వస్తాను. అన్నట్లు నా బట్టలు, సబ్బు, టవల్ అన్నీ బయటికి తీసిపెట్టి వెళ్లు." అన్నాడు.

అలా జిడ్డోడుతూనే వెళ్లి "పిన్ని గారూ, నేనేవైనా చెయ్యనా?" అంది తన్మయి గొంతు సరిచేసుకుంటూ.

"హైమా ఆంటీ, అని పిలువు. ఇది వైజాగు. మీ పల్లెటూరు కాదు." అని చిన్నగా నవ్వింది.

"ఊ...అమ్మాయ్, ఎలా ఉన్నాడు మీ ఆయన? నువ్వు చెప్పిన మాట వింటున్నాడా?" అన్నాడు అప్పుడే వచ్చిన శేఖర్ చిన్న మావయ్య శివ.

పళ్ళూడిపోయిన నోటితో గట్టిగా నవ్వుతూ "నువ్వూరుకోరా, పిల్లని మొదటే భయపెట్టకు." అన్నాడు శేఖర్ తాతయ్య.

కొత్తా పాతా లేని వీళ్ల సంభాషణకి బిత్తర పడి కిందికి చూస్తూ నిలుచుంది తన్మయి.

"టీ తాగుతావా?" అంది హైమ గ్లాసొకటి తనకీ ఇస్తూ.

అడ్డంగా తలూపి "వద్దండీ" అంది.

అప్పుడే స్నానం చేసి వచ్చిన శేఖర్ "థాంక్సాంటీ" అని ఆ గ్లాసందుకుని చకచకా తాగి "రాత్రికి వస్తాను." అంటూ బైకు స్టార్టు చేసుకుని వెళ్లిపోయేడు.

"నేనూ కాస్త స్నానం చేసి..." అని గొణిగి అక్కణ్ణించి తమ గదిలోకి వచ్చిపడింది తన్మయి.

గది తలుపు మూసుకోగానే ఎక్కడ లేని నిస్సత్తువ వచ్చినట్లయ్యింది. నేల మీద చాప వేసుకుని కూలబడింది.

సూట్ కేసులోనుంచి డైరీ తీసి "ప్రియ అజ్ఞాత మిత్రమా! వచ్చేసేను నీ దగ్గిరికి....ఆకాశమై నా వెంట తిరిగే నీ కోసం సముద్రమై ఉప్పొంగడానికి సిద్ధమై వచ్చేసేను..." అంటూ రాస్తూనే ఎలా నిద్రపోయిందో తెలీదు.

గట్టి తలుపు చప్పుడుకి గభాలున లేచింది.

## 11

తన్మయికి అంత మొద్దు నిద్ర ఎలా పట్టిందో అర్థం కాలేదు.

చెమటతో తలకూడా తడిసిపోయి ఉంది.

"కొత్త ఊరికి అలవాటు పడడానికి సమయం పట్టుందిలే." అన్నాడు శేఖర్ లోపలికి వస్తూనే తన్మయి జిడ్డు ముఖం చూసి.

తన కలల నగరం విశాఖపట్నం. ఎప్పుడు చూస్తానా అని ఎన్నో రోజుల నించీ చూసిన ఎదురుచూపు ఇప్పటికి నిజమైందన్న ఆనందంతో చిర్నవ్వు నవ్వింది.

"ఇదేవిటి? ఎక్కడి సామాన్లింకా అక్కడే ఉన్నాయి?" అన్నాడు కాస్త చికాగ్గా మొహం పెట్టి.

పక్కనే పుస్తకాన్ని, పెన్నుని చూసి "మొదలెట్టేవా, నీ పిచ్చి రాతలు?" అన్నాడు వ్యంగ్యంగా.

అతను పుస్తకం తీసి చదివితేగా తనేం రాసేదీ తెలిసేది.

ఉక్రోషంగా ఏదో అనబోతున్న తన్మయిని పట్టించుకోకుండా "లేచి ముఖం కడుక్కో, మావయ్యని చూసొస్తాను. " అని వెళ్లిపోయేడు.

అంతలోనే ఎదురు వరండాలోంచి "ఈ పూటకి మనకి భోజనం ఇక్కడే. వచ్చి అత్తమ్మకి సాయం చెయ్యి." అని అరిచేడు.

తెచ్చుకున్న చీరల్లోంచి చిన్నపూల కాటన్ చీర తీసి కట్టుకుంది. పాపిట నిండా సింధూరం, తిలకం బొట్టు, చేతుల నిండా గాజులు. తను ఎన్నాళ్లుగానో కలలు గన్న అవతారం. పమిట భుజం చుట్టూ కప్పుకుని వచ్చి వినమ్రంగా నిలబడింది.

"ఏవిటా ముసలమ్మ వేషాలు?" అని పకపకా నవ్వేడు శేఖర్.

తన్మయి శేఖర్ వైపు చురుగ్గా చూసిన చూపు శేఖర్ గమనించలేదు గానీ చిన్న మావయ్య శివ గమనించేడు.

"నీ పెళ్లానికి కోపం వచ్చేసిందిరా" అని గట్టిగా నవ్వేడు.

ఇంతలో చిన్నమావయ్య భార్య హైమ వెనక నుంచి వస్తూ చక్కగా అల్లుకున్న తన్మయి జడని చేతితో పైకెత్తి చూసి "నిజం జుట్టే, ఇంత బావుంది!" అంది.

ఆవిడకి ఎందుకంత ఆశ్చర్యం వేసిందో తన్మయికి అర్థం కాలేదు. భోజనాలయ్యేక అందరి కంచాలూ తన్మయినే తియ్యమని పురమాయించేడు శేఖర్.

"మీ పెళ్ళికి నాకు వొంట్లో బాగోలేక మేం రాలేకపోయేవమ్మాయ్, ఇదిగో మీకు అద్దె లేకుండా ఆరునెలలు మా ఇల్లు ఇస్తున్నా. అదే మీ పెళ్లి గిఫ్టనుకోండి." అన్నాడు నోట్లోంచి పళ్ల సెట్టు తీసి పక్కన బాక్సులో పెట్టుకుంటూ శేఖర్ తాతయ్య.

“తాతయ్యా! స్టవ్వూ అదీ...?"అని నసిగేడు శేఖర్.

"పాత కిరసనాయిలు స్టవ్వు షెడ్డు లో ఉంది తెచ్చుకోరా" అన్నాడు ఉదారంగా ఆయన.

"రేపు పగటి పూట నేను అక్కడ క్యాంటీనులో తినేస్తాను. రేపు పొద్దున్న ఈ సామాన్లన్నీ సర్దేసి నీకు వంట చేసుకో." అన్నాడు శేఖర్.

రాత్రికి పడుకోవడానికి చాప, బొంత అడిగి తెచ్చేడు శేఖర్.

సూట్కేసులోంచి దుప్పటి తీసి వేస్తున్న తన్మయి వైపు ఈసడింపుగా చూస్తూ "ఏం చేస్తాం! మీ వాళ్లు ఇదిగో ఇస్తాం, అదిగో ఇస్తామని ఇప్పటికింకా మంచం, కుంచం పంపనేలేదు. మనమిక్కడికి వచ్చే లోగా సామాన్లు పంపించేస్తే పోలా? ఎక్కడ పడుకుంటారనే ఇంగిత జ్ఞానం అయినా ఉందా మీ వాళ్లకి?" అంటూ అటు తిరిగి ఉన్న తన్మయిని తనవైపు తిప్పుకున్నాడు.

"డాబా మీద పడుకుందామా?" అడిగింది ఆశగా బయటికి చూస్తూ.

మంచి వెన్నెట్లో చిన్నగా గాలి వీస్తూ హాయిగా ఉంది బయట.

"సర్లే. ఈ ఉక్క పోతలో ఇయ్యన్నీ ఆలోస్తుంటే నాకు బుర్ర వేడెక్కిపోతూంది." అని చాప, దుప్పట్లని చుట్టి పైకి నడిచేడు శేఖర్.

"ఎవర్రా అది?" గట్టిగా కేక వినిపించింది కింద నుంచి.

"మేమే తాతయ్యా, ఫ్యాను లేదుగా ఉక్కగా ఉంటేనూ" అని అరిచేడు ఇట్నించి.

డాబా మీద పడుకునే అవకాశం వచ్చినందుకు తన్మయి సంతోషపడింది.

"రెల్లు పూలా పానుపు పైనా
జల్లు జల్లులుగా ఎవరో చల్లినారమ్మా
వెన్నెల.. చల్లినారమ్మా.... " కృష్ణ శాస్త్రి గారి పాటని తన్మయి హృదయం లోలోపల పాడుతూ ఆనందంతో పులకరిస్తూంది.

హాయిగా పైకి పాడాలని ఉంది. సాయంత్రమంతా నిద్రపోయినందువల్ల తన్మయికి నిద్ర రావడం లేదు. అప్పటికే నిద్రలోకి జారుకున్న శేఖర్ వైపు కన్నార్పకుండా చూస్తూ కూచుంది కాసేపు.

"సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు?
చంద్రికలనేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?"

ఎంత అందగాడు! అంత అందమైన మనస్సూ ఉంటే బావుణ్ణు! కాదు కాదు ఉంది. అతనికి మంచి మనస్సు ఉండి ఉంటుందని తనకి ఏ మూలో అనిపిస్తూంది.

"నేను నిన్ను తప్పక మార్చుకుంటాను శక్కూ! నా ప్రియ నేస్తాన్ని చేసుకుంటాను."అని దృఢంగా అనుకుంది.

నిజానికి తన చుట్టూ ఉన్న వాళ్ల మాటలు చూస్తూంటే వీళ్లందరి కంటే శేఖరే కాస్త నయమనిపించింది తన్మయికి.

★★★

ఉదయానే లేచి వాకిట్లో చక్కగా ముగ్గు పెట్టింది. గుమ్మానికి  పసుపు రాసి బొట్లు పెట్టింది.

శేఖర్ వెళ్లే లోగా కాస్త పరమాన్నం చేసింది.

"కొత్తగా ఇంట్లోకి వెళ్లే వేళ ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలి. రోజూ దీపం పెట్టడం మర్చిపోకు" అమ్మమ్మ తనకి వచ్చేటప్పుడు చెప్పిన మాటలు గుర్తొచ్చేయి.

రెండు మందార పూలు కోసి తెచ్చి కిటికీలో బుద్ధుడి బొమ్మకు అటూ ఇటూ పెట్టింది. ఇదంతా ఆశ్చర్యంగా చూసేరు ఇంట్లో వాళ్లంతా.

శేఖర్ వెళ్లేటపుడు "రోజల్లా పుస్తకాలు వేసుకుని కూచోకుండా అలా వెళ్లి మా అత్తయ్యకి కాస్త సాయం చెయ్యి" అన్నాడు.

అతను వీధి మలుపు తిరుగుతూ వెనక్కి తన వైపు చూస్తే బావుణ్ణని గేటు దగ్గిరే నిలబడింది. వీధి మలుపు తిరిగి శేఖర్ బండి  తిప్పుకుని మళ్లీ వెనక్కి వచ్చేడు.

తన్మయి వైపు కాస్త తీవ్రంగా చూస్తూ "ఇలా గేటు పుచ్చుకుని వేళ్లాడడం లాంటి పనులు మా ఇళ్లలో ఆడవాళ్లు చెయ్యరు. రేపట్నించి కర్టెను దాటి నువ్వు రావక్కరలేదు." అన్నాడు.

తన్మయికి కళ్లలో నీళ్లు తిరిగేయి. చప్పున లోపలికి నడిచింది. వరండా లోంచి అతని తాతయ్య పెద్ద నవ్వు వినిపించింది.

"అమ్మాయ్, హైమకి సాయం చెయ్యి" అని పిలిచేడాయన.

వంటింట్లో అటు తిరిగి పనిచేస్తున్న హైమని శివ వెనకి నుంచి వచ్చి ఒక్క తన్ను తన్నేడు. ఆ పక్కనే గట్టు మీద చపాతీలు ఒత్తుతున్న తన్మయి ఉలిక్కి పడింది. అతనేదో బూతుమాట హైమతో మెల్లిగా అన్నాడు.

ఆవిడ అదేదో జోకులా నవ్వుతూ"అది మా ఆయన పలకరింపు, నువ్వేం గాభరా పడకు. ఆఫీసుకి పంపించి, హనుమాన్ చాలీసా చదువుకుని వస్తాను. చపాతీలు వత్తడం అయిపోతే కూరలు తరిగిపెట్టు" అంది.

ఇంటి వాళ్లకి సాయం చెయ్యడం కోసం వాళ్ల మాటలన్నీ వినాల్సి రావడం పెద్ద బాధగా తయారైంది తన్మయికి.  వాళ్ల వరస నచ్చలేదు తన్మయికి. పైగా తనని పల్లెటూరి అమ్మాయని లోకువగా చూస్తున్నారనిపించింది. పదకొండు గంటల వేళ వంట చేసుకోవాలనే నెపం మీద గదిలోకి వచ్చి పడింది.

ఎందుకో గుండె బరువుగా అనిపించింది తన్మయికి. అద్దంలో తనను తాను చూసుకుంది. "ఇప్పుడేమయ్యిందని తనకిలా కళ్లనీళ్లు? " శేఖర్ వెళ్తూ అన్న మాటలు మనసులో బాధని రేకెత్తిస్తున్నాయి. కాస్సేపట్లో తేరుకుని "అతని పద్ధతి అది. పాటిస్తే పోలా? అతన్ని ప్రేమించడం అంటే ఇవన్నిటినీ ప్రేమించడమనేగా" అని సర్ది చెప్పుకుంది.

అతనితో జీవితాన్ని కలలు కన్నప్పుడు ఇవన్నీ తనకు తెలియవు. అసలు శేఖర్ ఇంత దురుసుగా పెళ్లికి ముందరెప్పుడూ ప్రవర్తించలేదు. అతని ప్రవర్తన తెలిసేటంత సేపు తామిద్దరూ గడపలేదు. తను చదివిన గొప్ప ప్రేమ కథల్లో పెళ్ళయ్యాక ఇంత మార్పు ఉన్న పాత్ర తనకి ఎక్కడా కనిపించలేదు. వనజ జ్ఞాపకం వచ్చింది.

ఉత్తరం రాయడం కోసం అడ్రసు పెట్టిన పుస్తకం తీసింది. గాభరాగా అన్ని పేజీలూ తిప్పింది. "ఎక్కడ పడిపోయి ఉంటుంది అడ్రసు కాగితం?" ఎంత ఆలోచించినా తనకి అర్థం కావడం లేదు.

బహుశా: బయలుదేరే రోజు శేఖర్ వాళ్లింట్లో మర్చిపోయి ఉంటుంది. అసలేదీ జాగ్రత్త చెయ్యని వాళ్లింట్లో ఈ కాగితాన్ని ఎవరైనా భద్రపరిచి ఉంటారన్న నమ్మకమూ లేదు. మనస్సులో అన్ని బాధలూ కలిపి మెలితిరగడం మొదలు పెట్టాయి.

"మిత్రమా! అజ్ఞాత మిత్రమా! నన్ను రక్షించు. అన్నిటి నించీ నన్ను రక్షించు." వాక్యం రాసి మౌనంగా చాలా సేపు కూచుంది తన్మయి.

రెండు గంటల వేళ ఆకలి కరకరా వేయడం మొదలయ్యింది. పాయసం కాస్త పెట్టుకు తిని ముఖం కడుక్కుని వచ్చింది.

దొడ్లో పనికి రాకుండా పడి ఉన్న చిన్న చిన్న బల్ల చెక్కల్ని తెచ్చి వాటి కింద ఇటుకలు పెట్టి, సంచుల్ని విప్పి సామాన్లని అందంగా, పొందికగా సర్దింది. పుస్తకాల్ని మురిసిపోతూ చూసుకుంది. పనిలో పడ్డాక మనసు శాంతించింది.

శేఖర్ బట్టలు ఉతికి ఆరేయడానికి మేడ పైకి వెళ్లింది. రాత్రి అందంగా కనబడిన డాబా ఇంతెత్తు మట్టి పేరుకు పోయి, అసహ్యంగా ఉంది. కిందనే తీగె కట్టి బటలు ఆరేసి మళ్లీ పైకెళ్లి చుట్టూ చూసింది. అంత డాబాని తుడవడం తనకి సాధ్యం కాని పని. చీపురు పుచ్చుకుని డాబాకి ఒక పావు మేర శుభ్రం చేసి వచ్చింది.

అకస్మాత్తుగా తమ ఇల్లు, సన్నజాజి పందిరి గుర్తుకొచ్చేయి. అమ్మా, నాన్నా, అమ్మమ్మా జ్ఞాపకం వచ్చేరు. ఒక్క సారి మాట్లాడితే బావుణ్ణనిపించింది.

"ఇంటి వాళ్లని ఫోను చేసుకోవడానికి అడిగి చూస్తే? అయినా శేఖర్ని పొద్దున్నే అడిగి వుండాల్సింది" అనుకుని అంతలోనే ఆ ప్రయత్నం విరమించుకుంది.

"ఏవమ్మాయ్, టీ తాగుతావా?" గుమ్మం దగ్గర్నించి హైమ పిల్చింది.

ఆ కాస్త పిలుపుకే ఆనందపడుతూ వెళ్లింది తన్మయి.

"నీకు శేఖర్ సంగతి తెలిసే చేసుకున్నావా?" గుసగుసగా అడిగింది ఆవిడ టీ గ్లాసు ఇస్తూ.

తన్మయికి ఒక్క సారిగా కాళ్లు వణికేయి. ఏం వినాల్సి వస్తుందో అని ఊపిరి బిగబట్టుకుని "ఏం సంగతండీ?" అంది గొంతు పెగుల్చుకుని.

"అయినా నాకెందుకులే." అంది ఆవిడ దాట వేస్తూ.

సాయంత్రం అయినదగ్గర్నించీ శేఖర్ ఎప్పుడొస్తాడా అని క్షణాలు లెక్కబెట్టసాగింది తన్మయి. అతను వస్తూనే అడగాలి. అదేవిటో గట్టిగా అడగాలి. అనుకుంది. రాత్రి భోజనాల సమయం అయిపోయి అందరూ నిద్రపోతూండగా వచ్చేడు శేఖర్.

"ఏవిటింకా పడుకోలేదా? నేను తినొచ్చేను." అన్నాడు. అతని దగ్గిర గుప్పున వాసన కొడుతోంది.

తన్మయి గొంతు పెగుల్చుకునే లోగా, "ఉష్.. మా తాతయ్యకి నేను మందు వేస్తానని తెలీదు. పెళ్లికి రాని ఫ్రెండ్స్ పార్టీ ఇచ్చే వరకూ ఊరుకోలేదు. ఏవిటా చూపు? కాస్త పక్క వెయ్యి మేడ మీద" అన్నాడు.

మెట్లు తూలుతూ ఎక్కుతూ, "నువ్వు ఇంట్లో పడుకుని, నేను మేడ మీద పడుకుని ఉంటే వాళ్లకి పొద్దున్న అనుమానమొస్తుంది. వేషాలు చెయ్యకుండా మేడ మీదికొచ్చి పడుకో" అన్నాడు.

★★★

విశాఖపట్నం వచ్చి వారమైనా సముద్రాన్ని చూడలేదు. మగవాళ్లంతా ఆదివారం నాడు వెళ్లి వంటకి దినుసులు, కూరగాయలు తెచ్చేరు. సాయంత్రం అందరూ కలిసి సముద్ర తీరానికి వెళ్దామని ప్లాను చెప్పేడు శేఖర్.

"మీ జెట్టిల దగ్గిరకెందుకురా చేపల కంపు, ఆర్కే బీచికెళ్దాం" అన్నాడు శివ.

తన్మయి గుండె దడ దడా కొట్టుకుంది. ఇందులో ఎవరు వద్దంటారో, ఎక్కడ మానెయ్యాల్సొస్తుందో అని. ముందు గానే చెప్పుకున్నట్లు మరో నాలుగైదు ఫామిలీలు సమయానికి చేరేరు. శేఖర్ తల్లి తరపు బంధువులు వాళ్లంతా. ఆవిడ అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు. అంతా కలిసి తన్మయిని ఆటపట్టించడం మొదలెట్టేరు.

"పెద్ద బొట్టు అవతారవేవిట్రా మీఆవిడ?" అని ఒకళ్లు.

" ఆ భుజం చుట్టు కొంగేవిటని" మరొకళ్లు.

తన్మయి అలవాటైన నిశ్శబ్దంతో కిక్కిరిసిన ఆటోలో చివర మౌనంగా కూచుని బయటికి చూడసాగింది. ఎక్కి దిగే కొండల రోడ్లతో చూడ చక్కగా ఉంది నగరం. చివరి రోడ్డు మలుపు తిరిగి, ఎత్తు నించి ఆటో దిగువకి దిగుతుండగా బ్రహ్మాండమైన అలల్తో తన్మయి కలల సముద్రం ప్రత్యక్షమైంది. శరీరం నించి మనస్సు విడిపడి సముద్రం వైపు పరుగుతీసింది తన్మయికి. ఒక్క సారిగా రెక్కలొచ్చిన అనుభూతి. అమాంతం ఆ జలధిలోకి దూకెయ్యాలన్నంత పరవశం.

ఆటో దిగుతూనే మొక్క జొన్న పొత్తులు కొనుక్కోవడానికి అంతా ఎగబడుతూండగా సముద్రంకేసి కన్నార్పకుండా చూస్తూ నిలబడింది తన్మయి.

"శేఖర్ చేతిని గట్టిగా పట్టుకుని మెత్తని ఇసుకలో నడుస్తూ, అలల్ని మైమర్చి చూస్తూ, ఒడ్డున పరుగులెడ్తూ....." తన్మయి మనస్సు పరిపరి విధాల కోరికలు వెదజల్లుతూంది.

చుట్టూ వందల మంది జనం. ఇసుకలో ఎక్కడా ఖాళీ లేకుండా ఉన్నారు. బూరలు, కాగితం బొమ్మలు, రకాల తినుబండారాలు అమ్మేవాళ్లతో కోలాహలంగా ఉంది అక్కడంతా.

"రోడ్డుకి అటు పక్కగా కాళికాలయం చూసేవా?" అన్నాడు శేఖర్.

ఈ లోకంలోకి వచ్చి పడింది ఒక్క సారిగా. "వెళ్దామా?" అంది అటుగా ఆశగా చూస్తూ.

"మనం ఒచ్చింది సముద్రం ఒడ్డుకి. గుళ్లూ గోపురాలు తర్వాతెప్పుడైనా విడిగా వచ్చి చూసుకుందాం. అలా ఎటో చూస్తూ అయోమయంలాగా ఉండకుండా అందరితో కలిసి ఉండు." అన్నాడు.

మనస్సులో పరవళ్ళు తొక్కుతున్న ఆలోచనలు భౌతికంగా అక్కడ ఎదురవుతున్న అనుభవాల్ని ఏ మాత్రం పట్టించుకునే స్థితిలో లేవు. అతనేమన్నాడో వినకుండా చిర్నవ్వు నవ్వింది.

"గత జన్మ నుండి నిన్ను చేరడానికే తపిస్తున్నా నేస్తం!

ఈ అనంత జల నిధి లో నన్ను పరవళ్లు తీయనీ

అలల నురుగుని ధరించి అణువణువూ పులకరించనీ... " కవిత్వమో ఏదో. మనస్సులో పదాలు సుళ్ళు తిరుగుతూ చుట్టుముట్టేయి తన్మయిని.

ఇసుకలో కిందకు కూరుకుపోతున్న తన పాదాల మీద పట్టీల్ని పైకి లాక్కుంటూ నీళ్ల వైపు అడుగులేసింది.

"తై" మని వచ్చిన వాళ్లలో పదహారు పదిహేడేళ్ల పిల్లలతో "బావా, బావా" అని పిలిపించుకుంటూ నీళ్లు వాళ్ల మీదికి జల్లుతూ ఆనందిస్తూన్న శేఖర్ హఠాత్తుగా వచ్చి తన చీర ఎక్కడ తడిసిపోతుందో అన్నట్లు చప్పున చేతుల మీద తన్మయిని ఎత్తుకున్నాడు. అంతా గోలగా అరిచేరు. ఆశ్చర్యంగా, మహదానందంగా తొలకరి వానకి పుడమి పులకరించినట్లు పులకించిపోయింది.

"ఏరా, నీ పెళ్లం రవణా రెడ్డిలాగా ఎంత పూచిక పిల్లలా ఉంటే మాత్రం, ఇలా గాల్లో తిప్పడం మొదలెట్టేవంటే ఇక బూమ్మీద నిలబడదు జాగ్రత్త" అంది శేఖర్ పిన్ని గారపళ్ళు పెకి వచ్చేట్లు గట్టిగా నవ్వుతూ.

చప్పున దించి "ఇలా సముద్రపు ఒడ్డుకు వచ్చేటపుడు నీళ్లలోకి రావాలనుకుంటే పంజాబీ డ్రెస్సు వేసుకో" అన్నాడు.

ఇంతలో "వొదినా, రా... " అంటూ ఇద్దరు పిల్లలు వచ్చి నీళ్ల లోకి లాక్కెళ్లేరు.

నీళ్లలో కెరటాల్తో పసిపిల్లలా ఆడుకుంటూ "నాకు సముద్రం ఎంత నచ్చిందో తెలుసా?" అంది పక్కనున్న అమ్మాయితో.

తలెత్తి ఆకాశం వైపు చూస్తూ "నేనొచ్చేసేను నా కలల నగరానికి" అని గట్టిగా అరవాలని ఉంది తన్మయికి.

ఇంతలో పెద్ద కెరటం వచ్చి ఒక్క ఉదుటున అందర్నీ ముంచేసింది. తన్మయి కాళ్లానుకోలేక కింద పడింది. పడడమే కెరటంతో బాటూ లోపలికి జారిపోసాగింది.

## 12

అసలే అక్కడ ఒడ్డు ఏటవాలుగా ఉంది. కెరటం ఉధృతంగా లాగేసరికి ఉక్కిరిబిక్కిరవుతూ శేఖర్ వైపు చూస్తూ గట్టిగా అరిచింది తన్మయి. మునిగి పోతున్న క్షణంలో శేఖర్ ఒక్కంగలో తన్మయి చీరని ఒడిసి పట్టుకున్నాడు. ఒక్క నిమిషంలో తన్మయిని దృఢమైన చేతుల్తో గట్టిగా పట్టుకుని ఒడ్డుకి తీసుకొచ్చాడు.

గుండె దడ హెచ్చి అర్థం కాని అయోమయమైపోయింది కాసేపు తన్మయికి. ఒడ్డుకి వచ్చి కూచున్నా ఒణుకు తగ్గలేదు.

"శేఖర్ తన దగ్గర్లో ఉన్నాడు కాబట్టి సరిపోయింది. తను చీర కట్టుకుంది కాబట్టి సరిపోయింది. లేకపోతే..." ఆలోచించడానిక్కూడా భయం వేసింది తన్మయికి. అప్పటిదాకా ఆహ్లాదంగా కనిపించిన సముద్రం ఒక్కసారిగా వెయ్యి నాలుకల మృత్యువుగా తోచింది. పక్కనే కూచున్న శేఖర్ భుజమ్మీద తల వాల్చి గట్టిగా ఏడ్చేసింది. చుట్టూ బంధువులంతా మూగారు.

శేఖర్ తనని కాపాడకపోయి ఉంటే? బాబోయ్, ఊహించుకోవడానికే ఒళ్ళు జలదరిస్తూంది.

ఒక్కసారిగా తన్మయి హృదయం అతని పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. తనంతట తానుగా అతన్ని ఎప్పుడూ ఏ విషయానికి బాధ పెట్టకూడదు.

శేఖర్ పట్ల ఉన్న ప్రేమ రెండింతలైంది. మరింత దగ్గరగా జరిగి కళ్లు మూసుకుంది.

తన్మయి కాస్త తేరుకుని, చుట్టూ ఉన్న వాళ్లంతా మళ్లీ ఆటలో పడగానే "ఇలా చూడు, ఆడదానికి ప్రాణం కంటే మానం చాలా విలువైంది. నువ్వక్కడ అలా వేషాలెయ్యడం, మునిగిపోవడం వల్ల ఇప్పటికే లక్ష మంది చూసేరు నీ అవతారాన్ని. నువ్విలా తడిసి పోయి అడ్డదిడ్డమైన చీరతో ఇక్కడే కూచుంటే నా పరువంతా పోతూంది. బయలుదేరు. పిన్ని వాళ్లకేదో సాకు చెప్పొస్తాను." అన్నాడు శేఖర్ ఈసడింపుగా.

కెరటం తనని ఎందుకు తీసుకెళ్లలేదా? అన్న దు:ఖం మొదలైంది తన్మయికి.

"అతను తన ప్రాణదాత. తనని బాధ పెట్టకూడదు." కన్నీళ్లు తుడుచుకుంది.

ముఖం లో భావాలు అంత త్వరగా మార్చుకోవడం చాతకాదు తన్మయికి.

బండి స్టార్టు చేస్తూ "ఎక్కు, ఆ ఏడుపు మొహవేంటి? నాకిలా దాపురించావేవిటే?" అన్నాడు గట్టిగా అరుస్తూ.

గుడ్ల నీళ్లు కక్కుంటూ, బండి వెనక పట్టుకుని అతనికి తగలకుండా కూచుంది.

అప్పుడప్పుడే మసకబారుతున్న వెల్తురు వల్ల, తీరంలో తేమ వల్ల, కంట్లో నీళ్ల వల్ల కలల నగరం అంతా మసకబారిపోయి పాడుబడినట్లు కనిపించసాగింది.

"మిత్రమా! ఇవేళ నువ్వు నన్ను కాపాడేవు కదూ! నాకు తెలుసు. నువ్వే శేఖర్ అయ్యి నన్ను కాపాడేవు. మరి నా దు:ఖాన్ని తుడిచేలా శేఖర్ తో సాంత్వన చేకూర్చే నాలుగు మాటలు ఎందుకు మాట్లాడించలేక పోతున్నావు? అంటే నువ్వు నువ్వేనా? శేఖర్ వి కావా?" తనలో తను లోపల్లోపల మాట్లాడుకుంటూ కూచుంది తన్మయి.

ఇంటికి వచ్చి తలారా స్నానం చేసినా కాళ్లలోంచి ఒణుకు తగ్గనట్లు అనిపించసాగింది. కాళ్లలో బలమంతా పోయినట్లయ్యిం ది.

శేఖర్ బయట ఎవరితోనో బాతాఖానీలో ఉన్నాడు. గదిలో చాప మీద నిస్త్రాణగా వాలిపోయింది.

అంతలో పొత్తి కడుపులో బాగా మంట మొదలైంది. మరో వైపుకి తిరిగింది. ఉహూ..తగ్గదే!

అరగంట దాటుతూన్నా అలా మంట వస్తూనే ఉంది. బాత్రూముకి వెళ్లొచ్చింది. యూరిన్ కి వెళ్లగానే భయంకరమైన మంట .

లోపలికి వచ్చి మూలుగుతూ ఇలా జేరబడిందో లేదో కడుపులో మంటతో బాటూ, నిప్పుల్తో కాలుస్తున్నట్లు జ్వరం వచ్చేసిం ది.

తన్మయికి తను గట్టిగా మూలుగుతున్నట్లు అర్థమవుతూంది. కానీ ఏమీ అర్థంకాని అశక్తత.

అంతా బీచ్ నించి తిరిగొచ్చిన పదినిమిషాల తర్వాత హైమ ఎందుకో లోపలికి వచ్చింది.

దగ్గరికి వస్తూనే "అనుకున్నంతా అయ్యింది, అయ్యో! ఒళ్ళు బాగా కాలిపోతూంది." అంటూ శేఖర్ ని గట్టిగా పిల్చింది.

హాస్పిటల్ కి ఆటోలో ఎలా ఎక్కించేరో తెలీదు. దార్లో వాంతు కావడం వరకే జ్ఞాపకం ఉంది.

కళ్లు తెరిచే సరికి చిన్న ఆసుపత్రి గదిలో పైన తిరుగుతున్న సీలింగు ఫ్యాను శబ్దం తప్ప ఏ శబ్దమూ లేదు. దాహంతో గొంతు పిడచకట్టుకు పోతూంది. పక్కనెవరూ లేరు మంచి నీళ్లు అడుగుదామంటే.

పక్కకి ఒత్తిగిలదామని చూసింది. కడుపులోఇంకా మంటగానే ఉంది. నిస్సత్తువగా గుమ్మం వైపు చూడసాగింది.

వస్తున్న ఆవిణ్ణి ముందెప్పుడూ చూసినట్టు లేదు. స్టెతస్కోపు మెళ్లో ఉంది కాబట్టి డాక్టరనుకోవాలి. సాదా సీదా చీరలో హౌ స్ వైపులాగా ఉందావిడ.

లోపలికి వస్తూనే "మెలకువ వచ్చిందా? మా ఇల్లే హాస్పిటల్. శేఖర్ నాకు చిన్నప్పట్నించీ తెలుసు. మా తమ్ముడు శేఖర్ స్నేహితుడు. ఇప్పుడెలా ఉంది?" అంది.

తను తలూపగానే, తర్వాత ప్రశ్న అర్థమైనట్లు "శేఖర్ భోజనానికెళ్లేడు, నీకు సముద్రంలో మునగడం వల్ల బాగా హైఫీవర్ వ చ్చినట్లుంది. తగ్గిపోతుందిలే." అంది చిన్నగా నవ్వుతూ.

ఇంకా ఇబ్బందిగా ఉన్న తన్మయి ముఖంలోకి చూస్తూ "ఏవిటీ?" అంది కడుపు మీదున్న చేతిని పరీక్షగా చూస్తూ.

పరీక్ష చేసిన తర్వాత "నీకు ఎప్పట్నించి ఉంది ఇలాగ? శేఖర్ ని కూడా పరీక్ష చేయాలి." అంది.

డాక్టరు బైటికి వెళ్లగానే ఉబికి వస్తున్న దు:ఖాన్ని పట్టుకోలేక పోయింది తన్మయి.

"తనకు సుఖవ్యాధా? శేఖర్! నన్నెందుకు ఇలా శిక్షిస్తున్నావు?" ఒళ్లంతా సలసలా రక్తం మరుగుతున్న కోపం తో ఒణికి పోయింది.

"అసలేం చెయ్యాలో అర్థం కాని పరిస్థితి. ఒక పక్క తనకి ఒంట్లో బాలేక హాస్పిటల్ లో ఉంటే తనని ఒక్కదాన్నీ బిక్కుబిక్కు మని ఈ హాస్పిటల్ లో ఒదిలేసి భోజనానికెళ్లడానికెలా మనసొప్పిందసలు?"

ఒక పక్కకి ఒరిగి దిండు తడిసిపోయేలా ఏడుస్తూ ఎంతసేపుండిపోయిందో తెలీదు.

శేఖర్ డాక్టర్ తో బాటూ లోపలికి వచ్చేడు.

"అదేవిటి డాక్టర్! నాకు ఏవీ లేదే. నన్నెందుకు పరీక్ష చేయించుకోమంటున్నారు?" అన్నాడు.

తన్మయి ఒక్కసారిగా విసురుగా చూసిందతని వైపు. అంటే ఈ వ్యాధి తనకి ఎలా సోకినట్లని అతని అభిప్రాయం?

తన మీద తనకే అసహ్యం వేసింది. అతనితో మాట్లాడడం కూడా ఇష్టం లేనట్లు కళ్లు మూసుకుంది.

"ఇద్దరూ కోర్సు వాడాలి. ఒక్కొక్కసారి ఎవరు బలహీనంగా ఉంటే వాళ్లకి ముందు బయటపడుతుంది" అంది డాక్టరు.

ఇంతలో బిలబిలామంటూ శేఖర్ చుట్టాలు లోపలికి వచ్చారు. తన్మయికి సిగ్గుతో చచ్చిపోయినట్లుంది.

వస్తూనే "కాస్త జ్వరానికే ఆసుపత్రిలో జాయినయ్యిపోయేరా? పెళ్ళాం ఎలా చెబ్తే అలా వినడం మానెయ్యాలిరా నువ్వు" అని ఉచిత సలహా ఇచ్చింది అతని పిన్ని.

"హాస్పిటల్ లో చేరినది బానే ఉంది ముఖం తేటగా. నీ కళ్లేవిట్రా లోతుకుపోయేయి. అసలేమైనా తిన్నావా, లేదా?" అంది మరొకామె.

తన్మయికి వాళ్ల మాటల వల్ల మరింత బాధ పెరిగింది.

అంతా వెళ్ల బోతూంటే శేఖర్ "నేనూ వస్తాను." అని వాళ్లని సాగనంపడానికి వెళ్లేడు.

శేఖర్ తాతయ్య మాత్రం "నేను తర్వాత వస్తాను" అని చెప్పడం వింది.

తన్మయి పక్కకి స్టూలు జరుపుకుని కూచున్నాడు తాతయ్య.

మంచం మీద పడుకుని కళ్ళు దించుకుని గోళ్లవైపు చూసుకుంటున్న తన్మయి తో

"అమ్మాయ్, వీడు అనుకున్నంత పనీ చేసేడన్న మాట. డాక్టరు ఇందాక నాతో చెప్పింది.

ఎలా వేగుతావో ఏవిటో, వీడు మంచోడు కాదమ్మా, కాస్త అదుపులో పెట్టే బాధ్యత నీదే ఇక." అన్నాడు.

ఆ మాత్రం మాట్లాడే వాళ్లే కనబడక తన్మయి కి దు:ఖం తన్నుకు వచ్చింది.

"ఏడవక, ఏం చేస్తావు మరి! సర్దుకుపోవాలి. గుడ్డిలో మెల్ల ఏవిటంటే ఇది కోర్సు వాడగానే తగ్గిపోతుందని చెప్పింది డాక్టరు. జీవితాంతం తగ్గనివి కూడా ఉంటాయి కొన్ని. అలాంటివేవీ కానందుకు సంతోషించాలి." అన్నాడు.

తన్మయి ఏడవడం తప్ప, మాట్లాడక పోవడం చూసి

"ఊరుకో, ఊరుకో" పెద్ద నిట్టూర్పు విడిచి బయట గుమ్మం దగ్గిరికి వెళ్లి నిలబడ్డాడాయన.

“శేఖర్కి ఇతర స్త్రీలతో సంబంధాలా? తనమీద తనకే కంపరం పుడుతోంది. ఎంత అపురూపంగా ప్రేమించింది తను! అందుకు అతనిచ్చిన బహుమానం ఇదా! అతన్ని ఇక తను ఎప్పటికైనా ముట్టుకోగలదా?" తెరిపిన పడని దు:ఖానికి, తెగని ఆలోచనలకి బందీ అయ్యి విలవిల్లాడుతూంది తన్మయి మనసు.

బయటి నుంచి కాస్సేపటిలో తిరిగొచ్చేడు శేఖర్. "తాతయ్యని దించి వస్తాను." అని గోడ వైపు తిరిగి ఏవీ మాట్లాడకుండా ఉన్న తన్మయి చేతికి జేబులో నించి ఒక ఉంగరం తీసి తొడిగాడు.

ఫ్రెండు దగ్గిర చీటీ కట్టిన డబ్బులొచ్చేయి. "బావుందా?" అన్నాడు.

అప్పటికీ తన్మయి ఇటు తిరగక పోవడం చూసి, "నా ఖర్మ, ఏం చేస్తాను? నాబతుకింతే. అన్నిటికీ ఎదవ అలకలు. ఏం మునిగిపోయిందిపుడు?" విసుక్కుంటూ వెళ్లిపోయేడు.

"ఏం మునిగిందా? నన్నే ముంచావు." తన్మయి కి గట్టిగా అరవాలని ఉంది. గోడల్ని చీల్చి అతని గుండెని బాది అడిగే పదమేదైనా ఉంటే దానితో అరవాలని ఉంది.

ఒక్కతే మిగిలి ఉన్న ఆసుపత్రి గదిలో ఒంటరిగా తిరిగే ఫ్యాను తన్మయిలాగే గొణుక్కుంటున్నట్లు చిన్నగా శబ్దం చేస్తూంది.

ఏడుస్తూనే ఎంత సేపు నిద్రపోయిందో తెలీదు. శేఖర్ వచ్చి లేపేడు.

తన్మయి వైపు చూస్తూ "ఇంటికి మీ నాన్న ఫోను చేసేరు. మీ అమ్మమ్మకి సీరియస్ గా ఉందట." అన్నాడు.

ఒక్క సారిగా గాభరాగా లేచింది తన్మయి.

"అదేవిటీ, ఏవైంది?" అంది దు:ఖంగా.

అసలతని తో మాట్లాడకూడదనుకుంది. కానీ ఇంకేమీ తన్మయి మనస్సులో తట్టడం లేదు.

తన్మయి సంతోషమే తనదని అనుకునే నరసమ్మ హాస్పిటల్ లో ఉన్నట్లు అనిపించగానే తన్మయికి జ్వరం ఇంకాస్త ఎక్కువైన ట్లనిపించింది. అయినా ఎక్కడ లేని ఓపిక కూడదీసుకుని కూచుంది.

తన్మయి ఏదో అనబోతుండగా "డాక్టరుతో మాట్లాడి డిశ్చార్జి చెయ్యమని అడుగుతాను. ఆ మందులేవో నీతో పట్టుకెళ్లు. ఫస్ట్ బస్సుకి బయలుదేరు. నిన్ను దించి రావడానికి పెద్ద మావయ్య వస్తారు. నాకు ఇక్కడ చాలా పనుంది." అన్నాడు.

అయిదారుగంటల ప్రయాణం ఎలా చేసిందో అర్థంకాలేదు తన్మయికి.

దారంతా ఏడుస్తూనే ఉంది. వెనకెక్కడో సీటులో కూచున్న శేఖర్ మావయ్య బస్సు దిగుతున్నపుడు "ఏడకమ్మా, ఏం చేస్తాం? " అన్నాడు.

బస్టాండుకి వెళ్లకుండా వీథి చివరే బస్సు దిగేసేరు.

దూరం నించి ఇంటి ముందు అంత మంది జనాన్ని చూడగానే తన్మయి మనసు కీడు శంకించింది. ఒక్క పరుగున వచ్చి పడింది.

వాకిట్లో నరసమ్మ శవాన్ని చూడగానే భోరున మీద పడింది. అసలే జ్వరంగా ఉందేమో వొణుకుతో కూడిన దు:ఖం తో కుమిలి కుమిలి ఏడ్చింది. అప్పటి వరకూ నిశ్శబ్దంగాఉన్న జ్యోతి కూతుర్ని పట్టుకుని తనూ గట్టిగా ఏడవడం మొదలు పెట్టింది.

తన్మయి కోసం బస్టాండుకి వెళ్లేడు భాను మూర్తి. వీళ్లు వీథి చివరే బస్సు ఆపుకుని దిగిపోయినట్లు చెప్పడానికి శేఖర్ మావయ్య మళ్లీ బస్టాండుకి బయలుదేరేడు.

బంధువులు అంతా వచ్చేరని రూఢి కాగానే శవయాత్ర మొదలైంది.

తన్మయి తన గుండె ని ఎవరో తీసుకెళ్ళిపోతున్నట్లు విలవిల్లాడింది.

★★★

పెళ్లైన దగ్గర్నించీ ఎదురవుతున్న అపశకునాలూ, ఉపద్రవాలూ ఒక్కొక్కటిగా గుర్తుకు వచ్చి బాధ పదింతలయ్యింది. కళ్ళల్లో జీవం లేకుండా ఒక్క రోజులో పది లంఖణాలు చేసినట్లు,అన్నీ కోల్పోయిన దానిలా నిస్తేజంగా తయారైంది తన్మయి.

మూడో రోజు కి మొత్తం బంధు గణం వచ్చేరు.

దేవి వస్తూనే "ఎలా ఉన్నారమ్మా? శేఖర్ కి పనుందట తర్వాతెప్పుడైనా వస్తాడు." అంది దగ్గరికి వచ్చి.

తన్మయి మౌనంగా విని ఊరుకుంది.

తన్మయికి ఊహ తెలిసాక ఇంట్లో మొదటి మరణం అది.

"బతికున్నంత సేపూ అమ్మమ్మ వెచ్చని శరీరం చనిపోగానే ఎంత చల్లగా అయిపోయిందో తల్చుకుంటే ఒళ్ళు జలదరిస్తూంది. అదే గామోసు జీవం లేకపోవడమంటే. మరణం అంటే బూడిదగా మిగలడమేనా? శరీరమంటే ఒకనాడు నిప్పుల్లో కాలిపోయేదేనా?" ఆలోచనలతో తన్మయికి తల వేడెక్కి పోతూంది.

"నరసమ్మ బతికున్న చివరి క్షణాలన్నీ మనవరాలినే కలవరించింది పాపం"

"రాత్రనగా ఫోను చేస్తే పిల్లని మధ్యాహ్నానికి పంపించేడు. పిల్ల చివరి చూపు అందుకోలేకపోయింది." జ్యోతి ఈసడింపు గా అనడం విని

"మీ అమ్మాయిని అబ్బాయి కూడా పంపడం మానేసి ఇక్కడే ఉంచుకోకపోయేరా మరి?" అని అంటించింది దేవి.

ముక్కు చీదుతున్న జ్యోతిని ఊరడిస్తూ "అయిపోయిందానికి ఏడ్చి ఏం ప్రయోజనం?" అని హితవు చెప్పేరెవరో.

చుట్టూ ఎవరేం మాట్లాడుతున్నా తన్మయి చెవికి ఏవీ ఎక్కడం లేదు. మతిపోయినదానిలా కూచుని హాల్లో అమ్మమ్మ ఫోటోని చూస్తూంది.

★★★

పదకొండో రోజుకి అంతా నరసమ్మ ని మరిచిపోయినట్లు, మరణం అతి సహజమైనదన్నట్లు కనిపించేరు తన్మయికి.

ఆ రోజు పెద్దరోజు కావడంతో అటూ ఇటూ తిరుగుతూ వంటల దగ్గర పురమాయిస్తూంది జ్యోతి.

తల్లి లేకపోతే విపరీతంగా దిగులు పడిపోతుందనుకున్న జ్యోతి అంత త్వరగా తేరుకోవడం తన్మయికి చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

పది రోజులుగా ఏవీ సరిగా తినక, తన్మయి తల స్నానం చేసొచ్చి నీరసంగా గోడకి జేరబడింది.

ఇంటి నిండా సాంబ్రాణి, అగరొత్తుల పొగ నిండి పోయింది.

తన్మయి ముఖంలో విచారం, బాధ కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. నరసమ్మ పటం వైపే చూస్తూ కూచుంది.

"పూల దండ, పెద్ద కుంకుమ బొట్టు. అమమ్మ ముఖానికి బొట్టు ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు ఫోటోకి బొట్టు పెడితే అమ్మమ్మ ముఖం ఎంతో బావుంది. జీవితమంతా అలిసిపోయిన ముడుతల చెంపలు, మనుషుల మనస్సుల్ని చదవగలిగే చురుకైన కళ్ళు. తన కళ్ళు అచ్చు అమ్మమ్మవే అని అందరూ అంటూంటారు."

చిన్న పిన్ని పక్క గదిలో సామాన్ల లో తిరుగుతూ నరసమ్మ పెట్టెని తీసి చూసి "దీంట్లో అన్నీ కొత్త చీరలే ఉన్నాయర్రా" అని బైటికి పట్టుకొచ్చింది.

నిమిషంలో “ఇది నాకు, అది నీకు” అంటూ అంతా పంచేసుకున్నారు.

ఎప్పటి నుంచి దాచిందో ఏమో, అన్నిటికన్నా అడుగున చిన్న డబ్బు సంచీలో అన్నీ కొత్త నాణేలు పోగు చేసింది. జ్యోతి వచ్చి నవ్వుతూ లోపలికి పట్టుకెళ్లింది.

ఆ కింద తన్మయి, శేఖర్ ల పెళ్ళి ఫోటో ఉంది. అది చూడగానే తన్మయి మళ్లీ కన్నీరు మున్నీరయ్యింది.

భానుమూర్తి కూతురి దగ్గరకు వచ్చి "మరీ అంత బాధ పడకమ్మా, పెద్దవాళ్లన్నాక ఇవన్నీ సహజం" అన్నాడు అనునయంగా .

సాయంత్రం పంపకాల తంతు మొదలయ్యింది. బంగారాలూ, ఆస్తులూ పంచడానికి కుల పెద్దలు వచ్చేరు.

"ఈ గొలుసు కన్నా గాజులు బరువున్నాయి, ఈ ఇంటికంటే చిన్న కొట్టు విలువైంది, అక్కడ భూమి నాకొద్దు" రకరకాల మాటలు తన్మయి చెవిన పడ్తూ ఉన్నాయి.

పటం ముందు దీపం వెలుతురుగా, అగరొత్తుల పొగగా మారిపోయిన నరసమ్మని చూస్తూ దు:ఖపు కళ్ళతో వెక్కి వెక్కి పడ్తూన్న తన్మయికొక్కదానికే నరసమ్మ బంధువైనట్లు, తమకేమీ కానట్లు అంతా గట్టి గొంతులతో డబ్బు పంపకాల కీచులాడుకుంటూన్నారు.

తన్మయికి జీవితం అంటే ఇంతేనన్న స్పృహ మొదటిసారి కలిగింది.

"జీవించి ఉన్న కాలంలో ఎన్నెన్ని అనుభవాలూ! చనిపోగానే ఏదీ తనది కాని ఈ ప్రపంచంలో కాస్త జీవితానికి ఎందుకీ పోట్లాటలు?"

పదకొండో రోజుకి కూడా శేఖర్ తల్లి వచ్చింది కానీ శేఖర్ రాలేదు. బంధువులంతా అడగడమే.

"మంచి రోజు చూసి మా ఇంటికి పంపించండి. మా కోడలు మా ఇంట్లోనూ నాలుగు రోజులు గడపాలిగా. మా అబ్బాయి తీరికైనప్పుడు వచ్చి తీసుకెళ్తాడు. అన్నట్లు మంచం లేక బాగా ఇబ్బంది పడ్తున్నారు." అని సాగదీసింది దేవి.

ఆవిడలా వెళ్లగానే జ్యోతి ముక్కు చీది ఏడవడం మొదలు పెట్టింది. "మహాతల్లికి చావింట్లో కూడా సారె గురించే ఆలోచన. ఈ మనిషికి అప్పుడనగా చెప్పేను. ఆ మంచం, కుంచం వాళ్ల ముఖాన పడెయ్యమని. ఎవరో స్నేహితుడి దుకాణవంట. కూతురికి దాబుగా మంచం చేయించాలట. ఏదో ఒక మంచం చేయించి పడెయ్యరాదూ!"

"నేనేం చేసేను మధ్యలో" అని కండువా దులుపుకుని బయటికెళ్ళి పోయేడు భాను మూర్తి.

తన్మయికి ఇవేవీ వినాలన్న ఉత్సాహమూ, ఆసక్తీ లేవు.

ఒక్కతే డాబా మీదికి వెళ్ళి సన్నజాజి పందిరి లో కూచుంది.

"ఎన్నో కలలతో మొదలు పెట్టిన తన జీవితం చేదు గుళికగా మారింది. ప్రాణంగా ప్రేమించిన శేఖర్ తనని మోసం చేసేడు. ప్రాణమైన అమ్మమ్మ చచ్చిపోయింది. తల్లిదండ్రులు, అత్తమామలు సారెల గోలతో ఇంకిలాగే తిట్టుకుంటూ ఉంటారు. ఇంకేం మిగిలుందీ ప్రపంచంలో."

కళ్ళు మూసుకుని కూచుంది.

"శేఖర్ తనతో ప్రేమ నడుపుతూనే ఇతర స్త్రీలతో తిరుగుతున్నాడన్న మాట ఇంత కాలం. తనెంత మోసపోయింది! అమ్మా,నాన్నలకి కూడా ఇష్టం లేని పెళ్లి ఇది.”

మనస్సులో ముళ్ళు గుచ్చుతున్నట్లు బాధకలుగుతూంది. తన్మయి పరిస్థితి ఎవరికీ చెప్పుకోలేని దయ్యింది.

తల్లితో పొరబాటున ఇవన్నీ చెప్పినా" నేను ముందే నెత్తి మొత్తుకున్నాను. ఆ కుర్రాణ్ణి ఇంటికి రానివ్వొద్దని...అంటూ మొదలు పెడ్తుంది."

"పోనీ... తను కూడా చచ్చిపోతే!"

ఆలోచన రాగానే నడుములో వణుకు మొదలయ్యింది. సముద్రంలో మునిగిపోయినప్పుడు భయం గుర్తుకొచ్చింది.

"విగత జీవురాలైన అమ్మమ్మ స్థానంలో తనని ఊహించుకోవడానికే కష్టంగా ఉంది. అయినా సరే. నిర్ణయం మార్చుకోకూడదు. ఈ పనికిమాలిన జీవితం కంటే చావే మేలు." దృఢంగా అనుకుంది.

పక్కనే ఉన్న పుస్తకం తెరిచి "అజ్ఞాత మిత్రమా!" అని మొదలు పెట్టింది.

ఎంతసేపైనా అసలు అక్షరం కూడా రాయలేక పోయింది.

చివరికి పెద్ద అక్షరాలతో పేజీ అంతా నిండేలా "సెలవు" అని రాసింది.

చచ్చిపోదామని నిర్ణయించుకున్నాక మనసు తేలిక పడింది.

ముందున్న సమస్యలన్నీ చిన్నవిగా కనబడసాగేయి. హమ్మయ్య తనకి విముక్తి దొరకబోతూంది. చిన్న సంతోషం కలిగింది.

డాక్టరు ఇచ్చిన మందుల వల్ల వారంలో తనకి పూర్తిగా నయమయ్యింది.

అయినా చచ్చిపోవాలనుకున్నపుడు శరీరం ఏమైపోతే తనకేం? ఎలాగూ బూడిదయ్యేదేగా.

తను చచ్చిపోతే ఎవరెవరు బాధ పడేవాళ్లున్నారా అని ఆలోచించింది.

శేఖర్ కి తన మీద ఎలాగూ ప్రేమ లేదు. కించిత్ కూడా బాధ పడకుండా మరో పెళ్ళి చేసుకుంటాడు. అమ్మా, నాన్నా కొన్నాళ్లు బాధ పడ్తారు. తర్వాత మర్చిపోతారు. వనజ బాగా బాధపడ్తుంది. కానీ తన జీవితం తనకూ ఉంది కాబట్టి తను కూడా మర్చిపోగలుగుతుంది. వీళ్లందరికీ ఎలా ఉన్నా, తను ఈ ప్రపంచం నుంచి బయట పడుతుంది.

తను కలలు గన్న పీహెచ్ డీ లక్ష్యమూ.. ఇవన్నీ శేఖర్ తో ఎలాగూ తీరేవిగా లేవు.

ఎప్పుడూ లేనిది పూల వాసనకి కడుపులో బాగా తిప్పుతున్నట్లు అనిపించసాగింది. కిందకు రాగానే పెద్ద వాంతి చేసుకుంది.

"పది రోజుల్నించీ ఏవీ తినడం లేదు మరి- అని ఇలారా" అని పక్కకు తీసుకెళ్లింది జ్యోతి.

ఏవేవో ప్రశ్నలడగడం, తన్మయి చెప్పడం పూర్తయ్యాక డాక్టరు దగ్గిరికి యూరిన్ పరీక్షకి తీసుకెళ్లేరు తన్మయిని.

శుభవార్త తో ఇంట్లో అంతా సందడి నిండి పోయింది తన్మయి హృదయంలో తప్ప.

"చచ్చిపోవాలని నిర్ణయించుకున్న తన కడుపులో బిడ్డ ఎదుగుతూందా?" నిస్త్రాణగా కూచుండిపోయింది.

పొట్ట మీద తడుముకుంది. ఒక్క సారిగా మనసు, శరీరం తెలీని ప్రేమతో నిండిపోయాయి.

"తను చచ్చిపోతే నిష్కారణంగా.... ఛీ.... ఛీ.... .తనంత దుర్మార్గురాలు కాదు.

ఇక తను ఆలోచించవలసింది జీవంపోసుకుంటూన్న బిడ్డ గురించి ఇక మరే విషయం గురించీ కాదు."

లేచి ముఖం కడుక్కుంది. కళ్లకి కాటుక పెట్టుకుని, తిలకం దిద్దుకుంది. జుట్టు దువ్వుకుని వదులుగా జడ వేసుకుంది.

కూతురిలో మార్పు చూడగానే బుగ్గలు పుణికింది జ్యోతి "అమ్మమ్మ నీ కడుపున పుట్టబోతూంది."

దేవికి ఫోను చేసి చెప్పింది జ్యోతి.

వార్త తెలిసినట్లుంది. రాత్రి నిద్ర పోవడానికి ముందు శేఖర్ ఫోను చేసేడు.

"నీకు ఆరోగ్యం మీద శ్రద్ధ లేదు. కనీసం ఇక్కణ్ణించైనా బాగా తిను. నాకు కొడుకు పుట్టబోతున్నాడు. నువ్వు జాగ్రత్తగా ఉండాలి. ఊరికే మేడ మీదికి కిందికి తిరగకు. అడ్డమైన రాతలు మానెయ్యి ..."

అవతల్నించి ఎంతో సంతోషంగా వినిపిస్తున్న శేఖర్ స్వరం వింటున్నా తన్మయికి ఉత్సాహం కలగడం లేదు.

"నువ్వెప్పుడొస్తున్నావ్?" అంది గొంతు పెగుల్చుకుని.

"నేను మీ వాళ్లు సారె ఇచ్చేంత వరకూ రాకూడదని నిర్ణయించుకున్నాను. రేపో, ఎల్లుండో మా ఇంటి నించి ఎవరైనా వచ్చి నిన్ను తీసుకెళ్తారు. మా అమ్మ ఈ వార్త విన్నప్పట్నించీ కోడల్ని తన దగ్గిర ఉంచుకుని కొన్నాళ్లు చూసుకోవాలని ముచ్చట పడ్తూంది." అన్నాడు .

ఓపిక లేనట్లు కూలబడింది తన్మయి మళ్లీ.

★★★

మర్నాడు నిద్ర లేచే సరికి తల తిరగడం మొదలయ్యింది. ఏం వాసనా పడడం లేదు. ఏం తాగినా బయటకు వచ్చేస్తూంది.

తన్మయికి ఇష్టమని జ్యోతి కమ్మగా వేయించిన బియ్యంతో నూకల జావ తీసుకు వచ్చింది. కాస్త తాగగానే మళ్లీ కడుపులో తిప్పడం మొదలైంది. దేవి కోడల్ని తీసుకెళ్లడానికి వస్తామని ఫోను చేసింది.

"తన్మయిని ఈ పరిస్థితుల్లో పంపడం ఇష్టం లేదమ్మామాకు. నాలుగో నెల వచ్చి, వేవిళ్ళు తగ్గేక పంపుతాంలెండి." అంది ఖరాఖండీగా జ్యోతి.

## 13

నిద్రలేవడం తోనే అలిసిపోయినట్లుగా అయ్యి కాస్సేపటిలోనే మళ్లీ నిద్రపోతూంది తన్మయి.

మెలకువగా ఉన్నంత సేపూ కడుపులో తిప్పడం వల్ల ఏమీ తినలేక, ఏ వాసనా నచ్చక, లేచిందగ్గర్నించీ కళ్లు తిరుగుతున్నట్లే అయ్యిసరిగా తినడం మానేసింది.

పీక్కుపోయిన కూతురి ముఖాన్ని, చెంపల్నీ రాస్తూ పక్కన వచ్చి కూచుంది జ్యోతి.

ఏదో మాట్లాడబోయే సరికి దు:ఖం తన్నుకు వచ్చింది తన్మయికి.

"అమ్మా, ఇక వెళ్లను అతని దగ్గిరికి" మనసులో సుళ్లు తిరుగుతున్న మాటలు గొంతులోకి రానివ్వకుండా ఏడుస్తూ ఉండిపోయింది.

కూతురి దు:ఖాన్ని మరో విధంగా అర్థం చేసుకున్న జ్యోతి "ఏడవకమ్మా, శేఖర్ ఏదో పనిలో ఉండి రాలేకపోయుంటాడు. నాన్నగారితో మళ్లీ ఒక సారి ఫోను చేయిస్తాలే" అంది అనునయంగా.

ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దు:ఖంతో గోడ వైపు తిరిగి ముసుగు పెట్టుకుని లోపల్లోపలే వెక్కి వెక్కి పడ్తూ పొట్ట మీద చెయ్యి వేసి తడుముకుంది. మెల్లగా గొణుగుతున్నట్లు కడుపులోని బిడ్డతో మాట్లాడడం మొదలు పెట్టింది.

తన చేతి వేళ్ల స్పర్శ నుంచి తనలో దాగున్న చిన్ని ప్రాణి తన మాటల్ని, తన మనసుని చదువుతున్నట్లు భ్రాంతి కలిగింది.

"బంగారూ! నువ్వు అమ్మాయివో, అబ్బాయివో తెలీదు నాకు.  ఎవరైనా నువ్వు నాకు బంగారువే. నీతో ఎన్నో చెప్పాలి. నీకు మాత్రమే చెప్పగలిగిన కష్టాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడిప్పుడే  ప్రాణం పోసుకుంటున్న పసికూనవి నీకర్థమవుతాయా? సర్లే, హాయిగా బజ్జో. మనిద్దరం ఇక రేపట్నించీ  కబుర్లు చెప్పుకుందాం. నా బాధలు నీకెందుకు గానీ, నీకు మంచి మంచి కబుర్లెన్నో చెపుతాను. సరేనా?!" అంది.

నిజంగా తనలో ఎవరో చెవి ఒగ్గి విని ఊకొట్టినట్లనిపించి దు:ఖం లోంచి వెంటనే తేరుకుంది. గొప్ప ఊరటగా, సంతోషంగా అనిపించింది.

ఒక్కటి మాత్రం అర్థం అయ్యింది. ఇక తనీ ప్రపంచంలో ఒంటరిది కాదు. తనకి తన కడుపులోని బిడ్డ తోడు.

“అవును. తన కడుపులో పెరుగుతున్న పసిప్రాణి తో మనసు విప్పి మాట్లాడుకోవచ్చు. తనకి నచ్చినట్లు హాయిగా పుస్తకాలు చదివి వినిపించొచ్చు. తనకి బిడ్డ పుట్టేక పాటలు, ఆటలతో జీవితం ఎంతో హాయిగా గడిచిపోతుంది.” తన్మయికి కష్టాలన్నీ గట్టెక్కిపోయిన ఆనందం కలిగింది.

“ఇక ఎప్పుడూ ఇలా తనలో తను కుమిలి పోకూడదు. ధైర్యంగా ఉండాలి. ఈ బిడ్డ ని సురక్షితంగా ఈ భూమి మీదకు తీసుకురావడం ఒక్కటే ఇక తన లక్ష్యం.”అని నిర్ణయించుకుంది.

తన బిడ్డకు తను, తనకు తన బిడ్డ ఒకరికొకరు ఆలంబనలు. తననీ ఇలాగే కడుపులో పెంచి ఈ అనురాగాన్ని పంచుకున్న అమ్మ మీద ఒక్కసారిగా ప్రేమ పదింతలైంది.

వంటింటిలో కూరగాయలు తరుగుతున్న జ్యోతి పక్కనే చేరి భుజానికానుకుంది.

"ఏమ్మా, ఏవైనా తింటావా?" అంది జ్యోతి.

ఏమీ మాట్లాడకుండా కళ్లు మూసుకుంది తన్మయి. మనస్సంతా తల్లి మీద కృతజ్ఞతా భావం నిండిపోయింది.

"అమ్మా, నాకొక జీవితాన్నిచ్చినందుకు నీకు ఎలా ధన్యవాదాలు చెప్పుకోను? నాకూ ఒక పాపాయి పుట్టబోతూ ఉంది. ఎంత సంతోషంగా ఉందో చెప్పలేను. నీకూ ఇలాగే సంతోషంగా ఉండి ఉంటుంది కదూ" అనుకుంది మనస్సు లో.

పైకి మాత్రం "కాస్సేపు వచ్చి నా పక్కన పడుకోమ్మా" అంది.

"అలాగే. నీకిష్టవని దొండకాయ వేపుడు చేస్తున్నాను. కూర వేగగానే వస్తాను. నీకు అలసటగా ఉంటే కాస్సేపు పడుకో." అంది జ్యోతి.

★★★

వారంలోనే  శేఖర్ ఫోను చేసేడు.

కుశల ప్రశ్నల కంటే ముందు  "ఎప్పుడెళ్తున్నావ్ మా ఇంటికి?" అనడిగాడు.

ఆ ప్రశ్న వినగానే ఉన్న నీరసం రెండింతలు పెరిగినట్లయ్యింది తన్మయికి.

తన్మయి ఏదో చెప్పబోయే లోగా "ఇలా చూడు. నీకిప్పుడు పెళ్లయ్యింది. నీకు నీ భర్త కుటుంబం అంటూ ఒకటుంది. వాళ్ల దగ్గిర ఉండాల్సిన బాధ్యత నీకుంది. ఇవన్నీ ఆలోచించకుండా ఇంకా అమ్మ దగ్గిర పాలు తాగుతానంటే ఎలాగనుకుంటున్నావు?" అన్నాడు.

శేఖర్ దురుసు మాటలకి తల మరింత వేగంగా తిరగడం మొదలు పెట్టింది.

ఏమనుకుంటే అనుకున్నాడని ఫోను వెంటనే పెట్టేసింది.

మళ్లీ వెంటనే మోగుతున్న ఫోనుని ఈసారి జ్యోతి తీసింది.

అట్నించి దేవి మాట్లాడుతున్నట్లు అర్థం అయ్యింది తన్మయికి.

ఫోను పెట్టేసి, "ఇదేం మనుషులు బాబూ! ఒకపక్క పిల్ల వేవిళ్లతో సతమతమైపోతూంటే, "మా కోడల్ని మా ఇంటికి పంపించక పోతే కుదరదని" గొడవకొస్తూంది మహాతల్లి. ఆ కుర్రాడికైనా బుద్ధుండొద్దూ! అమ్మ ఏవంటే దానికల్లా తందాన తాన అనుకుంటూ...ఛీ.. ఛీ.. వెళ్లి వెళ్లి వీళ్ల ఎదాన పడ్డాం." జ్యోతి గట్టిగా విసుక్కుంటూ వంటింట్లో గిన్నెలు దభాలున ఎత్తి కుదేయడం మొదలు పెట్టింది.

భానుమూర్తి నిశ్శబ్దంగా గోడకి జేరబడి చూస్తూ "పోనీలే. వాళ్లకీ అమ్మాయిని కొన్నాళ్లు చూసుకోవాలని ఉందేమో. నాల్రోజులు పంపించి మళ్లీ తెచ్చుకుందాం. అయినా ఎంత దూరం? మళ్లీ వారంలోనే పంపించమని అడుగుదాం. గొడవలెందుకు చెప్పు మనకి" అన్నాడు సాలోచనగా.

తన్మయి ఇవేవీ ఆలోచించే స్థితిలో లేదు.

ఎవరైనా లేపి కూచోబెట్టి కాస్త తినిపిస్తే తినడం, లేకపోతే పడుకోవడం. తన నాడి కొట్టుకోవడం తనకి స్పష్టంగా వినిపిస్తూంది.

జ్యోతి ముడుచుకుని పడుకున్న తన్మయి వైపు చూపిస్తూ ఏది ఏవైనా సరే "ఇలా వేళ్లాడి పోతున్న పిల్లని అస్సలు పంపను. ఇక మీద వాళ్లు ఫోను చేస్తే మీరే సమాధానం చెప్పుకోండి" అంది గట్టిగా.

★★★

మూడవ నెల దాటగానే కాస్త వాంతులు తెరిపిన బడ్డాయి. నిద్ర మాత్రం మామూలుగానే ఎప్పుడంటే అప్పుడు వస్తూంది. ఏదో కూపస్థ దశలో ఉన్నట్లు అనిపించసాగింది తన్మయికి. అన్ని వాసనలూ ఇంకా పడడం లేదు కానీ కాస్త తనంతట తను లేచి తిరగసాగింది.

శేఖర్ మధ్య మధ్య ఫోను చేసి గొడవ పెడ్తూనే ఉన్నాడు.

తల స్నానం చేసి తలారబోసుకోవడానికి వీధి వరండాలో కూచుంది తన్మయి. లేత సూర్యుని కిరణాలు వెచ్చగా తగులుతూ హాయిగా ఉంది.

"పోస్ట్" అన్న కేకా, వాకిట్లో వనజ చేతిరాతతో ఉత్తరం చూడగానే ఆనంద తాండవం చేసింది తన్మయి మనసు.

ప్రియాతి ప్రియమైన తనూ!

ఎలా ఉన్నావు అని అడగను. ఎందుకంటే నీకు ఎంతో నచ్చిన జీవిత భాగస్వామితో, నీ కలల నగరంలో హాయిగా ఉంటున్నావు కాబట్టి. నీ జీవితం ఎంత ఆనందదాయకంగా ఉందో ఊహించగలను. ఎందుకంటే స్నేహితురాలినే మరిచిపోగలిగేవు కదా! ఊ..చెప్పు...విశాఖపట్నం, సముద్రం, కొత్త కాపురం... అన్నీ చకచకా చెప్పేసెయ్యి.

ఇక నా విశేషాలంటావా? ఉదయం ఆఫీసుకి శ్రీ వారు వెళ్లి వచ్చే దాకా ఎంబ్రాయిడరీలు, పుస్తకాలు చదూకోవడం. సుధా సాంగత్యంలో రోజులు తెలీడం లేదంటే నమ్ము. ఇక్కడ భాష, సంస్కృతులు వేరైనా మనుషులు చాలా మంచి వాళ్లు. మా ఇంటిగలావిడకి పిల్లలంతా ఎక్కడో దూరాన స్థిరపడ్డారు. ఒక్కతే ఉంటుందేమో నన్నే కూతురిలా చూస్తుంది. ఇక సుధా అమ్మా, నాన్నా మాకు మరో అయిదారు

గంటల ప్రయాణపు దూరంలో ఉంటారు. వాళ్లు కూడా మంచి వాళ్లే. ప్రస్తుతానికి అన్నీ మంచి విషయాలే. అమ్మతో అప్పుడప్పుడూ బయటి నించి ఫోను మాట్లాడుతాను. మా ఇంట్లో ఫోను లేదింకా. చిన్న సంసారం కదా!

అన్నట్లు నీ ఎమ్మే విషయం ఎంత వరకూ వచ్చింది? యూనివర్సిటీకి అప్లై చేసావా? ఎంట్రెన్సు రాయాలనుకుంటూ. ప్రిపేర్ అవుతున్నావా?

నీ అడ్రసు తెలియక ఇక్కడికి రాస్తున్నా. ఇది త్వరలో నీకు చేరుతుందని ఆశిస్తాను. ఇపటికైనా కాస్త ఈ స్నేహితురాలిని కాస్త పట్టించుకోవమ్మా.

సదా ప్రేమతో

నీ

వన

ఇన్ లాడ్ లెటర్ మడిచి నీలి రంగు కాగితాన్ని ఆప్యాయంగా తడిమింది తన్మయి.

"తన జీవితంలో సంతోషం లేకపోయినా వనజైనా హాయిగా ఉంది అదే చాలు." అని నిట్టూర్చింది.

వనజలో తనకి బాగా నచ్చే విషయం తన పెద్దరికం. తన లాగా వలవలా ఏడ్చేయడం ఎప్పుడూ వనజలో చూడలేదు తను. తన కంటే కొంచెమే పెద్దదైనా తనకంత పెద్దరికం ఎలా వచ్చిందో ఆశ్చర్యం వేస్తుంది. "నువ్వెప్పుడూ నా కర్తవ్యాన్ని గుర్తు చేస్తావు. థాంక్స్ వనా!" అని మనసులోనే ధన్యవాదాలు చెప్పింది తన్మయి.

చదువులో తను సాధించాలనుకున్న లక్ష్యం దాదాపు గా మర్చిపోయింది. “విశాఖకి వెళ్లగానే వివరాలు కనుక్కోవాలి." అనుకుంది.

వనజకి ఉత్తరం రాద్దామని కూచుంది. ఏమని రాయాలి? ఎంత సేపు కూచున్నా రాయదగ్గ మంచి విషయం ఒక్కటీ కనిపించడం లేదు. తన జీవితంలో ఉన్న కష్టాలన్నీ ఏకరువు పెట్టి వనజకున్న సంతోషాన్ని కూడా చెడగొట్టడం ఇష్టం లేక ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. పాపం తనక్కడ వేచి చూస్తుందేమో. కానీ ఏమని రాయగలదు తను?

ఆలోచనలతోనే కాలం గడుస్తూంది తన్మయికి. “పుస్తకాలు చదువుదామంటే, తనకి నచ్చే పుస్తకాలు లైబ్రరీ నుంచి తెచ్చేవాళ్లెవరు?”

ఇంట్లో ఉన్న భగవద్గీత చదవడం మొదలు పెట్టింది. వ్యాఖ్యానంతో బాటూ ఉన్న శ్లోకాలు చదువుతూంటే ఎంతో సాంత్వన కలగసాగింది.

ఆ సాయంత్రం శేఖర్ ఫోను చేసాడు. ఏమో గానీ దిగులుగా మాట్లాడేడు. అతని గొంతులోని కాస్త దిగులుకే కరిగిపోయింది తన్మయి.

రెండ్రోజుల్లో అత్తవారింటికి ప్రయాణమయ్యింది. తన ముఖం లోకి దిగులుగా చూస్తూ "జాగ్రత్తమ్మా" అంటున్న తల్లికి "నేను ఇప్పుడు బానే ఉన్నానమ్మా. నువ్వేం దిగులు పడకు. అంతగా ఒంట్లో బాలేకపోతే వచ్చేస్తాలే" అంది.

"అన్నట్లు అల్లుడికి చెప్పు. నాన్నగారు మంచం, డ్రెస్సింగు టేబులు సాయంత్రం నవతా ట్రాన్స్ పోర్ట్ కి ఎక్కిస్తున్నారు. రెండ్రోజుల్లో అతన్ని వెళ్లి తెచ్చుకోమను." అంది జ్యోతి.

శేఖర్ తల్లి వెళ్లగానే అడిగే ప్రశ్నల్లో ఇదొకటి. తేలిగ్గా ఊపిరి తీసుకుంది తన్మయి.

స్వీట్లు, అరటి పళ్లు ఇంకా ఏవేవో కూతుర్తో బాటూ తీసుకొచ్చి అత్తవారింట్లో దిగబెట్టి వెళ్ళేడు భానుమూర్తి.

శేఖర్ ఆ సాయంత్రం రైలెక్కి తెల్లారగట్లకల్లా వచ్చేసేడు. మంచి నిద్దట్లో ఉన్న తన్మయిని తట్టి లేపుతూ "మొగుడు ఇన్ని నెలల తర్వాత వస్తే వాకిట్లో కాపలా కాయకుండా నిద్రపోతున్నావా నిద్ర మొహవా?" అన్నాడు నవ్వుతూ.

నిద్దట్లో ఉన్న తన్మయికి అది వ్యంగ్యమో, నిజమో అర్థం కాలేదు.

"ఎప్పుడెప్పుడు నువ్వు మా ఇంటికి వస్తావా, నేను వద్దామని అనుకుంటూంటే ఇన్నాళ్లు అమ్మగారింట్లో మకాం వేసేసేవా?" అన్నాడు మళ్లీ.

"మంచం అవీ పంపించేవని అమ్మ చెప్పింది. ఇక నువ్వు మా ఇంటికి రావొచ్చు." అంది తన్మయి.

"ఏవన్నావు మీ ఇల్లా!? అది మీ అమ్మ గారిల్లు. మీ ఇల్లంటే ఇది. ఇప్పుడు నువ్వున్నది. తెలుసుకో తెలివిమాలిందానా! అయినా మంచాలూ, కుంచాలూ ఇచ్చేసినంత మాత్రాన అయిపోదు. పెళ్లిలో మీ వాళ్లు చేసిన అమర్యాదకి జీవిత కాలం కోపగించినా సరిపోదు" అన్నాడు వెంటనే.

తన్మయి భగవద్గీతలోని స్థిత ప్రజ్ఞతా శ్లోకం గుర్తు తెచ్చుకుని లోపల్లోపలే బాధని అణచుకుంది.

"నా కొడుకు ఎలా ఉన్నాడు? సరిగా తిండి పెడ్తున్నావా లేదా? అసలే బక్కమ్మవి. ఇంకా బక్క చిక్కిపోయినట్లున్నావు." అన్నాడు పొట్ట మీద తడిమి.

అతని ధోరణిలో అతనేదే చేసుకుని పోతున్నా చలనం లేనట్లు ఒళ్లప్పగించింది తన్మయి.

★★★

వారం రోజుల్లో రెండు కొత్త సినిమాలకి ఇల్లంతా కలిసి వెళ్లేరు.

తన్మయికి అన్ని సినిమాలూ నచ్చవు. బాగా తల నెప్పి వచ్చెయ్యడం మొదలు పెట్టింది. ఇంటికి వస్తూనే కడుపులో "బుడుంగు" మని ఏదో కదిలి నట్లయ్యింది.

గడ్డలా ఉన్న కడుపు మీద గబుక్కున పట్టుకుంది. మళ్లీ కదిలింది.

తన్మయికి ఆనందం ఆకాశాన్నంటింది. “తన కడుపులో బిడ్డ కదులుతూంది!!” ఒక్క సారిగా గట్టిగా అరవాలనిపించింది. గమ్మత్తైన కొత్త అనుభవాన్ని ఎవరితోనైనా పంచుకోవాలని మనసు బాగా ఆరాటపడింది. ముందు గదిలో బాతాఖానీ లో ఉన్న శేఖర్ ని పిలిచింది.

"ఏవిటే, ఏదో వ్యాపారం విషయాలు మాట్లాడుకుంటూంటే" అన్నాడు విసుగ్గా.

"కడుపులో కొంచెం గాభరాగా ఉంది." అంది మెల్లగా.

అతను తన పొట్ట మీద చెయ్యి వేస్తే, ఆ చేతినలాగే పట్టుకుని "మన పాప కదులుతూంది చూడు" అనాలని ఎంతో ఆత్రపడింది తన్మయి.

"కూల్ డ్రింకే వైనా తాగుతావా తెప్పిస్తానుండు. సీరియస్ విషయాలు మాట్లాడుకుంటూంటే ఇందుకా పిలిచావు? ఇలాంటిదేదైనా మా అమ్మకి చెప్పొచ్చుగా" అంటూ వెళ్లిపోయాడు.

కడుపులో  మళ్లీ మళ్లీ కదులుతూన్న చోటల్లా పైన చెయ్యి వేస్తూ "ఏంటమ్మా! అన్ని మాటలూ వినేసావా? ఇవన్నీ పట్టించుకోకు. నేనున్నానుగా నీతో. మనిద్దరం కబుర్లు చెప్పుకుందాం" అంది ఆప్యాయంగా తడుముతూ తన్మయి.

అంతలో దేవి వచ్చింది "ఏవిటమ్మా, ఏదైనా ఇబ్బందిగా ఉందా?" అంటూ.

"లేదత్తయ్యా, కడుపులో కదులుతున్నట్లు ఉంది" అంది.

"నాలుగో నెల పడ్డాక పిల్లలు తన్నడం మొదలుపెడతారు. గాభరా పడకు. అన్నట్లు శేఖర్ రేపే బయలుదేరుతానంటున్నాడు. నిన్నూ పంపించమని అంటున్నాడు. నాలుగురోజులుండి వెళదామని నువ్వైనా చెప్పమ్మా" అంది.

ఆ రాత్రి శేఖర్ "నువ్వింన్నాళ్లూ అమ్మగారింట్లో మకాం వేసి బాగానే ఉన్నావు. అక్కడ నేను వండుకోలేక చస్తున్నాను. నాకు ఎక్కువ సెలవు లేదు. అన్నీ సర్దుకో, రేపు సాయంత్రం బండికి వెళ్దాం" అన్నాడు.

తన్మయికి లోపల్లోపల కాస్త సంతోషం కలిగింది. "వెళ్లగానే యూనివర్శిటీకి వెళ్లి రావాలి" అనుకుంది.

తల్లికి ఫోను చేసింది.

"అదేవిటమ్మా, ఇంకా ఓపిక చిక్కక ముందే మళ్లీ ప్రయాణం అంటున్నావు? అల్లుడు చెప్తే వినే రకం కాదు కదా. జాగ్రత్తగా ఉండు మరి." అంది జ్యోతి.

"సీమంతాలు అవీ మాకు ఆనవాయితీ లేవు. మీ అమ్మకి ముందే చెప్పమ్మ" పక్క నించి అంది దేవి.

ఆ మాటలు వినబడినట్లు "ఖర్చు తప్పడమే చూసుకుంటున్నట్టున్నది మహాతల్లి" అంది జ్యోతి.

ఫోను పెట్టేసేక కూడా తలపోటు తగ్గలేదు తన్మయికి వీళ్ల గొడవలకి.

★★★

మర్నాడు విశాఖపట్నంలో దిగగానే సంతోషకరమైన విషయం తెలిసింది తన్మయికి.

శేఖర్ తాతగారింట్లో అవుట్ హౌస్ పాతదైపోయిందని కూలగొట్టేసున్నందు వల్ల శేఖర్ బయటెక్కడో అద్దె ఇంటికి అడ్వాన్స్ ఇచ్చి వచ్చాడు.

"ఇల్లు మా తాతయ్య ఇంటికి దూరమైనా నా పనికి దగ్గరవుతుంది" అన్నాడు శేఖర్ తన్మయితో.

మెయిన్ రోడ్డు ని వదిలి చిన్న సందులు రెండు మూడు దాటి,  రోడ్డు కొంచెం కిందికి దిగే చోట గేదె ఒకటి కట్టేసి ఉంది. దాని పక్క నించి బండి వెళ్లే డౌన్ లోకి దిగారు. పక్కనున్న రెండు  పోర్షన్లలో ఒకటి.  ఇంటి ముందు సన్నని సిమెంటు వాకిలి ఉంది. ముందు వరండా గది. లోపల చిన్న మధ్య గది. వెనక వంటిల్లు, దాని వెనక బాత్రూము. నీళ్ల కుండీ.

గాలి వచ్చేందుకు మధ్య గదికి ఉన్న ఒకే ఒక్క కిటికీ వైపు గేదె కట్టి ఉన్నందు వల్ల ఎప్పుడూ అది తీయడానికి వీలుండదు.

ముందు వరండాలో సగానికి ఫెన్సింగు ఉండడం వల్ల బయటెవరు తిరిగినా ఇంట్లో వాళ్లు కనిపిస్తారు.

ఇక వంటిల్లయితే చీకటి గుయ్యారం. ఆ బయట ఉన్న బాత్రూముల దగ్గర పూర్తిగా రేకులతో మూసి ఉన్నందు వల్ల కుళాయినీళ్లు ఆరక చెమ్మగా ఉంది. బయట చిన్న డాబా పైకి వెళ్లేందుకు మెట్లు ఉన్నాయి. ఉన్నంతలో అదొక్కటే కాస్త ఊరట.

తన్మయికి ఇల్లు నచ్చలేదు. అదే చెప్పింది.

"నేనేమైనా జమీందారుననుకుంటున్నావా? నాకొచ్చే జీతంలో ఈ మహా నగరంలో ఈ మాత్రం తలదాచుకుందుకు చోటు దొరికింది సంతోషించు." అన్నాడు శేఖర్.

మర్నాడు సాయంత్రం నవతా ట్రాన్స్పోర్ట్ నించి మంచం, డ్రెస్సింగు టేబుల్ వచ్చాయి.

శేఖర్ వాళ్ల తాతగారింట్లో నించి పాత పరుపేదో తీసుకొచ్చి వేస్తూ "ఏం చేస్తాం, ఖర్మ. ఒక్కటే కూతురివి కదా, ఏదో దోచి పెట్టేస్తారనుకున్న నాకు ఇలాంటి శాస్తి జరగాల్సిందే" అన్నాడు.

పొద్దుట శేఖర్ బయటికి వెళ్లిపోగానే కాస్త వండుకు తినడం, ఇల్లు సర్దుకోవడం పనిగా పెట్టుకుంది తన్మయి. వంగి చేసే పన్లు, బరువు పన్లు చెయ్యొద్దని డాక్టరు చెప్పడం వల్ల రోజుకొక్కాస్త మెల్లగా చెయ్యడం మొదలెట్టింది.

ముదురు రంగు పాత చీరొకటి చింపి, చేత్తో కుట్లు వేసి బయట వరండా లో ఫెన్సింగుకి కర్టెన్లు కట్టింది.

తనెప్పుడో అల్లిన దారపు చిలకల పంజరం ఒకటి సామాన్ల లోంచి తీసి, వరండా లో గుమ్మం దగ్గిర వేళ్లాడ దీసింది.

మధ్య గదిలో గోడకున్న తలుపు ల్లేని అలమారా సొరుగుల్లో పేపర్లు వేసి, తన పుస్తకాలు, బట్టలు పొందికగా సర్దుకుంది.

వంటింట్లో చిన్న చిన్న సీసాల్లో శేఖర్ తెచ్చిన సరుకులు సర్ది పెట్టింది. గోనె సంచుల్లో ఉన్న అట్ల పెనం, మూకుళ్లు, గిన్నెలు, నీళ్ల బిందెలు రోజుకొకటి శుభ్రంగా కడగడం మొదలెట్టింది.

వారం రోజుల్లో చాలా వరకు పని తెమలింది.

పని మధ్యలో హఠాత్తుగా నిద్ర వస్తే పడుకోవడం అలవాటయినందువల్ల ఒక్కో సారి బద్ధకంగా అనిపించసాగింది. అలాంటప్పుడు మంచమ్మీద జేరబడి కడుపులో పాపాయితో కబుర్లతో గడపసాగింది.

ఆ రోజు పక్కింటి పోర్షన్లో ఉన్న మూడేళ్ల పాప అస్తమానూ ఫెన్సింగు దగ్గిర తొంగి చూడడం గమనించి గడియ తీసి లోపలికి పిలిచింది.

ఆ వెనకే వచ్చిన పాప తల్లి లక్ష్మి "ఎన్నో నెల?" అని పలకరించింది. వాళ్లాయన యూనివర్శిటీలో క్లర్కుగా పనిచేస్తున్నాడనగానే ఆసక్తి పెరిగింది తన్మయికి.

"యూనివర్శిటీలో అడ్మిషన్ పద్ధతేవిటో కనుక్కుంటారా కాస్త?" అని బిడియంగా అడిగింది తన్మయి మొదటి పరిచయంలోనే ఇలా సాయాలు అడిగితే ఆవిడ ఏమనుకుంటుందో అనుకుంటూ.

"అదేమంత పెద్ద పనమ్మా. నువ్వే అడొగొచ్చు ఆయన్ని. నాకు చదువుల విషయాలంతగా తెలీవు" అంది లక్ష్మి.

ఆ మర్నాడు వాకిట్లో రుబ్బురోలు ముందు కూచుని కొబ్బరి పచ్చడి రుబ్బుతున్నలక్ష్మితన్మయిని పిలిచింది. "కాస్త ఉప్పు సరిపోయిందేమో చెప్తావా?"

అత్యంత రుచిగా ఉన్న ఆ పచ్చడి లో నెయ్యి వేసుకుని కలుపుకుని తింటే బావుణ్ణని ఒకటే మనసంతా లాగడం మొదలెట్టింది తన్మయికి. కానీ అడిగితే బావుండదేమో అని మానుకుంది.

పది నిమిషాల్లో పెద్ద గిన్నెలో కొబ్బరి పచ్చడి తెచ్చి ఇచ్చిన లక్ష్మి వైపు ఆనందంగా చూసింది తన్మయి.

"కడుపుతో ఉన్నపుడు ఏం చూసినా తినాలనిపిస్తుంది. మనం వండుకున్నదానికంటే పక్కనెవరైనా వండిన వాసనలు నచ్చుతాయి. రోజూ కాస్త ఏవైనా ఇస్తాను కడుపునిండా తిను. మొహం చూడు ఎలా పీక్కుపోయిందో. రేపు మీ అబ్బాయో, అమ్మాయో పుట్టి, పెద్దయ్యాక నా పేరు మర్చిపోకుండా చెప్పాలి నువ్వు" అని నవ్వింది లక్ష్మి.

ముక్కూ మొహం తెలీని తన పట్ల ఆవిడ చూపిస్తున్న ప్రేమకి కళ్లల్లో నీళ్లు వచ్చాయి తన్మయికి.

"తను కూడా ఎప్పుడైనా తనలాంటి వాళ్లు ఎదురైతే ఇలా ఆప్యాయంగా చూడాలి" అనుకుంది.

★★★

"నాకు ఒరిస్సాలో పనిబడింది. పది రోజుల్లో వస్తాను. నువ్వొక్కర్తెవి ఇక్కడ ఉండలేకపోతే తాతయ్య గారింటికి దిగబెడతా నిన్ను" అన్నాడు వస్తూనే శేఖర్.

అతని దగ్గిర గుప్పుమని కొడ్తూన్న వాసనకి కడుపులో తిప్పినట్లయ్యింది తన్మయికి.

"నువ్విలా తాగి రావడం నాకు పడడం లేదని ఎన్ని సార్లు చెప్పాలి నీకు?" అంది ప్రాధేయ పూర్వకంగా.

"ఏవిటే? ఏదో స్నేహితులతో వారానికోసారి సర్దా చేసుకోవడానిక్కూడా ఏడుపేనా నీకు? నీకు పడకపోతే నాకేంటట. ఇంటికొచ్చిందగ్గిర్నించీ ఏడుపు మానేసి, కాస్త నవ్వు మొహమేసుకుని అన్నం పెట్టు" అన్నాడు విసుగ్గా.

డ్రెస్సింగు టేబుల్ మీద యూనివర్శిటీ అప్లికేషను చూసి "ఇదేవిటి?" అన్నాడు ఇంకాస్త విసుగ్గా.

"ఎమ్మే చదవడానికి అప్లికేషను. పక్కింటి ఆవిడ తెప్పించి పెట్టారు." అంది తన్మయి.

"ఇలాంటి వాటికి మాత్రం ఎక్కడ లేని ఓపికా వచ్చేస్తది నీకు. చదివిన చదువు చాలాలేదా మొగుడితో పోట్లాడడానికి. నువ్వింకా చదివి దేశాన్ని ఉద్ధరించక్కరలేదు." అన్నాడు వ్యంగ్యంగా.

"అదింకా అడ్మిషన్ టెస్టు అప్లికేషన్ మాత్రమే. సీటు వచ్చినప్పటి మాట. డెలివరీకి వెళ్లేలోగా ఒక్క సారి ఊరికే పరీక్ష ఎలా ఉంటుందో రాసి చూద్దామనుకుంటున్నాను." అని వెనక్కి తిరిగింది తన్మయి.

అప్పటికే నిద్రపోతున్న శేఖర్ వైపు చూసి నిట్టూర్చి కడుపు మీద చెయ్యి వేసుకుని నిమురుకుంటూ "పాపాయీ, నాతో బాటూ చదువుతావా?" అంది దిగులుగా తన్మయి.

14

"ఇదిగో, ఈ సంచీలో కూరలు లోపల సర్దు. నేను ఊరెళ్లి వచ్చే వరకూ ఖర్చులకు ఈ వంద ఉంచుకో" అన్నాడు శేఖర్ తన్మయితో.

తన్మయి ఏవీ మాట్లాడకపోవడం చూసి "విన్నావా? డబ్బులున్నాయి కదా అని మీ అమ్మతో ఫోన్లు మాట్లాడడం కోసం తగలెయ్యక, పొరబాటున ఈ మధ్యలో డాక్టరు దగ్గిరికి వెళ్లాల్సొస్తే అందులోనే సర్దుకో." అన్నాడు.

తన్మయి లెక్కబెట్టుకుంది. పగటి పూట ఎస్. టీ. డీ మాట్లాడితే నిమిషానికి 10 రూపాయలు అవుతాయి. అదే రాత్రి 7 తర్వాత మాట్లాడితే అదే డబ్బులకి నాలుగు నిమిషాలు మాట్లాడొచ్చు. ఎస్.టీ.డీ వీధి చివరే ఉంది కాబట్టి ఇప్పుడు 7 దాట గానే ఫోను చేయడం పెద్ద సమస్య కాదు. ఎంట్రెన్సు అప్లికేషను ఇవ్వడానికి యూనివర్శిటీకి వెళ్లి రావాలి. వెళ్లి రావడానికి ఆటో ఎక్కితే 40 రూపాయలు అవుతుండొచ్చు. డాక్టరు దగ్గిరికి వెళ్లాల్సి వస్తే 50 డాక్టరుకే ఇవ్వాలి. మరి ఆటో ఛార్జీ లో? ఇక రోజూ పాలపాకెట్టు 5 రూ|| ..అమ్మో... సరిపోయేట్టు లేవు.

"ఏవిటా తలకాయెక్కడో పెట్టుకుని ఆలోచించుకోవడం? విన్నావా నేను చెప్పింది?" అన్నాడు శేఖర్.

"ఊ... "అని తల ఊపింది అన్యమనస్కంగా.

"ఏం విన్నావో చెప్పు" అన్నాడు నడుమ్మీద చెయ్యి వేసుకుని అసహనంగా.

"డబ్బులు..." అంది నెమ్మదిగా.

"అదే కాదు...నీకు ఏదైనా అవసరమైతే మా పిన్నికో, మావయ్యకో ఫోను చెయ్యి. వచ్చి నిన్ను వాళ్లింటికి తీసుకు వెళ్తారు. మీ అమ్మా వాళ్లకి ఫోను చేసి నానా రాద్ధాంతం చెయ్యకు." అన్నాడు.

శేఖర్ ఊరికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఒంటరితనం హాయిగా అనిపించసాగింది. ఆ రాత్రి కంటి నిండా నిద్రపట్టింది తన్మయికి. అర్థరాత్రి నిద్రాభంగాలూ, మానసిక ఆందోళనలూ లేవు.

రెండో రోజు యూనివర్శిటీకి అప్లికేషను ఇవ్వడానికి బయలుదేరింది.

తనకు నచ్చిన లేత రంగు కాటన్ చీర కట్టుకుని, మెడ చుట్టూ కొంగు కప్పుకుంది. డబ్బులు మరోసారి లెక్కబెట్టుకుంది.

"ఆటోకి ఎటూ సరిపోయేటట్టు లేవు. కాబట్టి బస్సులో వెళ్లి రావడం మంచిది" అనుకుంది. లక్ష్మిని అడిగి బస్సు నంబర్లవీ రాసుకున్న కాగితం సరిచూసుకుంది. ముందు రోజే ఎక్కడ దిగాలో, ఎటు వెళ్లాలో అడిగి తెలుసుకుంది. అయినా బెరుకుగా ఉంది.

మెయిన్ రోడ్డు వరకు నడిచి బస్టాండులో నిలబడింది. వచ్చిన జనం కిట కిటలాడుతూ వేళ్లాడుతూ ఉన్నారు. రెండు మూడు బస్సులు వదిలెయ్యవలిసి వచ్చింది.

"సిటీ బస్సుల్లో ఇలా వేళ్లాడుతూ వెళ్లడం తనకి సాధ్యమేనా?" అని ఆలోచిస్తూండగా అదృష్టం కొద్దీ ఒక బస్సు ఎదురుగా డోరు వచ్చేట్టు ఆగింది. పొట్టతో చూడగానే బస్సులో ఎవరో లేచి గబుక్కున సీటిచ్చారు.

మొట్టమొదటిసారి ఒక్కతే ఇంటి నించి బయటకు రావడం వల్ల ఒక్కసారిగా స్వేచ్ఛా విహంగమైనట్టు అనిపించింది. స్టాపులు దాటుతున్నంతసేపూ ఇక మీదట తను ఇలా ఎప్పుడూ స్వేచ్ఛగా ఎవరి మీదా ఆధారపడకుండా బయటకు ఎక్కడెక్కడకు వెళ్లి రావాలో ఆలోచిస్తూ కూచుంది.

"యూనివర్శిటీ" బిగ్గరగా కండక్టరు అరుపు విని ఈ లోకంలోకి వచ్చి పడింది.

ఈ రోజు కోసం ఎన్ని రోజులుగానో కలలుగన్నందు వల్ల నడుస్తూంటే అడుగులు తడబడి కాళ్లలోంచి సన్నగా ఒణుకురాసాగింది.

రోడ్డు మీంచి కొంత దూరం లోపలికి నడిచి, మూడంతస్థుల ఆఫీసు బిల్డింగులో యాభై అరవై మంది పనిచేస్తున్న పెద్ద హాలులోకి అడుగు పెట్టింది. రెండో అంతస్థులో ఉన్న హాలులోకి మెట్లెక్కి రావడం వల్ల బాగా అలసటగా అనిపించింది. టేబుళ్ల వెనక మనుషులు కనబడనంత పెద్ద పెద్ద ఫైళ్ళ దొంతర్లు ఉన్నాయి.

"అప్లికేషను ఎవరికివ్వాలండీ?" గుమ్మంలో కనబడ్డ ప్యూన్ ని అడిగింది.

"అప్లికేషను పోస్టులో పంపొచ్చుగా" అన్నాడతను ఎగాదిగా చూసి.

"మేం ఇక్కడికి దగ్గర్లోనే ఉంటామండి" అంది నెమ్మదిగా.

"సర్లే, ఆ పదో టేబుల్ దగ్గిరికి వెళ్లండి" అన్నాడు.

అక్కడి క్లర్కు కనీసం తన్మయి వైపైనా చూడకుండా చూడకుండా "టేబుల్ మీద పెట్టి వెళ్లండి" అన్నాడు ఫైళ్లలోకి చూసుకుంటూ.

బయటికి వచ్చి బిల్డింగ్స్ పార్కు చేసి ఉన్న చోటి నించి పచ్చని చెట్ల మధ్య ఉన్న నాలుగు బెంచీల వైపు నడిచింది.

మధ్యాహ్నం వేళ కాబట్టి బాగా ఎండ కాస్తూంది. అటూ ఇటూ పుస్తకాలు, ఫైళ్లు పట్టుకుని తిరుగుతున్న వాళ్లని పరిశీలిస్తూ పది నిమిషాలు విశ్రాంతిగా కూచుంది.

స్టూడెంట్సు కాబోలు ఇద్దరూ, ముగ్గురూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ అటు ఇటూ నడుస్తున్నారు. యూనివర్శిటీ అంతా ఒకసారి తిరిగి చూస్తేనో!

పక్క రోడ్డు మీంచి మలుపు తిరగగానే కాంటీన్ కనిపించింది.

"యూనివర్శిటీ అంతా తిరిగి రావడానికి ఎంత సేపు పడుతుందండీ?" కాంటీన్ బయట కనబడ్డ మొదటి వ్యక్తిని అడిగింది.

"యూనివర్శిటీ చాలా పెద్దది. మీరే డిపార్టు మెంటుకి వెళ్లాలి?" అన్నాడు.

అవును కదూ, ముందసలు తనెక్కడ చదవాలనుకుంటుందో ఆ ప్రదేశం చూడాలి.

తన్మయి సమాధానం విని "అలా అయితే బస్సో, ఆటోనో ఎక్కి యూనివర్శిటీ వెనక గేటు వైపు అంటే మొత్తం వేరే వైపుకి వెళ్లాలి. ఇలా నడుచుకుంటూ మీరు వెళ్లడం కష్టం" అన్నాడతను పొట్ట వైపు చూస్తూ.

"థాంక్సండీ" అంది.

వెనక్కి బస్సులో వస్తూ "ఆటో ఎక్కి యూనివర్శిటీ అంతా తిరగడానికి సరిపడా డబ్బులు పోగుచెయ్యాలి ముందు". మనసులో దృఢంగా అనుకుంది.

ఇంటికి వెళ్లేసరికి బాగా నిస్సత్తువ వచ్చేసింది. కాస్త అన్నం తిని మంచమ్మీద వాలిపోయింది.

ఎంట్రెన్సుకి మోడల్ ప్రశ్నలు అప్లికేషనుతో బాటూ ఇచ్చిన బుక్ లెట్ లో చూసుకుని ఆ ప్రకారం చదవడం మొదలుపెట్టింది.

శేఖర్ వారంలో వచ్చేడు. అప్పటికే రాత్రి బాగా పొద్దుపోయింది.

స్నానమైనా చెయ్యకుండానే మంచమ్మీద పక్కన చేరేడు. అతని దగ్గిర ఏదో ఒక విధమైన దుర్గంధం వస్తూంది.

"కాస్త స్నానం చేసి రారాదూ?" అంది.

"రైల్లో రిజర్వేషను దొరక్క నానా కష్టాలూ పడి ఇంటికొస్తే నీ గోలేవిటే?" అన్నాడు తన్మయిని తన వైపు తిప్పుకుంటూ.

అతనికి సుఖాన్నిచ్చే శారీరక పనులన్నీ చెయ్యడానికి తన్మయికి వెగటుగా ఉంది. అదే చెప్పింది.

"అసలెప్పటికి నేర్చుకుంటావే నువ్వు? ఛీ.. ఛీ..వారం రోజులు గొడ్డులా కష్టపడి ఇంటికొస్తే కాస్త సుఖం కూడా లేదు." విసుగ్గా అన్నాడు.

ఎన్ని కలలు కంది శేఖర్ తో జీవితం పంచుకోవడానికి!!

ఎన్ని రోజులు ఎదురు చూసింది! వాస్తవం ఇంత కఠినంగా, మింగలేక, కక్కలేక బాధామయంగా ఉంటుందని తనస్సలు ఊహించలేకపోయింది.

పెళ్లి కాకముందంతా తామిద్దరి సమాగమం గురించి తనకెప్పుడూ గొప్ప ఊహాలే వచ్చేవి. తెల్లని లాల్చీ, పైజమా వేసుకుని శేఖర్ తనని మృదువుగా చేతుల్లోకి తీసుకున్నట్లు, తనని అతనొక అపురూప స్త్రీగా ఆరాధించినట్లు కలలు వచ్చేవి.

ఈ మధ్య అసలతన్నిలా చొక్కా లేకుండా చూడడం కూడా తనకెందుకో నచ్చడం లేదు. ఒంటి నిండా వెంట్రుకలతో అతను దగ్గిరకొస్తే తెలీని వెగటు కలుగుతూంది.

శుభ్రత పాటించకపోతే అసలతన్ని ముట్టుకోవడానికి కూడా మనస్కరించడం లేదు.

ఇక అతని శరీరం కంటే అపరిశుభ్రమైన మనస్సు ఇంకా చికాకు కలిగిస్తూంది.

"అవునూ, ఆ పుస్తకాలేవిటే? ఇంటికి రాగానే "నువ్వొక పెద్ద వెధవ్వి" అని నాకు చెప్పడానికా?" అన్నాడు అంతలోనే మాట మారుస్తూ.

తన చదువుకీ, అతను వెధవ కావడానికీ సంబంధం ఏవిటో అర్థం కాలేదు తన్మయికి.

అదే అడిగింది.

"ఏవిటా? నేను కాలేజీ ముఖం చూడలేదని నన్ను ఎద్దేవా చెయ్యడానికే గదా నువ్వు యూనివర్శిటీకి బయలుదేరేవు? రేపో మాపో ఎమ్మేలు చదివేసి ఏదైనా పెద్ద ఉద్యోగంలో చేరిపోయి, నువ్వు వంట చెయ్యిరా అనడానికా?" అన్నాడు.

"ఉ..హూ.." అని తల అడ్డంగా ఆడించింది.

"ఏదో చిన్న ఉద్యోగంలో గుట్టుగా సంసారం చేసుకుని, ఒకళ్లో, ఇద్దర్నో పిల్లల్ని కని, ఒక మొగుడికి పెళ్లాంగా పడి ఉందామని ఉందా నీకు? అయినా రేపో, మాపో కనీదానికి చదువులెలా వెలగబెడదామనుకుంటున్నావ్? రేప్పొద్దున్న చంటి బిడ్డనేసుకుని కాలేజీలకి తిరుగుతావా? "

శేఖర్ ఒక విషయం మీద కసి మరో విషయమ్మీద తీర్చుకొంటున్నాడో, లేక కావాలని అలా మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు తన్మయికి.

గోడ వైపుకి తిరిగి ఏడుస్తూ పడుకుంది.

"ఛీ... ఆపు. నీ ఎదవ ఏడుపు చూడలేక చస్తన్నాను." అన్నాడు.

"వారం రోజులు అతను దగ్గిర లేనప్పుడే ప్రశాంతంగా ఉంది కదా. మళ్లీ పీడన మొదలయ్యింది." అని బాధ మొదలయ్యింది తన్మయికి.

దు:ఖంతో మూలుగుతున్న శరీరాన్ని, మనసుని పట్టించుకోకుండా అతని సుఖం కోసం అతను మృగంలా మీద పడ్డాడు. మనసుతో సంబంధం లేని మొరటు సుఖానికి అలవాటుపడ్డ అడవి మృగం తనని చెరుస్తున్న బాధని పళ్ళ బిగువన అదుముకుంది.

★★★

మరో నెల రోజుల్లో ఎంట్రెన్సు పరీక్ష దగ్గిర పడ్తూండగా శేఖర్ మళ్లీ క్యాంపుకెళ్లేడు.

శారీరక గాయాలు మానినంత సులభంగా అతను కలిగిస్తున్న మానసిక గాయాలు అసలే మానడం లేదు. శేఖర్ బయటికెళ్ళినంతసేపూ తన్మయి చదువులో తలమునకలయ్యి ఉండసాగింది. చదువొక్కటే తన పాలిటి పెన్నిధి అయ్యింది. పుస్తకం మూస్తే ఒక విధమైన బాధ మనస్సులో చొరబడుతూంది.

ఫెన్సింగు చప్పుడు వినబడితే తొంగిచూసింది తన్మయి.

ఎదురుగా జ్యోతి, భానుమూర్తి ని చూసి ఆత్రంగా హత్తుకుంది.

"కిందటి వారం ఫోను చేసినప్పుడు చెప్పలేదేం వస్తున్నామని?" అనడిగింది. అంతలోనే తల్లి  ముఖం ప్రసన్నంగా లేకపోవడం చూసి ఏమయ్యిందో అని జంకుగా "అమ్మా, అంతా బానే ఉన్నారా?" అంది.

"ఊ....ఇంటి పక్కని గేదె  రొచ్చు కంపు ముందు వరండా వరకూ వస్తూంది. వెనక బాత్రూముకి అసలు గాలే లేదు. ఇదేం కొంప తల్లీ?" అంది జ్యోతి ముఖం చిట్లించి.

తన్మయి నిశ్శబ్దంగా విని ఊరుకుంది.

"ఇక్కడతనేదో గొప్ప ఉద్యోగం వెలగబెడ్తున్నట్లు మీ అత్త గొప్పలు పోతూండక్కడ. నీకు  సీమంతం చేస్తే అత్తగారి తరఫున ఏం పెట్టబడ్తాయోనని ఆనవాయితీ లేదని చెప్పింది. మంచం, కుంచం అని ఇచ్చే వరకూ పీకెల మీద కూచున్నారు..." అంటూ మొదలెట్టి తనకి మనసులో ఉన్న కోపమంతా వెళ్లగక్కసాగింది.

భానుమూర్తి బయటి వరండాలో సిగిరెట్టు వెలిగించుకుని కూచున్నాడు.

పొయ్యి మీద అన్నం ఉడుకుతూండగా బియ్యం సంచీ వైపు చూసి "ఇదేం ఖర్మ నీకు? రేషను బియ్యం తింటన్నారా!" అని నిర్ఘాంతపోయింది జ్యోతి.

తన్మయికి తల్లి తన మీద జాలి పడ్తూందో, తన స్థితికి బాధ పడ్తూందో అర్థం కాలేదు.

"కావాలని పట్టుబట్టి చేసుకున్నావు. నీకు మంచి జరిగిందా, మాకు మంచి జరిగిందా? మంచమ్మీద పరుపు ఇవ్వలేదని మీ అత్తగారు మాకు ఫోను చేసి డిమాండు చేస్తే, ఇదిగో –ఏవో తాకట్టు పెట్టి ఈ పైకం పుచ్చుకుని వచ్చాం". అని ముక్కు చీదుతూ కూచుంది.

ఇదంతా  తన స్వయంకృతాపరాధమని, శేఖర్, తను కలిసి వాళ్లను వేధిస్తున్నామని తన్మయికి లోపల్నించి ఇన్ ఫీరిరియాటీతో కలిసిన బాధ మొదలయ్యింది.

సాయంత్రం కొత్త పరుపు తెచ్చేడు భానుమూర్తి. "గాజువాకలో చిన్నాన్న వాళ్లింటికి వెళ్లి, అట్నించటే రేపెళ్తామమ్మా అమ్మా, నేను. నువ్వూ మాతో వచ్చేయకూడదూ. అల్లుడు వచ్చేక వద్దువు గాని"  అన్నాడు.

శేఖర్ కి చెప్పకుండా వెళ్తే వచ్చేక నానా రాద్ధాంతం చేస్తాడు. పైగా శేఖర్  ఇంట్లో ఉండగా అసలు చదువు కొనసాగడం లేదు. ఎంత చదివినా ఇదే మంచి సమయం.   తను రాయాల్సిన ఎంట్రెన్సు పరీక్ష  ఎన్ని అవాంతరాలెదురైనా రాసి తీరాలని పట్టుదలగా ఉంది తన్మయికి.

తనకి సీటు వస్తుందా, లేదా? చంటి బిడ్డ పుట్టాక చదవ గలదా, లేదా ఇవన్నీ తనకు అప్రస్తుతాలు. అసలు ఎంట్రన్సు ఎలా ఉంటుందో చూడాలి. అంతే.

ఇలా వచ్చి అంతలోనే వెళ్తున్న తల్లిదండ్రుల మీద లోపల్లోపల  బెంగ పడింది  తన్మయి.

పొద్దుట్నించీ ముక్కు మూసుకుని బలవంతంగా అక్కడుండాల్సి వస్తున్నట్లు ఉంటున్న తల్లిని ఇంకా బాధ పెట్టడం ఇష్టం లేక, " లేదులెండి నాన్నా, నేనిప్పుడు రాలేను. మీరు వెళ్లండి. వచ్చే నెలలో ఎలాగూ  వస్తానుగా " అంది దు:ఖాన్ని లోలోపల అణుచుకుని.

★★★

"పొద్దున్నొచ్చి, సాయంత్రం వెళ్లిపోయారా మీ అమ్మా, నాన్నా? కడుపుతో ఉన్నావు. నాల్రోజులు ఉండి నిన్ను చూసుకోవచ్చుగా" అని విస్తుపోయింది లక్ష్మి మర్నాడు.

"వాళ్లిక్కడ ఉండలేరు. నన్నే రమ్మన్నారు. కానీ చదూకోవాలని..." అని చిర్నవ్వు నవ్వింది బలవంతంగా తన్మయి

ఇంటి బయట ఏదో కోలాహలం వినబడి వీధిలోకి వచ్చారిద్దరూ.

గోనె సంచి మీద చిలక, కార్డులు  పేర్చుకుని జోతిష్యుడు కూచుని ఉన్నాడు.

చుట్టుపక్కల  ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు జాతకం చెప్పించుకుంటున్నారు.

"దా, జ్యోతిష్కం చెప్పించుకో. ఇతను సరిగ్గా చెప్తాడు" అంది లక్ష్మి తన్మయితో.

తన్మయి నవ్వుతూ "నాకిలాంటివి నమ్మకం లేదు" అంది.

చిలక ఇచ్చిన కార్డుని  ప్రార్థిస్తున్నట్లు కళ్ల మీద  పెట్టుకుని, కళ్లు మూసుకుని ఉన్న చిలక జోస్యపు మనిషి తీక్షణంగా తన్మయి వైపు చూసి, "జోతిస్యాన్ని సులకన సూడకు తల్లి, నీకు కొడుకు పుట్టబోతున్నాడు. ఆ బిడ్డడే నీకు ఆలంబన, ఆదారం. ఏ కస్టమొచ్చినా సెదరవు, బెదరవు. ఆకాసమే నీకు అద్దు." అన్నాడు.

విస్తుపోయి చూసి, అంతలోనే చిలక జోస్యపు మనిషి మాటల్ని నమ్మడవేవిటని నవ్వుకుంది తన్మయి.

మర్నాడు డాక్టర్ దగ్గిరికి వెళ్లేరు తన్మయి, శేఖర్.

"స్కానింగు చేయిద్దాం, ఎందుకైనా మంచిది" అంది డాక్టర్.

స్కానింగు చేసేటప్పుడు "డాక్టర్, జెండర్ తెలుస్తూందా?" అంది.

“నిజానికి మేం ముందే చెప్పడం నిషిద్ధం. అయినా నీ సంతోషం కోసం చెప్తున్నాను. ‘మగ పిల్లవాడు’ ” అంది.

తన్మయి కి ముందు రోజు జోస్యం గుర్తుకు వచ్చింది. "నీ కొడుకే నీకు ఆలంబన. ఆకాశమే నీకు హద్దు." ఎంత స్పష్టంగా తన మనస్సుని చదివినట్లు చెప్పాడు !!

అవును. ఈ పసిపాపడే కదా ఎప్పటి కప్పుడు  బాధా విముక్తుణ్ణి చేస్తున్నది.

ఇన్నాళ్లూ అమ్మాయని తను కబుర్లు చెప్తున్నది అబ్బాయితోనన్నమాట.

శేఖర్ బండి నడుపుతూ "నాకెప్పుడో తెలుసు. అబ్బాయే పుడతాడని. విత్తనం ఎవరిదిక్కడ! మా వంశంలో అందరికీ ముందు మగ పిల్లలే పుడతారు." అని గట్టిగా అరుచుకుంటూ చెప్పుకెళ్లిపోతున్నాడు.

తన్మయి కుదుపుల్నించి తప్పించడానికన్నట్లు పొట్టలో బిడ్డని ఒక చేత్తో గట్టిగా పట్టుకుంది.

"నాన్నా! నువ్వు మాత్రం ఇలాంటి మగవాడివి కాకూడదురా" అని గాఢంగా మనస్సులో అనుకుంది.

తల్లి మాటలు వినబడినట్లు కుంచించుకు పోయి కడుపంతా చేతిలో ఒదిగిపోయింది.

దారిలో కొబ్బరి బొండాం తాగడానికి ఆపేడు.

"వచ్చే నెలలో నేను నెల మొత్తం క్యాంపుకి వెళ్లాల్సి రావొచ్చు. నిన్ను వచ్చే నెలలోనే డెలివరీకి తీసుకు వెళ్తామని మీ వాళ్లు అన్నారు కదా! నేను వెళ్లే ముందు రోజు రమ్మని ఫోను చెయ్యి." అన్నాడు.

తన్మయి ఎంట్రెన్సు తారీఖు గుర్తు తెచ్చుకుంది. సరిగ్గా శేఖర్ ఊరికెళ్లే రోజు అది.

★★★

తన్మయిని తీసుకు వెళ్లడానికి భాను మూర్తి ఒక్కడే వచ్చాడు.

ఉదయం శేఖర్ ఊరికి వెళ్తూ "నా కొడుకుని క్షేమంగా కనిచ్చే వరకూ కాస్త జాగ్రత్తగా ఉండు. మీ పల్లెటూళ్లో డెలివరీకి మంచి డాక్టర్లెక్కడ ఉన్నారు? అందుకే డెలివరీ దగ్గిర పడ్డాక మన ఇంటికి వెళ్లిపో. నీ కోసం మా అమ్మ తెలిసిన డాక్టరుతో మాట్లాడి పెట్టింది. ఎప్పటికప్పుడు వివరాలు ఫోను చేసి చెప్పు మా అమ్మకి " అన్నాడు.

"అబ్బాయి చెప్పింది నిజమే. మనూళ్లో సరైన డాక్టర్లు లేరు. కానీ మీ అమ్మ ఏమంటుందో చూడాలి" అన్నాడు భానుమూర్తి కూతురితో.

మధ్యాహ్నం ఎంట్రెన్సు కి వెళ్లాల్సిన ఆలోచనల్లో తన్మయి ఇవన్నీ పట్టించుకోలేదు. శేఖర్ ని వదిలి వెళ్తున్నాననే ఆలోచన కూడా లేదు.

తండ్రి దగ్గరుండి తన్మయిని పరీక్ష హాలుకి తీసుకు వెళ్లేడు.

దారిలో "ఇప్పుడెందుకమ్మా నీకు చదువులు?" అన్నాడు.

సమాధానంగా చిర్నవ్వు నవ్వింది తన్మయి.

పరీక్ష హాలు మూడో అంతస్థులో. మెట్లన్నీ భారంగా ఎక్కి అతి కష్టమ్మీద అయ్యిందనిపించింది.

పరీక్ష అయ్యి మెట్లు దిగి వస్తూంటే "యూనివర్శిటీలో సీటు రావాలంటే యాభై లోపు ర్యాంకు రావాలి". అని పక్కనే తనతో బాటూ మెట్లు దిగుతున్న వాళ్లు మాట్లాడుకుంటున్నారు.

గబ గబా లెక్కబెట్టుకుంది. తనకి డెలివరీ అయ్యి, మూడో నెల వచ్చి తను వెనక్కి వచ్చే సరికి అడ్మిషన్లు మొదలవుతాయి.

"మనకి ఏమి రాసి పెట్టి ఉందో, చూద్దాం కన్నా" అంది కడుపు మీద చెయ్యి పెట్టి.

"వెళ్లేలోగా ఒకసారి సముద్రాన్ని చూడాలని ఉంది నాన్నా!" అంది తండ్రితో.

"ఇట్నించిటే వెళ్దాం మరి" అని ఆటో మాట్లాడేడు భాను మూర్తి.

ఒక పక్క ఎండ కాస్తూన్నా, సముద్రమ్మీంచి పొగ మంచేదో వచ్చి కళ్లకు అతుక్కున్నట్లు మసక బారిన కెరటాల్ని చూస్తూ ఒడ్డున కూచుంది తన్మయి. ఇంట్లో ఎప్పుడూ కలగని ప్రశాంతత ఇక్కడ కలగసాగింది. మనసంతా నిండిన ఆనందంతో పొట్ట మీద తడుముకుంది.

తల్లి సంతోషానికి ప్రతీకగా కాళ్లు చాచినట్లు విశాలంగా కదిలింది బిడ్డ.

తన్మయి తండ్రి వైపు చూసింది. భాను మూర్తి సిగిరెట్టు వెలిగించుకుని నీళ్ల ఒడ్డున అటూ ఇటూ తిరగసాగేడు.

చుట్టూ చూసింది. తన కలల సముద్రం ఒక వైపు, అందమైన నగరం ఒక వైపు. దూరాన ఇరువైపులా సముద్రం లోకి పొడుచుకు వచ్చిన పర్వతాల కొనలు. ఆకాశం, సముద్రం కలిసిపోయి ఒక్కటిగా అగుపిస్తున్న దిగంతం.

ఇసుకలో చెయ్యి పెట్టి ఆప్యాయంగా తడుముతూ "వెళ్లొస్తాను సాగర మిత్రమా! మళ్లీ కలుద్దాం. నీ కోసం ఎన్నో కలలు కని ఈ నగర ప్రాంగణంలో తలదాచుకుంటున్నా. ఇన్నాళ్లూ నిన్ను చూడడానికి రాని ఈ అశక్తురాల్ని మన్నిస్తావు కదూ. నేను తిరిగొచ్చే వరకూ ఈ చల్లని పవనాల్ని నా కోసం దాచిపెట్టవూ!" అంది.

తన మాటలు విన్నట్లు మబ్బు తొలగి నీళ్లు కాంతివంతమయ్యాయి. ఎండ తళుక్కున మెరిసే నురగల కెరటాల వెనకెక్కడో అంచుల్లో కదులుతున్న కాగితపు పడవల్లా ఓడలు ఒకటీ, రెండూ కదులుతున్నాయి.

తండ్రి తనవైపు రావడం గమనించి లేచి నిలబడింది తన్మయి.

సాయంత్రం రైలు సమయానికి గంట ముందే బయలుదేరారు.

లక్ష్మి వీధి బయట ఆటో కదిలే వరకూ నుంచుంది. "పండంటి బిడ్డను కని క్షేమంగా తిరిగిరా! " అంది ఆప్యాయంగా చేతిలో చెయ్యి వేసి.

ఆ ఆప్యాయతకి తన్మయి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆ చేతినలాగే పట్టుకుని "తల ఊపింది".

## 15

ఇంటి ముందు రిక్షా దిగగానే ఓపికంతా అయిపోయినట్లయ్యింది తన్మయికి. ఎక్కడివక్కడ వదిలేసి తన గదిలోకి వెళ్లి ముసుగు పెట్టింది. నిద్రపోయి లేచేక ప్రయాణపు బడలిక తీరినట్లయ్యి హాయిగా గాలి పీల్చుకుంది. గది కిటికీ దగ్గర ఎత్తైన బంతి చెట్లు తలలూపుతూ ఉన్నాయి. మనసంతా ఎంతో ఆహ్లాదం నిండింది.

"హమ్మయ్య, మళ్లీ ఇన్నాళ్ళకి ఇలా తన విశాలమైన గదిలో పచ్చని చెట్ల మధ్యకి వచ్చింది. మరి కొద్ది రోజుల్లో తన జీవితంలో అద్భుతం జరగబోతూంది. తనిన్నాళ్లూ కబుర్లు చెప్పుకుంటూన్న చిన్నిబిడ్డ తన కళ్ల ముందుకి రాబోతూంది."

పుట్టబోయేది అబ్బాయని తెలిసి అంతా తెగ సంతోషిస్తున్నారు.

"మా అమ్మకి మనవరాలి బిడ్డనెత్తుకునే యోగం లేదు, మగబిడ్డ పుట్టబోతున్నందుకు ఎంత సంతోషించేదో!" అంటూ జ్యోతి కళ్ళు తుడుచుకుంది.

"అందరికీ మగ పిల్లలంటే ఎందుకు మోజు? నా మట్టుకు నాకు అమ్మాయిలంటేనే ఇష్టం. ఇంట్లో ఒక్కతే పిల్లగా గారాబంగా పెరగడం వల్లనేమో" అనుకుంది తన్మయి.

తల్లిని ఎన్నో సార్లు అడిగింది. తనకు అన్నా, చెల్లీ ఎందుకు లేరని? సమాధానంగా నవ్వి ఊరుకునేది గానీ ఎప్పుడూ చెప్పలేదు.

అదే ప్రశ్న ఇప్పుడు మళ్లీ అడిగింది. దగ్గిరికి వచ్చి తల నిమిరి "ఏమోనమ్మా, నీ తర్వాత ఇంక నాకు మళ్లీ పిల్లలే పుట్టలేదు. అమ్మమ్మకీ అందరం ఆడపిల్లలమే. నీకు తొలిచూలు మగబిడ్డ అని తెలిస్తే ఎంత సంతోషించేదో" అంది మళ్లీ జ్యోతి.

కారణాలేవైనా తన్మయి మాత్రం ముందు తనకి అమ్మాయి పుడితే బావుణ్ణని ఎంతో కోరుకుంది. శేఖర్ ప్రవర్తన వల్ల విసిగిపోయో, ఎందుకో గానీ పుట్టబోయేది అబ్బాయని తెలిసినపుడు కాస్త నిరుత్సాహపడింది కూడా. కానీ కడుపులో ఉన్న బిడ్డ ఆడైనా, మగైనా తల్లిప్రేమలో తేడా ఉండదని తన్మయికీ తొమ్మిది నెలల్లో అర్థమయ్యింది.

తొమ్మిదో నెల నిండే సమయానికి బాగా భారం కాసాగింది. ఎప్పుడెప్పుడు డెలివరీ అవుతుందా అని ఎదురుచూపులు చూడసాగింది తన్మయి. రోజు ఉదయం నించి రాత్రి కావడమే అతి కష్టంగా జరుగుతోంది.

కంటి నిండా నిద్రపోయి ఎన్నో రోజులయ్యింది. ఎటు ఒత్తిగిలినా కడుపులో బిడ్డ కాళ్లూ చేతులూ గుచ్చుకుంటున్నాయి. నెలలు పూర్తయ్యే కొలదీ కదలికలు తక్కువగా వున్నా, ఇలా నిద్రపడుతుందనగా అలా కడుపులో తడుతున్న కదలికలకి నిద్ర రావడం లేదు. పైగా పైన ఊపిరి తిత్తుల దగ్గర్నించీ నడుం వరకూ సాగి ఉన్న పొట్ట వల్ల ఊపిరి సలపనట్లు, ఏవిటో గాభరాగా అనిపించసాగింది.

తన్మయికి అలా కాస్సేపు డాబా మీదకి వెళ్లి కాస్త గాలి పీల్చాలని అనిపించింది. అతి మెల్లగా రైలింగు పట్టుకుని ఎక్కుతున్న తనను చూసుకుని తనే ఆశ్చర్యపోయింది. ముందంతా డాబా మీదికి వెళ్లడమంటే పరుగులు పెట్టడమే. ఒక్కోసారి రెండు మెట్లు ఒకే సారి ఎక్కి దిగడమూ జ్ఞాపకం వచ్చింది. ఎంతలో శరీరం అంతా ఎలా మారిపోయింది! కేజీల రాయిని కడుపుకి కట్టుకున్నట్లు భుజాలు భూమిలోకి గుంజేస్తున్నాయి మెట్లు ఎక్కుతుంటే. వనజ జ్ఞాపకం వచ్చింది. ఎన్నో సాయంత్రాలు డాబా మీద కూర్చుని చెప్పుకున్న కబుర్లు జ్ఞాపకం వచ్చాయి.

"క్షమించు వనా! ఉత్తరం రాయలేని ఈ అశక్తురాలిని క్షమించు." అని పైకే అనేసింది.

సన్నజాజి పందిరి గూడు వైపు చూసింది. తను వెళ్లాక ఇంట్లో అంతగా పట్టించుకోక అనుకుంటాను సన్నజాజి లతలు గూడంతా అల్లుకుపోయి మొత్తం దారి మూసుకుపోయింది. అయినా పూల వాసన తనకి పడడం లేదు దగ్గరికి వెళ్లగానే వికారం మొదలయ్యింది. పూల వికారం ఎంత దారుణంగా ఉందంటే దూరం నించి ఎవరైనా జడలో పూల మాల పెట్టుకుని వెళ్తూ కనిపించినా ఇక్కడ తనకు కడుపులో తిప్పుతుంది.

డాబా నాలుగు మూలలా నెమ్మదిగా నడుస్తూ కిందికి చూసింది. పెరట్లో అరటి చెట్లు బారుగా పెరిగేయి. గెల బరువుతో పెద్ద అరటి చెట్టు తనలాగే వొంగి నిలబడి ఉంది. గులాబీ మొక్కలు ఒకటీ అరా మిగిలేయి. బంతి చెట్లు బాగా విరగ బూసేయి. కనకాంబరం మొక్కలు జీబురుగా విస్తరించేయి.

తన్మయికి మొక్కలన్నా, మొక్కల మధ్య గడపడం అన్నా బాగా ఇష్టం. వంగనారు వేసి కేజీల కొలదీ వంకాయలు పండించేది. చిక్కుడు పాదులు, బీర పాదులు పందిళ్ళు వేసి చక్కగా సంరక్షించేది. వైజాగు లో గాలి లేని తమ చిన్న గదుల ఇల్లు గుర్తుకు వచ్చి ఒక నిట్టూర్పు విడిచింది.

ఇక్కడిలాంటి ఇల్లు అక్కడ ఉంటేనా! ఎన్నెన్నిపూల మొక్కలు పెంచేదో!! అయినా ఇప్పుడు అవన్నీ సాధ్యం కావులే. ఇప్పుడున్న పరిస్థితుల్లో వంగలేదు కూడా.

ఒక వైపు సాయం సంధ్య నారింజ రంగుల తళుకులు చిమ్ముతూ ఆకాశమంతా మెరిసిపోతూ ఉంది. దూరంగా రోడ్ల మీద ధూళి రేపుకుంటూ పశువులు ఇళ్ళకి చేరుతున్నాయి. పక్షులు ఉదయపు ఉద్యోగాల్నించి గూటికి చేరి కిలకిలా శబ్దాలు చేస్తున్నాయి. ఆహ్లాదంగా వీస్తున్న గాలిని ఆస్వాదిస్తూ తన కోసమే వేసిన పడక కుర్చీలో విశ్రాంతిగా కూచుంది తన్మయి.

నారింజ ఆకాశంలో అక్కడక్కడా బూడిద రంగు కుంచెతో అద్దినట్లున్నాయి మబ్బులు. తన మనస్సులో ఆనందం కనిపెట్టేసినట్లు ఒక్కసారి కాళ్లూ, చేతులూ సాచింది కడుపులో బిడ్డ.

తన్మయి ఆప్యాయంగా పొట్ట తడుముకుంది. "బంగారూ, అలా చూడు నాన్నా ... ఆకాశం ఎంత బావుందో.... అవిగో మబ్బుల్లో.. అవి లేళ్ళు, ఇవి నెమళ్ళు.... తొందరగా వచ్చెయ్యి మరి అన్నీ చూపిస్తాను" అని కబుర్లు చెప్పసాగింది.

జ్యోతి సగం మెట్లెక్కి ఆగి "తన్మయీ! పొద్దు పోతూంది కదమ్మా, కాస్త పెందరాళే ఏదైనా తినకూడదూ" అని పిలిచింది.

పళ్లెంలో నల్లగా మాడిన తీపి అట్లు అమృతంలా కనిపించాయి తన్మయికి. తన ప్లేటు చూసి తనకే నవ్వొచ్చింది తన్మయికి. తన ఆహారపుటలవాట్లు ఈ తొమ్మిది నెలలుగా నెలకొక కొత్త విచిత్రంగా మారిపోతూ వచ్చాయి. అంతకు ముందు ఉన్న అలవాట్లన్నీ మారిపోయి కొత్తవి వచ్చాయి. ఇదొక విచిత్రమైన శారీరకావస్థ. అంతకు ముందు నచ్చనివెన్నో నచ్చుతున్నాయిప్పుడు. నచ్చేవెన్నో నచ్చడం లేదు శేఖర్ తో సహా.

ఇంతకు ముందు తను వంట మాడితే అసలు ముట్టుకునేది కాదు. అలాంటిది అట్లు నల్లగా అయితే చూడడానికి అందంగానూ, తింటుంటే అమృతంగానూ ఉంటున్నాయి.

"ఇది సరిగా మాడలేదు" అంది అట్టు పైకి తీసి చూపిస్తూ.

"చాల్లే తల్లీ, నీ కొడుకు నల్ల చింతగింజలా పుడతాడు నువ్వు తినే తిండికి." అంది జ్యోతి నవ్వుతూ.

ఆ మర్నాడు దేవి ఫోను చేసింది. "శేఖర్ ఫోను చేసేడమ్మా. నిన్ను మనింటి దగ్గర్లో ఉన్న డాక్టరుకి చూపించమని చెప్పేడు. రేపో ఎల్లుండో ఓ సారి రారాదూ. డెలివరీ ఆ పల్లెటూళ్లో వద్దే వద్దని పట్టుబట్టాడు. ఎంత ప్రేమో వాడికి నువ్వంటే." అంది.

"ఇదేం చోద్యం, మేమందరం కనలేదా" అంటూ జ్యోతి వెనకే రాగం తీసింది.

తన్మయి ముఖం చూసి, "వాళ్ళకెలా ఇష్టమో అలా చేసుకోనివ్వరాదూ" అన్నాడు భానుమూర్తి.

"డెలివరీ అక్కడెక్కడో అత్తగారింటికి దగ్గర్లో పెట్టుకుంటే, పిల్లకి మూడు రోజులు ఆసుపత్రిలో పత్యం భోజనం ఇబ్బంది కాదూ?అయినా మీ తండ్రీ కూతుళ్లకెలా ఇష్టమైతే అలా చెయ్యండి. నాకేవిటీ మధ్యలో. మీ అత్తగారినే అడిగి కనుక్కోమ్మా. మూడు పూటలా కేరేజీ పట్టుకుని వస్తాదేమో" అంది ముక్కు చీదుతూ జ్యోతి.

తన్మయికి ఎటూ అర్థం గాని సందిగ్ధం పట్టుకుంది. అసలు డెలివరీ అంటే తెలీని భయంగా ఉంది మొదట్నించీ. నెలలు నిండుతున్న కొలదీ బిడ్డ ఎలా బయటికి వస్తాడో అని గాభరాగా ఉంది. అత్తగారింటికి దగ్గర్లో డెలివరీ చేసుకోవడం అంతగా ఇష్టం లేకపోయినా, మంచి డాక్టర్ దగ్గిరికి వెళ్తే భయం తగ్గుతుందనే ఆలోచన వల్ల వెళ్లడానికే నిర్ణయించుకుంది.

"మీ ఆయన నీకే ఫోను చెయ్యొచ్చుగా అంత ప్రేమ ఉన్నవాడైతే. అన్నీ అమ్మకి చెప్పుకుంటాడు చంటి కూచి లాగా" అంది జ్యోతి.

కొన్ని విషయాలు ఇలా ఎత్తి చూపితే గానీ అర్థం కావు. శేఖర్ గురించిన ఆలోచన రాగానే తన్మయి మనస్సంతా దిగులు అలుముకుంది.

నిశ్శబ్దంగా గోడకి జేరబడి కూచుంది. కూతురి కళ్లలో నీళ్లు చూసి, "నేనిప్పుడేమన్నానని?" అంది ఉక్రోషంగా జ్యోతి.

తల్లికి సమాధానం చెప్పే ఓపిక లేక అలాగే గుడ్ల నీళ్లు కుక్కుకుంటూ ఉండిపోయింది. అయినా తల్లి అన్నదాంట్లో తప్పేముంది?

"వచ్చి ఇన్ని రోజులవుతున్నా ఫోను చెయ్యని పెద్ద మనిషికి డెలివరీ విషయంలో ఇంత శ్రద్ధ దేనికి? ప్రేమ తన మీదా? పుట్టబోయే కొడుకు మీదా?" ఇవన్నీ ఆలోచిస్తూంటే మనస్సుకి ఇంకా కష్టం తప్ప మరేమీ లేదు.

అతనికి తను అమ్మగారింట్లో ఉండడమే ఇష్టం లేదన్నట్లు ప్రవర్తిసాడు. ఒక ఫోను చెయ్యడు. ఉత్తరం రాయడు. అన్నిటికీ వాళ్లమ్మతోనే రాయబారాలు. ఎప్పుడో పెళ్ళిలో జరిగిన విషయాలకి ఇన్నాళ్లు కక్ష సాధింపేవిటో అర్థం కాదు తన్మయికి.

అదే అడిగితే "మీ అమ్మా, బాబూ ఏం దోచి పెట్టేస్తున్నారని వాళ్ల మీద ప్రేమ ఒలక బొయ్యాలి?" అన్నాడొకసారి.

ఇవన్నీ తల్లికి చెప్పి తన మనసు నొప్పించడం ఇష్టం లేదు తన్మయికి. "ఇదంతా తన దురదృష్టం. అంతే. ఏం చెయ్యగలదు తను?" అని లోపల్లోపల బాధ పడసాగింది.

★★★

"రేపో ఎల్లుండో డాక్టరు దగ్గరికి వెళ్దామా?" అంది తన్మయి మర్నాడు తల్లితో.

అప్పటికి కాస్త కుదుట పడి "వెళ్లేది డాక్టరు దగ్గిరికైనా ముందు మీ అత్తగారింటికి వెళ్లాలి కదా, మంచి రోజు చూసుకుని వెళ్దాంలే " అంది జ్యోతి.

వైజాగులో చూపించుకున్న డాక్టరు చెప్పిన ప్రకారం ఇంకా పదిహేను రోజులు ఉంది డెలివరీ డేటు.

రెండో రోజు ఉదయం నిద్ర లేస్తూనే ఏదో తేడాగా అనిపించింది. నడుములో కొద్దిగా నొప్పి మొదలయ్యింది. ఏదో చుక్కచుక్కగా నీళ్లలాగా పోతున్నట్లు అనిపించసాగింది.

క్షణం ఆలస్యం చెయ్యకుండా భానుమూర్తి టాక్సీ కోసం పరుగెత్తేడు.

దారి పొడవునా తన్మయికి ఎలా ఉందో అని గాభరా పడ్తూ అడగసాగింది జ్యోతి.

శేఖర్ తల్లీ, తండ్రీ ఇంటి ముందు టాక్సీ ఆపగానే ఎక్కేరు.

ఆసుపత్రి ముందు హాలులో అన్ని దేవుళ్ల పటాలు వేళ్ళాడుతున్నాయి. లోపల కన్సల్టింగు గదిలో ఎటు చూసినా సాయిబాబా పటాలు. డాక్టరు పెద్ద ఎర్ర బొట్టు పెట్టుకుని, ఆ పైన తెల్ల అడ్డబొట్టు పెట్టుకుని బాగా దైవ భక్తురాలిలా కనిపించింది.

"ఆ చెయ్యిలా ఇవ్వు" అంది తన్మయిని చూసి. చాలా కరుకుగా ఉన్న ఆవిడ మాట తీరు చూసి "ఇలాంటి వాళ్లు డాక్టర్లెందుకు అవుతారో?!" అనుకుంది తన్మయి.

రెండు నిమిషాల్లో పరీక్ష చేసి, "కంగారేం లేదు. ఇంకా వారం వరకూ పట్టొచ్చు." అని డాక్టరు అన్నాక, అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తన్మయికెందుకో నమ్మకం కలగడం లేదు. కడుపులో కాళ్లు పైకి, తల కిందికి స్పష్టంగా తెలుస్తున్నాయి. ముందులాగా ఎక్కువగా కదలడం లేదు. అక్కడక్కడే ఇరుకుగా కాళ్లూ చేతులూ కొంచెం చాపుతున్నట్లు తెలుస్తూంది.

ఎందుకో అన్నాళ్లు పట్టదేమో అనిపించ సాగింది. ఎందుకైనా మంచిది. అత్తగారింట్లోనే ఉంటే మంచిదనిపించింది. అదే చెప్పింది తల్లితో.

దేవి నవ్వుతూ "నా మనసులో మాట నువ్వే చెప్పేవు. ఇక్కడుంటే ఏ రాత్రి పూట హడావిడి ఐనా డాక్టరు అందుబాటులో ఉంటుంది. తన్మయిని వదిలేసి వెళ్లండి వదినా. ఏదైనా అర్జంటు అయితే ఫోను చేస్తాంలే " అంది జ్యోతితో.

రాత్రి వరకూ ఉండి జ్యోతి, భాను మూర్తి కూతుర్ని అత్తగారింట్లో వదిలెళ్లారు.

మర్నాడు శేఖర్ ఫోను చేసేడు. "ఎప్పుడూ ఇలా చెప్పిన మాట వినొచ్చు కదా, పోనీలే. ఈ విషయంలోనైనా బుద్ధిగా విన్నావు. మా అమ్మ చెప్పినట్లు విని నా కొడుకుని నాకు జాగ్రత్తగా కనివ్వు. అన్నట్లు నేనీ వారంలో ఊరెళ్తున్నాను. నాలుగు డబ్బులు సంపాదించడానికి ఇది మంచి సమయం. డెలివరీ సమయానికి నేను రాలేకపోవచ్చు. మా అమ్మా, నాన్నా ఉన్నారుగా." అన్నాడు.

తన్మయికి దు:ఖంతో గొంతు పూడుకు పోయింది. "నాకు చాలా భయంగా ఉంది. నువ్వు నా దగ్గిర ఉండవా డెలివరీకి?" అంది కంగారుగా.

"అబ్బా, ఊరికే చిరాకు తెప్పించక. పిల్లల్ని కనడం ఆడదాని బాధ్యత. అయినా పిచ్చి మొహవా, విను. హాస్పిటల్ గదిలో ఆడోళ్లు కనేటప్పుడు మగోళ్లని రానివ్వరు. ప్రసవం అయ్యేక వైరాగ్యం వస్తాదంటారు. నీకు ప్రసవం కాకుండానే వైరాగ్యం పట్టుకున్నట్లు ఆ ఏడుపేంటి? మా అమ్మ ఉంది కదా! భయం దేనికి? నేనొచ్చి ఏం చేస్తానూ? విషయం తెలుసుకోవడానికి రోజు విడిచి రోజు ఫోను చేస్తానులే మా అమ్మకి " అన్నాడు.

నాలుగో రోజు ఉదయం అప్పటి వరకూ చుక్క చుక్కగా ఉన్న నీళ్ల లాంటి స్రావం హఠాత్తుగా ఆగకుండా మొదలయ్యింది.

"వారం వరకూ ఏం ఫర్వాలేదందిగా డాక్టరు, కంగారెందుకూ?" అని రాగం తీసింది దేవి చెమట్లు పట్టిన తన్మయి ముఖం వైపు చూడకుండానే.

మరో గంటలో "నా పరిస్థితి ఏమీ బాగో లేదు. పైగా కడుపులో అంతగా కదలడం లేదత్తమ్మా." దేవితో మళ్లీ చెప్పింది తన్మయి.

"ఎందుకైనా మంచిది ఓ సారి డాక్టరు దగ్గిరికి తీసుకెళ్లరాదూ" అన్నాడు శేఖర్ తండ్రి.

డాక్టరు పరీక్ష చేస్తూనే జాయిన్ అవ్వండి "వెంటనే డెలివరీ చెయ్యాలి, ఉమ్మనీరు బాగా పోయింది. బిడ్డకి ప్రమాదం" అన్నాక గానీ దేవికి కోడలి పరిస్థితి అర్థం కాలేదు.

మరో రెండు గంటల్లో జ్యోతి, భాను మూర్తి వచ్చేరు.

శేఖర్ ఎలాగూ రానన్నాడు. బిడ్డని ముందుగా చూడడానికి కనీసం తల్లైనా పక్కన ఉంటే బావుణ్ణని కోరుకుంది తన్మయి.

చాలా చిన్న ఆసుపత్రి అది. డాక్టరు కన్సల్టింగు గది వెనక డెలివరీ గది, దాని పక్కనే మరో మూడు గదులు.

డెలివరీ గది మధ్యలో ఒక పక్కన అర్ధ చంద్రాకారంలో కత్తిరించిన బల్ల మీద రెండు వైపులా తాళ్లు కట్టిన ఊసలున్నాయి. అదొక వధ్యపలకలా కనిపించి భయం రెండింతలైంది తన్మయికి.

కడుపు మీద చెయ్యి పెట్టుకుని కళ్లు మూసుకుని ప్రార్థించింది. "భగవంతుడా, నేనేమైపోయినా ఫర్వాలేదు. నా బిడ్డని రక్షించు."

తన్మయిని బల్ల మీద పడుకోబెట్టి నర్సు వచ్చి ఏవో ఇంజషన్లు ఇచ్చింది. మెల్లగా కడుపంతా కలయదిప్పుతూ నొప్పి మొదలయ్యింది. రెండు కాళ్లూ మోకాళ్ల వరకూ పైకి మడత బెట్టి గుంజలకి జేరబెట్టి తాళ్ళతో కట్టేరు. చేతులకు తాళ్ళు ఆధారంగా చుట్టి, చప్పున మూలుగుతూ నొప్పులివ్వమని డాక్టరు గట్టిగా చెప్పడం మొదలెట్టింది.

నొప్పులు పడ్తూనే తల్లి కోసం గదంతా కలయజూస్తూ ఉంది తన్మయి.

దేవి గదిలో ఒక పక్కగా ఉన్న బల్ల మీద కూచుని నవ్వుతూ చూస్తూందిదంతా. మధ్య మధ్య "ఊరుకోవే తల్లీ, డాక్టరు చెప్పినట్లు నొప్పులియ్యి. తొందరగా ఆయిపోతుంది" అంటూంది.

"అమ్మా, అమ్మా" అని గోల పెట్ట సాగింది తన్మయి.

బైట కూచున్న జ్యోతిని నర్సు పిలుచుకొచ్చింది. తల్లి చెయ్యి గట్టిగా పట్టుకుని ఏడవడం మొదలెట్టింది తన్మయి. అప్రయత్నంగా "అమ్మా! ఇంకెప్పుడూ నీ మాట వినకుండా తప్పు పనులు చెయ్యను. ఇక నన్ను అతని దగ్గిరికి పంపకు." అనసాగింది.

"మధ్యలో నాకొడుకేం చేసేడమ్మా" అని గట్టిగా అనసాగింది దేవి.

"నీ బాధ చూడలేనమ్మా. నాకంత ధైర్యం లేదు. బయట కూచుంటాను. మీ అత్తగారు ఉంటుందిలే ఇక్కడ" అంది జ్యోతి చెయ్యి నెమ్మదిగా వదిలించుకుంటూ.

తన్మయికి ఎటూ దిక్కు తోచడం లేదు. ఏం జరుగుతూందో కూడా తెలియడం లేదు. కళ్ళు తేలిపోతున్నాయి. ఒకే విధంగా పెట్టి ఉంచడంవల్ల కాళ్ళు తెగ గుంజేస్తున్నాయి. తుంటి ఎముకలు విరిగిపోతున్న నెప్పులొక పక్క, కింద రంధ్రాల నించి ఏవేవో బయటికి పోతున్న తడి తడి చికాకు స్పర్శ ఒక పక్క. ఎంతగా డాక్టరు చెప్పినట్లు చేస్తూన్నా కడుపులోంచి బిడ్డ బయటికి రావడం లేదు.

నాలుగైదు గంటలు గడిచిపోయినా ఇదే పరిస్థితి.

"ఏవిటమ్మా ఈ పిల్ల, అస్సలు నొప్పులివ్వదు. తెల్లార్లూ ఇలా నిలబెట్టదా మమ్మల్ని ఇప్పటికే అర్ధ రాత్రి అయ్యింది" అని డాక్టరు విసుక్కోవడం మొదలెట్టింది.

"మరేమనుకున్నారు డాక్టర్, ఈ మొండి పిల్ల చెప్పిన మాట వినడం లేదని నాకొడుకు అస్తమానూ బాధ పడ్తున్నాడు." అని దేవి వంత పాడ సాగింది.

తన్మయికి మాటల వల్ల బాధ రెట్టింపు అయ్యింది. "భగవంతుడా! నన్ను చంపెయ్యి. నాకొడుకుని రక్షించు" అని మూగగా ప్రార్థించింది.

పది నిమిషాల తర్వాత ఉన్నట్టుండి అంతా తనని వదిలేసి బయటకు వెళ్ళిపోవడం గమనించింది తన్మయి. ఆయమ్మని అడిగి కాళ్లు బారజాపుకుంది తన్మయి. ఒక్క సారిగా హాయిగా అనిపించింది. కడుపులో నొప్పి కూడా మందగించింది. అలిసిపోయినట్లు కడుపులో ఎటువంటి కదలికా లేదు.

కడుపు మీద మెల్లగా చెయ్యి పెట్టుకుని "నాన్నా, నిద్రపోతున్నావా? నీకేం భయం లేదు. అమ్మ ఉంది. నేను నిన్ను సురక్షితంగా బయటకు తీసుకు వస్తాను." అంది లోపల్లోపల.

మనస్సులో ఉన్న పిరితనాన్ని ఇక తీసి వెయ్యాలి. ధైర్యంగా ఈ బిడ్డను బయటకు తీసుకురావాలి.....ధైర్యంగా... " తనలో తను గొణుక్కుంటున్నట్లు గట్టిగా అనసాగింది. అర్థమయీ కాని తన్మయి మాటలు విని ఆయమ్మడాక్టరుని పిలుచుకు రావడానికి వెళ్లింది. గుండె చప్పుడుతో బాటూ గడియారం చప్పుడు మహాగట్టిగా వినిపిస్తూంది.

"ధైర్యంగా ఈ బిడ్డను బయటకు తీసుకురావాలి" పది సార్లు అనుకున్న తర్వాత స్థిరంగా నిర్ణయించుకుంది. "డాక్టరుతో చెప్పాలి. "తన బిడ్డ తనకి ముఖ్యం. తను కాదు. ఆపరేషను చేసైనా బయటకు తియ్యమని డాక్టరుతో చెప్పాలి".

ఇంతలో జ్యోతి ఏడుస్తూ లోపలికి వచ్చింది." ఏవిటమ్మా, ఇదంతా?" అంటూ చుట్టూ ఉన్న దేవుడి పటాల వైపు చూస్తూ మొక్కసాగింది.

"ఏవైంది?" అంది తన్మయి. "డాక్టరు 'నా వల్ల కాదు. మీ అమ్మాయిని మరో డాక్టరు దగ్గిరికి తీసుకెళ్ల'మని చెప్తూంది" అంది ఏడుస్తూ.

"ఒకసారి నేను మాట్లాడతాను" అంది తన్మయి ఓపిక లేకున్నా, తెగింపుగా.

దేవి వెనకే డాక్టరు వచ్చింది. "ఆపరేషను చేసైనా నా బిడ్డని బతికించండి" రెండు చేతులూ ఎత్తి డాక్టరుకి దణ్ణం పెట్టింది తన్మయి.

"ఆపరేషను చెయ్యగలిగితే చెయ్యమా? బిడ్డ తల మధ్యలో ఇరుక్కుపోయింది. నువ్వు ఎంత గట్టిగా నొప్పులిస్తే అంత త్వరగా బిడ్డ ప్రమాదం లేకుండా బయటకు రాగలుగుతాడు. అంతా నీ చేతుల్లోనే ఉంది. ఇదొక్కటే మార్గం" అంది.

తన్మయికి గుండె వేగం హెచ్చింది. డాక్టర్ నాకు నొప్పులు రావడం లేదు అంది గాభరాగా. "ఇదిగో మళ్లీ నొప్పులకి ఇంజక్షను ఇస్తాను. నువ్వు సహకరించి ముందుకు తొయ్యి. ఇది సాయిబాబా విభూది ఏదీ నోరు తెరు" అంటూ కాస్త నోట్లో వేసి, కాస్త పొట్టకి రాసింది. "ఆ పైన భగవంతుడున్నాడు" అంది.

తన్మయికి ఒక్కటే దృశ్యం కళ్ల ముందు. కడుపులో బిడ్డ ఊపిరి సలపకుండా తల తిప్పుతున్న దృశ్యం. "భగవంతుడా రక్షించు, భగవంతుడా రక్షించు" అనుకుంటూ పళ్ళు గిట్ట కరిచి శక్తిని కూడదీసుకుని నొప్పులివ్వసాగింది.

ఫోర్ సెప్స్ చప్పుడు, శబ్దం చేసే వాక్యూం మెషినుతో బిడ్డ తలని లాగడం వంటివి తెలుస్తున్నాయి.

పక్కనున్న ఆయమ్మ తన్మయి చెయ్యి గట్టిగా పట్టుకుని "ఏసయ్యా.. ఏసయ్యా" అంటూ ఉంది.

తెల్లవారుతుండగా ఒక్కసారిగా వరద కట్టలు తెంచుకున్నట్లు, ఏదో తెగి దభాలున భూమి మీద పడ్డట్లు, కడుపులోంచి ఒక తూటా హఠాత్తుగా బయటకు వచ్చినట్లు జర్రున ఒక స్పర్శ, వెనకే చంటి బిడ్డ ఏడుపు వినిపించాయి తన్మయికి. ఆనందంతో నవ్వడానికీ, శరీరపు బాధతో దు:ఖించడానికీ ఓపిక లేదు తన్మయికి.

కళ్ల ముందు బిడ్డని చూపించింది నర్సు. "హమ్మయ్య తల్లీ, ఇదిగో నీ కొడుకు" అంటూ.

ఒళ్లు తుడవ గానే దేవి పక్కనే ఉండి ముందుగా బిడ్డని చేతిలోకి తీసుకుంది."నా మనవడు" అంటూ.

మరో అరగంటలో తన్మయిని జబ్బలు పుచ్చుకుని లేపేరు. పదిహేను కుట్లు వెయ్యడం వల్ల ముళ్ళు గుచ్చుకుంటున్నట్లు అడుగు పడడం లేదు తన్మయికి.

ఆ పక్కనే వెల్తురు సరిగా లేని గదిలో నేలకి కాస్త ఎత్తులో ఉన్న ఇనప మంచమ్మీద పడుకోబెట్టారు తన్మయిని. జ్యోతి కూతురి మాట మర్చిపోయి అపురూపంగా మనవడిని చూసుకో సాగింది. "మీ అమ్మని ఎన్ని కష్టాలు పెట్టేసేవు నాయనా" అంది నవ్వుతూ.

తల్లి ఒళ్ళో పొత్తిళ్ళలో ఉన్న బిడ్డని చూసి అప్పటి వరకు ఉన్న బాధంతా ఎగిరిపోయింది తన్మయికి. బాబుని పక్కన వెయ్యమని అడిగింది.

అప్పుడే పుట్టినా రెండు నెలల పిల్లాడిలా పొడవైన శరీరం, పాల నురుగులాంటి మంచి రంగు, చక్కగా విప్పారి గుండ్రంగా తిప్పుతూన్న చిన్ని కళ్లు, చిన్న ఉంగరాల జుట్టు, అదే పనిగా జుముక్కుంటూన్న అరచెయ్యి వెనక చిన్ని అందమైన బుల్లి నోరు.

తన్మయి కళ్ళల్లోంచి సంతోషంతో నిండిన నీళ్లు జారి బుగ్గల్ని తడిపేసేయి.

ప్రపంచంలో అంత వరకూ ఇంత అందమైన పసి బిడ్డని ఎప్పుడూ చూడలేదు తన్మయి. కడుపులో నుంచి తెలీని ఆనందం కలగసాగింది.

దగ్గరకు తీసుకోవాలని అనుకుంది. ఇన్నాళ్లూ రోజూ కబుర్లాడుతూ ఉన్నా, గబుక్కున ముట్టుకోవడానికి ఏదో ఒక విచిత్రమైన అపరిచిత భావన కలిగింది. పక్కన పడుకున్న పసి వాడి బుగ్గ మీద చూపుడు వేలి తో నెమ్మదిగా రాసింది. మరు నిమిషంలో దగ్గరకు తీసుకుని హత్తుకుంది, ఒక్క సారిగా గుండె ఉప్పొంగినట్లయ్యింది.

"ఎవరీ బుడతడు? నా కడుపు నించి ఉద్భవించి నన్ను పాల తల్లిని చేసిన వాడెవడీ బుడతడు?" అప్రయత్నంగా తన్మయి పెదాల వెనక మాటలు కదిలి, పెదవుల మీద చిర్నవ్వు మొలిచింది.

"శేఖర్! నువ్వు నా కష్టం చూడకపోయినా ఫర్వాలేదు. ఈ చిర్నవ్వు చూసి ఉంటే ఎంత బావుండేది?!" అప్రయత్నంగా అనుకుంది.

తన్మయికి జీవితంలో మొదటి సారి గెలిచిన భావన కలిగింది. "బహుశా: తను చావుని జయించింది. మరణం అంచు వరకూ వెళ్లి రావడం కంటే కష్టం ఏవుంటుంది?" ఇక మీదట దేనికీ భయపడకూడదని నిర్ణయించుకుంది.

తన్మయికి ఒకటి మాత్రం బాగా అర్థం అయ్యింది. "మరణం దగ్గిర ఎవరూ తోడురారు. అమ్మయినా, భర్తయినా. దీనితో పోలిస్తే మిగతా కష్టాలన్నీ ఏ పాటి?"

ఇంటికెళ్లొచ్చి అప్పుడే గదిలోకి వచ్చిన దేవి "శేఖర్ రేపు ఉదయం వస్తున్నాడు."ఒరేయ్ నాన్నా, మీ నాన్నొస్తున్నాడురా " అంది నవ్వుతూ.

## 16

శేఖర్ మర్నాడు తెల్లారగట్ల కి వచ్చేడు. ఏదో పెట్రోలు వాసనలా వస్తే ఉలిక్కిపడి లేచింది తన్మయి. కళ్లు తెరవగానే ఎప్పటినించో స్నానం చెయ్యనట్లు మకిలిపట్టి ఉన్న శేఖర్ కనిపించేడు. పక్కనున్న హాయిగా నిద్రపోతున్న పసివాడి మీదికి వాలి, కళ్ల నిండా గొప్ప సంతోషంతో చూడసాగేడు.

అంతలోనే "రారా, నాన్నా. ఈ నాన్న దగ్గిరికి వచ్చేయి." అంటూ అమాంతంగా నిద్రపోతున్న వాణ్ణి చేతుల్లోకి తీసుకుని భుజాన వేసుకున్నాడు.

అరగంట దాటినా కొడుకుతోనే కబుర్లు చెప్తూన్న శేఖర్ వైపు చూస్తూ "నేనెలా ఉన్నానో అడిగేవా?" అంది తన్మయి ఉక్రోషంగా.

"నీకేవే, తొమ్మిది నెల్లు పందిలా తిని ఎలా ఊరేవో చూడు. నా కొడుక్కి నువ్వు తిన్న దాంట్లో పదో వంతు వచ్చినా బావుణ్ణు. చూడు, వీడి కాళ్లూ చేతులూ ఎలా బలహీనంగా ఉన్నాయో. అసలే మగోడు." అని వెకిలిగా నవ్వేడు.

ఆ మాటలకి అదే గదిలో మరో వైపు పడుకున్న జ్యోతికి మెలకువ వచ్చినట్లుంది. "అసలే నిన్నంతా పురిటి నెప్పులు పడీ పడీ మొఖం పీక్కుపోయి ఉందది. అవేం మాటలు బాబూ!" అంది.

"మీ అమ్మని కాస్సేపు నోరుమూసుకుని ఉండమంటావా?" గద్దిస్తూ గట్టిగా అన్నాడు.

"ఏం, నేనెందుకు నోరు మూసుకోవాలి? నువ్వేవైనా నాడెంగా మాట్లాడతన్నావా?" అందుకుంది జ్యోతి.

"నా పెళ్ళాం, నా ఇష్టం. ఛీ..ఛీ.. పెళ్లాంతో వేళాకోళం ఆడుకోవడానికి కూడా లేదు. మీ వాళ్లింకెప్పటికీ మారరు. ఇదిగో ముందే చెప్తున్నాను. నెల రోజులలో నువ్వు మా ఇంట్లో ఉండాలి. ఇదే వంక పెట్టుకుని అమ్మగారింట్లో నెలల తరబడి మకాం వేయడం కాదు." అంటూ బయటికి వెళ్లిపోయాడు.

ఏ మాటా వినే ఓపిక లేని తన్మయి నిస్తేజంగా కళ్లు మూసుకుంది. 'అతనెందుకు వచ్చాడో, ఎందుకు వెళ్లిపోయాడో' ఏదీ ఆలోచించాలని లేదు.

పక్కన చిన్న గొంతుతో "కీచు కీచు" మని ఏడుస్తున్న పసి వాడిని దగ్గరకు లాక్కుని తల నిమిరింది.

"ఇవేవీ పట్టించుకోకు నాన్నా! హాయిగా పాలు తాగి బజ్జో." అని వాడి చెవిలో గుసగుసలాడింది.

ఏదో అర్థమైనట్లు కళ్లు విప్పి తనకేసి చూస్తున్న బుడతడి వైపు ఆశ్చర్యంగా చూసింది.

"వీడు నిన్నే ఈ భూమి మీది కొచ్చి అంతలోనే ఏదో ప్రపంచమంతా అర్థమయ్యినట్లు ఎలా చూస్తున్నాడో!" అంది పైకి అప్రయత్నంగా.

జ్యోతి అటు వైపు తిరిగి పడుకుంది. ఏడుస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తూంది.

"శేఖర్ మాటలు పట్టించుకోకమ్మా" అంది నెమ్మదిగా ఓపిక తెచ్చుకుని తల్లితో.

అతని మీద ఉన్న కోపమంతా ఒక్కసారిగా పెల్లుబుకుతూన్న గొంతుతో "అవునమ్మా, నువ్వూ నాకే చెప్పు. మొగుడికేమీ చెప్పుకోకు. అయినా నేను నీలా దద్దమ్మని కాను. నోరు మూసుకుని ఉండడానికి. పెళ్లయిన కొత్తలో నిన్ను "కుక్కా!" ఇలా రావే" అని పిలిచినప్పుడే వాడి పళ్లు రాల గొట్టి ఉండాల్సింది. అదేదో గొప్పన్నట్లు , ఆ రోజు వాడది 'జోకన్నప్పుడు' నువ్వూ తలూపేవు. ఇప్పుడు చూడు, పురిటి మంచంలో ఉన్న నిన్ను పట్టుకుని అంతంత మాటలంటాడా? నేనెందుకు ఓర్చుకోవాలి?" అంది గట్టిగా.

"ఎందుకు ఓర్చుకోవాలి?" ఆ ప్రశ్నకి సమాధానం తన్మయికి కూడా తెలీదు.

"అతన్ని ఇష్టపడినందుకో, ఎవరు కాదన్నా పెళ్లి చేసుకున్నందుకో...నిజంగా తను దద్దమ్మ అయినందుకో ... సమాధానం నాకే తెలీదు" అనుకుంది మనసులో.

కానీ ఇప్పుడిక ఏవన్నా, అతన్ని తను వెనకేసుకొస్తున్నానని తన మీద కోప్పడుతుంది తల్లి.

అందుకే మౌనంగా కళ్లుమూసుకుంది.

"నిన్న రోజంతా బల్ల మీద అనుభవించిన నరకం, మరణపు చివరి మెట్టు మీద కాలు మోపి వచ్చిన క్షణం ముందు ఇవన్నీ ఎంత? మాటలదేముంది, ఇవేళుంటాయి. రేపు మర్చిపోతాం. అయినా తనకు తన బిడ్డ ముఖ్యం. వీళ్లెవరూ కారు. బాబు కోసమైనా తను సంతోషంగా ఉండాలి." అని దృఢంగా అనుకుంది మనసులో.

పిల్లాడికి పాలిద్దామని దగ్గరకు తీసుకుంది.

దగ్గరకు తీసుకోవడమే తడవుగా పాల కోసం అలమటించినట్లు హడావిడిగా ముఖాన్ని గబగబా తిప్పేయసాగేడు బాబు.

నిన్నటి నుంచి ప్రయత్నిస్తున్నా పాలు పట్టుకోవడం రావడం లేదు, హడావిడి మాత్రం చాలా ఎక్కువ. "ఏంటిరా నాన్నా! నాకూ కొత్తేరా. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు." అంది మురిపెంగా.

పక్కన పడుకుని కాస్సేపూ, కూర్చుని కాస్సేపూ ప్రయత్నించసాగింది.

ఒళ్లో వేసుకోగానే బాబు కళ్లు కాస్త పచ్చగా కనిపించాయి.

తల్లిని పిలిచి చూపించింది. "ఏం ఫర్వాలేదులే, పిల్లలకి మొదటి మూడు రోజులు ఇలాగే ఉంటాయి కళ్లు. అయినా ఇందాకా డాక్టరమ్మ వచ్చి చూసిందిగా.ఏవీ చెప్పలేదు." అంది జ్యోతి.

మర్నాడు డాక్టరు రౌండ్లకి వచ్చే వేళకి దట్టమైన పచ్చదనం అలుముకుంది బాబు కళ్లకి.

"రండి డాక్టర్, ముందా కళ్లు చూడండి" అంది తన్మయి.

"ఊ.. పిల్లాడు బాగా నలిగి పోయేడు కదా కాన్పులో. కామెర్లు వచ్చాయి. మా దగ్గర పిల్లలకు ఇందుకు వైద్యం చేసే ఫెసిలిటీ లేదు. రెండు వీధుల అవతల హాస్పిటల్ కు రాసిస్తాను. మీ అత్తగారికి తెలుసులే. తీసుకెళ్లండి. అయినా నిన్ను ఇవేళ డిశ్చార్జి చేసేస్తాం" అంది తాపీగా.

తన్మయి గుండెల్లో ఒక్కసారిగా మొదలైన భయం శరీరమంతా పాకి కాళ్లు ఒణక సాగేయి. "బాబుకి కామెర్లా?! భగవంతుడా! నన్నెందుకు ఇన్ని విధాలుగా పరీక్షిస్తున్నావు? లేదు. నా బాబుకి ఏవీ కాదు. అంత కష్టమైన కాన్పు నించే బతికి బయట పడ్డాడు. మృత్యుంజయుడు వీడు. వీడికెప్పుడూ ఏవీ కానివ్వను." కన్నీళ్ళు తుడుచుకుంది తన్మయి.

డాక్టరు అలా వెళ్లగానే పిల్లాడిని గుడ్డల్లో చుట్టి, డాక్టరిచ్చిన కాగితం పట్టుకుని ఒక్క ఉదుటున బయటకు వచ్చింది. వెనకే జ్యోతి గట్టిగా పిలుస్తూన్నా వినిపించుకోలేదు.

తడబడే అడుగులతో, తడి ఆరని కుట్ల బాధని అదిమి పెట్టి, హవాయి చెప్పుల్ని ఈడ్చుకుంటూ రెండు వీథులు ఎలా దాటిందో తెలియలేదు.

తన్మయి మనస్సులో ఒకటే ఆలోచన. "బాబుకు ఏవీ కాకూడదు. వీలయ్యినంత త్వరగా వైద్యం చేయించాలి."

జ్యోతి కూతురి బాధ చూసి కళ్ళ నీళ్లు పెట్టుకుంటూ కూడా నడిచింది. "సమయానికి మీ నాన్న కూడా ఏదో పనున్నట్టు పొద్దున్నే బయటికెళ్లి పోయేరు చూడు. ఇక మీ ఆయన ఎటు పోయేడో ఏమో. తండ్రీ, ఏడుకొండల వాడా.." అంటూ.

ఎండలో నడిచొచ్చినందుకో, విపరీతమైన ఆదుర్దాకో తన్మయి ఒళ్ళంతా చెమటలు ధారాపాతంగా కారసాగేయి. ఈ ఆసుపత్రి కొంచెం పెద్దది. ముందు డెస్కు., చుట్టూ బోల్డు మంది పేషంట్లని చూడగానే నీరసం వచ్చింది తన్మయికి. అయినా అటుగా కనబడ్డ నర్సుకి పిల్లాడిని చూపించింది. అదృష్టం కొలదీ పిల్లాడిని చూడడానికి డాక్టరు దగ్గిరికి వెంటనే లోపలికి పంపించేరు.

డాక్టరు బాబుని చూస్తూనే "అర్జంటుగా అడ్మిట్ చెయ్యండి. బాబుకి అల్ట్రా వయొలెట్ లైట్ ట్రీట్ మెంట్ మొదలెడతాం." అన్నాడు.

"ఖర్చు గురించిన దిగులు పడకమ్మా. నా దగ్గిర ఉన్న దాంతో అడ్వాన్సు కడతాను. నాన్నగారు వచ్చేక మిగతాది ఆలోచిద్దాం." అంది జ్యోతి తల నిమురుతూ.

తల్లి మాటలకి కన్నీళ్లు ఆగలేదు తన్మయికి. కావలించుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది. "ఊరుకోమ్మా, ఊరుకో. బాలింతవు, ఇలా ఏడవకూడదు." అంది జ్యోతి.

పిల్లాడి చేతికి సూది గుచ్చి మందులిస్తూంటే గుండె విలవిల్లాడసాగింది తన్మయికి. అసలే ముందు రోజే టీకా వేసారు. కిళ్లు పెట్టి ఏడుస్తున్న పిల్లాడిని చూస్తూంటే తన్మయికి కళ్లనీళ్లు ఆగడం లేదు. ఆగకుండా వస్తున్న కన్నీళ్లని ఒత్తుకుంటూ కూచుంది.

నిశ్శబ్దంగా ఉన్న గదిలో ట్యూబ్ లైట్లు బిగించినట్లున్న బల్ల మీద బట్టల్లేకుండా పడుకోబెట్టిన బాబుని చూస్తూంటే, ఒక పక్క నించి తగ్గుతుందో లేదో అన్న భయం, పైకి చెప్పడం రాని వాడికి ఒంట్లో ఎలా ఉందో తెలీనితనం చుట్టుముట్టి అయోమయంగా కూచుంది తన్మయి ఎదురుగా బల్ల మీద.

జ్యోతి బయటికి వెళ్లి ఫోన్లు చేసింది అందరికీ.

మరో గంట తర్వాత పరుగులాంటి నడకతో దేవి వచ్చింది."అదేమమ్మా, మమ్మల్నెవరినీ పిలవకుండా, అసలు ప్రసూతి ఆసుపత్రి నించి డిశ్చార్జి అవ్వకుండా ఇలా ఉన్న పళాన వచ్చెయ్యడమేనా? డాక్టరు నాకు ఫోను చేసి తల మొయ్యా చీవాట్లు పెట్టింది. పిల్లకి తెలియక పోతే నీకైనా తెలియొద్దా ఒదినా" అంటూ.

తన్మయి ఇవేవీ పట్టనట్లు కన్నార్పకుండా బాబు వైపే చూస్తూంది. ఏదో లోకంలో ఉన్నట్లు హాయిగా నిద్రపోతూ, నిద్దట్లో ప్రశాంతంగా నవ్వుతున్న బాబు ముఖాన్ని చూస్తూ "పసిపిల్లలంత హాయిగా అంతా ఉండరెందుకు?" అనుకుంది.

పిల్లాడి ముఖమ్మీద, తెల్లని ఒళ్ళంతా అలుముకున్న పచ్చదనం దగ్గిరికెళ్లి చూసేక, "పోనీలే. మంచి పని చేసేరు. అన్నట్లు శేఖర్ రాత్రంతా ఇక్కడే ఉన్నాడా? పొద్దనగా వచ్చి నిద్రపోతున్నాడు. ఇంకా వాడికి చెప్పలేదు. నేనింటికి వెళ్లి శేఖర్తో కేరేజీ పంపిస్తాను. అన్నట్లు పిల్లలకి కామెర్లు ఉన్నపుడు తల్లి కటిక పత్యం చేయాలి. నీకు పాలన్నం పంపుతాను. వాడికి తగ్గే వరకూ అలానే తినడం మంచిది." అంది.

తన్మయి తలాడించింది.

నిజానికి తన్మయికి చిన్నతనం నించీ పాల వాసన పడదు. ఏదైనా పౌడరు కలుపుకుంటే గానీ తాగలేదు.

పిల్లాడికి తగ్గుతుందంటే "ఏదైనా చేస్తాను." దృఢంగా అనుకుంది.

శేఖర్ కేరేజీ పట్టుకొచ్చి ముభావంగా పిల్లాడి దగ్గిర కూచున్నాడు.

ఏవీ కలపని చప్పటి పాలన్నం మొదటి ముద్ద బయటికి రాబోయింది తన్మయికి. కానీ పిల్లాడికి పాలివ్వాలి అంటే తను తినాలి. కళ్ళు మూసుకుని గబగబా గొంతులో పోసుకుంది.

ఎవరి ముఖ కవళికలూ పట్టించుకునే స్థితిలో లేదు తన్మయి. అసలు ఎవరూ మాట్లాడకుండా ఉంటే బావుణ్ణని ఉంది. పొద్దుట్నించీ యోగినిలా కూచుని ఉంది. నర్సు వచ్చి పాలు ఇమ్మన్నపుడల్లా బాబుని ఎత్తుకుని పక్క గదిలోకి వెళ్లడం, మళ్లీ వచ్చి కూచోవడం. అంతే. ఒక్కటే ధ్యేయం. "బాబుని సురక్షితంగా ఇక్కడి నించి బయటకు తీసుకెళ్లాలి. ఏ కష్టమూ రాకుండా ఈ బిడ్డని కాపాడాలి."

పాలిస్తూ కన్నీళ్లతో తడుస్తున్న చెంపల్ని ఒత్తుకుంటూన్న కూతుర్ని చూసి "నీకే ఎన్ని కష్టాలు వచ్చాయే తల్లీ" అని తల నిమరసాగింది తల్లి.

శేఖర్ ఒక్క మాట కూడా మాట్లాడకుండానే సాయంత్రం వరకూ ఉండి బయటకు వెళ్లిపోయేడు.

--------

మూడు రోజులు గడిచాయి. బాబుకి రోజుకొంత నయమవుతూ వస్తూంది. శేఖర్ "పనిలోసెలవు లేదని మళ్లీ డిశ్చార్జి సమయానికి వస్తానని" వెళ్లేడు.

ఆ రోజు దీపావళి. బయటంతా పెద్ద చప్పుళ్లు. తన్మయికి దీపావళంటే అస్సలు ఇష్టం ఉండదు. ముఖ్యంగా శబ్ద కాలుష్యాన్ని తను అస్సలు భరించలేదు.

చిన్నప్పుడు దీపావళికి చెవుల్లో దూదులు పెట్టించుకుని వంటింట్లో బెల్లమో, చింతపండో జాడీల పక్కన కూచునేది.

శేఖర్ కి దీపావళంటే చాలా ఇష్టం. తనతో బాటూ తన్మయిని బయటకు లాగి బాగా ఏడిపించాడు కిందటి ఏడాది.

జ్యోతి అలా బయట నిలబడి చూసొస్తానని వెళ్లింది.

తలుపులు మూసుకుని ఉన్న ఏ. సీ గదిలో లైటు కింద బాబు దగ్గిర కూచుని కబుర్లు చెప్ప సాగింది తన్మయి.

"నాన్నా! బయట శబ్దాలకి భయపడకూ! అమ్మని ఇక్కడే ఉన్నానుగా నీకేమీ కాదు. నువ్వు తొందరగా నయం చేసేసుకో. ఇంటికి వెళ్ళిపోదాం. బయట ప్రపంచం అంతా సంబరాలు చేసుకుంటున్నారు. మనిద్దరమేమో ఇలా. మనమూ పండగ చేసుకుందాం. నీకు అన్నీ తినడం రాగానే నీకు నచ్చినవన్నీ వండి పెడతాను. సరేనా!"

బాబుకి ఏం పేరు పెట్టాలో అని సంభాషణలు అందరి నోటి వెంటా వస్తున్నాయి.

అట్నించీ, ఇట్నించీ మొదటి మనవడు కావడం వల్ల తాతగార్ల పేర్లు పెట్టాలని ప్రతిపాదనలు ఎక్కువయ్యాయి.

"నీకేం పేరు కావాలి నాన్నా? అమ్మాయిగా పుడతావేమోనని నేను బోల్డు పేర్లు సిద్ధం చేసుకున్నాను. కానీ అబ్బాయివి అయిపోయేవు. నీ పాల బుగ్గలంత మృదువైన మంచి పేరు పెట్టాలని ఉంది నీకు. అమ్మని పెట్టమంటావా? వద్దా?" అంది సాలోచనగా.

అమ్మనే పెట్టమన్నట్లు చిర్నవ్వు నవ్వాడు పసివాడు.

"ఊ...ఏం పేరు పెట్టుకుందాం? బుచ్చిబాబు, చలం, తిలక్.... ఊ.. వద్దులే కవులూ, రచయితలూ వద్దు. ఎవరికీ ఉండని పేర్లేవైనా..... అంటే.... అజ్ఞాత్ లాంటివి... బాలేవు కదూ....

నీ పాల బుగ్గల్లాంటి మృదువైన పేరేదీ.......... ఆ..."మృదుల్" ... బావుందా? మరి ముద్దు పేరు? బుజ్జి, కన్నా, చిన్నా, చంటీ....పోనీ "నాన్నారూ".

"తనకంతా సమ్మతమే అన్నట్లు ఇంకాస్త ప్రశాంతంగా నవ్వేడు."

"అమ్మలు, నాన్నలు, కన్నలు, బుజ్జులు, బంగారాలు ... అన్నీ నువ్వే కదమ్మా..." బాబుతో పాటూ హాయిగా తనూ నవ్వేసింది.

"మనం తొందరగా ఇక్కణ్ణించి ఇంటికి వెళ్లిపోదాం. హాయిగా పాలు తాగి తొందరగా పెద్దాడివయ్యిపోయి రోజూ ఆడుకుందాం..." ఏవేవో కబుర్లు చెప్తూన్న కూతురి వైపు అప్పుడే వచ్చిన జ్యోతి మురిపెంగా చూసింది. "నిన్నా మొన్నటి పసిపిల్లకి అప్పుడే కొడుకు" అంటూ మురిసిపోయింది.

--------

డెలివరీ అయిన పదిహేనో రోజున బాబుకి అంతా నయమయ్యిందని డిశ్చార్జి చేస్తామని చెప్పేరు. తన్మయి ముఖంలో ఇన్ని రోజులుగా తప్పిన కళ మళ్లీ తిరిగొచ్చింది.

డెలివరీ భయంకరమైన అనుభవంగా మిగిలింది. అందులోంచి తేరుకోకముందే బాబు విషయంలో ఖంగారు వల్ల గాభరా పడడం తప్ప ఏవీ సంతోషం లేదిన్నాళ్లూ.

తన్మయికి ఎక్కడ కూచుంటే అక్కడ కళ్లు తిరగడం మొదలయ్యాయి. "బహుశా: మానసికంగా బాగా ఓపిక లేకుండా అయిపోయినందువల్ల" అంది డాక్టరు.

కుట్లు విప్పినప్పటి కంటే అధికమైన బాధ అనుభవించింది ఇన్నాళ్లూ పిల్లాణ్ని చూస్తూ. శేఖర్ దగ్గర ఉండి కాస్త ఓదార్పుగా ఉంటే ఎంతో బావుండేది. వచ్చి గొడవపడి వెళ్లిపోయాడు. అదొక మానసిక వ్యథ తయారైంది తన్మయికి. ఇలాంటి తండ్రితో ఈ పిల్లవాడి జీవితం ఎలా తయారవుతుందో అని ఆలోచించసాగింది అస్తమానూ. ఎంత ధైర్యం తెచ్చుకుందామన్నా కొన్ని సార్లు ఇలాంటి ఆలోచనలు చుట్టుముట్టి దిగులు తప్పడం లేదు.

"మొదటి కాన్పుకి అంతా అమ్మగారే పెట్టాలి." అంది దేవి ముందు రోజు.

"అసలే అందరం పిల్లోడికిలా అయ్యిందని బాధతో కుంగిపోతన్నాం. డెలివరీ అంటే మా పిల్లకి డెలివరీ ఆసుపత్రిలో అయిన ఖర్చు, ఇక్కడ చంటి పిల్లోణ్ణి జాయిన్ చేసేం. ఈ ఖర్చంతా కూడా మమ్మల్నే పెట్టు కోమంటే ఎలా?" అంది జ్యోతి.

"పిల్లలన్నాక ఎన్నో వస్తాయి. కాన్పుకి వచ్చిన పిల్లకి, బిడ్డకి ఏదొచ్చినా ఖర్చు మీది కాకపోతే మాదా?" అంది అంతే గట్టిగా దేవి.

తన్మయికి గుండె దడ హెచ్చసాగింది. అసలే శేఖర్ ఇప్పటికే అలిగి వెళ్లిపోయేడు. ఇక ఇప్పుడు ఈవిడ కూడా అలిగితే మొత్తం తెంచుకున్నట్లు అవుతుంది.

"అమ్మా! నువ్వు కాస్త ఓపిక పడతావా? నాన్నగారొచ్చేక మాట్లాడి చూడొచ్చు కదా?" అంది తన్మయి హీనమైన గొంతుతో.

"అలా చెప్పమ్మా మీ అమ్మకి. నేను మళ్లీ రేపు వస్తాను." అంది దేవి విసవిసా బయటికి నడుస్తూ.

జ్యోతి తోక తొక్కిన తాచులా గయ్యిమంది. సమయానికి భానుమూర్తి రాబట్టి ఆ సంభాషణ మళ్లీ ఒక యుద్ధానికి దారి తీయకుండా ఆగింది.

"దేవుడి దయ వల్ల మనవడికి అంతా సర్దుకుంది. నేనేదొక రకంగా డబ్బు ఏర్పాటు చేస్తాలే. ఇప్పటికిప్పుడు ఇలాంటి ఖర్చులొస్తాయని వాళ్లు మాత్రం కలగన్నారా ఏంటి? అల్లుడి ప్రయోజకత్వం చూసేవుగా. ఇంకా ఎందుకు వాళ్లనడగడం? " అని కర్ర విరగకుండా, పాము చావకుండా మాట్లాడేడు.

తన్మయి తండ్రి వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసింది.

ఆ సాయంత్రానికి శేఖర్ వచ్చేడు.

వస్తూనే ఏ కళనున్నాడో ఏమో తన్మయి చేతిలో అయిదు వందలు పెట్టాడు. "ఖర్చులకు ఉంచుకో ". అంటూ.

తన్మయి బాధ తీరిందానిలా ఆ డబ్బులు తల్లి చేతిలో పెట్టబోయింది. "వద్దులేమ్మా ఉంచుకో. ఇంత చేసీ మళ్లీ మిమ్మల్నడిగి కట్టేమన్న పేరు మాకెందుకు?" అంది.

ఉన్నంత సేపూ కొడుకు దగ్గరే బల్ల దగ్గర కూచుని ఉన్నాడు శేఖర్.

జ్యోతి బయటకు వెళ్లగానే తన్మయి దగ్గరికి వచ్చేడు. "చూడు, నువ్వు రేపు మీ ఇంటికి వెళ్లి నెల రోజుల్లో తిరిగి వచ్చేయి. నేను మళ్లీ వచ్చే నెలలో వస్తాను. మా ఇంటి దగ్గిరే బాబుకి నామకరణం చెయ్యాలన్నారు నాన్నగారు. అవన్నీ అయ్యేక వైజాగుకి వెళ్లిపోదాం. నాకూ ఇబ్బందిగా ఉంది అక్కడ వొండుకు తినడం. అందుకే ఇల్లు ఖాళీ చేసి సామాన్లు తాతగారింట్లో అవుటు హౌసు తీసి కొత్తగా కట్టిన షెడ్లో పెట్టేను. నువ్వొచ్చేక మళ్లీ ఇల్లు తీసుకుందామని." అన్నాడు.

"అదేవిటి? ఇప్పటి వరకూ ఊరుకుని ఇప్పుడెందుకు ఖాళీ చేయడం?" అంది తన్మయి. తన కళ్లకెదురుగా గోనె సంచుల్లో చిందర వందరగా ఉన్న సామాన్లు, కొత్తగా కొన్న మంచం కోళ్ళు. పరుపు దుమ్ము పట్టి కనబడసాగేయి. "వచ్చే నెలలో వెళ్తే మళ్లీ ఇల్లు సర్దుకోవడానికే సరిపోతుందన్న మాట." అనుకుంది.

"ముందు నేనూ, మా తమ్ముడూ ఉన్నాం కదా, అని ఇల్లు ఉంచేను. ఇప్పుడు వాడికి కూడా మా కంపెనీలోనే ఒరిస్సాలో ఉద్యోగం కుదిరింది. నెలలో ఇరవై రోజులు ఒరిస్సాలో ఉండే మాకు వైజాగులో ఇల్లెందుకు?" అన్నాడు.

"మరి మనకు పోస్టులవీ వస్తేనో?" అంది.

"నాకెవడూ ఉత్తరం రాయడు. మరి నీకు ఉత్తరాలు రాసేవాళ్లున్నారేమో నాకు తెలీదు." అన్నాడు వ్యంగ్యంగా.

అతనితో యూనివర్శిటీ సంగతి చెప్పాలంటే భయంగా ఉంది. అయినా పర్మినెంట్ అడ్రసుగా ఇక్కడి అడ్రసు ఇచ్చింది కాబట్టి ఇక్కడికే పంపుతారేమో రిజల్టు. అయినా ఎందుకైనా మంచిది వీధి చివర STD అబ్బాయికి ఫోను చేసి, లక్ష్మిని పిలవమంటే పిలుస్తాడు. ఇంటికి వెళ్లేక ఒక సారి మాట్లాడాలి అనుకుంది.

యూనివర్శిటీ గురించిన ఆలోచన రాగానే ఇక శేఖర్ చెప్పినవన్నీ ఏదో ఆలోచిస్తూనే "ఊ" కొట్టింది.

"తల్లీ, బిడ్డా క్షేమంగా ఇంటికి వచ్చేరు. చంటోడికి నీ పేరు పెట్టుకుంటాం వెంకన్న తండ్రీ" అంది జ్యోతి మర్నాడు ఇంటికి రాగానే.

చుట్టుపక్కల వాళ్లందరూ సాయంత్రం వరకూ ఒక్కొకరుగా పలకరించడానికి వస్తూనే ఉన్నారు.

పిల్లాడికి దిష్టి తగులుతుందని కాటుక బొట్లు కాళ్లకీ, ముక్కుకి, గడ్డానికీ పెట్టింది జ్యోతి.

"ముందే చెప్తున్నాను నా కొడుక్కి ఆంజనేయ స్వామి పేరు పెడతానని మొక్కుకున్నాను." అన్న శేఖర్ మాటలు చెవిలో గిర్రున తిరిగాయి తన్మయికి.

"తననుకున్న పేరు అసలు వీళ్లెవరైనా పెట్టనిస్తారో లేదో?" అనుకుంది.

ఇరవై ఒకటో రోజు ఉదయానే తల్లీ బిడ్డల స్నానానికి చుట్టాలలో పెద్దావిడని పిలిపించేరు.

అన్నాళ్లూ నలుగంటే తెలియని చంటి పిల్లాడు ఆవిడ గట్టిగా రుద్దుతూంటే కిళ్ళు పెట్టి ఏడ్వ సాగేడు.

బాబు ఏడుపుకి తన్మయి కళ్లల్లో నీళ్ళు తిరగ సాగేయి. చుట్టూ ఉన్న వాళ్లంతా అది చూసి నవ్వులు మొదలు పెట్టేరు. "ఇదేమి సుకుమారమమ్మా" అంటూ. "రేపట్నించీ నేనే స్నానం చేయిస్తాను." అంది తల్లితో తన్మయి.

ఉదయానే పసుపు కలిపిన నలుగు పెట్టించుకుని, తలారా కుంకుడుకాయలతో స్నానం చేసేసరికి తన్మయికి అన్ని రోజుల అలసట తీరినట్లయ్యినా, చాలా నీరసం వచ్చింది.

సాంబ్రాణి వాసనతో నిండిన ఇల్లు మధ్యాహ్నానికల్లా బంధువులూ, స్నేహితులతో నిండిపోయింది.

దేవి ఒక్కతే వచ్చింది. వస్తూనే మనవణ్ణి ఒళ్లో వేసుకుని "మా మనవడు అచ్చు నా కొడుకుపోలికే. ఒరేయ్ నాన్నా, మీ నాన్న అచ్చు నీ లాగే ఉండేవాడురా ఈ వయసులో." అని మురిసిపోయింది.

వచ్చే నెల ఇదే రోజున బాబుకి నామకరణం మా ఇంట్లో జరిపిస్తాం. అంతకు నాల్రోజుల ముందే మంచిరోజు చూసుకుని పంపించెయ్యండి. అక్కణ్ణించి మూడో నెల పడ్డాక వైజాగు వెళ్తారు. మా అబ్బాయికి వండుకోవడం కష్టంగా ఉంది. అన్నట్లు శేఖర్కి ఏదో పనిబడిందని రాలేదు." అంది దేవి.

శేఖర్ రాడన్న సంగతి రూఢిగా ముందే తెలుసు కాబట్టి తన్మయి శేఖర్ కోసం ఎదురుచూడలేదు.

జ్యోతి అప్పటికొద్దీ దేవి చూడకుండా మూతి మూడు వంకర్లు తిప్పింది.

సాయంత్రం అంతా వెళ్లిపోగానే తల్లీ, బిడ్డలకి దిష్టి తీసి "నిన్నా మొన్నటి వరకూ హాస్పిటల్ లో ఉండొచ్చి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు తల్లీ, బిడ్డా." కనీసం మూడు నెలలైనా ఉండనివ్వకుండా నామకరణం వాళ్లింట్లో పెడతన్నామని తీసుకెళ్లిపోవడవేవిటి? అక్కణ్ణించటే పిల్లని దించడవేవిటి? బిడ్డ సారె తయారు చేయించొద్దూ!! అన్నీ ఇలా అఘమేఘాల మీద అయిపోవాలంటే ఎలా? నా మనవడితో నాకూ నాల్రోజులు గడపాలని ఉండదా? వాళ్లకేనా గొప్ప ప్రేమ?! " అని రాగం తీసింది జ్యోతి.

ఆదమరిచి నిద్రపోతున్న కొడుకుని దగ్గరకు తీసుకుని తన్మయి కళ్లు మూసుకుంది.

"ప్రపంచంలో బాధించే మాటలనేవి లేకుండా ఉంటే ఎంత బావుణ్ణు!

ఎప్పుడూ మనుషులు ఆనందదాయకమైన మాటలే మాట్లాడుకోగలిగితే!!"

హఠాత్తుగా అజ్ఞాత మిత్రుడు జ్ఞాపకమొచ్చాడు. "తను ఎంతో గొప్పగా ఊహించుకున్న జీవితంలో ప్రతీ చోటా ఎడారి, చీకటి. అదృష్టం కొద్దీ చందమామ లాంటి పసివాడు తోడున్నాడు. చాలు మిత్రమా! చాలు ఈ జీవితానికి!!" అయినా ఈ అజ్ఞాత మిత్రుడేవిటీ ఇంకా? చిన్ని మిత్రుడు తన ఒళ్ళో ఉండగా.

తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది.

తల్లి ముఖంలో దిగులు చూసి జాలి పడాలో, వీళ్ల గొడవలు చూసి చికాకు పడాలో అర్థం కావడం లేదు తన్మయికి.

అన్నిటికీ అతీతంగా తన మనస్సుని కేంద్రీకరించడం పెళ్లయిన దగ్గర్నించీ అలవడిన విద్యే.

కరెంటు పోయింది. కిరసనాయిలు దీపం బుడ్డి వెలిగించింది జ్యోతి. మంచం పక్కన వెలుగుతున్న ఒత్తి వైపు తదేకంగా చూడసాగేడు పసి వాడు.

కిటికీ లోంచి చుక్కలు అక్కడక్కడా మిణుక్కు మిణుక్కుమని మెరుస్తూ కనిపిస్తున్నాయి.

ఆకాశం నించి నక్షత్రం రాలిపడి తన పక్కన చేరినట్లు, ముచ్చటగా బాబుని దగ్గరకు తీసుకుని తన చెంపకు వాడి అరచేతిని రాసుకుంటూ, పాల వాసనలు చిమ్ముతున్న వాడి బుగ్గల్ని ప్రేమగా నిమిరింది తన్మయి.

ప్రపంచంలో ఇంత వరకూ తనకు దొరికిన అపురూపమైన బహుమతి ఈ పసివాడే. వీణ్ణి దగ్గరకు తీసుకున్నపుడల్లా ఎంత ప్రేమ! మాటల్లో వర్ణించలేని ఎంత గొప్ప మాతృభావం!!

ఇంత వరకూ ఏ పిల్లల్ని ముట్టుకున్నా కలగని భావం. ఇదేనేమో తల్లీబిడ్డల అనుబంధం అంటే.

"నువ్వూ, నేనూ ఎప్పుడూ ఒక శరీరపు భాగాలం కన్నా" గుర్తు పెట్టుకో అని చెవిలో నెమ్మదిగా స్ఫుటంగా చెప్పింది.

## 17

బాబుకి రెండు నెలలు నిండి మూడో నెల వచ్చిన మొదటి వారంలో నామకరణోత్సవం శేఖర్ వాళ్లింట్లో జరపడానికి నిర్ణయించారు.

ఉదయానే ఫోను మోగింది.

"అమ్మగారింట్లో ఇన్నాళ్లూ తిష్ట వేసింది చాలు, బయలుదేరు" అన్నాడు శేఖర్.

అతని వ్యంగ్యాలకు నవ్వే ఓపిక లేదు తన్మయి దగ్గర.

"ఇన్ని రోజులు నన్ను నా కొడుకుని చూడనీకుండా అమ్మగారింట్లో మకాం వేసేవు. వచ్చే వారంలో బాబుకి పేరు పెట్టగానే నాల్రోజుల్లో వైజాగు వెళ్లిపోదాం. ఇన్నాళ్లూ చిప్పకూడు తినలేక ఛస్తున్నాను. అన్నీ సర్దుకుని రా." అన్నాడు.

"చాలా బావుందమ్మా మీ సంగతి. మా మనవణ్ణి చూసుకోవాలని మాకు మాత్రం ఉండదా? బాలింతవి. ఇంకా తేరుకోనేలేదు. ఊళ్లో అంతా నవ్విపోతారు. అయిదో నెలలో పంపుతాంలే. ఆ పేరేదో పెట్టుకున్నాక మీ ఆయన్ని ఇక్కడ దించి వెళ్లమని చెప్పు." అంది జ్యోతి విసుగ్గా.

ఆ ప్రశ్నకు సమాధానం అత్తవారి నించి, శేఖర్ నించి ఎలా వస్తుందో తెలిసే తల్లి ఎందుకిలా అంటుందో అర్థం కాలేదు తన్మయికి.

తన్మయి మౌనం చూసి "సర్లే, నీకు లేని బాధ నాకెందుకు?" అంది మళ్లీ.

సాయంత్రం బాబునెత్తుకుని మేడ మీదికి వచ్చింది తన్మయి. ప్రశాంతంగా గాలి వీస్తూ, చిరు చల్లగా ఆహ్లాదంగా ఉంది.

తనకు అప్పుడప్పుడే పరిచయమవుతున్న కొత్త ప్రపంచాన్ని తనివి తీరా చూడాలన్నట్లు కళ్ళు పెద్దవి చేసి చూడసాగేడు బాబు.

అది చూసి మురిపెంగా ముద్దాడుతూ, ఆకాశంలో మారుతున్న అందమైన నారింజ రంగుల్ని చూపిస్తూ "అదుగో నాన్నా, మా అమ్మమ్మ చెప్పేది, పేదరాశి పెద్దమ్మ ఆకాశంలో పసుపు, కుంకం ఆరబోసిందట...." అంటూ కబుర్లు చెప్పసాగింది.

"రేపటి మీద దిగులు లేకుండా బతకడం మొదట నేర్చుకోవాలి మనం" అంది మధ్యలో గాఢంగా ఊపిరి పీల్చి.

తన్మయికి తన జీవితం తన చేతుల్లో లేదన్న విషయం ఎందుకో నచ్చడం లేదు. కానీ తప్పడం లేదు.

"దేనికీ తక్షణ పరిష్కారాలు కనుచూపు మేరలో లేవు. అసలు ఉన్నాయో లేవో కూడా తెలియదు. అయినా మన కలలు సాకారమయ్యే ఒక రోజు వస్తుంది నాన్నా! ***నువ్వు జీవితంలో రెండు వదలకూడదు. ఒకటి ఈ అమ్మని, రెండు మంచి జీవితమ్మీద ఆశని. మొదటిది నువ్వు చెయ్యి, రెండోది నేను సంపాదించి పెడతాను.***" అంది ఒళ్ళో మోకాళ్ళ మీద ఎదురుగా పడుకోబెట్టుకున్న బాబు కళ్ళ ల్లోకి చూస్తూ.

తన మాటలు అర్థమయినట్లే బాబు ముఖంలో చిన్న చిర్నవ్వు కనిపించింది. ఆ నవ్వు తన్మయి కళ్ళల్లోంచి గుండెల్లోకి పాకి మురిపెంగా మారింది.

బాబు చేతులని గట్టిగా పట్టుకుని, ముసురుతున్న ఆలోచనలతో కాస్సేపు ఆకాశం కేసి చూస్తూ మౌనంగా ఉండి పోయింది.

చిన్నతనం నించీ అమ్మా, నాన్నా తనకేం కావాలో సమకూర్చి పెట్టారు. తను ఎప్పటికీ వాళ్లకి చిన్నపిల్లే. తనకి ఒక వ్యక్తిత్వం ఉందనే విషయం వాళ్లకి చెప్పినా అర్థం కాదు. తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం కాకపోయినా, శేఖర్ తో ప్రేమైక జీవనాన్ని కోరుకుని మొదటి సారి తల్లిదండ్రుల మాట వినకుండా తన మాట నెగ్గించుకుంది.

పెళ్లయ్యాక శేఖర్, అతని తల్లిదండ్రుల సంరక్షణలోకి మారింది. ఇక్కడ అసలు తనకు ఒక వ్యక్తిత్వం ఉంటుందనే ఆలోచన కూడా ఎవరికీ లేదు. తన పరిస్థితి మరింత దిగజారింది కానీ ఏం బాగుపడలేదు.

ఎన్నాళ్లిలా గడపాలో తనకే తెలీదు. ఒక పక్క చదువు ఎలా కొనసాగుతుందో కూడా తెలీని అగమ్యగోచర పరిస్థితి.

శేఖర్ ని ఎలా ఒప్పించాలో అర్థంకాని పరిస్థితి ఒక వైపు, యూనివర్శిటీ లో సీటు వస్తే బాబుతో చదువు ఎలానో అని దిగులు మరో వైపు.

మనసంతా అల్లకల్లోలంగా ఉంది తన్మయికి.

పెళ్లి కానంత వరకూ "తన జీవితం ఎంత హాయైన జీవితమో" అని ఇప్పుడు అనిపించసాగింది.

చంద్ర బింబం లాంటి బాబు ముఖం చూసినప్పుడల్లా జీవితమ్మీద గొప్ప ధైర్యం, ఆసక్తి కలగసాగేయి.

"కానీ గడిచిపోయిన విషయాలలో ఆలోచనల భారం తప్ప ఏం ఉంది? ఇవేళ్టి దిగులు రేపు ఉండదులే. మన జీవితంలో సంతోషకరమైన రోజులు వస్తాయి." అని బాబుకి చెప్పి, తనకు తను ధైర్యం చెప్పుకుంది.

★★★

మర్నాడు నామకరణోత్సవమనగా పసివాడినెత్తుకుని అత్తవారింట్లో అడుగు పెట్టింది తన్మయి.

అరటి గెల, బిందెలతో సారె తీసుకుని జ్యోతీ, భానుమూర్తి కూతుర్ని దిగబెట్టడానికి వచ్చారు.

దేవి మనవడికి, కోడలికి దిష్టి తీసి లోపలికి ఆహ్వానించింది. శేఖర్ రాత్రి రైలుకి వచ్చేడు.

భోజనాలయ్యేక శేఖర్ తండ్రి "ఊ..బావగారూ, పిల్లవాడు కలిగేడు. సంసారం పెరిగింది. ఖర్చులూ పెరుగుతాయి కదా! ఏం ఆలోచించేరు?" అన్నాడు.

అనుకోని ఈ సంభాషణకి గతుక్కుమన్న భానుమూర్తి గొంతు పెగుల్చుకునేలోగా "ఆలోచించేది ఏం ఉంది? ఒక్కగానొక్క కూతురు కదా, అంతకంటే ఎక్కువ ఏం ఉన్నాయి మీకు? ఆ కాలవ కింది భూమేదో మీ అమ్మాయి పేర్న రాస్తే వాళ్లకీ కాస్త ఆదరువుగా ఉంటుంది. ఏం అంటారు అన్నయ్య గారూ?" అంది దేవి.

జ్యోతి మొదట్నించీ అనుమానపడ్తూనే ఉంది. "సీమంతం చెయ్యడానికి ఆనవాయితీ లేదని చెప్పిన వాళ్లు "నామకరణం అని హడావిడి ఎందుకు చేస్తున్నారా?" అని. ఇదన్నమాట సంగతి. వాళ్ల అబ్బాయి తమ ఇంటికి రాడు కాబట్టి, ఈ వంకతో ఇవన్నీ మాట్లాడడానికి తమని ఇక్కడికి పిలిపించారన్న మాట."

జ్యోతి అడ్డురాబోయే లోగా భానుమూర్తి సర్దుకుని, "చూడమ్మా, మీరన్నది నిజమే, మా ఆస్తి పాస్తులన్నిటికీ వారసురాలు మా అమ్మాయే. అయితే ఇప్పటికిప్పుడు భూమి రాసిస్తే మా గతేంకాను? మాకున్న ఆధారమే ఆ భూమి. ఈ సంవత్సరం వరదల వల్ల పంట నష్టంతో నానా కష్టాలూ పడతన్నాం. మా తదనంతరం అమ్మాయికే చెందేటట్లు రాస్తాం కదా" అన్నాడు.

"ఆ పల్లెటూళ్లో మీ ఇద్దరి పొట్టలు గడవడం పెద్ద కష్టమా చెప్పండి? ఆ మహా నగరంలో పిల్లలు నానా కష్టాలూ పడతన్నారు. అబ్బాయికి ఎంత కష్టపడినా వచ్చేది ఇంటద్దెకే సరిపోవడం లేదు. మేమే బియ్యమూ, ఉప్పులూ, పప్పులూ సర్దుతున్నాం." అంది దేవి.

ఈ సంభాషణ ఎక్కడికి దారితీస్తుందో అని భయంతో తన్మయికి కాళ్లు ఒణకసాగేయి. గుండె దడ హెచ్చి, ముఖం నిండా చెమటలు పట్టేయి.

తల్లిదండ్రులు తన తరఫున మాట్లాడుతున్న ధీమాతో శేఖర్ నిశ్శబ్దంగా వింటున్నాడిదంతా. తన్మయినేమీ మాట్లాడొద్దన్నట్టు సైగ చేసేడు పైగా.

"మాకు చేతనైన సహాయం మేమూ చేస్తాం. పిల్లలు కష్టాలు పడ్తుంటే చూస్తూ ఊరుకోం కదా" అన్నాడు భానుమూర్తి.

"పొలం కుదరక పోతే ఇంటిలో భాగం రాసియ్యండి" అంది దేవి.

కోపం నషాళానికంటుతున్నట్లున్న తల్లి ముఖం వైపు చూసింది తన్మయి.

వాళ్లనేమీ అనలేక తన్మయి వైపు ఈసడింపుగా చూసింది జ్యోతి.

"మమ్మల్ని కాస్త ఆలోచించుకోనివ్వండి." అని లేచాడు భానుమూర్తి.

"పిన్ని వాళ్ళింటికెళ్లి పొద్దున్న వస్తామమ్మా" అన్నాడు తన్మయితో.

తల్లిదండ్రుల్ని ఇక అక్కడ ఉండమనే సాహసం చెయ్యలేకపోయింది తన్మయి. ఈ సమయంలో వాళ్లు వెళ్లడమే మంచిదనిపించి, తలూపింది.

"ముదనష్టపు సంబంధం చేసుకున్నాం. ఏం చేస్తాం. మన ఖర్మ." నెత్తి కొట్టుకుంది దేవి వాళ్లలా వెళ్లగానే.

ఒళ్లో ముద్దులొలికే చంటి పిల్లాణ్ణి పెట్టుకుని, ఈ మాటలేవిటో అర్థం కావడం లేదు తన్మయికి. అసలక్కడ పసిపిల్లాడు ఒకడున్నాడు, వాడితో ముద్దుగా ఆడదామని ఎవరికీ లేదు.

శేఖర్ చేతుల్లోంచి బాబుని తీసుకుని లోపలికి వెళ్లిపోయింది తన్మయి.

పాలుపడుతూ "చూసేవా నాన్నా, మన చుట్టూ ప్రపంచం. డబ్బు చుట్టూ ఎలా తిరుగుతూందో. ఇన్నాళ్ళ తర్వాత నిన్ను చూసేరు. నిన్ను ఎత్తుకుని, హత్తుకుని, నీ పాల బుగ్గలని తడిమే ఆలోచన కూడా లేదెవ్వరికీ. అమ్మ చదువుకుని, మన కాళ్ల మీద మనం నిలబడే వరకూ మనకీ కష్టాలు తప్పవు. నాతో బాటూ నీకూ ఇలాంటి సంభాషణలు వినక తప్పడం లేదు. క్షమించు కన్నా!" అంది.

ఏ ప్రపంచమూ ఎరగని చిన్నారి పాలు తాగడం ఆపి, ఒక్క క్షణం తల్లి ముఖంలో ఆతృత కనిపెట్టినట్లు కళ్లలోకి చూసి చిర్నవ్వు నవ్వేడు.

అపురూపమైన ఆ అందమైన క్షణానికి పరవశించి పోయింది తన్మయి.

ఏ కష్టం వచ్చినా "ఆ భగవంతుణ్ణి తల్చుకోమ్మా, అన్ని కష్టాలూ తీరిపోతాయి." అన్న అమ్మమ్మ మాటలు జ్ఞాపకం వచ్చాయి తన్మయికి.

కళ్లు మూసుకుని అజ్ఞాత మిత్రుణ్ణి తల్చుకుంది. "మిత్రమా! నువ్వే నా భగవంతుడివి. ఎన్నో దు:ఖాశ్రువుల్ని తుడిచేవు. ఈ బాధనూ నా మనస్సులోంచి తుడిచెయ్యవా? నాకో దారి చూపించవా?" అని మనసారా వేడుకుంది.

తన బుగ్గల పైని కన్నీటిని బాబు అప్రయత్నంగా తగిల్చిన చిన్న చేతితో తడిమినట్లయ్యింది తన్మయికి.

ఆ చేతినలాగే పట్టుకుని కళ్లకద్దుకుంది. వేదనలన్నీ తీర్చే గొప్ప సాంత్వన నిండిన పసి వేళ్లవి. అరనిమిషంలో బాబుతో బాటూ నిద్రలోకి జారుకుంది.

గదిలోకి వస్తూనే శేఖర్ అరచిన అరుపుకి తుళ్ళిపడి లేచింది.

"మేమక్కడ నెత్తులు బాదుకుని ఏడుస్తూంటే, నువ్విక్కడ దున్నపోతులా నిద్రపోతన్నావా? నీకు నిద్రెలా పడతందే? అవున్లే, మొగుడెలా పోతే నీకెందుకు? అల్లుడెలా ఛస్తే వాళ్లకెందుకు? మీ అమ్మా, బాబూ ఎలా తప్పించుకున్నారో, నువ్వూ అంతే. ఆ రక్తం పంచుకుని పుట్టినదానివి కదా. ఇదుగో. ఇప్పుడే చెప్తున్నాను. నువ్విక వాళ్ల గుమ్మం తొక్కడానికి వీల్లేదు." అన్నాడు నిప్పులు కురుస్తూన్న గొంతుతో.

గోడ వైపు తిరిగి దు:ఖంతో కుమిలి పోతూన్న తన్మయిని, పక్కన ప్రశాంతంగా నిద్రపోతున్న పసివాడిని పట్టించుకోకుండా, విసురుగా పెద్ద శబ్దంతో తలుపేసి బయటికెళ్లిపోయేడు.

మర్నాడు ఉదయానే నామకరణోత్సవానికి వాళ్ల చుట్టాలంతా వచ్చేరు. ఉపవాసంతో హోమం ముందు కూచోబెట్టేరు. పిల్లవాడు పుట్టే సమయానికి తండ్రి దగ్గర లేనందున తండ్రికి కీడు తగులుతుందని పంతులుగారు చెప్పేరట. శాంతి హోమం చేయించిన తర్వాత పేరు పెట్టడానికి సిద్ధమయ్యేరు పంతులు గారు.

శేఖర్ "ఆంజనేయ స్వామి" పేరు తప్పనిసరిగా కలవాలని చెప్పేడు.

దేవి "వెంకన్న బాబుకి అమ్మాయి తల్లి మొక్కుకుందండీ. పైగా మా కుల దైవం కూడాను" అంది.

తన్మయి ఎవరి ముఖ కవళికలూ పట్టించుకోకుండా "మృదుల్" అని చేర్చమని ధీమాగా చెప్పింది.

వేళ్ల మీద ఏవో లెక్క వేసి, చివరికి పంతులు గారు "అమ్మా! అబ్బాయి పేరు "వెంకట ఆంజనేయ మృదుల్". అబ్బాయి జాతకరీత్యా పేరులో మొదటి అక్షరం "వ" తో ప్రారంభం కావడం చక్కగా కుదిరింది. కానీ సంఖ్యాశాస్త్రం ప్రకారం మరో రెండక్షరాలు పెంచాలి. ఇంకెవరికైనా ఏవైనా మొక్కులుంటే చెప్పండి" అన్నాడు.

ఆలస్యంగా వచ్చిన జ్యోతి, భానుమూర్తి తమ మొక్కు కలిసినందుకు సంతోషించేరు.

ఎవరో "సాయి" అని అందించేరు.

"వెంకటాంజనేయ సాయి మృదుల్" అని ఖరారు చేసేరు. ముందంతా ఏం పేర్లు ఉన్నా, తననుకున్న పేరు చివర కనబడినందుకు "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకుంది తన్మయి.

★★★

రెండో వారంలో విశాఖపట్నానికి చేరేరు.

"మా బాసు వాళ్లింట్లో అవుట్ హౌసు ఖాళీగా ఉందన్నారు. అద్దె తక్కువ కూడా. సామాన్లన్నీ మార్చేసేను." అన్నాడు శేఖర్.

కొత్త ఇంటికి ఆటో సందు మలుపు తిరగంగానే ఆశ్చర్యపోయింది తన్మయి. తన కళ్లని తనే నమ్మలేకపోయింది ఎదురుగా యూనివర్శిటీ గేటు చూసి.

యూనివర్శిటి నించి రెండు సందుల మలుపుల్లో ఉన్న పెద్ద బంగళాలో గేటుకి దగ్గర్లో ఉన్న చిన్న రెండు గదుల అవుట్ హౌసది.

పెద్ద ఇంటి ముందు కాలిబాట కిరుపక్కలా చక్కని పూలతోట. ప్రత్యేకించి అవుట్ హౌసునానుకుని ఉన్న నైట్ క్వీన్ తీగెల్ని చూసి మనస్సు గాలిలో తేలిపోయింది తన్మయికి.

చిన్న గదులైనా చక్కగా పరిశుభ్రంగా ఉంది ఇల్లు. తను ఎన్నాళ్లుగానో కలలు గన్న ఇల్లు.

చీకట్లో ఆకాశం కేసి చూసి "ధన్యవాదాలు అజ్ఞాత మిత్రమా!" అని లోపల్లోపల అనుకుంది.

తన్మయి ముఖంలో అద్వితీయమైన ఆనందం చూసి "యూనివర్శిటీయో అని నా బుర్ర తింటున్నావుగా. నచ్చిందా ఇల్లు? నీకు యూనివర్శిటీ నించి ఉత్తరం వచ్చింది. మా తాతగారికి చూపించేను. నీకు సీటు రావడం ఖాయమన్నారు. చదివితే ఉద్యోగాలొస్తాయంటగా. మీ వాళ్లెలాగూ మనకేమీ పెట్టి పోసేటట్టు లేరు. నువ్వైనా బుద్ధిగా చదివి, ఏ క్లర్కుగానో ఉజ్జోగం సంపాయించు. పసివాడినెత్తుకుని చదువు, సామని పరుగెత్తకు. కావాలంటే పక్క వీధిలోనే ఉన్న మా పిన్ని వాళ్లింట్లో చంటోడిని దించు. మా పిన్ని మనవడి కోసం పరితపించి పోతూంది." అన్నాడు శేఖర్.

ఆ మాత్రానికే మహదానంద పడి దగ్గరకు వచ్చి గట్టిగా హత్తుకుంది శేఖర్ ని.

దు:ఖంతో గొంతు పూడుకుపోయింది. అనుకోని వరాలన్నీ ఒక్క సారే కురిసిన ఆనంద క్షణానికి ఉక్కిరిబిక్కిరయిపోయింది.

"థాంక్యూ- థాంక్యూ" అంది.

"ఇంత కాలానికి నా విలువ తెలిసొచ్చిందన్నమాట, ఇదిగో అవకాశం ఇచ్చాను కదా అని మొగుణ్ణి వెధవని చెయ్యడానికి చూడకు… " అంటున్న శేఖర్ మాటలు వినిపించుకోకుండా

గబ గబా యూనివర్శిటీ ఉత్తరాన్ని విప్పి చూసింది.

3 వ ర్యాంకు చూసి సంతోషంగా గుండెలకి హత్తుకుంది. "యాభైలోపు ర్యాంకు వస్తే యూనివర్శిటీలో సీటు ఖాయం" ఎంట్రెన్సు పరీక్ష రాసి వస్తుండగా తన పక్కనే మెట్లు దిగుతూ ఎవరో అనుకున్న మాటలు చెవిలో గింగిరాలు తిరిగాయి,

వచ్చే వారంలో కౌన్సిలింగుకి వెళ్లి అఫీషియల్ గా అడ్మిషను తీసుకోవాలి. మరో రెండు నెలల్లో క్లాసులు ప్రారంభమవుతాయి.

"ఫీజులకి డబ్బులు మీ అమ్మనడుగుతావో, నాన్ననడుగుతావో నాకు తెలియదు." అన్నాడు శేఖర్.

తన్మయి తన చేతి బంగారు గాజుల జత వైపు చూసుకుంది. "ఎవ్వరూ కట్టనక్కర లేదు. ఇవి అమ్మేసైనా చదూకుంటాను." అని దృఢంగా నిర్ణయించుకుంది.

★★★

ముందు గదిలో బాబుకి చీర ఉయ్యాల కట్టింది. పొద్దున్నే వేడి వేడి నీళ్లు స్నానం చేయించి, పాలు పట్టి ఉయ్యాలలో వేస్తే చక్కగా నిద్రపోయాడు బాబు.

బాబు లేచే లోగా ఎంత చక చకా సామాన్లు సర్దుకున్నా ఇంకా పని మిగిలిపోతూనే ఉంది తన్మయికి.

శేఖర్ సాయంత్రం ఇంటి పట్టునే ఉండడం వల్ల ఇల్లు సర్దుకోవడానికి మరింత సమయం దొరుకుతూంది.

పెద్దింటికి, అవుటు హౌసుకి వాకిలి తుడిచి ముగ్గు పెట్టాల్సిన బాధ్యత తనది. పెద్ద వాకిలి రోజూ సాయంత్రం వొంగి ఊడవడం, కళ్లాపి జల్లి, ముగ్గేయడం కష్టమైన పనైనా,

తనకి నచ్చిన పని కావడం వల్ల సంతోషంగా చేస్తూంది తన్మయి. పైగా ముగ్గులెయ్యడం లో సిద్ధ హస్తురాలు కదా.

ఇంటి వాళ్లు షిరిడీ వెళ్లేరు.

"వాళ్లు మరో వారానికి గాని రారు. ఎందుకంత కష్ట పడి రోజూ ఊడవడం? వాళ్లొచ్చేక ఎలాగూ తప్పదు." అన్నాడు శేఖర్.

ఎవరో ఉన్నపుడొకలాగ, లేనపుడొకలాగ పని చెయ్యడం తన్మయి స్వభావానికి విరుద్ధం.

శేఖర్ కి సమాధానం చెప్పకుండా చిర్నవ్వు నవ్వింది.

తను వేసిన చక్కని ముగ్గుని తనే తేరిపార చూసుకుంది. "మొక్కలన్నిటికీ పాదులు తీయాలి. ముందు ఇంటి పని తెమిలేక, రోజూ కొంత పని చక్కబెట్టాలి." అంది.

"మనకి ఇల్లు చవకగా అద్దెకిచ్చినందుకు వాకిలి తుడిచి ముగ్గెయ్యమని మాత్రమే చెప్పింది ఇంటావిడ. ఓ...రాసుకునీ, పూసుకునీ పన్లన్నీ చెయ్యకు. ఎంత చేసినా ఎదవలకి విశ్వాసం లేదు. సంవత్సరం బట్టీ తెలిసున్న మనిషినైనా కనీసం కాఫీ కూడా ఇప్పించదు మా బాసు." అన్నాడు శేఖర్.

★★★

అడ్మిషను రోజు రానే వచ్చింది. శేఖర్ని తీసుకు వెళ్ళమని అడగింది.

"రేపట్నుంచి మీ బాబొచ్చి తీసుకెళ్తాడా? నువ్వే ఆ పాట్లేవో పడు." అని విసురుగా అని బైకు స్టార్టు చేసుకుని వెళ్లిపోయేడు. చిన్న విషయాలకి ఎందుకు ఇంత చికాకు పడతాడో అస్సలు అర్థం కాదు తన్మయికి.

"ఇప్పుడెళ్లి మళ్లీ పెద్ద పండగకి వస్తారో, లేదో. బట్టలు కొనుక్కోండి" అని తల్లి తన చేతిలో పెట్టిన వెయ్యి రూపాయల్ని పెట్టెలోంచి తీసి పర్సులో పెట్టుకుంది.

బాబుని తీసుకుని శేఖర్ పిన్ని గారింట్లో ఉయ్యాలలో పడుకోబెట్టి, పరుగులాంటి నడకతో యూనివర్శిటీ వైపు నడిచింది తన్మయి.

గేటు దాటి లోపలికి వెళ్తూంటే మొదటి పాదం మోపుతున్న చోటే, ప్రపంచాన్ని జయించిన గొప్ప భావన. ఒక అద్వితీయమైన ఆనందం.

పైకి తలెత్తి విశ్వ విద్యాలయం ద్వారతోరణం వైపు చూసింది. "ఆంధ్ర విశ్వ విద్యాలయం" తనని పూల వానతో ఆహ్వానిస్తున్న భ్రాంతికి లోనయ్యి పులకించి పోయింది.

"మిత్రమా! నేను జీవితాన్ని జయిస్తాను" అంది పైకి.

వనజకీ విషయం చెప్పాలి. ఎంత సంతోషిస్తుందో. అన్నట్లు లక్ష్మికి కూడా చెప్పాలి. వీలైతే ఒకసారి వెళ్లి రావాలి. అని తలుచుకుంది.

ఒక తెలీని ఆదుర్దాకి లోనయ్యింది. కాళ్లు నొప్పులు పుట్టసాగేయి.

తనకు నచ్చిన బెంగాల్ కాటన్ చీర కొంగు భుజం చుట్టూ తిప్పుకుని నడిచి, వందలాది మంది ఉన్న అడ్మిషను హాలుకి చేరింది.

మైకులో తన పేరు వినిపించగానే తడబడే అడుగుల్తో లేచింది.

చేతికి అడ్మిషను పేపర్లు ఇస్తూ "యూనివర్శిటీలో తొలి అయిదు ర్యాంకుల్లో వచ్చిన వారిని తప్పక గుర్తు పెట్టుకోవాలి మాస్టారూ" అని పక్కన ఉన్న మరో ప్రొఫెసర్తో చెప్తూ "కంగ్రాట్స్ అండ్ వెల్ కమ్ " అంటున్న వ్యక్తి వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసి నమస్కరించింది.

"అమ్మా, ఈయన మీ డిపార్టుమెంటు డీన్. ఆయనే నిన్ను గుర్తు పెట్టుకున్నారు. నీ అదృష్టం పండింది" అన్నాడు పక్కన ఉన్న మరో డిపార్ట్మెంటు డీన్.

తన వెనకే నాలుగో ర్యాంకు తీసుకున్న వ్యక్తి వెనక్కి వస్తూ "మొదటి స్టెప్పులోనే డీన్ మిమ్మల్ని మెచ్చుకున్నారు. ఎంత అదృష్టమండీ" అన్నాడు.

పరిచయంగా మాట్లాడుతున్న అతని వైపు ప్రశ్నార్థకంగా చూస్తున్న తన్మయి వైపు చూస్తూ "భలే వారండీ, మర్చిపోయేరా? యూనివర్శిటీ అప్లికేషను ఇవ్వడానికి వచ్చినపుడు మీకు దారి చెప్పింది నేనే" అన్నాడు.

తనకు బొత్తిగా గుర్తులేని అతను, తనని అంతగా గుర్తు పెట్టుకోవడం ఆశ్చర్యం వేసింది తన్మయికి.

అదే అడిగింది.

"ఇన్ని వందల మందిలో మీరొక్కరే అప్పుడూ, ఇప్పుడూ భుజం చుట్టూ కొంగు తిప్పుకుని నడుస్తున్నది. ఇన్ఫాక్ట్ ఐ అడ్మయిర్ ఇట్" అన్నాడు స్నేహ పూర్వకంగా.

"అప్పుడు మీరు భారంతో ఉన్నట్లు గుర్తు. అబ్బాయా? అమ్మాయా?" అన్నాడు మళ్లీ.

"అబ్బాయి, మృదుల్" అంది

"చాలా మంచి పేరు. అన్నట్లు నా పేరు కరుణ. కరుణశ్రీ అంటే ఉన్న అభిమానంతో నా కలం పేరు అలా పెట్టుకున్నాను." అన్నాడు.

"మీ అబ్బాయి పేరు చాలా బావుంది. నాలా కలం పేరు పెట్టుకోనవసరం లేదు" అన్నాడు నవ్వుతూ.

## 18

అడ్మిషను హాలు నించి తమ ఇంటి వైపున్న యూనివర్శిటీ గేటు వరకూ దాదాపు పదిహేను నిమిషాల పాటు నడవాలి. అక్కణ్ణించి బాబుని తీసుకొచ్చుకోవడానికి మరో పదిహేను నిమిషాలు.

"బాబు నిద్రలేచేలోగా ఇంటికి వెళ్లగలనో, లేదో." తన్మయి మనసులో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

మాటిమాటికీ గడియారం వైపు చూసుకుంటున్న తన్మయి వైపు చూస్తూ "ఏదైనా ప్రాబ్లమా?" అనడిగేడు కరుణ.

"లేదండి నేనర్జంటుగా ఇంటికి వెళ్లాలి. ఇప్పటికే ఆలస్యమైంది. థాంక్సండీ, యూనివర్శిటీ లో ఎక్కడేమున్నాయో.. ఎన్నో విషయాలు చెప్పేరు." అంది తన్మయి.

"ఎక్కడుంటారు మీరు? " అన్నాడు.

సందేహిస్తున్న తన్మయితో "మీకభ్యంతరం లేకపోతే చెప్పండి, ఏం లేదు మీకు దగ్గిర దారి చెబ్దామని" అన్నాడు.

తన్మయి సమాధానం విని, "ఏవిటీ ఆ పెద్ద బంగళానా?" అని ఆశ్చర్యంగా నవ్వేడు.

అతనంతగా ఎందుకు ఆశ్చర్యపోతున్నాడో అర్థం కాలేదు. అదే అడిగింది.

"చూసేరా? ప్రపంచంలో ఎన్ని వింతలున్నాయో! మీ ఇంటినానుకుని ఉన్న ఒక పెద్ద గోడనెప్పుడైనా చూసేరా?" అన్నాడు.

అవునన్నట్లు తలాడించింది. బంగళా వీధికి చివర ఉంటుంది. దానినానుకుని ఉన్న పెద్ద గోడ, ఒక మూలగా ఉన్న చిన్న గేటు, అందులో నుంచి ఏపుగా పెరిగిన గడ్డి మాత్రమే కనిపిస్తుంటాయి.

"అదే మా హాస్టలు" అన్నాడు నవ్వుతూ.

"అది యూనివర్శిటీ హాస్టలా? మరి ఆ గడ్డీ, అదీ ...." సందేహంగా అంటున్న తన్మయి మాటలకు అడ్డువచ్చి

"ఏదో పాడుబడ్డ ప్రదేశంలా ఉంటుంది కదూ, అది హాస్టలే కానీ ప్రైవేటు హాస్టలు. యూనివర్శిటీ హాస్టళ్లలో సీటు రావాలంటే కావాల్సిన రిజర్వేషన్లు ఏవీ లేని దౌర్భాగ్యుణ్ణి." అన్నాడు.

తన్మయి ముఖంలో ఆలోచన చూసి "ఏదోలెండి, తలదాచుకుందుకి ఇంత చోటు, అంతే. అందుకే రోజంతా లైబ్రరీలలో గడుపుతాను. మీకు ఏ పుస్తకం కావాలన్నా నాకు చెప్పండి. తెచ్చి పెడతాను. అన్నట్లు మీరు త్వరగా ఇంటికి వెళ్లాలంటే దగ్గిర దారేమీ లేదు. ఆటో ఎక్కడం తప్ప. బస్సులో వెళ్లినా మళ్లీ సగం దూరం నడవాల్సిందే కదా!" అని వెళ్లొస్తానన్నట్లు నమస్కరించేడు.

తన్మయి కూడా ప్రతి నమస్కారం చేసి, "సరేనండీ, మళ్లీ తరగతులు ప్రారంభం అయ్యేక కలుద్దాం" అంది.

❦❦❦

గబగబా నడవడం వల్ల చెమట్లు ధారాపాతంగా కారసాగేయి తన్మయికి.

విశాఖపట్నంలో, అందునా యూనివర్శిటీ చుట్టుపక్కల ఒక చోటి నించి ఒక చోటికి వెళ్లాలంటే దూరాలు తక్కువైనా విపరీతంగా అలసట వస్తుంది. దాదాపు ప్రతీ రోడ్డు కొండ ఎక్కడమో, దిగడమో అయి ఉంటుంది.

యూనివర్శిటీ ఎత్తున ఉన్నందువల్ల చుట్టుపక్కల వీధులన్నీ దిగువకి. కిందికి సముద్రం వరకూ విస్తరించి ఉంటాయి.

సముద్రం తాలూకు తేమగాలిలో ముఖం ఎప్పుడూ జిడ్డోడుతూనే ఉంటుంది.

చీర చెంగుతో ముఖం తుడుచుకుంటూ, పరుగులాంటి నడకతో బాబు దగ్గిరికి వచ్చి పడింది తన్మయి.

"వచ్చేవా అమ్మా, ఇడిగో మీ అబ్బాయి. ఇందాకట్నించి ఏడుస్తూంటే సముదాయించలేకపోతున్నానుకో." అంది శేఖర్ పిన్ని.

పైకి ముఖాన నవ్వు పులుముకున్నా స్వరంలో వెనక వినిపిస్తున్న విసుగుని ఇట్టే పసిగట్టింది తన్మయి.

బాబుని చంకనేసుకుని, వాడి సంచీ, తన పర్సు భుజాన తగిలించుకుని మాడే ఎండలో ఇంటికి తిరిగి వచ్చింది.

ఉదయమెప్పుడో కాస్త వేపుడు జావ తిని బయలుదేరింది.

విపరీతంగా ఆకలేస్తూంది. కానీ పిల్లాడు అంత కంటే ఆకలితో ఉన్నట్లు ఎత్తుకుంటే భుజం చీకుతున్నాడు.

బాబుని పక్కనేసుకుని పాలిస్తూ నిస్త్రాణగా పక్క మీద కూలిపోయింది.

కడుపు నిండిన చిరునవ్వుతో వాడు అయిదే నిమిషాల్లో ఆట మొదలు పెట్టేడు.

బొజ్జ నిండిపోగానే పాలు చీకడం ఆపి, అమ్మ ముఖంలోకి చూసి నవ్వడం, మళ్లీ చీకడం మొదలు పెడతాడు.

"అమ్మ దొంగా, అప్పుడే బొజ్జలు నిండిపోయాయా? ఆటలు మొదలు పెట్టేవు?" అని మురిపెంగా తల నిమిరింది తన్మయి.

అమ్మ ఇవేళ యూనివర్శిటీ లో జాయినయ్యిందిరా కన్నా, నువ్వు నాకు సాయం చెయ్యాలి గానీ, ఇలా పేచీ పెడితే ఎలా చెప్పు?" అంది వాడి చిన్ని అందమైన నల్లని కళ్లల్లోకి చూస్తూ.

సమాధానంగా కేరింతలు కొడుతూ "ఊ..." అన్నాడు బాబు.

లేచి వంట చేసుకునే ఓపిక లేదు తన్మయికి. పైగా ఇంట్లో కూరగాయలేవీ లేవు, ఉల్లిపాయలు తప్ప.

"శేఖర్ సాయంత్రం వచ్చేసరికి ఏం వండాలో!" అనుకుంటూ పొద్దున్న మిగిలి జావలో కాస్త మజ్జిగ పోసుకుని తిని, కడుపు నింపుకుంది.

సాయంత్రం బయట కాస్త చల్లబడగానే చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుని ,చూపురు తీసుకుని బయటకు వచ్చింది.

వరండా లో చాప పరిచి బొంత వేసి బాబుని పడుకోబెట్టింది.

ముందు రోజే తుడిచినా, దారంతా పరుచుకున్న ఆకులనూ, రాలిన పూలనూ తుడిచి పోగులు పెట్టింది.

మధ్య మధ్య బాబు వైపు చూస్తూ ఉంది.

ఉన్నట్టుండి బాబు బోర్లా పడి మూలుగుతుండడం చూసి ఒక్క పరుగున వచ్చి వెనక్కు తిప్పింది.

"అరే నాన్నా, నీకు వెనక్కు తిరగడం వచ్చేసిందేవిట్రా?" అంటూ లేవదీసి ముద్దులు కురిపించింది.

"బోర్లా పడితే బొబ్బట్లు, పాకడం వస్తే పాకం గారెలు, కూర్చోవడం వస్తే..." అన్నీ పంచిపెట్టాలిరా కన్నా.

అమ్మమ్మకి ఈ విషయం చెప్పాలి. ఫోను చేసొద్దామా?" అంది నవ్వుతూ.

"ఇది వరకు ఉన్న ఇంటిలాగా వీధి మొదట్లో ఫ్టోన్ బూత్ లేదిక్కడ. ఏం చేద్దాం మరి?" అంది సాలోచనగా కేరింతలు కొడ్తున్న బాబుతో.

శేఖర్ సాయంత్రం వస్తూనే చాలా చికాగ్గా కనిపించాడు. తన్మయి మనస్సంతా పొద్దుట్నించీ జరిగినవన్నీ శేఖర్తో పంచుకోవాలని ఉవ్విళ్లూరుతూంది. కానీ అతను బయటి నించి ఇలా చికాకుతో వచ్చినపుడు ఇటువంటివి ఏకరువు పెడితే మరింత విసుక్కుంటాడు.

బాబుని ఉయ్యాలలో వేసి, బయట వరండాలో కొచ్చి చాప మీద చతికిలబడింది. చీకట్లో ఆకాశం లో మిణుకు మిణుకు మనే అందాల నక్షత్రాలు, చూడచక్కని తదియ నాటి చంద్ర రేఖ.

చల్లగా ఆహ్లాదంగా వీస్తున్న గాలికి లతలుగా అల్లుకున్న తీగెలు అలల్లాగా కదులుతున్నాయి.

ఔట్ హౌస్ గేటు నించి వెనక్కి తిరిగి ఉండడం వల్ల బయటి వాళ్లెవరూ ఇక్కడికి కనిపించరు. ఇంటి వాళ్లకి కూడా కనిపించదు ఔట్ హౌస్ ముఖ ద్వారం. "ఈ ఇల్లు భలే ప్రత్యేకంగా, అందంగా, ఆహ్లాదంగా ఉంది నా మనస్సుకి సరిపడినట్టు." అనుకుంది తన్మయి.

"అన్నం పెట్టేదుందా, లేదా?" అన్న గద్దింపుకి ఈ లోకంలోకి వచ్చిపడింది.

"ఏమైంది?" అంది మెల్లగా అతని ముఖంలో ఇంకా చిరాకు తాండవించడం చూస్తూ.

"ఆడదానివి, నీకేం అర్థమవుతాయి నా ఉద్యోగం బాధలు?" అని "అవునూ, ఉదయం యూనివర్శిటీ నించి ఎప్పుడొచ్చేవు?" అన్నాడు.

"కొంచెం ఆలస్యమే అయ్యింది" అంది.

"నీకు మొదటే చెప్పేను. మా పిన్ని ఏదో పుణ్యానికి చూసి పెడతాదని. నువ్విలా ఆలస్యాలు చేసేవనుకో. చదువు వద్దు, చట్టుబండలు వద్దు. శుభ్రంగా ఇంట్లో పిల్లోణ్ణి చూసుకో చాలు. అయినా నీకెందుకే చదువు? ఒక ఇంగ్లీషు వాక్యం మాట్లాడడం రాదు" అన్నాడు.

"నాకు ఇంగ్లీషు మాట్లాడడం రాదని నీకు చెప్పేనా? అసలెప్పుడైనా విన్నావా నేను మాట్లాడేటప్పుడు?" అంది చటుక్కున ఉక్రోషంగా తన్మయి.

"నువ్వా? ఇంగ్లీషులోనా? నీ పల్లెటూరి ఇంగ్లీషూ ఓ ఇంగ్లీషే! మన ఇంటిగల ఓనరమ్మ మాట్లాడుతాది మరి, ఎదుటోళ్లు అర్థం చేసుకోలేనంత స్పీడుగా, దొరల ఇంగ్లీషులాగా మాట్లాడుతాది. పొరబాటున ఎప్పుడేనా నీ ఇంగ్లీషు పాడిత్యం చూపించేవు గనక. నవ్వుతారు అందరూ" అన్నాడు వ్యంగ్యంగా.

తన్మయికి బాధ కళ్లల్లోకి తన్నుకు వచ్చింది.

"మొదలెట్టేవా శనిగొట్టు ఏడుపు? నీ దరిద్రపు ముఖం చూడడం కంటే సెకండ్షో సినిమాకి పోవడం నయం. తలుపేసుకో." అని విసురుగా వెళ్లిపోతున్న శేఖర్ వైపు నిస్తేజంగా చూస్తూ ఉండిపోయింది.

యూనివర్సిటీ లో ఇన్ కమ్ సర్టిఫికేటు పెడితే ఫీజు తగ్గింపు ఉంటుందని చెప్పేరు ఆఫీసు వాళ్లు. దానికి కేస్ట్ సర్టిఫికేటు చేరిస్తే ఇంకా మంచిదట.

"ఎలాగూ లక్ష్మిని కూడా కలిసి రావాలి. రెండు పన్లూ చక్కబెట్టుకుంటే సరి. బయటికి వెళ్దాం వస్తావా కన్నా" అంది బాబుతో తన్మయి.

శేఖర్ కేంపుకెళ్లేడు.

పొద్దున్నే కాస్త వండుకు తిని బాబునెత్తుకుని బయట పడింది.

వీధి చివరకి రాకుండానే ఆటో ఎదురుపడింది. ఎక్కి కూచుని అడ్రసు చెప్పింది.

"అమ్మ ఇచ్చిన బట్టల డబ్బుల్లో ఇంకా రెండు వందలే మిగిలాయి" లోపల్లోపల అనుకుంది పర్సులో చెయ్యి పెట్టి.

కరెంటు బిల్లు, పాత కాస్ట్ సర్టిఫికేటు లాంటివి పర్సులో మడతబెట్టి పెట్టుకుంది.

తామున్న ఏరియా రెవెన్యూ కేంద్రానికి వెళ్లింది.

వాళ్లిచ్చిన ఫారాలు పూర్తు చేసి, తెచ్చిన కాగితాలు జెరాక్సు తీయించి క్లర్కుకి ఇచ్చింది. ఇదంతా కనీసం మూడు గంటలు పట్టింది. ద్వారం దగ్గర డబ్బులిమ్మని అటెండరు వెనకే వచ్చేడు.

ఇప్పటిదాకా చంటి పిల్లాడితో నానా కష్టాలూ పడి లైనులో నిలబడ్డప్పుడు కనీసం మంచినీళ్లు తాగడానికి వెళ్లలేక ఎంతో ఇబ్బంది పడింది. అప్పుడీ అటెండరు ఏమయ్యేడో!

వరండా మెట్లు దిగుతూనే కనబడ్డ బల్ల మీద కూలబడి పది రూపాయలు బయటికి తీసి ఇచ్చింది. "ఇదేంటమ్మా, బొత్తిగా. మీకు ఇన్ కమ్ సర్టిఫికేటు వస్తే ఫీజులన్నీ మిగులే కదా" అన్నాడు నీళ్లు నములుతూ.

"ఇక లేవు మరి నా దగ్గిర" అంది చెమట తుడుచుకుంటూ.

ఒళ్లో పిల్లోడి వైపు చూస్తూ "పదికి పాలసీసా అయినా వస్తందా?" అని గొణుక్కుంటూ నోటు తీసుకుని వెళ్లిపోయేడు.

"మరో పదిహేను రోజుల తర్వాత కనబడమన్నారు. అప్పటికి మళ్లీ చార్జీలుండొద్దూ? ఏం నాన్నా, నువ్వే చెప్పు." అంది బాబు తల నిమురుతూ.

వాడి చిక్కటి తల వెంట్రుకల్లో చెమట పట్టేసింది. "అయ్యో, చెమట్లు పట్టేసేయిరా నాన్నా." అని భుజానేసుకుని కాస్త నీడున్న చోట మరో చోట కూలబడి, పాలసీసాలో పోసి తెచ్చిన నీళ్లు పట్టించింది.

అప్పటికే మధ్యాహ్నం అయ్యింది. అక్కణ్ణించి పదిహేను నిమిషాలు నడిచి, బస్సు స్టాండుకి చేరుకుంది.

కట్టుకున్న పాలిష్టరు మిక్సు చీర కొంగు తీసి పిల్లాడి తలమీదుగా కప్పింది.

బస్సు దిగి కొండ మీద ఉన్న పాతింటి వైపు అడుగులేసింది. వీధి చివర అతను పలకరింపుగా నవ్వి "బావున్నారా?" అన్నాడు.

ఇంటి బయట స్టీలు గిన్నెలు బేరమాడుతున్న లక్ష్మి దూరం నించి తన్మయిని చూస్తునే పరుగెత్తుకొచ్చింది.

చంకలో పిల్లాణ్ణి చేతుల్లోకి తీసుకుని "అమ్మో, ఎంత ముద్దుగా ఉన్నాడో తల్లీ నీ కొడుకు" అంది ఆనందంగా.

అప్పటికప్పుడు పోపులు వేయించి, కొబ్బరి పచ్చడి రుబ్బడానికి సిద్ధపడ్తున్న లక్ష్మిని వారిస్తూ "వీడు కడుపులో ఉన్నప్పుడు తినాలనిపించిన కోరికలేవీ ఇప్పుడు లేవు. మీకు శ్రమ దేనికి?" అంది తన్మయి.

"శ్రమేవిటి తన్మయీ! అప్పుడు నీ కొడుకు కోసం, ఇప్పుడు నీ కోసం" అంది.

భోజనాలయ్యేక "మేమిక్కడే ఉంటే ఎంత బావుండేది! నేనిప్పుడు యూనివర్సిటీకి వెళ్లాలంటే పెద్ద సమస్య తయారయ్యింది. వీణ్ణి చూసి పెట్టే వాళ్లు లేరు." అంది తన్మయి.

"ఆ వీలు లేకుండా చేసేడుగా మీ ఆయన" అంది లక్ష్మి.

ప్రశ్నార్థకంగా చూస్తున్న తన్మయి దగ్గిరికి వొంగి "మీ ఆయన నీకు చెప్పలేదన్నమాట." అంది లక్ష్మి.

"ఊహూ--- "అని తలాడించి, ఏవిటి విషయమన్నట్లు ఆసక్తిగా చూసింది తన్మయి.

"ఏం చెప్తాదులే. చేసిన ఎదవ పన్లు. నువ్వెంత బంగారానివో, అంతటి భ్రష్టుడు మీ ఆయన. నువ్వెలా పెళ్లాడేవో గాని. నువ్విలా కాంపుకి వెళ్లేవో లేదో నేనూ ఊరెళ్లేను నెల రోజులు.

"వచ్చేసరికి చుట్టుపక్కల వాళ్లు ఒకటే గుసగుసలు చెప్పుకోవడం" అని రహస్యంగా గొంతు తగ్గించి, "మీ ఆయన రాత్రుళ్లు ఆడోళ్లని తెచ్చుకునీ వోడంట" అంది.

తన్మయి అప్రయత్నంగా "ఛీ, ఛీ.." అంది. అంతలోనే గొంతు పెగుల్చుకుని "వాళ్లకి చుట్టాలు చాలా మంది ఉన్నారు. ఎవరైనా వచ్చేవారేమో" అంది లక్ష్మి తో సర్ది చెప్పబోతూ.

"నువ్వింత మంచిదానివి కాబట్టి అతని ఆటలలా సాగుతున్నాయి. నేను కళ్లారా చూసేను. ఒకరోజు తప్పతాగి ఆడదాని ఒంటి మీద వాలిపోయి వచ్చేడు. ఇద్దరూ చేసిన యాగీ అంతా ఇంతా కాదు."

ఆ తెల్లారి ఇంటిగలాయనకి ఎవరు చెప్పేరో మరి. ఇల్లు తక్షణం ఖాళీ చెయ్యమని కూచున్నాడు.

ఆ మధ్యాహ్నమే మీ ఆయన ఆటోలు పట్టుకొచ్చి సామాన్లు సర్దుకుని వెళ్లిపోయేడు" లక్ష్మి గబగబా చెప్పుకుంటూ వెళ్లిపోతూంది.

తన్మయికి ఊగిపోతూ కోపం, ఆపుకోలేని దు:ఖమూ వచ్చేయి.

"లక్ష్మీ, ఇంకోసారి వస్తాను. ఇక నాకేం చెప్పకు. నా మీద నాకే అసహ్యం వేస్తూంది." అని చివాలున లేచింది.

వెనక నించి లక్ష్మి వచ్చి, "మొగోళ్లు వొట్టి ఎదవలు. మీ ఆయన ఎదవల్లోకి ఎదవ. అనవసరంగా నీ మనసు కష్టపెట్టినట్లున్నాను. నువ్వు ఇవన్నీ మనసులో పెట్టుకోమాక. బాగా చదువుకో. ఈ పిల్లోడి ముఖం చూసుకుని బతుకు. ఏం చేస్తావు మరి!" అని ఆటో ఎక్కే ముందు నచ్చచెప్పింది.

వొళ్ళంతా అవమానంతో దహించుకుపోతూంది తన్మయికి.

ఇంటికి వస్తూనే గోడకి వేల్లాడుతూన్న శేఖర్ ఫోటోని నేలకేసి కొట్టింది. "ఛీ.. ఛీ... శరీరం తప్ప, మనసులేని పశువు. పెళ్లికాకముందు ఎలా తిరిగాడో అనవసరం, కనీసం పెళ్లయ్యాకనయినా స్థిరంగా ఉన్నాడనుకుని నమ్మిందిన్నాళ్లూ. తనక్కడ కడుపుతో నానా కష్టాలు పడ్తూంటే, ఇతనిక్కడ వెలగబెట్టిన సంసారం ఇది. పశువుని కట్టుకున్నందుకు తనకి శాస్తి జరిగింది." గోడకి జేరబడి కూచున్నదల్లా కోపంతో అప్రయత్నంగా తలని గోడకేసి గట్టిగా కొట్టుకుంది. కసిదీరా తలని బాదుకుని తల నెప్పి వచ్చేస్తుంటే నేల మీద వాలి పోయి కుళ్ళి కుళ్లి ఏడవడం ప్రారంభించింది.

పిల్లాడు లేచి ఏడుస్తున్నా వినిపించని అర్థంలేని దిగులేదో పట్టుకున్నట్లు నేల మీద పడుకుని పిచ్చిదానిలా గది లో పడి రాత్రంతా ఏడుస్తూనే ఉంది.

"నేనేం తప్పు చేసానని నన్నిలా శిక్షిస్తున్నావు శేఖర్! నన్ను పెళ్లి చేసుకుని నా జీవితం సర్వ నాశనం చేసేవు. ఎందుకు? ఎందుకు?"

మధ్య మధ్య పిల్లాడి ఏడుపుకి మెలకువ వచ్చినపుడల్లా దగ్గరకు జరుపుకుని పాలిస్తూ తను మాత్రం తిండీ తిప్పలు మానేసి అలానే పడి నిద్రపోయింది తన్మయి.

రాత్రంతా కలత నిద్దర. శేఖర్ తనని పర్వతమ్మీంచి సముద్రంలోకి తోసేస్తున్నట్లు కల నించి దిగ్గున లేచింది.

తెల్లారి పిల్లాడి పనులు తప్పనిసరయ్యి చేసింది. దేని మీదా ఆసక్తిలేదు. ధారాపాతంగా కారుతున్న కన్నీళ్లని, ముక్కు ని కొంగుతో అద్దుకుంటూ రోజల్లా అలానే కూచుంది గోడకి జేరబడి.

ఉక్రోషంతో మనసు రగిలిపోతూంది.

ఆ మర్నాడు తెలార గట్లకి శేఖర్ వచ్చేడు. మనస్సంతా కాగిపోతున్న కోపోద్రేకంతో చివాలున లేచి కూచుంది.

"ఏవిటే తాచుపాములా లేచేవు? సరిగా నిద్రపోలేదా?" అన్నాడు నవ్వుతూ.

"నేను డెలివరీకి వెళ్లినపుడు ఏం చేసేవు? ఇల్లు నువ్వు ఖాళీ చేసేవా? వాళ్లు ఖాళీ చేయించేరా?" అని గట్టిగా అరిచింది.

"అసలు నువ్వెందుకెళ్లేవు అక్కడికి? నిన్నెవడెళ్లమన్నాడు అక్కడికి మళ్లీ?" అని తిరుగు ప్రశ్న వేసేడు.

"వెళ్లబట్టే తెలిసింది నీ అసలు రూపం. నువ్వు చెప్పకపోతే నాకు తెలీదనుకున్నావా?" అంది రోషంగా.

"రాత్రంతా రిజర్వేషను లేకండా జనరల్ లో నానా కష్టాలు పడి, నిద్ర లేక కళ్లు వాసిపోయి ఇంటికొచ్చిన మొగుడికి ఇదన్న మాట పెళ్ళాం చేసే మర్యాద." అన్నాడు వెటకారంగా.

"ఆహా. ఇక్కడ నేనేవన్నా సుఖంగా నిద్రపోయేననుకున్నావా? పిల్లాడు ఉండిపోయేడు. లేకపోతే ఉరేసుకుందామనుకున్నాను."అంది గొంతు పూడుకుపోయి.

"వేసుకోక పోయేవా? ఎదవ గోల వొదిలిపోయేది నాకు." అన్నాడు పిల్లాణ్ణి దగ్గరకు లాక్కుని ముసుగు తన్ని పడుకోబోతూ.

"ఛీ. ఛీ. నీలాంటి మనిషి కోసం ఛస్తే నాకే అవమానం" అంది.

"ఏవిటే తెగ రెచ్చిపోతన్నావు? ఆడదానివి నోరుమూసుకుని పడి ఉండు. మొగోణ్ణి నేను, లక్ష చేస్తాను. కష్టపడి సంసారం ఈదుతున్న దానికి మెచ్చుకోలు లేదు గానీ, అదేదో పెద్ద తప్పులాగా నిలదీసి అడుగుతున్నావేటి?" అని అటు తిరిగి పడుకున్నాడు.

వస్తూనే అతను తెచ్చిన స్వీట్ల పేకెట్టు, చీర, జాకెట్టు సంచీ తీసి నేలకేసి కొట్టింది.

ఆ గదిలో ఉండలేనట్లు బాత్రూములోకి వెళ్లి తలుపేసుకుంది. ఆలోచించడానిక్కూడా ఓపిక లేదు. తలంతా వేడిగా అయిపోయి, చెమటలు ధారాపాతంగా కారుతున్నాయి. చల్లని నీళ్లు తలమీంచి పోసుకుంది.

బయటకు వచ్చేసరికి తెల్లగా వెల్తురు వస్తూంది. తడి ఆరని తలని అలాగే వొదిలేసి ఇంటి తలుపు తీసుకుని బయటకు అడుగు పెట్టింది.

ఎటు వెళ్లాలో తెలియదు. సముద్రం వైపు నడక మొదలు పెట్టింది.

నిజానికి తమ ఇంటి నించి దిగువకి దాదాపు మైలు నడిస్తే సముద్రం కనిపిస్తుంది కానీ, చివర్లో కంచె వేసున్నందు వల్ల అంతా చుట్టు తిరిగి దాదాపు నాలుగైదు మైళ్లు వెళ్లవలసిందే.

నడిచి నడిచి కాళ్లు నొప్పులు పెడ్తూండగా కనబడ్డ బస్టాండులో కూలబడింది. చిన్న బడ్డీ కొట్టు దగ్గిర టీలు తాగడానికి వచ్చి పోయే వాళ్లు తనని వింతగా చూడడం గమనించింది. చెమటకి తడిసిపోయి, నలిగిపోయిన కాటన్ చీర, విరబోసుకున్న జుట్టు, ఏడుపుతో ఉబ్బిన కళ్లు.

అసలు తనెందుకు బయటికి వచ్చిందో అర్థం కావడం లేదు. ఆ ఇంటిలో మాత్రం ఉండాలని లేదు అంతే. నిస్త్రాణగా బల్లమీద కూలబడి తలని వంచుకుని కూచుని కళ్ళు మూసుకుంది.

ఉన్నట్టుండి మోచేతి మీద చివ్వున కాలడంతో కెవ్వున కేక వేసి పక్కకు పడింది బల్ల మీద.

తన బాధలో తను ఉండి, పక్కనే చివర్లు వెలిగించి ఉంచి వేళ్లాడుతున్న కొబ్బరి తాడుని గమనించుకోలేదు తను.

కానీ "దానికీ, తనకూ చాలా దూరమే ఉందే ! ఎలా కాలిందబ్బా!" అని మోచేతిని తడుముకుంటూ చుట్టూ చూసింది. బడ్డీ వెనక నించి వెకిలిగా నవ్వుకుంటూ ముందు కొచ్చేడు పిచ్చోడొకడు. బడ్డీ వాడు ఒక కర్ర తీసుకుని అతణ్ణి తరిమికొట్టేడు . కానీ తన్మయి అప్పటికే భయంతో కొయ్యబారిపోయింది.

19

తన్మయి ఒక్క ఉదుటున ఎదురుగా ఆగిన బస్సు ఎక్కేసింది. కండక్టరు టిక్కెట్టు అడిగే వరకూ తన దగ్గిర డబ్బుల్లేవన్న సంగతి గుర్తు రాలేదు.

పక్క స్టాపులో బస్సాపి "చూస్తే చదూకున్న దానిలా ఉన్నావ్, ఇదేం పని? దిగమ్మా, దిగు. ఎందుకెక్కుతారో డబ్బులేకుండా బస్సులు" అంటున్న డ్రైవరు మాటలు అసలు బుర్రకెక్కడం లేదు తన్మయికి.

తల మొద్దుబారిపోయినట్లయ్యింది. మనసంతా దు:ఖంతో కూడిన నిరాశ.

బస్సు దిగి నడక ప్రారంభించింది. హఠాత్తుగా ఎక్కడి నించో చంటి పాప ఏడుపు వినిపించింది.

ఒక్కసారిగా ఉలిక్కిపడి చుట్టూ చూసుకుంది తన్మయి.

"అమ్మో, బాబు! బాబుని వదిలేసి తనిక్కడ ..ఇలా రోడ్డు మీద...." ఇక ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా ఇంటి వైపు పరుగెత్తింది.

లోపలికి రాగానే శేఖర్ పక్కన ఆదమరిచి హాయిగా నిద్ర పోతున్న బాబుని అమాంతంగా ఎత్తుకుని భోరున ఏడ్చింది.

"పసివాడి తల మీద చెయ్యి పెట్టి, ఇంకెప్పుడూ నిన్నొదిలి ఎక్కడికీ వెళ్లను నాన్నా! నా ప్రాణం పోయినా సరే. నిన్ను మాత్రం వదలను." అంది.

తన్మయి ఏడుపు వినిపించినట్లు విసుగ్గా ముఖం చిట్లించి, వెనక్కి గోడ వైపు తిరిగి పడుకున్నాడు శేఖర్.

పిల్లాడిని అక్కున చేర్చుకుని నేల మీద పడి అలిసిపోయి ఎప్పుడు నిద్రపోయిందో తెలీదు.

ఎండ బాగా ముదిరిన పన్నెండు గంటల వేళ మెలకువ వచ్చే సరికి బాబు పక్కన లేదు. గదిలో మరో మూలకి దొర్లి వేళ్లు నోట్లో పెట్టుకుని జుముక్కుంటూ ఆడుకుంటున్నాడు నిశ్శబ్దంగా.

బోర్లా పడడమే కాదు. వాడికి ముందుకు కదలడమూ వచ్చిందని అర్థమైంది.

వాడి అందమైన ముచ్చట్లన్నీ గమనించేటంత మానసిక స్థిమితం ఉంటే బావుణ్ణని అనిపించి మరింత దు:ఖం వచ్చింది తన్మయికి.

"నన్ను క్షమించు నాన్నా! నీకు ఎన్నో చేయాలనుకుని చేయలేకపోతున్నాను. నా మనస్సేం బాగోలేదు." అంది వెక్కుతూ. బాబు దగ్గిరికి జరిగి వాడి చిన్ని అరచేతిని తన చేతిలోకి తీసుకుంది. ఏదో అర్థమయినట్లు అమ్మ చేతి వేలిని అందుకున్నాడు.

ఆ చిన్ని చేతినలాగే పట్టుకుని మౌనంగా రోదించ సాగింది తన్మయి.

శేఖర్ లేవడమూ, వీథి తలుపు ధబాలున వేసి బయటకు వెళ్లిపోవడమూ వింది.

"అతనికి మనసుతో సంబంధం లేదు. శరీరం, అదీ ఏ శరీరమైనా ఒకటే" అనే ఆలోచనే రోత కలిగించసాగింది.

ఇన్నాళ్లూ కాస్తో కూస్తో అతని మీద ఉన్న ప్రేమ భావం కూడా మాయమై అతన్ని చూస్తే కంపరం పుట్టుకు వస్తూంది.

"ఇక మీదట అతను తనని ముట్టుకోవడానిక్కూడా వీలులేదు." అని గట్టిగా నిర్ణయించుకున్న తర్వాత మనసుకి ఉపశమనం అనిపించింది.

లేచి తలారా చల్లటి నీళ్లతో స్నానం చేసింది. ఏడ్చి ఉబ్బిన కళ్లకి చల్లటి నీళ్ల స్నానం ఉపశమనం కలిగించింది.

కళ్లకి కాటుక పెట్టుకుని, ఎర్ర తిలకం సీసా కాడతో గుండ్రని బొట్టు దిద్దుకుంది. సింధూరం పాపిట పెట్టుకోబోయి విరక్తి కమ్ముకొచ్చి ఆగిపోయింది.

సింధూరం పెట్టుకున్నపుడల్లా పెళ్లి తతంగం గుర్తుకు వస్తుంది.

శేఖర్ ఆ సాయంత్రం వస్తూనే బ్యాగు సర్దుకుని "నాకు అర్జంటుగా రమ్మని ఒరిస్సా నించి పిలుపు వచ్చింది. ఏం చేస్తాం, ఎదవ బతుకు. మిలట్రీ సంసారం అయిపోయింది." అన్నాడు.

ముభావంగా ఉన్న తన్మయి వైపు చూస్తూ "నా బతుక్కి ఉద్యోగంలోనూ సంతోషంలేదు, కొంపలోనూ సంతోషం లేదు. నా తలరాత. ఏం చేస్తాను?!" అని నెత్తి కొట్టుకుని,

"నీ ఎదవ ఏడుపు మాని, నా కొడుకునైనా జాగ్రత్తగా చూసుకో" అని విసురుగా వెళ్లిపోయాడు.

శేఖర్ వెళ్లేక చీకటి వేళ చంటాడినెత్తుకుని వాకిట్లోకి వచ్చి కూచుంది తన్మయి.

ప్రశాంతంగా గాలి వీస్తూంది బయట.

తన్మయికి దు:ఖం ఎక్కడా నిలవనీయడం లేదు.

ఒళ్లో బాబు తో మెల్లగా మాట్లాడ సాగింది.

"ఎందుకు నాన్నా నేనిలా మోసపోయాను?! నేనేం తక్కువ చేసానని అతనిలా పరాయి స్త్రీలని తెచ్చుకున్నాడు? అప్పుడు నేను నిన్ను కనడానికే కదా వెళ్లింది! తల్చుకోవడానికే జుగుప్స కలుగుతోంది."

శేఖర్ గురించి కాకుండా మరేదైనా ఆలోచించాలని మనసుని తప్పించుకునే మార్గం కోసం లోపలి నించి కరుణ ఇచ్చిన పుస్తకం తెచ్చుకుంది.

"బయట వరండాలోకి మంచి వెలుతురు వచ్చే బల్బు కొని తేవాలి రా నాన్నా, నువ్వు ఆడుకుందుకూ, నేను చదువుకుందుకూ" అంది.

చాప మీద మెత్తటి దుప్పటి పరిచి బాబుని పడుకో బెట్టి పక్కనే కూచుని పుస్తకం తెరిచింది.

పద్య కావ్యమది. పద్యాలలో కొన్ని పదాలకు అర్థాలు తెలియడం లేదు. అయినా పద్యం చదువుతూంటే శబ్ద సౌందర్యానికి మనసుకి ఎంతో ఊరట కలగ సాగింది.

"పదాల వ్యుత్పత్తి ఎలా తెలుసు కోవాలి? కరుణ కనబడ్డప్పుడు అడగాలి" అనుకుంది.

చదువుతూ చదువుతూ ఉండగానే మనసులో దు:ఖమంతా క్రమంగా మాయమై గుండె తేలికపడింది కాస్సేపటిలోనే.

"అజ్ఞాత మిత్రమా! నువ్వు ఇపుడు ఈ పుస్తక రూపం దాల్చావన్న మాట." అనుకోకుండా తన్మయి ముఖమ్మీద చిన్న ప్రశాంతత వెలిసింది.

పుస్తకం లోకి, తన వైపే చూస్తున్న బాబు కళ్ళల్లోకి మార్చి మార్చి చూస్తూ "మిత్రమా! అనుక్షణం ఓడిపోతున్న జీవితంలో నువ్వే లేకపోతే నేనేమైపోయేదాన్ని!" అంది.

★★★

ఉదయానే పాల పేకెట్టు కోసం బయటికి వచ్చింది తన్మయి. గేటుకి వేళ్లాడ దీసిన రెండు సంచీల్లో చిన్న సంచీలో చేయి పెట్టి తమ పేకెట్టు తీసుకుని లోపలికి వచ్చింది.

ఈ ఇంటికి వచ్చిన దగ్గర్నించి అరలీటరు పాల పేకెట్టు ఇంటివాళ్లకి వేసే సప్లయిరు దగ్గిర తీసుకుంటున్నారు.

ఇంటి వాళ్లు తన్మయితో పరిచయంగా ఉండరు. ఇంటాయన పెద్దింటి వాకిట్లో శేఖర్తో అప్పుడప్పుడూ మాట్లాడతాడు.

ఇంటావిడ తన్మయిని చూసి పలకరింపుగా నవ్వుతుందే కానీ ఏమీ మాట్లాడదు. ఇంటికి వచ్చి పోయే వాళ్ల స్నేహితులతో గేటు దగ్గిర వరకూ వచ్చి బానే మాట్లాడుతుంది.

"ఆవిడ ఆస్థిపరురాలు కాబట్టి తనతో ఇలా అంతరం పాటిస్తుందనుకుంటా" అనుకుంది తన్మయి లోపలికి వెళ్తూ.

ఎప్పుడూ ఔట్ హౌస్ వైపు ఎవరూ రారు. తన్మయికీ అలా ఉండడమే ఇష్టం.

ప్రశాంతంగా ఉన్న ఇంట్లో శేఖర్ ఊళ్లో లేనపుడు తన్మయికి రోజంతా ఎటువంటి దిగులూ లేకుండా గడుస్తుంది.

ఆ రోజు మధ్యాహ్నం తలుపు తట్టిన శబ్దమయ్యింది.

తన్మయి ఆశ్చర్యంగా తలుపు తీసింది.

ఇంటిగలాయన పలకరింపుగా నవ్వుతూ "ఇంట్లో మీటర్ చెక్ చేయడానికి" అన్నాడు. అతన్ని ఇంత దగ్గిరగా చూడడం ఇదే మొదటి సారి. యాభై ఏళ్ళుంటాయనడానికి  సాక్షిగా పెద్ద బొజ్జ, బట్ట తల, తెల్ల బనీను, గళ్ళ లుంగీ, హవాయి చెప్పులు. ఎందుకో అతన్ని చూడగానే తన్మయికి మంచి అభిప్రాయం కలగలేదు.

అతనికి దారిచ్చి, బాబునెత్తుకుని తన్మయి బయటికి గేటు వైపుకి వచ్చి నిలబడింది.

అయిదు నిమిషాల్లో వెళ్తూ "శేఖర్ చాలా మంచి పనిమంతుడు. అతనికి కంపెనీలో  చాలా మంచి పేరుంది.  నాకూ మంచి స్నేహితుడు. అందుకే అద్దె గురించి చూసుకోకుండా మీకు ఇల్లిచ్చేం. నీకేం అవసరం పడినా అడగడానికి మొహమాట పడకు. మా మేడం కి ఇంట్లో సాయం అవసరం. నీకేవైనా వీలవుతుందా" అన్నాడు.

తన్మయి కొంచెం తటపటాయించి "నేను యూనివర్శిటీలో ఎమ్మే లో జాయినయ్యానండి. ఖాళీ ఉన్నపుడు తప్పక సాయం చేస్తాను." అంది.

అతను కనుబొమ్మలు ముడిచి "నువ్వు చదువుకున్న అమ్మాయివని శేఖర్ ఎప్పుడూ చెప్పనే లేదు. సారీ" అని

అప్పుడే వీధి గేటు తీసుకుని వస్తూన్న వాళ్లావిడ వైపు నడిచేడు.

ఆవిడ అతన్నీ, తననీ మార్చి మార్చి చూడడం తన్మయికి ఆశ్చర్యంగా అనిపించింది. ఆవిడ ముఖమ్మీద ఎప్పుడూ తనని చూడగానే  కనబడే చిన్న చిర్నవ్వు స్థానంలో ఒక విధమైన చికాకు చోటు చేసుకోవడం గమనించింది తన్మయి.

ఆ వెనకే వచ్చి ఇంటాయనని అడ్రసు అడుగుతూన్న కరుణని చూసి ఇంకాస్త ఆశ్చర్యపోయింది తన్మయి.

" ఇక్కడే  ఉన్నారా, ఇదిగో మీకీ పుస్తకం ఇచ్చి వెళదామని వచ్చేను. ఎంత గొప్పగా ఉన్నాయో ఈ పద్యాలు" అంటున్న అతన్ని చూస్తూ పక్క నించి వెళ్తూన్న ఇంటావిడ ముఖంలో చికాకు మరింత పెరగడాన్ని గమనించింది తన్మయి.

"థాంక్సండీ, మీరిది వరకు ఇచ్చిన పుస్తకం నిన్నే చదివేను. తెస్తానుండండి" అని లోపలికి వచ్చింది తన్మయి. కరుణ వరండా వరకూ వచ్చి బయట నిలబడ్డాడు.

"మీ అబ్బాయి భలే ముద్దొస్తున్నాడండీ, వీణ్ణి చూస్తే  భాగవతంలో చిన్ని కృష్ణుణ్ణి ఉద్దేశించిన పద్యాలు జ్ఞాపకం వస్తున్నాయి." అన్నాడు.

తన్మయి పుస్తకంతో బాటూ తెచ్చిన గ్లాసు నీళ్లు అందుకుని తాగి, "హమ్మయ్య, బతికించేరండీ నీళ్లిచ్చి" అని

"మీకు ఇంత చంటి పిల్లాణ్ణి పెట్టుకుని ఇలా చదవాలన్న ఉత్సాహం ఎక్కణ్ణించి వస్తోందా అనుకున్నాను. మీ ఇంటినల్లుకున్న ఈ తీగెలు, పొదలు, లతల నించన్నమాట....అన్నట్లు పదాలకు వ్యుత్పత్తి గురించి అడిగేరు కదా, అమర కోశం కంఠతా పట్టడమే. అలా కంగారు పడకండి నేనున్నానుగా." అన్నాడు.

చలాకీగా మాట్లాడుతూన్న అతన్ని చూస్తూ  "గొప్ప జ్ఞానంతో తొణికిసలాడే ముఖ వర్చస్సు ఇతనిది" అనుకుంది తన్మయి.

"వచ్చే సోమవారం నించి క్లాసులు. మర్చిపోకండి." అన్నాడు వెళ్తూ.

★★★

ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న కాలేజీ మొదటి రోజు రానే వచ్చింది.

బాబుని ఎత్తుకుని యూనివర్శిటీ ప్రాంగణం లోకి అడుగు పెట్టింది తన్మయి.

బాబుని క్లాసు రూములోకి రానిస్తారో లేదో తెలియదు. అయినా మరో దారి లేదు తనకు. మొదటి క్లాసు లోకి అడుగు పెట్టింది.

అప్పటికే క్లాసు లో ఉన్న లేడీ ప్రొఫెసరు "ఏమ్మా, ఎమ్మే నీకా, మీ అబ్బాయికా?" అంది.

"అందరూ పకాలున నవ్వేరు."

"ఇవేళ్టికే మేడం. రేపట్నించి...." అంది తన్మయి.

అందే గానీ రేపట్నించి ఏంచెయ్యాలో తెలియదు తనకి.

బాబు సరిగ్గా అయిదు నిమిషాల్లో ఏడుపు మొదలు పెట్టేడు. తన్మయి బ్యాగు తీసుకుని డిపార్టుమెంటు బయట చెట్టు కింద బెంచీ మీద కూలబడింది.

అప్పటి దాకా ఏడ్చిన వాడు బయటికి రాగానే నిశ్శబ్దంగా నవ్వేడు అమ్మని చూసి.

ఒళ్లో పడుకో బెట్టుకుని పాల సీసా బయటికి తీస్తూ "నువ్విలా పేచీ పెడితే అమ్మ ఎలా చదువుకుంటుందిరా?" అంది.

"ఊంగా" అంటూ కేరింతలు కొట్టేడు.

"నిజమే నీతో ఆడడమే ముఖ్యం. కానీ అమ్మ చదువుకోవాలి నాన్నా, అమ్మ తన కాళ్లమీద తను నిలబడాలి. చిన్నపట్నించీ కలలు గన్న పీ.ఎహ్.డీ చెయ్యాలి." అంది వాడి కళ్లల్లోకి చూస్తూ.

చుట్టూ ఉన్న యూకలిప్టస్ చెట్ల నించి ఆకులు రాలి చుట్టూ అంతా తుక్కుతుక్కుగా ఉంది. చెట్ల కింద బల్లల మీద కాస్త ఎండా, కాస్త నీడా దోబూచులాడుతున్నాయి.

బాబు తల మీద కొంగు కప్పి సంచీ లోంచి కర్చీఫ్ తీసి వాడికి విసురుతూ కూచుంది.

"ఇదేవిటి, ఇక్కడ కూచున్నారు?" కరుణ మాటలకి పలకరింపుగా నవ్వింది.

ఆ నవ్వులో నీరసం కనిపెట్టినట్లు "అయినా క్లాసుల్లో ఏవీ చెప్పేది లేదు ఇవేళ. మొదటి రోజు కదా, ఊరికే పరిచయాలు మాత్రమే." అంటూ అటుగా వస్తున్న ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిల్ని పిలిచి పరిచయం చేసేడు.

"ఈ అమ్మాయి అనంత, ఇతను రాజు, ఇతను దివాకర్" అంటూ.

అనంత పరిచయంగా దగ్గిరికి వచ్చి "అబ్బా, ఎంత ముద్దుగా ఉన్నాడో చంటోడు" అని చేతుల్లోకి తీసుకుంది. బాబు కేరింతల్తో పరిచయంగా మీదికి దుమికే సరికి "అమ్మో, ఎంత బంగారు కన్నయ్యో" అంటూ "నాకు పిల్లలంటే భలే ఇష్టమండీ" అంది ఓరగా రాజు వైపు చూస్తూ.

అతను ముసి ముసిగా నవ్వడం చూసి, "వీళ్లిద్దరూ చిరకాల ప్రేమికులు. ఎమ్మేలు, పీహెచ్ డీ లు  చేస్తారు గానీ పెళ్లి మాత్రం చేసుకోరు" అన్నాడు కరుణ.

"ఓయ్" అని అతని భుజమ్మీద ఒకటిచ్చింది అనంత.

వాళ్లని చూసి తన్మయికి భలే సంతోషంగా అనిపించింది. ఇలా అందరితో కలిసి హాయిగా చదువుకునే అవకాశం తనకి ఉంటే ఎంత బావుణ్ణు అనుకుంది.

"త్వరపడి చదువు పూర్తవకుండా పెళ్లి మాత్రం చేసుకోకండి." అంది తన్మయి.

అప్పటి వరకూ నిశ్శబ్దంగా ఉన్న దివాకర్ "నేను వి..వీళ్లను చూసే ఆ..ఆజన్మాంత బ్రహ్మచారిగా ఉండిపోవాలని చి...చిన్నప్పుడే శ..పథం చేసుకున్నా" అన్నాడు నత్తితో పలకలేక పాట్లు పడ్తూ.

అంతా పక్కున నవ్వేరు.

కరుణ లేస్తూ "రండి, అన్ని క్లాసు రూములూ చూసొద్దాం" అన్నాడు.

"బాబుతో...." అని సంశయిస్తున్న తన్మయి తో "అయ్యో ఇంత బంగారమంటి పిల్లోణ్ణి రావొద్దనే వాళ్లెవ్వరు? చూద్దాం పదండి" అంది అనంత వాణ్ణి తన్మయి భుజమ్మించి ముద్దాడుతూ. నలుగురితో కలిసి డిపార్టు మెంటు అంతా కలయదిరగడం తన్మయికి ఎంతో హుషారు నిచ్చింది.

తన చేతిలో బాబుని ప్రొఫెసర్లంతా సహృదయంతో పలకరించడం ఇంకాస్త హుషారునిచ్చింది.

చెట్ల మధ్య నించి కాస్త దూరం నడిచి కేంటీను వరకూ వచ్చేరు. టీ తాగుతూ, ఎదురుగా ఉన్న పెద్ద బిల్డింగుని చూపించి "ఇదే మన యూనివర్శిటీ లైబ్రరీ" అన్నాడు కరుణ.

తన్మయి తన కళ్లని తనే నమ్మలేక పోయింది. "ఇంత పెద్ద భవనం లైబ్రరీయా? అని నోరు తెరిచింది.

తన్మయి ముఖంలో కనిపిస్తూన్న ఆశ్చర్యం, ఆనందం చూసి, "బయటి నించి ఏం చూసేరు? లోపల ఎంత గొప్పగా ఉందో తెలుసా?" అన్నాడు కరుణ.

"వెళ్దామా?" అంది హుషారుగా తన్మయి.

"అబ్బా, మీరూ పుస్తకాల పురుగేనన్న మాట" అంది అనంత నవ్వుతూ.

లోపల రెండస్థులలో ఉన్న అత్యంత విశాలమైన లైబ్రరీని, ఆ పుస్తకాల్ని చూసి "ఆహా! నా జీవితం ధన్య మైపోయింది" అంది అప్రయత్నంగా తన్మయి.

కరుణ ప్రశంసా పూర్వకంగా చూసి "సరిగ్గా నేనూ ఇలాగే అనుకున్నాను తెలుసా ఈ లైబ్రరీని మొదటగా చూసినప్పుడు" అన్నాడు.

రేక్ ల మధ్యలో తిరుగుతూంటే అవధి లేని ఆనందం కలగసాగింది తన్మయికి.

లైబ్రరీ కార్డుకి అప్లికేషను పెడ్తూంటే ఎంతో గర్వంగా అనిపించసాగింది.

"యూనివర్శిటీలో తనిప్పుడు నిజంగానే చదువుకుంటూంది! నిజంగానే!!"

"అమ్మ యూనివర్శిటీ లో నిజంగా చదువుకుంటూంది. నచ్చిందా నాన్నా నీకు? నువ్వెప్పుడు యూనివర్శిటీకి వెళ్తావు మరి?" అంది తిరిగి వస్తూ బస్సులో బాబుతో.

★★★

శేఖర్ ఊర్నించి వస్తూనే "ఇంకా కోపం పోలేదా?" అన్నాడు నీరసంగా, ముభావంగా ఉన్న తన్మయితో.

నిశ్శబ్దంగా అన్నం వడ్డించింది.

"సాయంత్రం సినిమా కు వెళ్దాం" అన్నాడు మాట మారుస్తూ.

శేఖర్కు వచ్చిన ప్రతీ సినిమా చూసే అలవాటు ఉంది.

తన్మయికి ఫైట్లు, అర్థం పర్థం లేని గందరగోళం సినిమాలు నచ్చవు. మంచి సాహిత్యం, సంగీతం లేని పాటలు కూడా నచ్చవు.

ఇంట్లో అసహనంగా ఉంది. కనీసం సినిమాకు వెళ్తేనైనా తగ్గుతుందనిపించింది. అతని వెంట మౌనంగా బయలుదేరింది.

సినిమా నించి వచ్చేటపుడు అర్థమైంది ఇంట్లో ఉండడమే మంచిదని. అంత చెత్త సినిమా అది.

శేఖర్ రెండర్థాల డైలాగులకి పగలబడి నవ్వుకుంటూ సినిమా చూసేడు.

ఒళ్లో కూచున్న బాబు తనని చూసి నవ్వుతున్నాడనుకుని కిలకిలా నవ్వసాగేడు.

తన్మయికి బాగా తలపోటు వచ్చేయడం ప్రారంభించింది.

పడుకునే వేళకి తన్మయి విడిగా పక్క వేసుకోవడం గమనించి "ఏం? మంచం పైన పడుకోవా?" అన్నాడు.

మారు మాట్లాడకుండా గోడ వైపు తిరిగి పడుకుంది.

"ఏంటి చిన్న విషయానికి ఇంత గోల చేస్తున్నావు? నువ్వేమైనా భూలోక రంభవా నువ్వంటే వెంపర్లాడడానికి?" అన్నాడు విసుగ్గా.

"నేను భూలోక రంభని కాదన్న విషయం పెళ్లికి ముందు తెలీదా?" అంది చివుక్కున తిరిగి.

"ఒంటి మీద కేజీ కండ లేకపోయినా, అందగత్తెవి కాకపోయినా మొగుడేం చేసినా పడుంటావని చేసుకున్నాను. అయినా పెళ్లికి ముందు నువ్వు ఒళ్లు చూపించేవా, నువ్వు రంభవో, కాదో తెలియడానికి?" అన్నాడు పచ్చిగా.

అతని మాటలకి తన్మయికి తన మీద తనకే అసహ్యం వేసింది.

"ఛీ.. మనిషివేనా?" అని గట్టిగా అరిచింది. "అతను చేసే తప్పులన్నిటికీ తనని బాధ్యురాలిని చెయ్యడానికి చూస్తున్నాడు. కాస్త కూడా పశ్చాత్తాపం లేదు మనిషికి. ఛీ. ఛీ "

బాబు బాగా గాఢంగా నిద్రపోతున్నాడు.

తన్మయి కి ఇక ఆపుకోలేని దు:ఖం ముంచుకొచ్చింది. వెనక్కి తిరిగి ఏడుస్తున్న తన్మయిని అమాంతం ఎత్తి మంచమ్మీద పడేసేడు.

గింజుకున్నా వీలు లేని బలిష్టమైన కౌగిలిలో అసహాయంగా కళ్లు మూసుకుంది.

"వెర్రి మొర్రి వేషాలు వేసేవనుకో..." అని పెదవుల్ని గట్టిగా కొరికేడు.

కళ్లల్లోంచి ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ల శరీరమ్మీద పడి కోరిక తీర్చుకున్నాడు.

ఓడిపోయిన బాధతో కుమిలి పోతున్న తన్మయికి "భూమి పగిలి అంతా అక్కడే సమాధి అయిపోతే బావుణ్ణు" అనిపించింది.

## 20

ఉదయానే తలుపు చప్పుడయ్యి మెలకువ వచ్చింది తన్మయికి. బాబు మీద చెయ్యి వేసి, గురక పెట్టి నిద్రపోతున్నాడు శేఖర్.

"పిల్లాడి మీద ఉన్న ప్రేమ తన మీద లేదెందుకో" అని నిట్టూరుస్తూ లేచి తలుపు తీసింది.

ఎదురుగా అమ్మా, నాన్నా కనబడే సరికి ఆశ్చర్యం, ఆనందం ఒక్కసారి ముంచెత్తాయి.

గభాలున తల్లిని కౌగలించుకుంది. కూతుర్ని అలాగే ఒడిసి పట్టుకుని వీపు నిమిరింది జ్యోతి. తండ్రి లోపలికి వెళ్లి బాబుని శేఖర్ పక్క నించి లేవదీసి భుజమ్మీద వేసుకుని వచ్చేడు. జీవితంలోని బాధలన్నీ ఆ భుజమ్మీద తల వాల్చగానే నిశ్చింత పడినట్లయ్యి కళ్లల్లోంచి ధారాపాతంగా దు:ఖం ముంచుకొచ్చింది తన్మయికి.

"ఏమైందమ్మా, మాకూ బెంగగానే అనిపించే వచ్చేసాం." అంది జ్యోతి తనూ కళ్ళు తుడుచుకుంటూ.

అంతలోనే "ఏడీ, ఏడీ మా చిన్ని కన్నయ్య.. "అంటూ నిద్రపోతున్న చంటాడిని ఎత్తుకుని తల నిమురుతూ ముద్దాడింది.

పది నిమిషాల పాటు "అబ్బో ఎంత జుట్టు పెరిగిపోయిందో నాన్నారికి. ముక్కు చూడండి ఎంత అందంగా ఉందో ఇప్పుడు." అంటూ ఒకటే మురిసిపోతున్న అమ్మా, నాన్నల్ని మురిపెంగా చూస్తూ

"రాత్రి ఎప్పుడు బయలుదేరేరు? మొహాలు కడుక్కోండి. కాఫీ పెడతాను." అంది తన్మయి.

శేఖర్ నిద్ర లేచి వచ్చి "ఎప్పుడొచ్చేరు మావయ్యా?" అంటూ పలకరించేడు.

"అలా చిక్కి పోయేవేంటి బాబూ, బాగా పని ఎక్కువ ఉంటూందా ఉద్యోగంలో?" అన్నాడు భానుమూర్తి అల్లుడిని పలకరిస్తూ.

"పని ఒత్తిడి కాదు మావయ్యా, మీ అమ్మాయి వంట మహిమ" అన్నాడు నవ్వుతూ శేఖర్.

జ్యోతి వంటింట్లోకి వచ్చి "పోన్లేమ్మా, ఇన్నాళ్లకి మంచి సౌకర్యవంతమైన ఇంట్లోకి మారేరు. ఇల్లు ఎంత బావుందో. అల్లుడు కూడా కాస్త మారినట్లున్నాడు" అంది సంతోషంగా.

తన మనసులోని వేదనలేవీ తల్లికి కనబడకుండా వెనక్కి తిరిగి స్టవ్వు మీద కాఫీ దించుతూ "అవునమ్మా, మేం బానే ఉన్నాం" అంది తన్మయి.

తల్లిదండ్రులు రావడం వల్ల గొప్ప సంతోషం ఇంకోటుంది తన్మయికి. చక్కగా తను యూనివర్శిటీకి వెళ్లి రావొచ్చు.అసలే మొదటి రోజు తర్వాత మళ్ళీ క్లాసులకి వెళ్లడం లేదు తన్మయి. కనీస అటెండెన్సు లేనిదే సంవత్సరం చివర పరీక్ష రాయడానికి కుదరదని నిబంధనల్లో చదివింది తన్మయి.

శేఖర్ ఆఫీసుకి వెళ్ల గానే "అమ్మా, నేను యూనివర్శిటీకి వెళ్లొస్తాను. నే వచ్చేసరికి లేటైతే మీరు భోజనాలు చేసెయ్యండి" అంది తన్మయి నోటు పుస్తకం పర్సులో పెట్టుకుంటూ.

తండ్రి బాబునెత్తుకుని గేటు వరకూ వచ్చి "అమ్మకి టాటా చెప్పు నాన్నా" అన్నాడు.

తన్మయి సంతోషంగా ముందుకు కదిలింది.

"ఇన్ని రోజుల నించీ మిస్సయిన నోట్సులన్నీ రాసుకోవాలి. లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు తెచ్చుకోవాలి. అన్నిటికన్నా ముఖ్యంగా ఇన్ కమ్ సర్టిఫికేటు తీసుకొచ్చి యూనివర్శిటీ లో సబ్మిట్ చేయాలి." వడివడిగా నడుస్తూ లోపల్లోపల అనుకోసాగింది.

కాళ్లకి అడ్డం పడ్తూన్న బెంగాల్ కాటన్ చీరని వెనక్కి తిరిగి సర్దుకుంటూ పలకరింపుకి చటుక్కున తుళ్ళిపడి పక్కకి చూసింది.

దివాకర్ "న్న..నమస్తే" అన్నాడు రెండు చేతులూ జోడించి.

"నమస్తే, ఎలా ఉన్నారు?" అంది.

"మ్మా... ఇల్లు అదే.." అన్నాడు దూరంగా చూపిస్తూ.

"యూనివర్శిటీ క్వార్టర్సులా ఉంది " అంది తన్మయి.

"అ.. అవునండీ, నాన్నగారు డి..డిస్టేన్సు ఎడ్యుకేషను డిపార్టుమెంటులో క్ క్లర్కు గా పనిచేస్తారు." అన్నాడు.

వెనకే ఎవరో పిలుస్తున్నట్లనిపించి ఆగేరు. కరుణ వచ్చి కలిసేడు.

"పునర్దర్శనం ఇన్నాళ్లకన్నమాట" అన్నాడు తన్మయితో.

"చ..చాల్లోవోయ్ ..నిన్నేగా కలిసేను" అన్నాడు దివాకర్ తననసుకుని.

తన్మయి పక్కున నవ్వింది.

"మీరిలా నవ్వుతూ ఉంటే చాలా చక్కగా ఉంటారండీ." అన్నాడు ప్రశంసా పూర్వకంగా మెరిసే తన్మయి కళ్లల్లోకి చూస్తూ కరుణ.

అంతలోనే మాట మారుస్తూ "చూడండి, ఎంతలో వచ్చేసేమో డిపార్టుమెంటుకి ఇక అరక్రోసు దూరమే" అన్నాడు మళ్లీ.

"క..కరుణకి అన్నీ జోకులే...మీ.మీరేవీ పట్టించుకోకండి అన్నాడు దివాకర్."

లైబ్రరీ దగ్గిరికి రాగానే, "మీరు వెళ్లండి, నేను పుస్తకాలు లైబ్రరీలో ఇచ్చి వస్తాను. రా.. దివాకర్ " అన్నాడు కరుణ.

నిజానికి తనూ వెళ్లాలి లైబ్రరీకి. కానీ డిపార్టుమెంటు లోపలికి తనతో కలిసి రావడం బావుండదనుకుని అతను కావాలని అలా పక్కకి వెళ్తున్నట్టు అనిపించింది తన్మయికి. నిట్టూరుస్తూ ముందుకు కదిలింది.

చెట్ల నీడల మధ్య నడుస్తూన్నా, సూదిగా గూచ్చుతున్న ఎండని తప్పించుకోవడానికన్నట్లు కొంగు భుజం చుట్టు కప్పుకుని ముందుకు నడిచింది. చెంగుతో బాటూ ముందుకొచ్చిన పొడవైన జడని వెనక్కి వేసుకునే ప్రయత్నంలో డిపార్టుమెంటు మెట్లు దిగుతున్న వ్యక్తిని గమనించలేదు తన్మయి. వెనకే వస్తున్న విద్యార్థులు వంగి నమస్కారాలు చెప్తుంటే గానీ తనకి అర్థంకాలేదు ఆయన డిపార్టుమెంటు హెడ్డని.

"అయ్యో, తను నమస్కరించలేదు. ఏమనుకున్నారో ఆయన" అని మథనపడింది తన్మయి.

క్లాసులోకి అడుగు పెడ్తూనే అనంత దగ్గరకు వచ్చి చేతులు పట్టుకుని తనతో బాటూ తీసుకు వెళ్తూ "చంటోడేడీ" అంది.

తన్మయి జవాబు విని "పోనీలే, నీకు కాలేజీకి రావడానికి కాస్త సమయం చిక్కింది. నా దగ్గిర పెద్దగా నోట్సులేవీ లేవు. ఆ రాసే పనంతా అక్కడ" అంటూ నవ్వుతూ "క్లాసులో ముందు బెంచీలో కూచుని బుద్ధిగా ఏదో రాస్తున్న రాజుని చూపించింది.

అతన్నడిగి "ఒక నోట్సు పట్టుకొచ్చి, ఇంటికి పట్టు కెళ్లి, రాసుకున్నాక తీసుకురా, పర్లేదులే" అంది.

అప్పటికప్పుడు నోట్సు తెరిచి హడావిడిగా రాయడం మొదలెట్టిన తన్మయిని చూసి, "నువ్వూ ఈ బాపతేనన్నమాట. ఎంత అందమైన దస్తూరీ.." అని ముచ్చటపడింది అనంత.

వరసగా రెండు మూడు క్లాసులయ్యేక నోట్సు తీసుకెళ్లి రాజుకి ఇచ్చి, "థాంక్సండీ. రన్నింగు నోట్సులు చాలా బాగా రాసేరు. అనంత ఎటెళ్లిందో కనబడలేదు." అంది తన్మయి.

అతను కళ్లు కిందికి దించుకుని కాస్త సిగ్గుగా "పర్లేదండీ. మీకు ఎప్పుడు కావాలన్నా నోట్సులు తీసుకోండి. ఇలా హడావిడిగా ఇవ్వక్కరలేదు." అన్నాడు.

ఇంత నెమ్మదస్తుడైన ఈ అబ్బాయికి, ఆ గడుగ్గాయి అమ్మాయికి జత ఎలా కుదిరిందో అనుకుంది తన్మయి.

----

ఇన్ కం సర్టిఫికేటు వల్ల ఫీజు వందలోపే తెమిలిపోయింది. "ఇన్నాళ్లకి శేఖర్ వల్ల ఒక ఉపయోగం కలిగింది తనకి" అనిపించింది తన్మయికి.

ఇక పుస్తకాలంటూ ఏవీ కొనుక్కోనవసరం లేని పెద్ద లైబ్రరీ ఉంది. క్లాసులకి వెళ్లలేక పోయినా ఎప్పటికప్పుడు నోట్సులు వచ్చే మార్గం ఉంది. తన్మయికి జీవితం ఆశావహంగా కనిపించసాగింది.

జ్యోతిని వొదిలి తను మళ్లీ ఒస్తానని వెళ్ళేడు భానుమూర్తి.

శేఖర్ ఈ సారి కేంపుకి నెల రోజులకు వెళ్లిపోయేడు కాబట్టి ఎటువంటి ఇబ్బందీ లేదు తన్మయికి.

జ్యోతి పూర్తిగా ఇంటి పనులు, పిల్లాడిని చూసుకుంటూ కూతురికి చదువుకునే వీలు కల్పించింది.

త్వరలోనే డిపార్టుమెంటుతో గొప్ప అనుబంధం ఏర్పడింది తన్మయికి. ఎండా నీడలు దోబూచులాడే యూకలిప్టస్ చెట్ల మధ్య విశ్వవిద్యాలయపు తెలుగు శాఖా భవనం, కవిత్వం భాసిల్లే తరగతి గదులు, ఏదో దివ్యలోకాలకు తీసుకెళ్లే పద్యాలు......

"అటజని ......అభంగ తరంగ మృదంగ" నాదాలేవో ఆ చెట్ల మధ్య విన్నట్లనిపించింది తన్మయికి.

ఏదో కావ్యంలో చదివిన జ్ఞాపకం– తెల్లవారిన ఆకాశంలో చంద్రుడు నాయిక పాపిట గంధపు చుక్కలా ఉన్నాడట. ఆకుల పైని నిగనిగా మెరుస్తున్న సూర్య కిరణాల్ని కనురెప్పల మీద ఒడిసి పట్టుకుంటూ ఆకాశంలోకి చూసింది తన్మయి.

"ఏవిటండీ...ఉన్నట్టుండి ఆకాశంలో ఏం కనిపించింది?" అన్నాడు పక్కన నడుస్తున్న కరుణ.

"ఉహూ.. అని తలాడించింది" తన్మయి.

"కనిపెట్టేను లెండి. మనస్సులో ఏవో కవితాత్మక భావనలు కదలాడుతున్నట్లున్నాయి" అని ఈ పుస్తకం చదివేరా? అని "మను చరిత్ర" చేతిలో పెట్టేడు.

అతని వైపు ఆశ్చర్యంగా చూసింది. మొన్న క్లాసులో పాఠం విన్నప్పట్నించి ఈ పుస్తకం లైబ్రరీకి వెళ్ళి వెదకాలని ఆరాటపడింది. "తన మనస్సుని ఎంత ఖచ్చితంగా చదవగలుగుతున్నాడితను!"

"థాంక్సండీ.. అంది తడి మెరిసే కళ్లతో పుస్తకాన్ని గుండెలకానించుకుని.

పుస్తకం పట్ల తనకున్న అవ్యాజమైన ప్రేమని కనిపెట్టినట్లు "మీకే పుస్తకం కావాలన్నా నాతో చెప్పండి. ఈ భూ నభోంతరాళాలలో ఎక్కుడున్నా తెచ్చిస్తాను." అన్నాడు.

నవ్వుతున్న తన్మయి వైపు చూస్తూ "వేల చందురులు ఇచ్చోట విరబూసినట్లు ..." అంటూ "అబ్బే, ఇంత కవిత్వం వెల్లువై పొంగుతున్నా ప్రశంస లేకపోతే వ్యర్థం" అన్నాడు పెదవి విరిచి లైబ్రరీ బయట చెట్ల కింద కూలబడ్డ దివాకర్, అనంత, రాజుల వైపు నడుస్తూ .

కరుణ ఒక్కో పద్యాన్నీ రాగ యుక్తంగా చదివి అర్థం చెప్తూంటే తన్మయంగా అతని వైపు చూడ సాగింది తన్మయి.

"ఇతనికీ జ్ఞానం ఎలా అబ్బింది?!" అనుకుంటూ.

అదే అడిగింది. "హమ్మయ్య ఇప్పటికి ప్రశంస విన్నాను. ఏవుందండీ, బియ్యే ఓఎల్ చేసేం గా.. పైగా చిన్నప్పట్నించీ వేదాలు వల్లె వేసిన అనుభవమాయె" అన్నాడు తేలికగా కరుణ.

"మేమూ చేసేం. కానీ మాకు అబ్బిందా? కరుణ టాలెంటే వేరు." అంది మెచ్చుకోలుగా అనంత.

అంతలోనే రాజు ఉడుక్కోకూడదని కామోసు "మా రాజుది మరొక టాలెంటు. ఒక్క సారి నోట్సు రాసేడంటే ఇక ఎప్పటికీ మరిచిపోడు" అంది.

"నేనూ అంతే. ఎంత చదివినా గుర్తు ఉండదు. కానీ ఒక్కసారి రాసేనంటే ఇక ప్రత్యేకంగా పరీక్షలకు చదవక్కరలేదు." అంది తన్మయి.

"ఇవేళ్టికి మనుచరిత్రా పఠనమేనా? ఇంకేవైనా ఉందా?" అంది రాజు వైపు ఓరచూపు చూస్తూ.

"బీచ్ కి వెళ్దాం." అని లేచేడు రాజు.

"సరే మరి, రేపు కలుస్తాను" అని తనూ లేచింది తన్మయి.

"ఆ..ఆ.. ఎక్కడికి? బీచ్ కి మనందరం వెళ్తున్నాం" అంది అనంత.

తన్మయి మనస్సులో ఆలోచనేదో కనిపెట్టినట్లు, "మీ అమ్మగారున్నారుగా బాబుని చూసుకుందుకు. గంటా, రెండు గంటల్లో వెళ్లిపోదాం" అంది అనంత.

కరుణ, సుధాకర్ రెడీ అయ్యి తన్మయి వైపు చూసేరు. నిజానికి తన్మయికి కూడా వాళ్లతో వెళ్లాలనే ఉంది. సముద్రం చూసి ఎన్నాళ్లయ్యిందో కూడా.

"కానీ అమ్మ ఎదురు చూస్తుందేమో... పైగా బాబుకి పాలివ్వాలి" అంది అనంతని పక్కకి తీసుకెళ్లి.

"మీరంతా తిన్నగా బీచ్ కి వెళ్లిపోండి. నేను తన్మయితో వాళ్ల ఇంటికి వెళ్లి మరో గంటలో ఇద్దరం కలిసి అటే వచ్చేస్తాం." అంటూ తన కైనటిక్ హోండా స్టార్టు చేసింది.

"నువ్వొక బండి కొనుక్కోరాదూ. ఎప్పుడంటే అప్పుడు చంటోడిని మధ్యలో వెళ్లి చూసుకుని రావొచ్చు కదా." అంది అనంత.

శేఖర్ మొన్నీ మధ్య ఎవరిదో సెకండ్ హాండ్ బండి తీసుకొచ్చి ఇంటి ముందు పార్కు చేసి పెట్టేడు.

"మా ఆఫీసు క్లర్కు మా బాసుకి డబ్బులు బాకీ పడ్డాడు. తీసుకున్న డబ్బులు సకాలంలో తీర్చలేక ఈ బండి చేతిలో పెట్టాడు. ఓనరమ్మ కి తెలిస్తే తనకి చివాట్లు తప్పవని బాసు ఇక్కడ పార్కు చేసుకోమన్నాడు. ఆవిడ అడిగితే నీదేనని చెప్పు అన్నాడు."

"శేఖర్ ఊర్నించి రాగానే ఈ బండి సంగతి అడగాలి" అనుకుంది.

ఇంటికి వెళ్లగానే పాకుతూ వచ్చి కాళ్లని చుట్టుకున్నాడు బాబు. గబుక్కున ఎత్తుకుని గుండెలకు హత్తుకుంది తన్మయి.

అనంత వాణ్ణి భుజమ్మీంచే ముద్దాడుతూ "అబ్బో నవ్వితే వీడి బుగ్గల మీద సొట్టలు పడ్తున్నాయి.అదృష్టవంతుడు" అంది.

"అమ్మా, బీచ్ కి అందరం వెళ్దాం తయారవ్వు" అంది తన్మయి.

"నువ్వెళ్ళి రామ్మా, నాకు బయట తిరిగే ఓపిక లేదు. నేను బాబుని చూస్తానులే." అంది జ్యోతి.

బీచ్ లో ఆటో దిగే వేళకి మొక్క జొన్న కండెలతో రోడ్డు మీదే ఎదురు పడ్డాడు కరుణ.

"మీ గురించే ఎదురు చూస్తున్నాను. హమ్మయ్య. ఎంతకీ రాకపోయేసరికి నేనిక్కడే జీవిత కాలం నిరీక్షించాల్సి ఉంటుందని అనుకున్నాను" అన్నాడు చిర్నవ్వు నవ్వుతూ.

రోడ్డు కి ఒక పక్కగా కాళీ ఆలయం లో ఎవరో గంట మోగించారు. "అదిగో, సత్యం" అన్నాడు.

అందాల కెరటాల్తో ఎగిసిపడ్తూన్న సముద్రం వైపు చెప్పులు తీసి చేత్తో పట్టుకుని నడవసాగింది తన్మయి. కొద్దిగా ఎత్తి పట్టు కున్న చీర కుచ్చెళ్ళ కింద మెరుస్తున్న పాదాలకున్న చుట్లు, పట్టీలు చూస్తూ "అబ్బా, ఎంత బావున్నాయి నీ కాళ్లు" అంది అనంత. కరుణ కూడా చప్పున చూడడంతో గబుక్కున కుచ్చిళ్లు కిందికి విడిచింది తన్మయి.

"మేమేమీ కావ్యాలు రాయబోవట్లేదు లెండి మీ పాదాల గురించి" అన్నాడు చిర్నవ్వుతో మెరిసే కళ్లద్దాల కంటే చురుగ్గా మెరుస్తు న్న కళ్లతో.

"ఇతని దగ్గిర ఏదో ఒక గొప్ప ఆకర్షణా శక్తి ఉంది." అనుకుంది తన్మయి.

రాజు కనబడగానే అనంత ముందుకు పరుగెత్తింది. "కాస్సేపట్లో మళ్లీ కలుద్దాం తన్మయీ" అంటూ.

ఎండకాస్త తగ్గు ముఖం పడ్తూన్న సాయం కాలపు వేళ సముద్రమూ, ఆకాశమూ నీలి రంగులో పోటీలు పడ్తున్నట్లు ఉన్నాయి. అమాంతం ఒంటికి పూసుకోవాలని అనిపించే తెల్లని కెరటాల నురుగు. దిగంతం వరకూ పరుచుకున్న నీటి తళతళలు. ఎంత హాయిగా ఉంది ఈ రోజు! ఎన్నో రోజులయ్యి పోయింది ఇంత ఆహ్లాదంగా ఒక్క రోజు గడిపి. చక్కని కవిత్వం, నచ్చిన స్నేహితులు, హాయైన సాయంత్రపు సముద్రం. ఇసుకలో సున్నాలు చుడుతూ దూరంగా ఉన్న ఓడల్ని చూడసాగింది తన్మయి.

"ఇలా ఇసుకలో కూలబడడానికి కాదు వచ్చింది. రండి నీట్లోకి" అంటూ చెయ్యి అందించాడు కరుణ.

అతని చెయ్యి అందుకోకుండా తనంతట తను లేస్తూ "ఉహూ, నాకు సముద్రంలోకి దిగడం కంటే నీటి పొరలు పాదాలు తడిపే మెత్తటి ఒడ్డు మీద నడవడం ఇష్టం" అంది.

అతని ముఖంలో చిన్న అసంతృప్తి గమనించినా గమనించనట్లు చూపు కిందికి మరల్చింది.

"పోనీ అదే చేద్దాం." అని వెంట నడిచాడు కరుణ.

దివాకర్ నీట్లో ఆనందంగా ఆడుతున్నాడు.

"ఈ ప్రేమ పక్షులు ఎక్కడికి వెళ్లేరో " అని చుట్టూ చూసేడు కరుణ.

"సర్లెండి. మనం అలా ముందుకెళ్లి వద్దాం' అన్నాడు తన్మయితో.

దూరంగా ఒక వైపు ఆకాశంలో సగానికి ముసుగేసి సముద్రంలో దాచేసినట్లున్న డాల్ఫిన్స్ నోస్, సుదూరాన మరో పక్క అందంగా మలుపు తిరిగి ఆకాశాన్నందుకోవడానికి సముద్రం పైన మొలిచినట్లున్న ఋషికొండ...

"మనం ఇలా అందర్నీ వదిలి విడిగా నడవడం బావోదేమో!" సంశయంగా అంది తన్మయి.

సమాధానంగా నవ్వి దూరంగా చూపిస్తూ "మిమ్మల్ని ఋషికొండ వరకూ తీసుకెళ్లను లెండి. పదడుగుల్లో అలా వెళ్లి, తిరిగి వస్తూ ఇక్కడిక్కడే నడుద్దాం. సరేనా? అదీ మీకు నీళ్లలో తడవడం ఇష్టం లేదు కాబట్టి" అన్నాడు.

అంతలోనే ఏదో గుర్తుకొచ్చినట్లు "ఎన్నాళ్ల నించో ఒకటి అడగాలనుకుంటున్నాను..." అన్నాడు.

తన్మయి అతని ప్రశ్న విననట్లు ముఖం పెట్టి "చూసేరా పక్షులు ఆకాశంలో కాగితప్పడవల్లా ఎలా తేలుతున్నాయో!" అంది.

"తనూ!" అన్నాడు హఠాత్తుగా.

గబుక్కున కళ్లల్లోకి నీళ్లు వచ్చేయి తన్మయికి. చీర చెంగు కళ్లమీద పెట్టు కుంది. ఎన్నాళ్ళుగానో అలాంటి పిలుపు కోసం బెంగటిల్లిన గుండె ఒక్కసారి లయ తప్పినట్లయ్యింది.

"అయ్యయ్యో తప్పుగా పిలిచానా?"

"ఊహూ" అని తలాడించింది.

"మరి?"

"ఏం లేదు. నన్నలా పిలిచే వాళ్లే లేరు అందుకే" అంది తడి కళ్లతో.

"భలే భయపెట్టేరు నన్ను." అని తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు.

"మా అమ్మ నన్ను చిన్నప్పుడు ఏవేవో ముద్దు పేర్లతో పిలిచేది. ఇప్పుడు అలా పిలిచేవాళ్లే లేరు. రెండక్షరాల పిలుపులు ఎంత బావుంటాయి నిజానికి చిన్నా, బుజ్జీ, చిట్టీ, పొట్టీ, కన్నా..." అంటూంటే పకపకా నవ్వింది తన్మయి.

"హమ్మయ్య నవ్వేరుగా" మీకభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని "తనూ" అని పిలుస్తాను అన్నాడు.

"ఊహూ" అని తలడ్డంగా తిప్పింది.

"ఎందుకు?" అన్నాడు భృకుటి ముడివేసి.

"నన్ను అలా పిలవాల్సిన వాళ్లు మాత్రమే పిలవాలి" అంది.

"అర్థమైంది లెండి" అని చిరు కోపంగా ముక్కు పుటాలు ఎగరేసి "'మయీ' అని పిలవనా?" అన్నాడు.

"అదేం పేరు?" అంది నవ్వుతూ.

"మీ పేరులోనే రెండో భాగం. మీరు నన్ను 'రుణా అనండి. ఎలా ఉన్నాయి మన కొత్త పేర్లు" అన్నాడు తను కూడా నవ్వుతూ.

"ఈ షార్టకట్ పేర్లు అవసరమా?" అంది.

"అవసరమైనప్పుడు ఆలోచించుకోవడం కంటే ముందే ఆలోచించుకుని పెట్టుకోవడమన్న మాట. అన్నట్లు మీ చిన్నప్పటి విశేషాలు చెప్పండి. ఎన్నాళ్లుగానో అడగాలనుకుంటున్నాను" అన్నాడు.

అంతా విని "మొత్తానికి పరమ భావుకులన్నమాట మీరు. నాకు మీ అంత గొప్ప బాల్యమేదీ లేదు. ఊహ తెలీక ముందే నాన్న పోయారు. అక్కయ్య నా పదోయేట జబ్బుతో చనిపోయింది. ఇక మిగిలిన అమ్మా, నేనూ, మా పూరిల్లు. నేనేదైనా సంపాదిస్తేనే గడిచే బతుకు బండి. కాలేజీ లో ఉన్న సమయం కాకుండా ఎక్కడే పని దొరికినా చేస్తూంటాను. జీవితాన్నెలాగైనా గెలవాలన్న కసి నాకు. అందుకే పట్టు దలగా ఎమ్మే చదువుతున్నది. బియ్యీడీలూ, టీచర్ పరీక్షలూ ప్రతీ సంవత్సరం రాస్తూనే ఉన్నాను. ఇంకా నా మీద ఆ భగవంతుడికి దయ రాలేదు...." అతి మామూలుగా చెప్పుకెళ్లిపోతున్న కరుణ గాథ తన్మయిని కదిలించి వేసింది.

"ఏం భయపడకండి. మీ ఫీజులూ అవీ నేను కూడా సాయం చేస్తాను" అంది. నిజంగా అతను సరేనంటే ఏం చెయ్యాలో తెలిసినట్లు చేతి గాజుల వైపు చూసుకుంది.

"అబ్బెబ్బే, సాయం తీసుకునేటంత స్థితికి ఇంకా రాలేదులెండి. ప్రస్తుతానికి నేను సంపాయించేవి నా ఫీజులకి, మా పొట్టలు నిండడానికీ సరిపోతున్నాయి. కాకపోతే నాకొక్క సాయం కావాలి మీ నుంచి. నాకు ఇంగ్లీషు అంత బాగా రాదు. నాకు నేర్పించగలరా?" అన్నాడు.

"నీ మొహం. పల్లెటూరి మొహానివి నీకేం ఇంగ్లీషు వచ్చు? ఓనరమ్మ చాలా గొప్పగా ఇంగ్లీషు మాట్లాడుతుంది." అన్న శేఖర్ మాటలు చప్పున గుర్తుకు వచ్చాయి.

తన్మయి తడబాటు చూసి "ఇంగ్లీషు పోయెమ్ కి తెలుగు లో మీరు చేసిన అనువాదం మీ నోట్సు చివరి పేజీలోచూసేను లెండి. అంత గొప్ప అనువాదం చేసిన మీకు ఎంత చక్కని భాషా జ్ఞానం ఉందో అర్థం చేసుకోగలను." అన్నాడు.

"ఏవిటో ఇంగ్లీషు అంటున్నారు?" అని వచ్చి చేరాడు సుధాకర్.

విషయం విని, "త్త...తన్మయి గారూ! నాకూ ఇంగ్లీషు ట్యూషను చెప్పాలి మీరు" అన్నాడు.

సంతోషంగా తలూపింది తన్మయి. ప్రపంచాన్ని జయిస్తున్న తొలి మెట్టుని ఎక్కినట్లు సంబర పడింది.

అనంత, రాజు వచ్చి కలిసేరు. సిగ్గుల మొగ్గలా ఉన్న అనంత ముఖాన్ని చూస్తూ "ఏంటి కథ?" అని కనుబొమలు ఎగరేశాడు కరుణ.

అతన్ని తరుముతూ వెంట పరుగెత్తింది అనంత.

----------

ఇంటికి వచ్చేక కూడా కరుణ మాటలు మరిచిపోలేకపోతూంది తన్మయి.

బియ్యం ఏరుతూ "మయి" అని రాసింది అప్రయత్నంగా.

తనలో తను నవ్వుకుంటూన్న కూతురి వైపు ఆనందంగా చూసింది జ్యోతి. కాలేజీ లో చేరిన తర్వాత సంతోషంగా ఉన్న తన్మయిని చూసి ఆనందపడ్తూన్నా, అల్లుడు ఎక్కడ ఇవన్నీ భరించలేక గొడవ చేస్తాడోనని భయపడసాగింది. అయితే మరో కారణంతో శేఖర్ ఊరి నుంచి వస్తూనే ముఖం చికాకుగా పెట్టేడు. శేఖర్ క్యాంపు నించి వచ్చిన మొదటి రోజెప్పుడూ ఇలా చికాగ్గానే ఉంటాడు. అది చూసి తల్లి ఎక్కడ బాధ పడ్తుందోనని మథన పడసాగింది తన్మయి.

శేఖర్ చికాకు గమనించో, మరేమో జ్యోతి బట్టలు సర్దుకుంది. "అక్కడ ఊళ్లో పనులన్నీ ఆగి పోయాయి బాబూ, సాయంత్రం బస్సుకి వెళ్తాను" అంది.

"వచ్చే నెలలో బాబు పుట్టినరోజు ఉంది కదా. మళ్లీ వస్తాంలే." అంది తన్మయితో.

"మొదటి మనవడి పుట్టిన రోజు ఎంత గ్రాండ్ గా చేస్తారో మీ ఇష్టం." అన్నాడు శేఖర్.

జ్యోతి ఏదో మాట్లాడే లోగా "మా అమ్మ మీకు ఫోను చేసి లిస్టు చెపుతుంది. పిల్లాడి పుట్టినరోజుకి ఎవరెవరికి బట్టలు పెట్టాలో, ఏమేమి మర్యాదలు చెయ్యాలో మీరూ మీరూ మాట్లాడుకోండి" అన్నాడు.

సాయంత్రం వెళ్లే వరకూ జ్యోతి ముక్కు చీదుకుంటూ కూచుండిపోయింది.

"నీ కొడుకు పుట్టినరోజు ఎలా చెయ్యాలో తల్లీ" అని గాభరాగా గొణగసాగింది.

శేఖర్ బయటికి వెళగానే తన్మయి "అమ్మా, మీ వల్ల కాదని చెప్పేసెయ్యి. అతనడిగినవన్నీ చేస్తూంటే మరీ లోకువ అయిపోతూంది." అనేదో సర్ది చెప్పడానికి ప్రయత్నించింది.

"చాలు తల్లీ, చాలు. కావాలని నువ్వు పట్టుబట్టి చేసుకున్నందుకు మాకు జరుగుతున్న క్షోభ చాలు. ఏం నువ్వు చెప్పలేవా అతనికి? అంటే అన్నిటికీ నేనే చెడ్డ దాన్ని కావాలా?" అని ఎదురు ప్రశ్న వేసింది.

ఎన్నో విషయాలలో తనని ఎంతగానో అర్థం చేసుకున్నట్లు కనబడే తల్లి శేఖర్ విషయంలో అతన్నీ, తననీ ఒక గాటని కట్టి ఎందుకు మాట్లాడుతుందో అర్థంకాదు తన్మయికి. అతను చేసే ప్రతీ పని వెనకా తన కుట్ర కూడా ఉందన్నట్లు మాట్లాడుతున్న తల్లి మాటలకి విపరీతంగా దు:ఖం వచ్చింది తన్మయి.

తల్లిని బస్సెక్కించగానే శేఖర్ తో "బాబు పుట్టిన రోజు మా అమ్మ వాళ్లు ఎందుకు చెయ్యాలి? సాధ్యమైతే చేద్దాం. లేకపోతే మానేద్దాం." అంది.

తన్మయి వైపు ఈసడింపుగా చూసి "నేనేమైనా నా పుట్టినరోజు చెయ్యమన్నానా? వాళ్ళ మనవడి పుట్టినరోజేగా. బొత్తిగా తెలివి లేదు నీకు. నువ్విలాంటి వెర్రి మొహానివి కాబట్టే మీ వాళ్ల ఆటలు అలా సాగుతున్నాయి. నీకు ఇవన్నీ అర్థం కావు గానీ మా అమ్మ చెప్పినట్లు విను." అన్నాడు.

పిల్లాడి పుట్టిన రోజు పేరుతో జరగబోతున్న రణరంగాన్ని తల్చుకుని తన్మయి గుండెల్లో రైళ్ళు పరుగెత్త సాగాయి.

## 21

తెలుగు డిపార్టుమెంట్లో మొదటి సంవత్సరం పరీక్షలకు టైం టేబుల్ అతికించి ఉన్న గోడ దగ్గిర సాలోచనగా నిలబడిపోయింది తన్మయి.

"తను ఈ పరీక్షలు ఎలాగయినా గట్టెక్కాలి. కాదు, కాదు. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలి. అన్నిటినీ మించి పరీక్షల సమయంలో బాబు సంగతి ఆలోచించాలి."

తల దించుకుని నోట్సులో టైం టేబుల్ రాసుకుంటున్న తన్మయి కళ్లు మూస్తూ "ఇలా రోజుల తరబడి మాయమైపోతే ఎలాగమ్మా?" అంది అనంత.

బదులుగా నిట్టూర్పు చూసి "ఏమైంది తన్మయీ?" అంది పక్కకు తీసుకెళ్తూ.

"ఏం లేదు, పరీక్షలు దగ్గిర పడ్తూంటే గాభరాగా ఉంది." అంది తన్మయి.

"ఓస్, అంతేనా! నీ ముఖం చూస్తే భలే భయమేసింది. అయినా నోట్సులు రాసుకుంటున్నావుగా భయమెందుకు? అసలు నేనే మీ ఇంటికి సాయంత్రం వద్దామనుకుంటున్నాను." అంది.

తలెత్తి అనంత వైపు చూసింది తన్మయి.

"నాకో సహాయం కావాలి తన్మయీ. హాస్టల్లో నాకు ఈ సంవత్సరం సీటు రాలేదన్న సంగతి నీకు తెలుసుగా. హాస్టల్లో తెలిసిన ఫ్రెండ్ రూములో గెస్టుగా కాలక్షేపం చేస్తున్నా. ఇప్పుడా రూముకి మరొక అమ్మాయిని అలాట్ చేసేరు. ఇక నాకు ఉద్వాసన తప్పింది కాదు. ఎంత ప్రయత్నించినా

ఇప్పటికిప్పుడు మరొక గది దొరకడం కష్టం. ఎలాగూ ఎల్లుండి నించి ప్రిపరేషన్ హాలిడేస్ ఇస్తున్నారు కదా! అంత వరకూ నీకభ్యంతరం లేకపోతే ఈ రెండు రోజులూ మీ ఇంట్లో ఉండొచ్చా? " అంది.

"ఈ మాత్రానికి నన్ను అడగాలా? రెండ్రోజులు ఏదో రకంగా ఎడ్జస్టు అవుదాంలే" అంది సంతోషంగా తన్మయి.

"హమ్మయ్య. గొప్ప భారం తీరిందనుకో. ఉండు, రాజుకి చెప్పొస్తాను." అంది అనంత.

డిపార్టుమెంటు లో కరుణ కోసం చూస్తూ ఒక్కో గది దగ్గిరా ఆగి మెల్లగా చూస్తూ ముందుకు నడవ సాగింది తన్మయి.

ఆధునిక సాహిత్యాన్ని చెప్పే ప్రొఫెసరు గది దగ్గిరికి రాగానే కరుణ బయటకు వస్తూ కనిపించేడు.

"ఆ..మంచి సమయానికి వచ్చేరు. రండి, అంటూ ..." తన్మయిని లోపలికి తీసుకు వెళ్లి, "మాస్టారూ... ఆ ఇంగ్లీషు పోయెం ని తెలుగులోకి ట్రాన్సిలేట్ చేసింది ఈవిడే" అని పరిచయం చేసేడు.

"ఊ... కూర్చోండి.." అన్నాడాయన ఏదో రిఫరెన్సు పుస్తకంలోకి చూస్తూ.

తన్మయి బిడియంగా కుర్చీ ముందుకు జరిగి కూచుంది.

కరుణ రిలాక్స్ కమ్మన్నట్లు సైగ చేసేడు.

"చూసేను మీ అనువాదం. చాలా బావుంది. ఇంకేవైనా చేసేరా?" పుస్తకాన్ని మూసి తన్మయి వైపు చూసి అన్నాడాయన .

"లేదండీ, ఇదైనా ఏదో అనుకోకుండా.." అని నసిగింది తన్మయి. నిజానికి బియ్యే లో కనబడ్డ ప్రతీ కవితనీ అనువాదం చేస్తూనే ఉంది.

"ఇంగ్లీషు ఇంత బాగా వచ్చినపుడు తెలుగు ఎమ్మే ఎందుకు చేస్తున్నారు?" అన్నాడాయన.

జవాబుగా చిర్నవ్వు నవ్వింది. కారణం తనకీ తెలియదు.

"ఏం లేదు. అసలు మీరంతా తెలుగు ఎమ్మేలు చేసి ఏం సాధిస్తారు?" అన్నాడు భృకుటి ముడి వేసి.

సమాధానంగా "ఏం ఉంది మాస్టారూ, మీ లాగ తెలుగు బోధకులమవుతాం." అన్నాడు చిన్నగా నవ్వుతూ కరుణ.

"నా ఉద్దేశ్యంలో ఈ తెలుగు ఎమ్మేలు వట్టి దండగ. అందరికీ యూనివర్శిటీలలో అవకాశాలు వస్తాయనుకుంటున్నారా? బయట ప్రైవేటు కాలేజీల్లో ఎక్కడ చూసినా సంస్కృతం సెకండ్ లాంగ్వేజీగా ఉంది. ఇక గవర్నమెంటు కాలేజీలలో ఉద్యోగం రావడానికి అసలు నోటిఫికేషన్లే రావడం లేదు. బియ్యీడీలైనా చేసేరా కనీసం టీచర్ పోస్టులకి అర్హత కోసం? " అన్నాడు.

తన్మయి బెంబేలుగా తల అడ్డంగా ఊపింది. కరుణ ఏవో సమాధానాలు చెప్పేడు.

అక్కణ్ణించి బయటకు వచ్చాక కూడా ఆయన వేసిన ప్రశ్న చెవుల్లో మారు మ్రోగుతూంది "ఏం సాధిద్దామని ఈ తెలుగు ఎమ్మే?"

ఒక్క సారిగా ఎక్కడ లేని దిగులు, నిస్సత్తువ పుట్టుకొచ్చాయి తన్మయికి. ఎన్నో కలల్తో యూనివర్సిటీ లోకి అడుగు పెట్టింది తను. ఎమ్మే చదివితే ఎన్నో ఉద్యోగావకాశాలు ఉంటాయన్న ధీమాగా ఉండేది.

తల పైకెత్తి చెట్ల గుబురు కొమ్మల మధ్య ఎండా, నీడల తో చిల్లులు పడ్డట్లున్న ఆకాశం కేసి చూసి దీర్ఘంగా ఊపిరి పీల్చింది.

"ఉహూ. అవన్నీ నిజాలు కావు. తనకు తప్పకుండా ఒక దారి దొరుకుతుంది. ధైర్యంగా ఉండాలి" అనుకుంది.

అయినా అంతలోనే పక్కన నడుస్తున్న కరుణ బెంగ ముఖం చూస్తూ "అవునా, అసలేమీ అవకాశాలు లేవా?" అంది.

ఏదో ఆలోచిస్తున్న కరుణ "ఏమన్నారు?" అని, అన్యమనస్కంగా తల అడ్డంగా ఊపాడు.

అతనికి కూడా ఈ చదువు ఎంత ముఖ్యమో అర్థం చేసుకోగలదు తన్మయి.

దారిలో అనంత, రాజు కలిసేరు.

వీళ్ల దిగులు ముఖాల్ని చూసి నవ్వుతూ "హయ్యో, అసలా ప్రొఫెసరు దగ్గిరికి ఎవరు వెళ్లమన్నారు మిమ్మల్ని? ఆయనొక పెసిమిస్టు. అవేమీ పట్టించుకోకండి. అసలే ఫస్టియర్ పరీక్షలు దగ్గిర పడ్తున్నాయి. ముందు వాటి సంగతి చూద్దాం" అంది అనంత.

పుస్తకం తీసి పద్యం పాడబోయి, తల అడ్డంగా ఊపి "ఇవేళ్టికి నన్నొదిలేయండి" అని కళ్ళు మూసుకుని బెంచీ మీద పడుకున్నాడు కరుణ.

"మీరు ఆధునిక భాషా శాస్త్రం చదివేరా?" అని నోట్సు అందించేడు రాజు.

దీక్షగా పుస్తకంలోకి తలొంచి కూచున్న తన్మయిని చూసి "ఇంటికెళ్లి చదువుకుందువులే" అని లేచింది అనంత.

అనంత వెనక బండి మీద కూచుని పుస్తకం తీయబోయింది తన్మయి.

అనంత ఎప్పుడూ బండి చాలా వేగంగా నడుపుతుంది. ఆ స్పీడుకి ముందు జాగ్రత్తగా సర్దుకుని కూచోవడమే కష్టమనిపించి "స్పీడు తగ్గించు అనంతా" అంది.

ఇంతలో పక్క నించి మరొక బైకు మీద వెళ్తున్న ఇద్దరు కుర్రాళ్లు దాదాపు రాసుకుంటున్నట్లు సడెన్ గా పక్కకు వచ్చి నోటితో అసహ్యంగా శబ్దం చేసేరు.

అసంకల్పిత ప్రతీకార చర్యలా అనంత ఒక్క ఉరుము ఉరుముతూ "ఛీ వెధవల్లారా" అంటూ అరిచింది. దెబ్బకి హడిలిపోయి బైకు వేగం పెంచుకుని వెళ్ళిపోయేరు.

తన్మయికి కాస్సేపు గాభరా వచ్చేసింది. "బండి ఆపవా ఒక్క నిమిషం?" అంది.

అంతకే హడిలిపోతున్న తన్మయి వైపు చూస్తూ "నువ్వు కొంచెం ధైర్యం నేర్చు కోవాలమ్మాయ్" అంది నవ్వుతూ అనంత.

ఇంటి ముందు శేఖర్ బండి చూసి "అమ్మో, అప్పుడే వచ్చేసేడు." అంది పైకి గాభరాగా తన్మయి.

శేఖర్ బాబుని తీసుకుని వాళ్ల తాత గారింటికి వెళ్లి సాయంత్రం వస్తానని చెప్పి వెళ్లేడు పొద్దున్న.

అనంతని శేఖర్ కి పరిచయం చేసింది తన్మయి. "ఎల్లుండి వరకూ ఉండెళ్తానంటే రమ్మన్నాను." అంది.

సమాధానంగా "అయ్యో, తప్పకుండా, ఏ ఊరు మీది?" అని పరిచయంగా, చక్కగా మాట్లాడుతున్న శేఖర్ని చూసి స్థిమిత పడింది తన్మయి.

నిద్రపోతున్న బాబుని ముద్దాడి అందరికీ టీ పట్టుకొచ్చింది.

"మీ వారు చాలా కలివిడి మనిషి. మా రాజు ఇలా ఉంటే బావుణ్ణు" అంది అనంత గలగలా నవ్వుతూ.

రాజెవరన్నట్టు ప్రశ్నార్థకంగా చూసి, "ఓ, కాబోయేవారా?" అన్నాడు శేఖర్.

ఇంతలో గేటు తీసుకుని లోపలికి వస్తూన్న రాజుని, కరుణని చూసి అటు నడుస్తూ "అదుగో, మాటల్లోనే వచ్చేరు." అంది అనంత.

"చాలా థాంక్సండీ." అన్నాడు రాజు వస్తూనే తన్మయి వైపు చూస్తూ.

కరుణని పరిశీలనగా చూస్తూన్న శేఖర్ దగ్గిరికి వచ్చి షేక హేండ్ ఇస్తూ "నా పేరు కరుణ, శేఖర్ గారూ. అదుగో ఆ కనబడే గేటే నా నివాసం." అన్నాడు.

పరిచయాలయ్యేక "అన్నట్టు తన్మయీ, మన బాబు పుట్టిన రోజు గురించి తాతగారికి చెప్పగానే, ఆయన వాళ్లింటి డాబా మీద చేద్దామన్నారు." అంటూ

"మీరంతా మా అబ్బాయి మొదటి పుట్టినరోజుకి తప్పక రావాలి" అన్నాడు.

తన స్నేహితుల పట్ల శేఖర్ చూపిస్తున్న ఆదరాభిమానాలకి సంతోషం నిండిన కళ్లతో తన్మయి అందరినీ ఆ సాయంత్రం భోజనానికి ఉండిపొమ్మంది.

రాజు, కరుణ "ససేమిరా వద్దంటూ" లేచారు.

ఆ రాత్రి ముందు వరండాలో స్నేహితురాలి పక్కన తనూ చాప, బొంత వేసుకుని పడుకుంది తన్మయి.

చాలా సేపటి వరకూ కాలేజీ విషయాలు చెప్పుకుంటూ ఎప్పుడో నిద్రపోయేరు.

తన్మయి చాన్నాళ్ల తర్వాత ఆనందంగా నిద్రపోయిందా రాత్రి.

--------

మూడో రోజు పొద్దున్న నిద్రలేస్తూనే ఎర్రగా ఉన్న అనంత కళ్లని చూస్తూ, "అదేం అనంతా, నిద్ర సరిగా పట్టలేదా?" అంది తన్మయి.

సమాధానంగా ముభావంగా ఉన్న అనంత తో "అంతా ఓకేనా?" అంది తన్మయి.

అసలెప్పుడూ ముభావంగా తనని చూడక "ఏమైంది?" అని మళ్లీ అంది.

శేఖర్ బయటికి వెళ్లేక, "ఛీ, ఛీ, అదేం పాడు బుద్ధి మీ ఆయనకి? రాత్రి నేను బాత్రూముకి వెళ్లి వస్తూ ఉండగా వెనక నుంచి వచ్చి నన్ను గట్టిగా వాటేసుకున్నాడు. నేను వెంటనే చెంప ఛెళ్లుమనిపించాను. నిన్ను పిలవబోతే దణ్ణం పెట్టి వెళ్లిపోయేడు." అంది.

తన్మయికి కాళ్ల కింద భూమి కుంచించుకు పోయినట్లయ్యింది. బాధ, ఉక్రోషం తో కూడిన కన్నీళ్లు వచ్చాయి.

"అయ్యో, నువ్విలా బాధ పడ్తావనే చెప్పాలా, వొద్దా అని ఆలోచించానిప్పటి వరకూ, ఇక ఆగలేక చెప్పేసాను. అయినా తప్పు నాదేలే. అప్పుడే నిన్ను లేపాల్సింది. పాపం నువ్వసలే అలిసిపోయి నిద్రపోయావు" అంది.

తన్మయి స్నేహితురాలికి జరిగిన అవమానానికి బాధ్యత వహిస్తూ "జరిగిందానికి క్షమించు అనంతా. ఇంకెప్పుడూ అతనున్నపుడు మా ఇంటికి రాకు." అంది దు:ఖపడ్తూ.

"ఛా, ఛా, నీ తప్పేం ఉంది ఇందులో. రాజుకి తెలిస్తే పెద్ద గొడవ చేసేస్తాడు. పరీక్షల సమయంలో మీ ఇంట్లో ఉందామనుకున్నాను. ఇప్పుడా అవకాశం లేదు. ఎప్పుడూ నీ ముఖం చూసి ఏదో బాధ ఉంది నీకు అని అనుకుంటూ ఉంటాను. ఇప్పుడర్థమైంది. అయినా నీలాంటి మంచి అమ్మాయికి వీడెక్కడ దాపురించాడు?" అంది.

తన్మయి కథంతా విని, "నిన్ను ఒకప్పుడు ప్రేమించేనని నీ వెంట తిరిగి ఇప్పుడు ఇలా విసిగిస్తున్నాడంటే, నువ్విస్తున్న అలుసేనేమో ఆలోచించు. మంచి భర్త కాలేని వాడు, ఇంత అందమైన పసివాడికి మంచి తండ్రి మాత్రం ఎలా అవుతాడు?. నేను ఊర్నించి వచ్చాక డిపార్టుమెంటులో కలుద్దాం. ఇవన్నీ మనసులో పెట్టుకుని నీ ఆరోగ్యం పాడుచేసుకోకు." అంది అనంత.

ఆ సాయంత్రం శేఖర్ ఇంటికి వస్తూనే "ఇదుగో, బయట బండి ఇక నీదే" అన్నాడు తాళం చెవులు ముఖం మీద ఊపుతూ. "మా బాసు చవగ్గా ఇచ్చేస్తాను తీసుకోమంటే కొనేసాను. అంతే కాదు రేపు ఫ్రిజ్ రాబోతూంది మనింటికి. మా ఫ్రెండు షాపులో ఆర్డరు చేసేను.ఇవన్నీ మా అత్తగారు

నాకు ఇచ్చేరని చెప్పుకోవాలి అందరికీ. నువ్వూ అలాగే చెప్పు. ఎంత కాదనుకున్నా ఎవడన్నా బాగుపడ్తే ఏడ్చి పోతారు జనం. దేవుడి దయ వల్ల ఇన్నాళ్లకి కాసిన్ని డబ్బులు కళ్ల చూడగలిగేను."

ముభావంగా ఉన్న తన్మయి వైపు చూస్తూ "ఏదైనా మంచి మాట చెప్పినా ఎదవ ఏడుపు ముఖమేనా?" అన్నాడు.

తన్మయి ఆవేశంగా అతని చేతుల్లోంచి బండి తాళాలు తీసుకుని నేలకేసి కొట్టింది.

"నీకు సిగ్గూశరం ఉందా? నువ్వసలు మనిషివేనా?" గట్టిగా అరిచింది.

ఏమైందన్నట్లు అమాయకత్వం నటిస్తున్న అతని ముఖాన్ని చూస్తూ "ఛీ " అని పెద్దగా ఏడుస్తూ "నా స్నేహితురాలితో నువ్వు నడుచుకునే పద్ధతి అదేనా?" అంది ఇంకా గట్టిగా.

"ఏవిటే రెచ్చిపోయి అరుస్తున్నావు? చీకట్లో నువ్వనుకున్నాను" అన్నాడు బుకాయింపుగా.

"అబద్ధం. పచ్చి అబద్ధం. ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేదా నీకు?" అంది ఎర్రని కళ్లతో.

"చిన్న విషయానికి ఇంత రాద్ధంతం ఏవిటే. అయినా నిన్నెవడు తీసుకు రమ్మన్నాడు దాన్ని ఈ ఇంటికి? మాటిమాటికీ నన్ను అనడం కాదు. నువ్వు యూనివర్శిటీ పేరు చెప్పి మగవాళ్లతో రాసుకు పూసుకు తిరగడం లేదని నన్ను నమ్మమంటావా? చూసేనుగా దాని కాబోయే వాడినీ, నీ కాబోయే వాడినీ" అన్నాడు వెకిలిగా.

తన్మయి నేల మీద కూలబడింది దు:ఖంతో. అతని నాలుకకు నరం లేదు. మనిషి కాదితను మృగం.

"ఛీ. దరిద్రపు బతుకు. శుభమా అని రెండు వస్తువులు అమర్చుకుంటే, ఎవడో చచ్చినట్లు నట్టింట్లో కూచుని ఏడుస్తూంది." అని దభాలున తలుపు వేసేసి బయటికి వెళ్లిపోయేడు.

దరిద్రపు బతుకు ఎవరిదో అర్థం కాని తన్మయి రాత్రంతా వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంది.

-------

పిల్లాడి పుట్టిన రోజు ఏర్పాట్లు ఘనంగా చేసేడు శేఖర్.

పెద్ద డాబా మీద రాత్రి పూట వంద మందికి భోజనాలు పెట్టేడు. పెద్ద కేకు తెచ్చి, వీడియోలు, ఫోటోల తో "ధాం ధూం" అని చేసేడు. చుట్టూ ఊళ్లల్లో ఉన్న చుట్టాలనీ, అతని స్నేహితుల కుటుంబాలనీ పిలిచేడు.

"అతనితో మాట్లాడక పోవడం వల్ల అసలు ఇదంతా నాతో చెప్పలేదన్న మాట" అనుకుంది తన్మయి.

తన్మయి తల్లిదండ్రులు పిలవకపోయినా తమ బాధ్యత అన్నట్లు పిల్లాడికి బంగారం చెయిను, మురుగులు పట్టుకుని సాయంత్రం బస్సుకి వచ్చేరు.

"పుట్టినరోజు ఖర్చు భరించాల్సి వస్తుందని మీ అత్తగారోళ్లు మొత్తానికే రాకుండా ఎగేస్తారనుకున్నాను" అని వ్యంగ్యంగా కొడుకుతో దేవి అనడం వింది తన్మయి.

శేఖర్ తల్లిదండ్రులు పెత్తనం అంతా చెలాయించేరు. డాబా మీద మధ్యలో వేసిన టేబులు పక్కన కుర్చీలో బాబునెత్తుకుని కూచోవడం ఒక్కటే తన్మయి పని.

"ఎంత గొప్పగా చేస్తే ఏవి లాభంరా, నీ పెళ్లాం ముఖంలో కళా కాంతీ లేకపోయేకా" అని సాగదీసింది దేవి ఫంక్షను అవుతూనే.

"దాన్ని పట్టించుకోకమ్మా, అదెప్పుడూ ఏడుపు మొహవేసుకుని ఏడుస్తాది." లైటింగు సెట్లు విప్పుతూ అన్నాడు శేఖర్.

జ్యోతి కూతురి వెన్ను నిమిరింది "ఏవీ మాట్లాడొద్దన్నట్లు".

తన్మయికి అతని మాటలు కొత్తవీ కావు, వింతగానూ లేవు.

అసలివేళ అక్కడ జరుగుతున్న బాబు పుట్టిన రోజు ఆనందం మనస్సులో మచ్చుకైనా లేదు.

ఫంక్షను కాగానే చుట్టాలంతా అక్కడే డాబా మీద దుప్పట్లు పరుచుకున్నారు.

తల్లి పక్కన చేరి కళ్లు మూసుకుంది తన్మయి.

బాబుని తీసుకుని కిందికి వెళ్లేడు శేఖర్. అసలే అలిసిపోయిన చంటాడిని ఇప్పుడెందుకు తీసుకెళ్తున్నాడో అర్థం కాలేదు తన్మయికి.

అర గంట సేపైనా చంటాడిని తీసుకు రాకపోయే సరికి కిందికి వెళ్లింది తన్మయి.

అక్కడ కనబడ్డ దృశ్యం చూసి "శేఖర్" అని గద్దింపుగా ఒక్క కేక పెట్టింది. వాళ్ల మేనమావలతో తాగుడు, పేకాట పార్టీ లో కూచున్నాడు శేఖర్.

అందులో ఒక మావయ్య పిల్లాడి పెదవుల దగ్గిర గ్లాసు పెట్టి తాగించబోతున్నాడు.

సిగిరెట్టు పొగల మధ్య చుట్టూ ఉన్న పది మంది మగవాళ్లు పగలబడి నవ్వుతున్నారు.

తన్మయి అరుపు విని అదిరిపడి బాబుని తీసుకొచ్చి తన్మయి చేతికి ఇచ్చేడు శేఖర్ మేనమామ.

ఇక అదే చికాకులో సందులోంచి బయటికి బాబునెత్తుకుని చీకట్లో బయటికి నడిచింది తన్మయి.

లోపల శేఖర్ ఇదేం పట్టించుకోకుండా గట్టిగా దేనికో నవ్వడం వినిపిస్తూంది.

హడావిడిలో చెప్పులు వేసుకోలేదు. ఎక్కడికి నడవాలో తెలీదు. రాళ్లు గుచ్చుకుంటున్నాయి.

పైన డాబా మీంచి చూసిన తన్మయి తండ్రి వెనకే పరుగెత్తుకొచ్చేడు. "ఎక్కడికమ్మా చీకట్లో బాబునెత్తుకుని." అన్నాడు రెక్క పుచ్చుకుని వీధి మలుపులో.

పెద్ద వీధి మలుపు తిరిగితే రోడ్ల మీద ఆటోలు కనబడతాయి.

తండ్రి చెయ్యి విదిలించుకుని "నేను ఇంటికి వెళ్లిపోతున్నాను నాన్నా, మీరూ అమ్మా వెనకే వచ్చెయ్యండి" అంది ఆటో పిలుస్తూ.

తన్మయి ముఖం చూస్తూ "సరే, వచ్చేస్తాం. నువ్వు కూడా మాతో వద్దువుగాని. ఆగు" అన్నాడు.

తన్మయి వినకుండా ఆటో ఎక్కి కూచోవడం చూసి తన్మయిని జరగమని, తనూ కూచున్నాడు భాను మూర్తి.

తన్మయిని ఇంటి దగ్గిర దించి, "అమ్మని తీసుకుని మళ్లీ వస్తాను" అని అదే ఆటోలో వెనక్కి వెళ్లేడు.

ఇంటికి వచ్చేసరికి నిస్సత్తువతో కాళ్లు కదలక తలుపు తీస్తూనే దు:ఖంతో కూలబడిపోయింది తన్మయి. బాబుని హత్తుకుని ఏడుస్తూ ఉందేమో, వాడి తలంతా కన్నీళ్లతో తడిసిపోతూంది.

అలిసిపోయి నిద్ర పోతున్న పసివాడిని గుండెలకు హత్తుకుని "నాన్నా, నీకిదేం ఖర్మరా.. " అంటూ వెక్కి వెక్కి పడసాగింది.

------------

మర్నాడు ఉదయం శేఖర్ ఇంటికి రాలేదు.

దేవి వచ్చింది. ఇంట్లోకి వస్తూనే "ఏమ్మా మీ కూతురికి మంచీ, చెడూ నేర్పించుకోరా? ఇదేనా మీ గొప్ప పెంపకం? అవతల కొడుకు పుట్టినరోజని నా కొడుకు పొంగుకుంటూ అందరినీ పిల్చుకుంటే, ఈవిడిలాగ పిల్లాణ్ణి తీసుకుని రాత్రికి రాత్రి వచ్చేస్తాదా? మగోళ్ళ మధ్యకి అసలెందుకు వెళ్లిందీ అంట." అని అరవసాగింది.

నేల మీద వెనక్కి తిరిగి పడుకున్న తన్మయి అసలు లేవలేదు, వెనక్కి తిరిగి చూడలేదు.

"చూసేవా కండకావరం, అత్తగారు వచ్చిందని మర్యాదైనా ఉందా మీ కూతురికి? ఇలా మొండితనంతో నా కొడుకుని ఎంత వేధించుకు తింటూందో చూస్తూనే అర్థం అవుతూంది" అని విరుచుకు పడింది.

జ్యోతి ఏదో చెప్పేలోగా భానుమూర్తి ఎదురుగా వెళ్లి , "అక్కయ్యగారూ క్షమించండి. ఏదో చిన్నపిల్ల, దానికింకా పెద్దరికం రాలేదు" అన్నాడు.

"పెద్దరికం రాకపోతే నేర్పించవయ్యా. గారాబాలు చేసి నెత్తికెక్కించుకోవడం కాదు. దాన్ని ఆ చెంపా, ఈ చెంపా వాయించి పంపించు." ఇంకాస్త గట్టిగా అంది.

జ్యోతి వెంటనే రోషంతో "ఏవమ్మా, మా పిల్లని మేం ఎప్పుడూ 'అన్నా' అని అదిలించింది లేదు. ఇవేళ నువ్వు చెపితే చెంపలు వాయించడానికి. అయినా మీ కొడుకు చేసింది బావుందా? పసివాడితోనా ..హవ్వ?" అని నోరు నొక్కుకుంది.

"అదీ సంగతి. మీరిలా వెనకేసుకు రాబట్టే ఈ కొరివి మమ్మల్ని ఇలా కాల్చేస్తూంది" అంది దేవి ఎద్దేవాగా.

"ఇదుగో చూడండి అక్కయ్య గారూ, ఏదో అయ్యిందేదో అయిపోయింది కాస్సేపట్లో అమ్మాయిని, మనవణ్ని తీసుకుని వస్తాను." అన్నాడు నమస్కారం పెడ్తూ. తప్పు ఒప్పుకుంటున్నట్లు భాను మూర్తి.

ఇన్ని జరుగుతూన్నా వెనక్కి తిరిగి చూడని తన్మయిని ఈసడింపుగా చూస్తూ "ఇదుగో మధ్యాహ్నం భోజనాల వరకు టైం ఇస్తున్నా. నా మనవడు నాకు కనిపించాలి." అంటూ అప్పుడే వచ్చిన శేఖర్ బైకు మీద ఎక్కి కూచుంది దేవి.

తల్లిని దించింది ఇతనేనన్న మాట అనుకుంది బైకు శబ్దం విని తన్మయి.

"ఏవిటమ్మా ఇదంతా?" అన్నాడు భానుమూర్తి తల పట్టు కుంటూ.

"మన ఖర్మ" అని నెత్తి కొట్టుకుని ఏడుస్తూన్న తల్లిని చూస్తూ, "అమ్మా, ఇక ఏడాది వచ్చింది కదా. బాబుకి పాలు మానిపించొచ్చా" అంది తన్మయి అసందర్భంగా.

జ్యోతి కూతురి వైపు చూసి కళ్లు తుడుచుకుని "బాబుని తీసుకుని మాతో సాయంత్రం మన ఊరు వచ్చెయ్యి. కొన్నాళ్లాగి వద్దువులే." అంది.

అక్కడ తన చుట్టూ ఏం జరుగుతూ ఉందో అన్న దాని కంటే, పదిహేను రోజుల్లో ఎమ్మే ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయన్నదే తన్మయి మనస్సులో గట్టిగా మెదులుతున్న సమస్య.

ఈ సమయంలో వెళ్లడమే మంచిదేమో. అక్కడుంటే బాగా చదువుకోవచ్చు. "పరీక్షలు ఎలాగో గట్టెక్కే వరకూ బాబుని అమ్మ దగ్గిర అలవాటు చెయ్యాలిక" అనుకుంది తన్మయి.

కానీ శేఖర్ని కాదని వెళ్తే జరిగే రాద్ధాంతం ఇష్టం లేదు. వాళ్లంతా కలిసి తన తల్లిదండ్రుల్ని ఆడిపోసుకుంటారు.

బాబుకి తలార స్నానం చేయించింది. తను కూడా తయారయ్యి తల్లిదండ్రుల్ని తీసుకుని శేఖర్ తాత గారింటికి భోజనాల సమయానికి వెళ్లింది.

అంతా తన్మయిని చూసి అసలక్కడేమీ జరగనట్లు మామూలుగా పలకరించేరు.

ఆ సాయంత్రం చుట్టాలంతా వెళ్లేంత వరకూ ఉండి తన్మయి తల్లిదండ్రులతో ప్రయాణమయ్యింది. వెనక్కి వచ్చిన తన్మయిని చూసి ఏమనుకున్నాడో ఏమో తన్మయి ఊరు వెళ్తాననగానే తలూపేడు శేఖర్.

--------

రెండ్రోజుల్లో "అమ్మా, ఇక ఏడాది వచ్చింది కదా. బాబుకి పాలు మానిపించొచ్చా?" అని మళ్లీ అడిగింది తన్మయి.

నిజానికి సమాధానం తల్లికంటే తనకే బాగా తెలుసు.

బాబు తన దగ్గిర పాలు తాగడం అంటే తన్మయికి తెలిసిందొక్కటే. తన గుండెల్లో ఉన్న అత్యంత ప్రేమని అందజేసే మార్గం. అంతే.

ఇప్పుడు పాలు మానిపించడమంటే బాబు కంటే తనకే ఎక్కువ బాధగా ఉంది. బాబుని తన నుంచి వేరు చేసి బైటి ప్రపంచం వైపు విసిరేస్తున్నట్లున్న మెలిక తిప్పుతున్న బాధ.

కానీ తనిప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఇంత కంటే మార్గం లేదు.

రాత్రంతా గుక్క పెట్టి ఏడుస్తున్న పసి వాడికి పాలివ్వకుండా భుజాన వేసుకుని తిప్పుతూ, విసిరి కొడ్తున్న పాల సీసా ని మళ్లీ మళ్లీ దగ్గిరికి తెస్తూ ప్రయత్నిస్తూనే ఉంది.

తెల్లారగట్ల ఏడ్చి ఏడ్చి అలిసిపోయి నిద్రపోతున్న పసివాడి బుగ్గల్ని రాస్తూ "నన్ను క్షమించు నాన్నా" అంది కళ్లు తుడుచుకుంటూ.

కూతురితో పాటూ రాత్రంతా మెలకువగా ఉన్న జ్యోతి కూతురి దగ్గిరికి వచ్చి తల నిమిరింది. "మరీ ఇంత సున్నితంగా ఉంటే ఎలాగమ్మా?" అంటూ.

ఆ తెల్లారగట్ల పసివాడిని అక్కున చేర్చుకుని తల్లి ఒడిలో తల దాచుకుని పడుకున్నప్పుడు ఇక ప్రపంచంలో ఏ బాధలూ లేవన్నంత ప్రశాంతంగా అనిపించింది తన్మయికి.

చాలా విచిత్రంగా రెండో రోజు నించి తల్లిపాలు మానేసేడు బాబు.

"చూసేవా నీ కొడుకు ఎంత సులువుగా పాలసీసా పట్టుకున్నాడో! ఈ మాత్రానికి ఆ రాత్రంతా ఏడుస్తూ కూచున్నావు" అని నవ్వింది జ్యోతి.

-------

పరీక్షలు రెండ్రోజుల్లో ఉన్నాయనగా బాబుని అమ్మ దగ్గిర వొదిలి స్థిమితంగా బస్సెక్కింది తన్మయి.

బస్సు కదిలే వరకూ బాబు తల్లి వైపు దుముకుతూనే ఉన్నాడు. బస్సు కదలగానే ఒక్క సారిగా విపరీతమైన దు:ఖం వచ్చేసింది తన్మయికి.

మొదటి సారి బాబుని వొదిలి పెట్టిందేమో బస్సు విశాఖపట్నం చేరే వరకూ దు:ఖ పడ్తూనే ఉంది.

శేఖర్ ఇన్నాళ్లుగా తనెప్పుడొస్తుందో ఫోను చెయ్యడం గానీ, బాబు గురించి అడగడం గానీ చెయ్యలేదు.

"అక్కడుండగా "నా కొడుకు.. నాకొడుకు " అని తెగ పొంగిపోయే మనిషికి ఊరెళ్తే కొడుకు అవసరం లేదన్న మాట" అనుకుంది తన్మయి.

తనెళ్లిందగ్గర్నించీ శేఖర్ కూడా ఇంట్లో లేనట్లున్నాడు. ఇంటి తాళం తీసి చెత్తగా ఉన్న ఇల్లంతా ఊడ్చి, స్నానం చేసి, ఫోను కోసం బయటికి పరుగెత్తింది.

"నీకేం బెంగ లేదు. బాబు ఇంచక్కగా ఆడుకుంటున్నాడు. నువ్వు పరీక్షలు బాగా రాసిరా" అంది జ్యోతి అవతలి నుంచి.

ఫోనులో బాబు గొంతు "ఊ...ఊ..." అని వినగానే గుండె వేగంగా కొట్టుకుంది తన్మయికి.

వెనక్కి వస్తూ "ఏమనుకోకు నాన్నా. ఇంతకంటే వేరే మార్గం లేదు నాకు" అనుకుంది లోపల్లోపల.

శేఖర్ బాబుని వొదిలి వచ్చినందుకు గొడవ చేస్తాడోమో అని ఆలోచిస్తూ స్టవ్వు మీద కాస్త బియ్యం పెట్టి, పుస్తకాలు ముందేసుకుని కూచుంది.

చదవడం మొదలు పెట్టగానే దీక్షగా లీనమై పోయింది. అదొక్కటే తన్మయికున్న వరం. ఎన్ని సమస్యల్లో ఉన్నా పుస్తకాలు తీస్తే ఇక ఏదీ జ్ఞాపకం రాదు తనకి.

ఇంటాయన మీటర్ రీడింగంటూ తలుపు కొట్టేడు మధ్యాహ్నం.

తన్మయి మాములుగా గేటు దగ్గరకు వెళ్లి నుంచుంది.

గేటు దాటి అప్పుడే అటుగా వెళ్తున్న కరుణ కనిపించేడు. పరీక్షలకు శ్రద్ధతో చదువుతున్నట్లు పుస్తకం చేతబట్టుకున్న తన్మయిని చూస్తూనే గబుక్కున దగ్గిరికి వచ్చేడు.

"ఏవిటండీ, మీరు? ఎల్లుండి నించి పరీక్షలు పెట్టు కుని ఎక్కడికి వెళ్లిపోయేరు?" అన్నాడు.

అంతలోనే "మీరు నన్ను క్షమించాలి. మీ అబ్బాయి పుట్టిన రోజుకి రాలేకపోయాను. " అన్నాడు.

"ఫర్వాలేదులెండి" అంది తన్మయి.

"అంతా చదివేసేరా?" అని, "ఏవిటి నన్ను లోపలికి రానివ్వరా ఇక్కడే నిలబడి మాట్లాడతారా?" అన్నాడు చనువుగా.

తన్మయి "సోరీ. రండి. ఏదో ఆలోచిస్తూ మిమ్మల్ని లోపలికి పిలవడం మర్చిపోయేను" అంది.

వాకిట్లో బండి చూస్తూ "మీ బండి రంగు బావుందండీ" అన్నాడు.

ఇంట్లోంచి బయటకు వెళ్తున్న ఇంటాయనని చూస్తూ "అందుకా మీరు బయట నిలబడింది, ఎప్పుడూ బయట కనబడరు కదా" అన్నాడు.

టీ కప్పు అందుకుంటూ "చూడండి, పరీక్షలలో బాగా మార్కులు రావాలంటే నా దగ్గిర కొన్ని చిట్కాలున్నాయి." అన్నాడు తమాషాగా కళ్లెగరేస్తూ.

తన్మయి ఏదో అడిగేలోగా "అవన్నీ చెప్పాలంటే కొంచెం ఖర్చవుతుంది. అంటే మీ ముత్యాల వంటి చేతి రాతతో రాసుకున్న నోట్సు కాస్సేపు నాకివ్వాలి. చదివి పొద్దున్నే తెచ్చిస్తాను. కావాలంటే మరో సబ్జెక్టు నోట్సు మీకిస్తాను. అన్నట్లు మన వాళ్లంతా లైబ్రరీ దగ్గిర కంబైండ్ స్టడీస్ అంటూ చేరుతున్నారు రోజూ ఉదయం. రేపు మీరూ వస్తారుగా" అని నవ్వి బయలుదేరేడు.

ఆ కాస్సేపు ఎంతో ఆహ్లాదంగా అనిపించింది తన్మయికి. "ఈ ప్రపంచంలో చదువు మాత్రమే ఉండి ఉంటే ఎంత బావుణ్ణు ! ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండడం వల్ల విజ్ఞానానికి విజ్ఞానం, ఆరోగ్యానికి ఆరోగ్యం" అని నవ్వుకుంది.

అతనిచ్చిన నోట్సు తెరిచి గబగబా చదవసాగింది.

ఆ సాయంత్రం పాఠాలన్నీ ఒకటికి పది సార్లు మననం చేసుకుంటూ, చిన్న వరండా బల్బు వెలుగులో పద్యాల్ని వల్లె వేస్తూ చుట్టూ పుస్తకాల మధ్య పడి అలాగే నిద్దట్లోకి జారుకుంది.

22

ఎమ్మే మొదటి సంవత్సరం పరీక్షల మొదటి రోజు తన్మయికి బాగా బెదురు పట్టుకుంది. ప్రశ్న పత్రం చదివేముందు కళ్లు మూసుకుని గట్టిగా ఊపిరి పీల్చింది.

సరిగ్గా సగం రాసేక సబ్జెక్టు ప్రొఫెసరు వచ్చి అందరినీ ఉద్దేశించి "ఏవైనా సందేహాలున్నాయా?" అన్నాడు.

హమ్మయ్య చివరి ప్రశ్న సరిగా అర్థం కాక బుర్ర పగలగొట్టుకుంటూంది ఇప్పటి వరకూ..తన్మయి లేచి నిలబడింది.

సమాధానంగా ప్రొఫెసరు భృకుటి ముడివేసి "అసలు నువ్వెప్పుడైనా నా క్లాసుకు వచ్చేవా?" అని సీరియస్ గా అడిగేడు.

అనుకోని ప్రశ్నకు బిత్తరపోయి, నీళ్లు నములుతూన్న తన్మయి వైపు తీక్షణంగా చూస్తూ "ఎన్నో సార్లు క్లాసులో ఈ ప్రశ్నకు సంబంధించిన వివరాలు మాట్లాడుకున్నాం. ఇప్పుడిక్కడ ఈ ప్రశ్నకు అర్థం నీకు కొత్తగా చెప్పాలా? క్లాసుకు రాని వాళ్లు చదువులకు యూనివర్శిటీలకు ఎందుకు వస్తారో" అని విసుగ్గా అన్నాడు.

అప్పటికే తెలీని భయంతో బిక్కచచ్చిపోయిన తన్మయికి కళ్లల్లోకి వెంటనే నీళ్లు వచ్చేసాయి.

ఆయన వెళ్లిన అయిదు నిమిషాల తరవాత కూడా కళ్లు ఒత్తుకుంటూ పరీక్ష రాస్తున్న తన వైపు ఇన్విజిలేటరు జాలిగా చూస్తూ "మంచి నీళ్లు తాగుతారా?" అన్నాడు.

తన్మయి వొద్దన్నట్లు తలూపింది. "మంచినీళ్ల కోసం బయటకు వెళ్లొచ్చే సమయం కూడా వృథా చెయ్యడం ఇష్టం లేదు తనకి. తనకీ పరీక్షలు అతి ముఖ్యం."

తన్మయి పరీక్ష రాసి బయటకు వచ్చేక అనంత వెనకే వస్తూ "రాజు చెప్పేదు. ఏం బాధపడకు. ఆ ప్రొఫెసరు నిజానికి చాలా మంచివారు. ఆయన అలా మాట్లాడక పోతే ఆశ్చర్యపోవాలి. మన హెడ్డాఫ్ ద డిపార్టుమెంటు గా ఆయన మొదటగా అటెండెన్సు పట్టించుకోవాలి కదా! నువ్వు ఎందుకు క్లాసులకు రాలేకపోయావో, నీ పరిస్థితులేవిటో తెలియక అని ఉంటారు. నాతో రా. ఆయనకు పరిచయం చేస్తాను." అంది.

తన్మయి "వద్దు అనంతా! నాకిప్పుడు ఎవరితోనూ మాట్లాడాలని లేదు". అంది నిరాసక్తంగా.

డిపార్టుమెంటులోకి ఆహ్వానిస్తూ కౌన్సిలింగు రోజు ఆయన అభినందనగా నవ్విన నవ్వు ఇంకా గుర్తుంది తనకి. అలాంటిది ఇవేళ ఇలా.

నిజమే, డిపార్టుమెంటు హెడ్డు క్లాసుకే వెళ్లలేకపోయిన దౌర్భాగ్యం తనది. అంతేనా! లౌక్యం చాతకాని తను మధ్యలో ఒకట్రెండు సార్లు ఆయన ఎదురుపడినప్పుడు తన మానాన తను ఏదో ఆలోచనల్లో ఉండి నమస్కారం పెట్టడం కూడా మర్చిపోయింది.

"ఆ..మరింకేం. మీ వైపు నించి కావలిసినన్ని తప్పిదాలున్నాయి అటెండెన్సుతో బాటు. అయిన అవేమీ పట్టించుకోకండి. మనందరకూ ఇప్పుడు కావలసినవి ప్రశంసలు కాదు. మార్కులు." అన్నాడు కరుణ వాతావరణాన్ని తేలిక చేస్తూ.

కరుణ వైపు పరీక్షగా చూసింది. చప్పున వనజ గుర్తుకు వచ్చింది. విశాఖపట్నం వచ్చిన కొత్తలో వనజ లేని లోటు తనని బాగా బాధించేది. అదిప్పుడు అనంత రూపంలోనూ, కరుణ రూపంలోనూ తీరుతూంది.

అయినా ఎందుకో తన్మయి తేలికగా తీసుకోలేకపోయింది. మొన్నటికి మొన్న తెలుగు ఎమ్మే చదివి ఏం చేస్తారనే ప్రశ్న. ఇప్పుడు ఇంత కష్టపడి చదువుతున్నా క్లాసులకు అటెండ్ కాలేక పోతుందన్న బాధ.

"ఆయన అన్నారని కాదు, క్లాసులు ఎగ్గొట్టడం వల్ల తనకూ సబ్జెక్ట్ల పట్ల అవగాహన సరిగా ఉండడం లేదు. శేఖర్ తో ఈ విషయం మాట్లాడాలి. ఇక అతని గురించి భయపడ్తూ కూర్చోవడం వల్ల ఉపయోగం లేదు." దృఢంగా అనుకుంది.

★★★

శేఖర్ మర్నాటితో చివరి పరీక్ష అనగా ఆ రాత్రి వచ్చేడు.

వస్తూనే "బాబుని వొదిలి వచ్చేసేవా? నువ్వసలు తల్లివేనా?" అన్నాడు.

ఇలాంటిది జరుగుతుందని తన్మయికి బాగా తెలుసు. కాబట్టి ముందే తయారు చేసుకున్న సమాధానం చెప్పింది.

అది విని, "ఆహా, మీ వాళ్లకు మనవడి మీద అంత ప్రేమే ఉంటే, వాడి పుట్టిన రోజు ఎందుకు జరిపించలేదో?" అని,

"ఇదిగో ఇదే చివరిసారి. ఇక మీదట వాడు మన దగ్గిర, లేదా మా ఇంట్లో మా అమ్మా, నాన్నల దగ్గిర పెరుగుతాడు. అంతే గానీ డబ్బుకు లంకె పెట్టుకుని బతికే మీ వాళ్ళ మధ్య కాదు. అర్థమైందా?" అన్నాడు.

తన్మయి ఇవన్నీ విని, చెవికెక్కించుకునే ఆలోచనలో లేదు. ఏ పని చేస్తున్నా కళ్ల ముందు పరీక్షలు, పుస్తకాలు. అంతే.

అర్థరాత్రి దీక్షగా ముందు వరండాలో చాపేసుకుని పుస్తకాల ముందు కూచున్న తన్మయిని ఆశ్చర్యంగా చూస్తూ "నీకు పిచ్చి బాగా ముదిరిందే." అన్నాడు.

అదేమి మాటన్నట్టు అతని వైపు చూసింది. తన్మయి.

"చదివింది చాల్లే. రేప్పొద్దున్న మా తాత గారింటికి వెళ్లాలి మనం." అన్నాడు.

అదిరిపడింది తన్మయి. "రేపా? చివరి పరీక్ష రేపు. ఎల్లుండి వెళ్దాం." అంది.

"ఎదవ పరీక్షలు. మానేస్తే వచ్చే నష్టం ఏవీ లేదు. అయినా నీకు లెక్కేవుందిలే. చదువు తప్ప వేరే ప్రపంచం లేదు గదా తవరికి. రేపు మన పెళ్లి రోజనయినా గుర్తుందా? అదీ నేను చెప్పాలా?"

పెళ్లిరోజు తనెలా మర్చిపోతుంది?! ఎన్నో కలలతో చేసుకున్న పెళ్లి ఇది. అతన్ని ఎంతో గొప్ప సహచరుడిగా ఊహించుకుంది. ప్రాణంగా ప్రేమించింది. అతనితో కలకాలపు అందమైన జీవితాన్ని ఊహించుకుంది.

"నోర్మూసుకుని పొద్దున్నే తాత గారి కాళ్లకి నమస్కారం పెట్టడానికి రా. అక్కణ్ణించి మా పిన్ని భోజనానికి పిల్చింది. సాయంత్రం......" అతను చెప్పుకెళ్లిపోతున్నాడు.

శేఖర్ ఊళ్లో ఉన్నాడంటే ఇంతే. ఎప్పుడూ చుట్టాల ఇంటికి తిరుగుతూనే ఉంటాడు. వాళ్లూ అంతే. ఎప్పుడు పడితే అప్పుడు భోజనాలకు వస్తారు. ఇన్నాళ్లలో తన్మయి ఇవన్నీ ఎప్పుడూ కాదనలేదు. వచ్చిన వాళ్లకు శాయశక్తులా వండి పెడ్తూ ఉంది. అతని కూడా ఎక్కడికంటే అక్కడికి వెళ్తూనే ఉంది. మారు మాట్లాడకుండా అతని కూడా వెళ్లకపోతే జరిగే రాద్ధాంతం కంటే, చివరి పరీక్ష రాయక పోవడం వల్ల వచ్చే నష్టం ఎక్కువగా కనిపించింది. తన్మయికి.

పరీక్ష 12 గంటల కల్లా అయిపోతుంది. మధ్యాహ్నమంతా అతనిష్టం ప్రకారం చెయ్యడానికి తనకి అభ్యంతరం ఏవీ లేదు. ఎప్పటిలాగే, అలవాటు పడిపోయిన జీవితం.

అదే చెప్పింది దృఢంగా. తన్మయి గొంతులోని నిశ్చయానికి అసహ్యంగా చూసి, వెనక్కి తిరిగి పడుకున్నాడు శేఖర్. అతని ముఖంలోకి చూసి బాధ పడే సమయం లేదు తన్మయికి. ఏదో రకంగా గండం గట్టెక్కితే చాలన్నట్టు ఉదయం అతను లేవక ముందే ఇంట్లోంచి బయట పడాలని ఆలోచిస్తూ నిద్ర రాక అటు ఇటూ దొర్లుతూ గడిపింది.

చివరి పరీక్ష సంస్కృతం.

కరుణ "కుమార సంభవం" నుంచి చెప్పిన కాళిదాస శ్లోకం చప్పున జ్ఞాపకం వచ్చింది.

"వికారహేతౌ సతి విక్రియన్తే
యేషాం న చేతాంసి త ఏవ ధీరాః! ||"

"వికారం కలిగించే పరిస్థితి ఉన్నప్పుడు కూడా  పరిసరముల ప్రభావమునకు లోబడని మనోదృఢత కలిగినవారే ధీరులు."

తన్మయి మనసులో  దానిని  "విపత్తి హేతౌ" అంటే,

"ప్రతికూల పరిస్థితి ఉన్నప్పుడు కూడా పరిసరముల ప్రభావమునకు లోబడని మనోదృఢత కలిగినవారే ధీరులు."  అని మార్చుకుని ధైర్యం తెచ్చుకుంది.

★★★

ఎనిమిది గంటలకి ముందే  డిపార్టుమెంటు బయట చెట్టు కింద పుస్తకం పుచ్చుకుని కూచున్న తన్మయిని చూస్తూనే

"ఏవిటీ, నిన్నట్నించీ ఇక్కడే కూచుని పరీక్ష కోసం తపస్సు చేస్తున్నారా?" అన్నాడు కరుణ నవ్వుతూ.

దగ్గరగా వచ్చి ఎర్రగా ఉన్న తన్మయి కళ్లని చూస్తూ "మయీ! అంతా ఓకేనా?" అన్నాడు ఆదుర్దాగా.

అతని స్వరంలో ఆప్యాయతకు కళ్ల నిండిన కృతజ్ఞతా బాష్పాలతో అతని వైపు చూసి చిన్నగా నవ్వింది.

"హమ్మయ్య, పీక్కు పోయిన మీ ముఖం చూసి భయపడ్డాను. అలా వెళ్లి కొంచెం కాఫీ తాగి వద్దాం, పదండి". అన్నాడు.

యూనివర్సిటీ కేంటీన్ బయట గుంపులుగా నిలబడి అంత పొద్దుటే హడావిడిగా ఎందరో టిఫిన్ లు, కాఫీలు తాగుతున్నారు.

పొగలుకక్కుతున్న ఇడ్లీ తింటున్నారు ఎవరో. అది చూడగానే తన్మయికి బాగా ఆకలేసింది. పరీక్షల వల్ల ఈ మధ్య ఎందుకో సరిగా తినడం లేదు.

"కాఫీ వొద్దు గానీ ఇడ్లీ తిందాం." అంది.

సంశయిస్తున్న అతన్ని చూసి "బిల్లు నేనిస్తాలే". అంది.

గత కొద్ది నెలలుగా ఇంట్లో డబ్బులకు కొదవేం లేదు. శేఖర్ బీరువాలో ఉంచమని  చెప్పి అడపా దడపా డబ్బులు ఇస్తూ నే ఉన్నాడు.

ఇన్ని ఎక్కడివి అని అడిగితే, "చెప్పినా నీకు అర్థంకాదులే. ఎన్నాళ్లు జీతం డబ్బుల మీద ఆధారపడతాం.  ఫ్రెండుతో కలిసి సముద్రం మీద చిన్న యాపారం మొదలెట్టేను. మా బాసుకి, ఓనరమ్మకి పొరబాటున కూడా చెప్పకు." అన్నాడు.

పెళ్లిరోజుకని అతను ముందు రాత్రి తెచ్చిన పట్టుచీర, బంగారం గొలుసు సరిగా చూడను కూడా చూడలేదు తను.

"హలో, ఏ లోకంలోకి వెళ్లిపోయారు?" అన్నాడు కరుణ ఇడ్లీ ప్లేటొకటి తెచ్చి చేతికి ఇస్తూ.

"అబ్బా, ఎంత బావుందో ఇడ్లీ. ఈ పచ్చడి మరీను" అని ఆదరాబాదరా తింటున్న తన్మయి వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఇది మీకు నచ్చిందంటే గ్రేటే. ఈ కేంటీన్ల కూడు తినలేక మేం బాధపడ్తూంటాం." అన్నాడు.

బిల్లు కట్టడానికి ముందుకెళ్తున్న తన్మయిని కళ్లతోనే ఆపి, జేబులోంచి చక్కగా మడత పెట్టిన యాభై కాగితం తీసేడు కరుణ.

"అదేవిటి చాలా జాగ్రత్తగా దాచిన కాగితం మారుస్తున్నట్లున్నారు?" అంది.

"కష్ట సమయాలలో వాడమని మా అమ్మ ఇచ్చింది." అని నవ్వేడు.

"ఇప్పుడిది మార్చడం అవసరమా?..."అనేదో అనబోతున్న తన్మయి వైపు చూస్తూ "మొదటిసారి మనిద్దరం కలిసి తిన్న గుర్తుగా ఈ కాగితాన్ని మార్చడం కంటే గొప్ప సందర్భం ఏవుంటుంది? అయినా మరో అరగంటలో పరీక్ష. అయిదు నిమిషాలలో మనమక్కడ ఉండాలి. ఈ విషయం మరో సారి తీరిగ్గా మాట్లాడుకుందాం." అని వేగంగా ముందు నడిచేడు.

"అతని దగ్గిర తనకు నచ్చనిదదే. డిపార్ట్మెంటుకు తనతో కలిసి అడుగులు వెయ్యడానికి ఎందుకో భయపడతాడు." నిట్టూర్చి అతని వెనకే అడుగులు వేసింది తన్మయి.

పరీక్ష రాసి బయటకు వచ్చేక చాలా నిస్సత్తువ వచ్చేసింది తన్మయికి. అన్ని పరీక్షలూ సజావుగా రాసిన ఆనందమో, పరీక్షల వల్ల కలిగిన ఒత్తిడో.

"అందరం సినిమాకి వెళ్దాం." అంది అనంత.

హడావిడిగా లేస్తున్న తన్మయిని చూస్తూ "ఎక్కడికి తప్పించుకుంటున్నావ్?" అంది నవ్వుతూ.

"నేను వెళ్లాలి." అంది తన్మయి.

కారణం ఎవరికీ చెప్పడం ఇష్టం లేదు తన్మయికి.

చిన్న కోపంతో సన్నగా అదురుతున్న ముక్కు పుటాలతో "ఆవిణ్ణి వెళ్లనివ్వండి. ఎప్పుడు మనతో వచ్చింది గనక" అన్నాడు కరుణ.

"కనీసం మళ్లీ ఎప్పుడు కలుస్తారో అయినా చెబుతారా?" అన్నాడు తన్మయి వైపు చూస్తూ ఉక్రోషంగా.

తన్మయి మనసులో ఒకటే ఆలోచన. "ఎప్పుడెప్పుడు ఇవేళ్టి గండం గడిచి, ఊరెళ్ళి బాబుని చూస్తానా?" అని.

అదే చెప్పింది.

"సరే. రిజల్ట్సు వచ్చేక కలుద్దాం. కాలేజీ తెరవడానికి వారం ముందు డిపార్టుమెంటులో బోర్డు పెడతారట. కనీసం సెలవుల్లోనైనా చదువు గురించి మరిచిపోయి హాయిగా బాబుతో గడుపు" అంది అనంత.

"కానీ...." అనేదో అనబోతున్న రాజు వైపు చూసి, "మా పెళ్లికి పెద్దవాళ్లు ఒప్పుకున్నారు. ఈ సెలవుల్లో సంబంధం సెటిల్ చేసుకోవడానికి ముహూర్తం పెట్టబోతున్నారు." అంది అనంత.

"మీరంతా తప్పక రావాలని రాజు పిలుద్దామని అనబోతున్నాడు. మీ ఆయనకి సెలవులు ఉండవని నువ్వు చెప్పేవు కదా." అని తన్మయి వైపు 'అతన్ని' తీసుకురావొద్దన్నట్టు సైగ చేస్తూ అంది అనంత.

వెంటనే గ్రహించి "మీ ఇద్దరికీ కంగ్రాట్స్. నీకు తెలీనిదేవుంది అనంతా, శేఖర్ కి సెలవు ఉండదు. నేనూ మా ఊరి నించి ఎప్పుడొస్తానో తెలీదు. ఏవీ అనుకోవద్దు." అంది తన్మయి.

అనంత దగ్గరగా వచ్చి నెమ్మదిగా "తన్మయీ, నిన్ను రావొద్దని నా భావం కాదు..." అని చెప్పబోయింది.

బదులుగా "ఆల్ ది బెస్ట్ అనంతా!" అని, అందరికీ చెయ్యి ఊపింది.

"కనీసం మాతో కలిసి బస్టాండు వరకైనా రావా?" అంది అనంత.

కరుణ మరింత చికాగ్గా మొహం పెట్టి, "ఆవిణ్ణి వెళ్లనివ్వండి, టైం అవుతున్నట్లుంది" అన్నాడు.

అతని బాధ తన్మయికి అర్థమయినా, పట్టించుకునే పరిస్థితిలో లేదు.

★★★

ఇంటి స్టాపులో బస్సు దిగగానే ముందు ఫోను బూత్ కి పరుగెత్తింది తన్మయి.

అట్నించి బాబు "ఉంగా ఉంగా" కబుర్లు వినే సరికి ఎక్కడ లేని హుషారు వచ్చేసింది తన్మయికి.

"రేపే వస్తాను నాన్నా. అంత వరకు బొజ్జ నిండా బువ్వ తిని హాయిగా బజ్జో." సంతోషంగా అంది.

ఏదో అర్థమవుతున్నట్లు "ఊ" కొట్టసాగేడు బాబు.

"కంగారేం లేదులే. బాబు చక్కగా ఉన్నాడు" అంది జ్యోతి.

ఇంటికి వచ్చేసరికి శేఖర్ లేదు.

తలారా స్నానం చేసి అతను తెచ్చిన పట్టు చీర కట్టుకుని, గొలుసు వేసుకుంది.

అద్దంలో తనను తాను చూసుకుని మురిసిపోయింది. సన్నగా జాజిమల్లెలా ఎంత అందంగా ఉంది ఈ చీరలో!

"ఎంత బావుంటే ఏం లాభం? శేఖర్ కి నచ్చకపోయేక." అనుకుంది.

అంతలోనే చప్పున అతను వేసిన వేషాలు గుర్తుకు వచ్చి తన మీద తనకే విరక్తి కలిగింది.

తనెంతగా అతనిని ప్రేమించిందో అతను కూడా తనని అంతగా ప్రేమిస్తాడని తను ఊహించుకోవడం తప్పా? అసలతను తనని ప్రేమించకపోయినా తనే ప్రేమిస్తున్నాడని ఉహించుకుందా? ...ఎన్ని విధాలుగా ఆలోచించినా అతని ప్రవర్తనకు అర్థం బోధపడడం లేదు తన్మయికి.

"తను అతన్ని ఆకర్షించలేకపోతున్నందు వల్లే అతనిలా పరాయి ఆడవాళ్ల వెంట పడుతున్నాడా?" న్యూనతతో కుంగిపోయింది కాస్సేపు.

ఆకలి వేస్తూన్నా శేఖర్ వచ్చి భోజనానికి తీసుకు వెళ్తాడని ఎదురు చూస్తూ అలాగే పడి నిద్రపోయింది.

చీకటి పడ్తూన్న వేళ మెలకువ వచ్చింది తన్మయికి.

శేఖర్ జాడ లేదు. ఫ్రిజ్ లోంచి కాసిన్ని పాలు తీసుకుని తాగింది.

బాబు కోసం మనసు కొట్టుకుంటూంది. ఇంక ఒక్క క్షణం కూడా ఉండలేదు తను. పొద్దున్నే బయలుదేరి బాబు దగ్గిరికి వెళ్లిపోవాలి.

మంచం కింద సూట్ కేసు బయటికి తీసి సర్దసాగింది. మనసంతా చికాకుగా ఉంది.

అప్పటిదాకా ఆకలితో వేచి చూసి విసిగి పోవడంతో శేఖర్ వచ్చిన చప్పుడైనా వెనక్కి తిరిగి చూడలేదు. ఎంత సర్దుకుని పోదామని ప్రయత్నిస్తున్నా బాధ తన్నుకు వస్తోంది.

లోపలికి వస్తూనే "నేన్నీకు ఏం ద్రోహం చేసేనే? పెళ్లి రోజు కూడా మొగుణ్ణి లెక్క చెయ్యకుండా పరీక్షలని బయటికి పోయి పరాయివాడితో తిని తిరుగుతావా?" అన్నాడు.

"తాగొచ్చేవా?" అంది అతని ఎర్రని కళ్లని చూస్తూ.

"అడిగిన దానికి సమాధానం చెప్పు ముందు." అని అరిచేడు.

"ఏం చెప్పాలి?" అంది బట్టలు సర్దుకుంటూ.

"మా పిన్ని మొగుడు తన కళ్లతో చూసేడట. నువ్వు పొద్దున్నే యూనివర్శిటీ కేంటీన్ లో ఎవడితోనో కలిసి తినడం, తిరగడం. ఇదేనా నీ చదువు నాటకం?" అన్నాడు గట్టిగా.

"పరీక్షకి ముందు ఆకలేస్తే కేంటీన్ కు వెళ్లి తిన్నాను. కాలేజీలో కలిసి చదువుకునే వాళ్లతో కేంటీన్ కు వెళ్లడం కూడా తప్పేనా? అయినా నీకు చెప్పినా అర్థం కాదులే." అంది విసుగ్గా.

"అవునే. నాకు చెప్పినా అర్థం కాదు. నేనొక చదువు లేని ఎదవని. నా పెళ్లాం నిప్పని నమ్మిన ఎదవని. అందుకేనా నీ ఏషాలకి అడ్డం రాకుండా ఉంటాడని పిల్లోణ్ణి కూడా అమ్మగారింట్లో దిగబెట్టి వచ్చేవు?"

"ఛీ. ఆపుతావా?" అని అరిచింది తన్మయి.

"ఏవిటే, నేను ఆపేది? పొద్దుట్నించి నేనొక్కణ్ణే చుట్టాల ఇంటికి తిరుగుతూంటే, నీ పెళ్లాం ఎవడితో తిరుగుతూందిరా అని అందరూ యెక్కిరించి నవ్వుతున్నట్లు కంపరం పుట్టుకొస్తోంది. ఎక్కడికి బట్టలు సర్దుతున్నావు? ఆడితో లేచిపోవడానికా?" అని నిలబడలేక మంచానికి అడ్డం పడ్డాడు. ఒంటి మీద తెలివి లేకుండా ఏదేదో గొణుగుతూ నిద్రలోకి జారుకున్నాడు.

తన్మయి వరండా బయటికి వచ్చి నిలబడింది. చీకటిలో ఆకాశంలో దేదీప్యమానంగా వెలుగుతున్న చుక్కల్ని చూస్తూ గొణిగింది.

"మిత్రమా! ఎక్కడున్నావు? ఇంత పెద్ద విశ్వాంతరాళంలో భూమ్మీద ఉన్న మనిషి జీవిత కాలమెంత? అందులో మనిషి సంతోషంగా గడిపే కాలమెంత? ఒక్క నిమిషమైనా ఫర్వాలేదు. నాకు ప్రశాంతంగా, సంతోషంగా జీవించే అవకాశాన్నివ్వు. ప్లీజ్." చేతులు రెండూ జోడించి నేల మీద కూలబడింది.

కన్నీళ్లు తనకి తెలియకుండానే ఎంత సేపట్నించో చెంపల్ని కారుతూనే ఉన్నాయి.

శేఖర్ చేసేవి చేస్తూ తనని శంకిస్తున్నాడు పైగా.

ఏదో ఒక మోస్తరుగా ఉన్న తన లాంటి అమ్మాయిని చూడచక్కని రూపం ఉన్న శేఖర్ కావాలని వచ్చి పెళ్లి చేసుకోవడమే గొప్ప అనుకుని మురిసిపోయింది తను.

అతని మీద ఉండాల్సిన దానికంటే అధికంగా ప్రేమని పెంచుకుంది.

ప్రతిగా తను పొందుతున్నదేంటి? మనసూ, శరీరమూ గాయాలు. పచ్చి ఆరని గాయాలు.

కళ్లు తుడుచుకుని లోపలికి వచ్చింది. నిద్రపోతున్న శేఖర్ వైపు చూసింది. నిద్రలో అందమైన బాలుడిలా కనబడుతున్నాడు. మెలకువలో ఇతనిలో రాక్షసుడు పరకాయ ప్రవేశం చేస్తాడనుకుంటా.

అటు ఇటూ చూసి కనబడ్డ పెన్సిలుతో బల్ల మీద చీటి రాసి పెట్టింది.

"బాబుని తీసుకురావడానికి ఊరు వెళ్తున్నాను. నీ లాగా, నువ్వు అనుకుంటున్నంత చెడ్డగా నేను దిగజారలేదు."

★★★

తెల్లారి మొదటి బస్సెక్కింది తన్మయి. బస్సు కిటికీ లో నుంచి ఆహ్లాదంగా వీస్తున్న ఉదయపు గాలికి ఎప్పుడు నిద్రపట్టిందో తెలియలేదు.

"ఏవమ్మా, మీ ఊరు వచ్చింది. దిగవా?" కండక్టరు అరుపుకి దిగ్గున లేచింది.

ఇంటికి చేరుకోగానే బయటే వరండాలో ఆడుకుంటున్న బాబు తల్లి వైపు పడుతూ లేస్తూ అడుగులేసాడు. సూట్ కేసు గుమ్మం దగ్గిరే వొదిలేసి ఒక్క ఉదుటున వాడి వైపు పరుగెత్తింది తన్మయి. రెండు చేతుల్లో పైకి ఎత్తుకుని, చిన్న ఎముకలు గుచ్చుకునే వాడి పసి గుండెల మీద తలవాల్చగానే ప్రపంచం లోని వేదనలన్నీ తొలగిపోయిన నిశ్చింత కలిగింది.

"ఇంకెప్పుడూ నిన్ను వొదిలి వెళ్ళను నాన్నా" అంది కళ్లు మూసుకుని.

ఎప్పటిలాగే వచ్చి పదిరోజులవుతున్నా శేఖర్ నించి ఫోను లేదు.

దేవి మాత్రం రెండో వారం లో ఫోను చేసి తమ మనవడు తమ ఇంట్లోనే ఉండాలన్నట్లు ఆర్డరు జారీ చేసింది.

ఇదేమీ కొత్త కాదు కదా తన్మయికి. మారుమాట్లాడకుండా వెళ్లి, సెలవులయ్యేంత వరకూ అత్తగారింట్లో చెప్పిన పనల్లా చెయ్యడానికి సిద్ధ పడింది. ఎప్పటిలాగే తల్లి అడ్డుకోబోయింది.

"అసలే అతనికి ఇష్టం లేకుండా వచ్చింది తను. కాలేజీ విషయంలో అతనికీ, తనకీ భేదాభిప్రాయాలు తప్పడం లేదు. కనీసం సెలవుల్లోనయినా అతని ఇష్ట ప్రకారం కొన్నాళ్ళు ఉంటే కాస్త శాంతిస్తాడేమో."

అదే చెప్పింది తల్లికి.

"ఏమోనమ్మా, నీ ఇష్టం" నిష్ఠూరంగా అని, "పిల్లాడు చక్కగా అలవాటు అవుతున్నాడు మాకు. మేం మాత్రం వాణ్ణి వొదిలి ఎలా ఉండగలం?" అని దుఃఖపడింది.

అత్తగారింట్లో బాబుని పొద్దున్నే తయారు చెయ్యడం, మధ్య మధ్య అన్నం తినిపించడం వంటి పనులకు మాత్రమే తన్మయి దగ్గిర వదిలే వాళ్లు. మిగతా సమయమంతా వాళ్ల దగ్గిరే గడిపే వాడు బాబు. రోజల్లా వంటింటి పని, ఇంటి పనీ సరిపోయేది తన్మయికి. ఏ మాత్రం సమయం చిక్కినా పుస్తకం, పెన్ను పట్టుకుని రాసుకోవడం అలవాటుగా మారింది. ఎమ్మే మొదటి సంవత్సరంలో చదివిన పుస్తకాల గురించి అభిప్రాయాలు రాయడమో,

నచ్చిన పద్యాలు గుర్తు తెచ్చుకుని రాసుకోవడమో, స్వంతంగా అర్థం పర్థం లేని రాతలు రాయడమో ప్రపంచంగా మారింది. కలర్ టీవీ లో దూరదర్శన్ కాకుండా కొత్తగా మొదలైన టీవీ ఛానెల్ కి ఇంటి వాళ్లంతా అతుక్కుని కూచుంటే, తన్మయి కాగితాల మధ్య గడపడాన్ని అత్తగారు చాలా విచిత్రంగా చూసేది. అసలు ఏం రాస్తూందో అని కుతూహలం బాగా పెరిగిపోయినట్లు ఆవిడ ముఖమే చెప్తూండేది. ఓ రోజు తన్మయి స్నానానికి వెళ్లొచ్చే సమయానికి పుస్తకం తెరిచి ఉండడం కనిపించింది. అందులో అజ్ఞాత మిత్రుడి ఉత్తరం పేజీ దగ్గిర ఆగిపోయిన చదువరి మన:స్థితిని ఊహించుకుని నవ్వుకుంది.

వారంలో సెలవులవుతాయనంగా బాబుని ఒళ్ళో ఆడిస్తున్న దేవి దగ్గిరికి వెళ్లింది తన్మయి.

"అత్తయ్యా, రేపు, ఎల్లుండిల్లో నేను వైజాగు బయలుదేరుతాను." అంది.

"ఎందుకు?" అంది తన్మయి వైపు చూడకుండానే.

అసలా ప్రశ్నకు అర్థం బోధ పడలేదు తన్మయికి.

"మా ఇంటికి" అంది స్థిరంగా.

"శేఖర్ నాతో చెప్పేడు నువ్వక్కడ చేస్తున్న పనులు. నువ్విప్పుడు గొప్ప చదువు చదివి ఎవరినీ ఉద్ధరించక్కరలేదు. మా దగ్గిరే ఉండు. శేఖర్ కి కుదిరినపుడు వచ్చి చూసెళ్తాడు." అంది కఠినంగా.

తన్మయికి భయంతోనూ, ఆందోళనతోనూ దు:ఖం గబుక్కున ఉబికింది. గొంతు పూడుకుపోయింది. ఏవీ మాట్లాడలేక కాళ్లు వణకసాగేయి.

## 23

దేవి విశాఖపట్నం వెళ్ళొద్దనే సరికి ఆ రోజంతా తన్మయికి తన జీవితమేమిటో తనకే అర్థం కాని అయోమయ పరిస్థితి పట్టుకుంది.

ఎప్పటికప్పుడు తనెంత విధేయంగా ప్రవర్తిస్తూందో అంతకు అంతా శేఖర్, అతని తల్లిదండ్రులూ సమస్యలు తెచ్చి పెడ్తున్నారు.

"అసలు విశాఖపట్నమే వెళ్లొద్దనేంత తప్పు పని తనేం చేసింది? తనే ఒక సమస్యా వీళ్లకి?"

ఒక పక్క ఈ కుటుంబం మన్ననలు పొందలేకపోతున్న బాధ. మరో పక్క శేఖర్ ప్రవర్తనతో పుట్టుకొస్తున్న విసుగు. అన్నిటినించీ ఊరట నిస్తున్న ఒకే ఒక్క ఆధారం "బాబు".

ఒక్క క్షణం తన పక్కన ఆద మరిచి నిద్రపోతున్న పసివాణ్ణి గట్టిగా హత్తుకుంది. విశాఖపట్నం తిరిగి వెళ్ళలేకపోతే ఎమ్మే ఇక ఆగిపోయినట్లే. తన జీవితానికి ఏదో ఒక త్రోవ దొరుకుందనే ఆశతో ఎన్నో కష్టాలకు ఓర్చి ఈ ఎమ్మే చదువుతూంది. నిద్దట్లో బుగ్గలు సొట్టలు పడేట్లు నవ్వుతున్న పసివాణ్ణి చూస్తూ, "నాన్నా! నాకు ధైర్యాన్ని ఇవ్వరా. అమ్మ చదువు తప్పకుండా పూర్తవుతుందని చెప్పు." అంది. కళ్లు మూసుకుని ఏవేవో పెదవులు కదుపుతూ తనలో తను మాట్లాడుకుంటూ నిరాసక్తంగా నిద్దట్లోకి జారుకుంది.

తెల్లర గట్ల పక్కనే పరిచయమైన శేఖర్ ఒంటి వాసనకి ఉలిక్కి పడి లేచింది. తన్మయి మీదుగా ఒంగి బాబుని ముద్దాడుతున్నాడు.

తన్మయితో ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఒంటి మీద చెయ్యి వేసేడు. మారు మాట్లాడకుండా ఒళ్లప్పగించింది. మనసులో సుళ్లు తిరుగుతున్న బాధ ముందు శరీరం బాధ చాలా చిన్నది.

అతను నిద్రకుపక్రమిస్తూండగా "మనం వైజాగు ఎప్పుడు వెళ్తాం?" అంది.

"ఏం? చదువు మునిగిపోతందా నీకు?" వెటకారంగా అని, " వైజాగు కాదు. నెల్లూరులో బిజినెస్సు పనిబడింది నాకు. సాయంత్రం బండికి వెళ్దాం. బట్టలు సర్దుకో." అన్నాడు.

వారంలో కాలేజీ తెరుస్తారు. ఇప్పుడు మరెక్కడికో ప్రయాణం అంటే కాలేజీ పోయినట్లే. అయినా తమాయించుకుని, “మరి అక్కడ ఉద్యోగం?" అంది.

"అణా, కాణీ పోగేసే ఉద్యోగం ఉంటే ఏంటి? ఊడితే ఏంటి? దేవుడి దయ వల్ల యాపారం కుదురుకుంటే ఇలాటి ఉద్యోగాలు నేనే నలుగురికి ఇవ్వగలను." అన్నాడు.

పొద్దున్నే దేవి "తన్మయినీ, పిల్లాణ్ణి ఒదిలెళ్ళరా..." అనేదో అనబోయింది.

"నా కొడుకుని చూసి చాన్నాళ్లయ్యిపోయింది కదే అమ్మా. పైగా అక్కడ హోటలు తిండికి నాకు ఆరోగ్యం పాడయ్యి పోతంది. రానియ్యిలే." అన్నాడు.

ఎన్నాళ్లు అనే ప్రశ్న కూడా అడిగే ఉత్సాహం కూడా లేదు తన్మయికి.

విశాఖపట్నం లో ఇల్లు ఉంచేదో, ఖాళీ చేసేసేదో మాత్రం అడిగింది.

"ఇప్పుడు ఇల్లు ఖాళీ చేసేస్తే మా బాసుకు అనుమానం రాదూ? ఎదవ తెలివి ఏడిసినట్టే ఉంది. అయినా నెల్లూరులో ఒప్పందం కుదరనీ మొదట." అన్నాడు.

సాయంత్రం బండి ఎక్కి, తెల్లారగట్ల నెల్లూరులో దిగి, బస్సు ఎక్కేరు. అక్కణ్ణించి జీపులో కొంత దూరం. దాదాపు యాభై ఇళ్లు ఉండే సముద్ర తీరపు బెస్త పల్లెకి పదకొండు గంటల వేళకి చేరుకున్నారు.

ఏదో ఇంటి ముందు జీపు దిగే సరికి మధ్య వయసు ఆవిడ వచ్చి పలకరించింది. ఆ తెలుగు యాస మొదట అర్థం కాలేదు తన్మయికి.

శేఖర్ కి బయటే వాకిట్లో చిన్న నులక మంచం వాల్చి, అలిసిపోయి ముఖం పీక్కు పోయిన తన్మయిని, భుజాన నిద్రపోతున్న పిల్లాడిని లోపలి గదిలోకి రమ్మని తీసుకెళ్లింది. అది ఒకే ఒక్క గది, వసారా ఉన్న గవర్నమెంటు కట్టిచ్చిన పేదల పథకానికి చెందిన ఇల్లులా ఉంది. కింద గచ్చులేదు.

బయట వాకిట్లో కూడా ఇసుకే ఉంది. సముద్రానికి దగ్గరగా ఉన్నట్లు హోరు వినిపిస్తూ ఉంది.

బాబుని పడుకోబెట్టమని లోపల చిన్న నవారు మంచమ్మీద బొంత వేసింది.

ఇంటి వెనక చిన్న దడి చూపించి బాత్రూముకి వెళ్లమని చెప్పింది. మూడు వైపులా తాటాకుల దడి మధ్య ఒక చిన్న రాతి పలక ఉంది. చుట్టూ కాళ్ల కింద ఇసుక.

ఒక మూలగా మరో చిన్న పలక మీద చిన్న ఎర్ర సబ్బు ముక్క ఉంది.

చుట్టూ సొట్టలుండి సన్నని రంధ్రం నించి నీళ్లు కారిపోతున్న చెంబు, దాదాపు విరిగిపోతున్న డబ్బా రేకు బకెట్టు.

తన్మయి ముఖం కడుక్కుని వచ్చే సరికి ఇంటి ముందు వాకిట్లో ఒక పక్కగా ఉన్న పొయ్యి ముందు కూచుని, పొగ ఊదుతూ కనబడింది ఇంటావిడ.

"నీ మొగుడు ఎప్పుడొస్తాడు చెన్నమ్మా?" అన్నాడు శేఖర్.

సముద్రం వైపు చూపిస్తూ "రేత్తిరికి" అంది.

ఆవిడ దగ్గర్లో ఉన్న పీట మీద కూర్చుంటూ "నేను సాయం చెయ్యనా?" అంది తన్మయి.

మొహమాటంగా "వద్ద"న్నట్లు తల అడ్డంగా ఆడిస్తూ తన్మయి వైపు నవ్వుతూ చూసింది.

గార పట్టిన పళ్లు. ఎప్పటి నుంచో తైల సంస్కారం లేనట్లు పీచు జుట్టు ముడి. మాసిపోయిన చీర.

చెన్నమ్మ ఎవరో, చెన్నమ్మ భర్త ఎవరో శేఖర్ ని అడిగే ఆసక్తి  లేదు తన్మయికి. అసలేదీ అడిగే ఆసక్తి  లేదు. తన జీవితం తన చేతుల్లో లేదు. తను అనుకున్నట్లు ఏదీ జరగదు.

అసలు కాలేజీ తెరిచే సమయంలో తను ఇక్కడ ఏం చేస్తోంది? అసలిక్కడ నుంచి తిరిగి ఎప్పుడు విశాఖకు వెళ్లగలదు? ఏ ప్రశ్నకూ సమాధానం లేదు. అసలు తన జీవితం ఎటు పోతుందో తనకే తెలీదు.

మనసులో మెదులుతున్న ఆలోచనలతో చెన్నమ్మ చేస్తూన్నది నిశ్శబ్దంగా చూడసాగింది తన్మయి.

చుట్టు పక్కల పిల్లలు ఇద్దరు ముగ్గురు వచ్చి వీళ్లని తొంగి చూసి పారిపోయారు.

అంతా పేదరికంలో మగ్గుతున్నట్లు వాళ్ల ఒంటి మీదఅరకొరగా వున్న బట్టలు, మాసిన ముఖాలు చూస్తే అర్థం అవుతున్నాయి.

శేఖర్ ఆమెతో పరిచయం ఉన్నట్లు మాట్లాడుతున్నాడంటే, ఇంతకు ముందు ఇక్కడికి వచ్చి ఉండాలి.

ఎపుడూ ఎక్కడికీ తీసుకెళ్ళని తనని ఇక్కడికి ఈ ఊరికి అసలు ఎందుకు తీసుకు వచ్చాడో అర్థం కాలేదు.

నెల్లూరు అని చెప్పి తలుపూ ద్వార బంధంలేని ఈ బెస్త పల్లెకి తీసుకు వచ్చేడు శేఖర్.

అయోమయంగా ఎటో కొట్టుకొచ్చిన జీవితం. దూరంగా వినిపిస్తున్న సముద్ర తీరానికి చేరి ఇసుకలో చతికల బడి ఆకాశాన్ని తాకే సముద్ర కెరటాల మీద వేళ్లాడే దిగంతం పగిలేలా అరిచి గట్టిగా ఏడవాలనుంది తన్మయికి.

లోపలికి వచ్చి, బాబు పక్కన నడుం వాల్చి కళ్లు మూసుకుంది.

మరో గంటలో బాబు నిద్ర లేచేడు. తడి గుడ్డతో ఒళ్లు తుడిచి, సంచీ లోంచి శుభ్రమైన బట్టలు తీసి తొడిగింది. కింద వదిలే సరికి ఇంటి వాకిట్లో ఇసుకలో కూర్చుని, నెత్తి నిండా ఇసుక పోసుకున్నాడు.

సముద్రం హోరు వింటున్న కొలదీ సముద్రాన్ని చూడాలన్న ఉత్సుకత బాగా ఎక్కువ కాసాగింది తన్మయికి.

కడుపులో ఆకలి నకనక లాడుతూంది.

ఇంకో గంట వరకూ అక్కడ వంట తెమిలేటట్టు లేదు.

శేఖర్ ఎటో వెళ్ళడానికన్నట్లు పైకి లేచేడు.

తన్మయి కూడా లేచి నిలబడింది బాబునెత్తుకుని.

"నువ్వుండు, నేనలా వెళ్లొస్తాను. సాయంత్రం టౌనుకి వెళ్లిపోదాం" అన్నాడు.

ఒక పక్క నించి వీస్తున్న విసురు గాలికి పొయ్యిలో మంట ఆరిపోయి ఇంటావిడ అవస్థ పడ్తూంది.

అన్నం అతి కష్టమ్మీద వండింది.

మూడు గుడ్లు భద్రంగా పట్టుకొచ్చి నీళ్లలో వేసింది.

తన్మయి ఆవిడ చేతుల్లో నుంచి కత్తిపీట అందుకుని ఉల్లిపాయలు గబగబా కోసింది.

పరిచయంగా పొయ్యి దగ్గిర కూచుని కట్టెలు ఎగదోసి పొయ్యి ఊదింది.

ఆ మాత్రానికే చాలా ప్రశంసా పూర్వకంగా చూసింది చెన్నమ్మ.

"మీ కెందుకమ్మా" అంది.

"పర్లేదులే" అని చిన్నగా నవ్వింది తన్మయి.

చెన్నమ్మ ఏవేవో చెప్తూ ఉంది.

"శేకర్ బాబు అప్పుడప్పుడూ వొస్తాడు మా ఆయిన కాడికి. సెముద్రం మీదికి ఇద్దురూ కలిసి కూడా పొయిన్రంట."

"ఎప్పుడూ మా బెస్త గూడెం లో మేం సేపలే తిందుము. పట్నెం పిల్లవి నీకు గుడ్లయినా పెట్టమని సెప్పి పొయినాడు మా ఆయిన."

" సెముద్రం మీద ఏట ఒక్కో పారి బాగా వచ్చుద్ది. ఒకో పారి పొయ్యిద్ది ."

"మీ వైపు రైళ్లు తిరుగునా? నేనొక్క పారి ఎక్కినా"

"మాకు పిల్లలు గాలే, పదేండ్లయ్యె పెండ్లయ్యి"

ఏవిటేవిటో చెప్పుకెళ్లిపోతూంది చెన్నమ్మ.

అటూ ఇటూ ఇసుకలో దొర్లడానికి విదిలించుకుంటూన్న బాబుని ఒళ్లో కూచో బెట్టుకునే ప్రయత్నం చేస్తూ కష్టపడ్తున్న తన్మయి ఇక లాభం లేక వొదిలింది వాడిని.

పది నిమిషాలలో ఆ చుట్టుపక్కల పిల్లాడిలా తయారయ్యేడు.

శేఖర్ వచ్చే సమయానికి తన్మయి పొయ్యి ఊదుతూ ఉంది.

చెన్నమ్మ లోపలికి ఏదో పట్టుకు రావడానికి వెళ్లింది.

వస్తూనే చికాగ్గా "ఎక్కడికొస్తే అక్కడి వాళ్లతో కలిసిపోవడవేనా?, లే" అన్నాడు చికాగ్గా.

బాబుని తీసి ఇసుక దులుపుతూ "అలగా దానిలా నువ్వు పొయ్యి దగ్గిర తయారవ్వడం కాకుండా వీణ్ణి కూడా నీలాగే ట్రైనింగిస్తన్నావేంటే?" అని అరిచేడు.

తన్మయి ఆశ్చర్యపోయింది. డబ్బుల్లేని ఈ బెస్త పల్లెలో ఇంటామె డబ్బులున్న అతని యజమాని భార్య కంటే గొప్ప ఆదరం చూపిస్తూంది. డబ్బుల్లేనంత మాత్రాన "అలగా జనం" ఎలా అవుతారు వీళ్ళు? తన దృష్టిలో డబ్బు మనిషికి తిండి పెట్టే కాగితం మాత్రమే. మనుషులకు మధ్య అంతరాలు సృష్టించే అడ్డుగోడ కాదు.

శేఖర్ తో అదే అనబోయి, అంతలోనే లోపలున్న చెన్నమ్మ ఏమనుకుంటుందో అని, ఒంగి చూస్తూ, చప్పున లేచొచ్చి బాబుని ఎత్తుకుని చీర చెంగుతో తుడిచి, నులక మంచమ్మీద ఒక వైపుగా మాట్లాడకుండా కూచుంది.

చెన్నమ్మ ఆ మాటలు విన్నదనుకుంటా. భోజనాలు లోపల వొడ్డించి గుమ్మం అవతల నిలబడింది.

కష్ట పడి వొండిన చెన్నమ్మ అలా అంటనట్లు దూరంగా నిలబడ్డం అన్యాయంగా అనిపించింది తన్మయికి.

చకచకా తిని బయటికెళ్లి చెయ్యి కడుక్కుని, "నువ్వూ తిను చెన్నమ్మా" అంది.

మరో గంటలో ఇంటి ముందు జీపు వచ్చి ఆగింది.

శేఖర్ వెళ్లి ఏదో మాట్లాడి వచ్చి, "ఇవేళ పడవ రాదంట. మనం అనవసరంగా ఇవేళ ఒచ్చేం. నడు" అన్నాడు.

ఎక్కడికి వచ్చేమో, ఎందుకు వెళ్తున్నామో అప్రస్తుతమయిన తన్మయికి ఇదొక కొత్త అనుభవం.

చెన్నమ్మ జీవిత గాథ ఒక కొత్త కనువిప్పు.

చెన్నమ్మకి పెళ్లయ్యి పది సంవత్సరాలు దాటింది. పిల్లలు లేరు. పుట్టిందీ, పెరిగిందీ బెస్త పల్లెలోనే. తనకి తెలిసందల్లా సముద్రం, చేపల వేట. భర్త పచ్చి తాగుబోతు, తిరుగుబోతు. అతను సముద్రమ్మీదికి వేటకు వెళ్లిన సమయంలోనే కాస్త మనసుకి ఊరట. అతనెంత సంపాదించినా అంతా ఖర్చు పెట్టేస్తాడు. అదే మాసిన చీర బతుకు. ఎన్నేళ్లు గడిచినా అదే జీవితం. తన్మయికి ఎన్నో జవాబుల్లేని ప్రశ్నలు ఒక్క సారిగా మనస్సులో మెదిలేయి.

"చెన్నమ్మ ఎలా నవ్వుతూ బతకగలుగుతూంది?"

తన్మయికి ఒక్కటి మాత్రం అర్థమయ్యింది. తన చుట్టూ ఉన్నవి తనకి సమస్యలు అన్న అవగాహన, అంతకంటే మంచి జీవితం కావాలన్న ఆకాంక్ష లేవు చెన్నమ్మకి. అంతే.

అవన్నీ ఉంటే తనలా అంతర్మథనం తప్పదు. అంటే తనలాంటి వాళ్లకి ఆనందంగా బతికే హక్కు లేదా?

టౌనుకి చేరే వరకూ ఆలోచిస్తూనే ఉంది. బస్సు దిగి రిక్షా ఎక్కేరు.

" శేఖర్ తో తన చదువు విషయం మాట్లాడినా ఉపయోగం ఉంటుందని నమ్మకం లేదు. ఇక్కడ అతని పని కాగానే అతను వైజాగు వెళ్లినా, తనని వాళ్లింట్లో ధవళేశ్వరంలో వదిలేస్తాడు. విశాఖపట్నానికి చేరేదెలా?"

రిక్షా ఏవేవో చిన్న వీధి మలుపులన్నీ తిరిగి వెళ్తూ ఒక చోట ఆగింది.

తుప్పుపట్టిన ఇనుప గేటు తీసుకుని వెళ్లేరు. చిన్న డాబా. పక్కన ఇరుకు సందులో నుంచి పైకెక్కితే మేడ మీద ఉన్న ఒకే ఒక్క గది లోకి అడుగు పెట్టేరు. ఇంటి చుట్టూ ఉన్న చిన్న ఆవరణలో దట్టంగా చెట్లు ఉన్నాయి.

మెట్లెక్కుతూ ఉండగా కిందన ఇంటి వాళ్ల అమ్మాయి అనుకుంటా పద్దెనిమిది, పంతొమ్మిదేళ్లుంటాయేమో. తెల్లగా, బొద్దుగా, చూడచక్కగా ఉంది. శేఖర్ ని చూసి సిగ్గుగా నవ్వి లోపలికి వెళ్లిపోవడం, శేఖర్ హుషారుగా మెట్లెక్కడం గమనించింది.

పైన గదిని అనుకుని వెనక వైపు ఒక బాత్రూము ఉంది.

సామాన్లవీ ఏవీ లేనందువల్ల గది విశాలంగా కనిపిస్తూంది అంతే.

తమ ప్రాంతానికీ, ఇక్కడికీ పెద్దగా తేడా ఏవీ లేదు. ఇళ్ల బయట అవే మురికి కాలువలు. అవే మట్టి వాకిళ్లు.

శేఖర్ ఒక గంటలో బయటి కెళ్లి వస్తూ ఇక చిన్న స్టవ్వు, ఒక రెండు గిన్నెలు, కంచాలు, గ్లాసులు ఉన్న ఒక గోనె సంచీ పట్టు కొచ్చేడు. ఎవరో బాగా వాడేసినవి అవన్నీ.

"అమ్మ మొదట నేనొచ్చినపుడు కట్టి ఇచ్చింది. ఇప్పటికి ఉపయోగానికి వచ్చేయి. కిందన ఆంటీ గారింట్లో పెట్టేను. కాస్త స్నానం చేసి, బాబుని తయారు చెయ్యి. టౌనుహాలులో కొత్త సినిమా ఆడతంది. ఈ పూట హోటలుకి పోయి భోజనం చేద్దాం. మధ్యాహ్నం ఆ చేపలమ్మి వండిన కూడు తినలేక చచ్చేను. ఇక మీదట నేనా ఊరు వెళ్లే ముందు ఉదయానే నాకు బాక్సు కట్టివ్వు." అన్నాడు.

తన్మయి వినీ విననట్టు తలూపడం చూసి "అసలు తలకెక్కిందా నేను చెప్పింది?" అని గద్దించేడు.

"కిందనింట్లో ఆంటీ గారింట్లో టీ.వీ ఉంది. నీకు కావలసినంత కాలక్షేపం. ఆవిడికి అయిదేళ్ళ కిందటే మొగుడు పోయేడు. ఉన్న ఒక్క గానొక్క పిల్లదే ఈ ఆస్తి అంతా....." దారి పొడవునా ఏవేవో చెప్పుకెళ్లి పోతున్నాడు.

తన్మయికి విపరీతంగా అలసటగా ఉంది. వరసగా ప్రయాణం వల్ల బాబు భుజాన నిద్రపోతూనే ఉన్నాడు. కాస్సేపు శేఖర్ కి ఇచ్చినా ఏడుపు మొదలు పెడ్తున్నాడు. ఇప్పుడు సినిమా చూసే ఓపిక లేదు. కానీ గొడవ పడే ఓపిక అంత కంటే లేదు. అందుకే మాట్లాడకుండా అతని వెనక బయలుదేరింది.

సినిమా సగంలో నిద్రపోతున్న తన్మయిని భుజం పట్టుకుని కుదిపేడు. బయటికి రాగానే "తెరమీద బొమ్మ ఆడతా ఉంటే నీకు నిద్రెలా పడతందే?" విసుగ్గా అన్నాడు.

రిక్షా ఏదో చిన్న కాకా హోటలు ముందు ఆగింది. "ఇదుగో నిద్ర మొహం దానా, డబ్బులు ఇస్తన్నాం మనం. ఇక్కడా పడి నిద్ర పోకుండా మొత్తం తిను." అన్నాడు.

శేఖర్ మాటలు చెవికెక్కించుకునేలా లేదు తన్మయి మన:స్థితి.

అయినా ఎన్నాళ్ల నుంచో ఆకలితో ఉన్నట్లు తినసాగింది. భోజనం ఎంతో బావుంది. తెల్లని శుభ్రమైన అన్నం. గోంగూర పచ్చడి, రుచికరమైన పప్పూ, కూర, పెరుగు. తన్మయి నెల్లూరు భోజనం అని అంతా గొప్ప చెప్పడం వింది కానీ, ఇదే మొదటి సారి రుచి చూడడం.

"భోజనం చాలా బావుంది కదూ" అంది అప్రయత్నంగా.

"డబ్బులు పారేస్తే ఎందుకు బాగోదు? మంచి భోజనం తిన్నాక మొగోళ్లు భోజనాన్ని మెచ్చుకోవాలి, ఆడోళ్లు అలా వండడం నేర్చుకోవాలి" అని అదేదో జోకన్నట్టు గట్టిగా నవ్వేడు.

రాత్రి చాప మీద నడుం వాల్చగానే శేఖర్ పది నిమిషాల్లో గుర్రు పెట్టడం వింది.

తన్మయికి నిద్ర సరిగా పట్టడం లేదు. ఉదయం నించీ ఉన్న అలసటంతా ఇప్పుడు తెలుస్తోంది. అర్థ రాత్రి గదిలో నుంచి బయటికి వచ్చింది.

డాబా మీద పిండారబోసినట్లున్న చిన్న వరండాలో చతికిలబడింది. ఆహ్లాదంగా గాలి వీస్తూంది. చుట్టూ చెట్లు గాలికి తలలూపుతున్నాయి.

తన్మయికి మనస్సులో చదువు గురించిన బెంగ రెండింతలయ్యింది.

కళ్ళలో నీళ్ల వల్ల వెన్నెల ఆకాశమంతా మసకబారినట్లైయింది. రెండు చేతులూ జోడించి, పైకి చూస్తూ, మనసులోనే "మిత్రమా, నన్ను రక్షించు" అని పదే పదే అనసాగింది.

★★★

తన్మయి బయలుదేరే ముందు తల్లికి ఫోను చేసి చెప్పింది.

"బెంగపడకు. అంతగా నీకు నచ్చకపోతే నాన్నగారిని పంపిస్తాను. వచ్చెయ్యి" అని తల్లి చెప్పిన మాటలు ఊరట నిచ్చినా, శేఖర్తో గొడవ పడడం తల్చుకుంటే చిరాకు వస్తూంది.

తన జీవితమేమిటో తనకు తెలీని గందరగోళం పరిస్థితిలోనే పదిహేను రోజులు గడిచేయి.

శేఖర్ పొద్దుటే వెళ్లి రాత్రి పొద్దుపోయే వరకూ ఇంటికి రాడు.

ఇంటావిడ చాలా మంచిది. వచ్చిన మర్నాడే మేడ పైకి వచ్చింది. బాబుని పరిచయంగా దగ్గిరికి పిలిచింది. ఏం అవసరమైనా మొహమాటం లేకుండా అడగమని తన్మయికి చెప్పింది.

వారంలో పిల్లాడు ఆమెకు మాలిమి అయిపోయాడు. ఈ పదిహేను రోజుల్లో వాడికి స్నానం కూడా తనే చేయించేటంత చనువు వచ్చేసింది ఆవిడకు.

ఆ రోజు శేఖర్ వెళ్లేక, మెట్లు దిగి కిందికి వెళ్లింది తన్మయి.

"ఏవిటి తన్మయీ ఎప్పుడూ దిగులుగా ఉంటావు?" అంది ఇంటి యజమానురాలు భాగ్యమ్మ.

"ఏం లేదాంటీ" అని తల విదిల్చింది తన్మయి.

"మా ఇంట్లో టీవీ మోగుతూనే ఉండుద్ది ఎప్పుడూ. నీకు తోచక పోతే కిందికొచ్చి టీ.వీ చూడొచ్చు కదా" అంది. ఏదో తమిళ సీరియలు చూస్తూంది ఆవిడ.

"మీకు తమిళం వచ్చా?" అంది తన్మయి ఆశ్చర్యంగా.

"తమిళం కొంచెం అర్థం అయ్యిద్ది. మాట్లాడడం అంత బాగా రాదులే. ఇదే సీరియలు తెలుగులో కూడా వచ్చుద్ది. తమిళంలో వచ్చే వారంలో రాబోయే సీరియల్ ఎపిసోడ్ కూడా ఇప్పుడే చూసేస్తాను సస్పెన్సు తట్టు కోలేక" అని నవ్వింది భాగ్యమ్మ.

సీరియలు చూస్తూ ఉన్నట్టుండి, "ఆయన ఉండి ఉంటే..." అని కళ్లు ఒత్తుకుంటూ, అంతలోనే "నిన్ను చూస్తే మా పెద్దమ్మాయి బతికి ఉంటే నీలాగే ఉండుద్దనిపిస్తంది." అంది.

రెప్ప ఆర్పకుండా చూస్తున్న తన్మయి వైపు చూస్తూ "మాకు పెళ్లయ్యిన వెంటనే పాప పుట్టి పురిట్లోనే భగవంతుడి దగ్గిరికి వెళ్లిపోయింది. ఆ తర్వాత అయిదేళ్లకి ఇదిగో ఈ అమ్మాయి పుట్టింది. ఈమె పెళ్లి చూసే వరకైనా భగవంతుడు నా భర్తని బతికించలేకపోయాడు. పండగకి మెద్రాసు పోయి వస్తూంటే ఏక్సిడెంటు ఎత్తుకుపోయిందాయన్ని." అని నిట్టూర్చింది.

తన్మయి అనునయంగా "బాధపడకండి ఆంటీ" అంది.

"అలా బెంగగా ఉండకు తన్మయీ, మీ అమ్మా వాళ్లతో మాట్లాడాలనుకుంటే మనింట్లోంచి ఫోను చేసుకో" అంది కళ్లు వత్తుకుంటూ.

తన్మయికి ఎంతో సంతోషం వేసింది. దయామయులైన వ్యక్తులు తనకి ఎప్పుడూ అడుగడుగునా ఎదురుపడ్తూనే ఉండడం తన అదృష్టం.

ఫోను లో అవతలి నుంచి తల్లి గొంతు వింటూనే గొప్ప ఆనందం, గరగరలాడుతూ దు:ఖమూ తన్నుకు వచ్చేసాయి తన్మయికి.

భాగ్యమ్మ బాబుని ఎత్తుకుని బయటి వరండాలోకి వెళ్లింది.

"ఎవరో కరుణ అట, నీ పేరుతో కార్డు వచ్చింది తన్మయీ." అంది జ్యోతి.

కరుణ పేరు వినగానే మనసు సంతోషంతో ఉరకలు వేసింది తన్మయికి. అంతలోనే యూనివర్శిటీ జ్ఞాపకం వచ్చి బాధతో గొంతు వణికింది.

"ఏం రాసేడో చెప్పమ్మా" అంది.

"నీకు సెకండ్ ర్యాంక్ వచ్చిందటమ్మా. క్లాసులు ప్రారంభమైనా నువ్వు రాలేదేవిటని" రాసేడు. అంది జ్యోతి.

"అడ్రసేవైనా ఉందా కింద?" అంది తన్మయి.

"లేదమ్మా, పేరొక్కటే ఉంది. అన్నట్లు వచ్చే వారం మేం తిరుపతి వెళ్తున్నాం. శేఖర్, నువ్వూ కూడా మాతో వస్తే బావుంటుంది." అంది జ్యోతి.

"శేఖర్ ని అడిగి చూస్తాను. ఒకవేళ మేం రాలేకపోతే, మీరు వెనక్కి వచ్చేటపుడు నెల్లూరులోదిగండి. నేను కూడా మీతో మనూరు వచ్చేస్తాను" అంది ఉత్సాహంగా తన్మయి.

24

తెల్లారగట్ల రైలుకి నెల్లూరు వచ్చేరు జ్యోతి, భాను మూర్తి.

"మీ ఆయనకి ఇంతకంటే మంచి ఇల్లు దొరకలేదా?" వస్తూనే సణిగింది జ్యోతి.

తన్మయికి అక్కడి ఇల్లు అప్రస్తుతమన్న విషయం భానుమూర్తి గమనించినట్లు "అమ్మాయిని, అల్లుడిని తిరపతి తీసుకు వెళ్లడానికి వచ్చేం కానీ, ఇక్కడ ఉండిపోవడానికి కాదుగా" అన్నాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యేక జ్యోతి మనవణ్ణి జోకొడుతూ నిద్రలోకి జారుకుంది.

తన్మయి కూచున్న మెట్ల దగ్గిరికి వచ్చి "ఏంటి తల్లీ! అలా దిగులుగా ఉన్నావు?" అన్నాడు భానుమూర్తి.

"ఏం లేదు నాన్నా" అంది గద్గదంగా తన్మయి ఎటో చూస్తూ.

"అలా బాధ పడ్తూ ఉండకు. అన్నీ అవే సర్దుకుంటాయి. మీ అమ్మతో నేను పడడంలే ఇన్ని సంవత్సరాల నించీ?! బాబుని చూడమ్మా, బంగారం లాంటి పిల్లోడు. నువ్వు హుషారుగా ఉంటేనే కదా, వీడు కూడా ఆరోగ్యంగా ఉంటాడు. అంతగా నీకు ఇక్కడ ఉండాలనిపించకపోతే మాతో వచ్చెయి. కొన్ని రోజులుండి మళ్లీ వద్దువు గాని." అన్నాడు మరింత అనునయంగా.

"అలాగే నాన్నా!" అంది తన్మయి.

అన్నదే కానీ, ఎటూ తేల్చుకోలేనితనం తన్మయిని పిరికిపందని చేస్తూంది.

శేఖర్ ని కాదని వెళ్తే, జరిగే రాద్ధాంతం అంతా ఇంతా కాదు. అలాగని ఒప్పించడమూ గగనమే.

ఏదో ఆకాశవాణి తన్మయి మొర ఆలకించినట్లు, శేఖర్ బయటి నించి వస్తూనే "సమయానికి బానే వచ్చేరు మావయ్యా! తిరపతికి నేను రావడం పడదు కానీ, మీ అమ్మాయిని తీసుకు వెళ్లండి. మా ఇంటికి పిఠాపురం నించి సాములోరు వస్తున్నారంట. అమ్మ బాబుని చూపించాలంటూ ఫోను చేసింది." అన్నాడు.

ముందు అక్కణ్ణించి వెళ్లగలిగితే చాలన్నట్లు తన్మయి వెంటనే బట్టలు సర్దుకుంది.

ఇంటావిడ బెంగగా "త్వరగా వచ్చెయి తన్మయీ! చంటాడు అలవాటు అయిపోయాడు కదా, వీణ్ని తల్చుకుంటే నాకు బెంగొచ్చుద్ది." అంది వాడి బుగ్గలు పుణుకుతూ.

ధవళేశ్వరం మళ్లీ వెళ్లడం గురించి ఏం ఆలోచించడం లేదు తన్మయి.

తల్లిదండ్రుల తో తిరుపతి లో అడుగుపెట్టింది. ఎత్తైన శిఖరాల్ని చేరడానికి వంపుల రహదారిలో బస్సు ప్రయాణం బాబుని బెంబేలెత్తించినట్లుంది. ఒకటే పేచీ మొదలు పెట్టేడు. తీరా పైకి చేరగానే ఎక్కడా నిలవకుండా ఎటుపడితే అటు తుర్రుమని పరుగులెట్టడం మొదలు పెట్టేడు.

తన్మయి తలారా స్నానం చేసి కాటేజీ బాల్కనీ లోకి వచ్చింది.

తిరుమలలో తెల్లారి అతి మధురంగా చెట్లకీ, పుట్లకీ వ్యాపిస్తూ అన్నమయ్య కీర్తనలు వినవస్తున్నాయి.

నునువెచ్చని ఎండ సుతారంగా మేను సోకి హాయైన అనుభూతి కలిగింది.

"అబ్బ, ఎంత బావుంది తిరుమల" అంది అప్రయత్నంగా పైకి.

చిన్నప్పుడెప్పుడో వచ్చిన జ్ఞాపకం. ఆలయం మాడ వీధులకవతలగా స్వెట్టర్లు అమ్మే నేపాలీ వాళ్లు, పెద్ద పెద్ద నేతి లడ్డూలు జ్ఞాపకం తన్మయికి.

ఆ వయసులో ఇలా గొప్ప సంగీతం విన్న జ్ఞాపకం లేదెందుకో.

ఎందుకో అంతగా జనం లేరు. దర్శనం పూర్తయ్యాక, ఆలయానికెదురుగా ఉన్న వెయ్యి కాళ్ల మంటపం ముందు కూచున్నారు.

బాబు కిందికి దిగి అటూ ఇటూ అడుగులేస్తూంటే, భానుమూర్తి మనవడిని కనిపెట్టుకుని చూస్తున్నాడు.

తన్మయి తల్లి ఒళ్లో తల వాల్చింది.

తల్లి జుట్టు నిమరగానే తన్మయికి అత్యంత హాయిగా జీవితం ఇలాగే గడిస్తే బావుణ్ణనిపించింది.

"ఏం మొక్కుకున్నావమ్మా?" అంది తల్లి వైపు చూస్తూ.

"నీ కానుపు కష్టమైనప్పుడు  అనుకున్న మొక్కు ఇప్పటికి తీరింది." అంది ప్రశాంతంగా నిట్టూరుస్తూ జ్యోతి.

పరుగులెడ్తున్న చంటాడి వైపు చూస్తూ, "నీ చిన్నప్పుడు నువ్వూ అలాగే పరుగు తీసేదానివి. ఒకసారి తప్పిపోయావు కూడా. అప్పుడు అమ్మమ్మ, నేను, నాన్న గారు తలా వైపు పరుగు తీసేం. అప్పటికీ మాత్రం రద్దీ కూడా లేదు కాబట్టి, రెండు వీధులకవతల అదృష్టం కొద్దీ దొరికేవు" అంది.

నవ్వుతూ తల్లివైపు చూస్తున్న తన్మయి వైపు చూస్తూ, "ఎప్పుడూ ఇలా నవ్వుతూ ఉండమ్మా, ఏవిటో ఈ దిక్కుమాలిన పెళ్లి ఏ ముహూర్తంలో చేసుకున్నావో గానీ నీ ముఖాన దిగులు తప్ప ఏవీ చూడడం లేదు." అంది.

రాత్రి భోజనాలు చేసి మళ్లీ వచ్చి అక్కడే కూచున్నారు.

స్వామి వారి ఉయ్యాల సేవ జరుగుతూ ఉంది. అందంగా అలంకరించిన స్టేజీ మీద దీప తోరణాల మధ్య పూల ఉయ్యాలని నెమ్మదిగా ఊపుతూ ఉయ్యాల సేవ, ఆ పక్కనే మరో చిన్న స్టేజీ మీద అత్యంత శ్రావ్యంగా "జో అచ్యుతానంద..." అంటూ ఆస్థాన గాయకుల గానం.

అద్భుతమైన గానామృతం వల్లనో ఏమో అత్యంత ప్రశాంతంగా ఉన్న ఆ దృశ్యాన్ని చూస్తూ  ఉంటే అప్రయతంగా కళ్ళల్లోకి నీళ్లు వచ్చాయి తన్మయికి.

కళ్ళు మూసుకుని, "అజ్ఞాత మిత్రమా! ఈ  సృష్టిలో గొప్ప సంగీతం వల్ల జీవన సమస్యలు తీరగలిగితే ఎంత బావుణ్ను! ఈ క్షణం లో అన్నీ మటుమాయమైపోయేవి కదా!!" లోపల్లోపల అనుకుంది.

"అమ్మా, నాకు ఎమ్మే పూర్తి చెయ్యాలని ఉంది. రెండో సంవత్సరం కాలేజీ తెరిచేసేరు కూడా. ధవళేశ్వరం నాతో పాటూ వచ్చి, ఏదైనా చెప్పి నన్నూ, బాబునీ ఇంటికి తీసుకెళ్లు." అంది తల్లితో ఏడుపు తన్నుకు వస్తున్న గొంతుతో తన్మయి.

"ఇంత దానికి అలా కళ్ల నీళ్లెందుకమ్మా? వాళ్లు చెప్పిందల్లా చేస్తూనే ఉన్నాంగా. ఇంకా భయమెందుకు? నాన్నగారితో  చెప్పి మాట్లాడమని చెబుదాం." అంది జ్యోతి అనునయంగా.

మర్నాడు సాయంత్రం ధవళేశ్వరంలో దిగినా, ఆ మర్నాటికే "అమ్మాయిని, బాబుని మాతో తీసుకెళ్లి, తర్వాత పంపిస్తాం వదినా" అంది జ్యోతి.

ఏదో అనబోతున్న దేవికి అడ్డం వచ్చి, "మాకూ పిల్లని, మనవణ్ని చూసుకోవాలని ఉంటుంది కదా! నేనొచ్చి తర్వాత దిగబెడతాలే చెల్లెమ్మా!" అన్నాడు భానుమూర్తి.

తన్మయి తలదించుకుని నేలలోకి చూస్తూ నిలబడింది.

"సరే, మీ ఇష్టం" పెడసరంగా అని దేవి లోపలికి వెళ్లిపోయింది.

అనడమే తరువాయి గబగబా సర్దుకుంది తన్మయి.

దారిలోనే తల్లితో హుషారుగా చెప్పింది."అమ్మా, రేపే నేను విశాఖపట్నం బయలుదేరతాను. అక్కడ కాలేజీలో అన్ని క్లాసులూ మొదలయ్యిపోయి ఉంటాయి." అంది తన్మయి.

"వెళ్తూనే కాసిన్ని నోటు పుస్తకాలు, ఒక కొత్త పెన్ను కొనుక్కోవాలి." హుషారుగా గలగలా మాట్లాడుతున్న తన్మయి వైపు సంతోషంగా చూసింది జ్యోతి.

★★★

మర్నాడు బస్సెక్కి సాయంత్రానికల్లా విశాఖపట్నానికి చేరింది తన్మయి.

తాళం తీస్తూనే దుమ్ము పట్టిన గదీ, వసారా తనని చూసి బెంగటిల్లినట్లనిపించింది.

బాబుని వదిలి వచ్చానన్న బెంగ తప్ప, తిరిగి విశాఖపట్నానికి  వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది తన్మయికి.

తలారా స్నానం చేసి, వాకిట్లో ముగ్గేసి, తీగెలకీ, మొక్కలకీ నీళ్లు పెట్టింది.

తన చుట్టూ ఉన్న ప్రపంచమంతా తనకోసమే ఎదురు చూస్తున్నట్లు అనిపించి ప్రతీ పువ్వునీ పలకరించింది.

"ఆకులోఆకునై...పువ్వులో పువ్వునై... కొమ్మలో కొమ్మనై..." దేవుల పల్లి వారి గీతాన్ని లోపల్లోపల కూనిరాగం తీస్తూ

"మిత్రులారా! నేను తిరిగొచ్చేసేను" అంది ఆకుల్ని తడుముతూ సంతోషంగా.

★★★

మర్నాడు కాంపస్ లోకి అడుగుపెట్టగానే ఎమ్మేలో  చేరిన మొదటి రోజు కంటే అత్యధికమైన ఆనందం కలిగింది.

మొదటి క్లాసు కాగానే అనంత వెనకే వచ్చి కళ్లు మూసింది.

మెడలో కొత్త పసుపుతాడుతో, ముఖంలో వెలుగుతున్న సంతోషంతో ఉన్న అనంతని చూడగానే  ఆశ్చర్యపోయింది తన్మయి.

"సెలవులకు ముందు పెళ్లి కుదుర్చుకుంటున్నట్లు కదా చెప్పింది?" ప్రశ్నార్థకంగా చూసింది అనంత వైపు.

"అలా చూడకు తన్మయీ! ఎంగేజ్ మెంట్ కాస్తా పది రోజుల్లో పెళ్ళిగా మారింది. మన వాళ్లెవరికీ చెప్పే సమయం కూడా లేదు. రాజు వాళ్ల నాయనమ్మ చావుబతుకుల్లో ఉండి, మనవడి పెళ్ళి చూడాలని పట్టుబట్టడంతో మా ఇంట్లో వాళ్లు ఒప్పుకోక తప్పింది కాదు." అంది.

"మరి చదువులు పూర్తవకుండా, ఉద్యోగాల్లేకుండా ....." అంది తన్మయి.

"ప్రస్తుతానికి నేను రాజు హాస్టల్లోనే ఉంటున్నాను. నారు పోసిన వాడు నీరు పోయకుండా ఉంటాడా?' అంది పైకి చూస్తూ , చిన్నగా నవ్వుతూ అనంత.

"బోయ్స్ హాస్టల్లో నిన్నెలా..?"

"అవన్నీ అడక్కు. గర్ల్స్ హాస్టల్లో ఉన్నట్లు ఉండదు బాయ్స్ హాస్టలు. ఎప్పుడైనా ఎవరైనా వొచ్చి పోవచ్చు. నేను ఏకంగా ఉండిపోతున్నా. అదే తేడా. వాళ్ల రూమ్మేట్లకి లేని ఇబ్బంది నాకెందుకు?..మా సంగతి సరే, నువ్వేవిటి? కాలేజీ తెరిచి నెల్లాళ్లయినా ఎక్కడికి మాయమైపోయేవు? అమ్మగారిల్లు వొదిలి రావాలనిపించలేదా?" అంది అనంత.

తన్మయి ఏదో అనేలోగా రాజు ఎప్పటిలానే సిగ్గుగా వచ్చి అనంత పక్కన నిలబడి, తన్మయి వైపు చూసి చిన్న పలకరింపు నవ్వు నవ్వేడు.

"కంగ్రాట్స్" అంది తన్మయి ఇద్దర్నీ ఆత్మీయంగా చూస్తూ.

దివాకర్ ఆ వెనకే వచ్చి, ఏ....ఏవిటి ఇక్కడ దుకాణం పెట్టేరు, అక్కడ క్లాసు అవుతూంటే?" అన్నాడు.

తన్మయి వైపు తిరిగి "ఓహో...మొదటి ము..మూడు రా...ర్యాంకుల వాళ్ల మీటింగా ఇది?" అంటూ అక్కడి నించి వెళ్ళబోతున్నట్లు నటించేడు.

"మా ముగ్గురికీ మొదటి మూడు ర్యాంకులు వస్తే, మరి కరుణకో?" ఆలోచనలో పడింది తన్మయి.

అయినా మొదటి ర్యాంకు కరుణకి, తర్వాతి ర్యాంకులు రాజు, అనంతలకు వస్తాయని అనుకుంది కానీ అసలు రెండవ ర్యాంకు తనకు ఊహించనే లేదు తన్మయి.

తన్మయి కళ్లు వెనక ఎవరి కోసమో వెతుకున్నట్లుండడం గమనించి, "క..కరుణ కోసమేనా చూస్తున్నారు?" అన్నాడు దివాకర్.

తన్మయి సమాధానంగా ఇంకా అటే చూస్తుండగా "నా ...నాలుగవ ర్యాంకు వచ్చిందని బాధకో, మరేమో గానీ కాలేజీ తెరించిందగ్గర్నించీ మా ఎ ...ఎవ్వరితో స...సరిగా మాట్లాడడమే లేదు క..కరుణ. ప...పైగా ఇప్పుడు స..సెకండ్ ఇయర్ లో మ్ ..మనం ఆ..ఆప్షనల్ క్లాసులు తీసుకుంటున్నాం కదా. ఎ...ఎవరి క్లాసు వాళ్లదే అయిపోయింది. కరుణ పూర్తిగా క...కఠినమైన క్లాసులు తీసుకున్నాడు. ఇంతకీ మి...మీరేం క్లాసులు ఎ...ఎంచుకున్నారు?" అన్నాడు.

"ఏం క్లాసులు తీసుకోవాలో మీరే చెప్పాలి నాకు. నేనా విషయం ఇప్పటివరకు ఆలోచించనేలేదు." అంది సాలోచనగా తన్మయి.

"మేమిద్దరం తీసుకున్నవే తీసుకో తన్మయీ, నువ్వు క్లాసులకు రాలేకపోతే మేం సాయం చేస్తాం, నీ అందమైన చేతి రాతతో మాకు నోట్సులు చదువుకునే అదృష్టమూ కలుగుతుంది " అంది అనంత రాజు వైపు చూస్తూ.

"అదుగో వొ..వొస్తున్నాడు మ్మ...మహానుభావుడు" అన్నాడు దివాకర్ తమవైపే వస్తున్న కరుణ వైపు చూస్తూ.

వాడిపోయిన ముఖంతో, మాసిన గెడ్డంతో గుర్తుపట్టలేకుండా ఉన్న కరుణని చూసి ఆశ్చర్యపోయింది తన్మయి.

అతను తన్మయి వైపు సూటిగా చూడలేనట్లు కళ్లు దించుకుని "ఎప్పుడు వచ్చేరు?" అన్నాడు చిన్న గొంతుతో.

"మీరు ఏ క్లాసులు తీసుకున్నారు?" అంది తన్మయి.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా "మనందరినీ డిపార్ట్మెంటు హెడ్డు పిలుస్తున్నారు." అన్నాడు.

మొదటి సంవత్సరం పరీక్షల సమయంలో ఆయన అన్న మాటలు గుర్తొచ్చి తన్మయికి "మళ్లీ ఏం ములిగిందో"నని భయం వేసింది.

అనంత తన్మయి భుజమ్మీద చెయ్యి వేసి, "భయం లేదులే, నీకు చెప్పేనుగా, ఆయన స్వతహాగా మంచి వారే. బహుశా: నువ్వు సెకండ్ ఇయర్లో కనిపించడంలేదని పిలుస్తున్నట్లున్నారు. నేనూ వస్తాను పద" అంది.

కరుణ అనంత వైపు చూస్తూ, "మనందర్నీ రమ్మన్నారు ఎందుకో" అన్నాడు తన్మయి వైపు సాధ్యమైనంత వరకూ చూడకుండా ఉండడానికి ప్రయత్నిస్తూ.

తన్మయికి అతనెందుకు అలా ప్రవర్తిస్తూన్నాడో అర్థం కాలేదు.

డిపార్టు మెంటు హెడ్డు గారి గది ప్రాంగణంలోకి అడుగుపెడ్తూనే లోపలి నించి పిలుపొచ్చింది అందరికీ.

కుర్చీలో గంభీరంగా కూచుని ఉన్న హెడ్డు చిదంబరంగారిని చూడగానే తన్మయికి భయం పుట్టుకు వచ్చింది.

అందర్నీ ఎంతో మర్యాదగా "రండి, కూర్చోండి" అని కుర్చీలు చూపించారాయన.

తన్మయి ఆశ్చర్యపో యింది. "స్టూ డెంట్స్ కి ఇంత మర్యాద ఇస్తారా ఈయన?"

ఇంకా అంతా నిలబడే ఉండడం చూసి నవ్వుతూ, "నన్ను చూసి మీరంతా భయపడడం సహజం. మిమ్మల్ని భయపడొద్దని చెప్పడానికే పిలిచాను. అంతేకాదు, మన డిపార్టుమెంటులోనూ, అన్ని అనుబంధ పీజీ కాలేజీలలోనూ మీరు నలుగురూ మొదటి నాలుగు ర్యాంకుల్లోనూ నిల్చారు. ముందుగా మీ అందరికీ కంగ్రాట్స్" అన్నారు.

అప్పటి వరకూ తన్మయికి ర్యాంకింగు అంటే కేవలం యూనివర్శిటీ క్యాంపస్ కు మాత్రమే అని తెలుసు. అన్ని క్యాంపస్ లకు అని తెలిసేక కించిత్ గర్వంగా అనిపించింది.

"మొదటి సంవత్సరంలో తక్కువ ర్యాంకు వచ్చిన వారు అధైర్య పడకండి. రెండో సంవత్సరం చివర్న కన్సాలిడేటెడ్ ర్యాంకు తీస్తాం కాబట్టి ఇప్పుడు తక్కువ ర్యాంకు వచ్చిన వారు, రెండో సంవత్సరంలో ఎక్కువ మార్కులు తెచ్చుకుంటే ముందుకు వెళ్ళగలువుతారు." అన్నారు ప్రత్యేకించి కరుణ వైపు చూస్తూ.

"కరుణ టాలెంట్ కి విద్యార్థులే కాదు, హెడ్డు కూడా ముగ్ధులయ్యారన్న మాట" తనలో తాను అనుకుంటూ కరుణ వైపు చూసింది తన్మయి.

అతనింకా కళ్ళు దించుకునే ఉన్నాడు.

"చాలా థాంక్స్ మాస్టారూ" అన్నారు అంతా.

"నాకు మీలా శ్రద్ధగా చదివే వాళ్లని ఎంకరేజ్ చెయ్యడం ఇష్టం. రెండో సంవత్సరం పరీక్షలు కాగానే జరిగే జే.ఆర్.ఎఫ్ కు ఎవరైనా చదవదల్చుకుంటే నన్ను సంప్రదించండి. అన్నారు హెడ్డు.

కరుణ అందుకుని నెమ్మదిగా, "మాస్టారూ, గత పదమూడేళ్లుగా మన డిపార్టుమెంటు నించి ఎవరూ ఫెలోషిప్ కు సెలక్టు కావడం లేదు. మేం సాధించగలమంటారా?" అన్నాడు.

"ఎందుకు సాధించలేరయ్యా? మీరు యువకులు. తల్చుకుంటే ఏదైనా సాధించే శక్తి మీకుందని నమ్మితే చాలు." అని తన్మయి వైపు చూస్తూ "రెండో ర్యాంకు తెచ్చుకున్న అమ్మాయివి క్లాసులకు ఎందుకు రాలేకపోయావమ్మా?" అన్నారు.

తన్మయి తప్పు చేసినట్లు తల దించుకుంది.

అనంత వెంటనే కల్పించుకుని,"మీతో ఆ విషయం మాట్లాడాలి మాస్టారూ" అంటూ మిగతా వాళ్ల వైపు చూసింది.

అందరూ లేచేరు.

మిగతా అంతా వెళ్ళేక "చెప్పండి" అన్నారు హెడ్డు.

అనంత చెప్పిన తన్మయి కథ విని, ఒక్క క్షణం మౌనం తరవాత, "అయ్యో ఈ విషయం ఎప్పుడూ చెప్పలేదేవిటమ్మా, ముందుగా నువ్వు నన్ను క్షమించాలి. నీ పరిస్థితి అర్థం చేసుకోకుండా నిన్ను పరీక్షల్లో మనసు బాధించే మాటలన్నందుకు." అన్నారు.

"అయ్యో, ఫర్వాలేదు మాస్టారూ" అంది తన్మయి మెల్లగా.

"తన్మయి ఎన్ని అడ్డంకులెదురవుతున్నా ఎలా చదవగలుతూందో నాకు అర్థం కాదు మాస్టారూ. తన స్థానంలో నేనుంటే నాకు అసలు తనలా ర్యాంకు తెచ్చుకోవడం అసాధ్యం" అంది అనంత.

"ఎలాగైనా బాగా చదువుకోవాలనే నీ పట్టుదల, దీక్ష నిన్ను తప్పకుండా ఉన్నత స్థితికి తీసుకు వస్తాయి.అధైర్య పడకు తన్మయీ." అన్నారు హెడ్డు అనునయంగా.

"మాస్టారూ, అసలు తెలుగుకి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయంటారా?" అంది తన్మయి సందేహంగా.

"తెలుగు చదువుకుంటే ఉద్యోగ అవకాశాలు ఉంటాయా, ఉండవా అనే సందేహం మొదట మనసులోకి రానివ్వకండి. చిన్న చిన్న టీచర్ ఉద్యోగాల నించి, నేను చెప్పినట్లు జే ఆర్ ఎఫ్, గ్రూప్-1, సివిల్ సర్వీసెస్ మొదలైన ఎన్నో గొప్ప అవకాశాలలో తెలుగు ఆప్షనల్ గా తీసుకున్నవాళ్లు మంచి మార్కులు సాధించే అవకాశం ఉంది. మీకు కావల్సిందల్లా మనసులో సాధించగలమన్న నమ్మకం, కష్టపడే తత్త్వం." అన్నారు స్థిరంగా.

ఆ మాటలకు తన్మయికి గొప్ప ధైర్యం వచ్చింది. కృతజ్ఞతా పూర్వకంగా చూసింది ఆయన వైపు.

భుజం చుట్టూ చెంగు కప్పుకున్న తన్మయి వైపు చూస్తూ "మీ లాంటి మంచి అమ్మాయిలు ఎక్కడ దొరుకుతారమ్మా ఈ కాలపు అబ్బాయిలకి?" అని నిట్టూర్చి, "ఇలా చూడమ్మా, ఇక మీదట నన్ను మీ నాన్నగారి తో సమానంగా అనుకో. నీకు మన యూనివర్శిటీలో ఏ విషయానికి సాయం కావాలన్నా నన్ను అడగొచ్చు. ఇక మీదట నీ దృష్టి అంతా జే ఆర్ ఎఫ్ సాధించడం మీదే ఉండాలి. ఎమ్మే కాగానే అది సాధించగలిగితే అయిదు సంవత్సరాల పాటు నీకు సెంట్రల్ గవర్నమెంటు స్కాలర్ షిప్పుతో పీ ఎచ్ డీ చేసే అవకాశం వస్తుంది. నీలాంటి వారు ఉన్నత స్థితికి వస్తే నీలా కష్టపడుతున్న ఎందరికో నువ్వు ఆదర్శ ప్రాయం అవుతావు" అన్నారు.

అయన మాటలకే సగం లక్ష్యం సాధించిన బలం కలిగింది తన్మయికి. రెండు చేతులూ జోడించి మనస్ఫూర్తిగా నమస్కరించింది సెలవు తీసుకునేటప్పుడు.

బయటికి రాగానే "జె ఆర్ ఎఫ్...ఈ "జూనియర్ రిసెర్చి ఫెలోషిప్ " అంటే ఏవిటో ఇప్పటి వరకూ వినసే లేదు నేను అంది సాలోచనగా తన్మయి అనంత తో.

"అది ఆయన చెప్పినంత సులభం కాదు తన్మయీ, ఏటా అన్ని డిపార్టుమెంట్ల నించీ ఎందరో మొదట దాని కోసమే ప్రయత్నం చేస్తుంటారు. పైగా ఆ పరీక్షలో మన తెలుగు డిపార్టుమెంటు వాళ్లు విజయం సాధించలేకపోవడానికి ప్రధాన కారణం పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల్లో లాగా ఈ పరీక్ష లోనూ ఇంగ్లీషు, మాథ్స్ పేపర్లు కూడా ఉంటాయి. అంతే కాదు. అవి రెండూ పాసయ్యితేనే మూడవ పేపరైన తెలుగుని దిద్దుతారు. ఇక నాలుగవ పేపరు వ్యాస రూప పరీక్ష. అత్యంత కఠినంగా ఉండే ఈ పేపర్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి మాత్రమే ఫెలోషిప్ వచ్చే అవకాశం ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలలోనూ అత్యధిక మార్కులు వచ్చిన వారు కూడా ఈ పరీక్షలో విజయం సాధించలేక పోతున్నారు. రాజు ఈ వివరాలన్నీ ఇప్పటికే సేకరించేడు. కానీ నాకే నమ్మకం లేదు" అంది నిరాశగా అనంత.

బస్సు దిగి ఇంటి వైపు అడుగులేస్తున్నా ఇంకా మాస్టారి మాటలు, అనంత మాటలు వదలడం లేదు తన్మయికి.

"ఇంగ్లీషు, మాథ్సు అసలు ప్రాబ్లమే కాదు తనకి. ఎప్పుడూ ఫుల్ మార్కులే ఆ సబ్జెక్టుల్లో. ఇక తెలుగులో ఇంకా తను ఎన్నో చదవాల్సి ఉంది. పట్టు సాధించాల్సిన కోణాలెన్నో ఉన్నాయి. అయినా.. పట్టుదలగా జె ఆర్ ఎఫ్ కోసం ప్రయత్నం మొదలు పెట్టాలి..." తనలో తను ఆలోచించుకుంటూ, తల దించుకుని నడుస్తున్న తన్మయిని ఎవరో పిలిచినట్లయ్యి వెనక్కి చూసింది.

దూరంగా కరుణ తన్మయి వైపే వస్తూ కనిపించాడు.

దగ్గరకు రాగానే అతని చెమర్చిన కళ్లని చూస్తూ "ఏమైంది కరుణా? ఏవిటీ అవతారం?" అంది తన్మయి అతని గెడ్డాన్నీ, లోతుకు పోయిన కళ్లనీ చూస్తూ.

అతనేదో చెప్పేలోగా "ముందు నన్ను థాంక్స్ చెప్పనివ్వండి కార్డు రాసినందుకు. మీకు నాలుగవ ర్యాంకు వచ్చిందని ఇంతలా కుమిలి పోతే ఎలా?" అంది తన్మయి.

"అందరిలాగే మీకూ అంతే అర్థమైందన్న మాట" అన్నాడు ఉక్రోషంగా ముక్కుపుటాలు ఎగరేస్తూ కరుణ.

25

"ఇలా గెడ్డం పెంచుకుని తిరుగుతూంటే ఏమనుకోవాలి?" అంది తన్మయి పక్కనే నడుస్తున్న కరుణతో చిన్నగా నవ్వుతూ.

"మయీ! మీతో ఎన్నో మాట్లాడాలి. ఎంతో చెప్పాలి. అసలు..అసలు ఎక్కడికి వెళ్లిపోయారు మీరు ఇన్నినాళ్లు?!" అన్నాడు ముక్కుపుటాలు ఎగరేస్తూ నిష్టూరంగా.

తన్మయికి చప్పున నోటి చివరి వరకూ "శేఖర్ ...." అని వచ్చింది కానీ తమాయించుకుంది. తన బతుకేవిటో తనకే తెలీని పరిస్థితి. ఇంక అతనికి ఏవని చెప్తుంది?

"మీరేం ఆలోచిస్తున్నారో తెలుసు నాకు. నేనెక్కడికెళ్తే ఇతనికేవిటనేగా. అసలే మా అమ్మకి ఒంట్లో బావుండడం లేదు. అది చాలక సెలవుల్లో నా పార్ట్ టైం ఉద్యోగమూ ఊడింది. ఇక రిజల్టు సరేసరి నాలుగవ ర్యాంకు. అసలు నాలుగవ ర్యాంకు వచ్చినందుకు కాదు, నా బాధ. మొదటి మూడు ర్యాంకుల్లో వస్తేనే మెరిట్ స్కాలర్ షిప్పు వస్తుంది. ఆ ఆశ కూడా పోయింది. మీరు కూడా సెలవులకి వెళ్ళిపోయి ఎంతకీ తిరిగి రాలేదు. ఇక నేను ఇలా కాకుండా ఎలా ఉంటాను చెప్పండి?" అన్నాడు కరుణ కళ్లలో నీటి పొర మెదులుతూండగా.

"అయ్యో! మీ మనసు నొప్పించాలని కాదు రుణా! నా సమస్యలు నాకు ఉన్నాయి. అని గేటు తీస్తూ, "రండి, కొంచెం టీ తాగి వెళ్దురుగాని." అంది తన్మయి.

నిశ్శబ్దంగా అనుసరించాడు కరుణ ఓపిక లేనట్లు.

"కాస్త ముఖం కడుక్కుంటారా?" అంది అతని వాడిపోయిన ముఖాన్ని చూస్తూ.

మొదటి సారి ఇంటి లోపలికి అడుగు పెట్టేడు కరుణ.

పుస్తకాల గూడులో అందంగా సర్ది ఉన్న పుస్తకాలదగ్గిర ఒక్క క్షణం ఆగి "అమృతం కురిసిన రాత్రి" పుస్తకాన్ని చేతులోకి తీసుకుని, పేజీలు తిప్పకుండానే అంత నీరసంలోనూ ధారాళంగా

"గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ
జాజిపువ్వుల అత్తరు దీపాలూ
మంత్ర లోకపు మణి స్తంభాలూ
నా కవితా చందనశాలా సుందర చిత్ర విచిత్రాలు
అగాధ బాధా పాథః పతంగాలూ
ధర్మవీరుల కృత రక్తనాళాలూ
త్యాగశక్తి ప్రేమరక్తి శాంతిసూక్తి
నా కళా కరవాల ధగద్ధగ రవాలు
నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయఐరావతాలు"

.....కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటం ధరించిన తిలక్ మీకూ ఇష్టమన్న మాట" అన్నాడు.

తన్మయి విస్మయంగా చూసింది అతని వైపు. "ఇతనికి రానిదేదయినా ఉందా!!"

ఆ పక్కనే ఉన్న మిగతా పుస్తకాల్ని చూస్తూ, "మా కరుణశ్రీ గారేరీ?" అంటూ ఆయన పద్యాలు రెండు గొంతెత్తి పాడుతూ ముఖం తుడుచుకుంటున్న అతన్ని ఆసక్తిగా చూస్తూ టీ పెట్టి తీసుకు వచ్చింది తన్మయి.

వరండాలో చాప మీద పరిచి ఉన్న క్లాసు పుస్తకాల పేజీలు తిప్పుతూ "మయీ! ఒక్కటడుగుతాను చెప్తారా?!" అన్నాడు.

"చదవాలని మీకు ఇంత పట్టుదల ఎందుకు? చంటి పిల్లాడితో ఇంత కష్టపడి......" అంటూన్న అతని మాటల్ని దాట వేస్తూ

"మీ అమ్మగారికి ఏమైంది? మీరిప్పుడు తిన్నగా ఇంటికే వెళ్తున్నారుగా, నేనూ వొస్తాను పదండి మీ అమ్మగారిని చూడడానికి" అంది లేస్తూ.

తాళం వేసి బయటకు వస్తుండగా ఇంటిగలాయన లోపలికి వస్తూ "శేఖర్ ని నాతో ఒకసారి మాట్లాడమని చెప్తారా?" అన్నాడు పక్కనే ఉన్న కరుణ వైపు పరీక్షగా చూస్తూ.

తన్మయి తల ఊపి, గేటు దాటి వస్తూనే భుజం చుట్టూ కొంగు కప్పుకుంది.

"మా ఇల్లు మీలాంటి వారు చూడదగ్గ ఇంద్రభవనమేమీ కాదు." అన్నాడు కరుణ సంశయిస్తూ.

"మీ ఇంటిని కాదు, మీ అమ్మగారిని చూడడానికి వస్తున్నాను." అంది వొత్తి పలుకుతూ.

ఇంటి నుంచి రెండు మూడు మలుపులు తిరిగి రోడ్డు చివరి వరకూ నడిచి బస్టాండుకి చేరుకునే లోగా తమని దాటుకుంటూ వెళ్తున్న స్కూటరు మీద శేఖర్ పిన్ని, బాబాయిల్ని గమనించింది తన్మయి. తనని చూసి కూడా ఆవిడ ఎందుకు ఆగి పలకరించలేదో అర్థం కాలేదు తన్మయికి. బహుశా: చూడలేదేమో, అని సర్దిపుచ్చుకుంది.

రెండు బస్సులు మారి దాదాపు గంటన్నర తర్వాత దిగి నడక మొదలు పెట్టేరు.

"ఇంత దూరమా మీ ఇల్లు?!" అంది ఆశ్చర్యంగా తన్మయి.

"అప్పుడే వచ్చేసేమనుకుంటున్నారా?" అన్నాడు ఎదురుగా కొండ వైపు నడుస్తూ.

పైకి వెడల్పు మెట్లు, అటు ఇటూ చిన్ని చిన్ని ఇళ్లు ఉన్న చిన్న కొండ అది. ఆయాసం వస్తున్నా ఆగకుండా ఎక్కసాగింది తన్మయి. కరుణ అలవాటుగా చకచకా మెట్లు ఎక్కసాగేడు.

వెనకే ఒక మెట్టు కింద ఎక్కుతున్న తన్మయి వైపు చూస్తూ "మీ చీర కాళ్లలో పడ్తూంది జాగ్రత్త" అన్నాడు.

దాదాపు పై వరకూ ఎక్కేక, మెట్ల పక్కనే ఉన్న చిన్న రహదారి బాట పట్టేరు. కొండకి దాదాపు మరో పక్కకి ఉంది ఆ ఇల్లు. అది ఇల్లు కాదు, చిన్న గుడిసె.

"మాలాంటి పేదలకి గవర్నమెంటు ఇచ్చిన స్థలం ఇది. మా అమ్మ, నేను ఇక్కడే మా తాతగారితో బాటూ ఉంటాం." అన్నాడు కరుణ పరిశీలనగా చూస్తున్న తన్మయితో.

చిన్న తడికె తలుపు, లోపలికి అడుగు పెట్టగానే ఒకే ఒక్క గది ఉన్న చుట్టు గుడిసె అది. ఇంత వరకూ తన జీవితంలో ఇంత పేదరికపు ఇంటిని చూడలేదు తన్మయి. ఏవో రేకు పెట్టెలు, కాసిన్ని వంట సామగ్రి. చూరుకు వేళ్లాడుతున్న పాత కిరసనాయిలు దీపం. తన్మయికి ఆశ్చర్యం వేసింది.

ఇటువంటి ఇంట్లో నుంచి ఇంతటి పాండిత్యం ఉద్భవించిందా? కరుణ వైపు ప్రశంసా పూర్వకంగా చూసింది. ఒక వారగా నులక మంచంమీద పడుకుని ఉంది కరుణ తల్లి.

తమని చూసి మెల్లగా లేవబోయింది, కరుణ చప్పున దగ్గరకు వెళ్లి "పర్లేదు పడుకోమ్మా.. తన్మయి" అన్నాడు.

సరైన పోషణ లేక బాగా చిక్కిపోయిన శరీరం, ఒక కాలు మాత్రం కదల్లేని స్థితిలో ఉంది. బాగా లావుగా వాచి, బోదకాలు అని స్పష్టంగా తెలుస్తూంది.

"నువ్వేనామ్మా తన్మయివి, మా వాడు అస్తమాటు చెప్తూ ఉంటాడు" అంది తన్మయిని పరీక్షగా చూస్తూ.

తన్మయి ఆవిడకు ఎదురుగా నేల మీద పరిచిన చింకి చాప మీద కింద కూచుంది. నిలువుగా నామం పెట్టుకుని, మెడలో ఎప్పటివో రంగుపోయినట్లున్న కాషాయ పూసల మాలతో సన్యాసినిలా ఉంది ఆవిడ.

కరుణ వైపు చూస్తూ, "ఏం నాన్నా అన్నం తింటారా?" అంది హీనమైన స్వరంతో.

"మేం పెట్టుకుంటాంలే" అన్నాడు.

"పొద్దుట్నించీ ఏం తిన్నావో ఏమో" అంటూ

"నిద్రలేచి, టీ తాగి వెళ్తాడమ్మా. రాత్రి పూట ఒక్కటే భోజనం. మా నాన్ననీ, నన్నూ కనిపెట్టుకుని చూస్తాడు, కానీ వాడి గురించి పట్టించుకోడు" అంది తన్మయితో ఆవిడ మరింత హీన స్వరంతో.

"తాతయ్య ఏడి?" అన్నాడు.

"ప్రసాదం కోసం కిందికి మార్కెట్టు లో గుడి వరకూ వెళ్లొస్తానని వెళ్లేడు" అని, "ఏవీ అనుకోకమ్మా, బాగా నీరసంగా ఉంది" అంది అటు తిరిగి పడుకుంటూ.

"కాస్త ఏవైనా తింటారా?" అన్నాడు కరుణ. మొహమాటంగా తల అడ్డంగా ఊపింది తన్మయి.

చిన్న ఉండలాంటి అన్నం, కాసిన్ని పొట్లకాయ వేపుడు ముక్కలు, ఒక పచ్చి ఒడియం తెచ్చుకుని కలుపుకుని తినసాగేడు కరుణ.

అతనేమైనా అనుకుంటాడని, ఒక ఒడియం అడిగి చేతులోకి తీసుకుంది. అతనింకా తింటూ ఉండగానే "వెనక్కి వెళ్ళొస్తాను " అని తడిక తీసుకుని ఇంటి పెరట్లోకి వచ్చింది.

"వెళ్ళండి గానీ, మా అమ్మ మడి చీరకి తగలకండి, నన్ను కూడా ముట్టుకోనివ్వదు" అని నవ్వేడు కరుణ.

చిన్న దడి. దాని మీద ఆరవేసిన చిరుగుల చీర ముక్క. "ఇదేనా ఎవరూ ముట్టకూడని మడి చీర!" మనసులో అనిపించినా, వాళ్ళ నమ్మకాల మీద గౌరవంతో దూరంగా జరిగి దడికి మరోవైపు రెండడుగులు వేసింది. దడికి చుట్టుకుని దాదాపు ఎండిపోయిన స్థితిలో పొట్ల పాదు, పాదుకి వేళ్లాడుతూ చిన్న పిందెలు ఒకటో రెండో ఉన్నాయి. ఆ పైన సన్నని గడ్డి కొండ. కొండకి అటు వైపు ఏవుందో తెలీదు. గట్టిగా వాన కురిస్తే కూడా ఉండడం కష్టమన్నట్లు ఉంది ఆ ఇల్లు. తన్మయి లోపలికి వచ్చేసరికి కరుణ చేతులు కడుక్కునేందుకు పెరట్లోకి వెళ్లేడు.

వెనక్కి తిరిగే మరింత హీనమైన స్వరంతో "ఏవీ అనుకోకమ్మా, నాకు వొంట్లో బావుండదు. అడగడం మర్చిపోయేను, మీ ఇంటి పేరేంటి?" అంది. ఆ స్వరంలో తన పుట్టుపూర్వోత్తరాలు, తమ కులంతో సంబంధం తెలుసుకోవాలన్న ఆత్రం వినిపించింది తన్మయికి.

అయినా చెప్పి "మేం మీ వాళ్లం కాదండి" అంది తన్మయి.

"ఊరికే అడిగేనులే, మా వాడు చెప్పేడు. చంటి పిల్లాణ్ణి పెట్టుకుని కష్టపడి చదువుకుంటున్నావని." అంది మాట మారుస్తూ.

"అవునండి, బాబుతో కొంచెం కష్టమే అయినా, ఎమ్మే పీఎచ్ డీ చెయ్యాలన్నది నా ఆశయమండి" అంది దృఢంగా తన్మయి. బాబుని తల్చుకోగానే వెంటనే చూడాలని అనిపించి బెంగ మొదలయింది.

"మంచిదమ్మా, ఆ చేత్తో మా వాడిని కూడా కాస్త కనిపెట్టు. రాత్రింబగళ్లు కష్టపడతాడు. కానీ ఏవిటో నా దురదృష్టం వాడిని కూడా పట్టుకుని పీడిస్తూంది" అంది మూలుగుతూ.

అప్పుడే లోపలికి వచ్చిన కరుణ, "మొదలుపెట్టేవా నీ బాధాయణం! కాస్సేపు నిద్రపోవచ్చు కదా." అన్నాడు.

వెనక్కి తిరిగి వస్తూ బస్టాండు వరకూ వచ్చిన కరుణతో. "మనం ఎలాగైనా జే ఆర్ ఎఫ్ సాధించాలి కరుణా!" అంది పట్టుదలగా.

ఇంటికి తిరిగి వస్తున్నంత సేపు అంత కఠిన పేదరికపు పరిస్థితుల్లో నిలదొక్కుకుని అతను చదువుని కొనసాగించడం తల్చుకుని తనూ ధైర్యం తెచ్చుకుంది. కరుణ తల్లి అతని మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంది పాపం. అయినా ఏ తల్లికి ఉండదు పిల్లలు వృద్ధిలోకి రావాలని!

వస్తూనే వీధి చివర ఆగి ఇంటికి ఫోను చేసింది. బాబు స్వరం వినేసరికి వెంటనే వెళ్లిపోవాలనిపించింది.

రెండ్రోజుల్లో రెండవ శనివారం, ఆదివారం వస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం వెళ్లిపోతే మళ్ళీ ఆదివారం మధ్యాహ్నం బయలుదేరి రావొచ్చు. అనుకుంది.

---------

మర్నాడు కేంటీన్ బయట చెట్టు కింద కలిసేరందరూ.

తన్మయి గొంతు సవరించుకుని, రేపట్నించి జే ఆర్ ఎఫ్ కి ప్రిపరేషన్ మొదలుపెడదామనుకుంటున్నాను. మనందరికీ తెలిసిందే. అదెంత కష్టమో. కానీ అసాధ్యం కాదని నా ఉద్దేశ్యం" అంది.

రాజు వెంటనే అందుకుని “నేనూ, అనంతా మీతో కలుస్తున్నాం.” అన్నాడు.

దివాకర్ కరుణ వైపు చూస్తూ, "నేను పా... పాత క్వ...శ్చన్ పే..పర్లు మా నాన్న గారి సహాయంతో స..సంపాదించగలను." అన్నాడు.

కరుణ తనలో తాను అనుకుంటున్నట్టు “మీ అందరికీ జే. ఆర్ ఎఫ్ ఒక లక్ష్యం మాత్రమే. నాకు జీవన్మరణ సమస్య. చావో, రేవో తేల్చుకోవాల్సిందే" అన్నాడు ఆవేశంగా.

"మరింకేం!", అంటూ తెల్ల కాగితం తీసింది తన్మయి. ప్లాను అందులో గీస్తూ, "మనకి ఫైనల్ పరీక్షల తర్వాత సరిగ్గా ఆరునెలల్లో జే ఆర్ ఎఫ్ ఉంటుంది. ముందుగా అసలు పరీక్షలో ఏ విభాలున్నాయో పట్టిక తయారు చేద్దాం. తర్వాత ప్రతీ విభాగానికీ చదవాల్సిన పుస్తకాల, సేకరించాల్సిన వివరాల పట్టిక, అన్నీ పోగుచేసేక నోట్సు తయారు చేయడం... ఇవన్నీ చాలా పెద్ద పనులు కాబట్టి, విభాగాలుగా పంచుకుంటే త్వరగా చెయ్యగలుగుతాం." అంది తన్మయి.

కరుణ అడ్డు వస్తూ , "కానీ ఇక్కడొక విషయం మనం గుర్తు పెట్టుకోవాలి. మనం అందరం అన్నీ చదవాల్సిందే. మనకు పరీక్ష లో బిట్టు పేపరుతో బాటూ వ్యాసరూప పరీక్ష కూడా ఉందన్న విషయం మనం మర్చిపోకూడదు. అందులో పట్టు సాధించాలంటే తప్పనిసరిగా సబ్జెక్టు మీద మంచి అవగాహన ఉండి తీరాలి. మీ అందరకూ సంస్కృతం, ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్ర, వ్యాకరణం నేను చెప్తాను." అన్నాడు కరుణ.

అనంత, రాజు "మేం ఆధునిక సాహిత్యం, ఆప్షనల్ సబ్జెక్ట్ ల నోట్సులు తయారు చేస్తాం" అన్నారు.

"ఇంగ్లీషు, లెక్కలు, భాషాశాస్త్రం నాకు వదిలెయ్యండి." అని దివాకర్ వైపు చూసింది తన్మయి.

"మీ..మీరందరిలా నోట్సులు త..తయారు చెయ్యడం నా వల్ల కాదు, బైటి నించి పుస్తకాలు, మె..మెటీరియల్సూ సేకరణ మా..త్రమే న్నా...పని" అన్నాడు నవ్వుతూ దివాకర్.

అనుకున్న ప్రతీ పనికీ పక్కనే కాల నిర్ణయ పట్టికను, ఎవరు ఏం చేస్తారో పేర్లనూ రాసింది తన్మయి.

ఒక్కొక్కటిగా పైకి చదువుతూ......ప్రతి నెలా తయారు చేసిన నోట్సులు అందరి దగ్గిరా తలా ఒక కాపీ ఉండడానికి గాను జెరాక్సులు తీసుకుందాం. కుదరకపోతే నోట్సుల్ని ఎక్స్ఛేంజీ చేసుకుందాం. ఇందులో చివరి మూడు నెలలూ పునశ్చరణ కి కేటాయిద్దాం. చివరి నాలుగు వారాల్లో పరీక్షకు ఎంత సమయంలో ఏ ప్రశ్న దగ్గిర ఆగాలో వ్రాత సాధన చేద్దాం" అంది ఉత్సాహంగా తన్మయి.

"ప్రతీ పనీ సమయానికి పూర్తి చేస్తున్నామో, లేదో అన్న విషయం ప్రతీ వారం ఇక్కడ ఒక గంట కలుసుకుని చర్చిస్తే బావుంటుంది." అన్నాడు కరుణ.

చెట్ల కొమ్మల చాటు నించి చుర్రున తగులుతున్న ఎండ వైపు చూస్తూ "ఇక్కడా?" అన్నాడు దివాకర్.

"ఇక్కడ కాకపోతే సముద్ర తీరాన" అంది అనంత నవ్వుతూ.

"మనకి చోటు అంత ముఖ్యం కాదు. కలవడం ముఖ్యం. వీలైతే ప్రతీ రోజూ కలుద్దాం." అన్నాడు సీరియస్ గా రాజు.

"రోజూ ఒక చోట అనుకుందాం. క్లాసుల తర్వాత తిన్నగా అక్కడ కలుద్దాం. ఒకటి లైబ్రరీ, రెండు డిపార్టుమెంట్ బయటి బెంచీ, క్యాంటీను బయటి చెట్టు....అని అనంత లెక్కబెడ్తుండగా" "మా ఇంటి వరండా కూడా చేర్చు" అంది తన్మయి.

"ఫర్వాలేదా?"అన్నట్లు చూస్తున్న అనంత వైపు అభయమిస్తున్నట్లు చూసింది తన్మయి.

అంతా లేచి హుషారుగా ముందుకు కదిలేరు.

నోట్సుల మీద పేర్ల పక్కనే "JRF" అని రాసుకోవాలి అంది తన్మయి నవ్వుతూ .

"ఎ..ఎందుకు? అది కూడా పరీక్ష లో భాగమా ఏంటి?" అన్నాడు దివాకర్ అమాయకంగా.

అంతా గట్టిగా నవ్వేరు.

తన్మయి బస్సెక్కడానికి ఉద్యుక్తమవుతూండగా అనంత వెనకే వచ్చి, తనూ అదే బస్సెక్కింది.

ప్రశ్నార్థకంగా చూస్తున్న తన్మయి తో "మీ ఇంటికి రెండు స్టాపుల అవతల రాజు చిన్న బాబాయి గారింట్లో పనుంది" అంది అనంత.

"శేఖర్ లేడు, టీ తాగి వెళ్దువు రా" అంది తన్మయి.

ఇంటి ముంగిట్లో విరబూసిన సన్నజాజి పూల తీగె వైపు నడిచి, ఆత్రంగా మొగ్గల్ని కర్చీఫ్ లోకి కోస్తూ, "అబ్బ, ఇంటి చుట్టూ పూలమొక్కలుంటే ఆ అందమే వేరు కదూ" అంది అనంత.

పూలంటే పిచ్చి అనంతకి. చెట్లకి పూలు కనిపిస్తే చాలు, జడలో తురుముకునే వరకూ చేతులాగవు. రోజూ నందివర్ధనమో, గన్నేరు పువ్వో.. ఏవి కనబడ్డా తలలో తురుముకుని కనిపిస్తుంది. మాల కట్టడానికి దారం తెచ్చి ఇచ్చి, టీ పట్టుకు వచ్చింది తన్మయి.

అనంత తటపటాయిస్తూ, "ఎప్పుడు వస్తాడు మీ ఆయన?" అంది.

నెల్లూరు సంగతి విని ఎగిరి గంతేసింది.

"మంచి వార్త చెప్పేవు తన్మయీ! మీ ఆయన ఇక్కడకు రాకపోతే, నాకు నీతో బాటూ ఇక్కడే ఉండిపోవాలని ఉంది. అసలు రోజూ మీ ఇంట్లోనే కలుద్దాం కాలేజీ అయిపోయేక" అంది అనంత.

"నాకు అభ్యంతరం ఏవీ లేదు" అంది నవ్వుతూ తన్మయి.

ఇల్లు తాళం పెట్టి , "అలా బస్టాండు వరకూ వస్తా పద." అంది తన్మయి.

"పెళ్లి కాక ముందు బండి మీద హాయిగా తిరిగాను. ఇప్పుడు బస్సుల్లో తిరగాల్సి వస్తూ ఉంది" అని నిట్టూర్చి "పెళ్ళయ్యాక నాన్న గారి మీద ఆధారపడడం ఇష్టం లేదు తన్మయీ, అలాగని బండికి రోజూ ఆయిలు పోయించే స్థోమత లేదు, అందుకని బండిని చెల్లెలికి ఇచ్చేసేను. ఎమ్మే కాగానే మా ఇద్దర్లో ఎవరికైనా ఉద్యోగం తప్పనిసరి అవసరం. నెరవేరుతుందో లేదో" అంది బాధగా.

"తప్పకుండా నెరవేరుతుంది అధైర్యపడకు" అంది తన్మయి అనంత చెయ్యి అందుకుంటూ.

"నీ దగ్గిర నాకు నచ్చేదదే. నీకు ఎన్నో సమస్యలున్నా బెంబేలు పడకుండా నిలబడి, ఎదుటి వాళ్ళకి కూడా ధైర్యం చక్కగా చెప్పగలుగుతావు." అంది అనంత.

అనంతని బస్సెక్కించి ఇంటికి వచ్చేసరికి ఇంటిగలాయన గుమ్మం దగ్గిర "మీటర్ రీడింగ్ " అంటూ ఎదురయ్యేడు.

ఎప్పటిలానే వాకిట్లో నిల్చున్న తన్మయిని "నాతో వచ్చి కాస్త ఈ బాటరీ లైటు చూపిస్తారా?" అన్నాడు.

కుర్చీ ఎక్కి అతను రీడింగు తీసుకుని దిగి వచ్చి, బాటరీ లైటు తిరిగి తీసుకుంటూ పనిగట్టుకుని చేతిని గట్టిగా నొక్కేడు.

పురుగు పాకినట్లయ్యి తన్మయి చప్పున దూరం జరిగి "ఛీ " అంది.

"ఏం, నీ 'స్నేహితుల' సాటి రానా?" అన్నాడు వెకిలిగా స్నేహితులన్న పదాన్ని వొత్తి పలుకుతూ.

ఒక్క ఉదుటున బయట వరండా లోకి వచ్చి "మర్యాదగా బయటికి నడవండి. లేకపోతే మీ ఆవిణ్ణి పిలుస్తాను." అంది.

అతను అసలదేమీ తప్పుకానట్లు మారు మాట్లాడకుండా నడుచుకుని వెళ్లిపోయేడు. తన్మయికి ఒక్కసారిగా విపరీతమైన భయంతో కాళ్లలో నుంచి ఒణుకు పట్టుకుంది చాలా సేపు. తలలో నుంచి ధారాపాతంగా చమట్లు కారసాగేయి. ఇంటిగలావిడ ఊరెళ్ళిందన్న సంగతి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఆవిడ రాగానే వాళ్ళాయన నిర్వాకం చెప్పాలి. శేఖర్ కి కూడా ఫోను చేసి అసలు తను ఇక్కడ ఉన్న విషయం మొదట చెప్పాలి. ఇక ఈ ఇంట్లో ఉండడం అసంభవం. కానీ శేఖర్ గురించి ఆలోచించేసరికి తలనొప్పి కూడా మొదలయింది. ఒకదానిమీదొకటిగా సమస్యలు వచ్చి పడ్తున్నాయి.

మర్నాడు శుక్రవారం. ఈ ఒక్క రాత్రి గడిస్తే రేపు సాయంత్రం ఊరు వెళ్లిపోవచ్చు.

తిరిగి సోమవారం వచ్చేక అనంతని తనతో వచ్చి ఉండమని సాయం అడగాలి.

కళ్ళు గట్టిగా మూసుకుని "అజ్ఞాత మిత్రమా! ఈ రాత్రికి నన్ను రక్షించు." అని పదే పదే తనలో తను అనుకోసాగింది.

ఆ రాత్రి పడుకునే ముందు తలుపు గడియకి అడ్డుగా అట్లకాడ పెట్టి, కుర్చీని తలుపుకి అడ్డంగా పెట్టింది.

## 26

మర్నాడు కాలేజీ నించి మధ్యలోనే బయటికొచ్చి ఊరికెళ్ళడానికి బస్సెక్కింది తన్మయి.

రాత్రంతా భయంతో నిద్ర సరిగా పట్టలేదేమో బస్సెక్కగానే కళ్లు మూతలు పడిపోయాయి.

ఇంటికి చేరుకునేసరికి రాత్రి భోజనాల వేళ అయ్యింది. అసలేవీ ఆలోచించే ఓపిక లేదు తన్మయికి. బేగు భుజానేసుకుని నీరసంగా బస్టాండు నించి ఇంటికి నడవసాగింది తన్మయి. వీధి మొదలుకి చేరేసరికి బాబు ఏడుపు గట్టిగా వినబడసాగింది. అది మృదుల్ గొంతులా వినబడేసరికి నడక వేగం హెచ్చించింది తన్మయి. గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టగానే గట్టిగా ఏడుస్తున్న బాబుని భుజానేసుకుని సముదాయిస్తూ, అటూ ఇటూ

తిరుగుతూన్న తండ్రి కనిపించేడు. బాబు తన్మయిని చూడగానే ఒక్క ఉదుటున చేతుల్లోకి దుమికి ఇంకా గట్టిగా ఏడవసాగేడు. తన్మయి అక్కడే అరుగు మీద బాబునెత్తుకుని చతికిలబడి గుండెలకు హత్తుకుంది. తల్లి వెచ్చని స్పర్శకు నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు కాస్సేపటికి.

"హమ్మయ్య, ఇందుకన్న మాట పేచీ". అన్నాడు భానుమూర్తి.

"అమ్మ ఏదీ?" అంది తన్మయి లోపలకి నడుస్తూ.

"లోపల పడుకుంది. నాలుగు రోజుల్నించి మీ అమ్మకు ఒకటే జ్వరం. బాబుని నేనొక్కడినే సముదాయించుకొస్తున్నాను. మీ అమ్మచేతి గోరు ముద్దలు అలవాటయ్యి, నేను అన్నం తినిపిస్తుంటే సరిగా తినడంలేదు. అందుకేమో బాగా పేచీ పెడుతున్నాడు. ఇక నువ్వొచ్చేసేవుగా. మీ అమ్మకు తగ్గే వరకూ ఉండి వెళ్ళమ్మా." అన్నాడు భాను మూర్తి తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ.

"లేదు నాన్నా, నేను మళ్లీ సోమవారం ఊరికి వెళ్లిపోవాలి. చాలా చదువుకోవలసినవి ఉన్నాయి. బాబుని నాతో తీసుకెళ్తాను. అమ్మకు తగ్గేక తీసుకొస్తాను మళ్లీ." అంది తన్మయి.

"తీసుకెళ్లి ఎలా చూద్దామని? ఒంట్లో బావున్నా బాలేకపోయినా మాకు తప్పదుగా" విసుగ్గా అరిచింది జ్యోతి అంత జ్వరంలోనూ.

"అమ్మ అందని కాదు గానీ, నువ్వు కూడా శేఖర్ తో చెప్పకుండా ఎన్నాళ్లని మనగలవు?" ఆలోచించమ్మా అన్నాడు భాను మూర్తి.

తనకే తెలీని విషయాల్ని తల్లిదండ్రులకి ఎలా చెప్పి ఒప్పించాలో తెలియలేదు తన్మయికి.

"ఎన్ని కష్టాలు ఎదురైనా చదువు కొనసాగించాలి. పీ .ఎచ్. డీ చెయ్యాలన్న తన లక్ష్యాన్ని సాధించాలి." అంతే తనకు తెలిసింది.

బాబుని దగ్గరకు హత్తుకుని కళ్ళు తుడుచుకుంది.

----

సోమవారం ఉదయానే తిరుగు బస్సెక్కింది తన్మయి. కూతురి మనసులో దృఢమైన సంకల్పాన్ని కాదనలేక దగ్గరుండి బస్సెక్కించాడు భాను మూర్తి. తల్లి ఒళ్లో కూచుని ఆనందంగా కేరింతలు కొట్టసాగేడు బాబు. వేగంగా వెళ్తున్న బస్సు కిటికీ లోంచి వీస్తున్న చల్లని గాలి మనస్సులో రేగుతున్న ఆలోచనలని మళ్లించలేకపోతూంది.

"వెళ్తూనే శేఖర్ కి ఫోను చెయ్యాలి. బాబు తన దగ్గర ఉన్నంత వరకూ కాలేజీ కి వెళ్లడం కుదరదు కాబట్టి కాలేజీ అయ్యేక అందరినీ కలిసి నోట్సులు తీసుకుని చదువుకోవాలి..."

గేటు ముందు ఆటో దిగగానే ఎవరిదో స్కూటర్ ఉంది. అచ్చం శేఖర్ వాళ్ల పిన్ని భర్త స్కూటర్ లా ఉందది.

"శేఖర్ పిన్ని, బాబాయి వచ్చారా ? శేఖర్ వచ్చాడా ?" ఇంటి తాళం వేసినది వేసినట్లే ఉంది. "బహుశా: ఎవరిదో అయి ఉంటుంది లెమ్మ"ని సరిపెట్టుకుంది తన్మయి.

ఇంటికి వస్తూనే స్టవ్వు మీద కాస్త అన్నం పడేసి, బాబుకి స్నానం చేయించి తయారు చేసింది. ఇంతలో ఇంటి వాళ్ల పనమ్మాయి వచ్చి ఇంటిగలావిడ పిలుస్తూందని చెప్పింది. ఎప్పుడూ పిలవని ఆవిడకు తనతో పనేవిటో అనుకుంటూ మేడ మెట్లెక్కి పనమ్మాయి వెనుకే పైకెళ్లింది తన్మయి. మేడ పైన పెంట్ హౌస్ హాల్ లోకి అడుగు పెట్టిన తన్మయి శేఖర్ ని, వాళ్ల పిన్నిని అక్కడ చూసి ఆశ్చర్యపోయింది. అందుకన్న మాట స్కూటర్ బయట ఉంది. కానీ ఇంట్లో కాకుండా ఇక్కడెందుకున్నారు? శేఖర్ ని చూడగానే బాబు చటుక్కున చేతుల్లోంచి దుమికి అటు పరుగెత్తాడు. "నాన్నన్నాన్నా" అంటూ. ఈ మధ్యే వాడికి చిన్న చిన్న మాటలు వచ్చేయి. శేఖర్ వాణ్ణి ఒళ్ళో కూచో బెట్టుకున్నాడు. వాళ్ల పక్కనే మరో రెండు కుర్చీల్లో ఇంటిగలావిడ, వాళ్లాయన కూర్చుని ఉన్నారు.

ఇంటిగలాయన వైపు చూడడానికి కూడా అసహ్యం వేసింది తన్మయికి.

"అసలు శేఖర్ ఎప్పుడొచ్చేడు? వీళ్లంతా ఇక్కడెందుకు సమావేశమయ్యేరు?" ఏవీ అర్థం కాని తన్మయి బిత్తర చూపులు చూసింది.

కూర్చోమన్నట్టు కుర్చీ చూపించింది ఇంటావిడ.

తన్మయి కూర్చోబోతూ శేఖర్ వైపు "ఏవిట"న్నట్టు చూసింది.

"ఎంతకు బరితెగించేవే, మొగుణ్ణి నాతో చెప్పకుండా ఇక్కడికి వచ్చేయడమే కాకుండా, మరొకడితో కాపురం పెట్టేసేవా?" హఠాత్తుగా గట్టిగా అరుస్తూ అన్నాడు శేఖర్.

అసలు తను ఏం మాట్లాడుతున్నాడో ఇంకా అర్థం కాని తన్మయి ముఖం చిట్లించి ప్రశ్నార్థకంగా చూసింది.

అతని పిన్ని అందుకుని "నేను కళ్లారా చూసేను, కిందటి వారం ఒకడెవడో ఈవిడతో బాటూ ఇంట్లో ఉన్నాడు, వీళ్లిద్దరూ కలిసి పొద్దుపోయే వేళ షికారుకి కూడా వెళ్లేరు." అంది.

తన్మయి, "ఛీ" అని గట్టిగా అరిచి, కళ్ల నీళ్ల పర్యంతమవుతూ "అన్యాయంగా మాట్లాడకండి" అంది.

"మా అక్క ఈవిణ్ణి కోడలుగా చేసుకున్నందుకు ఎంతో క్షోభననుభవిస్తోంది. ఇంతకు రెట్టింపు ఆస్తిపరులు మా వాడికి పిల్లనిస్తామని ముందు కొచ్చేరు, కానీ ఈ మహమ్మారిని చేసుకుంటానని ఇదుగో వీడే పట్టుబట్టేడు" అని చేతులు ఊపుతూ కొనసాగించింది అతని పిన్ని.

ఇంతలో ఇంటిగలాయన "ఈవిడ కోసం కుర్రాళ్లు వచ్చి పోవడం నేనూ చాలా సార్లు చూసేను. నా మీదా కన్నేసింది" అన్నాడు కసిగా.

"అబద్ధం, ఇతనే నా చెయ్యి పట్టుకున్నాడు" అతని వైపు అసహ్యంగా చూస్తూ గట్టిగా అరిచింది తన్మయి.

"అమ్మో, అమ్మో మా ఆయన మీదే అభాండాలు వేస్తూంది, మొగుడు వేరే ఊళ్లో ఉండగా, అతనికి చెప్పకుండా ఈవిడిక్కడుండవేవిటీ, ఇక్కడుండి ఈవిడ ఇష్టం వచ్చినట్లు తిరగడమే కాకుండా మా ఆయన మీద అభాండాలు వెయ్యడవేంటి? ఉన్న పళంగా ఇల్లు ఖాళీ చెయ్యండి" అంది ఇంటిగలావిడ.

తన్మయికి కోపం నెత్తికెక్కింది. "మీలాంటి సంస్కారం లేని మనుషుల మధ్య ఉండాల్సిన అవసరం నాకు లేదు." అని

శేఖర్ వైపు తిరిగి, "అసలేంటి నీ ఉద్దేశ్యం? నీకేమైనా సందేహాలుంటే నాతో మాట్లాడు, ఈ చెత్త పంచాయితీ ఏవిటి?" అంది విసురుగా.

ఈ గందరగోళం లో బిత్తరపోయి బాబు ఏడుపు లంకించుకుని శేఖర్ ఒళ్ళో నుంచి తల్లి వైపు దుమికి రాబోయి టేబుల్ మీదున్న నీళ్ల గ్లాసుని ఒంపేసేడు.

బదులుగా "చూసేరా? వీణ్ణి కూడా ఇలా పద్ధతి లేని ఎదవలా పెంచుతూంది." అని తన్మయి వైపు ఈసడింపుగా చూస్తూ, "నీతో మాట్లాడే టైము అయిపోయిందే. ఇక మాట్లాడదల్చుకోలేదు. నీ అంతు తేలుస్తా" అన్నాడు శేఖర్.

ఒక్క ఉదుటున బాబుని చంకనెత్తుకుని తన్మయి, అందరి వైపూ వేలు చూపిస్తూ, "అయితే వినండి, మీకెవరికీ సమాధానాలు చెప్పాల్సిన అవసరం నాకు లేదు. మీరంతా కలిసి గంగలో దూకండి."

అని అక్కణ్ణించి గబగబా బయటికి వచ్చింది.

నడుస్తున్న తన్మయికి కాళ్ల కింద భూమి కదులుతున్నట్లు అనిపించి గుండె దడ దడా కొట్టుకోసాగింది. పాదాలలో ఓపిక లేనట్లయ్యింది.

అసలక్కడ ఏం జరుగుతూందో అర్థం కావడం లేదు మొదట. తన మీద గొడవ పెట్టాలనుకుంటే ఇంట్లో కాకుండా ఇక్కడెందుకు వీళ్లందరి ముందూ పంచాయితీ పెట్టేడో తెలియడం లేదు. వీళ్లందరికీ తన మీద ఇంత కక్ష ఏవిటో? ఒకరి మాటలు అర్థమయ్యే లోగా మరొకళ్లు తన మీద నిందలేస్తున్నారు. ఇంట్లోకొచ్చి తలుపు గడియ పెట్టుకుంది. మంచమ్మీద బోర్లా పడుకుని కుమిలి కుమిలి ఏడవ సాగింది. ఎంత అవమానం! ఎంత అవమానం!! వాళ్లందరి ముందూ తనని ఒక కేరెక్టర్ లేని మనిషిగా నిలబెట్టేడు శేఖర్. ఇంతకంటే చావడం మేలు. దు:ఖంతో ఏవేవో మాట్లాడుతూ పొగిలి పొగిలి ఏడవ సాగింది తన్మయి. తనేం పాపం చేసింది! ఇంత అవమానం తర్వాత తను సమాజంలో తలెత్తుకుని బతక గలదా? ఒక పక్కనుంచి బాబు కూడా బాగా ఏడుస్తున్నాడు ఏం జరుగుతూందో తెలీక. చావాలని అనిపించేక, ఎలా చావాలా అని మనసు ఆలోచించడం మొదలుపెట్టింది. అంతలో పక్కనే బేలగా చూస్తున్న బాబు కనిపించేడు.

కాస్సేపట్లో దు:ఖం నించి తేరుకుని కళ్లు తుడుచుకుని స్థిమితంగా ఆలోచించసాగింది తన్మయి. చావాలంటే ఎలాగైనా చావొచ్చు. బతకాలంటేనే ఏం చెయ్యాలో ఆలోచించాలి. ఒక్కసారిగా తల విదిలించుకుంది. బాబు బాధ్యత తనని చావకుండా వెనక్కి లాగుతూంది

ఒక కాగితం తీసి రెండు భాగాలుగా గీసింది. బతికితే, చచ్చిపోతే – లాభనష్టాలు రాయడం మొదలు పెట్టింది. బతకడం వల్ల ఒక గొప్ప ప్రయోజనం, ఒక ప్రాణిని పెంచి పెద్ద చేసి, గొప్ప వాణ్ణి చెయ్యగలగడం, కనీసం కుసంస్కారుడైన తండ్రిలా కాకుండా మంచి వాడిగా పెంచడం. చచ్చిపోతే ఈ పిల్లాడు తల్లి సంరక్షణకు దూరమై నానా ఇబ్బందులూ పడడమే కాకుండా తిరిగి తండ్రిలాంటి కుసంస్కారుడే అవుతాడు. అలాగని తనతో బాటూ పిల్లవాణ్ణి చంపే కౄరత్వం తనలో లేదు. మొదటి పాయింటు దగ్గరే తన్మయి బతకాలని నిర్ణయించుకుంది. తాను బతకడమే కాదు, బాబుని ప్రయోజకుణ్ణి చెయ్యాలి. బాబుని ఒళ్లోకి తీసుకుని తల నిమిరింది.

"ఏమీ కాలేదు నాన్నా, భయ పడకు, అమ్మ ఉందిగా. ఎలాంటి పరిస్థితుల్నయినా తట్టుకుని నిలబడతాను, తప్పులు చెయ్యనప్పుడు దేనికీ భయపడాల్సిన అవసరం లేదు." అంది వాడి తల మీద చెయ్యి పెట్టి.

ముఖం కడుక్కుని వచ్చి అన్నం తినిపించి, నిద్ర పుచ్చింది. బాబు పక్కనే పడుకుని కళ్లు మూసుకుంది. ఎంత కాదనుకున్నా, అలా అందరి ముందూ శేఖర్ తనని అవమానించడం తట్టుకోలేక మళ్లీ దు:ఖం తన్నుకురాసాగింది. కాస్సేపట్లో శేఖర్ వచ్చిన అలికిడి అయినా వెనక్కు తిరిగి చూడకుండా ఇంకాస్త గట్టి గా కళ్లు మూసుకుంది. బీరువా తలుపులు దబదబా తీయడం, మూయడం, వంటింట్లోకెళ్లి సామాన్లు విసిరి కొట్టడం వంటివి వినిపిస్తున్నా స్థాణువులా అలాగే గోడ వైపు తిరిగి పడుకుంది. దాదాపు గంట తర్వాత వీధి తలుపు విసురుగా వేసి శేఖర్ బయటకు వెళ్లిపోవడం వింది.

అతను వెళ్ళేక మరో గంట చలనం లేకుండా పడుకుంది. అసలు ఆలోచించే ఓపిక కూడా లేదు. ఏం జరుగుతూందో, అసలీ రాద్ధాంతం అంతా ఎందుకు చేస్తున్నాడో అర్థం కాని పరిస్థితి. కావాలని పెళ్లి చేసుకుని, ఏనాడూ సంతోషమనేది మిగలనివ్వకుండా చేస్తున్నది అతను. తన మానాన తను ఇష్టం వచ్చినట్లు ప్రవర్తి స్తూ బాధ్యతా రాహిత్యంగా నడుచుకుంటున్నది అతను. తిరిగి తన మీద నింద వెయ్యడమూ, పైగా ఎందుకూ కొరగాని ఇంటిగలవాళ్ల ముందు పంచాయితీ పెట్టడమూ. ఎందుకిదంతా జరుగుతూంది?తను ఏం తప్పు చేసింది? చదువుకోవాలన్న ఆశయాన్ని నెరవేర్చుకోవాలనుకోవడం తప్పా? ఈ మాత్రం చదువు మీద నైనా దృష్టి మరల్చుకుని ఉండకపోతే నరకప్రాయమైన తన బతుక్కి చావు తప్ప మరో శరణ్యం ఉందా?

కళ్లు మూసుకుని "అజ్ఞాత మిత్రమా! నన్ను రక్షించు. నా చిన్నారి బాబుని సంరక్షించుకునే ధైర్యాన్ని నాకివ్వు." అని పదే పదే అనుకోసాగింది.

పొద్దుట్నించీ ఏవీ తినకో ఏమో గానీ కడుపులో బాగా తిప్పుతూంది. నెమ్మదిగా వెనక్కి తిరిగి ఎదురుగా కనబడ్డ దృశ్యం చూసి ఆశ్చర్యపోయింది.

బీరువాలో శేఖర్ వస్తువులున్న సొరుగులన్నీ ఖాళీగా ఉన్నాయి. లాకర్ లో ఉన్న బంగారం వస్తువులు, డబ్బులు, బ్యాంకు పాసుపుస్తకాలు అన్నీ మాయమైపోయాయి.ఇంట్లో అతని బట్టలు, బూట్లు ఇతరత్రా అతని సామగ్రి ఏవీ లేవు. తనవనే వస్తువులు చేతికందినంత వరకూ అన్నీ తీసుకుని వెళ్లిపోయాడు శేఖర్. ఒక్కసారిగా మరింత నీరసంతో గోడకి జేరబడి కూర్చుండి పోయింది. మోకాళ్లలో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది. జరుగుతున్న పరిణామాలకి ఏడుపు ఆపుకుందామనుకున్నా తెలీకుండా తన్నుకు వస్తూనే ఉంది. తల్లి ఏడుపు వినబడి బాబు మంచమ్మీంచి దిగి వచ్చి బేలగా ఒళ్లో తలదాచుకున్నాడు. వాడి తలంతా తన్మయి కన్నీళ్లతో తడిసిపోతూంది.

"చూడురా, నాన్నా, మీ నాన్న ఏం చేసాడో" అంది వెక్కుతూ. వాడికి అర్థం కాక పోయినా చిన్ని చేతుల్తో కళ్లు తుడిచాడు.

"నాన్నాన్నాన్నా" అంటూ రెండు చేతులూ చాచి బయటకు నడవసాగేడు.

తన్మయి ఒక్క ఉదుటున బయటకు పరుగెత్తి వాడిని గుమ్మం దగ్గిర పట్టుకుంది. ఇక లాభం లేదు. ఇంటికి ఫోను చేసి చెప్పవలసిందే. ఇంట్లో అక్కడక్కడా దాచుకున్న డబ్బులు లెక్క చూసుకుంది. వంద రూపాయల వరకూ ఉన్నాయి. అంతే. అప్పటికే పొద్దు పోతూంది. ఇల్లు తాళం వేసి బాబుని చంకనేసుకుని ఫోను బూత్ దగ్గిరికి వచ్చింది. పొద్దుట్నించీ ఒక్కతే మోస్తున్న బాధా భారమంతా తండ్రికి ఫోను చెయ్యగానే పెల్లుబికింది.

"నాన్న గారూ!" గొంతు పూడుకు పోతూండగా భాను మూర్తికి జరిగినదంతా వివరించింది.

"గాభరా పడకమ్మా, అల్లుడు ఎక్కడికీ వెళ్లుండడు, వాళ్ల తాతగారి ఇంట్లో ఉండి ఉంటాడు. నేను ఇప్పుడే బయలుదేరి వస్తున్నాను. అధైర్య పడకు." అన్నాడు భాను మూర్తి.

జ్యోతి వెంటనే ఫోను లాక్కుని, "అందుకే నేను నెత్తీ నోరూ కొట్టుకుని చెప్పేను. ఒక్కదానివీ అక్కడుండొద్దని. విన్నావా? అయినా అసలు అలా వీధికెక్కి రచ్చ చేస్తున్నపుడే మాకు ఫోను చెయ్యకపోయావా?" ఏం ఊరుకూంటామనుకుంటున్నాడా? నాన్న గారు ఇప్పుడే వస్తున్నారు. నాకు వొంట్లో బావుంటే నేనూ వచ్చేదాన్ని. ఏడవకమ్మా, నువ్వస్సలు ఏడవొద్దు" అని, అట్నించి తన్మయి ఏడుపు విని గట్టిగా గద్దించింది.

ఇంటికి తిరిగొస్తూండగా గేటు దగ్గిర నిలబడి ఒళ్లంతా దెబ్బలతో కరుణ ఎదురయ్యాడు. అతని నుదుటి మీద ఎవరో బలంగా కొట్టినట్లు చర్మం చీరుకు పోయి రక్తం కారుతూంది. ఒళ్లంతా బురద కొట్టుకుపోయి, చొక్కా చినిగి వేళ్లాడుతూంది.

"అదేవిటి, మీకేమైంది కరుణా!" అంది గాభరాగా తన్మయి.

"మీ ఆయన నిర్వాకం" అన్నాడు ఈసడింపుగా తుపుక్కున రోడ్డు మీద ఉమ్మేస్తూ.

"ఇందాకా నేను లైబ్రరీ లోంచి బయటికొచ్చి యూనివర్శిటీ నుంచి బస్టాండు దగ్గరకు నడుస్తూండగా, నలుగురు మనుషుల్ని వెనకేసుకొచ్చి చితక్కొట్టేడు మీ ఆయన. అసలు నేనేం చేసేనని అడిగితే, నోర్మూసుకుని ఖాళీ కాగితాల మీద సంతకాలు, వేలిముద్రలు వెయ్యమని పట్టుకెళ్లేడు." అన్నాడు దు:ఖం నిండిన కళ్లతో.

తన్మయి రెండు చేతులూ జోడించి అతనికి నమస్కారం పెట్టి, "క్షమించండి, ఇక ఈ దరిదాపులకు కూడా రాకండి." అని ఏడుస్తూ లోపలికి పరుగెత్తింది.

గుండె వేగంగా కొట్టుకోసాగింది.

వేటికేదీ అర్థం కాకుండా అయిపోయాయి. ఛీ, తన వల్ల కరుణ కూడా బాధలు పడాల్సి వస్తూంది. ఇక అతన్ని తలెత్తి చూడగలదా? అసలు వైద్యానికి కూడా డబ్బులు ఉండి ఉండవు. పాపం.

"అయ్యో, ఖర్మ" అని నెత్తి కొట్టుకుంది.

ఇవన్నీ చూసి బాబు కింక పెట్టి ఏడ్వసాగేడు.

కసిదీరా వాణ్ణి వీపు మీద బాదసాగింది. దెబ్బల బాధకు తాళలేక తల్లి దగ్గరకు వస్తూంటే భయపడి వంటింట్లో స్టవ్వు గట్టు కిందకు వెళ్లి కూచుని వెక్క సాగేడు బాబు. తన్మయి పిచ్చిదానిలా గోడ కేసి నెత్తి గట్టిగా బాదుకోసాగింది.

బాగా నొప్పి తెలుస్తూన్నా, "తనకీ శిక్ష పడవల్సిందే, అతన్ని పెళ్లి చేసుకున్నందుకు తను ఇలా అనుభవించాల్సిందే". అని తనకు తెలీకుండానే గట్టిగా అరుస్తూ రక్తం వచ్చేంత వరకూ తల కొట్టుకుంది.

కాస్సేపట్లో హఠాత్తుగా కళ్లు బైర్లు కమ్ముతూండగా పక్కకు చలనం లేకుండా పడిపోయింది.

చివరి క్షణం లో కళ్లు మూతలు పడిపోతూండగా, "బాబూ... మృదుల్" అని మాత్రం అరవడం గుర్తు ఉంది.

★★★

కళ్ల మీద నీళ్లు పడిన చల్లదనానికి మెలకువ వచ్చి చూసే సరికి పక్కన కరుణ కూచుని ఉన్నాడు. ఒక్క ఉదుటున లేచి కూచుంది.

"అదేవిటి, మిమ్మల్ని రావొద్దని చెప్పేనుగా" అంది నీరసంగా.

"ఇందాకా, మీరు బాగా ఏడుస్తూండడం చూసి, ఏం అఘాయిత్యం చేసుకుంటారోనని మళ్లీ వెనక్కి వచ్చేను. మీరు కళ్లు తిరిగి పడిపోయి ఉన్నారు. బాబు మీ పక్కని నేల మీద పడుకుని ఉన్నాడు. భలే భయం వేసిందండీ." అన్నాడు గాభరాగా.

" నన్ను క్షమించండి. నా వల్ల అనవసరంగా..." అని గొణిగింది తన్మయి.

"ఛా, అలా అనకండి. నాకు మీమీద కోపం లేదు. అసలు ఏం జరుగుతూంది? అతను నా మీద దాడి చేసేంత తప్పు ఏం జరిగింది? అసలు పోలీసు రిపోర్టు ఇద్దామనుకున్నాను. కానీ అనవసరంగా మీ పేరు పైకి రావడం ఇష్టం లేదు నాకు. అదీగాక నా ఆర్థిక పరిస్థితి మీకు తెలిసిందేగా. రిపోర్టులంటూ తిరిగే ధనం, ఓపికా రెండూ లేవు." అన్నాడు.

తన్మయి మెల్లగా గొంతు సవరించుకుంది. మొదటినించి జరిగిన కథను రెప్ప వాల్చకుండా విన్నాడు కరుణ.

చివరికి నిట్టూర్చి,"నాకేం చెప్పాలో పాలు పోవడం లేదు. నా గురించి వదిలేయండి. నేను కేవలం మిత్రుణ్ణి మాత్రమే మీ జీవితంలో. సగటు భర్తగా అతను మీ ఉన్నతాశయాల్ని భరించలేక పోతున్నాడు. ఇక మీరే సమాధానపడక తప్పదు. నా చేత సంతకాలు పెట్టించుకున్న కాగితాల వల్ల మీకే నష్టమూ కలగ కూడదని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. సామరస్యంగా సమస్యలు పరిష్కారం చేసుకోండి. మీ ఆరోగ్యం జాగ్రత్త. పిచ్చి పనులు చేసి పిల్లాణ్ణి అనాధని చెయ్యకండి." అని లేచాడు.

కరుణ బయటికి వెళ్తూ ఉండగానే ఇంటిగలావిడ వచ్చి గుమ్మం దగ్గిర నిలబడింది.

తన్మయి విసుగ్గా "ఏవిటి?" అంది. పొద్దుటి ఈవిడ ధోరణికి పరమ అసహ్యంగా ఉంది అసలే.

వెళ్తున్న కరుణ వైపు వ్యంగ్యమైన చూపొకటి విసిరి, "మీ ఆయన ఇల్లు ఖాళీ చేసేస్తున్నామని చెప్పేడు. ఎల్లుండి ఒకటో తారీఖు. ఈ నెల అద్దె నిన్ను అడిగి తీసుకోమన్నాడు. ఎప్పుడు ఖాళీ చేస్తావో చెప్తే, మేం ఎవరికయినా ఇచ్చుకుంటాం" అని వెళ్లిపోయింది.

తన్మయికి ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. ఒకదానిమీదొకటి సమస్యలు. ఇప్పటికిప్పుడు ఇంటికి అద్దె కట్టడమంటే డబ్బులు ఎక్కడి నుంచి తేవాలి? భానుమూర్తి ఉదయానికి వస్తాడు. డబ్బులు తండ్రిని అడగడానికి మొహం చెల్లడం లేదు తన్మయికి. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో తప్పేట్లు లేదు. నేల మీద చతికిలబడింది మరింత నీరసంగా. తండ్రి వచ్చేంతవరకూ అలాగే కూచుంది. తెల్లారుతుండగా భానుమూర్తి వస్తూనే, లోతుకు పోయిన కళ్ళతో ఉన్న కూతుర్ని చూసి కళ్లనీళ్ల పర్యంతమయ్యేడు.

"బాధపడకమ్మా, శేఖర్ వాళ్ల తాత గారింట్లో ఉండి ఉంటాడు. పిలుచుకొస్తాను. నేను మాట్లాడతాను." అని ధైర్యం చెప్పి వెళ్ళేడు.

సాయంత్రం తిరిగొచ్చి, ఊర్లో చుట్టాలిళ్ల లో అన్ని చోట్లా వాకబు చేసేను. ఎక్కడా లేడమ్మా, మీ అత్తయ్యకు ఫోను చేసేను. అక్కడికి కూడా రాలేదట. నెల్లూరు వెళ్లి ఉంటాడు.

"కోపంలో వెళ్లిపోయి ఉంటాడు గానీ, నిన్నూ, బాబునీ వొదిలి అతను మాత్రం ఎలా ఉంటాడు?" అన్నాడు.

తన్మయి, ఏవీ ఆలోచించలేక, ఎండిపోయిన కళ్లతో, నీరసించిపోయిన తలని ఊపింది.

"ఒకటో తారీఖు రేపే. సర్లే, ముందు మనం ఈ సామాన్లవీ తీసుకుని మనింటికి వెళ్లిపోదాం. తర్వాత స్థిమితంగా ఆలోచిద్దాం" అన్నాడు.

తండ్రి ఇంటి వాళ్లకి తన జేబులో ఉన్న డబ్బులేవో ఇచ్చి ప్రాధేయపడడం గుమ్మం దగ్గర్నించి చూసి, సిగ్గుతో చితికిపోయింది తన్మయి.

చివరికి మళ్లీ తల్లిదండ్రులకి భారమై తిరిగి వెళ్తూంది. సామాన్లు సర్దు తూండగా ఎక్కడ లేని వైరాగ్యం కలిగింది. ఈ ఇల్లు నాది, ఈ గట్టు నాది అనుకుంటూ తుడిచిన చోటనే తుడుచుకుని అద్దంలా ఉంచుకున్న గదుల్ని, పుస్తకాల సొరుగుల్నీ, కిటికీ కర్టెన్లనీ చూసుకుని,

"వైవాహిక జీవితం గురించి ఎన్ని కలలు కన్నాను! " అని బాధపడింది.

సామాన్లని గోనె సంచుల్లోకి ఎక్కిస్తూ మొదటి జీవిత సత్యం అర్థం చేసుకుంది. *"ఈ సామాన్లు, ఈ వంట గదీ, ఈ పుస్తకాల సొరుగూ, ఈ కిటికీ కర్టెన్లు ఏవీ శాశ్వతం కావు. తాత్కాలిక అవసరాలకు ఉపయోగపడే వస్తువులు మాత్రమే. వస్తువుల మీద ఎప్పుడూ ప్రేమ పెంచుకోకూడదు."*



తన్మయి సామాన్లని సర్దుతూందే గానీ ఆలోచన్లతో తల బద్దలు అయిపోతూంది.

ఇన్ని రోజుల పాటు ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని నిలబడినదంతా ఇప్పుడు వెనక్కి వెళ్లిపోవడం వల్ల ఆవిరైపోతూంది.

తనని, బాబుని నిర్దాక్షిణ్యంగా వదిలి వెళ్లిపోయిన శేఖర్ని వెతుక్కుంటూ తను వెళ్లడం అంటే తన లక్ష్యాలన్నీ గంగలో కలిసినట్టే.

ఇన్నాళ్లూ అతనెలా నడుచుకున్నా, తనని ఎంతగా బాధిస్తూన్నా ముఖ్యంగా పిల్లాడికి తండ్రిని దూరం చెయ్యడం ఇష్టం లేకనే భరిస్తూ వచ్చింది. కానీ అతనెలా వెళ్లిపోగలిగాడు?

చేసినవన్నీ అతను చేసి, తన మీద నిందలు వేసి, అతను బయటకు వెళ్లడంలో ఆంతర్యం ఏమై ఉంటుంది? ఎందుకిదంతా చేస్తున్నాడు?

తండ్రి చెప్పినట్టు తాత్కాలిక మైన కోపంతోనే వెళ్లిపోయాడా?

మరి అందరి ముందూ తనని అవమానపరచడం, కరుణతో కాగితాల మీద సంతకాలు పెట్టించుకోవడం ఎందుకు చేసేడు?

సమాధానం తెలియని ప్రశ్నలతో తలమునకలు కాసాగింది.

ఒకటి మాత్రం నిజం. జీవితంలో అన్ని విధాలుగా ఓడిపోయినట్లయ్యి తల్లిదండ్రుల పంచని చేరి, భారంగా బతుకునీడ్చడం తనకి సుతరామూ ఇష్టం లేదు.

సామాన్లన్నీ వ్యాను లోకి ఎక్కించేక, కాసిన్ని బట్టలు, క్లాసు పుస్తకాలు సర్దుకున్న సూట్ కేసు, పర్సు పట్టుకుని "నేను తర్వాత వస్తాను నాన్నా, మీరు బాబును తీసుకుని వెళ్ళండి". అంది దృఢంగా తన్మయి.

పొద్దుటినించీ కూతురి ముఖంలో చూసిన బెంబేలుతనానికి బదులు కనబడ్డ దృఢత్వానికి భానుమూర్తి ఏమీ అనలేకపోయాడు. పైగా వ్యాను డ్రైవరు కంగారు పెడుతుండడంతో

"సరేనమ్మా, అమ్మకి ఫోను చెయ్యి, లేకపోతే కంగారు పడుతుంది." అన్నాడు.

వ్యాను బయలు దేరే ముందు కిటికీ అద్దంలోంచి బాబు చిన్నారి చెయ్యి బయట పెట్టి తల్లి చేతిని అందుకున్నాడు. బాబు చేతిని వదల్లేక వదల్లేక వదిలింది తన్మయి. ఒక్క రోజు కూడా బాబుని వదిలి ఉండలేని బేలతనం తనది. అదేవిటో గానీ  తన దురదృష్టం ఎప్పుడూ వాణ్ణి వొదలడం తప్పడం లేదు.

వ్యాను వీధి మలుపు తిరిగేంత వరకూ చూస్తూ నిలబడింది.

తండ్రితో తర్వాత వస్తానని అందే గానీ ఎక్కడికి వెళ్లాలో తెలీదు.

వీధి చివరకు నడిచి వచ్చి తల్లికి ఫోను చేసింది.

తల్లికి ఒక్కొక్కటీ చెపుతున్నపుడు దు:ఖంతో గొంతు పూడుకు పోయింది.

"ఆ కాగితాలు.. ఆ కాగితాలు ...అతనెందుకు సంతకాలు పెట్టించుకున్నాడు?....." అని వెక్కి వెక్కి పడసాగింది.

అట్నించి జ్యోతి "ఏడ్వొద్దమ్మా, నువ్వు అస్సలు ఏడవొద్దు. కాగితాలు ఏం చేసుకుంటాడు? నాలుగ్గీసుకుంటాడా? లేదా వాల్ పోస్టర్లేసి వీధి వీధీ పంచుకుంటాడా? తన పెళ్ళాం గురించి చెడుగా ప్రచారం చేసుకుంటే నష్టం ఎవడికి? చూస్తూండు. నువ్వే కావాలని అతనే దేభ్యం మొహవేసుకుని తిరిగొస్తాడు. నువ్వు బెంగ పడకు. ఎప్పటిలానే శనివారం ఇంటికి వచ్చెయ్యి. అప్పుడు తీరిగ్గా మాట్లాడుకుందాం. జాగ్రత్తగా ఉండమ్మా." అంది.

తల్లి  మాటలతో మరింత ధైర్యం వచ్చినట్లయింది తన్మయికి.

ముందు రోజు నించి జరిగిన పరిణామాల వల్ల కలుగుతున్న టెన్షన్ తో సరిగా తినక పోవడంవల్ల ఒంట్లో అస్సలు ఓపిక లేకున్నా అడుగు తీసి అడుగు ముందుకు వేస్తూంటే  తెలియని పట్టుదల కలగ సాగింది తన్మయికి..

తనకే ఇన్ని కష్టాలు ఎందుకు ఎదురవుతున్నాయి?  అడుగడుగునా పరీక్షలు ఎందుకు ఎదురవుతున్నాయి?

అసలు ఎక్కడ తన జీవితం గాడి తప్పింది?

ఎక్కడ తప్పు జరిగింది? అందరిలాగే తను కూడా జీవితమ్మీద ఎన్నో ఆశలు పెంచుకుంది. కోరి వచ్చిన వాడిని మనసారా ఇష్టపడి పెళ్లి చేసుకుంది. అవన్నీ ఎంత మామూలుగా జరిగాయో అంత మామూలుగానూ తన జీవితంలో ఉన్నతాశయాల్ని నెరవేర్చుకోవాలనుకుంది. అది తప్పా?

పెళ్ళి, ఆశయాలు ఒక ఒరలో ఇమడనంత క్లిష్టమైనదా జీవితమంటే?

తనకి నచ్చనివెన్నో అతనిలో ఉన్నాయి. అయినా తనకి అతణ్ణి వదులుకోవాలన్న ఆలోచన ఎన్నడూ రాలేదు. పెళ్ళి పట్ల, సంప్రదాయాల పట్ల ఉండే గౌరవం ఒక కారణమైతే, అతన్ని తను మనస్ఫూర్తిగా ఇష్టపడి పెళ్లి చేసుకుంది. కాబట్టి కష్టమైనా నష్టమైనా అతనితో నెట్టుకు వచ్చింది .

అతని అలవాట్లని, హింసని తను భరించగలుగుతున్నపుడు అతనికి నచ్చని ఒకే ఒక్క చదువుకోవాలనే ఆశయాన్ని అతనెందుకు సహించలేక పోతున్నాడు? పైగా చెత్త అనుమానం ఒకటి.

ఇవన్నీ ఒక వైపు సమస్యలు. అసలు తను ఇప్పుడు ఎలా బతకాలి? చదువుని ఎలా కొనసాగించాలి? బాబుని ఎలా పెంచుకోవాలి? అసలు ముందు ఈ రాత్రికి ఎక్కడ తలదాచుకోవాలి?

"మిత్రమా! నన్ను రక్షించు. నాకొక దారి చూపించు." మనస్సులో ప్రార్థిస్తూ , చెయ్యాల్సిన పన్లని మననం చేసుకోసాగింది.

ముందు అనంతని కలవాలి. తనకి తెలిసిన వాళ్ళెవరైనా లేడీస్ హాస్టల్ లో ఉండి, తనకి సహాయం చెయ్యగలరేమో కనుక్కోవాలి.

తిన్నగా యూనివర్శిటీకి వెళ్ళింది. చేతిలో బరువుతో యూనివర్సిటీకి వెళ్లే ఎత్తు రోడ్డులో నడిచే సరికి చెమట్లు ధారాపాతంగా కారసాగేయి.

డిపార్టుమెంటు బయట చెట్టు కింద నీడలో కూలబడింది.

మానసికంగా బాగా అలిసిపోయే సరికి ఆ ప్రభావం శరీరమ్మీద పడి ఇక ఒక్కడుగు కూడా వెయ్యలేని నిస్సత్తువ కమ్ముకుంది.

పర్సులో ఉన్న వంద రూపాయలతో వారమంతా బతకడమే కాదు, వారాంతంలో ఇంటికి వెళ్లడానికి ఛార్జీలు కూడా సరిపెట్టుకోవాలి.

తల దించుకుని ఆలోచలతో నిమగ్నమైపోయిన తన్మయి– రాజు, దివాకర్ దగ్గరకు వచ్చిన సంగతి చూడలేదు.

"ఏవిటి? ఎక్కడికో వెళ్తూ పొ ...పొరబాటున ఇలా వచ్చేరా?" అన్నాడు దివాకర్.

దివాకర్ కు సమాధానం ఇవ్వకుండానే రాజు వైపు తిరిగి "అనంత ఎక్కడుంది? నేను వెంటనే మాట్లాడాలి." అంది తన్మయి.

"అనంత నాన్నగారికి ఒంట్లో బాలేదని కబురు వచ్చింది. ఆదివారం తను వాళ్ల ఊరు వెళ్లింది. రేపు ఫోను చేసి కనుక్కుంటాను. అంతా బానే ఉంటే ఎల్లుండి వచ్చెయ్యమని చెపుతాను. ఇక్కడ క్లాసులు పోతున్నాయి తనకి. మీరు కనిపిస్తే చెప్పమంది. అవునూ, మీరేవిటి సరాసరి ఊర్నించి ఇటే వొస్తున్నారా?" అన్నాడు రాజు.

నిశ్శబ్దంగా తల ఊపింది తన్మయి.

"అవునూ.. మ్మన మహానుభావుడు ఎ..ఎక్కడికి వెళ్లేడో. నిన్నట్నించి కనబడ్డం లేదు అన్నాడు కరుణని ఉద్దేశించి." దివాకర్.

కరుణ గురించి తల్చుకుంటే ఒక విధమైన గిల్టీ ఫీలింగ్ కలగ సాగింది తన్మయికి. "పాపం, ఎలా ఉన్నాడో! ఎంతగా డిస్టర్బ్ అయి ఉంటాడో. తనతో స్నేహం చేసిన పాపానికి అతన్ని కూడా కష్టాల పాల్జేసింది." తనని తను మనసులో తిట్టుకోసాగింది.

దిగులుగా, నిశ్శబ్దంగా లేచి లేచి సూట్ కేసు అందుకుని, బస్టాండు వైపు నడవ సాగింది.

అనంత కనబడితే తనకు తెల్సిన వాళ్లెవరితోనైనా మాట్లాడి, లేడీస్ హాస్టల్లో తాత్కాలికంగా ఉండొచ్చని అనుకుంది. ఇప్పుడెలా, ఏం చేయాలి? ఊరికి తిరిగి వెళ్లిపోక తప్పేట్లు లేదు.

దివాకర్ పక్కనే నడుస్తూ "ఇ..ఇటివ్వండి నె..నేను పట్టుకొస్తాను మి..మ్మీ ఇంటి దాకా" అన్నాడు.

తన్మయి మొహమాటంగా తల ఊపుతూ "ఫర్వాలేదు దివాకర్" అంది. కానీ అప్రయత్నంగా దు:ఖం తన్నుకు వచ్చి మాట్లాడలేకపోయింది.

"అంతా బ..బానే ఉందా త..తన్మయి గారూ?" అన్నాడు ఖంగారు పడ్తూ.

"లేదు దివాకర్, మా ఇల్లు ఖాళీ చేసేం" అని నాలుగడుగుల్లో మరో బెంచీ మీద కూలబడింది.

"అయ్యో, మి..మీ్మకు ఒంట్లో ఓపిక కూడా లేనట్లుంది. మి...మీ్మకు అ..అభ్యంతరం లె..లేకపోతే మా ఇంటికి రండి. ఇంట్లో అ...అక్కయ్య, నేనే ఉన్నాం. మా అమ్మా, నాన్నా ఉ...ఊరు వెళ్లేరు. శు..శుక్రవారం వరకూ రారు. ఇ...ఈ లోగా మి..మీరు ఆలోచించుకోవచ్చు." అన్నాడు దివాకర్.

కృతజ్ఞతా పూర్వకంగా వెయ్యి నమస్సులు మనస్సులోనే సమర్పించింది తన్మయి."చాలా థాంక్స్ దివాకర్" అని అతని వెనక నడిచింది.

ఎత్తున ఉన్న యూనివర్శిటీ నించి దిగువన యూనివర్శిటీ క్వార్టర్స్ లో దాదాపు సముద్ర తీరపు ఘోష వినిపించే వరకూ వెళ్తే చివరి ఇల్లు వాళ్లది.

దారిలో మరొక త్రోవ వైపు చూపిస్తూ "మా..మాస్టారి ఇల్లు ఇ...ఇటే, మ..మన జె.ఆర్.ఎఫ్ ప్రి..ప్రిపరేషన్ కి ఎప్పుడైనా సరే, స..సాయం చేస్తామన్నారు." అన్నాడు.

జె.ఆర్.ఎఫ్ గురించి తల్చుకోగానే బాగా బెంగ పట్టుకుంది తన్మయికి. "నానాటికి సమస్యాపూరితమైన జీవితంతో తనేవైనా సాధించగలదా?"

నడుస్తున్నంత సేపు క్లాసుల గురించి, చదువు గురించి తప్ప తన స్వంత విషయాలు ఏ మాత్రం అడగని దివాకర్ మర్యాదకర ప్రవర్తనకు కృతజ్ఞతలు మనస్సులో సమర్పించింది తన్మయి.

దివాకర్ తో తనకు అంత వరకూ సరిగా పరిచయం లేదు. ఇంత వరకూ అతన్ని లోకం పోకడ తెలియని అమాయకుడిగానే గుర్తించింది. ఇప్పుడు అతను గొప్ప సంస్కరవేత్త అని కూడా అర్థం చేసుకుంది.

గేటు తీసుకుని లోపలికి వెళ్లే త్రోవలో రకరకాల పూల చెట్లు, పళ్ల చెట్ల మధ్య సన్నని త్రోవ గుండా ఇండిపెండెంట్ క్వార్టర్స్ లోకి అడుగుపెట్టేరు.

బయట వరండాకి ఆనుకుని ఉన్న అరుగు మీద కూచున్న అందమైన అమ్మాయి తమని చూస్తూనే పలకరింపుగా నవ్వుతూ దగ్గరకు వచ్చి

"ఆగండాగండి, మీరెవరో నేను చెప్తాను. మీరు తన్మయి కదా. మా దివా ఎప్పుడూ మీ గురించే చెప్తాడు. ఈ కాలంలో కొంగు కప్పుకుని నడిచే వారు మీరొక్కరే అని మిమ్మల్ని చూస్తూనే గుర్తు పట్టేను." అంది.

అలిసిపోయి ఉన్న తన్మయిని లోపలికి ఆదరంగా తీసుకెళ్లి, "ముందు మొహం కడుక్కోండి, కాఫీ తెస్తాను." అంది.

సూట్ కేసులోంచి టవలు తీసుకుని మొహం తుడుచుకుని బొట్టు పెట్టుకుంది తన్మయి.

దివాకర్ అక్క కాత్యాయని వయసులో మహా అయితే అతని కంటే రెండేళ్ళు పెద్దదై ఉండొచ్చు. ఎమ్మే ఫిలాసఫీ చేసింది. పెద్ద కళ్లు, చక్కని రూపం. రూపం కంటే ఆకర్షణీయమైన మృదు భాషణ.

దివాకర్ "అలా వెళ్లొస్తా" నని ఎక్కడికో వెళ్లేడు.

" 'ఈ-టీ.వీ' అని కొత్తగా వచ్చింది. సీరియల్ చూస్తారా?" అంది కాత్యాయని ఉత్సాహంగా.

టీవీ అనగానే తన్మయికి తన తల్లిదండ్రులు శేఖర్ కి పండగ బహుమతిగా ఇచ్చిన కలర్ టీవీ సన్నివేశం జ్ఞాపకం వచ్చింది. శేఖర్ తమ్ముడికి పెళ్ళి కుదిరింది. అమ్మాయి తరపు వాళ్ళు కట్నంతో బాటూ కలర్ టీవీ కూడా ఇస్తున్నారు కాబట్టి మీ వాళ్లు కూడా ఇవ్వవలసిందేనని పట్టుబట్టింది దేవి. అప్పటికిప్పుడు కలర్ టీవీ అంటే అథమం ఇరవై వేల పైమాటే. జ్యోతి కుదరదని చెప్పమన్నా, భానుమూర్తి వినిపించుకోకుండా చీటీ పాడి కొని ఇచ్చి పంపించేడు. సామాన్లతో బాటూ టీవీ ని తీసి వ్యానులోకి ఎక్కిస్తున్నపుడు తండ్రి దవడ బాధతో బిగుసుకోవడం చూసి వ్యధాపూరితురాలైంది తన్మయి.

కాత్యాయనికి సమాధానంగా చిన్నగా నిట్టూర్చి "టీ.వీ అలవాటు లేదు కాత్యాయని గారూ" అంది తన్మయి.

బదులుగా "కాత్యా, అని పిలవండి చాలు. మీరు చాలా బాగా చదువుతారని మా తమ్ముడు చెప్తుంటాడు. మీరు టీవీ చూడరంటే ఆశ్చర్యం లేదు లెండి" అంది.

కాస్సేపు చదువుల గురించి సంభాషణ సాగేక, కుర్చీ దగ్గర చాప వేసుకుని నేల మీద కూచుంది కాత్యాయని. తన్మయి కూడా చాప మీదికి మారింది. ఉండండి, దిండ్లు తెస్తాను. విశ్రాంతిగా నిద్రపోండి. బాగా అలిసిపోయినట్లున్నారు." అంది.

"నిద్ర రావడం లేదు కాత్యా! రేపు అనంత రాగానే హాస్టలు గురించి ప్రయత్నం చెయ్యాలి. ఒకవేళ దొరకకపోతే మీకభ్యంతరం లేకపోతే నేను రేపు కూడా ఇక్కడే ఉంటాను." అంది సందేహంగా తన్మయి తటపటాయిస్తూ.

"అయ్యో, అలా అడగాలా చెప్పండి. మీకు నచ్చినన్నాళ్లు ఉండొచ్చు. అవునూ, మీ బాబు ఎలా ఉన్నాడు?" అంది కాత్యాయని.

బాబుని తల్చుకోగానే జరిగిన అస్తవ్యస్త సంఘటనలన్నీ ఒక్క సారిగా జ్ఞాపకం వచ్చి కళ్లు నిండి పోయేయి.

"మిమ్మల్ని అడిగి బాధ పెట్టదల్చుకోలేదు, మీ గుండె భారం తీర్చుకోవడానికి మీ కష్టమేదైనా నాతో చెప్పడానికి వెనకాడకండి." అంది కాత్యాయని అనునయంగా దగ్గరకు వచ్చి కూచుని.

తన్మయి కళ్లు తుడుచుకుంటూ, మీతో చెప్పడానికి నాకేమీ అభ్యంతరం లేదు. అని మొదట్నించీ చెప్పసాగింది.

దాదాపు గంట సేపు తన్మయి చెప్తూండగా కాత్యాయని కళ్ల నీళ్లతో వింది.

తన బాధని పంచుకుంటూ తన కోసం కన్నీళ్లు కారుస్తూ న్న అపరిచితురాలైన ఆ అమ్మాయిని మనస్సు లోనే అభినందించకుండా ఉండలేకపోయింది తన్మయి.

"తనకి ఆశ్రయమిచ్చి, ఊరట కలిగించిన ఈ అమ్మాయిని జీవితంలో ఎప్పుడూ మర్చిపోకూడదు." అనుకుంది.

ఎప్పుడు వచ్చి విన్నాడో ఏమో బయట వరండాలో నిశ్శబ్దంగా కూచుని ఉన్న దివాకర్ కళ్లు కూడా వర్షిస్తూన్నాయి.

ఇటువంటి మంచి వాళ్లింకా ఉండడం వల్లనే ప్రపంచం ఈ మాత్రమైనా మనగలుగుతూంది.

తన్మయి తన బాధా గాథలో అనుకోకుండా ఇరుక్కున్న కరుణ విషయం మాత్రం చెప్పలేదు. ఇప్పటికే తన వల్ల అతనికి కలిగిన నష్టం చాలు. ఇక్కడే కాదు. ఎప్పుడూ ఎక్కడా ప్రస్తావించకూడదు అని నిర్ణయించుకుంది.

-----

మర్నాడు డిపార్టుమెంటులో అనంత తన్మయిని చూస్తూనే "హమ్మయ్య కనిపించావా, మా నాన్నకి కామెర్లు వచ్చి తగ్గకపోతే కె.జి హెచ్ లో జాయిన్ చేసేం. అమ్మ కూడా అక్కడే ఉంది. మీ ఇంట్లో కాస్త కేరియర్ పొంది పట్టుకెళ్లొచ్చా?" అంది ఆదుర్దాగా.

తన్మయి తన కష్టాన్ని మర్చిపోయి, "అయ్యో ఏమైంది? పద నేనూ వస్తాను" అంది.

తన్మయితో వచ్చిన దివాకర్ "మి మీర్రు వెళ్లండి. నేను నోట్సులు సంపాదిస్తాను. క్ల క్లాసులు అయ్యేక క్క కలుద్దాం." అన్నాడు.

అనంత, రాజులతో బాటూ కె.జి.హెచ్ బస్సెక్కింది తన్మయి.

తన్మయి ప్రస్తుత పరిస్థితి అంతా విని, "అయ్యో, అసలు ఇంత మంచిదానివైన నీకే కష్టాలు ఎందుకొస్తున్నాయో. నిన్ను ఇన్ని కష్టాల పాల్జేసి, బంగారం లాంటి నీ కొడుకుని కూడా దూరం చేసుకున్న అతనిదే దురదృష్టం. నువ్వేం అధైర్య పడకు. సాయంత్రం హాస్టలుకి తీసుకెళ్తాను. తెలిసిన అమ్మాయిలెవరి రూములోనైనా గెస్టుగా ఉండొచ్చు." అంది అనంత.

"థాంక్యూ, అనంతా" అంది తన్మయి కళ్లు చెమరుస్తూ ఉండగా.

"థాంక్స్ మాటికేం గానీ , నువ్వింక అన్నిటికీ కంట నీరు పెట్టుకోవడం మానెయ్యాలి. నువ్వు నిలబడి, బాబుకి మంచి జీవితాన్నివ్వాలి." అంది అనంత.

తన్మయి కళ్ళు తుడుచుకుని తల ఊపింది.

"రాజు వాళ్ల బాబాయి రైల్వే లో పనిచేసి రిటైరయ్యేరు. గాజువాక లో రైల్వే క్వార్టర్సులో వాళ్లకొక రెస్టారెంటు ఉంది. ఇప్పుడు యూనివర్శిటీకి దగ్గర్లో జరుగుతున్న ఎగ్జిబిషను లో ఫుడ్ స్టాల్ తీసుకున్నారు. మాకు డబ్బులు బాగా అవసరం కాబట్టి స్టాలులో హెల్పుకి నేను, రాజు

ఒప్పుకున్నాం. ఇంకా మరో ఇద్దరు ముగ్గురు కూడా అవసరమన్నారు కూడా.  నువ్వు సరేనంటే, నీ గురించి కూడా మాట్లాడతాను, ఏమంటావ్?" అంది అనంత.

బస్సు కిటికీ లోంచి కనిపిస్తూన్న ఆకాశం లోకి చూస్తూ "మిత్రమా! నువ్వు నిజంగా ఉన్నావు." అనుకుంది తన్మయి.

అనంత చేతిని చేతిలోకి తీసుకుని, "నీకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు అనంతా. తప్పకుండా వస్తాను క్యాంటీను కౌంటరులో పనిచేయడానికి" అంది గద్గదంగా.

ప్రతీ రోజూ సాయంత్రం అయిదు గంటల నించీ రాత్రి పదకొండు గంటల వరకూ కేంటీను లో ఉద్యోగం. కావడానికి కౌంటరు ఉద్యోగమైనా స్టాలు తెరిచిన దగ్గర్నించి కుర్చీలు, టేబుళ్లు వెయ్యడం దగ్గర్నించీ, రాత్రి మూసేసే సమయమయ్యాక సర్దడం వరకూ అన్నీ చెయ్యాలి.

అనంత, రాజు ఉన్నారు కాబట్టి తప్పని నిలువు జీతపు ఉద్యోగం ఎంత కష్టమైనా సులువుగానే అనిపించసాగింది తన్మయికి.

శుక్రవారం అనంత "శనాది వారాల్లో రోజంతా పని ఉంటుందట. మేమిద్దరం చేస్తున్నాం. ఈ వారం ఊరెళ్లడం మానేసి నువ్వూ మాతో రా తన్మయీ." అంది.

రోజుకి యాభై రూపాయలు, భోజనం పేకెట్టు . పది రోజుల వరకూ పని చేస్తే వచ్చే డబ్బులతో నెలాఖరు వరకూ గడపొచ్చు.

వారాంతం లో కూడా పనిచేస్తే రెండు మూడు వారాలు ఇంటికెళ్లి రావడానికి బస్సు ఛార్జీలకొస్తాయి.

తనూ వొస్తానన్నట్లు తలూపింది తన్మయి.

"అన్నీ బానే ఉన్నాయి గానీ ఇలాంటి చోట పని చేసేటప్పుడు చెంగు భుజాన కప్పుకోకూడదు తన్మయీ, ఇలా నడుం చుట్టూ బిగించాలి." అని నవ్వింది అనంత.

--------

యూనివర్శిటీ లేడీస్ హాస్టల్లో తన్మయి తాత్కాలికంగా అనంతకి తెలిసిన అమ్మాయి గదిలో గెస్టుగా చేరింది.

ఆ రోజు యూనివర్శిటీ నించి సాయంత్రం హాస్టలుకి రాగానే చేదు వార్త ఎదురయ్యింది తన్మయికి.

లేడీస్ హాస్టల్లో రూల్సు ప్రకారం ఎక్కువ రోజులు గెస్టుగా ఉండే అవకాశం ఉండదు. వచ్చే వారంలో ఆ రూము మరెవరికో కేటాయించబోతున్నారు.

తన్మయికి మళ్లీ సమస్య మొదటికి వచ్చింది.

మాటిమాటికీ అనంతని సహాయం అడగడమూ తనకు ఇబ్బందిగానే ఉంది. ఏం చెయ్యాలి? ఎక్కడ ఉండాలి?

హాస్టలు నించి రోడ్డు దిగువకి నడిచి సముద్ర తీరం వెంబడి నడుస్తూ "సముద్రమా! నిన్ను ఇన్ని అలలు ముంచెత్తుతున్నా ఎలా ధైర్యంగా ఉండగలుగుతున్నావు? మిత్రమా! నాకూ కాస్త ధైర్యాన్ని పంచమని సాగరంతో చెప్పవా?"

ఒక పక్క చదువు, ఒక పక్క జీవనం కోసం పోరాటం, మరో పక్క ఇంటికి వెళ్తే చాలు శేఖర్ అక్కడ కనిపించాడు, ఇక్కడ కనిపించాడని తెలుస్తున్న కబుర్లు, బాబుని వొదిలి ఉండలేనితనం...

రామకృష్ణ మిషను ఆవరణలోకి వెళ్లి కళ్లు మూసుకుని కూచుంది.

అక్కడ ఉన్నంత సేపు ఎంతో ప్రశాంతంగా అనిపించసాగింది తన్మయికి.

అప్పటి నుంచి మనసు బాధగా ఉన్నప్పుడల్లా అక్కడికి వెళ్లడం అలవాటు చేసుకుంది.

"Strength is Life, Weakness is Death.

Expansion is Life, Contraction is Death.

Love is Life, Hatred is Death."

— Swami Vivekananda "

అక్కడ గోడల మీద తన కోసమే రాసినట్లున్న ఆ వాక్యాల్ని మళ్ళీ మళ్ళీ స్ఫురింపజేసుకుంటూ

బయట వరండాలో చెప్పులు వేసుకుంటూ ఎదురుగా గోడకున్న ఎడ్వర్టైజుమెంటుని యథాలాపంగా చూసింది తన్మయి.

స్థానిక వివేకానంద ఆశ్రమపాఠశాలలో రెసిడెంటు టీచర్ల కోసం ప్రకటన అది. రెసిడెంటు ఉద్యోగంలో చేరితే తన హాస్టలు బాధలు తీరుతాయి. కానీ చదువు, ఉద్యోగం ఒకటే సమయంలో ఎలా కుదురుతాయో చూడాలి. ఏదైనా సోమవారం వెళ్లి చూద్దాం అనుకుంది.

అడ్రసు వివరాలు రాసుకుని బయటకు వచ్చి సముద్రం వైపు శిరస్సు వంచి కన్నీళ్లతో నమస్కరించి "మిత్రమా! నాకీ ఉద్యోగం ఇప్పించు" అంది.

-------

మర్నాడు ఇంటికి వెళ్లే ముందు బాబుకి రోడ్డు పక్కన చవకగా వస్తువులు అమ్మే చోట ఒక జత బట్టలు, ఒక చెప్పుల జత కొంది తన్మయి.

స్వయంగా సంపాదించిన డబ్బులతో కొన్న మొదటి వస్తువులని ఎంతో సంతృప్తిగా చూసుకుంది. గుండెలకు హత్తుకుంది. ఈ బట్టల్లో బాబు ఎంత ముద్దొస్తాడో. అని ఊహించుకుని మురిసిపోయింది. ముందంతా ఎప్పుడూ లేని అత్యంత అనందం ఇది.

బస్సెక్కే ముందు ఒక్క సారి బాబు గొంతు వినాలనిపించింది.

అవతలి నుంచి బాబు "అమ్మా!" అని పిలవగానే తన్మయి గుండె ఉప్పొంగింది. ఫోనులోనే వాడికి ముద్దులు కురిపించింది.

కానీ జ్యోతి గొంతు ఎప్పుడూ లేనంత దిగులుగా వినిపించింది.

సాయంత్రం ఇంటికి వెళ్లేక గానీ విషయం అర్థం కాలేదు తన్మయికి.

తండ్రి గుమ్మంలోనే వాలు కుర్చీలో నిశ్శబ్దంగా కూచుని ఉన్నాడు.

జ్యోతి చేతిలో నుంచి పోస్టల్ కవరు తీసుకుని టైపు చేసి ఉన్న మొదటి పేజీని చూసి అక్కడే కూలబడింది తన్మయి. శేఖర్ నించి "విడాకుల నోటీసు" అది.

రెండు నెలల నించి కేవలం కోపంతో వెళ్ళిపోయి తిరిగి వస్తాడని ఎదురు చూసిన తల్లిదండ్రులకి అశనిపాతంలా తగిలింది ఇది.

తన్మయికి ఏం చేయాలో పాలుపోలేదు. బాబుని గుండెలకు హత్తుకుని నిశ్శబ్దంగా రోదించసాగింది.

జ్యోతి కూతురి భుజమ్మీద చెయ్యి వేసి రాస్తూ కూచుంది.

ఇంతలో బయట వరండా లో కూచున్న భానుమూర్తి మూలుగుతున్నట్లు వినిపించి అటు పరుగెత్తారు. అప్పటికే గుండె పట్టుకుని ఎగ ఊపిరితో సతమతమవుతున్న తండ్రిని చూడగానే కెవ్వున అరిచింది తన్మయి.

28

భానుమూర్తికి గుండె పోటు వచ్చింది. అదృష్టం కొద్దీ ఆసుపత్రికి వెంటనే తీసుకెళ్లడం వల్ల ప్రమాదం తప్పింది.

ఇక మీదట ఉద్వేగం, బాధా తెప్పించే విషయాలేవీ ప్రస్తావనకు తీసుకు రావొద్దని హెచ్చరించారు డాక్టర్.

ఎప్పుడూ ధీమాగా ఉండే తల్లి మొదటిసారి బాగా బెంబేలు పడడం చూసింది తన్మయి.

తండ్రి కొద్దిగా తేరుకోగానే ఇంటికి వచ్చేరు.

వస్తూనే జ్యోతి వంటింట్లో టీ పెట్టడానికి వెళ్లింది. రోజల్లా ఆడి అలిసిపోయి నిద్రపోతున్నాడు బాబు. ఆ పక్కనే మరో మంచమ్మీద బాగా నీరసించిపోయిన తండ్రి పడుకున్నాడు.

తన్మయికి తండ్రి ముఖంలో, మూసి ఉన్న కను రెప్పల కింద కదులుతున్న అవిశ్రాంత కనుపాపలలో అప్రశాంతత కొట్టొచ్చినట్లు కనిపించసాగింది. మనస్సులోని బాధ వొంటిమీద బాగా ప్రభావం చూపించింది.

సాయం సంధ్య కావస్తూంది.

తన్మయి విడాకుల నోటీసు పెట్టె లోంచి తీసి చూసింది. త్వరలో కోర్టుకి వెళ్ళి హాజరు కావాల్సి ఉంది.

తమకింత వరకూ కోర్టు , న్యాయ వ్యవస్థ ఏవీ తెలీదు. ఎప్పుడూ వాటి వెనక తిరగాల్సిన అవసరం తమ కుటుంబానికి రాలేదు.

తండ్రి అంతగా కుంగిపోవడానికి కారణం అదేనని తనకు తెలుసు. పరువూ, మర్యాద కలిగిన సగటు పల్లెటూరి కుటుంబం తమది. ఇప్పుడు మొదటిసారిగా తన వల్ల ఇటువంటి అగత్యం కలిగింది.

తన్మయి ఆలోచిస్తూన్న కొలదీ కలుగుతూన్న గిల్టీ కాన్షస్ తో కుంగిపోసాగింది.

చీకటి పడ్తూన్న వేళ  డాబా మీదికి  మెల్లగా వచ్చి తనకిష్టమైన పూల పొదరింటి దాపున కూచుంది.

ఒకప్పుడు ఎంత హాయిగా ఉండేది తన జీవితం!

తల్లిదండ్రుల గారాల పట్టి తను. అమ్మమ్మ, అమ్మ, నాన్న, స్నేహితురాళ్లు ..చుట్టూ అంతా ప్రేమించే వాళ్లే ఉండేవాళ్లు.

శేఖర్ తన జీవితంలోకి ప్రవేశించిన తర్వాత మొదలైన అల్లకల్లోలం తన జీవితాన్ని తారుమారు చేసేసింది.

జీవితపు పోరులో మనశ్శాంతితో బాటూ అన్నీ కోల్పోయింది. తన ప్రాణ స్నేహితురాలైన వనజని కూడా పలకరించే అవకాశం లేని దౌర్భాగ్యపు బతుకు అయ్యింది.

వీధి మొదట్లో దుమ్ము రేపుకుంటూ వస్తున్న ఆవులు, మేకల గుంపులు , వాటి వెనకే భుజాన కర్రలకి తగిలించుకున్న సత్తు కేరియర్లు, అదిలింపుల వింత శబ్దాలు.

అనంతాకాశం నారింజ రంగులోకి మారి సమస్త ప్రపంచానికి విశ్రాంతిని కలగజేస్తోంది తన ఆలోచనలకి తప్ప.

తన్మయికి అనంత మాటలు జ్ఞాపకం వచ్చేయి. "శేఖర్ నిన్ను ప్రేమించేడు కాబట్టి ,అతన్ని ప్రేమిస్తున్నానన్న భ్రమలో బతికేవు నువ్వు. ఆ భ్రమలో  అదిలింపుల చేతి కర్రని అతనికి నువ్వే స్వయంగా అందించేవు."

అనంత అన్నది నిజమేనేమో,  తనని కాచేవాడు ఎటు తోలుకెళ్తాడో పట్టని ఈ మూగ జీవాలకీ, తనకీ ఏవైనా తేడా ఉందా?!

కనీసం తనకంటూ బ్యాంకు అకౌంటు ఒకటుండాలని కూడా ఆలోచించని తను మూగమొద్దుగాక ఏమవుతుంది?

అక్కణ్నించి తెచ్చిన తన సామాన్లన్నీ కొన్ని ఇంకా సంచులలోనే ఉన్నాయి. గోనె సంచులకి చేరిన తన సంసారం చూస్తుంటే విరక్తి తన్నుకు వస్తోంది.

పుస్తకాల వరకూ బయటికి తీసి తన గదిలో సర్దుకుంది తన్మయి.

మంచమ్మీద పడుకున్నప్పుడల్లా ఆ మంచం కొనడం కోసం తల్లి, శేఖర్ ల మధ్య జరిగిన వాగ్వివాదాలన్నీ జ్ఞాపకం వస్తున్నాయి.

దిగులు చీకటిలా ముసురుకోసాగింది.

తన ఈడు వాళ్లు స్కూటర్ల మీద భర్త చుట్టూ చేతులు వేసి కూచుని ఆనందంగా ఎక్కడికో వెళ్తూంటే విపరీతమైన బాధ కలగ సాగింది.

ఇక తండ్రిని చూట్టానికి వచ్చిన బంధువుల సానుభూతి వచనాలు అసలే వినలేకపోతూంది.

"బంగారం లాంటి చంటి పిల్లోడు అన్యాయం అయిపోయేడు. మేం అప్పుడే చెప్పేం ఆ సంబంధం చేసుకోవద్దని" .

"మీ వంశం వాళ్లకి అది ఆనవాయితీ ఏమో. భాను చెల్లెలు కూడా ఇలాగే చిన్నతనం లోనే మొగుడొదిలేస్తే ఇంట్లోనే ఉండిపోయిందిగా"

"అతనికేవిటీ, మొగోడు ఎన్ని తిరుగుళ్లయినా తిరుగుతాడు, ఆడోళ్ళం మనవే సర్దుకుపోవాలి, తెగేదాకా లాక్కోకూడదు"

"ఇప్పుడేడ్చి ఏం లాభం? చదువులంటూ దేశమ్మీదికి బయలుదేరిన ఆడోళ్ళ గతి ఇంత కంటే ఏం బాగుపడతది?"

ఎవరైనా ఏదైనా అంటే చెంప దెబ్బకొట్టినట్టు సమాధానం చెప్పే తల్లి కూడా బంధువుల మాటలకి సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండడం మరింత న్యూనతా భావాన్ని కలగజేస్తోంది తన్మయికి.

జరిగిన, జరుగుతున్న సంగతుల కంటే మాటలు భరించలేకపోతూంది తన్మయి. ఎవరు ఇంటికొచ్చినా గదిలోంచి బయటికి రావడం మానేసింది. తన కన్నీళ్లకి అర్థం లేదు. తన వ్యథలు ఎవరికీ అక్కరలేదు. ఓడిపోయిన ఒంటరి బతుకు!!

సామాన్ల లో నుంచి బాబు ఫోటో ఫ్రేము తీసి స్టడీ టేబుల్ మీద పెట్టుకుంది. తనకున్న ఒకే ఒక్క ఆధారం ఈ చంటిపిల్లాడు.

"మిత్రమా! నాకు ఈ ప్రపంచంలో బతికే స్థయిర్యాన్ని ప్రసాదించు. ఎక్కడ ఓడిపోయినా తల్లిగా నన్ను గెలిపించు." అని కన్నీళ్లతో ప్రార్థించసాగింది.

----

ఆ సాయంత్రం వనజ గేటు తీసుకుని వస్తూ కనిపించింది.

కిటికీలోంచి దిగులుగా ఆకాశాన్ని చూస్తున్న తన్మయి తన కళ్లని తనే నమ్మలేకపోయింది. ఒక్క ఉదుటున పరుగెత్తుకెళ్ళి వాకిట్లోనే స్నేహితురాలి చేతినందుకుంది.

"నీ గురించి అమ్మ ఫోనులో చెప్పింది. ఒక్క క్షణం కూడా ఉండలేక, వెంటనే బయలుదేరి వచ్చేసేను." అంది వనజ.

మామూలు పలకరింపులు కాగానే ఇద్దరి మధ్యా నిశ్శబ్దం అలుముకుంది. తనకు గుర్తుండి ఇంత నిశ్శబ్దం ఇదే మొదటి సారి వనజకూ తనకూ మధ్య. వనజ పెద్దగా నిట్టూరుస్తూ అంది.

"అధైర్యపడాల్సిన పనిలేదు, నువ్వు నిలబడాలి, నిలబడతావు, నాకు నీ మీద నమ్మకం ఉంది తన్మయీ!" అంది.

తన చేతిలో ఉన్న స్నేహితురాలి చెయ్యి తడిసేలా రోదించసాగింది తన్మయి.

తన్మయి దు:ఖం నించి తేరుకునేదాకా ఆగింది వనజ. "నువ్వు ఏడవగలిగినంతా, హృదయంలో దు:ఖం తీరే వరకూ బాధపడు తన్మయీ! కానీ ఒక్కటి గుర్తు పెట్టుకో. దు:ఖం నిన్ను దుర్బలం చేసి ఎటూ తేల్చుకోనివ్వని అశనిపాతమై ఒక్క అడుగు కూడా ముందుకు కదలనివ్వదు."

ఇంకా తన్మయి మెల్లగా రోదిస్తూనే ఉంది.

ఒక విధంగా ఆలోచిస్తే, "అతన్ని నువ్వు వద్దనుకున్న రోజే ఈ నోటీసు అతనికి నువ్వు పంపించి ఉంటే బావుండేదేమో, అతనికి నువ్వు వద్దనుకునేంతవరకూ ఆగినందువల్ల నోటీసు నువ్వు అందుకోవాల్సి వచ్చింది." అంది వనజ.

తన్మయి కన్నీళ్లు తుడుచుకుంటూ వనజ వైపు చూసింది. ఇన్ని సంవత్సరాలు వనజకి ఉత్తరం కూడా రాయలేదు తను. అయినా తనని క్షమించి తన కోసమే పనిగట్టుకుని ఊరొచ్చింది. తనని ఊరడించే పెద్ద మనసు, ఇంత విశ్లేషణాత్మకంగా అలోచన చెయ్యగలిగే పరిణతీ వనజకి వయసుతో వచ్చిందా? తన కంటే కాస్తే పెద్దది వనజ. అయినా వనజకున్న ఆలోచన తనకెందుకు లేదు? సంప్రదాయాల్ని పట్టుకుని వేళ్లాడే మూర్ఖత్వమా? పిరికితనమా? "ప్రేమించడం" అనే పదం వెనుక బందీ అయిపోయిన పసితనమా?

అదే అంది వనజతో.

"స్త్రీ పురుషులిద్దరూ సమానంగా సంప్రదాయాలకి, విలువలకీ, సమాజానికి కట్టుబడి ఉండాలి కదా! ఒకరికి అవసరం లేని న్యాయం మరొకరికి ఎందుకు? ఇక ప్రేమ అంటావా, ఏం చేసినా భరించడం ప్రేమెలా అవుతుంది తన్మయీ?! అతను నిన్ను ఇష్టపడ్డాడని నువ్వతన్ని ఇష్టపడినట్లు భావనలో పడ్డావు. ఆ భావనతోనే అతని హింసని మౌనంగా భరించేవు."

అని చేతి సంచీ లోంచి "జానకి విముక్తి" నవల చేతిలో పెట్టింది. ఆశ్చర్యంగా చూసింది తన్మయి.

"నీ కోసం ఈ పుస్తకం తెచ్చాను. నువ్వు తప్పకుండా చదవవలిసిన పుస్తకమిది. చదివి ప్రశాంతంగా ఆలోచించుకో. ఇందులో మూర్తి సత్యంతో అన్న మాటలు నీతో చెపుతాను. స్వతంత్ర ఆలోచన, ఎదిరించే చైతన్యం ఎదుటి వాళ్ళలో కలిగించకుండా, మన భావాలను వాళ్ళ మీద రుద్దితే అది సరైన ఫలితాన్ని ఇవ్వదు, పరిస్థితుల్ని ఎదిరించే చైతన్యాన్ని కలిగిస్తూ, వాళ్లకు అండగా నిలబడాలి" అని చిన్నగా నవ్వింది వనజ.

"ఒక పీడ వదిలిపోయింది అనుకో తన్మయీ. అతనే కావాలని దూరంగా వదిలి వెళ్లి, ఒక విధంగా అతను నీకు మంచి చేస్తున్నాడు, భార్యని వదిలి పెట్టకుండా జీవితాంతం హింసించే వాళ్ల పాలబడి నలిగిపోతున్న వారెందరో. ఇది నీకు లభించిన సదవకాశంగా భావించు. తప్పులు అందరం చేస్తాం. వాటిని సరిదిద్దుకోవడంలోనే మన విజ్ఞత దాగి ఉంటుంది. సగర్వంగా జీవితాన్ని కొనసాగించు. నీ లక్ష్యం ముందు ఏదీ తక్కువ కాదనే పట్టుదల నీకుందని నాకు తెలుసు. ఇక సమాజం, బంధువులంటావా, ఈ రోజు నేను చెప్తున్నాను చూడు. నువ్వు నిలబడ్డ రోజు వీళ్లంతా నువ్వు గొప్పదానివని నిన్ను పొగుడుతారు. నిన్ను అర్థం చేసుకోకుండా నోటికొచ్చినట్లు మాట్లాడే వాళ్ల పొగడ్తలనూ లెక్క చేయవలసిన పని లేదనుకో." అని తన్మయి ముఖం కాస్త కుదుట పడడం చూసి,

"మా చిన్నాన్న గారు విశాఖపట్నంలో మంచి లాయరు. నీకు ఉత్తరం రాసి ఇస్తాను. పట్టుకెళ్లు, ఆయన నీకు తప్పకుండా సాయం చేస్తారు. నేను కూడా వీలైతే ఫోను చేస్తాను నీ గురించి. ఆయన స్వయంగా నీ కేసు తీసుకోలేకపోతే తెలిసిన వారెవరికైనా అప్పజెపుతారు. ఫీజులో మినహాయింపూ ఇప్పిస్తారు. నేను రేపే వెళ్లిపోతున్నాను. ధైర్యంగా ఉండు తన్మయీ!" అంది వనజ.

జానకి విముక్తి ఒకటికి రెండు సార్లు చదివింది తన్మయి.

జానకి తన అన్న సత్యం మాటల్తో ప్రభావితమై తన చైతన్య స్థాయిని పెంచుకుంటూ, నికృష్టుడైన భర్త కబంధహస్తాల్లోంచి బయట పడి, స్వతంత్రంగా ఉద్యోగం చేసుకుంటూ, తన కాళ్ళ మీద తను నిలబడి, పిల్లవాణ్ణి తనే పెంచుకుంటూ, తన భావాలను అభివృద్ధి చేసుకున్న విధానం ఎంతో బలాన్నిచ్చింది తన్మయికి.

మనసులో వనజకు ఎన్ని సార్లు ధన్యవాదాలు చెప్పుకుందో లెక్కలేదు. కుటుంబ దాష్టీకాలకు బలైపోతున్న తనలాంటి ప్రతీ యువతీ చదవాల్సిన పుస్తకమిది. తన్మయికి కర్తవ్యం బోధపడింది.

------

తండ్రికి కాస్త త్వరగానే కుదుటపడడం వల్ల తన్మయి మరుసటి వారమే విశాఖపట్నానికి చేరింది. తన జీవితంలో రోజుకొక రకంగా మారిన పరిస్థితుల వల్ల ఈ సంవత్సరం కాలేజీలో సగ భాగం క్లాసులు పోయాయి. అనంత, రాజుల నోట్సులు తీసుకుని రాత్రీ, పగలూ రాసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వస్తూనే తలదాచుకోవడానికి హాస్టలులో వెళ్లి అడిగినా ప్రయోజనం లేకపోయింది. దిగులు ముఖంతో కూచుని ఉన్న తన్మయికి అచ్చు తనలాగే దిగాలు పడి నడుస్తూ వస్తూ కరుణ కనిపించాడు. బాగా పెరిగిన గడ్డం, వాడిపోయిన ముఖం. బెంచీకి ఆ చివర కాళ్ల వైపు చూసుకుంటూ కూచున్నాడు. తన్మయికి అతనితో ఎలా మాట్లాడాలో కూడా తెలియని సందిగ్ధత ఏర్పడింది.

"నన్ను క్షమించండి" అంది నెమ్మదిగా.

బదులుగా "ఎలా ఉన్నారు?" అన్నాడు ముభావంగా.

బేగులోంచి నోటీసు తీసి అతని చేతిలో పెట్టింది.

"ఇదంతా నా వల్లనేనా? మీరే నన్ను క్షమించాలి మయీ" అన్నాడు గద్గదంగా.

అతని తప్పు ఏం లేదని స్పష్టంగా తెలుసు తన్మయికి. అతని బదులు ఎవరు ఉన్నా, జరిగేదదే. అదే చెప్పింది.

"మీరెంత చెప్పినా మీ జీవితం తలక్రిందులు కావడానికి నేను ఒక కారణమయ్యేనన్నది నాకు బాగా బాధని కలిగిస్తోంది. అసలే అనేక సమస్యలతో సతమతమవుతున్న నాకు ఇదొక కొత్త సమస్య తయారైంది." అన్నాడు.

తన్మయి అతన్ని అర్థం చేసుకోగలదు. కానీ ఎవరి సమస్యలు ఎవరూ ఆర్చలేని, తీర్చలేని పరిస్థితి తామిద్దరిదీ.

కొద్దిసేపు మౌనం తర్వాత,

"మానసిక వేదన బొత్తిగా భరించలేకపోతున్నాను. వీటన్నిటి నుంచి బయటపడాలంటే పుస్తకం తప్ప వేరే సాధనం కనబడ్డం లేదు కరుణా! నాకు ఒక సాయం చేస్తారా?" అంది దీనంగా.

"చెప్పండి" గట్టిగా ఊపిరి పీల్చి అన్నాడు కరుణ.

"జే. ఆర్. ఎఫ్ కు సంబంధించి నాకు వీలయినన్ని పుస్తకాలు తెచ్చిస్తారా? ఇప్పుడున్న పరిస్థితుల్లోఅదొక్కటే నాకు శరణ్యం" అంది.

"నాకు అదే చాలా అబ్బురంగా ఉంటుంది! ఇన్ని బాధల్లో ఎలా చదవగలుగుతారో మీరు! మీతో మాట్లాడుతుంటే నాకూ ఎక్కడలేని ఆశా కలుగుతుంది తన్మయీ. అయినదేదో అయిపోయింది ఇక మనం చదవడం కొనసాగించాలి. ఉండండి, దివా, రాజు వాళ్లనీ పిలుచుకొస్తాను" అని లేచేడు.

దివాకర్ వస్తూనే తన్మయితో "కా..కాత్యక్క మ్మి..మిమ్మల్ని తీసుకు రమ్మని ఏ..ఎప్పుడూ చెప్తూ ఉంటుంది. మ్మ...మనందరి చదువూ మ్మా..మా ఇంటి అరుగు మీద పె..పెడదామా?" అన్నాడు.

అనంత "ఇక మీదట నువ్వు ఎక్కడ తలదాచుకోవాలా అని బాధ పడక్కరలేదు తన్మయీ. రాజు ఎంసెట్ కోచింగు సెంటర్లో సాయంత్రం పూట సంస్కృతం క్లాసులు చెప్పడానికి ఒప్పుకున్నాడు. ఇక్కణ్ణించి గంట దూరంలో ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నాం. మాతో వచ్చేయి." అంది అనంత.

తన్మయికి సంతోషం వెల్లువలా పెల్లుబికింది.

"మంచి సంతోషకరమైన వార్త చెప్పేవు అనంతా" అంటూ ఆనందంగా కౌగిలించుకుంది.

"ఆ మధ్య నేనొక రెసిడెన్షియల్ స్కూలులో ఉద్యోగాలకు ప్రకటన చూసేను. ఇప్పుడుంటాయో లేదో" అంది తన్మయి సాలోచనగా.

"విద్యా సంవత్సరం ప్రారంభమయిపోయింది కాబట్టి కష్టమే మరి, అయినా వెళ్లి చూద్దాంలే" అంది అనంత.

"వాళ్లకు సాయంత్రం పూట క్లాసులు ఉంటే నువ్వూ, నేనూ ట్యూటర్లు గా చేరొచ్చు" అంది తన్మయి.

"నాకు ఇప్పుడప్పుడే ఉద్యోగం చేసే ఉద్దేశ్యం లేదులే అని, చెవిలో మెల్లిగా"....." చెప్పి, నవ్వింది అనంత.

అనంత నెల తప్పింది. ఇంకా జీవితాల్లో స్థిరపడకుండా అనంత పెళ్ళి ఎందుకు చేసుకుందో, ఇప్పుడే పిల్లలని కనడమేవిటో అర్థం కాలేదు తన్మయికి. కానీ ఏదైనా జరగక ముందు ఆలోచించుకోవాలి ఎవరైనా. జరిగేక తప్పనిసరిగా ధైర్యంగా నెట్టుకు రావాలి. తన్మయికి తెలిసిందంతే.

అందుకే అనంత చేతిని తన చేతిలోకి తీసుకుని, "కంగ్రాట్స్, నీకేంకావాలో చెప్పు ఒండి పెడతాను" అంది తన్మయి.

బస్సులో అనంతతో బాటూ వెళ్తూ తమ బస్టాపు దాటగానే తన్మయికి దిగులు మళ్ళీ ఆవరించింది. ఒకప్పుడు అనంత తమ ఇంట్లో ఉంటానని అడిగింది. ఇప్పుడు తను అనంత ఇంటికి వెళ్తూ ఉంది. ఎంత సంక్లిష్టమైంది జీవితం! ఎప్పుడు తలకిందులై పోతుందో ఎవరికీ తెలియదు కదా!!

----

వనజ ఇచ్చిన ఉత్తరం తీసుకుని లాయరు గారి ఇల్లు వెతుక్కుంటూ వెళ్లింది తన్మయి. గేటు తీసుకుని లోపలికి వెళ్లి, కాలింగు బెల్లు కొట్టే ముందు గుమ్మం దగ్గర బోర్డు మీది పేరుతో కవరు మీది పేరుని సరిచూసుకుంది.

తలుపు తీస్తూనే వనజ పిన్ని "రామ్మా, వనజ ఫోను చేసింది మాకు" అంటూ ఆదరంగా లోపలికి తీసుకెళ్లింది.

తినడానికి, తాగడానికి ఇచ్చి, కాస్సేపు సేద తీరిన తర్వాత వనజ చిన్నాన్న గారిని పిలిచింది. ముందు గదిలో ఆయన ఆఫీసులో కుర్చీ వెనక గోడ మీద "సత్యమేవజయతే" అని రాసి ఉంది. ఆయన వనజ ఇచ్చిన ఉత్తరం తీసి చదువుకుని, అసలేం జరిగిందో వివరంగా చెప్పమన్నారు.

గుండె నిండుగా ఊపిరి పీల్చుకుని మొదలు పెడుతూ తన్మయి గోడ వైపు చూసింది.

అంతా విని తల పంకించి "ఒక్క నిమిషం"అంటూ ఫోను తీసి రింగ్ చేసి, "పది పదిహేను నిమిషాలలో రాగలరా?" అన్నారు ఎవరితోనో.

తన్మయి వైపు చూసి, "చూడమ్మా! మంచి వాడు, నిజాయితీ పరుడు అయిన లాయరు విశ్వని నీకప్పగిస్తున్నాను. నాకు జూనియర్, వృత్తికి కొత్త వాడే కానీ మంచి పట్టున్న వాడు. నీ కేసు ఆయనకు అప్పగిస్తున్నాను. ఇవేళ నిన్ను పరిచయం చేస్తాను" అని కుర్చీ లో నుంచి లేచి అటూ ఇటూ తిరుగుతూ

"అతను నీ మీద అక్రమ ఆరోపణతో విడాకుల కేసు పెట్టేడు. అవన్నీ నిజాలు కావని నిరూపణ చేస్తూ, కేసు నించి బయట పడాలి. నిజానికి నువ్వు కావాలనుకుంటే విడాకులు వెంటనే వస్తాయి. అతను నిన్ను పెట్టిన హింస తక్కువేమీ కాదు. కుటుంబంలో అంతర్గతంగా ఉన్న శారీరక హింసని నువ్వు నిరూపణ చెయ్యలేకపోవచ్చు. మానసిక హింసని కూడా హింసగానే పరిగణిస్తాయి కోర్టులు. అన్నిటినీ తట్టుకుని ధైర్యంగా నిలబడగలిగినందుకు నిన్ను అభినందిస్తున్నాను." అని ఒక్క నిమిషం ఆగి,

"మా వనజ అంటే నాకు, వాళ్ల పిన్నికి చాలా అభిమానం. తన స్నేహితురాలిగా నీకు అన్ని విధాలా సాయం చేస్తాను. ఫీజుల గురించి ఆలోచించకు. అవన్నీ నేను చూస్తాను. నీ చేతిలో డబ్బు ఉన్నపుడు తెచ్చి ఇద్దువుగాని." అన్నాడు.

తన్మయి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించింది.

లాయరు విశ్వ చురుకైన యువకుడు, మాట్లాడుతున్నప్పుడు ఎటో చూస్తూ ఉన్నా, నిశితమైన అతని వాగ్ధాటి అతని పట్ల విశ్వాసాన్ని కలుగజేస్తోంది.

పరిచయాలలో "మీ డిపార్టుమెటు హెడ్డు గారు నాకు స్వయానా మేనమామ" అన్నాడు విశ్వ .

తన పట్ల కాలానికి ఇంకా దయ ఉన్నందుకు తన్మయికి ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి. వనజ చిన్నాన్న గారే అనుకుంటే ఆయన కంటే మంచి వ్యక్తి, పైగా మాస్టారికి మేనల్లుడు తన లాయరుగా లభించడం తన అదృష్టం.

-----

మర్నాడు లాయరు విశ్వ ను ఆఫీసులో కలవడానికి అపాయింట్మెంట్ తీసుకుంది తన్మయి. తన ముందు ఉన్న మరో రెండు కేసుల వాళ్ళు వెళ్ళేంత వరకూ బయట బెంచీ మీద కూర్చుంది తన్మయి. తను ఎప్పుడూ ఇలా లాయర్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని కనీసం ఊహించుకోను కూడా లేదు. తనకీ పరిస్థితి కల్పించిన శేఖర్ మీద ద్వేషం పుట్టుకు రాసాగింది.

లాయరు విశ్వ తన్మయి వైపు చూసి తల పంకించి, "కాగితాలన్నీ సిద్ధం చేస్తున్నాను.మీరు వివరాలన్నీ రాత పూర్వకంగా ఇవ్వండి. టీ తాగుతారా? " అన్నాడు.

తన్మయి తల అడ్డంగా ఊపి, చేతికిచ్చిన పాడ్ అందుకుంది.

"మీరు నచ్చినంత సమయం తీసుకుని నిదానంగా జరిగినదంతా గుర్తు చేసుకుని రాయండి. మీకు తెలియకపోవచ్చు గానీ, ఒక లాయరుగా నాకు బాగా అర్థమవుతున్నదేవిటంటే, అతను ఇదంతా ఒక పథకం ప్రకారం చేసేడు. ఇదంతా చేసే ముందు అతను లాయరుతో సంప్రదించి సలహాలు తీసుకున్నాడని అర్థం అవుతూ ఉంది." అన్నాడు విశ్వ.

తన్మయి ఆశ్చర్యంగా చూసింది.

"ముందుగా అతను మీరు వైజాగులో ఉన్నారన్న విషయం తెల్సినా, ఇంటికి రాకుండా జాగ్రత్త పడ్డాడు. మీ స్నేహితులు చదువుకుందుకు మీ ఇంటి దగ్గరికి ఎప్పుడూ వస్తారని అతనికి తెలుసు, కానీ అదే విషయాన్ని అతని బంధువులకు చెడ్డగా వివరించి, వెళ్లి చూడమని పంపించాడు. ఇక ఇంటిగల వాళ్ల ముందు రచ్చ పెట్టడానికి కారణమూ అదే, మీ ఇద్దరి మధ్యా ఏ గొడవ జరిగినా నలుగురికీ తెలిస్తేనే సాక్ష్యం ఉంటుంది. ఇక మీ స్నేహితుణ్ణి కొట్టి అతనితో సంతకం పెట్టించుకున్న ఖాళీ కాగితాల మీద, కోర్టు కోసం ఉత్తరాలేవో సృష్టించుతాడన్నమాట. మిమ్మల్ని, బాబునీ ఒంటరిగా వదిలేసినదీ, ఇంటిగలవాళ్లతో చెప్పి ఇల్లు ఖాళీ చేయించినదీ అన్నీ పథకాలే. అవన్నీ మీ అంతట మీరు గానే మీ తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లిపోయేరని నిరూపణ చెయ్యడానికే. మీ వైపు నించి మీ కథ ఎవరికి వినిపించినా నమ్మడానికి లేకుండా అన్ని సన్నివేశాలనీ అతని ముందుగానే కల్పించాడు. ఆడవాళ్లకి విడాకులు కావాలంటే భర్త హింసించాడని చెప్పినా చాలు. కానీ మగవాడికి విడాకులు కావాలంటే బలమైన కారణం లేకుండా అసాధ్యం. అందుకే అతనివన్నీ చేసేడు." అన్నాడు.

వింటున్న తన్మయికి రక్తం మరిగిపోసాగింది. ఎంత మోసం! ఎంత కుట్ర!! తనస్సలు ఉహించలేకపోయింది, ఇవన్నీ కాకతాళీయంగా జరిగేయని గుడ్డిగా నమ్మింది. అతనికి విడాకులే కావాలనుకుంటే ఇన్ని చెయ్యాలా? తనని అడిగితే తనే ఇచ్చేసేది కదా! అతని పట్ల తనకున్న కట్టుబాటు

అలాంటిది. తనని అందరి ముందూ అవమానాల పాలు చేసి, ఇల్లూ, వాకిలీ లేకుండా చేసి, చేతిలో రూపాయి లేకుండా రోడ్డు మీద నిలబెట్టి, సొంత ఊరికి తరిమి కొట్టి అతను బావుకుంటున్నది ఏంటి? తన పట్ల కించిత్ కూడా ఇష్టం లేదన్నది అతను ఎవరినో ఇంటికి తెచ్చుకున్నపుడే అర్థమైంది.

కానీ బాబు పట్ల కూడా ఇష్టం లేదా? ఇన్నాళ్లూ తను అతన్ని ఎందుకు భరించింది? పిల్లాడికి తల్లిదండ్రులిద్దరి ప్రేమ, ఆలనా పాలనా అవసరమనే కదా! ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేకపోయిందా అతనికి? బంగారం లాంటి పిల్లాడు ఏం పాపం చేసాడు? విడాకుల వల్ల వాడి పరిస్థితి ఏంటి?

అదే అడిగింది లాయరుని.

"తన్మయి గారూ, మీకున్న ఆప్షన్లు చెప్తాను-

ఒకటి -అతను ఆరోపించిన అక్రమత్వం నిజం కాదని నిరూపించుకుని విడాకులు ఇవ్వనని చెప్పడం. మీరు విడాకులు ఇవ్వక పోవడం వల్ల అతనితో తిరిగి కలిసి జీవించే అవకాశం ఉంటుంది.

రెండు -ఆరోపణలు అబద్ధం అని నిరూపించి, మానసిక హింస కేసు పెట్టి అతని మీద విడాకుల కేసు మీరు పెట్టడం.

మూడు- వాడి ఖర్మకి వాణ్ణి ఒక్క సంతకంతో వొదిలెయ్యడం."

ఇక బాబు సంరక్షణ తల్లిగా మీకే వస్తుంది. అందుకు చింతపడాల్సిన పని లేదు...అతనింకా ఏదో చెప్తూ ఉన్నా తన్మయికి ఏవీ వినిపించడం లేదు.

తన్మయికి మనసంతా విపరీతమైన నిర్వేదం, వైరాగ్యం కలిగింది.

తనేం పాపం చేసింది! అతనికేం తక్కువ చేసింది? తనని ఎందుకు ఇంతగా హింసిస్తున్నాడు?

ఇప్పుడు తన రక్తం మరిగేటంత ద్వేషాన్ని కలిగిస్తున్న ఇతన్నా తన సంరక్షకుడని, తన జీవితాంతపు సహచరుడని నమ్మింది! బయటికొచ్చి బెంచీ మీద కూలబడింది. కళ్లు తెరిచినా, మూసుకున్నా కనుపాపల్లో కదులుతున్న దుఃఖపు చారికలు కళ్లలో నిప్పురవ్వల్ని వేసుకున్నట్లు మంట పుట్టిస్తున్నాయి. ఆ మంటల వెలుగులో నుంచి ఉద్భవించినట్లు నిత్య నూతనమై, ఒకే ఒక్క ప్రమాణంగా భువనాన్ని తేజోమయం చెయ్యగలిగిన గొప్ప వాక్యం స్ఫురించింది –

"సత్యమేవ జయతే"

అదే రాసింది మొదటి పేజీ మీద-

## 29

లాయరు విశ్వ ఆఫీసు బయట గదిలో బెంచీ మీద కూర్చుని జరిగినదంతా గుర్తు తెచ్చుకుని రాయడం మొదలు పెట్టింది తన్మయి. దు:ఖం కళ్ల నిండి, అక్షరాలు అలుక్కు పోతూ ఉన్నాయి.

మళ్లీ మళీ అదే ప్రశ్న. "అసలు అతను ఇదంతా ఎందుకు చేసేడు?"

అదే అడిగింది లాయరు విశ్వని.

పేపర్లు అందుకుని దీక్షగా మొదటి వాక్యం "సత్యమేవ జయతే" వైపు కాస్సేపు చూసి, తరువాత పేజీలన్నీ తిప్పి గబగబా చదివేడు.

చేతిలోని కాగితాల్ని టేబుల్ మీద పెట్టి, ఆ పైన పేపర్ వెయిట్ పెడుతూ తన్మయి వైపు చూసి,

"మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే" అని కారల్ మార్క్స్ ఏనాడో చెప్పేడు. ఇంత చదువుకున్నారు మీకు నేను చెప్పనవసరంలేదనుకుంటా. ఈ కేసులో బాగా అర్థమవుతున్న విషయం ఏవిటంటే- అతను అసలు మిమ్మల్ని పెళ్లి చేసుకున్నదే ఆర్థిక లాభం కోసం. కానీ అతను అనుకున్న విధంగా మీ నించి అతను ఆశించినంత లాభపడలేకపోయేడు. పైగా అతనికి కావల్సినది వంటింటి కుందేలు వంటి భార్య, మీలా ఉన్నత ఆశయాలున్న యువతి కాదు.

మిమ్మల్ని వద్దనుకోవడం అతని దురదృష్టం. మీది కాదు. అతనెంత దౌర్భాగ్యుడంటే, మీ మెడలో కట్టిన తాళిలో ఒకటి అతని తల్లిదండ్రులు కొన్నది కాబట్టి, అది తిరిగి ఇచ్చేయవలసిందని నోటీసులో రాయించేడు. అంతే కాదు, విడాకుల వల్ల మీకు, మీ అబ్బాయికి మనోవర్తి ఇవ్వబడుతుందని, అతని జీతం నెలకు మూడువందల రూపాయలని దొంగ సర్టిఫికేటు పుట్టించేడు...."

అప్పటి వరకూ తల దించుకుని వింటున్నదల్లా, అతని మాటలకు అడ్డు వస్తూ, తలెత్తి దృఢంగా అంది తన్మయి.

"ప్రేమ పేరుతో, పెళ్ళి పేరుతో నా జీవితంతో ఆడుకుని నన్ను ఇన్ని బాధలు పెట్టి, నన్ను నడి రోడ్డు మీదికి లాగిన అతన్ని అంత సులువుగా వదిలి పెట్టను లాయర్. మీరు చెప్పిన రెండవ ఆప్షను ప్రకారం నిర్దోషిగా నిరూపించుకుని, అతని మీద తిరిగి నేను విడాకుల కేసు పెడతాను. కానీ ఇలా చెయ్యడం వల్ల అతను కోరుకున్నదే నేను ప్రసాదిస్తున్నాను. కాబట్టి విడాకులు ఇవ్వను, అతని దగ్గిరిగి వెళ్లను. కానివ్వండి. కేసు ఎన్ని రోజులు నడుస్తుందో నడవనివ్వండి."

---------

ఆ సాయంత్రం ఊరు వెళ్ళగానే బాబుని ఎత్తుకుని తన గదిలోకి వెళ్లి, వాణ్ని కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది తన్మయి. ఎంత కాదనుకున్నా దుఃఖం ఆగడం లేదు.

"తనేం పాపం చేసింది? ఇంత మనో క్షోభ అనుభవించాల్సి వస్తోంది?"

తల్లి దుఃఖానికి అర్థం తెలియక పోయినా చిన్న అరచేతుల్తో కళ్లు తుడవ సాగేడు బాబు. కాస్సేపట్లో బేలగా వాడూ ఏడవడం ప్రారంభించేడు.

జ్యోతి వంటింట్లో నుంచి గాభరాగా పరుగెత్తుకు వచ్చింది. "ఏమ్మా, ఏవయ్యింది" అంటూ.

ఏం చెప్పాలి తల్లికి? ఎలా చెప్పాలి? తల్లికి సుతరామూ ఇష్టం లేకపోయినా, ఇటువంటి దరిద్రుడిని, మానవత్వం లేని మనిషిని, దుర్మార్గుడిని ప్రేమించి ఇష్టపడి, పెళ్లి చేసుకున్నదని వివరించగలదా? తల్లి వద్దన్నపుడు విని ఉంటే ఎంత బావుండేది. ఏవీ మాట్లాడకుండా, తల్లి ఒళ్ళో తలదాచుకుని భోరుమని విలపించసాగింది.

"నిన్ను ఒక్కదాన్నీ ఆ విశాఖపట్నంలో ఉండొద్దంటే వినవు. ఇలా బెంగపడి పోయి, డీలా అయిపోతే ఎలా చెప్పు? నువ్విలా ఏడుస్తూ ఉంటే ఇక ఒక పక్క ఒంట్లో బాలేని నాన్నగారిని, చంటాడిని చూసుకునే ధైర్యం నాకెలా వస్తుంది?" అంది జ్యోతి కళ్ళద్దుకుంటూ.

ఆ రాత్రి ఒక నిద్ర మాత్ర మింగి బలవంతాన నిద్రకుపక్రమించింది తన్మయి. ఫోనులో చుట్టాలెవరితోనో మాట్లాడుతున్న తల్లి మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

"అతన్ని విపరీతంగా ప్రేమించింది. హఠాత్తుగా అతను ఇలా విడాకుల నోటీసు పంపించేసరికి తట్టుకోలేక పోతూ ఉంది....."

----------

మరుసటి వారంలో మొదటి విడత కోర్టుకి బయలుదేరింది తన్మయి. బయట ఎండ తీవ్రంగా కాస్తూంది. కోర్టు ఆవరణ అంతా ఎత్తైన చెట్ల నించి రాలి పడ్డ ఆకులతో, గాలిలో ఎగురుతూన్న దుమ్ము, ధూళితో నిండి తన్మయి మనస్సులోని అసహనంలాగే చికాకుగా ఉంది. ఆవరణ గోడని ఆనుకుని దించిన టర్పంటైను గుడ్డల నీడల్లో టైపు మిషన్ల ముందు గుమస్తాలు, పిల్ల ప్లీడర్లు వచ్చిన వాళ్లని వచ్చినట్లు పంచుకుంటున్నారు. లావాదేవీల కోసం సంవత్సరాల తరబడి తిరుగుతూన్నట్లు వాడిపోయిన ముఖాలతో రకరకాల మనుషులు ఆవరణలో అటూ ఇటూ తిరుగుతున్నారు. ఒక మూలగా చిన్న షెడ్లలో ఒక గదిలో ఉంది ఫామిలీ కోర్టు. సినిమాలలో తప్ప ఎప్పుడూ కోర్టు ఎలా ఉంటుందో చూడలేదు తన్మయి. ఆ మారుమూల గది కోర్టంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఆ చుట్టు పక్కల ఆడవాళ్లంతా కోర్టు పిలుపు వచ్చేంత వరకూ చెట్ల కింది చప్టాల మీద దీనంగా కూలబడీ, నిలబడీ ఉన్నారు. ఇక మగాళ్ళయితే ఈ వ్యవస్థ అంతా తమ వైపే మొగ్గుతుందన్న ధీమాగా ఉన్నట్లు కనిపించారు తన్మయికి. చేతిలో సిగిరెట్లు చివరకు రాగానే కాలి కింద నలుపుతూ వ్యంగ్యం చూపులు విసురుతూ కొందరు, నములుతూన్న కిళ్లీని తుపుక్కున మోహాన ఊస్తున్నట్టు పక్కకి ఊస్తూ , వెకిలిగా అటు ఇటూ తిరుగుతూ కొందరు.

ఆ వాతావరణానికి కాళ్లలో బలం పోయినట్లయ్యి తన్మయి ఒక చెట్టు కింద కూలబడింది. తండ్రి చాటు బిడ్డగా, అపురూపంగా పెరిగింది తన్మయి. తనకెప్పుడూ మగవాళ్లు క్రూ రులనే భావన ఇంతకు ముందెప్పుడూ కలగలేదు. పెద్దగా ఆకులు లేని చెట్టు కింద ఎండ సూటిగా తగుల్తూండడంతో భుజాన చెంగు తీసి నెత్తిన కప్పుకుంది. దూరం నించి బండి మీద నల్ల కళ్లద్దాలు పెట్టుకుని అటు వైపే బండి మీద వస్తున్న శేఖర్ ని చూడగానే ఒక్కసారిగా అసహ్యం, కోపం చప్పున తలని తాకేయి. నుదుటిన కారుతున్న ఒక్కొక్క స్వేద బిందువూ ఒంట్లో సలసలా మరుగుతున్న రక్తపు బిందువులా అనిపించసాగింది.

దగ్గరికి వస్తున్నపుడు కావాలని తన్మయి వైపు కాకుండా మరోవైపు చూసుకుంటూ బండిని స్టాండు వేసి, కళ్లద్దాలు చేతిని తిప్పుతూ, అతని తాలూకు లాయరు వైపుకి నిర్లక్ష్యంగా నడుచుకుంటూ వెళ్లిపోయేడు.

“ఛూ, పెద స్టిల్లొకటి ఎదవకి” అని తన కోసమే అన్నట్టు తన్మయికి దగ్గర్లో కూచున్న మరొకామె మొగుణ్ణి తిట్ట సాగింది.

తన్మయికి హఠాత్తుగా మొదటిసారి అతను తన వైపు చూసిన ప్రేమైక చూపు జ్ఞాపకం వచ్చింది.

"ఛీ"... అని తల చప్పున విదిలించుకుంది.

బయట నిప్పులు చెరుగుతున్న ఎండ తలలో దూరి చెలరేగసాగింది. విపరీత భావాలు పుట్టుకు రాసాగేయి.

తనెవరో తెలీనట్లు నిర్లక్ష్యంగా నడుచుకెళ్లిపోతున్న అతన్ని అక్కడే నరికెయ్యాలన్నంత కసి పుట్టుకు రాసాగింది. బలవంతంగా తమాయించుకుంది. ఎలాగైతేనేం, మరో గంట తర్వాత తమ వంతు వచ్చింది. లాయరు విశ్వ తన్మయిని పిలుచుకెళ్ళేడు. పెళ్లలు ఊడిన చిన్న గదిలో కొంచెం ఎత్తుగా ఉన్న ప్రదేశంలో ఒక బెంచీకి అటు వెపు జడ్జి కూచున్నాడు, అతని పక్కగా టైపు మిషనుతో గుమస్తా. ఇద్దరి తరఫు లాయర్లు జడ్జి దగ్గరకు వెళ్లి కాగితాలు సమర్పించి, అతి నెమ్మదిగా వాళ్ల ముగ్గురికీ తప్ప ఎవరికీ వినబడకుండా ఏదో చెప్పసాగేరు.

శేఖర్ని, తన్మయిని పక్క పక్కన నిలబెట్టేరు. అతని ఉనికికి తన్మయికి గొంగళీపొరుగులు పాకుతున్నంత జలదరింపు కలగ సాగింది. అసలే బాధావేశాలతో దహించుకుపోతున్న తన్మయికి అక్కడ జరుగుతున్నదేదీ అర్థంకాకుండా పోవడమే కాకుండా లాయర్లు మాట్లాడుకుంటున్నది అసలు వినబడడమే లేదు.

పది నిమిషాల్లో లాయరు విశ్వ "రండి బయటకు" అనే వరకు అలాగే కట్టె పుల్లలా నిలబడింది.

"కేసు వచ్చే నెలకు వాయిదా వేయించేను. మీరనుకున్నట్లే అతన్ని కోర్టు చుట్టూ వీలైనన్నాళ్లు తిప్పిద్దాం. వచ్చే వారం మీరు ఒకసారి ఆఫీసుకి రండి." అన్నాడు.

తలూపుతూ తన్మయి దూరంగా దుమ్ము రేపుకుంటూ కనుమరుగవుతున్న శేఖర్ బండి వైపు చూసింది.

------

బస్సెక్కి "రామ కృష్ణా బీచ్" అంది కండక్టరుతో. సముద్ర తీరం వైపు అడుగులు వేసింది. చెప్పులు తీసి చేత్తో పట్టుకుంది. వేసవి మధ్యాహ్నపు వేడికి ఇసుకలో కాళ్లు కాలసాగేయి. అయినా ముందుకు నడిచింది. దేహమంతా కాలి బూడిదయ్యి పోయేటట్లు సలసలా మరుగుతున్న ఆలోచనలు. మండుతున్న ఇసుక నీళ్ళని తాకుతున్న చోట అలలు వెనక్కి వెళుతూనే చిన్నగా పొగలు రేగ సాగేయి. ఒంగి ఇసుకని గుప్పెట నిండా చేతిలోకి ఉండలా తీసుకుని అరచేతుల్తో గట్టిగా పిండింది. వేళ్లల్లో రాయిని తీసుకుని ఇసుకలా పిండి చేసెయ్యాలన్న ఆవేశం ప్రవేశించింది. కానీ అసహాయంగా తనలాగే రాలిపోతున్న ఇసుకని ఒడిసి పట్టుకుని తన వైపే వస్తున్న అలల వైపు చూస్తూ బలంగా విసిరింది.

"ప్రపంచమా! నువ్వు సముద్రమై ఉవ్వెత్తున నన్ను నిలువునా ముంచేసినా సరే, ఎదిరిస్తాను. నిలబడతాను. దృఢంగా నిలబడతాను." అంది గట్టిగా ఆకాశం వైపు చూస్తూ.

అలల ఒరవడికి కాళ్లు ఇసుకలో కూరుకు పోతున్నా, ఏటవాలుగా దిగువకి కెరటాలు తనని లాక్కుపోతున్న భ్రాంతి కలుగుతూన్నా ఎంతో సేపు అలాగే నిలబడింది. కళ్ల లోంచి కారుతున్న ఉప్పు నీళ్లు సముద్రపు నీళ్ల కంటే ఎక్కువగా ఉప్పగా తగల సాగేయి. అవి అధైర్యపు కన్నీళ్లు కాదు. కసితో రగులుతూన్న రక్తపుటేరులు. వెనక్కి తిరిగి వస్తూ రోడ్డు ఎక్కబోతున్న తన్మయికి ఎదురుగా ఇద్దరు మగాళ్లు తనని ఎప్పటి నించో గమనిస్తున్నట్టు

వెకిలిగా నవ్వడాన్ని గమనించింది. వాళ్ల ముఖాన ఉమ్మేసే కుసంస్కారం తనకు లేదు. ఒంగి కాలి చెప్పు తీసింది. తన్మయి కళ్ళలో రౌద్రం చూసి వాళ్లు ఒక్కడుగు వెనక్కి వేసేరు. తన్మయికి బస్సులో మగవాళ్ల ఉనికి కూడా అసహ్యం కలిగించసాగింది.

అనంత ఇంటికి చేరి తను తలుపు తీయగానే నిస్సత్తువగా నేలమీద కూలబడి మోకాళ్లలో తల దాచుకుని దు:ఖపడసాగింది తన్మయి. అనంత నిశ్శబ్దంగా పక్కన కూచుని వెన్ను రాయసాగింది తన్మయికి.

తనంతట తను దు:ఖంలోంచి తేరుకునే దాకా ఆగి, "తన్మయీ! నువ్వు అమాయకురాలివి. నీకు ఎప్పుడూ అంతా మంచే జరుగుతుంది. ఇదిగో సాక్ష్యం చూడు. నీకు వివేకానందా పాఠశాల నించి ఇంటర్వ్యూ కోసం ఉత్తరం వచ్చింది." అని చేతిలో పెట్టింది.

తన్మయి నమ్మలేనట్లు కవరు ఆదరాబాదరా గా విప్పి చూసింది.

నిజంగానే ఇంటర్వ్యూ లెటర్ అది. కానీ తామనుకున్నట్లు టీచరు ఉద్యోగానికి కాదు. టీచరు ఉద్యోగాలు అన్నీ నిండిపోయినందువల్ల సాయంకాలపు ట్యూటరుగానూ, గర్ల్స్ హాస్టలు వార్డెనుగానూ పనిచేయడానికి ఆసక్తి ఉంటే ఇంటర్వ్యూకి రమ్మని సారాంశం.

తన్మయి కళ్లు మూసుకుని ఉత్తరాన్ని కళ్లకద్దుకుంది. తనున్న పరిస్థితుల్లో ఏదో ఒక ఉద్యోగం తనకి అవసరం. బహుశా: ఇదే తనకు నప్పే ఉద్యోగమేమో! దిక్కులేకుండా ఎటో కొట్టుకుపోతున్న తన జీవితానికి ఒక చిన్న ఆధారం లభించబోతూంది.

"కృతజ్ఞతలు మిత్రమా! శతకోటి కృతజ్ఞతలు!!" అని మనసులోనే అనేక ధన్యవాదాలు చెప్పసాగింది.

-------

మర్నాడు యూనివర్సిటీ నుంచి మధ్యాహ్నం భోజన సమయానికి ముందే త్వరగా బయటికి వచ్చి కేంటీను లో టీ తాగి, తిన్నగా వివేకానందా పాఠశాల వైపు బస్సెక్కింది.

ఈ మధ్య మధ్యాహ్నం భోజనం చెయ్యకుండా టీ తాగి ఉండడం అలవాటు చేసుకుంది. కేంటీనులో భోజనం చెయ్యడానికి సరిపడా డబ్బులు లేకపోవడం ఒక్కటే కాదు, తినాలనిపించకపోవడమూ కారణమే. ఎందుకో ఈ మధ్య అన్నం తినబోతే కడుపులో తిప్పుతూ అస్సలు సహించడం లేదు. మనస్సులో తెలీని దుఃఖం. కడుపులో నుంచి మెలికలు తిరిగే బాధ. నిరంతరం రగులుతూన్న అగ్నిజ్వాల లాంటి బాధ. ఒక పక్క కళ్ల ముందు అత్యున్నతమైన లక్ష్యం. ఎగిసి పడ్తున్న బాధల ముందు కాలే కడుపు ఒక లెక్క కాదు.

దాదాపు గంట ప్రయాణం తర్వాత బస్సు మధురవాడ చివర్లో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాల స్టాపుకు చేరుకుంది.

బస్సు దిగి మట్టి రోడ్డు గుండా లోపలికి నడిచింది తన్మయి. తారు రోడ్డు నించి చిన్న గుట్ట మీదికి ఉందా రోడ్డు. పది నిముషాల నడక తర్వాత గుట్ట దిగుతూనే దాదాపు పది ఎకరాల మేర పెద్ద ప్రహరీ లోపల వరసగా అందమైన అయిదారు భవనాలు కనిపించాయి. దాదాపు పది స్కూలు బస్సులు గేటు బయట బారులు తీరి ఉన్నాయి.

రెసిడెన్షియల్ పాఠశాల అంటే ఇంత పెద్దగా ఉంటుందని ఊహించుకోలేదు తన్మయి. ఆశ్చర్యంతో అడుగులు వేసింది. పెద్ద గేటుకి ఒక పక్కగా కాపలాదారు కూచున్న చోట రిజిస్టరు లో సంతకం పెట్టి లోపలికి అడుగుపెట్టింది. ఈ మధ్య బాగా పాదుకుంటున్న రెసిడెన్షియల్ కార్పొరేట్ పాఠశాలల గురించి తన్మయి వింటే కానీ, ఎప్పుడూ చూడలేదు. మొదటి బిల్డింగు లోనే ఉన్న కరస్పాండెంటు ఆఫీసులోకి అడుగు పెట్టింది. వెయిటింగు హాలులో రిసెప్షన్ పక్కనే నిలువెత్తు స్వామీ వివేకానంద కాంస్య విగ్రహం, కాళ్ల దగ్గిర చుట్టూ పేర్చిన దేవ గన్నేరు పూలు.

ఒక అరగంట తర్వాత లోపలికి పిలుపు వచ్చింది తన్మయికి.

కుర్చీలో కూర్చున్న వ్యక్తి ఇంత పెద్ద కమర్షియల్ స్కూలు నడుపుతున్న ధనవంతుడిలా కాకుండా సాధారణ వ్యక్తి లా కనిపించారు. తెల్లని నూలు దుస్తులు. సాదాసీదా చెప్పులు. ముఖమ్మీద చక్కని మర్యాద పూర్వక దరహాసం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం అంటే ఏవిటో మొదటిసారి ప్రత్యక్షంగా చూసింది తన్మయి.

గర్ల్స్ హాస్టల్ వార్డెనుగా అపాయింటుమెంటు లెటరు చేతికిస్తూ "మీకున్న క్వాలిఫికేషనుకి ఇది సరైన ఉద్యోగం కాదు. మధ్యలో ఎప్పుడైనా టీచరు ఉద్యోగానికి ఖాళీ ఏర్పడితే మారుస్తాం. వెల్ కమ్ టు వివేకానందా! రండి. ఆవరణ అంతా చూపిస్తాను." అని లేచేరు స్కూలు కరస్పాండెంటు రాఘవేంద్రరావు గారు.

స్వయంగా ఆయనే అన్నీ తిప్పి చూపించడం మరో ఆశ్చర్యం. వెనక్కి చేతులు కట్టుకుని ఆయన ముందు నడుస్తూ ఉంటే ఆయన్ని అనుసరించింది తన్మయి. బాబుకి ఎడ్మిషను అడిగింది మాటల్లో.

"ప్రీస్కూలు లో జాయిన్ చేయండి. మీరేమీ డబ్బులు కట్టనవసరం లేదు. మీతో బాటూ రెసిడెన్సు, ఫుడ్ అన్నీ ప్రొవైడ్ చేస్తాం." అన్నారు.

ఇతరత్రా వివరాలేవీ అడగని ఆయన సంస్కారానికి మనస్సులోనే కృతజ్ఞతలు అర్పించింది తన్మయి.

ప్రధాన గేటు నించి ఇరుపక్కలా క్లాసు రూమ్స్. మధ్య బాటకిరుపక్కలా విరబూసిన దేవ గన్నేరు పూలు. చివర నున్న బిల్డింగుకి ముందు అతి పెద్ద వివేకానందుడి విగ్రహం. ఆ పక్కనే మలుపు తిరగగానే రామకృష్ణ పరమ హంస ప్రార్థనా మందిరం. మందిరానికిరుపక్కలా చిన్న కొలనుల్లో అందంగా విరిసిన కలువ పూలు.

అక్కడి నించి ఆవరణకు మరో పక్క రెండేసి అంతస్తుల్లో ఎదురెదురుగా ఉన్న హాస్టలు భవనాలు. ప్రశాంతమైన అక్కడి వాతావరణం చూడగానే తన్మయి మనస్సులోనే జోహార్లు అర్పించింది.

"మిత్రమా! నన్ను ఇంత అందమైన చోటికి చేర్చినందుకు నీకేమిచ్చుకోగలను!"

తనతో విధి ఎంతగా ఆడుకుంటున్నా తనని చేరాల్సిన చోటికే చేరుస్తూ ఉంది కాలం.

"ఈయన వెంకట్, ఈయన మురళి." బాయ్స్ హాస్టల్ ప్రధాన వార్డెన్లను పరిచయం చేసేరు రాఘవేంద్ర రావు గారు.

రెండు జోతులూ జోడించి నమస్కారం చేస్తూ మురళి వైపు చూసింది తన్మయి. అప్పుడప్పుడే ధ్యానం నించి బయటికి వచ్చినట్లు ప్రశాంతమైన కళ్ళు. ఒక గొప్ప పూజ్య భావం కలిగింది. మగవాళ్ళందరూ తెల్లని లాల్చీ పైజమాలు, స్త్రీలందరూ తెల్లని చీరలు ధరించడం తప్పని సరి అక్కడ. ధవళ వర్ణపు దుస్తుల వల్ల వచ్చిన కాంతి మాత్రమే కాదది. మరేదో అలౌకికమైన శక్తివంతమైన కళ్లవి. ఆ పైన నుదుట సన్నని విభూతి రేఖ. ఇంత వరకూ తనకు మురళిలాంటి యువకుడు ఎక్కడా తారసపడలేదు. కానీ ఎందుకో ఎప్పటి నించో పరిచయమైన దరహాసంగా అనిపించింది. ఒంగి ప్రతి నమస్కారం చేస్తూ తన్మయిని సాదరంగా ఆహ్వానించాడు మురళి.

వెంకట్ ఉత్సాహవంతమైన యువకుడిని మొదటి పలకరింపులోనే అర్థమైంది. హాస్టలు గోడల్లో ఇమడగలిగే స్వభావం కాదు. మరి ఇక్కడ ఎందుకు ఉన్నాడో!

కొత్తగా ప్రారంభించిన గర్ల్స్ హాస్టలు భవనం వరకూ చూసేక వెనుదిరిగేరు.

చివరగా తమ ఆఫీసుకి రెండవ అంతస్తులో ఉన్న కంప్యూటరు లాబు చూపిస్తూ "అందరికీ విధిగా కంప్యూటరు ట్రయినింగు కూడా ఇస్తున్నాం. మీరూ మెల్లగా సర్టిఫికేషను చెయ్యండి." అన్నారు రాఘవేంద్రరావు గారు.

తమతో వచ్చిన వెంకట్ "లోటస్ సర్టిఫికేషన్ లో మేం ఇప్పుడిప్పుడే ఓనమాలు దిద్దుతున్నాం." అన్నాడు.

అప్పుడర్థమయింది వెంకట్ అక్కడెందుకున్నాడో. కంప్యూటరుని మొదటి సారి ఆశ్చర్యంతో చూసింది తన్మయి. బ్లాక్ & వైట్ స్క్రీను మీద ఏవేవో ఇంగ్లీషు అక్షరాలు తిరుగుతున్నాయి. అసలు కంప్యూటరు ఉపయోగం ఏవిటో, తామెందుకు సర్టిఫికేషను చెయ్యాలో అర్థం కాలేదు తన్మయికి.

తన్మయి సందేహాన్ని గమనించినట్లు ,"ముందు ముందు మీకే అర్థమవుతుందిలెండి. నేను అమెరికాలో ఉన్నపుడు కన్న కల ఇది. ఇప్పటికి నిజమైంది." అన్నారు రాఘవేంద్ర రావు గారు.

మరింత ఆశ్చర్యంగా చూసింది ఆయన వైపు. ఈయన అమెరికా నించి తిరిగి వచ్చి ఇక్కడ స్కూలు పెట్టేరా?! అయినా ఇంత నిరాడంబరంగా ఉన్నారా?!"

-------

ఆ మర్నాడే బట్టలు, పుస్తకాలు సర్దుకుని వచ్చేసింది తన్మయి.

గర్ల్స్ హాస్టలు హాలులో పెద్ద అక్షరాలతో "Knowledge is Strength-Weekness is death" అని తన్మయికిష్టమైన వాక్యాలు రాసి ఉన్నాయి.

రెండవ అంతస్థులో పిల్లల విశాలమైన గదుల్ని ఆనుకుని కొసగా ఉన్న చిన్న గదిలోకి అడుగు పెట్టింది. సూట్ కేసులో నుంచి చిన్న వివేకానందుడి విగ్రహం తీసి గోడకున్న చిన్న గూడులో పెట్టి నమస్కరించింది. ఎక్కడి నించి ఎక్కడికి చేరింది తన జీవితం! సముద్రంలోని అలలా, వీచే గాలిలా తనకే తెలీని జీవితం!! వస్తూనే నాలుగు తెల్ల చీరలు రిసెప్షన్ లో ఇచ్చేరు. అందులో నుంచి ఒకటి తీసి కట్టు కుంది. తిలకం బొట్టు మీద సన్నని విభూది రేఖ పెట్టుకుంది. అద్దంలో చూసుకుంది. నిండా పాతికేళ్లు రాకుండానే సన్యాసినిగా మారింది! ఇక్కడ తనకు ఇప్పుడు ఒక్క బిడ్డ కాదు. అంతా తన పిల్లలే.

ఆయాలు ఉన్నా పిల్లల ఆలనా, పాలనా దగ్గరుండి పర్యవేక్షించడం, భోజన సదుపాయాలు సక్రమంగా జరుగుతున్నాయో, లేదో చూడడం, తల్లిదండ్రులకు సమాధానాలు చెప్పడం వంటివి ఉద్యోగంలోని భాగాలు.

కావడానికి ఇది రెసిడెన్షియల్ స్కూలు అయినా ఉదయం పిల్లలు స్కూలు భవనానికి వెళ్లిపోగానే తను యూనివర్శిటీకి వెళ్లిపోవచ్చు. సాయంత్రం పిల్లలు వచ్చే వేళకు ముందే తప్పనిసరిగా ఇక్కడ ఉండాలి.

మధ్యాహ్నం పిల్లల భోజన సమయంలో దగ్గరుండలేదని ముందే చెప్పింది.

రాత్రి పూట హాస్టల్ బిల్డింగులోనే జరిగే ట్యూటరింగ్ క్లాసులకు అటెండ్ కావాలి.

ఇక అన్నిటికన్నా ముఖ్యమైన వెసులుబాటు బాబుని ఇక మీదట తనతోనే ఉంచుకోవచ్చు. తను కాలేజీకి వెళ్ళినంత సేపూ వాడూ స్కూలుకి వెళ్లిపోతాడు. తాను లేనప్పుడు ఇతర పిల్లలతో బాటూ వాడి ఆలనా, పాలనా ఇక్కడి ఆయాలు చూస్తారు.

రెసిడెన్సు, భోజనం కాకుండా జీతం నెలకు ఎనిమిది వందల రూపాయలు. ఆ డబ్బులు బొటాబొటీగా యూనివర్సిటీకి వెళ్లిరావడానికి, ఇతరత్రా చిన్న ఖర్చులకు సరిపోతాయి. ముఖ్యంగా తన్మయికి అక్కడి వాతావరణం బాగా నచ్చింది.

తన జీవన పరిస్థితులకు సరిగ్గా సరిపడా ఉద్యోగం దొరకడం తన అదృష్టం.

ఉదయం అయిదు గంటలకు అందరూ కలిసి ప్రార్థనా మందిరం దగ్గర యోగా తరగతులలో విధిగా పాల్గొనాలి.

విశాలమైన ప్రార్థనా మందిరం బయట వాకిట్లో పరిచిన చాపల మీద కూర్చుని ప్రశాంత వాతావరణంలో యోగా తరగతులు జరుగుతాయి.

సన్నగా వినిపించే ఓంకార నాదంతో ప్రకృతిలో తానూ లీనమవుతున్న అనుభూతి కలగసాగింది తన్మయికి.

మనసూ, శరీరమూ ఏకమై ఊపిరిలో అంత: తేజస్సు లీనమై, మనస్సు లోని క్రోధావేశాల్ని దూరం చేసి, మలినపడిన మన:దేహాల్ని శుభ్రం చేసి, జీవన దు:ఖాలన్నీ తీర్చే అద్భుత మార్గం బోధపడినట్లై యింది.

'యోగా' తన్మయికి అత్యంత ఇష్టమైన కార్యక్రమంగా మారింది.

మురళి ముఖంలోని దివ్యకాంతికి అర్థం అప్పుడు బోధపడింది.

అప్పుడప్పుడే యోగా నేర్చుకుంటున్న తనకే ఇంత గొప్ప భావన కలుగుతూ ఉంటే, నేర్పించే మురళికి సంవత్సరాల సాధన వల్ల ఒనగూరిన దివ్యకాంతి అది.

## 30

లాయరు విశ్వ ఆఫీసు బయట గదిలో బెంచీ మీద కూర్చుని జరిగినదంతా గుర్తు తెచ్చుకుని రాయడం మొదలు పెట్టింది తన్మయి. దు:ఖం కళ్ల నిండి, అక్షరాలు అలుక్కు పోతూ ఉన్నాయి.

మళ్లీ మళీ అదే ప్రశ్న. "అసలు అతను ఇదంతా ఎందుకు చేసేడు?"

అదే అడిగింది లాయరు విశ్వని.

పేపర్లు అందుకుని దీక్షగా మొదటి వాక్యం "సత్యమేవ జయతే" వైపు కాస్సేపు చూసి, తరువాత పేజీలన్నీ తిప్పి గబగబా చదివేడు.

చేతిలోని కాగితాల్ని టేబుల్ మీద పెట్టి, ఆ పైన పేపర్ వెయిట్ పెడుతూ తన్మయి వైపు చూసి,

"మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే" అని కారల్ మార్క్స్ ఏనాడో చెప్పేడు. ఇంత చదువుకున్నారు మీకు నేను చెప్పనవసరంలేదనుకుంటా. ఈ కేసులో బాగా అర్థమవుతున్న విషయం ఏవిటంటే– అతను అసలు మిమ్మల్ని పెళ్లి చేసుకున్నదే ఆర్థిక లాభం కోసం. కానీ అతను అనుకున్న విధంగా మీ నించి అతను ఆశించినంత లాభపడలేకపోయేడు. పైగా అతనికి కావల్సినది వంటింటి కుందేలు వంటి భార్య, మీలా ఉన్నత ఆశయాలున్న యువతి కాదు.

మిమ్మల్ని వద్దనుకోవడం అతని దురదృష్టం. మీది కాదు. అతనెంత దౌర్భాగ్యుడంటే, మీ మెడలో కట్టిన తాళిలో ఒకటి అతని తల్లిదండ్రులు కొన్నది కాబట్టి, అది తిరిగి ఇచ్చేయవలసిందని నోటీసులో రాయించేడు. అంతే కాదు, విడాకుల వల్ల మీకు, మీ అబ్బాయికి మనోవర్తి ఇవ్వబడుతుందని, అతని జీతం నెలకు మూడువందల రూపాయలని దొంగ సర్టిఫికేటు పుట్టించేడు...."

అప్పటి వరకూ తల దించుకుని వింటున్నదల్లా, అతని మాటలకు అడ్డు వస్తూ, తలెత్తి దృఢంగా అంది తన్మయి.

"ప్రేమ పేరుతో, పెళ్ళి పేరుతో నా జీవితంతో ఆడుకుని నన్ను ఇన్ని బాధలు పెట్టి, నన్ను నడి రోడ్డు మీదికి లాగిన అతన్ని అంత సులువుగా వదిలి పెట్టను లాయర్. మీరు చెప్పిన రెండవ ఆప్షను ప్రకారం నిర్దోషిగా నిరూపించుకుని, అతని మీద తిరిగి నేను విడాకుల కేసు పెడతాను. కానీ ఇలా చెయ్యడం వల్ల అతను కోరుకున్నదే నేను ప్రసాదిస్తున్నాను. కాబట్టి విడాకులు ఇవ్వను, అతని దగ్గిరిగి వెళ్లను. కానివ్వండి. కేసు ఎన్ని రోజులు నడుస్తుందో నడవనివ్వండి."

---------

ఆ సాయంత్రం ఊరు వెళ్ళగానే బాబుని ఎత్తుకుని తన గదిలోకి వెళ్లి, వాణ్ని కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది తన్మయి. ఎంత కాదనుకున్నా దుఃఖం ఆగడం లేదు.

"తనేం పాపం చేసింది? ఇంత మనో క్షోభ అనుభవించాల్సి వస్తోంది?"

తల్లి దుఃఖానికి అర్థం తెలియక పోయినా చిన్న అరచేతుల్తో కళ్లు తుడవ సాగేడు బాబు. కాస్సేపట్లో బేలగా వాడూ ఏడవడం ప్రారంభించేడు.

జ్యోతి వంటింట్లో నుంచి గాభరాగా పరుగెత్తుకు వచ్చింది. "ఏమ్మా, ఏవయ్యింది" అంటూ.

ఏం చెప్పాలి తల్లికి? ఎలా చెప్పాలి? తల్లికి సుతరామూ ఇష్టం లేకపోయినా, ఇటువంటి దరిద్రుడిని, మానవత్వం లేని మనిషిని, దుర్మార్గుడిని ప్రేమించి ఇష్టపడి, పెళ్లి చేసుకున్నదని వివరించగలదా? తల్లి వద్దన్నపుడు విని ఉంటే ఎంత బావుండేది. ఏవీ మాట్లాడకుండా, తల్లి ఒళ్ళో తలదాచుకుని భోరుమని విలపించసాగింది.

"నిన్ను ఒక్కదాన్నీ ఆ విశాఖపట్నంలో ఉండొద్దంటే వినవు. ఇలా బెంగపడి పోయి, డీలా అయిపోతే ఎలా చెప్పు? నువ్విలా ఏడుస్తూ ఉంటే ఇక ఒక పక్క ఒంట్లో బాలేని నాన్నగారిని, చంటాడిని చూసుకునే ధైర్యం నాకెలా వస్తుంది?" అంది జ్యోతి కళ్ళద్దుకుంటూ.

ఆ రాత్రి ఒక నిద్ర మాత్ర మింగి బలవంతాన నిద్రకుపక్రమించింది తన్మయి. ఫోనులో చుట్టాలెవరితోనో మాట్లాడుతున్న తల్లి మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

"అతన్ని విపరీతంగా ప్రేమించింది. హఠాత్తుగా అతను ఇలా విడాకుల నోటీసు పంపించేసరికి తట్టుకోలేక పోతూ ఉంది....."

----------

మరుసటి వారంలో మొదటి విడత కోర్టుకి బయలుదేరింది తన్మయి. బయట ఎండ తీవ్రంగా కాస్తూంది. కోర్టు ఆవరణ అంతా ఎత్తైన చెట్ల నించి రాలి పడ్డ ఆకులతో, గాలిలో ఎగురుతూన్న దుమ్ము, ధూళితో నిండి తన్మయి మనస్సులోని అసహనంలాగే చికాకుగా ఉంది. ఆవరణ గోడని

అనుకుని దించిన టర్పంటైను గుడ్డల నీడల్లో టైపు మిషన్ల ముందు గుమస్తాలు, పిల్ల ప్లీడర్లు వచ్చిన వాళ్లని వచ్చినట్లు పంచుకుంటున్నారు. లావాదేవీల కోసం సంవత్సరాల తరబడి తిరుగుతూన్నట్లు వాడిపోయిన ముఖాలతో రకరకాల మనుషులు ఆవరణలో అటూ ఇటూ తిరుగుతున్నారు. ఒక మూలగా చిన్న షెడ్లలో ఒక గదిలో ఉంది ఫామిలీ కోర్టు. సినిమాలలో తప్ప ఎప్పుడూ కోర్టు ఎలా ఉంటుందో చూడలేదు తన్మయి. ఆ మారుమూల గది కోర్టంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఆ చుట్టు పక్కల ఆడవాళ్లంతా కోర్టు పిలుపు వచ్చేంత వరకూ చెట్ల కింది చప్టాల మీద దీనంగా కూలబడీ, నిలబడీ ఉన్నారు. ఇక మగాళ్ళయితే ఈ వ్యవస్థ అంతా తమ వైపే మొగ్గుతుందన్న ధీమాగా ఉన్నట్లు కనిపించారు తన్మయికి. చేతిలో సిగిరెట్లు చివరకు రాగానే కాలి కింద నలుపుతూ వ్యంగ్యం చూపులు విసురుతూ కొందరు, నములుతూన్న కిళ్లీని తుపుక్కున మొహాన ఊస్తున్నట్టు పక్కకి ఊస్తూ , వెకిలిగా అటు ఇటూ తిరుగుతూ కొందరు.

ఆ వాతావరణానికి కాళ్లలో బలం పోయినట్లయ్యి తన్మయి ఒక చెట్టు కింద కూలబడింది. తండ్రి చాటు బిడ్డగా, అపురూపంగా పెరిగింది తన్మయి. తనకెప్పుడూ మగవాళ్లు క్రూ రులనే భావన ఇంతకు ముందెప్పుడూ కలగలేదు. పెద్దగా ఆకులు లేని చెట్టు కింద ఎండ సూటిగా తగుల్తూండడంతో భుజాన చెంగు తీసి నెత్తిన కప్పుకుంది. దూరం నించి బండి మీద నల్ల కళ్లద్దాలు పెట్టుకుని అటు వైపే బండి మీద వస్తున్న శేఖర్ ని చూడగానే ఒక్కసారిగా అసహ్యం, కోపం చప్పున తలని తాకేయి. నుదుటిన కారుతున్న ఒక్కొక్క స్వేద బిందువూ ఒంట్లో సలసలా మరుగుతున్న రక్తపు బిందువులా అనిపించసాగింది.

దగ్గరికి వస్తున్నపుడు కావాలని తన్మయి వైపు కాకుండా మరోవైపు చూసుకుంటూ బండిని స్టాండు వేసి, కళ్లద్దాలు చేతిని తిప్పుతూ, అతని తాలూకు లాయరు వైపుకి నిర్లక్ష్యంగా నడుచుకుంటూ వెళ్లిపోయేడు.

“ధూ, పెద స్టిల్లొకటి ఎదవకి” అని తన కోసమే అన్నట్టు తన్మయికి దగ్గర్లో కూచున్న మరొకామె మొగుణ్ణి తిట్ట సాగింది.

తన్మయికి హఠాత్తుగా మొదటిసారి అతను తన వైపు చూసిన ప్రేమైక చూపు జ్ఞాపకం వచ్చింది.

"ఛీ"... అని తల చప్పున విదిలించుకుంది.

బయట నిప్పులు చెరుగుతున్న ఎండ తలలో దూరి చెలరేగసాగింది. విపరీత భావాలు పుట్టుకు రాసాగేయి.

తనెవరో తెలీనట్లు నిర్లక్ష్యంగా నడుచుకెళ్లిపోతున్న అతన్ని అక్కడే నరికెయ్యాలన్నంత కసి పుట్టుకు రాసాగింది. బలవంతంగా తమాయించుకుంది. ఎలాగైతేనేం, మరో గంట తర్వాత తమ వంతు వచ్చింది. లాయరు విశ్వ తన్మయిని పిలుచుకెళ్ళేడు. పెళ్లలు ఊడిన చిన్న గదిలో కొంచెం ఎత్తుగా ఉన్న ప్రదేశంలో ఒక బెంచీకి అటు వెపు జడ్జి కూచున్నాడు, అతని పక్కగా టైపు మిషనుతో గుమస్తా. ఇద్దరి తరపు లాయర్లు జడ్జి దగ్గరకు వెళ్లి కాగితాలు సమర్పించి, అతి నెమ్మదిగా వాళ్ల ముగ్గురికీ తప్ప ఎవరికీ వినబడకుండా ఏదో చెప్పసాగేరు.

శేఖర్ని, తన్మయిని పక్క పక్కన నిలబెట్టేరు. అతని ఉనికికి తన్మయికి గొంగళీపొరుగులు పాకుతున్నంత జలదరింపు కలగ సాగింది. అసలే బాధావేశాలతో దహించుకుపోతున్న తన్మయికి అక్కడ జరుగుతున్నదేదీ అర్థంకాకుండా పోవడమే కాకుండా లాయర్లు మాట్లాడుకుంటున్నది అసలు వినబడడమే లేదు.

పది నిమిషాల్లో లాయరు విశ్వ "రండి బయటకు" అనే వరకు అలాగే కట్టె పుల్లలా నిలబడింది.

"కేసు వచ్చే నెలకు వాయిదా వేయించేను. మీరనుకున్నట్లే అతన్ని కోర్టు చుట్టూ వీలైనన్నాళ్లు తిప్పిద్దాం. వచ్చే వారం మీరు ఒకసారి ఆఫీసుకి రండి." అన్నాడు.

తలూపుతూ తన్మయి దూరంగా దుమ్ము రేపుకుంటూ కనుమరుగవుతున్న శేఖర్ బండి వైపు చూసింది.

------

బస్సెక్కి "రామ కృష్ణా బీచ్" అంది కండక్టరుతో. సముద్ర తీరం వైపు అడుగులు వేసింది. చెప్పులు తీసి చేత్తో పట్టుకుంది. వేసవి మధ్యాహ్నపు వేడికి ఇసుకలో కాళ్లు కాలసాగేయి. అయినా ముందుకు నడిచింది. దేహమంతా కాలి బూడిదయ్యి పోయేటట్లు సలసలా మరుగుతున్న ఆలోచనలు. మండుతున్న ఇసుక నీళ్ళని తాకుతున్న చోట అలలు వెనక్కి వెళుతూనే చిన్నగా పొగలు రేగ సాగేయి. ఒంగి ఇసుకని గుప్పెట నిండా చేతిలోకి

ఉండలా తీసుకుని అరచేతుల్తో గట్టిగా పిండింది. వేళ్లల్లో రాయిని తీసుకుని ఇసుకలా పిండి చేసెయ్యాలన్న ఆవేశం ప్రవేశించింది. కానీ అసహాయంగా తనలాగే రాలిపోతున్న ఇసుకని ఒడిసి పట్టుకుని తన వైపే వస్తున్న అలల వైపు చూస్తూ బలంగా విసిరింది.

"ప్రపంచమా! నువ్వు సముద్రమై ఉవ్వెత్తున నన్ను నిలువునా ముంచేసినా సరే, ఎదిరిస్తాను. నిలబడతాను. దృఢంగా నిలబడతాను." అంది గట్టిగా ఆకాశం వైపు చూస్తూ.

అలల ఒరవడికి కాళ్లు ఇసుకలో కూరుకు పోతున్నా, ఏటవాలుగా దిగువకి కెరటాలు తనని లాక్కుపోతున్న భ్రాంతి కలుగుతూన్నా ఎంతో సేపు అలాగే నిలబడింది. కళ్ల లోంచి కారుతున్న ఉప్పు నీళ్లు సముద్రపు నీళ్ల కంటే ఎక్కువగా ఉప్పగా తగల సాగేయి. అవి అధైర్యపు కన్నీళ్లు కాదు. కసితో రగులుతూన్న రక్తపుటేరులు. వెనక్కి తిరిగి వస్తూ రోడ్డు ఎక్కబోతున్న తన్మయికి ఎదురుగా ఇద్దరు మగాళ్లు తనని ఎప్పటి నించో గమనిస్తున్నట్టు వెకిలిగా నవ్వడాన్ని గమనించింది. వాళ్ల ముఖాన ఉమ్మేసే కుసంస్కారం తనకు లేదు. ఒంగి కాలి చెప్పు తీసింది. తన్మయి కళ్ళలో రౌద్రం చూసి వాళ్లు ఒక్కడుగు వెనక్కి వేసేరు. తన్మయికి బస్సులో మగవాళ్ల ఉనికి కూడా అసహ్యం కలిగించసాగింది.

అనంత ఇంటికి చేరి తను తలుపు తీయగానే నిస్సత్తువగా నేలమీద కూలబడి మోకాళ్లలో తల దాచుకుని దు:ఖపడసాగింది తన్మయి. అనంత నిశ్శబ్దంగా పక్కన కూచుని వెన్ను రాయసాగింది తన్మయికి.

తనంతట తను దు:ఖంలోంచి తేరుకునే దాకా ఆగి, "తన్మయీ! నువ్వు అమాయకురాలివి. నీకు ఎప్పుడూ అంతా మంచే జరుగుతుంది. ఇదిగో సాక్ష్యం చూడు. నీకు వివేకానందా పాఠశాల నించి ఇంటర్వ్యూ కోసం ఉత్తరం వచ్చింది." అని చేతిలో పెట్టింది.

తన్మయి నమ్మలేనట్లు కవరు ఆదరాబాదరా గా విప్పి చూసింది.

నిజంగానే ఇంటర్వ్యూ లెటర్ అది. కానీ తామనుకున్నట్లు టీచరు ఉద్యోగానికి కాదు. టీచరు ఉద్యోగాలు అన్నీ నిండిపోయినందువల్ల సాయంకాలపు ట్యూటరుగానూ, గర్ల్స్ హాస్టలు వార్డెనుగానూ పనిచేయడానికి ఆసక్తి ఉంటే ఇంటర్వ్యూకి రమ్మని సారాంశం.

తన్మయి కళ్లు మూసుకుని ఉత్తరాన్ని కళ్లకద్దుకుంది. తనున్న పరిస్థితుల్లో ఏదో ఒక ఉద్యోగం తనకి అవసరం. బహుశా: ఇదే తనకు నప్పే ఉద్యోగమేమో! దిక్కులేకుండా ఎటో కొట్టుకుపోతున్న తన జీవితానికి ఒక చిన్న ఆధారం లభించబోతూంది.

"కృతజ్ఞతలు మిత్రమా! శతకోటి కృతజ్ఞతలు!!" అని మనసులోనే అనేక ధన్యవాదాలు చెప్పసాగింది.

-------

మర్నాడు యూనివర్సిటీ నుంచి మధ్యాహ్నం భోజన సమయానికి ముందే త్వరగా బయటికి వచ్చి కేంటీను లో టీ తాగి, తిన్నగా వివేకానందా పాఠశాల వైపు బస్సెక్కింది.

ఈ మధ్య మధ్యాహ్నం భోజనం చెయ్యకుండా టీ తాగి ఉండడం అలవాటు చేసుకుంది. కేంటీనులో భోజనం చెయ్యడానికి సరిపడా డబ్బులు లేకపోవడం ఒక్కటే కాదు, తినాలనిపించకపోవడమూ కారణమే. ఎందుకో ఈ మధ్య అన్నం తినబోతే కడుపులో తిప్పుతూ అస్సలు సహించడం లేదు. మనస్సులో తెలీని దుఃఖం. కడుపులో నుంచి మెలికలు తిరిగే బాధ. నిరంతరం రగులుతూన్న అగ్నిజ్వాల లాంటి బాధ. ఒక పక్క కళ్ల ముందు అత్యున్నతమైన లక్ష్యం. ఎగిసి పడ్తున్న బాధల ముందు కాలే కడుపు ఒక లెక్క కాదు.

దాదాపు గంట ప్రయాణం తర్వాత బస్సు మధురవాడ చివర్లో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాల స్టాపుకు చేరుకుంది.

బస్సు దిగి మట్టి రోడ్డు గుండా లోపలికి నడిచింది తన్మయి. తారు రోడ్డు నించి చిన్న గుట్ట మీదికి ఉందా రోడ్డు. పది నిముషాల నడక తర్వాత గుట్ట దిగుతూనే దాదాపు పది ఎకరాల మేర పెద్ద ప్రహరీ లోపల వరసగా అందమైన అయిదారు భవనాలు కనిపించాయి. దాదాపు పది స్కూలు బస్సులు గేటు బయట బారులు తీరి ఉన్నాయి.

రెసిడెన్షియల్ పాఠశాల అంటే ఇంత పెద్దగా ఉంటుందని ఊహించుకోలేదు తన్మయి. ఆశ్చర్యంతో అడుగులు వేసింది. పెద్ద గేటుకి ఒక పక్కగా కాపలాదారు కూచున్న చోట రిజిస్టరు లో సంతకం పెట్టి లోపలికి అడుగుపెట్టింది. ఈ మధ్య బాగా పాదుకుంటున్న రెసిడెన్షియల్ కార్పొరేట్

పాఠశాలల గురించి తన్మయి విందే కానీ, ఎప్పుడూ చూడలేదు. మొదటి బిల్డింగు లోనే ఉన్న కరస్పాండెంటు ఆఫీసులోకి అడుగు పెట్టింది. వెయిటింగు హాలులో రిసెప్షన్ పక్కనే నిలువెత్తు స్వామీ వివేకానంద కాంస్య విగ్రహం, కాళ్ల దగ్గిర చుట్టూ పేర్చిన దేవ గన్నేరు పూలు.

ఒక అరగంట తర్వాత లోపలికి పిలుపు వచ్చింది తన్మయికి.

కుర్చీలో కూర్చున్న వ్యక్తి ఇంత పెద్ద కమర్షియల్ స్కూలు నడుపుతున్న ధనవంతుడిలా కాకుండా సాధారణ వ్యక్తి లా కనిపించారు. తెల్లని నూలు దుస్తులు. సాదాసీదా చెప్పులు. ముఖమ్మీద చక్కని మర్యాద పూర్వక దరహాసం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం అంటే ఏవిటో మొదటిసారి ప్రత్యక్షంగా చూసింది తన్మయి.

గర్ల్స్ హాస్టల్ వార్డెనుగా అపాయింటుమెంటు లెటరు చేతికిస్తూ "మీకున్న క్వాలిఫికేషనుకి ఇది సరైన ఉద్యోగం కాదు. మధ్యలో ఎప్పుడైనా టీచరు ఉద్యోగానికి ఖాళీ ఏర్పడితే మారుస్తాం. వెల్ కమ్ టు వివేకానందా! రండి. ఆవరణ అంతా చూపిస్తాను." అని లేచేరు స్కూలు కరస్పాండెంటు రాఘవేంద్రరావు గారు.

స్వయంగా ఆయనే అన్నీ తిప్పి చూపించడం మరో ఆశ్చర్యం. వెనక్కి చేతులు కట్టుకుని ఆయన ముందు నడుస్తూ ఉంటే ఆయన్ని అనుసరించింది తన్మయి. బాబుకి ఎడ్మిషను అడిగింది మాటల్లో.

"ప్లేస్కూలు లో జాయిన్ చేయండి. మీరేమీ డబ్బులు కట్టనవసరం లేదు. మీతో బాటూ రెసిడెన్సు, ఫుడ్ అన్నీ ప్రొవైడ్ చేస్తాం." అన్నారు.

ఇతరత్రా వివరాలేవీ అడగని ఆయన సంస్కారానికి మనస్సులోనే కృతజ్ఞతలు అర్పించింది తన్మయి.

ప్రధాన గేటు నించి ఇరుపక్కలా క్లాసు రూమ్స్. మధ్య బాటకిరుపక్కలా విరబూసిన దేవ గన్నేరు పూలు. చివర నున్న బిల్డింగుకి ముందు అతి పెద్ద వివేకానందుడి విగ్రహం. ఆ పక్కనే మలుపు తిరగగానే రామకృష్ణ పరమ హంస ప్రార్థనా మందిరం. మందిరానికిరుపక్కలా చిన్న కొలనుల్లో అందంగా విరిసిన కలువ పూలు.

అక్కడి నించి ఆవరణకు మరో పక్క రెండేసి అంతస్తుల్లో ఎదురెదురుగా ఉన్న హాస్టలు భవనాలు. ప్రశాంతమైన అక్కడి వాతావరణం చూడగానే తన్మయి మనస్సులోనే జోహార్లు అర్పించింది.

"మిత్రమా! నన్ను ఇంత అందమైన చోటికి చేర్చినందుకు నీకేమిచ్చుకోగలను!"

తనతో విధి ఎంతగా ఆడుకుంటున్నా తనని చేరాల్సిన చోటికే చేరుస్తూ ఉంది కాలం.

"ఈయన వెంకట్, ఈయన మురళి." బాయ్స్ హాస్టల్ ప్రధాన వార్డెన్లను పరిచయం చేసేరు రాఘవేంద్ర రావు గారు.

రెండు జోతులూ జోడించి నమస్కారం చేస్తూ మురళి వైపు చూసింది తన్మయి. అప్పుడప్పుడే ధ్యానం నించి బయటికి వచ్చినట్లు ప్రశాంతమైన కళ్ళు. ఒక గొప్ప పూజ్య భావం కలిగింది. మగవాళ్ళందరూ తెల్లని లాల్చీ పైజమాలు, స్త్రీలందరూ తెల్లని చీరలు ధరించడం తప్పని సరి అక్కడ. ధవళ వర్ణపు దుస్తుల వల్ల వచ్చిన కాంతి మాత్రమే కాదది. మరేదో అలౌకికమైన శక్తివంతమైన కళ్లవి. ఆ పైన నుదుట సన్నని విభూతి రేఖ. ఇంత వరకూ తనకు మురళిలాంటి యువకుడు ఎక్కడా తారసపడలేదు. కానీ ఎందుకో ఎప్పటి నించో పరిచయమైన దరహాసంగా అనిపించింది. ఒంగి ప్రతి నమస్కారం చేస్తూ తన్మయిని సాదరంగా ఆహ్వానించాడు మురళి.

వెంకట్ ఉత్సాహవంతమైన యువకుడిని మొదటి పలకరింపులోనే అర్థమైంది. హాస్టలు గోడల్లో ఇమడగలిగే స్వభావం కాదు. మరి ఇక్కడ ఎందుకు ఉన్నాడో!

కొత్తగా ప్రారంభించిన గర్ల్స్ హాస్టలు భవనం వరకూ చూసేక వెనుదిరిగేరు.

చివరగా తమ ఆఫీసుకి రెండవ అంతస్తులో ఉన్న కంప్యూటరు లాబు చూపిస్తూ "అందరికీ విధిగా కంప్యూటరు ట్రయినింగు కూడా ఇస్తున్నాం. మీరూ మెల్లగా సర్టిఫికేషను చెయ్యండి." అన్నారు రాఘవేంద్రరావు గారు.

తమతో వచ్చిన వెంకట్ "లోటస్ సర్టిఫికేషన్ లో మేం ఇప్పుడిప్పుడే ఓనమాలు దిద్దుతున్నాం." అన్నాడు.

అప్పుడర్థమయింది వెంకట్ అక్కడెందుకున్నాడో. కంప్యూటరుని మొదటి సారి ఆశ్చర్యంతో చూసింది తన్మయి. బ్లాక్ & వైట్ స్క్రీను మీద ఏవేవో ఇంగ్లీషు అక్షరాలు తిరుగుతున్నాయి. అసలు కంప్యూటరు ఉపయోగం ఏవిటో, తామెందుకు సర్టిఫికేషను చెయ్యాలో అర్థం కాలేదు తన్మయికి.

తన్మయి సందేహాన్ని గమనించినట్లు ,"ముందు ముందు మీకే అర్థమవుతుందిలెండి. నేను అమెరికాలో ఉన్నపుడు కన్న కల ఇది. ఇప్పటికి నిజమైంది." అన్నారు రాఘవేంద్ర రావు గారు.

మరింత ఆశ్చర్యంగా చూసింది ఆయన వైపు. ఈయన అమెరికా నించి తిరిగి వచ్చి ఇక్కడ స్కూలు పెట్టేరా?! అయినా ఇంత నిరాడంబరంగా ఉన్నారా?!"

-------

ఆ మర్నాడే బట్టలు, పుస్తకాలు సర్దుకుని వచ్చేసింది తన్మయి.

గర్ల్స్ హాస్టలు హాలులో పెద్ద అక్షరాలతో "Knowledge is Strength-Weekness is death" అని తన్మయికిష్టమైన వాక్యాలు రాసి ఉన్నాయి.

రెండవ అంతస్థులో పిల్లల విశాలమైన గదుల్ని ఆనుకుని కొసగా ఉన్న చిన్న గదిలోకి అడుగు పెట్టింది. సూట్ కేసులో నుంచి చిన్న వివేకానందుడి విగ్రహం తీసి గోడకున్న చిన్న గూడులో పెట్టి నమస్కరించింది. ఎక్కడి నించి ఎక్కడికి చేరింది తన జీవితం! సముద్రంలోని అలలా, వీచే గాలిలా తనకే తెలీని జీవితం!! వస్తూనే నాలుగు తెల్ల చీరలు రిసెప్షన్ లో ఇచ్చేరు. అందులో నుంచి ఒకటి తీసి కట్టు కుంది. తిలకం బొట్టు మీద సన్నని విభూది రేఖ పెట్టుకుంది. అద్దంలో చూసుకుంది. నిండా పాతికేళ్లు రాకుండానే సన్యాసినిగా మారింది! ఇక్కడ తనకు ఇప్పుడు ఒక్క బిడ్డ కాదు. అంతా తన పిల్లలే.

ఆయాలు ఉన్నా పిల్లల ఆలనా, పాలనా దగ్గరుండి పర్యవేక్షించడం, భోజన సదుపాయాలు సక్రమంగా జరుగుతున్నాయో, లేదో చూడడం, తల్లిదండ్రులకు సమాధానాలు చెప్పడం వంటివి ఉద్యోగంలోని భాగాలు.

కావడానికి ఇది రెసిడెన్షియల్ స్కూలు అయినా ఉదయం పిల్లలు స్కూలు భవనానికి వెళ్లిపోగానే తను యూనివర్శిటీకి వెళ్లిపోవచ్చు. సాయంత్రం పిల్లలు వచ్చే వేళకు ముందే తప్పనిసరిగా ఇక్కడ ఉండాలి.

మధ్యాహ్నం పిల్లల భోజన సమయంలో దగ్గరుండలేదని ముందే చెప్పింది.

రాత్రి పూట హాస్టల్ బిల్డింగులోనే జరిగే ట్యూటరింగ్ క్లాసులకు అటెండ్ కావాలి.

ఇక అన్నిటికన్నా ముఖ్యమైన వెసులుబాటు బాబుని ఇక మీదట తనతోనే ఉంచుకోవచ్చు. తను కాలేజీకి వెళ్ళినంత సేపూ వాడూ స్కూలుకి వెళ్లిపోతాడు. తాను లేనప్పుడు ఇతర పిల్లలతో బాటూ వాడి ఆలనా, పాలనా ఇక్కడి ఆయాలు చూస్తారు.

రెసిడెన్సు, భోజనం కాకుండా జీతం నెలకు ఎనిమిది వందల రూపాయలు. ఆ డబ్బులు బొటాబొటీగా యూనివర్సిటీకి వెళ్లిరావడానికి, ఇతరత్రా చిన్న ఖర్చులకు సరిపోతాయి. ముఖ్యంగా తన్మయికి అక్కడి వాతావరణం బాగా నచ్చింది.

తన జీవన పరిస్థితులకు సరిగ్గా సరిపడా ఉద్యోగం దొరకడం తన అదృష్టం.

ఉదయం అయిదు గంటలకు అందరూ కలిసి ప్రార్థనా మందిరం దగ్గర యోగా తరగతులలో విధిగా పాల్గొనాలి.

విశాలమైన ప్రార్థనా మందిరం బయట వాకిట్లో పరిచిన చాపల మీద కూర్చుని ప్రశాంత వాతావరణంలో యోగా తరగతులు జరుగుతాయి.

సన్నగా వినిపించే ఓంకార నాదంతో ప్రకృతిలో తానూ లీనమవుతున్న అనుభూతి కలగసాగింది తన్మయికి.

మనసూ, శరీరమూ ఏకమై ఊపిరిలో అంత: తేజస్సు లీనమై, మనస్సు లోని క్రోధావేశాల్ని దూరం చేసి, మలినపడిన మన:దేహాల్ని శుభ్రం చేసి, జీవన దుఃఖాలన్నీ తీర్చే అద్భుత మార్గం బోధపడినట్లై యింది.

'యోగా' తన్మయికి అత్యంత ఇష్టమైన కార్యక్రమంగా మారింది.

మురళి ముఖంలోని దివ్యకాంతికి అర్థం అప్పుడు బోధపడింది.

అప్పుడప్పుడే యోగా నేర్చుకుంటున్న తనకే ఇంత గొప్ప భావన కలుగుతూ ఉంటే, నేర్పించే మురళికి సంవత్సరాల సాధన వల్ల ఒనగూరిన దివ్యకాంతి అది.

31

యూనివర్శిటీ కేంటీను బయట చెట్టు కింద చిన్న చిన్న రాళ్ళ మీద కూచుని ఉన్నారు అనంత, రాజు, దివాకర్, కరుణ, తన్మయి.

చేతిలోని జే ఆర్ ఎఫ్ క్విజ్ పుస్తకం తెరిచి తన్మయి ప్రశ్నలు అడగసాగింది. ఇన్నాళ్లూ ఏ పుస్తకం చదివినా వ్యాసరూప ప్రశ్నలతో బాటూ బిట్ పేపర్ కి పనికొచ్చే ప్రశ్నలని అనిపించినవన్నీ ఈ పుస్తకంలో రాయసాగింది తన్మయి. జే ఆర్ ఎఫ్ లో మొదటి భాగమైన బిట్ పేపర్ ప్రిపరేషన్ కి ఈ నోట్సు బాగా ఉపయోగకారి అయింది. దాదాపు అయిదు వందల ప్రశ్నలవి. ఈ ప్రశ్నలని వారంలో కనీసం మూడు సార్లు ఒక్కొక్కరూ అందరినీ అడగాలన్న ఒప్పందం చేసుకున్నారు. ఇవేళ తన్మయి వంతు. వారం వారం మళ్లీ మళ్ళీ అడుగుతూ ఉండడం వల్ల అందరికీ ఇప్పటికే కంఠోపాఠం అయ్యేయి. ప్రశ్నలో మొదటి పదం వినగానే సమాధానం చెప్పెయ్య సాగేరు.

"ఇ....ఇవ్వి కాకుండా ఇంకేవైనా ఆ అడిగే దమ్ము ఎ...ఎవడికైనా ఉ.. ఉంటుందా అసలు?" అని నవ్వేడు దివాకర్.

అవే ప్రశ్నల్లో నాలుగు నించి పది వాక్యాల్లో రాయగలిగిన సమాధానాలని కరుణ వివరిస్తూ ఉంటే రాజు గబగబా పాయింట్సు నోట్సుగా రాయసాగేడు. అందరికీ తలో కాపీ ఇవ్వడం కోసం తన్మయి, అనంత వాటిని తమ దస్తూరీతో తిరగ రాయసాగేరు. కేంటీనులోంచి కాఫీ తెచ్చుకుని తమ వైపు నడిచి వస్తూన్న డిపార్టు మెంటు హెడ్డు చిదంబరం గారిని చూస్తూనే చప్పున నిలబడ్డాడు దివాకర్.

అంతా లేచి నిలబడడం చూసి, "ఏవిటోయ్ నిన్న కూడా చూసేను, చెట్టు కింద దుకాణం పెట్టేరేవిటి?" అన్నారు చిన్నగా నవ్వుతూ.

"జె..జే.ఆర్.. ఎఫ్ చ...చదువు మేస్టారూ..! " అన్నాడు దివాకర్.

తన్మయి చేతుల్లోని బిట్ పేపర్ కాగితాల వైపు చూసి, నేనొకసారి చూడొచ్చా? అన్నారు మేస్టారు.

ఒక్కో పేజీ తిప్పుతూ, “ఇవన్నీ ఎక్కడి నించి సేకరించేరు? అన్నారు ఆశ్చర్యంగా.

“గత సంవత్సరంగా చదివిన పుస్తకాల నించి మాస్టారూ" అంది తన్మయి వినయంగా.

"అంటే ఇవన్నీ మీకు ఇప్పటికే కంఠో పాఠాలా? అన్నారు మరింత ఆశ్చర్యంగా.

"అవును మేస్టారూ, తన్మయి ఒక పద్ధతి ప్రకారం మమ్మల్నందరినీ జే ఆర్ ఎఫ్ ఉత్తీర్ణులని చెయ్యాలని సహాయం చేస్తూంది. ఇక కరుణకి రాని విద్యే లేదు. మేమంతా తలో భాగమూ పంచుకుని ఇప్పటికి అన్నిటిలోనూ దాదాపు నిష్ణాతులయిపోయేం” అంది చకచకా అనంత.

"ఊ... అన్నీ బానే ఉన్నాయి గానీ ఎండలో ఈ చెట్టు కింద మకాం ఏవిటీ?” అన్నారు మేస్టారు.

“డిపార్మెంటుకి ఇప్పుడు సెలవలు కదా మేస్టారూ, మేమందరం కలవగలిగే చోటు మాకు ఇంతకంటే ఎక్కడా దొరకలేదు" అన్నాడు కరుణ.

"నాతో రండి" అని లేచారు మేస్టారు.

డిపార్టు మెంటులో అటెండరుని పిలిచి ఒక క్లాసు రూము తాళం తీయించి, "సెలవులైనా నేను పగటి పూట డిపార్టు మెంటులోనే ఉంటాను. మధ్యాహ్నం భోజనం సమయం వరకూ మీరిక్కడ చదువుకోవచ్చు. ఒక వేళ డిపార్టు మెంటులో నేను కనిపించకపోతే తిన్నగా మా ఇంటికి వచ్చెయ్యండి. అక్కడ మీకు సమాధానాలు తెలియని వాటికి అవసరమైన సాయం నేను కూడా చేస్తాను. మా ఇంటి లైబ్రరీలోని పుస్తకాలు చదువుకుని నోట్సులు రాసుకోవచ్చు. ఒకటే నిబంధన పుస్తకాల్ని ఇంటికి పట్టుకెళ్ళకూడదు. మీకు తెలిసిందేగా పుస్తకం.....విత్తం పర హస్తం గతం గత:" అన్నారు నవ్వుతూ.

"తప్పకుండా మేస్టారూ, చాలా థాంక్స్, నమస్కారం" అని బయటికొచ్చేరు అందరూ.

దివాకర్ వాళ్ళిల్లు మేస్టారింటికి దగ్గరే. కానీ అతనికి ఇంటి దగ్గర చదువుకోవడం ఎందుకో ఇష్టం ఉండదు. రాజు, అనంతల ఇల్లు ఊరికి చాలా దూరం. గబుక్కున రిఫరెన్సుకి పుస్తకాలు కావాలంటే చాలా కష్టం.

బయటకు రాగానే తన్మయి "మేస్టారు చెప్పినదీ నిజమే, మనకేవైనా డౌట్సు ఉంటే వెంటనే అడిగి సమాధానాలు తెలుసుకోవచ్చు" అంది.

కరుణ ఎందుకో ముభావంగా ఉంటున్నాడు. తన్మయితో ప్రత్యేకించి మాట్లాడడం, తన వైపు చూడడం చెయ్యడం లేదు. తన్మయికి అదొక ఊరట గా అనిపించింది. కారణమేదైనా తన వరకూ తనకి కరుణ గురించిన ఆలోచనలు అస్థిమితాన్ని కలగజేస్తు న్నాయి.

మర్నాడు తను కోర్టు వాయిదాకి వెళ్లాల్సి ఉంది.

"ఎల్లుండి డిపార్టుమెంటులో కలుద్దాం, నాకు హాస్టలులో రేపు పనుంది." అంది తన్మయి లేస్తూ.

అబద్ధం చెప్పాలంటే పరమ అసహ్యం తన్మయికి. అయినా తప్పని సరయ్యి ఇలాంటివి చెప్పాల్సి వచ్చినపుడు తన్మయి గొంతు వణికి పోతుంది.

అనంత గమనించి పక్కకు తీసుకెళ్ళింది. "అంతా బానే ఉందా తన్మయీ?" అంటూ.

చప్పున కళ్ళ నీళ్లు తిరిగేయి తన్మయికి.

"నాకు ఈ కోర్టు ల చుట్టూ తిరగడం అస్సలు నచ్చడం లేదు అనంతా" అంది.

"అతన్ని కోర్టు చుట్టూ తిప్పిస్తున్నాననుకుని నువ్వు అనవసరంగా తిరుగుతున్నట్టు నాకనిపిస్తూంది. అందువల్ల నీకు కలుగుతున్న మనస్తాపం అతనికి కలుగుతూందనుకోను. అతను నీలాగా భావుకుడు కాదు, సున్నిత మనస్కుడూ కాదు. కాబట్టి అతనికి ఇవన్నీ చాలా మామూలు విషయాలు. కాబట్టి ఎన్ని సంవత్సరాలైనా కోర్టు చుట్టూ తిరగగలడు. ఇక మగవాడు కాబట్టి, అతనేం చేసినా సమాజం అతనికి వంత పాడుతుందన్న ధీమా ఉంది. కానీ ఒక స్త్రీగా మన పాట్లేవిటో నీకు చెప్పాల్సిన అవసరం లేదు. ఇక బాబు విషయం అంటావా? ఇప్పటికే నీకు వాడికి తండ్రి అనేవాడు లేకపోతేనే బావుణ్ణన్న భావం స్థిరపడి ఉండాలి. అసలు అతనికి బాబు పట్ల ప్రేమ ఉంటే ఇదంతా చేసేవాడే కాదు. ఎటు చూసినా అతను నిన్ను ప్రేమగా చూసుకోని వాడూ, డబ్బు మనిషి, ఒక అధ్వాన్నపు తండ్రి, ఒక సరైన వ్యక్తిత్వం లేని పరమ చవట. నీకు ఏ విధంగానూ తగని వాడు. అతని కోసం నువ్వు ఇంతగా బాధపడ్తూ కోర్టు చుట్టూ దేనికోసం తిరుగుతున్నావో ఆలోచించుకో " సాలోచనగా అంది అనంత.

బస్సులో హాస్టలుకి వస్తున్నంత సేపూ తన్మయికి అనంత చెప్పిన మాటలే గుర్తుకు వస్తున్నాయి. అతనికీ, తనకూ మధ్య మిగిలిన బంధం ఒక్క బాబు మాత్రమే. మిగతావన్నీ ఎప్పుడో కాలంలో కలిసిపోయేయి. తనని ఇన్ని హింసల పాలు చేసిన అతను కోరుకున్నవన్నీ తనెందుకు చెయ్యాలి? అందుకే తను విడాకులు ఇవ్వదు, తనకెంత కష్టమైనా సరే. మర్నాడు కోర్టు కి పుస్తకాలు పట్టుకుని వెళ్ళింది. పుస్తకం పట్టు కుంటే తన్మయికి చుట్టూ ప్రపంచంలో ఏం జరుగుతుందో తలకెక్కదు. పరీక్షల సమయంలో బస్టాండులో బస్సు కోసం వేచే సమయంలో కూడా చుట్టూ గందరగోళంలో తనకి దీక్షగా చదువుకోగలిగిన ఏకాగ్రత ఉంది. అది ఇప్పుడు ఒక వరం అయ్యింది. తన్మయి చేతిలోని జె ఆర్ ఎఫ్ నోట్సులో దృష్టి కేంద్రీకరించింది. లాయరు లోపలికి పిలిచినప్పుడు యాంత్రికంగా వెళ్ళి అయిదునిమిషాల్లో బయటకు నడిచింది. శేఖర వైపు కన్నెత్తి కూడా చూడలేదు. అతనిప్పుడు తనకు ప్రత్యర్థి మాత్రమే.

ఎక్కడో చదివింది, "నీ శత్రువు గురించి నువ్వు ఆలోచిస్తున్నావంటేనే, అతను నీ మీద గెలుపు సాధిస్తున్నాడని అర్థం".

"ఇక మీదట అతని ఆలోచనల్ని కూడా రానివ్వకూడదు."దృఢంగా నిశ్చయించుకుంది.

★★★

ఆ వారంలో స్కూలుకి సెలవులు వచ్చేయి. ఆయాలు ఊళ్ళు వెళ్ళేరు. హాస్టలు భవనాలన్నీ దాదాపు ఖాళీ అయ్యేయి. వార్డెన్లు కావాలంటే వెళ్ళొచ్చు, లేకపోతే ఉండిపోవచ్చు. వెంకట్ రెండు రోజులు వెళ్ళొచ్చేడు. మురళి ఒక రోజు పొద్దుటే వెళ్ళి సాయంత్రానికి వచ్చేసేడు. ఆయాలు కూడా సెలవు తీసుకున్నారు.

సాయంత్రపు భోజనాలయ్యేక ముగ్గురూ రెండు హాస్టళ్లకి మధ్య కుర్చీలు వేసుకుని కూచున్నారు.

తన్మయి మనసు నిండా పరీక్షల తాలూకు పుటలు తిరుగుతున్నా, కాస్సేపు వాళ్లతో కబుర్లు చెప్పడంతో మనసుకి ఊరట లభిస్తుందనిపించింది.

"మీరు కంప్యూటరు ఇన్స్ట్రక్టరు అయి ఉండి, ఓనమాలు దిద్దుతున్నానని చెప్పారేవిటి?" అంది తన్మయి వెంకట్ తో.

బదులుగా, "మరదే, అన్నీ చెప్పేస్తారు" అన్నాడు ఎప్పటి హాయైన నవ్వుతో వెంకట్.

తన్మయికి ఆ నవ్వు చూస్తే భలే ఆనందం వేస్తుంది. పసి పిల్లాడిలా ఎప్పుడూ సంతోషంగా ఉండడం ఎలా సాధ్యమవుతుంది అతనికి?

అదే అడిగింది.

అందుకు సమాధానంగా మురళి "జీవితమ్మీద సీరియస్ నెస్ ఉండదు వెంకట్ కి" అన్నాడు.

వెంకట్ సీరియస్ గా ఉన్నట్టు ఫోజు పెట్టి, "అబ్బా! సీరియస్ గా ఉండి మీరిద్దరూ సాధిస్తున్నదేవిటో! బై ది వే, కొత్త సినిమాలు ఏం చూసేరు?" అన్నాడు తన్మయి వైపు చూసి చిర్నవ్వుతో.

"సినిమాలా?" అని ఆశ్చర్యపోయింది తన్మయి.

తన జీవితంలో సినిమాలకి ఎప్పుడూ ఒంటరిగా వెళ్లలేదు. ఇక ఇప్పుడున్న పరిస్థితుల్లో సినిమాకి వెళ్ళే జీవితం ఉందా తనకు?" ఆలోచనలో పడిన తన్మయి వైపు చూస్తూ.

"ఏవిటండీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? నేనడిగిన ప్రశ్న సినిమాల గురించి, మా ఇంటి పై కప్పు గురించి కాదు" అన్నాడు వెంకట్.

"ఈ నవ్వులాటలకేకానీ, మీకభ్యంతరం లేకపోతే మీ గాథ వినాలని ఉంది" అన్నాడు మురళి.

తన్మయి ఆశ్చర్యంగా చూసింది. పైకి ఎంతో గంభీరంగా, నిశ్శబ్దంగా కనిపించే ఇతనికి తన గాథ వినే కుతూహలం ఉందన్న మాట.

తన మౌనాన్ని మరోలా అర్థం చేసుకుంటూ, "అంటే మీకు అభ్యంతరం లేకపోతేనే" అన్నాడు మురళి.

వెంకట్ కూడా తన వైపు చూస్తూ, మీ గాథ మన ముగ్గుర్నీ దాటి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లదని మాట ఇస్తున్నా" అన్నాడు సీరియస్ గా.

"మీకు అంత సీరియస్ నెస్ అతకదు లెండి. అయినా మంచి మిత్రులు, మీకు కాక ఇంకెవరికి చెప్పుకోగలను నా గాథ. కాకపోతే విని ఓపిక మీకుండాలి అంతే." అంది తన్మయి.

దాదాపు రెండు గంటల సేపు తన్మయి చెప్తున్న సన్నివేశాల్ని అతి నిశ్శబ్దంగా విన్నారు మురళి, వెంకట్.

మురళి వెంటనే తేరుకోలేనట్లు కనిపించాడు. ఎటో చూస్తూ తన్మయి బాధల పట్ల దుఃఖిత హృదయం తోనూ, తన్మయిని దుఃఖానికి గురి చేసిన అతని పట్ల కోపావేశాల తోనూ సతమతమవుతున్నట్లు అనిపించాడు.

వెంకట్ మాత్రం, "మీరు యూనివర్శిటీకి వెళ్లి వస్తున్నారంటే ఏదో మామూలు విషయం అనుకున్నాను. మీకున్న పట్టుదలకీ, ధైర్యానికీ జోహార్" అన్నాడు.

ఎప్పుడూ యోగమూర్తిలా శాంత వదనంతో ఉండే మురళి ముఖంలో కనిపిస్తున్న బాధని చూసి తన్మయికి వేదన కలగసాగింది. "తను మురళి ప్రశాంతతని కొల్లగొడుతూ ఉందా !"

అప్పుడప్పుడే పశ్చిమాన ఉదయిస్తున్న చంద్రుడి వైపు చూస్తూ "తన్మయిగారూ! మీ కథ విన్నాక మీ పట్ల గౌరవం రెట్టింపు అయింది. ఎప్పటికీ మీ జీవితం వెనుతిరగని వెన్నెల కావాలని ఆశిస్తున్నాను. మీ ఆశయ సాధనలో నా సహాయం ఎప్పుడు అవసరమైనా చెప్పండి, తప్పక చేస్తాను. మీ జీవితం పదిమందికి స్ఫూర్తిదాయకం. జీవితం అనేది ఒకే ఒక సారి మాత్రమే లభిస్తుందని నమ్ముతాను. జీవితం ఎంత చిన్నదో అంత అపురూపమైనది. దానిని సార్థకం చేసుకుంటూన్న మీకు శిరసు వంచి నమస్కరిస్తూ అభినందనలు తెలియజేస్తు న్నాను." అన్నాడు ఉద్విగ్నంగా.

"నాకు అంత భాష రాదు గానీ, 'మీ' జీవితాన్ని జీవించడం అంత సులభతరం ఏమీ కాదు. "ఐ హేవ్ సీన్ ద గ్రేటెస్ట్ ఉమన్ ఇన్ మై ఎంటైర్ లైఫ్" అన్నాడు వెంకట్.

"నన్ను అంతగా పొగిడెయ్యకండి. నా బాధల్ని చెప్పుకోవడానికి మీరిద్దరూ ఇక్కడ ఉండడం నా అదృష్టం అంది తన్మయి తేలికైన మనస్సుతో.

ఒక్క నిమిషం అని తన్మయి చేతిలో బ్యాగుతో వచ్చి, "మురళి గారూ అతను పట్టుకెళ్ళిపోగా మిగిలిన బట్టలు ఇవి. మన వృద్ధాశ్రమంలో ఎవరికైనా ఉపయోగపడ్తాయేమోనని పట్టుకొచ్చేను" అంది మురళికి ఇస్తూ.

ఇంతలో వొంటింట్లో నుంచి వంటతను, వంటావిడ మరో ఇద్దరు పని వాళ్ళు గాభరాగా పరుగెత్తుకొచ్చేరు.

ఏవైయిందని అడిగేలోగా మరింత గాభరాగా, "సిలెండరు పైన మంటలొచ్చే సేయి....మంటలు" అంటూ పరుగు లంకించుకున్నారు.

పక్కనే ఆడుకుంటున్న బాబుని లేవదీసి ఒక్క ఉదుటున తన్మయి కూడా దూరానికి పరుగు తీసి చుట్టూ ఉన్నవాళ్ళతో బాటూ వెళ్ళి నిలబడింది. అంతా హాస్టలు భవంతికి దూరంగా నిలబడ్డారు. ఎవరికీ ఏమీ తోచడం లేదు. గూర్ఖాలు, తోట పని వాళ్ళు కూడా పరుగెత్తుకొచ్చి అక్కడే నిలబడిపోయేరు. వంటింట్లో పెద్ద మంట తాలూకు వెలుతురు వస్తోంది. ఎప్పుడు పేలుతుందో, పేలితే ఏమవుతుందో అన్న ఆందోళన అందరి ముఖాలలోనూ.

"మురళి గారేరీ?" అంటూ చుట్టూ చూసింది తన్మయి.

వెంకట్ చుట్టూ చూస్తూ , వంటింటి వైపు చూపించేడు.

వంటింట్లో నుంచి మంటలు రేగుతున్న సిలెండర్ని పెద్ద గునపం తో బయటకు తోసుకుంటూ వస్తున్న మురళి వైపు చూసి "మురళీ, జాగ్రత్త" అని అరిచింది తన్మయి భయంతో చెంగు తీసి నోటికి అడ్డం పెట్టు కుంటూ.

ఆ సిలిండర్ని పక్కనే జరుగుతున్న కన్స్ట్రక్షన్ ఇసుక లో పడేసి, పరుగెత్తుకెళ్లి కనబడ్డ బక్కెట్టు లో నీళ్ళు తెచ్చి కుమ్మరించి ఆర్పేసేడు మురళి. అందరూ ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు. బొబ్బలెక్కిన అతని చేతుల్ని దాచుకుంటూ తమ వైపు వస్తున్న మురళిని చూసి తన్మయి అసలతను అలా ఎలా చేయగలిగేడో అర్థం కాక అయోమయంగా తలూపింది. ఇంత అసంకల్పితంగా పరోపకారం చెయ్యగలిగిన ఇటువంటి గొప్ప వ్యక్తులు కూడా ఉంటారా?! ప్రమాదం జరిగినప్పుడు ఎవరైనా ముందుగా తమని తాము రక్షించుకునే ప్రయత్నమే చేస్తారు. తన వరకూ తనకి ముందుగా బాబు గుర్తొచ్చేడు. అదేం ప్రమాదమో తెలియకపోయినా అసంకల్పితంగా అందరితో బాటూ తనూ పరుగు తీసింది.

కానీ మురళి అందరినీ రక్షించడానికి తన ప్రాణాలు పణంగా పెట్టడానికైనా సిద్ధమయ్యేడు. అదెలా సాధ్యం?!

మురళి దగ్గరకు రాగానే కళ్ల నిండా నీళ్ళ తో మనసంతా నిండిన అత్యున్నత భావంతో రెండు చేతులూ జోడించి నమస్కరించింది. మురళి వంటి ఉన్నత వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిని ఇంత వరకూ తన జీవితంలో చూడలేదు, బహుశా: ఎప్పటికీ చూడదేమో. అతని మీద ఆరాధన, గౌరవం వంద రెట్లు పెరిగేయి తన్మయికి. బాబుతో కాళ్ళకు దణ్ణం పెట్టించింది.

"అరెరే, ఏవిటిదంతా" అన్నాడు దూరంగా జరుగుతూ మురళి.

స్కూలు కరస్పాండెంట్ రాఘవేంద్రరావు గారు ఇంటి నుంచి వార్త విని హుటాహుటిన వచ్చేరు.

మురళీని అంతంత రిస్కులు చెయ్యొద్దని సున్నితంగా మందలిస్తూ నే గొప్ప ప్రమాదాన్ని తప్పించినందుకు అభినందనలు కురిపించేరు.

శేఖర్ లాంటి దుష్టులే కాదు, మగవాళ్ళలో మురళి లాంటి ఉన్నతులు కూడా ఉంటారని తన్మయి అర్థం చేసుకుంది.

ఆ సంఘటన తన్మయి జీవితమ్మీద చెరగని ముద్ర వేసింది.

-------

బాబుకి సెలవు కావడంతో కంబైండ్ స్టడీస్ కి తనతో తీసుకెళ్ళక తప్పడం లేదు తన్మయికి.

మొదటి నించీ ఒక కాలి మీద వాడిని కూచోబెట్టుకుని మరో కాలిమీద పుస్తకం పెట్టుకుని చదవడం తన్మయికి అలవాటైన విద్యే. ఆ రోజు అందరూ మేస్టారి ఇంటి దగ్గర చేరేరు. మాస్టారి భార్య అంత మందికి విసుగూ విరామం లేకుండా ఉడక బెట్టిన వేరు శనగలు, కాఫీ అంటూ అస్తమాటూ ఏవేవో తెచ్చి ఇచ్చేవారు. మాస్టారితో సరి సమానమైన గొప్ప వ్యక్తిత్వం ఆమెది.బాబు నిమిష నిమిషానికి తన్మయిని చదవనీయకుండా విసిగిస్తుండడం చూసి మాస్టారు బాబుని "ఇలా రావోయ్, అమ్మని చదువుకోనివ్వు, నీకు జాంకాయలు కోసిస్తాను" అని పెరట్లోకి తీసుకెళ్లేరు.

అది మొదలు ఎప్పుడు మాస్టారింటికి వెళ్లినా, జాంకాయలు అంటూ బాబు ఆయన వెంట పడడం, ఆయన నవ్వుతూ వాణ్ణి ఎత్తుకుని తీసుకెళ్లడం పరిపాటి అయ్యింది.

"ఎన్నో కష్టాలలో ఉన్నా, ఆ అమ్మాయికి ఆ చదవాలనే దీక్ష చూడు" అని మాస్టారు భార్యతో అనడం వింది తన్మయి.

ఆ రోజు అంతా వెళ్లేక, "మరి పదినిమిషాల్లో వెళ్దువులే" అన్నారు మాస్టారి భార్య వేదవతి.

"ఇలా చూడమ్మా, నీ కష్టం ఏవిటో నాకు తెలీదు. మాస్టారికి నీమీద అమిత వాత్సల్యం. ఆయనకు బాగా కష్టపడి చదివే వాళ్ళంటే ఎంతో అభిమానం. నువ్వు పరీక్షల సమయంలో బాబుతో బాటూ ఇక్కడే ఉండి చదువుకో. నువ్వు పరీక్షలకి వెళ్లినపుడు బాబుని నేను చూస్తాను" అన్నారావిడ.

తన్మయికి చప్పున దుఃఖంవచ్చింది. కళ్ళ నిండా నీళ్లతో నమస్కరించింది. తన పట్ల కొందరికి ఎందుకు ఇంత దయ? ఆ దంపతులిద్దరినీ జీవితంలో మరిచిపోకూడదు అనుకుంది తన్మయి. ఆవిడ చేత్తో వండిన కలగూర పప్పు, పెరటి చిక్కుడు కాయల కూర ఎంతో రుచికరంగా అనిపించాయి తన్మయికి. కొసరి కొసరి వడ్డించారావిడ.

----

జే ఆర్ ఫ్ పరీక్షలు రాసే రోజు రానే వచ్చింది. మాస్టారి భార్య దగ్గర బాబుని వదిలింది. ఈ పరీక్ష కోసం ఎన్నో రోజుల నించీ ఎదురుచూపు. ఇదొక అంతిమ ఘట్టం. చావో, రేవో తేల్చుకోవలసినంత తెగింపు.

ముందు రోజు నించే ప్రశ్న తర్వాత ప్రశ్న తలలో ప్రత్యక్షమవుతూ ఉన్నాయి. తనలో తాను మననం చేసుకుంటూ యోగముద్రలో ఉన్నట్టుంది మస్తిష్కం. పరీక్ష హాలు చూసే సరికి ఆశ్చర్యం వేసింది. అన్ని డిపార్టుమెంటులకి కలిపి ఒకే పెద్ద హాలులో జరుగుతూ ఉంది పరీక్ష. మొత్తం యూనివర్శిటీ లో కొన్ని వేల మంది అక్కడ పరీక్ష రాస్తున్నారు.పరీక్షలో మొదటి విభాగం ఇంగ్లీషు, లెక్కలు ఏ సబ్జెక్ట్ వారికైనా సమానమని గుర్తుకు వచ్చింది తన్మయికి. రెండవ విభాగం, మూడవ విభాగాలు పూర్తిగా సబ్జెక్ట్ కు సంబంధించిన పేపర్లు. తమ డిపార్ట్ మెంటు నించి సీనియర్లు కూడా చాలా మంది పరీక్ష రాస్తున్నారు. ఉదయం నించి సాయంత్రం వరకూ పరీక్ష అది. మధ్యలో గంట సేపు విరామం. విరామంలో మిత్రులంతా కలుసుకుని పొద్దుట పరీక్ష తాలూకు విషయాలన్నీ చర్చించుకున్నారు. అందరూ ఇంగ్లీషు, లెక్కలు కఠినంగా ఉన్నాయని వాపోయారు. కానీ తన్మయికి అంత కష్టంగా అనిపించలేదు. మొత్తం మూడు పరీక్షలు శ్రద్ధగా రాసింది తన్మయి. అన్నీ తెలిసిన ప్రశ్నలే అనిపించాయి. పరీక్ష రాసి బయటకు రాగానే పెద్ద భారం తీరినట్లైయింది.

పరీక్ష కాగానే అంతా సినిమాకి వెళ్దామని ప్రోగ్రాము పెట్టుకున్నారు. తన్మయి మృదువుగా తిరస్కరించి బాబుతో బాటూ హాస్టలు బస్సెక్కింది.

---------

ఆ మరసటి వారంలో హాస్టలు గేటు దగ్గర్నించి కబురు వచ్చింది తన్మయి కోసం విజిటర్సు వచ్చారంటూ. తన్మయి ఆశ్చర్యంగా ఆఫీసు రూములోకి అడుగు పెట్టింది.

శేఖర్ తల్లి, ఆవిడ తమ్ముణ్ణి తీసుకుని వచ్చింది.

"బాబుని చూడడానికి వచ్చేం." ముక్తసరిగా అంది శేఖర్ తల్లి దేవి.

తన్మయి చెయ్యి విదిలించుకుని బాబు ఆవిడ పిలవగానే అటు పరుగెత్తేడు. ఆవిడ చేతిలోని ఫైవ్ స్టార్ చాక్లెట్టు చూసి.

తెల్ల చీర కట్టుకుని సన్యాసినిలా ఉన్న తన్మయి వైపు చూసి పెద్దగా నిట్టూర్చింది ఆవిడ.

ఆవిడ తమ్ముడు "ఇలా చూడమ్మాయి, నీ మంచి కోసం నీకు ఒక మంచి సలహా చెప్తాను విను. మా శేఖర్ నీకు విడాకుల కాగితం పంపించాడంటే ఇక మీదట నిన్ను ఏలుకునే ఉద్దేశ్యం లేకనే. అలాంటి వాడిని పట్టుకుని ఎన్నాళ్ళు వేళ్ళాడతావు చెప్పు, ఆ సంతకమేదో పెట్టేస్తే ఇరువురికీ మంచి జరిగినట్టవుతుంది. మధ్యలో పిల్లాడు కూడా నలిగిపోతున్నాడు" అన్నాడు ఎక్కడ లేని సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు.

తన్మయి మాట్లాడకుండా బాబు దగ్గిరికి వెళ్ళి చెయ్యి పట్టుకుని "పద నాన్నా, లోపలికి వెళ్దాం." అని చెప్పి వాళ్ళ వైపు కూడా చూడకుండా హాస్టలుకి తిరిగి వచ్చేసింది.

మ్లానమైన ముఖంతో తనని దాటి వెళ్తున్న తన్మయిని చూస్తూ "ఏవైంది తన్మయి గారూ?" అన్నాడు మురళి.

"మురళీ గారూ! నాకు సాయం చేస్తానన్నారుగా, దయచేసి నాకోసం ఏ విజిటరు వచ్చినా నేను అందుబాటులో లేనని చెప్పించండి" అంది నమస్కరిస్తూ తన్మయి.

మురళి విసవిసా గేటు దగ్గరికి నడిచేడు. తన గదిలోకి రాగానే దు:ఖం ఆగలేదు తన్మయికి. తన మానాన తనని బతకనివ్వకుండా అతని బంధువులు వచ్చిపోవడం ఎందుకు? తనకీ బాధలెందుకు? తనేం చెయ్యాలో ఇప్పటికీ వాళ్ళే శాసిస్తారు.

బాబు తమ దృష్టి నించి దూరం కాకుండా ఉండడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

-----

ఆ మరుసటి నెలలో జ్యోతి, భానుమూర్తి వచ్చేరు. స్వయంగా భానుమూర్తి బాబాయి మనవడి పెళ్లి జరుగుతూంది. తన్మయిని పట్టుబట్టి తీసుకువెళ్లింది జ్యోతి. పొద్దుట వెళ్లి సాయంత్రానికి వచ్చేసేదే కాబట్టి ఒప్పుకుంది తన్మయి హాస్టలులో చేరి, తెల్ల చీరలు కట్టుకోవడం మొదలు పెట్టినప్పట్నించీ నిరాడంబరంగా బతకడం అలవాటు అయిపోయింది తన్మయికి. తల్లి తెచ్చిన పట్టుచీర కట్టుకుంటే ఏదో ఎబ్బెట్టుగా అనిపించసాగింది.

పెళ్ళి ఆర్భాటంగా జరిగింది. ఒక పక్క తిండి లేక అన్నమో రామచంద్రా అంటూ దేశంలో ఎందరో అలమటిస్తూ ఉండగా పెళ్లి పేరుతో పెడ్తున్న ఖర్చుని, విందులని చూసి మొదటిసారి చికాకు అనిపించింది తన్మయికి.

పెళ్లిలో తనకి శేఖర్ మేనత్త వరసయ్యే ఒకావిడ తన్మయి కూచున్న పక్క కుర్చీలో కూచుంది.

"బావున్నావా అమ్మా, ఎప్పుడో నీ పెళ్లిలో చూసేను. అన్నట్టు మీ ఆయన మరెవరో పిల్లని పెళ్ళి చేసుకుని, దానితోనే ఉంటున్నాడంట తెలుసా? వాళ్లు కాపురం ఉన్న వీధిలోనే నెల్లూరులో మా చెల్లెలు ఉంటూంది." అంది.

తన్మయికి ఒక్క సారిగా ఒంట్లో నించి కంపరం పుట్టుకు వచ్చింది. అక్కణ్నించి లేచి మరో చోటికి వచ్చేసినా ఆవిడ చెప్పిన మాటే చెవుల్లో గింగిర్లు తిరుగుతూంది. "వాడు ఆ పిల్లని వాడుకున్నాడు, వాళ్ళు కాలూ, చేతులూ కట్టి పెళ్లి చేసేసేరు." అని.

తన్మయికి ఇప్పుడు అన్ని విషయాలూ అర్థం కాసాగేయి.

తనతో అంత హఠాత్తుగా గొడవ పెట్టి ఎందుకు విడాకులు వెంటనే పంపించేడో, విడాకుల కోసం వాళ్ళ వాళ్లు ఎందుకు ఆరాట పడ్తున్నారో. తను విడాకులు ఇచ్చే వరకు “చట్ట బద్ధంగా” అతనికి పెళ్ళి చేసే వీలు లేదు. నెల్లూరులో అమ్మాయి అంటే బహుశా: ఇంటి వాళ్ల అమ్మాయి ఉంటుంది. ఒక్కతే కూతురు కావడం వల్ల వాళ్ల ఆస్తి మీద కన్నేసినట్టున్నాడు దుర్మార్గుడు.

అక్కడ ఎక్కువ సేపు ఉండలేక, త్వరగా భోజనం కానిచ్చి, అమ్మా, నాన్నల దగ్గర సెలవు తీసుకుని బయలుదేరింది తన్మయి.

వెనక నించి ఎవరో, "ఈ అమ్మాయి శేఖర్ మొదటి పెళ్ళాం కదూ! వీళ్ల వంశంలో అందరికీ మొగుళ్లనొదిలేయడం ఆనవాయితీ" అనడం వింది.

కుతాకుతా ఉడుకుతున్న మనసు మీద మాటల గాయాలు మళ్లీ మళ్లీ తగులుతూ ఉన్నాయి. “ఇంకెప్పుడూ బంధువుల ఇళ్ళకి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదు.” గట్టిగా నిర్ణయించుకుంది.

బస్సులో బాబు వెంటనే నిద్రపోయేడు.

బస్సులోని చీకటి మనసంతా నిండినట్లయ్యి తన్మయి బుగ్గల మీద నించి వెచ్చని కన్నీళ్ళు ధారాపాతంగా కారసాగేయి.

## 32

ఎమ్మే రెండవ సంవత్సరం రిజల్ట్సు వచ్చేయి.

కరుణకి మొదటి ర్యాంకు, వరసగా తన్మయికి రెండు, రాజుకి మూడు, అనంతకి నాలుగవ ర్యాంకు వచ్చేయి. దివాకర్ సెకండ్ క్లాసులో పాసయ్యేడు. కరుణ ముఖంలో మిగతా ముగ్గురి కంటే ముందు ర్యాంకులో ఉన్నానన్న గెలిచిన ఆనందం బాగా కనిపించింది తన్మయికి. కిందటి ఏడాది నాలుగవ ర్యాంకు వచ్చిందని అతను కుంగిపోతుంటే మెరిట్ స్కాలర్ షిప్పు రాలేదన్న బాధ అని సరిపెట్టుకుంది. కానీ ఎందుకో అతని మాటల్లో తను గెలవడం కంటే మిగతా వారి కంటే ముందుకు దూసుకు వెళ్లానన్న భావన కనిపించి ఆశ్చర్యపోయింది తన్మయి.

తనయితే అందరూ గెలవాలని, ఆనందంగా ఉండాలని కోరుకుంటుంది. తన్మయి తనకు వచ్చిన సెకండ్ ర్యాంకు తనకు లభించిన అత్యున్నత వరంగా భావించింది.

ఉదయానే మాస్టారింటికి వెళ్లింది. దంపతులిద్దరికీ ధన్యవాదాలు చెప్పింది. తనకు జే ఆర్ ఎఫ్ కూడా తప్పక వస్తుందని దీవించేరిద్దరూ. బస్సు దిగి తన్మయి బాబు చెయ్యి పట్టుకుని హాస్టలు వైపు ధీమాగా నడవ సాగింది. అప్పుడప్పుడే వర్షం కురిసి వెలిసి నేలంతా కళ్లాపి చల్లినట్లు బహు సుందరంగా ఉంది. బాట పక్కన లేతాకు పచ్చని తీగెలు, ఆకుపచ్చని చెట్లని అల్లిబిల్లిగా అల్లుకుని చిరుగాలికి తలలూపుతూ తన్మయికి త్రోవ చూపుతున్నట్లున్నాయి.

అప్పుడప్పుడే ఊహ తెలుస్తున్న బుడతడు హుషారుగా నడుస్తూ అమ్మని రకరకాల ప్రశ్నలు అడగసాగేడు. అన్నిటికీ తన్మయి ఓపికగా సమాధానాలు వివరించసాగింది.

హాస్టలులో తన రిజల్టు విషయం తెలియగానే పండగ వాతావరణం నెలకొంది. వంటామె గబగబా పంచదార పట్టుకొచ్చి నోట్లో పోసింది. దోసె మాస్టర్ ఒరియా వాడు. వచ్చీ రాని తెలుగులో "ఇప్పుడు మీద అమ్మకు పెట్టేది రెండు దోసెలు" అన్నాడు.

వెంకట్ రెండు దేవగన్నేరు పూల కొమ్మలు తుంచి తెచ్చి "అభినందన పూలమాలలివే, అందుకోండి" అన్నాడు.

మురళి చేతిలోని కలర్ పెన్సిల్ స్కెచ్ ని చేతిలో పెట్టి, "ఇక మీకు తిరుగు లేదు జీవితంలో" అన్నాడు.

కాగితాన్ని విప్పి చూసింది తన్మయి. అప్పటి వరకూ తమనే హాస్టలు పై నించి చూస్తున్నట్లున్నాడు, అందమైన లతల బాట వెంట తల్లీ, కొడుకూ ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని మాట్లాడుకుంటూ వస్తున్నట్లున్న చిత్రమది. తన్మయి కళ్లల్లోకి అప్రయత్నంగా నీళ్లు వచ్చేయి! మురళికి నమస్కరిస్తూ చప్పున కళ్లు దించుకుంది. ఇంతలో పిల్లలంతా పరుగున చుట్టూ చేరి కౌగలించుకుని అభినందనల్లో ముంచెత్తేరు. తన్మయి తనకు లభించిన అపురూప వరానికి పులకించిపోయింది.

"నా చుట్టూ ఇంత మంది ఆత్మీయుల్ని ప్రసాదించినందుకు ధన్యవాదాలు మిత్రమా!" తనలో తను అనుకుంది.

ఆధారం కోల్పోయి అలల తాకిడికి ఎటో కొట్టుకుపోతున్న ఒంటరి నావలా ఈ తీరానికి చేరింది. ఇందరి ప్రేమాప్యాయతలు పొందగలగడం తన అదృష్టం.

★★★

ఆ మధ్యాహ్నం బాయ్స్ హాస్టలు వాకిట్లో దాదాపు ఇరవై, ఇరవై రెండు సంవత్సరాల వయసున్న అందమైన అమ్మాయి, ఆమె తల్లిదండ్రులు కాబోసు బయటకు నడుస్తూ కనిపించేరు దు:ఖపూరితంగా ఉన్న ఆమె ముఖం చూస్తేనే అర్థం అవుతూంది, ఆమె ఏదో కష్టంలో ఉన్నదని.

తన్మయి మెట్లు దిగి వెళ్లబోతూ వాళ్లని గేటు వరకూ సాగనంపడానికి వెనకే వస్తున్న మురళిని చూసి ఆగిపోయింది. "ఆమె ఎవరు? మురళికి చెల్లెలా? బంధువా? ఎందుకు దు:ఖ పడ్తూంది?" తనలో తనే ప్రశ్నలు వేసుకోసాగింది.

తన్మయి వైపే వస్తున్న వెంకట్ ప్రశ్నార్థకమైన తన్మయి ముఖం చూస్తూనే, "ఆమె ఎవరని కదా మీ సందేహం!" అన్నాడు.

తన్మయి తలూపే లోగా,"మురళి భార్య" అన్నాడు.

తన్మయి నమ్మలేక ఆశ్చర్యంగా చూసింది.

"మురళికి పెళ్లయ్యిందా?" తనలో తను గొణుక్కుంటున్నట్లు అంది.

"మరదే, మురళి పెళ్లయ్యినట్లు కనబడడు కదూ! అదో పెద్ద కథ లెండి, బాల్య వివాహం " అన్నాడు వెంకట్ చిన్నగా నవ్వుతూ.

తన్మయి తల చిన్నగా విదిలిస్తూ,"అది కాదు నా ప్రశ్న. పెళ్ళయినా మురళి యోగిలా ఎందుకు జీవిస్తున్నాడు? ఆ అమ్మాయి ఎందుకు దు:ఖ పడ్తూంది? కాదు, కాదు మురళి ఆమె దు:ఖానికి కారకుడెందుకయ్యాడు?" అంది గబగబా.

"అవన్నీ పరమాత్ముడికెరుక, సంసార జీవితంలో ఇమడలేని గౌతముడికి పెళ్లయ్యి, పిల్లాడు పుట్టేక ఇంటి నించి వెళ్ళిపోవాలనిపించలేదూ, అలాగే ఇదన్న మాట. మురళికి పెళ్లయ్యిన సంవత్సరానికి సంసార జీవితమ్మీంచి సన్యాసం వైపు దృష్టి మళ్లింది. కారణాంతరాలు ఎవరు ఎన్ని సార్లు అడిగినా, ఆ అమ్మాయికి మళ్లీ పెళ్లి చెయ్యమని, తను ఈ జన్మకి ఇలా సన్యాసిలాగే మిగిలిపోతానని సమాధానం చెపుతాడు. గంట కిందట మళ్లీ జరిగిందదే" అన్నాడు వెంకట్.

తన్మయి ఏమీ మాట్లాడలేక పోయింది. ఎందుకో ఒంటరిగా ఉండాలనిపించింది. హాస్టలు భవనం వెనక ఉన్న వృద్ధాశ్రమం వైపుగా నడవ సాగింది.

"అందరికీ ఆదర్శమైన మురళి ఇతడేనా?..."

అతని జీవితమ్మీద అతనికి సంపూర్ణ హక్కులు ఉన్నాయి. వాటిని ఎవరూ కాదనలేరు. కానీ మరొక అమ్మాయి జీవితంతో అతని జీవితం ముడిపడినపుడు అతని హక్కులకు స్థానం ఉందా?! తనతో జీవితం పంచుకుంటూన్న స్త్రీని నిర్దాక్షిణ్యంగా వదిలి వేస్తున్న మురళి, శేఖర్ లాగా స్వార్థపరుడేనా?

"ఉహూ ..." అని తల విదిలించింది తన్మయి.

"మురళికి శేఖర్ తో పోలిక ఏవిటి? తన పిచ్చి కాకపోతే! మురళి నిస్సందేహంగా గొప్ప వ్యక్తి, పరులకే తన దేహ ప్రాణాలు అంకితం చేసే వ్యక్తి. కానీ ఒకరి కన్నీటి లో కాళ్లు ముంచి ముందుకి ఎలా నడవగలుగుతున్నాడు?"

ఆలోచనలతో ముందుకు నడుస్తున్న తన్మయి ఎదురుగా వస్తున్న మురళిని చూడలేదు. మురళి ముఖంలో ఎప్పుడూ లేనంత దిగులు కనిపించింది. తన్మయి దగ్గరకు వస్తూనే "మీరేం అడగబోతున్నారో అవేమీ అడగకండి. చెప్పాలనిపిస్తే నేనే చెప్తాను." అన్నాడు.

"అసలు తనేదో అడగబోతున్నానని అతనికెలా తెలుసు?"

కాస్సేపు నిశ్శబ్దంగా నడిచేక, ఆమెకు చెప్పిన మాటల్నే మీకూ చెపుతున్నాను. "ఈ లోకంలో దు:ఖానికి మూలం కోరికలు, దు:ఖాన్ని జయించాలంటే కోరికల్ని జయించాలి." ఇవి నా మాటలు కావు, గౌతమ బుద్ధునివి. ఎంతో విలువైనవి." అని దీర్ఘంగా ఊపిరి పీల్చి, "చిత్రంగా ఆమె నా మాటలు విని దు:ఖంతో వెళ్లిపోయింది. నిజానికి దు:ఖమే జీవితాన్ని పరిశుభ్రం చేస్తుంది. కానీ అజ్ఞానంతో కూడిన దుఃఖం బహు ప్రమాదకారి."

తన్మయి మురళి వైపు ఆశ్చర్యంగా చూసింది. "పాతికేళ్ల వయసు ఉంటుందేమో ఇతనికి. దీనిని వైరాగ్యం అనాలా? లేదా జ్ఞానం అనాలా? ఇంత చిన్న వయసులో ఇతనికి ఇటువంటి తాత్త్విక చింతన ఎందుకు కలుగుతూంది? లౌకిక బంధనాల నుంచి తామరాకు మీద నీటిబొట్టులా ఉండడం ఇతనికి ఎలా సాధ్యమవుతూంది?"

తిరిగి వస్తూ ఉంటే మురళి మాటలే చెవిన మోగుతున్నాయి.

"దు:ఖానికి మూలం కోరికలు. కోరికల్ని జయిస్తే దు:ఖాన్ని జయించవచ్చు" ఏదో అర్థమయినట్లు అనిపించసాగింది.

తెలిసిన విషయమే కానీ తనున్న కష్ట సందర్భంలో వినడం వల్లనో ఏమో, అక్షరమక్షరం మనసుకి హత్తుకున్నాయి.

★★★

ఆ ఆదివారం అనంత తన్మయిని కలవడానికి హాస్టలుకి వచ్చింది. తెల్లని బెంగాల్ కాటన్ చీరలో, చెదరని చిరునవ్వుతో, తేజోవంతంగా ఉన్న తన్మయిని చూసి "ఎంత గొప్ప మార్పు నీలో తన్మయీ!" అంది.

"ఏం నచ్చలేదా?" అంది తన్మయి అదే చిరునవ్వుతో.

"నచ్చకపోవడమా, నాకూ ఇక్కడికి వచ్చి ఉండిపోవాలని ఉంది. వీలైతే రాజుని ఒప్పించి ఇక్కడే ఉద్యోగాలకు కుదురుకోవాలనీ ఉంది. అన్నట్లు నీ కోసం ఏం తెచ్చానో చూడు" అంది అనంత.

"ఏవిటివి?" అంది అప్లికేషన్లు అటూ ఇటూ తిప్పుతూ తన్మయి.

"కాలేజ్ సర్వీస్ కమీషన్, గవర్నమెంట్ లెక్చరర్ సెలక్షన్స్ పరీక్షకు అప్లికేషను, రెండోది స్టేట్ ఎలిబిలిటీ టెస్ట్. ఇది లెక్చరర్ గా రాష్ట్ర వ్యాప్తంగా ఏ కాలేజీలోనైనా పని చేసేందుకు అర్హతనిచ్చే పరీక్ష" అంది అనంత.

"ఒకేసారి రెండు పరీక్షలా పైగా ఒక దానికొకటి పది రోజుల వ్యవధిలో" అంది తన్మయి సాలోచనగా.

"జే ఆర్ ఎఫ్ రాసిన జ్ఞానంతో ఏ పరీక్ష అయినా సులభంగా రాయొచ్చు. అందుకే ఈ రెండు అప్లికేషన్లూ పట్టుకొచ్చా నీకు." అంది అనంత.

తన్మయి బరువుగా ఊపిరి పీల్చింది. ఇందులో ఎలిజిబిలిటీ టెస్ట్ జే ఆర్ ఎఫ్ కు సరిసమానమైంది. కేవలం బిట్ పేపర్లు మాత్రమే ఉండడం వల్ల అంత క్లిష్ట మైనది కాదు. అంతే కాదు స్టయిఫండు కూడా రాదు. కానీ లెక్చరర్ గా పనిచేసేందుకు ఎలిజిబిలిటీ మాత్రం వస్తుంది. జే ఆర్ ఫ్ రాకపోతే ఇది రెండవ ఆప్షనన్నమాట. కానీ సర్వీస్ కమీషను గురించి లేశమాత్రమైనా తెలీదు. అసలు ఎలా ప్రిపేర్ కావాలో, ఎలా రాయాలో. అదే అడిగింది అనంతని.

తేలిగ్గా నవ్వుతూ, "చూడు తన్మయీ, ఇవి గవర్నమెంటు పరీక్షలు. ఎప్పుడు పెడతారో ఎవరికీ తెలీదు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఇప్పుడు హఠాత్తుగా జరుగుతున్నాయి. ఈ పరీక్షకు పాత పేపర్లు కాదు కదా, పరీక్ష ఎలా ఉంటుందో రాసిన వాళ్లు కూడా కనబడరు మనకి. ఏదో ఒక ట్రయిల్ వెయ్యడమే. పైగా రాష్ట్ర వ్యాప్తమైన పరీక్ష కదా. ఒక్క తెలుగు సబ్జెక్టులోనే కొన్ని లక్షల మంది పరీక్ష రాస్తారు. నీకో విషయం చెప్పనా, మొత్తం తెలుగు లెక్చరర్ ఖాళీలు ముప్ఫయ్యట. అంటే ఎన్ని లక్షల మంది రాసినా చివరి వరకూ పోరాడి గెలవగలిగేది ముప్ఫయి మంది మాత్రమే. నీకో తమాషా చెప్పనా, ఇలా తక్కువ ఉద్యోగాలు ఉండడం వల్ల పోరాట పటిమ ఉన్న వాళ్లు మాత్రమే బరిలో దిగుతారు. అంటే మనతో సమ ఉజ్జీలన్నమాట. ఒక వేళ ఉద్యోగం వస్తే అందరిలో గెలవడం గొప్ప కాదూ!" అంది అనంత.

ఇంకా తన్మయి ఆలోచన చూసి, "ఇంకేం ఆలోచించకు తన్మయీ, జే ఆర్ ఎఫ్ తో మహా అయితే అయిదేళ్ళు మాత్రమే స్టయిఫండు వస్తుంది. ఈ ఉద్యోగం వస్తే జీవితాంతం నెలనెలా జీతం అందుకోవచ్చు. లైఫ్ సెటిల్ అయిపోయినట్లే" అంది అనంత.

"నేను ఆలోచిస్తున్నది రాయాలా వద్దా అని కాదు, ఎలా రాయాలా అని" అంది దృఢంగా తన్మయి.

"నాకు తెలుసు నువ్వు ఆలోచన వచ్చిన మరు నిమిషం నించే సంసిద్ధురాలివవుతావని, దటీజ్ తన్మయి" అంది అనంత ధైర్యంగా వైపు తడుతూ.

బాబు పరుగున వచ్చి తన్మయి ఒళ్లో కూచున్నాడు. చిన్నారి చేతుల్తో అప్లికేషనుని తడిమి పరుగున మళ్లీ పిల్లలతో ఆడుకోవడానికి వెళ్లేడు.

"నలగకుండా అతి సున్నితంగా అప్లికేషను వాడు భలే ముచ్చటగా పట్టుకున్నాడులే. వాడి చెయ్యి పడిందిగా నీకు ఉద్యోగం వచ్చేసినట్టే." అంది అనంత లేస్తూ.

★★★

ఆ రోజు సాయంత్రం ధ్యానంలో కూచుంది తన్మయి. ఇక్కడికి వచ్చిన దగ్గరనించి పరీక్షలకు కావలసిన మానసిక సంసిద్ధతని ధ్యానంతో సమకూర్చుకోవడం అలవాటయ్యింది తన్మయికి. కానీ ఒత్తిళ్లన్నీ పక్కకు పెట్టి మానసిక ప్రశాంతతని చేకూర్చుకోవడానికి ఎంతో సాధన, సంయమనం అవసరం. ఒక పక్క కోర్టు చుట్టూ తిరగడమే ఒక పెద్ద ఒత్తిడి. మరో పక్క బాబుని వృద్ధిలోకి తీసుకు రావాలంటే తను త్వరగా నిలదొక్కుకోవాల్సిన ఒత్తిడి. ఇవన్నీ బాలెన్సు చేసుకోగలిగినా అడుగడుగునా సమాజంతో ఎదురవుతున్న ఘర్షణ. తప్పు ఎవరు చేసినా స్త్రీని నిందించే సమాజంలో, అడుగడుగునా ఎదురవుతున్న మనుషుల లేకితనం, వంకర మాటలు. తన్మయికి ముందు వారం జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది.

గర్ల్స్ హాస్టల్ వార్డెన్ కావడంతో ఆడపిల్లలకు సంబంధించిన శారీరక, మానసిక ఒత్తిళ్లలో తల్లి వంటి పాత్ర ధరించాల్సి రావడం తన్మయికి ఎంతో ఆనందదాయకమయ్యింది. కానీ అయిదో తరగతి లోపు పిల్లలతో ఫర్వాలేదు గానీ, పెద్ద పిల్లలతో చాలా సమస్యలు ఉంటూండేవి.

అసంకల్పితంగా కడుపు నొప్పి అనో, ఒంట్లో బాగా లేదనో ఆడపిల్లలు క్లాసులు ఎగ్గొట్టి హాస్టల్ కి వచ్చేసేవారు.

తన్మయి వచ్చిన కొత్తలో ప్రతీ రోజూ ఇద్దరో, ముగ్గురో ఇదే పద్ధతిలో హాస్టల్ లో ఉండిపోతూ ఉండేవారు. పేరెంట్స్ ని పిలిచే వరకూ అదే తంతు. పేరెంట్స్ వచ్చి, హాస్పిటల్ లో చూపిస్తామని ఇంటికి తీసుకు వెళ్లడమే ఇందుకు మందని అర్థమయ్యేటట్లు చెయ్యడమే వాళ్ల ఉద్దేశ్యమని అర్థమయ్యింది తన్మయికి. మొదట్లో పిల్లలకు నిజంగా ఆరోగ్యం బాగోలేదో, లేదా కావాలని హాస్టల్ లో ఉండడం ఇష్టం లేక వంకలు చెప్తున్నారో అర్థం అయ్యేది కాదు తన్మయికి. అర్థమయ్యేక ఈ సమస్యకి పరిష్కారం వాళ్లతో స్నేహితురాలిలా మాట్లాడడం ద్వారా చక్కదిద్దగలనని తెలుసుకుంది తన్మయి. హాస్టల్ లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆకాంక్షలు, చదువు- ఆవశ్యకత, శారీరక శుభ్రత, క్రమశిక్షణ, ఏకాగ్రత ... ఇలా ఎన్నో టాపిక్స్ పిల్లలతో మాట్లాడేది తన్మయి. పిల్లలంతా చుట్టూ చేరి ఆసక్తిగా వింటూండేవాళ్లు. ప్రతి రోజూ రాత్రి పూట కాస్సేపు పిల్లలతో కబుర్లు చెప్పడం అలవాటు చేసుకుంది తన్మయి. చిన్న పిల్లలు అటు ఇటూ చేరి ఒళ్లోనే నిద్రపోయే వాళ్లు. ఇదిలా ఉండగా అస్తమాటూ ఈ వంకన వచ్చీ, పోయే మగ పేరెంట్స్ తో తరచూ సమస్యలు ఎదుర్కోవలసి వచ్చేది తన్మయికి. వచ్చిన వాళ్లకి కొందరికి తన జీవితమ్మీద ఆసక్తి ఎక్కువ ఉండేది. బాబు తండ్రిని గురించి, ఒంటరిగా ఇక్కడ ఎందుకు వుందనే ఆరాలకు సమాధానం చెప్పవలసి వచ్చేది. అడిగిన వాళ్లకు అబద్ధం చెప్పడం ఇష్టం లేని తన్మయి ధైర్యంగా విడిపోయామని చెప్పడం అలవాటు చేసుకుంది. అందులో ఒక అమ్మాయి తండ్రి అవసరం ఉన్నా లేకపోయినా వివరాలు కనుక్కోవడానికన్నట్లు తరచూ రావడం మొదలు పెట్టేడు.

అక్కడ నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు వారానికోసారి వచ్చి చూసి పోవచ్చు.

"ఉన్నట్లుండి ఒక రోజు ఇంత చిన్న వయసులో మీకెంత కష్టమొచ్చింది! అయినా ఎన్నాళ్లు ఇలా ఉండిపోతారు? రెండో భార్య గా స్వీకరించడానికి నాకు అభ్యంతరం లేదు" అన్నాడు.

ఒక్కసారిగా రక్తం సలసలా మరిగింది తన్మయికి.

పిల్లల పేరెంట్ కావడంతో కోపాన్ని అణచుకుని, "దేశాన్ని మీరు తర్వాత ఉద్ధరిద్దురు గాని, ముందు ఎవరితో ఏం మాట్లాడాలో నేర్చుకోండి. మరోసారి ఇటువంటివి మాట్లాడితే మేనేజ్ మెంటుకి కంప్లయింట్ చెయ్యాల్సి ఉంటుంది." అంది.

తర్వాత అతనెప్పుడు వచ్చినా అసలేమీ ఎప్పుడూ మాట్లాడనట్లే మసలసాగేడు. ఇటువంటి సంఘటనలు తన్మయికి బాగా డిస్ట్రబెన్స్ కాసాగేయి. ఎందుకు ప్రపంచం స్త్రీని ఒంటరిగా, ధైర్యంగా బ్రతకనివ్వదు? మగవాడు తోడు లేకుండా బతికే స్త్రీ పట్ల సమాజంలో ఒక విధమైన చులకన భావం పాతుకుపోయి ఉందని తన్మయికి చాలా త్వరగా అర్థం అయ్యింది. విడాకులు కేవలం ఇద్దరు వ్యక్తుల జీవితాలను, రెండు కుటుంబాలను మాత్రమే కాదు, సమాజాన్ని మొత్తం ప్రభావితం చేస్తాయని ఎక్కడో చదివింది. కానీ సమాజమే అందులో ఉన్న వాళ్ల మానసిక సంఘర్షణకు కారణమవుతూ ఉంది. తన్మయి ఆ ప్రభావాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోగలుగుతూంది. తను కోల్పోతున్న విషయాల లిస్టు రాయసాగింది. అందులో ఒంటరిగా చెయ్యలేని పనుల జాబితా రోజురోజుకీ పెరిగిపోసాగింది. అందులో పొద్దుపోయిన తర్వాత బయటికి ధైర్యంగా వెళ్లలేకపోవడం ఒకటి. తను ఒక్కతే పరిష్కరించగలిగినది కాదు కాబట్టి, వెళ్లడమే మానుకుంది. బహుశా: తనే పిరికిదనుకుంటా. ఇప్పటి వరకూ ఒక్కతే సినిమాకి వెళ్లే సాహసం ఎందుకు చెయ్యలేకపోయింది? తన చుట్టూ తను గీసుకునే గీతలు, కట్టుకునే గోడల ఎత్తు పెరుగుతున్న కొలదీ తన్మయికి బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోసాగింది.

ఒక విధంగా ఆలోచిస్తే తనకీ హాస్టలు జీవితం చాలా సరైనది. ఒంటరి స్త్రీలకు బయట ప్రపంచం లో ఎదురయ్యే సమస్యలు, ప్రశ్నలు ఇక్కడ తరచూ ఎదురుకాకాపోవడమే కాదు, తనలాంటి పిరికివాళ్లకు ఇలాంటి భద్రతా వలయాలే సరి అయినవి. కానీ ఇప్పుడిప్పుడే ప్రపంచంలోకి అడుగుపెడుతున్న బాబుకి ఇంత చిన్న ప్రపంచం నించి బయటికి వెళ్ళినపుడల్లా ఆశ్చర్యమే.

ముఖ్యంగా మగవాళ్లకి సంబంధించిన అనేక విషయాలు వాడి చిన్ని బుర్రలో ప్రశ్నలు పుట్టించసాగేయి. తల్లిదండ్రుల ఇద్దరి సంరక్షణలో పెరిగిన పిల్లగా తన్మయికి తన సంరక్షణలో ఒంటరిగా పెరుగుతున్న బాబు గురించి దిగులు ఎక్కువ కాసాగింది. స్కూలుకి వచ్చే తల్లిదండ్రులు పిల్లల్ని ముద్దాడే ఏ సంఘటనైనా తన్మయిని కలచి వెయ్యసాగింది.

పైగా అలాంటి సంఘటనలు చూసినప్పుడల్లా "అమ్మా, మా నాన్నేడీ?" అనే బాబుకి సమాధానం చెప్పలేకపోతూంది తన్మయి.

తమనీ స్థితికి గురి చేసిన శేఖర్ పట్ల కోపం, ద్వేషం విపరీతంగా పెరగసాగేయి.

★★★

స్టేట్ ఎలిబిలిటీ టెస్ట్ ఎగ్జామ్స్ అయిన వారంలోనే గవర్నమెంట్ లెక్చరర్ ఉద్యోగాలకు కూడా రాత పరీక్షలు పూర్తయ్యేయి. అందులో సరైన మార్కులు వస్తే ఇంటర్వ్యూకి పిలిస్తారు. పరీక్షలు బానే రాసినట్లనిపించింది తన్మయికి. కానీ ఉద్యోగం వస్తుందన్న భరోసా లేదు. అందుకు కారణం కొన్ని లక్షల మంది పరీక్షలు రాయడమే కాదు, కేవలం ముప్ఫయి ఉద్యోగాలు మాత్రమే ఉండడం కూడా. ఎంతో ప్రతిభ ఉంటే గానీ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్లడం కూడా కష్టమే. ఇక ఏకంగా ఉద్యోగం రావడం అంటే మాటలా?

జే ఆర్ అఫ్ రిజల్ట్సు వచ్చే సమయం అయ్యింది. రిజల్ట్సు వచ్చిన రోజు యూనివర్సిటీలోని జే ఆర్ ఎఫ్ ఆఫీసు లో తెలియజేస్తారు. తర్వాతే డిపార్టుమెంటుకి తెలియజేస్తారు. ఇక సెలక్టు అయిన వారికి ఇంటికి పట్టా పంపిస్తారు. ఆ రోజు బాబుని స్కూలుకి పంపించి, తన్మయి ఉదయానే యూనివర్శిటీ బస్సెక్కింది.

"తనకి సెలక్షన్ రాకపోతే?" అనే ఆలోచనకే ఒణుకు రాసాగింది.

తన ప్రయత్నం తను చేసింది. అంతే. ఫలితం వచ్చేదీ, రానిదీ అదృష్టం మీద కూడా ఆధారపడి ఉంటుంది. కానీ అలా అని సరిపెట్టుకోలేక అస్థిమితంగా అడుగులేస్తూ బస్సు దిగి డొంకదారి వెంట నడవసాగింది. రాత్రి కురిసిన వర్షానికి దారంతా గడ్డి మీద నీటి బిందువులు అందంగా అమిరి ఉన్నాయి. యూనివర్శిటీలో డొంకదార్లు విద్యార్థులు ఎక్కువగా వాడుతూంటారు. అసలు దారుల్లో నడవాలంటే ఎంతో సమయం పడుతుంది. తన్మయికి ఈ బాట అంటే చాలా ఇష్టం. ఒక విధమైన నిశ్శబ్దంతో ఎక్కడో అడవిలో ఉన్నట్లు ఉంటుందేమో దారి మలుపుల్లో అలికిడి వినిపించినప్పుడల్లా ఉడుతలు అటూ ఇటూ పరుగెత్తుతూ ఉంటాయి. తూనీగలు బాట పక్కని బతానీ పూల మీద వాలి చిన్న సంగీతం ఆలపిస్తూ జుమ్మని శబ్దాలు చేస్తూ చెవుల చుట్టూ గింగిరాలు తిరుగుతుంటాయి.

చిన్న కాలిబాట పక్కన ఒత్తుగా పెరిగిన మొక్కల మధ్య నడుస్తున్న తన్మయి కాళ్ల మీద ఆకుల మీంచి నీటి బిందువులు కరిగి రాలి చీర అంచులు తడిసిపోసాగేయి. అడుగులు పడకుండా తడిచీర అంచులు అడ్డుకోసాగేయి. జే ఆర్ ఎఫ్ ఆఫీసు ఇంకా తెరిచినట్లు లేరు. ముందు రోజు రిజల్ట్సు వచ్చేసినట్లయితే సాయంత్రం ఆఫీసు మూసివేసే సమయానికి లిస్టు అతికించి ఉండాలి. మెట్ల కింది నుంచి తలుపు వైపు చూసింది తన్మయి. యాభై మెట్ల పైనున్న ఆఫీసు తలుపులకి ఏదో కొత్త కాగితం అతికించినట్లే ఉంది. తన్మయికి గుండె దడదడా కొట్టు కోసాగింది. తన నాడి తనకే స్పష్టంగా వినిపించసాగింది. ఒక్కో మెట్టు ఎక్కుతూండగా ఒంట్లోని ఓపికంతా ఆవిరి అయిపోతున్నంత నీరసం రాసాగింది. మొత్తం ఇరవై పేర్ల లిస్టు అది. రెండు విభాగాలుగా ఉన్న లిస్టులో లెక్చరర్ షిప్పుకి మాత్రమే సెలక్టయిన పేర్లు కిందన ఉన్నాయి. అందులో కరుణ, రాజు, అనంత ల పేర్లు ఉన్నాయి. తన పేరు లేదు. పైన ఉన్న విభాగంలోజే ఆర్ ఎఫ్ స్కాలర్ షిప్పు కి సెలక్టు అయిన లిస్టులో ఒకే ఒక్క పేరు ఉంది.

తన్మయి తన కళ్లని తనే నమ్మలేకపోయింది.

తన పేరులో మొదటి అక్షరం "టి" చూడగానే తన్మయి తట్టుకోలేక మొదటి మెట్టు పైనే కూలబడింది.

తన పేరు చూడగానే ఆపుకోలేని దుఃఖం తో ఆకాశం కేసి చూస్తూ వెక్కి వెక్కి ఏడవ సాగింది.

"మిత్రమా! నన్ను కరుణించావా! "

"నా చిన్నారి బాబూ, ఇక మనకి భయం లేదురా!"

ఆనందాతిరేకపు దుఃఖపు మాటలు అప్రయత్నంగా మాట్లాడసాగింది.

చుట్టూ ఎవరూ లేని ఆ పొద్దుటి పూట తన్మయికి లభించిన అత్యుత్తమ విజయం తాలూకు సంతోషానికి భూమ్యాకాశాలు కూడా కరిగి కన్నీరైనట్లు వాన కురవసాగింది.

33

"తనకి జే. ఆర్ ఎఫ్ వచ్చింది". మెట్ల మీద కూలబడి ఆనందాతిరేకపు దు:ఖంలో కన్నీరు మున్నీరైన తన్మయి మీద ఆశీస్సుల జల్లుల వాన కురిపించసాగింది ఆకాశం. లిస్టులో ఉన్న తన పేరుని చూసి తన్మయి తన కళ్లని తనే నమ్మలేక పోతూంది. ఓటమి పేరుకుపోయిన దు:ఖం తాలూకు వ్యథపు పొరలు అన్నీ ఒక్కొక్కటిగా కరిగిపోతున్నట్లు మనసు బాగా తేలికపడసాగింది.

"ఎమ్మే మొదటి సంవత్సరంలో చేరినప్పుడు "తెలుగు ఎమ్మే చేసి ఏం సాధిస్తారు?" అన్న లెక్చరర్ నిరుత్సాహపూరిత మాటలు జ్ఞాపకం వచ్చేయి.

నిర్దాక్షిణ్యంగా తనని వదిలి వెళ్తూ శేఖర్ చూసిన నిర్లక్ష్యపు చూపు గుర్తుకొచ్చింది.

భయంతో ఏడుస్తూ తన కంఠాన్ని కౌగిలించుకున్న బాబు గుర్తుకొచ్చేడు.

రోజు మొత్తమ్మీద ఒకే ఒక్క 'టీ' తాగి, పిచ్చి పట్టినట్లు రాత్రీ పగలూ చదువుతూ, తనలో తను మాట్లాడుకుంటూ, ఒకానొక ధ్యానంలో నడిచిన రోజులన్నీ కళ్ల ముందు గిర్రున తిరిగేయి.

వెనక నించి వచ్చి కళ్లు మూసిన అనంత చప్పున ముందుకొచ్చి "ఏవిటీ, ఏడుస్తున్నావా? పిచ్చిపిల్లా, రిజల్టు చూసేవా అసలు, నీకు జే. ఆర్ ఎఫ్ వచ్చింది. ఇక మీదట నీకు నెలకు ఏడువేలు స్కాలర్ షిప్పు వస్తుంది. బాబుతో కలిసి దర్జాగా బతకొచ్చు తన్మయీ!" అంది భుజాలు పట్టుకుని కుదుపుతూ.

ఇంకా దు:ఖంలో నించి తేరుకోలేక పోతున్న తన్మయి కళ్లు తుడుస్తూ , ఇలా చూడు "నువ్వు గెలిచావు... కాదు ..కాదు.. పురుషుడు శతవిధాలా ఓటమిపాల్చేయాలని చూసినా, మొక్కవోని దీక్షతో నిలబడ్డ స్త్రీ గెలిచింది." అంది దృఢంగా.

మెట్ల కింద రాజు, దివాకర్, కరుణ కనిపించారు.

"కరుణకి, మాకూ లెక్చరర్ షిప్పు వచ్చింది. స్కాలర్ షిప్పు రాకపోయినా పీ.ఎచ్.డీ లో జేరడానికి, బయటెక్కడైనా లెక్చరర్లగా పనిచేయడానికి అర్హత వచ్చినట్లే. మా ఆనందానికి పట్టపగ్గాల్లేవు. మొదటి సారి రాసిన వాళ్ళెవ్వరికీ లెక్చరర్ షిప్పు రావడం కూడా కష్టమట, తెలుసా! " అంది పక్క నించి అనంత.

ప్రశంసా పూర్వక నవ్వుతో చేతులూపేరు రాజు, దివాకర్. తనకి రాని జే. ఆర్ ఎఫ్ తన్మయికి వచ్చినందుకు జీర్ణించుకోలేనట్లు కరుణ ముఖం కంద గడ్డ లా ఉంది. తన్మయి వైపు చూడలేనట్లు చప్పున కళ్లు దించుకున్నాడు.

లెక్చరర్ షిప్పు కూడా రాని దివాకర్ మనస్ఫూర్తిగా నవ్వుతూ "మీ...గెలుపు మ్మ...మనందరిదీ" అన్నాడు.

అందరి కంటే ఎత్తుకి ఎదిగిన అతనికి రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది తన్మయి.

సంతోషంతో తన్మయిని అనంత కేంటీన్ వైపు లాక్కెళ్తూ "అవును దివాకర్ చెప్పింది కరెక్టు. ఇది మనందరి విజయం. ఇవేళ మనందరికీ పండుగ రోజు." అంది.

"టీ బిల్లు నేనిస్తాను" అన్నాడు రాజు.

అన్నట్లు నీకో మంచి విషయం చెప్పాలి తన్మయీ. "మీ వివేకానందా పాఠశాలలో నాకూ, రాజుకీ ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఇది గనక వస్తే మా జీవితాలు సెటిల్ అయినట్లే. రెసిడెన్షియల్ గాబట్టి ఏ దిగులూ లేదు. ఉన్న ఊళ్ళో ఉద్యోగం గాబట్టి పీ.ఎచ్.డీ నిశ్చింతగా పూర్తి చేసుకోవచ్చు." అంది అనంత.

"న్నా ...న్నాకు కూడా ఏదోటి చ్చు..చూడండి. వ...వచ్చేస్తాను అన్నాడు" దివాకర్.

"బాయ్స్ హాస్టల్ లో వార్డెన్ పోస్టు కి అప్లికేషన్లు తీసుకుంటున్నారు. మీకిష్టమైతే నేను మిమ్మల్ని రికమండ్ చేస్తాను. మీకు తప్పక ఉద్యోగం వస్తుంది అంది" తన్మయి మనస్ఫూర్తిగా.

సంతోషంగా తలూపేడు దివాకర్.

"మరింకేం, అందరం ఒక చోటే ఉందాం." అని కరుణ వైపు ప్రశ్నార్థకంగా చూసింది అనంత.

అప్పటికి కాస్త తేరుకున్నట్లు బలవంతంగా చిన్న నవ్వు నవ్వి, "నాకు మరో ఆర్నెల్లు ఈ చెట్టు కింద సహవాసమే శరణ్యం. జే. ఆర్ ఎఫ్ మళ్లీ రాసి, సాధిస్తాను." అన్నాడు పట్టుదలగా కరుణ.

అతని పట్టుదల నిండిన మాటలకి ప్రశంసా పూర్వకంగా చూస్తూ, "మీరు తప్పక సాధిస్తారు" అంది తన్మయి.

అప్పటి వరకూ జీవితంలో బాధలూ, దు:ఖాలూ తప్ప సంతోషాన్ని చవి చూడని తన్మయి మనసు దూది పింజలా తేలికగా మారిందా సమయానికి. ఆ చెట్టు కింద అప్పటి వరకూ ఎన్ని సార్లు కూచున్నా కలగని గొప్ప శాంతి కలగసాగింది. అప్పటి వరకూ ఉన్న మబ్బు తొలగి ఆకాశం కాంతివంతంగా మారింది. తలెత్తి చుట్టూ ఉన్న ఎత్తైన చెట్ల మధ్య నించి సూటిగా పడు న్న సూర్య కిరణాల వైపు చూసి మనస్సులోనే "ధన్య వాదాలు మిత్రమా! ధన్య వాదాలు" అంది.

అనంత తన్మయి వైపే తదేకంగా చూస్తూ దగ్గిరికి వచ్చి "అబ్బా తన్మయీ! నీ ముఖం ఎంత తేజస్సుతో వెలిగిపోతుందో! చూసే కొద్దీ చూడాలనిపిస్తోంది. ఇక తిరుగులేదు నీకు జీవితంలో. చూస్తుండు ప్రతీ ఒక్కరూ ఇక నీ చుట్టూ తిరుగుతారు." అంది.

★★★

యూనివర్శిటీ నించి బయటకు రాగానే తల్లిదండ్రులకి ఫోను చేసి శుభవార్త చెప్పింది తన్మయి. హాస్టల్ కి వస్తూనే బాబుని ఎత్తుకుని ముద్దాడింది. గాల్లో గిరగిరా తిప్పుతూ నవ్వుతూన్న అమ్మ ముఖంలో సంతోషానికి అర్థం తెలీకపోయినా కొత్తగా వెలుగుతూన్న తల్లి ముఖాన్ని చిన్నారి చేతుల్తో ప్రేమగా తడిమేడు బాబు. మురళికి ఈ విషయం వెంటనే చెప్పాలని ప్రాంగణమంతా వెదికింది తన్మయికి.

“మురళి సార్ ధ్యానం క్లాసు నించి అటే వృద్ధాశ్రమానికి వెళ్ళేరు” అన్నాడు వాచ్ మేన్ దారిలో ఎదురుపడి.

రాత్రి భోజనాలయ్యేక రెండు హాస్టళ్ల మధ్య ఎప్పటిలానే ముగ్గురూ స్థిమితంగా కూర్చున్నాక చెప్పింది తన్మయి.

"ఇంత మంచి వార్తని ఇంత లేటుగా చెప్పడం అన్యాయం. మీ జీవితంలో అత్యంత గొప్ప శిఖరారోహణం ఇది. కానీ ఇది మొదటి శిఖరం మాత్రమే. ఇంకా ఎన్నో అధిరోహిస్తారు మీరు. నాకు వంద శాతం నమ్మకముంది మీ మీద." అని వెంకట్ మనస్ఫూర్తిగా అభినందించేడు.

మురళి ప్రశాంతమైన నవ్వుతో కళ్లు మూసుకుని "మీకు ఎల్లవేళలా శుభం కలుగుతుంది" అన్నాడు. క్షణకాలం తర్వాత తెరిచిన కళ్లల్లో పలచని కన్నీటి పొరని చూసి ఆశ్చర్యపోయింది తన్మయి.

పక్కనే ఉన్న వెంకట్ కి తెలియకూడదన్నట్టు చప్పున కళ్లు దించుకున్నాడు.

"దు:ఖానికి మూలం కోరికలు, కాబట్టి కోరికల్ని జయించాలి. అని నమ్మి ఉద్బోధించేది ఇతనేనా? "

ఆ క్షణం ప్రపంచంలో అన్ని బంధాల కన్నా గొప్పదైన అనుబంధం పంచగలిగిన ఆత్మీయత అతని కళ్లల్లో కనిపించింది. అతని మనస్సులో తనకే దక్కిన అరుదైన గౌరవం అది. కానీ ఎందరికో ఉపయోగపడడమే అతని జీవిత ఆదర్శం. అందుకు సాక్ష్యమన్నట్లు మరు నిమిషంలో మురళి వైపు చూసిన తన్మయికి మళ్లీ ప్రశాంతమైన చిరునవ్వు సాక్షాత్కరించింది.

ఆ రాత్రి ఎంతో స్థిమితంగా కంటి నిండా నిద్రపోయింది తన్మయి. ఎప్పటిలానే ఉదయం అయిదు గంటలకి అల్లారం మోగుతున్నా నిద్రలేవాలనిపించని ప్రశాంతమైన నిద్ర అది. ఇప్పటి వరకూ ఎప్పుడూ ఉదయానే దడదడలాడే గుండెతో నిద్రలేచే తన్మయికి బద్ధకం కొత్త అనుభవం. ఎర్ర బొట్టు మీద తెల్లని విభూది రేఖని అద్దుకుంటూ అద్దంలో వెలుగుతున్న తన ముఖాన్ని చూసుకుంది. ముందు రోజు ఉతికి, ఇస్త్రీ అయి వచ్చిన తెల్లచీరల్ని అల్మారాలో సర్దుతూ మడతల మీద ప్రేమగా తడిమింది. ఇక మీదట వీటిని కట్టుకునే అవకాశం రాదు. చేయాల్సిన పనుల జాబితాని సరిచూసుకుంది.

యూనివర్సిటీకి వెళ్లి వివరాలు కనుక్కోవాలి. డిపార్టు మెంటులో ఎలా రిజిస్టరు కావాలో, అసలు పీ ఎచ్ డీ లో ఎలా జాయిన్ కావాలో చూసుకోవాలి. ఇక అన్నిటికన్నా ముఖ్యంగా యూనివర్సిటీలోని రీసెర్చి స్కాలర్స్ హాస్టల్ కి మారాలి. రిజిగ్నేషన్ అప్లికేషను రాసి వివేకానందా స్కూలు కరస్పాండెంట్ రాఘవరావు గారి దగ్గరికి పట్టు కెళ్లింది తన్మయి.

"కంగ్రాట్స్. మా రూల్స్ ప్రకారం నెల రోజుల ముందు అప్లికేషన్ ఇవ్వాలి గానీ, మీరింకా ముందే వెళ్ళాలనుకున్నా వెళ్ళండి. మీరు మా స్కూలుకి అందించిన అత్యుత్తమ సేవలకు పారితోషికంగా మీకు రెణ్ణెల్ల జీతాన్ని బోనస్ గా ఇస్తాం." అన్నారు.

తనతో బాటూ బయట వాకిలి వరకూ వచ్చిన ఆయన కాళ్లకు నమస్కరించింది తన్మయి.

అత్యంత కష్టకాలంలో ఆదుకున్న ఈ స్థలం తనకి దేవాలయం తో సమానం. తనెక్కడకి వెళ్లినా ఈ స్కూలుని మరిచిపోవడం అసాధ్యం.

హాస్టలు వరకూ వచ్చాక ఒకసారి చుట్టూ చూసింది.

తక్కువ కాలంలో మనసుకి అత్యంత దగ్గరగా వచ్చిన ఈ పరిసరాలని, ఈ మనుషుల్ని వదిలి వెళ్ళడానికి మనసు ఒప్పడం లేదు.

మెల్లగా నడిచి వెళ్ళి తనకి ఇష్టమైన కలువపూల కొలను ఒడ్డున కూచుంది.

కాళిదాసు జ్ఞాపకం వచ్చేడు.

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితోపి జంతుః
తచ్చేతసా స్మరతి నూన మభోధ పూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని"

–"అందమైనవి చూసి, మధురమైనవి విని సుఖాన్ని చెందినా, ప్రాణి కలత చెందుతుంది.

ఆ కలతకు కారణం ఇది అని తెలుసుకోగలిగిన పూర్వ విషయ జ్ఞానం లేకపోవడం.

సుఖానికి కారణం మనస్సు తనలో స్థిరమై ఉన్న పూర్వ జన్మలోని స్నేహ భావానుభవాన్ని స్మరించడం.".

★★★

యూనివర్సిటీ లో డిపార్టుమెంటులోకి అడుగు పెడుతూనే గుమ్మం దగ్గర అటెండరు తన్మయి వైపు చూసి సెల్యూట్ కొట్టినట్లు నమస్కరించేడు. ఆశ్చర్యంగా ప్రతి నమస్కారం చేసింది. లెక్చరర్లకు, ప్రొఫెసర్లకు మాత్రమే దక్కే గౌరవం అది. అందుకు కారణం నాలుగడుగుల్లోనే గమనించింది తన్మయి. డిపార్టుమెంటు ఆఫీసు బయట నోటీసు బోర్డు లో తన పేరు ప్రత్యేకించి పెద్ద అక్షరాలతో రాసి ఉంది.

ఎప్పుడూ ఏ పనిబడినా పట్టించుకోని క్లర్కులు "నమస్కారం మేడమ్" అని ప్రత్యేకించి గౌరవంగా పలకరించేరు.

హెడ్డు గారి గది బయట అటెండరు "మీరెప్పుడొచ్చినా వెయిటింగు లేకుండా వెంటనే పంపమన్నారు మేస్టారు." అని తలుపు తెరిచేడు.

తన్మయిని చూస్తూనే, "ఏమ్మా, సాధించేవుగా. అద్భుత విజయమిది. మన డిపార్టుమెంటులో పదమూడేళ్లుగా ఎవరూ సాధించని గొప్ప విజయం. ఎంత ఆనందంగా ఉందో తెలుసా!" అని వాత్సల్య పూరితంగా అన్నారు.

"అంతా మీ ఆశీస్సుల వల్లనే మాస్టారూ!" అంటూన్న తన్మయికి గొంతుకేదో అడ్డుపడినట్లు దుఃఖం తన్నుకు వచ్చింది.

"ఇక నీ కష్టాలన్నీ తీరిపోయినట్లేనమ్మా. నీకిక ఎదురులేదు. అన్నీ మంచి రోజులే. మన డిపార్టుమెంటులో కొత్తగా చేరిన వారికి నువ్వొక గొప్ప స్ఫూర్తివి. రేపు మొదటి సంవత్సరం క్లాసులు మొదలవుతున్నాయి. ఆహ్వాన సమావేశంలో నీ ఉపన్యాసం ఏర్పాటు చేసేను." అన్నారు నవ్వుతూ.

"నేనా? నేనేమి చెప్పగలను మాస్టారూ!" అంది కొంచెం సంకోచంగా.

అక్కడి నించి బయటికి వచ్చినా మాస్టారి మాటలే చెవిన మోగుతున్నాయి తన్మయికి.

"నువ్వు చేసిందే చెప్పు. ఎన్ని కష్టాలెదురయినా అధిగమించి గమ్యాన్ని చేరుకోవడానికి నువ్వేం చేసేవో చెప్పు. నీదేమీ మామూలు విజయం కాదు తెలుసా? చిన్న వయసులో తల్లివయి, కుటుంబం, సమాజ సహకారం లేకుండా చంటి బిడ్డని పెంచుకొంస్తూ చదువుని కొనసాగించి, ఒంటరిగా మొక్కవోని దీక్షతో అత్యుత్తమమైన లక్ష్యాల్ని సాధించడం మామూలు విషయం కాదు. ఒక అద్భుత విషయం. ఇంత సాధించావంటే నీలో ఏదైనా సాధించే ఒక గొప్ప పట్టుదల ఉంది. ఇక్కడితో ఆగిపోకుండా ఎప్పటికప్పుడు ముందుకు దూసుకెళ్ళు. నీలాంటి వాళ్ల వల్ల ఎందరికో జీవితంలో గొప్ప స్ఫూర్తి లభిస్తుంది."

ఆ మాటలు వినిపిస్తున్న కొద్దీ తన్మయికి వేస్తున్న ప్రతీ అడుగులోనూ గొప్ప ఉత్తేజం కలగ సాగింది. ఉన్నట్టుండి వెనక నించి కరుణ పిలుస్తున్నట్టు అనిపించింది.

నిజంగానే కరుణ పరుగున వచ్చి "ఏవిటి తనూ! పిలుస్తున్నా ఆగకుండా అంత వేగంగా నడుస్తున్నారు?" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

చాన్నాళ్లకు "తనూ!" అని ఆత్మీయంగా వినబడ్డ పిలుపు తన్మయి మనస్సులో గొప్ప సంతోషాన్ని కలగజేసింది.

ఆగి అతని వైపు చూస్తూ "లేదు రుణా! నాకిప్పుడే వినిపించింది మీ పిలుపు" అంది.

అతని ముఖంలో రిజల్ట్స్ వచ్చినప్పటి బాధ తగ్గు ముఖం పట్టినట్లనిపించింది.

తన్మయి ఏదో మాట్లాడబోయే లోగా తనే చెప్ప సాగేడు. "సారీ, మిమ్మల్ని సరిగా అభినందించలేకపోయేను మొన్న. రోజుకొక ఇంటర్వ్యూకి వెళ్ళొస్తున్నాను. అయినా ఫలితం ఉండడం లేదు. వరస పరాజయాలు నన్ను కుంగదీస్తున్నాయి. మొత్తానికి మీ ఆశలైనా నెరవేరినట్టేగా. జే. ఆర్ ఎఫ్ కొట్టేరు. ఇంకేముంది ఎదురులేదిక" అన్నాడు.

ప్రతిగా తలుపుతూ "యూనివర్సిటీ లో మొదటి అయిదు రాంకుల వారికి మెరిట్ స్కాలర్ షిప్పు వస్తుందని తెలిసి అప్లికేషను పెట్టేను. మీరు పెట్టేరా?" అంది.

"నేను పెట్టకుండా ఉంటానా చెప్పండి, ఇప్పుడు వెళ్ళేది అక్కడికే." అన్నాడు.

యూనివర్సిటీకి వెనకగా మరోమూలకి ఉన్న ఆ ఆఫీసుకు కాలి నడకన వెళ్ళడానికి కనీసం నలభయి నిమిషాలు పడుతుంది. కాస్త దగ్గర దారి అవుతుందని డొంక దారిన నడవడం మొదలు పెట్టేరు. దారంతా ఆహ్లాదంగా ఉంది. చిక్కని చెట్లు . అక్కడక్కడా పడుతున్న చిన్న సూర్యకిరణాలు. ఆకాశంలో నుంచి సూటిగా నేల మీదికి ప్రసరిస్తున్న కాంతి పుంజాలు.

ఎవరో దగ్గర్లోని మరో త్రోవలో నడుస్తూ సన్నగా పాడుతున్నారు.

"మేరె మెహబూబ్ తుఝే, మేరీ మొహబ్బత్ కి కసమ్"

పాట వింటూ అన్యమనస్కంగా నడుస్తున్న తన్మయి చీర చెంగు చటుక్కున దారి పక్కని కొమ్మకి తగులుకుంది. పక్కకి పడబోయిన తన్మయి చేతిని చప్పున అందుకున్నాడు వెనకే వస్తున్న కరుణ. అనుకోకుండా మరో రెండడుగులు అలాగే నడిచేరిద్దరూ. తన్మయికి ఏదో అర్థమయ్యినట్లయ్యి వెంటనే చెయ్యి విదిలించుకుంది.

కరుణ చప్పున దగ్గరకు వచ్చి "తనూ! ఇప్పుడు చెప్పగలిగిన విషయమవునో కాదో తెలీదు. కానీ చెప్తాను. నేను.. నేను.. మిమల్ని ప్రేమిస్తున్నాను" అన్నాడు.

తన్మయికి ఒక్కసారిగా గొంతు తడారినట్లయ్యి ఏమీ మాట్లాడ లేకపోయింది. కరుణ ఎప్పుడో ఒక్కప్పుడు ఈ మాట అంటాడని భయపడుతూనే ఉంది. నిజానికి తనెంత కాదనుకున్నా కరుణని తను కూడా ఇష్టపడుతూనే ఉంది. కానీ తన జీవిత పరిస్థితులు వేరు. అతని పరిస్థితులు వేరు. ఇవి రెండూ ఒక ఒరలో ఇమడవు. పైగా ఇప్పుడు తనున్న పరిస్థితి, తన మన:స్థితి ఇటువంటి వాటికి సిద్ధంగా ఉందా? నెలనెలా కోర్టు చుట్టూ ప్రదక్షిణలు, జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాబు భవిష్యత్తు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే జే. ఆర్ ఎఫ్ విజయంతో ఆర్థిక పరంగా నిలదొక్కుకునే అవకాశం రాబోతూ ఉంది. అయిదు నిమిషాలు అంతా నిశ్శబ్దం తాండవించింది ఇద్దరి మధ్య.

అప్పటికి డొంక దారి దాటి చిన్న కేంటీను బాట వచ్చింది. ఇక నడవలేక రోడ్డు పక్కని బెంచీ మీద కూలబడింది తన్మయి.

కరుణ పక్కనే కూచున్నాడు.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ , "మౌనం అర్థాంగీకారం అనుకోవచ్చా?" అన్నాడు.

తన్మయి గొంతు సవరించుకునేలోగా

"ఇంకో విషయం. మీరు అర్థం చేసుకుంటారనే చెప్తున్నాను. మా అమ్మకి సంప్రదాయాల పట్టింపు ఎక్కువ. మీరు మరో కులానికి చెందిన వారని మనిద్దరి పెళ్లిని ఆవిడ ఒప్పుకోదు. నాన్న లేని నన్ను అన్నీ అయి పెంచిన మా అమ్మ అభిమతానికి వ్యతిరేకంగా నడచుకోలేను. అందుకే మా అమ్మకు నచ్చినట్లుగా, ప్రపంచం కోసం మా కులంలో మరో అమ్మాయిని కూడా చేసుకోవాలనుకుంటున్నాను." అన్నాడు "కూడా" ని ఒత్తి పలుకుతూ.

తన్మయికి ఒక్క క్షణం అతనేమంటున్నాడో అర్థంకాలేదు. "అంటే....?" అంది తల విదిలిస్తూ.

"మీతో బాటూ ఇంకొక అమ్మాయిని కూడా చేసుకోవాలి నేను" అన్నాడు కరుణ.

హఠాత్తుగా ఆకాశం పెళ్లున విరిగి పడ్తున్న భయమేదో కలిగింది తన్మయికి.

"అసలు ఇతను కరుణేనా? తన స్నేహితుడై తనని ఓదార్చిన కరుణేనా? ఇటువంటి దురాలోచనలకి ఇతనెందుకు లోనవుతున్నాడు? అనంత చెప్పినట్లు తన ఆర్థిక విజయమే కారణమా?!"

విపరీతమైన ఆవేదనతో దుఃఖం తన్నుకు రాసాగింది.

"అసలు ఏమనుకుంటున్నాడు ఇతడు తన గురించి?! ఇటువంటి వాడితోనా తనిన్నాళ్ళూ స్నేహం చేసింది!"

బాధావేశాలు కుదిపివేస్తుండగా ఒక్కసారిగా అరికాలి నుంచి రక్తం తలకి ఎక్కినట్లయింది తన్మయికి. గగుర్పాటుతో చప్పున లేచి నుంచుంది.

అతని ముఖమ్మీద చరిచినట్లు చప్పుడు చేస్తూ నమస్కరించి, "చాలు. ఇక ఒక్క మాట కూడా మాట్లాడొద్దు. అయినా దేశాన్ని ఉద్ధరించే ముందు నిన్ను నువ్వు సంస్కరించుకో? నీకు ఇద్దరు భార్యలు. అందులోఒకరు నేను. ఛీ.ఛీ.. ఇంతకంటే అసహ్యమైన ఆలోచన ఇంకొకటి ఉందా?" అంది చిరాగ్గా తన్మయి.

"అదేవిటి, ఇందులో తప్పేవిటి? నేను మా అమ్మని బాధ పెట్టలేను, అలాగని నిన్ను వొదులుకోలేను" అన్నాడు ఆశ్చర్యంగా.

"తప్పు ఏవిటని అడుగుతున్నావా? ఆ ఆలోచనే తప్పు. నీలాంటి కుసంస్కారం వంతుడు నా స్నేహితుడు కావడం నా దురదృష్టం. జీవితంలో ఇక నాకు దగ్గరకు రావడానికి ప్రయత్నించొద్దు."

అతని వైపు మరోసారి చూడడం కూడా తప్పన్నట్లు విసవిసా ముందుకు నడిచింది.

ఎంత అసహ్యంగా ఆలోచిస్తున్నాడో! “ప్రపంచం కోసం ఒక పెళ్లి, అతని కోసం ఒక పెళ్లి.”

ఆడవాళ్లంటే ప్రతీ ఒక్కడికీ అలుసయిపోయింది. అయినా తనేం తప్పు చేసింది? తనకే ఇలాంటి మనుషులు ఎందుకు ఎదురవుతున్నారు? మగవాళ్లు ఎంత అవకాశవాదులు! శేఖర్ కి, ఇతనికి దుర్మార్గంలో తేడా ఏవుంది? అతను తనుండగా ఎవరో అమ్మాయితో రహస్యంగా ఎఫైర్ నడిపి, ఆమె కోసం తనని ఒదిలి వెళ్ళిపోయేడు. ఇతను పబ్లిగ్గా ఇద్దరు భార్యల్ని కట్టుకోవాలనుకుంటున్నాడు.

“తనెప్పుడూ కరుణ జ్ఞానాన్ని చూసి చాలా అబ్బురపడేది. అటువంటి స్నేహితుడు తనకి ఉన్నందుకు ఎంతో గర్వపడేది. అతని ఆర్థిక పరిస్థితి చూసి వీలైనంత సహాయం చెయ్యాలని జాలి పడేది. తనతో బాటూ శేఖర్ వల్ల ఇతను కూడా సమస్యల్లో ఇరుక్కున్నపుడు అతని ఓర్పుకి కృతజ్ఞతాభావంతో పొంగిపోయింది. అలాంటిది ...ఇప్పుడు...”ఇక ఆలోచించలేక తన్మయి గొంతునిండా దుః ఖం నిండిపోయింది.

అసలే తను పెళ్లనే ఉచ్చులో ఇరుక్కుని ఇంకా బాధలు పడుతూనే ఉంది. ఒక స్నేహితుడిగా అతను తనకి ఓదార్పునివ్వాల్సింది పోయి ఇంత దారుణంగా ఎందుకు ఆలోచిస్తున్నాడు? తను ఇంకో పెళ్లి కోసం అర్రులు చాస్తున్నట్టు కనిపిస్తోందా ఇతనికి? కాదు.. ముమ్మాటికీ కాదు. తనున్న పరిస్థితుల్ని ఇతనికి అనుగుణంగా మలచుకోవడానికి పన్నుతున్న కుతంత్రం ఇది. ఇతని గురించి ఆలోచించడం కూడా తప్పే. అనర్హుల కోసం కన్నీరు కార్చడం కూడా వృథానే.

"అజ్ఞాత మిత్రమా! నా మనసుని రాయిగా మార్చు. నా కళ్ళ నించి చుక్క కూడా రానివ్వకు. నన్ను ఈ దుష్ట ప్రపంచం నించి కాపాడు. నాకు ఈ లోకంలో సగౌరవంగా బతికే ధైర్యాన్ని ఇవ్వు..." జీరబోయిన గొంతుతో తనలో తనే గొణుక్కుంటున్నట్లు మాట్లాడుకుంటూ ముందుకు నడిచింది.

## 34

తన్మయి లేడీస్ పీ.హెచ్.డీ హాస్టలు చూసొద్దామని బయలుదేరింది.

ఈ హాస్టలు సముద్రం ఒడ్డున ఉన్న పీజీ హాస్టలు దగ్గర్లో కాకుండా యూనివర్సిటీ కాంపస్ కి దగ్గర్లో ఉంది. తెలుగు డిపార్టు మెంటు నించి రెండు బస్టాపుల దూరం. కాస్త సమయం ఉంటే నడిచి కూడా వెళ్లొచ్చు. విశాఖ పట్నంలో ఉన్న సౌందర్యమంతా కొండ ఎక్కి, దిగినట్లుండే రోడ్లలో ఉన్నప్పటికీ దాదాపు సగం కొండ దిగువన ఉన్న బస్టాపు లో దిగి ఎత్తుకి ఎక్కి హాస్టలు ప్రాంగణంలోకి అడుగు పెట్టేసరికి చెమటలు ధారాపాతంగా కారసాగేయి తన్మయికి. బుడి బుడి అడుగులేసుకుని ఎక్కడా ఎత్తుకోమనకుండా తనతో నడుస్తూన్న బాబుని మెచ్చుకోకుండా ఉండలేకపోయింది.

పీజీ హాస్టలుకి ఉన్నట్లు కాపలాలేవీ లేవు ఇక్కడ. అసలు గేటే సగం విరిగి పక్కకి పడి ఉంది.

ఏదో ఒక పాత భవంతి అది. ప్రాంగణం లో పిచ్చి పిచ్చిగా పెరిగిన గడ్డి మధ్య ఉన్న కాలిబాట గుండా నడిస్తే పైకి అయిదారు మెట్ల మీద ఉన్న పెద్ద గది లోకి అడుగు పెట్టేరు. గుమ్మం దగ్గర వాచ్ మేన్ కోసం 'నామ్ కే వాస్తే' అన్నట్లు ఒక కుర్చీ వేసి ఉంది. ముందు గదిలో ఒక మూలగా టీవీ చుట్టూ

పది పదిహేను మకిలి పట్టిన ప్లాస్టిక్ కుర్చీలు ఉన్నాయి. నైటీల్లో ఉన్న నలుగురయిదుగురు అమ్మాయిలు తమ వైపోసారి చూసి తల తిప్పుకున్నారు. అంతా తైల సంస్కారం లేని జుట్లు ముడేసుకుని ఉండడం గమనించింది తన్మయి.

సందేహంగా అక్కడే పది నిమిషాలు కూచుంది తన్మయి. బాబు ఒళ్లో నుంచి దిగి టీవీకి దగ్గర్లో ఉన్న కుర్చీ మీద కూచుని తదేకంగా ఆసక్తిగా చూడసాగేడు.

వివేకానందా పాఠశాలలో టీ.వీ లేకపోవడం వల్ల వాడికి టీవీ చాన్నాళ్ళకి కనబడింది పాపం. టీవీని, వాడి ఆసక్తిని చూడగానే తన్మయికి తను మొదటి సారి టీవీ చూసిన జ్ఞాపకం మెదిలింది.

తన్మయి ఎనిమిదో తరగతి లో ఉండగా ఊళ్లో బాగా డబ్బులున్న వాళ్ల ఇళ్లలో బ్లాక్ & వైట్ టీవీ లొచ్చేయి. తనతో బళ్ళో చదువుతున్న పక్క బెంచీ అమ్మాయి వాళ్ల పెదనాన్న గారిల్లు అందులో ఒకటి. ఇంకేం మరి, స్నేహితురాళ్ల తో బాటూ కలిసి ఆ వింతేదో చూడడానికి వెళ్లింది తన్మయి. పెద్ద మండువా లోగిలిలో హాలంతా పరిచి ఉన్న చాపలలో చివరి సీటు దక్కింది. టీవీ స్క్రీన్ ని ఆన్ చెయ్యగానే పెద్ద పెద్ద చుక్కలు చాలా సేపు వచ్చేయి. ఇంటికి పైనెక్కడో ఉన్న పెద్ద ఆంటీనా ని కదుపుతూ ఇంటి వాళ్లు పాపం చాలా కష్టాలు పడ్తున్నారు. పై నించి "వచ్చిందా" అంటూ కొందరు. కింద నున్న హాల్లో "రాలేదు" అని కొందరు. మొత్తానికి టీవీ మీద అలుక్కుపోయినట్లు మొదటి బొమ్మ కనీ కనబడగానే అంతా ఆనందాశ్చర్యాలతో గట్టిగా చప్పట్లు కొట్టేరు.

ఆ పాట్లు గుర్తు రాగానే తన్మయి పెదవుల మీద అప్రయత్నంగా చిరునవ్వు వెలిసింది.

కాస్సేపు అలాగే కూచుని, ఇక లాభం లేదని తన్మయి లేచి ఆ గది దాటి, వెనక వైపున్న మరో ప్రాంగణం వైపు కదిలింది. బాబు వెంటనే తన్మయి వైపు పరుగెత్తుకొచ్చేడు. అంతసేపూ అక్కడున్న వారిలో ఒక్కరు కూడా బాబుని కూడా పలకరించకపోవడం ఆశ్చర్యంగా అనిపించింది తన్మయికి.

ఆ లోపల ఉన్న పెద్ద భవంతి చూసి ఆశ్చర్యచకితురాలైంది తన్మయి. అదేదో పురాతన రాజ భవంతిలా ఉంది. చుట్టూ రెండస్తుల్లో గదులున్నాయి. మధ్య అంతా సిమెంటు చేసి ఉన్న పెద్ద ఖాళీ ప్రాంగణం. పైన కప్పు లేకుండా ఆకాశం కనిపిస్తూ ఉంది. ఆ చివరగా అటూ, ఇటూ పైకి మెట్లు. గొప్ప రాతి కట్టడమది. చాలా పురాతనమైన భవంతి అనడానికి సాక్ష్యంగా అక్కడక్కడా రాతి పగుళ్ళ మధ్య నించి మొక్కలు మొలకెత్తి ఉన్నాయి.

తన్మయి సందేహంగా చుట్టూ చూసింది. వరండా అంతా నిర్మానుష్యంగా ఉంది.

ఎక్కడో ఒక గదిలో నించి రేడియో శబ్దం వినిపిస్తూంది.

వెనక్కి చూస్తే ముందు గది అడ్డంగా ఉండడం వల్ల బయటి నించి వచ్చిన గేటు కానరాలేదు. లోపలికి ఉండడం వల్ల ఇంత పెద్ద భవంతి ఇక్కడ ఉన్నట్లే బయటి ప్రపంచానికి తెలియనట్లు ఉంది. ఎడమ వైపు మొదటి గది తాళం వేసి ఉంది. కుడివైపు మొదటగా ఒక చిన్న గది ఉంది. "ఎటు వెళ్దామా?" అని చూస్తున్నంతలో బాబు చెయ్యి వదిలేసి ఎడమ వైపున్న రెండో గది వైపు పరుగెత్తేడు.

తన్మయి చప్పున గుమ్మం వరకు పరుగెత్తింది వాడి వెనక. పలుచని చీర కర్టెన్ లోపల చాల పెద్ద విశాలమైన గది కనిపించింది. పీజీ హాస్టలులో దాదాపు నాలుగైదు గదులు కలిపినంత పెద్ద గది అది. తలుపు దగ్గర చప్పుడయ్యేసరికి గదికి ఒక మూలగా ఉన్న మంచానికి ఒక వైపు నేల మీద మోకాళ్ల మీద కూచుని, మంచమ్మీద మోచేతులుంచి, తల నిండా కొంగు కప్పుకుని క్రైస్తవ ప్రార్థన చేస్తున్న నడి వయసు అమ్మాయి కళ్ళు విప్పింది.

తన్మయి తన తప్పు తెలుసుకుని, "క్షమించండి, బాబు పరుగెత్తుకొచ్చేసేడు" అంది.

"ఫర్వాలేదు, లోపలికి రండి." అత్యంత ప్రసన్నవదనంతో అందా అమ్మాయి.

సాదరమైన ఆ పిలుపుకి తన్మయికి ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించి ఆనందం వేసింది.

"నమస్తే, నా పేరు తన్మయి. కొత్తగా రీసెర్చి స్కాలర్ ని కాబోతున్నాను. హాస్టలు చూద్దామని వచ్చేనండీ." అంది.

"అండీ అనక్కరలేదు మేరీ అని పిలవండి చాలు, కొద్దిగా కాఫీ తీసుకుంటారా?" అంది లేచి మళ్లీ అదే చిర్నవ్వుతో.

అప్పటి వరకు ఉన్న బెరుకు కొంచెం కాస్త తగ్గి, "ఆహా వద్దండి. అడిగేరు అంతే చాలు. ఇక్కడ వార్డెను ఎక్కడుంటారు?" అంది తన్మయి.

బదులుగా "చూపిస్తాను. వీడు మీ అబ్బాయా?" భలే ముద్దుగా ఉన్నాడు అని,

"ఏమోయ్, గర్ల్స్ హాస్టలులో ఉంటావా మరి?" అంది దగ్గరకు చెయ్యి చాస్తూ.

పాతా కొత్తా లేకుండా, దగ్గరకు వెళ్లి తలూపుతూ "ఉంతా" అన్నాడు ముద్దుగా.

ఆ అమ్మాయి కిలకిలా నవ్వింది. పొట్టిగా, లావుగా, చూడడానికి సీరియస్ గా, పెద్దదానిలా కనబడుతూన్నా నవ్వితే చాలా చిన్నపిల్లలా కనిపించింది.

తన్మయి చుట్టూ పరికించింది. అత్యంత పరిశుభ్రంగా ఉన్న ఆ గదికి ఒక మూలగా చిన్న వత్తుల స్టవ్వు, కొద్దిగా సామాన్లు, ఒక రైటింగు టేబులు, టేబుల్ లాంపు, కర్టెన్లు వేసున్న గోడ అల్మారాలో పొందికగా సర్ది ఉన్న బట్టలు, పుస్తకాలు. గోడకి తలిగించి ఉన్న మేరీమాత పటం.

అక్కడక్కడా పెళ్లలు ఊడిపోయిన గచ్చుకి స్వయంగా మట్టి మెత్తినట్లు స్పష్టంగా తెలుస్తూంది. గదికి రెండో వైపు మరో మంచం, మరో టేబులు , కుర్చీ ఖాళీగా ఉన్నాయి.

"ఇంత పెద్ద గదికి ఇద్దరేనా?" అంది తన్మయి ఆశ్చర్యంగా.

"హాస్టలులో మొత్తం 25 గదులున్నాయి తన్మయీ. మొత్తం స్కాలర్సు ఉన్నది పదిహేను మందిమే.

విడిగా ఒక్కో గదిలో ఉండలేక కొందరు ఒకే గదిలో ముగ్గురు కూడా ఉంటారు. అంతా ఎవరిష్టం వారిది. నా గదిలో మొదట్నించీ నేనొక్కదాన్నే ఉంటున్నాను. మీకభ్యంతరం లేకపోతే మీరు నా గదిలో ఉండొచ్చు." అంది మేరీ బాబుకి డబ్బా లో నుంచి బిస్కెట్టు తీసి ఇస్తూ.

"చాలా థాంక్సండీ. ఇంత కంటే అదృష్టం ఇంకోటి ఉండదు" అంది తన్మయి.

అసలు ఇంత పరిశుభ్రంగా, అందంగా గదిని ఉంచుకోవచ్చని అప్పుడే తెలుసుకుంది తన్మయి.

చుట్టూ కిటికీలకు అందమైన లేత గులాబీరంగు చీర కర్టెన్లు, ఆ అమ్మాయి మంచమ్మీద తెల్లని అందమైన దుప్పటీ.

గదిలో చెప్పులతో సహా ఎక్కడ ఉండాలో అక్కడే ఒద్దికగా ఉన్నాయి.

చూడగానే మేరీ తన్మయికి బాగా నచ్చేసింది.

"మీ వాడు ఎంత తెల్లగా ముద్దొస్తున్నాడో! నేను వీడి దగ్గిర మరీ నల్లగా ఉన్నాను " అంది నవ్వుతూ అప్పటికే గదిలో అటూ ఇటూ పిల్లిమొగ్గలు వేస్తున్న బాబుని మురిపెంగా చూస్తూ.

"నలుపు, తెలుపులలో అందం ఉండదండీ, మంచి వ్యక్తిత్వంలో తప్ప." అంది తన్మయి.

మేరీ తన్మయి వైపు ఆశ్చర్య చకితురాలై చూసి "చాలా చక్కగా చెప్పేరు" అంటూ

"పదండి మీకు హాస్టలు చూపిస్తాను" అని గది తాళం వేసి ముందుకు నడిచింది మేరీ.

హాస్టలు వరండాలోని కుడి వైపు గది తలుపు మీద చిన్నగా కొట్టి, " వార్డెను ఆంటీ! కొత్త అమ్మాయి వచ్చింది" అంది.

పెద్ద బొట్టు పెట్టుకుని చూడడానికి కొంచెం కఠినంగా కనబడుతున్న ఒక పెద్దామె వచ్చింది జుట్టు ముడేసుకుంటూ.

"ఏ డిపార్టుమెంటు?" అంది సీరియస్ గా.

"తెలుగండీ" అంది నెమ్మదిగా తన్మయి.

"పేరు, ఇంటి పేరు..." అంటూ వివరాలు రిజిస్టరు లో రాసుకున్నాక, వరండా మధ్య ఉన్న ఖాళీలో అటూ ఇటూ తిరుగుతున్న బాబుని చూస్తూ, "ఈ పిల్లోడెవరూ?" అంది నొసలు చిట్లించి.

"మా అబ్బాయి" అంది.

"మరి నువ్వు హాస్టలు లో ఉంటే ఈ పిల్లోణ్ణి మీ ఆయన చూస్తాడా?" అంది.

"అహాహా, బాబు నాదగ్గరే ఉంటాడు" అంది తన్మయి.

"అలా ఉండడానికి హాస్టలు రూల్సు ఒప్పుకోవు, ఇది తల్లీపిల్లల హాస్టలు కాదు. కేవలం లేడీస్ హాస్టలు" అంది ఒత్తి పలుకుతూ.

ఆ మాట వినగానే ఏదో అర్థమైనట్లు బాబు పరుగెత్తుకొచ్చి తన్మయి కాళ్లని చుట్టుకున్నాడు కాస్త భయంగా.

వాణ్ణలాగే పొదివి పట్టుకుని, "అయ్యో" అంది తన్మయి.

తన్మయి ఏదో అనబోతూండగా మేరీ మధ్యలో అందుకుని, "అలాగేలెండి, మీరు స్ట్రిక్టని తెలుసు కదా" అంది తన్మయి చెయ్యి పట్టుకుని రమ్మన్నట్లు బయటికి లాగుతూ.

"ఏవిటీ, నీ రూములోనే ఉంటుందా ఈ పిల్ల" అంది గట్టిగా వెనక నించి వార్డెను.

"అవును, రాసుకోండి" అంది మేరీ.

గది తాళం తీసి, "మిగతా హాస్టలు తర్వాత చూద్దాం లే. ముందు లోపలికి రా. నా కంటే చిన్నదానివే అయి ఉంటావు నువ్వు. అందుకే నువ్వు అంటున్నా. ఏవీ అనుకోకు. ఈ మంచి నీళ్ళు తాగు ముందు. " అంది తన మంచమ్మీద కూచోబెడుతూ.

కొద్దిగా స్థిమిత పడుతూన్నట్లున్న తన్మయి ముఖం వైపు చూస్తూ, "ఏవిటి ప్రాబ్లం!" అంది మేరీ.

మొదటి పరిచయంలోనే మీకు చెప్పాల్సి వస్తూంది. అని తన కథని టూకీగా చెప్పింది తన్మయి.

కళ్ల నిండా నీళ్ళతో చప్పున దగ్గరికి వచ్చి, "అయ్యో, ఇంత చిన్న వయసులో నీకెంత కష్టం వచ్చింది!" అంది చెయ్యి పట్టుకుంటూ మేరీ.

ఆ చెయ్యినలాగే వదలకుండా "ఈ అమ్మాయి ఎప్పటికీ తనకి స్నేహితురాలైతే బావుణ్ణు" అనుకుంది తన్మయి. హఠాత్తుగా వనజ జ్ఞాపకం వచ్చింది.

అనంత ద్వారా ఆ లోటు కాస్త తీరినప్పటికీ, వనజకి దూరమైనప్పటి నించి అంతరాంతరాల్లో పేరుకుపోయిన దు:ఖమేదో ఆ క్షణాన ఉబికి వచ్చింది తన్మయికి.

తను ఈ అమ్మాయికి ఏమవుతుంది? ఇప్పుడిప్పుడే కలిసిన తన మీద ఇంత దయ ఆమెకు ఎందుకు కలిగింది?

"అజ్ఞాత మిత్రమా! నువ్వు ఎన్ని రూపాలలో నాకు ఎదురయ్యి సహాయపడ్తున్నావో కదా!" అని మనస్సులోనే ధన్యవాదాలు సమర్పించింది.

★★★

బస్సులో ఇంటికి వెళ్తున్నంత సేపూ ఆలోచిస్తూనే ఉంది తన్మయి. బాబుని తనతో ఉండనివ్వకపోతే తను హాస్టల్లో ఉండడం ఎలా? బయటెక్కడైనా ఉండాలంటే ధైర్యం చాలడం లేదు. అలాగని బాబుని మళ్ళీ అమ్మ దగ్గర వదిలి పెట్టి ఉండడమూ ఇష్టం లేదు.

"ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి?"

మేరీ చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి.

“వివేకానందా పాఠశాలలో రిజైన్ చేసేసావు గనుక, పోనీ ఒక నెల రోజుల పాటు బాబుని అమ్మ దగ్గిర వదిలి రా. అందాక తలదాచుకోవడానికి ఈ హాస్టల్ పనికి వస్తుంది. పీ.హెచ్.డీ లో జాయినయ్యి, హాస్టల్లో చేరేక నిదానంగా ఆలోచించుకోవచ్చు. బహుశా: అదే మంచిదేమో.

తనకి ఒక్కతే ఉండడం అంటే ఏదో తెలీని భయం. ఒక్కతే సినిమాకు కూడా వెళ్లలేని తను ఏకంగా ఒక ఇల్లు తీసుకుని చిన్న పిల్లాడితో ఈ ప్రపంచంలో మనగలదా? తనలాంటి వాళ్ళు అసలు ఎలా ఉండగలుగుతున్నారో ఏమో.” పిరికితనంతో తనలో తనే కుమిలిపోసాగింది తన్మయి. ఆ వెంటనే శేఖర్ మీద కోపం ముంచుకొచ్చింది.

"తనేం పాపం చేసింది? ఇలా అనుక్షణం క్షోభననుభవించాల్సి వస్తూంది?"

ఒళ్ళో నిద్రపోతున్న బాబు లేత చెంపల్ని నిమిరింది.

“నన్ను క్షమించురా నాన్నా. మళ్లీ కొన్నాళ్ళు నీకూ, నాకూ ఎడబాటు తప్పదు.”

ఇంటికి చేరుతూనే తల్లి కాస్త ముభావంగా ఉండడం గమనించింది తన్మయి. ఇన్ని రోజుల తర్వాత తను ఇంటికి వస్తే కాస్త నవ్వుతూ పలకరించకపోయేసరికి తన్మయికి బాధ రెట్టింపయ్యింది. తల్లి అలా ముఖం ముడుచుకున్నప్పుడల్లా అందుకు తన పెళ్ళి, అది కాస్తా ఇలా పెటాకులయ్యి పరిణమించడం కారణంగా భావించి తన్మయి న్యూనతకు గురికాసాగింది. తండ్రి బాగా నీరసించిపోయ్తినట్లు కనిపించేదు. అంతకంతకూ ఆయన ఆరోగ్యం క్షీణించడం వెనుక తన జీవితమే కారణం.

"ఛీ, కన్నతల్లిదండ్రుల్ని సంతోషంగా ఉంచలేని బతుకు తనది."

రాత్రంతా కలత నిద్రతో గడిపింది తన్మయి.

----

తెల్లారి తన్మయి లేచే సరికి బయట వరండాలో పరిచితమైన స్వరాలు వినిపించేసరికి దిగ్గున నిద్ర లేచింది తన్మయి.

బాబు చాలా అస్థిమితంగా అటూ ఇటూ పరుగులు తీస్తున్నాడు.

"తన పక్క నించి ఎప్పుడు లేచాడో ఏమో. తెల్లవారు ఝాము వరకూ సరిగా నిద్ర పట్టలేదు. ఇక తెల్లవారగానే మెలకువ రాలేదు."

పరుగెడుతున్న బాబుని ఆపి మూతి తుడిచింది. జ్యోతి వాడికి పాలు పట్టించినట్లుంది.

మూతికటూ ఇటూ పాలచారికలతో బాటూ చేతిలో పెద్ద ఫైవ్ స్టార్ చాక్లెట్టు విప్పుకుని తింటున్నాడేమో మన్ను తింటున్న కృష్ణుడిలా కనిపించేడు.

వాణ్ణి ఎత్తుకుని ముద్దాడి "ఎక్కడికిరా ఈ పరుగులు? పొద్దున్నే చాక్లెట్టు ఏవిటి?" అంది తన్మయి.

బదులుగా "అమ్మా! "తిరుగుబోతు" అంటే ఏంతి?" అన్నాడు.

హఠాత్తుగా వాడి నోటి వెంట వచ్చిన ఆ మాటకి ఆశ్చర్యపోయింది తన్మయి. "ఎవరన్నార్రా? అసలిలాంటి మాటలు ఎలా నేర్చుకుంటున్నావు?" అంది.

"మరి బయట నాన్న ఉన్నాడుగా. 'ఎక్కడికెళ్ళేవు?' అని అడిగేను. "మీ అమ్మ తిరుగుబోతురా" అందుకే వెళ్లిపోయేను." అని చెప్పేడు.

తన్మయికి విపరీతంగా కోపం పెల్లుబికి వచ్చింది. "పసి పిల్లాణ్ణి కూడా చెడగొడుతున్నాడు" అని పళ్ళు నూరుకుంది.

మధ్య గదిలోకి వస్తూనే వరసగా శేఖర్ తల్లి, పిన్ని, తాతయ్య, మావయ్య గొంతులు వినవచ్చాయి. వరండాలో మడత కుర్చీలో కూచున్న భానుమూర్తి నీరసమైన స్వరమూ విన వచ్చింది. వంటింట్లో కాఫీలు పెడుతున్న జ్యోతి నిన్న రాత్రి లాంటి ముడుచుకున్న ముఖంతోనే "లేచావా? కాస్త కాఫీలు పట్టుకెళ్ళు" అంది. ఆ స్వరంలో నిష్టూరం విని తన్మయికి చికాకు వచ్చింది. తనకి తెలియకుండా వాళ్లెందుకు వచ్చారు?

పైగా అదేదో తన తప్పన్నట్లు తల్లి ఇలా నిష్టూరంగా మాట్లాడడమేంటి? అదే అడిగింది అసహనంగా.

"అవునమ్మా, అంతా నా మీదే చికాకు పడండి. చేసుకున్నావుగా, అందుకే అనుభవిస్తున్నాం. పిల్లాడి కోసం వస్తున్నాం అంటే ఒకరో ఇద్దరో అనుకున్నా. ఇలా అంతా కలిసి తగలడతారని ఎవరికి తెలుసు?" అంది.

అసలెవరి వైపూ చూడకుండా లోపలికి నిశ్శబ్దంగా కాఫీలు పట్టుకెళ్ళి గుమ్మంలో టీపాయి మీద పెట్టింది తన్మయి.

"ఏమ్మా, అంతా కులాసాయేనా? కాస్త ఇలా తెచ్చివ్వు" అన్నాడు శేఖర్ తాతయ్య.

ఆయనకో కప్పు తీసి చేతి కిచ్చి "పెళ్లి చూపులకి వచ్చినట్లు ఇంకా వీళ్ళకు కాఫీలు చేతికందించడమొకటి" తనలో తనే తిట్టుకుని లోపలికి వచ్చింది తన్మయి.

శేఖర్ తన వైపు చూసేడో, లేదో అని పట్టించుకునే స్థితి ఎప్పుడో దాటి పోయింది తనకు.

మరో అరగంటలో భానుమూర్తి "అమ్మా, తన్మయీ!" అంటూ పిలిచేడు.

జుట్టు ముడేసుకుని అలాగే నైటీతో వెళ్లి, తండ్రి వైపు ఏవిటన్నట్టు చూసింది.

"కూచోమ్మా, అన్నాడు శేఖర్ తాతయ్య.

"ఫర్వాలేదు చెప్పండి" అంది విసుగు ధ్వనించే గొంతుతో.

"లేదు, కాస్సేపు మాట్లాడాలి నీతో" అన్నాడు.

అది అంది పుచ్చుకుని శేఖర్ మావయ్య "మరేం లేదమ్మా, ఎంతైనా మనం మనం కావాల్సిన వాళ్ళం. ఈ విడాకులు, అవీ ఎందుకు గొడవ? సామరస్యంగా సాధించుకుంటే పోలా?" అన్నాడు.

తన్మయి చివ్వున తలెత్తింది."విడాకులు నేనడిగానా? అతనా?" అంది.

"అదేలే, ఎవరడిగితే ఏం?" సామరస్యంగా…" అన్నాడు మళ్లీ శేఖర్ మావయ్య .

శేఖర్ గుమ్మం లోంచి బయటకు చూస్తూ కూచున్నాడు మాట మాట్లాడకుండా.

తన్మయికి వద్దనుకున్నా, తనని అనవసరంగా దోషిని చేసి ఇంటిగలవాళ్ల ముందు అతను ఆడిన నాటకం, కోర్టు బయట అతను తన వైపు చూసిన నిర్లక్ష్యపు చూపు గుర్తుకు వస్తున్నాయి.

అసలు అతనికీ తనకూ మధ్య ఎప్పుడూ ఏవీ లేనట్లు ఎంత కఠినంగా ప్రవర్తించేడో తల్చుకుంటే అతని మీద కంపరం పుట్టుకొస్తూంది.

పైగా బాబుతో అతను కాసేపటి క్రిందట తన గురించి చెప్పిన చెడ్డ మాటలొకటి.

తన్మయి ఏదో అనబోయేలోగా, తండ్రి సంతోషం నిండిన స్వరంతో "అంత కంటేనా బాబూ, మీరెలా అంటే అలాగే" అన్నాడు.

అర్థం పర్థం లేని తండ్రి మాట విని నివ్వెరపోయింది తన్మయి.

ఇంత జరిగినా ఇంకా ఇలా ఎలా ఆలోచిస్తున్నాడు తన తండ్రి?

"నాన్నగారూ!" అంది అసహనంగా.

బాబుని పొదివి పట్టుకున్నాడు శేఖర్. వాడు తండ్రిని మరిచిపోనట్లు అతని ఒళ్ళోకి చేరి గట్టిగా కావలించుకున్నాడు.

బాబు వైపు ఆశ్చర్యపోయి చూసింది తన్మయి.

"చంటి పిల్లాడు కదా, తెలీనితనం" అని సరిపెట్టుకోలేకపోతూ ఉంది తన్మయి. ఏవీ చెయ్యలేని నిస్సహాయత చుట్టూ ఆవరించినట్లయ్యి కళ్ళు మూసుకుంది.

ఒక పక్క తండ్రి ఆమోదం చెప్పడం. తనకి ఈ విషయం బొత్తిగా సంబంధం లేనిదన్నట్లు తల్లి అసలు బయటికే రాలేదు.

శేఖర్ కి భానుమూర్తి మాటల్తో గొప్ప బలం వచ్చినట్లు కాళ్ళూపుతూ, గొంతు గట్టిగా సవరించుకుని "అయితే నాదొక కండిషను." అన్నాడు ఏదో పెద్ద దయామూర్తి లాగా.

"చెప్పురా చెప్పు. నీకున్న కండిషన్లన్నీ స్పష్టంగా చెప్పెయ్యి." అంది శేఖర్ తల్లి ఈసడింపుగా.

ఇదంతా వినోదం చూస్తూ అటూ ఇటూ కళ్లు తిప్పసాగింది అతని పిన్ని.

వీళ్లందరి ముఖాలు చూడడానికే అసహ్యం వేస్తూ ఉంది తన్మయికి.

"చెప్పు బాబూ" అన్నాడు భానుమూర్తి.

"ఈవిడ ఉద్యోగం చేస్తుందో, ఊళ్లేలుతుందో తనిష్టం. జీతం పట్టుకొచ్చి నా చేతుల్లో పెట్టాలి. ఇక నేను మరో అమ్మాయితో కలిసి ఉంటున్నాను, మీకు తెలుసనుకుంటాను. ఆమెని పక్క పోర్షనులో ఉంచుతాను. మేం మా తాత గారింటి పక్కనే అద్దెకి ఉంటాం ఇక మీదట. నేను ఊళ్లోలేనపుడు ఈవిడెక్కడికి వెళ్లినా మా వాళ్ళెవరికైనా చెప్పి వెళ్ళాలి." అన్నాడు ఒక్కొక్క కండిషనుని వత్తి పలుకుతూ.

ఇంట్లో కాబట్టి సమయానికి చెప్పులు వేసుకోలేదు తన్మయి, లేకపోతే చెప్పు తీసుకుని అతడిని అక్కడే అందరి ముందూ ఎడా పెడా వాయించాలన్నంత కోపం వచ్చింది తన్మయికి.

"గెటవుట్" అని వీధి వైపు వేలు చూపిస్తూ అరిచింది లేచి నిలబడి.

తండ్రి తన్మయిని వారించబోతూంటే రెండు చేతులూ జోడించి, "దయచేసి మీరు మాట్లాడకండి నాన్నా మధ్యలో" అంది.

"అసలు మిమ్మల్ని ఇక్కడికి ఎవరు రమ్మన్నారు? అంతా బయటికి నడవండి ముందు." అంది మహా కాళిలా.

ఎర్రగా కందిపోయిన ముఖంతో శేఖర్ మాత్రం చాలా కూల్ గా "చూసేరా, ఎలా అరుస్తుందో, ఇది రాజీకి రాదని వచ్చేటపుడే చెప్పేను మీ అందరికీ " అన్నాడు వాళ్ళ వాళ్ళ ముందు అమాయకత్వం నటిస్తూ.

శేఖర్ తల్లి, పిన్ని ఒక్కసారిగా విరుచుకు పడ్డారు.

"ఏవిటే పోన్లే కదా అని సంధికి వస్తే రెచ్చిపోతున్నావేంటి? మా వాడు మంచి వాడు కాబట్టి బాబు గురించి ఆలోచించి సంధికి వచ్చేడు. అదే ఇంకెవడన్నా అయితే..." అని మొదలుపెట్టేరు.

“బాబు గురించి ఆలోచించే వాడే అయితే ఇల్లొదిలి రోడ్డున నన్నూ, బాబునీ వొదిలి ఎందుకు వెళ్లిపోయేడు? బాబు గురించి ఆలోచించే వాడే అయితే ఎవత్తె తోనో ఎందుకు కలిసి ఉంటున్నాడు? ఇదిగో అతను ఇచ్చిన విడాకులు నోటీసు” విసురుగా పక్కనే ఉన్న టేబులు సొరుగు లాగి టేబుల్ మీద కాగితాన్ని గిరాటు వేసింది.

“ఇప్పుడు చెప్తున్నాను వినండి. మీ వాడు నాకు విడాకులు ఇవ్వడం కాదు, నేనే ఇతనికి విడాకులిస్తున్నాను.

అంతా కలిసి ఏ గంగలో దూకుతారో దూకండి. అంతే కాదు కట్నంగా మా వాళ్ళిచ్చిన సొమ్ము మర్యాదగా వెనక్కి తిరిగివ్వండి. బాబుని చూడడానిక్కూడా వీల్లేదు.” అంది గట్టిగా బాబు చెయ్యి పట్టుకుని గుంజి లోపలికి తీసుకు వెళ్తూ.

తల్లి రౌద్రాన్ని చూసి బెంబేలెత్తో, భుజం నొప్పి పుట్టో, గట్టిగా ఏడుపు లంకించుకున్నాడు వాడు. వాళ్ళ చెంప వాయగొట్టలేక, గట్టిగా వాణ్ణి వీపు మీద బాది లోపలికి ఈడ్చుకు వెళ్లింది. ఒక్క ఉదుటున లోపలి గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంది. బెంబేలుగా చూస్తూ ఏడుస్తున్న బాబుని దగ్గరకు తీసుకుని గట్టిగా పట్టుకుని గుండెలవిసేలా దు:ఖించసాగింది. భయంతో ముడుచుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్న తల్లి వైపు వెక్కుతూ చూడసాగేడు బాబు.

35

తిరిగి విశాఖపట్నానికి వస్తున్న తన్మయికి శేఖర్ తల్లి దేవి మాటలు చెవుల్లో మారుమ్రోగ సాగేయి.

"ఆడు మగాడే. ఎంత మందితోనైనా తిరుగుతాడు. ఎంత మందితోనైనా కలిసుంటాడు. ఆడదానివి నువ్వు మొగుడేం చెప్తే అది విని పడి ఉండాల్సిందే. కాదూ కూడదని నువ్వు ఊరేగుతానంటే నా కొడుకు గాజులు తొడుక్కుని ఊరికే కూచోలేదు. ఈ పిల్లోడికి తండ్రి వాడు. వాడి మీద హక్కులన్నీ మాకే ఉన్నాయి. మా మనవడు వాడు. వాణ్ణి నీకు ఎట్టి పరిస్థితుల్లోనూ దక్కనివ్వను. గుర్తుంచుకో."

తన్మయి గుండెల్లో కొత్త బెదురు, భయం మొదలయ్యింది. కలిసి ఉన్నంతసేపూ దుర్భర జీవితాన్ని చవి చూసింది. అతనికి దూరంగా, ఏదో తన మానాన తాను బతుకుని చక్క దిద్దుకుంటుంటే మళ్లీ ఈ ఉపద్రవాలేంటి? ఈ బెదిరింపులేవిటి?

"ఆవిడ అన్నవన్నీ నిజం కాకూడదు. ఎప్పటికీ నిజం కాకూడదు. లేదు, అలా జరగడానికి వీలు లేదు." మనసు ప్రార్థిస్తూ ఉంది.

తెల్లారగట్ల బస్సు కిటికీ లోంచి అతి చల్లని గాలి ముఖానికి తగుల్తూన్నా తన్మయికి ధారాపాతంగా చెమట్లు పట్టసాగేయి.

ముందు వెంటనే లాయర్ ని కనుక్కోవాలి.

"బాబు నించి ఎప్పటికీ దూరం కావడం" అనే ఆలోచనకే కడుపులో నుంచి మెలితిప్పినట్లు బాధ కలగసాగింది.

“భార్యా భర్తలు విడాకులు తీసుకున్నపుడు పిల్లలు ఏమవుతారో అనేది ఊహకు కూడా అందకుండా, ఏ విషయాలూ తెలుసుకోకుండా పెరిగిన సామాన్యురాలు తను. అసలు ఇవన్నీ తెలుసుకోవాల్సివస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.”

ఆలోచనలకు అంతూ పొంతూ కనబడడం లేదు.

బస్సు వేగాన్ని అందుకోలేక కిటికీ బయట వెనకబడుతున్న దృశ్యాలను కలుపుతూ, విడదీస్తూ కొనసాగుతున్న గతపు చిత్రాలు ఏవేవో తన్మయి తలలో గింగిరాలు కొడుతున్నాయి.

"అసలే తప్పనిసరి పరిస్థితుల్లో బాబుని తిరిగి తల్లిదండ్రుల దగ్గరే వదిలేసి వచ్చింది.

వాడు నిద్ర లేస్తే ఏడుస్తాడని తెల్లారగట్లే బస్సెక్కింది. పాపం లేవగానే ఎంత బెంగ పడ్తాడో ఏమో!"

గొంతులోకి గరగరమంటూ దు:ఖం తన్నుకు వచ్చింది తన్మయికి. తన్మయి బలమూ, బలహీనతా ఈ పసివాడే.

వాడిని చూడగానే, హత్తుకోగానే జీవితాన్ని వాడి కోసమే గెలిచి తీరాలన్న గొప్ప పట్టుదల కలుగుతుంది. అడుగడుగునా సవాళ్ళే ఎదురవుతున్న జీవనంలో ఎక్కడా వాణ్ణి ఒక్క క్షణం వదిలి ఉండలేని బాధ, దుఃఖం.

ఎన్నో కలలతో, ఆశలతో, నిరంతరం శ్రమతో, పట్టుదలతో గెల్చుకున్న జె ఆర్.ఎఫ్ వల్ల మంచి స్కాలర్ షిప్పుతో పీ.ఎచ్.డీ చేసే అవకాశం వచ్చింది. హాస్టల్లో పిల్లాడితో కలిసుండకూడదనే నిబంధన వల్ల మళ్లీ బాబుని దూరం పెట్టాల్సి వస్తూంది. బయటెక్కడైనా ఇల్లు చూసుకోవాలంటే ధైర్యం

చిక్కబట్టుకోవడమే కాదు. కాస్త నిలదొక్కుకోవాలి కూడా. ఇంటికి అద్వాన్సు ఇవ్వాలన్నా, ఎక్కడయినా స్కూలులో బాబుని చేర్పించాలన్నా తగినన్ని డబ్బులు లేవు. అసలు స్కాలర్ షిప్పు చేతికి వస్తూ రెణ్ణెల్లు గడిస్తే గానీ ఏవీ చెయ్యలేని పరిస్థితి. కొన్నాళ్లు ఓపిక పట్టాలి తప్పదు.

కిటికీ లో నుంచి బయటికి చూస్తూ కళ్ళు తుడుచుకుంది తన్మయి.

వివేకానందా పాఠశాలలో కిండర్ గార్టెన్ కి వెళ్తూనే అన్ని అక్షరాలూ నేర్చేసుకున్న చురుకైన వాడు బాబు. ఇప్పటి వరకు చక్కగా చదువుతున్న పిల్లాణ్ణి ఇలా అర్థాంతరంగా మళ్లీ మానిపించాల్సి వచ్చింది.

"అందాకా వీధి చివర ఎవరో అమ్మాయి ప్రైవేటు చెప్తూంది, ఊరికే కాస్సేపు పంపుదాంలే" అంది తల్లి వచ్చేటపుడు. గట్టిగా నిట్టూర్చింది తన్మయి.

★★★

హాస్టలుకి వస్తూనే తనతో తెచ్చుకున్న కాసిన్ని బట్టలు, పుస్తకాలు గదిలో ఒక మూలగా ఉన్న చిన్న అలమారా లో సర్దుకుంది. టేబుల్ మీద బాబు ఫోటో పెట్టింది. చిన్న అద్దం తీసి కిటికీ ఊచల మీద తగిలించింది. మంచమ్మీద దుప్పటి పరిచి నడుం వాల్చగానే ఒళ్ళు తెలియకుండా నిద్ర పట్టేసింది. మేరీ తట్టి లేపేంత వరకూ బయట చీకటి పడిందని కూడా తెలియలేదు తన్మయికి.

"బాగా అలిసిపోయేవా?" అంది మేరీ.

తనను మేరీ అలా ఏక వచనంలో సంబోధించడం తన్మయికి ఎంతో నచ్చింది. పైగా తన గొంతులో ఉట్టి పడ్తున్న ఆప్యాయతకి కలిగిన సంతోషంతో చిన్న చిరునవ్వుతో తలూపింది తన్మయి.

భోజనాల వేళ అయ్యింది. "రా, డైనింగు హాలుకి వెళ్దాం" అంది మేరీ.

బయటికి రాగానే రాత్రి పూట ఆ భవంతి లో అక్కడక్కడా వెలుగుతున్న చిన్నలైట్ల వల్లనో ఏమో భవంతి చుట్టూ ఉన్న కీచురాళ్ల రొద జీబురుమని వినిపించసాగింది. అన్ని గదులకి చివరన ఎత్తున ఉన్న డైనింగు హాలులో అడుగు పెట్టగానే అదేదో పిల్లుల దీర్ఘ నివాసంలా దుర్గంధం వచ్చింది. చప్పున చీర చెంగుతో ముక్కు మూసుకుంది తన్మయి. పెద్ద గది మధ్య పొడవైన పెద్ద చెక్క భోజనాల బల్ల, అటూ ఇటూ కూచునేందుకు పొట్టి బల్లలు. భోజనాల బల్ల నల్లగా చివికిపోయి, మురికి పట్టి, మాసికలు పడి ఉంది. తమని చూస్తూనే బల్ల మీద ఒక వారగా ముడుచుకుని పడుకున్న పిల్లులు రెండు చటుక్కున మెట్ల మీంచి దూకి చీకట్లోకి మాయమయ్యేయి.

ఒక మూల కూచున్న వయసు మీద పడ్డట్లున్న ఆడామె తమని చూసి లేచి వచ్చింది.

"కొత్త అమ్మాయా?" అంది మేరీతో.

"అవును" అని ఆవిడతో అని, తన్మయీ, "కొండమ్మ" అని పరిచయం చేసింది మేరీ.

పలకరింపుగా నవ్వింది తన్మయి. హాలులో ఒక పక్కగా సత్తులు పడిన పొడవాటి అల్యూమినియం గిన్నెల కారియర్లు పెద్దవి రెండు ఉన్నాయి.

ఆ పక్కనే నీళ్ల కుండ, కాసిన్ని స్టీలు గ్లాసులు, పళ్లేలు. తమతో తెచ్చుకున్న గ్లాసుల్ని టేబుల్ మీద పెట్టేరు మేరీ, తన్మయి.

"రండమ్మా" అంది కొండమ్మ ముందుకు దారి తీసి.

అప్పటికే టేబులు మీద సర్ది ఉన్న నాలుగైదు పళ్ళేలలో రెండిటి మూతలు తీసి, నిశ్శబ్దంగా మంచినీళ్లు గ్లాసుల్లో పోసింది. ఆ హాలులో వాసనకి కడుపులో తిప్ప సాగింది తన్మయికి. ఉదయం నించీ ఏవీ సరిగా తినక పోయినా ఆకలి వెయ్యనట్లు అనిపించసాగింది. తెలారగట్ల ప్రయాణం చెయ్యడం వల్లనే కాక, దారి పొడవునా తల పగిలిపోయే ఆలోచనల వల్ల మన్ససంతా బాధ అలుముకుంది. తప్పని సరిగా తినక తప్పదన్నట్లు పళ్లెంలో చెయ్యి పెట్టింది. చల్లని అన్నం, రుచీ పచీ లేని కూర, ఉప్పు లేని పచ్చడి, నీళ్ల లాంటి పప్పు, పుల్లని మజ్జిగ. తన్మయికి అసలు ఒక్క ముద్ద కూడా లోపలికి పోవడం లేదు. మేరీ మాత్రం అలవాటు పడిపోయినట్లు అతి మామూలుగా తినసాగింది.

తన భోజనం పూర్తి కావస్తూన్నా తన్మయి పళ్లెం లో అన్నం కొంచెం కూడా కదలక పోవడం చూసి

"ఏమైంది తన్మయీ, రేపట్నించి రూముకే తెప్పించుకుందామా?" అంది మేరీ.

తన్మయి ఆశ్చర్యంగా చూసింది. ఈ హాస్టల్లో ఈ సౌకర్యం కూడా ఉందా?

★★★

మర్నాడు మధ్యాహ్నం తలుపు దగ్గిర చప్పుడైతే "రండి" అంది తన్మయి చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి.

"అమ్మా, మేరమ్మగారు మీ భోజనం గదికి తెచ్చి ఇమ్మన్నారమ్మా" అంది కొండమ్మ.

"మరి మేరీ భోజనం?" అంది పళ్లెం అందుకుంటూ తన్మయి.

"అమ్మ గారు రేత్రి ఒకటే పూట ఆస్టల్లో తింటారమ్మా. మీకు ఒప్పుడేం కావాలన్నా పిలవండి. అదుగో ఆ మూలన సిన్న గది నాదేనమ్మా." అంది కొండమ్మ.

సన్నగా పూచిక పుల్లలా ఉండి, వయసు మీద పడిన మీదట భుజాలు వొంచి నడుస్తూంది కొండమ్మ.

"పాపం తను గది గదికీ తిరిగి భోజనం అందివ్వడం ఏవిటి?" అనిపించి "ఫరవాలేదులే. నేనే వచ్చి తెచ్చుకుంటాను." అంది తన్మయి వెళ్తున్న కొండమ్మకి వినిపించేలా.

"పర్లేదమ్మా. ఇది నాకు అలవాటే. సివాచలం ఉన్నాడుగా సాయం సేత్తానికి. రెండ్రోలు ఆళ్ల ఊరెళ్ళేడు ఎల్లుండి వచ్చేత్తాడు." అంది.

కొండమ్మ ని చూస్తుంటే తన్మయికి అమ్మమ్మ నరసమ్మ జ్ఞాపకం వచ్చింది.

"అదే యాసలో మాట్లాడేది అమ్మమ్మ. ఇప్పుడు తను లేకపోవడమే మంచిదయ్యింది. లేకపోతే తన కష్టాలు చూడలేక తండ్రిలా తను కూడా మంచాన పడేది." పెద్దగా నిట్టూర్చింది తన్మయి.

మరో అరగంటలో మేరీ వచ్చింది. వస్తూనే గదిలోని కుండలో నీళ్లు తీసుకుని గడగడా తాగుతూ "అబ్బో, ఇవేళ ఎండ చాలా ఎక్కువగా ఉంది" అంది.

తన్మయి పుస్తకం పక్కన పెట్టి "భోజనం చేసేవా మేరీ?" అంది.

బదులుగా మూత పెట్టి ఉన్న పళ్లెం వైపు చూస్తూ "అదేవిటి, నువ్వు భోజనం చెయ్యలేదా?" అంది మేరీ.

"ఉహూ. తినాలని అనిపించడం లేదు. నువ్వింకా చేసి ఉండకపోతే, చెరి సగం తిందాం. ఇంత అన్నం నేనొక్కదాన్నీ తినలేను." అంది తన్మయి.

"ఫర్వాలేదులే నువ్వు తిను. నేను మధ్యాహ్నం భోజనం చెయ్యను." అంది మేరీ.

"ఏవిటి డైటింగా?" అంది నవ్వుతూ తన్మయి.

"లేదు తన్మయీ. నాకు వచ్చే 'లో ఇన్ కమ్ స్కాలర్ షిప్పు' రెండు పూటలా తినడానికి చాలదు. మరీ బాగా ఆకలేస్తే కాస్త అన్నం స్టవ్వు మీద వండుకుంటాను. లేదా ఏ బిస్కట్లో తింటాను." అంది.

తన్మయికి ఒక్కసారిగా మనసంతా బాధ కలిగింది.

చప్పున దగ్గరికి వెళ్లి, "నేను తీసుకునే భోజనం మనిద్దరికీ సరిపోతుంది మేరీ. ఇక మీదట రాత్రి పూట కూడా నువ్వు కొనుక్కోనవసరం లేదు. దా, ఇద్దరం తిందాం." అంది తన్మయి.

ఇంకా మేరీ కదలక పోయే సరికి "నువ్వు తినకపోతే నేనూ తినను మరి" అంది బుంగమూతి పెడుతూ.

నవ్వుతూ వచ్చి పళ్లెం దగ్గర కూచుని "ఆ ప్రభువు నా కోసమే నిన్ను ఇక్కడికి పంపేడు. ఇది నా అదృష్టం." అంది మేరీ.

★★★

మర్నాడు ఉదయం డిపార్టుమెంటుకి వెళ్లడానికి సిద్ధం కాసాగింది తన్మయి. పెట్టె లో నుంచి తనకి ఇష్టమైన తెల్లని బెంగాల్ కాటన్ చీర తీసింది. చిన్న ముదురు ఊదా రంగు అంచుతో హుందాగా ఉంటుందా చీర. తెల్లచీర పైకి తీయగానే వివేకానందా పాఠాశాల, వెనువెంటనే మురళి, వెంకట్ జ్ఞాపకం వచ్చారు.

"ఎలా ఉన్నారో ఏవిటో, ఒక ఉత్తరమైనా రాయాలి" అనుకుంది.

పక్కనే రెండో కిటికీ ఊచలమీది చిన్న అద్దంలో చూసుకుంటూ తయారవుతున్న మేరీ "ఎవరికి ఉత్తరం రాయాలి?" అంది.

తన్మయి "తనలో తను అనుకున్నాను" అని అనుకుంది కానీ, పైకి అన్నదన్న సత్యాన్ని అప్పుడు గ్రహించింది.

"ఊహూ" అని తల అడ్డంగా ఆడించి, అదో పెద్ద కథ సాయంత్రం చెప్తాను. అంది తన్మయి.

"సాయంత్రం వరకూ ఎందుకు, నడిచి వెళ్దాం యూనివర్శిటీకి. ఎంచక్కా కబుర్లు చెప్పుకుంటూ వెళ్లొచ్చు. మా సోషియాలజీ డిపార్టుమెంటు మీ పక్కనేగా." అంటూ

నుదుటిన బొట్టు దిద్దుకుంటూన్న తన్మయి వైపే చూస్తూ "నా దిష్టే తగిలేలా ఉన్నావు." అంది చిరునవ్వు నవ్వుతూ మేరీ.

బయట చిరు వెచ్చగా ఉంది ఉదయం. హాస్టలుకి ఎదురుగా బాట పక్కన నడిచే దారి మీదికి కట్టిన చిన్న వినాయకుడి గుడి దగ్గర అటూ, ఇటూ నడిచే వాళ్లు ఆగి బొట్లు, దణ్ణాలు పెట్టుకుంటూ, గుంజీలు తీస్తూ, ఆత్మ ప్రదక్షిణలు చేస్తూ హడావిడి చేస్తున్నారు. ఆ పక్కనే పూల దండలు, కొబ్బరి కాయలు రోడ్డు మీదే గోనెలు పరిచి అమ్ముతున్నారు. హోరున పక్క నించి వాహనాలు దూసుకు వెళ్తున్నాయి. అంత రణగొణ ధ్వనుల్లోనూ మేరీతో కలిసి మాట్లాడుకుంటూ నడుస్తూ ఉంటే హాయిగా అనిపించసాగింది తన్మయికి. వనజ, అనంత గుర్తుకు వచ్చేరు .

"వాళ్లిద్దరూ కలిసి ఒక్కరే అయిన నెచ్చెలి మేరీ. అనంత అప్పుడప్పుడూ తనతోనే ఉన్నా, వనజ, తను ఎప్పుడూ ఒక ఇంట్లో కలిసి లేరు. వనజ తమ ఇంట్లోనే ఉంటే ఎంతో బావుణ్ణని తన్మయి చిన్నప్పుడెప్పుడూ అనుకునేది. అది తీరని కోరికగానే మిగిలిపోయింది. కానీ మేరీ ద్వారా ఇప్పుడా లోటు తీరింది."

తన్మయి చెప్పిన వివేకానందా పాఠశాల గాథ విని, "అబ్బా, నువ్వు చెప్తూంటే నాకు ఒక సారి వెళ్లి చూసి రావాలని అనిపిస్తూంది. ఓ సారెళ్లొద్దామా" అంది మేరీ.

"అవునూ, నా కథలు వినడమేనా? నీ గురించేమైనా చెప్పేదుందా?" అంది తన్మయి.

అడగగానే మేరీ ముఖంలో దిగులు కమ్ముకోవడం చూసి, "నీకిష్టమైతేనే" అంది సందేహంగా తన్మయి.

"ఇందులో ఇష్టం లేకపోవడం ఏవీలేదు తన్మయీ, గుర్తు తెచ్చుకుని బాధ పడడం మానేసి చాలా రోజులయింది. అంతే." అంది.

"అయ్యో సారీ" అంది తన్మయి.

"ఫర్వాలేదు తన్మయీ. నువ్వు సారీ చెప్పనవసరం లేదు. నీతో పంచుకోవడం వల్లనయినా నా బాధ ఉపశమిస్తుందేమో. కారణాంతరాలు ఏవైతేనేం నేనూ నీలాగే మోసపోయాను. అతనితో విడాకుల పర్వంలో పాపని కోర్టు అతనికే ఇచ్చింది. అదొక్కటే నాలో నిరంతరం సలిపే బాధ." అంది.

చివరి మాట చెప్పేటప్పుడు మేరీ గొంతు బొంగురుపోవడం స్పష్టంగా గమనించింది తన్మయి.

నిశ్శబ్దంగా మేరీ చెయ్యి పట్టుకుని నిమిరింది. నిరంతరం మేరీ ప్రార్థనలో మునిగి తేలడం వెనుక కారణభూతమైన విషాదం ఇదన్న మాట . ఒక్కసారిగా కాళ్లలో సత్తువ పోయినట్లైయింది తన్మయికి.

"పిల్లల మీద తల్లికి హక్కులు లేవా?" మళ్లీ బాధ మొదలయింది.

మేరీని వివరాలు అడిగి మరింత బాధ పెట్టడం ఇష్టం లేదు తన్మయికి.

"మధ్యాహ్నం లాయరు విశ్వతో అప్పాయింటుమెంటు ఉంది. కాస్త ఓపిక పడితే అన్ని వివరాలూ తెలుస్తాయి. అయినా తనని, బాబుని ఎవరూ విడదీయలేరు" అని తనకి తను ధైర్యం చెప్పుకుంది.

--------

డిపార్టుమెంటులో స్కాలర్సు రిజిస్టరులో మొదటి సంతకం చేసింది తన్మయి. సంతకం చేస్తుంటే కన్నీటి పొర కమ్మి, రూళ్ళ పుస్తకంలో గీతలన్నీ అలుక్కుపోయినట్లు కనిపించసాగేయి.

తన పేరు పక్కన "డాక్టర్" అని కనిపించబోయే చిర కాలపు ఆశయానికి తొలి సంతకం అది.

చప్పున మేరీ మాటలు గుర్తుకొచ్చాయి.

"గత అయిదారేళ్లుగా రీసెర్చి స్కాలర్ గా ఇదే హాస్టల్లో ఉంటున్నాను. నా పరిశోధన ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. మంచి గైడు లేకపోతే ఇదే ఇబ్బంది."

"పరిశోధనాంశం ఏవిటో, గైడుగా అభ్యర్థన ఎవరికి పంపాలో ఏవీ ఇంకా తెలియదు తనకి." అని ఆలోచనలో పడింది తన్మయి.

నిజానికి తన్మయి జె. ఆర్. ఎఫ్ కి సెలక్టు అయింది కాబట్టి తెలివైన విద్యార్థిని అని డిపార్టు మెంటులో అందరికీ అర్థం అయింది. తన్మయి ఆరోజు ఏ ప్రొఫెసర్ని కలిసినా, ఎవరికి వారు తమ దగ్గరే చేరమని ప్రతిపాదనలు చేసేరు. ఎమ్మే తెలుగు చదివి ఏం సాధిస్తారన్న ప్రొఫెసరు కూడా తనకి ప్రతిపాదన చేయడం చాలా హాస్యాస్పదంగా అనిపించింది తన్మయికి. ఎవరి దగ్గర చేరినా మరొకరికి కోపం వస్తుందన్న విషయమూ గ్రహించింది. డిపార్టుమెంటులో ప్రత్యేక గౌరవాదరాభిమానాల వల్ల చిక్కులు కూడా ఉంటాయని అప్పుడు అర్థం అయింది తన్మయికి. తన కాలేజీ జీవితంలో వెన్ను తట్టి ప్రోత్సహించిన హెడ్డు చిదంబరం గారి దగ్గరే చేరాలని తన్మయి ఆకాంక్ష. అదే చెప్పింది ఆయనతో.

"శుభం భూయాత్, నిన్ను చూసి గర్వ పడే వాళ్లలో మొదటి వాణ్ణి నేను. సంతోషంగా చేరమ్మా." అన్నారు చిదంబరం గారు.

అన్నీ అనుకున్నట్టు సజావుగా జరిగేయి ఆ రోజు. బయటకు రాగానే మనసుకి హాయిగా అనిపించింది. డిపార్టుమెంటు బయట బెంచీ దగ్గరకు వచ్చి కూచుంది తన్మయి. ఎమ్మే రెండు సంవత్సరాలూ చదువుకి అడ్డం తగిలిన అనేకానేక గడ్డు రోజులు, తనకి అడుగడుగునా అండగా నిలబడ్డ మిత్రులు కరుణ, అనంత, రాజు, దివాకర్ లతో కలిసి గడిపిన క్షణాలు కళ్ల ముందు అప్పుడే జరుగుతున్నట్లు కదలాడేయి. దీర్ఘంగా నిట్టూర్చింది తన్మయి.

"ఇవేళ తను ఇలా జె .ఆర్. ఫ్ కి సెలక్టు అయ్యి, ఇంత సంతోషంగా ఉంటుందని అప్పుడే తనకి తెలిసి ఉంటే ఎంత బావుణ్ణు. బాధలు, దుఃఖాలు, ఆందోళనలు ఉండేవి కావు కదా!" తన ఆలోచనలకి తనకే నవ్వు వచ్చింది.

"ఏవిటి మీలో మీరే నవ్వుకుంటున్నారు!" ఎక్కడో పరిచయమైనట్లున్న గొంతుకి చప్పున తలతిప్పి చూసింది తన్మయి.

చూడగానే గుర్తు పట్టింది అతన్ని. తనతో ఎం.పీ.సీ గ్రూపుతో ఇంటర్మీడియెట్ చదివిన తన క్లాస్ మేట్. ముఖంలో మీసాలు తప్ప ఏవీ తేడా లేదు.

"మీరు ప్రభు కదూ!" అంది.

"బానే గుర్తు పట్టారు. మిమ్మల్ని నేను గుర్తుపట్టినట్లే" అని,

"భలే కనిపించారు ఇన్నాళ్లకి. మీరేవిటి ఇక్కడ?" అన్నాడు.

"ఆ ప్రశ్న నేనడగాలి, మీరేవిటి మా యూనివర్సిటీ లో, మా డిపార్టుమెంటు దగ్గర" అంది తన్మయి చిన్నగా నవ్వుతూ.

"నేనూ మీ యూనివర్సిటీ లోనే మొన్నే ఎమ్. సి. ఏ పూర్తి చేసానండీ. హైదరాబాదులో ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. మీ డిపార్టుమెంటుకి మిత్రునితో చుట్టపు చూపుగా వచ్చేను." అన్నాడు బదులుగా నవ్వుతూ.

కుశల ప్రశ్నలయ్యేక, "అలా నడుస్తూ , కేంటీన్ లో కాస్త కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం రండి." అంది తన్మయి.

"మొత్తానికి మీరు చిన్నప్పటి నించి అనుకున్నది సాధించేరన్న మాట. మీ పరిశోధన విజయవంతం కావాలని ఆశిస్తున్నాను" అన్నాడు ప్రభు.

కాఫీ కప్పులు తెచ్చుకుని బయట బెంచీ దగ్గరికి రాగానే మిత్రులతో కలిసి జె. ఆర్. ఎఫ్ కి చదువుకున్న చెట్టు కింద కరుణ కనిపించేడు.

అతని కళ్లలో స్పష్టంగా అసూయా, ద్వేషాలు రగులుతూ కనబడ్డాయి.

తన్మయి చప్పున మొహం తిప్పుకుంది.

"ఏమైంది!" అన్నాడు ప్రభు మ్లానమైన తన్మయి ముఖం వైపు చూస్తూ.

బదులుగా "ఏవీ లేదన్నట్లు" తల అడ్డంగా ఆడించింది.

తిరిగి డిపార్టుమెంటుకి వస్తూనే "అడుగో మా వాడు వస్తున్నాడు. అన్నట్లు మిమ్మల్ని మళ్లీ కలవాలంటే..." సాలోచనగా అన్నాడు.

"నా కేరాఫ్ ఇదే. మరో ఐదేళ్లు ఇదే డిపార్టుమెంటు లో ఉంటాను" అంది సెలవు తీసుకుంటూ తన్మయి.

---------

లాయరు విశ్వ ఆఫీసు నించి బయటకు వచ్చే సరికి భోజనాల వేళ దాటిపోయినా ఆకలి వెయ్యడం లేదు తన్మయికి. మనసులో బాగా అస్థిమితం అలుముకుంది. లాయరు మాటలు చెవిలో గింగుర్లు కొడుతున్నాయి.

"చట్టం ప్రకారం పిల్లలకి తండ్రి సహజ సంరక్షకుడు. అయిదేళ్లలోపు పిల్లలు మాత్రం తల్లి సంరక్షణలో ఉండచ్చు. అయిదేళ్లు నిండిన పిల్లలు తండ్రికే చెందుతారు. అయితే తొమ్మిదేళ్లు నిండిన తర్వాత పిల్లలకి తమ సంరక్షకుల్ని స్వయంగా ఎంచుకునే హక్కు ఉంటుంది."

“అసలు ఇదెక్కడి న్యాయం?! తండ్రి సహజ సంరక్షకుడా? మరి కడుపున మోసిన తల్లి?

అయిదేళ్ల వయసయినా, పదేళ్ల వయసయినా పిల్లలకి తల్లి ఎంతో అవసరం. తండ్రి ఒక్కడూ పెంచగలడా? తప్పకుండా అతని రెండో భార్య చేతుల్లో పెరగాల్సి వస్తుంది. అయినా అయిదేళ్లు నిండిన పిల్లలు తండ్రి దగ్గిర నాలుగేళ్లు పెరిగేక, తల్లిని కావాలనుకుని వస్తారా?”

సమాధానాలు లేని ప్రశ్నలతో తలపోటు ప్రారంభమైయింది తన్మయికి. బాబు దూరం అవుతాడేమో అన్న ఆందోళనకి కడుపులో దేవడం మొదలు పెట్టింది.

36

మర్నాడు సాయంత్రం తన్మయి హాస్టలుకి వచ్చేసరికి, మేరీ గది శుభ్రం చేస్తూ కనిపించింది. గది పరిశుభ్రంగా మెరుస్తున్నా మరింత అందంగా ఉంచుతుంది మేరీ. తన టేబుల్ మీద ఖాళీ హార్లిక్సు సీసాలో రంగు కలిపిన నీళ్లు, అందులో ఆవరణలోని పసుపు పూల చెట్టు కొమ్మలని చూస్తూనే మేరీ దగ్గరికి వెళ్లి ఆత్మీయంగా కౌగలించుకుంది తన్మయి.

"పొద్దున్న ఎప్పుడు తిన్నావో ఏమో, కాస్త టీ తాగుతావా?" అంది మేరీ ఆప్యాయంగా.

పాలపొడి లో వేడి నీళ్లు వేసి క్షణాలలో చిక్కని పాలు తయారు చేసి, అందులో టీ డికాషను కలిపి మేరీ చేసే టీ అంటే తన్మయికి చాలా ఇష్టం. ఇద్దరూ టీ కప్పులతో కిటికీ దగ్గిరికి కుర్చీలు జరుపుకుని కూర్చున్నారు. గది కిటికీ లో నుంచి వెనక ఎత్తుగా ఉన్న చిన్న గుట్ట మీదికి ఏపుగా పెరిగిన గడ్డి మీద సాయంత్రపు కిరణాలు ప్రతిఫలిస్తున్నాయి. లేత గాలికి గడ్డి చివర్లు మంద్రంగా సంధ్యా సంగీతమేదో వినిపిస్తున్నట్లు మెల్లగా ఊగుతున్నాయి. రోజూ వాళ్లిద్దరికీ ఎన్ని కబుర్లు చెప్పుకున్నా ఎప్పటికీ తనివితీరనట్లే ఉంటుంది. తన్మయి హుషారుగా పొద్దుటి విశేషాలు చెప్తూండగా ఫోను వచ్చిందని అటెండరు సింహాచలం గుమ్మం దగ్గరికి వచ్చి చెప్పేడు. అంతకు ముందు రోజే జ్యోతి ఫోను చేసింది.

“బాబుతో తను తనివితీరా కబుర్లు చెప్పింది. అమ్మ మళ్లీ ఎందుకు ఫోను చేసుంటుంది?" ఆలోచిస్తూ ముందు హాలులోకి నడిచింది తన్మయి.

అట్నించి లాయరు విశ్వ.

“"ఏమయ్యిందండి?"కంగారు పడింది తన్మయి.

"కంగారుపడకండి. మంచి వార్తే, మనం కేసు గెలవబోతున్నాం. అతను విడాకుల కేసుని ఉపసంహరించుకుంటున్నాడని అతని లాయరు చెప్పేడు. అంతే కాదు మీ మీద అతను మోపిన అభియోగాలన్నీ అబద్ధాలని ఒప్పుకుంటున్నాడు" అన్నాడు.

తన్మయి "అతను కేసు ఉపసంహరించుకుంటున్నాడంటే అర్థం, నేను అతనితో సంధికి ఒప్పుకుంటున్నాననా?" అంది చిరు చికాగ్గా.

"అతనితో మీరు సంధికి ఒప్పుకోవడం, ఒప్పుకోవకపోవడం పూర్తిగా మీ వ్యక్తిగత నిర్ణయం. మీకు అతనితో విడాకులు పొందే మార్గం ఇంకా సులువవుతుంది ఇప్పుడు" అన్నాడు.

తన్మయి, "నాకు అర్థం కాలేదు విశ్వ గారూ" అంది.

"అతను కేసుని ఉపసంహరించుకున్నా, అతని మీద మీరు తిరిగి విడాకుల కేసు పెట్టొచ్చు. మిమ్మల్ని అతను పెట్టిన హింస అంతా, ఇంతా కాదని ఇప్పటికే ఫైలులో ఉంది కాబట్టి కోర్టు మీకు వెంటనే విడాకులు మంజూరు చేస్తుంది." అన్నాడు.

"మరి బాబు...!" అంది సందేహంగా తన్మయి.

"బాబుకి ఇంకా అయిదేళ్లు నిండలేదు కాబట్టి సంరక్షణ మీకే వస్తుంది. తర్వాతెప్పుడైనా ఒకవేళ అతను సంరక్షణ తీసుకోదల్చుకుంటే అతను మళ్లీ కోర్టులో అప్పీలు చేసుకోవాల్సి వస్తుంది. అయినా మీరు ధైర్యంగా ఉండండి. కట్టిన తాళితో సహా తిరిగి ఇవ్వమని అడిగిన ఇటువంటి దౌర్భాగ్యుడిని నేను నా ప్రాక్టీసులో ఇంత వరకు చూడలేదు. అంత వరకూ వస్తే బాబుని దక్కించుకోవడానికి మీకు తప్పకుండా సహాయం చేసి పెడతాను. అంతే కాదు మీ వాళ్లు కట్నంగా ఇచ్చిన సొమ్ము తో సహా అన్నీ ముక్కు పిండి వసూలు చేద్దాం" అన్నాడు.

"చాలా థాంక్సండి, నేను తిరిగి కేసు ఫైలు చేస్తాను. రేపే వస్తాను మీ ఆఫీసుకి" అంది దృఢంగా తన్మయి.

గదికి తిరిగి రాగానే దీర్ఘాలోచనలన్నీ చెదిరి, తుఫాను వచ్చి తగ్గిన తర్వాత ప్రశాంత వాతావరణంలా తేలికగా అనిపించింది తన్మయికి.

"ఇప్పటికైనా నిర్ణయం తీసుకుని చాలా మంచి పని చేస్తున్నావు తన్మయీ. నీకేం తక్కువ? చక్కగా మంచి స్కాలర్ షిప్పుతో పీ.హెచ్ డీ కి సెలక్టు అయ్యావు. నీ కాళ్లమీద నువ్వు నిలదొక్కుకోగలిగావు. ఇక ఏవీ ఆలోచించకుండా హాయిగా ప్రశాంతంగా నిద్రపోవచ్చు నువ్వు. బాబు గురించి కూడా దిగులు పడకు. వచ్చే ఏడాది ఏమవుతుందో అన్న ఆందోళనతో ఇప్పటి జీవితాన్ని అప్రశాంతంగా మార్చుకోకు. అన్నీ అవే చక్కబడతాయి." అంది మేరీ తన్మయి భుజం తడుతూ.

మేరీ దగ్గర అదే తనకు నచ్చుతుంది. గత అయిదేళ్లుగా ఒంటరిగా జీవిస్తూన్నా, అధైర్యం మచ్చుకి కూడా కనిపించదు. పైగా గొప్ప ఆత్మస్థ్యైర్యంతో  తన వెన్ను తడుతుంది. అసలు మేరీని చూస్తేనే ఒకానొక ధైర్యం, ఓదార్పు  కలుగుతాయి తన్మయికి. నిరంతర ప్రార్థన వల్ల కలిగిన గొప్ప ప్రశాంత తేజస్సు మేరీ ముఖంలో తాండవిస్తూ ఉంటుంది.

తన్మయికి ఆ క్షణాన సముద్ర తీరాన ఉన్న "ధ్యాన మందిరం" జ్ఞాపకం వచ్చింది.

ఎమ్మే చదువుతున్నపుడు మిత్రులంతా కలిసి ఋషికొండ తీరానికి విహార యాత్రకు వెళ్లినపుడు దారిలో బస్సు చెడిపోయి అంతా నడక మొదలు పెట్టేరు. కాస్సేపటిలోనే త్రోవ పక్కనే పెద్ద మందిరం విశేషంగా కనిపించింది. అదే మొదటిసారి తన్మయి ఆ ధ్యాన మందిరాన్ని చూసింది.

అర్థ గోళాకారంలో ఉన్న పెద్ద హాలు అది. విశాలంగా ఖాళీగా ఉన్న ఆ హాలులో ఈనె చాపలు పరిచి ఉన్నాయి. "నిశ్శబ్దం" అన్న పదం రాసి ఉంది స్తంభాల మీద. అక్కడంతా నిశ్శబ్దం. ఒట్టి నిశ్శబ్దం. కేవలం సాగర కెరటాల హోరు తప్ప ఏవీ వినిపించని నిశ్శబ్దం. అక్కడ కూచుని తనలోకి తను తరచి చూసుకున్న  కాసేపూ తన్మయికి జీవితం దాపున, నిరంతరం లోలోపల సలుపుతున్న గాయాల మీద గొప్ప లేపనమేదో పూసినట్లయ్యింది. కానీ ఎందుకో మళ్లీ ఎప్పుడూ అక్కడికి వెళ్లగలిగే అవకాశం ఇప్పటి వరకూ కలగలేదు. "ఒకసారి వెళ్ళిరావాలి" అనుకుంది.

ప్రతీ రోజూ రాత్రి భోజనం కాగానే మేరీ తన ప్రార్థన లోకి వెళ్లిపోతుంది. చిన్నగా వెలుగుతున్న టేబుల్ లాంపు ముందు కూచుని లైబ్రరీ నుంచి తెచ్చుకున్న పుస్తకాలు  చదువుకుంటూన్నపుడు తన్మయికి అదే ప్రశాంతత కలుగుతూంది. ఇప్పుడు పరీక్షలేవీ లేవు. అయినా పుస్తకాలే తన్మయికి ప్రపంచమయ్యాయి.

‘’తన సుఖం మాత్రమే కోరే మనిషి చెడ్డవాడు, ఇతరుల అభిప్రాయమే తనది అని చెప్పేవాడు బలహీనుడు, ఇతరుల సుఖాన్ని కోరే వాడు ఉత్తముడు, అన్నిటా భగవంతుడే అని భావించేవాడు మహా గొప్ప వాడు "  అని టాల్ స్టాయ్

"పని ఆనందమైతే జీవితం సంతోషమవుతుంది! పని, బాధ్యతైతే, జీవితం బానిసత్వమవుతుంది."  అని గోర్కీ

"నీవు ఎంత వెర్రి వాడవు. నీ బరువు నీవే మోయాలని యత్నిస్తున్నావు. భిక్షకుడా! నీ గడప దగ్గర నీవే భిక్షాటన చేస్తున్నావు. అన్ని భారాలూ ఆయనపై వదిలి పెట్టు.ఆయనే అన్నింటినీ భరిస్తాడు. నీవు నిశ్చింతగా వుండు. నీ వాంఛాపరత, మలిన శ్వాసలో నీలోని దీప్తిని ఆర్పివేస్తుంది. ఈ అపవిత్రమైన హస్తాలతో కానుకలను స్వీకరించకు. పవిత్ర ప్రేమతో అందించిన కానుకలనే స్వీకరించు." అని టాగూర్

"సహృదయం అనే వస్తువు ఒకటి వుంది. మీరు దాన్ని ఇంకెక్కడా చూడలేదా" అని శరత్........తడి ఆరని హృదయపు దుఃఖాన్ని సమూలంగా తుడిచి తనకి గొప్ప నిశ్చింతనివ్వడం కోసమే రాసేరేమో!" అనిపించసాగింది తన్మయికి.

మెల్లగా ఒక్కొక్కరి రచనలూ చదువుతున్న కొలదీ జీవితం లో కొత్త కోణాలు అర్థం కావడం మొదలుపెట్టేయి తన్మయికి. ఆ అక్షరాల ప్రవాహంలో కోల్పోయినవెన్నో లభించసాగేయి.

నిరంతర పఠనం ఒంటరి జీవనంలో అద్భుత సహచరుడయ్యింది తన్మయికి.

-------

ఆ ఉదయం హఠాత్తుగా అనంత వచ్చింది హాస్టలుకి. చాలా సంతోషంగా ఉన్న తన ముఖాన్ని చూస్తూనే గుర్తు పట్టింది తన్మయి ఏదో శుభ వార్త అయ్యి ఉంటుందని. గవర్నమెంట్ బి.ఈ.డీ టీచర్ పోస్టులకు అనంత, రాజు సెలక్టు అయ్యేరు.

"చాలా మంచి వార్త చెప్పేవు అనంతా. కంగ్రాట్స్. అనుకున్నట్లుగానే సెలక్టు అయ్యారన్న మాట" అంది తన్మయి.

పరిచయాలయ్యేక "నేను ఇంత వరకు ఎన్నో సార్లు ప్రయత్నించేను. కనీసం సెకండరీ గ్రేడు టీచరు పోస్టులకు కూడా సెలక్టు కాలేదు. మీరిద్దరూ సెలక్టు కావడం చాలా గొప్ప విషయం " అంది మేరీ అభినందిస్తూ.

"అయితే తప్పకుండా నువ్వు ప్రొఫెసర్ వి అవుతావు మేరీ. అందుకే నీకు చిన్న ఉద్యోగాలేవీ రావు." అంది తన్మయి.

"నీ నోటి వాక్యాన అదే జరిగితే, ఈ ప్రపంచం లో నా కంటే అదృష్టవంతురాలు ఉండదు. అవునూ, నువ్వూ రాయకపోయావా తన్మయీ?" అంది మేరీ.

"బి.ఈ.డీ చెయ్యలేదు నేను" దిగులుగా అంది తన్మయి.

అనంత వెంటనే అందుకుని, "తన్మయి ఆశయాలు, లక్ష్యాలు ఉన్నతమైనవి. చూడండి, జే ఆర్ అఫ్ కి సెలక్టు అయ్యి గొప్ప విజయం సాధించింది. త్వరలో గవర్నమెంటు లెక్చరర్ అయినా ఆశ్చర్యపోవలసిన పనిలేదు." అని తన్మయి వైపు తిరిగి " అవునూ గవర్నమెంటు లెక్చరర్ పరీక్ష రిటెన్ టెస్టు రిజల్ట్సు త్వరలో వస్తాయని ప్రకటించేరు. నీ నంబరు ఇవ్వు తన్మయీ." అని వెళ్లబోతూ,

“అన్నట్లు కరుణ కి కూడా టీచరు ఉద్యోగం వచ్చింది." అంది అనంత.

కరుణ ప్రసక్తి రాగానే తన్మయి ముఖంలో కనబడ్డ ఒక అప్రశాంతత ని కనిపెట్టినట్లు మేరీ అనంత వెళ్లగానే "కరుణ ఎవరు?" అంది.

తన్మయి మాటల్లో కరుణ చివరి ప్రతిపాదనని విన్న తర్వాత, "అతనికి చెప్పుతో కొట్టినట్లు సమాధానం చెప్పి మంచి పని చేసేవు తన్మయీ. అతను నీ మిత్రుడు గానే కొనసాగి ఉంటే అతని మనస్సులోని దుర్గార్గపు ఆలోచనలు ఎప్పటికీ బయటపడేవి కావు. ఈ ప్రపంచంలో చాలా దురదృష్టకరమైన విషయం ఏవిటంటే మగవాళ్లతో స్నేహం ఏదో ఒక సందర్భంలో శరీరం వైపు దారితీస్తుంది. స్నేహం స్నేహంగానే కొనసాగడం చాలా అరుదు. బహుశా: అసాధ్యమేమో. ఆడవాళ్లుగా మనకున్న కనీసపు వివేచన, నియమాలూ మగవాళ్లకి సహజంగానే ఉండవనుకుంటా" అంది మేరీ.

"అందరూ అలా ఉండరు మేరీ. వెంకట్, మురళి ల వంటివి ఉత్తములూ ఉన్నారు" అంది సాలోచనగా తన్మయి.

"ఇదే నీలో మెచ్చుకోదగిన విషయం. ఇంత జరిగినా పురుషుల పట్ల ద్వేషం లేదు నీకు. నాకైతే మగవాళ్ళని చూస్తేనే అసహ్యం వేస్తుంది." అంది మేరీ నవ్వుతూ.

"నా కడుపున పుట్టిన వాడూ మగవాడేగా మేరీ! వాణ్ణి స్త్రీలని గౌరవించే మంచి వ్యక్తిగా, ఉత్తముడిగా తీర్చి దిద్దాలి." దృఢంగా అంది తన్మయి.

-------

కోర్టుకి మరుసటి వారమే చివరి వాయిదా అని చెప్పేడు లాయరు విశ్వ. ఆ రోజు ఉదయానే తలారా స్నానం చేసి బయలుదేరింది తన్మయి. ఎంత ప్రశాంతంగా ఉండాలనుకున్నా ఒక విధమైన అలజడేదో పుట్టుకు రాసాగింది. కొంగుని చుట్టూ మరింత గట్టిగా బిగించుకుని కోర్టు బయట తన వంతు కోసం ఎదురు చూస్తూ చెట్టు కింద ఎప్పటిలానే కూచుంది తన్మయి. పక్కనే కూచున్న మరొకావిడ పలకరించింది. చూడగానే పెద్దగా చదువుకోలేదని అర్థం అవుతూ ఉంది. విడాకులు వచ్చి సంవత్సరం దాటినా భర్త నెలనెలా ఇవ్వాల్సిన భరణం చెల్లించకపోవడంతో మళ్లీ కోర్టుని ఆశ్రయించిందావిడ.

"ఇద్దరు పిల్లలతో నానా కస్టాలూ పడతన్నాను. నాతో బాటూ పిల్లల్ని కూడా ఒద్దన్న ఎదవ అసలు ఎందుకు కన్నాడో మరి. కనీసం పిల్లల పోసన కైనా బరణం ఇవ్వని శనిగొట్టు ఎదవ, తాగుబోతు సచ్చినోడు, ముండల ముటాకోరు...." ఆమె మాట్లాడుతూ ఉండగా తన్మయికి పిలుపు వచ్చింది.

"కలిసున్నన్నాళ్ళు ఎముకలు సున్నంలాగా ఇరగదీసేసేడు. సూడమ్మా..." అని కప్పుకున్న కొంగు తీసి వీపు మీద లోతైన గాయాల గుర్తులు చూపించింది ఆమె.

మనస్సులో గాయాల్ని అలా పైకి చూపించలేని నిస్సహాయత తనది. ఆమె దీనగాథ విని మనసంతా వికలం అయ్యింది తన్మయికి. వెళ్లబోతూ ఆమె చేతిలో వందరూపాయల నోటు పెట్టి "వద్దనొద్దు. పిలలకేవైనా కొనిపెట్టు" అంటూ లాయరు వైపు నడిచింది.

అనుకోకుండా అప్పటివరకూ ఉన్న ధైర్యం దాపున దైన్యం అలుముకుంది. కలగాపులగంగా సలుపుతున్న పచ్చిపుండ్ల లాంటి జ్ఞాపకాలు బాధ రేపసాగేయి. తమాయించుకుని లోపలికి అడుగు పెట్టింది.

జడ్జి తన్మయిని అడిగేడు "మీకు విడాకులు మంజూరు చేస్తున్నాం. సమ్మతమేనా?"

తన్మయి "సమ్మతమే" తలూపుతూ సమాధానమిచ్చింది గొంతులోని అలజడి పైకి రానివ్వకుండా నొక్కిపెడుతూ.

"మీకు భరణం కావాలా?" తర్వాతి ప్రశ్న.

శేఖర్ పక్కన అక్కడ నిలబడడానికి కూడా అసహ్యం వేస్తుంది. అతి చిన్న గది కావడం వల్ల తప్పని సరయ్యింది. అతని దయాధర్మం మీద బతకాల్సిన ఖర్మ తనకు లేదు.

అందుకే దృఢంగా "వద్దు, అవసరంలేదు" అంది.

లాయరు ఆశ్చర్యంగా చూసేడు.

"మీకు భరణం అవసరం లేకపోయినా, పిల్లవాడికి మాత్రం భరణం ఇప్పిస్తున్నాం. అతని జీతంలో ఇరవై అయిదవ శాతం, అంటే నెలకు మూడు వందల రూపాయలు. ఇవేళ్టి నించి మీ ఇద్దరికీ ఎటువంటి సంబంధమూ లేదు. వ్యక్తిగత ఆస్తిపాస్తుల మీద కానీ, వ్యక్తిగత విషయాల మీద గానీ ఎటువంటి హక్కులూ లేవు......"జడ్జి చెప్తున్నవేవీ తన్మయి చెవికి ఎక్కడం లేదు.

చేతికి ఇచ్చిన కాగితాల మీద యాంత్రికంగా సంతకం చేసి, బయటకు అడుగుపెట్టింది. శేఖర్ వడివడిగా ముందుగానే బయటకు వెళ్లిపోవడాన్ని కూడా గమనించలేదు తన్మయి.

"మీకు, అబ్బాయికి భరణం ఇవ్వబడుతుందని అతను అత్యంత తక్కువ జీతం పొందుతున్నట్లు కోర్టుకి కాగితం సమర్పించేడు. నెలకు మూడు వందలకు మీ అబ్బాయికి కనీసం ఒక జత బట్టలు కూడా రావు. పోషణ భారం మీకే మొత్తం పడాలని అతని ఎత్తు." కూడా బయటకు వచ్చిన లాయరు విశ్వ చెప్తున్నవేవీ వినకుండా నమస్కరించి బయటకు నడిచింది తన్మయి.

"విడాకులంటే ఇలా చెరో కాగితం చేతికి తీసుకుని, జీవితాల్ని మధ్యకి చింపి వెళ్లిపోవడం. అంతేనా! "

ప్రాంగణం లో నుంచి బయటకి అడుగులు వేస్తూ ఉంటే పెళ్లికి జరిగిన తంతంతా వరసగా జ్ఞాపకం వచ్చింది.

పెళ్లి కోసం ఆతృతగా ఎదురు చూసిన రోజులు జ్ఞాపకం వచ్చేయి.

తన పెళ్లి కోసం తల్లిదండ్రులు పడ్డ శ్రమ జ్ఞాపకం వచ్చింది.

పెళ్లి మాటల దగ్గర నుంచి పెళ్లయ్యే వరకూ జరిగిన అనేకానేక సంఘర్షణలూ, ఉద్విగ్న క్షణాలూ గుర్తుకు వచ్చేయి.

అన్నిటి మీద నించి అతను నిర్దాక్షిణ్యంగా నడిచి వెళ్ళిపోయేడు. చేసిన ప్రమాణాలన్నీ తృణ ప్రాయంగా తొక్కి పడేసేడు.

"అతనికి బుద్ధి చెప్తున్నాను" అనుకుని, విడాకులు వద్దని మూర్ఖంగా ఇన్నాళ్లూ కోర్టు చుట్టూ వృథాగా తిరిగింది.

అతను మాత్రం సుఖవంతంగానే ఉన్నాడు. తనే కష్టాలు అనుభవించింది.

"ఇంకా ఎన్నాళ్లు కోర్టు చుట్టూ తిరగాలో" అని దిగులు పడని రోజు లేదు.

కానీ ఏదైతే జరిగితే బావుణ్ణనుకుందో అది జరిగిన తర్వాత కలుగుతున్న ఈ అలజడికి, దుఃఖానికి కారణం ఏవిటి? బయటికి వస్తూనే కనబడ్డ మొదటి బస్సు ఎక్కి, నిస్త్రాణగా వెనక్కి జారబడింది.

టిక్కెట్టు తీసుకుంటూ యథాలాపంగా "ధ్యానమందిరం" అని చెప్పింది.

"ఇది డైరక్టు బస్సు కాదు. ఆల్ రౌండు బస్సు"

అదేవీ వినిపించుకునే స్థితిలో లేదు తన్మయి. నిశ్శబ్దంగా టిక్కెట్టు తీసుకుని కళ్లు మూసుకుంది. దాదాపు గంట తర్వాత మెల్లగా మనసు తేలిక పడసాగింది. అసలు అర్థం లేకుండా తనెందుకు వ్యథ పడుతూంది? నిజానికి కష్టాలన్నీ తీరిన గొప్ప సుదినం అది.

"ఇక మీదట అతనికి తన మీద ఎటువంటి హక్కూ లేదు." వినడానికే ఎంత బావుంది!!

అప్పటివరకూ ఉన్న దిగులంతా మాయమయ్యి, అమాంతంగా రెక్కలు పొడుచుకొచ్చి సీతాకోక చిలుకలా గాలి వాటున పైకెగిసిన భావన కలగ సాగింది తన్మయికి. బస్సు జోడు గుళ్ల పాలెం కొండ వంపులు తిరుగుతుండగా దిగువన సముద్రమ్మీద దూరాన దిగంతాన్ని కలిసే చోటు మీదుగా సాయంత్రపు సూర్య కిరణాలు ఏటవాలుగా పడ్తూ నారింజ రంగు కాంతి కనుచూపుమేరా ప్రసరిస్తూ ఉంది. అలల మీదుగా ఎగురుతూన్న పక్షులను చూడగానే తన్మయికి తన జీవితం అత్యంత ఆశావహంగా, స్వేచ్ఛాయుతంగా కనిపించింది. అందులో అన్నిటికన్నా ఎత్తున ఎగురుతూ అవలీలగా గిరికీలు కొడ్తున్న పక్షిలా సంకెళ్లు తెగిన హాయి మనసంతా వ్యాపించింది. ఎక్కడైనా ఆగి దిక్కులు పగిలేలా గట్టిగా అరవాలని ఉంది.

ఆలోచన రాగానే తర్వాతి స్టాపులో బస్సు దిగి పోయి తీరంలో తడి ఇసుకలో నుంచి నడక ప్రారంభించింది.

కాస్సేపు ముందుకు నడవగానే దూరంగా సరుగుడు చెట్ల తోట కనబడసాగింది. అక్కణ్ణించి తీరం లోపలికి సాగి, రోడ్డు కనుమరుగవుతుంది. ఇక వెనక్కి తిరిగి దగ్గర్లోని రోడ్డు చేరుకోవడానికి ఉద్యుక్తురాలవుతూ కాళ్లు మునిగే కెరటాలలో నిలబడి దోసిలితో ఇసుకను, నీటిని సముద్రంలోకి విడుస్తూ "శేఖర్, ఇక నీకు నా మీద ఎటువంటి హక్కూ లేదు" అని అరిచింది.

37

ఆ వారాంతం ఇంటికి వెళ్లింది తన్మయి.

తండ్రి ముఖంలోచిటపటలు, తల్లి ముఖంలో ప్రశాంతత కనిపించేయి తన్మయికి.

మనసంతా ఎప్పుడూ లేనంత హాయిగా, తేలికగా ఉంది తన్మయికి.

"తను ఇప్పుడు సర్వ స్వతంత్రురాలు. ఎవ్వరి మీదా ఆధారపడి లేదు, ఎవ్వరికీ తన మీద హక్కులు లేవు, తన మీద ఎవ్వరి అజమాయిషీ లేదు. ఆ భావనే ఎంతో హాయిగా ఉంది."

అందుకే తండ్రికి ధైర్యంగా చెప్పింది.

"ఏం చేద్దామని విడాకులు తీసుకున్నావు?" గట్టిగా అరిచేడు భానుమూర్తి.

"నాన్నగారూ, మీరు అర్థం లేకుండా మాట్లాడుతున్నారు. ఇంత జరిగేక అతనితో ఎలా కలిసి ఉంటానని అనుకున్నారు? ఛీ, వాడి విషయం తలుచుకుంటేనే కంపరం పుట్టు కొస్తూంది." అంది తన్మయి.

"తండ్రిని నేననేవాణ్ణొకడిని ఉన్నాను. నన్ను అడగాలని ఇంగిత జ్ఞానం నీకు లేకపోయింది. నీ అంతట నువ్వు నిర్ణయం తీసేసుకోవడమే. రేప్రొద్దున్న ఈ పిల్లోడు తండ్రి కావాలంటే ఏం సమాధానం చెప్తావ్? ఇంత తొందరపాటు నిర్ణయం ఏంటి?....." ఆవేశంగా మాట్లాడుతున్న తండ్రి వైపు ఆశ్చర్యంగా చూసింది తన్మయి.

"మొదటి నించి జరిగిన ప్రతీ సంఘటనా తెలిసీ ఎందుకు ఇలా మాట్లాడుతున్నాడు? అయినా మొదట విడాకుల కోసం నోటీసు పంపినది అతనా, తనా? ఆతనికై అతను అటువంటి తీవ్ర నిర్ణయం తీసుకునే వరకూ తను పిచ్చి దానిలా అతనేం చేసినా భరించింది. అతను నోటీసు పంపాక, విడాకులు ఇవ్వననే కోర్టు చుట్టూ అర్థం లేకుండా ఇన్నాళ్లూ తిరిగింది. ఏ విధంగానూ తను తొందర పడలేదు. అయినా తండ్రి అంటున్నదేవిటి? తనది తొందరపాటా?" అదే అడిగింది.

కుర్చీ లోంచి లేవబోయి తూలి పడ్డాడు భానుమూర్తి.

"నాన్న గారూ!" అంటూ చటుక్కున దగ్గరికి వెళ్లి పట్టుకుంది తన్మయి.

గుండె రాసుకుంటూ, పక్కనే మంచమ్మీద చతికిలబడుతూ బైటికి వేలు చూపించేడు భానుమూర్తి.

"వెళ్ళు, ఇంకెప్పుడూ ఇక్కడికి రాకు"

బుగ్గలమీంచి ధారాపాతంగా కారుతున్న వెచ్చని కన్నీళ్లు తనని గంగా ప్రవాహమై ఉవ్వెత్తున ముంచి అక్కడికక్కడే తనని కలిపేసుకుంటే బావుణ్ణని అనిపించింది తన్మయి.

చప్పున మేరీ అన్న మాటలు గుర్తొచ్చేయి.

"మగవాళ్లెప్పుడూ మగవాళ్లే. తమ పరిధిలో తల్లయినా, భార్య అయినా, కూతురైనా చెప్పిన మాట వింటూ తు.చ తప్పకుండా నడుకున్నన్నాళ్లూ గొప్ప వాళ్లుగానే ప్రవర్తిస్తారు. వాళ్ల ఆధిపత్యంలో ఉన్న ఆడవాళ్ళు వాళ్లకి నచ్చనివి చేసిన్నప్పుడే వాళ్ల అసలు స్వరూపం బయటపడుతుంది."

"నిజమేనా?" కన్నీళ్లు తుడుచుకుంటూ పక్క గదిలోకెళ్లి పోయింది తన్మయి.

"శేఖర్ ఎంత బాధించినా అతను మరొక కుటుంబం నించి వచ్చిన వ్యక్తి కాబట్టి అతని పద్ధతులు వేరు అని సరి పెట్టుకోవచ్చు. కానీ తండ్రి?

ఒక్కతే కూతురు కావడం వల్ల చిన్నప్పటి నించీ తల్లి తనని అమ్మాయిగానూ, తండ్రి అబ్బాయిగానూ పెంచేరు.

తను ఆరో తరగతిలో సైకిలు తొక్కడం నేర్చుకుంటానని అనగానే, తన పెద్ద సైకిలు మీద మొదటి రోజు ఫెడలు తొక్కడానికి ఒక రోజంతా తనకి శిక్షణ ఇచ్చేడు ఆయన.

ఆయన టీవీఎస్ -50 మోటారు సైకిలు కొని తీసుకొచ్చిన మొదటి రోజే బండి నడపడం నేర్చేసుకున్న తన వైపు ప్రశంసా పూర్వకంగా చూసిన చూపు ఇంకా మర్చిపోలేదు తన్మయి.

వస్తూ వస్తూ  సాయంకాలం వేళ వీథి చివర కొట్టాలకు వెళ్తున్న పశువులు అడ్డం పడి, బండి మీద నించి పడ్డ తనని లేవనెత్తడానికి ఆదరా బాదరా ఇంటి నించి ఆయాసంతో పరుగెత్తు కొచ్చిన ఆదుర్దాని మర్చిపోలేదు తన్మయి.

"నువ్వే అబ్బాయి వైతే బావుణ్ణురా" అని ఎన్నో సార్లు తనతో అన్న తండ్రిని మనసారా ఎంతో ప్రేమించింది.

"నువ్వు మీ నాన్నలాగే ఉంటావు" అని ఎవరైనా అంటే ఎంతో పొంగిపోతూ వచ్చింది.

అలాంటి నాన్నేనా ఇలా మాట్లాడుతున్నది?

ఒక మగవాడి సంరక్షణలో తప్ప స్వతంత్రంగా తను బతకలేనని ఆయన ఎందుకు బాధపడ్తున్నాడు? అవన్నీ సరే. తనని ఏకంగా ఇంటికే రావొద్దని అంత కర్కశంగా ఎలా అంటున్నాడు?"

ఇంట్లో ఇంత గొడవ జరుగుతూన్నా తల్లి ముభావంగా ఉండిపోయింది.

తన్మయికి మనసంతా దిగులు కమ్ముకుంది.

జీవితం ఎప్పుడూ పోరాటమేనా?

ఇన్నాళ్లూ తను చేసిన పోరాటం వేరు, ఇక మీదట చెయ్యబోయేది వేరు.

మొదటిసారిగా తనెంత ఒంటరో అర్థం కాసాగింది.

అయినా తప్పదు, ఇక మీదట తల్లిదండ్రుల అండ కూడా లేదు తనకి.

తన పాట్లేవో తనే పడాలి. అంతే.

ఇక బాబుని తనతో తీసుకెళ్లి పోయి స్వతంత్రంగా బతకాలని నిశ్చయించుకుంది తన్మయి.

"ఏదో ఆవేశంలో అన్నారులే. రెండ్రోజుల్లో నిన్నూ, వాడినీ చూడకుండా ఉండలేనని అనరూ" అని తల్లి తనని ఓదారిస్తే బావుణ్ణని అనిపించింది.

"తన బాధ్యత తల్లికీ దుర్భరంగా అనిపిస్తూందా? బాబు సంరక్షణ భారంగా తయారైందా?

ఏమో! ఏవీ ఊహించుకోవడం ఇష్టం లేదు, అలాగని తల్లి మనస్సు లోని అభిప్రాయమూ తనకు తెలియడం లేదు.

ఒక పక్క తనకి శేఖర్ పీడ విరగడైనందుకు ఆమె ముఖంలో సంతోషం కనిపిస్తూ  ఉన్నా, ఏదో తెలీని అసహనం ఎందుకు కనిపిస్తూందో అర్థం కాలేదు తన్మయికి.

కారణాంతరాలు ఏవైనా ఇప్పుడిక అసలు జీవితం ప్రారంభించబోతూంది తను."

కళ్ళు తుడుచుకుంది.

“దేనికీ కుంగిపోకూడదు. తన నిర్ణయాలకు బాధ్యురాలు తనే. కష్టనష్టాలు అనుభవించేది తనే. తల్లిదండ్రులు కాదు. తనకు తెలిసినంత వరకూ తను కానీ పనేదీ చెయ్యలేదు. మంచి నిర్ణయాలనిపించినవే తీసుకుంది. ఇక వాళ్ల కోపతాపాలతో తనకి సంబంధం లేదు. వాళ్లకి తనని చూడాలనిపిస్తే వాళ్లే వస్తారు."

బాబు బ్యాగు సర్దింది నిశ్శబ్దంగా తన్మయి.

ఉదయం మొదటి బస్సుకి విశాఖపట్నానికి బయలుదేరింది.

విశాఖపట్నం పొలిమేరల్లోకి రాగానే మరింత దిగులు కమ్ముకుంది.

ఈ నగరం వైవాహిక జీవితంలో తను కన్న అపురూప కలలన్నీ కూల్చి వేసింది. ఎన్నో దుః ఖ పూరిత రాత్రుళ్లని మిగిల్చింది. ఎన్నో పాఠాలు నేర్పింది. అయినా కొందరు మంచి మనుషుల్ని పరిచయం చేసింది. అధ:పాతాళాన్నీ, అత్యున్నత విజయాన్నీ పరిచయం చేసింది. కొన్ని మెట్లని అధిగమింపజేసింది. కొత్త జీవితాన్నిచ్చింది.

ఎంతో విచిత్రమైనది జీవితం! తనెప్పుడూ ఇలా ఒంటరి ప్రయాణం చెయ్యాల్సి వస్తుందని ఊహించుకోలేదు. తెలిసి ఉంటే తను మరింత దృఢంగా నిలబడేదేమో!

ఒళ్లో నిద్ర పోతున్న బాబు తల నిమిరింది.

ప్రాపంచిక బాధలెరుగని పసివాడు! వాడి నుదుటి మీద ముద్దు పెట్టి, చుట్టూ కప్పిన శాలువాని వాడికి వెచ్చగా చుడుతూ గుండెల దగ్గరకు తీసుకుని

"నాన్నా! నువ్వూ, నేనూ మాత్రం ఎప్పటికీ దూరం కావద్దు" అంది.

తల్లి ఒంటి వెచ్చదనానికి ఆదమరిచి నిద్రపోతున్నాడు బాబు.

ఒక్క సారి ఊపిరి గట్టిగా పీల్చింది.

బయట తొలి మంచు వెలుతురు మెల్లగా విచ్చుకుంది. తడి ఆరని తన్మయి కళ్లల్లో జీవితం పట్ల ఆశలాగా.

★★★

నిద్రపోతున్న బాబుని ఒక చేత్తో గట్టిగా పట్టుకుని వాడు చేతుల్లోంచి జారిపోకుండా, కొంగు తీసి నడుం చుట్టూ బిగించుకుంది. మరో చేతికి పర్సు తగిలించుకుని, అదే చేత్తో బ్యాగు మోసుకుంటూ ఆటో దిగి హాస్టలు ఆవరణలోకి నడవసాగింది.

వార్డెన్ అడిగితే ఏం సమాధానం చెప్పాలో ముందే నిర్ణయించుకుంది.

“ఒక వారంలో ఎక్క డైనా ఇల్లు చూసుకుని వెళ్ళిపోతాం. దయచేసి అంత వరకూ ఉండనివ్వండి.”

హాస్టలుకి చేరగానే నిసత్తువ వచ్చేసింది తన్మయికి.

కానీ విశ్రాంతి తీసుకోవడానికి లేదు.

“చేతిలో ఉన్న కాసిన్ని డబ్బులతో ఇంటికి అడ్వాన్సు ఇచ్చేస్తే ఇతరత్రా ఖర్చులెలా వస్తాయి?”

మొదటి నించీ తన్మయికి తన దగ్గర డబ్బులు లేకపోతే తినడం మానేసి పస్తులయినా ఉంటుంది కానీ, ఎవరినీ చెయ్యి జాచి అప్పుగా నయినా అడిగే అలవాటు లేదు.

"తనకే ఎందుకిలా జరుగుతూంది?" బాబు పక్కనే పడుకున్న తన్మయి బుగ్గల్ని వెచ్చని కన్నీళ్లు తడిపేయ సాగేయి.

ఎప్పుడు నిద్రపోయిందో తెలీదు. మేరీ వచ్చి తట్టి లేపేంత వరకు మెలకువ లేకుండా పడి ఉంది.

అప్పటికే నిద్ర లేచి పక్కనే ఆడుకుంటూన్న బాబు "అమ్మా" అంటూ వచ్చి ఒళ్ళో చేరేడు.

"“అమ్మా” అన్న వాడి పిలుపు కోసమే తను ఇంకా బతికి ఉంది. వాడి కోసం ఎన్ని కష్టాలనయినా భరించగలిగే గొప్ప స్ఫూర్తి వాడు.”

"చిన్ని నాన్నా, బంగారు తండ్రీ!" అంటూ గుండెలకు హత్తుకుంది.

తన్మయి కళ్లల్లో నీటి పొరలు చూడగానే ఏదో జరిగిందని అర్థమయ్యింది మేరీకి.

పక్కనే కూచుని చేతి మీద రాయ సాగింది.

"నీకు వచ్చే స్కాలర్ షిప్పుతో నువ్వూ, బాబూ దర్జాగా బతకొచ్చు. ఎందుకు దిగులు పడతావు?" అంది.

ఇంకా మౌనంగా కూచున్న తన్మయితో

“ఇప్పుడిప్పుడే పీ.ఎచ్.డీ మొదలు పెట్టేవు కాబట్టీ, నీకు ప్రీ పీ.ఎచ్.డీ ఎగ్జామ్స్ అయ్యేంత వరకూ పెద్దగా పనుండదు. మీ గైడు గారితో మాట్లాడుకుని బాబు స్కూలుకి వెళ్లే సమయంలో మాత్రమే రీసెర్చి పని చేసుకోవచ్చు. నువ్వెక్కడ ఉన్నా, నేను కూడా నా పనులు త్వరగా చూసుకుని, బాబు వచ్చే వేళకి తెముల్చుకుని వచ్చేస్తాను. టెన్షను పడకు తన్మయీ. అన్నిటికీ ఆ ప్రభువు ఉన్నాడు." అని ఓదారుస్తూన్న తన్మయి మేరీ అర చేతిని పట్టుకుని నిశ్శబ్దంగా రోదించసాగింది. “ఈ అమ్మాయికి తను ఏమవుతుంది? ఎందుకింత దయ తన మీద?"

“నీకు థాంక్స్ చెప్పడం కూడా చిన్నమాటే మేరీ. నీ స్నేహాన్ని నేను నా జీవితంలో ఎప్పుడూ మర్చిపోను.” అంది మెల్లగా.

మర్నాటి నించి యూనివర్శిటీకి దగ్గర్లో గది దొరుకుతుందేమో అని వెతకడం మొదలు పెట్టేరు తన్మయి, మేరీ.

సిటీలో బాగా ఖరీదైన ప్రాంతం కావడంతో దాదాపుగా అన్నీ బాగా చిన్నవి, అద్దె బాగా ఎక్కువ.

ఇక అన్నిటి కంటే బాగా ఇబ్బంది పెడ్తున్న విషయం ఏవిటంటే, తన్మయికి మెళ్లో సూత్రాలు, కాళ్లకు మట్టెలు లేకపోవడాన్ని పట్టి పట్టి చూడడం, బాబు వైపు, తన వైపు మార్చి మార్చి చూసి, ముఖమ్మీదే "అద్దెకు ఇవ్వం" అని చెప్పసాగేరు కొందరు.

"సర్లే, అటువంటి ఇళ్లు నీకు అస్సలు అవసరంలేదు" అని మేరీ ఎంత ఓదారుస్తున్నా, అవమానంతో తన్మయికి దుః ఖం తన్నుకు రాసాగింది.

మూడో రోజుకల్లా అర్థమైన విషయం ఏవిటంటే ఊరి నించి దూరంగా వెళ్తేనే తక్కువ అద్దెలో కాస్త సౌకర్యవంతమైన ఇల్లు దొరుకుతుంది. అక్కడ సంస్కారవంతులైన వాళ్ళు ఉంటే.

దిగులుగా కూచున్న తన్మయితో, “నాకూ నీతో రావాలనే ఉంది తన్మయీ, కానీ నాకొచ్చే అరకొర స్కాలర్ షిప్పుతో నాకు హాస్టలుల్లో తప్ప ఇంకెక్కడా ఉండే స్తోమత లేదు. నీకు తెల్సుగా అంది మేరీ.”

“ఫర్వాలేదు మేరీ. ఒంటరిగా ఉండడానికి ఏదో తెలీని భయం ఆవహిస్తూంది.” అంది నిస్త్రాణగా.

గది బయటి చీకటి మనస్సులోకి పాకుతున్నట్లనిపించసాగింది తన్మయికి.

★★★

ఆ మర్నాడు యూనివర్శిటీలో డిపార్ట్ మెంటు బయట బెంచీ మీద బాబుతో బాటూ కూచుని కబుర్లు చెప్తూన్న తన్మయి “ఏ...ఏవిటి బా...బాగున్నారా?” అనే పిలుపు వినబడి తలెత్తి చూసింది.

దివాకర్ నవ్వుతూ నిలబడ్డాడు.

“అయ్యో, మి...మీ్మరు ఇళ్ళ కోసం ఎక్కడో వెతకడం ఏవిటీ? మా ఇంటి వరండాని ఆనుకుని ఉన్న పెద్ద గదిని మీకు త్త.. తక్కువకి అద్దెకు ఇప్పిస్తాను. ఇంతకు ముందు బ్ర... బ్రహ్మచారి మేస్టారు ఒకరు ఉండేవారు. ఆయనకు మొన్ననే పెళ్లయ్యి వెళ్ళిపోయేరు. మి.. మీ్మకు ఇంటి సమస్యా తీరుతుంది, బాబు సమస్యా తీరుతుంది. బడి నించి రాగానే మీ బాబుని మా అమ్మగారు చ...చక్కగా చూస్తారు” అన్నాడు.

తన్మయి ఆశ్చర్యంగా చూసింది.

తనకొక కష్టం వచ్చి కళ్లనీళ్ల పర్యంతం కాగానే ఒక అజ్ఞాత సహాయం అందజేస్తున్న అజ్ఞాత మిత్రునికి మనస్సు లోనే కృతజ్ఞతలు చెప్పుకుంది.

“రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది."

“అయ్యో, భ..భలే వారు” అంటూ దారి తీసేడు దివాకర్.

“ఇ..ఇంకా ఏ ఉద్యోగంలోనూ కుదురుకోలేదు. మి...మీ్మరు చెప్పిన రెసిడెన్షియలు బ్బ..బాగా దూరం. ఆఅ..అందుకే వెళ్లలేదు...”అని చిన్న పిల్లాడిలా మాట్లాడుతున్న దివాకర్ వైపు కృతజ్ఞతగా చూసింది తన్మయి.

ఇతని తత్త్వం చిన్న పిల్లవాడిదయినా, హృదయం ఎందరో పెద్దవాళ్ల కన్నా ఎంతో విశాలమైనది.

దివాకర్ తల్లి ఎంతో ఆదరంగా, “రామ్మా”అని పలకరించింది.

అడ్వాన్సు ఇవ్వబోతే, “మా అమ్మాయిలాంటి దానివి. మాకు అడ్వాన్సులు అక్కరలేదు, నువ్వు త్వరగా వచ్చెయ్యి చాలు” అని చిరునవ్వుతో తిరస్కరించింది.

తల్లి దగ్గరనించి మంచి తనాన్ని పుణికి పుచ్చుకున్నాడన్న మాట దివాకర్.

హాస్టలుకి సంతోషంగా తిరిగి వచ్చింది. “ ఆదివారం ఇంట్లో చేరుతాను మేరీ” అంది మేరీ రాగానే సంతోషంగా తన్మయి.

“మంచి వార్త తన్మయీ, కానీ ముందీ ఇంటర్వ్యూ అయ్యేక చేరుదువు గాని” అని కళ్ల ముందు కవరు ఆడించింది మేరీ.

ఆత్రంగా కాగితం బయటికి తీసి చూస్తున్న తన్మయి వైపు నవ్వుతూ చూస్తూ ,

"కాలేజ్ సర్వీస్ కమీషను నించి ఇంటర్వ్యూ కదా! అనుకున్నా కవరు చూసి. ఇంకేం గవర్నమెంట్ లెక్చరర్ పోస్టుకి ఇంటర్వ్యూ కి పిలుపు వచ్చింది. ఇక ఉద్యోగమే తరువాయి." అంది మేరీ.

తన్మయి తన హడావిడిలో పడి రిటెన్ టెస్టు రిజల్ట్సు వచ్చేయని కూడా పట్టించుకోలేదు. ఇక ఇప్పుడు మూడు వారాల్లో హైదరాబాదులో ఇంటర్వ్యూ.

STD బూత్ కి పరుగున వెళ్లి తల్లికి ఫోను చేసింది. అసలు జరిగినవన్నీ మర్చిపోయింది.

“పోన్లేమ్మా, దేవుడి దయ వల్ల ఈ ఉద్యోగం నీకు వచ్చేస్తే బావుణ్ణు.” అంది అట్నించి జ్యోతి.

“ఉద్యోగం వస్తుందా, రాదా అన్నది ప్రధానం కాదు తన్మయీ. నీకు ఇంటర్వ్యూలు ఎలా ఉంటాయన్నది తెలుసుకోవడానికి కూడా ఇదొక మంచి అవకాశం. అయినా నీ ప్రతిభకు తగ్గ ఉద్యోగం ఇది. ధైర్యంగా అటెండ్ అవ్వు. నువ్వు వచ్చే వరకూ బాబుని నేను చూస్తాను" అంది మేరీ.

ఆ మాట వింటూనే "విడిచి వెళ్ళొద్దు"న్నట్టు పరుగున వచ్చి తల్లిని కౌగలించుకున్నాడు బాబు.

ఆలోచనలో పడింది తన్మయి. హైదరాబాదులో తల్లికి పెదనాన్న గారి అమ్మాయి, తనకి పెద్దమ్మ వరస అయ్యే ఆవిడ ఉంది. ఇంటర్వ్యూకి వెళ్ళి రావడం అంటే ఒక్క రోజు పని కాదు. ప్రయాణంతో కలిపి అయిదు రోజులు పడుతుంది.

తల్లిని తనతో రమ్మని, తీసుకు వెళ్లడమే ఉత్తమం. పెట్టెలో అడుగున దాచిన డబ్బుల్ని లెక్కచూసుకుని, గట్టిగా ఊపిరి పీల్చుకుని వదిలి, "నిన్నొదిలి వెళ్లను నాన్నా, అమ్మమ్మని కూడా మనతో తీసుకెళ్దాం, సరేనా?" అంది తన్మయి సంతోషంగా.

జే. ఆర్. ఎఫ్ కి తయారు చేసుకున్న నోట్సులన్నీ తీసి రాత్రీ పగలూ చదవ సాగింది తన్మయి.

మరో వారంలో ఇంటర్వ్యూ అనగా దగ్గరలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీకి వెళ్లింది.

విరిగిపోయిన గేటు, మాసిపోయిన గోడలు, పెళ్లలు ఊడి వచ్చిన గచ్చు.

అరకొర వసతులతో గట్టిగా పది గదులు కూడా లేని కాలేజీ అది.

ఉన్నంతలో కాస్త చక్కగా ఉన్నది ప్రిన్సిపాలు గది.

"పిన్సిపాలు గారు లేరు. రేపు రండి" అన్నాడు అటెండరు.

అయినా ముందుకు నడిచింది.

ఆ పక్కనే ఉంది స్టాఫ్ రూము. ఒక బల్లకి అటూ, ఇటూ రెండు కూర్చునే బల్లలున్న చిన్న పాటి గది అది.

అక్కడ పుస్తకం చదువుకుంటున్న యువకుడు తన్మయి వైపు సందేహంగా చూసేడు. పొద్దున్నే కావడంతో ఇంకా ఎవరూ వచ్చినట్లు లేరు. చాలా సాదా దుస్తులయినా చక్కగా ఇన్ షర్టు చేసుకుని, మంచి హుందాగా ఉన్నాడు.

తన్మయి స్కాలర్ అని తెలియగానే "రండి మేడమ్, కూర్చోండి" అని,

"నా పేరు సిద్ధార్థ. ఇంగ్లీషు లెక్చరర్ ని" వినమ్రంగా అన్నాడు.

అతని చేతిలోని 19 వ శతాబ్ది అమెరికన్ కవయిత్రి ఎమిలీ డికిన్ సన్ కవిత్వం పుస్తకాన్ని చూస్తూ

"నా అభిమాన కవయిత్రి.

"Success is counted sweetest
By those who ne'er succeed
To comprehend a nectar
Requires sorest need" ...అనే పాదాలు నాకు చాలా ఇష్టం." అంది తన్మయి.

"అయితే మీరు ఆంగ్ల సాహిత్యాన్ని కూడా ఔపోసన పట్టేరన్న మాట" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఏదో లెండి. చదివింది తక్కువైనా, అభిమానించింది ఎక్కువ. ఒకప్పుడు ఆంగ్ల కవిత్వాన్ని తెలుగులోకి అనువాదం చేయడం నాకు ఇష్టమైన పనిగా ఉండేది." అని చిన్నగా నవ్వింది.

"మరి ఇప్పుడు!" అన్నాడు ఆసక్తిగా.

"ఇప్పుడంతా జీవన పోరాటం ఆసక్తుల్ని పక్కకి నెట్టింది"

అతను వెంటనే చిన్నగా దగ్గి, "అంతేలెండి, స్కాలర్ అయ్యేక బోల్డు పనులు ఉంటాయిగా, మీకేదో సలహాలు చెప్తున్నానని అనుకోకపోతే ఒక్క మాట. అందరికీ ఉండేవి ఇరవై నాలుగు గంటలే అయినా, మీ ఆసక్తులకు కూడా కొద్దో గొప్పో సమయాన్ని కేటాయించండి. లేకపోతే జీవన పోరాటంలో కొన్ని సంవత్సరాలు గడిచిపోయేక వెనక్కి చూసుకుంటే మనకంటూ ఏవీ మిగలదు "

తన్మయి అతని వైపు ఆశ్చర్యంగా చూసింది. "తన అజ్ఞాత మిత్రుడు తనతో సరిగా ఇలాగే మాట్లాడుతూ ఉంటాడు."

ఆ ఆలోచన రాగానే తన్మయి పెదాల మీద చిన్నగా నవ్వు వెలిసింది.

అంతలోనే వచ్చిన పని గుర్తుకు వచ్చి "గవర్నమెంట్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ అంటే ఎలా ప్రిపేర్ కావాలో అర్థం కావడం లేదండి" అంది తన్మయి.

గట్టిగా నవ్వేడతను. "బి బోల్డ్ మేడమ్. ఏమడిగినా భయపడకుండా చక్కగా చెప్పేసెయ్యండి. సబ్జెక్ట్ ఏదయినా ఇంటర్వ్యూ లు ఒకటే. మీకు ఏమడిగినా చెప్పగల నాలెడ్జి ఉన్నపుడు అసలు ఇంటర్వ్యూ కష్టమే కాదు. ఒక్కటి గుర్తు పెట్టుకోండి. మీరు వెళ్తున్నది పంతులమ్మ ఉద్యోగానికి. కాబట్టి క్లాసులో మీరు పాఠం ఎంత కాన్ఫిడెంట్ గా చెప్పగలుగుతున్నారనేది మాత్రం తప్పని సరిగా చూస్తారు. కాబట్టి ముందుగా కాస్త ట్రయిల్ వేసుకుని వెళ్లండి. కనబడ్డ నలుగురు పిల్లల్ని కూచోబెట్టి పాఠం చెప్పెయ్యండి. ఎవరూ లేకపోతే ఇదుగో మీ అబ్బాయికి చెప్పెయ్యండి." గలగలా మాట్లాడుతున్న అతని "వాగ్ధాటికి మెచ్చే ఉద్యోగం ఇచ్చి ఉంటారు" అనిపించింది తన్మయికి.

వచ్చేటపుడు బాబు చేతిలో రంగు రంగుల చాక్ పీసులు పెడుతూ "మేడమ్, ఉద్యోగం వచ్చేక మొదటి స్వీటు నాదే. గుర్తుపెట్టుకోండి." అన్నాడు సిద్ధార్థ నవ్వుతూ.

అప్పుడప్పుడే అతను పరిచయం అయినా అతన్ని మరిచిపోవడం అసాధ్యం అనుకుంది.

తిరిగి హాస్టలుకి రాగానే హాస్టలు వార్డెన్ ఎదురుపడింది. ఏ కళ నుందో బాబుని చూసి కూడా ఏమీ అనకుండా ఊరుకుంది. నిజానికి ఒక వారం అన్నది రెండు వారాలయింది.

ఆ రోజు డిపార్టుమెంటులో దివాకర్ కి కబురు చెప్పింది తన్మయి "ఇంటర్వ్యూ చూసుకుని, వచ్చే నెలలో చేరుతాను. మీ అమ్మ గారికి చెప్పండి." అని.

డిపార్టుమెంటులో సెలవుకి అప్లికేషను ఇచ్చి బయటికి రాగానే ఒకసారి సందేహంగా వెనక్కి తిరిగి చూసింది. "ఇక్కడే తను రిసెర్చి చేస్తూ మరో అయిదేళ్లు ఉంటుందా?"

38

బాబుతో బాటూ తన్మయి, జ్యోతి తెల్లారుతూనే హైదరాబాదుకి చేరుకున్నారు. తన్మయి హైదరాబాదుని చూడడం అదే మొదటిసారి. విశాఖ పట్నమూ నగరమే అయినా, రెండు నగరాలకూ తేడా చాలా స్పష్టంగా కనిపించసాగింది.

విశాఖపట్నంలో రోడ్లు ఎక్కే కొండ, దిగే కొండగా ఉండడం వల్లనో, ప్రధానమైన రోడ్లు తప్ప మిగతా రోడ్లన్నీ విశాలంగా లేకో, నగర శివార్లు అంతగా అభివృద్ధి చెందకో నగరం చిన్నదనిపిస్తుంది. కానీ అందమైన నగరం. సముద్రం, కొండలు, పచ్చదనం...బహుశా: విశాఖ పట్నాన్ని చూసి ప్రేమలో పడని వారుండరేమో.

హైదరాబాదు లో దిగగానే ఏదో కొత్త లోకానికి వచ్చినట్లు అనిపించసాగింది. విశాలమైన రోడ్లు, తేమ లేని పొడి వాతావరణం, కొత్త భాష, జన సముద్రం. స్టేషన్లో తోసుకొస్తున్న జనాలని తప్పించుకుని బయటికొచ్చి ఆటో ఎక్కేరు. అడ్రసు కాగితం ఆటో అబ్బాయికి చూపించింది జ్యోతి.

"మాలూం నహీ" అన్నాడు హైదరాబాదీ భాషలో.

అతనికెలా చెప్పాలో తెలియక తికమక పడ్డారు తల్లీ కూతుళ్లు.

వెళ్లాల్సిన అడ్రసు పైకి చదివి, "ముందు ఆ ఏరియాలోకి పోనియ్యి చూద్దాం" అంది తన్మయి.

అతి వేగంగా ఎక్కడ బోల్తా పడ్తుందో అన్నట్లు దూసుకు వెళ్తున్న ఆటో లో అటూ ఇటూ ఊచల్ని గట్టిగా పట్టుకుని కూచున్నారు. బాబు ఉత్సాహంగా లేచి చుట్టూ చూడసాగేడు.

అరగంట ప్రయాణం చేసేక "ఇదే మీ బస్తీ" అన్నాడు.

రెండు, మూడు సందులు తిరిగి మొత్తానికి ప్రమీల పెద్దమ్మ ఇల్లు పట్టుకున్నారు. ఆటో వాలా మరో పది రూపాయలు ఎక్కువ ఇమ్మని కూచున్నాడు. జ్యోతి బేరానికి పైసా ఇచ్చేది లేదని వాదనకి దిగింది.

"అసలే డబ్బులు కనాకష్టంగా ఉన్నాయంటే ఇలాంటి కష్టాలు మరీ వచ్చి పడ్తున్నాయి." అని మనస్సులోనే బాధ పడ్తూ, తన్మయి తల్లిని వారించి, అయిదు రూపాయలు ఎక్కువ ఇచ్చింది.

రెండస్థుల పెద్ద మేడ ముందు దిగేరు. కింద పోర్షను ఎవరికో అద్దెకి ఇచ్చినట్టున్నారు. వాకిట్లో ఊడుస్తున్న అమ్మాయి పైకి దారి చూపించింది. గుమ్మం దగ్గిర నిలబడి తెరిచి ఉన్న తలుపుల మీద కొట్టేరు. పెద్దమ్మ వచ్చిసాదరంగా లోపలికి తీసుకు వెళ్తుందనుకున్న ఆశలు అడియాసలే అయ్యాయి.

"అమ్మ తానానికి పొయ్యింది. కూచోండి" అంది పనమ్మాయి.

బెదురుగా ఒకరి వైపు ఒకరు చూసుకుంటూ కూచున్నారు.

"సినిమా ఫీల్డులో చేరి బాగా డబ్బు సంపాదించేరని తెలుసు కానీ ఇంత బాగా అని తెలీదు." చుట్టూ తేరిపార చూస్తూ, రహస్యంగా అంది జ్యోతి.

లోపల మరో పెద్ద హాలు ఉంది. పేపరు తిరగేస్తూ, కాఫీ తాగుతున్న వ్యక్తి తమ వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

"ఆయనే మీ పెదనాన్న గారు. గుర్తు పట్టినట్లు లేదు. ఎప్పుడో పెళ్ళిలో చూడడమే నన్ను. వాళ్ల పెళ్ళి నాటికి నా వయసు పదిహేనో, పదహారో ఉంటాయి." అంది గుసగుసగా జ్యోతి.

గదికి ఆ మూల నించి ఈ మూల వరకు అద్దాల బీరువా ల్లో ఏవేవో షీల్డులు, ఖరీదైన వస్తువులు అలంకారంగా ఉన్నాయి. బాబు ఒళ్ళో నుంచి దిగి అటు ఇటూ అక్కడక్కడే నడవ సాగేడు. వాణ్ణి ఏవీ ముట్టుకోవద్దని సైగ చేసింది తన్మయి. అద్దం టీపాయి మీద వార పత్రికలలో నుంచి ఒకటి చేతిలోకి తీసుకుంది. కానీ కళ్లు మండసాగేయి. జ్యోతి వెనక్కి జేరబడి కళ్లు మూసుకుంది. రాత్రంతా జనరల్ పెట్టెలో ప్రయాణం. కిక్కిరిసిన రైలు లో కంటి మీద కునుకు లేదు ఇద్దరికీ.

అప్పుడే హాల్లోకి అడుగు పెడ్తూ, "ఎలా జరిగింది ప్రయాణం?" అంది పెద్దమ్మ ప్రమీల కట్టుకున్న పెద్ద అంచు జరీ చీర సరిచేసుకుంటూ.

అక్కడే తిరుగుతున్న బాబు ఎక్కడ ఏం పడేస్తాడో అన్న చిన్న చికాకు ఆవిడ ముఖంలో క్షణం పాటు తాండవించడాన్ని ఇట్టే గమనించింది తన్మయి.

బాబు ని దగ్గరికి పిల్చి, "నమస్తే చెప్పమ్మా" అంది.

వెంటనే ఆవిడ " "అమ్మమ్మా" అని పిలిపించకమ్మా," ఆంటీ" అనమను. మా అబ్బాయికి ఇంకా పెళ్లి కానే లేదు." అంది భుజాల వరకూ కత్తిరించుకున్న జుత్తు వెనక్కు తోసుకుంటూ.

జ్యోతి వెంటనే కల్పించుకుని, "అవునక్కా, బాబు పెళ్ళెప్పుడు?" అంది.

"సంబంధాలు చూస్తన్నాం. ఈ ఏడాది కుదురుద్దేమో చూడాలి" అని, "వీడికి నీ పోలికే లేదు. తండ్రి పోలికనుకుంటా. అవునూ, అతను రాలేదేం?" అంది ప్రమీల ఆరా తీస్తున్నట్టు.

కాస్త చికాగ్గా ముఖం పెట్టి తన్మయి సమాధానం ఇచ్చే లోగా

జ్యోతి "ఏం లేదక్కా, అతనికి ఉద్యోగంలో సెలవు లేదు..." అని నసిగింది.

తన్మయి మెళ్లో బయటికి వేళ్లాడుతున్న ఖాళీ గొలుసు వైపు ఓ చూపు విసిరి, "నాతో రండి" అని హాలుకి ఒక పక్కగా బయటి నించి ఉన్న సందులో నుంచి నడిచి ఇంటి వెనక వైపు ఉన్న గది తలుపు తీసి, "ఇదే మీ గది" అంది.

ముందు ఉన్న ఇంటికి సంబంధం లేనట్లు కట్టి ఉన్న రెండు గదుల్లో వంటింటి కి పక్కగా ఉంది ఆ గది. గదిలో సన్నని దూది పరుపు వేసున్న పాత డబల్ కాట్ మంచం ఉంది.

"అదుగో అది బాత్రూము. స్నానలవీ కానివ్వండి. మీకు టిఫిను పనమ్మాయి తెచ్చి ఇస్తుంది. కాస్సేపట్లో సిటీలో పెద్ద కాంట్రాక్టరు గారింట్లో పెళ్ళికి వెళ్లాలి మేం. వచ్చేసరికి సాయంత్రం అయిపోతుంది. మీకు మధ్యాహ్నం భోజనాలవీ కూడా ఏర్పాటు చెయ్యమని పనమ్మాయికి చెప్తాను." అంది ప్రమీల.

"ఫర్వాలేదక్కా. మేం పెట్టుకు తింటాంలే" అంది జ్యోతి.

ఆవిడటు వెళ్లగానే తన్మయి వైపు తిరిగి "కాస్త ఆ గొలుసు లోపలికి వేసుకోరాదూ, అందరి చూపులు తట్టు కోలేక చస్తన్నాం" అంది జ్యోతి.

"పెద్దమ్మకి తెలీదా?" విసుగ్గా అంది తన్మయి.

"తెలుసో, లేదో. మనంతట మనం డప్పు వేసుకోవటం ఎందుకు? ఇదేవైనా అంతా మెచ్చుకునే విషయమా?" అంది జ్యోతి.

తన్మయికి చప్పున కళ్లనీళ్లు తిరిగేయి. "తనేం తప్పు చేసింది?"

జ్యోతి చూసీ తల తిప్పుకుని ఏవీ పట్టనట్లు మాట మారుస్తూ "ప్రమీల పెద్దమ్మకి పిల్లలు లేరు. ఒకబ్బాయిని పెంచేరు. అతను ఇప్పుడు అమెరికాలో ఉన్నాడట." అంది.

బాబు కి స్నానం చేయించి, తనూ తయారయ్యి గదిలో ఉన్న పరుపు మీద తల వాల్చింది తన్మయి. శరీరం కంటే మనస్సుకే ఎక్కువ అలసటగా ఉంది. ఎక్కడికెళ్లినా ఎదురవుతున్న చేదు అనుభవాలు. తన లాంటి స్త్రీల జీవితాలు అడుగడునా ముళ్ళ మీద నడకే. తప్పు మగవాళ్లు చేసినా స్త్రీలని బాధ్యుల్ని చేసి హింసిస్తుంది సమాజం. శేఖర్ తో విడాకులతో అతనికి, తనకు సంబంధం తెగిపోయిందని తను అనుకుంటున్నా, ఈ సమాజం అతన్ని మరిచి పోనివ్వడం లేదు.

"అజ్ఞాత మితుడా! నన్నీ బాధల నుంచి కాపాడు." అని కళ్లు మూసుకుంది.

ఆలోచనలతో అలిసి పోయిన శరీరానికి వెంటనే నిద్ర పట్టేసింది.

మధ్యాహ్నం భోజనానికి తట్టి లేపింది జ్యోతి. "లేమ్మా, బాగా లేటయ్యి పోయింది ఇప్పటికే" అంటూ.

ఏదో కాస్త బలవంతంగా తిని, పుస్తకాలు ముందేసుకుని కూచుంది తన్మయి. ఎంత త్వరగా ఇక్కడి నించి తిరిగి వెళ్ళిపోతామా అనిపించసాగింది. జీవితంలో తప్పని పరిస్థితులు ఎదురయ్యినప్పుడే సంయమనం పాటించాలని ఎక్కడో చదివింది. కళ్ళు మూసుకుని, గట్టిగా ఊపిరి పీల్చి వదిలి, పుస్తకం తెరిచింది. పుస్తకం తెరవగానే ఒక్క సారిగా మనస్సు లో ఉన్న ఇతర ఆలోచనలన్నీ మబ్బులు తొలిగినట్లు మాయమైపోయేయి. ఏకాగ్రతగా చదవసాగింది.

సాయంత్రం టీలు పట్టుకుని వచ్చిన పనమ్మాయితో, "ఏవిటీ మీ అమ్మగారు ఎప్పుడొస్తారు?" అని ఆరాలు తీస్తూన్న తల్లి వైపు చూస్తూ, "అమ్మా! ఎల్లుండి ఇంటర్వ్యూ. రేపు డాక్యుమెంట్లు చెకింగుకి రమ్మన్నారు. గుర్తుందా? " అంది తన్మయి.

" ఊ, ఈ సిటీలో ఆటోలకు బాగానే వదిలేటట్లు ఉన్నాయి" అంది జ్యోతి.

ప్రమీల కారులో దిగడం పై నుంచి చూసి పరుగెత్తుకొచ్చి "అమ్మా అమ్మా! రేపు మనం కారు ఎక్కుతామా?" అడిగేడు బాబు అమాయకంగా.

"లేదు నాన్నా, ఆటోలో వెళ్తాం" అంది మృదువుగా వాడి తల నిమురుతూ తన్మయి.

"ఊహూ, నేను ఆటోలో రాను" అన్నాడు బుంగమూతి పెట్టి.

తన్మయి ఏదో చెప్పి సముదాయించే లోగా "పోనీ బండిమీదెళ్దాం" అన్నాడు.

వాడికి ఈ మధ్య అదొక సర్దా పట్టు కుంది. హీరో హోండా, సుజుకి, కవాసాకి, యమహా బండ్లు లోన్ల మీద మధ్య తరగతి వాళ్లకి అందుబాటు లోకి వచ్చాయేమో ఎక్కడ చూసినా చిన్న పిల్లల్ని ముందు, కాస్త పెద్ద పిలల్లని మధ్య కూచో బెట్టుకుని వెళ్లే జంటలు ఎక్కువయ్యేరు. బాబు అటువంటి వాళ్ల వైపు ఎన్నో సార్లు ఆశగా చూడడం గమనించింది తన్మయి. బాబుకి ఏ లోటూ లేకుండా పెంచాలన్నది తన ధ్యేయం. కానీ తండ్రి లేని లోట్లలో ఇదొకటి అని అర్థమయ్యింది. బాబుకి ఇవన్నీ అర్థమయ్యేలా ఎలా చెప్పాలి? వీణ్ణి తండ్రి ఆలోచన లేకుండా ఎలా పెంచాలి?

ఆలోచనలతో సతమతమవుతూ తన్మయి వాటర్ టాంకు మాత్రమే ఉన్న మూడో అంతస్థు మీదికి వెళ్లింది. మేడ మీద నుంచి చూస్తే వరసగా ఆ వీధిలో అన్నీ దాదాపు రెండు, మూడంతస్థుల భవనాలే. దూరంగా ఖాళీ స్థలంలో వరసగా టార్పాలిన్లు కప్పి ఉన్న గుడిసెల్లో ఉంటున్న జనం సాయంత్రం కావడంతో గూళ్ళకు చేరినట్లున్నారు. ఇళ్ల బయట పిల్లలు మట్టిలో పొర్లుతూ ఆడసాగేరు. బాబు బండి గురించి అడిగిన విషయం ఆలోచిస్తూ తను బాధ పడ్తూంది గానీ, మట్టిలో పెరిగే ఆ పిల్లలు పాపం ఎన్ని కోర్కెలు మనసులో అణచుకుంటారో! ఐసుఫ్రూటు, చాక్ లెట్టు ...ఇలా ప్రతీదీ వాళ్ళకి అందనిదే. ఏదైనా కావాలని వాళ్లు తల్లిదండ్రుల దగ్గర మారాం చేస్తే వాళ్లూ తన లాగే తీర్చలేక, బాధ పడ్తారా?

"తన్మయీ!" కింద నుంచి జ్యోతి పిలుపుకి ఈ లోకంలోకి వచ్చింది తన్మయి.

"పెద్దమ్మ పిలుస్తూంది."

అప్పటి వరకు టీవీ ముందు కూచున్న పెదనాన్న అనబడే వ్యక్తి వీళ్ల వైపు ఒకసారి చూసి నవ్వి, అర్జంటుగా ఏదో పనున్నట్టు లోపలికి వెళ్లిపోయేడు.

"ఋతురాగాలు" సీరియల్ని లీనమైపోయి చూడసాగేరు ప్రమీల, జ్యోతి.

మధ్యలో ఎడ్వర్ టైజ్ మెంట్లు రాసాగేయి.

"వాషింగ్ పౌడర్ నిర్మా....పాల వంటి తెలుపు....రంగుల బట్టలు తళ తళలాడే..."

"ఒనిడా టీవీ- ఓనర్స్ ప్రైడ్, నైబర్స్ ఎన్వీ..."

తన్మయికి విసుగు వస్తూంది.

తిరిగి సీరియల్ ప్రారంభమైంది.

"సాగే.... జీవన రాగం......"

"అవును ఎక్కడా ముగియకుండా సా......గే.......దే జీవనం"

ధైర్యం చేసి, "ఎల్లుండి ఇంటర్వ్యూ ఉంది కదా పెద్దమ్మా, నేను చదువుకోవాలి" అని లేచింది తన్మయి.

"ఆ... వెళ్లమ్మా చదువుకో. ఇంతకీ ఏం ఉద్యోగానికీ?" అని రాగం తీసింది ప్రమీల.

తన్మయి సమాధానం విని, "లెక్చరర్ అంటే జీతం బానే వస్తుందనుకుంటా. ఒక్కగానొక్క కూతురువి. ఉద్యోగం రాగానే మీ అమ్మనీ, నాన్ననీ నీ దగ్గరికి తీసుకెళ్లిపో. ఆ పల్లెటూళ్లో ఎన్నాళ్లని పాట్లు పడతారు?" అంది.

ఆవిడ అసందర్భపు మాటలకి నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు తన్మయికి.

జ్యోతి అందుకు సమాధానంగా "ఆడపిల్ల దగ్గిర ఉండాల్సిన ఖర్మ మాకేంటక్కా, కలో గంజో తాగి మా బతుకులు మేం బతుకుతాం గానీ.." అని సాగదీసింది.

తన్మయికి అక్కడ ఒక్క క్షణం కూడా ఉండాలనిపించక చప్పున నడిచి వెనక గదిలోకి వచ్చేసింది.

కాస్సేపట్లో జ్యోతి వచ్చి, "నువ్వు కాస్త నీ కోపం తగ్గించుకోవడం నేర్చుకో. 'పరాయింటికి వచ్చినపుడు ఎలా నడచుకోవాలో కూడా నేర్పలేదా నీ కూతురికి' అని గడ్డి పెట్టింది మా అక్క" అని విసుక్కుంది.

తన్మయి ఒళ్లో ఆదమరిచి నిద్ర పోతున్న బాబు తల నిమురుతూ, ఎదురుగా ఉన్న పుస్తకం తీసింది. అలుక్కుపోతున్న అక్షరాల్ని కూడబలుక్కుంటూ చదవసాగింది.

★★★

మర్నాడు కాలేజీ సర్వీస్ కమీషన్ ఆఫీసుకి వెళ్లడానికి తయారయ్యి కిందికి వచ్చేరు.

గేటు దగ్గిరే ఎదురయ్యింది ప్రమీల.

"వెళ్లొస్తాం పెద్దమ్మా" అంది తన్మయి.

అప్పుడే బయటికి వెళ్తూ కారెక్కబోతున్న ఆవిడ భర్త వీళ్ల వైపొక చూపు విసిరి, "మెయిన్ రోడ్డు వరకు నడిస్తే ఆటోలు సులభంగా దొరుకుతాయి మీకు" అని ఉచిత సలహా ఇచ్చి, డోరు వేసుకున్నాడు.

"మధ్యాహ్నం భోజనానికి వస్తారా?" అంది ప్రమీల తన్మయి చేతిలోని ఫైలు వైపు చూస్తూ.

"అక్కడ ఎంత సమయం పడుతుందో తెలీదక్కా. ఇంత పెద్ద నగరంలో అసలు ఆ అడ్రసు కే ఎప్పుడెళ్తామో ఏమో" అంది జ్యోతి.

వెళ్లిపోయిన కారు వైపు నిరాశగా చూసి, తల్లి వైపు చూసేడు బాబు. తన్మయి అర్థమయ్యినట్లు వాడి వైపు చూసి, తన చేతిలోని పర్సు, ఫైలు తల్లికిచ్చి, వాణ్ణి ఎత్తుకుంది. పది నిమిషాల పాటు నడిచేక ఆటో స్టాండు వచ్చింది. సిటీ బస్సులో వెళ్దామంటే దారులు తెలీవాయె. పైపెచ్చు ఉదయం పది గంటలకల్లా రమ్మన్నారు. సమయం దాటి పోతుందేమో అన్న ఆదుర్దా ఒకటి.

నడుస్తున్నంత సేపు, "నడ మంత్రపు సిరి అంటారు దీన్నే. డబ్బు వచ్చేసరికి మనుషులకి మనుషులు కనబడరు. కనీసం మీ పెదనాన్న ఆటో స్టాండు వరకూనైనా దించేడు కాదు. ఈ ఎండలో పడి పిల్లాణ్ణెత్తుకుని నడుచుకుని వెళ్తున్నామన్న కనికరం కూడా లేదు...." అని గొణుగుతూనే ఉంది జ్యోతి.

తన్మయి నిర్లిప్తంగా నడవసాగింది. జీవితంలో ఎంత డబ్బు సంపాదించినా మనుషులకు విలువనివ్వడం మరిచిపోకూడదన్న పాఠమిది.

"నాన్నా, నువ్వు పెద్దాడివయ్యేక, మనం కూడా కారు కొనుక్కుంటాం. అప్పుడు మనలా నడిచే వాళ్లనందరినీ ఎక్కించుకుందాం, సరేనా?" అంది వాడి బుగ్గ నిమురుతూ.

సంతోషంగా తలూపేడు బాబు. రయ్యిన దూసుకెళ్తున్న ఆటోలో విశాలమైన రోడ్లని, ఎవరి హడావిడిలో వాళ్లు పరుగులు పెడ్తున్న మనుషుల్ని చూస్తూంటే తమ ఊరు గుర్తుకు వచ్చింది తన్మయికి. తన చిన్నతనంలో ఏదైనా ఆపదొస్తే తప్ప ఎప్పుడూ మనుషులు హడావిడిగా పరుగులు పెట్టడం చూడలేదు. బడికి వేళకి తయారయ్యి, నిదానంగా నడుచుకుని వెళ్లే దోవలో పక్కింటి అత్తయ్య గారు,మావయ్య గారు, ఎదురిటి పిన్ని గారు, బాబాయి గారు, పక్క వీధి మేస్టారు, కిళ్లీ కొట్టు రాములు.....అంతా స్థిమితంగా జీవితాల్ని గడిపేవారు. కుంపటి మీద రోజల్లా వంట అవుతూన్నట్లు కనిపించినా సమయానికి వంట సిద్ధం అయ్యేది. రోజల్లా పదో పరకో సంపాదించినా తృప్తిగా జీవితం గడిచేది.

ఇప్పుడు అందరూ నగరాలకు వలస వెళ్లిపోతున్నవారే. ఏదో తెలీని పరుగులు పెడ్తున్న వారే. ఏవుంది ఈ నగరాల్లో!? అంతులేని యాతన తప్ప!! జ్యోతి ఆటో అబ్బాయిని తనకున్న కొద్ది పాటి హిందీ భాషా పరిజ్ఞానంతో ప్రశ్నలు అడగసాగింది. మృదుల్ ఇద్దరి మధ్యా కూర్చుని నిశ్శబ్దంగా చుట్టూ పరికిస్తున్నాడు. దారిలో ఎత్తున కొండ మీద బిర్లా మందిర్ కనిపించింది.

"పూరా మార్బుల్, చూణ్ణీకి రెండు కళ్లు సాలవు" ఆటోవాలా గట్టిగా చెప్పసాగేడు.

"పున్నమి వెన్నెల్లో బిర్లా మందిర్ ని చూస్తే ఎంత బావుంటుంది! " అనుకుంటూ అప్రయత్నంగా కళ్లు మూసుకుంది తన్మయి.

ఎన్నోసార్లు శేఖర్ ని హైదరాబాదు వెళ్దామని, బిర్లా మందిర్ చూద్దామని అడిగేది.

"అసలు ఉన్న ఊరు తప్ప ఏం వూరు వెళ్ళినా ఏం వుంటుంది? డబ్బులు దండగ అని కొట్టి పడేసే వాడు."

శేఖర్ ఆలోచన రాగానే వికలమైన మనస్సుతో వెంటనే కళ్లు తెరిచింది.

★★★

దాదాపు గంట ప్రయాణం తర్వాత ఆఫీసుకి చేరేరు. సర్టిఫికేట్ల వెరిఫికేషన్ కి రెండు వందల మంది వరకు వచ్చేరు.

మూడో అంతస్థులో, "ఉస్సురంటూ" అప్పటికే ఉన్న పెద్ద లైనులో చివర నిలబడ్డారు.

లోపలికి వెళ్లి బయటకు వచ్చే వారిని లైనులో నిలబడ్డ కొందరు ఆత్రంగా ప్రశ్నలు అడగడం, వాళ్ళేవో చెపుతుంటే, "అయ్యో, నా దగ్గిర జిరాక్సు లేదు" అని బయటకు పరుగెత్తడం చేస్తున్నారు. తన్మయి అన్నీ మర్చిపోకుండా తెచ్చుకుంది. అయినా మళ్లీ ఒకసారి సరిచూసుకుంది. పక్కన ఎవరో మాట్లాడుకుంటున్నారు.

"మూడు లక్షల మంది రాత పరీక్ష రాస్తే రెండొందల మందిని ఇంటర్వ్యూకి పిలిచేరు. ఉన్నవి యాభై ఉద్యోగాలు."

తన్మయి గబగబా లెక్క వేసుకుంది. అంటే ఒక్కో ఉద్యోగానికి నలుగురు పోటీ పడ్తారన్న మాట.

"అసలు మా జోన్ లో ఉన్నవి రెండే ఉద్యోగాలు. నాకు వస్తుందన్న ఆశలేదు"

"ఈ ఇంటర్వ్యూ పద్ధతంతా బూటకమే. అన్నీ ఎప్పుడో అమ్ముడయిపోయి ఉంటాయి"

అంతకంతకూ నిరాశా జనకమైన మాటలు వినవస్తూ , లైనులోనిలబడీ నిలబడీ వస్తున్న కాళ్లు నొప్పులతో బాటూ తలపోటు కూడా తెప్పించసాగేయి.

మేరీ మాటలు జ్ఞాపకం వచ్చేయి. "నీ ప్రయత్నలోపం లేకుండా నువ్వు శ్రమించు. విజయం వస్తుందా, లేదా అనేది ముందే ఆలోచించకు."

దాదాపు మధ్యాహ్నం కావస్తుండగా తన్మయి వంతు వచ్చింది. పొద్దుటినించి బాబుని పట్టుకుని జ్యోతి సెక్షను బయట బెంచీ మీద కూచుంది. మర్నాడు వీళ్ళిద్దరిని వదిలి ఒక్కతే రావడం మంచిదనిపించింది తన్మయికి. పెద్ద పెద్ద ఫైళ్లు పేర్చి ఉన్న విడి విడి డస్కుల వెనక కూచున్న ఐదారుగురు క్లర్కులు వచ్చిన వారిని ఒకరి తర్వాత ఒకరిని పిలవసాగేరు. వరసగా పదో తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, పీజీ, సర్టిఫికేట్లు, మార్కుల లిస్టులు, ఒరిజనల్ , జిరాక్సు ... అంటూ టిక్కులు పెట్టుకుంటూ దాదాపు అరగంట నిలబెట్టేడు క్లర్కు.

"సర్టిఫికెట్లన్నీ సరిగా తెచ్చిన తన పరిస్థితే ఇలా ఉంటే, ఇక తేని వారి సంగతేంటో!"

ఇంటర్వ్యూ కి ఉదయమో, సాయంత్రమో సమయం ఏవీ చెప్పలేదు. పొద్దున్నే వచ్చి వేచి చూడవలసిందే. ఆ వారమంతా ఇంటర్వ్యూలు అవుతున్నందున ఇచ్చిన తేదీ ప్రకారం రావాలి.

తన్మయికి మర్నాడే ఇంటర్వ్యూ.

"పోనీలే, ఇదొకందుకు మంచిదే. వచ్చిన పనయ్యిపోతే తొందరగా ఊరెళ్ళి పోవచ్చు" అంది జ్యోతి.

త్వరగా ఇంటర్వ్యూ అయిపోతే వెళ్లిపోవచ్చన్న విషయం తన్మయికి కాస్త తెరిపినిచ్చింది. ఆదరం చూపించని ఎవరింట్లోనో ఉండడం చాలా కష్టంగా ఉంది మొదట. సర్టిఫికెట్ల పని కాగానే కాంటీనులో సమోసాలు తిని, ఇరానీ చాయ్ తాగేరు. బాబు పేచీ పెడుతుంటే గేటు బయట ఉన్న "పానీ

పూరీ" వైపు దారి తీసింది తన్మయి. మొదటి సారి తినడమేమో అసలు ఎలా తినాలో అర్థం కాలేదు ముగ్గురికీ. బండి వాడు తమ పాట్లు చూసి నవ్వుకోవడం గమనించింది తన్మయి. ఆ పూట మొదటి సారిగా తిన్న హైదరాబాదీ ఆహార పదార్థాలు, టీ అమితంగా నచ్చేయి తన్మయికి.

"ఉద్యోగం ఇక్కడికి దగ్గర్లో వస్తే బావుణ్ను!" తన ఆలోచనకి తనకే నవ్వు వచ్చి తల విదిలించింది.

"తథాస్తు" అన్నట్లు మసీసు లో నుంచి ప్రార్థన వినబడింది.

భాష అర్థం కాకపోయినా మనస్సులోనే తన ప్రయత్నం సఫలం కావాలని ప్రార్థించింది.

39

ఇంటర్వ్యూ నాడు ఉదయం ఆరు గంటలకే తయారయ్యింది తన్మయి. తనకి అత్యంత ఇష్టమైన తెల్లని బెంగాల్ కాటన్ చీర కట్టుకుంది. చీర అంచుకి నప్పే ముదురు ఊదా రంగు బ్లౌజు వేసుకుంది. అద్దంలో చూసుకుంటూ తిలకం బొట్టు దిద్దుకుంది. రాత్రి చదవగలిగినంతా చదివి పెందరాళే పడుకుందేమో అలసట తీరి ప్రశాంతంగా ఉన్నాయి కళ్లు. అత్యంత నిరాడంబరంగా ఉన్న తనను తాను లెక్చరర్ ఉద్యోగానికి వెళ్తున్నట్టు ఒకసారి ఊహించుకుంది. జీవితంలో మొదటి సారి లెక్చరర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్తూంది.

సిద్ధార్థ మాటలు గుర్తు తెచ్చుకుంది. "ఎదుటి వాళ్లు ప్రశ్నలు అడుగుతున్నపుడు అవతలి వారికి ఏమీ తెలియదన్నట్టు, చిన్న పిల్లలకు సమాధానం చెప్తున్నట్టు మీ మనస్సులో అనుకోవాలి. అప్పుడే ధీమాగా పాఠాలు చెప్పగలుగుతారు." అతని హాస్య చతురత గుర్తుకు వచ్చి చిన్నగా నవ్వుకుంది.

ఇప్పుడీ ఉద్యోగం తనకు వస్తుందా? రాదా? అనేది అప్రస్తుతం. కేవలం ఒక ఇంటర్వ్యూకి వెళ్తున్న అనుభవం కోసం వెళ్తూందంతే. తను అర్హురాలు కాకపోయినా తనకి ఉద్యోగం వచ్చిందంటే తన పాఠాలు వినబోయే పిల్లలకు అన్యాయం చేసినట్టే. తను నిజంగా అర్హురాలే అయితే ఈ ఉద్యోగం రాకుండా ఎవరూ ఆపలేరు. అంతే. కలగా పులగంగా కలుగుతున్న ఆలోచనలనించి తప్పించుకుని కాస్త ఊపిరి పీల్చుకునేందుకు వాటర్ ట్యాంకు ఉన్న చిన్న డాబా మీదికి వెళ్లింది.

తూర్పున సూర్యుడు ప్రపంచంలోని రాత్రుళ్ల కష్టాల్ని గట్టెక్కించడానికి కవాతు చేసుకుంటూ వస్తున్న వీర జవాన్ల లాంటి కిరణాలతో వేగంగా ముందుకు కదలసాగేడు. తమ ఊళ్లో కనిపించే పక్షుల కిలకిలా రావాలు లేవు. రేడియో నించి వినవచ్చే సుప్రభాతాలు లేవు. ఆరు బయట నిద్రిస్తున్న వారు లేరు. దూరాన ఇళ్లలోకి పేపర్లు విసురుతూ వస్తున్న సైకిలు కుర్రాడు మధ్యలో ఒక్కో ఇంటి దగ్గిర ఆగి పాలపేకెట్లు బయట గేటుకి కట్టి ఉన్న సంచుల్లో వేస్తున్నాడు. ఇళ్లలో అంతా అప్పటికే లేచి స్కూళ్లకి పిల్లల్ని తయారు చేస్తూనో, ఆఫీసులకు తయారవుతూనో ఉన్నట్టు కుక్కరు విజిల్సు వినవస్తున్నాయి. కాఫీ కప్పులతో పేపరు తిరగేస్తూ ఒకరో ఇద్దరో అక్కడక్కడా డాబాల మీద తిరుగుతున్నారు. మహా నగరాల లక్షణమన్నట్లు పెద్ద మేడలు, ఆ పక్కనే మధ్య తరగతి ఇరుకు గదులు, చిన్నపాటి ఖాళీ స్థలాల్లో డేరా ల బతుకులు... అన్నీ అక్కడక్కడే కానవస్తూ ఉన్నాయి.

పనమ్మాయి కింది నించి కాఫీ కోసం పిలిచింది.

జ్యోతి ముఖం కడుక్కుంటూ "ఏమ్మా, అప్పుడే తయారయిపోయేవా?" అంది ఆశ్చర్యంగా.

"కాస్త ముందే వెళ్తానమ్మా. ఇవేళ బస్సుల్లో వెళ్తాను. ఎలాగూ ఒక్కదాన్నేగా డబ్బులు కలిసొస్తాయి." అంది తన్మయి.

వదులుగా, పొడవుగా ఉన్న తన్మయి జడని అబ్బురంగా చూస్తూ పనమ్మాయి "ఏం పెడతావు యెంట్రుకలకి?" అంది.

జ్యోతి నవ్వుతూ, "ఇప్పుడేంటి, ఇంకా చిన్నపుడయితే మోకాళ్ల వరకూ ఉండేది మా అమ్మాయి జుట్టు" అంది.

బయటికి వెళ్తూ గేటు తీస్తున్న తన్మయికి వెనక నించి ఎవరో చూస్తున్నట్లు అనిపించింది. యథాలాపంగా వెనక్కి తిరిగింది.

అద్దెకున్న పోర్షను నించి దాదాపు తన తండ్రి వయసున్న వ్యక్తి తనని అదే పనిగా చూస్తున్నాడు. తన్మయి వెనక్కి తిరగడం చూసి చప్పున చేతిలో ఉన్న పేపర్లో తల దూర్చేడు. తన్మయి పమిట చెంగుని చప్పున చుట్టూ కప్పుకుని, వడివడిగా నడిచింది. అవకాశం కోసం చూసే మగకళ్లని పసిగట్టలేని పసిపిల్లేం కాదు తను.

"ఛీ..ఛీ.." అని అసహ్యించుకుంది.

"నీ ఇంటర్వ్యూ రేపు అయిపోతే ఎల్లుండి సాయంత్రం బండికి బయలుదేరాలి మనం" అంది ముందు రోజు రాత్రి తల్లి.

" రేపు సాయంత్రం కాదు, ఉదయానే పాసింజరు రైలు లోనైనా సరే వెంటనే బయలుదేరాలి ఇక్కణ్ణించి" దృఢంగా అనుకుంది తన్మయి.

రెండు బస్సులు మారి కాలేజ్ సర్వీస్ కమీషను ఆఫీసుకి చేరేసరికి ఇంకా గంట టైము మిగిలింది తన్మయికి. గేటు బయట ఒక టీ కొనుక్కుని తాగింది. తనలాగే ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళు ఒకరిద్దరు తమలో తాము మాట్లాడుకుంటూ ఇంటర్వ్యూలలో జరిగే అన్యాయాలు చెప్పుకుంటున్నారు.

"ఎంత బాగా సమాధానాలు చెప్పినా, ఇంటర్వ్యూ ఎంత బాగా చేసేమనిపించినా, నువ్వు మంత్రిగారికి చుట్టమైతేనో, లంచం సమర్పిస్తేనో మాత్రమే ఇలాంటి ఉద్యోగాలు వస్తాయి"

"మొన్నీ మధ్య మా ఊరి వాడు గ్రేడు-4 ఉద్యోగం కోసం పొలం అమ్మేసేడు. లంచం ఇచ్చినా పని జరగ లేదు. ఉద్యోగం రాలేదు సరికదా, పొట్టకి ఆధారమైన పొలం కూడా పోయింది."

నడుస్తూ ఆలోచించసాగింది. "అంటే తనలాగా స్వశక్తి మీద ఆధార పడిన వాళ్లకి గవర్న మెంటు ఉద్యోగాలు రావా?"

కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం "లంచాల్ని నిర్మూలిస్తాం" అని ప్రకటన చేసింది.

ముఖ్యమంత్రికి అంతా భయపడి స్ట్రిక్టుగా నడచుకుంటున్నారని వార్తలు వింది.

"అదే నిజమైతేనో! లేదా తను విన్న కథలు అబద్ధం అయితేనో!" మనసుకి సర్ది చెప్పుకుంటూ చుట్టూ చూసింది.

పొడవైన వరండాలో లైనులో కూచున్న వాళ్లలో టెన్షనుతో కాళ్లూపుతున్న వాళ్లు కొందరు. కళ్లు మూసుకున్న వాళ్లు కొందరు. అనవసర పరిచయాలు చేసుకుంటూ, ఆరాలు తీస్తున్నవారు కొందరు. మొత్తానికి అక్కడ కూచున్న వాళ్లందరూ ఆందోళనతో చెమటోడుతున్న వాళ్లే.

తన్మయి కళ్లు మూసుకుంది "అజ్ఞాత మిత్రమా! ఇంత కాలం నాకు నువ్వే మార్గదర్శి వై నడిపించావు. నువ్వు చెప్పు. నా జీవిత గమనం ఎటు మారనుందో. నీ ఆజ్ఞను శిరసావహిస్తాను".

"తన్మయీ" పరిచయమైన గొంతుకి కళ్లు విప్పి చూసింది. ఎదురుగా ప్రభు.

"అరే, మీరేంటి ఇక్కడ?" అంది ఆశ్చర్యంగా.

ఆంధ్రా యూనివర్శిటీలో కిందటి సారి ప్రభుని చూసినప్పుడు తను ఎం.సి.ఏ చేసి హైదరబాదులో ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నానని చెప్పడం స్పష్టంగా గుర్తుంది.

ప్రభు ఏదో చెప్పేలోగా, తనే మళ్లీ "మీరూ ఇంటర్వ్యూకి వచ్చేరా?" అంది.

తల అడ్డంగా ఊపుతూ "అహహ, మనకంత సీను లేదు లెండి" అన్నాడు.

అతని భాష విని తన్మయికి చప్పున నవ్వొచ్చింది. అయినా అంతా ఈ మధ్య అలాగే మాట్లాడుతున్నారు.

"అంత లేదు", "అంత సీను లేదు" అంటూ సినిమాల భాషలో.

మాస్ మీడియాని బొత్తిగా ఇష్టపడని తనకి ఇదంతా కొత్తగానూ, వింతగానూ ఉంటుంది.

ఇంతలో "అదుగో" అంటూ తన మిత్రుడెవరో కూచున్నవైపు దూరంగా చూపించేడు అతనికోసం వచ్చేనన్నట్టు.

పక్కనే కూచుంటూ, "అయినా నాకు గవర్న మెంటు ఉద్యోగాలు పడవు తన్మయీ. ప్రయివేటు కాలేజీలో కంప్యూటరు ఇన్స్ట్రక్టర్ గా చేరేను." అని నవ్వేడు.

తన్మయి అన్యమనస్కంగా తలూపింది.

"మీ ఇంటర్వ్యూ కానివ్వండి, కింద కాంటీనులో కలుద్దాం" అని లేచేడు.

ఇంటర్వ్యూ ఉదయం బ్యాచ్ లోనే కావడం తనకు ఒక విధంగా మంచిదే. మిగతా రోజంతా స్థిమిత పడొచ్చు. అనుకుంటూ

"అలాగే. నా పేరు మరో ఇద్దరి తర్వాత ఉంది. కాగానే వస్తాను" అంది.

ఒక్కొక్కళ్లకి అరగంట సమయం పడుతూంది. అన్ని సబ్జెక్టులకీ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ప్రత్యేకించి తెలుగుకి రెండు గదుల్లో జరుగుతున్నాయి. ఎటైనా తనని మరో అరగంటలో పిలవొచ్చు.

తన పేరు వినబడే సరికి అప్పటి వరకూ ఉన్న ఏదో సన్నని ఆందోళన మాయమయ్యి చిత్రంగా 'ఏదేమైనా సరే' అనే తెగింపు కలిగింది.

గదిలోకి అడుగు పెడ్తూనే వినమ్రంగా నమస్కరించింది. తనని చూస్తూనే మంచి అభిప్రాయం కలిగినట్లు తలలు ఊపేరు మధ్యలో కూర్చున్న ఇద్దరూ. పొడవాటి గది, ఒక పక్కగా పెద్ద టేబుల్, ఆ వెనకగా కూర్చుని నలుగురు, వారికి కాస్త ఎడంగా మరొక టేబుల్ దగ్గిర మరొకాయన. అంతా రిటైర్మెంటు దగ్గర పడ్డట్టు తలలు నెరిసిన వారే. గదికి మరొక వైపు గోడకి బ్లాక్ బోర్డు, రంగు చాక్ పీసులు ఉన్నాయి.

ముందుగా ఒకాయన "నీ పేరేంటమ్మా?" అని అడిగేడు.

సమాధానం విని "ఊ.. మంచి పేరు" అన్నాడు.

ఇంకొకరు ఊరు, మరొకరు విశ్వవిద్యాలయం వివరాలు.. చకచకా ప్రశ్నలు అడగ సాగేరు ఆలస్యం కాకూడదన్నట్టు. తన్మయి ఒకరి వైపు తిరిగి సమాధానం చెప్తూండగనే రెండో ప్రశ్న వినిపించసాగింది. వాళ్లు ప్రశ్నలడుగుతూంటే ఎవరో కొత్తవారిని పరిచయం చేసుకుంటున్నట్లు అనిపించి హుషారుగా మాట్లాడసాగింది తన్మయి.

ఎమ్మే లో చదివిన ప్రత్యేక సబ్జెక్టుల గురించి ప్రశ్నకు సమాధానం చెప్తూండగా దానిననుసరించి మరొకరు అడుగుతున్న విధానాన్ని బట్టి అన్నీ ముందుగా తయారు చేసుకున్న ప్రశ్నలు కాదని ఇట్టే గ్రహించింది తన్మయి.

"అటు వైపు వారు మీకు విద్యార్థులనీ, వారికేమీ తెలియదని అనుకుని నిర్భయంగా సమాధానాలు చెప్పెయ్యండి" అన్న సిద్దార్థ మాటలు చప్పున స్ఫురణకు వచ్చేయి.

అయినా సరయిన సమాధానాలే చెప్పసాగింది. ఆలోచించుకోకుండా అడిగిన వెంటనే తడుముకోకుండా సమాధానాలు చెప్తున్న తన్మయిని అభినందిస్తూ , "భేష్" అన్నాడు అందరికీ ఎడంగా కూర్చున్న పెద్దాయన. అంతా ఆయన వైపు చూసేరు.

లేచి పక్కనే ఉన్న ఫ్లాస్కు లోంచి కాఫీ ఒంపుకుంటూ "ఇక నేను విశ్లేషణాత్మకమైన ప్రశ్న అడుగుతాను." అన్నాడు.

తన్మయి అత్యంత శ్రద్ధగా ప్రశ్న విని, సమాధానం చకచకా చెప్పడం మొదలు పెట్టింది. అరచేతుల్ని కదుపుతూ తన్మయి సమధానం చెప్తున్న విధానాన్ని ఆసక్తిగా విన్న అంతా సంతృప్తిగా తలలాడించేరు. వరసగా వ్యాకరణం, సంస్కృతం, ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం, భాషా శాస్త్రం, ప్రక్రియలు, ధోరణులు ఒక్కో సమాధానం చెప్తున్న కొలదీ తన్మయికి తెలియని ఆనందం కలగసాగింది. పద్యం దగ్గరికి వచ్చేరు చివరికి.

"పద్యాన్ని రాగ యుక్తంగా కాకుండా, భావ యుక్తంగా చెపుతాను" అని జంకూ గొంకూ లేకుండా చెప్పింది.

అనుమతి ఇవ్వంగానే లేచి నిలబడి, పద్యాన్ని వాక్యం చదువుతున్నట్టు చక్కగా విరిచి చెప్తున్న తన్మయి వైపు అబ్బురంగా చూసేరు.

తన్మయి చేత్తో తెచ్చిన ఫైలుని తిరిగి తన చేతికిస్తూ "మంచిదమ్మా, వెళ్ళిరా" అన్నారు.

అందరి ముఖాల్లో అభినందనాత్మక చిరునవ్వు స్పష్టంగా కనిపించింది. ఇంటర్వ్యూ బాగా చేసిన చక్కని సంతృప్తి కలిగింది తన్మయికి. అదే తనకి గెలుపుతో సమానం. బయటకు రాగానే తన్మయికి మనస్సు హాయిగా తేలిగ్గా అనిపించింది. అనుకున్నదానికంటే వందరెట్లు ఎక్కువ బాగా జరిగినట్లనిపించింది ఇంటర్వ్యూ.

"ఇక ఉద్యోగం వస్తుందా, రాదా అని ఆలోచించడం మానెయ్యొచ్చు, ఈ అనుభవమే చాలు."

అదే చెప్పింది ప్రభుతో కేంటీన్లో.

"మీరు భలే అల్ప సంతోషులు, కానీ అనుకున్నది సాధించే పట్టుదల కలవారు. ఇలాంటి రెండు విభిన్నమైన లక్షణాలు ఒకే వ్యక్తిలో ఉండడం బహుశా: చాలా అరుదు" అన్నాడు మెచ్చుకోలుగా.

"నా సంగతి అలా ఉంచండి. మీ విషయాలు చెప్పండి" అంది తన్మయి.

"నాదేముంది. చదువుకున్నన్నాళ్లూ సీట్లు వస్తాయో, లేదో అన్న బాధ, చదువయ్యాక ఉద్యోగం గురించిన బాధ. ఇక ఇప్పుడు..." అని తల అడ్డంగా ఊపి "వద్దులెండి. నా బాధలు చెప్పి మీకు బాధ తెప్పించడం నాకు ఇష్టం లేదు." అన్నాడు నవ్వుతూ.

హాయిగా నవ్వుతూ, కులాసాగా మాట్లాడుతున్న అతని వైపు చూస్తూ, "మీరు ఏకరువు పెట్టినవేవీ గొప్ప బాధలేం కాదు" అంది.

తన్మయి ముఖంలో ఒక్క క్షణం కదలాడిన విషాదం గమనించి భృకుటి ముడేస్తూ, "మీరు... మీరు ఏదయినా సమస్యల్లో ఉన్నారా?" అన్నాడు ఆదుర్దాగా.

తన్మయి అవునూ, కాదన్నట్టు తలాడించింది.

"నేను మిమ్మల్ని యూనివర్సిటీ లో చూసినప్పుడే అనుకున్నాను. మీరేదో బాధల్లో ఉన్నారని. కానీ అక్కడే అడిగే ధైర్యం చాలలేదు. ఇప్పుడు చెప్పండి. నేను మీ సమస్యల్ని ఆర్చలేకపోయినా. తీర్చలేక పోయినా అర్థం చేసుకోగలను. కానీ మీకు చెప్పాలనిపిస్తేనే చెప్పండి. లేకపోతే వద్దు" అన్నాడు.

"మీకు చెప్పకూడనిదేమీ కాదు. ఇప్పుడు అతనితో విడిపోయాక నా సమస్యలు తగ్గేయి." అని, చుట్టూ గందరగోళంగా ఉన్న ఆ చోట ఇక ఏమీ చెప్పాలనిపించక, "తర్వాతెప్పుడైనా వివరంగా చెపుతాను ప్రభూ!" అంది చెయ్యి కడుక్కోవడానికి లేస్తూ.

"అయామ్ సారీ తన్మయీ" అన్నాడు.

"సారీ అవసరంలేదు. ఇప్పుడు హాయిగా ఉన్నాను" అంది.

బయటికి వచ్చేక వాతావరణాన్ని తేలిక చేస్తూ , "బిర్లా మందిర్ చూస్తారా?" అనడిగేడు.

ఆశ్చర్యంగా చూసింది తన్మయి. "బిర్లా మందిర్ తనెప్పటి నుంచో చూడాలని అనుకుంటున్నదని ఇతనికెలా తెలుసు?"

అదేమీ పట్టనట్లు ప్రభు చిన్నగా నవ్వి, "మీరు ఇంతకు ముందు చూసి ఉండక పోతే దగ్గర్లో చూడాల్సిన మంచి ప్రదేశం. మీకు సమయం ఉంటేనే.." అన్నాడు.

సిటీ బస్టాండు వైపు అడుగులేస్తూ హైదరాబాదు గురించి చెప్పడం మొదలు పెట్టేడు.

"ఈ నగరానికి మొదటగా వచ్చినపుడు ఎక్కడికెళ్ళాలన్నా, ఏ బస్సులు పట్టుకోవాలో తెలియక గందరగోళంగా ఉండేది. ఇప్పుడంతా కొట్టినపిండి లెండి. పట్టుబట్టి ఊరు చూడడమే పనిగా పెట్టుకుని ఆదివారాలు తిరుగుతూ అర్థం చేసుకోవడం మొదలు పెట్టేను. కాగితమ్మీద ప్రణాళిక రాసుకుంటే ఏదయినా చాలా సులభం." అన్నాడు.

"చిత్రంగా నాక్కూడా ఇలా కాగితాల మీద ప్రణాళికలు రాసుకునే అలవాటుంది ప్రభూ" అంది.

తన్మయి వైపు ప్రశంసా పూర్వకంగా చూసి,"ఈ ఊళ్ళో చారిత్రాత్మకమైన ప్రదేశాలు, చూసి తీరవలసినవి చాలా ఉన్నాయి. మీరు ఎంత వరకూ ఉంటున్నారు?" అన్నాడు.

తన్మయి సమాధానం విని, "అయ్యో, రేపేనా? రెండ్రోజులుండొచ్చుగా" అన్నాడు.

అతని మాటలకి నవ్వొచ్చింది తన్మయికి.

"పొద్దున్న అతను కాకతాళీయంగా సర్వీస్ కమీషను ఆఫీసులో కలిసే వరకు తనిక్కడ ఉన్నట్లు కూడా అతనికి తెలీదు. ఇప్పుడేమో ఇలా."

మాటల్లోనే బస్టాండుకి చేరుకున్నారు.

కిక్కిరిసిన హైదరాబాదు బస్సుల్లో ఎక్కడం, దిగడం కూడా కష్టమే.

చప్పున కదిలిపోతున్న సిటీ బస్సులో ముందు వైపు ఎక్కలేక పోయింది తన్మయి. అప్పటికే వెనక ఎక్కిన ప్రభు చెయ్యి అందించేడు. అదంతా చాలా మాములుగా జరిగినా, పట్టుకున్న చేతిని వదలడం ఇష్టం లేనట్లు అతను మరొక్క క్షణం ఎక్కువ తీసుకున్నపుడు ఆ కళ్ళలో ఆరాధనా భావం స్పష్టంగా కనబడింది. తన్మయి చప్పున కళ్లు దించుకుని ముందుకు కదిలి ఆడవాళ్ల సీట్ల వైపు నడిచింది.

బస్సు బిర్లా మందిర్ కు చేరే వరకు వెనక్కి తిరిగి చూడలేదు. అయినా ప్రభు తనవైపు చూస్తున్నట్లు అనిపించసాగింది.

ఇంటర్మీడియేట్ చదివే రోజుల్లో ఎప్పుడూ ప్రభుతో సరిగా మాట్లాడిన జ్ఞాపకం కూడా లేదు. కానీ అతని ముఖంలో తనని చూసినప్పుడల్లా ఎందుకో అమితమైన ఆనందం గోచరిస్తూ ఉంది.

అసలు చిన్నప్పుడు తనతో చదివిన వాళ్లెవరితోనూ తానెన్నడూ స్నేహం చేసి ఎరగదు. తన బాల్యం అంతా ఎందుకో ఒంటరిగా గడిచిపోయింది. వనజ తప్ప తనకు ఎవరూ స్నేహితులు ఉండేవారు కాదు. ఇక యవ్వనం ఎప్పుడూ జీవితం పట్ల ఊహల్లోనూ, కలల్లోనూ.. శేఖర్ తప్ప మరొకరి గురించి ఆలోచన లేకుండా గడిచి పోయింది. ప్రభు చాలా సంవత్సరాల తర్వాత యూనివర్సిటీ లో కనబడినప్పుడు అతని ఆనందాన్ని తను చాలా మామూలుగా తీసుకుంది. కానీ ఇప్పుడు అర్థమవుతూ ఉంది అతను తనని చదువుకున్నప్పటి నించీ ఆరాధిస్తున్నాడని. అతను ఆ విషయాన్ని అప్పుడూ చెప్పలేదు, ఇప్పుడూ చెప్పలేదు. కానీ స్పష్టంగా అర్థం అవుతూ ఉంది.

చప్పున కరుణ జ్ఞాపకం వచ్చేడు. మనసంతా బాధ మెదిలింది.

"జరిగిన చేదు అనుభవాలు చాలు. ఈ విషయాన్ని ఇంతటితో ఆపాలి. ఇలాంటివి తనకి ఇష్టం లేదని ఇతనితో గట్టిగా చెప్పాలి." అనుకుంది తన్మయి.

## 40

తెల్లారగట్ల రైలులో విశాఖ పట్నానికి తిరిగొచ్చింది తన్మయి. భానుమూర్తిని కనిపెట్టుకుని ఉన్న నరసమ్మ చెల్లెలికి ఒంట్లో బాగోకపోవడంతో జ్యోతి రాజమండ్రి స్టేషనులో దిగి ఇంటికి వెళ్లిపోయింది. రైలు స్టేషనులో ఆగగానే తమ తమ వారి కోసం వచ్చిన వాళ్ల పలకరింతలతో చుట్టూ హడావిడి

చుట్టుముట్టింది. తన కోసం ఎవరు రారని, ఎవరు లేరని తెలిసినా తన్మయి మనసు బాధనలుముకుంది. ఈ నగరం తన కలల్ని నిలబెట్టినా, తన జీవితాన్ని ఛిద్రం చేసింది.

ఆటోలో బాబుని పొదువుకుని కూచుంది తన్మయి. తెల తెలవారుతున్న చలిగాలి ఆలోచనల్ని చల్లబరుస్తూ అత్యంత ఆహ్లాదంగా వీచసాగింది.చల్లగాలి మేను తాకగానే సముద్ర తీరం చుట్టి రావాలని అనిపించింది తన్మయికి. అనుకున్నదే తడవుగా స్కాలర్స్ హాస్టలు దగ్గర దిగడం మానేసి, ఆటో వాలా ని రామకృష్ణా బీచ్ కు పోనివ్వమని చెప్పింది.

కాస్త ఆశ్చర్యంగా చూస్తున్న అతనితో, "మళ్లీ ఇక్కడికే రావాలి చినవాల్తేరు మీదుగా" అంది.

పొద్దుటే మబ్బు ముసురుకుని కెరటాలు ఉవ్వెత్తున ఎగిసి పడ్తున్నాయి. రాత్రి చేపల వేటకి వెళ్ళిన పడవలు తిరిగి తిరిగి అలిసిపోయి ఒడ్డున ఇసుకలో ఒగురుస్తూ చతికిలబడినట్లు నీళ్లోడుతున్నాయి. వలల్ని విడదీస్తూ, దులుపుతూ జాలర్లు బతుకుని భుజాలకెత్తుకుంటున్నారు. సముద్ర తీరాన పొడవుకీ కట్టి ఉన్న చప్టా మీద నడుస్తున్న ఒకటీ అరా మనుషుల్ని దాటుకుంటూ ఆటో రయ్యిన దూసుకుపోసాగింది.

"కాస్త నెమ్మదిగా వెళ్దాం" అంది తన్మయి నిద్రపోతున్న బాబుని సర్దుకుంటూ.

స్వేచ్ఛా విహంగంలా తనకి ఎప్పుడు ఏం చెయ్యాలనిపిస్తే అది చెయ్యగలిగే జీవితం! ఆ ఆలోచన రాగానే తన్మయికి మనస్సంతా హాయి నిండింది. ఒకప్పుడు అన్నిటికీ ఆంక్షలు, అదుపాజ్ఞలు. తల్లి దండ్రులు సంరక్షణ పేరుతో ఆడపిల్లగా పుట్టడమే ఒక శిక్ష అన్నట్టు పెంచేవారు. ఇక భర్త సరేసరి. తనని అన్ని విధాలా అణచి వేసేడు. అంతకు ముందు అంతో ఇంతో ఆహ్లాదమైన జీవితం పెళ్లి అనే కూపంలో ఇరుక్కుని ఊపిరి సలపనట్టయ్యింది. దారిలో విరిగి పడి ఉన్న అప్పూఘర్ శకలాల్లో ఒకప్పటి తనలాగే తుప్పుపట్టిన మేరీ గో రౌండ్ ని చూసి తల తిప్పుకుంది తన్మయి.

ఇప్పుడు తనొక స్వేచ్ఛా విహంగం. తన్మయికి మనసంతా కట్లు తెంచుకున్న పావురాయిలా తేలికై, గాలి వాటున సీతాకాకోక చిలుకలా పైకి లేచి, గూడ బాతులా వాలి సముద్రపు నురుగు పూసుకుని అలల కెరటాల మీద గిరికీలు కొట్టింది.

-----

హాస్టలుకి రాగానే మేరీ ఆప్యాయంగా కాఫీ తీసుకు వచ్చింది. "ప్రయాణం బాగా జరిగిందా?" అంటూ.

"ఈ ప్రయాణం లో చుట్టాలంటూ ఎవరింటికో వెళ్లి ఉండడం తప్ప అన్నీ బాగానే జరిగినట్టే"

అదే చెప్పింది మేరీతో.

"నిజమే, తన్మయీ. జీవితంలో అన్నీ బాగానే జరుగుతున్నపుడు మన చుట్టూ ఉన్న మనుష్యులతో ఏ సమస్యలూ ఎదురవ్వవు. మనకే తెలీకుండా మన జీవితాలు అల్లకల్లోలమైనా ఈ సమాజం సానుభూతి చూపించదు. సమూహంలో మనలాగా ఒంటరి స్త్రీల కి జరిగే అవమానాలు ఇంతా అంతా కాదు. అందుకే నేను ఎప్పుడూ చుట్టాలు, బంధువులంటూ ఎవరింటికీ వెళ్లకూడదని ఎప్పుడో నిర్ణయించుకున్నాను. అప్పటి నించీ మనశ్శాంతిగా ఉన్నాను. అవన్నీ సరే గానీ త్వరగా రెడీ అవ్వు. నువ్వు ఇంటర్వ్యూ బాగా చేసినందుకు గాను, ఇవేళ బయటెక్కడైనా టిఫిన్ చేయడానికి వెళ్దాం" అంది.

బదులుగా "గవర్నమెంట్ లెక్చరర్ పోస్టుకి రిజల్ట్సు ఎప్పుడు వస్తాయో ఎవరికీ తెలియదు. ముందు అర్జంటు గా హాస్టలు ఖాళీ చేసి అద్దె గదికి మారాలి మేరీ" అంది తన్మయి.

"అలాగే. నువ్వు ఏదైనా సమస్యని పరిష్కారించే వరకూ విశ్రమించవు కదా. అట్నించి అటే దివాకర్ వాళ్లింటికి వెళ్లి, రేపే ఇంట్లో చేరుతావని చెప్దాం." అంది మేరీ నవ్వుతూ.

దివాకర్ తల్లి సాదరంగా ఆహ్వానించింది తన్మయిని.

"యూనివర్శిటీ లో పీ. ఎచ్. డీ లో జాయినయ్యిన కొద్ది రోజుల్లోనే లెక్చరర్ పోస్టుకి కూడా ఇంటర్వ్యూ చేసొచ్చావంటే నీకు తప్పకుండా గవర్నమెంటు ఉద్యోగం వచ్చేస్తుందమ్మా"

అంది మన:స్ఫూర్తిగా ఆశీర్వదిస్తూ అందావిడ.

"మీ ఆశీస్సుల వల్ల అదే జరిగితే మా తన్మయి అంత అదృష్టవంతురాలు ఇంకొకరు ఉండరు." అంది మేరీ.

బాబు పరిచయంగా ఆడడం మొదలు పెట్టేడు.

ఆవిడ దివాకర్ తండ్రి ని పిలిస్తూ, "ఏవండోయ్, మీకు మనవడొచ్చాడు" అంది.

సాయంత్రం సామాన్లతో వస్తానని చెప్పి సెలవు తీసుకుంది తన్మయి.

ఆటోలో తిరిగి వస్తున్నపుడు, "నీ మంచితనమే నిన్ను కాపాడుతూంది తన్మయీ. నీ పరిస్థితిని అర్థం చేసుకోవడమే కాకుండా, వాళ్లింట్లో అంతా నిన్ను వాళ్ల అమ్మాయిలా ఆదరిస్తున్నారు. ఎక్కడికక్కడ రాబందుల్లా పీక్కు తినే ఈ పాడు ప్రపంచంలో అరుదుగా ఉండే వీళ్ల లాంటి మంచి వాళ్లు కొందరు నీకు దన్నుగా నిలబడడం నీ అదృష్టం" అంది మేరీ సంతోషంగా.

బదులుగా మేరీ చేతిని తన చేతిలోకి తీసుకుని, "నాకు నువ్వు దొరికినట్టు" అంది తన్మయి.

-------

అంతా అంటున్నట్టుగానే గవర్నమెంటు ఉద్యోగాల ఎంపికల విషయంలో అవక తవకలు జరుగుతున్నాయని కొందరు కోర్టుని ఆశ్రయించారని, ఆ కేసులు తేలేంత వరకూ సెలక్షను లిస్టు తెమలదని పేపరులో ఆ మర్నాడు వార్త వచ్చింది.

ఇక ఆ ఉద్యోగం విషయం మరిచి పోవల్సిందేనని తోచింది తన్మయికి. బాబుని దగ్గర్లోని స్కూలులో చేర్పించింది. పొద్దుటే బాబుని దించడానికీ, సాయంత్రం తీసుకొచ్చుకోవడానికీ మధ్య ఉన్న సమయం రీసెర్చికి చక్కగా సరిపోతుంది. ఆదివారాలు రోజల్లా బాబుతో ఆడుకోవడానికే కేటాయించసాగింది. ఒడుదుడుకులన్నీ చక్కబడి కాస్త జీవితం కుదుటన పడింది తన్మయికి.

ఆ రోజు బాబుని స్కూలు నించి తీసుకుని ఇంటికి వస్తూనే గేటు తెరిచే సరికి అరుగు మీద కుర్చీలో తమ కోసం ఎదురుచూస్తూ శేఖర్ తల్లి కనబడింది. తన్మయికి ఆశ్చర్యం వేసింది. ఇంత తొందరగా వీళ్లకు తన అడ్రసు తెల్సిపోయిందంటే ఎవరో తనను ఎప్పుడూ గమనిస్తున్నారన్నమాట. వీళ్లు ఇలా తనని వెంబడిస్తూ తన మానాన బతక నివ్వకుండా చేస్తున్నారు. ఒక్కసారిగా నిస్సత్తువ ముంచుకు వచ్చింది తన్మయికి.

అప్పటికే దివాకర్ తల్లి కాఫీ ఇచ్చినట్టుంది ఆవిడకి.

తమని చూస్తూనే "వచ్చేరామ్మా" అని ముఖం నిండా నవ్వు పులుముకుంటూ ముందుకు వచ్చింది దేవి.

తన్మయి ముభావంగా చూసింది ఆవిడ వైపు. బాబుని చెయ్యి చాచి పిలుస్తూ ఒళ్లో కూచో బెట్టుకుంది.

తన్మయి తాళం తీయగానే లోపలికి వచ్చి, "ఏవిటీ, ఒక్క దానివే ఉంటన్నావా?" అంది.

తన్మయి చురుగ్గా చూసేసరికి, "అదే మీ అమ్మా, నాన్నా నీతో ఉన్నారనుకున్నాం" అంది.

తన అమ్మా, నాన్నా ఊళ్లో ఉంటారన్న సంగతి తెలిసే ఆవిడ కావాలని అడిగిందన్న సంగతి తనకు తెలీదా?

"ఏవిటో రాత, మా పెద్ద మనవడు వీడు. అందరం వీడి మీద ప్రేణాలు పెట్టుకున్నాం. చివరికి ఇలా అయ్యింది" అని నిట్టూర్చింది.

ఆవిడ ఏం మాట్లాడినా, తన్మయి విననట్టే ఊరుకుంది. అసలు ఆవిడ ఉనికే తనకి దుర్భరంగా ఉంది. కోర్టు తండ్రికి ఎప్పుడయినా చూడగలిగే అవకాశం ఇచ్చింది. అదే అదనుగా తీసుకుని అతని వాళ్లంతా ఇలా వచ్చేటట్టు ఉన్నారు. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు తన్మయికి. రెండు గదులలో వెనక గదిలోకి వెళ్ళిపోయి తలుపు వేసుకుంది.

ముందు గదిలో ఆవిడ బాబుతో ఓ గంట సేపు ఏవేవో మాట్లాడి "వెళ్లొస్తానమ్మా" అని కేకేసింది.

పక్క గదిలో తన్మయికి వినబడుతూనే ఉన్నాయి.

"మీ నాన్న నీకోసం బెంగట్టిపోతన్నాడురా బాబూ"

"మీ అమ్మ స్థిరమైనదైతే మనకీ పాట్లొచ్చేవి కావు"

"ఎవరైనా వొస్తన్నారా మీ ఇంటికి?"

తన్మయికి రక్తం ఉడికిపోతూ ఉంది ఆ మాటలకి.

"చిన్న పిల్లాడితో మాట్లాడుతున్నానన్న ఇంగిత జ్ఞానం ఉందా ఆవిడకి?"

ఆవిడ తమ్ముడు స్కూటర్ మీద వచ్చి గేటు బయట హారను మోగించేడు. తన్మయికి మహా చికాకు వేసింది.

దివాకర్ తల్లితో, ఏదో పెద్ద ప్రేమ ఒలికిపోతున్నట్టు "కాస్త చూస్తూండండీ" అని రాగం తీసి బయలుదేరిందావిడ.

వీళ్లు కనబడుతున్న ప్రతీసారీ శేఖర్ తనకి చేసిన అన్యాయాలన్నీ వరసగా గుర్తుకు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్నించి తప్పించుకోవడానికి ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. దు:ఖం తన్నుకొచ్చింది తన్మయికి. మంచానికి అడ్డం పడి కుమిలి కుమిలి ఏడవసాగింది. బాబు ఏదో అర్థమైన వాడిలా వచ్చి తల్లి తల నిమిరేడు.

-------

ఎప్పటికి పరిష్కారమవుతుందో అనుకుంటున్న సర్వీసు కమీషను కేసు రెండు నెలల్లోనే తేలిపోయింది.

ఆ సాయంత్రం జ్యోతి ఫోను చేసింది.

దివాకర్ పరుగున వచ్చి చెప్పేడు.

ఎప్పుడూ తన్మయే ఎస్ టీ డీ బూత్ నించి చేస్తుంది. తనంతట తానుగా తల్లి హఠాత్తుగా ఎందుకు ఫోను చేసిందో అర్థం కాక, భయంగా పరుగెత్తింది తన్మయి. అట్నించి జ్యోతి సంతోషంతో ఒగురుస్తూ "నీకు ఉద్యోగం వచ్చిందని ఉత్తరం వచ్చిందమ్మా" అంది.

తన్మయికి వింటున్నది నిజమో, కాదో అర్థం కాలేదు.

"నిజమా అమ్మా, నిజమా అమ్మా" అని అంటూండగానే బుగ్గల మీదికి వెచ్చని కన్నీరు ఉబికింది తన్మయికి.

"రేపు ఆదివారం ఇంటికి వస్తానుండు" అని మాత్రం అనగలిగింది.

తనకి జే.ఆర్ ఎఫ్ వచ్చినా తల్లికి అంత ఆనందం కలగలేదు ఎందుకో మరి! చాలా నిర్లిప్తంగా "ఓహో" అంది అప్పుడు. ఆ విజయం అర్థం కాకో, పరిశోధన తర్వాత ఏం చేస్తుందనే ప్రశ్నకి సమాధానం లేకపోవడం వల్లనో. ఇప్పుడు మాత్రం తల్లి గొంతులో అత్యంత సంతోషం తాండవించడాన్ని గమనించింది. గవర్నమెంటు ఉద్యోగం అంటే సహజమైన గొప్ప విలువ వలన కావచ్చు.

ముందుగా మాస్టారి ఇంటికి పరుగెత్తుకెళ్లింది తన్మయి. కాళ్లకి సంతోషంతో నమస్కరించింది.

"నా ప్రమేయం ఏవుందమ్మా, అంతా నీ ప్రతిభ, నీ కొడుకు చేసుకున్న అదృష్టం, శుభంభూయాత్" అని ఆశీర్వదించారు మాస్టారు.

ఆయన శ్రీమతి గుప్పెడు పంచదార తెచ్చి నోట్లో పోసింది. సంతోషంతో బాటూ, పరిశోధన ఏమవుతుందోననే బెంగ కలిగింది తన్మయికి. అదే అడిగింది మాస్టారిని.

"నీ పరిశోధన ఏమీ ఆపనవసరం లేదు. కాకపోతే కష్టపడి సాధించుకున్న జె ఆర్ ఎఫ్ స్కాలర్ షిప్పు పొందే అవకాశం ఉండదు నీకు. గవర్నమెంటు ఉద్యోగం స్టేట్ గవర్నమెం టు, జె ఆర్ ఎఫ్ స్కాలర్ షిప్పు సెంట్రల్ గవర్నమెంటు ద్వారా అయినప్పటికీ నీకు ఏదో ఒకటే పొందే అవకాశం ఉంది. ఇక పీ ఎచ్.డీ ని పార్ట్ టైముగా మార్చడానికి అప్లికేషను పెట్టి, గవర్నమెంటు ఉద్యోగంలో ముందు జాయినయ్యిపో. వాళ్ళు ఎక్కువ సమయం ఇవ్వరు. ఒకసారి అక్కడ కుదురుకున్నాక ఇక్కడి విషయాలు తీరికగా ఆలోచిద్దువుగాని." అన్నారు.

మాస్టారి భార్య చీర, జాకెట్టు బొట్టు పెట్టి ఇచ్చి ఆప్యాయంగా "ఎప్పుడొచ్చినా తిన్నగా ఇక్కడికే వచ్చేసెయ్యి" అన్నారు.

వారి దగ్గర సెలవు తీసుకుని మేరీకి శుభవార్త చెప్పడానికి బయలుదేరుతూండగా గేటు తీసుకుని వస్తూ కరుణ కనిపించాడు. తనని చూసి, వెంటనే చిరు కోపంగా చూపు తిప్పుకున్నాడు.

"ఆ..రావోయ్, తన్మయికి గవర్నమెంటు లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. తెలుసా? "అన్నారు మాస్టారు వాకిట్లోనే.

తన్మయిని దాటి వెళ్తున్న అతను కనీసం మర్యాదకయినా ఆగి కంగ్రాట్స్ చెప్పకుండా ముభావంగా ముందుకు వెళ్ళిపోయేడు. తన విజయాల్ని సహించలేని అసహనం అతని ముఖంలో తాండవించడం మళ్లీ స్పష్టంగా చూసింది. అతను తన జీవితం లోకి ప్రవేశించకుండా జాగ్రత్త తీసుకున్నందుకు తనను తను అభినందించుకుంది. లేకపోతే తను జీవితంలో మళ్లీ ఘోరమైన తప్పటడుగు వేసేది. కాకపోతే కొన్నాళ్లపాటయినా అతన్ని స్నేహితుడని నమ్మినందుకు మనస్సు కాస్త చివుక్కు మని వెంటనే సర్దుకుంది.

"ముళ్ల తీగెల మధ్య లాఘవంగా దాటుకుంటూ వెళ్లడమే జీవితం!" అని తనకి తను చెప్పుకుంది.

---------

ఆ వారాంతం ఎప్పుడవుతుందా అనిపించింది తన్మయికి. ఇంటికి వెళ్లగానే టైపు చేసి ఉన్న అపాయింటు మెంటు లెటర్ని పది సార్లయినా చూసుకుంది. చాలా విచిత్రంగా తన్మయి కోరుకున్నట్టుగానే హైదరాబాదు శివార్లలో ఉన్న ఊళ్లో ఉద్యోగం వచ్చింది. అలా పూర్తిగా జోను మార్చి మరో జోనులో ఇచ్చే ఇద్యోగానికి నేషనల్ ఇంటిగ్రేషను అపాయింటుమెంటు అంటారని అప్పుడే మొదటిసారి తెలుసుకుంది. అంతే కాక, ఒక జోనులో ప్రతిభావంతులకి అవకాశాలు లేనప్పుడు ఇలా మరో జోనులో ఖాళీలలో వేస్తారట.

ఎలాగైతేనేం, తనకి నచ్చిన చోట ఉద్యోగం రావడం తన్మయికి చాలా సంతోషంగా అనిపించింది.

బాబుని యథావిధిగా తల్లి దగ్గిర వొదిలిపెట్టి ఉద్యోగం లో జాయినయ్యేందుకు హైదరాబాదుకి ఒంటరిగా ప్రయాణమయ్యింది తన్మయి.

41

"ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల" బోర్డు చూస్తూ లోపలికి అడుగుపెడ్తూన్న తన్మయికి బోర్డు కనబడనంతగా కన్నీటిపొర అలుముకుంది.

ఇవేళ్టి నించి ఆ కాలేజీలో లెక్చరర్ తను. ప్రభుత్వ ఉద్యోగం. ఆ ఆలోచనే గొప్ప ఆనందాన్నిస్తూంది. ఎక్కడి నించి ఎక్కడికి వచ్చిపడింది తన జీవితం! ఎలా మొదలయింది! ఎక్కడికి చేరింది!! అపజయాల మీద నుంచి పడుతూ, లేస్తూ నడిచొచ్చిన విజయాలు. అడుగడుగునా అవరోధాలు. తన కన్నీళ్లు తనే తుడుచుకుని, తన గాయాలకు తనే చికిత్స చేసుకుని, ముందుకు నడిచిన సైనికురాలు. తనే తన సైన్యం, ధైర్యం. ఒక్క సారి గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది. తన జీవితంలో కష్టాలు లేకపోతే తనకి ఇంత పట్టుదల కలిగేదా? విజయాలు కలిగేవా? అందరికీ ఇంత దూరంలో ఉద్యోగం వచ్చినందుకు

అసలు సంతోషించేదా? ... అర్థంపర్థం లేని తన ఆలోచనలకి అంతలోనే నవ్వొచ్చింది. ఈ కాలేజీ తమ ఊళ్లో తను ఇంటర్మీడియేట్ చదువుకున్న కాలేజీ కంటే మెరుగ్గానే ఉంది.

అడుగు పెట్టగానే ఇంకా తను నిన్నో, మొన్నో ఇంటర్మీడియేట్ చదివినట్టు జ్ఞాపకాలు చుట్టూ ముసిరాయి. లెక్చరర్లందరూ గుర్తొచ్చారు. సరదా అల్లర్ల మధ్య ఆడుతూ పాడుతూ పూర్తి చేసిన చదువది. లెక్చరర్ కావాలన్న ఆకాంక్ష మొదలయిన రోజులవి. ఆ కోరిక ఇప్పుడు అనుకోకుండా నెరవేరింది. ఒక్క క్షణం తన లెక్చరర్లు తనని ఇలా చూస్తే బావుణ్ణని అనిపించింది. తను వాళ్ల కొలీగ్ అయి ఉంటే! బహుశా: అదే జిల్లాలో పోస్టింగ్ వచ్చి ఉంటే తను చదివినప్పటికి యువకులయిన ఒకరిద్దరు లెక్చరర్లతో కలిసి పనిచేసే అవకాశం వచ్చేదేమో! కానీ ఇంత దూరంలో అసాధ్యం.

తనకి ఇంటర్వ్యూకి సలహాలనిచ్చిన సిద్దార్థ జ్ఞాపకం వచ్చేడు. వచ్చే ముందు తనకి ఉద్యోగం వచ్చిన సంగతి చెప్పడానికి వెళ్లినా అప్పటికే అతనికి ట్రాన్స్ఫర్ అయిపోయినందు వల్ల కలుసుకోలేక పోయింది. బహుశా: ఇక ఎప్పటికీ కనిపించక పోవచ్చు. ఆ ఆలోచన రాగానే నిట్టూర్చింది. జీవితంలో ఎన్నో పరిచయాలు ఇలా అర్థాంతరంగా ముగిసిపోతూ ఉంటాయి. ఆవరణలో గేటు దాటి నడుస్తూండగా తనని దాటి వెళ్తూ వెనక్కి చూస్తూ, తన వైపే పట్టి పట్టి చూస్తూ "కొత్త మేడం" అని పిల్లలు గుసగుసగా మాట్లాడుకోవడం గమనించింది. తమలో తాము తోసుకుంటూ, గట్టిగా నవ్వుకుంటూ తన వైపు క్లాసురూము కిటికీల్లోంచి చూస్తున్న పిల్లల వైపు చూస్తూ చెయ్యి ఊపింది. ఆవరణ మధ్య జెండా కర్ర, చుట్టూ మూడు వైపులా పెద్ద వరండాలతో గదులు.

ఆఫీసు రూములో అడుగు పెడ్తూనే ఒక పక్కగా టైపు మిషను ముందు కూచున్న టైపిస్టు "నమస్తే మేడం" అన్నాడు. ఆ పక్కనే నిలబడ్డ అటెండరు అమ్మాయిలు ఇద్దరూ నవ్వుతూ "నమస్తే మేడం" అన్నారు వంత పాడుతున్నట్టు.

"ప్రిన్సిపాల్" అని రాసి ఉన్న టేబుల్ ముందున్న కుర్చీలో సందేహంగా కూచుంది తన్మయి.

సూట్ కేసుతో బాటూ వచ్చిన తనని అంతా కొత్తగా, వింతగా చూస్తూండడం గమనించి, చిన్నగా నవ్వి, "నేను విశాఖపట్నం నించి వస్తున్నా" అంది.

అంతా, "ఆ.." అని నోళ్లు తెరిచేరు. "అంత దూరానికెల్లి వచ్చిన్రా" అంటూ.

అప్పుడే గదిలోకి అడుగుపెట్టిన ప్రిన్సిపాల్ యాదగిరి గారు తనని చూస్తూనే, "అరే, ఎప్పుడొచ్చిన్రు మేడం, కాఫీ తీసుకుంటరా?" అంటూ ఆదరంగా పలకరించేరు.

జాయినింగు రిపోర్ట్ అంటూ ఫార్మాలిటీసు కాగానే "రండి, తరగతి గదులు చూపిస్తాను" అంటూ దారి తీసేరాయన.

వెనకగా మరో వరస బిల్డింగు కూడా కట్టేరు. దాదాపు నాలుగైదు వందల మంది పిల్లలు ఉన్న పెద్ద కాలేజీ అది.

ప్రిన్సిపాల్ రూం పక్కన ఉన్న కంప్యూటరు లాబ్ చూపించేరు ముందుగా. " ఈ మధ్యనే కొత్తగా ఎం పీ ఫండు తో శాంక్షను అయినదమ్మా, కానీ ఇన్ స్ట్రక్ టర్లు దొరుకత లేదు, మాకెవరికీ చాతగాదు" అన్నారు చిన్నగా విచారిస్తూ.

తన్మయికి వివేకానందా పాఠశాలలో తను చేసిన కంప్యూటరు బేసిక్ కోర్సు జ్ఞాపకం వచ్చింది.

"నేను ప్రయత్నిస్తానండి, నాక్కొంచెం తెలుసు" అంది వెంటనే. ఎందుకో అప్రయత్నంగా ప్రభు జ్ఞాపకం వచ్చేడు. తనకి తెలిసిన ఒకే ఒక్క కంప్యూటరు నిపుణుడు అతనే కావడం వల్లనేమో.

"అతన్నే ఇన్ స్ట్రక్ టర్ గా చేస్తాడేమో అడిగితేనో?" ఆలోచనొచ్చిందే తడవుగా "నా స్నేహితుడొకతను ఎం. సీ. ఏ చేసేడు. కనుక్కోమంటారా?" అంది.

"మంచిది. అడుగమ్మా" అన్నారాయన.

మరో పక్క గదిలో పిల్లలు శ్రావ్యంగా పాడుతూండడం వినిపించింది.

"ముందు అటుగా వెళ్దొద్దామాండీ?" అంది.

ఒక్క నిమిషం అర్థం కానట్టు మొహం పెట్టేరాయన.

తన భాషకి, ఇక్కడి భాషకి ఉన్న వ్యత్యాసం వల్ల ఆయనకి అర్థం కాలేదని అని ఇట్టే గ్రహించి, "పాట చాలా బావుందండి, అందుకే ఒకసారి చూసొద్దామని.." అంది.

"ఆ...అదేమంత విషయం, పొయ్యి వద్దాం." అని దారి తీసేరు.

అప్పటివరకూ పాడుతున్న పిల్లలు చప్పున ఆపేసి, గుసగుసగా నవ్వడం ప్రారంభించేరు.

ప్రిన్సిపాల్ గారు "ఈవిడ మీ కొత్త తెలుగు మేడం" అని పరిచయం చేసేసరికి "అయ్యా! ఇంగ్లీషు మేడం లెక్క కొడుతూంది సార్" అని నవ్వేరు.

"తను వాళ్ల ఇంగ్లీషు మేడం లాగా ఉన్నానని అంటున్నారో, లేక తన సబ్జెక్టు ఇంగ్లీషని అనుకుంటున్నారో" అర్థం కాలేదు తన్మయికి.

మాండలికాలు తెలిసినా, అచ్చమైన గ్రామీణ మాండలికం తనకి ఎప్పుడూ పరిచయం కాలేదు. తను నేర్చుకోవలసినది చాలా ఉందని మాత్రం అర్థం అయ్యింది.

వాళ్లని చూసి తనూ పరిచయంగా నవ్వి, "నాకు పాటలంటే చాలా ఇష్టం, ఎక్కడ నేర్చుకున్నారీపాట?" అడిగింది తన్మయి.

ఒకమ్మాయి వెనక నించి,"అన్నలు నేర్పిరి మేడం" అంది. అంతా మళ్లీ పక్కున నవ్వేరు.

పదో తరగతి అప్పుడప్పుడే పాసై ఇంటర్మీడియేట్ కు వచ్చిన ఈ చిన్న పిల్లల గొంతుల్లో గొప్పగా పలుకుతూన్న సామాజిక చైతన్య గీతం వెనక్కు తిరిగి వస్తున్నా తనని వెంటాడసాగింది.

పంటసేనులారా మీకు పాద పాదా నొందనాలు

సేను సిలకలారా మీకు సెమటసుక్కల వొందనాలు..

ఎక్కడివీ పువ్వులు గాయలు

ఎక్కడివీ పంటా రాశులు

నింగి నుండి తీసుకొచ్చారా

నేలనుండి దూసుకొచ్చేరా ||పంట||

పచ్చపచ్చని ఆకులల్ల

సుక్కలోల కాతా రాసీ

వెచ్చని బట్టా నిచ్చీ

ఆదుకున్న పత్తీ నీకు ||పంట||

సంకలోన బిడ్డా నుంచి

ఒంటికాలు మీదా నిల్చి

సక్కనైన కంకుల గన్న

మొక్కజొన్న సేనులాకూ ||పంట||

నెత్తినిండా పూలూ ముడిసీ

నేలపొరలో కాయా గాసి

కన్నతల్లీ ప్రేమను చాటిన

వేరుశెనగా సేనులకూ ||పంట||

ఎండల్లలొ వాడిపోతే

ఎండిపోవును పిల్లానాని

పొద్దుతోని ఆటలాడె

పొద్దుతిరుగుడు సేనులకు||పంట||

మట్టిలోన కలిసినగానీ

మరణమన్నది నీకూ లేదు

ఇత్తనాలై ఒరుగుతు ఉన్న

పుట్ల కొద్దీ పంటాలైనా ||పంట||

అంత వరకూ తను విన్న ఎన్నో భావగీతాల కన్నా "జయరాజు" రాసిన ఈ బతుకు గీతం చాలా గొప్పదనిపించింది. కళ్లు చెమర్చాయి.

వ్యక్తిగత జీవితం, కుటుంబం వంటివి సమాజం తో పోలిస్తే ఎంత చిన్నవి! రైతు తనకి అన్నం పెట్టిన పంటకి వందనాలు సమర్పించడం ఎంత గొప్ప విషయం!!

ఆ రోజు కాలేజీ అంతా తిరిగి చూసేక అక్కడున్న పిల్లల్లో చాలా మందికి సరైన బట్టలు, చెప్పులు కూడా లేకపోవడాన్ని గమనించింది తన్మయి. తమ ప్రాంతంలో అంతగా కనబడని కటిక పేదరికం ఇక్కడ కనబడసాగింది.

"వీళ్లంతా తన పిల్లలే ఇక మీదట. వీళ్ళకి తన వంతుగా ఏదైనా చెయ్యాలి." దృఢంగా తనలో తను అనుకుంది తన్మయి.

స్టాఫ్ రూమ్ లో అడుగు పెడుతూనే అంతా చక్కగా పలకరించేరు. "వెల్ కమ్ మేడం" అంటూ.

తనలాగే కొత్తగా వచ్చిన బోటనీ, కామర్సు సబ్జెక్ట్ అమ్మాయిలు తప్ప అంతా పెద్ద వయసులో ఉన్న మగ వాళ్ళే.

ఇంగ్లీషు పోస్టు ఖాళీ గా ఉందట చాలా కాలం నించి. పార్టు టైము లెక్చరర్ ఎవరో ఒకావిడ ఉన్నారని, మెటర్నిటీ లీవులో వెళ్ళేరని చెప్పేరు. ప్రస్తుతానికి ప్రిన్సిపాల్ గారే ఇంగ్లీషు పాఠాలు చెప్తున్నారక్కడ.

పరిచయాలు కాగానే "సార్ ఏం చేస్తారు మేడం?" అనడిగేడు అందులో ఒకాయన.

"అయామ్ ఎ డైవర్సీ. నాకు అతని డీటెయిల్స్ చెప్పడం ఇష్టం లేదు" అని నిక్కచ్చిగా, సూటిగా సమాధానం చెప్పింది తన్మయి.

అప్పటిదాకా ఆసక్తిగా వింటున్న అంతా ఒక్క సారిగా ఖంగు తిన్నట్లయ్యి అంతలోనే సర్దుకున్నారు. సాయంత్రానికి ఒకే కుటుంబంలా చక్కగా కలిసిపోయి, కబుర్లు చెప్పుకున్నారంతా. అంతా మంచి వాళ్లే అయినందుకు తన్మయికి చాలా సంతోషంగా అనిపించింది.

సాయంత్రం కాలేజీ కాగానే అటెండరు తాయిబా కూడా వాళ్ల ఇంటికి బయలుదేరింది తన్మయి. వీధులన్నీ పరిశుభ్రంగా ఉన్నాయి. రోడ్ల మీద ఎక్కడా మురికి కాలువలు లేవు. అదే అడిగింది పక్కనే నడుస్తున్న తాయిబాని.

"మురుగు కాలువలు భూమి లోపలి నుంచి ప్రవహించడం వల్ల, వీధులు పలక రాళ్లతో తాపీ చేసి ఉండడం వల్ల, చెత్త చెదారం ఇష్టం వచ్చినట్లు రోడ్ల మీద పడెయ్యకుండా చెత్త బళ్ళలో వెయ్యడం వల్ల పరిశుభ్రత సాధ్యమన్న మాట." అంది తన్మయి తాయిబా మాటలని తన యాసలోకి అనువదించుకుంటూ.

అటూ, ఇటూ మురుగు కాలువలతో దోమలతో, ఈగలతో అపరిశుభ్రమైన తమ ప్రాంతపు వీధులు జ్ఞాపకం వచ్చాయి తన్మయికి.

"అట్నే అనుకో మేడం" అని తలూపింది తాయిబా.

"కాలేజీలో స్టాఫ్ అంతా చాలా మంచివాళ్ళు కదూ" అంది తన్మయి మాట మారుస్తూ.

"అంతా మీ మనసులోనే ఉన్నది మేడం. మీ మనసు మంచిదైతే అన్నీ మంచిగనే కనిపిస్తయి" అంది తాయిబా నవ్వుతూ.

తన్మయి ఆశ్చర్యంగా చూసింది ఆ అమ్మాయి వైపు. ఎంత గొప్ప జీవిత సత్యం చెప్పింది!

పొద్దుటే అద్దెకి గది ఎక్కడైనా దొరుకుతుందా అనడగగానే "ఏణ్ణో ఎంతుకు మేడం, మా ఇంటి కాడ ఉండండి, మా ఆయన ఎట్లనూ దుబాయి పొయ్యిండు." అంది తాయిబా.

ఆ అమ్మాయి కలివిడితనానికి ముచ్చటేసింది తన్మయికి. తన వయసే ఉంటుందేమో తాయిబాకి. రెండు ముక్కులకూ నత్తులతో, చక్కని నవ్వు ముఖంతో కళ గా ఉంది. కాలేజీ నుంచి బయటకు వచ్చే ముందు బురఖా వేసుకుంది. నాలుగైదు వీధులకావలగా ఉంది ఇల్లు. మహా అయితే పదిహేను నిమిషాల నడక. దారిలో ఎస్. టీ. డీ బూత్ దగ్గిర ఆగింది తన్మయి. తల్లికి కొత్త ఊరి విశేషాలు చెప్పింది. బాబుతో మాట్లాడింది.

"వారాంతంలో ఇంటికి వెళ్లి బాబుని తీసుకొచ్చుకోవాలి. రెండు రోజులు సెలవులు ఆదివారంతో కలిపి పెట్టాలి" అనుకుంటూ తర్వాత ఫోను ప్రభుకి చేసింది.

"కాలేజీలో పోస్టు ...." అని వినగానే పెద్దగా నవ్వేడు అటునించి ప్రభు.

అతనికి ఎందుకంత నవ్వొచ్చిందో తన్మయికి అర్థం కాలేదు. అదే అడిగింది.

"మీ కాలేజీ చూడడానికి పిలిస్తే తప్పకుండా వస్తాను. అంతే గానీ నేనిక్కడ పనిచేస్తున్న కార్పొరేట్ ఆఫీసు ఉద్యోగాన్ని వదిలి అలాంటి చిన్న ఊళ్లో చిన్న ఉద్యోగాలు చెయ్యడం నా వల్ల కాదు." అన్నాడు.

తన్మయి చప్పున నాలుక్కరుచుకుంది."ఏమీ అనుకోవద్దు ప్రభూ, ఇంత క్రితం మనం కలిసినప్పుడు మీరు ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారని విన్నట్టు గుర్తు" అంది.

అన్న మాటలో తప్పు అర్థమయినట్లు "అయ్యో, అయామ్ సారీ తన్మయీ, నాకు ఉద్యోగం వచ్చిన సంగతి మీకు చెప్పలేదు కదూ. మీ కంప్యూటరు లాబ్ ని

చూడడానికి, మీకు నేర్పించడానికి శనివారాలు వస్తాను. సరేనా?" అన్నాడు.

తనేదో గొప్ప సాయం చేస్తున్నట్టు ఫోను చేస్తే అతనికి అది తగని ఉద్యోగమయింది.

ఫోను పెట్టేసేక గట్టిగా నిట్టూర్చింది.

"ఎవరు మేడం, సారా?" అంది తాయిబా.

తాయిబాతో కరుకుగా సమాధానం చెప్పడానికి ఇష్టం లేక, తల అటూ ఇటూ "కాదు, అవున"న్నట్టు ఊపింది.

మరో మలుపు తిరగగానే వీధి మొదట్లోనే ఇల్లు కనబడింది. నేల మీద పలక రాళ్లు పరిచి ఉన్న మూడు గదుల చిన్న ఇల్లు. ఇంటి చుట్టూ పెద్దగా స్థలం లేనందువల్ల అక్కడా పలకలు పూర్తిగా పరిచి ఉన్నాయి. మొక్కలు లేకపోయినా వాకిలి పరిశుభ్రంగా, ఉన్నంతలో అందంగా ఉంది. ప్రతీ గదీ అద్దెకిచ్చేటందుకు వీలుగా విడి విడిగా పక్కపక్కన కట్టిన గదులు.

అందులో ఒక వైపు ఉన్న గది తాళం తీసింది. గదిలో ఒక పక్కగా చిన్న గోడ కట్టి ఉంది. ఆ గోడకవతల వంట కోసం చిన్న స్టవ్వు గట్టు. గది వెనక వైపు విడిగా చిన్న బాత్రూము. తన్మయికి గది నచ్చింది. విశాఖపట్నంతో పోలిస్తే అద్దె కూడా చాలా తక్కువ. చిరునవ్వుతో ఆ అమ్మాయి అడిగిన దానికంటే మరొక యాభై ఎక్కువ వేసి, ఒక నెల అద్దె అడ్వాన్సు గా చేతిలో పెట్టింది తన్మయి.

"చాలా సంతోషం మేడం. మీరు సామాన్లు తెచ్చుకునే వరకి నా కాడనే తినండి" అంది ఆనందంగా.

పడుకునేందుకు ఒక మడత మంచం తెచ్చి ఇచ్చింది. మంచమ్మీద తల వాల్చగానే నిస్సత్తువగా అనిపించింది తన్మయికి.

ఆలోచనలు చీకట్లో మిణుగురుల్లా మెదలసాగేయి. కొత్త ప్రాంతం! కొత్త జీవితం!!

జీవితంలో ఒక్కోసారి ఎదురు చూసినవి ఎప్పటికీ ఫలవంతమవవు. ఒక్కోసారి అనుకోని కొత్త మలుపులు ఎదురయ్యి ఆనందాశ్చర్యాలకు గురి చేస్తాయి. అలాంటిదే ఈ ఉద్యోగం, ఈ ఊరు. ఒక పక్క ఉత్సాహపూరితంగా అనిపిస్తున్నా తల్లి దండ్రులు, తను పుట్టి పెరిగిన వాతావరణానికి ఎంతో దూరంలో జీవించాల్సి రావడంతో మెల్లగా దిగులు మొదలయింది.

## 42

మరుసటి వారంలో ఇంటికి వెళ్లి బాబుని తీసుకుని వచ్చింది తన్మయి. వంట సామాన్లు సర్దుకుంటూంటే అనుకోకుండా దు:ఖం ముంచుకొచ్చింది. ఈ సామాన్లు నావి, ఈ వంట గది నాది, ఈ ఇల్లు నాది... అని అందరిలానే అమాయకంగా కలలుగన్న సగటు యువతి తను. అందులో ప్రతీ ఒక్కటీ ఎక్కడెక్కడ కొన్నదీ ఇంకా గుర్తే తనకి. నిజానికి సంసారానికి కావలసిన వంట సామాన్ల వంటివన్నీ తల్లే ఇచ్చి పంపించింది. కానీ కొత్తవి కాకుండా అప్పటికే ఏళ్ల తరబడి వాడుతున్నవి ఇచ్చి పంపించిందని శేఖర్ తల్లి చీవాట్లు వేసింది. తల్లి తను ఇంట్లో వాడుతున్న సామాన్లు, తను కట్టుకున్న చీరలు ఇచ్చిందంటే, వాటిలో తల్లి "ప్రేమ" ఉందని తన్మయి భావించినా అతను, అతని తల్లి మాత్రం పాతవి వొదిలించుకోవడానికి చేసిన కుట్రగా చూసేరు. తల్లి ఇచ్చిన సామాన్లు చూసినప్పుడల్లా అతను విసుక్కోవడం చూసి, అవన్నీ పక్కకి పెట్టి కాసిన్ని కొత్త సామాన్లు కొంది తన్మయి. అలా పూర్ణా మార్కెట్టు లో కొన్న చిన్న మజ్జిగ కవ్వమూ, జల్లెడా కనిపించేయి.

ఆ రోజు ఇంకా తనకి జ్ఞాపకమే. కొత్తగా సంసారం పెట్టిన రోజులు. అతని ఊర్లో ఉండేవాడు కాదు కాబట్టి సంసారానికి ఏది కావాల్సినా తనే వెళ్లి కొని తెచ్చుకునేది తన్మయి. పక్కింటి అమ్మాయి సలహాతో ఇంట్లో జల్లెడ, కవ్వమూ కొనడానికే కాకుండా వారానికి సరిపడా కూరలు కూడా కొని తెచ్చుకోవడానికి పూర్ణా మార్కెట్టు బస్సెక్కింది తన్మయి. రద్దీగా ఉన్న జగదాంబా జంక్షను పరికిస్తూ చుట్టూ ఉన్న సినిమా హాళ్ల గురించి కబుర్లాడుకునే జనాలకతీతంగా ఆకాశం కేసి చూడసాగింది తన్మయి. చిరు జల్లుకురావడానికి సిద్ధమైనట్లు మబ్బు మబ్బుగా ఉంది. పూర్ణా మార్కెట్టు రోడ్డు కివతల ఆగి, అటు వైపు దాటుకుని ద్వారం దాటి లోపలి అడుగుపెట్టగానే వాన కురవకుండానే జల్లు కురిసినట్లు చిత్తడిగా ఉంది. బురదలోనే త్రోవకటు ఇటూ కూరగాయల నించి వంట సామాన్ల వరకూ దుకాణాలు. కొన్ని నేల మీద గోనె సంచుల మీదా, కొన్ని బండ్ల మీదా, కొన్ని చిన్న దుకాణాలుగాను.

వచ్చిపోయే వారిని తోసుకుంటూ, ఉమ్ముకుంటూ, తిట్టుకుంటూ హడావిడి పడ్తున్న జనం. చేతి సంచీని భుజాన తగిలించుకుని, చిన్న చేతి పర్సుని జాకెట్టులో దాచి, చీర కుచ్చిళ్ళు పైకి దోపుకుని అతికష్టమ్మీద కావలసిన సామాన్లు కొనుక్కుని బయట పడింది తన్మయి. మజ్జిగ కవ్వమూ, జల్లెడల వైపు

తదేకంగా చూసింది. ఇలాంటివి తన కంటపడకుండా ఉంటేనే తను మనశ్శాంతిగా ఉండగలదు. తన దగ్గర ఉన్నవి తల్లిని తీసుకొమ్మని, ఇంట్లో ఉన్న పాతవి తనకి ఇమ్మని అడిగింది.

"ఏమ్మా, మీ ఆయన మొదట్లో చేసిన నిష్టూరం చాలదా? పాతవెందుకులే. నువ్వెలాగూ నేనిచ్చినవి పక్కనెట్టి కొత్తవి కొనుక్కున్నావుగా, ఇన్నాళ్లుగా అవి ఇక్కడే పడున్నా నేనెప్పుడూ వాటిని  వాడలేదు" అంది జ్యోతి  నిష్టూరంగా .

తన్మయికి కాళ్లలోకి నిస్సత్తువ వచ్చింది. అతనెప్పుడో తల్లిని బాధించిన మాట వాస్తవమే. అందుకు ఇప్పటికీ తను బాధ పడుతుంది. కానీ తను ఇప్పుడు వాళ్ల కూతురు మాత్రమే. ఇంకా పాతవన్నీ గుర్తు తెచ్చుకుని ఇంకా తల్లి తనని ఇలా నిష్టూరమాడడం ఎందుకు?

అంతటితో ఆగకుండా తన్మయి తల్లిని తనతో రమ్మని అడగగనే తనతో రావడం ఇష్టం లేనట్లు ధ్వనిస్తున్న గొంతుతో, "అస్తమాటూ నీ వెనకాల తిరుగుతూ ఉంటే ఇక్కడ నాన్నగారిని ఎవరు చూస్తారమ్మా, ఇదేవన్నా మీ అత్తగారిల్లా మందీ మార్బలం ఉండడానికి, వాళ్లంటే జమీందారులు, డబ్బుకి లెక్క లేదు వాళ్లకి. అయినా వాళ్లకీ, వీళ్లకీ ఆయన్ను ఇక్కడ అప్పగించి, రావడం సుతరామూ ఇష్టం లేదు." అంది.

అంతే కాదు కనీసం మాట వరసకైనా  కాసిన్ని ఉప్పూ పప్పులు పట్టుకెళ్లమని కూడా ఇవ్వలేదు. ఆడించిన పంట బియ్యం అదే రోజు ఇంటికి వచ్చేయి. అక్కడికీ తన్మయి నోరు తెరిచి అడిగింది.

"ఇక్కడి నుంచి అంత దూరానికి బియ్యం పట్టుకెళ్లడం ఎందుకు? అక్కడే కొనుక్కో." అంది జ్యోతి.

మనసులోనే నిట్టూర్చుకుంది తన్మయి. తనకి అతనితో కలిసి ఉన్నప్పుడూ బాధలే. విడిపోయేకా బాధలే. తనలాంటి దౌర్భాగ్యపు బతుకు పగ వాళ్లకి కూడా కలగకూడదు. ఇప్పుడు తన్మయి ఒంటరిగా ఉంటూందన్న సత్యం తెలిసీ తల్లి ఇలా సూటీపోటి మాటలతో వేధిస్తూ, అంటీ ముట్టనట్లు ఎందుకు ఉంటుందో  అర్థంకాదు.

రైలెక్కిందే గానే నిద్ర రాలేదు. తెల్లారగట్లెప్పుడో కణకణా మండుతున్న కళ్లని బలవంతంగా మూసుకుంది "అంతా నా దురదృష్టం!" అనుకుంటూ.

ఉదయానే రైలు దిగి, చాలా సేపు బస్సు కోసం ఒక చోట నిలబడ్డారు. తర్వాత అర్థమైన విషయం ఏవిటంటే అక్కడ సిటీ బస్సులు మాత్రమే ఆగుతాయని, ఎర్ర బస్సులకు దగ్గర్లోని బస్టాండుకి వెళ్లాలని. సామాన్లు మోసుకుని, ఆటో కోసం నడిచింది. బాబు చెంగు పట్టుకుని త్వరగా నడుస్తున్న తల్లిని అనుసరించేడు. అత్యంత రద్దీగా ఉంది బస్టాండు. చేతిలో సామాన్లు ఉండడం వల్ల బస్సులో సీటు కోసం పరుగులెత్తే మనుషులతో ఓడిపోసాగింది.

పక్కనే ఉన్న యువకుడొకతను "ఇలా ఇవ్వండి నేను సాయం చేస్తా" అని చప్పున సిటీలోని సామాన్ల సంచీ అందుకున్నాడు.

అంతే కాకుండా అతిలాఘవంగా సీటు కూడా సంపాదించేడు.

"చాలా థాంక్సండీ" అంది తన్మయి కృతజ్ఞతా పూర్వకంగా.

బస్సెక్కగానే నిద్ర ముంచుకొచ్చింది తన్మయికి. బాబు అప్పటికే ఒళ్ళో వాలిపోయేడు. బాబుకి అటువైపు కూచున్న ఆ యువకుడు "ఏ ఊరు వెళ్తున్నారు?" అన్నాడు.

చెప్పింది తన్మయి.

"అది నా ప్రాణ స్నేహితుడి ఊరు. నేనస్తమాటూ వస్తుంటాను." అన్నాడు.

తన్మయి నిద్ర కళ్ళతో ఊకొట్టింది.

అతనదేమీ పట్టించుకోకుండా "సారు.. రాలేదా మీతో?" అన్నాడు.

"రాలేరు" అని కళ్లు మూసుకుంది.

బస్సు ఎక్కడో స్టాపులో ఆగింది.

"మక్క బుట్టల్..మక్క బుట్టల్ " అంటూ కిటికీ దగ్గర మొక్కజొన్న పొత్తులమ్మే పిల్లల అరుపులకి మెలకువ వచ్చింది తన్మయికి.

కిటికీ దగ్గిర కూచున్న యువకుడు చప్పున మూడు కొని, తన్మయి వైపు తిరిగేడు. తన్మయి వద్దనేలోగానే రెండు చేతిలో పెట్టేడు. ఉదయం నించీ ఏమీ తినకపోవడం వల్లనేమో బాబు చటుక్కున మొక్క జొన్న పొత్తు ఒకటి అందుకుని తినసాగేడు. పొద్దుట బిస్కెట్లు ఇవ్వబోతే తినను అని మొరాయించేడు. వాడెప్పుడూ పొత్తు తిననట్లు ఆదరాబాదరాగా తినడం చూసి తన్మయికి నవ్వొచ్చింది.

అతనేమనుకున్నాడో ఏమో అని "థాంక్సండీ" అంది తన్మయి.

బదులుగా అతను "వచ్చేదే మా ఊరు. ఎప్పుడైనా తప్పకుండా రండి" అని జేబులో చిన్న కాగితాల బొత్తిలో నుంచి ఒక కాగితం చింపి అతని పేరు, ఫోను నంబరు రాసిచ్చేడు.

"మురళి..." అతని పేరు చూడగానే తన్మయికి చప్పున వివేకానందా పాఠశాల, వెంకట్, మురళి జ్ఞాపకం వచ్చేరు.

జీవితం ఎంత విచిత్రమైంది!

అక్కడున్నంత సేపు మురళి తనకే కష్టమొచ్చినా ఆదుకునేవాడు. ఇప్పటికీ ఆదుకుంటున్నాడన్నమాట.

అతని వైపు తిరిగి నమస్కరించింది.

బస్టాండులో దిగి రిక్షా ఎక్కింది తన్మయి. ఇక్కడి రిక్షాలు తమ వైపులా కాకుండా విభిన్నంగా ఉన్నాయి. కూచునే సీటుకి, కాళ్లు పెట్టుకునే చోటుకి మధ్య నేలపీట కంటే తక్కువ ఎత్తు ఉండడాన్ని ఆశ్చర్యంగా చూసేడు బాబు. తమ వైపు కూచునే సీటు కుర్చీలో కూచున్నంత ఎత్తు ఉండి, కాళ్లు కిందికి పెట్టుకుందుకు వీలుగా ఉంటుంది. తన చిన్న తనంలో సినిమాకి వెళ్లేటపుడు నడిచి వెళ్లి, వచ్చేటపుడు రిక్షా కట్టించుకునే వారు. అమ్మా, నాన్నల మధ్య కాళ్ల దగ్గిర కూచునేది తను. కానీ ఇంటికి వచ్చేసరికి బాగా నిద్రపోయేది. ఇక ఇంటి గుమ్మం దగ్గిర దిగి లోపలికి నడవాలంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు తనకి. రాత్రంతా తనని రిక్షాలో తిప్పుతూ అలాగా పడుకోనిస్తే బావుణ్ణని అనిపించేది.

"పెద్దయ్యాక తప్పకుండా తనలాగే చెయ్యాలి" అనుకునేది.

ఆ ఆలోచన రాగానే నవ్వొచ్చింది తన్మయికి. పక్కనే కూచుని కబుర్లు చెప్తున్న బాబు తల నిమురుతూ వాడి మెరుపు కళ్లలోకి చూడసాగింది తన్మయి. కబుర్లలోనే నిద్రలోకి జారుకున్నాడు. నిశ్చింతగా పడుకుని నిద్రపోతున్న చిన్నారి తలని ముద్దాడింది. వాడికి తన తల్లిదండ్రుల దగ్గిర ఎంత దగ్గిరతనం ఉన్నా తనతో ఉన్నపుడు ఉన్న హుషారు వాడికి అక్కడున్నపుడు ఉండదు ఎందుకో. తనకి కూడా ఒదిలొచ్చేటప్పుడెప్పుడూ వాడి బెంగ చూపులు తనని వెంటాడుతూనే ఉండేవి. కడుపున మొయ్యడం, కడుపున పుట్టడం... 'పేగు బంధం' అంటే ఇదేనేమో!

"ఇక మనం హాయిగా ఉందాం నాన్నా! " అంది ఆప్యాయంగా వాణ్ణి దగ్గరకు హత్తుకుని.

బాబుని ఊర్లో మంచి స్కూల్లో జాయిను చేసింది. స్కూలు యూనిఫారం, పుస్తకాలు, పుస్తకాల సంచీ, టిఫిను బాక్సు, వాటర్ బాటిల్ వంటివన్నీ కొంది. వచ్చే ముందు అయిసుక్రీము, ఫైవ్ స్టార్ చాక్లెట్ల వైపు చూపించేడు బాబు.

"కొంటాను గానీ, ఏదో ఒక్కటే " అంది.

కాస్సేపు అటూ ఇటూ ఊగిసలాడి చివరికి అయిసు క్రీము కావాలన్నాడు.

ఇంటికి నడుస్తూండగా, "అమ్మా! మనం రేపు ఫైవ్ చాక్లెట్టు కొనుక్కుందామేం?" అని ముద్దుగా అడిగేడు బాబు.

పసివాడితో "అలాగే" అని అబద్ధాలాడడం ఇష్టం లేదు తన్మయికి.

"లేదు నాన్నా, ఇలాంటివి మనం నెలలో ఒక్క రోజు మాత్రమే కొనుక్కుంటాం." అంది సాలోచనగా.

అర్థమయీ కానట్టున్న వాడి ముఖం చూసి, "అమ్మకి వచ్చే జీతంలో మన ఖర్చులు పోను, కొంత దాచుకోవాలమ్మా. అనుకోకుండా మనకి కష్టం వచ్చిందనుకో మనకి డబ్బులు ఎవరిస్తారు చెప్పు?" అంది.

ఏదో అర్థమైనట్టు తలూపేడు వాడు. ఇంటికి రాగానే పుస్తకాలన్నింటికీ అట్టలు వేసి, పేర్లు రాసింది. ఒక అర ఖాళీ చేసి వాడి స్కూలు వస్తువులు సర్ది పెట్టింది. రెండో రోజే స్కూలు బస్సెక్కనని పేచీ పెట్టేడు బాబు.

"ఏవిటమ్మా" గోముగా అడిగింది తన్మయి.

స్కూటర్ల మీద, బళ్ల మీదా తల్లిదండ్రులతో ముందూ, వెనకా కూచుని వెళ్తున్న పిల్లల వైపు చూపించేడు. తన్మయి మనస్సు చివుక్కుమంది.

"తండ్రి గుర్తురాకుండా పెంచాలని ఎంత తపన పడ్తున్నా కుదరడం లేదు. ఎలా?"

ఆలోచించే కొలదీ తలనొప్పి రాసాగింది తన్మయికి.

అనుకోకుండా మర్నాడు కాలేజీలో టైపిస్టు "చిట్" లోచేరుతరా మేడమ్ అనడగగానే ఒప్పుకుంది.

అప్పటి వరకు అసలు చిట్ అంటే ఏవిటో, ఎందుకు అంతా ఇలాంటివి కడతారో తెలియదు తనకి.

"ఒక్కసారి డబ్బు అవసరమయ్యే మనలాంటి మధ్య తరగతి వారికి వడ్డీ తక్కువ మార్గం ఇదొక్కటే" అన్నాడు టైపిస్టు మొదటి నెల డబ్బు కట్టించుకుంటూ.

ఆ మరసటి రోజు నించీ సెకండ్ హేండులో లేడీస్ బండి ఎవరైనా అమ్ముతారేమోనని పేపర్ లో లోకల్ ప్రకటనలు వెతక సాగింది తన్మయి.

ఆ సాయంత్రం కిరసనాయిలు ఒత్తుల స్టవ్వు వల్ల బాగా మసి పట్టేసిన గిన్నెల్ని తోముతున్న తన్మయి వైపు చూస్తూ "గేసు కనెక్షను కి అప్లై చెయ్యరాదు మేడమ్ ?" అంది తాయిబా.

"అప్లయ్ చేసిన సంవత్సరం దాకా రాదట కదా!" అంది తన్మయి.

"ముందు స్టవ్వు కొనుక్కో మేడం. కనెక్షను వచ్చే వారికి నా కాడ డబుల్ సిలిండర్ నువ్వొకటి వాడుకో" అంది.

గేసు స్టవ్వు, సిలిండర్.. అని తన దగ్గిర ఉన్న కాస్త డబ్బులూ ఇలాంటి వాటికి ఖర్చు పెట్టడం కష్టం.

అదే చెప్పింది తాయిబాతో.

"హయ్యో మా లాంటి వారందరూ డబ్బులు మస్తు ఉండే అన్నీ కొనుకుంటరంటరా మేడమ్!" అంది నవ్వుతూ.

సాయంత్రం వాయిదా పద్ధతిలో స్టవ్వు, మిక్సీల వంటివి అమ్మే దుకాణానికి తీసుకెళ్లి, "భయ్యా! మా మేడమ్ కి మంచి స్టవ్వు చూపియ్" అంది.

"ఆ..ఆ..ముందు డబ్బులు ఎలా కట్టాలో కనుక్కో కుండానే.."అంది తన్మయి అడ్డు తగులుతూ.

"అరే మా కాలేజీలో మేడమ్ మీరు. ఏది నచ్చినదో ఫస్టు చూసుకొండి. మీకు నచ్చిన వాయిదాలో పైసల్ కట్టండి." అంటూ దుకాణాదారు రెండు మూడు స్టవ్వులు చూపించేడు.

అందులో నాణ్యమైన కంపెనీ స్టవ్వు చూపించి ఇందులో కాస్త రేటు తక్కువది చూపించండి" అంది.

అతను లోపలనించి మరొక రెండు పట్టుకొస్తూ , వాయిదాల వివరాలు రాసున్న ఒక అట్ట ముక్క తెచ్చేడు.

అన్నిటికన్నా తక్కువ ఖరీదు స్టవ్వుకి నెలకు వంద చొప్పున పన్నెండు నెలలు కట్టాలి. దాని అసలు ఖరీదు తొమ్మిది వందలే. కానీ వాయిదాలో పన్నెండు వందలు కట్టాలి.

తన్మయి తటపటాయించడం చూసి, "మీకు పదకొండువందలకే ఇస్తా, మొదటి నెల మాత్రం రెండు వందల్ కట్టి తీసుకెళ్ళండి" అన్నాడు అతను.

తాయిబా నవ్వుతూ, "ఏం భయ్యా మాకెన్నడూ ఇవ్వక పోతివి" అంది.

"మేడమ్ ఏడికెల్లో ఈడికొచ్చింది. మనంమంచిగుండాలె గదా!" అన్నాడు అతను.

తన్మయి పర్సులో నుంచి రెండు వందలు తీసి అతని చేతిలో పెట్టింది.

"స్టవ్వు మంచిగుంది. గిట్లనే నెలకో వస్తువ జమకూర్చుకో మేడమ్, సంవత్సరం ఏ పాటికి! సామాన్లు ఒక్క తడవ కొంటే ఎప్పటికీ పడుంటయ్యి" అంది తాయిబా స్టవ్వు తన్మయి చేతిలో నుంచి అందుకుని నడుస్తూ.

"సామాన్లు ఒక్క తడవ కొంటే ఎప్పటికీ పడుంటయ్యి"... తన విషయంలో ఇదెప్పుడూ నిజం కాలేదు.

"వస్తువులు అశాశ్వతమైనవి తాయిబా" అంది దీర్ఘంగా నిట్టూర్చి తన్మయి.

"అంత గొప్ప మాటలు నాకర్తం కావులే. ఈడ గెన్సి గడ్డలు కొందాం మేడమ్" అని ఆగింది తాయిబా.

ఏదో ఆలోచనలో ఉన్న తన్మయి వైపు చూసి నవ్వి, "బాగుంటయి. తిని సూడు" అంది కాల్చిన దుంపను విరుస్తూ.

"మక్కబుట్టలు నాకు భీ ఇష్టమే" అంది తన్మయి పక్కనున్న మొక్కజొన్న పొత్తు వైపు చూస్తుండడం గమనించి.

తాయిబా హుషారుగా కబుర్లు చెప్తూ తన పక్కన నడుస్తుంటే దూరం అనిపించడమే లేదు తన్మయికి. "ఎప్పుడూ ఈ అమ్మాయిలా ఉంటే ఎంత బావుణ్ణు" అనుకోకుండా ఉండలేకపోయింది తన్మయి.

బాబు కూడా అలసట అనకుండా వాళ్ల కబుర్లు వింటూ నడవసాగేడు.

43

కొత్త ఊరిలో కొత్త ఉద్యోగంలో చేరి రెండు నెలలయ్యింది. క్రమంగా అక్కడి జీవితానికి అలవాటు పడసాగేరు తన్మయి, బాబు. ఆదివారం ఉదయానే స్కూలుకి తయారు చేసినట్టే బాబుని లేపి తయారు చేసింది. చుట్టూ ఉన్న పిల్లలందరూ బాగా స్నేహితులయ్యేరు బాబుకి. పాలు తాగి, టిఫిను తినగానే ఆరుబయట పిల్లలతో ఆడుకోవడానికి పరుగెత్తేడు. ఎప్పటి నుంచో మిగిలిపోయిన పనుల లిస్టు బయటికి తీసింది తన్మయి. అందులో మొదటిది పాత చీరొకటి చింపి కర్టెన్లు కుట్టడం. గది బయట వాకిట గుమ్మంలో చాప పరిచి సూది, దారం, కత్తెర వగైరా సరంజామా అన్నీ సర్దుకుని దీక్షగా పని చెయ్యసాగింది.

“అమ్మా, నా దోస్తు వాల్లింటికి తోలుకుపోతానంటుండు. పొయ్యి రానా?” అన్నాడు బాబు.

చాలా త్వరగా బాబు అక్కడి ప్రాంతపు యాస నేర్చేసుకున్నాడు. పిల్లలు ఎంత త్వరగా కలిసి పోతారో కదా! ఎటొచ్చి పెద్దవాళ్లకే భేషజాలన్నీ. కానీ తను అదృష్ట వంతురాలు. ఇక్కడ తన చుట్టూ ఉన్న వాళ్లు అంతా తనను ఆదరంగా చూస్తున్న వాళ్లే. బాబు యాస విని తాయిబా బాబు దగ్గిరికి వచ్చి బుగ్గలు పుణికి “అబ్బో, ఎంత మంచిగ అడిగిండు!” అని ముద్దాడింది.

తన్మయి బాబుని ఫ్రెండుతో పంపడానికి తటపటాయిస్తూండగా, "నేను తోలుకుపోయి ఒప్పజెప్పి వొస్తాలె మేడం, నువ్వు ఫికర్ గాకు" అని ముందుకు నడిచింది తాయిబా. వాళ్లలా వెళ్లగానే గేటు చప్పుడు అయింది. ఎదురుగా నిలబడ్డ ప్రభుని చూసి ఆశ్చర్యపోయింది.

“అరే, ఇలా ప్రత్యక్షమయ్యేడు! అసలితనికి ఇల్లెలా తెలిసింది?” తనలో తను అనుకుంది.

తన్మయి మనసులోని ఆలోచనలని కనిపెట్టినట్లు, “నాకు ఇల్లెలా తెలిసిందనుకుంటున్నారా? ఇదేమన్నా మహా నగరమా? మీ కాలేజీ దగ్గర్లో కిళ్లీ కొట్టు వాడినడిగినా ఇట్టే తెలిసిపోతుంది.” అన్నాడు చుట్టూ పరికిస్తూ.

అంతలోనే వీపు  మీద వేసుకున్న బాగ్ ని కింద పెట్టి, వాకిట్లోనే ఉన్న చిన్న ముక్కాలి పీటను దగ్గరకు జరుపుకుని కూచున్నాడు.

“ఎందుకొచ్చినట్లు?” ఇంకా ఆలోచిస్తూనే ఉంది తన్మయి.

“పైగా ఒక ఉత్తరమైనా రాయకుండా ఇలా వచ్చేసేదేవిటి?”

అదే అడిగింది.

“అదేవిటి? మీరేగా, మీ కాలేజీలో కంప్యూటరు అసిస్టెంట్ కావాలని అడిగేరు. ఉద్యోగం ఖాళీ లేదా మరి?” అన్నాడు కొంటెగా నవ్వుతూ.

తన్మయికి కాస్త చిర్రెత్తుకొచ్చింది. తను ఉద్యోగంలో చేరిన రోజెప్పుడో అడిగినప్పుడు, "ఆ పల్లెటూర్లో, అంత చిన్న కాలేజీలో తనకి ఉద్యోగమేవిటని పెద్ద ఫోజు కొట్టేడు. ఇప్పుడేమో ఇలా"

తన్మయి మొహంలోని సీరియస్ నెస్ చూసి, “అరెరే, మీకు కోపం వచ్చినట్లుంది. ఊరికే, ఏదో సరదా కి అన్నానులెండి. నిజానికి మీకు కంప్యూటరు నేర్పించాలని వచ్చేను.” అన్నాడు.

తను కంప్యూటరు గురించి కొద్దో గొప్పో వివేకానందా పాఠశాల లో నేర్చుకుంది. ఇప్పుడు ఇతను వచ్చి తనకు నేర్పించేదేముంటుంది?

కొంచెం నిర్లక్ష్యం గా మొహం పెట్టి “నాకు కంప్యూటరు గురించి బానే వచ్చు" అంది.

"బానే అంటే?" అన్నాడు.

"డాస్ కమాండ్స్ , లోటస్ నోట్స్ వచ్చు. ఇంకా ఏవైనా నేర్చుకోవాలా?” అంది గొప్పగా.

సమాధానంగా “ఊ..ఇంట్రెస్టింగ్. ఇంకేం, ఇప్పుడు హాట్ టాపిక్ అయిన డాట్ కామ్ బూమ్ గురించి కూడా తెలిసుండాలి”అన్నాడు.

తన్మయి తెల్ల మొహం వైపు చూస్తూ  "మీ కాలేజీలో ఇంటర్నెట్ ఉందా?" అన్నాడు.

“ఇంటర్నెట్టా...అంటే?” సాలోచనగా అంది.

చిన్న చిరునవ్వు నవ్వి, “నాకు కొంచెం మంచి నీళ్లయినా ఇస్తారా?” అనడిగేడు.

తన్మయికి అప్పటి వరకూ తను వాకిట్లో నుంచే  మాట్లాడుతున్నానని గుర్తుకొచ్చి, చప్పున గడప లోపలి వెళ్లి, “లోపలికి రండి” అంది. లోపలికి అడుగు పెడుతూనే గోడకున్న వివేకానందుడి పటం మీద రాసున్న వాక్యాలు బిగ్గరగా చదివేడు "Knowledge is stregth – Weekness is death"

మరొక మనిషి వస్తే కూర్చోవడానికి కుర్చీ  కూడా లేదు తన దగ్గర. సమయానికి తాయిబా కూడా లేదు, అడిగి తెద్దామంటే.

తన్మయిని దాటుకుని, గది మూల నున్న చాప పరుచుకుని గోడకి జేరబడి కూచుంటూ, “అబ్బా, ఆశ్రమంలాగా ఎంత నిరాడంబరంగా ఉందో మీ ఇల్లు!” అన్నాడు.

అరల్లోని పుస్తకాల వైపు దృష్టి సారించి "అబ్బో ! అమృతం కురిసిన రాత్రి... ఆహా! మహా ప్రస్థానం...” అనసాగేడు.

తన్మయి ఆశ్చర్యంగా చూసింది.

"ఏం .సీ. ఏ చదివిన వాడికి ఇంత తెలుగు వచ్చా?"

అదేం పట్టించుకోకుండా, మహా ప్రస్థానం తీసుకుని “మావూ కూసింత తెలుగు నేర్చుకున్నావండీ.. అంటూ

"నైలు నదీ నాగరికతలో – సామాన్యుని జీవితమెట్టిది?
తాజ్ మహల్ నిర్మాణానికి – రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?
సామ్రాజ్యపు దండయాత్రలో – సామాన్యుని సాహసమెట్టిది?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ – అది మోసిన బోయీలెవ్వరు?"

అని బిగ్గరగా, గంభీరంగా చదివేడు.

తన్మయి ఆశ్చర్య చకితురాలై అలా నిలబడి పోయింది. "ఎంత బాగా చదివేడు!"

అతను పుస్తకం పక్కన పెట్టబోతూ ఉంటే "మరొకటి .." అంది "అమృతం కురిసిన రాత్రి " అతనికి ఇస్తూ బతిమాలాడుతున్నట్టు.

కాస్సేపట్లోనే ఆ గది నిండా కవితా సౌరభాలు విరిసేయి.

★★★

ఆదివారం కావడంతో కాలేజీ మూసేసి ఉంది. కానీ ప్రిన్సిపాల్ కాలేజీ లోనే ఒక గదిలో మకాం ఉంటూ ఉంటారు కాబట్టి గేటు తెరిచే ఉంది. ప్రిన్సిపాల్ యాదగిరి గారికి ప్రభుని పరిచయం చేసింది తన్మయి.

ఆయన సాదరంగా ఆహ్వానించి, “మీ అసుంటి యువకులు మా కాలేజీ ఇన్ స్ట్రక్టరు అయితే మంచిగుంటది” అన్నారు.

కంప్యూటరు లాబ్ లో ఉన్న పది కంప్యూటర్లని చూస్తూ “ఊ...అన్నీ విండోస్”అన్నాడు ప్రభు.

తన్మయి, ప్రిన్సిపాల్ అర్థం కాక, ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

“గదిలో ఉన్న విండోస్ అన్నీ ఏ.సీ కోసమని మూసేసి ఉంచారు.” చప్పున అదే చెప్పింది తన్మయి.

“సారీ, నేను ఆపరేటింగ్ సిస్టం గురించి మాట్లాడుతున్నాను” అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ఇలా కంప్యూటరుకి సంబంధించి తన అజ్ఞానం బయట పడినప్పుడల్లా అతని పెదవుల మీద కనిపిస్తున్న చిన్న నవ్వు తన్మయికి కోపాన్ని తెప్పించసాగింది.

అంతకు అంతా పట్టుదలా పెరగ సాగింది "లాభం లేదు, ఎలాగైనా ఇవన్నీ నేర్చుకోవాలి" తనలో తను అనుకోబోయి పైకే అనేసింది.

ప్రభు ఈ సారి ప్రశంసా పూర్వకంగా నవ్వేడు. అంతలోనే దీక్షగా పనిలో పడ్డాడు.

కంప్యుటరు ముందున్న వైరు కుర్చీలో కూర్చుని, చకచకా మీటలేవో నొక్కుతూ "ఇంకా కాన్ ఫిగర్ చేసినట్లు లేరు" అన్నాడు.

ప్రిన్సిపాల్ అతని పక్కకి కుర్చీ లాక్కుంటూ మరొక కుర్చీ తన్మయికి చూపిస్తూ , "అవ్వన్నీ మాకు తెల్వది, ఇగో, మా తెలుగు మేడం కి తెలుస్తయి" అన్నారు. ప్రభు కంప్యుటరు వైపే పరీక్షగా చూస్తూ, "ఈ కంప్యూటర్లతో బాటూ ఇంకేవైనా వైర్ల వంటి సామాన్లు ఇచ్చేరా?" అన్నాడు.

తన్మయి ఆ గదిలోనే ఒక పక్కగా ఉన్న గోద్రేజ్ బీరువా తెరిచింది. కాలేజీలో ఇతర క్లాసురూములకూ, ఈ గదికీ నక్కకీ నాకలోకానికీ ఉన్నంత తేడా ఉంటుంది. ఎంట్రన్సు లో గాజు తలుపు, గదంతా ఎర్ర కార్పెట్టు, కొత్త బల్లల మీద కొత్త కంప్యూటర్లు, కీ బోర్డులు, మౌసులు, బల్లల కింద ఒక సీపీయూలు, వైర్లు, అన్నిటినీ మించి కొత్త వైరు కుర్చీలు, ఇదుగో ఈ బీరువాలో లాబ్ కి కావలసిన సమస్తమైన సామాన్లతో ఈ గదెక్కడ! పెచ్చులూడిన గచ్చు, ఇంకుల సంతకాలతో రంగులు మారిపోయిన పాత బెంచీలు, అవసాన దశలో ఉన్న డెస్కులు, సంవత్సరాల తరబడి అరిగిపోయి వైట్ బోర్డు లయిపోయిన బ్లాక్ బోర్డు లతో మిగతా క్లాసురూములెక్కడ!

"దీనిని కీ-బోర్డంటారు. ఇది దాదాపు టైపు మిషను వంటిదే...." ప్రభు ప్రిన్సిపాల్ గారికి ఒక్కొక్కటీ వివరిస్తూ ఉంటే తన్మయి విస్మయంగా వినసాగింది.

"ఇంత బాగా పాఠాలు బోధిస్తున్న టీచర్ ని ఇప్పటివరకూ తను చూడలేదు"

మరో గంటలో అన్ని కంప్యూటర్లనూ ఒకసారి ఆన్ చేసి, ఆఫ్ చేసి, "ఆ బీరువాలో ఫ్లాపీ డిస్కులు ఇలా అందుకోండి " అన్నాడు ప్రభు.

తన్మయి మొహంలో ప్రశ్నార్థకాన్ని చూసి, చిన్నగా నవ్వుతూ లేచెళ్లి, బీరువాలో ఒక మూల నున్న డిస్కుల పేకెట్టుని తెచ్చేడు.

"ఇందులో మీ ఆఫీసులోఇదిగో, ఈ ఫైల్లో ఉన్న సమాచారాన్నంతా భద్రపర్చగలిగే "స్పేస్" ఉంటుంది" అన్నాడు.

తన్మయి, ప్రిన్సిపాల్ అర్థం కాక, మొహమొహాలు మళ్లీ చూసుకున్నారు.

ప్రభు ప్రిన్సిపాల్ గారి వైపు తిరిగి "నేను వచ్చే వారం మళ్లీ వస్తానండి. కాన్ఫిగర్ చెయ్యడానికి ఇక్కడ నాక్కాలవసిన సామగ్రి లేదు. నేను వచ్చేటపుడు నాతో తెస్తాను." అని

తన్మయి వైపు తిరిగి, "నేను చెప్పేవన్నీ అర్థం కాకపోతే చెప్పండి. మళ్లీ చెపుతాను. నాకేం ఫర్వాలేదు. నిజానికి ఇదంతా కొత్త ప్రపంచం. రేపటి ప్రపంచం. అందులో నేనూ విద్యార్థినే" అన్నాడు.

ప్రిన్సిపాల్ నవ్వుతూ "మంచిది, మీకెన్నడు వీలైయినా రండి, గట్లనే మా పిల్లలకూ జర కంప్యూటరు చెప్పండ్రి. ఆదివారమైనా మనం ఒక గెంట క్లాసులు పెడదాం, ఏమంటారు?" అన్నారు .

ప్రభు చిన్నగా నవ్వుతూ "అన్ని వారాలూ నాకు ఖాళీ ఉండక పోవచ్చండి. నా వరకూ ఎందుకు? మీ తెలుగు మేడం కి అన్నీ నేర్పిస్తాను. ఇక ఆవిడే చూసుకుంటారు" అన్నాడు సెలవు తీసుకుంటూ.

అతను మామూలుగా అన్నా, ఎక్కడో కొంచెం కొంటెతనం కనిపించి, తన్మయి చిరుకోపంగా తల తిప్పుకుంది.

బయటకు రాగానే చెంగు చుట్టూ తిప్పుకున్నా కింద జీరాడుతున్న తన్మయి పొడవైన జడని చూస్తూ "ఏవిటీ మీ కోసం ఇంత దూరం వస్తే భోజనం పెట్టరా?" అన్నాడు.

వెనక్కి తిరిగి అతని ముఖం వైపు చూసింది. "అప్పుడే వెళ్లిపోవాలా "అన్నట్లు దీనంగా పెట్టిన ముఖం చూసి చిర్నవ్వు నవ్వి "నాకు వంట అంత గొప్పగా రాదు మరి" అంది.

"నాకు చాతనవును. బంగాళా దుంపల వేపుడు బాగా చేస్తాను" అన్నాడు హుషారుగా.

అతనితో నడుస్తూనే ఆలోచించసాగింది తన్మయి.

"ఎవరితను? తన జీవితంలోకి వేగంగా దూసుకు వస్తున్నాడు!

ఇతనికెలా చెప్పాలి? అసలే తను ఒంటరిగా ఉంటూంది. ఇలా అతను వారం వారం వస్తే చూసే వాళ్లకి బావుంటుందా? చిన్నప్పటి నించీ తల్లీతండ్రీ కట్టుదిట్టాలతో పెంచేరు. గట్టిగా నవ్వడమే పెద్ద తప్పన్నట్లు భావించే ఊర్లో పెరిగింది తను. ఇక మగ వాళ్లతో మాట్లాడడం కూడానా? నరనరాల అంతరాంతరాల్లో జీర్ణించుకుపోయిన సమాజం పట్ల బెరుకు, భయం వెంటాడుతున్నాయి. ఇతను నగరంలో ఉండడానికి అలవాటు పడ్డ యువకుడు. అతనికీ తనకీ ఎంతో భేదముంది. పైగా అతను మగవాడు. సమాజంలో అతనికున్నంత వెసులుబాటు స్త్రీగా తనకు ఉందా? ఎంతైనా తన జాగ్రత్తలో తను ఉండడం మంచిది.

"ఏవిటీ? భోజనం పెట్టమన్నందుకే ఇంత దీర్ఘాలోచనలో పడ్డారా?" ప్రభు మాట విని ఈ లోకంలోకి వచ్చి పడింది.

దారిలో కూరగాయల మార్కెట్టు లోపలికి నడిచింది.

అప్పటికే తనకి పరిచయమైన ఒకట్రెండు దుకాణాల వాళ్లు, "ఏం మేడమ్, సారా?" అనసాగేరు.

తన్మయి తల అడ్డంగా ఊపుతూ ఆ ప్రశ్నలకు సమాధానాలివ్వడానికి కష్టపడడం చూసి, ప్రభు "సారీ, మిమ్మల్ని ఇబ్బంది పెడ్తున్నానా?" అన్నాడు.

వాకిట్లో తాయిబా ఎదురైంది, "పొద్దు పొద్దున్నే ఏడికి పొయ్యిరు మేడం" అంటూ నవ్వుతూ ప్రభు వైపు చూసి చప్పున పక్కకి తప్పుకుంది.

ఇంట్లోకి అడుగుపెడుతూనే, "అయ్యో, కరివేపాకు మరిచిపోయాను, వెళ్లొస్తాను" అంది తన్మయి.

"మరేం ఫర్వాలేదు, నేను వెళ్తాను" అన్నాడు ప్రభు.

"వద్దు, నాకివన్నీ అలవాటే, ఈ లోగా మీరు కాస్త మొహం కడుక్కుని అలా చేరబడండి" అంది మడత మంచం వైపు చూపిస్తూ చెప్పులు వేసుకుని.

తన్మయికి ఒంటరిగా ఉంటూ, అన్ని పనులూ తనంతట తను చక్కబెట్టుకోవడం అలవాటైన మూలానో ఏమో గానీ, ఎవరి సాయం తీసుకోవడం, ఎవరి మీదా ఆధారపడడం ఇష్టం ఉండడం లేదు. ప్రభు చిన్నతనం నించీ తెలిసిన వాడు, మంచి వాడు. ఆయినా అతను ఇంటికి

వస్తే తనకెందుకు తెలీని ఆందోళన ఎందుకు కలుగుతూంది? అతను మంచి సంస్కారవంతుడు కూడా. గవర్నమెంటు ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్లినపుడు ప్రభుతో కలిసి బిర్లా మందిర్ కి వెళ్లిన రోజు జ్ఞాపకం వచ్చింది తన్మయికి. బస్సులోకి ఎక్కే ముందు అతను తన చేతిని కాస్సేపు గట్టిగా పట్టుకున్నపుడు అతని చేతుల్లో తనని వదలలేని భావమేదో స్ఫురించింది. ఎందుకైనా మంచిది అతనికి దూరంగా ఉండాలని అనుకుంది.

అనుకోవడమే కాదు, బిర్లా మందిర్ మెట్లెక్కుతూ అదే చెప్పింది.

అందుకు సమాధానంగా " చిన్నప్పుడంతా మీతో మాట్లాడాలని తపించే వాణ్ణి. కానీ, ఏదీ అమ్మాయి గారు ఎప్పుడైనా కరుణిస్తేనా? అఫ్కోర్స్, మనం చదివింది పల్లెటూరు కావడం వల్ల ఎప్పుడూ ధైర్యం చెయ్యలేకపోయాను. కానీ ఇప్పటికీ నేను దాచుకోవల్సిన అవసరం నాకు కనబడం లేదు. మీకు వెన్నెల్లో బిర్లా మందిర్ చూడడం ఇష్టం. ఒక స్నేహితుడిగా కనీసం ఆ కోర్కెని వెన్నెట్లో కాకపోయినా సాయంత్రపు వెలుగులో చూపించలేనా? నా వల్ల ఏదైనా తప్పు జరిగితే నన్ను క్షమించండి" అన్నాడు. అతని మాటల్లో సిన్సియారిటీ కనిపించింది తన్మయికి.

"మీకో విషయం చెపుతాను, ఏమనుకోరుగా" అన్నాడు కాస్సేపట్లో.

ఏవిటన్నట్లు చూసింది తన్మయి.

"సండే ఈజ్ గ్రేటర్ దేన్ మండే" అన్నాడు తనకు మాత్రమే వినబడేటట్లు.

అది తను ఇంటర్మీడియేట్ చదువుకునేటప్పటి మాట. అమ్మాయిల లోదుస్తులు పొరబాటున పైకి కనిపిస్తే అబ్బాయిలు సర్దుకోమని చెప్పడానికి తమ కాలేజీలో వాడే మాట అది. ఇతనికి ఇవన్నీ ఇంకా గుర్తున్నాయా? చప్పున సర్దుకుంటూ అప్రయత్నంగా నవ్వింది తన్మయి.

"హమ్మయ్య, అలా నవ్వుతూ ఉండొచ్చుగా ఎప్పుడూ. నవ్వుతుంటే ఎంత బావున్నారో మీరు" అన్నాడు మొహంలోకి ఆరాధనా పూర్వకంగా చూస్తూ.

సంధ్య వేళ బిర్లా మందిర్ పై నుంచి నగరాన్ని చూడడం ఎంతో ఆహ్లాదంగా ఉంది. చుట్టూ ఉన్న విశేషాలు చేత్తో చూపిస్తూ వివరిస్తున్న ప్రభు వంక చూస్తూంటే మనసులో అజ్ఞాత మిత్రుడు మెదిలేడు.

"మిత్రమా! నీకెన్ని రూపాలో కదా!" అనుకుంది తన్మయి.

అంత సేపు మాట్లాడినా తన వ్యక్తిగత జీవితం గురించి ఒక్క ప్రశ్న కూడా అడగని అతని సంస్కారానికి మనసులోనే అభినందనలు తెలుపుకుంది.

★★★

కరివేపాకు కొని వెనక్కు వస్తూ, "తను అనవసరంగా భయపడుతున్నట్లుంది. ప్రభు తన చిన్న నాటి పరిచయస్తుడు. ఇప్పుడు మిత్రుడు, తన మంచికోరే వాడు. కాలేజీలో పని కోసం ఒకట్రెండు సార్లు అతను వచ్చెళితే తనకు కలిగే నష్టమేముంది?"

ఆలా అనుకోగానే మనస్సు కాస్త తేలిక పడి వడివడిగా నడవ సాగింది.

44

"మీ అబ్బాయి భలే ముచ్చటైన వాడు! ఆడుకోవడానికి బయటికెళ్ళినట్లున్నాడు. బయటి నించి రాగానే నాకు "నమస్తే" అని చెప్పేడు. బుద్ధిగా కాళ్లూ చేతులు కడుక్కుని, బట్టలు మార్చుకుని పుస్తకాలు ముందేసుకుని చదువుతున్నాడు." అన్నాడు ప్రభు తన్మయితో.

కరివేపాకు మర్చిపోయిన పాపానికి రెండో సారి మార్కెట్ వరకూ నడిచెళ్లొచ్చిన తన్మయి ముఖానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ చిరునవ్వుతో బాబు వెన్ను మీద నిమిరి

"ఏం నాన్నా! బాగా ఆడుకున్నావా?" అంది.

సీరియస్ గా చదువుకుంటున్నట్లు ముఖం పెట్టి తలూపేడు వాడు.

"ఒకటో తరగతిలోనే ఇంత సీరియస్ చదువా? మేమెప్పుడూ ఇంత భయభక్తులతో చదవలేదు!" నవ్వుతూ అంటూ వంట గట్టు దగ్గిరకి వచ్చి నిలబడ్డాడు ప్రభు.

తన్మయి ఉల్లిపాయలు కోస్తూ ఉంటే, "నేనూ సాయం చెయ్యనా?" అన్నాడు.

తన్మయికి ఇదంతా కొత్తగా, ఆశ్చర్యంగా ఉంది. ఇంత వరకూ తనెరిగిన మగవాళ్లెవరూ వంట ఇంటిలోకి తొంగి చూసిన వాళ్లు కాదు మరి! తల్లి మంచి నీళ్లు కూడా తెచ్చి ఇస్తేనే తాగుతాడు తండ్రి. ఇక అత్తవారింట్లో సరేసరి. మగవాళ్ళతో కలిసి భోజనం చెయ్యడం కూడా తప్పేనన్నట్లు ముందు ఇంట్లోని మగవాళ్ళంతా తిని లేచేకే, చివరలో ఆడవాళ్లకి వడ్డించేది శేఖర్ తల్లి.

శేఖర్ ఎప్పుడూ వంటింట్లోకి వచ్చి తాను వంట చేస్తుండగా కబుర్లు చెప్పడం కూడా చెయ్యలేదు. తను వంట చేస్తున్నంత సేపూ అతను నిద్రపోవడమో, బయటికి ఫ్రెండ్స్ తో తిరగడం కోసం వెళ్లిపోవడమో చేస్తుండేవాడు. వంట చెయ్యడమూ, వడ్డించడమూ కేవలం ఆడవాళ్ల బాధ్యత మాత్రమే అని తనకి అర్థమవుతూ వచ్చింది.

అదే చెప్పింది ప్రభుతో.

"మీ ఆడవాళ్లు మమ్మల్ని వంటింట్లోకి రానిస్తే కదా!" అని చిరునవ్వుతో "తప్పుకోండి, ఇవేళ చీఫ్ కుక్ ని నేను. మీరు సహాయం చేయండి చాలు" అన్నాడు.

స్టవ్వు పక్కనే చిన్న స్టాండులో అందంగా సర్ది ఉన్న సరుకులు, మసాలా దినుసుల సీసాల్ని , వాటి మీద పేర్లని చూస్తూ , "అమ్మో! వంటింటిని కూడా ఇంత ఆర్గనైజ్డ్ గా నడపడం మీ వల్లే అవుతుంది" అన్నాడు.

అతనడిగే వరకూ తన దగ్గిర గ్రైండర్ కాదుకదా మిక్సీ కూడా లేదన్న విషయం స్ఫురించలేదు తన్మయికి. ఎప్పుడైనా అవసరమైతే వాకిట్లో ఉన్న ఇంటి వాళ్ల సన్నికల్లు మీద నూరడం, కొంచెం ఎక్కువ రుబ్బాల్సి వస్తే రుబ్బురోట్లో రుబ్బడం అలవాటు చేసుకుంది తన్మయి.

"ఏవిటేవిటీ ! మిక్సీలు వచ్చి ఇన్నాళ్లవుతున్నా మీరు వీటితో అడ్జస్ట్ అవుతున్నారా!" అని , "పొరబాటున నాతో పప్పు రుబ్బించరు గదా" అన్నాడు భయాన్ని నటిస్తూ.

తన్మయికి అతని ముఖం చూసి నవ్వొచ్చింది.

చప్పున "నెలకొక వస్తువు సమకూర్చుకో మేడం" అన్న తాయిబా మాటలు జ్ఞాపకం వచ్చేయి.

అదే అంది పరధ్యానంగా.

"నెలకొక వస్తువు ఎందుకు?" అని, వెంటనే అర్థమైనట్లు ఆగేడు.

అటు తిరిగి సన్నికల్లు మీద నూరుతున్న తన్మయికి వెనక నుండి "తన్మయీ !" అని గద్గదంగా వినిపించింది.

అతని కళ్ళల్లో సన్నటి నీటి పొర, ఏమీ చెయ్యలేని అశక్తత ఆ గొంతులో అడ్డంపడ్డట్లు స్పష్టంగా తెలుస్తోంది తన్మయికి.

"నా మీద జాలిపడొద్దు ప్రభూ" అంది.

"ఛా. జాలికాదు తన్మయీ, ఏదో చెప్పలేని బాధ. నాకే తెలీకుండా నన్ను చుట్టుముట్టి మెలితిప్పుతున్న బాధ" పక్కనే కూచుని కళ్లనీళ్లు పెట్టుకుంటున్న అతన్ని చూస్తూ

"అయ్యో, ఇంత జాలి గుండె కలవాడా ఇతను" అని అనుకోకుండా ఉండలేకపోయింది.

-----------

భోజనాల తర్వాత మరో గంటసేపు ఉండి, "వెళ్ళొస్తానూ" అన్నాడు ప్రభు.

తన్మయి నిశ్శబ్దంగా తలూపింది. అతను భారమైన హృదయంతో వెళ్తున్నట్టు తెలుస్తోంది.

కానీ తన గురించి అతను అంత బాధపడ్తున్నందుకు సంతోషించాలో, బాధ పడాలో అర్థంకాక అయోమయంగా గుమ్మం దగ్గరే మోకాళ్ల లో తల పెట్టి ఎంతో సేపు కూచుండి పోయింది. తన గురించి శ్రద్ధాసక్తులు చూపిస్తున్న ఇతను తనకి ఏమవుతాడు? ఎందుకు హఠాత్తుగా తన జీవితంలోకి అనుకోకుండా ప్రవేశించాడు? తన జీవితం ఒకప్పుడు దయనీయ స్థితిలో ఉండేది. కానీ ఇప్పుడు మెరుగయింది. ఇప్పుడు తనకి కావాల్సిందల్లా నిబ్బరం. ఒంటరిగా, ధైర్యంగా బతకగలగడం. బాబుని ఏ లోటూ లేకుండా పెంచుకురావడం. ఇందులో ఎవరైనా జాలి పడాల్సింది ఏమైనా ఉందా?

"రతనాల మేడలోన నిన్నొక రాణిగ చూడాలని, నీ అడుగులు కందకుండా నా అర చేతులుంచాలని, ఎంతగా అనుకున్నాను, ఏవిటి చూస్తున్నాను...." ఎదురింటి టీవీ లో నుంచి పాట వినిపించసాగింది.

ప్రభు తనని చిన్నతనం లో ఆరాధించాడన్న విషయం తనకి బొత్తిగా ఎప్పుడూ తెలియనేలేదు. సరిగ్గా అదే వయసు నుంచి శేఖర్ తన చుట్టూ తిరగడం వల్లనో ఏమో తనెప్పుడూ తన చుట్టూ ఉన్న మరే మగ పిల్లవాడి వైపూ ప్రత్యేకించి చూసిన జ్ఞాపకం కూడా లేదు. తనంటే ఇష్టపడి వచ్చానన్న శేఖర్ తన జీవితాన్ని సమూలంగా నాశనం చేసేడు. స్నేహంగా ఉంటూ, తన పట్ల ఇష్టం చూపించిన కరుణ చివరికి స్వార్థపూరితంగా ఆలోచించేడు. ఇక ఇప్పుడు తన పట్ల చిన్నప్పటి ఆరాధనతో, జాలితో దగ్గరవుదామని ప్రయత్నిస్తున్న ప్రభుని తన జీవితంలోకి స్నేహితుడిగానైనా అసలు రానివ్వొచ్చా?

ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న తన జీవితంలో లేనిపోని సమస్య లు కావాలని కొని తెచ్చుకుంటున్నానా? అని మథనపడసాగింది తన్మయి.

నిస్త్రాణగా పడుకున్న తల్లిని "అమ్మా!" అంటూ ఆందోళనగా కుదిపేడు మృదుల్.

"ఏం లేదు నాన్నా, కాస్త తలపోటుగా ఉంది, అంతే" అంటూ లేచి బాబుని ఒళ్ళోకి తీసుకుని, "కాస్సేపు బజ్జో" అంది జోకొడుతూ.

------------

మర్నాడు ఉదయం లేస్తూనే బాబు ఒళ్లు జ్వరంతో కాగిపోసాగింది. తాయిబాతో కాలేజీకి సెలవు చీటీ పంపించింది. బస్టాండ్ దగ్గరలో పిల్లల డాక్టరు ఉన్నాడని తాయిబా చెప్పింది. సరిగ్గా డాక్టరు దగ్గిరికి వెళదామని బయలుదేరబోయేసరికి చినుకులు పడసాగేయి. రోడ్డు పక్కన ఎంతసేపు నిలబడ్డా ఒక్క రిక్షా కూడా రావడం లేదు. ఇక బాబుని ఎత్తుకుని నడవడం మొదలుపెట్టింది. నాలుగడుగులు వేసేసరికి ఆయాసం రాసాగింది. దించి, నడిపిద్దామా అంటే, వాడు నడిచే పరిస్థితిలో లేడు. ఇంతలో కుండపోతగా వాన ప్రారంభమయింది. చేతి సంచిలో ఉన్న తువ్వాలు భుజమ్మీదున్న బాబు మీద కప్పి ఊపిరి బిగబట్టి వేగంగా అడుగులెయ్యడానికి ప్రయత్నించసాగింది. ఎంత వేగంగా నడవాలనుకుంటే అంత నెమ్మదిగా పడసాగేయి అడుగులు. ఎత్తుకున్న భుజం, పట్టుకున్న చేతులూ పట్టు ఇవ్వకపోగా, కాళ్లు పీకెయ్య సాగేయి.

తన్మయికి దుఃఖం ముంచుకొచ్చింది. దగ్గరలో కనబడ్డ దుకాణం ముందుకు వడిగా నడిచి చూరు కింద నిలబడింది. దుకాణం మూసి ఉండడం తో నిలబడేందుకు అంతగా జాగా లేదు. కాస్త కూచునే చోటేమైనా ఉంటుందేమోనని చుట్టూ చూసింది. అంతా మట్టి తప్ప ఏవీ లేదు.

భుజమ్మీద జ్వరంతో మూలుగుతున్న పిల్లాణ్ణి ఒడిసి అలాగే పట్టుకుని "భయంలేదు నాన్నా! అమ్మ ఉంది" అని తనలో తను గొణుక్కుంటున్నట్టు అనసాగింది. అసలే జ్వరం లో ఉండి తడవడం వల్ల ఇంకేదైనా అయితే? సమయానికి వైద్యం అందకపోతే? – ఆ ఆలోచనకే భయంతో కాళ్లు ఒణక సాగేయి తన్మయికి. కాస్సేపట్లో వాన తగ్గు ముఖం పట్టినా రిక్షాలు అటుగా రావడం లేదు. అసహాయంగా రోడ్డు కేసి చూస్తూ భారంగా అడుగులేయసాగింది.

హాస్పిటల్ కు చేరుకునే సరికి బాగా నీరసం వచ్చేసింది. పేషంట్లతో కిటకిటలాడుతున్న వరండాలో బల్లమీద కాస్త జాగాలో కూలబడింది.

మరో అరగంట తర్వాత డాక్టరు ఇంజక్షను చేసి, "ఏం ఫర్వాలేదు" అని చెప్పేవరకూ మనసు కుదుటపడలేదు తన్మయికి.

తన బాధని పంచుకోవడానికి, కనీస సహాయం చెయ్యడానికి తోడు ఒకరుంటే బావుణ్ణని మొదటిసారి అనిపించింది.

---------------

రెండ్రోజుల్లో బాబుకి తగ్గుముఖం పట్టింది. బండి గురించి వెతకడం ముమ్మరం చేసింది తన్మయి.

కాలేజీకి వెళ్లే దారిలో ఉన్న మెకానిక్ షాపు అబ్బాయి వెనక నుంచి "మేడమ్" అంటూ కేక వేసేడు.

తన్మయి వెనక్కి రెండడుగులు వేయగానే, "మీరు సెకండ్ హాండ్ బండి గురించి అడిగిన్రు కదా! పన్నెండు వేలకి ఓ బండొచ్చింది కొంటరా?" అనడిగేడు.

తన్మయి తటపటాయింపు చూసి, "పాత బండి అని పరేషాన్ గాకు మేడం, సంవత్సరం వరికి ఏ రిపేరొచ్చినా నాది జిమ్మెదారీ" అన్నాడు.

తన్మయి ఆలోచిస్తున్నది అది కాదు, "ఇప్పటికిపుడు పన్నెండు వేలంటే ఎక్కడినుంచి వస్తాయి?"

అదే చెప్పింది అతనితో.

"చివరి మాట పదకొండున్నర వేలకి ఇప్పిస్తా, ఆ తర్వాత నీ ఇష్టం" అన్నాడు.

కాలేజీ కి వెళ్లి సంతకం పెడ్తుండగా, "రిజిస్టర్ పార్సిల్ వచ్చింది మేడమ్" అని క్లర్కు ఇచ్చేడు.

"అంత పెద్ద పార్సిల్ ఎక్కడి నుంచయ్యుంటుందబ్బా!" సాలోచనగా పార్సిల్ వెనక్కి తిప్పి ఫ్రమ్ అడ్రసు చూసింది.

కొక్కిరిబిక్కిరి దస్తూరితో "ప్రభు" అన్న పేరు, అడ్రసు కనబడేసరికి ఇంకాస్త ఆశ్చర్యపోయింది.

ఏం పంపించి ఉంటాడు? తన డెస్క్ దగ్గిర కూచుని ఆదరాబాదరా చింపింది.

"కంప్యూటర్ బేసిక్స్" అనే టైటిల్ తో స్పైరల్ బైండు తో ఉన్న దాదాపు వంద పేజీల టైపు చేసిన కాగితాలు అవి.

చిన్న చాప్టర్ లతో , ప్రతీ చాప్టర్ కు బొమ్మలతో, సింపుల్ ఇంగ్లీషులో ఇలా చదవ గానే ఇట్టే అర్థమయ్యేలా ఉన్న ఆ నోట్సు చూసి తనలో తను ప్రభుని అభినందించకుండా ఉండలేకపోయింది. పుస్తకం మధ్యలో అన్నిటికంటే విభిన్నంగా పైకి కనిపిస్తున్న కాగితాన్ని బయటికి లాగింది. ఉత్తరం. కష్టపడి రాసినట్లున్న దస్తూరీ.

తనూ!

ఉభయకుశలోపరి.

మిమ్మల్ని ఇలా పిలవాలని ఎన్నాళ్ల కాంక్షో ఇప్పటికి నెరవేరింది. ఎలాగైతేనేం రాత్రీపగలూ కూచుని మీ కోసం గబగబా ఈ మెటీరియల్ తయారు చేసేను. కంప్యూటర్స్ కు సంబంధించిన విషయాలు మీకు త్వరితంగా అర్థం కావడానికీ , మీ కాలేజీలో విద్యార్థులకు మీరు బోధించడానికీ ఇది మీకు బాగా ఉపయోగపడుతుందనుకుంటున్నాను. ఎక్కడే సందేహం వచ్చినా నిర్మొహమాటంగా అడగండి. (అలాగైనా మీ నించి ఉత్తరం అందుకోవచ్చని చిన్న ఆశ సుమా!) అవునూ, నన్ను అసలెప్పుడైనా గుర్తు తెచ్చుకుంటారా?

మీ అబ్బాయితో ఆడుకుంటూ నన్నెప్పుడో మర్చిపోయానని మాత్రం చెప్పకండి. అన్నట్లు ఎలా ఉన్నాడు వాడు? మీలాగే చాలా హుందాతనం ఉన్న కుర్రాడు. మొన్న మీ ఇంటికి వచ్చినపుడు మాట వరసకి "మీ నాన్న ఎక్కడుంటారు?" అనడిగేను.

"ఏమో, నాకు తెలియదు" అని చాలా సీరియస్ గా అని, తల దించుకుని తన హోమ్ వర్కు చేసుకోసాగేడు.

వయసు కంటే ఎంతో ఎత్తుకి ఎదిగినట్లున్న ఆ పసివాణ్ణి చూస్తే ముచ్చట వేసింది. మీ పెంపకానికి జోహార్లు.

ఇప్పటికే రాత్రి పన్నెండు కావచ్చింది. నా చుట్టూ ప్రపంచమంతా నిద్రపోతూ ఉంది. నేను మీకు ఇలా రాస్తూ ఉంటే మీరు ఎదురుగా ఉండి, మీతో మాట్లాడుతున్నట్టే ఉంది.

"తెల్లారి కాస్త ఒందుకుని, ఉద్యోగానికి టైము కెళ్ళడం కోసం బస్సుల వెంట పరుగులు పెట్టాలి." అని ఒక పక్క గడిచిపోతున్న సమయం హెచ్చరిస్తూ ఉన్నా ఇలాగే రాత్రంతా మెలకువగా ఉండి మీతో కబుర్లాడాలని ఉంది.

మీరిక్కడే ఉన్నారు కదూ!

కళ్లు మూతలు పడకపోయినా కాలం హెచ్చరిక వినకతప్పదు.

ఇప్పటికి ఉండనా మరి!

మీ

ప్రభు

ఉత్తరం మడతపెట్టి గుండెలకు హత్తుకుంది.

"తనూ!" – ఏ సంబోధన కోసం తను ఎప్పుడూ అర్రులు చాస్తుందో అలా తనని పిలవాలని ఇతనికి ఎందుకు అనిపించింది!?

దస్తూరీ బాగా లేకపోయినా మళ్లీ మళ్లీ చదవాలనిపించేలా ఎంత బాగా రాసేడు! శేఖర్ కి తను ఇలాగే అందమైన ఉత్తరాలు రాసేది. అటునించి అతనూ అలా రాస్తే బావుణ్ణని ఎంతో ఎదురుచూసేది. ఆ కోరిక ఎప్పుడూ తీరలేదు. అసలు అతనికి తన భావాలు అసలెప్పుడైనా అర్థం అయి ఉండి ఉంటాయా?. ఒకసారి తనని అడిగేడు.

నువ్వు ఉత్తరాల్లో "కదూ!" అని రాస్తావు ఎప్పుడూ. అంటే అర్థం ఏవిటి? " కదా " అనా? "కాదు" అనా?" అని.

ఇప్పుడు తల్చుకుంటే అతని అజ్ఞానానికి నవ్వు వస్తోంది గానీ, అప్పుడు అయోమయంగా అనిపించింది. ఇతనికి అర్థమవుతున్నాయనుకుని తనేదేదో రాసింది ఇన్నాళ్లూ. ఇతనికి "కదూ!" అనే పదానికే అర్థం తెలీదన్నమాట!

ప్రభు రాసిన వాక్యాలు మళ్లీ మళ్లీ జ్ఞాపకం వస్తున్నాయి. "మీరిక్కడే ఉన్నారు కదూ!"

ఆ రోజంతా కాలేజీలో క్లాసుల మధ్యలో ఎప్పుడు ఖాళీ దొరికినా మెటీరియల్ తీసి చదవసాగింది. ప్రతిసారీ ఉత్తరం ముందుగా చదవవాలని అనిపిస్తోంది ఎందుకో!

కాలేజీ విడిచిపెట్టే ముందు "ఇవేళ మొదటి విడత చీటీ పాట ఉంది. మీకు అవసరం ఉందని తాయిబా చెప్పింది. మీరు పాడుకుంటారా?" అన్నాడు టైపిస్టు.

అన్యమనస్కంగా తలూపింది. అసలు చీటీ పాట అంటే ఏవిటో తెలియదు తన్మయికి.

అదే చెప్పింది అతనితో.

"మీరేం ఫికర్ చెయ్యకురి. గట్ల వచ్చి నిలబడిన సాలు. నేను నడిపిస్త గద" అన్నాడతను.

"దేవుని పాట అయిదువందలు" అని మొదలయింది పాట.

"వెయ్యి"

"పదిహేను వందలు"

మూడు వేలు"

గబగబా వినవస్తున్న ఆ సంఖ్యలు తన్మయికి గాభరాని పుట్టిస్తున్నాయెందుకో. పాట చివరికి ఆరువేల అయిదువందల దగ్గిర ఆగింది.

టైపిస్టు తన్మయికి చెవిలో చెప్పేడు. "మరొక అయిదు వందలు కలుపురి. మీదే అయితది"

తన్మయి "ఏడు వేలు" అనడంతో అంతా నిజంగానే నిశ్శబ్దంగా అయిపోయేరు.

ఒకటోసారి, రెండో సారి, మూడో సారి....అన్నాడు టైపిస్టు.

తన్మయి ఏదో గెల్చినట్లు "కంగ్రాట్స్ మేడమ్" అనసాగేరు అంతా.

ఇరవై వేల చీటీలో ఏడువేలు పోగా పదమూడు వేలు తీసి తన్మయి చేతిలో పెట్టేడు టైపిస్టు.

అంతా చప్పట్లు కొట్టేరు. కానీ ఇంకా తన్మయికెందుకో లోపల గాభరాగా అనిపించసాగింది.

దీని వలన తన జీతంలో నుంచి ఇరవై నెలల పాటు నెలకి వెయ్యి రూపాయల చొప్పున దీనికి పోతుంది. అసలే "ఏదైనా తెలీని కష్టమొస్తే" అని దాస్తున్న మార్గదర్శి చీటీకి ఇది తోడయ్యింది.

బండి కొనడం వల్ల పెరిగే పెట్రోలు, రిపేర్లు వంటి ఇతరత్రా ఖర్చులు తోడైతే, తన నెల జీతం బాబుకి, తనకి బొటాబొటీగా సరిపోతుంది. గబగబా లెక్కేసింది. ఇక తల్లిదండ్రుల్ని చూడడానికి సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే వెళ్లగలదు.

"బండి త్వరగా కొనాలనే తపనతో అనవసరంగా ఇటువంటి పనులు చేస్తోందా తను!" ఇంటికి నడుస్తూ దీర్ఘమైన ఆలోచనలో పడింది.

## 45

దసరా సెలవులు వచ్చేయి. డబ్బులు ప్రధాన సమస్య కావడం వల్ల ఉద్యోగంలో చేరి, బాబుని తీసుకుని వచ్చేక ఇంటికి మళ్లీ వెళ్లే డబ్బు వెసులుబాటు కలగలేదు తన్మయికి. కానీ పీ.హెచ్.డీ లోజాయినయ్యిన మొదటి సంవత్సరం గడిచే లోగా ప్రీ పీ .హెచ్ డీ పరీక్ష రాయాల్సి ఉంది.

అనుకోకుండా దసరా సెలవులు కాగానే వచ్చే మొదటి సోమవారమే పరీక్షకి తారీఖు ఖరారు కావడంతో ఎలాగూ విశాఖపట్నం వెళ్లాల్సి ఉంది కూడా కాబట్టి తన్మయి బండి కొనే ఆలోచన తాత్కాలికంగా పక్కనబెట్టి ఇంటికి బయలుదేరింది. కాలేజీ కి మధ్యాహ్నం సెలవు పెట్టి బస్సెక్కి హైదరాబాదుకి చేరుకుంది. రైల్వే స్టేషనుకి చేరుకునే సరికి ఏడు కావచ్చింది. రాత్రి తొమ్మిది గంటల వేళ రైలుకి టిక్కెట్టు కావడంతో ప్లాట్ ఫారమ్మీద ఉన్న హిగ్గిన్ బాదమ్స్ పుస్తకాల షాపు దగ్గర్లో ఉన్న గట్టు మీద కూచుంది. షాపుకి కట్టి ఉన్న తాడు మీద అన్నిటికన్నా చివరన ఉన్న వారపత్రిక తీసి, "చూడొచ్చా?" అంది.

రెండో పేజీలో ఉన్న ఫుల్ పేజీ బొమ్మ కి సరిపోయేటట్లు ఉన్న కవిత చూడగానే చదవాలనిపించేటట్లు ఉంది.

"ఈ జీవితం కాన్వాసు మీద

వయసు కుంచె

అనుభవాల రంగుల్తో

వేసిన స్మృతి చిత్రాలు

కాలం నీరు

ఎంతగా ఒలికినా

మాసిపోవడం లేదు"

"ఎంత బాగా రాసేరు!!" అనుకోకుండా ఉండలేకపోయింది.

కవిత రాసిన వారి పేరు కోసం మళ్లీ ఒకసారి పేజీ తిప్పి చూసింది.

"కిరణ్ ప్రభ"

వెనక నుంచి బాబు కొొంగు పుచ్చుకుని లాగేడు.

చిరుకోపంగా "ఏవిటమ్మా?" అంది.

ఆ పక్కనే నిలబడి తన వైపే చూస్తున్న ప్రభుని చూసి ఆశ్చర్యపోయింది.

"మీరేవిటి, ఇలా?" అంది.

"ఊరు వెళ్తున్నారన్న సంగతి మీరు చెప్పక పోతే తెలీదనుకున్నారా?" అంటూ టిఫిను బాక్సు చేతిలో పెట్టేడు.

"జీడిపప్పు ఉప్మా. నేనే స్వయంగా చేసేను. రైలెక్కగానే తినండి. అప్పటికి బాగా ఆకలేస్తుంది." అంటూ

జేబులో నుంచి ఫైవ్ స్టార్ చాక్లట్టు తీసి బాబు చేతికి ఇవ్వబోయేడు.

బాబు తన్మయి వైపు తిరిగేడు, "తీసుకోనా, వద్దా" అన్నట్లు.

"అయ్యబాబోయ్, ఏం కట్టుదిట్టంగా పెంచుతున్నారో వీణ్ణి. మీరు పర్మిషను ఇవ్వందే చాక్లెట్టు కూడా తీసుకునేటట్లు లేదు వీడు." అని నవ్వి "ఫర్వాలేదు లేవోయ్" తీసుకో అన్నాడు.

అప్పటికీ బాబు తటపటాయిస్తూ, తన్మయి తల ఊపగానే చటుక్కున అంది పుచ్చుకుని, "థాంక్యూ" అన్నాడు.

"నిజంగానే, ఎలా తెలిసింది మీకు?" అంది సాలోచనగా.

"ఇంటికి ఫోను చేసేను. తాయిబా మీరు ఏ బండికి వెళ్తున్నారో పేరు చెప్పింది. ఇందులో అంత దాపరికం ఏవుంది!" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఊహూ..ఏం లేదు. మీరెందుకు ఇలా...ఇబ్బంది" అంటూ బాక్సు వైపు చూస్తూ ఇక మాట్లాడలేనట్లు తల కిందికి వంచుకుంది!

ఇతనికి తనంటే ఎందుకింత అభిమానం!

అదే అడిగింది.

బదులుగా నవ్వి, "అదిగో రైలు వస్తోందని ఎనౌన్సుమెంటు మొదలైంది. దయచేసి వినండి" అన్నాడు అనౌన్సరుని మాటల్ని అనుకరిస్తూ.

తన్మయి వద్దన్నా వినకుండా లగేజీ పట్టుకుని "బెర్తు నంబరు చెప్పండి" అన్నాడు.

తన్మయి సర్దుకోగానే రైలు దిగుతూ "జాగ్రత్తగా వెళ్లి రండి. ఎదురు చూస్తుంటాను" అన్నాడు.

రైలు కదిలేంత వరకూ కిటికీ ఊచల్ని పట్టుకుని నిలబడే ఉన్నాడు.

"ఉత్తరం వెయ్యడం మర్చిపోకండి" అన్నాడు చివరికి. అతని గొంతులో చెప్పలేని బాధ ధ్వనించింది.

అతని మాటలు, బాధ అర్థమవుతున్నా తన హృదయం ఏదో సందేహిస్తూంది. ఒక పట్టాన మానని చేదు గాయలు అంతరాంతరాల్లో సలుపుతున్నాయి. అతనికి ఆహ్వానం పలకలేని స్థితి. అలాగని దూరంగా ఉండమని కఠినంగా అతనిని హెచ్చరించలేని స్థితి. తనేవిటో, తన జీవితం ఏవిటో అతనికి ఏం తెలుసని ఇలా వెంటపడుతున్నాడు?

బండెక్కగానే బాబు "ఆకలి" అనడం మొదలుపెట్టేడు.

బాక్సు మూత తీయగానే జీడిపప్పు, కరివేపాకు, అల్లం సువాసన గుప్పున కొట్టింది. ఆత్రంగా ముందుకు వంగిన బాబుకి తినిపించి, తనూ తింది. అతని మనసులోని ప్రేమంతా కలిపినట్లు ఎంతో రుచిగా ఉందా ఉప్మా. అసలు అతనికి 'రైలెక్కగానే ఆకలేస్తుందని' ఆలోచన వచ్చినందుకే అతని పట్ల మనసంతా కృతజ్ఞతతో నిండి పోయింది. తినగానే నిద్రలోకి జారుకున్నాడు బాబు. ప్రభు గురించి ఆలోచనలు చుట్టుముట్టాయి. అతను తమ గురించి ఆలోచిస్తూ అతని జీవితాన్ని వృథా చేసుకుంటున్నాడు. ఇప్పుడిప్పుడే మొదలు పెట్టిన అతని జీవితంలో అన్నీ సాఫీగా జరగాల్సి ఉంది. ఇంకా ఎంతో వృద్ధిలోకి రావాల్సిన వాడు. లేదు లేదు. ఇదిక్కడితో ఆపాలి. ఇంకా మొదలవుతున్న అతని జీవితంలో నుంచి ఇప్పుడు నిష్క్రమించడమే మంచిది. అదేదో ఇప్పుడే చెప్తేనో?

ఆలోచన రాగానే పర్సులో నుంచి ఇన్ లాండ్ లెటరు ఒకటి తీసి, రాయడం మొదలు పెట్టింది.

"ప్రభూ!

నా కోసం మీరు శ్రమ పడి తెచ్చిన ఉప్మా ఇప్పుడే పూర్తి చేసాం. నా జీవితంలో ఇంత రుచికరంగా ఎవరూ వండగా ఇప్పటివరకూ నేను తినలేదు. మా గురించి ఇంతగా ఆలోచిస్తున్న మీ ఋణం తీర్చుకోవడానికి "ధన్యవాదా"లన్నది చాలా చిన్న మాట. కారణాంతరాలేవైనా మీరు బాల్యంలో నన్నెరిగినంత బాగా నేను మిమ్మల్ని గురించి ఎప్పుడూ తెలుసుకోలేదు. నా వరకూ నాకు మీరు ఇప్పుడిప్పుడే పరిచయమైన స్నేహితులే. రైలు కదిలేంతవరకూ మీరలా నా కోసం నిలబడడం నాకెందుకో ఇబ్బందికరంగా అనిపించింది. ఇలా ఎవరినీ ఇబ్బంది పెట్టడం నాకు బొత్తిగా నచ్చదు. నా పట్ల మీకు చిన్నప్పటినించి ఉన్న ఆరాధనని అర్థం చేసుకోగలను. కానీ నా చుట్టూ తిరుగుతూ మీ సమయాన్ని, జీవితాన్ని వృథా చేసుకోవడాన్ని చూస్తూ ఉరుకోలేను. అర్థం చేసుకుంటారు కదూ!

సదా

మీ మంచి కోరే మీ స్నేహితురాలు,

తన్మయి.

లెటరు మడిచి పర్సులో పెట్టుకున్నాక గానీ మనసు స్థిమిత పడలేదు.

"పొద్దున్నే ఇంటికి వెళ్లగానే పోస్టు చేసెయ్యాలి." అనుకుంది.

లయబద్ధంగా వినిపిస్తున్న పట్టాల చప్పుడు, పట్టాల మీద ఉయ్యాలలూగుతూన్నట్లు సాగే రైలు ప్రయాణం తనకి చిన్నతనం నించీ చాలా ఇష్టం. ఎప్పుడూ ఇలా రైలెక్కగానే అలా తరుముకొచ్చినట్లు వస్తుంది నిద్ర. ఇవేళెందుకో నిద్ర పట్టడం లేదు.

కిటికీ వార బెర్తు కావడం వల్ల చీకట్లో చెట్ల నీడలు వేగంగా కదులుతూ ఆకాశంలో అప్పుడే పొడిచిన అందమైన నెల వంకతో పాటూ పరుగు పందెం వేసుకున్నట్లు పోటీ పడసాగేయి.

అంతలో మెల్లగా రైలు ఏదో స్టేషనులో ఆగింది. దానితో బాటూ ఆలోచనల వేగమూ తగ్గినట్లైయింది.

తనలో తను సంభాషించుకో సాగింది.

"నన్ను మన్నించు అజ్ఞాత మిత్రమా! నీతో ఎన్నో రోజులయింది సంభాషించి. నీ రూపంలో ప్రభు కనిపిస్తున్నాడు నాకు. కానీ అది నా భ్రమో, నిజమో తెలియడం లేదు. తెలిసి తెలిసి అతని జీవితాన్ని కష్టాలమయం చెయ్యడం ఇష్టం లేదు. అలాగని చిన్నతనం నించీ ఆరాధిస్తున్న అతన్ని దూరం చేసుకోవడమూ ఇష్టం లేదు. నువ్వే చెప్పు ఏం చెయ్యాలో."

రైలు మళ్లీ బయలుదేరబోతున్నట్లుంది.

"నువ్వే చెప్పు మిత్రమా ఏం చెయ్యాలో" అని కళ్లు మూసుకుంది.

స్టేషనులో గణగణా గంట మోగింది.

"సత్యం" అన్నారు ఎవరో.

-------

వనజ ఊర్లో ఉందని తెలియడంతో వెళ్లగానే వాళ్ల ఇంటికి బయలుదేరింది.

"చాలా బావుందమ్మా నీ హడావిడి. రాకరాక వచ్చేవు. ఇలా రాగానే అలా స్నేహితురాలంటూ పరుగెత్తాలా? వెళ్లే ముందు వెళ్ళొచ్చు. ఇంతలో తనెక్కడికీ పోదు." అంది జ్యోతి.

"వెళ్లనీ, స్నేహితురాళ్ళు ఇద్దరూ కలిసి చాన్నాళ్లయ్యింది కదా" అన్నాడు భానుమూర్తి.

ఒకప్పుడు చకచకా పనులన్నీ చక్క బెట్టే తండ్రి ఇప్పుడు లేవదీస్తే గానీ, మడత కుర్చీ లోంచి కదలలేని పరిస్థితిలో ఉన్నాడు. తన్మయికి తప్పిదం తనదే అన్న బాధ చుట్టుముట్టింది. తల్లికి సమాధానం చెప్పకుండా వనజ ఇంటి వైపు నడిచింది. వనజ రెండో కాన్పుకి అమ్మగారింటికి వచ్చింది. పాప చక్రాల లాంటి కళ్లతో అందంగా ఉంది. నడుముకి తువ్వాలు బిగించి కట్టుకుని మెల్లగా అటూ ఇటూ తిరుగుతూ ఉన్న వనజ తన్మయిని చూడగానే ఆత్మీయంగా చేతులు గట్టిగా పట్టుకుంది.

"మళ్లీ లక్ష్మీ దేవేనమ్మా. మూడో సారైనా కొడుకు పుడతాడో లేదో చూడాలి." అంది నిష్టూరంగా వనజ తల్లి మళ్లీ ఆడపిల్ల పుట్టడం వల్ల అన్యాయమేదో జరిగిపోయినట్టు.

"చాల్లేమ్మా నీ పిచ్చి మాటలు. నువ్వే అత్తగారిలా తయారయ్యేవు. ఇప్పటికే రెండు సార్లు చచ్చి బతికేను. ఇంకా మూడోసారి కూడానా?" అంది కాస్త గొంతు పెంచి వనజ.

ఆవిడ నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. తన్మయికి ఆశ్చర్యం వేసింది. తనెప్పుడూ తల్లితో అలా చనువుగా, గద్దింపుగా మాట్లాడి ఎరుగదు. అదే తన తల్లి అయితే రెండో వాక్యం పూర్తి చెయ్యక ముందే ముక్కు చీది ఏడవడం మొదలెట్టేది. ఇంకాస్త ముందుకెళ్లి వారం పాటు మాట్లాడడం కూడా మానేసేది.

వనజతో అదే అంది.

"మా అమ్మ అమాయకురాలు. పితృస్వామ్య వ్యవస్థలో బతుకుతున్న సగటు ఆడ మనిషి. అది సరే గానీ, అసలు నేను నీకు గుర్తున్నానా? ఎన్ని ఉత్తరాలు వేసినా జవాబివ్వవు." అంది చిరు కోపం నటిస్తూ వనజ.

ఏం చెప్పగలదు వనజకి తన వ్యర్థ చరిత్ర!

తన్మయి నిట్టూర్పు విని, "ఏదో సరదాకి అన్నాను. నిన్ను ఆ మాత్రం అర్థం చేసుకోకపోతే స్నేహితురాలిని ఎలా అవుతాను? అదంతా సరే గానీ నీ సంగతులు చెప్పు. ఎలా ఉన్నావు? కొత్త ఉద్యోగం, కొత్త ఊరు, కొత్త జీవితం ఎలా ఉంది?" అంది ఆసక్తిగా.

"ఏ బాదర బందీలు లేకుండా జీవితం ప్రశాంతంగా గడుస్తూ ఉంది వనజా!"

"అంటే మన చిన్నప్పటిలాగా అన్నమాట" అంది వనజ.

"ఉహూ. ఎంత బాదర బందీలు లేకపోయినా చిన్నప్పటి స్వేచ్ఛ వేరు. ఇప్పటి జీవితం వేరు. బహుశా: చిన్నప్పటి రోజులు మళ్లీ రావేమో" సాలోచనగా అంది చిన్నగా నవ్వుతూ తన్మయి.

"ఏది ఏమైతేనేం. ఎక్కడా వెనకడుగు వేయకుండా నువ్వు జీవితంలో అనుకున్నవి సాధించావు. నువ్వు నా స్నేహితురాలివని గర్వంగా చెప్పుకుంటున్నాను తెలుసా!" అంది వనజ.

వనజతో మాట్లాడితే వెయ్యేనుగుల బలం వస్తుంది ఎప్పుడూ. మాట్లాడుతూ గదిలోని అద్దాల షోకేసులో గీతాంజలి పుస్తకాన్ని చేతిలోకి తీసుకుంది తన్మయి.

అది తను వనజకి ఇచ్చిందే. "అబ్బ. ఎంత జాగ్రత్తగా దాచావు వనా!" అంది తన్మయి.

నిజానికి తనూ అలాగే దాచింది. తమ పెళ్లిళ్లు కుదిరి అత్తవారిళ్లకు వెళ్లిపోయే ముందు ఇద్దరూ గీతాంజలిని ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకున్నారు. పుస్తకం పేజీలు తిప్పుతుండగా కనబడ్డ మొదటి కవితని అన్యాపదేశంగా పైకి చదివింది తన్మయి.

"ప్రభూ!

అనుదినం నీ సన్నిధిలో ముఖాముఖిగా ముకుళిత హస్తాలతో నీ సన్నిధిలో నిలుస్తాను

శాంత గంభీర నిర్మల నీలాకాశం క్రింద వినీలిత హృదయంతో నీ సన్నిధిలో నిల్చుంటాను ...."

ఇక చదవలేక తన్మయి గొంతు గద్గదమవడాన్ని గమనించి చప్పున దగ్గిరికి వచ్చింది వనజ. "నిజంగా అంతా బానే ఉందా?" అంటూ.

"హఠాత్తుగా ప్రభు ఎందుకు గుర్తొస్తున్నాడు? అతని పట్ల తను ఆకర్షితురాలవుతూందా?! అతన్ని తలుచుకుంటే దూరమవుతున్న బాధ తనకి ఎందుకు కలుగుతోంది?"

ఏవీ మాట్లాడలేక నిశ్శబ్దంగా తల అడ్డంగా ఊపింది తన్మయి.

"ఏమో వనా! ఒంటరి జీవితంలో ఎంత వెసులుబాటు ఉందో, అంత బెంగ కూడా ఉంది. లోకమంతా నిశ్శబ్దంగా నిద్రించే వేళ, వెచ్చని స్పర్శ లేని బాధ. శరీరంతో బాటూ మనసుని వేధించే ప్రేమ రాహిత్యపు బాధ. ఒంట్లో బాలేనప్పుడు దిక్కు తోచని బాధ...." కళ్ల వెంట బొట బొటా కారుతున్న నీళ్లని కొంగుతో అద్దుకుంటూ, "బాలెంతవి. నాతో బాటూ నిన్ను బాధ పెట్టడం నాకు సబబు కాదు. మళ్లీ వస్తా వనా" అంటూ లేచింది తన్మయి.

వనజ తన్మయి చెయ్యి పట్టుకుని ఆపి, "ఉండు. ముందు కాసిన్ని మంచి నీళ్లు తాగు. స్థిమితపడు" అంది.

పాపని తీసుకెళ్లి లోపల పడుకోబెట్టి, పెరట్లో బాదంచెట్టు కింద ఉన్న గట్టు మీద కూచుంటూ "ఇలారా, ఎవరతను?" అంది చిరునవ్వు నవ్వుతూ వనజ.

తన్మయి కళ్లలో నీటిపొరతోనే చప్పున నవ్వి చెప్పసాగింది.

అంతా విని వనజ ఉత్సాహంగా ముందుకు వంగి, "అతను నిన్ను నిజంగానే ఇష్టపడుతున్నాడని అనిపిస్తూంది. అతన్ని నువ్వు ఎందుకు దూరం పెట్టాలి?" అంది.

తన్మయి ఏం మాట్లాడక పోవడం చూసి "కలిసి జీవించడంలోను, ఒంటరిగా ఉండడంలోను వేటి సమస్యలు వాటికే ఉన్నాయి. కాదనను. నువ్వు ఎలా జీవించాలనుకుంటున్నదాని గురించి స్పష్టత తెచ్చుకో. నిన్ను ఏరి కోరి రావడానికి, నీ మీద జాలి చూపించడానికి తేడా ఉంది. ప్రభు నిజాయితీగా నిన్ను ఇష్టపడుతున్నాడని అనిపిస్తూంది. నీకు నచ్చినంత సమయం తీసుకుని నిదానంగా ఆలోచించుకో." అంది వనజ.

తిరిగి వస్తున్నంత సేపూ వనజ మాటలే వినిపించసాగేయి తన్మయికి. ఇంట్లో రాత్రుళ్లు ఒక్కతే పడుకోవడానికి కూడా తనెంత భయపడుతుందో తనకు తెలుసు.

తలుపు కి ఉన్న మాములు గొళ్లెం మధ్యలో అట్లకాడ అడ్డం పెట్టి, కుర్చీని తలుపుకి ఎదురుగా జరిపి, కుర్చీ మీద బరువైన బియ్యం డబ్బా పెట్టి......ఎంతగా భయపడుతుందో ప్రతీ రాత్రీ. ఒంటరిగా జీవించలేని తనకి తప్పనిసరైన ఒంటరి జీవితంలో ఉలికి పాట్లతో ఎన్ని నిద్ర పట్టని రాత్రుళ్లు కుమిలి కుమిలి ఏడుస్తూ ఉంటుందో తనకే తెలుసు. అలాగని కొరివితో తల గోక్కోవడమూ ఇష్టం లేదు. ఇంటికి వచ్చే దారిలో ప్రభుకి రాసిన ఉత్తరం పోస్టు డబ్బాలో వేసేసేక మనసు కాస్త స్థిమితపడింది.

------------

దసరా సెలవులు ఇంకా రెండు రోజుల్లో అవుతాయనగా విశాఖపట్నానికి బయలుదేరింది తన్మయి. మేరీ ఎప్పటి నుంచో తన దగ్గిర ఉండమని పోరుతూ ఉంది. ఇన్నాళ్ళకి తనకి కుదిరింది. పైగా ప్రీ పీ .హెచ్ డీ పరీక్ష కోసం కాస్త స్థిమితంగా చదవాలి. సెలవులు లేనందున ఇక్కడి నుంచే సరాసరి హైదరాబాదుకి వెళ్లాల్సి ఉండడంతో బాబుని తీసుకుని వచ్చింది తన్మయి. రైల్వే స్టేషనులో దిగగానే తన కోసం స్టేషనుకి ఎవరూ రాని ఒంటరితనం చుట్టుముట్టింది. తన కలల నగరమే తనని కల్లోలం చేసింది అదేం విచిత్రమో!

సామాన్లతో నాలుగడుగులు వెయ్యగానే మేరీ ఎదురొచ్చింది. "బస్సు లేటయి పోయింది. ఎలా ఉన్నావు తన్మయీ!" అంటూ.

"అయ్యో. నా కోసం స్టేషనుకి రావాలా? నేనే వస్తానుగా" అంది తన్మయి సంతోషంగా.

"రైలు దిగగానే మన కోసం ఎవరూ రాకపోతే ఎంత దిగులుగా ఉంటుందో నాకు తెలుసు. పైగా నిన్ను చూసి ఎన్ని రోజులో అయిపోయింది. రాకుండా ఎలా ఉంటాను చెప్పు?" అంది మేరీ బాబుని ఎత్తుకోవడానికి చెయ్యి చాస్తూ.

బాబు అడ్డంగా తలూపేడు.

"అమ్మో, వీడు పెద్దాడయిపోయేడు" అంది మేరీ వాడి బుగ్గలు పుణుకుతూ.

సముద్రతీరం వెంబడి ఆటో వెళ్తుంటే అత్యంత ఆహ్లాదంగా అనిపించసాగింది తన్మయికి. మేరీ ఏవేవో కబుర్లు చెప్తూనే ఉంది. తన్మయి మనస్సు శరీరం నించి వేరు పడి సాగరతీరం నుంచి కెరటాల్ని చుట్టుకుని, గాలి వాటున రెక్కలల్లార్చుకుని, అలల నురుగు మీద గిరికీలు కొట్టి స్వేచ్ఛగా విహరిస్తున్న విహంగమయ్యింది. రోడ్డు పక్కన అప్పు ఘర్ చూపించడానికి బాబు కుదిపేసరికి ఈ లోకంలోకి వచ్చి పడింది. ఆటో పక్కనే పరిచితమైన వ్యక్తి బండి మీద చిన్న పాపని, భార్యని ఎక్కించుకుని ముందుకు వెళ్తూ కనిపించేడు.

"కరుణ కదూ" అంది మేరీ.

తన్మయి నిర్లిప్తంగా, నిరాసక్తంగా "అయి ఉండొచ్చు" అంది.

"పోన్లే, సెటిలయ్యాడన్న మాట పాపం ఒక్క భార్యతో" అంది వెక్కిరిస్తూ మేరీ.

తన్మయి పొడిగించకుండా "మేరీ, రేపు కైలాసగిరికి వెళ్దామా?" అంది.

ఎం. వి. పీ కాలనీ మలుపు తిరిగింది ఆటో.

"అవునూ, స్టేషను నుంచి ఎం. వి. పీ కాలనీ రావడానికి మనం బీచి రోడ్డు లో నుంచి ఎందుకొచ్చేం?" అంది తన్మయి.

దిగి ఆటోకి డబ్బులిస్తున్న మేరీని వారించి, డబ్బులు పైకి తీసి , " రైలు దిగంగానే నాకు సముద్రాన్ని చూపించాలని అటు నుంచి తీసుకువెళ్ళమని చెప్పావు కదూ" అంది సంతోషంగా తన్మయి.

మేరీ లాంటి స్నేహితురాలు దొరకడం తన అదృష్టం. తన మనసులోని భావాల్ని చదివినట్లు పనులు చేసి తనని సంతోషపెడుతుంది.

అదే చెప్పింది మేరీతో.

"ఊ.. ఈ పొగడ్తల మాటకేం గానీ, బాబుని నేను చూసుకుంటా, హాయిగా చదువుకో" అంది మేరీ కాఫీ పెడుతూ.

"మేరీ లాగా తనని ప్రేమించే వ్యక్తి ప్రభు. అయినా అతన్నించి తను ఎందుకు దూరం కావాలనుకుంటూంది?"

అతని ఆలోచనలు మళ్లీ చుట్టుముట్టసాగేయి.

46

ప్రీ పీ హెచ్ డీ పరీక్షలు కాగానే యూనివర్శిటీ నించి అట్నుంచటే మాస్టారింటికి బయలుదేరి వెళ్లింది తన్మయి.

"ఏమ్మా, బాబు బావున్నాడా?" అంటూ ఆదరంగా పలకరించేరు మాస్టారి భార్య.

మరి కాస్సేపట్లోనే మేరీ బాబుని తీసుకుని వచ్చింది.

"అమ్మో, పొడుగయ్యేడు" అన్నారు మురిపెంగా వాడిని చూస్తూ మాస్టారు.

వాళ్ల ఆదరం చూస్తుంటే కళ్లు చెమర్చేయి తన్మయికి. "ఈ భార్యాభర్తలకి తనేమవుతుంది? ఏ జన్మలోనో తను పుణ్యం చేసుకున్నందు వల్ల మాత్రమే లభ్యమయ్యే అరుదైన ఆత్మీయతలివి" అనుకుంది.

నిజానికి తన్మయికి పాపపుణ్యాల మీద నమ్మకం లేదు.

అయినా ఎందుకో అలా అనిపించింది.

అన్నీ మానవ ప్రయత్నాల వల్లే జరుగుతాయన్నది నిజమో, అపోహో తెలీదు కానీ ఇది మాత్రం ఖచ్చితంగా తనకు లభించిన వరమే.

మరో గంట తర్వాత లేవబోతూ టీ. వీ లో వస్తున్న స్క్రోలింగు ని అప్రయత్నంగా చూసింది తన్మయి. అది అక్కడి లోకల్ ఛానెల్ అట. ఇటీవలే లోకల్ ఛానెళ్లు ప్రారంభమయ్యేయని ఆవిడ మాటల్లో అన్నారు.

రెండు మూత్రపిండాలు పాడయిన వ్యక్తి ఆపరేషనుకి నెగటివ్ బ్లడ్ గ్రూపు బ్లడ్ కావాలని ఆ ప్రకటన సారాంశం. తన్మయి కి తెలుసు అదెంత అరుదైన బ్లడ్ గ్రూపో. చప్పున లేచి అడ్రసు, ఫోను నంబరు రాసుకుంది. మేరీకి బాబునప్పగించి అందులోని అడ్రసుకి ఆటో ఎక్కింది. ఆసుపత్రిలో తను వచ్చిన పనేమిటో చెప్పగానే అప్పటివరకూ అక్కడే తిరుగుతున్న ఒకామె ఆత్రంగా దగ్గరకు వచ్చింది.

కట్టు బొట్టు తీరును బట్టి బెంగాలీ అని తెలుస్తూ ఉంది. తనని చూస్తూనే రెండు చేతులూ జోడించి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కారం చేసింది.

నర్సు బ్లడ్ తీసుకోవడం అయిపోగానే ఇచ్చిన జ్యూసు ని అందుకుంటూ "నేను ఎవరికీ బ్లడ్ ఇస్తున్నానో ఆ పేషంట్ ని చూడొచ్చా?" అనడిగింది తన్మయి.

తను బయటికి రాగానే అప్పటివరకూ బయటే కూచున్న ఆమె తమని అనుసరించింది. ICU లో ఉన్న పేషంట్ కి బహుశా: నలభైయ్యేళ్ళు ఉంటాయి. రెండు మూత్రపిండాలు పాడయ్యిన అతనికి ఆ రోజు రాత్రి ట్రాన్స్ ప్లాన్ టేషన్ జరగబోతోంది. మరి కొన్ని గంటల్లో జరగబోతున్న ఆపరేషన్ కి చివరి నిమిషం వరకూ బ్లడ్ సమకూరలేదట వాళ్లకి. తన్మయి దేవతలా వచ్చి కాపాడిందని అతి కష్టమ్మీద శ్వాస తీసుకుంటూ అతను ఇంగ్లీషులో మెల్లిగా ఒక్కొక్క పదమే చెప్తూ నమస్కరించాడు.

అతని భార్యకి బెంగాలీ తప్ప ఇతర భాషలు తెలియనందున ఆమె కళ్లతోనే సంభాషిస్తూ నమస్కరించింది. ICU లో ఉన్న వ్యక్తిని మొదటి సారి చూడడమేమో తెలీని బాధ చుట్టుముట్టింది తన్మయికి. పాపం ఆ భార్య అతని కోసం ఎంతో బాధ పడ్తుంది. తన్మయి వస్తున్నపుడు తన అడ్రసు అడిగి తీసుకున్నారు వాళ్లు. అక్కడి నుంచి వస్తున్నపుడు తన్మయికి వాళ్ల బాధతో పోలిస్తే తన బాధ అతి చిన్నదనిపించింది.

జీవితంలో అన్నిటికంటే అత్యంత పెద్ద సమస్య ఆ జీవితమే కోల్పోవడం. మరణం తో పోరాడుతూ బతకాలన్న తపన పడ్తున్న ఆ భర్త, భర్తకేమవుతుందో అనే ఆదుర్దాతో అనుక్షణం నరకాన్ని అనుభవిస్తున్న ఆ భార్య ఎన్నో రోజులు కళ్ల ముందే కదలాడసాగేరు.

జీవితంలో ఓర్పుతో, సంయమనంతో ఏ సమస్యనైనా చక్కదిద్దుకోవచ్చు అని మేరీ ఎప్పుడూ చెపుతుంది. కానీ జీవితమే ఒక సమస్య అయితే! మరణం అంచున పోరాడడమే జీవితమైతే!!

★★★

రైల్వేస్టేషనుకి చేరుకునేసరికే హైదరాబాదు వెళ్లే రైలు ప్లాట్ ఫారమ్మీద సిద్ధంగా ఉందని ప్రకటన వినబడుతూ ఉంది. తన్మయి వద్దన్నా వినకుండా మేరీ బాబుతో, సామాన్లతో ఎలా వెళ్తావంటూ దిగబెట్టడానికి వచ్చింది.

ఇల్లు ఊడ్చుకోవడానికి మంచి కొండ చీపుర్లు రెండు కొంది తన్మయి. విశాఖపట్నంలో తప్ప ఇటువంటి గుబురు కట్టలు తనున్న చోట ఎక్కడా దొరకడం లేదు. తమ చిన్నపుడు కేవలం పూతికల చీపుర్లు మాత్రమే చవకగా దొరికేవి. పూతికల చీపురుతో ఇల్లు ఊడ్చిన మొదటి రోజు ఇంటి నిండా పూతికలు ఎగురుతూ బట్టలకు అక్కడక్కడా అతుక్కుపోయి గుచ్చుకుని చంపేవి. కొండ చీపుర్లు ఇప్పటికీ ఖరీదు ఎక్కువే.

"అందుకే గామోసు హైదరాబాదు వైపు ఒక్కొక్క కట్టని మూడేసి కట్టలు చేసి మధ్య ఖాళీ పుల్లలు పెట్టి అమ్ముతారు. అవి రెండ్రోజుల్లో ఊడి వస్తాయి." అంది తన్మయి మేరీతో అవి కొనేటపుడు.

దానితో బాటూ మేరీ రెండు దిండ్లు కొనిచ్చింది. వాటికి తనే కవర్లు కుట్టి, అందంగా ఎంబ్రాయిడరీ కూడా చేసింది.

“ఎందుకివన్నీ ఇప్పుడు” అంటే, "అదేవిటి తన్మయీ అలా అంటావు? నాకున్న ఏకైక ప్రియ మిత్రురాలివి నువ్వు. నాకు యూనివర్సిటీలో ఉద్యోగం వచ్చిన సందర్భంగా నీ కోసం నేను ఆ మాత్రం చెయ్యకూడదా?" అంది.

ఒకప్పుడు తామిద్దరూ హాస్టలులో కలిసి ఉన్న సమయంలో తను ఏ ఉద్యోగానికి అప్లై చేసినా రాలేదని మేరీ ఎంతో బాధ పడుతూ ఉండేది. తనకి బాగా గుర్తు, చివరికి తనకి ఎలిమెంటరీ స్థాయి ఉద్యోగం కూడా రాలేదని ఒక రాత్రంతా దుఃఖ పడింది కూడా. ఓర్పుగా ఎదురు చూసినందుకు అన్నిటికంటే అత్యుత్తమమైన ఉద్యోగం వచ్చింది తనకి. అదే చెప్పి మేరీని కౌగలించుకుంది తన్మయి.

"కాలం అన్ని సమయాల్లోనూ ఒకేలా ఉండదనడానికి నీ జీవితమే ఉదాహరణ. సమస్యలు వచ్చినపుడు 'ఆ రోజుతో జీవితం ఆఖరయిపోతుందని, ఇక భవిష్యత్తు లేదేమో' అని జీవితాన్ని అంతం చేసుకోవాలనుకునే వాళ్లు తెలుసుకోవలసిన గాథ. కాలం గాయాల్ని మాన్పడమే కాదు, సమస్యల్ని కూడా పరిష్కరిస్తుందని నిరూపించావు. కష్టాల్ని ఎదిరించి, చక్కగా నీ కాళ్ల మీద నువ్వు నిలబడ్డావు, నువ్వు ఎందరికో స్ఫూర్తిదాయకం, నీ స్నేహం వల్ల నాకూ నీ ఓర్పు అలవడింది" అంది నవ్వుతూ మేరీ.

మేరీతో ఎప్పుడు మాట్లాడినా వెయ్యేనుగుల బలం వస్తుంది. రైలు పెట్టెలోకి ఎక్కి కూచుని సామాన్లు సర్దుకుని కిటికీ దగ్గరే నిలబడ్డ మేరీని "ఫర్వాలేదులే మేరీ ఇక ఉండు" అంటూ

"ఆంటీకి "టాటా" చెప్పమ్మా బాబూ" అంది వెనక్కి చూస్తూ.

పక్కన బాబు లేదు.

అదిరిపడి ఒక్కసారి లేచింది "బాబూ" అంటూ. తమ పక్కన గానీ, ఎదురు బెర్తులో గానీ ఎవరూ లేకపోవడంతో

ఎవర్నడగాలో అర్థం కాలేదు తన్మయికి.

"అయ్యో అదేవిటి ఇప్పటి వరకూ ఉన్నాడుగా" అంటూ పక్కనే తలుపు ఉండడంతో మేరీ చటుక్కున రైలెక్కింది.

తన్మయి కంగారుగా రైలులో వరుసగా ఉన్న బెర్తుల మధ్య పరుగెత్తింది "బాబూ" అని పిలుస్తూ.

వరసలో నాలుగో బెర్తులో శేఖర్ ఒళ్లో కూచుని ఆడుకుంటున్న బాబు తల్లిని చూస్తూనే పరుగెత్తుకు వచ్చేడు. హఠాత్తుగా శేఖర్ ని అక్కడ చూసి ఆశ్చర్యపోయింది. వెంటనే కోపమూ తన్నుకు వచ్చింది.

"పిల్లాణ్ణి తీసుకెళ్లే ముందు చెప్పాలని తెలీదూ!"

అతన్ని ఏమీ అనలేక బాబు వీపు మీద ఛెళ్ళున ఒకటేసి, ఒక్క అరుపు అరిచింది "నాతో చెప్పకుండా ఎక్కడికి పోయావ్ రా వెధవా" అంటూ.

శేఖర్ కోపంగా తల పక్కకు తిప్పుకుంటూ, "వాడు నా కొడుకు, నా దగ్గరకు రావడానికి నిన్నడగాల్సిన పని లేదు" అన్నాడు.

పక్క సీట్లలో వాళ్లు చోద్యం చూస్తుండడంతో తన్మయి మాట్లాడకుండా బాబుని లాక్కుని సీట్లోకొచ్చి కూలబడింది. వెనకే వచ్చిన మేరీ పక్కనే కూచుని "బాధ పడకు. అతన్ని స్టేషను బయట చూసేను. మన వెనకే ఆటో దిగేడు. అతనెవరో ఇప్పుడు తెలిసింది. మనం మాట్లాడుకుంటుండగా పక్క బెర్తు దగ్గర నుంచి బాబుని పిల్చి ఉంటాడు. వీడు బానే గుర్తుపట్టేడు అదే ఆశ్చర్యం! " అంది.

ఏడుస్తున్న బాబుని ఒళ్లో పొదువుకున్న తన్మయి కళ్లల్లోంచి అప్రయత్నంగా కన్నీళ్లు ఉబికి వచ్చేయి.

"అయ్యో! భద్రంగా పెంచుకుంటున్న పిల్లాణ్ణి కొట్టేనే" అని మనసంతా బాధ అలుముకుంది.

"అతనూ ఇదే రైలుకి వెళ్తూ కాకతాళీయంగా మనల్ని చూసేడా లేక కావాలని వచ్చేడా" అంది సందేహం వెలిబుస్తూ మేరీ.

తెలీదన్నట్లు పెదవి విరిచింది తన్మయి. కారణం ఏదయినా అతనూ ఇదే రైలులో ప్రయాణం చేస్తున్నాడనేది ఎందుకో భరించలేకపోతూంది. "ఎందుకు?"

దుఃఖం, కోపం, కసి, చేతకానితనం కలగాపులగంగా ఒకదానిమీదొకటి తన్మయి మనసు మీద దాడి చేస్తూ కలవరాన్ని పెంచుతున్నాయి. తన్మయికి దిక్కులు పిక్కటిల్లేలా గట్టిగా అరవాలనుంది. అతని రెండు చెంపలూ వాయించాలనుంది. తనని అతని జీవితంలోంచి సునాయాసంగా బయటికి తోసేసి, నిర్దాక్షిణ్యంగా రోడ్డు పాలు చేసిన అతన్ని రైలు లోంచి వెళ్లగొట్టాలనుంది. ఏమీ చేయలేని నిస్సహాయత వల్ల దుః ఖం చుట్టుముట్టింది.

రైలు బయలుదేరబోతున్నట్లు విజిల్ వింటూనే "ఏమీ కాదులే. బాధ పడకు, ఊరుకో. అనుకోకుండా ఇదే రైలు లో ప్రయాణిస్తూ మిమ్మల్ని చూసి ఉంటాడు. ముందు నువ్వు ధైర్యంగా ఉండు. బాబు జాగ్రత్త" అంటూ మేరీ రైలు దిగింది.

రైలు బయలుదేరిన పది నిమిషాల్లో శేఖర్ వచ్చి పెట్టెకి ఆ మూల కిటికీ దగ్గిర కూచుని బాబుని మళ్లీ పిలిచేడు.

దెబ్బకి భయపడిన బాబు తల్లి వైపు చూసేడు. తన్మయి కిటికీ లోంచి బయటికి చూస్తూ కళ్లు మూసుకుంది.

"పర్లేదు రారా నాన్నా. అది నిన్నూ, నన్నూ ఎలా వేరు చేస్తదో చూస్తాను." అన్నాడు కఠినంగా.

"ఇన్నాళ్లూ ప్రేమంతా ఎటు పోయిందో. కొడుకు మీద అసలంత ప్రేమ ఉన్నవాడు ఎందుకు వదిలెల్లిపోయాడో."

తన్మయి కోపాన్ని అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ గుప్పెట గట్టిగా బిగించింది.

కోర్టు తనకే బాబు సంరక్షణని ఇచ్చినా, ఎప్పుడైనా వచ్చి చూసే హక్కు అతనికి ఇచ్చింది. ఇప్పుడిక దాన్ని అడ్డుపెట్టుకుని తనని సాధిస్తాడన్నమాట. తన ఎదురుగా కూచున్న అతన్ని చూస్తూ భరించడం కన్నా పిల్లాణ్ణి అతని దగ్గరకే పంపడం మంచిదని అనిపించి ఇంకా తన వైపే దిగులుగా చూస్తున్న బాబుని వెళ్ళమన్నట్లు చూసింది.

"కొత్త వింత" అన్నట్లు బాబు హుషారుగా అతని వేలు పుచ్చుకుని వెళ్లేడు.

నిస్త్రాణగా బెర్తు మీద వాలి పోయింది తన్మయి. "మిత్రమా! నన్ను రక్షించు" అని మనసులో అనుకుంటూ.

"ఒకప్పుడు అతనితో జీవితాన్ని పంచుకోవడం కోసం ఎంతగానో ఎదురు చూసింది. తల్లికి ఇష్టం లేకపోయినా అతని వేలందుకుని నడవడం కోసం ఎంతో తపించింది.

ఆ రోజుల్లో అతన్ని తల్చుకోగానే తన ముఖమ్మీద ప్రేమైక చిరునవ్వు మెరిసేది. అతన్ని చూడగానే తెలీని సిగ్గు ముంచెత్తేది.

రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకున్నప్పుడల్లా "ఎందుకంత సిగ్గు" అని అతను అడిగేవాడు.

అతన్ని ఎంతో గొప్ప వ్యక్తిత్వం ఉన్నవాడిగానూ, గొప్ప మనసున్న వాడి గానూ, తమ ప్రేమ ఎంతో అపురూపమైంది గానూ ఊహించుకుంది. అవన్నీ కాలరాసి, అతని ఇష్టం వచ్చినట్లు బాధ్యతా రాహిత్యంగా నడచుకుని, పైగా తనేదో అన్యాయం చేసినట్లు చివరకు చిత్రీకరించి, తనని ముప్పుతిప్పలు పెట్టి, నానా కష్టాల, అవమానాల పాలు చేసి మరీ వెళ్లిపోయేడు. విడాకుల కాగితాలు తీసుకుని అతను నిర్లక్ష్యంగా ముఖం తిప్పుకుని బండి స్టార్టు చేసుకెళ్ళిన దృశ్యం ఇప్పటికీ మర్చిపోలేకపోతూంది.

అతనికి తనేం అన్యాయం చేసిందని తన జీవితంతో ఆడుకున్నాడు? తన వెంటపడి ప్రేమ అని, పెళ్ళి అని ఎందుకు తిరిగాడు? తీరా పెళ్లయ్యాక అనుక్షణం నరకం చూపించి ఎందుకు కక్ష సాధించాడు?"

మరో గంటలో బాబు వచ్చి పక్కన నిలబడగానే కన్నీళ్లతోనే పక్కకు తిరిగింది. తల్లి దుఃఖం అర్థమైనట్లు చిన్నారి చేత్తో కళ్లు తుడవసాగేడు.

వాణ్ణి కౌగిలించుకుని 'నన్ను వదిలెళ్ళకురా, ఎప్పుడూ వెళ్లకురా నాన్నా " అని లోపల్లోపలే కుమిలి ఏడవసాగింది.

★★★

పొద్దున్న హైదరాబాదులో రైలు దిగే సరికి శేఖర్ లేడు. బహుశా: అతను వాళ్ల ఊర్లో దిగిపోయి ఉంటాడు.

"హమ్మయ్య" అని స్థిమితపడింది తన్మయి.

తమని దాటెళ్లి పోతూ "కూలీ" అని అరుస్తూ వెళ్తున్న ఎర్ర చొక్కా అతన్ని పిలిచింది.

బాబునొక చేత్తో పట్టుకుని, మరో చేత్తో పర్సు పట్టుకుని అతని వెనక ఆటో స్టాండు వైపు నడిచింది.

దగ్గర్లోని బస్టాండు వరకు ఆటో కట్టించుకున్నా, అక్కణ్ణించి ఇవన్నీ బస్సులో ఎక్కించడం కాస్త కష్టమే. ఆలోచనలతో నడుస్తూ గుమ్మం దగ్గిర టీ.సీ కి టిక్కెట్టు ఇచ్చి ఒక్కడుగు వేసేసరికి

"అయ్యో, రైలు తొందరగా వచ్చినట్లుంది. ప్రయాణం ఎలా జరిగింది" అంటూ ఎదురొచ్చాడు ప్రభు.

రాత్రంతా కలత నిద్దరతో, దుః ఖం తో కళ్లు వాచిపోయిన తన్మయి అతన్నించి తప్పించుకోవడానికన్నట్లు చప్పున కళ్లు దించుకుని వడిగా కూలి వెనక నడిచింది. వడిగా నడుస్తున్న తల్లి నొదిలి బాబు ప్రభు చెయ్యి పట్టుకున్నాడు.

ఆటో లో ఏమీ మాట్లాడని తన్మయి వైపు చూస్తూ "అంతా బానే ఉందా?" అన్నాడు.

ముభావంగా తలూపింది. తన మనసులో రేగిన అగ్నిజ్వాలని అతనికి ఎలా చెప్పగలదు? లోపల చెలరేగుతున్న వ్యథావేదనలతో ప్రభుతో మాట్లాడాలని అనిపించడం లేదు. అతని సమక్షం విసుగ్గా, చికాకుగా అనిపించసాగింది. తనని వెంటాడుతూ ఏవిటితను? కానీ ఎవరితోనూ ఏవీ మాట్లాడే ఓపిక, ఆసక్తి కూడా లేక అతన్నేం మాట్లాడొద్దన్నట్లు ఒక చూపు చూసింది. అయినా సామాన్లన్నీ బస్సులో సర్దిపెట్టి, కదులుతున్న బస్సు కిటికీ పక్కనే నిలబడి

"ఆదివారం వస్తున్నా" అన్నాడు గట్టిగా.

"వద్దు" అంది ఓపిక లేని స్వరంతో.

కానీ ఆ మాట బస్సు బయలుదేరుతున్నట్లు మోగించిన హారను ధ్వనిలో కలిసిపోయింది. బస్సు కదిలి వెళ్తున్నా కనుచూపు మేర వరకూ అతనక్కడే నిలబడ్డాడు.

తనకోసం అంత పొద్దున్నే లేచి రైలు స్టేషనుకి వచ్చేడు పాపం. కానీ ఇవన్నీ పట్టించుకునేలా లేదు తన మనసు. కనీసం తను అతను సహాయం చేస్తున్నందుకైనా సరిగా మాట్లాడలేదు. శేఖర్ మీద కోపంతో ప్రభుని దూరం పెట్టడం న్యాయమో కాదో తెలీదు.

హృదయం అర్థం లేని దుఃఖం తో మూలుగుతోంది. ఎవరితోనూ పంచుకోలేని వ్యథ! అతని జీవితం పాడు చేసుకోవద్దని ఉత్తరం వేసినా మళ్లీ ఎందుకు స్టేషనుకి వచ్చేడు? ఇప్పుడిప్పుడే కుదుట పడ్తున్న తన జీవితం లోకి అతను వద్దన్నా ఎందుకు వస్తున్నాడు? అతన్ని ఎలా దూరం పెట్టాలో పాలుపోవడం లేదు.

శేఖర్ మళ్లీ కనబడేసరికి గతమంతా రీలులా..కాదు కాదు, మనసుని చీరేస్తూ తిరుగుతున్న ముళ్ల చక్రంలా కదలాడింది.

'అమ్మా! నాన్న నెల రోజుల్లో స్కూలుకి వస్తానని చెప్పేడు" అన్నాడు బాబు అంతలో.

తన్మయి నిస్త్రాణగా సీటుకి జేరబడింది. ఇదొక కొత్త సమస్య ఇక మీదట. ఇప్పటిదాకా మొత్తానికి వదిలేసిన వాడు మళ్లీ ఎందుకు బాబు జీవితంలోకి అడుగుపెడ్తున్నాడు? తనకీ కొత్త పరీక్ష ఏవిటి? ఒక సమస్య పరిష్కరించుకుంటే మరొకటి వెంటాడుతూ ఉంది. ఇంతేనా జీవితం!

నిరాసక్తంగా కిటికీ లోంచి ఆకాశం వైపు చూడసాగింది. నీలాకాశంలో స్వచ్ఛమైన తెల్లని మేఘాలు పరుగులు పెడ్తున్నాయి. ఈ అనంత కోటి తారల విశ్వంలో చిన్న ఇసుక రేణువంత భూమ్మీద మనిషి ఉనికి ఎంత? జీవితమెంత? ఇన్ని కోట్ల మనుషులలో తన బాధ ఎంత? ఎందుకు ఇంతగా బాధ పడ్తుంది తను?

మేరీ మాటలు మళ్లీ జ్ఞాపకం వచ్చాయి. "ఓర్పుతో, సంయమనంతో ఏ సమస్యనైనా చక్కదిద్దుకోవచ్చు".

కళ్లు తుడుచుకుంది.

బాబుని దగ్గరకు తీసుకుని "ఆకాశంలో మబ్బులాట ఆడదామా?" అంది మెల్లిగా.

తల్లి ముఖంలో ప్రశాంతత చూసి హుషారుగా తలూపేడు.

"దూరంగా.. అదిగో ఆ మబ్బు ఏ ఆకారంలో ఉంది?" అంది.

"నిన్న నాన్న వేసుకున్న బూటులా ఉంది" అన్నాడు బాబు నవ్వుతూ.

వెంటనే ఒక్క క్షణం మనసు చివుక్కుమంది.

“ఒక్కసారి అతన్ని చూడగానే వీడు అతని గురించే ఆలోచిస్తున్నాడు! అయినా చిన్న పిల్లాడు వీడికేం తెలుసనీ! చాక్లెట్టు ఎవరిస్తే వాళ్లని గుర్తుపెట్టుకుంటాడు" అని సమాధానపడి

"మరి ఆ పక్కనున్న మబ్బు ఎలా ఉంది?" అంది తన్మయి.

## 47

విశాఖపట్నం నించి తిరిగొచ్చిన మర్నాడంతా "ఆదివారం వస్తున్నాను" అన్న ప్రభు మాటలే చెవిన తిరుగుతూ ఉన్నాయి. అతనికి తన గురించి ఏం తెలుసని?

చిన్నప్పుడెప్పుడో తనతో కలిసి చదువుకున్నాడు. ఇన్నేళ్ల తర్వాత తను ఒంటరిగా జీవితాన్నీదడాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాడు. ఈ మధ్య అసలేం జరిగిందో, ఎందుకు తను ఒంటరిగా ఉండాల్సి వస్తూందో అతనెప్పుడూ అడిగి తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు. మరి అది అతని సంస్కారమో, ఆసక్తి రాహిత్యమో. కొంతైనా ఊహించి ఉంటాడనేది వాస్తవం, కానీ ఏం ఊహించుకుంటున్నాడనేది ఆలోచించడం ఇష్టం లేదు. ప్రభు రాగానే ఖరాఖండీగా అదే అడిగేసింది తన్మయి.

"ఏం తెలియాలి?" అని తిరుగు ప్రశ్న వేసాడు.

"నా గతం గురించి..." అంటూ చెప్పబోతున్న తన్మయిని మధ్యలోనే ఆపుతూ "నాకు తెలుసుకోవాల్సిన అవసరం లేదు" అన్నాడు.

"అంటే తెలుసుకోవాలన్న ఆసక్తి లేదా, ఇష్టం లేదా?" అంది రెట్టిస్తూ.

"అవసరం లేదు" అంటున్నాను అన్నాడు స్థిరంగా ఒత్తి పలుకుతూ.

అయినా నాకు చెప్పాల్సిన అవసరం ఉంది.

"నేను ఎన్ని బాధలు పడ్డానో తెలిస్తే నువ్వు నా వెంట ఇలా పడవు. ఇప్పుడిప్పుడే నా హృదయం కాస్త కాస్త గా కోలుకుంటూంది. నేను దేనికీ సిద్ధంగా లేను." అంది తన్మయి.

మాటల్లో అతన్ని ఏకవచన ప్రయోగం చేసిందన్న విషయం చప్పున గుర్తు వచ్చి "మీరు..." అంది సర్దుకుంటూ.

"వద్దు. నువ్వు అనే అను తనూ" అన్నాడు గద్గదికంగా.

చప్పున అతని వైపు ఆరాధనగా చూసి వెంటనే కళ్లు దించుకుంది.

తనకి ఆ పిలుపు ఎంతిష్టమో అతనికి అర్థమయినట్లు "తనూ, నీకు చెప్పాలనిపిస్తే చెప్పు. అలాగైనా నీ బాధ తగ్గుతుందేమో" అన్నాడు ఎదురుగా గోడకి జేరబడి కూచుంటూ.

తన్మయి జీవితంలోని ఒక్కొక్క అధ్యయమూ మెల్లిగా చెప్తూ ఉండగా తన కళ్లలోకే చూస్తూ వినసాగేడు.

"...అలా చివరికి నా జీవితం ఈ ఊరికి చేరింది" అని తన్మయి ముగించగానే

"శభాష్ తనూ! నీ గాథ వింటున్నంతసేపూ నాకు నచ్చినదేవిటంటే ఒక్క కన్నీటి బొట్టు కూడా రాలకుండా నువ్వు ధైర్యంగా చెప్పిన విధానం. అంతటి దారుణ జీవితాన్ని అవలీలగా దాటి రాగలిగిన నీ స్థైర్యానికి జోహార్లు. ఐ అడ్మయిర్ యూ. అని ఒక్క క్షణం ఆగి ఊపిరి తీసుకుని, "మనం పెళ్లి చేసుకుందాం" అన్నాడు స్థిరంగా.

తన్మయి అదిరిపడింది.

"పెళ్లి" అనే మాటే తనకు చేదు జ్ఞాపకం. ఒక్కసారిగా దు:ఖం చుట్టుముట్టింది.

"అయ్యో, నేనూ నీకు దు:ఖం తెప్పిస్తున్నానా?" అన్నాడు ఆదుర్దాగా దగ్గరకు జరిగి.

"వద్దు ప్రభూ, నా నించి దూరంగా వెళ్లిపో" అంది కళ్లనీళ్లతో అతన్నించి దూరంగా జరుగుతూ.

"ఎందుకు వెళ్లాలి?" అన్నాడు మొండిగా.

తన దగ్గిర సరైన సమాధానం లేదని తన్మయికీ తెలుసు.

"ఎందుకంటే నా మనసు ఇంకా కోలుకోలేదు. ఎప్పటికి కోలుకుంటుందో తెలీదు. పైగా నాతో జీవనం వల్ల నీ జీవితమూ ములగడం నాకిష్టం లేదు. నువ్వు నా గాథ విన్న ఆవేశంలో నా మీద జాలితో పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నావు. పైగా మనిద్దరి కుటుంబాలూ హర్షించవు, ఒప్పుకోవు. ఇవన్నీ నాకు సుతరామూ ఇష్టం లేవు. నిరంతరం పోరాడి అలిసిపోయాను. ఇక నా వల్ల కాదు. దయచేసి నన్ను వొదిలి ఇప్పుడే వెళ్లిపో" అంది రెండు చేతులూ ఎత్తి నమస్కరిస్తూ.

"నేనేదో ఆవేశంలో నిన్ను పెళ్లి చేసుకుంటానన్నానని  అనుకుంటున్నావు కదూ! ఇదంతా ఆవేశం కాదు, నిజమని నన్నెలా నిరూపించమంటావు?" అన్నాడు మరింత స్థిరంగా.

"అయినా నా గురించి మాత్రమే నువ్వు ఆలోచిస్తున్నావు, బాబు మాటేవిటి?" అంది తీక్షణంగా.

"వాడు నీ శరీరంలో భాగం, వాడూ నీతో సమానం నాకు" అన్నాడు అంతే  తీక్షణంగా.

"ఊహూ. నువ్వు నా మీద జాలితోనూ, సానుభూతితోనూ తాత్కాలిక ఆవేశం లో నిర్ణయం తీసుకుంటున్నావు" అంది మళ్లీ.

"అలాగా, బహుశా: నేను ఇప్పుడు చెప్పడం వల్ల నీకు ఆ అభిప్రాయం కలుగుతున్నట్లుంది. చెప్పు నన్నేం చెయ్యమంటావో" అన్నాడు.

ఒక్క నిమిషం ఆగి "తాత్కలికంగా అతన్ని అక్కణ్ణించి పంపివేయాలన్నదే లక్ష్యంగా

"ఒక ఏడాది తర్వాత కూడా నీకు ఇదే అభిప్రాయం కలిగితే అప్పుడు చూద్దాం" అంది నెమ్మదిగా.

చాలా సేపు నిశ్శబ్దం ఆవరించింది వారిద్దరి మధ్య.

"సరే వెళ్తొస్తాను. నీకోసమే ఇప్పుడు వెళ్తున్నాను. నిన్ను దక్కించుకోవడం కోసమే" అన్నాడు లేస్తూ.

వెళ్లబోతూ గుమ్మం దగ్గిర ఆగిన ప్రభు మీంచి దృష్టి పై కప్పు వైపు మరల్చి, "మరొక్క మాట, ఈ ఏడాదీ నన్ను చూడడానికి రావొద్దు" అంది.

అతను వెళ్లగానే మూసిన తలుపుల దాపున కూలబడి "ప్రభూ!" అంటూ వెక్కి వెక్కి రోదించసాగింది.

నిజానికి అతని పట్ల తనకూ అనుకోని ప్రేమ మొదలయ్యిందన్న సంగతి అప్పుడే తన్మయికి పూర్తిగా అర్థం కాసాగింది.

నిస్త్రాణగా నేల మీద ఒరిగి తనలో తను దు:ఖించ సాగింది.

మరో గంట తర్వాత బయట స్నేహితులతో ఆడుకుంటున్న బాబు లోపలికి పరుగెత్తుకొచ్చి "అమ్మా" అని కుదిపే వరకూ అలాగే ఉండిపోయింది.

★★★

సాయంత్రం మనసు మరీ దు:ఖ భారంతో మూలుగుతూ తల నొప్పి ప్రారంభం కావడంతో మాత్ర ఒకటి వేసుకుని త్వరగా నిద్రకుపక్రమించింది. నిద్ర రాని మనసు పొద్దుటి సంభాషణని మళ్లీ గుర్తు తేసాగింది తన్మయి మనసులో అనేక భయాలు కలగాపులగంగా ముంచెత్తుతూ. గడచిన జీవితం నించి ఏమి నేర్చుకుంది తను? ఇప్పటికీ ఎవర్ని నమ్మచ్చో, ఎవర్ని నమ్మకూడదో తెలీని పరిస్థితి.

అడుగు ముందుకు వెయ్యాలంటే భయాందోళనలు. మోసం తప్ప పరిపూర్ణమైన గొప్ప ప్రేమ ఉందా ఈ ప్రపంచంలో! ప్రభు మోసగాడు కాదని మనసుకి అనిపిస్తున్నా, "తన అంచనా తప్పయితేనో?" అన్న ప్రశ్న ముందుకు కదలనివ్వడం లేదు. అతనికి తను చెప్పిన కారణాలన్నీ నిజమైనవే. తన మనసు ఇంకా కోలుకోలేదు. శేఖర్ నించి విడిపోయి దాదాపు రెండేళ్లు కావస్తున్నా తన మనసింకా కోలుకోలేదు. ఏ ఒక్క విషయమూ మరిచిపోలేకపోతూంది. ఎవర్ని చూసినా ఏదో ఒక సందర్భంలో గత జీవితం కళ్ల ముందు కదలాడడం, బాధ తన్నుకు రావడం. శేఖర్ తో విసిగిపోయిన తనకి స్నేహితుడనుకున్న కరుణ దుర్మార్గంగా తనని రెండో భార్య గా చేసుకోవాలనుందని మగవాళ్లమీదే అసహ్యం పుట్టించేడు.

అప్పుడప్పుడే మానుతున్న గాయాన్ని మళ్లీ రేపినట్లు నిన్న గాక మొన్న శేఖర్ రైలులో ప్రత్యక్షమయ్యేడు. కఠినమైన అతని మాటలు, చూపులు తన బాధని తిరగతోడేయి. తనెందుకంత బద్ధ శత్రువయ్యిందతనికి? ఉద్దేశ్య పూర్వకంగా అతను చేసినవి కప్పిపెట్టుకోవడానికి తనని శత్రువుగా అందరి దృష్టిలోనూ చిత్రీకరించేడు. పసివాడెదురుగా రైలులో అతను ప్రవర్తించిన తీరు చూస్తే కంపరం పుట్టుకొచ్చింది. ఇక ప్రభు తనతో జీవితం పంచుకోవడం వల్ల అతనికి ఎటు వైపు నించి ఏం కష్టాలు వస్తాయో తెలీదు. అతనికిదే మొదటి పెళ్లి. తనకి రెండో సారి. ఈ విషయం అతన్ని భవిష్యత్తులో ఎప్పుడైనా బాధించొచ్చు.

అతను తన గాథ విన్న ఆవేశంలో, జాలితో మాట్లాడుతున్నాడు. తన పట్ల సానుభూతితో అతను తన్ని పెళ్లి చేసుకోవడం తనకి సుతరామూ ఇష్టం లేదు. ఆవేశం లో తీసుకున్న నిర్ణయాలు ఎంత కాలం నిలబడతాయో తెలీదు. తీరా చేసుకున్న కొద్ది నాళ్లలో అతనికి తను వొద్దనిపిస్తే? ఇక ఇరువైపులా తల్లిదండ్రులు, బంధువులు ఎవరూ ఈ నిర్ణయాన్ని ఒప్పుకోరు. అతనికీ, తనకీ ఇరువైపులా కుటుంబాలు, ఆర్థిక పరిస్థితులు, కులాలు, మతాలు ఎందులోనూ సారూప్యత లేదు. వీటన్నిటినీ మించి తను డైవోర్సీ, పిల్లాడి తల్లి. ఇన్నిటిని ఎదుర్కొని తామిద్దరూ ఎవర్నయినా ఒప్పించడం అన్నవి జరిగే పని కాదు.

తామిద్దరూ అనుకుంటే సరిపోదు. ఇరువైపులా ఉన్న వాళ్లంతా ఒప్పుకోవాలి. అది జరిగే పని కానప్పుడు ఇటువంటి ఆశలు పెంచుకోకపోవడమే మంచిది.

ఇక తనకి ఇలా ఒంటరి జీవితం రాసిపెట్టి ఉంది. ఎవరూ తన జీవితాన్ని సరిదిద్దలేరు. ఇంతే. రాత్రంతా కలత నిద్రలో, ఆలోచనలతో అటూ ఇటూ దొర్లుతూ అశాంతిగా గడిపింది తన్మయి.

★★★

తెల్లారి కాలేజీకి వెళ్లడానికి రెడీ అవుతుండగా "ఏం మేడం, అంతా మంచిగనే ఉన్నవా?" అని పలకరించింది తాయిబా గుమ్మం దగ్గిరికి వచ్చి.

అవునన్నట్లు తలూపింది తన్మయి.

"నిన్న రాత్రి ఏమో ఏడుస్తున్నట్లు శబ్దం ఇనొచ్చింది. ఎవరో, ఏమో అని మస్తు పరేషనయ్యిన. నువ్వయితే కాదు కదా!" అంది.

కాదన్నట్లు తలూపింది తన్మయి.

"ఎవరో, ఏమో పాపం" అని నిట్టూర్చి "సెలవల్ల బండి కోసరం మెకానిక్కు అచ్చి పొయ్యిండు మేడం, మీరు తీసుకుంటరా వేరోల్లకి అమ్ముకోవాల్నా? అనడిగిండు. నాకు తెల్వదని చెప్పిన" అంది.

"ఊ.. "అని నిట్టూర్చింది తన్మయి.

దారంట ఎవరు పిల్లల్ని బళ్ల మీద ఎక్కించుకుని వెళ్తున్నా ఆశగా చూస్తున్న బాబు ముఖం ఎప్పుడూ గమనిస్తూనే ఉంది.

"నాకు నాన్న లేకపోవడం వల్ల నేనెప్పుడూ బండి మీద వెళ్లలేకపోయేను" అని వాడు బాధ పడ్తున్నాడేమో అని కూడా అనిపిస్తూంది.

వాడికి ఏ లోటూ రాకుండా పెంచడమే తన లక్ష్యం. పైగా చీటీ పాడిన డబ్బులు రెడీగా ఉన్నాయి. ఇక ఆలోచన అనవసరం అని తోచింది తన్మయికి. కాలేజీకి వెళ్ళే త్రోవలో బ్యాంకుకి వెళ్లి డబ్బులు డ్రా చేసింది. మెకానిక్కు మధ్యాహ్నం బండి పట్టుకొచ్చి ఇచ్చేడు. ఆ సాయంత్రం ఇంటికి బండి వేసుకొచ్చింది. తన జీవితంలో తను కొనుక్కున్న మొదటి పెద్ద వస్తువు! ముట్టుకుంటే అనిర్వచనీయమైన ఆనందం కలగసాగింది. స్టాండు వేసి, బండికి దారంట అంటిన దుమ్ము తుడవసాగింది.

స్కూలు బస్సు ఆగగానే ఇంటికి పరుగెత్తుకొచ్చిన బాబు వాకిట్లో బండి చూసి ఆగిపోయేడు.

బండి "మనదేనా అమ్మా!? మనదేనా?" అని వెలిగిపోతున్న వాడి ముఖం చూస్తే తన్మయికి బాగా ముద్దొచ్చింది.

గబగబా ముఖం కడిగి బట్టలు మార్చి, "దా, అయిసుక్రీము కొనిబెడతా" అంది బండి స్టాండు తీస్తూ. హాండిల్ ముందు నిలబడి కుదుపులతో బాటూ ఎగురుతున్న బాబు సంతోషాన్ని చూసి మురిసిపోయింది తన్మయి.

★★★

మర్నాడు కాలేజీలో మధ్య విరామంలో మేథ్స్ లెక్చరరు "డిగ్రీ కాలేజీలో పరీక్షలకి ఇన్విజిలేషన్ కి పోతరా మేడం?" అనడిగేడు.

తన్మయి అదేవిటన్నట్టు చూసింది. "ఓపన్ యూనివర్శిటీ పరీక్షలు జరుగుతన్నయి. ఆదివారం ఇన్విజిలేషను కు ఎవరూ దొరకత లేదని ఆ కాలేజీ ప్రిన్సిపలు మన కాలేజీకి ఫోను చేసిండన్నట్లు. మీరు ఊర్లనే ఉంటరు కదా. కాలీగా ఉంటే పోవురి. పైసలు కూడా వస్తయి." అన్నాడు

తన్మయి "అలాగే సర్. నా పేరు రాసుకోండి, కానీ బాబు…." అంది సందేహంగా.

"మీ సారు గిట్ల పట్టుకోరా మేడం ఒక్క పూటకి" అన్నాడు.

ఇంతలో అక్కడే గుమ్మం దగ్గిర నిలబడ్డ తాయిబా, "బాబుని నేను సూసుకుంటలే మేడం తియ్యి" అంది.

తన ప్రశ్నకి సమాధానం తన్మయి నించి రానందుకు ఒకింత నిరాశపడ్డట్లు ముఖం పెట్టేడాయన. తన గురించి తెలిసి అడుగుతున్నాడో, తెలియక అడుగుతున్నాడో తెలియలేదు తన్మయికి. అతను మామూలుగానే అడిగినా తన గురించి అతను ఆరా తీస్తున్నట్లు భావన కలిగింది తన్మయికి.

"నేను ఒంటరిగానే ఉంటాను సర్. నేను డైవోర్సీని" అంది సీరియస్ గా.

"అయ్యో, సారీ మేడం తెల్వక అడిగినా. ఏమైంది?" అన్నాడు తెలుసుకోవడానికి కుతూహలంగా.

తన్మయికి చికాకు వేసుకొచ్చింది. చెప్పేందుకు అది చిన్న గాథ కాదు, గొప్ప గాథ కాదు. పైగా ఇలా అస్తమాటు తన గడచిన జీవితాన్ని తలుచుకుంటూ బతకడం దుర్భరంగా ఉంది.

"ఏదో లెండి, తర్వాతెప్పుడైనా చెప్తాను" అని అక్కణ్ణించి లేచింది.

ఈ ప్రపంచం ఎక్కడికెళ్లినా తనని ఒంటరిగా, ప్రశాంతంగా బతకనివ్వదు. కాలేజీ బయట వరండా లోకి వచ్చింది. ఊరి చివర ఉండడం వల్ల కాలేజీని ఆనుకుని పొద్దు తిరుగుడు తోటలు విరగబూసి ఉన్నాయి. ఆ పక్కనే మొక్క జొన్న చేలు. మరొక వైపు అక్కడక్కడా తుప్పల్లాంటి సీతాఫలాల చెట్లు. బయటికి రాగానే మనసులోని అలజడి కాస్త ఉపశమించింది. ప్రిన్సిపాలు గారితో చెప్పి కాలేజీ బయటికి వచ్చింది. కాలేజీ మలుపు దాటే వరకూ చూసుకోలేదు. తన వెనకే నలుగురు కాలేజీ పిల్లలు కూడా వస్తున్న సంగతి.

"ఏమిరా, క్లాసు లేదా?" అంది ఆగి వెనక్కి తిరిగి గంభీరంగా.

"లేదు మేడం, ఇయ్యేల మా ఎకనామిక్సు సారు రాలే" అన్నారు వాళ్లు ముక్త కంఠంతో.

"ఇటెక్కడికి మరి?" అంది.

"మీ కోసమే మేడం" అన్నారు మళ్లీ.

ఆశ్చర్యపోయింది తన్మయి.

"నాకు తోడుగానా? ఎందుకు?" అంది.

"ఏం లే మేడం, పొలాల పురుగూ పుట్రా ఉంటయి, అల్లరి పోరగాల్లు ఉంటరు. మేడం ఒక్కతె పోతూందని ఇగో ఈడంటే తోడు వొద్దమని అచ్చినం" అని అందులో ఒకబ్బాయిని చూపించేరు.

తన్మయికి సంతోషంతో కళ్ల నీళ్లు నిండేయి. తనొక్కతే వెళ్తుందని ఎస్కార్టు వచ్చేరన్నమాట. ఎంత ప్రేమ ఈ పిల్లలకి! వీళ్లతో తనెప్పుడూ దండించినట్లు మాట్లాడడమే గానీ ప్రేమగా మాట్లాడలేదు ఇప్పటి వరకూ.

"ఊ అయితే, అలా వెనక నడవక్కరలేదు. నాతో నడవండి" అంది నవ్వుతూ.

ఇక హుషారుగా కబుర్లు చెప్పడం మొదలు పెట్టేరు వాళ్లు. అందులో ఎవరికీ సరైన కాలి జోళ్లు కానీ, మంచి బట్టలు గానీ లేకపోవడం గమనించి మనసు బాధ వేసింది తన్మయికి.

వీళ్లని చూస్తూ ఉంటే తను ఇంటర్మీడియేట్ చదువుకున్న రోజులు జ్ఞాపకం వచ్చేయి. పదిహేను, పదహారు సంవత్సరాల లేత వయస్సులో ప్రపంచం ఎంత అందంగానో కనిపించేది.

కానీ అప్పట్లో తాము ఇలా లెక్చరర్లతో మాట్లాడడానికే భయపడే వాళ్లు. ఇంతలో త్రోవ పక్కన ఒక కర్ర ముక్క విరిచి తెచ్చి ఇచ్చేడు అందులో ఒక కుర్రాడు.

"గెప్పుడు తోటకి పొయ్యినా కర్ర పట్టుకో మేడం. పురుగూ పుట్రా గురించే కాదు, మంచిగా నడవొస్తది" అన్నాడు.

అంతా నవ్వేరు. తన్మయికి వాళ్లని చూసి భలే ముచ్చటేసింది.

తనకి తోడుగా రావాలన్న ఆలోచన కలిగినందుకే మనస్సులోనే అందరికీ కృతజ్ఞతలు చెప్పుకుంది.

"ఊ..చెప్పండి. పొద్దుట పూట కాలేజీకి ఎందుకు లేటుగా వస్తారు మీరు?" అంది ఊరికే వాళ్లని మాట్లాడాలించాలని.

"పొద్దుగాల నల్లలొస్తయి మేడం. ఇంటి కాడ తాగనీకి, తానాలకి నీల్లు మోసినాకే బయలెల్లి రావాలె" అన్నాడు ఒకబ్బాయి.

"మా ఊరికాణ్ణించి ఆరు మైళ్లు నడిసి రావాలె. దినామూ బస్సు కి పైసలేడికెల్లి ఒస్తాయి మేడం?" అన్నాడింతలో మరొకబ్బాయి.

"మేడం సదువు మీరు ఎంత సెప్పినా ఇంటి కాడ "పనికిబోరా పైసలొస్తయ్" అంటరు. స్కాలర్ షిప్పు వస్తదని మా నాయిన్ని ఒప్పించిన, ఇగో ఈడది విని నవ్వబట్టె" .....

"పొద్దుగాల బువ్వేడొస్తది మేడం, ఏదో టీ తాగి వచ్చుడు, పొద్దుమీకి ఒక్కపూటే ఇంత తినేది"...

పిల్లలు అవన్నీ అతి మామూలుగా చెప్పుకెళ్లిపోతుంటే వింటున్న తన్మయికి.చెప్పలేని బాధ తన్నుకు రాసాగింది.

ఇంత కటిక పేదరికంలో ఉన్న ఈ పిల్లలు చినిగిన బట్టలు, తెగిన చెప్పులు కాక ఏం వేసుకుని వస్తారు?

తిరిగి వెనక్కి వచ్చేక తిన్నగా ప్రిన్సిపాల్ యాదగిరి గారి దగ్గరకు వెళ్లింది.

"మీరు మధ్యాహ్న భోజన పథకం గురించి ఆలోచిద్దామన్నారు కదా! మొదలు పెడదాం సర్" అంది.

"గట్లనే మేడం. కానీ గీ పోరలు కాలేజీ ఇడిసిపెట్టిందాక ఉండి సదువుత మంటే గదా! అయినా స్టాఫ్ మీటింగు పెట్టి సూద్దాం " అన్నారాయన సాలోచనగా.

"భోజన పథకానికి ఊర్లో మోతుబర్లను, దబ్బులున్న దుకాణాదారులని సహాయం అడుగుదాం. పిల్లల్ని సాయంత్రం వరకూ కాలేజీలో ఉంచి చదివించాలంటే రెగ్యులర్ క్లాసులు అయిపోయేక స్టడీ అవర్స్ పెడదాం. ఇవన్నీ స్టాఫ్ అంతా సరేనంటే అమలు చేద్దాం. ఇక నా జీతంలో నుంచి 2% నెల నెలా బాగా చదివే పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్పుగా ఇద్దామనుకుంటున్నానండి" అంది గబగబా.

ఆవేశంగా చెప్తున్నా ఆ మాటల్లోని స్థిరత్వానికి అబ్బుర పడ్డారాయన.

"చివరగా మరొక్కమాట. ఆగష్టు పదిహేనుకి స్వీటు బదులు చెప్పుల్లేని పిల్లలందరికీ తలా ఒక జతా చెప్పులు కొనిపెడదాం సర్" అంది.

"ఇన్నినాళ్ల బట్టి నా సర్వీసుల నీ అసుంటి మణిసిని సూడలె మేడం. మంచిది, గట్లనె చేద్దాం" అన్నారాయన నవ్వుతూ.

48

ఆ రోజు ఉదయం కాలేజీకి ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న ఇంగ్లీషు పోస్టుకి కొత్త లెక్చరర్ వస్తున్నారని చెప్పేరు ప్రిన్సిపాల్ యాదగిరి గారు. ప్రొద్దుట మొదటి క్లాసు పూర్తి చేసుకుని స్టాఫ్ రూములోకి వచ్చిన తన్మయి తన కళ్లని తనే నమ్మలేకపోయింది. ఎదురుగా సిద్దార్థ! తనకీ ఉద్యోగం రాక ముందు ఇంటర్వ్యూకి టిప్స్ చెప్పిన ఇంగ్లీషు లెక్చరర్ సిద్దార్థ.

తన వైపే నవ్వుతూ చూస్తున్న అతని ఎదురుగా బల్లకటువైపు కూచుంటూ, "మీరేవిటి ఇక్కడ?" అని, "ఆగండి నేను చెప్తాను. కాలేజీకి కొత్తగా వచ్చిన ఇంగ్లీషు లెక్చరరు మీరే కదూ! " అంది సంతోషంగా.

అవునన్నట్టు తలూపి, "ఊ... మీకు ఉద్యోగం వస్తుందన్న సంగతి నాకప్పుడే తెలుసు. వెల్, నైస్ టూ మీట్ యూ అగైన్" అన్నాడు.

"విశాఖ పట్నం నించి ఇక్కడికి ఎలా?" అంది మళ్లీ.

"జోనల్ ట్రాన్స్ఫర్. మా మిసెస్ కి సెక్రటేరియట్లో ఉద్యోగం వచ్చింది" అన్నాడు.

"వెల్కం"అంది తన్మయి అతని చేతిలోని పుస్తకం వైపు చూస్తూ.

"అరుంధతీ రాయ్ "ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్". చదువుతారా?" అన్నాడు.

తన్మయికి ఇప్పటికీ అతన్ని చూసిన మొదటి రోజు గుర్తే. అప్పుడూ ఇలాగే చేతిలో ఉన్న పుస్తకంలో మునిగిపోయి ఉన్నాడు. ఇప్పటికీ అదే సాదాసీదాతనం. చేతిలో పుస్తకం, భుజాన వేళాడే సంచీ, కళ్లల్లో భావుకత్వం.

స్టాఫ్ రూములో చుట్టూ అందరి పరిచయాలు అయ్యేక, "రండి సిద్దార్థా! కాలేజీ చూపిస్తాను" అంటూ దారి తీసింది తన్మయి.

"సిద్దూ. సిద్దూ అంటే చాలు" అన్నాడు ఆమెని అనుసరిస్తూ.

కంప్యూటరు లాబ్ లోకి అడుగుపెట్టగానే "మేడం అచ్చిందే" అంటూ పిల్లలు చుట్టూ మూగేరు.

"ఈయన కొత్త ఇంగ్లీషు సారు, ఇక మీదట ఈ సారు కూడా మీకు కంప్యూటరు పాఠాలు చెప్తారు" అంది.

"తెలుగు చదువుకున్న మీకు కంప్యూటర్సు ఎలా పరిచయం?" అన్నాడు సిద్దార్థ బయటకు వస్తూనే.

"ప్రభు" అని నోటి చివరి వరకూ వచ్చినా తమాయించుకుని, "ఈ మధ్యే స్నేహితుల ద్వారా కొద్దిగా నేర్చుకున్నాను" అంది.

తన్మయి మాటలో తడబాటు చూసి, "నేనూ పెద్దగా ప్రావీణ్యుణ్ణి కాదులెండి. ఇంతకు ముందు నేను పనిచేసిన కాలేజీ కోసం కంప్యూటర్సు లో ఏదో చిన్న డిప్లొమా చేసేను" అన్నాడు పరధ్యానంగా బయటకు చూస్తూ.

సిద్దార్థ అలా పరధ్యానంగా మాట్లాడుతూంటే అతని ముఖ కవళికల్లో వివేకానందా పాఠశాల లోని మురళి కనిపించాడు తన్మయికి.

యాదృచ్ఛికమే అయినా తన్మయి సంతోషంతో తనలో తను ఉప్పొంగుతూ. "అజ్ఞాత మిత్రమా! మురళిని ఈ రూపంలో నా దగ్గరకు పంపేవా?" అని అనుకుంది.

ఆమె ముఖంలోని చిన్న దరహాసాన్ని గమనించనట్టే వరండా లోకి నడిచేడు సిద్దార్థ.

కాలేజీ ఆవరణలో నుంచి కనిపిస్తున్న పొద్దు తిరుగుడు తోట వైపు చూస్తూ,

*"Ah! sunflower, weary of time,*

*Who countest the steps of the sun,*

*Seeking after that sweet golden clime*

*Where the traveller's journey is done"* అన్నాడు.

"విలియం బ్లేక్ కదూ!" అంటూ తన్మయి ఒక పక్కగా ఎండిన పూల వైపు చూస్తూ

*"What came for them? Not death. Just the end of living"* అంది.

అవునన్నట్లు తలూపి, "గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్" కూడా చదివేసేరన్న మాట అన్నాడు నవ్వుతూ.

అతనితో మాట్లాడుతున్నంతసేపు ఏదో జన్మలో తను కోల్పోయిన స్నేహితుడు తిరిగి తనకి లభించినట్లయ్యి తన్మయికి జీవితంలోని కష్టాలన్నీ తీరిపోయినట్లు హాయిగా అనిపించసాగింది.

"ధన్యవాదాలు అజ్ఞాతమిత్రమా!" పైకే అంది వెనక్కు వస్తూ .

కాలేజీ వాచ్ మేన్ తో మాట్లాడుతూన్న సిద్దార్థ గొంతు వెనక నించి వినిపిస్తూంది. గంభీరమైన గొంతు కాకపోయినా, వినాలనిపించే గొంతు. ఇందాకా అతను విలియం బ్లేక్ కవిత చెప్తున్నంతసేపూ ఆతని ముఖం వైపే చూస్తూ ఉండి పోయింది. ఏమనుకున్నాడో ఏమో!

ఆ రోజంతా ఎన్నో ఏళ్ల తర్వాత తన జీవితంలోకి వసంతం వచ్చినట్లు అత్యంత ఆనందంగా అనిపించసాగింది తన్మయికి.

జీవితం ఎంత విచిత్రమైనదో కదా! ఇక ఎప్పుడూ కలవలరనుకున్న వాళ్లు మళ్లీ అనుకోకుండా ఇలా కలవడం గొప్ప విషయంగా తోచింది తన్మయికి. స్టాఫ్ లో అంతా చుట్టు పక్కల ఊళ్ల వాళ్లే. వాళ్లిద్దరూ ఒకే ప్రాంతం నించి వచ్చిన వాళ్లు కావడం వల్లనూ, ముందే పరిచయం ఉండడం వల్లనూ అతి త్వరగా మిత్రులయ్యేరు తన్మయి, సిద్దార్థ లు.

★★★

మరుసటి వారంలో డిగ్రీ కాలేజీలో ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలకు ఇన్విజిలేషను ప్రారంభం అయ్యింది. ఇప్పటికి తమ కాలేజీలో రెండు మూడు పరీక్షలకు ఇన్విజిలేషను చేసింది తన్మయి. తన తోటి ఇనివిజిలేటర్లు ఎప్పుడూ కాపీ రాయుళ్లని చూసీ చూడకుండా వదిలెయ్యడం గమనించింది తన్మయి. కానీ తన వరకూ తనకి అలా చూసీ చూడనట్లు ఊరుకోవడం ఒక విధంగా వాళ్లని ఎంకరేజ్ చెయ్యడమే అని అనిపిస్తుంది. ఒకట్రెండు సార్లు ఈ విషయమై తనకూ, తోటి లెక్చరర్లకూ వాగ్వివాదం కూడా జరిగింది.

ఇక ఈ రోజు పరీక్ష ప్రారంభమైన అరగంటలో చీటీలతో దొరికిన ఇద్దరు, ముగ్గుర్ని వెంటనే పేపరు లాక్కుని బయటకు పంపించేసింది తన్మయి. ఇద్దరు పేపరు నిశ్శబ్దంగా ఇచ్చి తల వంచుకుని వెళ్ళిపోయేరు. ఒకడు మాత్రం బయటికి వెళ్తూ వెనక్కి తిరిగి తన వైపు కొరకొరా చూడడం గమనించింది తన్మయి. పక్క గదిలో ఇన్విజిలేషను చేస్తున్న సిద్దార్థ మధ్యలో గుమ్మం దగ్గిరకి వచ్చి, తొంగి చూసి ప్రశంసాపూర్వకంగా నవ్వేడు.

"అలా ఒకరిద్దర్ని పంపిస్తే, మిగతా వాళ్లకి కాస్త బుద్ధొస్తుంది" అంది తన్మయి మెల్లిగా.

"పోరగండ్లు పేసవుడే కస్టం, పోనీలే మేడం తియ్" అన్నాడు తన్మయితో బాటూ ఇన్విజిలేషను చేస్తున్న మరొక లెక్చరర్ దగ్గిరికి వచ్చి.

తన్మయి అతనికేమీ సమాధానమివ్వకుండా ముందుకు కదిలి, "స్వంతంగా మీకు ఎంత వస్తే అంతా రాయండి, నాకు చీటీలు కనిపిస్తే మాత్రం పరీక్ష రాయనివ్వను" అని అందరికీ వినబడేటట్టు గట్టిగా చెప్పింది.

పిల్లల్లో అసహనం కనబడినా, తన్మయి తీక్షణంమైన చూపులకు తలలు వొంచుకుని రాయసాగేరు.

పరీక్ష కాగానే బండి స్టాండు వైపు నడిచింది తన్మయి.

అప్పటికే సిద్దార్థ తన బండిని స్టార్టు చేయబోతున్నాడు. అతన్ని దాటుకుని మరో మూడు బళ్లకవతల ఉన్న తన బండిని చూస్తూనే అవాక్కయిపోయింది తన్మయి.

బండి సీట్లు బ్లేడుతో కోసేసి ఉన్నాయి. హెడ్ లైట్లు పగల గొట్టేసి, బల్బులు బయటికి వేలాడదీసి ఉన్నాయి.

సిద్ధార్థ హెల్మెట్టు పెట్టుకోబోతూ "తన్మయీ, ఏమైంది?" అన్నాడు కొయ్యలా నిలబడిపోయిన తన్మయి దగ్గరకు వస్తూ.

తన్మయికి గొంతు పిడచకట్టుకుపోయింది. అతికష్టమ్మీద చీటీ పాడి కొనుక్కున్న బండి. ఎంతో ఇష్టంగా, ప్రేమగా చూసుకుంటున్న బండి. సెకండ్ హాండ్ బండైనా కొత్త బండిలా అపురూపంగా, జాగ్రత్తగా చూసుకుంటూ వస్తూంది. అదలా ఉంచితే, రిపేరు చేయించేందుకు ఎంత అవుతుందో కూడా తెలీదు. చేతిలో సరిపడా డబ్బుల్లేవు. అలా చిన్నాభిన్నంగా ఉన్న బండిని చూడగానే కాళ్లలో సత్తువ అంతా పోయినట్లయ్యింది. నిలబడలేక పక్కనే ఉన్న చెట్టు మొదలుకి ఆనుకుంది. బాధతోనూ, ఉక్రోషంతోనూ, అదిమి పట్టిన పెదవి మీంచి కళ్లలోకి కన్నీరు ఉబికి రాసాగింది.

సిద్ధార్థ చకచకా చుట్టూ నాలుగడుగులు వేసి పరిశీలనగా చూసేడు.

"మనం లోపల ఉన్నప్పుడు వర్షం పడింది కదూ. అందుకే ఇక్కడ అడుగుజాడలున్నాయి. వీటిని బట్టి ఎవరో ఇద్దరు బండి మీద వచ్చి మరీ పగలగొట్టేరు. బహుశా: ఏ క్రికెట్ బాట్తో తెచ్చినట్టున్నారు. సీట్లు కత్తిరించడానికి షార్ప్ గా ఉన్న బ్లేడ్ ని ఉపయోగించేరు. లోపల ఉన్న స్పాంజి తో సహా బయటికి వచ్చేసిందంటే ఎన్ని సార్లు కసిగా కోసేరో అర్థం అవుతూంది. భయపడకండి తన్మయీ. ఎవరు చేసేరో కనిపెడదాం. ఎందుకైనా మంచిది, ముందు లోపలికి వెళ్లి కాలేజీలో చెప్పి వద్దాం" అని ముందుకి చకచకా కదిలేడు.

తన్మయి స్థాణువులా అలాగే ఉంది.

ఒకటే ఆలోచిస్తూంది, "ఎవరు చేసి ఉంటారు? తనకి ఈ ఊళ్లో ఎవరు శత్రువులున్నారు? పొద్దున్న తను చీటీ లాక్కుని బయటికి పంపిన కుర్రాళ్లా? సిద్ధార్థ చెప్పినదాన్ని బట్టి బండి మీద వచ్చి పగలగొట్టే ధైర్యం ఆ కుర్రాళ్లకే ఉండి ఉండాలి"

ఆలోచన రావడమే తడవు. కళ్లు తుడుచుకుని వేగంగా కదిలింది ముందుకు.

"సిద్ధూ! పోలీస్ స్టేషనుకి వెళ్దాం" అంది స్థిరంగా.

అప్పటికే అక్కడికి వచ్చిన మరో ఇద్దరు లెక్చరర్లలో ఒకాయన "ఎందుకులే మేడం పోనియ్యి. ఆళ్ల పాపాన ఆళ్లే పోతరు." అన్నాడు.

మరొకాయన "నే చెప్పిన గదా మేడం, 'పిలగాళ్లని సూసీ సూడక ఊకో' అని. ఇన్నావు గావు, సూడు గిప్పుడేవైనదో" అని నిట్టూర్చేడు.

తన్మయికి వాళ్ల వరస మరింత చికాకు కలిగించసాగింది.

"అయితే ఇప్పుడేమంటారు? నేను స్ట్రిక్టుగా ఉన్నందువల్లే ఇదంతా జరిగింది కాబట్టి దీనికి నేనే కారణమనా?" అంది తన్మయి.

ఆమె గొంతులోని దుఃఖం తో కూడిన వేదనని గమనించి వాళ్లే "అరే ఊకో మేడం, మీకేమన్న అయితే మేమంతా ఉన్నది ఏమిటికి? మీరన్నది నిజమే. నదుంద్రి పోలీసు స్టేషనులో కంప్లైంటు ఇద్దాం. గిట్లనే ఊరుకుంటే రేపు అందరి బళ్లు ఇరగ గొడ్తరు" అని ముందుకి దారి తీసేరు.

డిగ్రీ కాలేజీ నుంచి తాయిబా కు ఫోను చేసి బాబుని చూడమని చెప్పింది తన్మయి.

తను ఇవేళ ఇంటికి వెళ్లే సరికి ఎంత సమయం అవుతుందో ఏమో! తాయిబా లేకుంటే ఇలాంటి సమయాల్లో తన పరిస్థితి ఏవిటి? ఊరు కాని ఊరులో తనని ఆదుకున్న ఆమె పట్ల కృతజ్ఞతతో నిండి పోయింది తన్మయి మనస్సు.

స్టేషను వరకూ సిద్ధార్థ బండి మీద తీసుకుని వెళ్లాడు.

"సిద్ధూ! మీ వెనకాల ఇటువంటి పరిస్థితుల్లో కూచోవలసి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు" బాధగా అంది.

"అలా ఎప్పుడూ అనుకోవద్దు. జీవితంలో అనుకోకుండా కొన్ని కష్టాలు ఎదురవుతాయి. అంత మాత్రాన కృంగిపోకూడదు" అన్నాడు సిద్ధార్థ అనునయంగా.

★★★

నలుగురు లెక్చరర్లు కలిసి వెళ్లడంతోనో, లేదా అంతా ఊర్లో తెలిసిన వాళ్లు కావడం వల్లనో ఎస్సై టీలు, బిస్కెట్లు తెప్పించి మర్యాద చేసేడు.

ఓపిగ్గా తన్మయి చెప్పినదంతా విని, "ఏం పర్లే మేడం, మీకు జరిగినది శానా దారునం. మీకు అనుమానం ఉన్న పేర్లు చెప్పండి, ఒక్కొక్కణ్ణీ గుంజుకొచ్చి, విషయం అరగంటలో తేలుస్తా. ఈడికి అచ్చి మంచి పని చేసిన్రు. గిసుంటివి ఊకుంటే, తర్వాత గీ పోరగాళ్లే రౌడీషీటర్లయితరు. గిప్పుడే బుద్ధి చెప్పాల" అన్నాడు.

ఇంతలో కూడా ఉన్న లెక్చరర్లు అందుకుని తన్మయి ఉదయం బయటకు పంపిన పిల్లల పేర్లు నాలుగూ ఇచ్చేరు. ఎస్సై అన్నట్లే అరగంటలో నలుగుర్నీ తీసుకొచ్చి స్టేషనులో నిలబెట్టేరు.

అందులో ఒకడు పోలీస్ స్టేషనుకి రాగానే భయపడి "సా, నన్నేం జెయ్యకురి. ఆంతా జెప్త. మా నాయినికి జెప్పకురి" అని కాళ్లావేళ్లా పడసాగేడు. ఇద్దరు కళ్ళు దించుకుని నిలబడ్డారు. ఒకడు నిర్లక్ష్యంగా చూడసాగేడు. తన్మయి వెంటనే గుర్తు పట్టింది. పొద్దున్న అదే చూపు.

ఎస్సై కనుసైగతో నలుగుర్నీ ఎదురుగా ఉన్న సెల్లోవేసి, పెద్ద దుడ్డు కర్రతో దబదబా నలుగురికీ నాలుగు తగిలించేడు కానిస్టేబుల్.

అప్పటిదాకా నిర్లక్ష్యం ప్రదర్శించిన వాడితో సహా నలుగురూ "బాబోయ్" అని అరుస్తూ ఏడవసాగేరు.

ఆ దృశ్యం చూడలేక తన్మయి కళ్లు గట్టిగా మూసుకుంది. మరో గంటలో ఆ పిల్లల తరఫున ఒక పెద్దమనిషి, అతని కూడా మరో నలుగురు అనుయాయులు వచ్చేరు. చూడ్డానికి గ్రామపెద్ద లా ఉన్నాడతను.

తమ దగ్గిరికి వచ్చి చాలా మర్యాదగా నమస్కరించి, "మేడం, ఈ పోరలంతా మా ఊరోల్లు. తెలిసో తేలికో తప్పు చేసిన్రు. మీ బండి కొత్త బండి లెక్క గిప్పుడే బాగు చేపిస్త. ఇంకో సారి గిట్ల కాకుండ హామీ ఇస్త. ఇంతడితొ వొదిలెయ్యి మేడం, కేసు గీసు పెట్టమాకు." అన్నాడు.

అంతా తన్మయి వైపు చూసేరు. అప్పటికే ఆ పిల్లలకు తగిలిన దెబ్బలకు తన్మయి మనసులో బాగా బాధ కలగసాగింది. తన బండిని వాళ్లు ఆవేశంలో పగలగొట్టి తప్పు చేసినా, అంత దుడ్డుకర్రతో కాళ్లు విరగ్గొట్టినట్లు వాళ్లని చితక్కొట్టడం చూడలేకపోయింది.

ఆ పెద్ద మనిషికి ప్రతి నమస్కరించి "చూడండి. మీ పిల్లల మీద నాకేమీ కక్ష లేదు. పరీక్షల్లో కాపీ కొట్టడం నీతి, నిజాయితీ అయిన పనికాదు. అది అర్థమయ్యేటట్లు చెప్పండి." అని

ఇన్స్పెక్టర్ వైపు తిరిగి "వాళ్లను వదిలెయ్యండి సర్ " అంది.

"మంచిది మేడం, బండి సాయంత్రం లోగా బాగు చేయించి ఇంటికి పంపిస్తా" అన్నాడు ఇన్స్పెక్టర్ తేలిగ్గా ఊపిరి తీసుకుంటూ.

బయటకు వచ్చేసరికి చీకటి పడే వేళవుతుంది.

మిగతా లెక్చరర్లు , "మేడం, జర జాగ్రత్తగ ఉండుండ్రి. పోరగాల్లు మల్ల ఏమైన సేసిన సేస్తరు" అన్నారు.

సిద్దార్థ సెలవు తీసుకుంటూ, "ఐ రియల్లీ ఏప్రిషియేట్ యువర్ కరేజ్ అండ్ గుడ్ హార్ట్ " అన్నాడు.

తన్మయి ఇంటికి వచ్చిపడిందే గానీ లెక్చరర్లు చెప్పి చివరి మాటలే చెవుల్లో తిరుగుతున్నాయి. "జర జాగ్రత్త. మల్ల ఏమైన...."

బాబు అప్పటికే నిద్ర పోతున్నాడు. అప్పుడు వచ్చేయి నిశ్శబ్దంగా కన్నీళ్లు. ఒంటరి జీవితపు భయంతోనూ, బాధతోనూ.

ఇలాంటివి ఇంకా ఎన్ని ఎదుర్కోవాలో, ఎలా ఎదుర్కోవాలో. తలుపుకి ఎన్ని అడ్డం పెట్టినా రాత్రంతా కలత నిద్రతో భయపడుతూ ఉంది. తను ఇలా జీవితాంతం ఒంటరిగా బతగ్గలదా? తనకి తోడెవరైనా ఉంటే బావుణ్ణని తీవ్రంగా అనిపించసాగింది. ఇది రెండోసారి తనకి ఇటువంటి భావన కలగడం. మొదటిసారి బాబుకి వొంట్లో బాలేక నిస్సహాయ స్థితి లో ఉన్నప్పుడనిపించింది.

చిత్రంగా ప్రభు మళ్లీ జ్ఞాపకం వచ్చేడు. అతన్ని దూరం పెట్టినప్పట్నుంచి ఎందుకో అతని మీద ప్రేమ కలగసాగింది.

శేఖర్ తనని ఇష్టపడ్డానని చెప్పినప్పుడు తను ఏమీ ఆలోచించలేదు. అంతటి అందగాడు తనని కోరుకుని రావడమే చాలన్నట్లు సంతోషపడి అతన్ని ఇష్టపడడం మొదలు పెట్టింది. కాదుకాదు, అతన్ని ఇష్టపడ్డానని అనుకుంది. అతన్ని ఉన్నతంగా ఊహించుకుంది. తను చిన్నప్పటినించి చూసిన చుట్టూ ఉన్న అందరి స్త్రీలలాగే భర్త ఏం చేసినా ఓపిక పట్టింది. బాబుకి తండ్రి కావాలనే బలహీనతతో అన్నీ సహించింది. కానీ అతను తన జీవితాన్ని సర్వ నాశనం చేసేడు. చేతిలో పిల్లాణ్ణి మిగిల్చి నిర్దయగా వెళ్లిపోయేడు.

ఇప్పుడు ప్రభు తనని ఇష్టపడుతున్నానని వచ్చేడు. తను నిర్దయగా పంపివేసింది.

అతన్ని దూరం పెట్టినప్పట్నుంచి తనకి ఇష్టం పెరగడానికి కారణం ఏవిటి? అసలు అతన్ని ఇష్టపడడానికి కారణం ఏవిటి?

అతను అంత అందమైన వాడేమీ కాదు, ఇక అతని ఉద్యోగం తనతో సమానమైనదే. అతని కుటుంబ పరిస్థితులు తన కంటే గొప్పవేమీ కాదు.

మరి?

"అతని మంచి మనసు". అవును, తనని అపురూపంగా చూసే విధానం, అతని కళ్లల్లో కనిపించే నిజాయితీ అయిన ప్రేమ. పైగా ఎటువంటి దురలవాట్లు లేవు. తన ప్రమేయం లేకుండా తనని కోరుకుని వచ్చిన వాడు. పెళ్లి చేసుకుని తనతో జీవించాలని ఇష్టం చూపిస్తున్నవాడు. సరిగా ఆలోచిస్తే, అతనికి తనని పెళ్లి చేసుకోవలసిన అవసరం లేదు. అయినా తనని వలచి రావడానికి తన దగ్గర ఏవుందని? అందమా అంతంత మాత్రం. ఒక సారి పెళ్లయ్యి, చేదు జీవితం బారిన పడి, కన్న బిడ్డ కోసమే కాలం వెళ్లబుచ్చుతున్న సన్యాసిని తను. ఒక్క గవర్నమెంట్ ఉద్యోగం తప్ప తన దగ్గర ఆకర్షింపదగినది ఏవుంది?

ఎప్పుడు నిద్రపట్టిందో తెలియలేదు తన్మయికి.

మర్నాడు లేవగానే కలగాపులగంగా ముందురోజు జరిగిన సంఘటనలన్నీ జ్ఞాపకం వచ్చేయి.

"జర జాగ్రత్తగ ఉండుండ్రి" అన్న లెక్చరర్ల మాటలు చెవిలో గింగుర్లు తిరిగేయి.

కాలేజీకి వెళ్లే త్రోవలో మార్కెట్టు లోకి వెళ్లి ఎందుకైనా మంచిదని ఒక చిన్న చాకు కొని పర్సులో వేసుకుంది.

★★★

ఆ రోజు కాలేజీలో క్లాసులో నుంచి వచ్చే సరికి ఉత్తరం తన టేబుల్ మీద పెట్టి ఉంది. అడ్రసు మీద చేతివ్రాత చూడగానే గుర్తు పట్టింది ప్రభు అని. ఆతృతతగా కవరు చింపింది తన్మయి. జలజలా రాలిపడ్డాయి గులాబీ రేకులు.

కాగితం మడత పైన కృష్ణశాస్త్రి గారి కవిత –

*"నా విరులతోట పెంచుకున్నాడనొక్క*
*పవ్వడపు గులాబి మొక్క*
*నా ప్రణయజీవనమ్ము*
*వర్షమ్ముగా ననయమ్ము కురిసి"*

మడత విప్పగానే గులాబీ సువాసన గుప్పుమంది.

"తనూ!

బావున్నావు కదూ!

నీ షరతు ప్రకారం నేను ఏడాది వరకూ నిన్ను చూడడానికి రాను.

కానీ ఉత్తరం రాయడానికి షరతులేవీ లేవు కదూ! పూలు పంపడానికి షరతులు లేవు కదూ!

ఇవేళ ఆఫీసుకి వెళ్తుంతే రోడ్డు పక్కన పూల దుకాణంలో నీ నవ్వులా ఆహ్లాదంగా ఉన్న గులాబీ పూలు కనిపించాయి.

అన్నీ పంపలేను కాబట్టి ఇదిగో నా హృదయం లాంటి ఈ చిన్న గులాబీని పంపుతున్నాను, స్వీకరిస్తావు కదూ!

దారంట చిన్నపిల్లల్ని ఎవరిని చూసినా నువ్వు అక్కడ పసిపిల్లాడితో గడుపుతున్న ఒంటరి జీవనమే గుర్తుకు వస్తూంది.

అనుక్షణం నీ గురించిన ఆలోచనలు నన్ను నిలవనీయకుండా చేస్తున్నాయి.

ఒక్క ఉత్తరం వ్రాయవూ?

నీ కోసం సంవత్సరం ఏవిటి, ఒక జీవిత కాలమైనా ఇక్కడే వేచి ఉంటాను!

సదా

నీ

ప్రభు"

రోజల్లా మళ్లీ మళ్లీ ఉత్తరం చదువుకుంటూ అన్యమనస్కంగా ఉన్న తన్మయిని పట్టించుకున్నా, ఏమీ ఎరగనట్లు తన మానాన తను పుస్తకంలో తల దూర్చి కూచున్న సిద్దార్థ దగ్గిరికి వచ్చి, "సిద్ధూ! మీతో మాట్లాడాలి" అంది.

49

"సిద్ధూ! నేను మీతో మాట్లాడాలి" అంది తన్మయి.

"తప్పకుండా, చెప్పండి" అన్నాడు సిద్దార్థ.

కాలేజీలో ఆవేళ సాయంత్రం స్టడీ అవర్స్ తామిద్దరి వంతు కావడం వలన మిగతా స్టాఫ్ అంతా అప్పటికే వెళ్ళిపోయేరు.

తన్మయి కాలేజీ నుంచి బయటకు దారి తీస్తూ, "అలా రోడ్డు చివరి వరకూ నడుద్దాం" అంది.

అయిదు నిమిషాల మౌనం తర్వాత సంశయిస్తున్నట్టున్న తన్మయి వైపు తిరిగి, "ఏదో చెప్పాలని పిలిచేరు" అన్నాడు గుర్తు చేస్తున్నట్టు.

తన్మయి "ఎక్కణ్ణించి మొదలు పెట్టాలా అని ఆలోచిస్తున్నాను అంది" దూరంగా ముంచుకొస్తున్న మేఘాల వైపు చూస్తూ.

పది నిమిషాల నడక తర్వాత "ఏమో సిద్ధూ, జీవితం అంతా అల్లకల్లోలంగా ఉంది ఈ ఆకాశంలా" అంది.

"ఊ..అర్థం చేసుకోగలను. జీవితం అంత భారమైనది ఇంకోటి లేదు" అంటూ

"కాస్త టీ తాగుదాం" అంటూ రోడ్డు పక్కన ఉన్న టీ దుకాణం లోకి దారి తీసేడు.

"ఏం సార్, బాగున్నరా?" అన్నాడు దుకాణాదారు.

ఇద్దరూ కూర్చునే లోగా "దో అద్రక్ చాయ్" అని అరిచాడు.

సిద్దార్థ చిన్నగా నవ్వుతూ "చిన్న ఊళ్లల్లో పనిచెయ్యడం వలన ఉండే లాభాల్లో ఇదొకటి. మనం ఆర్డరు ఇవ్వక్కరలేదు" అన్నాడు.

టీ మెల్లగా సిప్ చేస్తూ "చాలా వరకూ నిలదొక్కుకున్నాను సిద్ధూ . కానీ కొత్త నిర్ణయాలు తీసుకోవడానికి భయం వేస్తూంది" అంది తన్మయి సాలోచనగా.

"నిర్ణయాలు తీసుకోవడానికి భయం వేస్తున్నదంటే కారణం ఆ నిర్ణయం సరైనది కాకపోయి అయినా ఉండాలి, లేదా నిర్ణయం పట్ల సరైన అవగాహన లేకపోయి అయినా ఉండాలి" అన్నాడు.

"మొదటిది అవునో, కాదో అనే మీమాంస, రెండోది పెంపొందించుకోవలసిన ఆవశ్యకత. అందుకే మధ్యే మార్గంగా వాయిదా వేస్తున్నాను" అంది తన్మయి.

"మీ సమస్యేవిటో తెలీదు కానీ, వాయిదా అన్ని సందర్భాల్లోనూ పనికిరాదు. ఆలస్యం అమృతం విషం. మీకు తెలియనిదేవుంది? అలాగని తొందరపాటు నిర్ణయాలూ పనికిరావు. కానీ ఒక్కటి మాత్రం నిజం. మనస్ఫూర్తిగా మీకు నచ్చినది, ఇష్టమైనది చెయ్యండి. అప్పుడే ఒకసారి నిర్ణయం తీసుకున్నాక మంచి ఎదురైనా, చెడు ఎదురైనా తట్టుకోగలిగే శక్తి వస్తుంది. ఏదేమైనా నిర్ణయానికి కట్టుబడండి. గుడ్ లక్" అని లేచేడు సిద్ధార్థ.

తన్మయికి మనసంతా తేలికగా మారింది. "థాంక్యూ" అంటూ ప్రశంసాపూర్వకంగా చూస్తూ నమస్కరించింది. అతని పట్ల ఉన్న గౌరవం మరింత పెరిగింది.

"ఎటువంటి సమస్యనైనా చక్కగా విశ్లేషించి, విషయం ఇట్టే బోధపడేటట్లు చేస్తాడు. సిద్ధార్థ లాంటి స్నేహితుడు దొరకడం నిజంగా తన అదృష్టం" నడుస్తూ ఆకాశం లోకి చూసింది. చిత్రంగా మేఘాలన్నీ చెల్లాచెదురై ఆకాశం ప్రశాంతంగా ఉంది.

ఇంటికి వచ్చేసరికి తన్మయి కోసం పార్శిల్ ఎదురుచూస్తూ ఉంది. ప్రభు నించి వచ్చిందని అర్థమవుతూనే ఉంది.

సాలోచనగా పార్సిల్ ని కత్తెరతో జాగ్రత్తగా కత్తిరించింది.

ఒక చిన్న అబ్బాయి, అమ్మాయి చెయ్యీ చెయ్యీ పట్టుకుని నడుస్తున్న ఫోటో లామినేషన్ అది.

ముచ్చటగా ఉన్న ఆ ఫోటోని గోడకి తగిలిస్తూ "ఎంత మంచి సెలక్షన్ చేసేడు ప్రభు!" అనుకోకుండా ఉండలేకపోయింది.

అతని ఉత్తరాలు, అతని చేతలు అతను మంచివాడని చెపుతున్నాయి. మనసు అతన్ని కోరుకుంటూంది. ఒంటరిగా ఇన్నాళ్లూ బతికినా, తనకీ తోడుంటే బావుణ్ణన్న ఒక చిన్న ఆశ ఏదో అతన్ని ఒప్పుకోమంటూంది.

కాగితం తీసుకుని ఉత్తరం రాయడం ప్రారంభించింది.

"ప్రియమైన ప్రభూ!

ఎలా ఉన్నారు?

మీ ఉత్తరం వంద సార్లు చదవడం పూర్తికాక ముందే మీరు పంపిన చిత్రం అందింది. ఎంత అందంగా, ముచ్చటగా ఉందో! మాయా మర్మంలేని పసి ప్రేమ. మనుషులు ఎప్పటికీ అలా కల్మషరహితంగా ఉండిపోతే ఎంత బావుంటుంది ప్రపంచం! మొన్నటికి మొన్న ఉదయానే కురిసిన హేమంత తుషారంలా మీ ఉత్తరంలో నుంచి రాలిపడ్డ గులాబీ రేకులు. ఉత్తరం మడత విప్పినప్పుడల్లా నన్ను చుట్టుముడుతున్న పరిమళం. ఇప్పుడేమో చిదానందాన్ని పంచే చిత్రం! నేను మీకు ఏమిచ్చి ఋణం తీర్చుకోను!! మీ కోసం ఇదిగో నా హృదయాన్ని బహుమతిగా పంపుతున్నాను.

మీ

తను"

తను రాసిన ఉత్తరాన్ని తనే నాలుగైదు సార్లు చదువుకుంది.

అతనంటే తనకూ ఇష్టమని చెప్పడం తప్పేమీ కాదని అనిపిస్తూంది. పెళ్లి అనే ఆలోచనను తనెలాగూ సంవత్సరం తర్వాతకు వాయిదా వేసింది.

ఉత్తరం మడిచి తలగడ కింద పెట్టుకుని పడుకుంది. పక్కనే నిద్రపోతున్న బాబు చెంపల్ని నిమిరింది.

"నువ్వు చెప్పు నాన్నా! నేనేమి చెయ్యాలో" అంది.

నిద్దట్లో ప్రశాంతంగా ఉన్న వాడి ముఖమ్మీద చిర్నవ్వు ఒక్క క్షణం వెలిగింది.

తన్మయి వాణ్ణి దగ్గరగా అదుముకుని ముద్దు పెట్టుకుంది. "చాలు నాన్నా" అంటూ.

★★

జ్యోతి ఉత్తరం రాసింది. ఇంటర్వ్యూకి వచ్చినపుడు హైదరాబాదు లో తమకు ఆతిథ్యం ఇచ్చిన పెద్దమ్మ కొడుక్కి పెళ్లట. భాను మూర్తికి ఆరోగ్యం కాస్త కుదుటపడింది కాబట్టి ఇద్దరూ ముందుగా తన దగ్గిరికి వచ్చి, అంతా కలిసి పెళ్ళికి వెళ్దాం, రెండ్రోజులు సెలవు పెట్టమని.

అమ్మా, నాన్నా ఇద్దరూ వస్తున్నారు. తన్మయికి గొప్ప ఆనందం వేసింది.

ఇంట్లోకి టిఫిన్లు ఇతరత్రా వండుకోవడానికి కావల్సిన కిరాణా సామాన్లు కొని తెచ్చింది.

తండ్రి భోజనం తినడానికి కిందన కూర్చోలేడు కాబట్టి రేకు భోజనం బల్ల, ఒక రెండు ఫోల్డింగు కుర్చీలు కొంది.

పెళ్లికి కట్టుకోవడానికి తన దగ్గిర ఒక్క పట్టుచీర కూడా లేదు. పైగా తనకి ఎన్నాళ్లుగానో మంచి చీర కొనుక్కోవాలని ఉంది. సిద్ధూ చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చేయి. అవును, మనస్ఫూర్తిగా నచ్చినట్లు బతకడంలోనే ఆనందం ఉంది. తాయిబా ను తోడు తీసుకెళ్లి సులభ వాయిదాల్లో కట్టడానికి ఒప్పుకుని మంచి జరీ పట్టుచీర కొని తెచ్చుకుంది. చీరకు అంచులు, ఫాల్సు, జాకెట్టు కుట్టించడానికి ఇచ్చింది.

శేఖర్ నించి విడిపోయేక తల్లీ, తండ్రీ మొదటిసారి వస్తున్నారు తన దగ్గిరికి. వాకిట్లో ముగ్గులు వేసింది. చెప్పలేని ఆనందంగా ఉంది. తను చదువుకుని ప్రయోజకురాలు అయ్యింది. ఉద్యోగం చేస్తూ తన కాళ్ల మీద తను నిలబడి, తన మానాన తను హాయిగా బతుకుతూంది. ఇంతకంటే ఏ తల్లిదండ్రులకైనా ఏం కావాలి? తనని చూసి తప్పకుండా సంతోషపడతారు. అద్దంలో తనను తాను చూసుకుని గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది. కళ్ల కింద నల్ల చారలు, పీక్కుపోయిన చెంపలు.అయినా జీవితం ఏవీ నిరాశాజనకంగా లేదు. తనకు నచ్చిన కాటన్ పంజాబీ డ్రెస్సు వేసుకుని, తల్లి ఇచ్చిన సన్నని గొలుసు, ఒక జత గాజులు మాత్రం వేసుకుంది.

బాబుకి పేంటు, షర్టు, బూట్లు, సాక్సులు వేసి తయారు చేసింది. తాతయ్య, అమ్మమ్మ వస్తున్నారని బాబు హుషారుగా చిందులు వేయసాగేడు.

తల్లీ, తండ్రీ వస్తారన్న సమయానికి అరగంట ముందే బండి మీద బస్టాండుకి బయలుదేరింది.

సమయానికంటే పది నిమిషాల ముందే బస్సు వచ్చింది.

తన్మయిని, బాబుని చూస్తూనే జ్యోతి ఆత్రంగా బాబుని ఎత్తుకుని ముద్దాడింది. ఇద్దరూ బాబు మీద బాగా బెంగ పడ్డట్టు ఒక్క క్షణం కింద దించకుండా ఒకళ్ళు మార్చి ఒకళ్ళు ఎత్తుకోసాగేరు. తన్మయికి వాళ్లని చూసి పట్టరాని అనందం కలిగింది. తల్లి దగ్గిరికెళ్లి కౌగలించుకుంది. తండ్రి చేతిలో బ్యాగు అందుకుంది.

వీధి మలుపు తిరగగానే "అదేవిటమ్మా, ఇంత కంటే వేరే చోట ఇల్లు దొరకలేదా" అంది వీధి మొదట్లో పీర్ల పండగ నాటి జెండాలను చూస్తూ.

వాళ్లు వచ్చిన సంతోషం గంట కూడా నిలవలేదు తన్మయికి.

వస్తూనే చికాకు పడింది. "ఏవిటీ ఇల్లు, కనీసం సెపరేటు బాత్రూము కూడా లేకుండా? ఆ ఇంటావిడ ఏంటి, అస్తమాటూ అన్నిటికీ కల్పించుకుంటూ..." అని.

ఇక తండ్రి తన్మయి ఏదో కోల్పోయి నిరాశలో బతుకుతున్నట్టు బాధాకరంగా ముఖం పెట్టుకు కూర్చున్నాడు.

తన్మయి ఏదో రకంగా వాళ్ల మూడ్ మార్చడానికన్నట్లు, "అమ్మా, పెద్దమ్మ కొడుకు పెళ్లికి పట్టుచీర కొనుక్కున్నాను చూడు" అంది చీర ఎదురుగా పెడుతూ.

జ్యోతి ముఖంలో మార్పు లేకపోగా శోకాలు పెట్టడం ప్రారంభించింది.

"ఆ దౌర్భాగ్యుడు నీ మెళ్లో పుస్తెలు కూడా లాక్కున్నాడు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని పెళ్లికి వెళ్తాం?" అంటూ ముక్కు చీదడం ప్రారంభించింది.

ఇదేమీ వినడం ఇష్టం లేనట్లు తండ్రి తల మీద చెయ్యేసుకుని పడుకున్నాడు. తన్మయికి సంతోషం అంతా నీరుగారిపోయింది.

తను పెళ్లికి వీళ్ల కూడా వెళ్లడం వీళ్లకి పరువు నష్టమన్నమాట. తను భర్త నుంచి విడిపోయింది కాబట్టి నలుగురూ నాలుగు మాటలంటారన్న బాధన్నమాట వీళ్లకి.

అయినా తన్మయి వెనక్కి తగ్గకుండా, "అమ్మా! మేమిద్దరం విడిపోయేం అన్న విషయం ఈ సరికే అందరికీ తెలిసే ఉంటుంది. కాబట్టి నా మెళ్లో మంగళ సూత్రాలు కనబడాల్సిన అవసరం లేదు. అయినా నేనేదో తప్పు చేసినట్లు నలుగురిలో కలవకుండా ఎందుకు ఉండిపోవాలి?అయినా ఎవరైనా ఏమైనా అంటే నేను సమాధానం చెప్పుకుంటాను " అంది స్థిరంగా.

"మొకమ్మీద అంటారా ఎవరైనా? వెనక వెనక నవ్వుకుంటారు" అంది జ్యోతి ఇంకా ముక్కు చీదుతూ.

"నా వెనక వాగుకునే వాళ్ల గురించి నాకు బాధ లేదు, మీకు బాధగా ఉంటే నేను రావడం మానేస్తాను" అంది తన్మయి.

"అహా, అంత దూరం నుంచి వచ్చి నిన్ను తీసుకురాకుండా పెళ్లికి వచ్చారేవిటని అందరూ మమ్మల్ని ఆడిపోసుకోవడానికా?" అంది జ్యోతి రివర్సులో.

తన్మయికి తలపోటు రాసాగింది.

"నన్నేం చెయ్యమంటావో చెప్పు" అంది ఓపిక పట్టి తల్లి దగ్గిర కూలబడుతూ.

"ఏం చేస్తాం, మన ఖర్మ ఇలా కాలేక" అని వెనక్కి తిరిగి కూచుంది జ్యోతి.

★★★

పెళ్లి సాయంత్రం అనగా ఆ ఉదయాన వెళ్లేరు.

దగ్గిర చుట్టాలంతా ఆ రోజే రావడంతో అప్పుడే పెళ్లి కొడుకుని చేసేరు.

అందరూ వెళ్లి అక్షింతలు వేయసాగేరు. తన్మయిని పెళ్లి కొడుకు పిన్ని వరసయ్యే ఆవిడ పక్కకు పిలిచింది.

"ఇలా చూడమ్మా, శుభమా అని పెళ్లి జరుగుతూంది ఇక్కడ. మొగుడూ పెళ్లాలు కలిసి దీవిస్తన్నారు. నువ్వు, మీ ఆయన విడిపోయేరంటగా. నువ్వేవనుకోకపోతే అక్షింతలు మాత్రం వెయ్యకు" అని నసిగింది.

తన్మయికి ఒక్కసారిగా దు:ఖం ముంచుకొచ్చింది.

అక్కడ ఒక్క క్షణం కూడా ఉండ బుద్ధి కాలేదు. తల్లి, తండ్రుల్ని అక్కడ వొదిలిపెట్టి వెళ్లలేక, ఒక పక్కగా వెళ్లి కూచుండి పోయింది.

భర్త పోయిన ఆవిడొకామె వచ్చి తన పక్కనే కూచుని నిట్టూర్చడం గమనించింది తన్మయి.

సంప్రదాయాలంటూ మనుషుల మూఢ ప్రవర్తనలకు విసుగు పుట్టింది తన్మయికి. ఏమీ చేయలేని నిస్సహాయత. ఇక మీదట బంధువుల ఇళ్లకు రాకూడదని నిశ్చయించుకుంది. ఇంతకు ముందెప్పుడో ఇలాగే బంధువుల్లో అవమానం జరిగినప్పుడు ఇలాగే నిశ్చయించుకున్నది, కానీ తల్లీతండ్రీ ఈ పనిమీదే తన దగ్గరకు వచ్చినపుడు ఎలా రాకుండా ఉంటుంది? ఎన్నో రోజులు ఎక్కడికీ వెళ్లక ఒకసారి వెళ్లి చూద్దామని వచ్చినందుకు తగిన శాస్తి జరిగింది తనకు.

దు:ఖం ఆపుకోలేక కింద గేటు దగ్గరకు వచ్చింది.

వచ్చిపోయే చుట్టాల్లో కొందరు "ఇక్కడ ఉన్నావేవమ్మా, పైన పెళ్లికొడుకుని చేస్తుంటేనూ" అనసాగేరు.

ఎదురుగా కిరాణా దుకాణం దగ్గిర ఎవరో ఒకతను బండి స్టాండు వేసి కొనడానికి వెళ్లేడు. వెనక నుంచి అచ్చు ప్రభులాగే ఉన్నాడు.

తన్మయికి అంత దుఃఖం లోనూ ఒక్కసారి అతన్ని చూడాలని కుతూహలం కలిగింది. రోడ్డు దాటి అటు వెళ్లడానికి సాహసం కలగలేదు. ఒకవేళ నిజంగా ప్రభు అయితే! అతను తనని చూస్తే పలకరించకుండా ఉండడు. ఇదంతా ఎవరయినా చూసి, అమ్మా నాన్నలకు తప్పకుండా చెపుతారు.ఆ తర్వాత జరిగే రభస తల్చుకోవడానికే భయం వేసి, చప్పున మెట్లెక్కి పైకి వచ్చేసింది. చివరి మెట్టు తిరుగుతూ మనసాపుకోలేక అటుగా చూసింది.

సరిగ్గా బండి స్టార్టు చేస్తూ పైకి చూసేడతను. ప్రభు! అవును ప్రభుయే!!

తన్మయి గుండె ఒక్క క్షణం ఆగి కొట్టుకోవడం మొదలు పెట్టింది. కానీ అంత పై అంతస్తులో మెట్లెక్కుతున్న అనేక పట్టుచీరల్లో తనని అతను చూసినట్లు లేదని అర్థమైంది. తన చుట్టూ ఏం జరుగుతున్నదీ మైమరచిపోయి, అతని బండి కనుచూపుమేర దాటేంత వరకూ చూస్తూ , అలాగే ఉండిపోయింది. మధ్యాహ్నం భోజనాల దగ్గిర, సాయంత్రం పెళ్లి దగ్గిరా ఎక్కడ చూసినా, ఎవర్ని చూసినా ప్రభు కనిపించసాగేదు. అతని ఊహ వచ్చినపుడల్లా పెదాల మీద చెరగని చిర్నవ్వు మొలుస్తూనే ఉంది. కానీ పొద్దున్న జరిగింది జ్ఞాపకం వచ్చి పెళ్లి మండపంలో అక్షింతలు వెయ్యడానికి వెళ్లకుండా దూరంగా ఉండి పోయింది తన్మయి. తనని, ప్రభుని వాళ్ల స్థానాల్లో ఊహించుకుంటే ఎందుకో ఒకరకమైన వేదన మొదలయ్యింది. తన చుట్టూ ఉన్న వీళ్లంతా ఇలాగే ఆశీర్వదిస్తారా? ముఖ్యంగా తల్లీతండ్రీ ఒప్పుకుంటారా?!

జ్యోతి కూతురి ముఖంలో భావాల్ని మరోలా అర్థం చేసుకుంది.

మర్నాడు ఇంటికెళ్లగానే "నిన్న పెళ్లిలో అందరూ జాలిపడడమే మమ్మల్ని చూసి. మా బతుకులే ఇలా తగలడ్డాయి. ప్రపంచంలో అందరూ బాగున్నారు. అప్పుడే నువ్వు ఆ దగుల్బాజీ వెధవని పెళ్లి చేసుకుంటానని పట్టుబట్టకబోతే ఇవన్నీ జరిగేవి కావు. ఇప్పుడు ఏడ్చి ఏం లాభం?" అంది నిష్టూరంగా.

తల్లి ఇలా మాట్లాడడం కొత్త కాకపోయినా బాధ మాత్రం ప్రతీసారీ కలుగుతూ ఉంది. తను మళ్లీ పెళ్లి చేసుకుంటేనే ఇటువంటి సమస్యలన్నీ తీరుతాయేమో అని నమ్మకం కలగసాగింది తన్మయికి. కానీ తల్లీ, తండ్రీ తన దగ్గర ఉన్న వారం రోజులూ ప్రభు ప్రస్తావన తేవాలనుకునీ, తేలేకపోయింది తన్మయి. చిత్రంగా ఇప్పటివరకూ వాళ్లు కూడా ఎప్పుడూ తనకి మళ్లీ పెళ్లి చేయాలనే ప్రస్తావన తీసుకు రాలేదు.

తను ఇంకా అటువంటి ప్రస్తావనలకు సిద్ధంగా లేదనా? లేక ఇక తను జీవితాంతం ఇలా ఉండవల్సిందేననా? కారణాంతరాలు ఏవైనా పెళ్లి విఫలం అయినపుడు మగవాళ్లు జీవితాన్ని చక్కదిద్దుకున్నంత వేగంగా ఆడవాళ్లు చక్కదిద్దుకోలేరన్న వాస్తవం క్రమంగా

బోధపడసాగింది తన్మయికి.

★★★

ఆ ఉదయం తాయిబా అమ్మా, నాన్నా వచ్చేరు.

వస్తూనే "బేటీ, ఎలా ఉన్నావు" అంటూ వాకిట్లోనే కూతురుని బెంగగా కౌగలించుకుని కన్నీరు మున్నీరయ్యింది ఆ తల్లి.

జ్యోతి, భానుమూర్తి బయలుదేరిన ఉదయం జ్ఞాపకం రాసాగింది తన్మయికి.

బాబుని అక్కున చేర్చుకుని బుగ్గలు పుణుకుతూ "బాగా చదువుకో నాన్నా" అంది జ్యోతి.

తన్మయి వైపు తిరిగి "జాగ్రత్తగా ఉండమ్మా" అంది.

తన్మయికి అమ్మా, నాన్నా తనని వదిలి వెళ్తుంటే కళ్లల్లో నీళ్లు వచ్చేయి.

తల్లి తననూ అక్కున చేర్చుకుంటే బావుణ్ణని అనిపించింది.

గుమ్మం దగ్గిర బయటకు వచ్చి నిలుచున్న తాయిబాతో "ఏమాటకామాటే చెప్పుకోవాలి, మాకు మా అమ్మాయి మీద కంటే మా మనవడి మీదే ప్రేమెక్కువ, వాణ్ణి ఒదిలి ఉండలేకే వచ్చేం. కొంచెం చూస్తుండమ్మా" అంది జ్యోతి.

తన్మయికి మనసు చివుక్కుమంది. రిక్షా ఎక్కుతున్న తల్లిని, తండ్రిని చెయ్యి పట్టుకుని ఎక్కించింది.

తనకు మాత్రం వీళ్లంటే ప్రాణం. తిరిగి ఆ ప్రేమను వాళ్ల నుంచి పొందలేకపోవడం తన దురదృష్టం. తనలో తనే నిట్టూర్చింది.

లోపలకి వెళ్లబోతూ ఉంటే, తాయిబా వెనకే వచ్చింది, "మేడం, మనసు బాగలే, కూసో వచ్చా" అంటూ.

"రా తాయిబా" అని కుర్చీ వేసింది

అయిదు నిమిషాలైనా, ఉలకక పలకక ఉన్న తాయిబా వైపు చూస్తూ, "అంతా బానే ఉందా?" అంది.

"ఏం సెప్పను మేడం, నా తలరాత గిట్లున్నది. మీతో సెప్పుకుంటెనన్న కొంచెం పరేషాన్ తగ్గుతదని అచ్చిన." అంది

"చెప్పు తాయిబా" అంది అనునయంగా తన్మయి.

"మా ఆయినకు, నాకు గిది రెండో పెళ్లి" అంది తాయిబా.

ఆశ్చర్యంగా చూసింది తన్మయి.

ఈ అమ్మాయి జీవితంలోనూ కష్టాలేనన్నమాట. కానీ ఎప్పుడూ చెదరని చిర్నవ్వుతో కనిపిస్తుంది.

"నా సిన్నపుడె నాకు యాబై ఏణ్డ్ల వానికిచ్చి కట్టబెట్టిన్రు. వాడేమో డబ్బు పోస్తడని గామోసు. మా అమ్మకి సుతరామూ ఇష్టం లేకుండె. మా బాపు నచ్చజెప్పి పెండ్లి సేసిండు. నా అదృష్టమొ, దురదృష్టమొ కాపురానికి పోక ముందె యాక్సిడెంట్ల వాడు పాయె." అని ఆగి నీళ్ల కోసం సైగ చేసింది.

మంచి నీళ్లు తీసుకు వచ్చి, "మెల్లగా, ముందు స్థిమితపడు తాయిబా" అంది తన్మయి.

"ఇరవై ఏండ్ల వయసున గిదో గీ సమ్మందం మా చిన్నాయిన తీసుకుని అచ్చిండు. అతనికి ముందు పెండ్లాము సచ్చిపాయె. మనిసి మంచోడే, కానీ లేని దురలవాటు లేదు. పగలూ, రేత్రీ యేపుకు తింటుండె. ఇంక నయం ముందూ, యెనకా ఎవరూ లేరు. రెండేళ్ల క్రితం దుబాయి పొయ్యిండు. మూడు నెల్ల బట్టి నయాపైస పంపకపోతుండె, మనిసి మంచిగనె ఉన్నడని దుబాయిల ఉన్న మా సిన్నమ్మ కొడుకు సెప్పిండు. ఒక ఉత్తరం లేదు, కబురు లేదు. ఏం పోయెగాలమొచ్చెనో ఏమొ. నాకు గిట్ల పిల్లలు లేరని, దేన్నైనా పెట్టుకున్నడేమో

అని డౌటు కొడ్తంది. ఈడు నన్ను ఏడ ఇడిసిపెట్టడోనని మస్తు పరేషాను అయితంది మేడం. రెండో పెళ్లిజేసుకుని సుకాన ఉన్న నా ప్రాణం దుక్కాన బెట్టుకున్ననే అని ఏడ్వని రోజు లేదు" అని దు:ఖపడింది.

కాస్సేపు నిశ్శబ్దంగా తాయిబా చెయ్యి నిమురుతూ కూచుండి పోయింది తాయిబా.

"అయ్యో, అమాయకమైన ఈ అమ్మాయికి ఎంత కష్టమైన జీవితం మిగిలింది" అని బాధ మొదలయ్యింది.

"దిగులుపడకు, అన్నీ చక్కదిద్దుకుంటాయి" అంటూ తాయిబాకి ధైర్యం చెప్పింది.

అన్నదే కానీ అప్పట్నించీ మళ్లీ మళ్లీ తాయిబా మాటలు గుర్తుకురాసాగేయి.

"రెండో పెళ్లిజేసుకుని సుకాన ఉన్న నా ప్రాణం దుక్కాన బెట్టుకున్న......"

తను మళ్లీ పెళ్లి చేసుకోవాలని ఆశపడడం ఇలాగే దు:ఖదాయకమవుతుందా?

ఇప్పుడు తన మానాన తను, ఉన్నంతలో హాయిగా ఏ బెడదా లేకుండా జీవిస్తూంది.

ప్రభుతో మళ్లీ జీవితం పంచుకోవడం అనే ఆలోచనతో తను కోరి కష్టాలను కొని తెచ్చుకుంటూందా?....ఏమో....

★★★

ఆ రోజు ఒంట్లో నలతగా అనిపించి కాలేజీకి వెళ్లకుండా ఇంట్లో ఉండిపోయింది తన్మయి.

పదకొండు గంటల వేళ తలుపు చప్పుడయితే మెల్లగా లేచింది.

తాయిబా, పక్కనే సిద్దార్థ.

"ఇగో మేడం, ఇంగ్లీషు సారు ఇల్లు సూపించమంటే నేనూ అచ్చిన. సుస్తీ ఉంటే రాంద్రి, దావఖానకు పొయ్యొద్దాం" అంది తాయిబా.

తన్మయి ఫర్వాలేదన్నట్టు తలూపింది.

తాయిబా పక్క తలుపువైపు వెళ్లడం చూసి, "అయితే తనింట్లోనే మీరు అద్దెకుంటున్నారన్న మాట" అని కూచుంటూ, "ఏమిటి? ఎలా ఉన్నారు?" అన్నాడు సిద్దార్థ.

తన్మయి జుట్టు సరిచేసుకుంటూ "కొంచెం నలతగా ఉంది, అంతే" అంది బలవంతంగా చిన్న నవ్వు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"ఈ మధ్య మీరు అన్యమనస్కంగా ఉండడం గమనిస్తూనే ఉన్నాను, ఎప్పుడూ ఏదో బాధలో ఉంటున్నారు. అంతా ఓకేనా? ఏవీ అనుకోకపోతే కారణం తెలుసుకోవచ్చా?" అన్నాడు సిద్దార్థ.

అప్పటి వరకూ దాచుకున్న దు:ఖం కట్టలు తెంచుకుంది తన్మయికి.

తన్మయి తన గాథ చెప్తున్నంత సేపూ రెప్ప వాల్చకుండా వినసాగేడు.

చివరగా ప్రభు గురించి చెప్పి తన్మయి గట్టిగా ఊపిరి తీసుకుంది.

ఇంతలో తాయిబా టీలు పట్టుకొచ్చి ఇచ్చింది.

"నువ్వు కాలేజీ మానేసి ఈ పనులన్నీ చెయ్యాలా తాయిబా" అంది తన్మయి.

"అట్లంట వేంది మేడం, అయినా ఏమీ గాదులే, ప్రిన్సిపాల్ సారుకి సెప్పొచ్చిన, ఇంగ్లీసు సారెంబడి పోతున్న అని" అని

సిద్దార్థ వైపు తిరిగి, "నువ్వయినా చెప్పు సారూ, ఎప్పటికీ ఏమో పరేషానయితది, ఇగ ఆరోగ్యం గిట్ల గాక ఏమయితది?" ఆప్యాయంగా అని, "గిప్పుడే వస్త" అని లేచింది తాయిబా.

టీ తాగి కప్పు కింద పెడుతూ

"ఐ రియల్లీ అప్రిషియేట్ యువర్ బ్రేవ్నెస్ తన్మయీ. ఐ అడ్మయిర్ యూ. జీవితంలో కష్టాల్ని కత్తి ఝళిపిస్తూ విజయవంతంగా నెగ్గుకొచ్చేరు మీరు. మీకు ఇంకా దు:ఖమా? లేవండి, కళ్లు తుడుచుకోండి. ధైర్యంగా ముందడుగేయమని నేను మీకు చెప్పక్కరలేదు" అన్నాడు.

ఇంకా అలాగే ఉన్న తన్మయి వైపు చూస్తూ, "మీరనుమతిస్తే ప్రభుని నేను కలుస్తాను. అతను మీకు సరైన వాడవునో, కాదో తెలుసుకోవడానికి మీకు సహాయం చేస్తాను, ఏమంటారు?" అన్నాడు.

50

కాలేజీకి వేసవి కాలం సెలవులు వచ్చేయి. సిద్దార్థ ప్రభుతో మాట్లాడతానన్నాడు. స్పాట్ వేల్యూయేషన్ లో కలిసినా సిద్దార్థ తన హడావిడిలో తనుండడం వల్ల తన్మయి ఏవీ అడగలేక పోయింది. అతనూ ఏవీ చెప్పలేదు. సిద్దార్థ ఏం మాట్లాడేడో, ప్రభు స్పందన ఏవిటో తెలుసుకోవాలనే కుతూహలం రోజురోజుకీ పెరిగిపోసాగింది.

సెలవులు అయ్యేంతవరకు రోజులు ముళ్ల మీదున్నట్టు భారంగా అనిపించసాగేయి తన్మయికి. సిద్దార్థ అసలు ప్రభుతో మాట్లాడేడో, లేదో కూడా తెలియదు. బహుశా: సెలవులకి సొంత వూరు వెళ్ళడం వంటి పనుల్లో పడి అసలు కలిసే ఉండకపోవచ్చు.

"అయినా తన పిచ్చిగానీ ప్రభు తనకు తగినవాడవునో కాదో తనకు తెలుసు కదా! సిద్దార్థ కొత్తగా అతన్ని అంచనా వేసేదేవుంటుంది?" అని ఒక వైపు

"సిద్దార్థ తనకు మంచి మిత్రుడు. తన మేలుకోరే వాడు. ప్రభు గురించి తనకు కొంత మాత్రమే తెలుసు. తనకి తెలియనివి, అర్థం కానివి సిద్దార్థ తెలుసుకుని తనకు సలహా చెప్పడంలో తప్పేముంది" అని మరోవైపు అనిపించసాగింది.

అదీగాక తనొక్కతే ఇవన్నీ ఆలోచించి చాలా అలిసిపోతూంది. తన ఆలోచనలు మరెవరితోనైనా పంచుకోవాలని అనిపిస్తున్న తరుణంలో సిద్దార్థ తనంతట తనే సహాయం చేస్తానని ముందుకొచ్చేడు.

ఏదేమైనా తను తప్పు నిర్ణయం తీసుకోకూడదు. అసలే మొదటిసారి శేఖర్ విషయంలో తను అతన్ని పూర్తిగా నమ్మి మోసపోయింది.

ప్రభు విషయంలో తొందరపడకూడదు, ఎంత కాలం పట్టినా తను తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. ఆలస్యం అమృతం విషమైనా, మరేదైనా.

ఇప్పుడు తనున్న పరిస్థితుల్లో తనకి పెళ్లి ఒక జీవితాంతపు తోడే కాదు, అవసరం కూడా. కానీ అవసరాల కోసం, స్వార్థాల కోసం కలుపుకునే బంధాలు పటిష్టమైనవి కావని శేఖర్ నిరూపించేడు. తనూ ఇప్పుడు అలాగే ఆలోచిస్తూందా? ఛ.. ఛ.. లేదు. తను శేఖర్ లా నీచంగా ఎప్పటికీ ఆలోచించలేదు, ప్రవర్తించలేదు. ప్రభుని తను మనసారా ప్రేమించి, అతను తనకి కావాలని అనుకుంటూంది. అతనితో జీవితం పంచుకుని, హాయిగా బతకాలని తాపత్రయపడుతూంది. కానీ తనకు కావలసిన ఆలంబన కోసం ఇప్పుడిప్పుడే మొదలవుతున్న అతని జీవితాన్ని కాలరాసే అధికారం తనకు లేదు. అతనే స్వయంగా అందుకు సిద్ధపడుతున్నప్పటికీ, అతన్ని మనసారా ప్రేమించే వ్యక్తిగా తను అతని జీవితం ఎప్పుడూ చక్కగా ఉండాలని కోరుకుంటూంది.

పైగా అతను తనతో జీవించడంలో ఎన్నో త్యాగాలు చేయాల్సి వస్తుంది. వాటన్నిటికీ తను అర్హురాలైనా, కాకపోయినా అతను భవిష్యత్తులో ఎప్పుడైనా బాధ పడకుండా ఉండగలడా? తీసుకున్న నిర్ణయాలు సరైనవి అవునని ఇప్పుడు నమ్ముతున్నట్లే జీవితాంతం నమ్మి, కట్టుబడి ఉండగలడా? ఏ

ప్రేమతోనైతే అతను తనకు దగ్గిర కావాలనుకుంటున్నాడో ఆ ప్రేమ అజరామరంగా తాము జీవించి ఉన్నంతకాలం ఉండగలదా? అంత బలమైన ప్రేమని ప్రేరేపించగల గొప్ప హృదయాలు తామిద్దరికీ ఉన్నాయా?

దృఢమైన నిర్ణయాలు, బలమైన ప్రేమ, ఎన్ని కష్టాలెదురైనా తట్టుకుని, 'మేమిద్దరం ఒకటి' అని ఎదురు నిలబడగలిగిన స్థయిర్యం.... ఇవన్నీ ప్రభులో ఉన్నాయో లేదో తెలుసుకోగలగాలి సిద్దార్థ. అతని మాటల్లోనూ, చేతల్లోనూ తనకి కనబడుతున్న నిస్వార్థ ప్రేమ, నిజాయితీ సిద్దార్థ కు కనిపించాలి. అప్పుడే అసలు ఈ ప్రయత్నం సఫలమవునో కాదో అర్థమయ్యేది....

★★★

తల స్నానం చేసి బట్టలు ఆరవెయ్యడానికి డాబా మీదికి వచ్చింది తన్మయి.

పొడవైన కుదుళ్లకు కట్టుకున్న తువ్వాలుని విప్పి ఒక పక్కగా నిలబడి ఎండకి జుట్టారబోసుకోసాగింది.

పక్కనే ఎక్కడి నుంచో టీవీ లోంచి పాట వినిపిస్తోంది.

"నిదురించే తోట లోకి పాట ఒకటి వచ్చింది

కన్నుల్లో నీరు తుడిచి కమ్మని కల ఇచ్చింది"

ఎన్నిసార్లు విన్నా మనసు ఆర్ద్రమయ్యే గొప్ప పాట-

శేషేంద్ర శర్మ గారి కవిత్వం జ్ఞాపకం వచ్చింది

"చెట్టుగా ఉంటే ఏడాదికి ఒక వసంతమైనా దక్కేది

మనిషినై అన్ని వసంతాలూ కోల్పోయాను"

"కాలాన్ని నా కాగితం చేసుకుంటూ దాని మీద లోకానికి ఒక స్వప్నం రాసిస్తా

దాని కింద ఊపిరితో నా సంతకం చేస్తా"

....చిత్రంగా గుర్తుకొచ్చిన కవితలన్నీ ప్రభు తన గంభీరమైన గొంతుతో తన చెవుల్లో వినిపిస్తున్నట్లు అనిపించసాగేయి తన్మయికి.

తను ప్రభుని దూరం పెట్టేనని అనుకుంటూంది గానీ, అసలు తను తన ఆలోచనల్లోంచి ఎప్పుడైనా దూరం పెట్టగలుగుతోందా?

తన్మయి ఆలోచనల్లో ఉండగానే కింద పోస్ట్ మేన్ వచ్చిన కేక వినబడింది. ఆ వెంటనే తాయిబా పిలుపు వినబడింది. తన్మయి కిందికి గబగబా వచ్చి సంతకం పెట్టి పార్సిల్ తీసుకుంది.

"Let us C" సీ ప్రోగ్రామింగు పుస్తకం.

మొదటి పేజీలోంచి తొంగి చూస్తున్న ఉత్తరం కనిపించేసరికి సంతోషం ఉరకలు వేసింది తన్మయికి.

అమాంతం లోపలికి వెళ్లి పుస్తకాన్ని గుండెలకు హత్తుకుని, ఉత్తరాన్ని ముద్దు పెట్టుకుని విప్పింది.

ప్రియాతిప్రియమైన తనూ!

'ప్రియమైన ప్రభూ!' అని నన్ను పలకరించిన నీ లేఖ ఇవేళ నాకు ఆనందాతిరేకాన్ని నింపిన రోజుని బహూకరించింది.

ఎప్పుడెప్పుడు ఆఫీసు అవుతుందా, ఎప్పుడు నీకు ఉత్తరం రాద్దామా అని మనసు పొద్దుట నీ ఉత్తరం అందుకున్న దగ్గిర్నించీ తహతహలాడుతూంది.

సమయం ఉన్నప్పుడల్లా నీ ముత్యాల్లాంటి అక్షరాల్ని నా కనురెప్పల్తో తడుముతూ, ప్రతీ పదంలోనూ తొణికిసలాడుతున్న ప్రేమను అమాంతం హత్తుకుని గొప్పగా పొంగిపోతూ నీ కోసమే కలవరిస్తున్నాను. ఏ జన్మ అనుబంధమో మనది! కష్టాల జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కొని ధీరవనితవైన నువ్వు

నమ్మకపోవచ్చుగానీ, నువ్వు నన్ను చేరుకోవడం కోసమే నీ జీవితంలో అవన్నీ జరిగాయని నేను నమ్ముతున్నాను! మనల్నిక ఎవరూ ఆపలేరు. నిన్ను నా నించి ఎవరూ దూరం చెయ్యలేరు. నన్ను పెళ్లి చేసుకోవడానికి నీ మనస్సులో ఏవైనా సందేహాలున్నాయేమో గానీ, నాకు లేవు. నీ పట్ల నా ప్రేమ నిజమైనదే అయితే మనం తప్పక పెళ్లి చేసుకుంటాం. ఎప్పుడెప్పుడు మన గడువు తీరుతుందా, ఎప్పుడు నిన్ను చూద్దామా అని మనసు తహతహలాడుతూంది. ఊహూ... అసలు మనసు నా వశంలోనే ఉండడం లేదు."

.......ప్రేమ ప్రవాహం లా సాగిపోతున్న ఉత్తరాన్ని గుండెకి హత్తుకుంది తన్మయి.

"ఇంత గొప్ప ప్రేమ కి తను అర్హురాలేనా? చాలు అజ్ఞాత మిత్రమా! ఈ జన్మకిది చాలు!!"

ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుకుందో లెక్కలేదు. ఉత్తరానికి జాబు రాసి కవరు అతికించింది. నాలుగు రోజులకొక ఉత్తరం వస్తూనే ఉంది. జవాబులు రాస్తూనే ఉంది. ఆ మధ్యాహ్నం గదిలో చాప మీద పడుకుని చుట్టూ ఉత్తరాలు పేర్చుకుని, ఒక దాని తర్వాతొకటి మళ్లీ, మళ్లీ చదవసాగింది. ప్రభు ఉత్తరాల్లో కేవలం ప్రేమ పలకరింతలు, పలవరింతలే కాదు. జ్ఞానాన్నిచ్చే ఎన్నో అంశాలు కూడా ఉంటాయి.

"కంప్యుటరు సైన్సు తరగతులు ఎంత వరకూ వచ్చాయి? విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్స్ కూలంకషంగా ఉపయోగించడం వచ్చిందా? డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు అంటే ఏవిటో గుర్తుందా? సీ ప్రోగ్రామింగు లో చుక్కల్తో త్రిభుజం నిర్మించడం ఎంత వరకు వచ్చింది?"

అతనికొచ్చిన విజ్ఞానమంతా తనకీ నేర్పాలన్న ఉత్సాహం తన్మయికి ఎంతగానో నచ్చుతుంది. ఎప్పటికైనా అతనితో సమ ఉజ్జీ కాగలదో లేదో తెలియదు కానీ, కొత్త సబ్జెక్టు తెలుసుకోవడం తనకీ ఉత్సాహంగా ఉంది.

ఇవేళ్టి ఉత్తరం చివర్న "బాబుకి ముద్దులు. నీకు మాత్రం ఏవీ లేవు." అనే కొంటె వాక్యాన్ని చూసి బోర్లా తిరిగి రెండు చేతులూ గెడ్డం కింద పెట్టుకుని నవ్వుకుంది.

వారం పొడవునా ప్రభు ఉత్తరాల కోసం ఎదురు చూడడం, ఉత్తరం అందుకోగానేతిరిగి ఉత్తరం వ్రాయడమే జీవితంగా గడుస్తూంది.

వేసవి కాలం తన జీవితంలో గతపు చేదునంతా తీసివేసి కొత్త ఉత్సాహం నిండుకున్నట్టు అత్యంత ఆనందంగా గడవసాగింది తన్మయికి.

సెలవుల్లో ఇంటికి వెళ్లి రావాలనుకుంది కానీ, మనసు బాధగా అనిపించి వెళ్లడం మానేసింది. అలా వెళ్ళకపోవడం ఒక విధంగా మంచిదే అయ్యింది. తను ప్రభు ఉత్తరాలతో రోజులు ప్రశాంతంగా, హాయిగా గడపగలుగుతూంది. ఈ మధ్య తల్లిదండ్రులిద్దరూ ఉత్తర భారత దేశ తీర్థయాత్రలకు వెళ్లేరు. తనూ వస్తానంటే తనకీ, బాబుకీ టిక్కెట్లు తనే కొనుక్కోవాలని నిర్మొహమాటంగా చెప్పింది తల్లి. తన్మయికి మొదట వెళ్లాలనిపించినా, ఈ మాటతో వెళ్లే ఉత్సాహం మొత్తం పోయింది.

తల్లి ప్రవర్తనకి ఒక్కొక్కసారి తన్మయికి చాలా ఆశ్చర్యం వేస్తుంది. తన డబ్బులు సరిపడా లేకపోతే తనకి చెప్పొచ్చు కదా! తనే అందరికీ టిక్కెట్లు తీసేది కదా! వాళ్ళిద్దరికీ వాళ్లు కొనుక్కుని, తనకీ, బాబుకీ తను కొనుక్కోవడం ఏవిటో తనకి అస్సలు అర్థం కాదు! లేదా కూతురి సంపాదించిన డబ్బులు తీసుకోవడం ఇష్టం లేకపోతే, తననీ తీసుకెళ్లాలనుకున్నపుడు అందరికీ వాళ్లే కొనగలిగినప్పుడే ప్రయాణం పెట్టుకోవచ్చు కదా! ఇటువంటి సందర్భాలో వాళ్లకి తను పరాయిదన్న భావన తనని కలచి వేస్తుంది. తల్లిదండ్రులు కూడా తనకి పరాయి వారైతే అసలు తనకంటూ ఎవరున్నారు? బాబూ, తనూ ఒకరికొకరు తప్ప. ఉహూ.. ప్రభు ఉన్నాడు. అవును తనని అతనెప్పుడూ పరాయిగా ఆలోచించిన సందర్భం ఒక్కటీ లేదు.

అతని పట్ల ఇష్టం బాగా పెరిగిపోవడానికి ఇదొక కారణం. అవధిలేని ప్రేమ ఆ అక్షరాల నిండా. తన్మయి కళ్లు నీళ్లతో నిండుకున్నాయి.

అతని అవ్యాజమైన ప్రేమకి ఏమిచ్చుకోగలదు తను?

★★★

కాలేజీ తెరిచిన మొదటి రోజు అత్యంత ఉత్సాహంగా ఆవరణలోకి అడుగు పెట్టింది తన్మయి.

ఎప్పుడెప్పుడు సిద్దార్థ వస్తాడా, ప్రభుతో మాట్లాడిన వివరాలు చెప్తాడా అని మనసంతా ఆతృతగా సిద్దార్థ కోసం ఎదురుచూడసాగింది.

సిద్దార్థ వస్తూనే నవ్వు ముఖంతో పలకరించాడు.

"ఏవిటి, ఏదో ఆతృతగా ఎదురు చూస్తు న్నట్టున్నారు?' అన్నాడు.

తన్మయి "అహ, ఏవీ లేదు" అని కళ్లు కిందికి దించుకుంది.

చేతిలోని బ్యాగుని టేబుల్ మీద పెడుతూ, "ప్రభుని కలిసేను" అన్నాడు.

తన్మయి సాధ్యమైనంత తక్కువ ఉత్సాహం చూపించాలన్నట్టు "ఏమని మాట్లాడేరు? " అంది.

"మంచి వార్తలు అంత సులభంగా చెప్పేస్తే ఎలా?" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

తన్మయి నవ్వుతూ "ఏం కావాలో చెప్పండి మరి!" అంది.

సిద్దార్థ "అలా నడుద్దామా ఇంకా గంట టైముంది కదా కాలేజీ మొదలవ్వడానికి" అని బయటికి దారి తీసేడు.

కాలేజీ బయటికి వచ్చి పక్కనే ఉన్న డొంక దారి వైపు తిరిగేరు. కాలేజీ ఊరి చివరన ఉండడం వల్ల చుట్టూ రకరకాల తుప్పలు మొలిచేయి. అక్కడక్కడా సీతాఫలం మొక్కలు తలలూపుతూ ఉన్నాయి. జూన్ నెల మొదటి వారం కావడంతో వేసవి ఇంకా ప్రతాపం చూపిస్తూనే ఉంది. ఉదయానే ఎండ ముఖానికి చుర్రుమని తగులుతూ ఉంది.

ఫర్లాంగు దూరం నడవగానే సిద్దార్థ గొంతు సవరించుకున్నాడు.

"ప్రభు మీకు ఎలా పరిచయం అన్నారు?"

తన్మయి చెప్పింది.

"కానీ అతనికి మీమీద జన్మజన్మల ప్రేమ ఉంది.తెలుసా? మేలిమి బంగారం, ఇంకేం ఆలోచించనవసరం లేదు. మీరిద్దరూ చాలా అదృష్టవంతులు. మీ ఇలాంటి వారు ఒకరికొకరు దొరకడం చాలా అరుదు." అన్నాడు.

ఆ మాట వింటూనే పొంగిపోయింది తన్మయి.

"మీకెలా కృతజ్ఞతలు చెప్పను?" అంది.

"అతనితో మాట్లాడుతున్నంతసేపు మీతో మాట్లాడుతున్నట్టే అనిపించింది. సరిగ్గా మీలాగే ఆలోచిస్తాడతను. మీలాగే మంచితనం. నాకెందుకో మీరు అతన్ని చేసుకుంటే మీ జీవితం సుఖవంతమవుతుందని అనిపిస్తూంది" అన్నాడు నవ్వుతూ.

"ఇంతకీ ఏం మాట్లాడేరో చెప్పలేదు" అంది తన్మయి చిరునవ్వుతో.

"ఏం లేదు. అతనికి మీ పట్ల ఉన్న ప్రేమని, సీరియస్ నెస్ ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. అంతే" అన్నాడు.

"థాంక్యూ సిద్ధూ!" అంది.

"ఒక్క విషయం మాత్రం స్పష్టత లేదు" అని ఆగేడు.

తన్మయి ప్రశ్నార్థకంగా చూసింది అతని వైపు.

"మీ విషయం అతను వాళ్ల వాళ్లెవరికీ చెప్పినట్టు లేదు. వాళ్లింట్లో అతనికి పెళ్లి సంబంధాలు వెతుకుతున్నట్టు చెప్పేడు."

"మరి?" అంది తన్మయి.

"అతనికి మిమ్మల్నే చేసుకోవాలని ఉంది. కానీ ఎవరూ ఒప్పుకోరనే భయమూ ఉంది. రెంటిలో ఏది బలమైనదో అతను నిర్ణయించుకోవాలి..." అని ఒక్క క్షణం ఆగి, "ఇది పెళ్లితో సర్దుబాటు జరిగే సమస్య కాదు. ఇన్ఫాక్ట్ , పెళ్లితో ప్రారంభమయ్యే సమస్య. కాబట్టి ఎంత బలంగా అతను నిలబడగలడు అన్నది అతనే నిర్ణయించుకోవాలి. మీ వరకూ మీరు చెయ్యగలిగినది అతన్ని నమ్మడం మాత్రమే. అంతా మంచే జరుగుతుందని కోరుకుందాం. " అన్నాడు.

తన్మయి ముభావంగా ఉండడం చూసి "ఏదేమైనా మీరు నిరాశపడవలసినది ఏమీ లేదు. ఏది జరిగినా మీ మంచికే అని ధైర్యంగా ఉండండి. ఇది మీ జీవితంలో గొప్ప మలుపు కావాలన్నదే నా ఆకాంక్ష. మీకు ఎప్పుడు ఏ సహాయం కావాల్సినా నేను చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. సరేనా?" అన్నాడు.

తన్మయి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించింది.

★★★

సాయంత్రం ఇంటికి వచ్చేసినా తన్మయి చెవుల్లో ఒకటే మాట గింగిర్లు తిరుగుతూంది.

"అతనికి పెళ్లి సంబంధాలు వెతుకుతున్నట్టు చెప్పేడు"

ప్రభు ఇన్ని ఉత్తరాలలో ఒక్క సారి కూడా ఈ ప్రస్తావన ఎక్కడా తీసుకురాలేదు. ఎందుకని? తెలిస్తే తను బాధ పడ్తుందనా? చెప్పడం ఇష్టం లేకనా? చెప్పడం ఎందుకనా? లేక కరుణలా ఆలోచిస్తున్నాడా? మరెవర్నో చేసుకుని తనని రెండవ భార్యగా ఉద్ధరించాలనుకున్న కరుణ మాటలు గుర్తుకొచ్చి మనసంతా కంపరంతో కూడిన బాధ మొదలయ్యింది. ప్రభు నుంచి  అటువంటి స్పందన వినడం కాదు, కనీసం ఊహించడం కూడా ఇష్టం లేదు తనకి.అలాంటిది అదే నిజమైతే ఇక జీవితంలో తనెవరినైనా నమ్మగలదా?

తీవ్రమైన దుః ఖ భారంతో కుమిలిపోతూ కళ్లుమూసుకుంది.

"అజ్ఞాత మిత్రమా! నన్ను రక్షించు. నన్ను రక్షించు!!"

## 51

ఆదివారం ఉదయానే తాయిబా "ఏం చేస్తురు మేడమ్?" అంటూ వచ్చింది.

"రా తాయిబా" కూచో అంది తన్మయి.

"బాబు ఈడ మంచిగ అలవాటు పడిండు. బాష మస్తు మాటాడుతుండు, మీ మాట గినుక గిసుంత మారనేలేదు" అంది నవ్వుతూ.

తాయిబా ఎందుకో వచ్చి, ఏదో మాట్లాడుతూందని అర్థమైంది.

"చెప్పు తాయిబా" అంది స్టవ్వు మీద టీ పెడుతూ తన్మయి.

వంటింటి గుమ్మానికి ఆనుకుని నిలబడి, ఏంలే మేడమ్, ఓ మాట చెప్త నీకు. నీ చెల్లె లెక్క అనుకో నన్ను" అంది నానుస్తూ.

"సరే, చెప్పు మరి " అంది నవ్వుతూ తన్మయి.

"ఏంలే,  నువ్వు మళ్లీ పెళ్లి చేసుకో మేడం" అంది నెమ్మదిగా.

తుళ్లిపడింది తన్మయి. 'ప్రభు ఒకట్రెండు సార్లు మొదట్లో రావడం చూసి ఇలా అంటుందా?'

అదేవి పట్టించుకోకుండా "ఒంటరిగ  ఆడమనిసి ఉన్నదంటే ఎవరికైన లోకువే మేడమ్, మా యమ్మ మీద ఆన. ఆ బాదేవిటో నాకు గుడక తెలుసని చెపుతుంటిని. కాలేజీలో ఏమో గుసగుసలు పోతరు మీ గురించి, మీరు పెళ్లి చేసుకుంటె అందరి నోళ్లు మూతపడతయ్యి " అని తన్మయి ముఖంలోకి చూసింది.

"కాలేజీలో తన గురించి గుసగుసలా?" తన్మయికి మనసంతా బాధ అలుముకుంది. కానీ ఎవరా మాటలు అన్నారు? ఎందుకు అన్నారు? వంటి ఆరాలు తీసే కుసంస్కారం లేకపోవడం వల్ల "అనుకోనీ, నేనేవిటో నాకు తెల్సు. అయినా ఎవరి బాధలు వాళ్లకి తప్ప మరొకరికి అర్థం కావు, అయినా నాకు ఇటువంటివి తెలుసుకునే ఆసక్తి లేదు తాయిబా" స్థిరంగా అంది తన్మయి.

"అది పోని తియ్యి మేడం, పెళ్లి సంగతి సూడు" అంది తాయిబా.

"ఏమో తాయిబా, అందరికీ అన్నీ కలిసివస్తాయంటావా?" అని నిట్టూర్చింది తన్మయి.

"కుదుర్సు కోవాలె ప్రయత్నం సేయాలె" అంటూ "మా ఊర్ల ఒకాయన ఉండిండు. నేను అన్న అని పిలుస్త. నెలనాడు ఈడికి వొచ్చి పొయ్యిండు. మొన్న దాక మిలటరీ లో పనిచేసి అచ్చిండు. నిన్ను చూసింది మొదలు పెళ్ళికి అడుగుమని నా దిమాఖ్ తింటుండు. మీ కులమే, డబ్బు మస్తు ఉన్నది ఆడికాడ. నువ్వు పెళ్ళికి ఒప్పుకుంటే ఈ ఊర్ల బిజినెస్ పెట్టుకుని, ఈడనే సెటిల్ అయితనంటుండు" అంది గబగబా తాయిబా.

తన్మయికి అనుకోకుండా బాగా నవ్వొచ్చింది. "తాయిబా తనకు సంబంధాలు చూస్తుందన్నమాట. అతనెవరో తను కనీసం అబ్జర్వ్ కూడా చెయ్యలేదు. ఎవరో తనని చూసి ఇష్టపడడం ఏవిటీ, ఇలా రాయబారం పంపడం ఏవిటి"

తన్మయి నవ్వడం చూసి "ఏం మేడం నడుస్తదా" అంది తాయిబా ఆసక్తిగా ముందుకు వంగి.

తన్మయి తల అడ్డంగా ఊపుతూ "ఉహూ, హఠాత్తుగా నువ్వు ఎవరి గురించో చెప్పేసరికి నవ్వొచ్చింది" అని ఏదో అనే లోపల

"నువ్వు గుడక నచ్చుకుంటే ఇప్పుడే ఫోను చేస్త, రేపీ పాటికి మాట్లాడుకోనీకి వస్తరు" అంది తాయిబా.

తన్మయి దీర్ఘంగా నిట్టూర్చి, "లేదు తాయిబా. పెళ్లి అనేది అంత సులభం కాదు. నాతో సహజీవనం చేసే వ్యక్తి ముందు నా మనస్సుతో సహజీవనం చెయ్యాలి. బొత్తిగా పరిచయం లేని వ్యక్తిని నా పక్కన ఊహించుకోలేను. నా మనస్తత్వం అందుకు సరిపడదు" అంది.

"అదేమంత పని, ఓ సారి మాటాడరాదు మేడం, పెళ్లి జరంత సోచాయించుకున్నాక పెట్టుకుంటాననీ, ముందు దోస్తానా చేస్తననీ చెప్పు, " అంది తేలిగ్గా.

"ఉహూ, నా వల్ల కాదు తాయిబా. ఇలా తొందరపాటు పెళ్లి చేసుకుని, మళ్లీ ఒక పోరాటం చేసే ఓపిక లేదు నాకు" అంది స్థిరంగా.

అప్పుడే వచ్చిన బాబుని ముద్దాడుతూ "గీ పిల్లోన్ని సూడు మేడం, గెంత ముద్దుకొడుతుండో, వీనికోసమైనా నువ్వు జరంత సోచాయించాలె" అంది లేస్తూ.

బాబు వైపు చూసింది తన్మయి. లోకమెరుగని అయిదేళ్ల పసివాడు. దగ్గిరికి తీసుకుని తల నిమిరింది. తను మళ్లీ పెళ్ళి చేసుకుంటే వీణ్ణి ఆ వచ్చేవాడు సరిగా చూడక పోతే! నిజానికి ప్రభు అయినా తన భర్తలా వీడి బాగోగులు చూడగలడేమో కానీ, తండ్రి కాగలడా? బాబు ప్రస్తావన వచ్చినపుడు చాలా తేలిగ్గా, "నాకు సంబంధించినంత వరకు వీడు నీ శరీరంలో భాగం" అన్నాడు. అంటే వేరుగా చూడడనే అర్థం అని అనుకోవాలని సిద్ధార్థ అన్నాడు.

తన్మయి ఆలోచనలో పడింది. ఇదేవీ పట్టని బాబు గలగలా కబుర్లు చెప్పసాగేడు.

★★★

తాయిబా వెళ్లగానే ప్రభుకి ఉత్తరం రాయడం మొదలు పెట్టింది. అసలు ప్రభుకి వాళ్ల వాళ్లు సంబంధాలు చూస్తున్నారన్న విషయం సిద్ధూ చెప్పిన దగ్గర్నుంచీ అన్యమనస్కంగా ఉంది తన్మయి. ఇప్పుడు తాయిబాపెళ్లి సంబంధం మాటలు విన్నాక ప్రభుకి వాళ్ల వాళ్లు పెళ్లి సంబంధాలు చూస్తూండడం లో తను బాధ పడాల్సింది ఏదీ లేదనిపించసాగింది. వయసొచ్చేక అనేక మంది పెళ్లి సంబంధాలు తీసుకు వస్తారు. ఇందులో ప్రభు తప్పేం ఉంది? ప్రభు అటువంటి వాటికి విలువ ఇవ్వనపుడు తనతో అసలు ఈ ప్రసక్తి తీసుకు రావల్సిన అవసరం ఏవుంది? తన పిచ్చి గానీ ప్రభు ప్రేమను

శంకించి దు:ఖ పడడం ఏవిటి? కల్మషం లేని వ్యక్తి మీద నమ్మకం రెట్టింపు అవ్వాల్సింది పోయి, అనవసరమైన అపోహలు పెంచుకుంటూంది తను. కాకపోతే అతను తనకి తెలియకుండా కొన్ని విషయాలు దాస్తున్నాడన్నదే ఎందుకో భరించలేకపోతూంది.

అదే అంది సిద్దార్థతో మర్నాడు.

"ప్రేమ బంధం పెంచుకునే కొలదీ స్వార్థం ఇలాగే ముంచుకొస్తుంది. ప్రేమించిన వ్యక్తి పూర్తిగా తనకే స్వంత కావాలన్న ఆకాంక్ష పెరిగిపోతుంది. ఇలాంటి స్వార్థపు ఆలోచనే విభేదాలకు అంకురార్పణ అవుతుంది" అన్నాడు సిద్దార్థ.

తన్మయి ప్రశ్న పూర్వకంగా చూసింది అతని వైపు.

"ప్రేమించడం అంటే ఏవిటి? ఒక్కసారి ఆలోచించండి తన్మయీ" అన్నాడు సాలోచనగా.

"ఒకరితో ఒకరు కలిసి కాలమంతా హాయిగా గడపాలనుకోవడం" అంది నెమ్మదిగా తన్మయి.

"ప్రేమగా జీవిస్తే ఎటువంటి జీవితం కోరుకుంటున్నారని నేను అడగడం లేదు, ఒక్క సారి ఆలోచించండి, ప్రేమించిన వ్యక్తి సుఖాన్ని కోరుకోవడాన్ని మించిన గొప్ప ప్రేమ ఉందా" అన్నాడు మళ్లీ.

సిద్దార్థ కళ్లల్లో వివేకానందా పాఠశాలలో యోగ సాధన వల్ల, జ్ఞానసముపార్జన వల్ల కలిగిన తేజస్సుతో మురళి సాక్షాత్కారమయ్యేడు. తన్మయి ఒక్క క్షణం కళ్లు నులుముకుంది.

సిద్దార్థ కొంచెం గొంతు సవరించుకుని "ఇంకా కొంచెం వివరంగా చెప్పాలంటే మనం ప్రేమించే వ్యక్తిని హాయిగా, తనకి నచ్చినట్లు స్వేచ్ఛగా ఉండనివ్వడం" అన్నమాట అన్నాడు.

అక్షరాలా నిజం. కానీ అంత గొప్ప మనసు అందరికీ ఉంటుందా? అదే అడిగింది సిద్దార్థని.

"మంచి ప్రశ్న. గొప్ప మనసు అయితేనే నిజమైన ప్రేమ అవుతుంది" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ఒక్కోసారి సిద్దార్థ మాట్లాడుతున్నపుడు జ్ఞానోదయం అయినట్లు అనిపిస్తూ ఉంటూంది.

ఇవన్నీ తనకి తెలిసినవే అయినా ఆ సమయానికి సరిగ్గా ఆలోచించలేక పోతుంది ఒక్కోసారి.

"థాంక్యు సిద్ధూ!" అంది ప్రశంసా పూర్వకంగా.

బదులుగా "ఆల్ ది బెస్ట్" అని తర్వాతి క్లాసుకి బయలుదేరేడు సిద్దార్థ.

★★★

ఆ రోజు ఉదయం లేచిన దగ్గర్నించీ కడుపులో విపరీతమైన నొప్పి ప్రారంభమైంది తన్మయికి. నొప్పి మాత్ర ఒకటి వేసుకుని కాలేజీకి బయలుదేరింది. సగం దూరం కూడా వెళ్లక ముందే మళ్లీ నొప్పి ముంచుకు వచ్చింది. తన్మయికి ప్రకృతి సహజ వైద్యాలంటే ఇష్టం. తప్పనిసరయితే తప్ప మాత్రలు వేసుకునే అలవాటు లేదు.

“ఎందుకింకా నొప్పొస్తూంది? మాత్ర పనిచెయ్యడం లేదా?” ఆలోచనలో ఉండగానే హాస్పిటల్ సందు వచ్చింది.

దాటబోతూ ఉండగా కళ్లు తిరుగుతున్నట్లు అనిపించసాగింది. తనకేదో కాబోతూందని వెంటనే అర్థమై హాస్పిటల్ వైపు బండిని తిప్పింది.

కౌంటరులో తన్మయిని చూస్తూనే "అంతా మంచిగనె ఉన్నదా మేడం" అంది రిసెప్షనిస్టు.

తన్మయి ఏదో చెప్పబోతూ ఉండగానే నొప్పి తీవ్రం కావడంతో కడుపు పట్టుకుని పక్కనే కుర్చీలో కూలబడింది. ఒక్క ఉదుటున లోపలి రూములోకి తీసుకెళ్లేరు. లేడీ డాక్టరు పొత్తి కడుపు మీద అక్కడక్కడా నొక్కి పరీక్ష చేసింది.

"వెంటనే స్కానింగు చెయ్యాలి" అంది మరు నిమిషంలో డాక్టరు నొప్పి తీవ్రత ఎడమవైపని అర్థం కాగానే.

"స్కానింగు కి ఎక్కడికి వెళ్లమంటారు? " అంది బాధ పడ్తూనే తన్మయి.

"మీరెక్కడికీ వెళ్లనవసరం లేదు ఇక్కడే నేనే చేస్తాను. డోంట్ వర్రీ" అంది డాక్టర్.

తన్మయి నొప్పిని అదిమి పెడుతూనే వాచీ చూసుకుంటూ" నేనెంతసేపట్లో వెళ్లొచ్చు డాక్టర్? కాలేజీకి టైం అవుతూంది" అంది.

డాక్టర్ స్కానింగు పూర్తి చేసి గ్లోవ్స్ విప్పుతూ "ఎడమ పక్క ఓవరీ ఇన్ ఫెక్ట్ అయ్యింది. మీరు వెంటనే ఎడ్మిట్ కండి. సర్జరీ చెయ్యాలి" అంది డాక్టర్.

"సర్జరీనా?" ఒక్కసారిగా ఉలిక్కి పడింది తన్మయి.

"అదీ వెంటనేనా? తల్లిదండ్రులిద్దరూ యాత్రల కెళ్లేరు. తను ఆసుపత్రిలో ఉంటే బాబునెవరు చూస్తారు? సర్జరీ తర్వాత తనకెవరు సాయం చేస్తారు? ఇవన్నీ సరే, సర్జరీ సక్సెస్ కాక తనకేవైనా అయితే బాబు సంగతి ఏవిటి?" ఒక్కసారిగా అన్ని ఆలోచనలూ చుట్టుముట్టి వెన్నులో నుంచి వొణుకు పుట్టుకొచ్చింది.

అదే అడిగింది డాక్టరుని.

బదులుగా చిరునవ్వు నవ్వి, "మీరేం కంగారుపడకండి, ఆపరేషను కి సిటీ నుంచి మంచి పేరున్న సర్జను వస్తారు. ఆపరేషను అయ్యేక నాలుగైదు రోజుల్లో ఇంటికి కూడా వెళ్లిపోవచ్చు, తేలికపాటి పనులు చక్కగా చేసుకోవచ్చు" అంది.

అయినా "డాక్టర్, రేపు వచ్చి అడ్మిట్ అవుతాను, ఇవేళ్టికి నొప్పి తగ్గడానికి టేబ్లెట్లు రాసివ్వండి" అంది తన్మయి లేని ధైర్యాన్ని కూడగట్టుకుంటూ.

"సిస్ట్ బాగా ఎన్ లార్జి అయ్యింది, చిన్న కుదుపుకి కూడా అది పగిలిపోవచ్చు. అదే జరిగితే మీ ప్రాణానికే ప్రమాదం వస్తుంది. జాగ్రత్త మరి. ఇప్పటికైతే ఇంజక్షను, టేబ్లెట్స్ ఇస్తున్నాను." అంది డాక్టర్.

డాక్టరు ఎదురుగా తలూపినా, బయటకు వెంటనే వెళ్లే ఓపిక లేక రిసెప్షను లో ఓ మూల కుర్చీలో కూలబడింది.

తనకి ప్రాణాంతకమైన పరిస్థితా? డాక్టరు ఏమీ కాదని చెప్పినా తన్మయికి వొణుకు అధికం కాసాగింది. ముద్దులొలికే బాబు ముఖం ఎదురుగా కదలాడసాగింది. తను లేకపోతే వాణ్ణెవరు చూస్తారు? బాబు పుట్టినపుడు తనకి డెలివరీ అత్యంత కష్టమై, డాక్టరు ఏదో ఒక్క ప్రాణాన్నే కాపాడగలనని చెప్పినపుడు భగవంతుణ్ణి తన ప్రాణం తీసుకుని, బాబుని బ్రతికించమని వేడుకుంది. కానీ ఇప్పుడు వాడు బతకాలంటే తనూ ఉండాల్సిన తప్పనిసరి పరిస్థితి. కళ్లు మూసుకుని "భగవంతుడా! వాడి కాళ్ల మీద వాడు నిలబడే వరకూ నన్ను బతికించి ఉంచు" అని దీనంగా వేడుకోసాగింది.

"తన్మయీ!" గాభరాగా సిద్దార్థ గొంతు వినబడడంతో పక్కకి చూసింది.

తన్మయికి దు:ఖం తన్నుకొచ్చింది.

"సిద్ధూ!" అంది గానీ, గొంతు పెగిలి రాలేదు.

అతికష్టమ్మీద "మీరు.. ఇక్కడ..." అంది.

కాలేజీలో పిల్లలెవరో మిమ్మల్ని హాస్పిటల్ కు వెళ్తూండగా చూసేమని చెప్పేరు. ఉదయం ఇంటి నుంచి మామూలుగానే బయలుదేరి వచ్చారని తాయిబా చెప్పింది.

"లంచ్ టైము అయిపోతున్నా మీరు రాకపోయేసరికి కంగారుపడి వచ్చాను. ఆర్యూ ఆల్ రైట్? ఏమైంది?" అన్నాడు.

అతికష్టమ్మీద గొంతు పెగుల్చుకుని, తన్మయి చెప్పింది విని,

"ఏమీ భయపడకండి, ముందు ధైర్యంగా ఉండండి మీకేం కాదు" అన్నాడు.

తన్మయి మాట్లాడకుండా బేలగా తలూపింది.

"ఎలా? తనకేమైనా అయితే ఎలా?" ఎంత వొద్దనుకున్నా అదే ఆలోచన.

ఇప్పుడే వొస్తానుండండి అంటూ లేచెళ్లి డాక్టరుతో మాట్లాడేడు సిద్దార్థ.

పది నిమిషాల్లో వచ్చి, "నా మాట విని ఇప్పుడే జాయినవ్వండి. నే వెళ్లి తాయిబాను తీసుకొస్తాను.

బాబు గురించి ఏమీ దిగులు పడొద్దు. మీరు కోలుకునే వరకూ నేను, తాయిబా సాయం చేస్తాం." అన్నాడు సిద్దార్థ.

"ఆపరేషనుకి డబ్బులు జాయినింగుకి కొంత, అయ్యేక కొంత, డిశ్చార్జి అయ్యేటపుడు మిగతాది కట్టమన్నారు. మీరేమీ అనుకోకపోతే జాయిన్ కావడం కోసం డబ్బులు నా అకౌంట్ లో నుంచి డ్రా తేసి తేగలరా?" నీరసంగా అంది తన్మయి.

"అవన్నీ నేను పే చేస్తాను. మీరు బాగయ్యాక ఇద్దురు గాని" అన్నాడు.

దేవుడిలా తనని కాపాడుతున్న సిద్దార్థ కు చేతులెత్తి నమస్కరిచింది.

"ప్రతిగా అదేవిటి తన్మయీ, నేను మీ పరిస్థితిలో ఉంటే మీరూ ఇదే చేస్తారు ఖచ్చితంగా. నా గొప్పతనమేమీ లేదు. ముందు ఇదిగో కాస్త ఈ కొబ్బరి నీళ్లు తాగండి. వెళ్లి మీరు అడ్మిట్ కావడానికి ఏర్పాట్లు చేసి వస్తాను" అని లేచేడు.

తన్మయికి తల్లిదండ్రులతో మాట్లాడాలని అనిపించింది. వాళ్లు యాత్రల నుంచి ఇంకా పదిహేను రోజులకు గాని తిరిగి రారు. వాళ్లు రాగానే ఇంటికొచ్చేకనైనా చదువు కుంటారని ఉత్తరం రాయడం మొదలు పెట్టింది.

"ప్రియమైన అమ్మకు, నాన్న గారికి...."

మొదటి వాక్యం రాయగానే దు:ఖం తన్నుకు వచ్చింది.

ఏమని రాయగలదు? తనకు వాళ్లని వెంటనే చూడాలని ఉన్నదనా? ఆపరేషనుకి వెళ్లే ముందు తల్లిని కౌగిలించుకుని చివరి వీడ్కోలు చెప్పాలని ఉన్నదనా? తను తిరిగి రాకపోతే బాబుని వాళ్లే చూస్కోవాలని జాగ్రత్తలు చెప్పాలనా?

చిన్నతనం నించీ తల్లిదండ్రులతో తను ఆనందంగా గడిపిన కాలమంతా కళ్ల ముందు కదలాడింది.

బాగా చిన్న వయసులో ఏదో తీర్థానికి వెళ్లేరు. ఉన్నట్టుండి అమ్మా, నాన్నా కనిపించలేదు. ఏడుస్తూ తిరుగుతున్న తనను రోడ్డు పక్కన అరటి పళ్ల దుకాణం ఆమె చూసి, తన దగ్గిర కూచోబెట్టుకుంది. ఏడవొద్దని, ఎన్ని అరటి పళ్లు కావాలన్నా తినమనీ చెప్పింది. మరో గంటలో గాభరాగా వెతుక్కుంటూ వచ్చిన తల్లిదండ్రులు తనని హత్తుకుని ముద్దుల వర్షం కురిపించడం, అంతలోనే తన ముందు గుట్టగా పడున్న అరటి పళ్ల తొక్కలు చూసి నవ్వుకోవడం జ్ఞాపకం వచ్చింది.

అప్పట్నించీ ఎక్కడికి వెళ్లినా తనని తండ్రి మెడ మీద కూచోబెట్టుకుని నడిచేవాడు. ఎక్కడికెళ్ళినా ఇంటికి రాగానే అమ్మమ్మ నరసమ్మ దిష్టి తీసి లోపలికి తీసుకెళ్లేది. ఒకసారి తనని బళ్లో మేస్టారు కొట్టినపుడు స్కూలు మీదికి గొడవకెళ్లేడు తండ్రి. ఒక్కతే సంతానం కావడం వల్ల తనని కంటికి రెప్పలా పెంచి పెద్ద చేసేరు. తను, శేఖర్ విడిపోయినందుకు మానసికంగా, శారీరకంగా కృంగి పోయేరు. ఏవో చిన్న చిన్న విషయాలు మనసుని బాధించినా అమ్మా, నాన్నలంటే తనకి పంచప్రాణాలు. వాళ్లతో యాత్రలకి వెళ్లక పోవడం గురించి ఎంతో బాధ పడింది కూడా. అయినా ఒక విధంగా తను

వెళ్లకపోవడమే మంచిదయ్యింది. ఇదే నొప్పి మార్గమధ్యంలో అయి ఉంటే అందరికీ కష్టం అయ్యేది. తనకి ఇలా ఎమర్జన్సీ వస్తుందని తనెప్పుడూ కలలో కూడా ఊహించలేదు. ఇప్పుడిప్పుడే జీవితమ్లో స్థిరపడుతున్న తనకి సేవింగ్సూ పెద్దగా లేవు.

ఉద్యోగం వచ్చిన రెండో నెల నుంచీ "మార్గదర్శి తోడుంటే ఆనందం నా వెంటే" అనుకుంటూ చీటీ కట్టడం ప్రారంభించింది.

కాలేజీలో వేస్తున్న చీటీ పాడేసి, బండి కొనుక్కుంది. ఇప్పుడు ఈ ఆపరేషను ఖర్చుకి మార్గదర్శి చీటీ కూడా పాడెయ్యాలిక.

అంత నిర్వేదంలోనూ అప్రయత్నంగా నవ్వొచ్చింది తన్మయికి. ఒక పక్క ఆపరేషనుతో బతికి బట్టకడుతుందో లేదో భయం, అంత లోనే జీవన సమస్యలు.

ప్రభుని వెంటనే చూడాలని ఉంది. తను పెట్టిన సంవత్సరం గడువుకి ఇంకా రెండు నెలలు ఉన్నాయి. కానీ తన స్వార్థం కోసం ఇప్పుడతన్ని గడువు గురించి అంతా మర్చిపోయి రమ్మనడం సబబేనా?

ఏం చెయ్యాల్లో అర్థం కాని ఆలోచనలు బుర్ర దొలుస్తూ ఉన్నాయి.

చివరికి ఏదయితే అయ్యిందని ప్రభుకి ఉత్తరం రాసింది. కాలేజీ ప్రిన్సిపాలు గారికి మెడికల్ లీవు అభ్యర్థనతో సెలవు చీటీ రాసింది.

వనజ, మురళి, వెంకట్, మేరీ, యూనివర్శిటీ మాస్టారు జ్ఞాపకం వచ్చేరు. తనకేమైనా అయితే వాళ్లకి ఎలా తెలుస్తుంది? కాగితం తీసుకుని వాళ్ల పేర్లు, అడ్రసులు రాయసాగింది.

తాయిబా ఒక్క పరుగున వచ్చినట్లు ఒగురుస్తూ "అరే మేడం, సారు చెప్పగనె మస్తు పరేషానయ్యింది. జల్దీ ఉరికొచ్చిన, నువ్వీడ సక్కగ కూసొని రాస్తున్నవ? ఇగో అన్నీ బంద్ జేసి మంచిగ పండుకో, బాబు గురించి పరేషాని గాకు, నే జూస్త" అని పక్కన కూర్చుని చెయ్యి నిమిరింది.

52

"తెల్లారి ఆరుగంటలకి ఆపరేషను. ఇవేళ్టి రాత్రి పెందరాళే భోజనం చేసెయ్యాలి. తర్వాత ఇక ఏమీ తినకూడదు, తాగకూడదు." అంది నర్సు.

అసలే కడుపు నొప్పితో బాధ పడ్తున్న తన్మయి ఉదయం టిఫిను తర్వాత ఏమీ తినలేదు. నీరసంగా తలూపింది.

తను ఇలా బెడ్డు మీద పడుకుని ఉంటే "రాత్రికి తనకి భోజనం ఎవరు పెడతారు?"

సిద్దార్థ పొద్దుటే ఆపరేషను టైముకి వచ్చి కాలేజీకి వెళ్తానన్నాడు కాబట్టి సాయంత్రం త్వరగా ఇంటికి వెళ్లమని పంపించింది. తాయిబా బాబుని చూడడమే తనకి చాలా గొప్ప సహాయం. ఇంకా తనని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు. తల్లీతండ్రీ యాత్రల్లో ఉన్నారు. మొదటిసారి తనెంత ఒంటరిదో అర్థం అయ్యింది తన్మయికి. జీవితంలో అన్నిటికన్నా పెద్దదైన, రాకూడని కష్టం వచ్చింది. అప్పటివరకూ ఉన్న ధైర్యం, ఏదైనా పరిష్కరించుకోగలిగిన ధీరత్వం ఒక్కరోజులో మాయమైపోయాయి. ఎవరిమీదా ఎప్పుడూ ఆధారపడకూడదనే నమ్మకం సడలిపోయి దీనురాలిగా పడి ఉంది ఇప్పుడు.

హాస్పిటల్ గదిలో వెల్లకిలా పడుకుని తిరుగుతున్న సీలింగ్ ఫాను వైపు చూస్తూ "మిత్రమా! నాకెందుకీ పరీక్ష?" నన్ను ఎవరు ఆదుకుంటారు?" అంది జీరబోయిన గొంతుతో.

ఫానులాగే లోపల్లోపల అయోమయత్వం దుఃఖంగా సుళ్ళు తిరుగుతోంది. "ఈ ప్రపంచంలో ఒంటరిగా ప్రవేశించిన మనిషి ఒంటరిగానే నిష్క్రమించాలి. కానీ జీవన పర్యంతం ఒంటరితనాన్ని ఎలా అధిగమించాలి? ఇలాంటి కష్ట పరిస్థితుల్లో తనకంటూ ఒకరుండి ఉంటే ఎంత బావుండేది? తనెంత దురదృష్టవంతురాలు!" ఆగకుండా కన్నీళ్లు ధారాపాతంగా మున్చెత్తసాగేయి.

"ఈ రాత్రి తర్వాత తనకి ఏమవుతుందో కూడా తనకి తెలీదు. తను ఆపరేషను తర్వాత అసలు బతికుంటుందో, లేదో కూడా తెలియదు. ఇక భోజనం సంగతి అప్రస్తుతం." నిస్త్రాణగా కళ్లు మూసుకుని ప్రార్థించసాగింది.

"భగవంతుడా! తండ్రీ!! నా సర్వస్వం నా ఒక్కగానొక్క కొడుకు మాత్రమే. నేనే ఆధారమైన ఆ పసివాడిని దయచేసి శిక్షించకు. వాడిని ప్రయోజకుడిని చేసే వరకూ నాకు బతికుండే అవకాశాన్ని కలిగించు. నన్నీ కష్టం నుంచి కాపాడు"

"ఏంది మేడం, ఏడుస్తుండావా, సాలు తియ్యి. నే లేనా? ఇగో, నీ కోసం భోజనం తెచ్చిన, లెవ్వు" తాయిబా దగ్గిరికి వచ్చి చప్పున కళ్లు తుడిచింది. వెనకే బాబు పరుగెత్తుకొచ్చేడు.

ఆ క్షణాన తాయిబా సాక్షాత్తూ భగవంతుడే అని అనిపించి చేతులెత్తి నమస్కరించింది.

అదేమీ పట్టించుకోని తాయిబా "అమ్మ దావఖానల ఉన్నదనగానే ఉరికినాడు బిడ్డ" అంది బాబు వీపు రాస్తూ.

ఒక్క ఉదుటున బాబుని మంచమ్మీదికి తీసుకుని హత్తుకుంది తన్మయి. వాడి చిన్ని చేతుల మధ్య నిశ్చింతగా అనిపించి కళ్లు మూసుకుంది.

"ఇంటికి వెళ్లిపోదాం దామ్మా" అన్నాడు చెయ్యి పట్టుకుని లాగుతూ.

"రేపు వెళ్ళిపోదాం. నేనివేళ ఇక్కడే ఉండాలి. నువ్వు తాయిబా దగ్గిర ఉండు నాన్నా ఇవేళ" అంది ముద్దులు కురిపిస్తూ.

"ఉహూ" అని తల అడ్డంగా ఆడించేడు.

తాయిబా కల్పించుకుని "ఉంటడులే, నువ్వు పరేషాన్ గాకు, టీవీ పెడతగా. ఉంటడు" అని భోజనం వడ్డించింది.

తన్మయి తినే ఒక్కొక్క ముద్దలో అమృతం ఉన్నట్టు కష్టాన్ని అవలీలగా గట్టెక్కగల ధైర్యం కలగసాగింది.

"తాయిబాకి ఏమిచ్చి ఈ ఋణం తీర్చుకోగలదు?"

అదే అంది.

"ఊకో మేడం, నీ అంత పెద్ద మాటలు నాకు రావు. నా సిన్నతనంల గరీబోల్లమైనా, మా అమ్మా, బాపు కాయకష్టం సేసెటోళ్లయినా సుట్టూ అందరికీ సాయంసేసుడే. నీకు ఇన్నినాళ్ళకి బుక్కెడు బువ్వ తినబెట్టే అదురుష్టం నాకు కలిగింది" అంది చిన్నగా నవ్వి.

సంతృప్తిగా తిన్న తన్మయిని ఆనందంగా చూసింది తాయిబా.

విశాఖపట్నంలో మూత్రపిండాల మార్పిడి లోఅరుదైన రక్తం అవసరమైన వ్యక్తికి తను రక్తదానం చేసినప్పుడు అతని కళ్లల్లో కనిపించిన అత్యంత కృతజ్ఞతాభావం, ఆ వ్యక్తి ప్రాణం నిలబడ్డప్పుడు తనకి కలిగిన ఆనందం జ్ఞాపకం వచ్చింది తన్మయికి. జీవితంలో సహాయం పొందిన క్షణాలు ఎప్పుడూ మరిచిపోకూడదని తీర్మానమూ, కష్టంలో ఉన్న ఎవరికైనా నిస్వార్థసేవ చెయ్యడమే ఇక తన జీవన పరమార్థమని నిర్ణయమూ చేసుకుంది తన్మయి.

---------

ఆ రాత్రి ఆసుపత్రిలో క్షణం నిద్దర లేకుండా గడిచింది తన్మయికి. చుట్టూ స్పిరిట్ వాసన, పక్క గదుల్లోంచి బాధా పూరిత మూలుగులు, చంటిబిడ్డల ఏడుపులు, వరండాలో వచ్చి పోయే జనాల చప్పుళ్లు. నొప్పికి ఇంజక్షను ఇచ్చినా కొత్త ప్రదేశం కావడం వల్ల గాభరాగా, అస్థిమితంగా ఉంది.

తెల్లారగట్ల నర్సు వచ్చి లేపింది.

ఉరిశిక్ష పడ్డ ఖైదీ ఆలోచనల్లా అల్లకల్లోలంగా తెల్లవారింది ఆ రోజు. మనస్సుని అతికష్టమ్మీద ఉగ్గబట్టుకుని ధైర్యం చెప్పుకోసాగింది తన్మయి.

నర్సు టెంపరేచర్, బి.పి ల వంటివి చెక్ చేసి “అటు తిరుగు ఎనీమా చెయ్యాలె” అంది.

అదేవిటో తన్మయికి అర్థం అయ్యేలోపలే కడుపులో సుళ్లు తిరగడం ప్రారంభం అయ్యింది. అసలే కడుపు నొప్పికి నిన్నటి నుంచి చాలా సార్లు వెళ్లాల్సి వచ్చింది. తన్మయికి నీరసం వచ్చేసింది. పైగా కాసిన్ని మంచినీళ్లడిగినా కుదరదని కఠినంగా చెప్పింది నర్సు.

అంతలోనే ఏమనుకుందో “ఆపరేషను అయినంక మర్రోజు వరకి ఒంటికి, రొంటికి పోరాదు. కడుపు కాళీ ఉండాలె. ఇగో అంతగ అయితె గొంతు తడుపుకో” అని ఒక స్పూను, గ్లాసులో సగానికి నీళ్లు తెచ్చి పెట్టింది.

మరో గంటలో థియేటర్ లోకి తీసుకెళ్లి పడుకోబెట్టేరు. బల్లమీద వెల్లకిలా పడుకున్న తన ముఖంమీదికి  ఉన్న లైటు వైపు చూడలేక కళ్లు మూసుకుంది. సిటీ నుంచి వచ్చిన సర్జను, ఎనస్థీషియన్ లను తోడు తీసుకుని డాక్టర్ వచ్చింది.

“ఏం మేడం, హౌఆర్యూ” అని పలకరిస్తూనే వెన్నుకి ఇవ్వబోయే ఎనస్థీషియా ఇంజక్షను గురించి వివరించింది.

పక్కకి తిరిగిన వెన్నులో గట్టిగా సూది గుచ్చుకున్నపుడు పళ్ల బిగువున బాధని అతికష్టమ్మీద అదిమిపెడుతూ “అమ్మా....” అని అరిచింది తన్మయి.

క్షణంలో కళ్లు మూతలు పడడం వరకే గుర్తుంది తన్మయికి.

---------

తన్మయి కళ్లు తెరిచే సరికి గదిలో తిరుగుతున్న  ఫ్యాను గట్టిగా శబ్దం చేస్తూ మీద పడుతున్న భ్రాంతి కలిగింది.

మంచం మీంచి కిందికి ఎవరో తోస్తున్నట్టు “అయ్యో, అయ్యో...." అని అరవసాగింది.

ప్రభు చప్పున చెయ్యి పట్టుకుని “ఎలా ఉంది” అన్నాడు.

హఠాత్తుగా ప్రభు కనిపించేసరికి "తను కలలో ఉందా" అన్న అనుమానం వచ్చింది.

కానీ స్పర్శ నిజమనిపిస్తోంది.

ప్రభు చేతిని గట్టిగా పట్టుకుని “ప్రభూ! వెళ్లొద్దు, నన్నొదిలి ఎక్కడికీ వెళ్లొద్దు”  అనసాగింది.

“ఎక్కడికీ వెళ్లను, సరేనా” అన్నాడు ఇంకాస్త దృఢంగా చేతిని పట్టుకుని.

అంతలోనే నిద్ర ఆవహించింది తన్మయికి.  తన్మయి చేతిని తన చేతిలోకి తీసుకుని అలాగే కూచున్నాడు ప్రభు. తన్మయికి మెలకువ వచ్చినపుడల్లా ధైర్యపు స్పర్శతో మెల్లగా నిమిరసాగేడు.  తన్మయికి నడుము నించి కింది భాగమంతా చలనం కోల్పోయి అంతా చచ్చుబడినట్లు ఉంది. సెడేషన్ వల్ల నాలుకంతా పిడచకట్టుకుపోయి దాహం బాగా వెయ్యసాగింది.

“ప్రభు...ప్రభు....వచ్చేవా..నాకోసం వచ్చేవా?”  మనసులోనే మాట్లాడసాగింది.

“నీతో ఎన్నో మాట్లాడాలనుంది. నిన్ను కౌగిలించుకుని మనసారా దు:ఖించాలని ఉంది. ప్రభూ! నా చేతిని ఎప్పుడూ వదలొద్దు. ఇంకెప్పుడూ ఎక్కడికీ వెళ్లొద్దు. ఈ దీనురాల్ని ఇలా దుస్థితిలో వదిలి ఎక్కడికీ వెళ్లొద్దు”

మనసులో సుళ్ళు తిరుగుతున్న ఏవేవోబాధల్ని అదిమిపట్టి పైకి మెల్లగా "దాహం" అని మాత్రం అనగలిగింది.

ప్రభు చప్పున పరుగెత్తి నర్సుని పిలుచుకు వచ్చేడు.

"అరే, చేతికి సెలైను ఎక్కుతుండె కదమ్మా, నీకు నీళ్లు అవసరం లే, ఊరికె గట్లనె అనిపిస్తది. నీళ్లు తాగినవంటె వాంతి గట్ల అయితది మరి సూడు" అంది.

అయినా దాహం భరించడం చాలా కష్టం గా ఉంది. పెదాలు తడుపుకుందామంటే కాస్త తడి కూడా తగలడం లేదు.

మళ్లీ "దాహం...దాహం" అంది.

నర్సు అటు వెళ్లగానే, తన్మయి అవస్థ చూడలేక ప్రభు చిన్న కాటన్ తీసుకుని వచ్చి తడిపి పెదాల మీద రెండు చుక్కలతో అద్దేడు.

కాస్త ప్రాణం లేచొచ్చింది తన్మయికి.

తన చేతిని పట్టుకున్న ప్రభుని చూసి కృతజ్ఞతతో కళ్లు నిండి అప్రయత్నంగా కన్నీళ్లు ధారాపాతంగా రాసాగేయి తన్మయికి.

"ఉష్...." అంటూ దగ్గిరగా జరిగి, తల నిమురుతూ అనునయంగా, "తనూ! నువ్విలాంటప్పుడు ఏడొవొచ్చా? నేనున్నానుగా. ఏవీ బెంగ పడకు. ఆపరేషను సక్సెస్ ఫుల్ గా అయిందని చెప్పేరు డాక్టరు, నాలుగు రోజుల్లో నువ్వు చక్కగా లేచి నడిచి నీ పనులు నువ్వు చేసుకోగలవని కూడా చెప్పేరు. ఇక ఏవీ భయం లేదు. ధైర్యంగా ఉండాలమ్మా, సరేనా?" అన్నాడు ముందుకు వంగి చిన్న పిల్లతో చెపుతున్నట్టు లాలనగా.

తన్మయికి తండ్రి జ్ఞాపకం వచ్చేడు. దాదాపు ఏడేళ్ల వయసులో తనకి తేలు కుట్టినపుడు తండ్రి తనని భుజాన వేసుకుని మంత్రగాడి దగ్గిరకి పెట్టిన పరుగు ఇప్పటికీ గుర్తుంది. ఉల్లిపాయ చితక్కొట్టి, పసుపు రాసి..ఏం చేసినా తగ్గని నొప్పికి గిలగిల్లాడుతూ తను పెట్టిన ఏడుపు చూళ్లేక, తండ్రి తన పక్కనే జాగారం కూచుని కంట తడి పెట్టడం గుర్తొచ్చింది.

కాస్సేపట్లో అప్పుడప్పుడే మత్తు విడూతుండగా వెల్లకిలా పడుకోలేక నడుం లాగేయడం మొదలయ్యింది. పక్కకు తిరిగి పడుకోవాలని అనిపించసాగింది.

నర్సు వచ్చి మళ్లీ మందలించింది. "అరే ఆ మూల కెళ్లి ఈడి దాక కుట్లు పడ్డయ్యి, పక్కకి గెట్ల తిరుగుతవమ్మ? నువ్వు పరేషాన్ అయ్యి మమ్మల్ని పరేషాని బెట్టకు"

తన్మయి నిస్సహాయంగా గది సీలింగు వైపు చూస్తూ ఉండి పోయింది.

నర్సు వెనకే వెళ్లొచ్చి నిట్టూర్చేడు ప్రభు "నేనేమైనా సాయం చెయ్యగలనేమో అనుకున్నాను. కానీ పేషంట్ పక్కకు తిరిగి పడుకుంటే రక్తప్రసరణ పక్కకు అయ్యి కుట్లలోంచి రక్తం పక్కకు బయటకు వచ్చే ప్రమాదం ఉందట. "కొంచెం ఓర్చుకో ప్లీజ్" అన్నాడు బతిమాలాడుతున్నట్లు.

తన్మయి కళ్లల్లోంచి బాధ తట్టుకోలేక నీళ్లొచ్చేయి. ఏవేవో చెప్పాలనుంది ప్రభుకి. తన బాధలన్నీ ఏకరువు పెట్టాలనుంది. మత్తు ఆవరిస్తూ నిద్రపోతూ, అంతలోనే కళ్ళుతెరుస్తూ భ్రాంతిమయ క్షణాలలో ఏదో అర్థంలేని శబ్దాలు చెయ్యసాగింది.

-----------

సాయంత్రం అయ్యేసరికి నెమ్మదిగా మత్తు విడి క్రమంగా కుట్లు నొప్పి తెలియసాగింది. ఎవరో తన శరీరాన్ని రెండు ముక్కలు చేసి మళ్లీ జత చేసినట్లు చర్మం పీకెయ్యసాగింది.

ప్రభు మళ్లీ పరుగెత్తేడు నర్సు కోసం.

నొప్పి తగ్గడానికి ఇచ్చిన ఇంజక్షన్ క్రమంగా పనిచేస్తూనే నిద్రలోకి జారిపోయింది తన్మయి. నిద్రలో శేఖర్ పక్కనే కూచుని సేవలు చేస్తూ ఉన్నట్లు కలగంది. కళ్లు తెరుస్తూనే ఈ సారి పూర్తిగా మెలకువ వచ్చినట్లనిపించింది. చుట్టూ అన్నీ అర్థం కాసాగేయి. తన కలకు అర్థమేమిటా అని ఆలోచించింది. బహుశా: ప్రభులాగా శేఖర్ తనని చూసుకుని ఉండి ఉంటే బావుణ్ణని తను కోరుకుంటూoదన్న మాట. లేకపోతే శేఖర్ తన కలలోకి అంత మంచివాడుగా రావడమేమిటి?

తన్మయి కళ్లు తెరవగానే "ఎలా ఉందిరా" అన్నాడు ప్రభు ఆత్రంగా దగ్గరకు వచ్చి.

పొద్దుట్నించి పాపం బాగా అలిసిపోయేడు ప్రభు. అతని ముఖమంతా అలసటతో వాడిపోయింది.

ఆ పలకరింపులోని ఆత్మీయత, ఆప్యాయత తన్మయికి అత్యద్భుత వరాలలా వినిపించాయి.

"చాలు మిత్రమా! ఈ జన్మకిది చాలు" అనుకుంది మనస్సులో.

"నువ్వెప్పుడు వచ్చేవు? నీకెప్పుడు తెలిసింది?" అంది మెల్లిగా.

"ఉష్...అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు ఇంకా తల నిమురుతూ.

"ఇంటికి వెళ్లి కాస్సేపు రెస్టు తీసుకో, తాళాలు పర్సులో ఉన్నాయి" అంది మెల్లిగా.

"ఫర్వాలేదు, నువ్వు నా గురించి దిగులు పడకు. ఆఫీస్ కి రెండు రోజులు సెలవు పెట్టాను. నువ్వు పూర్తిగా కోలుకునే వరకూ ఇక్కడి నుండే ఆఫీస్ కు వెళ్లొస్తాను." అన్నాడు స్థిరంగా.

తన్మయి కృతజ్ఞతగా తలూపింది.

"కనీసం కాస్త టీ అయినా తాగి రా, బాగా అలిసిపోయేవు" అంది నీరసమైన గొంతుతో.

ప్రభు అలా వెళ్లగానే కాలేజీ నుంచి స్టాఫ్, పిల్లలు వచ్చేరు.

"అయిదు నిమిషాల్లో అంతా పొవ్వాలె, పేషంటుకి గాలి ఆడాలె" నర్సు గదమాయించడంతో పిల్లలు బయటే ఆగిపోయి గుమ్మం దగ్గిర గుమిగూడారు.

తన మంచికోరే ఇందరు మనుషులు తనచుట్టూ ఉన్నారన్న విషయం తన్మయికి అత్యంత ఆనందాన్ని ఇచ్చింది. అంతా వెళ్లేక, సిద్దార్థ ప్రభు వచ్చే వరకూ ఉండి వెళ్లేడు.

సిద్దార్థ ని చూస్తూనే "చాలా థాంక్సండీ, సమయానికి మీరు ఫోను చెయ్యకపోతే నాకు తెలిసేది కాదు" అన్నాడు ప్రభు.

"అయ్యో, ఇందులో మీరు థాంక్స్ చెప్పాల్సింది ఏముంది? మీరు దగ్గరుంటే తన్మయి త్వరగా కోలుకోగలదు" అన్నాడు చిన్నగా నవ్వుతూ సిద్దార్థ.

"తప్పకుండా" అన్నాడు ప్రభు.

సిద్దార్థ వైపు చూసి నమస్కరించి "థాంక్యూ సో మచ్" అంది తన్మయి. పాపం పొద్దున్న ఆపరేషను థియేటర్ లోకి తను వెళ్లే అయిదు నిమిషాల ముందు పరుగున వచ్చేడు. ముందు రోజు ఎంతో సాయం చేసేడు.

"మీరు త్వరగా కోలుకోండి, అంతే చాలు. ఈ ఆదివారం మా మిసెస్ ని తీసుకుని వస్తాను. మీకు కొంచెం సాయంగా ఉంటుంది" అన్నాడు.

"అయ్యో ఫర్వాలేదు, ఆవిడని ఇబ్బందిపెట్టకండి" అంది తన్మయి

బాబు స్కూలు నించి రాగానే తాయిబా తీసుకుని వచ్చింది. అసలేమవుతుందో తెలియక ఏడుపు ముఖం పెట్టుకుని దగ్గిరికి వచ్చేడు.

తన్మయి బాబు తల నిమిరి, "భయం లేదు నాన్నా! నాకేమీ కాలేదు" అంది.

"నువ్వేం పరేషాన్ గాకు మేడం. అల్లా మనతో ఉన్నాడు. బాబు గురించి ఫికర్ చెయ్యకు. మంచిగ ఉంటుండు. నీకు జల్దీ నయం గావాలని ఇగో ఇది తెచ్చిన" అని రహస్యంగా పమిట కింద నుంచి తాయెత్తు తీసి చేతికి కట్టింది.

“తను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఇది!” అనిపించింది తన్మయికి "తన చుట్టూ తనని ప్రేమించే ఇందరు మనుష్యులు! ప్రభు, సిద్ధార్థ, తాయిబా ...తను వీళ్ళకేమిచ్చి ఋణం తీర్చుకోగలదు? వీళ్లంతా లేకపోతే ఇలాంటి పరిస్థితుల్లో తనేం చెయ్యగలదు?"

నిస్త్రాణగా మూసుకున్న కళ్ళ ముందు మొత్తం జీవితం గిర్రున తిరుగాడింది.

"ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చింది తన జీవితం!

ఒక చిన్న పల్లెటూరులో పుట్టి, తల్లిదండ్రులకి ఒక్కత్తే సంతానంగా అపురూపంగా, తనదైన ప్రపంచంలో అత్యంత భావుకురాలిగా పెరిగి భావి జీవితం గురించి ఎన్నో కలలతో మొదలయ్యింది తన ప్రస్థానం!

శేఖర్ ఛిద్రం చేసిన జీవితాన్ని చదువు ఆదుకుని, అక్కున చేర్చుకుని తనని ఉన్నత స్థానంలో నిలబెట్టింది. పెళ్లి, ఆశయాలు ఒక ఒరలో ఇమడని అత్యంత సంక్లిష్టమైన జీవితాన్ని దాటుకుని వచ్చింది. ఇప్పుడు శరీరానికే కష్టం వచ్చింది. అయినా తను మనో ధైర్యంతో తట్టుకుని, దాటుకుని వెళ్తుంది. దేనికీ భయపడకూడదు. ఈ కష్టమూ ఓర్చుకుని గట్టెక్కాలి. అవును, గట్టెక్కాలి. " మనస్సులో దృఢంగా అనుకుంది తన్మయి.

గట్టిగా నిట్టూర్చ బోయి ఆగిపోయింది. కనీసం దగ్గడానికి కూడా కుదరడం లేదు. కుట్లన్నీ పీకేసినట్లు నొప్పి. ఇక తుమ్ము వచ్చిందంటే ప్రాణం పోయినట్లే. అందుకే పేషంట్ల కి ఇతర అనారోగ్యాలు చుట్టుముట్టకుండా చూసుకుంటూ ఉంటారు హాస్పిటల్ సిబ్బంది.

కళ్లు తెరిచి మళ్లీ మూసుకుంది. తల్చుకున్నపుడల్లా ముల్లులా గుచ్చుకుంటుంది గతం. త్రోవ పొడవునా తనకి ఎదురైన మంచి మనుషులు మాత్రమే తనకున్న ఆస్తిపాస్తులు. అయినా గతాన్ని పక్కకు నెట్టి, బాబు భవిష్యత్తు కోసం తను ధైర్యంగా అన్నిటినీ తట్టుకుని నిలబడాలి.

దేనికీ భయపడకూడదు. ఈ కష్టమూ ఓర్చుకుని గట్టెక్కాలి. అవును, గట్టెక్కాలి! పక్కనే ఉన్న బాబు చేతిని గట్టిగా పట్టుకుంది. తల్లి బాధను అర్థం చేసుకున్న వాడిలా చేతిని నిమిరేడు. ఆ క్షణంలో వాడు తన కడుపున పుట్టిన చిట్టి తండ్రిలా కాక, తనను కన్న తండ్రి లా అనిపించాడు!

“అమ్మా, నాన్నా ఎప్పుడొస్తారో” యథాలాపంగా పైకే అంది.

అప్పుడే లోపలికి వస్తున్న ప్రభు వెంటనే “ఫోను ప్రయత్నించేను. కానీ ఇంకా యాత్రల నించి వచ్చినట్లు లేరు” అన్నాడు.

\-\-\-\-\-\-\-\-

అనారోగ్యమే జీవితంలో అన్నిటికన్నా పెద్ద కష్టమని మొదటిసారి తెలిసొచ్చింది తన్మయికి. పాపం తాయిబా ఆఫీసు మాని బాబుని చూస్తూ, పైగా తన కోసం ప్రత్యేకంగా పథ్యం వండి పట్టుకు రాసాగింది. ఇక ప్రభు అన్నీ మాని తనతోనే హాస్పిటల్లో ఉంటానని పట్టుబట్టినా తన్మయి వారించి బలవంతంగా ఆఫీసుకి వెళ్లమని పంపించింది. అయినా రోజూ సాయంత్రం అంత దూరం నుంచి వచ్చి తను నిద్రపోయేక వెళ్లసాగేడు.

రెండో రోజే లేపి కూచోబెట్టి, మూడో రోజు నించే లేచి నడవడానికి ప్రయత్నించమని చెప్పింది డాక్టరు. మొదటి రెండడుగులు అతికష్టం అనిపించినా మెల్లగా బిగబట్టిన చర్మంతో అడుగులు వెయ్యడానికి అలవాటు పడింది తన్మయి. పగలల్లా మంచంమీద పడుకుని ఉండడానికి బోరుగా అనిపించసాగింది. పక్క గదుల్లోని పేషెంట్లని పలకరించసాగింది.

ఒక పేషెంట్ కూడా ఉన్నామె “మీగదిలో ఎవరికి ఆపరేషనయ్యింది?” అనడిగింది కూడా.

తనే పేషెంట్ అని తెలిసి ఆమె ఆశ్చర్యం చూడాలి!

\-\-\-\-\-\-\-

అనుకున్నదానికంటే వేగంగా తన్మయి కోలుకోవడంతో నాలుగో రోజునే డిశ్చార్జి చేసింది డాక్టరు. వేసుకోవాల్సిన మందుల కట్ట చూసి దిగులు పట్టుకుంది తన్మయికి. తనకస్సలు మందులు మింగడం ఇష్టం ఉండదు. పైగా ఒక్కొక్క మాత్రా పెద్ద పెద్ద చిక్కుడు గింజల్లా ఉన్నాయి. ఒకపట్టాన మింగుడు పడడం కష్టమే.

ఇంటికి వచ్చిన మధ్యాహ్నానికి తల్లీతండ్రీ వచ్చేరు.

"అయ్యో! పాడు యాత్రలకి ఇప్పుడే వెళ్ళాలా మేం" అంటూ జ్యోతి కూతుర్ని కౌగిలించుకుని భోరుమంది.

భానుమూర్తి కూతురి తల నిమిరి "భయపడకు తల్లీ! మేం వచ్చేవు గా" అన్నాడు.

బాబు ఆత్రంగా తాతయ్యను, అమ్మమ్మను హత్తుకున్నాడు.

"అయ్యో పిల్లాడు భయపడిపోయి, డీలాపడిపోయేడు" అని జ్యోతి వాణ్ణి భుజాన వేసుకుని వెన్ను నిమిరింది.

తల్లిదండ్రుల్ని చూడగానే తన్మయికి నిశ్చింతగా అనిపించింది. నాలుగురోజులు ముందు వాళ్లకి తెలిసి ఉంటే ఎంతో బావుండేది కదా అనిపించింది.

"రాత్రే ఊరినించి వచ్చాము. ఎవరో ప్రభు అటమ్మా, నీతో చదువుకున్నాడట. ఫోను చేసి చెప్పేడు" అంది జ్యోతి.

తల్లి ప్రభు గురించి ఇంకేమైనా వివరాలు అడుగుతుందేమోనని సందేహంతో తన్మయి మాట మార్చి, "యాత్రలెలా జరిగేయమ్మా" అంది.

"ఇన్నాళ్ళకి అనుకున్న ప్రదేశాలన్నీ చూసి రాగలిగేం. అంతా భగవంతుడి దయ. ఏ కష్టం లేకుండా నెల రోజులు తిరగగలిగేం. కానీ మీనాన్నగారికే కాళ్లు బాగా వాచిపోయాయి పాపం. ఎక్కడివక్కడ పడేసి నీ గురించి వినగానే ఫస్టు రైలు పట్టుకుని వచ్చేసేం. మా మాటకేం గానీ అసలేం జరిగిందమ్మా, ఉన్నట్టుండి ఈ ఆపరేషనేవిటి?" అంది జ్యోతి.

53

తల్లిదండ్రుల్ని చూడగానే తన్మయికి పూర్తిగా ధైర్యం వచ్చింది. బాబు కూడా సంతోషంగా గంతులు వేసేడు. ఆపరేషను అయ్యి వారం రోజులే అయినా తనంతట తనుగా లేచి చిన్న చిన్న పనులు చేసుకోసాగింది తన్మయి.

"జాగ్రత్తమ్మా, కింద కూర్చోవడం, బరువులు ఎత్తడం లాంటివి అస్సలు చెయ్యద్దు" అని వారించింది జ్యోతి.

"వీళ్లు వచ్చిన సంగతి ప్రభుకు ఎలా తెలియజెయ్యాలి? బయటికెళ్లి ప్రభు ఆఫీసుకి ఫోను చేసొద్దామంటే ఇంకా అప్పుడే బయట నడవగలిగే ఓపిక ఇంకా రాలేదని అనిపిస్తూంది" ఆలోచిస్తూ

పొద్దున్నే కాలేజీకి బయలుదేరుతున్న తాయిబాని రహస్యంగా పిలిచి , "సిద్ధార్థ సారుకు లెటర్ ఇవ్వు" అని కాగితం మడిచి చేతిలో పెట్టింది.

వెనక్కి తిరగగానే తల్లి ఎదురు పడే సరికి, "ఏం లేదు, కాలేజీకి లీవు లెటరు" అంది కొంచెం తడబాటుగా.

"నేనేమీ అడగలేదే" అంది జ్యోతి.

తల్లిదండ్రులు వచ్చిన సంగతి ప్రభుకు ఫోనుచేసి చెప్పమని సిద్ధార్థకు రిక్వెస్టు లెటరది. తన్మయికి ఒక పక్క ప్రభు వస్తే తల్లిదండ్రులకు ఏం సమాధానం చెప్పాలోనన్న ఆతృత, మరో పక్క అతను రాకపోతే ఎలా అన్న దిగులు ఒకేసారి కలిగి కలవరంగా అనిపించసాగింది. ముఖం నిండా చెమట్లు పడుతూ అస్థిమితంగా ఉన్న కూతుర్ని చూసి, "ఏమైందమ్మా!" అన్నాడు భానుమూర్తి. తండ్రి ప్రేమగా అడిగేసరికి భోరున ఏడ్చింది తన్మయి.

"అయ్యో, అయ్యో ఆపరేషను అయ్యి పదిరోజులు కూడా కాని పిల్లవి ఇలా ఏడవొచ్చా?" అంది తల్లి గాభరాగా.

"ఏమని చెప్పాలి? చెప్పినా ప్రభుకు, తనకు మధ్య పెరిగిన ఆత్మీయతానురాగాలు హర్షిస్తారా? అసలు ఒప్పుకుంటారా?" చెప్పడానికి ధైర్యం చాలక కళ్లొత్తుకుంటూ, కిందికి చూస్తూ ఉండిపోయింది తన్మయి.

"ప్రశాంతంగా కాస్త తిని నిద్రపోమ్మా, అనవసరమైన ఆలోచనలు పెట్టుకోకు. అమ్మా, నేను నీకు తగ్గే వరకూ ఉంటాంగా" అన్నాడు భానుమూర్తి.

అలాగేనన్నట్టు "నిశ్శబ్దంగా తలూపింది"

మనసంతా ఎంతో భారంగా ఉంది. మొన్నటి వరకూ ప్రభుకి తనే ఆంక్షలు పెట్టింది. ఇప్పుడిక అసలు అతన్ని చూడకుండా ఉండడం దుర్లభం అనిపిస్తూంది. పుస్తకాల అరలో నుంచి తిలక్ "అమృతం కురిసిన రాత్రి" తీసి తల కింద పెట్టుకుంది.

"ఇన్ని నే బతికిన దినాల పన్నిన వ్యూహాన
నిన్నెక్కడ కలిసికొనినానొ స్మృతికి రాదుగాని
నీవు లేవనునట్టి కాలమే నాకు లేదు
నా దారి నుండి నిన్ను వీడదీయు వేరు మార్గమే లేదు
నా నిదురించు శయ్యాగృహమ్ము
నీవు లేక నాకు పచ్చి శూన్యమ్ము"

తిలక్ కవిత్వం కంటి నుంచి ధారాపాతంగా కురుస్తూ ఉండగా నిస్త్రాణగా కళ్లు మూసుకుంది తన్మయి. ఎంత సేపు పడుకుందో తెలియలేదు.

"ఏమ్మా, ఎలా ఉన్నారు?" గుమ్మం బయట దేవి గొంతులా వినబడడంతో ఉలిక్కి పడి లేచింది తన్మయి.

దేవి, ఆవిడ పెద్ద తమ్ముడు నిజంగానే అక్కడ ప్రత్యక్షమయ్యేరు. తాయిబానడిగి తండ్రి వాకిట్లో కుర్చీలు వెయ్యడం, దేవి, ఆవిడ తమ్ముడు కుశల ప్రశ్నలు వేస్తూ బాబుని ముద్దాడడం చూసి ఒక్క సారిగా తలపోటు ప్రారంభమైంది తన్మయికి. మూసుకున్న కళ్లు తెరవడం ఇష్టం లేక, వెనక్కి తిరిగి పడుకున్న తన్మయి హృదయం బాధతో మూలగ సాగింది.

"అసలే తనకు శరీరమూ, మనసూ ఏవీ బాలేవు. మధ్య మళ్లీ వీళ్ల గోల ఏవిటీ? అసలెందుకొచ్చేరు?"

"ఇక్కడికీ దాపురించేరు" జ్యోతి విసుక్కుంటూ స్టవ్వు మీద టీ పెడుతున్న శబ్దం విని మెల్లిగా లేచి కూర్చుంది తన్మయి.

భానుమూర్తి సంతోషంగా మాట్లాడుతున్నాడు.

"ఆపరేషను అయ్యిందని తెలిసిందన్నయ్యా. హైదరాబాదులో పెద్ద తమ్ముడింటికి మొన్నే వచ్చేను. కానీ వాడి ఉద్యోగం హడావిడిలో ఇప్పటికి రాగలిగేను." దేవి మాటలు లోపలి నుంచి వింటూ

"ఏవిటో ఈవిడికి ఇంత ప్రేమ పుట్టుకొచ్చింది నీ మీద" ఈసడింపుగా అంది తన్మయి.

తన్మయి నిశ్శబ్దంగా బాత్రూములో కెళ్లి ముఖం కడుక్కుని వచ్చింది.

"ఎంత కాదనుకున్నా మనం మనం బంధువులం. ఎన్నాళ్లని ఇలా ముఖముఖాలు చూసుకోకుండా ఉంటాం?" అంటున్నాడు దేవి తమ్ముడు.

భానుమూర్తి మాట్లాడకుండా టీ చప్పరించ సాగేడు.

తన్మయి బయటికి రావడం చూసి ఆవిడ తమ్ముడు లేచి గట్టు మీద కూచుంటూ "ఇలా రామ్మా, కుర్చీ లో కూచో" అన్నాడు.

దేవి ముఖాన నవ్వు పులుకుంటూ "ఏమ్మా, ఎలా ఉంది ఒంట్లో" అంది. కృత్రిమమైన పలకరింపుకి చికాకు వచ్చి తన్మయి ముభావంగా తలాడించింది.

"ఏవిటో వొదినా, ఎవరి కళ్ళు పడ్డాయో గానీ పండంటి కుటుంబం చెదిరిపోయింది. మా మనవణ్ణి తరచూ చూసుకోవడానికి మాకు యోగం లేకుండా పోయింది" అంటూ ముక్కు చీదింది దేవి.

జ్యోతి "వీళ్లెందుకు వచ్చేరన్నట్లు" తన్మయి వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

తన్మయి కూడా అలాగే చూసింది తల్లి వైపు.

"ఎవరి కళ్లో పడి పండంటి కుటుంబం చెదిరిపోయిందా? జరిగిన ఏ పరిణామమూ ఈవిడికి తెలీదూ? ఈవిడ కొడుకే కావాలని కుటుంబాన్ని కాల రాసుకున్నాడని తెలీదూ?

అయినా జరిగిన అన్నిటి వల్ల తనకూ, తన కొడుక్కీ కలిగిన నష్టం ముందు, అతనికీ, వీళ్లకు కలిగిన బాధ ఏపాటిది? ఈవిడకి మనవణ్ణి చూసుకోలేక పోవడం ఒక్కటే బాధ. మరి తనకి? బాబుకి?" మనసులో సుళ్లు తిరుగుతున్నవేవీ బైటికి అనే ఓపిక లేక తన్మయి అక్కణ్ణించి లేవబోయింది.

ఇంతలో ఆవిడ తమ్ముడు భానుమూర్తి నుద్దేశించి "మా అక్క బాధ చూళ్లేక తీసుకు వచ్చేను. బావగారూ! మీ అమ్మాయి విలువ ఇప్పుడు తెలిసి వచ్చింది అందరికీ. మీ అమ్మాయిని కాదని శేఖర్ చేసుకున్నది కొరకంచె. ఎవ్వరినీ గుమ్మం ఎక్కనివ్వదు. అయినా ఆడుకూడా యాపారంలో నష్టవొచ్చి బాగా చితికి పోయేడు. పైగా ఇద్దరు ఆడపిల్లలు. మీరే ఏదోలాగా మీ అమ్మాయికి నచ్చ చెప్పి ఆ కుటుంబాన్ని నిలబెట్టాలి" అన్నాడు నీళ్లు నములుతూ.

భానుమూర్తి ఏదో అనేలోగా దేవి మళ్లీ ముక్కు చీదుతూ, "అన్నయ్యా! నీకు తోడబుట్టక పోయినా, ఎంత కాదనుకున్నా నేను మీ చెల్లెలిని. మా మనవడు మాకు దూరం అయ్యి పోయేడని అందరం దిగుళ్లు పెట్టుకున్నాం. ఇవన్నీ కాదు గానీ, నువ్వే చెప్పు. నా కొడుకు మళ్లీ మీ అమ్మాయిని ఏలుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. ఏవంటారు?" అంది.

తన్మయికి కుట్లన్నీ ఒక్కసారి పీకేసినంత ఆవేశం కలిగింది. ఆ చెంపా ఈ చెంపా వాయించి, మెడబట్టి వాళ్లని బయటకు తోయాలన్నంత కోపం వచ్చింది. భానుమూర్తి దిగులుగా వింటున్నాడు. తండ్రి ముఖంలో బాధని చూడలేక దిగ్గున అక్కణ్ణించి లేచింది తన్మయి. కానీ అడుగు ముందుకు పడని హఠాత్తు నొప్పితో అక్కడే కూచుండిపోయింది.

జ్యోతి కూతురి అవస్థని వెంటనే పసిగట్టి, "మీకు దణ్ణం పెడతాను. ఆపరేషను అయ్యి పచ్చి పుండులా ఉన్న పిల్లని ఇంకా వేధించకండి, నువ్వు రామ్మా" అని చెయ్యి సాయం అందించింది.

గదిలో అడుగుపెట్టగానే తల్లి భుజమ్మీద దు:ఖ భారమంతా తీర్చుకుంది తన్మయి.

"ఏడవకమ్మా! ధైర్యంగా ఉండు. ఇవేళ నువ్వు చక్కగా జాబులో సెటిలయ్యేవు కాబట్టి ఇప్పుడు నువ్వు కావాల్సి వచ్చేవు. సిగ్గులేని బతుకులు. ఆ ఎదవకి ఇప్పుడు సంపాయించి పెట్టే పెళ్లాం కావల్సి వచ్చింది కాబట్టి వీళ్లు నిన్ను వెతుక్కుంటూ వచ్చేరు" అంది గట్టిగా వాళ్లకి వినబడేటట్టు.

ఇంతలో మసీదులో నుంచి ప్రార్థన వినవచ్చింది.

"వాళ్లకి నా మాటలు వినిపించాయో, లేదో తెలీదు. నేను చూసొస్తాను. నువ్వు పడుకో. ఇక బయటికి రాకు. నాన్నగారు, నేను మాట్లాడుతాం" అని బయటికి నడిచింది జ్యోతి.

తల్లిదండ్రులు ఏం మాట్లాడుతున్నారో వినే ఆసక్తి కూడా లేదు తన్మయికి. బాధతో కళ్ళు మూసుకుంది. బయటెక్కడో ఆడుకుంటున్న బాబు తల్లి దగ్గిరికి పరుగెత్తుకొచ్చి పక్కన చేరేడు. తన్మయి వాణ్ణి దగ్గిరికి తీసుకుని దు:ఖ భారంతో ముద్దులు కురిపించింది.

ఏదో అర్థమైన వాడిలా తల్లి కన్నీరు తుడుస్తూ "అమ్మా! నాన్నమ్మ నాకు చాక్లెట్టు తెచ్చింది. వద్దని చెప్పేను" అన్నాడు.

వాణ్ణి గుండెలకు హత్తుకుంది తన్మయి.

★★★

ఆ రాత్రి తన్మయికి నిద్రపట్టలేదు. మనసంతా సుళ్లు తిరుగుతున్న బాధ, తీరని కోపం వల్లనో ఏమో శరీరం తన మీద ప్రతాపం చూపిస్తున్నట్లు కుట్లు నొప్పి. శేఖర్ చేసిన తప్పిదాలన్నీ మరిచి పోయి, కాదు కాదు క్షమించి, అతనితో ఏం జరగనట్టు జీవితం మొదలు పెట్టడం అసలు జరిగే పనేనా? అతను తప్పిదాల మీద తప్పిదాలు చేస్తూ వచ్చేడు. వ్యసనాల్లో కూరుకుపోయి అగ్ని సాక్షిగా చేసిన అన్ని ప్రమాణాలూ చెరిపివేసేడు. తనతో ఉండగానే మరో అమ్మాయిని చెప్పా పెట్టకుండా పెళ్లి చేసుకుని తనని వదిలించుకోవడానికి పెద్ద డ్రామా చేసేడు. పుస్తెలు కూడా వదలకుండా తనని దోపిడీ చేసేడు. ఇప్పుడు తనను "మళ్లీ ఏలుకునే" నెపంతో "మళ్లీ దోపిడీ" మొదలుపెడతాడన్నమాట.

పిల్లాడి నెపం ఒకటి మధ్యలో. తల పగిలిపోసాగింది తన్మయికి. పొద్దున్న వాళ్లు మాట్లాడేది తండ్రి అంత శాంతంగా ఎందుకు విన్నాడో అర్థం కాలేదు. అసలు తనకూ ఒక మనసుంటుందని ఎవరికీ అర్థం కాదా? అర్థమయినా దానికి విలువ లేదా? ఎవరికి విలువ లేకపోయినా తనకి ఉంది. తనంటే తనకి తెలుసు. తనకే బాగా తెలుసు. తనిప్పుడు ఎవ్వరి మీదా ఆధారపడిన వ్యక్తి కాదు. తన జీవితానికి ఏం కావాలో తను నిర్ణయించుకోగలిగిన సాధికార మహిళ. ఇటువంటి ఎన్నో డిస్టర్బెన్సెస్ జీవితంలో ఎన్నో కలుగుతాయాయి. వీటి నుంచి ఎంత త్వరగా తను బయటికి రాగలిగితే అంత మంచిది తనకి.

కన్నీళ్లు తుడుచుకుని, మొహం కడుక్కుని బయటికి వచ్చి వెన్నెట్లో అరుగు మీద జేరబడి కూచుంది. తన మానాన తను హాయిగా ఉన్న జీవితాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ మురికి కూపంలోకి నెట్టుకోకూడదు. అసలా ఆలోచనే వద్దు. ఇప్పుడు ఆలోచించవలిసినది తనీ శారీరక కష్టం నుంచి త్వరగా కోలుకోగలదా అన్నది మాత్రమే. తల్లిదండ్రులు తన దగ్గిర ఉన్నారు కాబట్టి బాబు గురించి, ఇంటి పని గురించి ఇప్పట్లో బెంగ లేదు. కానీ ఇలా ఇంట్లోనే కూచోవడం వల్ల మనశ్శాంతి ఉండడం లేదు. తల్లిని ఒప్పించి మరో వారంలో మెల్లగా కాలేజీకి వెళ్లిపోవాలి. కాకపోతే కొన్నాళ్ల పాటు క్లాసులు నిలబడి చెప్పడం కష్టం అవుతుందేమో. బహుశా: కూచుని పాఠాలు చెప్పాలి. ధైర్యంగా ఉండాలి. అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కోవాలి.

ఆకాశం కేసి చూస్తూ తనకి మాత్రమే వినబడేటట్టు "అజ్ఞాత మిత్రమా! ఈ కష్టాల్ని ఎదుర్కోవడానికి తగిన ధైర్యాన్ని ఇవ్వవూ" అంది.

★★★

మర్నాడు ఆదివారం ఉదయానే గేటు తీసుకుని వస్తున్న ప్రభుని చూసి ఆశ్చర్యపోయింది తన్మయి.

"అదేవిటి? రావొద్దని సిద్దార్థతో ఫోను చేయించింది కదా?"

వస్తూనే చేతిలో ద్రాక్షపళ్లు, అరటి పళ్లు జ్యోతికి ఇస్తూ నమస్కరించేడు.

ప్రభుని గుర్తు పట్టినట్టు "ఆ... మీ అమ్మగారూ, నాన్న గారూ బావున్నారామ్మా? ఎప్పుడో మీరు చదువుకునే రోజుల్లో చూసేను. మీరు మా వీథికవతల పేటలో అద్దెకునేవారు కదా" అంది.

భానుమూర్తి ప్రతి నమస్కారం కూడా చెయ్యకుండా తలూపేడు. వాకిట్లో కూచున్న ప్రభుని చూస్తూ ఒక పక్క మనసు అంతులేని సంతోషంతో గంతులు వేస్తున్నా మరొక పక్క తల్లీ తండ్రీ ఏమంటారో అన్న భయం కలగసాగింది తన్మయికి. బాబు పరిచయంగా వచ్చి ప్రభు ఒళ్లో కూచోవడం వాళ్లు గమనించడాన్ని తన్మయి పసిగట్టింది.

మెల్లిగా బయటకు వచ్చిన తన్మయిని చూస్తూనే "ఎలా ఉంది ఆరోగ్యం?" అన్నాడు ప్రేమ ధ్వనిస్తున్న గొంతుతో.

తన్మయి నిశ్శబ్దంగా తలూపింది. నిజానికి అతన్ని అల్లుకుని దు:ఖపడాలని ఉంది. రాత్రంతా తనకి తను ధైర్యం చెప్పుకున్నా ప్రభుని చూడగానే ఒకరకమైన బేలతనం ఆవరించింది.

"నేస్తం! నన్నీ ప్రపంచం లోని అన్ని కష్టాల నుంచి త్వరగా గట్టెక్కించు" అని హత్తుకోవాలని ఉంది.

తన్మయి మనసు పసిగట్టినట్లు దిగులుగా చూసేడు ప్రభు. అక్కడ ఇక ఉండ లేక లోపలికి వచ్చేసింది తన్మయి. తల్లి వంటింట్లో టీ పట్టసాగింది. అక్కడే గోడకి ఆనుకుని నిలబడ్డ తన్మయి వెనకే తండ్రి విసవిసా వచ్చేడు.

ఒక్కసారిగా తన్మయి గొంతు పట్టుకుని రౌద్రమైన ముఖంతో "ఎవరితను? తరచుగా ఎందుకొస్తున్నాడు?" అన్నాడు.

హఠాత్తుగా జరిగిన పరిణామానికి తన్మయి ఆశ్చర్యపోయింది.

జ్యోతి వెంటనే ఒక్క అరుపు అరిచింది, "ఉండండి, పిల్లని చంపుతారా ఏంటి? అతణ్ణే అడుగుదాం"

భానుమూర్తి వెంటనే తేరుకున్నట్టు పట్టు వదిలేసినా అప్పటికే గోళ్లు గుచ్చుకున్నాయి గొంతు మీద. తన్మయి కళ్లల్లో జల జలా నీళ్లు తిరిగేయి. చిన్నతనం నుంచి అల్లారు ముద్దుగా పెంచిన తండ్రేనా ఇతను? మొదటిసారిగా తండ్రి మీద అసహ్యం వేసింది. ఎర్రబడ్డ కళ్ల తో తండ్రి వైపు తీక్షణంగా చూసింది.

"ఏమ్మా, మమ్మల్ని ఇలా కూడా బతకనియ్యవా" అంటూ తల్లి కూడా ఉన్నట్టుండి తండ్రికి వంత పాడడం మొదలుపెట్టింది.

మాటలు బయటకు వినబడకూడదన్నట్లు తలుపు మూసి వాకిట్లో కూచున్న ప్రభు దగ్గిరికి వచ్చింది.

ప్రభు అప్పటికే అంతా విన్నట్టు లేచి నిలబడ్డాడు. దగ్గిరికి వచ్చి తల పంకిస్తూ, "మా వాళ్లు అర్జంటుగా రమ్మంటే ఊరు వెళ్తున్నాను. నీకు చెప్పి వెళదామని వచ్చేను. నిన్ను అనవసరంగా బాధ పెడితే క్షమించు. మళ్లీ వస్తాను" అని గేటు తీసుకుని వెళ్లిపోయేడు.

అతను వెళ్లిన వైపే నిర్వికారంగా చూస్తూ అరుగు మీద కూలబడింది. తండ్రి తన గొంతు పట్టుకోవడం వెనక కారణం ఏదైనా, ఇక ఆయన ఎప్పటికీ తన జీవితంలో ఇంతకు ముందు తండ్రి కాలేదు. ఎప్పటికీ కాలేదు.

★★★

తల్లి ప్రభు గురించి ఆ తర్వాత ఏం మాట్లాడినా తన్మయి మౌనం వహించింది. ప్రభు తమతో మాట్లాడకుండా వెళ్లిపోవడాన్ని ఇద్దరూ సహించలేకపోయేరు.

"చూసేవుగా, నాన్నగారు అతన్ని విషయం ఏవిటని అడిగే లోపలే పలాయనం చిత్తగించేడు"

"అయినా అతన్నని ఏం పాపంలే. నీ అలుసు లేకుండా అతనెందుకొస్తాడు?"

"అయినా, ఇదేం ఖర్మమో. బతికున్నంత కాలం నీ గురించి ఏడవాల్సి వస్తూంది"

"హవ్వ, పేటలో కుర్రాడు ఇలా మన పిల్ల చుట్టూ తిరుగుతున్నాడని ఎవరికైనా తెలిస్తే ఇంకేవైనా ఉందా?"

తల్లి మాట్లాడీ మాట్లాడీ ఊరుకుంది. తండ్రితో తన్మయి వాళ్లు వెళ్లే రోజు వరకూ మాట్లాడలేదు. వాళ్లున్నంత సేపూ తన్మయికి తన స్వంత ఇంటిలో తనే జైలులో ఉన్నట్లు అనిపించసాగింది. వాళ్లు తన తల్లిదండ్రులైనా ఇంకా తనని దండించే వయసున్న చిన్న పిల్లగా చూడడం తన్మయి సహించలేకపోతూంది. అయినా ఎదురు చెప్పకుండా మౌనం వహించింది. తనని వదిలిపెట్టేసి శేఖర్ హాయిగా బతుకుతున్నాడు.తను జీవితాన్ని చక్క దిద్దుకోవడంలో తప్పేవుంది? ప్రభు తన కోసం రావడాన్ని వీళ్లు ఎందుకు తప్పు పడుతున్నారు?

తనకి పెళ్లి కాకముందు ఆ పల్లెటూళ్లో తనని అదుపాజ్ఞలలో భయభక్తులతో పెంచేరు. ఇప్పటికీ వీళ్ల అదుపులోనే ఉండాలనుకుంటున్నారా? లేదా అసలు తను మళ్లీ తన జీవితం చక్క దిద్దుకోవడం ఇష్టం లేదా? లేదా తను మళ్లీ తప్పటడుగు వేస్తుందేమోనని భయపడుతున్నారా? తను జీవితాంతం ఇలా ఒంటరిగా ఉండిపోవాలనా వీళ్ల ఉద్దేశ్యం? లేదా శేఖర్ తో మళ్లీ తను కలవాలని అనుకుంటున్నారా? లేదా వాళ్లే సరైనవాడిని చూసి

చెయ్యాలనుకుంటున్నారా? అదే నిజమైతే, ఇప్పటి వరకూ ఒక్క సంబంధం కూడా ఎందుకు చూడలేకపోయేరు? ప్రభు కుటుంబం, అతని సామాజిక వర్గం, ఇతర పరిస్థితులు అంగీకరించడం ఇష్టం లేదా?

అంతు చిక్కని ప్రశ్నలు తనలో తనే వేసుకుంటూ జవాబులు తెలుసుకోలేక అవస్థ పడసాగింది తన్మయి.

★★★

కాలేజీలోకి మొదటిరోజు అడుగుపెట్టగానే ప్రిన్సిపాల్ గారితో సహా అందరూ ఆప్యాయంగా పలకరించేరు.

కాసేపట్లోనే తాయిబా ఉత్తరం పట్టుకు వచ్చి ఇచ్చింది. ప్రభు ఉత్తరం చూడగానే సంతోషం పెల్లుబుకింది తన్మయికి .

ఆత్రంగా విప్పింది.

"ప్రియమైన తనూ!

నీకు ఆరోగ్యం ఇంకా కుదురుపడకుండా నేను నీ నుంచి దూరంగా వెళ్లాల్సి వచ్చినందుకు ఎంత బాధగా ఉందో చెప్పలేను. ఈ వారం మళ్లీ మా ఇంటికి అర్జంటుగా రావాల్సి ఉండి వచ్చాను. మీ వాళ్లు నీ దగ్గిరే ఉన్నందుకు ఒక పక్క కొంత నిశ్చింతగా ఉన్నా, నువ్వెలా ఉన్నావో అనే చింత వెంటాడుతూనే ఉంది.

ఇక మా ఇంటికి వచ్చిన విషయం ఏవిటో ఇప్పుడు నువ్వున్న పరిస్థితుల్లో నీకు చెప్పి నిన్ను బాధించడం నా ఉద్దేశ్యం కాదు. కానీ, నీతో తప్ప నేను ఏ విషయమైనా ఎవరితో పంచుకుంటాను?

మా వాళ్లు నా కోసం చెప్పాపెట్టకుండా సంబంధం మాట్లాడి, రేపు నిశ్చితార్థం అని ఫోను చేసేరు. ఇక మన సంగతి స్వయంగా వచ్చి చెప్పడం కంటే వేరే మార్గం కనబడలేదు. తీరా వచ్చేనే కానీ ధైర్యం చాలడం లేదు. ఒక పక్క మీ వాళ్లకూ ఇష్టం లేదని అర్థమయ్యి పోయింది. ఇక వీళ్లకు చెప్పినా ససేమిరా ఒప్పుకోరు. అందుకే ఇక ఒక నిర్ణయానికి వచ్చేను........" ఇక చదవలేక ఆగిపోయింది తన్మయి.

వేగంగా కొట్టుకుంటున్న గుండె చప్పుళ్ల మధ్య, ముఖమంతా చెమటలతో, వణుకుతున్న చేతులతో టేబుల్ మీదే వాలిపోయింది. గుండెని పిండేస్తున్న దు:ఖం. కళ్లు తిరుగుతున్నట్టు స్పష్టంగా తెలియసాగింది తన్మయికి.

గుమ్మం దగ్గిరే ఉన్న తాయిబా "అయ్యో మేడం... మేడం" అంటూ చప్పున లోపలికి పరుగెత్తుకు వచ్చింది

## 54

తన్మయికి మెలకువ వచ్చేసరికి స్టాఫ్ రూములో ఒక పక్కగా ఉన్న బల్ల మీద పడుకుని ఉంది. తాయిబా పక్కనే విసురుతూ కనిపించింది. చుట్టూ లెక్చరర్లు గుమిగూడేరు. తన్మయి కళ్లు తెరవడం చూసి అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రిన్సిపాల్ గారు "ఏమిది మేడం, మరి నాల్గుదినాలు ఇంటికాడ ఉండుండ్రి" అన్నారు తేలికపడుతూ.

సిద్ధార్థ నర్సుని వెంటబెట్టుకుని వచ్చేడు.

"మీరు గిట్ల పడంగనె పాపం సారు దావఖానకు ఉరికిండు" అంది తాయిబా.

తన్మయి కృతజ్ఞతా పూర్వకంగా చూసింది సిద్ధార్థ వైపు. కాస్సేపట్లోనే పూర్తిగా తేరుకుని ఇంటికి బయలుదేరింది తన్మయి. తాయిబా తోడు వచ్చింది. సిద్ధార్థ గేటు వరకూ వచ్చి ఆటో ఎక్కిస్తూ

"నర్సు ఏం ఫర్వాలేదని చెప్పే వరకూ గాభరా పుట్టుకొచ్చింది. అయినా ఏంటి తన్మయీ! ఇప్పుడు కాలేజీకి తొందరేమొచ్చిందని వచ్చేరు. నా మాట విని మరొక వారం రెస్టు తీసుకోండి" అన్నాడు.

దారిలో తాయిబా ఉత్తరం తీసి చేతిలో పెట్టింది. "ఏంది మేడం, గట్ల సదవతానే పడిపోయిన్రు. అంత మంచిగనె ఉన్నదా?" అంది.

తన్మయి నిట్టూర్పు విడుస్తూ తల ఊపింది. ప్రభు ఉత్తరం లో తను చదివిన చివరి వాక్యం వెంటాడుతూ ఉంది.

"మా వాళ్లకు చెప్పినా ససేమిరా ఒప్పుకోరు. అందుకే ఇక ఒక నిర్ణయానికి వచ్చేను...."

ఇంటికి రాగానే నిస్త్రాణగా మంచమ్మీద వాలిపోయింది. ఊరి నుంచి పొలం కౌలు వ్యవహారాలేవో అర్జంటుగా చెయ్యాల్సి ఉన్నాయని తల్లీతండ్రీ అంతకు ముందు రోజే బయలుదేరేరు.

వెళ్లే ముందు జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది తన్మయికి.

భానుమూర్తి కూతురి దగ్గిరికి వచ్చి "ఒకసారి ఆలోచించమ్మా. బాబు కోసమైనా నువ్వు శేఖర్ తో కలిసి ఉంటే మంచిదేమో" అన్నాడు.

జ్యోతికి ససేమిరా ఇష్టం లేకపోయినా, కూతురు ఎవరినో మళ్లీ పెళ్లి చేసుకోవడం కంటే మంచిదన్నట్టు మాట్లాడకుండా ఉండి పోయింది.

"వీళ్లు ఇలా ఎలా ఆలోచించగలుగుతున్నారు? అసలు శేఖర్తో తనెలా మళ్లీ కలవగలదు? అతనిప్పుడు ఎవరికో భర్త. ఎవరో ఆమె పిల్లలకు తండ్రి.

ఛీ,ఛీ. తల్చుకోవడానికే అసహ్యం వేస్తూంది. అతని ముఖం చూడడానికి కూడా కంపరం పుట్టుకొస్తూంది. పైగా ప్రభు వచ్చిన రోజు జరిగిన సంఘటన నుంచి తన్మయి అప్పటికీ కోలుకోలేదు. తనపై ఎప్పుడూ చెయ్యి చేసుకోని తండ్రి తన పీకె పట్టుకున్నాడు. అంత తప్పు తనేం చేసింది? నిజానికి ఆ రోజు నుంచీ తండ్రితో ముభావంగానే ఉంటూ వచ్చింది. ఇక ఉండబట్టలేక అదే అడిగింది.

"నువ్వు నీ సంతోషమే చూసుకుంటున్నావు కానీ పిల్లాడి గురించి ఆలోచించేవా?" అన్నాడు తండ్రి గద్దింపుగా.

"ఇప్పుడు వాడికేమయ్యింది?" అంది రోషంగా. "ఏమయ్యిందా? ఆ వచ్చేవాడు నీకు భర్త కాగలడేమో. కానీ పిల్లాడికి తండ్రి కాగలడా?" అని రెట్టించేడు భానుమూర్తి.

"ప్రభు బాబుకి తండ్రి కాగలడో, లేడో తనకూ తెలీదు. కానీ వాడు శేఖర్ లాంటి దుష్టుడి నీడలో పెరగడం కంటే మంచిదే. మంచి భర్త కాలేని శేఖర్ మంచి తండ్రా?" అదే చెప్పింది.

"నీ వితండ వాదాలకు నా దగ్గిర సమాధానం లేదు. మేం నీ మంచి కోరి చెపుతున్నాం. వినేదీ, లేనిదీ నీ ఇష్టం" అన్నాడు భానుమూర్తి.

"నీ ఇష్టం" అన్న చివరి మాట "నీ ఖర్మ" అన్నంత విసురుగా వినబడింది తన్మయికి.

ఇప్పుడీ ఉత్తరం. నిజానికి ఉత్తరం పూర్తిగా చదవలేదు.

"ఇరువైపులా తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు కాబట్టి ఒక నిర్ణయానికి వచ్చేనన్నాడు"

అదేవిటో ఊహించుకోవడానికే భయం వేసి కళ్లు తిరిగిపోయేయి తనకు. ప్రభు తనను ఇలా నిస్సహాయంగా వదిలేసేటంత బలహీనమైనదా అతని ప్రేమ? ఎందుకో మనస్సంగీకరించడం లేదు. అతని ప్రేమ గట్టిదని తనకు అనిపిస్తూ ఉండేది, కాదు కాదు అదే నిజం కూడా! మరెందుకిలా జరుగుతోంది? తనకే ఎందుకు జరుగుతోంది?

తప్పు తనదేనా? ముందంతా అతను వెంటపడినప్పుడు తనే ఏడాది గడువు పెట్టింది. ఇప్పుడు అతను తన జీవితం తను చూసుకుంటున్నందుకు తట్టుకోలేకపోతూంది. కళ్లు తుడుచుకుని ఉత్తరం మరొకసారి చదవడం మొదలు పెట్టింది. ఎప్పుడూ ప్రతీ ఉత్తరాన్నీ, అందులోని ప్రేమ పూరిత అక్షరాల్నీ హత్తుకుని ముద్దులు కురిపిస్తూ చదివేది. ఇప్పుడు ఆపుకుందామన్నా దు:ఖం ఆగడం లేదు. మొదటి పేజీలోని చివరి పేరాకి వచ్చేసరికి మళ్లీ నీరసం ముంచుకొచ్చింది.

"మా వాళ్లు నా కోసం చెప్పాపెట్టకుండా సంబంధం మాట్లాడి, రేపు నిశ్చితార్థం అని ఫోను చేసేరు. ఇక మన సంగతి స్వయంగా ఇక్కడికి వచ్చి చెప్పడం కంటే వేరే మార్గం కనబడలేదు. తీరా వచ్చేనే కానీ ధైర్యం చాలడం లేదు. ఒక పక్క మీ వాళ్లకూ ఇష్టం లేదని అర్థమయ్యి పోయింది. ఇక వీళ్లకు చెప్పినా ససేమిరా ఒప్పుకోరు. అందుకే ఇక ఒక నిర్ణయానికి వచ్చేను........"

తను అతన్ని మనస్ఫూర్తిగా ప్రేమించింది. అసలు ప్రేమకు అర్థం ఏవిటి? ప్రేమించిన వ్యక్తి సంతోషంగా ఉండాలని కోరుకోవడం కదా! అలాంటప్పుడు తనకు బాధ ఎందుకు కలుగుతూంది?

"ప్రభూ! నిన్ను ప్రేమించే వ్యక్తిగా ఎప్పుడూ నేను నీ మంచిని, నీ సంతోషాన్ని కోరుకుంటాను, కానీ నా నించి దూరంగా వెళ్లడం నీకు సంతోషమెలా అవుతూందో అర్థం కావడం లేదు. ప్రశాంతంగా ఉన్న నా జీవితంలోకి చొరబడి, నన్ను నీ ప్రేమతో వివశురాల్ని చేసి ఇలా తప్పుకోవడం నీకు న్యాయమేనా?" ధారాపాతమైన కన్నీటిని తుడుచుకుంటూ రెండవ పేజీ తిప్పింది.

"తనూ! నేను ఇప్పుడు తీసుకొనబోయే నిర్ణయం వల్ల ఏమవుతుందనే ఆలోచన ఇక మానెయ్యదలుచు కున్నాను. ఏమైనా కానియ్యి. నేను ఉన్న పళంగా ఇక్కడి నుంచి వచ్చెయ్యాలనుకుంటున్నాను. నిన్ను చూడడానికి రెక్కలు కట్టుకుని వాలాలని ఉంది. మీ అమ్మానాన్న గార్లు వెళ్లంగానే చెప్పు. నిజానికి నాకు నిన్ను వెంటనే చూడాలనుంది. ఎవరికోసమూ నేను నిన్ను వదులుకోలేను, దూరం చేసుకోలేను, ముఖ్యంగా నిన్ను అక్కడ ఒంటరిగా వదిలి నేను ఎక్కడా సంతోషంగా బతకలేను. చిన్నతనం నించి నిన్ను ప్రేమించినా సరైన సమయానికి నిన్ను దక్కించుకోలేకపోయాను. ఇక ఇప్పుడూ నీతో జీవితం పంచుకునే అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోలేను. మన కుటుంబాలూ, చుట్టూ ఉన్న ప్రపంచం ఒప్పుకున్నా, ఒప్పుకోక పోయినా నేను నిన్ను వొదులుకోలేను. అయినా నీకు తెలీదూ? నా మనస్సు నీకు ఎప్పుడో సమర్పించానని? నువ్వే నేను, నేనే నువ్వని. హమ్మయ్య, నీకు ఇది రాసేక గానీ నా మనసు కుదుటపడడం లేదు. ఇవన్నీ సరేగానీ, నువ్వు త్వరగా కోలుకోవాలి. సమయానికి భోజనం చెయ్యడం మర్చిపోకు"

తన్మయి ఆనందబాష్పాలతో గబగబా ఉత్తరానికి ముద్దులు కురిపించింది. తనకి తెలుసు, తన ప్రభు తనకి అన్యాయం చెయ్యడని. అయినా తెలివితక్కువతనం కాకపోతే ఉత్తరం సగంలోనే గాభరా పడిపోవడమెందుకు? ప్రభు ప్రేమని శంకిస్తే తనని తను శంకించుకున్నట్టే.

తన కోసం కొట్టుకునే గుండె చప్పుళ్లల్లో అతని నిజాయితీ ఎప్పటికప్పుడు తేటతెల్లమవుతూనే ఉందిగా. తనెందుకు అంత పిచ్చిగా ఆలోచిస్తుంది?

లేచి చల్లని నీళ్లతో ముఖం కడుక్కుంది. అద్దంలోచూస్తూ చిన్న స్టిక్కర్ బొట్టు ముఖానికి అతికించుకుంది.

జీవితం పొడవునా మింగుడు పడని చేదు అనుభవాలతో మెరుపు కోల్పోయి, చిక్కి పోయిన పలచని చెంపలు, అనుక్షణం దుఃఖం తో అలిసిపోయిన కళ్లు.

ఒకప్పుడు తిలకం సీసాతో పెద్ద బొట్టు పెట్టుకుంటూ కాంతివంతమైన తన ముఖాన్ని తానే చూసుకుని మురిసిపోయేది. వాకిట్లో రాళ్ల వారన విరగబూసిన ముద్ద బంతి పూల దగ్గిరికి వచ్చింది.

"అజ్ఞాత మిత్రమా! పూల మొక్కలా ఎంత చిన్నదైనా అందమైన జీవితాన్ని ప్రసాదించు నాకు" అని కళ్లు మూసుకుని వేడుకుంది.

ఒంట్లో నీరసంగా ఉన్నా కాళ్లల్లోకి ఎక్కడ లేని హుషారు వచ్చినట్టయ్యింది. రోడ్డు మీది ఎస్టీడీ బూత్ కి వచ్చి ప్రభు ఆఫీసుకి ఫోను చేసింది

"అరే మేడం, ఏడికి బోతున్నవు? అగో, నే తోలుకుపోత ఉండు" అంటూ తాయిబా వెంట వచ్చింది.

"సుస్తీ తగ్గేవరికి జర జాగ్రత్తగ ఉండు మేడం, ఏడికి బోవాలన్నా నే తోలుకుపోత గద...."గలగలా మాట్లాడుతున్న తాయిబా వైపు చూస్తూ

ఈ అజ్ఞాత ప్రదేశంలో ఈ అమ్మాయే లేకపోతే తన జీవితం ఏమయ్యేదో అనిపించి కృతజ్ఞతగా తాయిబా చెయ్యి పట్టుకుని "థాంక్యూ" అంది.

"ఊకో మేడం" అని సిగ్గు పడింది తాయిబా.

ఫోన్ లో అవతలి నుంచి ప్రభు గొంతు వినిపిస్తూనే మళ్లీ దు:ఖం ముంచుకొచ్చింది తన్మయికి.

"ఒక్కసారి రాగలవా" అని మాత్రం అనగలిగింది.

★★★

గేటు తీసుకుని వస్తున్న ప్రభుని చూడగానే మొత్తం సత్తువ వచ్చినట్లయ్యింది తన్మయికి. దగ్గిరికి వస్తూనే అతన్ని అల్లుకుని కళ్లు మూసుకుంది.

గుండెలకు హత్తుకున్న తల మీద ముద్దు పెట్టి, గెడ్డం పెకెత్తి దు:ఖంతో తడిగా, భారంగా ఉన్న కన్రెప్పల్ని తుడుస్తూ, "పద తనూ! పెళ్లి చేసుకుందాం, ఇక అభ్యంతర పెట్టకు" అన్నాడు ప్రభు.

తల మీద వెన్నెల పూల వాన అకస్మాత్తుగా కురుస్తున్నట్లు అనిపించింది తన్మయికి.

వివశత్వంతో ఇంకాస్త గట్టిగా హత్తుకుని "అలాగే. కానీ, నేను ఒక గంట పాటు నిలబడగలవగానే" అంది సంతోషంగా.

"అయ్యో! ముందు కూర్చో" అన్నాడు ఆతృతగా.

అతనికి జేరబడి కూచుంటూ నిస్త్రాణగా కళ్లు మూసుకుంది.

"మరి ఇలా చెప్పకుండా పెళ్లి చేసుకుంటే మీ వాళ్లు బాధ పడరూ?" అంది సాలోచనగా.

"అలాగని, నిన్ను బాధ పెట్టడం మంచిదంటావా? నేను వాళ్లు చెప్పినట్లు నడుచుకుంటే వాళ్లు ఆనందపడినా, నువ్వు, నేను జీవితాంతం బాధ పడాలి. మన పెళ్లి వల్ల వాళ్లు కొన్నాళ్లు బాధ పడతారు నిజమే. కానీ ఆ బాధని మరిపింపజేసేలా నువ్వూ, నేనూ నడచుకుంటే అది త్వరగా ఉపశమిస్తుందని నా నమ్మకం. తనూ! నేను మా వాళ్లని ఎప్పుడూ జాగ్రత్తగా చూసుకోవాలని అనుకుంటూ ఉంటాను. నువ్వు కాదనవు కదూ!" అంటూ చెయ్యి చాచేడు.

అతని చేతిలో తన అరచెయ్యి ఉంచుతూ "తప్పకుండా" అంది.

నిశ్శబ్దంగా తల నిమురుతూ, "నువ్వు బాగా కోలుకో ముందు. దేనికీ బాధ పడకు. ఇక నేనూ ఇక్కడే ఉంటాను. నిన్ను భద్రంగా చూసుకుంటాను" అన్నాడు.

తన్మయి నిశ్శబ్దంగా తలూపింది. ఇక ఏ విషయానికీ జీవితంలో ఒంటరి పోరాటం చేసే ఓపిక కూడా లేదు.

అదే చెప్పింది చిన్న గొంతుతో.

"ఊ...ఇక దేనికీ నువ్వు ఒంటరిగా పోరాడక్కరలేదు, నేనున్నానుగా" అన్నాడు గట్టిగా ఊపిరి పీల్చి వదులుతూ.

"మరి మీ వాళ్లు..." అనేదో అనబోతున్న తన్మయికి ఆనుకోవడానికి తలగడ ఇస్తూ "ష్... కాస్సేపు ప్రశాంతంగా నిద్రపో. ఏమీ ఆలోచించకు" అన్నాడు.

★★★

ప్రభు సాన్నిధ్యంలో నెల రోజుల్లో తన్మయి పూర్తిగా కోలుకుని, ఆరోగ్యవంతురాలయ్యింది. తను మందులు వేసుకోవడం దగ్గర్నుంచి, తినడం వరకూ ప్రతీ విషయంలోనూ అతను తన పట్ల చూపించే శ్రద్ధకి అబ్బురపడింది తన్మయి. ఆ నెల రోజులూ తనే వంట చేసి తినిపించి తనకు తల్లి అయ్యేడు, కంటికి రెప్పలా చూసుకుని తండ్రిని మరిపింపజేసేడు.

ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూనే "రిజిస్టర్ ఆఫీసు వివరాలన్నీ కనుక్కుని వచ్చేను. ఇద్దరి సాక్షిసంతకాలుంటే చాలు" అన్నాడు.

"సిద్ధార్థని, ఆయన మిసెస్ ని అడగొచ్చు. నీ స్నేహితులు ఎవరైనా వస్తున్నారా?" అంది.

ప్రభు తల అడ్డంగా ఊపేడు. అతను తన వాళ్లతో ఏమీ చెప్పలేకపోవడం అతనికి విచారాన్ని కలగజేస్తోందని అర్థం అయ్యింది తన్మయికి. తన జీవితాన్ని బాగు చెయ్యడం కోసం, ప్రేమను గెలిపించుకోవడం కోసమో అతను పెళ్లికి సిద్ధపడుతున్నా, అతని మనసులో చెలరేగుతున్న బాధ చూస్తున్న కొలదీ తాము తప్పు చేస్తున్నామేమో అని అనిపించసాగింది తన్మయికి.

అదే అంది మర్నాడు సిద్ధార్థతో.

"ఊ.. అతని మానసిక పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. అతను తన స్నేహితులని కూడా పిలవదలచకపోవడం లో బహుశా: ఎవరైనా అతని ఇంటికి వార్త అందజేస్తే అనవసరమైన రభస అవుతుందేమోనని భయం ఉందనుకుంటా. లేదా వార్త ఎవరి ద్వారానో కాక, తనే

స్వయంగా  తెలియ జేయాలనే ఉద్దేశ్యమూ అయిఉండొచ్చు. పెళ్లి లోగా అతన్ని ఎంతైనా ఆలోచించుకోనివ్వండి, మధన పడనివ్వండి. పెళ్లి తరువాత ఆలోచించుకోవడం కంటే ఇది మంచిదే నా ఉద్దేశ్యంలో. ఏదేమైనా కానీ మీరు ఈ విషయాన్ని మనసుకి పట్టించుకోనవసరం లేదనుకుంటా" అన్నాడు సిద్దార్థ.

అయినా తన్మయికి ఆ ఆలోచనే వొణుకు పుట్టించసాగింది. ఇదంతా ఎక్కడికి దారి తీస్తుందో అర్థం కావడం లేదు. ముఖ్యంగా బాబు భవిష్యత్తు ఎలా ఉంటుందోనని భయం కలగసాగింది. ఇప్పుడు తను తప్పు నిర్ణయం తీసుకుంటే తను జీవితాన్ని చక్కదిద్దుకోవాలనుకోవడంలో అర్థం లేదు.

సిద్దార్థ అన్నట్టు  "జీవితం ఆనందమయం కావాలని ఆశ పడడంలో తప్పు లేదు"

కానీ పొరబాటున అది వికటిస్తే తన చేజేతులారా తనే బాబు భవిష్యత్తుని కాలరాసినట్లవుతుంది.

ఆ సాయంత్రం ప్రభు రాగానే  "అలా డాబా మీదికి వెళ్లొద్దామా" అంది.

అప్పుడప్పుడే సాయం సమయం కావడంతో ఆకాశం ఎరుపు రంగు దాల్చింది. కేవలం బట్టలు ఆరవేసుకోవడానికి మాత్రమే పనికొచ్చే అతి చిన్న డాబా అది.

ఒక మూలగా నిలబడి ఆకాశంకేసి చూస్తూ  "మరోసారి ఆలోచిస్తే మంచిదేమో ప్రభూ" అంది దిగులుగా.

"నేను ఏదైనా నిర్ణయం తీసుకునే వరకే ఆలోచిస్తాను, ఆ తరువాత ఎప్పుడూ వెనుతిరగి చూడను. కష్టమైనా, నష్టమైనా ఆ నిర్ణయానికి జీవితాంతం కట్టుబడి ఉంటాను" అన్నాడు స్థిరంగా.

ఆ సంధ్య వేళ అతని దృఢ సంకల్పం చూసి తాము తప్పు చెయ్యడం లేదని, అతనితో జీవితం సుఖవంతమవుతుందని మనస్ఫూర్తిగా అనిపించింది తన్మయికి.

## 55

పెళ్లి చేసుకుందామని ప్రభు దృఢంగా  చెప్పినప్పటి నుంచి "ఇదంతా మంచిదౌనా, కాదా" అన్న మీమాంస రోజురోజుకీ పెరగసాగింది తన్మయికి. పక్కనే ఆదమరిచి నిద్రపోతున్న బాబు ముఖం కేసి చూసింది. ఈ పెళ్లి వల్ల తనొక్కతే కాదు, వీడి భవిష్యత్తు కూడా సుఖవంతం కావాలి. అది సాధ్యమేనా?

ఆలోచనలతో బుర్ర పగిలిపోతూంది. సిద్దార్థ అన్నట్లు "కొన్ని విషయాలలో స్వంతంగా నిర్ణయం తీసుకోలేనప్పుడు మరెవరినన్నా విశ్వసించాలి. ప్రభు పట్ల నమ్మకంతో ముందుకు అడుగెయ్యడమే మంచిది." ఇక మరిన్ని ఆలోచనలు వృథా.

"పెళ్లి ఏ రోజు చేసుకోవాలో ముహూర్తం ఎవరు పెడతారు మనకి? " అన్నాడు సాలోచనగా ప్రభు ఆ రోజు ఆఫీసు నించి వస్తూనే.

"మనమే" అంది చిన్నగా నవ్వి తన్మయి.

"మనకి ఏ రోజు రిజిస్టరు ఆఫీసులో అప్పాయింటుమెంటు దొరుకుతుందో అదే మంచి ముహూర్తం" అంది మళ్లీ.

"వీలైనంత సింపుల్ గా చేసుకుందాం. ఆర్భాటాలు చెయ్యడం నాకు ఇష్టం లేదు" అన్నాడు.

"అలాగే" అంటూ నీరసంగా తలూపింది.

"ఏమయ్యిందిరా, పోనీ నీకు నచ్చిన వాళ్లనందరినీ పిలువు" అన్నాడు గోముగా కళ్లలోకి చూస్తూ.

వద్దన్నట్టు మిన్నకుండిపోయింది.

మనసులో ఒక రకమైన భయాందోళనేదో సుళ్లు తిరుగుతూంది. ఇదంతా సక్రమంగా జరుగుతుందో, లేదో ఎవరైనా అడ్డుపడతారేమోనన్న భయం ఒక వైపు, ఎవరికీ తెలియకుండా చేసుకుంటూన్న ఈ పెళ్లి సక్సెస్ అవుతుందో, లేదో అన్న టెన్షన్ మరోవైపు.

"ఏమయ్యిందిరా" అన్నాడు మళ్లీ.

అత్యంత ప్రేమపూరితమైన ఆ పిలుపుకి మనస్సులోని బాధావేదనలన్నీ తొలిగిపోయినట్లు అతని భుజాల మీద తల వాల్చి నిశ్చింతగా కళ్లు మూసుకుంది.

"ఈ నిశ్చింత చాలు తన జీవితానికి" అనిపించింది "ప్రభూ! నన్నెప్పుడూ వదిలి వెళ్లవుగా" అంది.

"ఎప్పుడూ వెళ్లను" అన్నాడు గద్గదంగా తల నిమురుతూ.

"రేపు సెలవు పెట్టి పెళ్లికి కావల్సినవన్నీ కొనుక్కుందామా" అంది.

"సరే, ముందు కాస్త చల్లని నీళ్లతో ముఖం కడుక్కో కాఫీ కలుపుతాను" అన్నాడు.

తన్మయి సంతోషంగా లేచింది.

★★★

మనసంతా నిండిన హుషారుతో తెల్లారగట్లే మెలకువ వచ్చింది తన్మయికి. తనకెంతో ఇష్టమైన చలికాలపు రోజులవి. దుప్పటీ కప్పుకునే వాకిట్లోకి వచ్చింది. ముందురోజు వేసిన ముగ్గు ఇంకా అందంగా అలానే ఉంది. విరబూసిన బంతి పూలు, గన్నేరు పూలు ఉదయపు ఆహ్లాదానికి తలలూపుతున్నాయి.

ఆకాశం కేసి చూస్తూ "అజ్ఞాత మిత్రమా! నా జీవితం అందమైన మలుపు తిరగబోతూంది. నువ్వు నాతో తోడుండి అన్నీ సక్రమంగా జరిగేటట్లు చెయ్యవూ?" అని దీర్ఘంగా ఊపిరి పీల్చింది.

తనకు, ప్రభుకు పెళ్లి. తమ అపురూపమైన పెళ్లికి మేఘాలే పందిళ్లు, పక్షుల కిలకిలారావాలే మంగళ వాయిద్యాలు, ఆశీస్సులందజేస్తున్నట్లు తలలూపుతున్న వృక్షాలే బంధువులు. ఈ పెళ్లికి అయినదానికీ కాని దానికీ అలిగే మగపెళ్లి వారు లేరు, అసంతృప్తితో విసుక్కునే ఆడపెళ్లి వారు లేరు. అటూ ఇటూ ఏ గందరగోళమూ లేదు. అందమైన నిశ్శబ్దపు, అచ్చమైన రహస్యపు పెళ్లి. చిన్నప్పుడు కథల్లో విన్న "గాంధర్వ వివాహం" అంటే ఇలాగే ఉండేదా? ఏమో. ఇలా ఏ తంతూ లేకుండా మనసుకి ప్రశాంతంగా, హాయిగా అనిపిస్తూంది. ఒకర్నొకరు ఇష్టపడే ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించేందుకు అసలింత కంటే ఏం కావాలి?

"పొద్దున్నే మెలకువ వచ్చేసిందా?" చిన్నగా నవ్వేడు అప్పుడే లేచిన ప్రభు లోపలికి వస్తున్న తన్మయిని చూస్తూ.

తన్మయి ప్రశాంతంగా చిరునవ్వు నవ్వి "థాంక్యూ" అంది.

"దేనికి?" అన్నాడు.

"అన్నిటికీ" అంటూ బాబుని నిద్రలేపి స్కూలుకి తయారుచేయసాగింది.

షాపింగుకు బయలుదేరుతూ ఎందుకైనా మంచిదని సాయంత్రం లేటైతే బాబుని చూడమని తాయిబాకు చెప్పి వచ్చింది. తన్మయి తనకు ఇష్టమైన గంధం రంగు పట్టు చీర కొనుక్కుంది. ప్రభు తనకు నచ్చిన బట్టలు, బూట్లు సెలక్టు చేసుకున్నాడు.

"ఆఫీసుకి వేసుకునే బట్టలు కదా ఇవి" అంది తన్మయి.

"అవును పొద్దున్న పది గంటలకి కదా మన పెళ్లి, అట్నించటే నేను మళ్లీ ఆఫీసుకి వెళ్లి పోవాలి" అన్నాడు.

తన్మయి అతని వైపు ఆశ్చర్యంగా చూసింది. "ఎంత రిజిస్టరు పెళ్లయినా ఇంత ప్రాక్టికల్ గా ఉండాల్సిందేనా?" అదే అంది.

"నీకు తెలీనిదేవుంది, నాకు ఆర్భాటాలు నచ్చవని. అది సరే, ఆఫీసులో బోల్డు పని పెండింగులో ఉంది. ఇక్కడ ఎంత తొందరగా తెమిలితే అంత మంచిది" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"మరి ఈ రోజంతా సెలవు..." అని తన్మయి అనబోతూండగా "నువ్వేదో బాధ పడ్తున్నావని సరేనన్నాను నిన్న" అన్నాడు.

మరో గంటలో "పూల దండలు ఆర్డరు ఇవ్వడం కూడా అయిపోయింది కదా, ఇక నిన్ను బస్సెక్కించి నేను ఆఫీసుకి వెళ్తాను మరి" అన్నాడు.

తన్మయి "మంగళ సూత్రాలు, మెట్టెలు కొనాలి కదా" అంది.

ప్రతిగా చిన్న నవ్వు నవ్వి "నీకు నచ్చితే నువ్వు కొనుక్కో" అని పర్సులోంచి "ఇదుగో క్రెడిట్ కార్డు అని కొత్తగా వచ్చింది. ఇది పెద్ద షాపుల్లోనే ఏక్సెప్టు చేస్తున్నారు. నిన్నక్కడ దించి నేను వెళ్తాను పద" అన్నాడు.

షాపులోకెళ్లి తనకు నచ్చిన పెద్ద మంగళ సూత్రాలు, చుట్లు, పిల్లేళ్లు  వెరైటీలు చూస్తూందే కానీ ప్రభు కూడా  తనతో ఉంటే బావుణ్ణని అనిపించసాగింది.

"పెళ్లి" జీవితంలో అతి ముఖ్యమైన సంఘటన. అది ఇతనికి ఎందుకు ఇంత మామూలుగా అనిపిస్తూంది?

తప్పు తన ఆలోచనల్లో ఉందా? లేదా అతని పద్ధతిలో ఉందా? ఏదేమైనా పెళ్లి పేరుతో తన జీవితంలో ఇంత వరకూ జరిగిన అనేక బాధాకరమైన సంఘటనల కంటే ఇది నయమే.

ఇక్కడ తనకి నచ్చినదేదైనా చేసే జీవితం ఉంది ఇప్పుడు. “తనకు నచ్చనిదేదీ చెయ్యక్కరలేదు.” ఆ ఆలోచనే ఎంతో ఆనందంగా ఉంది.

రెడీమేడ్ లో చూసిన మెట్టెలు నచ్చక పక్కనే సందులో ఉన్న చిన్న దుకాణాల దగ్గిర నడవసాగింది.

జీవితాంతం తన కూడా నడవవల్సిన వాడు తనతో ఈ కాస్సేపు ఉండలేనట్లు వెళ్లిపోయేడు "ప్చ్"  అని నిట్టూర్చింది.

అంతలోనే "జీవితాంతం" అన్నది తల్చుకుని తనలో తనే నవ్వుకుంది.

అసలు ఆ పదానికి అర్థం ఉందా?

యౌవనం లోకి అడుగుపెడ్తూనే ఎన్ని కలలు కంది తను! శేఖర్ తనతో జీవితాంతం ఉంటాడని, అతనితో తనున్న ఇల్లు, జీవితం శాశ్వతం అనీ అనుకుంది. కానీ అవన్నీ కలలుగా మాత్రమే మిగిలిపోయాయి.

"ఇంతకంటే బరువైన మెట్టెలు కావాలంటే చేసి ఇస్తాం. కానీ వారం పడుతుంది" అంటున్నాడు షాపతను.

ఈ లోకంలోకి వచ్చింది. "ఊహూ, అంత సమయం లేదు" అని ముందుకు నడిచింది.

తమ అమ్మమ్మ కాళ్లకి పెద్ద మెట్టెలు, కడియాలు ఉండేవి. తనకెందుకో అలాంటి మెట్టెలంటే భలే ఇష్టం.  శేఖర్తో పెళ్లిలో చీరలు, నగల మాట దేవుడెరుగు కనీసం పూల జడతో సహా ఏదీ తనకి నచ్చినదేదీ జరగలేదు.  అన్నీ నిన్నో మొన్నో జరిగినట్టు గుండె గాయాలై బాధతో సలుపుతూ ఉన్నాయి. పెళ్లి మాటల్లో కట్నాల బేరాలు, పెళ్లిలో ఆడపడుచు లాంఛనాల అలకలు, భోజనాల గొడవలు, పెళ్లి కాగానే సారె గోల, అడుగడుగునా శేఖర్, అతని తల్లిదండ్రుల అసంతృప్తి వేధింపులు, తన తల్లిదండ్రుల దు:ఖం, ఈసడింపు మాటలు... అది పెళ్లి కాదు. ఇరు కుటుంబాల మధ్య యుద్ధమది. ఎవరి గోలా, గొడవా లేకుండా ఇలా చెప్పాపెట్టకుండా పెళ్లి చేసుకోవడం ఎంత ఉత్తమమో అనిపించసాగింది. తనకు నచ్చినవన్నీ కొనుక్కుని బస్సెక్కింది తన్మయి. బంగారు రంగు అంచు ఉన్న తెల్లని సిల్క్ చీర అందులో ఒకటి.

ఇంటికి వెళ్లగానే కవరు లోంచి పైకి తీసి మురిపెంగా చూసుకుంది. భుజమ్మీద వల్లెవాటుగా వేసుకుని అద్దంలో చూసుకుంది. శరీరం ఒకప్పటికన్నా బాగా చిక్కిపోయినా, అన్ని విధాలా నచ్చిన పెళ్లికి ఆయత్తమైన ముఖం ముగ్ధ మనోహరంగా కొత్త అందాన్ని సంతరించుకుంది.

బట్టలు దగ్గర్లోని టైలర్కి ఇచ్చి, పొద్దున్న మర్చిపోయిన బంగారు రంగు మట్టి గాజులు రెండు డజన్లు కొనుక్కుని మళ్లీ ఇంటికి వచ్చేసరికి కూడా ప్రభు రాకపోయేసరికి రోడ్డు చివరి వరకూ వెళ్లి ఆత్రంగా ఆఫీసుకి ఫోను చేసింది.

అవతలి నుంచి ప్రభు గొంతు విన్నాక కానీ స్థిమితం కలగలేదు.

"ఇంట్లో ఫోను పెట్టించుకోవాలిక, లాభం లేదు మర్నాడే వెళ్లి టెలిఫోను ఎక్స్ఛేంజీలో అప్లికేషను పెట్టాలి. అసలే ఆరునెలలయినా పడుతుంది ఫోను రావడానికి" తనలో తను అనుకుని నిట్టూర్చింది.

రాత్రికి ఇంటికి వస్తూనే అన్యమనస్కంగా కనిపించేడు ప్రభు.

భోజనం చేసి పడుకోవడానికి తన చాపా, దుప్పటీ సర్దుకుంటున్న ప్రభుతో "అలా కాస్సేపు డాబా మీదికి వెళ్లొద్దామా" అంది.

వెన్నెల రోజులు కావడంతో దేదీప్యమానంగా వెన్నెల కాస్తూంది.

సంతోషంగా "మన పెళ్లి పౌర్ణమి నాడు వస్తూంది తెలుసా?" అంది ప్రభు చేతిని పట్టుకుని.

"అవునా?" అని "మా అమ్మానాన్నలు నన్ను కన్నవాళ్లు కాదు, పెంచారు" అన్నాడు బొత్తిగా సంబంధం లేకుండా హఠాత్తుగా.

తన్మయి ఆశ్చర్యంగా చూసింది. “ఇన్నాళ్లూ ఎందుకు చెప్పలేదు? ఇప్పుడెందుకు చెప్తున్నట్టు?”

“మా అసలు అమ్మ, నన్ను పెంచిన అమ్మకి చెల్లెలు వరస అవుతుంది. ఆ విషయం నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు. వాళ్ల ఆర్థిక పరిస్థితి బాలేకే నన్ను పెంచుకోవడానికి ఇచ్చేరు. ఒక విధంగా ఇప్పుడు వాళ్లకి నేనే ఆధారం. మన పెళ్లి వల్ల నన్ను పెంచిన అమ్మా, నాన్నా ఎలాగూ దూరం అవుతారు. అందుకు నాకు పెద్దగా బాధ లేదు, వాళ్లకి నా మీద ఆధారపడాల్సిన అవసరం లేదు. కానీ నేనే ఆధారం అయిన నన్ను కన్న వాళ్ల సంగతి ఏవిటి? నేను డబ్బులు పంపిస్తే గానీ గడవని పరిస్థితి వాళ్లది" అన్నాడు దీర్ఘంగా నిట్టూర్చి.

"ఊ...ఎప్పటిలానే డబ్బులు పంపిస్తే తీసుకోరంటావా?" సాలోచనగా అంది తన్మయి.

"ఏమో తనూ, డబ్బుల కంటే వాళ్ల మాట వినలేదనే పంతం ఎక్కువ కావచ్చు. నన్ను కుటుంబం నుంచి వెలివెయ్యొచ్చు. నన్ను కన్న ఋణం తీర్చుకునే అవకాశం నాకు లేకుండా పోతుందనే బాధగా ఉంది. పైగా నా మీద కోపంతో వాళ్లు కష్టాల పాలవుతారని దిగులుగా ఉంది" అన్నాడు.

"నువ్వు చాలా మంచి వాడివి ప్రభూ! నిన్ను వాళ్లు ఎప్పటికీ దూరం చేసుకోరు" బాధపడకు అనునయంగా అంది తన్మయి.

"ఏమో తనూ! మన పెళ్లయ్యేక వాళ్లకి ఎలా చెప్పాలో ఆలోచించాలి" అన్నాడు ఇంకా ఆలోచిస్తూ.

తన్మయి అతని చేతిని తన చేతిలోకి తీసుకుని "నన్ను దేనికీ దిగులు పడొద్దని నువ్వు ఇలా బెంబేలు పడితే ఎలా?" అని "అన్నట్టు నీకు చెల్లెలు ఉంది కదా తనకేమైనా కొందామా" అంది.

"ఒక అక్కా, అన్నయ్యా కూడా ఉన్నారు. అవునూ, ఏవిటీ వాళ్లకు ఏమైనా కొనడమంటే ఆడపడుచు లాంఛనాలా?" అని చిన్నగా నవ్వి "ఈ కట్నాలు, లాంఛనాలు, ఖర్చులతో కూడిన వివాహ వ్యవస్థంటేనే నాకు చాలా చికాకు" అంటూ లేచేడు.

"మరి అన్నయ్యా, అక్కా ఉండి కూడా మీ వాళ్లు ఎందుకు నీ మీద ఆధారపడి ఉన్నారు?" అంది.

"వాళ్లు పెద్దగా చదువుకోలేదు, వాళ్ల జీవితాలు గడవడమే అతి కష్టం, ఇక అమ్మా, నాన్నలనేం చూస్తారు?" అన్నాడు.

తన్మయికి ప్రభు ఎంతో ఉన్నతంగా కనిపించేడు. మంచి కొడుకు కాలేని వాడు, మంచి భర్త కూడా కాలేడన్నది తను బాగా నమ్ముతుంది. అతను తన వాళ్లని చూసుకోవాలనుకోవడం అతనికెంత బాధ్యతో తనకూ అంతే.

అదే చెప్పింది.

"నాకు తెలుసు తనూ!" గద్గదంగా అంటూ హత్తుకుని నుదుటి మీద ముద్దు పెట్టేడు.

తనెంతో అదృష్టవంతురాలు. అసలు ఇంత మంచి వ్యక్తి తనని కోరి, వలచి రావడం ఇంకా తనకి కలగా అనిపిస్తూంది.

కిందికి వస్తూనే ప్రశాంతంగా నిద్రపోతున్న బాబు నుదుటి మీద ముద్దు పెట్టి "మన కష్టాలన్నీ తీరిపోతున్నాయి నాన్నా, ఇక మనకే భయం లేదు" అంది.

★★★

పెళ్లి రోజు రానే వచ్చింది. తలారా స్నానం చేసి వదులుగా జడ వేసుకుంది. కళ్లకు సన్నని కాటుక, నుదుటిని తిలకం బొట్టు దిద్దుకుంది. తలలో తనకి ఇష్టమైన జాజిపూల తురుముకుంది.

గంధం రంగు పట్టుచీర, చేతికి బంగారు రంగు గాజులతో మెరిసిపోసాగింది తన్మయి.

"బాబుని నేను సూస్తాలే తియ్యి. ఎప్పుడూ సల్లగ ఉండుండ్రి" సంతోషంతో మెటికలు విరుస్తూ పెద్దదానిలా దీవించింది తాయిబా.

బండి మీద తన్మయి కూర్చోగానే బాబు గేటు దగ్గిరికి పరుగెత్తుకొచ్చి "టా టా" అన్నాడు.

వాడికి ఏం అర్థమయ్యిందో తెలీదు. సంతోషంగా చేతులూపేడు. వీధి మలుపు తిరగగానే ప్రభు డ్రైవ్ చేస్తూనే తన భుజమ్మీద ఉన్న తన్మయి చేతిని తీసి నడుము చుట్టూ మార్చుకున్నాడు. బండి అద్దంలో నుంచి కనబడుతున్న అతని కళ్లల్లోని చిలిపిదనాన్ని చూసి నవ్వింది. అనుకున్న సమయానికి రిజిస్ట్రార్ ఆఫీసుకి సిద్దార్థ భార్యతో బాటూ వచ్చాడు. సంతకాలు, దండలు మార్చుకోవడం, తాళి కట్టడం అన్నీ చకచకా జరిగిపోయాయి.

తన్మయికి ఇదంతా నిజమో, కలో అన్నట్లు భ్రాంతి కలగసాగింది.

వయసొచ్చిన వివాహానికి వేద మంత్రాలు అవసరం లేదని, మనసులు కలిస్తేనే అత్యంత ఆనందదాయకమైన, ఉన్నతమైన వివాహమనీ అర్థం అయ్యింది. ప్రభు చిటికెన వేలు పట్టుకుని దిగిన రిజిస్ట్రాఫీసు మెట్ల దారే అపురూప సప్తపదయ్యింది. చల్లగా వీస్తున్న గాలి వల్ల చుట్టూ ఆవరణలో ఉన్న చెట్ల చిన్న చిన్న పసుపురంగుటాకులు ఎగిరి వస్తూ ఆకాశం తమ పెళ్లికి సన్నగా పూల వర్షం కురిపిస్తున్నట్లు అనుభూతి కలిగింది తన్మయికి.

బయటికి వస్తూనే దగ్గర్లో ఉన్న రెస్టారెంటు పేరు చెప్పి "భోజనాలు చేసెళ్దాం" అంది తన్మయి.

ప్రభు కాదనకుండా ముందుకు దారి తీసేడు. తన్మయికి ఆ మాత్రానికే ఎంతో సంతోషం వేసింది. భోజనాలైన మరో గంటలో సిద్దార్థ, అతని భార్య మరోసారి మన:పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకున్నారు. తన్మయిని బస్సెక్కించి ఆఫీసుకి వెళ్లిపోయేడు ప్రభు. దండల్ని తెచ్చుకున్న చేతి సంచీలో పెట్టి, తను కూర్చున్న సీటు పక్కనే ఖాళీ సీట్లో పెట్టుకుంది. మెడలో మెరుస్తూన్న తాళి బొట్టుతో, కాళ్లకి మట్టెలతో కొత్త పెళ్లికూతురన్న సంగతి చుట్టూ అందరికీ ఎక్కడ తెలుస్తుందోనని కొంగు భుజం చుట్టూ కప్పుకుంది. తెల్లారగట్ల నిద్ర లేవడం వల్ల బస్సెక్కుతూనే నిద్ర ముంచుకొచ్చినా ఉదయం నుంచీ జరిగినవన్నీ మళ్లీ మళ్లీ తల్చుకుంటూ కిటికీ లోంచి బయటికి చూడసాగింది తన్మయి.

వీధి మొదట్లో ఉన్న దేవ గన్నేరు చెట్టు కింద రాలిన పూలు నాలుగు చేతిలోకి తీసుకుంటూ

"మిత్రమా! అన్నీ అనుకున్నట్లు జరగడానికి సహాయపడడమే కాకుండా నాకోసం నీ బహుమతిగా నాకిష్టమైన ఈ పుష్పాల్ని కూడా ఇక్కడుంచావన్నమాట. నీకెలా కృతజ్ఞతలు చెప్పుకోను" తనలో తనే అనుకుంటూ పూలని అపురూపంగా ఇంటికి తెచ్చి చిన్న గిన్నెలో నీట్లో వేసింది. .

పరుగెత్తుకు వచ్చిన బాబుని ముద్దులతో ముంచెత్తింది. తల్లి ఆనందానికి కారణం తెలియకపోయినా సంతోషంతో గంతులు వేసేడు. తాయిబా ఎదురొచ్చి దిష్టి తీసింది.

"ఎంత ముద్దుగ ఉన్నావు మేడం, ఇంద ఈ ఖీర్ తాగు" అంటూ సేమ్యా పాయసం కప్పు చేతికిచ్చింది.

సంతోషంతో తాయిబాని కౌగిలించుకుంది తన్మయి.

లోపలి నుంచి తాయిబా కోసం కొన్న చీర పట్టుకొచ్చి ఇస్తూ "వద్దనకు తాయిబా, నువ్వే నాకు అమ్మయినా, నాన్నయినా, తోబుట్టువయినా" అంది తన్మయి.

పెళ్లి కబుర్లు ఇద్దరూ కులాసాగా చెప్పుకుంటూండగానే చీకటి పడసాగింది.

"బాబుని నాల్నాళ్లు మా ఇంటి కాడ పండబెట్టుకుంటాను" ముసిముసిగా నవ్వుతూ తీసుకెళ్లింది తాయిబా.

ప్రభు వచ్చే సమయానికి తలారా స్నానం చేసి ఇష్టంగా కొనుక్కున్న బంగారు అంచు తెల్ల సిల్కు చీర కట్టుకుంది. తలలో దేవ గన్నేరు పువ్వొకటి పెట్టుకుంది. అద్దంలో తనకు తనే దేవకన్యలా కనబడింది తన్మయికి.

"జీవితంలో కష్టసుఖాలన్నీ అవగతమయ్యేక చేసుకునే పెళ్లే నిజమైన పెళ్లేమో. శరీరమూ, మనస్సూ ఇప్పటికి పరిపక్వమయ్యాయి. ప్రభుతో తను పంచుకోబోయే మొదటిరాత్రి అత్యంత మరపురానిదిగా, అందంగా ఉంటుంది. తనకు నమ్మకముంది."

శాండిల్ ఉడ్ అగరొత్తుల పరిమళం హాయిగా, ప్రశాంతంగా ఉంది. టేప్ రికార్డర్ లో నుంచి సన్నగా వినిపిస్తున్న హరి ప్రసాద్ చౌరాసియా వేణు నాదం వింటూ తన్మయంగా మంచమ్మీద జేరబడి కళ్లు మూసుకుంది తన్మయి. కాస్సేపట్లో ప్రభు వస్తూనే కళ్లెగరేసి చిన్నగా నవ్వేడు. సిగ్గుగా కళ్లు దించుకుంది. స్నానం చేసి తన్మయి ఇచ్చిన తెల్లని లాల్చీ, పైజమా వేసుకున్న ప్రభు ని చూడగానే గుండెల మీద వాలిపోవాలన్నంత తమకం కలిగింది తన్మయికి.

కానీ ప్రభు ఏదో దిగులుగా ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తూంది.

"అలసటగా ఉందా?" అంది.

నిశ్శబ్దంగా భోజనం చేస్తున్న ప్రభు తల మీద చెయ్యి వేసి చూసింది ఒంట్లో బాలేదేమోనని. భోజనం కాగానే కంప్యూటరు ముందు కెళ్లి కూర్చుని ఆఫీసు పని చేసుకోసాగేడు. ఈ మధ్యే కేబుల్ ద్వారా ఇంటర్నెట్టు వచ్చింది. కేబుల్ టీవీ ఉన్నా తన్మయికి అదేపనిగా టీవీ ముందు కూర్చోవడం ఇష్టం ఉండదు. కానీ ఈ ఇంటర్నెట్టు వల్ల ఆఫీసు పని ఇంటికీ వచ్చిందిక.

పదకొండుగంటల వేళైనా కదిలిరాని అతని వైపు చూసి నిట్టూరుస్తూ "నాకు నిద్రొస్తూంది బాబూ" అంది.

"పడుకో మరి" చిన్నగా అన్నాడు.

తను విన్నది నిజమేనా అన్నట్లు వింతగా చూసింది అతని వైపు.

తన్మయి భావన అర్థమయ్యినవాడిలా "క్షమించు, నాకు మనసేం బాలేదు" అన్నాడు.

దగ్గిరికెళ్లి అనునయంగా "ఇవేళ మన పెళ్లయిన మొదటి రోజు" అంది తన వైపు తిప్పుకుంటూ.

దు:ఖం నిండిన అతని కళ్లని చూసి చప్పున పక్కన కూచుంటూ "ఏమైంది" అంది ఆదుర్దాగా.

"సాయంత్రం ఇంటి నుంచి ఫోను చేసేరు. ఎంత ప్రయత్నించినా ఉదయం మనం పెళ్లి చేసుకున్నామన్న సంగతి చెప్పడానికి ధైర్యం చాలలేదు. ఏదో అపరాధభావన నన్ను చుట్టుముట్టేస్తూంది" అని తన్మయి ఒళ్లో తల వాల్చి దు:ఖ పడసాగేడు.

56

పెళ్లయిన మొదటి రాత్రి ప్రభు దు:ఖంతో భారమై, దిగులుగా గడిచింది తన్మయికి.

ఉదయం లేస్తూనే తన్మయి కళ్లలోకి చూడలేనట్లు కళ్లు దించుకుని "నిన్ను నిరాశ పరిస్తే నన్ను క్షమించు" అన్నాడు.

పెళ్లయితే చేసుకున్నాడు గానీ అతని మనస్సులో అపరాధభావన వెంటాడుతోందని అర్థమైంది తన్మయికి.

తన్మయి నెమ్మదిగా అతని తల నిమిరి "ఫర్వాలేదు, ముందు మన సమస్యలన్నీ చక్కబడనీ" అని బాబుని తీసుకురావడం కోసం తాయిబా దగ్గిరికి వెళ్లింది.

తాయిబా ఏదో నవ్వులాటగా అనబోయి, సీరియస్ గా ఉన్న తన్మయి ముఖాన్ని చూసి ఆగిపోయింది.

"థాంక్స్ తాయిబా, రాత్రి వీణ్ణి చూసుకున్నందుకు" అంది తన్మయి.

"ఇగో మేడమ్, నాల్నాళ్లు ఈడనే పంటడులే" అంటున్న తాయిబా వైపు చూసి "ఫర్వాలేదు" అని చిన్న నవ్వు నవ్వింది.

ఆ నవ్వులో నిర్లిప్తత తాయిబా గమనించిందో లేదో తెలీదు గానీ తన్మయి కళ్లు దించుకుని అక్కడి నుండి వచ్చేసింది.

"ఇంట్లో ఉంటే ఇలాంటి ఆలోచనలు త్వరగా వదలవు" అనిపించి బాబుని స్కూలుకి పంపించి తను కూడా త్వరగా కాలేజీకి తయారయ్యింది.

తాళం వెయ్యబోతూ లోపలికి చూసింది. ప్రభుకి పెట్టిన లంచ్ బాక్సు వంటింటి గట్టు మీదే ఉంది.

పెళ్లి చేసుకోకముందే ఇవన్నీ ఊహించే, ఇతన్ని సంవత్సరం పాటు ఆలోచించుకోమని చెప్పింది. ఇన్నాళ్లు ఆగిన తర్వాత కూడా తనే కావాలనుకుని వచ్చి ఇంకా ఎందుకు బాధపడ్తున్నట్టు? ఇతనికి అపరాధభావన ఎందుకు వెంటాడుతున్నట్టు? ఎవరితో చెప్పలేకుండా, ఎవరినీ ఒప్పించలేకుండా పెళ్లికి ఎందుకు సిద్ధపడినట్టు?

ఏదేమైనా సిద్దార్థ అన్నట్టు "తను అతనికి సరిపడా సమయం ఇచ్చింది. అయినా అతను బాధ పడడం తనకు సంబంధం లేని విషయం. ఇదంతా తన సమస్య కాదు, అతని సమస్య".

కానీ అలా కొట్టిపారేయడానికి సాధ్యం కావడం లేదు తన్మయికి. ప్రభు సమస్యలన్నీ తన జీవితంతో ముడిపడి ఉన్నవే మరి!

కాలేజీకి బండి మీద వెళ్తున్నంత సేపూ "అతను ఈ పరిస్థితుల నుంచి త్వరగా తేరుకోవాలంటే ఏం చెయ్యాలా అని" ఆలోచించసాగింది.

బస్టాండు దాటుతూండగా పరిచయమైన ముఖమేదో తననే చూస్తున్నట్టనిపించి వెనక్కి చూసింది. హైదరాబాదులో ఉండే పెద్దమ్మ భర్త. ఇక్కడెందుకున్నాడు? వెనక్కి వెళ్దామా అని ఒక్కసారి ఆలోచించి, విరమించుకుంది. ఎప్పుడెళ్లినా ఒక్క మాట కూడా మాట్లాడడం ఇష్టం లేనట్లు మొహం పెట్టుకుని ఉంటాడు. ఇప్పుడు వెనక్కి వెళ్తే మాత్రం పలకరిస్తాడా! బండి అనుకోకుండా ఆగిపోవడం తో పక్కకు తీసి కిక్కు కొడుతూ అద్దంలో చూసుకుంది. బయలుదేరే హడావిడిలో చూసుకోలేదు. పసుపుతాడు, మంగళ సూత్రాలు బయటికి వేళ్లాడుతున్నాయి. ఆయన చూసి ఉంటాడా? అందుకేనా అలా చూస్తున్నాడు తన వైపు? ఇప్పుడు ఇంటికెళ్లి పెద్దమ్మకు చెపితే ఆవిడ అమ్మకు ఫోను చేసి చెప్పక మానదు. తనంతట తనుగా చెప్పకుండా ఇలా ఎవరి ద్వారానో తెలిస్తే తల్లిదండ్రులకి కోపం రాకమానదు. అసలే ఒక పక్క ప్రభు వాళ్ల వాళ్లకు తెలిస్తే ఏం గొడవ అవుతుందోనని భయపడుతున్నాడు. ఈ సమయంలో తన వాళ్లకు తెలిసి వీళ్లు ప్రభు మీదికి గొడవకు వస్తే?

కాలేజీకి వెళ్లిన తర్వాత కూడా తెగని ఆలోచనలతో చెమటలు పట్టసాగేయి. సమయానికి సిద్దార్థ కూడా రాలేదు ఆవేళ కాలేజీకి. ఎవరో చెప్పేలోగా తల్లిదండ్రులకి తనే ఫోను చేసి చెప్పాలని నిర్ణయించుకుంది.

★★★

ఫోను ఎత్తి అట్నుంచి నిశ్శబ్దంగా వింటూంది జ్యోతి. తల్లిదండ్రులకి వార్త తన ఫోను కంటే ముందే తెలిసిందని గ్రహించింది తన్మయి.

ఆశ్చర్యకరంగా తన్మయి చెప్పింది శాంతంగా విని " సర్లే, మీ ఇద్దరికీ పెళ్లి జరగాలని రాసి పెట్టి ఉంది. ఇక అంతా మంచే జరగాలని కోరుకుందాం, కానీ ఏమోనమ్మా ఇదంతా ఎక్కడికి దారితీస్తుందో, జాగ్రత్తమ్మా" అంది జ్యోతి.

తండ్రి మాట్లాడనే లేదు.

ఇంటికి రాగానే "హమ్మయ్య ఒక భారం తీరింది" అనిపించింది తన్మయికి.

ఇంత సులభంగా తల్లిదండ్రులకి తను చెప్పగలుగుతుందని, వాళ్లు ఒప్పుకుంటారని అనుకోలేదు.

“తనని చూడడానికి వచ్చినపుడు ప్రభుని చూసి మరి అంత రాద్ధాంతం ఎందుకు చేసేరో?! ఈ పెద్దవాళ్లు ఎప్పుడూ ఓ పట్టాన అర్థం కారు.”

తన వాళ్లు ఒప్పుకున్న సంగతి ప్రభుకి తెలిస్తే ఎంతో సంతోషిస్తాడు. ఇక ప్రభు వైపు వాళ్లు కూడా ఒప్పుకుంటే చాలు. కాదు కాదు, ప్రభు తన వాళ్లని ఒప్పించగలిగితే చాలు. మొహం కడుక్కుని కాటుక, బొట్టు పెట్టుకుని ఏదో కొత్త సౌందర్యంతో తళుక్కున మెరిసిపోతున్న తల్లిని అదే పనిగా చూస్తున్న బాబుని అడిగింది.

"ఏంటమ్మా అలా చూస్తున్నావు?"

"ఉహూ" అని తలాడించి మంగళ సూత్రాల్ని చేత్తో ముట్టుకుని గలగలా మోగించి కిలకిలా నవ్వేడు.

దగ్గిరికి తీసుకుని ఒళ్లో కూచో బెట్టుకుని "ఇక మీదట ప్రభు అంకుల్ ని నువ్వు "డాడీ" అని పిలవాలి" అంది.

తలాడించేడు కానీ అర్థం కానట్టు చూసేడు.

"ఎందుకంటే ఇప్పుడు అమ్మా, అంకుల్ పెళ్లి చేసుకున్నారు. ఇక మీదట మనం ముగ్గురం ఎప్పుడూ కలిసే ఉంటాం. సరేనా?" అంది.

"ఊ.." అని "మరి నాన్న?" అన్నాడు.

"మీ నాన్న మన దగ్గిర నుంచి ఎప్పుడో వెళ్లిపోయాడు కదా. పైగా వేరే ఎవర్నో పెళ్లి కూడా చేసుకున్నాడు. ఎప్పుడూ మన దగ్గిరికి రాడు, రాకూడదు. ఇప్పుడు మనం ముగ్గురం ఒకటి. ఇక ప్రభుయే నీకు డాడీ" అంది.

వాడి చిన్ని మనసుకి ఏం అర్థమయ్యిందో, ఎంత అర్థమయ్యిందో తెలీలేదు కానీ ఆ సాయంత్రం ప్రభు రాగానే "డాడీ" అని దగ్గిరికి వెళ్లేడు.

ప్రభు నవ్వుతూ "ఏవిటి వీడు పిలుపు మార్చేసేడు?" అని వాడి వైపు తిరిగి "అయినా ఇదే బావుందిలే. అలానే పిలువు" అన్నాడు.

తన్మయి తల్లిదండ్రులు ఒప్పుకోవడాన్ని అతి మామూలుగా తీసుకుంటున్నట్టు " మీ వాళ్లు ఒప్పుకోవడంలో ఆశ్చర్యం లేదులే" అంటూ వాకిట్లో బాబు సైకిలు వైపు చూస్తూ, "ఏవిటీ నవతా ట్రాన్స్ పోర్ట్ లో సామాన్లు వచ్చేసేయా?" అన్నాడు.

"ఊ" అంది టీ కప్పు చేతికిస్తూ ప్రభు మాటకి అర్థం ఏవిటో ఆలోచించడం కూడా ఇష్టం లేదు తన్మయికి. ఏదేమైతేనేం తనని అర్థం చేసుకుంది తల్లి. అదే తనకి పదివేలు.

తల్లిదండ్రుల దగ్గిరే వదిలేసిన డబల్ కాట్, డ్రస్సింగ్ టేబుల్, టీ.వీ, వంట సామగ్రి వంటి సామాన్లు ఇప్పటికి తెప్పించుకోవలసిన అవసరం పడింది. ఇక పరుపు, బాబుకి వేరే వైరు మంచం, చిన్న కూలర్ కూడా జీతాలు రాగానే ఆ వారంలోనే అమరాయి. బాబుతో పరుగులు తీసి ఆడుతున్న ప్రభుని, కిలకిలా నవ్వుతూ పరుగెడుతున్న బాబుని చూస్తూ సంతోషంగా అరుగుమీద జేరబడింది తన్మయి. ఇటువంటి ఆనందదాయకమైన రోజొకటి వస్తుందని తను కల్లో కూడా అనుకోలేదు. తనకు ఆపరేషను అయినప్పుడు చూడడానికి వచ్చినప్పుడు తండ్రి చేసిన రాద్ధాంతం గుర్తుకొచ్చింది.

"ఇతను నీకు భర్త కాగలడేమో గానీ, పిల్లాడికి తండ్రి కాగలడా?"

ఎక్కడో తన మనస్సులో ఆ మాట భయం భయంగా ఇప్పటి వరకూ తనని దొలుస్తూనే ఉంది. ఇక ఇప్పుడు తనకా బెంగ తీరింది. ప్రభు ఇంటికి వచ్చిన దగ్గర్నుంచీ నిమిషం వదలకుండా వెంట వెంటే తిరుగుతూ కబుర్లు చెప్తూన్న బాబుని ఓపిగ్గా చూసుకుంటున్న ప్రభు మీద మనసంతా కృతజ్ఞత నిండిపోసాగింది.

"ఇది చాలు మిత్రమా!" అనుకుంది మనస్సులో.

★★★

రెండు వారాలు గడుస్తున్నా ప్రభు దిగులు తగ్గకపోయేసరికి "పోనీ, మీ అక్కయ్యకు ఉత్తరం రాయరాదూ? తనైతే అర్థం చేసుకుంటుందేమో" అంది తన్మయి

"ఊ..." అన్నాడు.

నాల్రోజుల్లో ఇంటికి వస్తూనే సాయంత్రం సంతోషంతో వెలిగిపోతూ ఉన్న ప్రభు ముఖాన్ని చూస్తూనే ఆనందపడింది తన్మయి.

"అక్క ఫోను చేసింది. నన్నేం బాధ పడొద్దని, అమ్మ, నాన్నలకి మంచి సమయం చూసి చెప్పి ఒప్పించే బాధ్యత తనదనీ చెప్పింది తెలుసా" అన్నాడు తన్మయిని ఎత్తుకుని గాల్లో గిరగిరా తిప్పుతూన్నంత పనిచేసి.

ఆ రాత్రి తన చిన్ననాటి కబుర్లు ఉత్సాహంగా చెప్పసాగేడు ప్రభు. అక్క, అన్నలతో తను గడిపిన చిలిపి బాల్యం గుర్తు తెచ్చుకుంటూ నవ్వుతున్న ప్రభు వైపు చూస్తూ "హమ్మయ్య" అని నిశ్చింతగా వెనక్కి జేరబడింది.

గది కిటికీ లోంచి వెన్నెల సరిగ్గా మంచమ్మీద పడుతోంది.

తన్మయి ఒళ్లో తల వాల్చి, ప్రశాంతంగా కళ్లు మూసుకుంటూ "తనూ! ఒక పాట పాడవూ!" అన్నాడు లాలనగా.

"రెల్లు పూలా పానుపు పైన జల్లుజల్లులుగా ఎవరో చల్లినారమ్మా వెన్నెల చల్లినారమ్మా...."

అని నెమ్మదిగా కృష్ణ శాస్త్రి గారి గీతం పాడసాగింది. గదిలో గోడగడియారం, పుస్తకాలు... అన్నీ తన్మయంగా వింటున్నట్టున్న లేత వెన్నెల వెలుగులో తన్మయి పెదవుల్ని చటుక్కున ముద్దు పెట్టుకున్నాడు.

పాట ఆగిపోయినా మాధుర్యం గదంతా పరుచుకుంది. సుతిమెత్తగా స్పృశిస్తున్న అతని సాంగత్యంలో తన్మయి వివశురాలై ఒదిగిపోయింది. ప్రభుతో గడిపిన ఆ తొలిరాత్రి జీవితంలో మొట్ట మొదటిసారి అత్యంత ఆనందాన్ని పొందింది తన్మయి. అదే చెప్పింది ప్రభుతో.

తన్మయిని తన కౌగిట్లో మరింత గాఢంగా దాచుకుంటూ "తనూ! మనిద్దరం ఎప్పుడూ ఒక్కటి. ఏ పరిస్థితుల్లోనూ మనం విడిపోకూడదు. నాకు ప్రమాణం చెయ్యి" అన్నాడు.

"ఊ...." అంది మరింత తన్మయత్వంతో కళ్లు మూసుకుంటూ.

అవేళ్టి నుంచి అన్నీ అందమైన రాత్రుళ్లే అయ్యేయి.

★★★

ఆ వారాంతం నిద్ర లేవంగానే ప్రభు "యాదగిరి గుట్ట చాలా బావుంటుందట. వెళ్లొద్దామా? మా ఆఫీసులో కొలీగ్స్ చెప్పడం చాలా సార్లు విన్నాను. పైగా మనం ఇప్పటివరకూ ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లలేదు కదా" అన్నాడు.

తలారా స్నానం చేసి కొత్తగా కొనుక్కున్న తెల్ల పంజాబీ డ్రెస్సు వేసుకుంది.

అద్దంలో చూసుకుంటూ "నీకు ఆరేళ్ల పిల్లడు ఉన్నడంటే ఎవరైన నమ్ముతరా మేడం" అన్న తాయిబా మాటలు గుర్తుకొచ్చి చిన్నగా నవ్వుకుంది.

బాబుని ముందు కూచోబెట్టుకుని బండి నడుపుతున్న ప్రభు నడుం చుట్టూ చేతులు వేసి కూచుని అతని భుజమ్మీద నిశ్చింతగా తల వాల్చింది.

"ఎన్ని నాళ్ల కల ఇది!" జీవితంలో తననుకున్న ఒక్కొక్కటీ నెరవేరడానికి ఇప్పటికి సమయం ఆసన్నమయినట్లుంది.

దారి పొడవునా తాడి చెట్లతో నిజంగానే గోదావరి ప్రాంతంలా ఉన్న ఆ ప్రాంతాన్ని చూడగానే తన్మయికి ఆనందం రెండింతలయింది. తాటి ముంజులు, తేగలు, సీతాఫలాల బాల్యం గుర్తుకొచ్చింది. గోధూళి వేళ వనజ, తను డాబా మీద కూర్చుని గంటలు, రోజుల తరబడి చెప్పుకున్న అంతులేని కబుర్లు జ్ఞాపకం వచ్చాయి. అప్పుడంతా భావి జీవితంలో అందమైన రోజుల కోసం తను కన్న కలలన్నీ ఇప్పుడు ప్రత్యక్షమవుతున్న విషయం వనజకు చెప్పాలి.

అదే చెప్పింది ప్రభుతో.

"ఉత్తరమేం ఖర్మ, నీకు మీ స్నేహితురాల్ని చూడాలని ఉంటే రాయచూరే వెళ్లొద్దాం. కానీ మీ వనజ వాళ్లింట్లో ఉండాలని మాత్రం చెప్పకు. నాకలా పరిచయం లేని ఎవరింట్లోనూ ఉండడం ఇష్టం ఉండదు. హోటల్ లో ఉందాం. మరో రెండు రోజులు సెలవు పెట్టుకుని ఆ చుట్టుపక్కల ఇంకేమైనా చూడడానికి ఉంటే అవి కూడా చూసుకుని వద్దాం" అన్నాడు.

తన్మయి ఆనందానికీ అవధులు లేవు. తన మనసెరిగి మసలుకునే సహచరుడు ప్రభు. దార్లో త్రోవ పక్క దేవగన్నేరు పూల చెట్టు దగ్గిర ఆపి, దోసిలి నిండా పూలు తీసుకొచ్చేడు. ప్రభుకెలా తెలుసు తనకిలా దోసిలి నిండా దేవగన్నేరు పూలంటే ఇష్టమని?! ఆ దోసిలిని అందుకుంటూంటే ఆ పూలన్నీ పై నుంచి కురుస్తున్నట్లు తన్మయత్వం కలగసాగింది. సంభ్రమాశ్చర్యాలతో ఆకాశం కేసి చూసింది.

కొత్తగా కొన్న కెమేరాతో త్రోవ పొడవునా ఫోటోలు తీసుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ముగ్గురూ ఆలయానికి చేరుకునేసరికి పదకొండు గంటల వేళయ్యింది. ఇంత మంచి మనసున్న ప్రభు ఎప్పుడూ బావుండాలని మనసారా వేడుకుంది భగవంతుణ్ణి.

"ఎందుకీ గుళ్లో జనం బాగా పలచగా ఉన్నారో" అంది తన్మయి చుట్టూ చూస్తూ.

ఆలయంలో కొట్టిన కొబ్బరి చిప్పని ప్రాంగణం లో కూచుని చిన్న ముక్కలు కొట్టి ఇద్దరికీ చెరోటి ఇచ్చి తనూ కాస్త నోట్లో వేసుకుని స్తంభానికి జేరబడి కూచున్న తన్మయి పక్కనే చున్నీ మీద తల వాల్చేడు ప్రభు. బాబు అక్కడక్కడే చుట్టూ తిరుగుతూ ఆడసాగేడు. తన్మయి ప్రభు వైపే ఆరాధనగా చూసింది. ఎంత మంచి మనిషి ఇతడు! తను ఏ జన్మలో చేసుకున్న పుణ్యం వల్లనో ఇప్పటికి ఇతన్ని కలుసుకోగలిగింది.

రామదాసు కీర్తన జ్ఞాపకం వచ్చింది.

"రామచంద్రుడితడు... రఘువీరుడు....కామిత ఫలములీయగలిగేనందరికీ"

హాయిగా కళ్లు మూసుకుంది. రెండు నిమిషాల్లో కళ్లు తెరిచే సరికి బాబు కనిపించలేదు. గాభరాగా ఒక్క ఉదుటున లేచి నిలబడింది.

ఆ అదురుపాటుకు కళ్లు తెరిచిన ప్రభు దిగ్గున లేచి చెమటలు కారుతున్న తన్మయిని చూస్తూనే "ఉండు, భయపడకు నేనటు వెళ్తాను, నువ్విటు చూడు" అంటు చప్పున కుడివైపుకు పరుగెత్తేడు. ఆలయం తలుపు దాటంగానే చిన్న చిన్న దుకాణాలు వరసగా ఉన్నాయి. జనం కొద్దీ మందే ఉన్నా చిన్న చిన్న దుకాణాల సందుల్లో ఏ మూలకి వెళ్ళేడో వెతికి పట్టుకోవడం చాలా కష్టం. తన్మయి ఆలయ ప్రాంగణంలో మైకులో ఎనౌన్సుమెంట్లు చేస్తున్న చోటికి చప్పున పరుగెత్తింది. అసలా గాభరాలో మైకు దగ్గిర కూచున్న అతను అడుగుతున్నా బాబు ఏ రంగు బట్టలు వేసుకున్నాడో చప్పున చెప్పలేకపోయింది. బుగ్గల మీద జారుతున్న కన్నీళ్లని తుడుచుకుంటూ తన చేతిలో ఉన్న కెమేరాలో ఫోటోల్ని వెనక్కి గబగబా తిప్పి చూస్తూ "నీలం రంగు నిక్కరు, ఎర్ర గళ్ల చొక్కా, ఆరేళ్ల పసివాడండీ, ప్లీజ్ త్వరగా అనౌన్సు చెయ్యండీ" అంది గాభరాగా.

అట్నించి ప్రభు బాబు దొరికేడా అంటూ పరుగెత్తుకు వచ్చి మళ్లీ మరో వైపుకి పరుగెత్తేడు. ఎవరైనా కావాలనుకుని ఎత్తుకుపోయేరా? కాళ్లల్లో సత్తువంతా పోయినట్లు కాళ్లు వణక సాగేయి, కడుపులో నుంచి హఠాత్తుగా నొప్పి ప్రారంభమై పోయి ఆయాసం వచ్చెయ్యసాగింది తన్మయికి. వేస్తూన్న ఒక్కో అడుగూ భారమైపోయి, నాలుక పిడచకట్టుకుపోసాగింది.

బయట బజారులో అటూ ఇటూ పిచ్చిదానిలా దిక్కులు చూస్తూ, కనబడ్డ వాళ్లందరినీ "ఏవండీ చిన్న బాబుని చూసేరా" అంటూ అడుగుతూ పరుగెత్తసాగింది.

మిట్ట మధ్యాహ్నమేమో ఎండ చుర్రుమని కాలుతూంది.

మధ్య మధ్యలో వెనక్కు తిరిగి ఆలయం వైపు చూస్తూ "భగవంతుడా! నా బాబుని నాకు చూపించు" అని రెండు చేతులూ ఎత్తి నమస్కరించసాగింది.

తన్మయి మొర ప్రభువు ఆలకించినట్లు ఎవరో గంట మోగించేరు.

సరిగ్గా అరగంట లో మైకులో ఎనౌన్సుమెంటు వినిపించింది. "అబ్బాయి దొరికేడు తల్లిదండ్రులు ఎక్కడున్నా రావాలి"

బాబుని చూస్తునే పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లనిపించింది తన్మయికి.

ఏడుస్తున్న పిల్లాణ్ణి ఎత్తుకుని ముద్దులు కురిపించింది. "ఎటెళ్లిపోయేవు నాన్నా, ఎటెళ్లిపోయేవు, ఎప్పుడూ వెళ్లకేం" అంటూ.

తన్మయి భుజం చుట్టూ చెయ్యి వేసి భయపడొద్దని గట్టిగా పట్టుకున్న ప్రభు "హమ్మయ్య" అని నిట్టూర్చేడు.

అంతకు ముందు కూచున్న చోటకే వచ్చి కూచుంటూ, "ఇంద మంచినీళ్లు తాగి కాస్త స్థిమిత పడు" అని తన్మయి జుట్టు సవరిస్తూ "ఎటెళ్లిపోయేవురా?" అన్నాడు బాబుతో.

దూరంగా చూపిస్తూ "నాన్న" అన్న మాట వినీ వినడంతోనే పసివాడన్న విషయం కూడా మరిచి పోయి నెత్తి మీద గట్టిగా ఒక్క దెబ్బ వేసేడు.

ఆ కోపంలో చేతిలో కొబ్బరి చిప్ప ఉందన్న విషయం కూడా మర్చిపోయేడు. తన్మయి ఒక్క ఉదుటున బాబుని ఒళ్లోకి తీసుకునేసరికే ఆలస్యం అయిపోయింది. తల మీద ఉన్న మెత్తటి మాడు ప్రాంతంలో తగిలిందేమో బొటబొటా రక్తం కారసాగింది.

"అయ్యో" అంటూ అప్పటికే ఏడ్చి ఏడ్చి జీరబోయిన గొంతుతో రోదిస్తూ " బుద్ధిలేదూ, చంటి పిల్లాడికి ఇలా నెత్తి పగలగొడతావా?" అని కీచుగా అరిచింది.

తప్పు తెలుసుకున్నవాడిలా స్థాణువులా కూచుండిపోయేడు ప్రభు. చున్నీ తీసి బాబు తలకి గట్టిగా కట్టి బాబునెత్తుకుని గబగబా బయటికి పరుగెత్తింది తన్మయి. వెనకే వచ్చిన ప్రభు ని "బండి తియ్యి, త్వరగా ఏదైనా హాస్పిటలుకి పోనియ్యి" అంది ఏడుస్తూ. అప్పటికే తమ చుట్టూ జనం పోగవుతారేమోనని భయపడుతూ ప్రభు వేగంగా పోనిచ్చేడు.

డాక్టరు పరీక్షగా చూస్తూ "బాగా లోతుకే తలిగింది. కుట్లెయ్యాల, గట్టు మీద నించి పడితె రాయి గిట్ల గుచ్చుకునుండొచ్చు" అన్నాడు.

ఏడుస్తున్న తన్మయి భుజం చుట్టూ అదిమి పట్టుకున్న ప్రభు చెయ్యి తన్మయికి తేళ్లు పాకినంత చికాగ్గా జలదరింపుగా అనిపించింది.

"నాలుగుదినాలు జర జాగ్రత్తగా ఉండుండ్రి, గీ మందులు వాడుండ్రి" అని కాగితం చేతికిచ్చేడు డాక్టరు.

బండి మీద ఎక్కుతూ "ఇప్పుడే చెప్తున్నాను. ఇక మీదట పిల్లాడి మీద ఎప్పుడైనా చెయ్యి వేసావంటే మర్యాదగా ఉండదు జాగ్రత్త" అంది గట్టిగా.

బండి మీద మధ్యలో కూర్చున్న బాబు దారంతా తల్లిని కావలించుకుని ఏడుస్తూనే ఉన్నాడు. బాబు రక్తంతో తన్మయి తెల్ల డ్రెస్సు ఎర్రగా మారింది. ఇంటికెలా వచ్చి పడ్డారో తెలీలేదు తన్మయికి. నిద్రపోతున్న బాబు పక్కన పడుకుని కుమిలి కుమిలి ఏడవ సాగింది. ఎంతో మంచి వాడనుకున్న ఇతనికి

పసివాడితో ఎలా ఉండాలో ఆ మాత్రం ఇంగితజ్ఞానం లేదా? ఆ రాత్రి ప్రభు తలుపు జేరవేసి తన చాప తీసుకుని బయటికి వెళ్లిపోయేడు. కనీసం క్షమించమని అడగలేదు కూడా. ఒక్క సారిగా తన్మయికి అతని మీద అసహ్యంతో బాటూ, భయం కూడా కలగసాగింది.

నిద్దట్లో అమ్మా.. అమ్మా.. అని మూలుగుతున్న బాబు తలమీద నిమిరి "లేదు నాన్నా తగ్గి పోతుంది, ఇంకెప్పుడూ ఇలా జరగనివ్వను" దృఢంగా అంది తన్మయి.

★★★

మర్నాడు బాబు ముందులా ప్రభు దగ్గరకు వెళ్లకపోవడాన్ని గమనించింది తన్మయి.

"ఏమ్మా, ఇంకా భయపడుతున్నావా?" అంది లాలనగా.

బేలగా తలూపి "అమ్మా, నాన్న కావాలి, డాడీ వొద్దు" అని ఏడుపు లంకించుకున్నాడు బాబు.

ఖిన్నురాలై గోడకి జేరబడి కూచుండి పోయింది తన్మయి.

"తప్పు నాన్నా, అలా అనకూడదు. ఇంకెప్పుడూ నాన్న కనబడితే వెళ్లకు. అతను కావాలని అనకు. డాడీ నువ్వు కనిపించలేదని గాభరాలో కొట్టేడు. అయినా ఇంకెప్పుడూ నిన్ను కొట్టనివ్వను కదా నేను" అని ఏడుస్తూ గుండెలకు హత్తుకుంది.

ఇక ప్రభు సంగతి సరేసరి. ఆ రోజు నించి బాబుని చేరదియ్యడం మానేసేడు. అయినా పసివాడికేం తెలుసు? తప్పు తను చేసి, పసివాణ్ణి శిక్షిస్తున్న అతని ప్రవర్తన అర్థం కాక సాయంత్రం ప్రభు వస్తూనే నిలదీసింది.

బదులుగా "వాడు చేసిన పనేమైనా బావుందా? అయినా నువ్వే కదా నాకు వీడితో ఇక ఏ సంబంధం వద్దన్నట్టు మాట్లాడేవు. చాలు. ఇక మీదట వాడికీ, నాకూ ఏమీ సంబంధం లేదు" అన్నాడు విసుగ్గా.

"అదా నేను మాట్లాడింది, సరిగా గుర్తు తెచ్చుకో, నువ్వేం చేసేవో, నేనేం అన్నానో" అంది తను కూడా చికాగ్గా.

"వద్దు తల్లీ వద్దు, నువ్వే నీ కొడుకుని పెంచుకో, నాకీ బంధమూ వద్దు, బాధ్యతా వద్దు" అని నమస్కరించేడు.

తన్మయి వెర్రిదానిలా గాల్లోకి చూస్తూ ఉండి పోయింది. తండ్రి చెంపమీద కొట్టి మరీ నిలదీసి అడుగుతున్నట్లు అనిపించసాగింది.

"ఇతను నీకు భర్త కాగలడేమో, కానీ వీడికి తండ్రి కాగలడా?"

## 57

ఆ సాయంత్రం కాలేజీ నించి వస్తూనే గట్టు మీద కూచున్న కొత్త ముఖాల్ని చూసి "ఎవరా" అని ఆలోచించసాగింది.

నలిగిపోయిన పాత కాటన్ చీర, సరిగా దువ్వుకోని తల, అడ్డదిడ్డంగా అంటించుకున్నట్టున్న కుంకం బొట్టు, వెలిసిపోయిన చేతి సంచీ. ఆవిడ పక్కనే కూచున్నతను తన్మయిని చూస్తూనే లేచి నిలబడ్డాడు. కావి రంగుకి చేరిన పాత తెల్ల పంచె, ముతక చొక్కా, భుజమ్మీద మాసిన తువాలు చేతిన పాత బడిన చీరల కొట్లో ఇచ్చే కర్రల చేతి సంచీ.

రోజూ అప్పటికే స్కూలు నించి వాకిట్లో వచ్చి ఆడుకునే బాబు వీళ్లని చూసి భయపడ్డట్లున్నాడు. ఎదురింటి పిల్లలతో బాటూ వీధి చివర ఆడసాగేడు. తల్లి రావడం చూసి బండి వెనకాలే పరుగెత్తుకు వచ్చి చెంగు చాటున దాక్కున్నాడు.

ఆవిడ మొహం ఏడ్చి ఏడ్చి ఉబ్బినట్టు ఉంది.

అతను సందేహంగా తన్మయి వైపు ఒకడుగు వేసి "మా యబ్బాయి ప్రబు...." అని నసిగేడు.

అప్పటికి అర్థమయ్యింది తన్మయికి వీళ్లు ప్రభుని కన్న తల్లిదండ్రులన్న సంగతి.

"తనకు చిన్నతనంలో తెలిసిన వారు ప్రభుని పెంచిన తల్లిదండ్రులన్నమాట. ప్రభు నెలనెలా డబ్బులు పంపుతున్నా, ఇంకా కటిక పేదరికంలో మగ్గుతున్నట్టే ఉన్నాయి వీళ్ల ఆహార్యాలు. కారణం ఏవిటో మరి! అది సరే ఇదేవిటి హఠాత్తుగా ఇక్కడ ప్రత్యక్షమయ్యేరు!!" వాళ్లని హఠాత్తుగా అక్కడ చూసి తన్మయికి ఏం చెయ్యాలో తోచలేదు.

చప్పున గొంతు సరిచేసుకుంటూ "రండి, లోపలికి రండి" అని పిలిచింది.

అతను "ఫర్వాలేదమ్మా" అని ఇచ్చిన మంచినీళ్లు తీసుకుంటూ హాల్లో వేసిన కుర్చీలో కూచున్నాడు. ఆవిడ మాత్రం లోపలికి రాకుండా, ఉలక్కుండా పలక్కుండా అక్కడే భీష్మించినట్లు కూచుంది.

"ఇదిగో బేబీ, ఈవిడే మన కోడలమ్మ. మంచీలు తాగుతావా?" అన్నాడతను గారపళ్లు పెట్టి నవ్వుతూ.

తన్మయి వైపు చూడడం కూడా ఇష్టం లేనట్లు ముఖం తిప్పుకుంది ఆవిడ. తన్మయి లోపలి గదిలో టెలీఫోను దగ్గిరికి గబగబా నడిచింది.

మరీ సరిపోవడం లేదని తమ రెండు గదులనానుకుని ఉన్న మరోగది కూడా ఈ మధ్యే అద్దెకు తీసుకున్నారు. ప్రభుకి ఈ మధ్యే ఆఫీసు వాళ్లు పేజర్ ఇచ్చారు. మెసేజీ చూసుకుని వెంటనే ఫోను చేసేడు.

"వాళ్లని జాగ్రత్తగా చూడు, ఇప్పుడే బయలుదేరుతున్నాను" గాభరాగా అన్నాడు అవతల్నించి.

వాళ్లు వొస్తున్నారన్న మాట ప్రభుకి కూడా తెలీదన్నమాట.

"మీ అబ్బాయి ట్రాఫిక్కులో పడి ఇంటికి రావడానికి చాలా టైము పడుతుంది. బాత్రూములో నీళ్లు పెట్టేను. ముఖాలు కడుక్కుని కాస్త టీ తాగుదురు రండి." అని కొత్త టవల్ ఒకటి తెచ్చి ఇచ్చింది వాళ్లకి తన్మయి.

"ఆవిడ ముఖం కడుక్కోదు కానీ, టీ ముందు ఇచ్చెయ్యమ్మా" అని ఆయన బాత్రూములోకి వెళ్లేడు.

స్టవ్వు మీద టీ కలుపుతూ ఉందే కానీ అసలేమీ అర్థం కావడం లేదు తన్మయికి "వీళ్లు సరాసరి ఇంటికెందుకొచ్చేరు? ప్రభుని, తనని నిలదీసి అడుగుదామనా? తమతో గొడవ పడదామనా?"

ఎవరికైతే తెలీకూడదనుకుంటూ ప్రభు తమ పెళ్లిని ఇన్నాళ్లూ రహస్యంగా దాస్తూ వచ్చాడో వాళ్లే సరాసరి వచ్చేసేరు. ప్రభు వాళ్ల అక్కకి ఉత్తరం రాసేడు కాబట్టి, ఆవిడ ద్వారా వీళ్లకి విషయం ఇప్పటికి తెలిసి ఉండాలి. బహుశా: ఇప్పుడు హఠాత్తుగా రావడానికి కారణం అదే అయి ఉంటుంది.

"ఇప్పుడు వీళ్లు ఒప్పుకుంటారో? లేదో? ఒప్పుకోకపోతే ఏం జరుగుతుంది? ప్రభు వీళ్లతో వెళ్ళిపోతాడా? తనతో గొడవ పెట్టి ప్రభుని తన నుంచి తీసుకువెళ్లిపోవడానికి వచ్చారా?" రకరకాల ఆలోచనలతో తల నెప్పి రాసాగింది తన్మయి.

అయినా ప్రభు ఏవైనా చిన్నపిల్లవాడా వెళ్లిపోవడానికి? పైగా తన ఇష్టప్రకారమే చేసుకున్నాడు.

ఎంత పిలిచినా లోపలికి రాకుండా ఆవిడ వాకిట్లో వీధి అరుగు మీదే చేతిన సంచీ పట్టుకుని పక్కకు తిరిగి కూచుంది.

ఇక లాభం లేదని ఆయనా తన టీ గ్లాసు పుచ్చుకుని అరుగు మీద మరో వైపు చతికిలబడ్డాడు తన్మయి వాకిట్లో వేసిన కుర్చీ మీదకి కాళ్లు బారజాపి.

ఇంకా నయం తమ ఇంటికి గేటు ఉంది కాబట్టి సరిపోయింది. లోపలి అరుగు బయట వీధిలో నడిచే వాళ్లెవ్వరికీ కనబడదు. లేకపోతే కాందిశీకుల్లా ఉన్న వీళ్లని చూసి చుట్టూ అందరూ వివరాలు అడిగేవాళ్లు.

తన్మయి బాబుకి స్నానం చేయించి, హోం వర్కులు రాయించి, గబగబా వంట పని మొదలు పెట్టింది. వీధిలో ఏ బండి చప్పుడైనా ప్రభు వచ్చేడేమోనని ఆత్రంగా కిటికీలోంచి చూడసాగింది. వాళ్లని చూస్తే ఒక వైపు భయం, మరో వైపు జాలి పుట్టుకురాసాగింది తన్మయికి. ఎప్పుడు ఏం తిన్నారో ఏమో! బిస్కెట్ల పాకెట్టు పట్టుకెళ్లి ఇమ్మని బాబుకిచ్చి పంపించింది. వాడు మరునిమిషంలో పాకెట్టు పుచ్చుకుని వెనక్కు పారిపోయి వచ్చేడు.

సమయానికి తాయిబా కూడా లేదు, తనైతే చుట్టుపక్కల పిల్లలెవరితోనైనా ఏ కూల్ డ్రింకో ఇట్టే తెప్పిస్తుంది. తను వెళ్లొద్దామనుకుని మళ్లీ విరమించుకుంది. తనతో మాట్లాడడమే వీళ్లకు ఇష్టం లేనట్లుంది. "ప్చ్" అని నిట్టూర్చి బాబుని నిద్రపుచ్చడానికి లోపలి గదిలోకి తీసుకెళ్ళింది.

మరో గంటలో ప్రభు రావడం తోనే, తల్లిని లేపి పొదివి పట్టుకుని లోపలికి తీసుకు వచ్చి తన్మయి వైపు చికాగ్గా చూస్తూ "మా వాళ్లని లోపలికి రమ్మనడం కంటే నీ కొడుకుని నిద్రపుచ్చడం ఎక్కువైపోయిందా?" అని, అప్పుడే నిద్రలోకి జారుకుంటున్న పిల్లాణ్ణి రెక్కపుచ్చుకుని లేపి, అతని తల్లిని మంచమ్మీద కూచోబెట్టి కాళ్ల దగ్గిర కూచున్నాడు. అతని తండ్రి ఆ పక్కనే కుర్చీ మీద కూచున్నాడు.

తన్మయి ఎగిసిరాబోతున్న దుః ఖాన్ని అదిమిపట్టి బాబునెత్తుకుని మధ్య గదిలో వైరు మంచమ్మీద పడుకోబెట్టి అక్కడే కూచుండి పోయింది. అసలేవిటి ప్రభు ఉద్దేశ్యం? వాళ్లని రమ్మని పిలిచినా వాళ్లే కదా రానని మొరాయించారు. ప్రభు మాటలు విని కూడా ఆ విషయం చెప్పకుండా ఊరుకున్నారు వాళ్లు. పైగా అతని తండ్రి ముఖంలో పైశాచికమైన నవ్వొకటి.

బాబు పక్కన పడుకుందే కానీ ప్రభు ప్రవర్తనకు, చికాకుకు బాధ కలగసాగింది. అసలే కిందటి వారంలో పిల్లాణ్ణి కొట్టినప్పుడు జరిగిన సంఘటన నించే ఇంకా తేరుకోలేదు తను. ఇంతలో ఇదొకటి. ఎక్కడ లోపం జరిగింది? ఎందుకు ఇలా జరుగుతూంది? ఆలోచనల్తో తల బద్దలు కాసాగింది.

లోపల నించి ఆవిడ ముక్కు చీదీ చీదీ శోకాలు పెట్టడం, మధ్య మధ్య అతని తండ్రి రంకెలు, ప్రభు కన్నీళ్లతో సంజాయిషీ ఇవ్వడం... అన్నీ వినిపిస్తూనే ఉన్నాయి.

మొత్తానికి ఏడుపు ఆపి గొంతు విప్పింది ఆవిడ. "సరే నాయినా, నీకు నచ్చింది నువ్వు సేసుకున్నావు. మరి మేవూ సుట్టూ అందరికీ సెప్పుకోవాల గదా మా యబ్బాయికి పెళ్లయ్యిందని. పిల్లోణ్ణి నాల్రోజులు ఆవిడ అమ్మగారింటి కాడ ఏడయినా దించి ఆవిణ్ణి తీసుకుని రా. మన ఇంటి కాడ సిన్న పంక్సనేమైనా సేసుకుందాం" అంది.

అంతదానికే బహు సంతోషపడిపోతూ తన్మయిని గొంతెత్తి పిలుస్తూ గుమ్మం వరకు వచ్చి వెనక్కి తిరిగి "అదేం వొద్దులే అమ్మా, మీరు వొప్పుకున్నారు అంతే చాలు నాకు, చుట్టూ అందరి సంగతీ వదిలెయ్యండి" అంటూ చప్పున వాళ్ల కాళ్లకి నమస్కరించేడు. అప్రయత్నంగా తన్మయి కూడా వంగి నమస్కరించింది.

ఆవిడ ఇష్టం లేనట్టు చికాగ్గా మొహం పెట్టి చప్పున కాళ్లు వెనక్కి లాక్కుంటూ "అట్టైతే ఇక మేవూ యెనక్కి పోం. అక్క ఎలాగూ మన కాడే ఉంటంది గదా, పిల్లల్ని తీసుకుని ఇల్లు కాళీ సేసి ఈడికే వచ్చియ్యమని కబురెట్టు" అంది.

"ఊ...అలాగే చేద్దాం" అన్నాడు ప్రభు ఆనందబాష్పాల్ని తుడుచుకుంటూ.

తండ్రి వాకిట్లో కెళ్లి కాండ్రించి ఉమ్మేసి, "ఈడిలాటి ముదనష్టప్పనిజేసినా, ఉన్న పళాన ఇది కొడుక్కాడికి పోదావంటేనే అనుకున్నాను, ఇలాటి పిట్టింగేదో పెడతాదని" అన్నాడు.

ప్రభు బయటికెళ్లి " ఇప్పుడేవైంది నాన్నా, అమ్మ చెప్పినట్లు అందరం కలిసి ఇక్కడే ఉందాం. మీకు పుట్టి పెరిగిన ఊరని మమకారం ఉంటే అప్పుడప్పుడూ వెళ్లి రావడం ఎంత పనని?" అన్నాడు.

"ఏదోటి కానియ్యండి" అన్నాడు మళ్లీ ఉమ్మేసి.

కాస్సేపట్లో తన్మయి భోజనాలు వడ్డించింది.

తన ప్రమేయమే లేనట్లు ఒకదాని తర్వాత ఒకటి ఏమేం చెయ్యాలో వాళ్లలో వాళ్లు అన్నీ మాట్లాడేసుకున్నారు. ప్రభు కనీసం తనతో ఒక్కమాట కూడా సంప్రదించడం లేదు. అసలు అక్కడ తన్మయి ఉన్నట్టు కూడా ఎవరూ పట్టించుకోకుండా భోజనాలు కానిచ్చేరు.

వాళ్లకి లోపలి గదిలో పక్కలు వేసేక చాప తీసుకుని డాబా మీదికి వెళ్లింది తన్మయి. దాదాపు పన్నెండు గంటల వేళ వచ్చేడు ప్రభు.

"హమ్మయ్య, వీళ్లనెలా ఒప్పించాలో అన్న బెంగ కూడా తీరిపోయింది నాకు. మా అమ్మా, నాన్నా ఎంత మంచివాళ్లు నిజంగా! రోజూ వాళ్ల కాళ్లు కడిగి నెత్తిన జల్లుకున్నా సరిపోదు. నన్ను ఎక్కడ దూరం చేసేస్తారో అని ఎంత బాధ వేసేదో నాకే తెలుసు. ఇక ఏ బెంగా లేదు నాకు. ఇక మనం కనీసం నాలుగ్గదులుండే పెద్ద ఇల్లు చూసుకుని మారాలి. అసలే అక్కా, పిల్లలూ కూడా మనతోనే ఉండడానికి వస్తున్నారు" అన్నాడు గబగబా.

తన్మయి నిశ్శబ్దంగా విని "ఇదంతా మన పెళ్లికి ముందు నువ్వు నాకు ఎందుకు చెప్పలేదు?" అంది.

"ఏమని?" అన్నాడు ఆశ్చర్యంగా.

"వీళ్లందరితోనూ మనం కలిసి ఉండాలని" అంది.

"ఎందుకు చెప్పలేదు? మా వాళ్లని చూసుకోవాలని చెప్పేను కదా!" అన్నాడు.

ఈ సారి ఆశ్చర్యపోవడం తన్మయి వంతయ్యింది "మీ వాళ్లని చూసుకోవడమంటే ఇదా! డబ్బులు పంపడం అని అనుకున్నాను" అంది.

"నువ్వెలా అనుకున్నావో నాకు తెలియదు. ప్రస్తుతానికి వాళ్లంతట వాళ్లే మన దగ్గర ఎప్పటికీ ఉండిపోవడానికి వచ్చేరు, ఇంతకంటే అదృష్టం ఇంకేముంది?" అన్నాడు సంతోషంగా.

"అది సరే, వాళ్లని నేను లోపలికి రమ్మని ఎన్ని సార్లు పిలిచినా రానన్నారు. నువ్వు నన్ను తప్పుబట్టడం ఏమయినా బావుందా?" అంది.

ఒక్క సారి తల విదిలించి "వదిలెయ్యి, ఏదో గబుక్కున అనేసాను" అని "అన్నట్టు వాళ్లకి ఏ కొరతా రాకుండా చూసుకోవాలి మనం" అన్నాడు.

"అయినా ఇంత పెద్ద సిటీలో ఇంత మంది.. మన ఇద్దరి జీతాలతో...." అనేదో అనబోతున్న తన్మయితో

"ఇలా చూడు, వాళ్లకిష్టం లేని పెళ్లి చేసుకున్నందుకు వాళ్లు నన్ను వెలివేయకుండా మనతో కలిసి ఉండాలనుకోవడమే ఎంతో సంతోషించవలసిన విషయం. ఇందుకు నేను జీవితాంతం వాళ్లను నెత్తిన పెట్టుకున్నా సరిపోని పెద్ద మనసులు వారివి. నీకు ఇష్టం లేకపోతే నువ్వు నీకేది సంతోషం అనిపిస్తే అది చెయ్యొచ్చు, కానీ వాళ్లు మాత్రం నాతోనే ఉంటారు" సీరియస్ గా అన్నాడు.

తన్మయి నిశ్శబ్దం వహించింది. ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నాడు! నిన్న మొన్నటి వరకూ ఒంటరిగా ఎన్నో కష్టాలు పడి, చివరికి తనకోసమే అలమటించిన ప్రభుని ఇష్టపడి పెళ్లి చేసుకుంది. అతను కాకుండా మరో జీవితాన్ని తనకి ఊహించుకోవడం కూడా ఇష్టం లేదు.

అసలు "నీకేది సంతోషం అనిపిస్తే అది చెయ్యి" మన్న మాట అనడానికి ఇతనికి నోరెలా వస్తుంది?

అదే అడిగింది.

"చూడు, నీతో వాదించే ఓపిక నాకు లేదు. అసలే ఆఫీసులోనే నాకు బోల్డు తలకాయ నొప్పులున్నాయి. ఇంట్లో కూడా తలనెప్పి తెప్పించకు" అని విసవిసా కిందికి వెళ్ళిపోయేడు.

తన్మయి శున్యమైన మనస్సుతో రోదన పూడుకుపోయిన గొంతులో బాధని దిగమ్రింగి కళ్లుమూసుకుని ప్రార్థించింది.

మిత్రమా! నా కోసం ప్రభు గొప్ప సాహసం చేసేడు నిజమే. వీళ్లు అతన్ని కన్న తల్లిదండ్రులు కాబట్టి గౌరవించాలి. ఇక డబ్బులంటే నా కెప్పుడూ పెద్ద ప్రేమ లేదు. పొదుపుగా, ఉన్నదాంతో బతకడం అలవాటే. ఎలా జరగాలని ఉందో నాకంటే నీకే బాగా తెలుసు. నాకు తగిన శక్తిని, నిలబడే ధైర్యాన్ని ఇవ్వు"

తన్మయి బాధని విన్నట్టు ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చినుకులు పడసాగేయి. అప్పటికి దుఃఖం కట్టలు తెంచుకుంది. వానలో అలానే తడుస్తూ , రోదిస్తూ ఉండిపోయింది.

★★★

మర్నాడు సెలవు పెట్టి ఊర్లో చుట్టుపక్కల కాస్త పెద్ద ఇల్లు వెతికి రావడానికి బయలుదేరేరు. రాత్రి నిద్రలేమికి, వానలో తడిసినందువల్లా తన్మయికి తలపోటు రాసాగింది. నడవడానికి కూడా ఓపిక లేదు. తను రానంటే ప్రభు మరోలా అర్థం చేసుకుంటాడే తప్ప ప్రయోజనం ఉండదు. మౌనంగా బండి మీద అతని వెనక కూచుంది.

ఆవిడ పొద్దున్నే వంటింట్లోకి వస్తూనే పెద్ద గొంతు పెట్టుకుని భర్తతో "ఇలా సూడు బావా, మనోడి సంసారం. ఒకళ్లు తిన్నా కంచం కడుక్కుని మరొకళ్లు తినాల. సరింగా నాలుగు బొచ్చెలు కూడా లేవు కర్మ, ఈ మాతల్లి పున్నెవా అని ఎన్నో జమ్మిందారీ సమ్మందాలు కాదని ఎల్లగొట్టీసేడు. హవ్వ, కన్నెపిల్లలందర్నీ కాదనీసి ఈ పిల్లల తల్లిని కట్టీసుకున్నాడు" అంది నోరు నొక్కుకుంటూ.

ప్రభు వెంటనే అందుకుని "ఇంత కాలం మేమే కదా అని ఏవీ కొనుక్కోలేదు. సాయంత్రం అలా వెళ్లి నీకేం కావాలో అన్నీ కొని తెచ్చుకుందాం" అన్నాడు నవ్వుతూ తల్లి మాటల్ని అతి తేలిగ్గా తీసుకుంటూ.

ఆవిడేం మాట్లాడుతూందో తన్మయికి ఏవీ అర్థం కావడంలేదు. అయినా నిశ్శబ్దంగా ఆవిడకి స్నానానికి నీళ్లు పెట్టింది.ఆవిడ తన సంచీలోంచి పాత చీరొకటి తీసుకుని కట్టుకోబోతూంటే తన్మయి మొన్నే కొనుక్కున్న కాటన్ చీరొకటి తీసి ఇవ్వబోయింది.

"ఏం మా రాణీ! మేం నీ స్తాయికి తగమనా నీ సీర కట్టుకోమంటన్నావు. నా కొడుకు తలుచుకుంటే ఇంతకి బాబులాటి సీరలు కొనిపెడతాడు నాకు" అంది కటువుగా విసిరికొడుతూ.

ఏవీ వినబడనట్టు ప్రభు మాట్లాడకుండా బయటికెళ్లి బండి తీసేడు.

తన్మయి ఏదో అనేలోగా గేటు దగ్గిర ప్రభు హారను మోగించడంతో మాట్లాడకుండా బయటికి నడిచింది తన్మయి.

బండెక్కుతూనే "మా అమ్మకి నచ్చిన చీరలు ఆవిడని కట్టుకోనివ్వు" అన్నాడు.

తన్మయికి మనస్సు చివుక్కుమంది.

తనతో పరిచయం లేని ఇతని తల్లి తనని అర్థం చేసుకోకపోవడంలో అర్థం ఉంది. కానీ ప్రభు ఇలా మాట్లాడడంలో అర్థం ఉందా?

అదే అడిగింది.

"మళ్లీ మొదలెట్టేవా? ఇలా చూడు. వాళ్లని వీలైనంత సంతోషంగా ఉంచడమే నా ధ్యేయం. లక్ష మాటలైనా అనే హక్కు వాళ్ళకుంది. నేను చేసినది ముమ్మాటికీ తప్పే. ఇలా శిక్షని అనుభవించాల్సిందే" అన్నాడు.

తన్మయికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. "ప్రభు శిక్షని అనుభవిస్తున్నాడా? తను అనుభవిస్తూందా?"

నిట్టూర్చి మాట్లాడకుండా ఉండిపోయింది. దగ్గర్లో ఉన్న ఇళ్లేవీ ప్రభుకి ఒక పట్టాన నచ్చడం లేదు. టులెట్ బోర్డులు చూసుకుంటూ దాదాపు పదిపదిహేను కిలోమీటర్లు దూరంలో ఉన్న మరో ఏరియాలోకి వచ్చేసేరు.

తన్మయికి తల తిరగసాగింది. "ఏదయినా తాగుదామా?" అంది.

"ఊ.." అంటూ బండిని పక్కనే ఉన్న చిన్న బేకరీ ముందు ఆపేడు.

ఎదురుగా ఉన్న టులెట్ బోర్డు చూపిస్తూ "ఇక్కడైతే నా ఆఫీసుకి కూడా దగ్గరవుతుంది కాస్త. ఏవంటావ్?" అన్నాడు డూప్లెక్సు హౌస్ ఒకటి చూస్తూనే.

తన్మయి టులెట్ బోర్డుకున్న అయిదంకెల అద్దె గురించే ఆలోచిస్తూంది. ఇప్పుడు వాళ్లిచ్చే అద్దెకు మరో రెండు వంతులెక్కువ. పైగా రెండు నెలల అడ్వాన్సు కట్టాలి. ఇంత వరకు ప్రభు తన జీతంలో తన పెట్రోలు ఖర్చులకు మాత్రం ఉంచుకుని, మిగతాదంతా వాళ్ల వాళ్లకి పంపించేస్తూ వచ్చేడు. ఇల్లంతా తన్మయి తనొక్క జీతంతోనే నడిపేది.

"ఇప్పుడు తన జీతం మొత్తం కేవలం అద్దెకే పోతుంది" అర్థం కానట్టు మొహం పెట్టింది తన్మయి.

ఇంతలోనే "సరేనండీ, మేం రేపూ, ఎల్లుండుల్లో వచ్చేస్తాం" అని ఒక వెయ్యి తీసి అడ్వాన్సు" ఇచ్చేసేడు ఇంటాయనకి.

బయటికి వచ్చి బండెక్కుతూనే నేనంతా ఆలోచించే అడ్వాన్సు ఇచ్చేను. "మా వాళ్లు ఇక మనతోనే ఉన్నారు కాబట్టి, వాళ్లకి డబ్బులు నెలనెలా పంపక్కరలేదు కదా, ఇక అడ్వాన్సు అంటావా, మొన్నే బోనసు వస్తే మా అమ్మకు పంపేను. అవింకా ఉండే ఉంటాయి" అన్నాడు.

★★★

ఆ మర్నాడు తల్లిదండ్రుల్ని కూడా తీసుకెళ్లి ఇల్లు చూపించుకొచ్చేడు ప్రభు.

రాగానే "ఇల్లు శానా బాగుంది. ఎవరి గదులాళ్లకి పత్యేకంగా ఉన్నాయి. ముందే సెప్తున్నాను, మేవు కిందనే ఉంటావు. పైన పెద్ద గది అక్కకి, పిల్లలకీ సరిపోతది. మీరు ఆ పక్కనే ఉన్న చిన్న గదిలో ఉండండి. పిల్లోడు పైన మధ్య హాల్లో పడుకుంటాడు. ఇంక వంట గది కిందనే ఉన్నాది కాబట్టి అది నాది. ఈవిడ అందులో అడుగెట్టనాకి ఈల్లేదు" అంది.

తన్మయికి తన జీవితం మీద పెత్తనం మొదలవ్వబోతూ ఉందో, బాధ్యతలు తప్పుతున్నాయో అర్థం కాలేదు.

ఒక పక్క ప్రభు "వాళ్లేమన్నా వాళ్లతో ఏవీ వాదించకు. కొన్నాళ్లకి కోపం తీరి వాళ్లే శాంతిస్తారు" అంటున్నాడు.

"ఏదేమైనా ప్రభుతో కొత్త జీవితం ఇలా ప్రారంభమయ్యింది " తనలో తనే నిట్టూర్చింది తన్మయి.

ఇంతలో ప్రభు తల్లి దగ్గిరికెళ్లి మెల్లిగా నసుగుతూ "అమ్మా, మనం ఇంటికి అడ్వాన్సు కట్టాలి. నీకు మొన్న పంపిన బోనసు డబ్బులు...." అన్నాడు.

వెంటనే ఏడుపు గొంతు పెట్టి "ఇయ్యో అయ్యెక్కడున్నాయమ్మా, ఇదుగో మీ నాన్న తాకట్టెట్టేసిన నా తాలిబొట్టు, అక్క గొలుసు, ఉంగరవూ ఇడిపించడానికి సరిపోయేయి" అంది మెళ్ళోంచి పసుపు తాడు చివర సొట్టలు పడి మకిలి పట్టిన సన్నని రేకుల్లాంటి సూత్రాలు చూపిస్తూ.

అవన్నీ తాకట్లు పెట్టి విడిపించినా ప్రభు పంపించిన డబ్బుల్లో సగం కూడా ఖర్చవ్వవన్న సంగతి అర్థం అయింది. ప్రభుకి ఈ విషయాలు సరిగా తెలియవు, తెలిసినా ఇక వాళ్లని అడగడు. తన్మయి అక్కణ్ణించి లేచి వాకిట్లోకి వచ్చింది.

వెనకే వచ్చిన ప్రభు "మనకి రెండే మార్గాలున్నాయి. ఒకటి –డబ్బులు సమకూరేవరకూ ఇక్కడే అడ్జస్టు కావడం, రెండు– నీ గాజులు తాకట్టు పెట్టడం" అన్నాడు బాధగా మొహం పెట్టి.

తన్మయి మరు నిమిషంలో అతని చేతిలో తన గాజులు తీసి పెట్టింది "బాధపడకు" అంటూ "కానీ నెల నెలా అద్దె చాలా ఎక్కువ. ఇక మనకంటూ ఏవీ సేవింగ్సు ఉండవు మరి, ఏ కష్టం వచ్చినా.." అంది సాలోచనగా.

"థాంక్యూ థాంక్యూ తనూ. ముందు ఏదో రకంగా నడవనీ. కాస్త సెటిల్ అయ్యేక ఆలోచిద్దాం" ఆనందంగా అని లోపలికెళ్లేడు.

భవిష్యత్తు పట్ల లోపలెక్కడో భయం భయంగా ఉన్నా అతని ముఖంలోని ఆనందం కోసం ఏదైనా చెయ్యొచ్చనిపించింది తన్మయికి.

ఇంతలో లోపల గట్టిగా జరుగుతున్న సంభాషణ వినిపించసాగింది.

"నువ్వు నెల నెలా మాకిచ్చే డబ్బు ల్తో నీ సంసారాన్ని కూడా నడపడం మా వొల్ల కాదు. ఆవిడీ, ఆవిడి సోకులూ, ఆ పిల్లోడి సదువులూ" అంటూన్న తల్లితో

"అవన్నీ మీరు పెట్టక్కరలేదు, కేవలం ఇంటద్దె కట్టండి చాలు. మిగతా అంతా తను తన జీతం నుంచి చూసుకుంటుంది" అని బతిమిలాడసాగేడు ప్రభు.

"కరెంటు బిల్లు, నీళ్ల బిల్లు కూడా ఆవిణ్ణే కట్టమను" అన్నాడు అతని తండ్రి.

బయట మొక్కల్లోకి చూస్తూ గాఢంగా నిట్టూర్చింది తన్మయి.

తన జీవితం ఏం కానుంది?!

## 58

మర్నాడు తన్మయి కాలేజీ నుంచి వచ్చేసరికి లోపల అదే పనిగా టీవీ మోగుతూంది. ఈటీవీ, జెమినీ టీవీ ఒకదాని తర్వాతొకటి మోగుతున్నాయి.

బాబు కూడా స్కూలు నుంచి రాగానే ఇంట్లో వీళ్లతో బాటూ టీవీ ముందు కూచున్నట్టున్నాడు. వాడి స్కూలు సంచీ, విప్పిన బూట్లు, సాక్సులు ఒక పక్కకి విసిరేసి ఉన్నాయి. ఎప్పుడూ బుద్ధిగా ఇంటికి రాగానే బూట్లు, సాక్సులు విప్పి తలుపు చాటున పొందిగ్గా పెట్టి, ముఖం కాళ్లూ కడుక్కుని, బట్టలు మార్చుకుని, తలదువ్వుకుని, పుస్తకాలు ముందేసుకుని గబగబా ముందు హోంవర్కు పూర్తి చేసుకునే బాబు ఇవేళ ఇంకా స్కూలు నుంచి వచ్చిన మురికి బట్టల్లోనే ఉన్నాడు. ప్రభు అమ్మా, నాన్నా కూచున్న కుర్చీల ముందు నేల మీద కూచుని దృష్టి తిప్పకుండా టీవీ చూస్తున్న బాబుని చూడగానే తన్మయికి తెలీని కోపం ముంచుకొచ్చింది.

ఇద్దరు పెద్దవాళ్లు ఇంట్లో ఉండి పిల్లాణ్ణి పట్టించుకోకపోవడమే కాకుండా, వాణ్ణి వాళ్ల పక్కన కుర్చీ మీద కూచోనివ్వకుండా, నేల మీద కూచోబెట్టేరు.

వాళ్లనేమీ అనలేని తన్మయి అరచెయ్యి వాడి వీపుకంటుకునేలా ఒక్కటంటించి "లే" అని పక్క గదిలోకి లాక్కెళ్లింది.

అయినా వాళ్లు అక్కడ జరుగుతున్నది తమకు సంబంధం లేనట్టు టీవీ చూడసాగేరు.

అనుకోని సంఘటనకి బిత్తరపోయి, అంతలోనే వీపు మీది దెబ్బకు తాళలేక "అమ్మా" అని మంచమ్మీద పడి దొర్లి దొర్లి గుక్కపెట్టి ఏడవసాగేడు బాబు.

అప్పటిగ్గానీ తన్మయికి తనేం చేసిందో అర్థం కాలేదు.

"అయ్యో, అయ్యో" అంటూ వాణ్ణి కౌగిలించుకుని తనూ దుఃఖించసాగింది.

మరునిమిషంలో తన ఏడుపు ఆపి వెక్కుతూనే తల్లి కళ్లనీళ్లు తుడవసాగేడు బాబు. తన పరిస్థితికి తనే తమాయించుకోలేక తన్మయి వాడి వీపు నిమురుతూ అలాగే మంచమ్మీద వాలిపోయింది. ఎంతసేపు ఉండిపోయిందో తెలీలేదు. చీకటి పడుతుండగా చేతిమీద నిద్రపోతున్న బాబుని పక్కకి జరిపి వంటింట్లోకి వెళ్ళింది. హాల్లో టీవీ ముందు కదలకుండా వాళ్లలాగే కళ్లప్పగించి చూస్తున్నారు తన్మయి వాళ్ల ముందు నుంచి నడిచినా అసలక్కడ ఉన్నట్టే పట్టించుకోకుండా.

కుర్చీల పక్కనే తాగిన టీ గ్లాసుల్లో మిగిలిన టీ పక్కకి ఒలికి గ్లాసులు నేల మీద దొర్లుతూ ఈగలు ముసరసాగేయి. తన్మయి గ్లాసుల్ని తీసి, గబగబా తడిగుడ్డ తెచ్చి నేల మీది టీని వత్తి, వంటింట్లోకి వెళ్లి స్టవ్వు మీద కుక్కర్ పెట్టింది.

మామూలుగా తన్మయి వారాంతంలో తప్ప టీవీ చూడదు. చూసినా కేవలం న్యూస్ వచ్చే కాసేపే. రోజూ ఈ సరికి బాబుకి హోం వర్కులు పూర్తి చేయించి, స్నానం చేయించి, అన్నం తినిపించి పడుకోబెట్టేసేది. మరో గంటలో వంట పూర్తి చేసి వాళ్లని అన్నం తినడానికి రమ్మని పిలిచింది.

వాళ్లు కనీసం తల పక్కకి కూడా తిప్పి చూడకపోవడంతో చేసేదేం లేక బాబుని లేపి కాస్త తినిపించబోయింది. నిద్రకళ్లతో సగం మెలకువలో "అమ్మా! వద్దమ్మా.. కొట్టొద్దు " అని ఏడవసాగేడు. ఎత్తుకుని భుజాన వేసుకుని పడుకోబెట్టడానికి డాబా మీదికి తీసుకెళ్లి తనూ వాడి పక్కన నడుం వాల్చింది.

ఎన్ని బాధలున్నా బాబు పక్కన పడుకోగానే మనశ్శాంతిగా అనిపిస్తుంది తన్మయికి.

వాడి వీపు మీద తడిమి "ఏమ్మా, ఇంకా నొప్పిగా ఉందా?" అంది.

తలూపుతున్న బాబుని హత్తుకుంటూ "నన్ను క్షమించు నాన్నా! ఇంకెప్పుడూ నిన్ను కొట్టను" అని తనలో తనే ప్రతిజ్ఞ చేసుకుంది.

నిశ్శబ్దంగా తల నిమురుతూన్న తల్లి వైపు తిరిగి పొట్ట మీద చెయ్యి వేసి అప్పటికి మెలకువ వచ్చినట్టు "అమ్మా, వీళ్లు ఎవరు?" అనడిగేడు.

"డాడీ కి అమ్మా, నాన్నా" అంది నిర్లిప్తంగా.

"మరి వాళ్లను ఏమని పిలవాలి?"

"మన అమ్మమ్మా, తాతయ్యలని పిలిచినట్లే నానమ్మ, తాతయ్య అని పిలువు" అంది.

ఇంతలో ప్రభు వచ్చినట్లు బండి శబ్దం రాగానే కిందికి వెళ్లి వాళ్లకి భోజనాలకు అన్నీ సర్ది పెట్టి మళ్లీ పైకి వచ్చేసింది తన్మయి. తన్మయి తిందో, లేదో ప్రభు అడగలేదు. తన్మయి చెప్పలేదు.

బాబు మీద అన్యాయంగా తనలా చెయ్యి చేసుకున్నందుకు  భోజనం చెయ్యకుండానే నడుం వాల్చింది తన్మయి. కింద అర్థ రాత్రి వరకూ టీవీ మోగుతూనే ఉంది. ప్రభు తల్లిదండ్రులతో కులాసాగా కబుర్లు చెప్పడం తన్మయికి వినిపిస్తూనే ఉంది.

★★★

ఉదయం తన్మయి లేచి వచ్చేసరికి హాల్లో ఎవ్వరూ లేకపోయినా టీవీ ఆన్ చేసే ఉంది.

తన్మయి నిశ్శబ్దంగా టీవీ ఆఫ్ చేసి బాత్రూములోకి వెళ్లింది.

లోపలి గదిలో నుంచి గురకలు వినిపిస్తున్నాయి.

హాల్లో పడుకున్న ప్రభు కళ్లు చిట్లించి చూసి "టైం ఎంతయ్యింది?" అన్నాడు.

తన్మయి సమాధానం విని ఒక్క ఉదుటున లేచి "త్వరగా తయారవ్వు. అక్కా, పిల్లలూ స్టేషనుకి వస్తున్నారు మనం వెళ్లాలి" అన్నాడు.

ఆదివారం కావడంతో పొద్దున్నే టిఫినుకంటూ గారెలకి పప్పు నానబోసింది ముందురోజు రాత్రి. అదే చెప్పింది.

"సర్లే, నేనొక్కణ్ణే వెళ్లొస్తాను, వీళ్లకు కావలసినవన్నీ కాస్త జాగ్రత్తగా చూసుకో" అని వెళ్లేడు ప్రభు.

బాబు గబుక్కున పరుగెత్తుకెళ్లి గేటు పట్టుకుని నిలబడి ప్రభు వెళ్లిన వైపే చూస్తూ "డాడీ! టాటా!" అనరిచేడు బాబు.

ఇంతలో ఎప్పుడు లేచిందో ఆవిడ గబుక్కున గుమ్మం దగ్గిరికి వచ్చి ఒక్క అరుపు అరిచింది.

"ఇదుగో ఒరే, ఇప్పుడే చెప్తున్నాను నా కొడుకుని "డాడీ" అని పిలిచేవంటే మర్యాద దక్కదు. ఎవడికి పుట్టేవురా? నా కొడుక్కి పుట్టేవా? ఇదుగో, నువ్వు మమ్మల్ని తాతయ్య, నాన్నమ్మ అని పిల్దానికి ఈల్లేదు. నువ్వూ మాకు ఏవీ కావు గుర్తెట్టుకో"

బాబు మీద గదమాయింపులు వినిపించి గబుక్కున వంటింట్లో నుంచి హాల్లోకి వచ్చింది తన్మయి. అప్పటికే బిక్క చచ్చిపోయిన మొహంతో తల్లిని చూడగానే గబుక్కున వెనక్కి చేరి గట్టిగా ఏడుపు లంకించుకున్నాడు బాబు. తన్మయికి కోపం కట్టలు తెంచుకుంది.

"మాటలు మర్యాదగా రానీండి. పసిపిల్లాడితో మాట్లాడే మాటలేనా అవి?" అని అరిచింది.

"అమ్మో, అమ్మో నా కొడుకు ఇంట్లో ఉన్నంతసేపు మింగిలాగా ఉండి, ఆడలాగెళ్లగానే ఎలా నోరేసుకుని పడిపోతందో రాకాసి ముండ. నువ్వూ, నీ కొడుకూ నాశనమైపోనూ. నా కొడుకే దొరికేడే నీకు తగులుకోవడానికి లంజా..." అంటూ బూతు తిట్ల దండకం లంకించుకుంది బేబమ్మ.

తన్మయికి తల తిరగ సాగింది. చెవులు గట్టిగా మూసుకుని వంటింట్లోకి బాబుతో సహా వెళ్లి తలుపేసుకుంది.

ఛీ, ఛీ, ఛీ. జీవితంలో ఎవ్వరూ ఎప్పుడూ తనని ఇలాగ భయంకరమైన తిట్లు తిట్టలేదు.

తన జీవితం పెనం మీంచి పొయ్యిలోకి పడిందని అర్థం అయ్యింది. చుట్టుముడుతున్న నైరాశ్యంతో కళ్లుమూసుకుని ఏడుస్తున్న బాబుని హత్తుకుని నేల మీద కూచుండిపోయింది.

★★★

మరో రెండు గంటల్లో  ప్రభు వచ్చేడు.

వెనకే ప్రభు అక్క, ఆవిడ కూతురు, కొడుకు, మూడేళ్ల మనవరాలు ఆటో దిగేరు. ఆవిడకి దాదాపు నలభైయేళ్లుంటాయేమో.

"మా యమ్మాయికి ఎనిమిదో తరగతిలోనే పెళ్లి చేసేసేం, వెంటనే కూతురు" అంది జుట్టు సరిచేసుకుంటూ ప్రభు అక్క తన్మయి నుద్దేశించి.

తన్మయికి అప్పటికే ప్రభు తల్లి తిట్లకి చికాగ్గా ఉంది. ఎప్పుడు ఈ విషయం ప్రస్తావించాలా ఆలోచిస్తూనే ప్రభు అక్క మాట్లాడుతుండగా లేచెళ్లి మంచినీళ్ల గ్లాసులు తెచ్చి మౌనంగా అందించింది. చిన్నపాప తల్లి కొంగు పట్టుకుని అదేపనిగా లాగుతూండడంతో కూతుర్ని ఒళ్లో వేసుకుని అరుగు మీదే కూచుని పాలివ్వసాగింది ఆ అమ్మాయి. మూడేళ్లమ్మాయి తల్లి దగ్గిర ఇంకా పాలు తాగడం చూసి బాబు తన్మయి వెనక దాక్కున్నాడు.

ఆవిడ కొడుక్కి ఇరవయ్యేళ్లుంటాయేమో. చేతిలోని రెండు గోనె సంచుల సామాన్లని అరుగు మీద మరోవైపు పెట్టి, తన్మయిని చూసీ చూడనట్టు తల దించుకుని లోపలికెళ్లి టీవీ ముందు కూచున్నాడు.

ప్రభు అక్క ప్రభు కంటే పెద్దదని తెలుసు కానీ ఇంత పెద్దదని తెలీదు. ఆవిడింకా తన్మయి వైపే చూస్తూ మాట్లాడుతూనే ఉంది.

"అయిదేళ్ల కిందట భర్త పోయిన దగ్గర్నుంచి ఆవిడ అమ్మగారింట్లోనే ఉందట. ఇక ఆవిడ కూతురి భర్త మిలటరీలో ఉంటున్నాడు కాబట్టి ఆ అమ్మాయీ ఆవిడతోనే ఉన్నది పెళ్లయిన దగ్గరనుంచి.

అబ్బాయి ఏడో తరగతి ఫెయిలయ్యి ఇక అటు చదువూ చదవలేదు, ఇటు ఏ పనీ నేర్చుకోలేదు."

ఇంత సంసారాన్ని నడపడానికి తమ జీతాలు ఎలా సరిపోతాయో తెలీడం లేదు తన్మయికి. వాళ్లందరికీ టిఫిన్లు, కాఫీలు అయ్యీ కాక ముందే మధ్యాహ్నం వంటకి పెద్ద చేపలు రెండు తీసుకు వచ్చేడు ప్రభు. వాటిని శుభ్రం చేసి, వండి, భోజనాలు పెట్టి వంటిల్లు శుభ్రం చేసుకునే సరికి వికారంగా, కళ్ళు తిరుగుతున్నట్టు అనిపించసాగింది తన్మయికి. హాల్లో అంతా కిక్కిరిసినట్టు టీ.వీ ముందు కూచున్నారు. ప్రభు కూడా వాళ్లతో బాటూ కూచున్నాడు. బాబు బయటికి ఆడుకోవడానికి వెళ్లేడు. లోపల గదిలోకి వెళ్లి పడుకుందామంటే అప్పటికే బేబమ్మ మంచమ్మీద మధ్యాహ్నపు నిద్ర తీయసాగింది. ఇక చేసేదేం ఇక తన్మయి వంట గదిలో ఒక వారగా చాప పరుచుకుంది.

అరగంటలో టీలు కావాలని ప్రభు వచ్చేడు.

తన్మయిని చూస్తూనే "ఇలా ఇక్కడ ఎవరితోనూ కలవకుండా ఒక్కదానివీ ఉండకపోతే అలా వచ్చి టీవీ ముందు అందరితో కూచోవచ్చు కదా" అన్నాడు.

పగటి పూట ఎప్పుడూ పడుకోని తను అసలు ఎందుకు పడుకుందో అడుగుతాడనుకున్న తన్మయికి తనకు ఒంట్లో బాలేదన్న విషయం కూడా చెప్పాలనిపించలేదు.

మాట్లాడకుండా నెమ్మదిగా లేచి టీ పెట్టడానికి స్టవ్వు వెలిగించింది.

అసలే పొద్దున్న ఆవిడ చేసిన రాద్ధాంతానికి మనసేమీ బాగోలేదు.

ఈ విషయం ప్రభుతో రాత్రికి మాట్లాడాలి. వీళ్ల నోటికి హద్దూ పద్దూ లేకుండా మాట్లాడితే కుదరదని గట్టిగా చెప్పాలి.

టీ తాగడానికి తల్లిని లేపేడు ప్రభు. బయటికి రాగానే బేబమ్మ ప్రభుతో గట్టిగా మాట్లాడడం మొదలుపెట్టింది.

"ఇదిగో చినబాబూ, నీ పెళ్లాం వరసేవీ బాగోలేదు. నిన్న ఆ పిల్లోడు మా కాళ్ల కాడ కూకున్నాడని లాక్కెల్లిపోయింది. మేం టీలు తాగినకాడ ఎనకాలే తడిగుడ్డ ఎట్టి తుడుసుకుంటంది. అంటే మావు అంటరానోళ్ల వనా?...అదలాగుంచు. ఆ పిల్లోడు నిన్ను "డాడీ" అని పిల్సాకి ఈల్లేదు. నిన్నా మొన్న పెళ్లయ్యి, అప్పుడే ఆరేళ్ల పిల్లోడికి తండ్రెలా అయిపోయేవురా మా కర్మ గాపోతే! నీ పెళ్లాం నీ ముందు మింగిలాగా ఉంటంది కానీ మమ్మల్నేవన్నాదో తెల్సా, 'మాటలు జాగర్తగా రానియ్య'న్నాదిరా " అని శోకాలు పెట్టసాగింది.

ప్రభు నిశ్శబ్దంగా విన్నాడే గానీ ఏవీ మాట్లాడలేదు. చుట్టూ ఉన్నవాళ్ళంతా ఇది తమకు మామూలే అన్నట్లు ఓ పక్కన పెద్దగా మోగుతున్న టీవీ చూడసాగేరు. ఆ రాత్రి ప్రభు తన్మయితో మాట్లాడడం ఇష్టం లేనట్లు తప్పించుకు తిరిగేడు. డాబా మీద ఒక పక్కకు నిద్రకుపక్రమించబోతున్న ప్రభుని తట్టి సీరియస్ గా అంది తన్మయి.

"వాళ్ల మటుకు వాళ్లు నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటే ఏవిటి నీ ఉద్దేశ్యం ఒక్కమాట కూడా మాట్లాడవు?" అంది.

"నువ్వు మటుకు ఏవైనా గొప్పదానివా? వాళ్లు ఏం మాట్లాడినా ఎదురు చెప్పొద్దు అని చెప్పేను. నువ్వేం చేసేవు?" అన్నాడు.

"అంటే వాళ్లు "ఎవడికి పుట్టేవురా?" అని నోరులేని పిల్లాడిని పట్టుకుని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నా, నన్ను దారుణంగా బూతులు తిడుతున్నా ఊరుకోవాలా?" అంది దుఃఖం నిండిన కళ్లతో.

"అవును. వాళ్లేమన్నా ఊరుకోవాలి. వాళ్లకి చెప్పాపెట్టకుండా పెళ్లి చేసుకున్నా నన్ను క్షమించేరు. అందుకు కృతజ్ఞత చూపాల్సింది పోయి నువ్వూ, నీ కొడుకూ కల్సి ఈ గొడవలేంటి? ఇలా చూడు రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లవుతాయి. రేపసలే ఇల్లు మారాలి మనం. ఇక ఇంతకంటే నీతో వాదించే ఓపిక లేదు నాకు" అని ముసుగు మొహం మీదికి లాక్కున్నాడు.

తన్మయికి బాధ, కోపం చుట్టుముట్టేయి.

"నువ్వెంత అన్యాయంగా మాట్లాడుతున్నావో నీకు అర్థమవుతుందా? నీ వాళ్లు నీకు ఎంత ముఖ్యమైనా ఏ కల్మషం ఎరగని నా పసివాడు నాకు అంత కంటే ముఖ్యం. వాడిమీద ఈగవాలినా సహించను. గుర్తుపెట్టుకో" అంది.

★★★

ఆ మరుసటి రోజే ఇల్లు మారాల్సి ఉంది. తన్మయి ఉదయం లేచిన దగ్గర నించి ఆలోచించ సాగింది.

"ప్రభు తనని వొదిలి వాళ్లతో వెళ్ళిపోయినా ఫర్వాలేదనుకుని తను వీళ్లతోబాటూ వెళ్లడం మానేసి ఇక్కడే ఉండిపోతే!"

"ఎప్పటిలానే తను, బాబు, తన జీవితం మళ్లీ మొదలుపెడితే"

మళ్లీ అంతలోనే "తనలా విడిగా వెళ్ళిపోవడమే వాళ్లకి కూడా కావలసింది. ఏవుంది! ప్రభుకి మళ్లీ పెళ్లి చేస్తారు. అసలు నిజానికి వీళ్లు ఇక్కడికి గొప్ప క్షమా హృదయంతో రాలేదు. కావాలని తనని ఏడిపించి పంపెయ్యడానికే వచ్చేరు. ప్రభుని కావాలనుకుని పెళ్లి చేసుకుని ఇంతలోనే ఓడిపోయినట్లు తనెందుకు విడిపోవాలి?" అని పట్టుదల కలగసాగింది.

చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుని వచ్చి స్థిమితంగా ఆలోచించసాగింది. ఈ సమస్యల్ని వీళ్లతోనే ఉండి పరిష్కరించుకోవాలి. అదెంత కష్టసాధ్యమైనా సరే.

తనకి ప్రభు ముఖ్యం. ప్రభు తాత్కాలికంగా కఠినంగా మాట్లాడుతున్నాడు కానీ తనంటే ఎంత ప్రేమ లేకపోతే ఇంతగా తను ప్రేమించే వీళ్ళందర్నీ కాదని తనని పెళ్లి చేసుకుంటాడు!

ఒకటి మాత్రం నిజం. శేఖర్ లాగా ప్రభు మూర్ఖుడు కాదు. తనకి ఎప్పటికీ అన్యాయం చెయ్యడు. తను మాత్రం ఎందుకు అతన్ని వదిలి వెళ్లిపోవాలి?

లోపల్లోపల పరిపరి విధాలా ఆలోచిస్తూ మారు మాట్లాడకుండా సంచులు తీసుకుని సామాన్లు సర్దసాగింది.

వాళ్ల సామాన్లు ఉన్న కాసిన్నీ తెచ్చుకున్న సంచుల్లో అలాగే ఉన్నాయి కాబట్టి వాళ్లకి పనేమీలేదు. తన్మయి ఒక్కతే తన సామాన్లు సర్దుకోవాల్సి రావడంతోనో ఏమో ముందురోజు వికారం తీవ్రతరమైంది. కానీ వంట సామాన్లు సర్దడానికి, పుస్తకాలు, బట్టలు సర్దడానికి గానీ ఇంట్లో ముగ్గురు ఆడవాళ్లున్నా తన్మయిని సాయం కావాలా అని కూడా అడగలేదు. అదే అంది ప్రభుతో.

"ఇలా చూడు, వాళ్ల నుంచి నువ్వు ఏవీ ఎప్పుడూ ఎక్స్‌పెక్ట్ చెయ్యొద్దు. నేను చేస్తానుగా నీకు సాయం" అన్నాడు అసలు ముందురోజు ఏవీ జరగనట్టు ముఖం పెట్టి ప్రభు.

తన్మయి ఊపిరి గట్టిగా పీల్చి నిట్టూర్చింది. "ఏవిటితని వరస?"

మంచం, టీవీ, బీరువా వంటి పెద్ద సామాన్లు ప్రభు, అతని మేనల్లుడు కలిసి వ్యానులోకి ఎక్కించేందుకు వీలుగా దుప్పట్లు, సంచులు వేసి కట్టేరు. వెళ్లే ముందు చెప్పిరావడానికి తన్మయి తాయిబా దగ్గిరికి వెళ్లింది.

"ఏమో ఇది మేడం, సారు జిమ్మేదారీ అంతా నీ మింద పడింది. మల్ల గలీజు గలీజు మాటలంటుండ్రు. నిన్నటి సంది అంతా ఇన్నా నేను. నువ్వే జర సోచాయించుకోవాలె. ఇయ్యేల ఇల్లు కాళీ చేస్తురంటే మస్తు బాద గొర్తాఉంది నాకు. ఎట్ల బతుకతవో ఏమో ఈళ్ల మద్దెన" అంది టీ కలిపి ఇస్తూ.

తన్మయి నిశ్శబ్దంగా తలుపుతూ "ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు తాయిబా. ప్రభు స్వతహాగా చాలా మంచివాడు. వీళ్లు రానంతవరకూ నన్ను ఎంతబాగా చూసేడో నువ్వూ చూసేవుగా. పైగా ఇప్పుడు నెల తప్పినట్లుంది. నేను ఏ కఠిన నిర్ణయం తీసుకున్నా ఈ బిడ్డ కూడా తండ్రి లేని జీవితం గడపాలి. పైగా ఇద్దరు పిల్లల్ని ఒక్కదానినీ పెంచుకురాగలనా? అంతా అయోమయంగా ఉంది" అంది ఎన్ని రోజులు ఆలస్యమయ్యిందో లెక్కపెట్టుకుంటూ.

"అమ్మ ఎంత మంచి వార్త చెప్పినవు మేడం, ఇంకేం పరేషాని గాకు. అల్లా నిన్ను సల్లగ సూస్తడు. సారు గిట్ల నిన్ను మంచిగ సూసుకుంటడు. మన్మడో, మన్మరాలో అయితే మీ అత్తమామలు గిట్ల మారుతరులే తియ్యి" సంతోషంగా అంటూ తాయిబా "నడు, నేనొస్త సర్దనీకి. నువ్వు బరువులు గిట్ల మొయ్యనే గూడదు" అంది.

59

ఇల్లు ఖాళీ చేసి తాళం చెవి తాయిబాకు ఇస్తుంటే ఎంతో బాధ కలిగింది తన్మయికి.
ఉద్యోగ నిమిత్తమై ఒంటరిగా ఊరుకాని ఊరొచ్చిన తనకి ఎంతో సాయపడ్డది. తనకు అక్కచెల్లెళ్లు లేని లోటు తీర్చింది తాయిబా. ఎన్నో సార్లు కష్టకాలంలో బాబుని చూసుకుని ఎంతో సహాయం చేసింది.
గేటు దగ్గిర "నే చెప్పింది జర యాదుంచుకో మేడం, మీ అత్తమామల లెక్కేమున్నది తియ్యి గాని, సారు, నువ్వు గిట్ల మంచిగుంటె అంత మంచిగైతది" అంటూ కౌగిలించుకున్న తాయిబాకు వీడ్కోలు పలుకుతూ

"మిత్రమా! ఇంత మంచి అమ్మాయికి నా తరఫున ఎప్పుడూ సహాయం చెయ్యి" అని మనసులోనే వేడుకుంది.
తాయిబాకు తనంటే ఎంత ప్రేమ! జీవితం తనకిచ్చిన అరుదైన వరాలివన్నీ. ఏమిచ్చి ఋణం తీర్చుకోగలదు తను? వాకిట్లో మొక్కలకు, చిన్న డాబా మీద గింజలు ముక్కున కరుచుకుని రెక్కలు అల్లాడిస్తూ తుర్రున ఎగురుతున్న పిచికలకు వీడ్కోలు పలికి మౌనంగా ప్రభు బండి వెనక ఎక్కింది.
బాబు సరదా పడితే సామాన్లతో బాటూ ప్రభు మేనల్లుడి వెంట వ్యానులో పంపించింది.
ఊరు దాటుతూ ఉండగా రోడ్డు మలుపు నించి దారి పొడవునా అటూ ఇటూ వీడ్కోలు పలుకుతున్న మోదుగ పూల చెట్ల పరిమళం తాకగానే గుండెమాటున దాగున్న జ్ఞాపకాలు ఒక్కపాటున విరబూసేయి.

తనా ఊరికి వచ్చిన మొదటిరోజు అప్పటి వరకు ఎప్పుడూ పరిచయం లేని కొత్త పరిమళం, తేమలేని చల్లని పీఠభూమి గాలి సేదతీర్చలేని ఎడతెగని దుఃఖం. ప్రాణప్రదమైన విశాఖ సముద్రాన్నొదిలి తెలియని ప్రాంతంలో అడుగుపెడుతూ మనస్సంతా తీగలుగా అల్లుకున్న దిగులుతో ఒంటరిగా బాబుతో ఒకే ఒక్క సూట్ కేసుతో అడుగుపెట్టింది అక్కడికి.

ఇప్పుడు? ఒక వ్యాను నిండా సామాన్లు అయ్యేయి.

బాబు తో ఒంటరిగా మొదలైన జీవితం ప్రభు రాకతో వసంతాన్ని సంతరించుకుంది.

ఉన్నట్టుండి ప్రభు కుటుంబమూ తమతో చేరి ఇప్పుడు ఒక్కసారిగా సంసారం సాగరం అయ్యింది.

కానీ తనంటే బొత్తిగా ఇష్టం లేని వాళ్ల మధ్య బతకడమే ఇప్పుడు పెద్ద సమస్య.

ప్రభు తల్లి భయంకరమైన మాటలు గుర్తుకు వచ్చి మళ్లీ ఈటెల్లా గుచ్చుకోసాగేయి.

ప్రభు భుజాన చెయ్యి వేసి కళ్లు మూసుకుంది.

ఆ చేతిని తన చేత్తో నిమురుతూ ఏదో అర్థమైనట్లు "కాస్త ఓపిక పట్టురా ప్లీజ్, అన్నీ సర్దుకుంటాయి" అన్నాడు అనునయంగా.

తన్మయి నిశ్శబ్దంగా తన చేతిని వెనక్కు తీసుకుని గట్టిగా ఊపిరి తీసుకుంది.

అప్పుడప్పుడే చీకటి పడుతూ సంధ్య వెలుగు ఆకాశమంతా పరుచుకుంటూ ఉంది.

తన్మయికి తమ ఊరు, ఎన్నో సాయంత్రాలు ఒంటరిగా జాజి పందిరి పొదరింట్లో కూచుని చదువుకున్న పుస్తకాలు, వనజతో కబుర్లు చెప్పుకుంటూ గడిపిన గోధూళి వేళలు, అజ్ఞాతమిత్రునికి రాసిన పొందికైన లేఖలతో అనంతాద్భుతమైన అనుభూతిగా, హాయిగా సాగిన తన యవ్వన కాలమంతా జ్ఞాపకం వచ్చింది.

తరువాత గడిచిన జీవితమంతా ఎప్పటికప్పుడు కొత్తకొత్త సమస్యలే.

తనకు మాత్రమే జీవితం ఇలాంటి అంతుచిక్కని ప్రహేళిక లాంటి కాలాన్ని భవిష్యత్తుగా బహూకరిస్తూందెందుకో!

నిస్త్రాణగా కళ్ళు మూసుకుంటూ "మిత్రమా! ఎప్పటిలానే నా జీవితాన్నినీ చేతుల్లో పెడుతున్నాను. నన్ను నువ్వే నడిపించు" అనుకుని కళ్లు తెరిచింది.

తన్మయి మాటలు విని ఆకాశం అభయహస్తాన్నిచ్చినట్లు దూరంగా ఉల్క ఒకటి రాలిపడింది.

★★★

కాలేజీ నుంచి దాదాపు గంట దూరంలో ఉందీ కొత్తిల్లు.

ఇంటి దగ్గర్లో మరో కాలనీలో ఉన్న స్కూలొకటి చూసి బాబుని జాయిన్ చేసింది.

పొద్దుట వాణ్ణి స్కూలు ఆటో ఎక్కించి, వెంటనే బయలుదేరి రోడ్డు మీదికొచ్చి బస్సు పట్టుకుంటే తొమ్మిది గంటల వేళకి అటూ ఇటూగా కాలేజీకి వచ్చి పడుతూంది. ఈ మధ్యలో ఎక్కడ లేటయినా మరింత లేటు కావడం ఖాయం!

అసలే కాలేజీలో ప్రిన్సిపాల్ ట్రాన్స్ ఫర్ అయ్యి కొత్తగా లేడీ ప్రిన్సిపాల్ జాయిన్ అయ్యేరు. సొంతంగా కారున్న ఆవిడ కాలేజీ సమయానికి అరగంట ముందే వచ్చి కూచుని, లేటొచ్చిన వాళ్లు లెక్చరర్లయినా ఆప్సెంటు వేసేస్తుందని అందరూ చెప్పుకుంటూ ఉన్నారు.

ఈ సమయంలో ఇల్లు మారడం ఒక విధంగా తనకి దురదృష్టమే అనుకుంది తన్మయి.

ఇక ఇంట్లో ఎవరి గదుల్లో వాళ్లు సర్దుకున్నారు.

తన్మయి ఇంట్లో ఉన్నంతసేపు సాధ్యమైనంత వరకు తన గదిలోనే ఉండసాగింది.

ఎక్కువగా తన్మయి ముఖం కనబడకో ఏమో ప్రభు తల్లి కాస్త నెమ్మదించినట్టు కనబడింది.

పొద్దున్న తన్మయి కిందికి వచ్చేసరికే ప్రభుకి, తన్మయికి, బాబుకి కేరేజీలు కట్టేసి రెడీగా ఉండసాగేయి.

తనని వంటింట్లోకి అడుగుపెట్టొద్దని ప్రభు తల్లి శాసనం వేసినందుకు బాధ కలిగినా, సమయానికి వండి పెడ్తున్నందుకు సంతోషించింది తన్మయి.

కానీ ఆ సంతోషం ఎక్కువసేపు నిలవలేదు. మొదటి రోజే మధ్యాహ్న భోజనం చేసేందుకు కారేజీ మొదటి బాక్సు మూత తెరవగానే నీరయిపోయిన రాత్రన్నం జిగురుగా చేతికి తగిలింది.

ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది తన్మయికి. తనకిదేం ఖర్మ!

తన ఇంట్లో తను వండుకుని తినడానిక్కూడా వీలులేదు. వాళ్లేం పెడితే అది తినాలి. వాళ్లు పెడుతున్నది ఇదీ.

ఎదురుగా అప్పుడే బాక్సు మూత తియ్యబోతున్న ఇద్దరు ముగ్గురు లెక్చరర్లు తన్మయి ముఖంలోకి చూసీ చూడనట్లు తలదించుకున్నారు.

విసవిసా బయటకు నడిచి రోడ్డు మీదికి వచ్చి ప్రభుకి ఫోను చేసింది తన్మయి.

మారు మాట్లాడకుండా అంతా విన్న ప్రభు అట్నించి చాలా కూల్ గా "ఆ కేరేజీ పడేసి ఏదైనా తెప్పించుకుని తిను" అన్నాడు.

తన్మయి చికాకొచ్చి ఫోను పెట్టేసింది. అసలే ఒక పక్క ఆకలి మండుతుంది. మరో పక్క గుండెల్లో ఈ మంట. కేరేజీ పడేసి ఏదైనా తెప్పించుకోవాలని తనకీ తెలుసు. అసలు తనెందుకు ఫోను చేసింది? తన బాధ చెప్పుకోవడానికి అతను తప్ప ఎవరున్నారు తనకి? వాళ్ల వాళ్లు ఎలా తనని ఏడిపిస్తున్నారో అతనికీ తెలియాలి కదా!

కనీసం "అయ్యో, అలాగా సాయంత్రం వాళ్లతో మాట్లాడుతాననైనా" అనలేదు ప్రభు. ఇక అతనితో చెప్పుకుని ఏం ప్రయోజనం?

వెనక్కి దిగులుగా నడిచి వస్తున్న తన్మయికి బస్సు దిగి అప్పుడే కాలేజీకి వస్తున్న సిద్దార్థ ఎదురయ్యేడు.

"ఉదయం లేటయ్యిందండీ. ఎలాగూ ఆబ్సెంటు పడుతుందని సెలవు పెట్టి మధ్యాహ్నం సెషన్ కి వస్తున్నా" అన్నాడు.

సమాధానం లేని తన్మయి ముఖం చూస్తూనే మనఃస్థితి పసిగట్టినట్టు "ఎలాగూ లంచ్ అవరే కదా, కొంచెం టీ తాగి వెళ్దాం రండి" అంటూ త్రోవ పక్కనే ఉన్న చిన్న హోటల్లోకి దారి తీసేడు.

బాధతో, ఆకలితో, అవమానంతో, దుఃఖంతో, దిగులుతో కళ్లు దించుకుని కూచున్న తన్మయి భోజనం చెయ్యలేదన్న సంగతి ఇట్టే పసిగట్టి టిఫిను ఆర్డరు చేసేడు.

తిన్నాక స్థిమితపడ్డ తన్మయి "థాంక్యూ సిద్ధూ!" అంది కళ్ల మీది సన్నటి నీటి పొరని ఒత్తుకుంటూ.

జరిగిందంతా విన్న సిద్దార్థ గట్టిగా నిట్టూర్చేడు.

"బాధ పడకండి. మంచి మనసున్న మీకెప్పుడూ అపజయం కలగదు. మీరు చదువుకున్న వారు. సంస్కారం కలిగినవారు. అతని వైపు వాళ్లెవరికీ సంస్కారం లేనట్లుంది. వాళ్లకున్న పరిజ్ఞానం, వాళ్ల జీవితాల పరిధీ మీతో పోలిస్తే దాదాపు సున్నా. మీరు చూసిన జీవితం వాళ్లెవ్వరూ చూసి ఉండరు. ఆ కుటుంబంలో వయసుల్ని పక్కన బెడితే జీవితానుభవంలో మిమ్మల్ని మించిన వారూ ఉండరు. ఏ విధంగా చూసినా మీ కంటే అల్పులే వాళ్లంతా. ఒక విషయం గుర్తు పెట్టుకోండి. అటువంటి వాళ్ల వల్ల మీ కంట్లో కన్నీరు ఉబకకూడదు." అన్నాడు.

తన్మయి విభ్రమంగా చూసిందతని వైపు.

ఎంత బాగా చెప్పేడు!

"ఇక ప్రభు పరిస్థితి ఎటూ మాట్లాడలేనిది. వాళ్లు ఎటువంటి వాళ్లో అతనికి బాగా తెలుసు. కానీ తన వాళ్లని కాదని మిమ్మల్ని వెనకేసుకురాలేడు. అందువల్ల తను ఎక్కడ వాళ్లకు దూరమవుతాడేమోనన్న భయం అయ్యి ఉండొచ్చు. ఏదేమైనా, ఏ పరిస్థితుల్లోనూ వాళ్లను వదులుకోలేని మంచి కొడుకు అతను అన్నాడు "మంచి" అన్న పదాన్ని ఒత్తిపలుకుతూ. కానీ ఈ విషయాన్ని పెళ్ళికి ముందు మీతో స్పష్టంగా చెప్పి ఉంటే బావుండేది. బహుశా: ఇదే జీవితమంటే. నిరంతర పోరాటం. ఇంత కంటే గొప్ప కష్టాలెదుర్కొని నిలదొక్కుకున్న మీకు నేను చెప్పనవసరం లేదనుకుంటా" అని

తన్మయి మౌనంగా ఆలోచిస్తుండడం చూసి

"ప్రభు విషయం నాకంటే మీకే బాగా తెలుసు. మంచి కొడుకు మంచి భర్త కాగలడని సామెత ఉంది కదా! అది నిజమౌతుందేమో ఆలోచించండి" అన్నాడు.

తన్మయి అర్థం అయినట్లు తలూపింది.

"సరే మరి, మంచి అద్రక్ చాయ్ తాగి బయలుదేరుదామా" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

తన్మయి తేలికపడ్డ మనసుతో ఊపిరి తీసుకుంటూ ప్రతిగా చిర్నవ్వు నవ్వింది.

★★★

తిరిగి వస్తున్నపుడు బస్సులో ఒళ్లు తెలీకుండా నిద్రపట్టేసింది తన్మయికి.

అంతలోనే కల కూడా రాసాగింది.

తన్మయి బస్సు దిగి ఇంటికెళ్లే దారిలో చిన్న సిలిండరుతో బాటూ ఉండే స్టవ్వొకటి కొంది.

"నేను వంటింట్లోకి అడుగు పెట్టకూడదు కాబట్టి పైన మన గదిలో నేను వండుకుంటాను" అంది.

"ఇంత చిన్నగదిలో వంట పెడితే ఎలా?" అని ముఖం చిట్లించిన ప్రభుని పట్టించుకోనట్లు , అది తన సమస్య కానట్లు తెచ్చిన పాల పేకెట్టుని గిన్నెలోకి వంపి స్టవ్వు మీద పెట్టింది.

"ఏదో పొద్దున్నే పాలు కాచుకుందుకో, అస్తమాటూ కిందికి దిగి వెళ్లలేని చిన్న చితకా అవసరాలకో ఈ చిన్న స్టవ్వు వాడుకో కావాలంటే. మధ్యాహ్నం కేరేజీ కావాలంటే బయటి నుంచి తెప్పించుకో. అంతేగాని మొత్తం వంట వేరే పెడితే ఏం బావుంటుంది?" అన్నాడు.

"అంతే గాని వాళ్లకు రాత్రి అన్నాలు కేరేజీల్లో పెట్టొద్దని చెప్పవన్నమాట. అయినా నేను వంటింట్లోకి రాకూడదని శాసనం వేసేరుగా. ఇంకేం చెయ్యమంటావు?" అంది గట్టిగా తన్మయి.

ప్రభు మాట్లాడకుండా తల తిప్పుకోవడం చూసి "ఇక మీదట ఇంటి ఖర్చులేవీ నేను కట్టడం లేదు. నా ఖర్చులు, బాబు ఖర్చులు పోగా మిగిలివేవైనా ఉంటే సేవింగ్సు బ్యాంకులో వేస్తాను. ఇల్లు నువ్వూ, మీ వాళ్లూ కలిసి నడుపుకోండి. ఇక మీదట సాయంత్రం భోజనం కూడా నేనే వండుకుంటాను. గదిలో కాకపోతే మధ్య హాల్లో" అని పుస్తకం తీసుకుని డాబా మీదికి వెళ్ల సాగింది.

ఇంతలోనే పక్కనున్న ఎవరో కుదపడంతో మెలకువ వచ్చింది తన్మయికి.

అబ్బా! చిన్న కునుకు పట్టిన కాస్సేపు కూడా ఇంటి గొడవల కలే.

కలలో అప్రసన్నంగా ఉన్న ప్రభు ముఖం గురుకొచ్చి తనలో తను చికాకు పడుతూ బస్సు దిగి, బండి తీసుకుని ఇంటి ముందు ఆగంగానే ఎక్కడలేని అలసట వచ్చింది తన్మయికి.

తల్లి కోసమే చూస్తున్నట్లు గేటు పుచ్చుకుని అటూ ఇటూ ఊగుతున్న బాబు తన్మయిని చూస్తూనే పరిగెత్తుకుని వీధి చివరికి ఎదురొచ్చి బండెక్కేడు.

పాత ఇంటి అలవాటుగా అలా పరిగెత్తుకు వస్తున్న బాబుని వారిస్తూ "నాన్నా! రోడ్డు మీద బళ్లు వస్తున్నాయి కదా! అలా పరిగెత్తొచ్చా" అంది మందలింపుగా.

"అమ్మా! ఆకలేస్తూ ఉంది" అన్నాడు.

"అదేమ్మా, స్కూలు నించి వచ్చి పాలు తాగలేదా?" అంది.

బాబు తల అడ్డంగా ఊపుతూ "మనిద్దరికీ పాలు మనమే కొనుక్కోవాలట" అన్నాడు.

"సర్లే, ఆ విషయం నేను చూస్తాను, ఇవేళ్టికి సెంటర్లో ఏమైనా తిందువు" అంది తన్మయి బండి వెనక్కి తిప్పుతూ.

పైకి అలా అందే కానీ మనస్సులో ఈ చికాకులకి బాధ కలగసాగింది.

ప్రభుతో చెప్పడం వల్ల ఉపయోగం ఉండదని మధ్యాహ్నమే బాగా అర్థమయ్యింది.

ఇక అన్నీ తనే చక్కదిద్దుకోవాలి.

తిరిగి ఇంటికొస్తూనే ఒంపకుండా తిరిగి తీసుకొచ్చిన కేరేజీ ని అక్కడే  టేబుల్ మీద పెట్టి మెట్లెక్కసాగింది.

వెనకే వంటింటి సింకులో విసురుగా పడ్డ కేరేజీ శబ్దాన్ని వినిపించినా వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

గదిలోకి అడుగుపెట్టగానే ఒక్కసారిగా తల తిరుగుతున్నట్లు అనిపించసాగింది. అతికష్టమ్మీద పైకెళ్లి మంచమ్మీద వాలిపోయింది. అంతలోనే కడుపు మెలితిప్పుతూ వాంతి రాసాగింది.

తన్మయికి స్పష్టంగా అర్థం అయింది వేవిళ్లని.

బాబు పుట్టినప్పుడు అయిదు నెల్లు నిండే వరకు వేవిళ్లతో తన పరిస్థితి ఎంత దారుణంగా ఉందో గురుకొచ్చి భయం పట్టుకుంది.

చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుని తలగడకు జేరబడి కూచుండి పోయింది.

"ఒక పక్క తనని ఎలా వేధించాలా అని చూస్తున్న ఇంట్లో వాళ్లు, నానాటికీ క్లిష్టమవుతున్న ఉద్యోగం, మరోపక్క పార్ట్ టైముగా చెయ్యాల్సిన పీ.హెచ్.డీ వర్కు , అప్పుడప్పుడే బాగా ఊహ తెలుస్తున్న బాబు,  వీటన్నిటితో ఇప్పుడు కడుపున పాపాయి" నిస్సత్తువగా కళ్లు మూసుకున్న తన్మయి ప్రభు స్పర్శతో కళ్లు తెరిచింది.

నుదుటి మీద చెయ్యేస్తూ "ఏరా, ఒంట్లో బాలేదా" అన్నాడు లాలనగా.

మధ్యాహ్నం అతను మాట్లాడినది కూడా మర్చిపోయి అతన్ని అల్లుకుపోయింది.

నిశ్శబ్దంగా తల నిమురుతూ "వాళ్ల తరపున నేను సారీరా. ఇక రేపట్నుంచి ఇద్దరం ఇంట్లో నుంచి కేరేజీ మానేద్దాం. సెంటర్లో మెస్ లో మాట్లాడేను. పొద్దున్నే మనిద్దరికీ వేడివేడిగా టిఫిను కట్టిచ్చేస్తాడు" అన్నాడు మళ్లీ అందుకే తన్మయి బాధపడ్తున్నదనుకుని.

తన్మయికి ప్రభు తన గురించి ఆలోచిస్తున్నందుకే బోల్డు సంతోషం వేసింది.

నిశ్శబ్దంగా తలుపుతూ నిశ్చింతగా కళ్లు మూసుకుని అతని చెవిలో నీరసంగా గొణిగింది.

తన్మయి ముఖాన్ని ముద్దులతో ముంచెత్తుతూ సంతోషిస్తాడనుకున్న ప్రభు తన్మయి ఒళ్లో తలాన్చి ఒక్కసారిగా దుఃఖపడసాగేడు.

బిత్తరపోయి ప్రభుని హత్తుకుని "ఏమైంది?" అంది.

దాదాపు పది నిమిషాల తర్వాత కాస్త స్థిమితపడి "ఏమోరా. తండ్రి కావడమంటే ఇలా ఉంటుందా? నాకే తెలీడం లేదు" అన్నాడు ప్రభు.

అప్పటికి తేరుకున్న తన్మయి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

అంతలోనే ప్రభు వస్తూనే ఏమన్నాడో జ్ఞాపకం వచ్చి ఆలోచనలో పడింది. తను చెప్తున్న పరిష్కారం సరైనది కాదని ప్రభుకి కూడా తెలుసు. ఎన్నాళ్లు బయట తింటారు? పైగా రోజూ బయట తినడం ఆరోగ్యకరమేనా?

ఇంతలో ప్రభు "నేనూ నీకో మంచి వార్త చెపితే నాకేమిస్తావు?" అన్నాడు.

తన్మయి ఏదో అనేలోగా "నాకు ప్రమోషనిచ్చేరు. జీతం మరో పదివేలు పెంచేరు. ఇక మీదట ఇంటి ఖర్చులేవీ నువ్వు కట్టొద్దు. నీ ఖర్చులు, బాబు ఖర్చులు పోగా మిగిలివేవైనా ఉంటే సేవింగ్స్ బ్యాంకులో వేసుకో" అన్నాడు.

★★★

వారాంతంలో తన్మయిని డాక్టరు పరీక్షకి తీసుకువెళ్లేడు ప్రభు.

"డాక్టరు చెప్పింది అర్థమైందిగా. నువ్వు దేనికీ కష్టపడొద్దు. ఉద్యోగం ఒక్కటీ కాగానే హాయిగా రెస్టు తీసుకో." అన్నాడు తిరిగి వస్తున్నపుడు ప్రభు బండి నడుపుతూనే తన్మయి చేతిని ఒక చేత్తో పట్టుకుంటూ.

అతని వీపుకానుకుని కూచుని నిశ్శబ్దంగా తలూపింది తన్మయి.

ఇంట్లోనూ ఈ వార్త తెలిసి సంతోషించినట్టే కనబడ్డారందరూ.

కానీ అతని తల్లి ముక్కు చీదడం మాత్రం ఆపలేదు.

వాళ్ల కొడుక్కి వచ్చే పది లక్షల కట్నం పోగొట్టిందని ఒకసారి, ఆడపడుచు లాంఛనాలు పోయాయని ఒకసారి, చిన్న కొడుకు పెళ్లి ఎంత ఘనంగా ఉహించుకుందోనని మరోసారి రోజుల తరబడి వాళ్లు పంచాయితీలు పెట్టడం ప్రభు వాళ్లతో ఓపిగ్గా మాట్లాడ్డం వింటూనే ఉంది తన్మయి.

తన ముఖమ్మీదే ఏవేవో మాటలు విసురుగా వినిపిస్తున్నా విననట్లు , తామరాకు మీద నీటి బొట్టులా నిమిత్తమాత్రంగా ఉండడం అలవాటు చేసుకుంది.

తనకి ప్రభు ముఖ్యం అనుకుంటూ ఆ సాయంత్రం బాల్కనీలో విరబూసిన పూలలోంచి ఒక గులాబీని కొయ్యబోయింది. తొడిమకున్న ముళ్లు చప్పున గుచ్చుకున్నాయి.

చప్పున ఏదో అర్థమైనట్లయ్యింది. అందమైన గులాబీకి ముళ్ళున్నట్టే ఇతని చుట్టూ వీళ్లంతా. గులాబీని అందుకోవాలంటే ముళ్లు గుచ్చుకోక తప్పదు. ముళ్లు గుచ్చుకున్న వేలిని విదిలిస్తూ ఆకాశంలోకి చూసింది.

అద్భుతమైన నెలవంక పసిపాప నవ్వులా విరిసింది.

"తెల్లగా నెలవంక తేలిపోతోంది –

చల్లగా నా ఊహ

మెల్లగా భావాల

నల్లిబిల్లిగ పాట

లల్లుతో వుంది

ఆకాశమే నన్ను ఆలకించింది –

నా చింతలో ఆస

నటియించడము జూచి

నాకోస మొక జాలి

నవ్వు పూచింది"

మల్లవరపు విశ్వేశ్వరరావు గారి కవిత జ్ఞాపకం వచ్చింది.

"మీరున్న చోట ఇంకెవరున్నా వాళ్లతో కలిసి తిట్టుకుంటూ అందులోనే పడి కొట్టుకుంటూ ఉంటారు. మీరు మాత్రమే మీలా సంయమనంతో ఉండగలరు" అన్న సిద్దార్థ ప్రశంసా పూర్వక మాటలు జ్ఞాపకం వచ్చేయి.

***జీవితం ఎంత సౌందర్యవంతమైందో అంతకంతా క్లిష్టమైంది!***

***ఎంత క్లిష్టమైందో అంతకంతా సౌందర్యవంతమైనదీను!!***

పడమటి వేపున్న తమ గది తలుపు మూసుకుంటే అంతా తన ప్రపంచమే తన్మయికి.

బాల్కనీలోంచి వినిపించే సాంధ్యరాగాల నడుమ బుద్ధుని దాపున వెలిగించిన అగరొత్తు పరిమళం మనసుకి ప్రశాంతతని చేకూరుస్తూ ఉండగా రవీంద్రుని గీతాంజలి చేతిలోకి తీసుకుని పేజీ తిప్పగానే ముత్యాల్లాంటి వనజ చేతి వ్రాతలో "నా తన్మయికి -ఎప్పటికీ నీ వన " అన్న అక్షరాలు కనిపించాయి.

60

అప్పటికప్పుడు వనజకి ఉత్తరం రాయాలనిపించింది తన్మయికి.

"వనా!

ఎలా ఉన్నావు? మనం ఉత్తరాలు రాసుకుని ఎన్నాళ్ళయింది! కాదు కాదు ఎన్నేళ్లయ్యింది!!..."

గుమ్మం ముందు అలికిడి కావడంతో రాస్తున్నదల్లా పక్కకి చూసింది.

ప్రభు అక్క కూతురు, పాప ని ఎత్తుకుని నిలబడి సంశయిస్తూ "యాండీ, నేను లోపలికి రావొచ్చా" అంది.

తన్మయి చిర్నవ్వుతో గుమ్మం దగ్గిరికి వెళ్లి ముద్దులొలుకుతున్న పాప వైపు చెయ్యి చాస్తూ, పాప తల్లి వైపు తిరిగి "రామ్మా" అంది.

గదిలోకి బిడియంగా వచ్చి పరీక్షగా చుట్టూ చూడసాగింది ఆ అమ్మాయి.

తన్మయి డబ్బా లో నుంచి బిస్కెట్టు తీసి పాపకిస్తూ "నన్ను అత్తా అని పిలొవొచ్చు నువ్వు. మీ మావయ్య భార్యనేగా" అని చిర్నవ్వు నవ్వింది.

ఆ అమ్మాయి "అక్కా" అని పిలవొచ్చా అంది సమాధానంగా.

"నీకెలా నచ్చితే అలా పిలువు రాణీ" అంది తన్మయి.

ఆ అమ్మాయి గబగబా "మా యమ్మమ్మ మాటలు పట్టించుకోకు అక్కా! ఆవిడ నోరు చెడ్డదే గానీ మనసు మంచిదే. ఆళ్లకి మాటైనా సెప్పకుండా మావయ్య పెళ్లి సేసుకున్నాడని కోపం. కొన్నాళ్లకి శాంతిస్తాదిలే. కుసింత ఓపిక పట్టు. అయినా ఆవిడి నిన్ననే గాదు మా యమ్మనీ, నన్నూ అలాగే తిడతాది." అంది గుమ్మం దగ్గిర్నించి మెట్ల మీంచి కిందికి చూస్తూ.

"ఏవిటి, ఇంట్లో ఎవరూ లేరా?" అంది తన్మయి, తనూ కిందికి చూస్తూ.

"మరే, పండగొస్తంది కదా ముగ్గులకి రంగులు కొనడానికి రోడ్డు దాకా యెళ్లేరు. దార్లోనే కూరగాయలు కూడా కొనుక్కుని వొత్తామన్నారు" అంటూ

“ఏం లేదక్కా, నువ్వు బాగా పెద్ద సదువు సదివేవంట కదా, బాబుతో పాటూ మా బుజ్జిక్కూడా నాలుగు అచ్చరమ్ముక్కలు నేర్పించవా? వొచ్చే ఏడాది బళ్లో ఎయ్యాలంటే ఏయో ఇంగ్లోసు అచ్చరాలు ముందే రావాలంట కదా" అంది.

తన్మయి చిరునవ్వుతో అలాగే, రోజూ సాయంత్రం నేను రాగానే కాసేపు కూచోబెట్టుకుంటాలే. అంటూ "వస్తావా" అంది పాపతో.

తల్లి చాటుకి వెళ్లి దాక్కుని కొంటెగా తొంగి చూడసాగింది బుజ్జి.

తన్మయికి ఆడపిల్లలంటే చాలా ఇష్టం. చక్కగా రెండు జళ్లు వేసి, రకరకాల పరికిణీలు కుట్టించి, అందంగా బొట్లూ, కాటుకలూ పెట్టి బొమ్మల్ని తయారుచేసినట్లు తయారు చెయ్యడమంటే మరీ ఇష్టం. అదే చెప్పింది.

"అటైతే నీకు ఈ చూలి అమ్మాయే పుడతాదిలే" అంది నవ్వుతూ రాణి.

అంతలోనే తన్మయికి కడుపులో తిప్పుతూండడంతో బాత్రూములోకి పరుగెత్తింది. తిరిగి నిస్త్రాణగా వచ్చి మంచమ్మీద వాలిపోయిన తన్మయికి కిందికి పరుగెత్తుకెళ్లి గ్లాసునీళ్లలో పంచదార కలుపుకొచ్చి ఇచ్చింది రాణి.

తన్మయి కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ "థాంక్స్ రాణీ" అంది.

"అయ్యో మనలో మనకు టాంక్సెందుకక్కా, నీకేం కావాలన్నా నన్ను పిలు" అంది.

ఆ అమ్మాయి అలా పరిచయంగా వచ్చి మాట్లాడుతూ సహృదయంతో ఏవో చెప్తున్నా తన్మయికి లోపల్లోపల భయంగానే ఉంది.

రాణి వెళ్లగానే వనజకు రాస్తున్న ఉత్తరాన్ని కొనసాగించింది.

వనా!

జీవితం ఎంతో చిత్రవిచిత్రమైంది!

ఎన్ని మలుపులు తిరుగుతుందో, ఎటు తీసుకు వెళ్తుందో ఎవరికీ తెలియదు.

తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని అంటారు కదా!

కానీ నిర్ణయాలు తీసుకోవడానికి సంవత్సరాల సమయం తీసుకున్నా కొన్నిసార్లు తప్పు నిర్ణయమే తీసుకుంటాం.

అలాగని ఏ నిర్ణయమూ తీసుకోకుండా ఉండిపోవడం వల్ల, జీవితంలో మార్పు లేకపోవడం వల్ల కదలని మడుగులా నాచుపట్టిపోతాం.

జీవితంలోకి మార్పుని ఆహ్వానించడమంటే ప్రవాహంలా జీవితాన్ని చైతన్యవంతం చేసుకోవడమే కదూ!

అందుకే ఏ మార్పునయినా ధీమాగా ఎదుర్కొవాలి కదూ! అదే జీవితం కదూ!!

సంధ్య వేళ కావస్తోంది. ఆకాశం నారింజ రంగు దాలుస్తూ ఉంది. ఎన్నో సాయం సంధ్యల్ని మనం కలిసి చూస్తూ కబుర్లు కలబోసుకున్న మా ఇంటి డాబా జ్ఞాపకం వస్తూంది వనా.

నువ్వక్కడ పిల్లలతో సతమతమవుతూ ఉన్నా సంధ్య వేళ ఆకాశం కేసి చూస్తావని నాకు తెలుసు. అందుకే నీకు ఉత్తరం రాస్తుంటే నువ్వు నేను చెప్తున్న కబుర్లన్నీ పక్కనే కూచుని వింటున్న భావన! జీవితం తిప్పిన మలుపుల్లో ఎట్నుంచి ఎటో సాగుతున్న నా జీవితం మాటికేం గానీ నీ గురించి చెప్పు.

నీ ఉత్తరం కోసం ఎదురుచూస్తూ ఉంటాను.

నీ

తను

★★★

మరుసటి వారంలో ప్రభు అక్క మంగ బట్టలారవేయడానికి డాబా మెట్లు దిగబోతూ పై అంతస్తులో చివరి మెట్టు మీద కాలు మెలిక పడి "ఓర్నాయనో" అని గావుకేక పెట్టింది.

సాయంత్రం కాలేజీ నుంచి వచ్చి, ముఖం కడుక్కుని, బొట్టు పెట్టుకుంటున్న తన్మయి కేక వినబడగానే చప్పున బయటికి పరుగెత్తుకు వచ్చింది. పడడమే పాదం పెద్దగా వాచిపోయి లేవలేకపోతున్న ఆవిడకి చెయ్యి సాయం అందించి కుర్చీలో కూచోబెట్టింది. సమయానికి ప్రభు అమ్మానాన్నా కూడా లేరు.

మెట్ల మీంచి కిందికి చూస్తూ "రాణీ" అని పిలిచింది తన్మయి.

తన్మయి పిలుపు విని రాణి, ఆ అమ్మాయి తమ్ముడు దాసు పరుగెత్తుకొచ్చేరు "ఏటయ్యిందే అమ్మా" అంటూ.

వాళ్లను చూస్తుండమని చెప్పి బండి తీసి మెయిన్ రోడ్డు వరకూ వెళ్లి ఆటో పిలుచుకొచ్చింది తన్మయి.

అప్పటికే ఆవిడ "అమ్మా, అబ్బా" అని మూలగసాగింది.

ఇంట్లో బాబుని చూస్తుండమని రాణికి అప్పచెప్పి దాసుని, మంగని ఆటోలో ఎక్కమని తను వెనకే బండి నడుపుతూ దగ్గర్లోని స్పెషాలిటీ హాస్పిటల్ కు తీసుకు వెళ్లి కావల్సిన ఎక్స్ రేలు తీయించి రిపోర్ట్సు వచ్చే లోగా బయటికొచ్చి ప్రభు కి ఫోను చేసింది.

"అయ్యో, ఇప్పుడే వస్తున్నా" అంటూ మరో గంటలో ఆఘమేఘాలమీద వచ్చేడు ప్రభు.

కాలికి సిమ్మెంటు కట్టు వేసేక, దారిలో టాబ్లెట్లు కొని తిరిగొచ్చేరు.

అప్పటికే గాభరాగా గేటు దగ్గిర నిలబడ్డ బేబమ్మ "అమ్మో నా తల్లీ, ఏటయ్యిందే " అంటూ శోకాలు పెట్టసాగింది.

టయానికి కోడలమ్మ "ఆస్పటలకి తీసుకెళ్లబట్టి బతికేనే అమ్మా" అంటూ నిస్త్రాణగా సోఫాలో జేరబడింది మంగ.

కొన్న మందులు ఏవేవి ఏ పూట వేసుకోవాలో డాక్టరు ఇచ్చిన ప్రిస్క్రిషను చూసి చెప్పసాగింది తన్మయి.

ఇంతలో గ్లాసు నిండా టీ పట్టుకొచ్చి "ఇందమ్మా, ముందిది తాగు" అంటూ తన్మయి చేతికి టీ ఇచ్చింది బేబమ్మ ప్రశంసాపూర్వకంగా చూస్తూ.

ఆవిడ మొదటి సారి తన్మయితో మాట్లాడుతూంది. తన్మయి తడబడుతూ "ముందు వదినకి ఇవ్వండి అత్తయ్యా" అంది.

"పర్లేదమ్మా నువ్వు ముందు తాగు. పాపం కాలేజీ నుంచి వస్తానే నేను పరుగులు పెట్టించేను" అంది మంగ.

రాత్రంతా తన్మయికి ఎదురు గదిలో నుంచి మంగ మూలుగులు వినిపిస్తూ నే ఉన్నాయి. అర్థ రాత్రి ఆవిడ వేసుకోవలసిన టాబ్లెట్లు వేసుకుందో లేదో అడగడానికి వచ్చింది తన్మయి.

ప్రతిగా చెయ్యి పట్టుకుని "నా తల్లే, దేవతలా పరిగెట్టుకొచ్చి ఎంటనే కాపాడావు. అది సాలక నా కోసం నిద్రోకుండా కూసున్నావా. ఏసుకొంటాలేమ్మా. నువ్వు పడుకో. పాపం పొద్దున లెగిసింది మొదలు పరుగులెట్టాలి" అంటూ కృతజ్ఞతా పూర్వకంగా మాట్లాడ సాగింది.

ఆ మరుసటి రోజు ఉదయానే బేబమ్మ సర్ది పెట్టిన కేరేజీలు  తన్మయికి, ప్రభుకి స్వయంగా చేతికందించింది.

ఏదో అనబోతున్న ప్రభుతో "దాసుబాబు పన్లో కుదిరేదు కదా. ఆడికీ కేరేజీ ఎట్టాలి. ఎలాగూ అందరికీ వంట ఒకటే పాలి అయిపోతది. మీకూ రోజూ కేరేజీ కట్టిఇచ్చేత్తానులే" అంది.

వద్దంటే తల్లి ఏవంటుందో అని ప్రభు తన్మయి వైపు ఒప్పుకోమన్నట్టు చూసేడు. తన్మయి మారు మాట్లాడకుండా అందుకుంది. తన్మయి చేతికి కేరేజీ కింది గిన్నెలోని వేడన్నం బొక్కు చుర్రుమని అంటుకుంది.

★★★

మామూలుగా ప్రభు ఆఫీసు నుంచి వస్తూనే ఒక గంట సేపు కిందన వాళ్ల వాళ్లతో కబుర్లు చెప్పి అప్పుడు మేడ మీదికి వస్తాడు. ఆ రోజు ప్రభు ఎంతకీ రాకపోవడం చూసి పైన మధ్య హాల్లోకొచ్చి కిందికి చూసింది తన్మయి. కింద జరుగుతున్న సంభాషణలో బాబు ప్రస్తావన వినిపిస్తూండడంతో ఒక్క నిమిషం ఆగింది.

ప్రభు తండ్రి కొడుక్కి ఉద్బోధన చేస్తున్నట్లు " నువ్వెంత బాగా సూసినా ఏ గూటి సిలక ఆ గూటికే సేరతాది. నువ్వు ఎంత సాయానా అనుకుని పెంచినా ఆ పిల్లోడు రేపొద్దున్న ఆడి బాబు కాడికెల్లిపోతాడు. అంతే  గాకండా నీ ఆస్తీపాస్తీ మూటగట్టి అట్టికెల్లి పోయి ఆడి బాబుకి దొబ్బెట్టేత్తాడు, మరానక నీ ఇస్టం. నిన్ను గన్న తల్లీదండ్రీ మాటిని, ఆణ్ణి ఇప్పుడే అంపేత్తావో, నీ పెల్లాం మాటిని ఆణ్ణి నెత్తి మీద కూకుండబెట్టుకుని నీ కస్టార్జితవంతా ఆడి బాబుకే దారబోత్తావో ఆలోసించుకో" అన్నాడు.

వింటున్న తన్మయి గుండె దడదడా కొట్టుకోసాగింది. కాళ్లు వణకసాగేయి. పాదాల్లో నుంచి రక్తం చివ్వున నెత్తికి పాకి కోపం తన్నుకు వచ్చింది. ఎంత దారుణంగా ఆలోచిస్తూ నూరి పోస్తున్నారో! ఇప్పటికే బాబు పట్ల విద్వేషం పెంచుకుంటున్న ప్రభు మీద  ఇలాంటి మాటలు ఇంకాస్త తీవ్రంగా పనిచెయ్యవూ!  పసివాడు ఏం పాపం చేసేడని వీళ్లిలా కక్షగట్టి మాట్లాడుతున్నారు?

ఇంతలో ప్రభు తల్లి అందుకుంది.

"బాబూ మీ నాన్న సెప్పిన మాటిను. పోనీలే  పసోడంటే సోల్డు బియ్యమే గందా ఎగస్ట్రా అననుకుంటున్నావేమో. ఆడి సదువులు, సోకులే తిరుత్తావా, లేదా నీకు పుట్టబోయే బిడ్డల బాగోగులే సూత్తావా?" అని ముక్కు చీదసాగింది.

ప్రభు మాట మాట్లాడకుండా కూచుని ఉండడం ఇంకాస్త చికాకు పుట్టించసాగింది తన్మయికి. అసలక్కడ ఇంకొక్క క్షణం కూడా ఉండాలని అనిపించక లోపలికి ఒక్క ఉదుటున వచ్చేసింది.

నిద్రపోతున్న బాబు తల నిమురుతూ "నాన్నా! నిన్ను ఇలాంటి మనుషుల మధ్యకి తీసుకు వచ్చిన నన్ను క్షమించు. నా ప్రాణమున్నంతవరకు నిన్ను నాకు దూరం కానివ్వను" అంటూ

గట్టిగా ఊపిరి తీసుకుని వదిలింది. వాళ్ల చెడు మాటలు విని ప్రభు బాబుని తన నించి దూరం చేసే ప్రయత్నం చేస్తాడా? నిజంగా సంస్కారవంతుడయితే అసలు ఇలాంటి మాటలు స్థిమితంగా కూచుని వింటాడా?

అయినా సిద్దార్థ చెప్పినట్లు "ప్రభు చిన్న పిల్లవాడు కాదు. అతను ఏం నిర్ణయించుకున్నా తనేం చెయ్యాలో తనకి బాగా తెలుసు" దృఢంగా అనుకుంది.

ప్రభు మేడ మీదికి వస్తూనే ఏమైనా మాట్లాడుతాడేమో అని చూసింది. ముభావంగా ఉన్నాడే కానీ ఆ విషయాలేవీ కదల్చలేదు. అసలు అక్కడ ఏవీ జరగనట్టు అతి మామూలుగా ఉన్నాడు. ప్రభుతో ఇదే వచ్చిన సమస్య. తనంతట తనుగా ఏ విషయమూ మాట్లాడడు. తనలో తను ఏం ఆలోచించుకుంటాడో తెలీనివ్వడు. ఎదుటి వాళ్లు గొడవకు దిగినప్పుడు మాత్రం ఆ వేడిలో మనసులో చెలరేగుతున్నవన్నీ బయట పెట్టేస్తాడు. కాస్సేపటిలో కోపం తగ్గగానే తనని క్షమించమని నిస్సంకోచంగా అడుగుతాడు.

చాలా సేపటి తర్వాత నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "దసరా సెలవులు వస్తున్నాయి కదా నీకు మీ ఇంటికి వెళ్లాలని ఉంటే కొన్నాళ్లు వెళ్లిరా" అన్నాడు.

నిజానికి ఈ ఇంట్లో ఒక్క క్షణం కూడా తనకి మనఃశ్శాంతి లేదు. అయినా తన్మయి తల అడ్డంగా ఊపింది.

★★★

మర్నాడు భానుమూర్తికి ఒంట్లో బాలేదని, తనని చూడాలని అంటున్నాడని జ్యోతి కాలేజీకి ఫోను చేసింది. ఆ సాయంత్రమే బయలుదేరింది తన్మయి.

ప్రభు తన్మయిని, బాబుని రైలెక్కిస్తూ "త్వరగా వచ్చేయి" అన్నాడు.

కిటికీలో నుంచి బయటికి చెయ్యూపుతున్న బాబుని పట్టించుకోకుండా వెనక్కి తిరిగి వెళ్లిపోతున్న ప్రభుని చూసి మనసు చివుక్కుమంది తన్మయికి. అయినా తమాయించుకుంది. మనసులో ఒత్తిళ్లు కడుపులోని బిడ్డ మీద తీవ్ర ప్రభావాలు చూపిస్తాయని ఎక్కడో చదివింది. అయిదో నెల మరో వారంలో నిండనుంది. కొంచెం వేవిళ్లు తగ్గి కాస్త మాములు కాసాగింది ఇప్పుడిప్పుడే. నిజానికి ఈ పాప కడుపులో పడ్డ సమయంలోనే ప్రభు కుటుంబం తమ జీవితాల్లోకి ప్రవేశించడం, ఇల్లు మారాల్సి రావడం, వాళ్ల సూటిపోటి మాటలు, బాబు పట్ల ప్రభు ప్రవర్తన ఒక్కటేవిటి... అన్నీ బాధాకరాలే. అసలు ఏ రోజూ తను సంతోషంగా లేదు. మొదటిసారి బాబు కడుపులో ఉన్నపుడు ఎన్నెన్ని కబుర్లు చెప్పేది!

అలాంటిది ఇప్పుడు జీవితం మొత్తం నిస్సారమయిపోయినట్లయ్యి కడుపులోని బిడ్డ మీద కూడా శ్రద్ధ పట్టలేకపోతోంది.

పక్కనే కూచున్న బాబు అంతలోనే నిద్రకు జోగసాగేడు. తన ఒళ్లో వాడి తలని ఆన్చుకుని కాళ్లు పైకి సర్ది, చీర చెంగు తీసి వాడి మీద కప్పింది.

ఒక చెయ్యి బాబు తలమీద మరో చేతిని కడుపుమీద వేసి "పాపాయీ! ఎలా ఉన్నావమ్మా" అని మనసులోనే పిలిచింది.

భౌతిక ప్రపంచానికి వినిపించని ఆత్మీయమైన స్వరమేదో తనని తాకినట్టు ఒక్క సారి బుదుంగున కదిలింది. ఇదే మొదటిసారి కదలిక కావడంతో తన్మయి చటుక్కున కదిలిన చోటే చేత్తో రాస్తూ లాలనగా మరిన్ని కబుర్లు చెప్పసాగింది.

"ఎన్ని ప్రతికూల పరిస్థితులెదురయినా నా రెండు రెక్కల చాటునా మిమ్మల్నిద్దరినీ కాచి కాపాడుతాను. అమ్మ ఉంది మీకు ధైర్యంగా ఉండండి" అంది చీకటిని చీల్చుకెళుతున్న రైలు కిటికీ లో నుంచి దూరాన మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాల్ని చూస్తూ .

61

తన్మయికి తెలుసు. తనకి రెండే మార్గాలున్నాయి. ఒకటి ప్రభుకు నచ్చినట్లు అతని కుటుంబంతో కలిసి జీవించడం, లేదా ప్రభుతో విడిపోయి తన జీవితం తను ఎప్పటిలానే బతకడం.

ఈ విషయంలో సిద్దార్థతో సహా ఎవరినీ సలహా అడగదలుచుకోలేదు. నిజానికి అడగడానికి తనకి ఇంకెవ్వరూ లేరు కూడా.

ప్రభుని మనసారా నమ్మింది. తల్లిదండ్రులకి చెప్పాపెట్టకుండా పెళ్లి చేసుకుంది. కానీ ఎప్పుడూ ఇలా అవుతుందనుకోలేదు. బహుశాః ఇదే జీవితం. కష్టాల మీద కష్టాలు వస్తూ ఉంటే ధైర్యంగా ఎదుర్కోవలసిందే.

మొన్నెప్పుడో కాగితం మీద రెండు ఆప్షన్లూ రాసుకుని మంచి చెడ్డలు సరిచూసుకుంది. రెండిటిలోనూ లాభాలూ, నష్టాలూ సరి సమానంగా ఉన్నాయి. ప్రభు లేని ఒంటరి జీవితం తనకు ఎలాగూ అలవాటే. అందులో బదరబందీలు ఉండవు. తనకి నచ్చని వారెవరూ తన ఇంట్లో ఉండరు. తనని పల్లెత్తు మాట అనేవారు కానీ, దేని గురించీ తనని నిలదీసి అడిగే వారు కానీ ఉండరు. కానీ పండగలూ పబ్బాలూ ఏ సంతోషమైనా, దుఃఖమైనా తనకి తనుగా మిగిలిపోవలిసిందే తండ్రులు లేని పిల్లలతో అన్నిటికీ తనే జవాబుదారీగా నిలబడుతూ. ఇక సమాజంలో తన ఒంటరిపోరాటంలో ఎదురైన చేదు అనుభవాల సంగతి చెప్పనే అక్కరలేదు. అవి ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటాయి.

జీవితంలో అనుకోని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడ్డ ఒంటరి స్త్రీని సమాజం హర్షించదు సరికదా ఎప్పటికప్పుడు పీడించాలని చూస్తుంది. ప్రభుని పెళ్లి చేసుకోవడానికి ఉన్న బలమైన కారణాల్లో ఇదొకటి. కానీ ఇంట్లో తనకి పీడన మొదలయ్యిందే. ఇంటి నుంచి సమాజంలోకి పారిపోవాలా? దుష్ట సమాజాన్ని తప్పించుకోవడం కోసం ఇల్లనే ముసుగులో దాక్కోవాలా?

కడుపులోని బిడ్డ మళ్లీ కదలగానే చెయ్యి పొట్ట మీద వేసుకుని తనలో తను అంది.

"నువ్వు చెప్పు పాపాయీ!"

అన్నిటినీ పక్కపెడితే అసలు రేపో మాపో పుట్టబోతున్న ఈ పసికూనకి తండ్రిని, అతని కుటుంబాన్ని దూరం చేసే హక్కు తనకి ఉందా?

ఆలోచనలో పడింది తన్మయి.

ఇవన్నీ పట్టించుకోని రైలు చీకట్లోకి దూసుకుపోతూనే ఉంది.

తెల్లారగట్ల రైలు స్టేషనుకి చేరుకుంది. తన్మయి రైలు దిగి బాబుని ఒక చేత్తో నడిపించుకుంటూ, మరో చేత్తో బ్యాగు పుచ్చుకుని భారంగా అడుగులు వేయసాగింది.

★★★

ఇంటి దగ్గిర రిక్షా దిగుతూనే జ్యోతి ఎదురొచ్చి బాబుని ఎత్తుకుంది. వాకిట్లో ఊడుస్తున్న పనిమనిషి పరుగెత్తుకొచ్చి గబుక్కున తన్మయి చేతిలోని బ్యాగు అందుకుంది.జ్యోతి తన భుజమ్మీది టర్కీ టవలు కూతురి చుట్టూ కప్పి కడుపు పైకి కనిపించనివ్వవద్దన్నట్టు లోపలికి తీసుకెళ్లింది. అనుకోని ఈ చర్యకు ఆశ్చర్యపోయింది తన్మయి. అంటే చుట్టుపక్కల వాళ్లెవ్వరికీ తను మళ్లీ పెళ్లి చేసుకున్న విషయం ఇంకా తెలియదన్నమాట. అయినా లోకులు అంత సామాన్యమైన వాళ్లా? ఇదంతా పసిగట్టి గుసగుసలు పోరూ! తను పెళ్లి చేసుకున్నదని అందరితో చెప్తే వచ్చే నష్టం ఏవుందో అర్థం కాలేదు.

అదే అంది తల్లితో.

వరండా పక్క గదిలో భానుమూర్తి నిద్రపోతుండడంతో ఈ విషయాలు ఏవీ మాట్లాడొద్దన్నట్టు రెండు చేతులూ పైకెత్తి నమస్కరించి విసవిసా వంటింట్లోకి వెళ్లిపోయింది జ్యోతి.

బాబు వెనకే పరుగెత్తేడు.

తన్మయి నిట్టూర్చింది "పెళ్లిచేసుకున్నాక మొదటిసారి వస్తే తనకు ఎదురవుతున్న ఆహ్వానం ఇది!"

తండ్రి పడుకున్న గదిలోకి తొంగి చూసిన తన్మయికి ఎముకల గూడులా మంచానికి అంటిపెట్టుకుని పోయిన భానుమూర్తిని చూసి దుఃఖం తన్నుకు వచ్చింది.

వంటింట్లోకి వెళ్లి "అదేవిటమ్మా, నాన్నగారికి ఏవయ్యింది?" ఏడుస్తూ అంది.

"ఏవోనమ్మా, నెల రోజుల నించి బొత్తిగా తిండి పోవడం లేదు. ఆ ఏడుకొండలవాడే రక్షించాలి" అంది జ్యోతి.

అయ్యో, ఇప్పటి వరకు తండ్రి తన మీద కోపంతో తనతో మాట్లాడడం లేదని అనుకుందే కానీ, ఇలా ఒంట్లో బాలేదని అస్సలు అనుకోలేదు.

"అదేవిటమ్మా, చెప్పొద్దూ " ఇంకా ఏడుస్తూ నే అంది తల్లితో తన్మయి.

జ్యోతి మాట్లాడలేదు. మెల్లిగా తండ్రి పడుకున్న మంచం పక్కన కుర్చీ జరుపుకుని కూచుంది. ఎప్పుడూ ధీర గంభీరంగా ఉండే తండ్రి స్ఫురద్రూపం గుర్తుకు వచ్చింది. అసలు పోలికే లేని రూపంతో కొన ఊపిరితో ఉన్నట్టున్న పాలిపోయిన బక్క చిక్కిన శరీరాన్ని చూడలేక పోతూంది.

బాబు పరుగెత్తుకొచ్చి తట్టి లేపేడు భానుమూర్తిని.

కళ్లు విప్పుతూనే పక్కనే ఉన్న కూతుర్ని, మనవడిని చూసిన భానుమూర్తి  కళ్లల్లోంచి నిశ్శబ్దంగా కన్నీళ్లు కారసాగేయి.

తన్మయి కళ్లు తుడుచుకుంటూ "నేనొచ్చేసేనుగా నాన్నా, బాధపడకండి" అంది.

అలాగే అన్నట్టు నిశ్చింతగా తలూపి అంతలోనే నిస్త్రాణగా కళ్లు మూసుకున్నాడు.

తన్మయి తల్లి దగ్గిరికి వచ్చి "డాక్టరు ఏవన్నారు?" అంది.

"ఏ రోగవూ లేదంటున్నారు. అన్ని పరీక్షలూ చేసేరు. నీ గురించే ఎప్పుడూ ఈ మనిషికి బెంగ. ఆ బెంగ బెంగే ఇలా తినేసింది." అంది చికాగ్గా.

తన్మయి నిస్త్రాణగా పీట మీద జేరబడింది. బాధ మనసుని మెలిపెడుతూంది. ఒక పక్క ఆకలితో కడుపులోని బిడ్డ బుడుగు బుడుగుమని అదే పనిగా కదులుతూ ఉంది.

తన బాధ గమనించినట్టు జ్యోతి గబగబా ప్లేటులో ఇడ్లీలు పెట్టి ఇస్తూ "ముందు తినమ్మా, అసలేఒట్టి మనిషివి కాదు" అంది.

ఆదరాబాదరా తింటున్న కూతురి తల మీద చెయ్యి వేసి "ఏమ్మా, అల్లుడు మంచివాడేనా? ఎలా ఉన్నారు?" అని అడిగింది.

నిశ్శబ్దంగా తలూపి మంచి నీళ్లు ఇవ్వమన్నట్టు సైగ చేసింది తన్మయి. భానుమూర్తిని చూసి నిశ్శబ్దమైపోయిన బాబు తల్లికి జేరబడి కూచున్నాడు. జ్యోతి వాణ్ణి ఒళ్లోకి లాక్కుని తినిపించసాగింది. తినగానే ఇక మనసులోని బాధని తట్టుకోలేని తన్మయి పక్క గదిలోని మడత మంచమ్మీద నడుం వాల్చి రోదించసాగింది.  అల్లకల్లోలమైన తన జీవితం ఇప్పుడు తన తండ్రినీ పొట్టన బెట్టుకోసాగింది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇక తన జీవితంలోని కష్ట నష్టాలేవీ తల్లిదండ్రులకి తెలియనివ్వకూడదు. కష్టమో నష్టమో తనే ఓర్చుకోవాలి. దృఢంగా నిశ్చయించుకుంది.

ప్రభుకు ఫోను చేసి తన మనసులోని బాధలన్నీ చెప్పుకోవాలని అనిపించింది.

కానీ అంతలోనే ఆలోచనలో పడింది.

తనను "దసరా సెలవులు వస్తున్నాయని, ఊరు వెళ్లి రమ్మని" ఎందుకు అడిగాడు?

తనకొక్క దానికే సెలవులు ఉండి, ప్రభుకు సెలవులు లేవు కాబట్టి, తను ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లో ఉంటే గొడవలు అవుతాయనా? లేదా మరేదైనా కారణముందా?

ఇంకేదైనా కారణమున్నా తనకు తను ఇలా ప్రభుకు వ్యతిరేకంగా ఆలోచించుకోవడం మానేయాలి. అతను ఎంతో ఉదాత్తుడు. తనని మనసారా ఇష్టపడి, అతని జీవితంలోకి ఆహ్వానించిన వాడు. అతని బలహీనతల్లా అతని కుటుంబమే.ఇక బాబు విషయంలో అతని పద్ధతి బహుశా: క్రమంగా సర్దుకుంటుంది. తన జీవితంలో తనకి కొన్ని నిర్దిష్ట లక్ష్యాలున్నాయి. ఇక వాటి మీద దృష్టి పెట్టాలి.

ఆ సాయంత్రం ప్రభ ఆఫీసు నించి వచ్చే సమయానికి ఇంటికి ఫోను చేసింది.

లాండు ఫోను కావడంతో ఎప్పుడూ ముందు కిందనే ఫోను ఎత్తుతారు. ఒకవేళ ఫోను ప్రభుకి గానీ, తన్మయికి గానీ అయితే పైన ఫోను ఎత్తగానే కిందన ఫోను పెట్టేస్తారు.

యథావిధిగా ఫోను ప్రభు తండ్రి ఎత్తేడు "అలో..." అంటూ.

అతని చెడ్డ అలవాటు ఏంటంటే అవతల మాట వినిపించే లోగా "అలో, అలో" అంటూ వీధి చివరికి వినబడేటట్టు అరుస్తూనే ఉంటాడు.

తన్మయికి ఇవన్నీ అలవాటే గాబట్టి ప్రభు లైనులోకి వచ్చే వరకు ఓపిగ్గా భరించింది.

"హలో తనూ! జాగ్రత్తగా చేరేవు కదూ! ఇదిగో నేనే ఇప్పుడు చెయ్యాలనుకుంటున్నాను, ఇంతలోనే నువ్వే చేసేవు" ప్రభు ప్రేమైక స్వరం వింటూనే పులకించి పోయింది.

"ప్రభూ!.. " అంటూనే గొంతు పూడుకుపోయి ఆగిపోయింది.

అట్నించి గాభరాగా "అంతా ఓకేనా?" అన్నాడు.

"నాన్నగారికి ఒంట్లో అస్సలు బాగోలేదు" అంది కొద్దిగా గొంతు సవరించుకుని.

"నీకు నచ్చినన్నాళ్లు ఉండిరా" అన్నాడు సాలోచనగా.

"అదికాదు, నువ్వూ వస్తే బావుంటుంది" అంది.

అట్నుంచి సందేహంగా గొంతు సవరించుకుంటున్న ప్రభుతో "చూడు మరి, ఆలోచించు" అంది.

ప్రభు ఏదో అనేలోగా ఫోనులో మూడో గొంతు ఉన్నట్టు చిన్నగా దగ్గు వినబడింది. తన్మయికి చికాకు వచ్చింది. అంటే ఇంతవరకు తమ సంభాషణ కిందన కూడా వింటున్నారన్నమాట. అది సభ్యత కాదని తెలియదా? ఇలాంటి పనులు కావాలని తెలిసీ చేస్తున్నారా? అయినా ప్రభు చెప్పుకోవాలి వాళ్లకి.

"సరేమరి, తర్వాత ఫోను చేస్తాను" ఫోను వెంటనే పెట్టేసి కుర్చీలో జేరబడింది.

తామిద్దరికీ అడుగడుగునా అడ్డుగోడలు. అతనితో తను ఇలాంటి భవిష్యత్తుని ఎన్నడూ ఊహించుకోను కూడా లేదు. ఇంతవరకు ప్రభు తన తలిదండ్రుల్ని కలవలేదు. కనీసం ఇలా అయినా ఇక్కడికి వస్తే బావుణ్ణని ఆశపడింది. కానీ ఇక ఆ ఆశ అడియాస అయినట్టే. కిందన ఇప్పటికే ఒక పంచాయితీ ప్రారంభమయ్యి ఉంటుంది. వాళ్ల కొడుకు ఎప్పుడు ఎక్కడికి వెళ్లాలో, వెళ్లకూడదో కూడా నిర్ణయించేది వాళ్లే కదా!

మనసంతా గందరగోళంగా తయారయ్యింది.

నిశ్శబ్దంగా కళ్లు ఒత్తుకుంటున్న తన్మయి దగ్గిరికి వచ్చి "ఇదేంటమ్మా, కడుపుతో ఉన్నపుడు అస్తమాటూ ఇలా ఏడవొచ్చా?" కసిరినట్టు అంది జ్యోతి.

తల్లి కాస్త తల నిమిరి "ఏడవకమ్మా" అని ఉంటే బావుణ్ణని అనిపించింది తన్మయికి.

పక్క గదిలో నుంచి తండ్రి మూలుగు, ఒక పక్క మనసులో ప్రభు గురించి చెలరేగుతున్న బాధ, కళ్లెదురుగా బాబు, కడుపులో సుళ్లు తిరుగుతున్న బిడ్డ.... అంతా, అన్నీ సమస్యల మయమే. ఇక తల్లి దగ్గిర ఒక్క ఓదార్పు మాట లేదు.

లేచి కాస్సేపు డాబా మీదికి వెళ్లడానికి ఉద్యుక్తురాలయింది.

మొదటి మెట్టు ఎక్కకముందే తల్లి వెనకే వచ్చి "ఎందుకు? చుట్టూ అందరూ చూసి తలో మాటా అనుకోవడానికా?" విసురుగా అంది.

తల్లికి సమాధానం చెప్పే ఓపిక లేదు. అయినా ఎదురు చెప్తే జరిగే పరిణామం తనకు కొత్తేమీ కాదు.

ఏడుస్తూ పడుకుని, తనతో రోజంతా మాట్లాడ్డం మానేస్తుంది.

అయినా స్థిరంగా ఓపిక తెచ్చుకుని "అమ్మా! నాకు ఒంట్లో ఏవీ బాగాలేదు. కాస్త అలా గాలి పీల్చుకుని వస్తాను" అని మెట్లు ఎక్కసాగింది.

తనకెంతో ఇష్టమైన సాయం సంధ్య వేళ డాబా మీదికి వెళ్లగానే జీవితంలోని కష్టాలన్నీ తీరిపోయిన సాంత్వన కలిగింది తన్మయికి.

"మిత్రమా! నా భవిష్యత్తు ఇలా అంధకారబంధురం కావాల్సిందేనా?"

సమాధానంగా "కాదన్నట్టు" వెనకే బాబు పరుగెత్తుకు వచ్చేడు.

తల్లి పొట్టని ఆప్యాయంగా నిమిరేడు. తన్మయి అంతా అర్థమయినట్టు తల పంకించింది. తన పిల్లలే తన భవిష్యత్తు. తన చుట్టూ ఎన్ని ప్రతికూల పరిస్థితులున్నా గెలవాలి. పట్టుదలగా తను గెలుస్తూ, ఈ పిల్లల్ని గెలిపించాలి.

"చెల్లి" అని అంది బాబుకి పొట్ట మీద చూపిస్తూ.

వాడు సంతోషంగా గెంతులు వెయ్యసాగేడు.

తన్మయి ముఖమ్మీద చిర్నవ్వు వెలిసింది. తనకి ఇంతకంటే ఏం కావాలి?

కిందికి వస్తూనే "అమ్మా! నాన్నగారిని హైదరాబాదు తీసుకు వెళ్లి వైద్యం చేయిద్దాం" అంది తల్లితో.

ఏ కళనుందో మారుమాట్లాడకుండా ఒప్పుకుంది తల్లి.

"అలాగేనమ్మా! మన ఊళ్లో డాక్టరు వారానికోసారి చూడ్డానికి వస్తున్నారు. రేపు ఆయన రాగానే ఒక మాట ఆయనకి చెప్పి.." అంది.

ప్రభుకి ఫోను చేసింది.

కిందన వింటున్నారని తెలిసి మరీ దృఢంగా చెప్పింది "నేను మా వాళ్లని తీసుకుని వస్తున్నాను"

ప్రభు నించి వెంటనే "అలాగే" అన్న సమాధానం విని తన్మయి మనసు ఆనందంతో పొంగిపోయింది.

ప్రభు మంచి మనసు తనకు తెలుసు.

★★★

మర్నాడు ఉదయం లేవగానే తండ్రి పిలుస్తున్నట్లు వినబడి దగ్గిరికి వెళ్ళింది తన్మయి. ఆశీర్వదిస్తున్నట్లు తల మీద చెయ్యి పెట్టి ఏదో గొణిగాడు. ఆయన గొంతు తడారిపోయినట్లు నాలుక లోపలకి తోడుకుపోయి ఉంది. తన్మయి మంచినీళ్ల కోసం పరుగెత్తింది.

పెరట్లో ఉన్న జ్యోతిని గట్టిగా పిలుస్తూ తన్మయి తిరిగి వచ్చేసరికి బాబు చేతిని పట్టుకుని ఉన్న భానుమూర్తి ప్రాణాలు అప్పటికే గాల్లో కలిసిపోయేయి.

తన్మయి పెద్దపెట్టున ఏడుస్తూ కూలబడింది.

జ్యోతి "అయ్యో!" అని గట్టిగా అరుస్తూ వీధిలోకి పరుగెత్తింది.

బాబు బెంబేలుగా గుక్కపెట్టి ఏడవసాగేడు. వీధిలో చుట్టుపక్కల అందరూ గబగబా చేరేరు. ఊర్లోని బంధువులు పరుగున వచ్చేరు.

తల్లిని ఇద్దరు ఆడవాళ్లు అక్కున చేర్చుకుని చెరో పక్కా పట్టుకున్నారు. హఠాత్తుగా తన్మయికి కళ్ల ముందు చీకటిమయంగా అనిపించింది.

కళ్లు తెరిచేసరికి వనజ ఎప్పుడు వచ్చిందో తెలీదు. తన చెయ్యి పట్టుకుని ఉంది.

భోరుమని వనజని కౌగిలించుకుంది తన్మయి.

"ఏడవకు తనూ! జరగాల్సిన కార్యక్రమాలు అమ్మ ఒక్కత్తి చేసుకోలేదు. నువ్వే గుండె రాయి చేసుకుని ధైర్యం చేసుకోవాలి" అంది.

అప్పటికే వాకిట్లో పడుకోబెట్టిన భానుమూర్తి పార్థివ దేహం దగ్గిర నూనె దీపం వెలుగుతూ ఉంది.

ముఖం కళ్లు మూసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నట్టున్నా, బిగుసుకుపోయిన శరీరం, పాలిపోయి అస్థిపంజరానికి వేళ్లాడుతున్నట్టు పుల్లల్లాంటి చేతులు.

తన్మయి దగ్గిరికెళ్లి చేతుల్ని తడిమింది. నుదుటి మీద జుట్టుని సరిచేసింది. ఒత్తయిన తండ్రి జుట్టుని పట్టుకుని ఎన్నోసార్లు ఆడుకునేది చిన్నతనంలో. ఆ వీపు మీద ఉప్పుమూట ఎక్కించుకుని తిప్పిన రోజులు, ఒంట్లో బాలేనప్పుడు ఎత్తుకుని డాక్టరు దగ్గిరికి పరుగెత్తిన భుజాలు స్పృశించింది. తాడుతో కట్టిన బొటన వేళ్ల పాదాలకి నమస్కరించింది.

అమ్మమ్మ చనిపోయినప్పుడు తను మొదటిసారి మృత కళేబరాన్ని చూసింది. అప్పుడెందుకో చల్లని ఒంటిని ముట్టుకోవడానికే భయం వేసింది.

కానీ ఇప్పుడు తండ్రి మృతదేహం దగ్గిర భయం లేదు. ఇక ఎప్పటికీ చూడలేనన్న వాస్తవం కలిగిస్తున్న బాధ తప్ప. ఒక పక్క కన్నీరుమున్నీరుగా రోదిస్తూనే తండ్రిని కళ్లారా చూడసాగింది. జ్యోతి మాత్రం ఇక తన బాధ్యత అయిపోయిందన్నట్టు ఒక పక్కగా గోడకి జేరబడి కిందికి చూసుకుంటూ కూచుంది. తల్లి కళ్లల్లో నుంచి ఒక్క నీటి చుక్క కూడా రాకపోవడం విచిత్రంగా అనిపించింది తన్మయికి. అది దుఃఖం రాని స్థితో, దుఃఖం అయిపోయిన స్థితో అనిపించడం లేదు.  బహుశా: సహజీవనం ఒక్కటీ మనుషులని దగ్గిరచెయ్యదేమో! మనస్సులో ఏ మూలనో  కాస్త ప్రేమ కూడా ఉండాలి.

సహజంగా తల్లి బేల మనస్కురాలు కాదు. అయినా ఇదీ ఒకందుకు మంచిదే. తండ్రికి ఒంట్లో బాలేనప్పుడల్లా తల్లి ఒంటరిగా ఎలా ఉంటుందో అన్న బాధ తనని చుట్టుముట్టేది. ఇప్పుడా బెంగ అవసరం లేదనిపించింది తన్మయికి. దుఃఖపడాల్సిన అవసరం లేకపోయినా, ఏదో చుట్టుపక్కల వాళ్ల కోసం మధ్య మధ్య ముక్కు చీదుతూ కూచుని ఉన్న జ్యోతి తన్మయి తన వైపు చూడడం గమనించి దగ్గిరికి పిలిచింది.

"వీళ్లంతా సంప్రదాయాల పేరుతో బొట్టు, గాజులు తీసే తతంగాలు అవీ నాకు ఇష్టం లేదు. నువ్వే చెప్పు కాస్త" చెవిలో మెల్లిగా అంది.

తన్మయి దుఃఖ పడుతూనే తలూపింది.

అంతిమ యాత్ర లో స్త్రీలు వాకిటి వరకే వెళ్లగలిగిన సంప్రదాయాల్ని కాదనలేకపోయినా, తన్మయి తల్లి వైపు నిలబడి తల్లికి చెయ్యబోయిన తతంగాలన్నీ ఆపించింది. భానుమూర్తి తరఫు బంధువులు వెనక వెనకే గుసగుసలు పోయినా తర్వాత సర్దుకున్నారు. బాబుతో తండ్రికి తల కొరివి పెట్టించేరు. సాయంత్రానికి ప్రభు వచ్చేడు. తన్మయి దుఃఖం కట్టలు తెంచుకుంది.

"హమ్మయ్య, వచ్చావా నేస్తం! నా దుఃఖపూరిత హృదయాన్ని ఓదార్చడానికి కాసింత సమయం చేసుకుని......" తన్మయికి లోపల్లోపల ప్రభు రాక సాంత్వన కలగజేయసాగింది.

ప్రభు వచ్చిన దగ్గరనించి అన్నీ తనే అయ్యి నిలబడి చెయ్యసాగేడు.

బంధువులందరికీ అప్పుడే పరిచయమయినా ఎన్నాళ్లుగానో అందరికీ తెలిసినట్లు మసలుతూన్న ప్రభు వైపు ప్రశంసాపూర్వకంగా చూసింది తన్మయి.

అంత వరకూ తనని అనుమానస్పదంగా చూస్తున్న బంధువులందరికీ ఒక సమాధానం దొరికినట్టు చిన్నత్తయ్య దగ్గిరికి వచ్చి "ఎన్నో నెల?" అంది.

ప్రభు పనుల్లో  కల్పించుకోవడం జ్యోతికి  ఒక పక్క అప్రసన్నంగా ఉన్నా, మరోదారి లేకపోవడంతో నిశ్శబ్దంగా ఉండిపోయింది.

పెద్ద పిన్ని తన్మయి దగ్గిరికి వచ్చి బుగ్గలు పుణికి "మంచి పని చేశావమ్మా. అబ్బాయి ఎంతో మంచివాడు. మీ అమ్మకు ఇక దిగుల్లేదు"  అంది.

ప్రభు మూడో రోజు చిన్న దినం అయ్యేవరకు ఉండి, పదకొండో రోజు పెద్దదినానికి మళ్లీ వస్తానని వెళ్లేడు.  తన్మయికి ఏ రోజూ దుఃఖం కట్టడి కావడం లేదు. అయినా లేచి పనులు చక్కబెట్టక తప్పడం లేదు. జ్యోతిని పలకరించడానికి రోజూ ఊళ్లో ఎవరో ఒకరు వస్తుండడంతో మిగతా అన్ని పనులు తన్మయి చక్కబెట్టసాగింది. వచ్చిన వాళ్లు తెస్తున్న స్వీట్ల పేకట్లతో వంటింటి అలమారా నిండిపోసాగింది. ఒక పక్క మనసులో బాధ సుళ్ళుతిరుగుతూ ఉంటే

ఇదేమి ఆచారమో అనిపించసాగింది తన్మయికి. బయటి వరండాలో పెట్టిన భానుమూర్తి పటం దగ్గిర అగరొత్తులు, దీపం ఆరకుండా వెలిగించసాగింది తన్మయి.

నాలుగో రోజు వరండాకొచ్చిన జ్యోతి "అదెందుకలాగ అన్నీ తగలేస్తున్నావు?" అని తన్మయి మీద గయ్యిమనబోయి అంతలోనే ఎవరో బంధువులు గేటు తీసుకుని వస్తుండడంతో లోపలికి వెళ్ళిపోయింది.

తల్లి ప్రవర్తన చిన్నతనం నించీ అలవాటయిన తన్మయి దేనికీ ఎదురు చెప్పకుండా ఉండిపోసాగింది. ఇప్పుడు ఇట్టే వెలిగి ఆరిపోయే అగరొత్తులు, ఆవిరయ్యే దీపంలోని నూనె ముఖ్యం కాదు. అసలు ఐహిక ప్రపంచంలో ఏదీ ముఖ్యం కాదు. జీవన గమనంలో పైకి కనబడే ఆర్భాటాలన్నీ జీవించి ఉన్నంతవరకే. అగరుపొగై అంతర్థానమయిపోయిన శరీరం తర్వాత మిగిలేవి జ్ఞాపకాలు మాత్రమే. చిన్నతనం నించి తండ్రితో ఉన్న అనుబంధం ఒక వైపు, ఆయన బతికి ఉన్న కాలంలో ఆయనకి సంతోషం కలిగించేవేన్నో చెయ్యలేకపోయిన బాధ మరోవైపు చుట్టుముట్టసాగేయి. అన్నిటికన్నా ఎక్కువగా తన వల్లే మొదట్నించీ తండ్రి అనారోగ్యం పాలయ్యాడన్న బాధ మెలిపెట్టసాగింది.

తండ్రి మరణం మొదటిరోజు కంటే ఎక్కువగా తన్మయిని కృంగదీయసాగింది.

## 62

భానుమూర్తి మరణించిన పదకొండో రోజు పెద్ద దినానికి బంధువులందరూ వచ్చేరు.

ప్రభుకి చివరి నిమిషంలో ఆఫీసు పని పడడంతో రాలేకపోతున్నానని ఫోను చేసేడు.

"వాళ్ల వాళ్లెవ్వరూ ఎలాగూ రారు, ప్రభు వస్తే నైనా బావుణ్ణు" నిట్టూర్చింది తన్మయి.

బాబాయిలూ, మావయ్యలూ దగ్గరుండి అన్నీ చూసుకుంటూ ఉన్నా ప్రభు లేని లోటు స్పష్టంగా కనిపించసాగింది.

ముఖ్యంగా కడుపులో బిడ్డతో తను అవస్త పడకూడదని ఏ మూలనున్నా తనని ఓ కంట కనిపెట్టి గబుక్కున ఏ అవసరమైనా పరుగెత్తుకొచ్చే ప్రభు దగ్గిర లేకపోవడం బాధేగా మరి!

బంధువులు ఒకరూ ఒకరూ రాసాగేరు. పదకొండు గంటల వేళ దేవి వచ్చింది.

వస్తూనే జ్యోతితో "ఏవీ అనుకోకు వదినా, చిన్నదినానికి రాలేకపోయేను, వియ్యంకుడు కాబట్టి మీ అన్నయ్యగారు ఎలాగూ రాకూడదు" అని పక్కనే ఉన్న తన్మయి వైపు, పొట్ట వైపు ఎగా దిగా చూస్తూ గద్దించినట్టు "మళ్లీ పెళ్లి చేసుకున్నావని తెల్సింది. మన కులవేనా?" అంది.

తన్మయి ఏదో అనేలోగా జ్యోతి కల్పించుకుని "అవన్నీ ఇప్పుడెందుకులేమ్మా" అని తన్మయి వైపు చూసింది అక్కడి నుంచి లోపలికి వెళ్లమన్నట్టు.

“తల్లి ఎందుకు ధైర్యంగా తన పెళ్లి గురించి చెప్పదు?తనేం తప్పు చేసింది? తనకు నచ్చిన వాణ్ణి పెళ్లి చేసుకుంది.”

దేవి ప్రశ్న గుర్తుకు వచ్చింది.

"అయినా అతను ఏ కులమైతే వీళ్లందరికీ ఏంటట? తండ్రి పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తనని అడగాల్సిన ప్రశ్నలేనా ఇవి?"

అటూ ఇటూ పరుగెడుతున్న బాబుని దేవి దగ్గరికి పిలిచినా వాడు వెళ్లకపోవడాన్ని గమనించింది తన్మయి.

దేవి మూతి మూడు వంకర్లు తిప్పి తన్మయి వైపు చురచురా చూసి "ఏ గూటి సిలక ఆ గూటి పలుకే పలుకుతాదట, ఏం జేత్తాం మా కర్మ" అని గొణిగింది.

తన్మయి చూసీ చూడనట్టు అక్కణ్నించి లోపలికి వెళ్లిపోయింది.

"ఇప్పుడు తనివన్నీ మనసుకి పట్టించుకోకూడదు.సమయానికి వనజ ఊర్లో ఉంది కాబట్టి సరిపోయింది. లేకపోతే ఒకదాని మీద ఒకటి వచ్చి పడ్తున్న సమస్యల్తో తల పగిలిపోతూంది తనకి.”

తన్మయికి అమ్మమ్మ చనిపోయినప్పుడు జరిగిన ఆస్థి పంపకాల యుద్ధం గుర్తుకు వచ్చింది. తన తల్లిదండ్రులకి తనొక్కతే సంతానం కాబట్టి సరిపోయింది. లేకపోతే అది కూడా తోడయ్యేది.

శ్రాద్ధ కర్మలు, భోజనాలు, హడావిడి అయ్యి బంధువులు మెల్లగా వెళ్లసాగేరు. ఇలా చావు ఇంటి నుంచి వెళ్లేటపుడు ఇంటి వాళ్లకి చెప్పి వెళ్లకూడదనేది ఆచారం కాబట్టి ఎవరు ఎప్పుడు వెళ్లేరన్నది తెలియదు. దేవి ఎప్పుడు వెళ్లిందో కూడా తెలియదు.

"మహాతల్లి, మొత్తానికి వదిలిందమ్మా. అన్నీ ఆరాలే మనిషికి. ఆవిడ కొడుకు పెళ్ళాం ఉండగానే దేన్నో తగులుకుని ఊరేగొచ్చు. విడాకులయిపోయినా ఇక్కడ మాత్రం ఎవరూ పెళ్లిళ్ళు చేసుకోకూడదు." పిన్ని విసుక్కోసాగింది.

పొద్దుట్నించీ అటూ ఇటూ తిరుగుతూ దాదాపు నిలబడే ఉన్న తన్మయికి సాయంత్రం వేళకి బాగా నిస్సత్తువ వచ్చినట్లయింది. భౌతికంగా కడుపులోని బరువుకి తోడు మానసికమైన దిగులు కూడా తోడయ్యి మరింత భారం అనిపించసాగింది. కడుపులో ఒక రకమైన సన్నని నొప్పిగా అనిపించసాగింది. ముందు బాబు పుట్టినప్పటిలా.

తన్మయి లెక్క బెట్టుకుంది. మర్నాటికి ఏడు నెలలు నిండుతాయి. లోపలి గదిలోకి వెళ్లి నెమ్మదిగా మేను వాల్చింది. ఏ పక్క ఒత్తిగిలినా అలాగే నొప్పి రాసాగింది.

తన అవస్త గమనించినట్లు పిన్ని లోపలికి వస్తూనే "ఏమ్మా! ఏవైనా తిన్నావా లేదా?" అంటూ నుదుటి మీద చెయ్యి వేసి చూసింది.

తన్మయి కడుపు మీద ఒక చెయ్యి పట్టుకుని మరో చేత్తో పిన్ని చేతిని గట్టిగా పట్టుకుంది.

పిన్ని అర్థమయినట్టు గబుక్కున వరండా లోకి పరుగెత్తి "అక్కా! పిల్లకి నెప్పులొస్తున్నట్టున్నాయి, ఇదిగో ఏవండీ రిక్షా పిలిపించండి" అని అరిచింది.

జ్యోతి గబుక్కున వచ్చి కడుపు మీద చెయ్యి వేసి గాభరాగా "ఏమ్మా, ప్రసవం నెప్పిలా అనిపిస్తందా?" అంది.

తన్మయి తలూపగానే "బాబాయ్, ఊర్లో కొత్త డాక్టరు గారు ప్రసూతి ఆస్పత్రి పెట్టేరు కదా" అక్కడికని చెప్పండి రిక్షాకి అనరిచింది.

గుమ్మం దగ్గిర నించి గాభరాగా తల్లినే చూస్తున్న బాబుని దగ్గిరికి పిలిచింది.

గాభరా పడకు నాన్నా "చెల్లి బయటికి రావడానికి ఇంకా రెణ్ణెల్లు టైం ఉంది. ఇప్పుడేదో కొంచెం నెప్పిగా ఉందంతే. వెళ్లి తొందరగా వచ్చేస్తాను." అంది నెమ్మదిగా పంటి బిగువున బాధని ఆపుకుంటూ తన్మయి.

డాక్టరు పరీక్ష చేస్తూనే " నొప్పి కంట్రోల్ అవ్వడానికి ఇప్పటికి మందు ఇస్తాను. కానీ ఆపరేషను చేసి బిడ్డను బయటికి తియ్యాల్సి రావొచ్చు" అన్నారు.

తన్మయికి తల తిరిగింది.

"అదేవిటీ డాక్టర్, ఇంకా ఏడో నెల ఇప్పుడే పూర్తయ్యింది కదా" అంది.

"తప్పదమ్మా కొన్ని సార్లు ఇలా ప్రీ టర్మ్ డెలివరీ చెయ్యాల్సి ఉంటుంది. ఇప్పుడు వెంటనే అడ్మిట్ కండి. ఉదయానే లేడీ డాక్టరుని పిలిపిస్తాను. ఆవిడ స్కానింగ్, మిగతా పరీక్షలు చేసి సరేనంటే డెలివరీ చేసేద్దాం. కానీ బేబీ ఇంకా పూర్తిగా ఎదగదు కాబట్టి ఇంక్యుబేటర్ లో ఒక నెల వరకూ నయినా ఉంచాల్సి ఉంటుంది. మీరేం గాభరా పడకండి. ఇక్కడే ఆ సదుపాయం కూడా ఉంది." అన్నాడు.

జ్యోతి కాళ్లలో ఓపిక లేనట్టు కూలబడింది "ఒక దాని మీదొకటి ఈ బాధలేంటి భగవంతుడా" అంటూ.

తన్మయి స్థిమితపడుతూ "అమ్మా! టెన్షను పడకు. నాకు సన్నగా నొప్పిగా ఉంది అంతే. అయినా డాక్టరు చెప్పినట్లు అడ్మిట్ అవ్వడమే మంచిదని అనిపిస్తూంది. రేపు లేడీ డాక్టరు చూసి చెప్తారని చెప్పేరుగా. పిన్నిని ఇక్కడ నా దగ్గిర ఉంచి, నువ్వు ఇంటికి వెళ్లి అర్జంటుగా రమ్మని ప్రభుకి ఫోను చెయ్యి" అంది.

జ్యోతి ఇంకా భగవంతుడికి నమస్కరిస్తున్నట్టు గాల్లో చేతులు చూపిస్తూ "ఏమో తల్లీ! నీకున్న ధైర్యం నాకు లేదు. నాకు కాళ్లూ చేతులూ ఆడడం లేదు. పైగా ఇప్పటికిపుడు ఆపరేషనంటే చేతిలో అంత డబ్బూ లేదు." అంది.

తన్మయి తల్లి చేతుల మీద చెయ్యి వేసి "అమ్మా! ఆ విషయాలన్నీ ప్రభు చూసుకుంటాడు. నువ్వు దిగులు పడకు. నా దగ్గిర ప్రస్తుతం ఉన్నవి నేను కడతాను." అంది అనునయంగా.

"మీ నాన్నగారే ఉంటే నాకీ బాధే లేకపోను" అని కళ్లొత్తుకోసాగింది జ్యోతి.

"అదేటక్కా ఓ పక్క పిల్లకి బాలేకపోతే నువ్వూ ఇలాగేడుస్తా కూచుంటే ఎలాగ సెప్పు. మీ మర్దిగారు, నేను ఇయ్యన్నీ సర్దుకునీ వొరకూ మీకు సాయంగా ఉంటాంలే. పాప సెప్పినట్టు నువ్వు ఇంటికెల్లి అల్లుడు గారికి పోను చెయ్యి" అంది పిన్ని.

తన్మయి కృతజ్ఞతా పూర్వకంగా చూసింది. పైకి ధైర్యంగా మాటలు చెప్తూందే కానీ లోపల్లోపల భయంగా అనిపించసాగింది తన్మయికి.

కళ్లు మూసుకుని "మిత్రమా! ఎన్నో కష్టాల నుంచి గట్టెక్కించావు. నన్నీ కష్టం నించి కూడా గట్టెక్కించు, నాకు ధైర్యాన్ని ప్రసాదించు" అని వేడుకుంది.

కడుపు మీద చెయ్యి పెట్టి "పాపాయీ! నువ్వస్సలు భయపడొద్దు. ఈ అమ్మ బతికుండగా నీకేం కాదు. ధైర్యంగా ఉండు" అని చెప్పింది.

గంటలో వనజ పరుగున వచ్చింది.

వస్తూనే తన్మయి బెడ్ దగ్గిరికి వచ్చి చెయ్యి పట్టుకుని "ఏం గాభరా పడకు. మేమందరం ఉన్నాంగా" అంది.

"ఏటోనమ్మా ఈ కస్టాలు, మా రోజుల్లో కనీవినీ ఎరగం" అంది పిన్ని నిట్టూరుస్తూ.

వనజని చూడగానే బోల్డు ధైర్యం వచ్చినట్లయ్యింది తన్మయికి.

"ఒకప్పుడు మనిద్దరం ఎన్ని సాయంత్రాలు కలిసి కబుర్లు చెప్పుకునే వాళ్ళం! ఆ రోజుల్లో కష్టమంటే ఏవిటో అసలు తెలుసా మనకి?" మెల్లిగా అంది.

వనజ చెయ్యి నిమురుతూ "కష్టాల్లోకి ఎదగడమే జీవితం అనుకుంటా తనూ! అయినా ఏం భయపడకు. డాక్టరు రేపు ఇంటికి పంపేస్తారులే" అంది.

అలాగే అన్నట్టు తలుపుతూ "ఊరికి ఎప్పుడెళ్తున్నావు?" అంది తన్మయి.

"లేదు తనూ! అమ్మా వాళ్ల ఇంట్లోనే ఉంటున్నాం. సుధాకర్ ఉద్యోగం మానేసి బిజినెస్ ప్రారంభించేరు రెండేళ్ల కిందట. కానీ సరిగా కలిసి రాలేదు. మొన్నీమధ్యే నాన్నగారు ఈయనకి షుగర్ ఫాక్టరీలో ఉద్యోగం వేయించేరు. ఇంకా మా భవిష్యత్తు ఏవీ కుదుటపడలేదు. ఒక పక్క ఒకరికి ఇద్దరు పిల్లలయ్యేరు" అంది నిట్టూరుస్తూ వనజ.

అంతా బావుందనుకున్న వనజ సంసారంలో ఆర్థిక ఇబ్బందులన్న మాట.

ఏవిటో ఒక్కొక్కరి జీవితం!

వనజ చేతినలాగే పట్టుకుని "నాకు ఎప్పుడూ నువ్వే ధైర్యం. అలాంటి నువ్వు ఎప్పుడూ ధైర్యం కోల్పోకూడదు వనా! ఏం భయపడకు అంతా సర్దుకుంటుంది" అంది తన్మయి.

★★★

తెల్లారగట్ల మొదటి బస్సుకి ప్రభు వచ్చేడు. రాత్రంతా కలత నిద్ర పట్టి అప్పుడప్పుడే నిద్రలోకి జారుకుంటున్న తన్మయి నుదుటి మీద ప్రభు చేతి స్పర్శకి ఆనందంగా కళ్లు తెరిచింది.

"ఎలా ఉందిరా?" ఆదుర్దాగా అడిగేడు ప్రభు.

అతని హృదయంలోని ప్రేమంతా కళ్లలో ప్రతిఫలిస్తూ కంటి మీద నీటి పొర కప్పింది. తన్మయి నిశ్చింతగా తలూపింది. ప్రభుని చూడగానే కొండంత బలం వచ్చింది. తనని వదిలి వెళ్ల వద్దన్నట్టు అతని చేతిని గట్టిగా పట్టుకుంది.

పిన్ని లేచి "ఎప్పుడొచ్చేవు బాబూ?" అని "హమ్మయ్య, మా అల్లుడుగారు వొచ్చేసేరు. మా అమ్ములుకి ఇంక బాధే లేదు" అంది నవ్వుతూ.

మరో గంటలో జ్యోతి బాబుని తీసుకుని వచ్చింది.

తొమ్మిది గంటలకి లేడీ డాక్టరు వస్తూనే పరీక్షలు చేసి "డెలివరీ చేసెయ్యడమే మంచిది" అంది.

అప్పటివరకూ ఇంటికి వెళ్లి పొమ్మంటారని ఆశిస్తూ  ఉన్నారు అంతా. ఇప్పుడా ఆశ కాస్తా అడియాస అయ్యింది.

ప్రభు గాభరాగా వెనకే వెళ్లి విషయాలన్నీ అడిగి వచ్చేడు.

వెనక్కి వస్తూనే తన్మయి దగ్గిరికి వచ్చి చేతిని గట్టిగా పట్టుకుని "ఏం భయపడక్కరలేదని చెప్తున్నారు డాక్టరు.

స్కానింగులో పాపాయి బానే ఎదిగినట్లు ఉంది కాబట్టి  ఇంక్యుబేటరులో ఎక్కువ రోజులు పెట్టాల్సిన పని ఉండక పోవచ్చు  అంటున్నారు. ఇక సిజేరియను ఈ రోజుల్లో చాలా కామన్ అయిపోయింది కాబట్టి వర్రీ అవ్వొద్దని అన్నారు. నువ్వు ధైర్యంగా ఉండు" అన్నాడు.

"కాలేజీకి ఫోను చేసి సెలవు చెప్పాలి. సిద్దార్థకి కూడా ఫోను చెయ్యి అంది" తన్మయి.

"సిద్దార్థ గారికి రాత్రే ఫోను చేసేను. అన్నీ ఆయన చూసుకుంటామన్నారు. సంతకాలు ఏవైనా అవసరమైతే పోస్టులో కాగితాలు పంపుతామన్నారు. నువ్వు నిశ్చింతగా ఉండు" అన్నాడు.

"ప్రభు అంత జాగ్రత్తగా ఈ ప్రపంచంలో తనని ఎవరూ చూడలేరేమో!"

ఆపరేషను థియేటర్ లోకి వెళ్లే  వరకూ ప్రభు చేతిని వదలకుండా పట్టుకునే ఉంది తన్మయి.

"ఆ స్పర్శ లోనే గొప్ప నిశ్చింత ఉంది!"

మత్తులోకి జారుకుంటూ ఉన్నపుడు "మిత్రమా! నేను మరలా కళ్లు తెరిచినా, తెరవకపోయినా నా బిడ్డని బ్రతికించు. నా బాబుని కాపాడు. నా ప్రభుని ధైర్యంగా ముందుకు నడిపించు." అని వేడుకుంది.

నిజానికి పూర్తిగా మత్తులోకి జారుకోకుండానే ఆపరేషను పూర్తయ్యి పోయింది కూడా. సిజేరియన్ ఆపరేషను ఇంత సులభమని తెలియదు తన్మయికి. మొదటిసారి తను అనవసరంగా మాములు డెలివరీ పేరుతో నరకం అనుభవించింది.

పాపని బయటికి తీస్తూనే కళ్ల ముందు "ఆడపిల్ల" అని ఒక్క క్షణం చూపించి వెంటనే ఇంక్యుబేటర్ రూం కి పంపేరు.

"ఆడపిల్ల" అన్న మాటే అమృత తుల్యంగా అనిపించింది తన్మయికి. తనకి పాపే కావాలని ఎప్పుడూ కోరుకుంది. అందుకే బాబుతో అస్తమాటూ "చెల్లి" అని చెప్పేది.

బయట ఉన్న ప్రభుకి పాపని ఒక్క సారి చూపించమని  మత్తులోనే  గొణగ సాగింది తన్మయి.

"మీరేం టెన్సను పడకండి పాపని ఆరి నాన్నగారే సాయంగా దగ్గరుండి ఇంక్యుబేటర్ రూముకి తీసుకెళ్లేరు" అంది ఆయమ్మ నవ్వుతూ.

మరో అరగంటలో కుట్లు వెయ్యంగానే రూముకి మార్చేరు తన్మయిని.

"పాప బలహీనంగా ఉన్నా అన్ని అవయవాలూ పూర్తిగా ఎదగడం వల్ల ప్రమాదమేమీ లేదు" అంది డాక్టరు రూముకి షిఫ్ట్ చేసే ముందు.

తన్మయికి పాపని ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఉంది. తన్మయిని చూసేక గానీ స్థిమితం లేనట్లు బయటే అటూ ఇటూ తచ్చాడుతున్న  ప్రభు చప్పున లోపలికి వచ్చేడు. చెమట్లు పట్టి ఉన్న ప్రభుని చూస్తూనే నీరసంగా నవ్వింది తన్మయి. కానీ అంతలోనే మత్తు ఆవహించడంతో మళ్లీ కళ్లు మూసుకుంది. కాస్సేపట్లో మెలకువ వచ్చేసరికి జ్యోతి తల నిమిరుతూ ఉంది.

గొంతు తడారిపోతున్నట్లున్నా మాటల్ని కూడదీసుకుంటూ "పాప ఎలా ఉందమ్మా?" అంది.

జ్యోతి దుఃఖం నిండిన గొంతుతో "బానే ఉందంటున్నారమ్మా. కానీ అలా పిల్లని పెట్టెలో కట్టిపడేసినట్టు చూసేసరికి నా కడుపు నీరయిపోతూంది" అంది.

తన్మయికి దుఃఖం తన్నుకొచ్చింది.

ప్రభు వెంటనే కల్పించుకుని దగ్గిరికి వచ్చి " తనూ! ఈ పరిస్థితుల్లో నువ్వసలు ఏడవకూడదు. మన పాపకి ఏవీ కాలేదు. అంతా బానే ఉంది. మనకే ఇవన్నీ చూడడం కొత్త కదా. అందుకే అలా అనిపిస్తుంది. డాక్టర్లు ఏం చేసినా పాప మంచి కోసమే కదా! ఇంకా రెణ్ణెళ్లు కడుపులో ఎదగాల్సిన పాప ఇప్పుడే బయటి ప్రపచంలోకి త్వరపడి వచ్చేసింది. తనకి కడుపులోని వాతావరణం కృత్రిమంగానైనా కల్పించడమే మంచిది కదా!"  అని

“అత్తమ్మా! మీరు అనవసరంగా బాధ పడి తన్మయిని బాధ పెట్టకండి" అన్నాడు.

జ్యోతి వెంటనే "ఏవో బాబూ, మీలా మేం చదూకోలేదు. మాకివన్నీ తెలీదు. ఏదో కన్న కడుపు తీపి" అని నిష్ఠూరంగా అంది.

ప్రభు ఏమని రియాక్ట్ అవుతాడో అని తన్మయి లోపల్లోపలే భయపడింది.

ప్రభు నిశ్శబ్దంగా ఊరుకున్నాడు.

"హమ్మయ్య" అని నిట్టూర్చింది తన్మయి.

★★★

మర్నాడే తన్మయిని లేపి కూచోబెట్టేరు. సాయంత్రానికి మెల్లిగా నడిపించి తన్మయికి పక్క గదిలోనే ఉన్న పాపని చూపించేరు. పాపకి పాలు పిండి ఇవ్వడానికి మిషను తెప్పించేరు. నర్సులే పాపకు ట్యూబులు మార్చి పెడుతున్నారు. కళ్లు మూసుకుని ఇంకా కడుపులోనే ఉన్నట్టు నిద్రపోతూనే ఉంది పాప. తల్లి అన్నదాని కాదు కానీ తన్మయికి బలహీనంగా ఉన్న పాపని అక్కడలా చూడగానే బాగా దుఃఖం తన్నుకొచ్చింది. మూడో రోజు తన్మయిని ఇంటికి వెళ్లి పోవచ్చని చెప్పినా పాపను పంపేవరకూ తనూ ఆసుపత్రిలోనే ఉంటానని పంతం పట్టింది తన్మయి.

అయిదో రోజు నాటికి తన్మయికి తనంతట తనుగా లేవగలగడం అలవాటయ్యింది. పాప దగ్గిరి నించి వచ్చేసరికి ప్రభు తల్లీ, తండ్రీ వచ్చి ఉన్నారు. చెప్పాపెట్టకుండా వచ్చేవని వాళ్లు అంటున్నా ప్రభుకి తెలియకుండా వచ్చేరన్నది నమ్మబుద్ధి కాలేదు తన్మయికి. అయినా మామూలుగానే పలకరించింది.

జ్యోతి ముందు సంశయించినా కాస్సేపట్లో అంతా పరిచయంగా మాట్లాడుకోవడం చూసి స్థిమితపడింది తన్మయి.

ప్రభు అందరికీ టీలు పట్టుకురావడానికి బయటికి వెళ్లేడు. ఉన్నట్టుండి ప్రభు తండ్రి నోట్లో నములుతున్నదేదో బయటి గుమ్మం దగ్గిరకెళ్లి కాండ్రించి ఊసి వచ్చి "ఊ...ఏం నిర్ణయించుకున్నారు?" అన్నాడు జ్యోతిని ఉద్దేశించి.

జ్యోతి అర్థం కానట్టు తెల్లబోయి చూసింది.

"అదే, మాకు మనవరాలు పుట్టింది. వచ్చే ఏడాదో, పై ఏడాదో మొగ పిల్లోడు కూడా పుడతాడు. ఇంక మీ మనవణ్ణి మీ ఇంటి కాడ ఉంచుకోవటం అందరికీ ఉత్తమం, ఏటి?" అన్నాడు.

తన్మయికి రక్తం సలసలా మరిగింది ఒక్కసారిగా.

"ఎవరికి ఉత్తమం? మీ మనవరాల్ని చూసుకోవడానికి వచ్చేరా?బాబు విషయం మాట్లాడడానికొచ్చేరా?" అంది తీక్షణంగా చూస్తూ.

జ్యోతి వెంటనే కల్పించుకుని బాలెంతవి అంతంత ఆవేశం తెచ్చుకోకమ్మా అంటూ "మీరేవంటన్నారో నాకు ఒక్క ముక్క అర్థం కావట్లేదు. మా పిల్ల తెలిసో తెలీకో మీ అబ్బాయిని చేసుకుంది. మధ్యలో పసి పిల్లోడు ఏం చేసేడు? దయచేసి ఇప్పుడిక్కడ ఇలాంటి మాటలు మాట్లాడకండి. మీ అబ్బాయి వచ్చేక మీరూ మీరూ తేల్చుకోండి." అని లేచి బయటికెళ్లిపోయింది.

తన్మయి ముఖం పక్కకు తిప్పుకుని కళ్లు మూసుకుంది. వీళ్లిక్కడ పంచాయితీ పెట్టడానికి వచ్చేరన్నమాట. ఒక పక్క డెలివరీ కష్టం కంటే మనసులో ముల్లులా గుచ్చుకుంటూన్న వీళ్ల మాటలే ఎక్కువ బాధ పడ్తున్నాయి. పసి పిల్లవాడు ఏం చేసేడని ఇంత కక్ష సాధింపు చేస్తున్నారో అర్థం కావడం లేదు.

ప్రభు వస్తూనే ఏదో జరిగిందని పసిగట్టినట్టు "పదండి పాపని చూసొద్దాం" అంటూ వాళ్లని లేవదీసేడు.

తన్మయి ఎవరి వైపూ చూడకుండా కళ్లు మూసుకునే ఉంది అక్కడ వాళ్లున్నంతసేపూ. జ్యోతి వాళ్లని ఇంటికి పిలవడం కూడా మానేసి మొహం తిప్పుకుని కూచుండిపోయింది. ప్రభు వాళ్లని టౌనులో చుట్టాలింట్లో దించి వస్తానని చెప్పి బయలుదేరి వెళ్లేడు.

వాళ్లలా వెళ్లగానే "ఇదా నువ్వు చేసుకున్న సంబంధం, ఆ మనిషి మాట్లాడే దానికి తలా తోకా ఉందా? ఎందుకొచ్చేడు, ఏం మాట్లాడతన్నాడు? అయినా నీ కొడుకు నీతో ఉండకూడని ఆంక్షలు పెడుతున్న వీళ్లందరినీ ఇంట్లో ఉంచుకోవడానికి నీకు బుద్ధిలేదా, నీ మొగుడికి బుద్ధిలేదా? ఇదెక్కడి అన్యాయం మనుషులు?" అంది గట్టిగా.

ఏ మనుషుల గురించి తల్లికి తెలియకుండా ఇన్నాళ్లూ దాచిపెట్టిందో ఆ మనుషులే ఎదురుగా వచ్చి మరీ వాళ్ల బుద్ధి చూపించుకున్నారు. ఇక ప్రభు సరేసరి. బహుశాః వాళ్లిప్పటికే చిలవలూ పలవలూ కల్పించి చెప్పే ఉంటారు. ఇక వాళ్లున్నంత సేపూ ఇక్కడికి రానుకూడా రాడు. తన్మయికి భయంకరమైన తలపోటు రాసాగింది.

ఎటూ మాట్లాడని ప్రభు నిశ్శబ్దాన్ని అవకాశంగా తీసుకుని రెచ్చిపోతున్న వీళ్లతో ఇక రోజూ పోరాటం చేస్తూ రావాల్సిందే. ఒక పక్క పాప ఎప్పటికి ఒడిలోకి వస్తుందో అన్న ఆందోళన, మరో పక్క ఇలాంటి భయంకరమైన మనుషుల వల్ల మానసిక వ్యథ.

"మిత్రమా! ఎప్పటికైనా నాకు కష్టాలు గట్టెక్కే మార్గం ఉందా?" అంటూ మౌనంగా రోదించసాగింది.

63

**ప్రభు సాయంత్రానికి** తిరిగి వచ్చేడు.

వాళ్ల తల్లిదండ్రుల గురించి గానీ, వాళ్లు మాట్లాడిన మాటల గురించి గానీ ఒక్క మాట కూడా ఎత్తకుండా దిగులుగా ఉన్న తన్మయి పక్కనే కుర్చీ జరుపుకుని కూచుని తల మీద లాలనగా చెయ్యి వేసి "ఏరా, కొబ్బరి బొండాం ఏమైనా తాగుతావా?" అన్నాడు.

తన్మయి ఆచేతినలాగే పట్టుకుని నిశ్చింతగా కళ్లుమూసుకుంది.

ప్రభు వాళ్ల అమ్మా, నాన్నా అన్న మాటలు ఏవీ తనతో చర్చించలేదు. అంటే వాళ్లు ప్రభుతో చెప్పకపోయైనా ఉండాలి, లేదా ప్రభుకి తెలిసీ తనకి అవన్నీ ప్రస్తావించడం ఇష్టం లేకపోయైనా ఉండాలి. ఏదేవైనా తన మనసు బాధ పెట్టే పని ప్రభు చెయ్యనందుకు సంతోషంగా అనిపించింది.

"పాపని చూసిరాక పోయావా?" అంది నెమ్మదిగా.

"అక్కడినుండే వస్తున్నానురా. బంగారు తల్లి అలా నిద్రావస్థలోనే ఉంది" అన్నాడు మెల్లగా బాధ పలుకుతున్న గొంతుతో.

తన్మయికి తెలుసు తన ఎదురుగా బాధ పడితే తన ఆరోగ్యానికి మంచిది కాదని ప్రభు దు:ఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ ఉన్నాడని.

తన్మయికి కళ్ల నిండా నీళ్లు కమ్ముకున్నాయి.

పాప క్షేమంగా ఉండాలని, సంపూర్తిగా ఎదిగి, కళ్లు తెరిచి బయటి ప్రపంచం లోకి రావాలని అనుక్షణం తమలో తాము ప్రార్థన చేస్తూనే ఉన్నారిద్దరూ. అయినా అనుకోనిదేదైనా జరుగుతుందేమోనని భయం వెయ్యసాగింది. ఈ బాధ వల్ల సరిగా తినక, నిద్రపోక కలుగుతున్న నీరసం మరొక వైపు క్రుంగ దీస్తోంది.

ఇప్పుడిప్పుడే కుట్ల నొప్పి కూడా బాగా బాధ పెడ్తూందితన్మయికి. కడుపు మీద, లోపల కండరాలు బిగబడుతున్న నొప్పితో బాటూ పాప గురించిన బాధ కడుపులో నుంచి తన్నుకు రాసాగింది.

బహుశా: కడుపు తీపి అంటే ఇదేనేమో! ఈ ప్రపంచంలో కన్న పిల్లల మీద ఉన్న మమకారం ఎవరిమీదా ఉండదు అనుకుంటా! గడియారం వైపు చూసింది. ఆరయ్యింది. ప్రతీ రోజూ సాయంత్రం జ్యోతి, బాబు ఇద్దరూ వచ్చి కాస్సేపుండి వెళ్తున్నారు. ఇవేళ ఇప్పటికింకా రాలేదెందుకో!

"అన్నట్టు మర్చిపోయా అంటూ" ప్రభు జేబులో నుంచి ఒక చిన్న నంబర్లు నొక్కే ఫోను రిసీవరు లాంటిది తీసి చూపించేడు.

ప్రశ్నార్థకంగా చూస్తున్న తన్మయితో "మొబైల్ ఫోను, కొత్తగా వచ్చింది. ఆఫీసు వాళ్లు ఇచ్చేరు." అన్నాడు.

ఇంకా అలాగే చూస్తున్న తన్మయితో "నువ్విక్కడి నుంచే ఇంటికి ఫోను చెయ్యొచ్చు" అని చేతికి ఇచ్చేడు.

అరచెయ్యంత పొడవున ఉన్న ఫోను మీద "మోటరోలా" అనే అక్షరాలున్నాయి.

సరిగ్గా లాండు ఫోను రిసీవరు సైజులో సగం ఉందా సెల్ ఫోను. కానీ బరువుగా ఉంది.

తన్మయి చిన్నగా నవ్వి "భలే ఉంది" అంది.

ఇంటికి ఫోను చెయ్యబోతూండగా బాబు పరుగెత్తుకొచ్చేడు "అమ్మా" అంటూ.

మంచమ్మీద ఎక్కబోతున్న వాణ్ణి సున్నితంగా మందలించింది జ్యోతి.

"ఆ...ఆ...జాగ్రత్త అమ్మ కడుపు మీద పడకు" అంటూ.

తన పక్కనే కూచోబెట్టుకుంటూ మురిపెంగా వాడి తల సవరిస్తూ "ఏ నాన్నా! పొద్దుట్నించీ బాగా ఆడుకున్నావా?" అంది ప్రేమగా తన్మయి.

అంతలోనే తల్లి చేతిలోని ఫోను తన చేతిలోకి తీసుకుంటూ గబగబా నంబర్లేవో ఒత్తసాగేడు.

ప్రభు అప్పటిదాకా చిర్నవ్వుతో చూస్తున్న వాడల్లా చటుక్కున వాడి చేతిలో నుంచి ఫోను లాక్కుని బయటకు వెళ్లిపోయేడు.

చిన్నబోయిన ముఖంతో ఏడుపు నిండిన కళ్లని నిశ్శబ్దంగా తుడుచుకోసాగేడు బాబు.

ఇంత చిన్న వయసులో చేతిలో వస్తువు లాక్కుంటే కాళ్లు నేలకు తాటిస్తూ అరుస్తారు వేరే ఏ పిల్లలైనా.

వయసుకి మించిన పరిణతి నిండిన వాడి గంభీరత్వానికి తన్మయికి ఒక పక్క ఆశ్చర్యమూ, వాడి పట్ల జాలీ, ప్రభు ప్రవర్తనకు బాధా ఒక్కసారిగా కలిగేయి తన్మయికి.

వాణ్ణి హత్తుకుని ముద్దుపెట్టుకుని "అది కొత్తగా వచ్చిన సెల్ ఫోనట నాన్నా. అలా నంబర్లు అన్నీ నొక్కెయ్యకూడదు మరి!" అంది అనునయంగా.

జ్యోతి పాపని చూసి రావడానికి వెళ్లింది కాబట్టి సరిపోయింది. లేకపోతే అక్కడొక రణరంగం అయ్యేది.

నిశ్శబ్దంగా తలూపి తల్లిని పట్టుకుని అలానే పక్కన పడుకుని "అమ్మా! నువ్వు, చెల్లి ఇంటికి ఎప్పుడొస్తారు?" అన్నాడు బాబు.

బదులుగా తన్మయి వాడి వెన్ను నిమురుతూ "డాక్టరు గారు త్వరగా పంపేస్తారమ్మా బెంగ పడకు, అమ్మమ్మ ఉందిగా" అంది.

నిస్సత్తువగా బాబు వెన్ను అలానే నిమురుతూ కళ్లు మూసుకుంది తన్మయి.

జీవితం అడుగడుగునా గాయాలే. ఒక గాయం పూర్తిగా మానక ముందు మరొకటి. శరీరం, మనసు అన్ని చోట్లా గాయాలే.

అనుక్షణం సమస్యలే. అన్ని వైపుల నుంచీ చుట్టుముడుతున్న సమస్యలు.

తీవ్ర ఒరవడితో బాధా నదిలో కొట్టుకుపోతున్న తనకు దొరికిన చెట్టు కొమ్మ ఆసరా ప్రభు.

కానీ కొమ్మ చుట్టూ అడుగడుగునా చేతులు గీరుకుపోతున్న ముళ్లు.

అయినా జీవితాన్ని గట్టెక్కించాలంటే రక్తసిక్త హస్తాల్ని నవ్వు ముసుగు వెనుక దాచుకోవాల్సివస్తూంది.

"మనకు సమస్యలన్నీ తీరిపోతాయి నాన్నా! భయపడకు" అంది తనలో తను గొణుక్కుంటున్నట్లు.

రోజూ అద్దాల పెట్టెలోని పాపాయికీ అదే చెప్తూంది.

"భయపడకు తల్లీ భయపడకు! అమ్మ ఉంది నీకు తోడుగా. ఏ కష్టాన్నైనా కలిసి పంచుకునే అమ్మ ఉంది. త్వరగా కోలుకుని బయటి ప్రపంచం లోకి నువ్వెప్పుడు కళ్లు విప్పుతావా అని ఆత్రంగా చూసే అమ్మ ఉంది."

ఆసుపత్రిలో రోజులు భారంగా దొర్లసాగేయి. వనజ దాదాపు రోజు విడిచి రోజు వచ్చి ధైర్యం చెప్పసాగింది.

తన్మయికి తన మనస్సులో చెల రేగుతున్న అలజడిని వనజతో పంచుకోవాలని ఎంతో అనిపించినా చెప్పలేకపోతోంది.

ఏమని చెప్పాలి? మళ్లీ పెళ్లనే పేరుతో తనకే తెలియనంత లోతున సమస్యల్లో కూరుకుపోయింది తను.

ఇక వనజకున్న సమస్యలతో బాటూ తన బాధలూ చెప్పి తనని మరింత బాధ పెట్టకూడదం ఎందుకు?

ఒకప్పుడు తన విషయాలు ప్రతి ఒక్కటీ వనజతో పంచుకునేది. అసలు ఇది చెప్పచ్చు, ఇది చెప్పకూడదు అన్న ఆలోచన గానీ, వివేచన గానీ లేని వయసది.

బహుశా: వనజకి తన కష్టాలు చెప్పుకుంటే కలిగే సాంత్వన వల్ల ఏదాపరికమూ ఉండేది కాదనుకుంటా.

ఎంత సన్నిహితులైనా వయసు వచ్చే కొలదీ ముసుగులు, మొహమాటాలు వచ్చేస్తాయి మనుషుల మధ్య. కారణాంతరాలు ఏవైనా సరే.

"తనూ! ఒకప్పుడు ఏ బాదరబందీల్లేకుండా ఎంత హాయిగా ఉండే వాళ్ళమో కదా!" అంది హఠాత్తుగా వనజ.

అదే ఆలోచిస్తున్న తన్మయి ఆశ్చర్యంగా చూసి నిట్టూర్చింది.

మళ్లీ వనజే అందుకుని "ఒకప్పుడు ఉండే ధైర్యం సన్నగిల్లిపోతూ ఉంది తనూ. ఒక పక్క పెరుగుతున్న బాధ్యతలు, కుటుంబభారాలు. మరొక పక్క మానసిక ఆందోళనలు. స్త్రీల జీవితాలే ఇంతేనేమో. మనకు తెలిసిన ఏ స్త్రీ అయినా సుఖపడ్డట్టు చూసేమా?" అంది.

తన్మయి వనజ చేతిని నిమురుతూ "వనా! నా వరకు నాకు నువ్వే ధైర్యం. నువ్వే ఇలా అధైర్యపడితే ఎలా" అంది.

"ఒకసారి ఆలోచిస్తే స్త్రీల జీవితాల్లో ఉన్నన్ని సమస్యలు పురుషులకు ఉండవేమో అనిపిస్తుంది. సమాజం, కుటుంబం స్త్రీలని ఒక విధంగా చూస్తే , పురుషులని మరొక రకంగా చూస్తాయి. ఒకే రకమైన సందర్భంలో పురుషులు ఉన్నపుడు, స్త్రీలు ఉన్నపుడు కలిగే పరిణామాలే వేరు. స్త్రీలకి కలిగే నిందలు, అవమానాలు,

దుఃఖాలు పురుషులకి ఉన్నాయా? " సాలోచనగా మళ్లీ అంది వనజ.

తను ఏ సందర్భంలో అలా మాట్లాడుతూందో గానీ, అవన్నీ తనకు సరిగ్గా వర్తిస్తాయి.

తన్మయి బాధగా తలూపింది.

ఒక్కటి మాత్రం నిజం. ఈ విషయాలన్నీ వనజ పరిశీలనతో తెలుసుకుంటే, తను అనుభవపూర్వకంగా తెలుసుకుంది.

"అవును వనా! నా జీవితమే అందుకు పెద్ద ఉదాహరణ" అంది తన్మయి కళ్లు మూసుకుంటూ.

"పోనీలే ఇప్పుడు నువ్వున్న పరిస్థితుల్లో గతించిన విషయాలు జ్ఞాపకం తెచ్చుకోవడం, బాధ పడడం మంచిది కాదు. నీ మనసెరిగిన సహచరుడు నీకు లభించేడు. ఎటువంటి ఆర్థిక సమస్యలూ లేకుండా నిలదొక్కుకున్నావు. అంతేచాలు. పాప త్వరగా పుంజుకుంటే ఉన్న ఇదొక్క కష్టమూ గట్టెక్కినట్టే." అంది వనజ.

"ఒక పెద్ద కష్టం గట్టెక్కినట్లే" పైకి అంది గానీ, "కనీసం ఒక పెద్ద కష్టం గట్టెక్కినట్లే" అని అనుకుంది మనసులో తన్మయి.

తన్మయిని డిశ్చార్జి చేసినా ఆసుపత్రిలో పాపాయి దగ్గిరే ఉండ సాగింది.

ఆపరేషను వల్ల బాగా నడుము లాగినప్పుడల్లా బయట ఉన్న బల్ల మీదే నడుం వాల్చ సాగింది.

పెరిగిన గెడ్డం తో బాటూ దిగులుగా ఉన్న ప్రభు కళ్లు చూస్తేనే పాప విషయంలో బాగా బెంగపెట్టుకున్నట్టు అర్థం అవుతూ ఉంది.

కానీ తన దిగులు చూసి తన్మయి ఎక్కడ బాధ పడ్తుందో అని ప్రభు లోపల్లోపల కలవలపడడమూ గమనిస్తూ ఉంది.

ఎప్పుడూ హుషారుగా ఉండే ప్రభు అలా దిగులుగా ఉండడం చూస్తే మరింత దు:ఖంగా ఉంది తన్మయికి.

తామిద్దరికీ పాపే వర్తమానమూ, భవిష్యత్తూ.

ఇక దేని మీదా ఆసక్తీ, ధ్యాసా పోవడం లేదు.

అయినా ఉద్యోగం తప్పని సరయ్యి ప్రభు వారానికోసారి వెళ్లసాగేడు.

కన్నబిడ్డ విషయంలో కడుపుతీపి, ప్రేమ తొలిసారి అనుభవవేద్యమవుతున్న ప్రభుకి తన కొడుకు మీద తనకి ఎంత మమకారం ఉంటుందో అర్థం చేసుకోగలగాలి. కానీ అతను అంతకంతకూ బాబు నించి దూరం కావడంలోనే మనశ్శాంతి ఉన్నట్టు ప్రవర్తించడం మాత్రం ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు తన్మయికి.

తను ఈ పెళ్లి చేసుకుని తప్పుపని చేసిందా?

తన పట్ల కనబరిచే ప్రేమలో కొద్ది వంతైనా బాబు పట్ల చూపించలేని కఠినాత్ముడిగా ఎందుకు తయారవుతున్నాడు ప్రభు?

ఇటువంటి వ్యతిరేకతలో బాబు మనసు గాయపడకుండా ఎలా పెంచుకురావాలి?

ఇవన్నీ ఆలోచిస్తున్న కొలదీ ఒక విధమైన వైరాగ్యం కలగసాగింది తన్మయికి.

"అలా దిగులుగా కూచోకమ్మా అన్నీ అయ్యే అర్దుకుంటాయి. ఇంటికెల్లి కాస్త ఏవైనా తిందువురా. అల్లుడుగారిక్కడ ఉన్నారు కదా" అంటూ పిన్ని బలవంతంగా లేవదీసింది తన్మయిని.

ఇంటి దగ్గిర తన్మయికి జడ దువ్వి వేస్తూ "అక్కా! పాపకి ఉజ్జోగం, ఇద్దరు పిల్లలని చూసుకోవడం కస్టం కదా. బాబుని నీ కాడ ఉంచుకుని సదివించరాదూ, ఇక్కడ నువ్వు ఒక్కదానివీ అయిపోయేవు కదా" అంది.

బాబుని ఇక మీదట వదిలిపెట్టమని ప్రభు తల్లిదండ్రుల మాటలు తెలిసి మాట్లాడుతూందో, తెలియకుండానే మాములుగా మాట్లాడుతూందో అర్థం కాలేదు తన్మయికి.

తన్మయి ఏదో అనేలోగా "ఇప్పుడిప్పుడే కాస్త మనశ్శాంతిగా ఉంటన్నాను. మళ్లీ పిల్లల బాధ్యతలు నెత్తికెత్తుకోవడం నా వల్ల కాదమ్మా. అయినా ఒకప్పుడంటే మీ బావగారు తోడున్నారు కాబట్టి చంటిపిల్లాణ్ణి పెంచగలిగేం. ఇప్పుడు గభాలున ఏ ఒంట్లో బాలేకపోయినా పరుగులెత్తే ఓపిక లేదు నాకు" అంది జ్యోతి.

"అదేటక్కా.." అనేదో అనబోతున్న చెల్లెలితో

"నీకు పిల్లలు లేరు కదా, మీరు పెంచుకోండి" అంది జ్యోతి.

తన్మయి వెంటనే "నా కొడుకుని నేను పెంచుకోగలను పిన్నీ" అని అక్కణ్ణించి పెరట్లోకి వచ్చేసింది.

తల్లిని తప్పుపట్టలేదు తను. పిల్లల బాధ్యత చిన్న బాధ్యత కాదు.

కానీ తనకి సహాయం అవసరమైన ఇటువంటి క్లిష్ట సమయంలో ఇలాంటి సమాధానం తల్లి నుంచి ఎదురయ్యినందుకు బాధ వెయ్యసాగింది.

తనెప్పుడూ తన జీవితం ఇలా అవుతుందనుకోలేదు.

ఒక జీవితానికి ఇన్ని సమస్యలొస్తాయని తనెక్కడా విన్నట్టు కూడా లేదు.

అయినా తనకే ఇవన్నీ ఎందుకు ఎదురవుతున్నాయి?

తన జీవితం అల్లకల్లోలం అయ్యిందన్న బాధ వల్లే ఆరోగ్యం క్షీణించి తండ్రి మరణించేడు.

ఉన్న సమస్యలు చాలవన్నట్టు అనుకోని పరిస్థితుల్లో డెలివరీ రెండు నెల్ల ముందుగానే అయింది.

పూర్తిగా ఎదగలేదని పాపని ఇంక్యుబేటర్ లో పెట్టాల్సి వచ్చింది.

ఒక పక్క బాబుని స్కూలు మానిపించాల్సి వచ్చింది.

మరో పక్క ప్రభు తల్లిదండ్రులు వచ్చి బాబుని తీసుకురావొద్దని గొడవ పెట్టి వెళ్లేరు.

తన్మయి గట్టిగా ఊపిరి తీసుకుంది.

సమస్యల సుడిగుండాల మయమైన తన జీవితాన్ని తనే సంయమనంతో చక్కదిద్దుకోవాలి. ఎవరి సహాయం కోసమూ తనెప్పుడూ ఎదురు చూడకూడదు.

దృఢంగా నిర్ణయించుకున్నాక కాస్త మనసు తేలికపడ్డట్లయ్యింది తన్మయికి.

పాప ఎంత త్వరగా కోలుకుంటే అంత త్వరగా మిగతా విషయాలన్నీ చక్కబెట్టుకోవాలి.

"తన్మయీ! బాలెంతవి చలిగాల్లో బయట తిరగొచ్చా, లోపలికిరా" అనరిచింది జ్యోతి లోపల్నించి.

మారుమాట్లాడకుండా లోపలికి వచ్చింది తన్మయి.

డాక్టరు రౌండ్లకి వచ్చేరని ఆసుపత్రి నుంచి ఫోను చేసేడు ప్రభు.

పిన్ని ఇచ్చిన కర్చీఫు చెవులకి కట్టుకుంది తన్మయి.

"మేం రేపు బయలుదేరుతావమ్మా. ఇంటి కాడ పన్లు ఎక్కడియ్యక్కడ ఉండిపోయేయి" అంది పిన్ని.

జ్యోతి మాటలకి నొచ్చుకుందని స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

కృతజ్ఞతగా పిన్ని చేతులు పట్టుకుని "పన్లు చక్కబెట్టుకుని వారంలో వచ్చెయ్యి పిన్నీ" అంది.

"అమ్మ ఉంది కదమ్మా, ఇక్కడ నేనుండి పెద్దగా ఉపయోగమూ లేదు. పాపని ఇంటికి తీసుకొచ్చేక వొస్తానులే" అంది.

రిక్షా లో ఆసుపత్రికి బయలుదేరింది తన్మయి.

కూడా గేటు దాకా వచ్చిన పిన్ని రిక్షా వీథి మలుపు తిరుగుతూండగా వాకిట్లో అలాగే నిలబడి తను వెళ్ళిన వైపే చూస్తుండడం గమనించగానే ఆప్యాయత పొంగుకొచ్చింది తన్మయికి.

కళ్లని కమ్ముకున్న నీటిపొరల మధ్య అస్పష్టంగా కానవస్తూ కళ్లొత్తుకుంటున్నట్టున్న పిన్ని రూపాన్ని చూస్తూ తల రిక్షాలో నుంచి బైట పెట్టి, చెయ్యి ఊపింది.

నాలుగు వారాలు గడిచేయి.

డాక్టరు గారు వచ్చి చూసి "ఇవేళ రూముకి షిఫ్టు చేసేద్దాం పాపని. అంతా బావుంటే మరో వారం రోజుల్లో డిశ్చార్జి చేసేస్తాను." అన్నారు.

అప్పుడే వచ్చిన ప్రభు ఆ నాలుగు వారాల్లో మొదటిసారి చిరునవ్వు నవ్వేడు.

"థాంక్యూ సో మచ్ డాక్టర్ గారూ" అని నమస్కరించేడు.

పుట్టిన నెల్లాళ్ల తర్వాత ఒడి చేరిన పాపాయిని మురిపెంగా గుండెలకు హత్తుకుని కూచుండి పోయింది తన్మయి.

సంతోషంతో కళ్లు ధారాపాతం కాసాగేయి.

ప్రభు పాపని చేతుల్లోకి తీసుకుని తన్మయంగా చూడసాగేడు. నిద్రపోతున్న పాప చిన్ని వేళ్ళని తన వేళ్ళతో తడుముతూ ఆనందంతో వెలిగిపోతున్న ప్రభు ముఖాన్ని చూసి సంతోషపడింది తన్మయి.

"హమ్మయ్య, గండం గడిచింది ఏడుకొండలవాడా" అని దణ్ణాలు పెట్టింది జ్యోతి.

బాబు హుషారుతో గెంత సాగేడు.

ప్రభు గబగబా విషయాన్ని తల్లిదండ్రులకి సెల్ ఫోన్లో ఆనందంగా చెప్పసాగేడు.

మత్తుగా నిద్రపోతున్న పాపకి మొదటిసారి తన దగ్గిర పాలు పెట్టే ప్రయత్నం చేసింది తన్మయి.

ఎవరో నేర్పించినట్టు గబగబా అందుకుని తాగుతున్న పాప జుట్టుని మురిపెంగా సరిచేసింది.

ముఖంమీద పడ్తున్న పలచని జుట్టు , పేలవంగా ఉన్న కాళ్లు, చేతులు తడుముతూ "ఏం భయపడకు తల్లీ, మెల్లగా పుంజుకుందువుగాని" అని మెల్లిగా పాప చెవిలో గొణిగింది.

64

అనుకున్నట్టే వారం రోజుల్లో పాపని డిశ్చార్జి చేసేరు.వాకిట్లో పిన్ని దిష్టి తీసి లోపలికి ఆహ్వానించింది. జ్యోతి మాటలు మనసులో పెట్టుకోకుండా మళ్లీ వచ్చినందుకు పిన్ని పట్ల కృతజ్ఞతతో మనసు నిండిపోయింది తన్మయికి. అంతే కాదు. వస్తూ వస్తూ దాదాపు పదిహేనేళ్లున్న అమ్మాయిని వెంట తీసుకుని వచ్చింది పిన్ని.

"అమ్మలూ, నీకు అయిద్రాబాదులో పిల్లల్తో ఏ కస్టవూ లేకండా ఉంటానికి ఇదుగో మా బావగారి మేనల్లుడి తమ్ముడు కూతుర్ని సమచ్చర జీతానికి మాట్లాడి తీసుకు వచ్చేను. ఈ పిల్ల నీకు నచ్చిన పన్లన్నీ సేసిపడతాది" అంది.

జ్యోతి వెంటనే ముఖం చిట్లించి "అదేంటి, తీసుకొచ్చే ముందు అడగక్కర్లా? సంవత్సర జీతమంటే మాటలా? ఇంతకీ ఎంతకి మాట్లాడేవో" అంది.

పిన్ని సమాధానం కోసం ఎదురుచూడకుండా తన్మయి "ఏమీ ఫర్వాలేదు. ఇలా ఎవరైనా దొరకడమే పదివేలు. మా ఇంట్లో నాకు, పిల్లలకు చేదోడు వాదోడుగా ఉండి కుదురుకుంటే చదువు కూడా నేర్పిస్తాను." అంది తన్మయి ఆనందంగా.

తనకి ఎప్పుడూ కష్టాలతో బాటూ వాటిని తీర్చే మార్గాలు కూడా సమకూర్చిపెట్టే అజ్ఞాత మిత్రుడు తన వెంటే ఉంటాడు. ఇప్పుడు పిన్నిలో ఉన్నాడు. అంతే. అంతలోనే ప్రభు తల్లిదండ్రులు ఈ అమ్మాయిని చూసి ఏమంటారో అన్న ఆలోచనలో పడింది. అయినా ఇందాక ప్రభు అన్నీ విన్నాడుగా.

తనకి తెలిసి ప్రభుకి ఎటువంటి అభ్యంతరమూ ఉండదు. ఇక వాళ్ళ వాళ్ళ సంగతి తనకి అప్రస్తుతం. ఏదేమైనా కానీ, ఎవరి కోసమూ తన జీవితం తన చెయ్యి దాటిపోకూడదు. బాబుని తీసుకురావొద్దని ప్రభు తల్లిదండ్రులు అన్నారు గానీ, ప్రభు ఇంతవరకూ అనలేదు. అయినా వాళ్లు తమతో వచ్చి ఉన్నారు కానీ, తామెళ్లి వాళ్లతో ఉండడం లేదు. తమ ఇంట్లోని పరిస్థితులు వాళ్లకు నచ్చేటట్లు ఉండాలని శాసించే హక్కు వాళ్లు లేదు.
బాబు ఆ ఇంట్లో ఉండకూడదనే హక్కు అస్సలు లేదు. వాళ్లకి నచ్చకపోతే వాళ్లే వెళ్లాలి కానీ, తనెందుకు బాబుని దూరం చేసుకోవాలి? అయితే ఈ విషయం వాళ్లంత తేలికగా వదిలెయ్యరు.

సిద్దార్థ అన్నట్టు "చదువు లేకపోయినా ఇటువంటి తెలివితేటలు చాలా మెండుగా ఉన్న కుసంస్కారులు వాళ్లు".

గొడవలైనా, గందరగోళమైనా వాళ్లని ధైర్యంగా ఎదుర్కోవాలి తను.

ఒక్క విషయం మాత్రం స్పష్టం. "వాళ్లకి అర్థమయ్యేటట్టు చెప్పాల్సింది తను కాదు- ప్రభు."

ఆలోచనలు ఒక కొలిక్కి రాగానే తన్మయి తేలికగా ఊపిరి పీల్చుకుంది.

గుమ్మం దగ్గిర నిలబడి లోపలికి రానా, వద్దా అన్నట్టు చూస్తున్న ఆ పల్లెటూరి అమ్మాయి వైపు చూసి చిన్న నవ్వు నవ్వి "ఇలా రా, నీ పేరేంటి?" అంది తన్మయి.

"నాగలచ్మి వొదినీ" అంది.

"ఊ.. నిన్ను "నాగా" అని పిలుస్తాను సరేనా?" అని "అవునూ, నువ్విలా పన్లోకి వచ్చి సంవత్సరం పాటు  ఉండిపోతే మీ అమ్మా, నాన్నా మీద నీకు బెంగ రాదూ" అంది.

"నాకు అమ్మ లేదొదినీ, నే పుట్టగానే ఎటో ఎల్లిపోయిందంట. మా నాన మల్లీ పెల్లి సేసుకున్నాడు. నన్ను మా నానమ్మ పెంచింది. ఆవిడి ఈ మద్దే కాలం సేసింది." అని పిన్ని వైపు చూస్తూ "అత్తయ్యిగోరు వొచ్చి అడిగీతలికి అందికే ఎంటనే వొచ్చీసేను. మా నాన అప్పుడప్పుడూ వొచ్చి సూస్తానన్నాడులే." తెల్లగా, పీలగా ఉన్న ముఖమ్మీద పెద్ద కళ్లల్లో ఏ మాత్రం బాధ లేకుండా చెప్పుకుపోతున్న ఆ పిల్ల మీద ఎనలేని ప్రేమ  పుట్టుకొచ్చింది తన్మయికి.

"జన్మనిచ్చిన తల్లి చంటిపిల్లని వొదిలేసి వెళ్లిపోయిందా? పాపం అంతటి కష్టం ఏం వచ్చిందో ఆ తల్లికి! వెళ్లేది పిల్లని ఎందుకు తీసుకు వెళ్లలేదో. పాపం ఈ పిల్ల ఎటూ గాకుండా కష్టాలు పడ్తూంది."

తన్మయికి కళ్లు చెమర్చాయి. బట్టలు మడత పెడ్తూ వెనక్కి తిరిగి కళ్లొత్తుకుంది. ఆ అమ్మాయి పరిచయంగా "నే మడతెడతాలే వొదినీ, పాప లేసింది కదా పాలెట్టు" అంది ఆరిందాలా. పిల్లలకు పరిస్థితులే అన్నీ నేర్పిస్తాయనుకుంటా.

★★★

మామూలుగా ఇరవై ఒకటో రోజున బిడ్డతో బాటూ బాలెంతస్నానం చెయ్యాలి.

కానీ పాప ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కాకపోవడంతో ఆ కార్యక్రమం అయిదోవారంలో ఇప్పటికి కుదిరింది. పక్కింటి పెద్ద మామ్మ చంటి బిడ్డకి నలుగు పెడదామని ఎంతో సంబరపడింది.

కానీ "ఈ పిల్లకి ముట్టుకుంటే కండే లేదు. ఇంక నలుగు స్నానాలెందుకులే. అలా పై పైనే సున్నుపిండి రాసి కడిగేస్తే సరి" అంది జ్యోతి. అసలు కాళ్ల మీద వేసుకుని ఎవరైనా స్నానం చేయిస్తారంటే తన్మయికి చూడడానికే భయం పట్టుకుంది.

"నలుగు స్నానాలొద్దులే అమ్మా! ఇంకొన్నాళ్లు ఆగుదాం" అని తన్మయి స్టీలు బేసిను లో గోరు వెచ్చని నీళ్లు పోసి మృదువుగా ఒళ్లు కడిగింది పాపకి. తల జాగ్రత్తగా పట్టుకుని  కొత్తగా వచ్చిన బేబీ షాంపూతో రుద్దింది. స్నానం కాగానే సాంబ్రాణి పొగ వేసింది పిన్ని.  అప్పటికే అలిసిపోయి నిద్రలోకి జారుకుంది పాపాయి. అర్భకంగా ఉన్న పిల్లకి వనజ తీసుకొచ్చిన చిన్న పరికిణీ, జాకెట్టు వేసేసరికి అందం వచ్చేసింది. మొదటిసారి కూడా ఆడపిల్ల కావాలని ఎంతగా కలలు కందో!  ఆ కోరిక ఇప్పటికి తీరింది.

దిష్టి చుక్క పెడుతూ "నా బంగారు తల్లీ! నూరేళ్లు వర్థిల్లు" అంటూ తన్మయి లోలోపల ఆశీర్వదించింది.

ఈ తతంగమంతా ఉత్సాహంగా చూడసాగేడు బాబు.

నాగ పాపాయి పనుల్లో సాయం చెయ్యడంతో బాటూ, బాబుని తయారు చెయ్యడం, ఇంటి పనిలో జ్యోతికి సాయం చెయ్యడం వంటివి కూడా చకచకా చేసెయ్యడం చూసి సంతోష పడింది పిన్ని. తన్మయి ఒళ్లంతా పసుపు రాసుకుని, నలుగు పెట్టుకుని, కుంకుడు కాయలతో, గోరు వెచ్చని నీళ్లతో తలారా స్నానం చేసింది.

"ఎక్కువ సేపు స్నానం చెయ్యకమ్మా చంటి బిడ్డకి జలుబు సేస్తాది" అంది పిన్ని.

స్నానం అయ్యి కొత్త కాటన్ చీర కట్టుకుని తలకి సాంబ్రాణి పొగ వేసుకుని అద్దంలో చూసుకుంటూ పెద్ద తిలకం బొట్టు దిద్దుకుంది.

"మా అమ్మే కుందనం బొమ్మలా ఉన్నావు, నా దిష్టే తగిలేలా ఉంది" అంటూ మెటికలు విరిచింది పిన్ని.

పాపిట్లో సింధూరం పెట్టుకోబోతూండగా జ్యోతి వచ్చి ముఖం చిట్లించి "పూజగదిలో అమ్మమ్మకి, నాన్నగారికి దణ్ణం పెట్టుకో" అంది.

తల్లికి ఇలా పాపిట సింధూరాలు వంటివి నచ్చవని గుర్తుకొచ్చింది తన్మయికి.

తన్మయి అగరుపొగ వెనుక పటాలుగా మారిపోయిన అమ్మమ్మకి, తండ్రికి మనసారా నమస్కరించింది. నిన్నా మొన్నటి వరకు అక్కడే తిరిగిన తండ్రి అంతలోనే ఈ ప్రపంచం నుంచి మాయమై పోయిన వైనం గుర్తుకొచ్చి దు:ఖం ముంచుకొచ్చింది తన్మయికి.

"నాన్నా! మరి కొద్ది రోజులు మీరుండి ఉంటే పాపని చూసేవారు. ఏం చేస్తాం మాకే ప్రాప్తం లేదు."

అంటూ నిశ్శబ్దంగా తండ్రితో మాట్లాడుతున్నట్టు అక్కడే చాలా సేపు కూచుండిపోయింది. ఆపరేషను వల్ల కింద కూచోకూడదని ముక్కాలి పీట మీద కూచుంది తన్మయి. అయినా నడుము లాగసాగింది. పదిగంటల వేళ ప్రభు వచ్చేడు. వస్తూనే కాళ్లూ, చేతులు శుభ్రంగా కడుక్కుని వచ్చి నిద్రపోతున్న పాపని గుండెలకు హత్తుకున్నాడు. పక్కనే పడుకున్న తన్మయి నుదుటి మీద ముంగురుల్ని లాలనగా సవరించేడు. ఆ క్షణాన తనకి ఏ బాధలూ లేనట్లు అనిపించి తన్మయి నిశ్చింతగా కళ్లు మూసుకుంది.

"రేపూ, ఎల్లుండుల్లో ఇంటికి వెళ్లిపోదామురా. పాపని అక్కడే చూపిద్దాం. ఏమంటావ్?" అన్నాడు.

తన్మయికి కూడా త్వరగా వెళ్లిపోవాలనే ఉంది. ఒక పక్క బాబుకి స్కూలు కూడా పోతూంది. మూడో నెల వరకూ ఉండమని తల్లి గొడవ చేస్తుందేమో అనుకుంది. కానీ జ్యోతి మారుమాట్లాడకుండా ఒప్పుకుంది.

పిన్ని మాత్రం ఉండబట్టలేనట్లు "అదేటమ్మా ఆపరేసను అయ్యింది కదా అయిదో నెల దాకా ఉండి..." అని సీరియస్ గా ఉన్న జ్యోతి ముఖం వైపు చూసి ఆగిపోయింది.

తన్మయికి ఆశ్చర్యం వేసింది. తండ్రి పోయిన దు:ఖంతో తల్లి తల్లడిల్లి పోతుందనీ, తను తల్లి దగ్గరే ఉంటే సాంత్వనగా ఉంటుందనీ అనుకుంది. కానీ తల్లి తను ఎప్పుడు వెళ్తుందా అని చూస్తున్నట్టు అనిపించి బాధ కూడా వేసింది.

మర్నాడు బయలుదేరే వేళ తన్మయికి ఎందుకో ఆ ఇంటితో బంధం తీరిపోయినట్లు అనిపించసాగింది.

అయినా తమాయించుకుని "అమ్మా, నీకు ఎప్పుడు పిల్లలని చూడాలని అనిపించినా ఒక్క ఫోను చెయ్యి" అంది. అంతలోనే గొంతులోకి దు:ఖం ముంచుకొచ్చి గొంతు గరగరలాడింది.

మొదటిసారి తను తన తల్లిదండ్రుల్ని వొదిలి అత్తవారింటికి వెళ్ళినపుడు దారంతా దు:ఖపడడం జ్ఞాపకం వచ్చింది. ఎప్పుడూ తల్లిని, పుట్టిన ఇంటిని వదిలి వచ్చేటపుడు అదే దు:ఖం కలుగుతుంది తనకి. కానీ తల్లికి తనని వొదిలి కూతురు వెళ్తూందన్న బాధ కలిగినట్టే ఉండదు ఎప్పుడూ. తనకంటే తల్లి ధైర్యవంతురాలు కావడం వల్లనో, లేదా తనకున్నంత ప్రేమ లేకపోవడం వల్లనో.

★★★

రాత్రంతా ప్రయాణంలో పాత జ్ఞాపకాలన్నీ తరుముకొస్తూనే ఉన్నాయి. రైలు దిగంతాల్ని చీల్చుకుపోతున్నట్లు శరవేగంగా దూసుకుపోసాగింది. అంతటా నిశీధి ఆవరించినా దిగంతాల్లో ఎక్కడో సన్నని వెలుగు చీకటి వెనక దాగున్న వెలుగు రేఖని స్పష్టం చేయసాగింది.

త్రోవ పక్క ఎక్కడి నుంచో అడవి పూల ఘాటైన పరిమళం ముక్కు పుటాల్ని తాకుతూ ఏవో జ్ఞాపకాల్ని రెకెత్తించసాగింది. తన్మయికి వివేకానందా పాఠశాల, మురళి, వెంకట్లు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చేరు. సంధ్య వేళ ధ్యాన సమయం తర్వాత ఇలాగే దిగంతాన కనిపించే సన్నని వెలుతుర్ని చూస్తూ తన జీవితాన్ని చక్కదిద్దమని ఎన్ని సార్లు ప్రార్థన చేసేదో! తన ప్రార్థనలన్నీ ఫలించినట్లు ప్రభు తన జీవితంలోకి వచ్చేడు.

ప్రభు వైపు చూసింది. కళ్లు మూసుకుని బెర్తు కి జేరబడి చంటిదాన్ని గుండెలకు హత్తుకుని కూచుని ఉన్నాడు. బాబు ఎదుటి బెర్త్ మీద నిద్రపోతూ ఉన్నాడు. మరో బెర్త్ మీద నాగ నిద్రపోతూ ఉంది. కాస్సేపట్లోనే నడుం నొప్పిగా అనిపించడంతో తన్మయి మెల్లిగా నడుం వాల్చింది. తన్మయి గుండెల్లో ఒక పక్క ప్రభు తల్లిదండ్రుల గొడవలు మళ్లీ ఎలా ఎదుర్కోవాలో అన్న బాధ, దిగులు కలగసాగేయి. అంతలోనే తమాయించుకుంది.

అసలు వాళ్ల మాటలకి తను విలువని ఎందుకివ్వాలి? అలా విలువనివ్వడం వల్లే తనకి ఇలా బాధ కలుగుతూంది. కానీ నిరంతరం నచ్చని వాతావరణంలో, ఇలా ఏడిపించే మనుషుల మధ్య తను ఎన్నాళ్లు ఉండగలదు? బాబుని ఎన్నాళ్లు కాపాడుకు రాగలదు? పోనీ, ఇవన్నీ వదిలేసి తన మానాన తను ఉద్యోగం ఉన్న ఊర్లోనే ఇల్లు చూసుకుని వెళ్లిపోతేనో. ఇప్పుడు పిల్లల్ని చూసిపెట్టడానికి చేదోడు, వాదోడుగా నాగ ఉండనే ఉంది. ప్రభు తమని చూడడానికి వారానికోసారి వచ్చినా ఫర్వాలేదు. అతని కుటుంబం కూడా తను ఎంత దూరంగా ఉంటే అంత సంతోషంగా ఉంటారు ఎలాగూ.

ఆలోచన రాగానే మనసు తేలికపడ్డట్టయ్యింది. ఇంటికి వెళ్లగానే ప్రభు తల్లిదండ్రులు గొడవ చేస్తే తను ఇదే చేస్తుంది. తనూ, తన పిల్లలు, తన ఉద్యోగం అంటూ మనశ్శాంతిగా ఉండగలిగితే త్వరలో పీ ఎచ్ డీ కూడా పూర్తిచెయ్యగలుగుతుంది. పీ ఎచ్ డీ గురించి తల్చుకుంటే మరో బెంగ మొదలయ్యింది. ఒకదానిమీదొక సమస్యతో సుడిగుండంలా తయారైన తన జీవితంలో గొప్ప చదువు చదవాలన్న లక్ష్యాలు పక్కకు పోకుండా పాడుకోవడమే అతి కష్టం అయిపోతూంది. మొన్ననే మాస్టారి నుంచి తను రాసిన ఉత్తరానికి జవాబు వచ్చింది. పీ ఎచ్ డీ గురించి ఇప్పుడు ఆలోచనే వద్దనీ, ముందు తన ఆరోగ్యం, పాప ఆరోగ్యం కుదుటపడనివ్వమనీ, అన్నీ సర్దుకున్నాక ఒక సంవత్సరం ఆలస్యం అయినా పీ ఎచ్ డీ సబ్మిట్ చెయ్యవచ్చనీ రాసేరు. ఎంత మంచివారు మాస్టారు! పీ ఎచ్ డీ కి ఆయనే గైడు కావడం జీవితంలో తనకు లభ్యమైన అరుదైన వరాల్లో ఒకటి. నిజానికి జే ఆర్ ఎఫ్ రావడం, గవర్నమెంటు ఉద్యోగం రావడం, ప్రభు లాంటి భర్త దొరకడం, బాబు, పాప .... అన్నీ అరుదైన వరాలే. అజ్ఞాత మిత్రమా! చాలు నాకీ జన్మకి ఈ వరాలు అని వేనోళ్ల పొగుడుతూ నిద్రలోకి జారుకుంది.

★★★

ఏకళనుందో గానీ బేబమ్మ వాకిట్లోనే దిష్టి తీసి సాదరంగా ఆహ్వానించింది. అర్భకంగా ఉన్న చంటిదాన్ని పొత్తిళ్లలో చుట్టి అందరికీ చూపించేడు ప్రభు. ఎత్తుకోవడానికి వీలుపడకపోయేసరికి నిరుత్సాహపడిపోయేరు పిల్లలు. ఇంట్లో అందరి సత్ప్రవర్తన చూసి తన్మయి కాస్త స్థిమితపడింది.

ఆ సాయంత్రమే దగ్గర్లోని పిల్లల డాక్టరుకి చూపించేరు పాపని. ఇలా ముందుగా పుట్టిన పిల్లలకు బరువు తక్కువగా దడం మామూలేనని, పాప ఆరోగ్యంగానే ఉందని అన్నారు డాక్టర్. ఆ నెలలో వేయాల్సిన టీకా ఏదో వేసి పంపించేరు.

టీకా వేసినప్పటి నుండి ఆపకుండా కిల్లు పెట్టి ఏడవసాగింది పాప. రాత్రంతా ఒక్క లెక్కన ఏడుస్తూనే ఉన్న పాపని ప్రభు, తన్మయి ఒకరి తరవాత ఒకరు భుజాలు మార్చుకోసాగేరు. తండ్రిగా పాపని అత్యంత జాగ్రత్తగా చూసుకోవడం, పాపే లోకంగా బతకడం చేస్తున్న ప్రభుని చూసి ఏదేమైనా ప్రభుని వదిలి ఎప్పుడూ వెళ్లకూడదని ప్రమాణం చేసుకుంది తన్మయి.

బాబుని ఆ మర్నాడే మళ్లీ స్కూలులో జాయిను చేసింది.

ప్రభు ఇంట్లో వాళ్లతో ఏం మాట్లాడాడో గానీ తన్మయి భయపడ్డట్లు బాబు విషయంలో ఎటువంటి గొడవా చెయ్య లేదు.

పగలంతా పాప తన్మయి దగ్గరే ఉన్నా ప్రభు రోజూ ఆఫీసు నించి రాగానే సరాసరి పాపని ఎత్తుకుని కిందికి వెళ్లిపోవడం, పాలు పట్టాల్సి వచ్చినపుడే తన్మయికి ఇవ్వడం చేస్తున్నాడు.

ఆ సమయంలో తన్మయి పీ ఎచ్ డీ పని ప్రారంభించింది.

క్రమంగా ఉదయం స్నానం చేయించి, పాలు పట్టగానే కిందనే హాల్లోని ఉయ్యాలలో వెయ్యసాగింది.

పాపని మధ్య మధ్యలో పాలకి మాత్రం తన్మయి దగ్గిరికి ఎవరో ఒకరు తీసుకుని వస్తూ మిగతా సమయమంతా మురిపెంగా ఆడసాగేరు.

నాగ పాపాయి పనులతో బాటూ, ఇంట్లో పనులన్నీ చకచకా చక్కబెడుతూ చేదోడు వాదోడుగా ఉండడంతో ఇంట్లో అంతా సంతోషించినట్లే కనిపించేరు తన్మయికి.

నాలుగో నెల రాగానే పగటి పూట పట్టుపాలు పట్టడం, సిరిలాక్ తినిపించడం వంటివి మొదలుపెట్టేరు. పాపాయి త్వరగా పుంజుకుని బొద్దుగా, ఆరోగ్యంగా తయారైంది.

తన్మయి తిరిగి ఉద్యోగంలో జాయినైంది.

రోజంతా తన్మయి బయటికి వెళ్ళినపుడు పాపని ఇంట్లో అందరూ బాధ్యతగా చూసుకోసాగేరు.

అంతా సజావుగా జరుగుతున్న తన్మయి జీవితంలో ఆ మరుసటి వారంలో మళ్లీ ఒక సమస్య వచ్చిపడింది.

65

సాయంత్రం కాలేజీ నుంచి వస్తూ దార్లో బాబుని పికప్ చేసుకోవడానికి ట్యూషను దగ్గిరికి వెళ్లింది తన్మయి. స్కూలు కాగానే ఆటో సరాసరి ఇక్కడే దించేస్తుంది బాబుని. ఇక్కడే హోం వర్కులు పూర్తి చేసుకుని, చదువుకుంటూ ఉంటాడు. ఆ ట్యూషను టీచరే పిల్లాడికి కాసిన్ని పాలు కలిపిచ్చేలా మాట్లాడింది తన్మయి. అందుకుగాను విడిగా డబ్బులు కట్టసాగింది. పొద్దుననగా తన్మయి కాలేజీకెళ్లి, సాయంత్రం వచ్చే వరకు పాపని నాగ సాయంతో ఇంట్లో వాళ్లంతా బానే చూసుకోసాగేరు. ప్రభు అక్క మనవరాలు బుజ్జిని కూడా దగ్గరలోని స్కూల్లో వేసేరు. ఆ పాప తల్లి రాణిని దగ్గర్లోని కుట్టు మిషను ట్రైనింగు సెంటర్లో జాయిను చేసింది తన్మయి. ఆ అమ్మాయి వచ్చేటపుడు స్కూలు నించి వాళ్ల పాపని తీసుకొచ్చుకుంటుంది. ప్రభు అక్క కొడుకు దాసుతో ఓపెన్ యూనివర్శిటీలో బి. ఏ కి కట్టించి ట్యూషను పెట్టించింది. ఇక భర్త లేని ప్రభు అక్క మంగ ఎప్పుడు చూసినా హాల్లో టీవీకి అతుక్కుపోయి ఉండే తల్లికి, తండ్రికి అన్నీ అందిస్తూ చేదోడు వాదోడుగా ఉండి, ఇంటిల్లపాది పనీ చక్కబెట్టసాగింది. ఇంటి పన్లకీ, బయటి పన్లకీ నాగ అందరికీ సాయం చెయ్యసాగింది.

ఇంతద్దె, వెచ్చాలు, కరెంటు బిల్లు వంటి ఇంటి ఖర్చులు కాక ఇంత మందికీ అన్ని అవసరాలూ తీర్చగలిగే రెండు రెక్కలు ప్రభు, తను. నెల జీతం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసినంతసేపు ఉండడం లేదు. బాకీలు తీర్చడానికే సరిపోసాగేయి.

"మనకి జీతాలు ఎంత వస్తున్నాయో, ఎంత ఖర్చు అవుతూందో వంటి కష్టాలేవీ ఇంట్లో ఎవరికి తెలియనివ్వద్దు" అన్నాడు ప్రభు తన్మయితో.

తన్మయికి ప్రభుని చూస్తే ఒక్కొక్కసారి ఆశ్చర్యం వేస్తుంది. అసలు తనకి భవిష్యత్తు గురించిన భయం ఉన్నట్టే కనబడదు. సేవింగ్స్ అంటూ లేకుండా ఏ నెలకానెలే గడుస్తూన్నా ఖర్చుకి వెనకాడడు. ఇంటిల్లపాదినీ తీసుకునే సినిమాకైనా, షికారుకైనా వెళ్లాలి. తను కష్టాలు అనుభవిస్తూన్నా తన వాళ్లకి ఏ కష్టమూ తెలియనివ్వకూడదనుకునే మంచి కొడుకుని కన్నందుకు వాళ్లు ఎంతో అదృష్టం చేసుకున్నారు.

వీళ్లంతా వచ్చిన దగ్గిరనించి "తామిద్దరూ, తమ" అనే పదాలు ప్రభు మర్చిపోయేడు.

తన్మయి కూడా మర్చిపోవడానికి ప్రయత్నం చెయ్యసాగింది. కాలేజీ నుంచి వచ్చేటపుడు బస్టాండులో అమ్మే జామకాయలు, మొక్కజొన్నలు, మల్లెపూలు... ఏవైనా సరే ఇంట్లో అందరికీ తేవడం మొదలుపెట్టింది. వస్తూనే పాపనెత్తుకుని కిందే కాస్సేపు కూర్చుని, వాళ్లిచ్చే టీ తాగి, వాళ్లతోబాటూ కాస్సేపు టీవీ చూసి ప్రభులాగే గడపసాగింది. ప్రభు ఆనందానికి అవధులు లేవు.

★★★

అంతా ప్రశాంతంగా గడుస్తున్న సమయంలో ఆ వారంలో గవర్నమెంటు జీవో 610 అమలులోకి వస్తుందన్న వార్త వచ్చింది. దాని ప్రకారం ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి తెలంగాణా ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులు తిరిగి ఆంధ్ర ప్రాంతానికి వెళ్లిపోవాలనేది సారాంశం. కాలేజీలో ఆ రోజంతా ఇదే చర్చనీయాంశమయ్యింది.

"అయితే ప్రాంతీయ నియామక స్థానంలో అర్హులైన స్థానికులని కాదని స్థానికేతరులకు అవకాశం ఇచ్చి ఉంటేనే జీవో వర్తిస్తుందని, లేకపోయినా స్వచ్ఛందంగా వెనక్కి వెళ్లాలనుకునే వారికి ఖాళీలను బట్టి వారి జిల్లాల్లో కోరుకున్న చోట నియామకం ఇస్తామనీ అంటున్నారు" అన్నాడు సిద్ధార్థ.

"అంటే నేను మా జిల్లాలో ఖాళీ చూసుకుని వెళ్లిపోవలసిందేనా" అంది దిగులుగా తన్మయి.

"ఎందుకైనా మంచిది మీ నియామకం కాగితాలు ఒకసారి మళ్లీ చూడండి. మీ నియామకం వల్ల మరెవరి ఉద్యోగమూ మీకు ఇవ్వబడలేదన్న స్పష్టత ఉంటే బహుశా: మీరు ఇక్కడే ఉండొచ్చు. మా మిసెస్ కు హైదరాబాదు సెక్రటేరియట్ లో ఉద్యోగం రావడం వల్ల నేను జోనల్ ట్రాన్స్ ఫర్ చేయించుకుని వచ్చాను. నిజానికి ఈ జీవో ప్రకారం వెనక్కి వెళ్లిపోవాల్సి వస్తే మొదట నేనే వెళ్లాల్సి ఉండొచ్చు" అన్నాడు.

"అయ్యో, అదెలా" అంది తన్మయి.

"ఎలా ఏం ఉంది చెప్పండి, మళ్లీ మామూలే. మా జిల్లాలోనే ఉద్యోగం చేసుకోవడమే. ఇందువల్ల ఆమే, నేనూ అటూ ఇటూ తిరగాల్సి రావొచ్చు. గుడ్డిలో మెల్ల ఏవిటంటే ఇంకా మాకు పిల్లలు లేరు" అని చిర్నవ్వు నవ్వేడు వాతావరణాన్ని తేలిక చేస్తూ.

అప్పటికే ఎకనామిక్సు మేడం దు:ఖపడ్తూ బయటికి వెళ్లడం గమనించింది తన్మయి.

తన నియామకం ప్రకారం వెళ్లాల్సి వస్తే ఈ పిల్లలతో తనెక్కడికి వెళ్లాలి? పుట్టిన ఊరుకి దగ్గర్లో ఉన్న కాలేజీలో జాయినయ్యి, తల్లి దగ్గిరే ఉండి రోజూ వెళ్లి వద్దామంటే కుదిరేటట్టు లేదు. అసలే వచ్చే ముందు బాబుని చూసుకోవడమే భారమన్నట్టు మాట్లాడింది తల్లి. బాబుని చూడడమే కష్టమైతే, చంటిపాపని చూసుకోవడం అసాధ్యం. అయినా నాగ ఉంది కాబట్టి ఒప్పుకుంటుందేమో. అప్పుడేదో విసుగులో అలా అని ఉంటుంది. మరోసారి అడిగి చూస్తే పోయేదేం ఉంది? ఒకవేళ తనకి తమ ఊరికి దగ్గర్లో కాలేజీ దొరకక పోతే తన తర్వాతి ఆప్షన్ విశాఖపట్నమే. కానీ తల్లి తన కూడా వస్తేనే తప్ప తనొక్కతీ పిల్లలతో సతమతమవ్వడం కోరి కష్టాలు తెచ్చుకోవడమే. నిజానికి విశాఖపట్నంలో ఉండడం వల్ల తన పీ.ఎచ్.డీ ఒక కొలిక్కి వస్తుంది కూడా. తన చిరకాల కోరిక నెరవేరుతుంది. ఇక ప్రభుకి హైటెక్ సిటీలో ఉద్యోగం కావడం వల్ల తనైతే ఎట్టి పరిస్థితుల్లోనూ తన కూడా ఎక్కడికీ రాడు. తమ ఇద్దరి పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ప్రభు ఇక్కడా, తనెక్కడో. ఇద్దరూ వారానికో, రెండు వారాలకో కలుసుకోవాలి. ఏ ముహూర్తాన తాము పెళ్లి చేసుకున్నారో గానీ పట్టుమని పదిరోజులు హాయిగా కలిసి ఉండే అవకాశం రావడం లేదు. ఇక రెండు చోట్లలో రెండు సంసారాలు, రాకపోకలంటే ఉన్న జీతాలతో ఎలా నెట్టుకురావాలో కూడా లెక్క వేసుకోవాలి.

తన్మయి తనలో తనే సుదీర్ఘమైన ఆలోచనల్లో మునిగిపోయింది. అన్నిటినీ మించి ప్రభుని వదిలి ఉండడానికి బాగా బెంగ వేసి దు:ఖం రాసాగింది.

ప్రభు ఆలనాపాలనలతోనే ముందు తన జీవితంలో అనుభవించిన కష్టాలన్నీ సులభంగా మరిచిపోగలిగింది. అతని తల్లిదండ్రుల ద్వారా మానసిక వేదన కలుగుతూన్నా తట్టుకోగలిగే శక్తిని తమ మధ్య ప్రేమే ఇస్తూంది. ప్రభుతో జీవనం ప్రారంభించినప్పటి నుండి ఏ ప్రపంచం ఎటు తిరగబడినా ప్రభు తనతో ఉంటే చాలునన్న బేలతనం తనని ఆవరించడానికి ఎంతో సమయం పట్టలేదు తనకి. అతనిమీద ఒక్కోసారి ఎంత కోపం వచ్చినా లాలనగా అతని గొంతులోంచి పిలుపు వినబడేసరికి ఆ కోపమంతా ఇట్టే కరిగిపోతుంది. అతనెప్పుడు వచ్చి తల నిమురుతాడా అని ఆశగా ఎదురు చూస్తుంది. అంతటి ప్రేమ పొందగలగడం తన అదృష్టం అనే అనిపిస్తుంది. బస్సు దిగి నడుస్తూ కళ్లు తుడుచుకుంది. జీవితం ఎంత విచిత్రమైందో కదా!

నిన్నా మొన్నటి వరకు బాబు విషయంలో ప్రభు తల్లీతండ్రీ గొడవ భరించలేక తనే విడిగా వెళ్లిపోవాలనుకుంది. ఇప్పుడు అదే అవకాశం తనకి రాబోతూంటే బాధపడ్తూంది. షరా మామూలుగా అజ్ఞాత మిత్రుడినే వేడుకుంది. తన మొర ఆలకిస్తున్నట్టు ఆకాశంలోంచి మొదటి చినుకొచ్చి సరిగ్గా తన్మయి తల మీద పడింది. స్టాండులోని బండి తీస్తుండగానే కుండ పోతగా వాన మొదలయ్యింది. వర్షాకాలపు తొలి వానే ఇంత ఉధృతంగా కురవడం గొప్ప ఆహ్లాదంగా అనిపించడంతో ఎక్కడా ఆగకుండా రాసాగింది. సరిగ్గా జంక్షనులో నుంచి దాటి చిన్న రోడ్డు మలుపు తిరిగిందో లేదో వెనకే కీచుమన్న బ్రేకుల చప్పుడు, బస్సు ఢీకొట్టి ఏదో బండి పల్టీలు కొట్టిన శబ్దం వినిపించింది తన్మయికి.

ఒక్క నిమిషం మెదడు మొద్దుబారిపోయింది తన్మయికి. తనకి ప్రమాదం తృటిలో తప్పింది. పాపం తన వెనకే వస్తున్న ఎవరికో ప్రమాదం జరిగింది. బండి పక్కకు తీసి స్టాండు వేసి గభాలున చుట్టూ ఒకరిద్దరితో బాటూ అటు పరిగెత్తింది. బస్సు ఢీ కొట్టిన వ్యక్తి మరో పక్కకి పడడంతో అదృష్టం కొద్దీ పెద్ద గాయాలేవీ తగలకుండానే బయటపడ్డాడు, కానీ బండి మాత్రం చక్రాల కిందికి వెళ్లి పనికిరాకుండా అయిపోయినట్లుంది.

ఇంటికొచ్చినా వణుకు తగ్గలేదు తన్మయికి. ఆ స్థానంలో తనని ఊహించుకోవడానికే భయం వేసింది.

"అమ్మో తనకేమైనా అయితే తన పిల్లలు..." అనే ఆలోచనే భయంకరమై బెదురు పట్టుకుంది.

ప్రభు ఇంటికి వచ్చేంత వరకూ ఫోను మీద ఫోను చేస్తూనే ఉంది. జాగ్రత్తగా మెల్లగా రమ్మని పదే పదే చెప్పింది. ప్రభు మేడమీదికి రాగానే గబుక్కున అల్లుకుని చిన్నపిల్లలా రోదించసాగింది.

"నీకెప్పుడూ ఏవీ కాదు. అంతలోకే ఇలా భయపడితే ఎలారా" అని తలా నిమరసాగేడు ప్రభు.

రాత్రంతా కరెంటుపోయి ఉరుములూ, మెరుపులతో వర్షం కురుస్తూనే ఉంది.

తెల్లారగట్ల మెలకువ వచ్చి ప్రభుని, పాపని మార్చి మార్చి చూస్తూ "మన బంగారం నాన్నని వదిలి మనం ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లొద్దురా పాపాయీ" అని పాప చెవిలో గొణిగింది.

★★★

మరో నెల రోజులు గడిచిపోయినా 610 జీవో కి సంబంధించి నోటీసులేవీ రానందున అంతా ఊపిరి పీల్చుకున్నారు.

స్వచ్ఛందంగా వెళ్లాలనుకునే వారు మాత్రం అప్లికేషన్లు పెట్టుకున్నారు.

రోజూ పొద్దున్న లేస్తే సాయంత్రం వరకూ ఎలా గడుస్తుందో తెలియని ఉరుకుల పరుగుల జీవితమయ్యింది తన్మయికి. కాలేజీలో ఉన్నంతసేపూ కాలేజీ పిల్లలే లోక మైనా, ఇంటికి రాగానే తన పిల్లలే జీవితంగా గడపసాగింది. అడపా దడపా ప్రభు తల్లిదండ్రుల అసంతృప్తి ఏదో విధంగా బయట పడ్తూ ఉన్నా ప్రభు తన జీతం మొత్తం వాళ్ల చేతుల్లో పెడ్తూ ఉండడం వల్ల ఎక్కడికక్కడ సమాధానపడ్తున్నట్టే కనబడసాగేరు.
కానీ పాప పట్ల ప్రభు తరఫు వాళ్లంతా కురిపిస్తున్న ప్రేమ మాట అటుంచితే, బాబు పట్ల అంతా చూపించే వివక్ష స్పష్టం కాసాగింది రోజురోజుకీ.

అంత మంది మధ్యా తన చిన్ని ప్రాణానికి తల్లే లోకంగా పెరుగుతున్న బాబు అందరిలో ఒంటరిగా పెరుగుతున్నట్టే అనిపించసాగింది తన్మయికి.

వాడు కూడా ఎక్కడా బయట పడకుండా లోపల్లోపల మధనపడుతున్నాడని అనిపించినా ఏమీ చేయలేక చూసీ చూడనట్లు మౌనం వహించసాగింది. పాపాయి మొదటిపుట్టినరోజు నాడు అదంతా స్పష్టం అయ్యింది. ఇంటి బయట అంతా లైటింగ్ సెట్లు పెట్టించి, కాలనీలోని వాళ్లందర్నీ పిలిచి పెద్ద ఎత్తున చెయ్యాలన్న బేబమ్మ ప్రతిపాదనకి ప్రభు ఆమోదం తోడవ్వడంతో అంతా ఉత్సాహంగా పనులు చెయ్యసాగేరు. ఇంటి పట్టునే ఉండడంతో కాలనీ వాళ్ళందరికీ బేబమ్మ, మంగ, రాణి పరిచయస్తులయ్యి, మంచి స్నేహితులయ్యినట్టు మొదటిసారి గమనించింది తన్మయి.

అంతా కొత్త బట్టలు వేసుకుని, బ్యూటీ పార్లర్లకి వెళ్లి మరీ తయారయ్యి వచ్చేరు.

మొదటిరోజు పీచుముడి వేసుకుని , ముతక చీర కట్టుకుని వచ్చిన బేబమ్మకి, ఇప్పటి బేబమ్మకి పోలికే లేదు.

కొత్తగా వస్తున్న చిప్పు కుట్టిన షిఫాను చీర కట్టుకుని, జుట్టు భుజాల వరకు కత్తిరించుకుని ఇరవయ్యేళ్ళ చిన్నదానిలా తయారయ్యింది.

ఆ మాటకొస్తే ఆవిడ కూతురైన మంగే వయసుకి తగ్గట్టు గా అంచు జరీ చీరొకటి కట్టుకుంది. ఇక రాణి, దాసు, బుజ్జిలకి అదో పెద్ద పండగే అయ్యింది.

వీళ్లంతా ఇంత ప్లాన్డ్ గా ప్రిపేర్ అయ్యారన్న సంగతి తన్మయికి ఆ రోజు మధ్యాహ్నం వరకూ తెలియలేదు.

లక్కీగా చంటిదానితో పాటూ బాబుకీ కొత్తబట్టలు కొంది కాబట్టి సరిపోయింది. లేకపోతే వాడు వీళ్లందరినీ చూసి తనకి కొనలేదని బాధపడేవాడు అనుకుంది తన్మయి.

తన్మయి, ప్రభు తమ పెళ్లి బట్టలు వేసుకున్నారు.

ప్రభు ఈ మధ్యే కొన్న కొత్త కెమెరాతో ఇంటిల్లపాదికీ ఫోటోలు తియ్యడంలో నిమగ్నమయ్యేడు.

నిమిషానికోసారి ఏదో పనున్నట్టు బేబమ్మ బాబుని పక్కకి పిలిచి వచ్చిన వాళ్లకి కూల్ డ్రింకులు, ప్లేట్లు అందించే పన్లు అప్పగించసాగింది. రాణి, దాసుతో సహా అంతా వచ్చిన కాలనీ బాటూ వాళ్లతో కుర్చీలలో కూర్చున్నారు. నాగతో బాటూ బాబొక్కడే ఆ పన్లన్నీ చేస్తుండడం లేటుగా గమనించింది తన్మయి.

పొద్దుట్నించీ బాబు ఎక్కడ ఏది ముట్టుకోబోయినా ప్రభు తల్లీతండ్రీ "అది పాడుచెయ్యొద్దు , ఇది పాడుచెయ్యొద్దు" అని మందలించి ఇప్పుడు పనులన్నీ వీడితో చేయించడం చూసి మనసు చివుక్కుమంది తన్మయికి.

పోనీ ఇంట్లో అంతా తలోటీ అందిస్తూ బాబుకి కూడా చిన్నపనేదో చెప్తే అది వేరే సంగతి.

కేకు కత్తిరించే సమయానికి బాబుని అవన్నీ పక్కకి పెట్టి రమ్మని తీసుకొచ్చి పాప దగ్గిరే కూచోబెట్టింది తన్మయి.

వచ్చిన వాళ్ళతో మాట్లాడుతూ బిజీగా ఉన్నా "నాన్నా , ఏమైనా తిన్నావా" అంటూ మధ్య మధ్య బాబు గురించి పట్టించుకుంటూ ఉంది.

అయినా వాడిపోయిన వాడి ముఖాన్ని చూసి ఏమైందమ్మా అంది అంతా వెళ్లిపోయేక.

"అమ్మా! నన్ను వెళ్ళిపోమంటున్నారు" అన్నాడు దుఃఖం నిండిన కళ్లతో.

తన్మయికి చివాలున రక్తం కళ్ళలోకి వచ్చినంత కోపం వచ్చింది.

"ఎవరమ్మా?" అంది వాణ్ణి గుండెలకు హత్తుకుంటూ.

"కింద... " అంటూ చూపించి "పోరా మీ నాన్న దగ్గిరికి పో.. నీ వల్ల నా కొడుక్కి , మాకు మనశ్శాంతి లేదు" అన్నారమ్మా అన్నాడు.

చటుక్కున పిల్లాడి రెక్క పుచ్చుకుని కిందికి తీసుకొచ్చింది తన్మయి.

"ఎవరు పిల్లాణ్ణి వెళ్లిపొమ్మని అంటున్నది" అని ఒక్క అరుపు అరిచింది.

అంతా టీవీ ముందు కూచుని సీరియల్లో నిమగ్నమై పోయి ఉన్నవాళ్లు కాస్తా ఒక్క ఉదుటున ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్ళిపోయేరు. ప్రభు, అతని తల్లి తండ్రీ మాత్రం మిగిలేరు. తన్మయి బాబుని పాప దగ్గిరికి పైకి తీసుకెళ్లమని నాగకి అప్పగించి అలాగే ఉరిమి చూసింది.

"నేనే... ఏంటంట" అన్నాడు ప్రభు తండ్రి గారపళ్లు కొరుకుతూ.

"మీకు ఆఖరుసారి చెప్తున్నాను, మరోసారి పిల్లాడితో ఇలాంటి మాటలు మాట్లాడితే ఒప్పుకునేది లేదు" అని విసవిసా పైకి వచ్చేసింది తన్మయి.

అక్కడే మౌనంగా కూచున్న ప్రభు మీద ఇద్దరూ అరవడం వినిపిస్తూనే ఉంది.

"నా మనవరాలితో సమానంగా కూకోనాకి ఈ పిల్లోడు ఎవడూ అంట"

"ఏం ఇంట్లో సిన్న పని సేస్తే అరిగిపోతాడా ఆడు? నీ పెళ్ళాం ఆణ్ని మద్దిలో లాక్కెల్లి పోతాదా?"

"వొచ్చినోల్లందరికీ ఆడు మా మనవడు కాదని సెప్పుకోలేక సచ్చేం."

"ఈ వొయసులో మాకీ బాదలేటీ అంట"

"......................................................"

ప్రభు యథావిధిగా అక్కడంతా మారు మాట్లాడకుండా ఉండి మేడ పైకి రాగానే "నీకెన్ని సార్లు చెప్పాలి మా వాళ్ళ మీద నువ్వు అరవకూడదని" అన్నాడు గట్టిగా కింది వాళ్లకు వినబడేటట్లు.

తన్మయి రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టి హాల్లో ఒక్కడే నిద్రపోతున్న బాబు దగ్గిరికి వెళ్లి పడుకుంది.

వెనకే తలుపు మూసుకున్నాడు ప్రభు.

తన్మయి వెచ్చని కన్నీటితో బాబు తల తడవసాగింది.

ఆదమరిచి నిద్రపోతున్న వాడి తల నిమురుతూ "నన్ను క్షమించు నాన్నా! నీకు ఇంతకంటే గొప్ప జీవితాన్ని ఇవ్వలేని ఈ తల్లిని క్షమించు" అంది.

★★★

ఆ మర్నాడు తన్మయి కాలేజీలో ఉండగా జ్యోతి నుంచి ఫోను వచ్చింది.

"పాపాయి పుట్టినరోజుకి పిలవలేదని బాధపడి ఉంటుందా?" అని ఆలోచిస్తూ స్టాఫు రూము లోంచి బయటికొచ్చింది తన్మయి.

అయినా తనకే మర్యాదలేని ఆ ఇంటికి తల్లిని పిలవడం అంత తప్పుపని ఇంకొకటి లేదు. అదే చెపుదామని నిర్ణయించుకుంది.

అట్నించి జ్యోతి "తన్మయీ!" అని గట్టిగా అంది.

ఆ గొంతులో గాభరాని ఇట్టే పసిగట్టింది తన్మయి.

"ఏవిటమ్మా ఏమయ్యింది? నీకు ఆరోగ్యం బానే ఉందా?" అంది కంగారుగా ఇట్నించి.

"నా ఆరోగ్యం బాగా ఎలా ఉంటాదమ్మా ఈ ముదనష్టపు మూక పాలబడ్డాక" అంది ఏడుపు గొంతుతో జ్యోతి.

పక్క నుంచి దేవి గట్టిగా "ఏమ్మా, నీ కూతురు మళ్లీ పెళ్లి చేసుకుని పిల్లా పాపల్తో సంతోషంగా కులుకుతా ఉంటే, మేం మా మనవణ్ణి ఎక్కడికెళ్లి చూసుకోవాలీ అంట, మా మనవణ్ణి మాకు ఇచ్చెయ్యమను......" అని అరవసాగింది.

"ఇదిగో తల్లీ, ఈవిడికి నువ్వే సమాధానం చెప్పు. మీరందరూ కలిసి నన్ను ఎప్పటికీ ప్రశాంతంగా బతకనివ్వరన్న మాట" అని తన్మయితో ఈసడింపుగా అంది జ్యోతి.

తన్మయికి అరికాలి నుంచి కోపం తలకెక్కింది.

"అమ్మా, ఆవిడ అసలెందుకొచ్చింది? నువ్వెందుకు రానిచ్చేవు? అయినా ఆవిడకి దేనికీ సమాధానాలు చెప్పాల్సిన అవసరం నాకు లేదని, బాబుని ఇవ్వడం ఎట్టి పరిస్థితుల్లోనూ కుదరదని చెప్పు" అంతే విసురుగా అంది తన్మయి.

"ఆహా... అలాగైతే ఎల్లి ఆళ్లింటి కాణ్ణే తేల్చుకుంటాం. పిల్లోణ్ణి ఎప్పుడంటే అప్పుడెల్లి చూసుకునే హక్కు మాకు ఉంటాది" అని అవతలి నించి రంకెలు వెయ్యసాగింది దేవి.

జ్యోతి గట్టిగా "అమ్మా తల్లీ! నీ కొడుకుని తీసుకెళ్లి ఏ హాస్టల్లోనో అంట వెయ్యి. ఈవిడగారి కొడుక్కి అప్పుడప్పుడూ కొడుకు మీద ప్రేమ ఒచ్చి పడతా ఉంటది. నెలకి పంపాల్సిన ముష్టి మూడొందలు కూడా ఏనాడో మానేసేడు గానీ, సిగ్గులేని బతుక్కి పిల్లోడు కావలసి వచ్చేడు" అని అంటిచ్చింది.

దేవి పక్కనే శేఖర్ ఉన్నాడన్న సంగతి అప్పుడు అర్థమయ్యింది తన్మయికి.

హఠాత్తుగా తలపోటు వచ్చెయ్యసాగింది.

మరో పక్క దు:ఖమూ, బాధా, ఉక్రోషమూ కలగాపులగంగా ముంచెత్తసాగేయి.

దేవి అన్నంత పనీ చేసి వాళ్లు ఇంట్లో ప్రత్యక్షం అయ్యేరంటే ఇంక ఇంట్లో జరిగే గొడవ ఊహించుకోవడం కూడా ఇష్టం లేదు తన్మయికి.

పోనీ ప్రభుతో చెప్దామంటే, తను మొదటే చెప్పేడు ఇలాంటివేవీ తనకి చెప్పొద్దని. పైగా బాబు విషయాలంటే అసలేవీ పట్టవు ప్రభుకి. కానీ ఇంట్లో గొడవ జరిగితే మాత్రం తిరిగి తనమీదే గందరగోళం చేస్తాడు.

తన్మయికి ఎందుకో సిద్దార్థకి కూడా ఏవీ చెప్పాలని అనిపించడం లేదు. అస్తమాటూ తన కష్టాలని అతనికి చెప్పి ఆతనినీ బాధ పెట్టడం బాగా అనిపించడం లేదు.

ఎవరికీ చెప్పుకోలేని ఈ సమస్యని దాటడం ఎలా?

ఎన్నో కష్టాలు అనుభవిస్తూన్నా తను, తన పిల్లలు కలిసి ఒక్క చోట ఉన్నామన్న ఆనందంతోనే జీవితం ఈ మాత్రమైనా ఆనందంగా గడుస్తూ ఉంది. ఇప్పుడు మళ్ళీ ఇదొక సమస్య లేవనెత్తుతున్నారు శేఖర్, అతని తల్లి కలిసి. తనని ఇన్ని కష్టాలు పెట్టేటంత తప్పు తనేం చేసింది?

ఫోను పెట్టేసేక కూడా గుండె పట్టేసినట్లు బాధ కలగసాగింది తన్మయికి.

66

మధ్యాహ్నానికి సెలవు చీటీ ఇచ్చి కాలేజీలోంచి బయటికొచ్చింది. ఎటు చూసినా సమస్యల సుడిగుండమైన ఇంటికి వెళ్లాలనిపించడం లేదు. బస్టాండు దాటిపోయి రోడ్డు పక్కనే నడుస్తూనే ఉంది. ఎండ బాగా మొహమ్మీద పడుతూండడంతో కొంగు తీసి తల మీద కప్పుకుంది. యూనివర్శిటీలో చంటిపిల్లాణ్ణి ఎత్తుకుని నడిచిన జ్ఞాపకాలు తరుముకొచ్చేయి.

అమ్మా, నాన్నా తనే అయ్యి ఎన్నో కష్టాలకోర్చి పెంచుకు వస్తూ ఉంది. అడుగడుగునా తనకీ కష్టాలేవిటో! ఇదంతా స్వయంకృతాపరాధమేనా? ఏదేమైనా తన జీవితమంత దుర్భరమైన జీవితం ఎక్కడా ఉండదు. కంటికి నీరలుముకుని రోడ్డు కనబడడం లేదు. పక్క నించి వెళ్తున్న షేర్ ఆటోల దుమ్ము రేగి ఒళ్లంతా పడసాగింది. కాళ్లు లాగసాగేయి. అయినా నడవసాగింది. ఎంత దూరం నడవగలదో తెలియదు. తన మీద తనకే విరక్తి, కసి పేరుకుపోసాగేయి. తన దుస్థితికి తనే కారణమనే ఆత్మ న్యూనతా భావం తినివేయసాగింది. ఇంతలో పక్కనే ఆగిన ఆటో లోంచి బిలబిలా నలుగురు కాలేజీ పిల్లలు దుమికి వచ్చేరు.

"మేడం ఇటేడికి నడిసి పోతున్రు?" అన్నాడు అందులో ఒక కుర్రాడు.

ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చి పడిన తన్మయి "ఏం లేదు, ఊరికే చుట్టూ చూసొద్దామని" అంది తడబాటుగా.

"అయితే మా ఊరు రాండ్రి మేడం, తోలుకపోతాం" అన్నారు ముక్త కంఠంతో.

మారు మాట్లాడకుండా వాళ్లతో బాటూ ఆటో ఎక్కింది తన్మయి. దాదాపు ఇరవై నిముషాల తర్వాత ప్రధాన రహదారి మీంచి డొంక రోడ్డు లోకి ప్రవేశించి పడి, లేచి వెళ్లసాగింది ఆటో. కిక్కిరిసిన జనంతో బాటూ ఇలా మారుమూల పల్లెటూరుకి వెళ్లడం మరోసారెప్పుడైనా అయితే చాలా ఆసక్తిదాయకంగా ఉండేది తన్మయికి. కానీ ఇప్పుడున్న మానసిక స్థితిలో అసలెక్కడికి వెళ్తూందో అర్థం కాకపోయినా ఇంటి నుంచి కాస్సేపైనా ఎక్కడికైనా దూరంగా వెళ్లిపోవాలన్న భావనొకటే మనసులో మెదులుతూ ఉంది.

అంతలోనే నవ్వొచ్చింది తన్మయికి. కానీ తన పిచ్చి గానీ ఎక్కడికి వెళ్తుంది? తన మీదే ఆధారపడి ఉన్న ఇద్దరు పసికూనల్ని వొదిలి? సాయంత్రమైతే తన కోసమే గేటు పుచ్చుకుని వేళ్లాడే బాబు, తల్లి ఎప్పుడొచ్చి ఒళ్లోకి తీసుకుంటుందా అని ఆత్రంగా దుమికే పసిపాప. ఇప్పుడు ఇంటికి వెళ్లినా చంటిది ఉయ్యాలలో నిద్రపోతూ ఉంటుంది. బాబు స్కూల్లో ఉంటాడు. ప్రభు ఏ రాత్రికోగానీ ఇంటికి రాడు. అందుకే కనీసం సాయంత్రం వరకైనా ఇంటికి వెళ్లాలని లేదు. కాలేజీలో ఉండాలని అస్సలు అనిపించలేదు. ఇక పెందరాళే ఇంటికెళ్లి తననీ, తన కొడుకునీ ద్వేషించే ఆ మనుషుల మొహాలు చూడడం అంతకంటే ఇష్టం లేదు. ఎవరి సాహచర్యం భరించలేకపోతూందో వారితోనే కలిసి జీవించాల్సి రావడం ఎంత దుర్భరమైన విషయమో!

తను వాళ్లకి ఏం అన్యాయం చేసింది? వాళ్ళ కొడుకు తనని పెళ్లి చేసుకుంటే తనని, తన కొడుకుని ఏడిపించడం ధర్మమేనా? వాళ్లని దూరం పెట్టమంటే ప్రభు ఒప్పుకోడు. తనే దూరం వెళ్లిపోదామంటే ప్రభు పట్ల ప్రేమ వెనక్కి లాగుతూ ఉంది. పైగా చంటి పిల్లకి తండ్రిని దూరం చేసే హక్కు తనకి లేదనే మీమాంస. ప్రభు తల్లిదండ్రులకి  ప్రభుయే చెప్పాలి. అదెప్పటికి సాధ్యమవుతుందో, అసలు ప్రభు ఎప్పటికైనా చెప్పగలడో, లేడో! వాళ్లు తనని బాధ పెట్టడమే కాకుండా, బాబుని బాధిస్తున్నారన్నది తప్పనే ఆలోచన ప్రభుకి ఎందుకు లేదో కూడా అర్థం కావడం లేదు.  ఇవన్నీ సరిపోవన్నట్టు కొత్తగా ఇప్పుడు శేఖర్ తల్లి బెదిరింపు మనసుని రగిల్చేస్తూ ఉంది.

ఆటో పెద్ద గోతిలో పడి లేచింది. అందరూ ఒక్కసారి "ఓ" అని అరిచేరు. ఆలోచనల్లోంచి బయటికొచ్చి తల విదిలించింది తన్మయి.

లాయరు విశ్వ గారితో మాట్లాడాలి. అవును, అదే సరైనది. వెనక్కి వెళ్లగానే ఫోను చేసి విశ్వ సలహా తీసుకోవాలి. ఇక ఈ సమస్యల గురించి భయపడకూడదు. పరిష్కారం వెతకాలి. ఒక్కసారిగా కాస్త మనసు తేలికపడినట్లయ్యింది తన్మయికి.

తనని పిచ్చి ఆలోచనల్లోంచి మార్గం మళ్ళించి ఆటో ఎక్కించిన పిల్లల వైపు కృతజ్ఞతగా చూస్తూ "అవునూ, మీరేంటి కాలేజీ పూర్తవకుండా ఇంటికి వెళ్లిపోతున్నారు?" అంది.

"ఏం చేస్తం మేడం, స్కాలర్ షిప్పు పైసల కాడికని శాన్నాళ్లకి కాలేజీకి పోయినం. అటెండెన్సు లేనిదె పైసలు ఇచ్చేడిది లేదని ప్రిన్సిపలు మేడం ఎల్లగొట్టింది. ఆటో పైసలు గెట్లనో జమకూర్చి తెచ్చుకున్నం. మీరైనా జర చెప్పురి" అన్నారు ప్రాధేయపడ్తూ.

"ఊ... మరి కాలేజీలో స్కాలర్ షిప్పుకి కావలసిన కనీస అటెండెన్సు కూడా లేకుండా మీరేం చేస్తున్నారు?" అంది సాలోచనగా.

"ఫాక్టరీలో పనికి పోతం మేడం" అన్నారు ముక్త కంఠంతో.

"మిమ్మల్ని కాలేజీకొచ్చి చదువుకోమనే కదా గవర్నమంటు స్కాలర్ షిప్పు ఇచ్చేది. మీరు చదువులు ఎగ్గొట్టి, కేవలం స్కాలర్ షిప్పు కోసమే కాలేజీకి వొస్తే ఎలా?" అంది తన్మయి.

"మేం కాలేజీకి ఎప్పుడో ఓ తరి పోతున్నది కరక్టే మేడమూ, కానీ సదువు సదవకుంటే కదా. ఇగో మన యెంకటేసు ఉన్నాడు సూడండి. వీనికి అన్నీ ఫస్టు మార్కులే వొస్తయి మేడం. ఈయనే మా కందరికీ రాత్రి బడి కూడా సెప్తాడు. కావాలంటే మొన్న హాఫియర్లీ పరీక్షల్లో మా మార్కులు చూడుండ్రి."  అని కాయితాలు చూపెట్టేరు.

నిజమే, వీళ్లంతా బాగా చదువుతున్న పిల్లలే. తన్మయికి ఒక్కసారిగా యూనివర్శిటీలో ఉన్నపుడు అదే రకమైన తన పరిస్థితి జ్ఞాపకం వొచ్చింది. క్లాసులకి వెళ్లలేక, చెట్టు కింద బాబుని ఎత్తుకుని కూచుని, నోట్సులు రాసుకుంటూ, అనేక కష్టాలకోర్చి చదివి పట్టుదలగా మంచి మార్కులు తెచ్చుకున్న రోజులు జ్ఞాపకం వచ్చి కళ్లు చెమర్చాయి.  పిల్లలు గమనిస్తారేమోనని కొంగు కళ్లకి అడ్డం పెట్టుకుంటూ "అబ్బా, బాగా దుమ్ము పడుతూ ఉంది" అంది. ఆటోలో ఎదురుగా బల్ల మీద అప్పటిదాకా ఒక మూలకి ఒదిగి సిగ్గు పడ్తూ కూచున్న వెంకటేశు తనని ఆశ్చర్యంతో గమనించడం చూసింది తన్మయి.

వెంటనే తేరుకుని "ఊ... అయితే మీరంతా మంచి మార్కులే తెచ్చుకున్నారు" అంది తలాడిస్తూ.

మట్టిలో మాణిక్యాలంటే ఈ పిల్లలే.

ముఖ్యంగా అప్పుడప్పుడూ క్లాసులకి వొస్తున్నా తను స్వంతంగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవడమే కాకుండా, చుట్టూ ఉన్న పిల్లలకి కూడా సాయం చేస్తున్న వెంకటేశుపై అంతులేని వాత్సల్యం కలిగింది తన్మయికి.

ఆటో దిగేక "మేడం, మా ఇంటికి రండి అంటే మా ఇంటికి రండి" అంటూ పిల్లలంతా పిలిచేరు.

ముందుగా వెంకటేశు ఇంటి వైపు దారి తీసింది తన్మయి. దాదాపు కూలిపోబోతున్న మట్టి గోడల చిన్న ఒంటిగది పెంకుటిల్లు. వరండాలో పెళ్లలు ఊడిపోయిన గచ్చుమీద తల నెరిసిన ముసలామె చేటలో ఆకులు పేర్చుకుని బీడీలు చుట్టసాగింది.

"జేజెమ్మా, మా మేడము" అంటూ తన్మయి కూర్చుందుకు ముక్కాలి పీట ఒకటి తెచ్చి వేసి ఒక పక్కగా ఒదిగి నిల్చున్నాడు వెంకటేశు.

"గట్లనా, మంచిది బిడ్డా. కాల్లు కదుక్కో తిందువు" అంది మెల్లగా లేవబోతూ.

"అహహ, గిప్పుడొద్దులె తియ్యి, మేడముకు చాయ పట్టుకొస్త" అంటూ బయటకు పరుగెత్తేడు వెంకటేశు.

"ఇగో బిడ్డా, గీ పైసల్ తీసికెల్లు.. అంటూ చెంగు చివరన కట్టిన చిల్లర పైసలు తీసి ఇవ్వబోతూ అప్పటికే బయటికి పరుగెత్తిన వెంకటేశు వెళ్లిన వైపే చూసి నిట్టూరుస్తూ "ఏందో పరేషాన్ పిలగాదు. పొద్దుగాల చాయ తాగి పనికి పోయినదే. రోజల్ల తినకుంట ఇగో పొద్దుమీకి గిప్పుడు ఒక బుక్క తిని సదువుకి పోయి ఏ రాత్రో వచ్చి పంటడు. వీని కోసమే రెక్కలు ముక్కలు అయితన్నా గీ వయసుల గీ పని సేస్తండ. ఇంకెన్నాల్లు ఉంటది గీ సదువు మేడం? ఏమైన ఉద్దోగమొస్తదంటవ?" అంది ముసలామె.

తన్మయి ఏదో అనేలోగా "తల్లిదండ్రి లేని పిలగాదు మేడం. వీన్ని కని నా కూతురు గప్పుడే ఎల్లిపోయింది. వీడి నాయిన మల్లీ పెల్లి సేసుకుని ఇగ వీని మొకమే సూడలె. నేనెన్నాల్లుంటనో నాకే తెల్వది. నా సావు లోగా వీనికి ఒక తొవ్వ దొరికితె సాలని శివునికి రోజు మొక్కుతాండ. ఏమైతదో ఏమో" అని నిట్టూర్చింది.

తన్మయి మనసంతా బాధ కమ్ముకుంది. కష్టాలంటే ఇవేనేమో. తినడానికి మంచి తిండి, ఉండడానికి మంచి ఇల్లు కూడా లేని జీవితం, తల్లీతండ్రీ లేకుండా పెరుగుతున్న ఒంటరితనం.

వీటితో పోలిస్తే తన కష్టాలు ఏ పాటి? తనకి ఆర్థిక సమస్య లేదు, భవిష్యత్తు బాధ లేదు. మనుషులకూ కొదవలేదు. నిజానికి మనుషుల వల్లే బాధ.

అంతలోనే ముసలవ్వ మళ్లీ అందుకుని "మేడం! నువ్వు సిన్న పిల్లలెక్కనే కొదుతున్నావు. అయినా పెద్ద సదువు సదివినవు. నా బిడ్డని నీ సేతుల్లో పెడతండా. నాకేమైన గాని నువ్వే వీనిని కడుపునబెట్టుకోవాలె. గిప్పుడిప్పుడే పరిసయమయ్యి ఇదేమి ముసల్ది ఇట్ల అడుగుతన్నదని పరేషాన్ గాకు. నీ గురించి వాడు ఎప్పుడూ "మా మేడం, మా మేడం" అంటూ సెప్తడు. కాలేజీలో పిలగాండ్ల సదువుకి నువ్వు సాయం సేస్తవంట గదా! వీనిని గూడ దయసూదు నీ కాల్మొక్త" అంది దీనంగా.

తన్మయి పక్కనే ఉన్న పుస్తకాల మీద వెంకటేశు మార్కుల లిస్టు తీసి చూసింది. అన్నీ ఫస్టు మార్కులే. ఇంతలో వెంకటేశు చాయి గ్లాసుతో తిరిగొచ్చేడు. మొహమాటంగానే అందుకుని పూర్తిచేసి లేస్తూ వెంకటేశు దగ్గిరికి వెళ్లి చేతిలో అయిదు వందల కాగితం పెట్టింది.

తడబాటుగా అడ్డంగా తలాడిస్తూ "ఎందుకు మేడం" అన్నాడు.

"నీకు టెస్టుల్లో ఫస్టు మార్కులొచ్చినందుకు. ఇంతే కాదు. ఇక మీదట నీ చదువ్వు పూర్తయ్యేవరకూ అన్ని ఫీజులూ నేనే కడతాను. నువ్వు సియిాసీతో చదువుతున్నావు కాబట్టి, ఇంటర్మీడియేట్ కాగానే సిటీలో మేనేజ్మెంటులో బాచిలర్స్ చెయ్యి. అందుకు అయ్యే ఖర్చు కూడా నేను పెడతాను. నువ్వు చెయ్యాల్సిందల్లా ఇలాగే అన్ని పరీక్షల్లోనూ మంచి మార్కులు తెచ్చుకోవడం, మంచి ఉద్యోగంలో స్థిరపడడం. సరేనా?" అంది లేస్తూ.

చప్పున వంగి కాళ్లకు నమస్కరించాడు వెంకటేశు. ముసలవ్వ రెందు చేతులూ ఎత్తి నమస్కరించబోతే వద్దని వారించింది తన్మయి.

తిరిగి వస్తూంటే ఎంతో సంతృప్తిగా అనిపించింది తన్మయికి. తన సంపాదనకు సరైన అర్థం ఇప్పటికి ఏర్పడినట్లుగా అనిపిస్తూంది.

అయితే తనకు ఒక కొత్త బాధ్యత ఏర్పడింది. ఇకమీదట తన జీతంలో నుంచి నెలనెలా కొంత తీసి ఈ అబ్బాయి చదువు కోసం పక్కన పెట్టాలి.

"ఎలాగైనా ఈ పిల్లవాడికి మంచి జీవితాన్నివ్వాలి" దృఢంగా అనుకుంది.

తిరిగి ఆటో ఎక్కించడానికి పిల్లలంతా వచ్చేరు. తన్మయికి మనసంతా తేలికగా, ప్రశాంతంగా ఉంది ఇప్పుడు.

"తన జీవితంలో అడుగడుగునా తనకి ఎలాగూ కష్టాలే. కనీసం ఇతరుల జీవితాల్లోనైనా సంతోషాన్ని నింపగలిగితే!" అన్న ఆలోచనే అంతకు ముందున్న దు:ఖాన్ని, నిరాశని మటుమాయం చేసింది.

★★★

తిరిగి కాలేజీ దరిదాపుకి వచ్చే సరికి సెల్ ఫోనులో సిగ్నలు రావడంతో లాయరు విశ్వకు డయల్ చేసింది.

ఆఫీసు మూసేసే వేళ దగ్గర పడడంతో గబగబా అడగసాగింది తన్మయి.

సమాధానంగా "కంగారు పడకండి. నాకు గుర్తున్నంత వరకు బాబును మొత్తంగా మీ దగ్గరే ఉంచుకోవడానికి మీకు రాత పూర్వకంగా హక్కులు ఇచ్చేడతను. ఇక తండ్రిగా అతను ఎప్పుడైనా వచ్చి బాబుని చూసుకునే హక్కుని మాత్రం మీరు కాదనలేరు. చట్ట ప్రకారం తల్లిదండ్రులిద్దరికీ మైనరు పిల్లల మీద సమానమైన హక్కులు ఉంటాయి. అయితే మీ ప్రైవేటు జీవితానికి భంగం వాటిల్లజేసే హక్కు అతనికి లేదు. అలాంటిదేదైనా జరిగితే మీరు కంప్లైంటు ఫైలు చెయ్యవచ్చు. మిమ్మల్ని ఈ విషయకంగా ఇబ్బంది పెట్టడం చట్టరీత్యా నేరం. అది అతనికి తెలిసేలా ఒక నోటీసు పంపించుదాం." అన్నాడు.

తన్మయికి ఒక్కసారిగా గొప్ప రిలీఫ్ గా అనిపించింది. "థాంక్యూ విశ్వగారూ!" అంది.

"ఇక బాబుని చూడడానికి మీకు భంగం వాటిల్లకుండా అతను బయటెక్కడైనా కలవొచ్చు, ఏ ప్రదేశంలో, ఏ సమయంలో కలవాలి వంటి విషయాలమీద మీరిద్దరూ ఒక ఒప్పందానికి రావడమే మంచిది. సాధారణంగా ఇవన్నీ విడాకులు అయిన వెంటనే వచ్చే సమస్యలు. అతను ఇన్నాళ్లు పట్టించుకోకుండా ఇప్పుడు బాబుని చూడాలనుకోవడం హాస్యాస్పదం. అయినా ఎందుకైనా మంచిది. అతనితో లీగల్ గానే ప్రొసీడవుదాం. ఇక ఈ మధ్య అందరూ విదేశాలకు వెళ్తున్నారు. ఇటువంటి కేసుల్లో పిల్లలకు పాస్ పోర్టు వంటివి తీసుకోవాలన్నా అభ్యంతరాలు ఎదురయ్యే అవకాశం ఉన్నాయి. కాబట్టి అటువంటి అభ్యంతరాలు లేకుండా అఫిడవిట్ల మీద సంతకాలు తీసుకోవడం కూడా భవిష్యత్తులో ఉపయోగ కరం. ఏమంటారు?" అన్నాడు విశ్వ.

తన్మయి ఆశ్చర్య పోయింది. తన మనసు చదివినట్టే మాట్లాడుతున్నాడు విశ్వ. తనకి చిన్నతనం నించీ యూరప్ దేశాలు చూడాలన్నది ఎంతో ఇష్టం. రాబోయే రెండు, మూడేళ్లలో డబ్బులు కూడబెట్టి వెళ్లి రావాలని ప్రభుతో ఆ మధ్య అన్నది కూడా. పాసుపోర్టులకి అప్లై చెయ్యాలని అనుకుంటూ ఉంది. బాబుకి పాసుపోర్టు తీసుకోవాలన్నా, తమతో తీసుకెళ్లాలన్నా ఇలాంటి సమస్యలు ఉంటాయని అస్సలు అనుకోలేదు.

వెంటనే గొంతు సవరించుకుని "అలాగే విశ్వగారూ! వెంటనే నోటీసు, అఫిడవిట్లు సిద్ధం చేయించండి" అని కృతజ్ఞతాపూర్వకంగా అంటూ "ఒకవేళ అతను నిరాకరిస్తే.." అంది సంశయిస్తూ.

"అప్పుడు కోర్టుకి వెళ్లి అనుమతి సంపాదించుకోవచ్చు లెండి. లాయరు ఖర్చు మిగలాలంటే బుద్ధిగా సంతకం పెట్టడమే మంచిదని అతనికి తెలియకుండా ఉంటుందని అనుకోను." అన్నాడు.

ఫోను పెట్టేసేక తన్మయికి ఊరటగా అనిపించింది. అవతలి నుంచి సమస్యల్ని చట్టపరంగా పరిష్కరించుకునే అవకాశం ఉంది కనీసం.

కానీ ప్రభు తరఫు నించి సమస్యలకి కూడా పరిష్కారం ఉందో, లేదో కూడా అర్థం కావడం లేదు. తిరిగి ఇంటికి వస్తూ బస్సులో ఇదే విషయం తీవ్రంగా ఆలోచించసాగింది. మనసుని తీవ్రంగా కలిచి వేస్తున్న ఆలోచనల వల్ల ధారాపాతంగా చెమటలు కారసాగేయి. పైగా సీటు దొరకక బస్సు ఊసలు పట్టుకుని వేళ్లాడుతూ నిలబడ్డం ఒకటి. గంటసేపు ప్రయాణం రోజూ ఇంతే అయినా శరీరంలో ఓపిక అంతా అయిపోయినట్టు కాళ్లు పీకసాగేయి.

అంతలో బస్సు చివరి సీటు లోంచి ఎవరో చెయ్యి ఊపి "సీటు ఉంది రమ్మని" సైగ చెయ్యడం గమనించింది. పిలిచినాయనకి కృతజ్ఞతగా నమస్కరించి, కిటికీ పక్కగా ఒదిగి కూచుంది. అప్పటికే గొంతు పిడచకట్టుకుపోయినట్లు కావడంతో చేతికి తగిలించుకున్న వాటర్ బాటిల్ మూత తీసి నీళ్లు తాగి స్థిమితపడింది. పక్కనున్న ఆయన్ని ఎక్కడో చూసినట్టు పరిచయమైన ముఖంలా అనిపించింది.

"మిమ్మల్ని ఎక్కడో చూశానండీ. కానీ క్షమించండి గుర్తు రావడం లేదు" అంది.

67

"మీరు నాకు బాగనె గుర్తుకున్నరు మేడం. రెండేల్ల కిందట స్పాట్ వాల్యుయేషన్ ల మీ పక్క పొంటి బెంచిల ఉంటి. కాకుంటె ఇంగ్లీషు డిపార్టుమెంటు" అన్నాడు ఆయన.

"ఆ.. గుర్తొచ్చింది సార్. మీరు ఇప్పుడు ఎక్కడ పనిచేస్తున్నారు?" అంది తన్మయి.

"ఇప్పుడు ఏడ చేస్తలేదు మేడం. అయిదేండ్ల పర్మిషను మీద పీ.ఎచ్.డీ చెయ్యనీకి అమెరికకు పొయ్యుంటి. రెండు వారాల సెలవు పెట్టి హైద్రబాదు ఒచ్చి ఉంటి." అన్నాడు.

తన్మయికి ఆశ్చర్యంగా "ఇతర దేశాల్లో చదువుకుందుకు మనకు గవర్మంటు అయిదేళ్లు పర్మిషన్ ఇస్తుందాండీ" అంది.

"ఇస్తది మేడం. ఉద్యోగానికి పోతె కూడా ఇస్తది. ఐదేండ్ల లాంగ్ లీవుకి అప్లై చేసుకోవాలె. కానీ జరంత ఆలస్యమైతది. ముందుగాల కాలేజీల అడ్మిషను గానీ, జాబు గానీ కరారు చేసుకోవాలె. వెంబడె లీవు అప్లికేషను గవర్నమెంటుకు పంపాలె. అమెరికల జాయిను అయెటందుకు ఎట్లయిన మీకు ఆరు నెల్ల పైమీకి సమయముంచుకోవాలె. అందుట్ల మీరు పర్మిషన్ తెచ్చుకుంటిరంటె అయిపాయె" అన్నాడు.

తన్మయి శ్రద్ధగా వింటూండడం చూసి "మీరు ఇంగ్లీషుల మంచిగ మాట్లాడుదు నే జూసిన. మీరు గిట్ల కాలేజీల అడ్మిషను ట్రై చేయురి." అన్నాడు మళ్లీ.

తన్మయి చిరునవ్వు నవ్వి "లేదు సార్, మాకంత స్థోమత లేదు" అంది.

"ఆడికి పొయ్యేటందుకు, ఒక సంవత్సరం ఉండేటందుకు పైసల్ జమ చేసుకురి. కాంపస్ లల జాబు పార్ట్ టైము గిట్ల వచ్చిందంటె కతం పైసల్ ఫికర్ ఉండనె ఉండదు" అన్నాడు.

"అయినా కష్టమే సార్, ఇవన్నీ అయ్యేవి కావు నాకు. ఇక్కడ పీ.ఎచ్.డీ చేస్తున్నా" అంది.

"అయితె కెనడా, న్యూజిలాండ్ గిట్ల ఫామిలీ ఇమ్మిగ్రేషను ట్రై చేయురి. బాగ చదుకున్నవోళ్లకోసం ఆ దేశాలు చూస్త ఉంటయి. ఎట్లను మీరిక్కడనె పీ హెచ్ డీ చేస్తుంటిరి కదా, అది కాగనె అప్లికేషను పెడితిరంటె ఈజీ అయితది ప్రాసెస్. కాకుంటె మస్తు పైసల్ ఖర్చయితయ్యని ఇన్నా. హిమాయత్ నగర్ల ఏజన్సీ ఉన్నది ఒకపారి పొయ్యి కలువురి. మీకు ఎంతో భవిష్యత్తు ఉన్నది మేడం. అసుంటి చోట్ల మీరు, మీ ఫామిలి మంచిగ సెటిల్ గావచ్చు" అన్నాడాయన కిటికీ లోంచి బయటికి చూస్తూ. దాదాపు నలభయ్యేళ్లుంటాయేమో ఆయనకు. గొప్ప ఆశావహంగా మాట్లాడుతున్న ఆయనతో బస్సు దిగే వరకూ మాట్లాడుతూనే ఉంది. దిగే ముందు ఆయన రాసిచ్చిన ఫోను నంబరు, అడ్రసు కాగితాన్ని జాగ్రత్తగా పర్సులో పెట్టుకుంది.

ఏ నెలకానెలే ఖర్చులతో సతమతమవుతూ పదివేలు కూడా సేవింగ్సు లేని తమకు అవన్నీ సాధ్యమయ్యే పనులు కావని తెలిసినా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నందుకు చాలా సంతోషంగా అనిపించింది. ఎప్పటికైనా డబ్బులు కూడబెట్టి ఒక్క దేశమైనా చూసి రావాలన్నదే గొప్ప ఆకాంక్ష. అసలు మరో దేశం చూడడమే గొప్ప విషయం ఇక అక్కడే ఉండే అవకాశం వస్తే బహుశా: తన జీవితంలో ప్రస్తుతం ఉన్న సమస్యలన్నీ తీరిపోతాయనుకుంటా.

సమస్యల్లేని జీవితాన్ని ఊహించుకున్నందుకే మనస్సంతా తెలియని హాయిగా అనిపించింది తన్మయికి.

ఉదయపు బాధలన్నీ తీరిపోయినట్లు అనిపించింది ఇంటికి రాగానే. తలారా స్నానం చేసి గదిలో ఉన్న "Knowledge is strength – Weakness is death" పోస్టర్ దగ్గిర రెండు అగరొత్తులు వెలిగించి కళ్లు మూసుకుని నిలబడింది కాస్సేపు. పొద్దుటి నించీ ఉన్న అలసటంతా తీరి కొత్త ఉత్సాహం వచ్చినట్లయ్యింది. పెందరాళే పిల్లల్ని నిద్రపుచ్చింది.

ప్రభు రావడం ఆలస్యం అవుతుండడంతో కంప్యూటరు ముందు కూచుంది. బయట సన్నగా చినుకులు పడ్తున్న శబ్దం వినబడసాగింది.

ఈ మధ్యనే సెకండ్ హ్యాండ్ డెస్కు టాపు కంప్యూటరు ఒకటి ప్రభు తన స్నేహితుడి దగ్గిర నించి కొని తెచ్చేడు.

బీ ఎస్ ఎన్ ఎల్ ఫోను ద్వారా ఇంటర్నెట్టు కావల్సి వచ్చినపుడు మాత్రమే కనెక్టు చేసుకోవాలని, లేకపోతే బిల్లు బాగా ఎక్కువ అవుతుందని ప్రభు ముందే హెచ్చరించేడు.

సాధారణంగా ప్రభు ఇంటికి వస్తూనే కంప్యూటరు ముందు కూర్చుని అర్థరాత్రి వరకూ ఏదో పని చేస్తూనే ఉంటాడు.

తన్మయి కోసం ఒక గెస్టు లాగిన్ పెట్టి ఇచ్చేడు. తనంతట తను కంప్యూటరుని మొదటిసారి ఆన్ చేసింది తన్మయి.

ఏది నొక్కితే ఏమవుతుందో అని బెరుకుగా  అంతకు ముందు కొద్ది కొద్దిగా నేర్చుకున్న పరిజ్ఞానంతో ఇంటర్ నెట్టు ఎక్ష్ప్లోరర్ లో, యాహూ సెర్చిలో బస్సులో లెక్చరర్ చెప్పిన కాలేజీ సైటు ఓపెన్ తీసింది ముందుగా.

ఎంత వెతికినా తెలుగు భాషలో ఉన్నత విద్యా కోర్సులు ఎక్కడా కనబడలేదు. ఇక కెనడా, న్యూజిలాండ్ దేశాల చిత్రాలు చూసింది. అక్కడి సంస్కృతుల గురించి వివరాలు చదివింది.

సరిగ్గా ఒకేఒక్క గంటలో వెళితే బావుణ్ణన్న ఉత్సాహమంతా పోయి, మనస్సులో ఏదో తెలియని దిగులు మొదలయ్యింది. ఇప్పటి వరకూ ఉన్న జీవితాన్ని అమాంతం ఒదిలి కొత్త ప్రాంతంలోకి వెళ్లి స్థిరపడడమా?

కష్టపడి నిర్మించుకున్న జీవితాన్ని వదిలి మళ్లీ  ఎక్కడో పునః ప్రారంభించడమా?

ఆలోచిస్తూంటేనే నీరసం రాసాగింది.

అంతలోనే "ఆలూ లేదూ చూలూ లేదన్న" సామెత గుర్తుకు వచ్చి తన అర్థం పర్థం లేని ఆలోచనలకి తననే తిట్టు కుంటూ అలసటతో పాపాయి పక్కన జేరబడింది. అనుకోకుండానే నిద్రలోకి జారుకుంది. ప్రభు ఎప్పుడు వచ్చేడో తెలియదు. కరెంటు ఎప్పుడు పోయిందో కూడా తెలియదు

"తనూ! భోజనం చేద్దాం దా" అంటూ తట్టి లేపుతున్న ప్రభుని చూడగానే మెడని కౌగిలించుకుంది.

"ఏంట్రా, అంతా ఓకేనా" అన్నాడు నవ్వుతూ పక్కన కూచుంటూ.

మాట్లాడకుండా అలాగే అతని భుజమ్మీద తలాన్చి ఎంతో సేపు ఉండిపోయింది.

తన్మయి మౌనాన్ని మరోలా అర్థం చేసుకుంటూ-

"మీటుంగులో ఆలస్యమైపోయిందిరా. ఇలా బాధపడితే ఎలా చెప్పు. అయినా నీకొక సంతోషకరమైన వార్త చెప్పాలని త్వరత్వరగా డ్రైవ్ చేసుకొచ్చేను" అన్నాడు మెల్లిగా లేచి తల తుడుచుకుంటూ.

"ఏవిటన్నట్టు" చూసింది.

"నన్ను మా ఆఫీసు వాళ్లు నెల రోజుల కోసం బిజినెస్ ట్రిప్పు మీద అమెరికా పంపిస్తున్నారు. సోమవారం వీసా కోసం మద్రాసు వెళ్లి రావాలి నేను........" అంటూ చెప్పుకెళ్లిపోతున్న ప్రభు మాటలు నమ్మలేనట్లు సంభ్రమంగా చూసింది.

అంతలోనే దిగులు కమ్ముకొచ్చి కళ్లు తుడుచుకుంది. నిజానికి సాయంత్రమంతా తనేదైతే ఆలోచించిందో అదే ప్రభు చెప్తున్నా దుఃఖం ఆగడం లేదు.

బట్టలు మార్చుకుంటూ వెనక్కి తిరిగి చెప్పుకెళ్లిపోతున్నాడు ప్రభు

"........ఆఫీసు వాళ్లు నన్ను పంపుతానంటే వెంటనే ఒప్పుకున్నాను. ఎందుకంటే ఒక నెల జీతమంత డబ్బులు ఎక్స్ ట్రా వస్తాయి వెళ్తే. వింటున్నావా?" అంటున్న ప్రభుతో

"ఒకవేళ పిల్లలు, నేనూ వచ్చే వీలుంటే? ఒకవేళ నీకు అక్కడే ఉద్యోగం వస్తే" తనలో తను గొణుక్కుంటున్నట్టు మెల్లగా అంది ప్రభుతో.

"ఆగాగు, నేను వెళ్తున్నది చిన్న బిజినెస్ ట్రిప్పు మీద. వెళ్లి అక్కడే స్థిరపడాలన్న పెద్ద ఆశలు పెట్టేసుకోకు. ఇక నా ఒక్కడి కంటే కంపెనీయే అన్ని ఖర్చులూ భరిస్తుంది. కానీ అందరం వెళ్లడానికి ఇప్పుడు మన దగ్గిర డబ్బులెక్కడున్నాయి చెప్పు? ఇక నిజంగా అక్కడ నాకు జాబ్ ఆఫర్ వస్తే అప్పుడు ఆలోచిద్దాం. కనీసం మన ఆర్థిక కష్టాలు తీరే వరకైనా ఉండి వెనక్కి వచ్చేయ్యొచ్చేమో" అన్నాడు నవ్వుతూ.

ప్రభు మాటలు సగం అర్థమయీ కాకపోయినా ఒకటి మాత్రం అర్థమయ్యింది. "విదేశాలకు వెళ్లే అవకాశం వస్తే వదులుకోకూడదని."

భోజనాలు కాగానే ఎప్పటిలానే ప్రభు కిందే ఆగిపోయేడు.

అర్థరాత్రవుతున్నా రాని ప్రభుతో అతని తల్లితండ్రుల సంభాషణ ఎలా ఉంటుందో ఊహించగలదు తను.

"నెల రోజులకే..." అని ప్రభు పదే పదే చెప్పడం వినిపిస్తూనే ఉంది.

ముందు వైపు తలుపు దగ్గిరికి వేసేసి గదిలో వెనక వైపు వెన్నెల పడ్తున్న బాల్కనీ లో కుర్చీలో నిట్టూరుస్తూ జేరబడింది.

*"నా గది స్వప్నాలతో నిండిపోయింది*

*నా మది స్వగతాలతో కుంగిపోతోంది*

*ఇంక రావెందుకు ప్రభూ*

*శంకాకులమై ఈ రాత్రి సడలిపోతోంది" –తిలక్* గుర్తొచ్చాడు.

ప్రభు ఒక్కడే వెళ్ళబోతూ ఉన్నా ఏదో ఒక కొత్త తొలిమెట్టు ఎక్కబోతున్న ఆనందం ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, మరో పక్క ప్రభు లేకుండా ఈ ఇంట్లో ఎలా గడపాలో అన్న బెంగ చుట్టుముట్టసాగింది.

★★★

ప్రభు వెళ్లి వచ్చేంత వరకూ తల్లితండ్రుల బ్యాంకు అకౌంట్లలో తగిన ఏర్పాట్లు చేసే వెళ్లేడు.

అయినా తన్మయి కాలేజీ నుంచి వచ్చేటపుడు రోజూ కాయగూరలు, మొక్కజొన్నలు, ద్రాక్షపళ్లు, కమలాఫలాల వంటివేవైనా కొనుక్కొచ్చి అందరికీ ఇవ్వసాగింది.

బాబుతో పాటూ, రాణి కూతురు బుజ్జికీ యథావిధిగా చదువు చెప్పసాగింది.

తన చిరకాల లక్ష్యమైన పీ హెచ్ డీ మీదే పూర్తిగా దృష్టంతా కేంద్రీకరించి థీసిస్ రఫ్ కాపీ తయారు చెయ్య సాగింది.

ప్రభు రాగానే యూనివర్సిటీకి వెళ్లి రావాలి.

ప్రభు గురించిన బెంగ చుట్టుముట్టకుండా అహర్నిశలూ థీసిస్ పనిలో మునిగి తేలసాగింది తన్మయి.

కానీ ఎంతకాదనుకున్నా నిద్రపోయే ముందు మహా దిగులు కమ్ముకొచ్చేది.

ప్రభు ఈ–మెయిల్ చెయ్యడం ఎలాగో నేర్పించినా తెలుగుని ఇంగ్లీషులో టైపు చెయ్యడం నచ్చదు తన్మయికి.

ఇక ఇంగ్లీషులో రాయడం అంతకంటే కృతకంగా ఉండడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది.

రోజూ నిద్రొచ్చే వరకూ ప్రభుకి ఒక ఉత్తరం రాసి కంప్యూటరు బల్ల సొరుగులో భద్రంగా దాచిపెట్టసాగింది.

కాస్త ఖాళీ దొరికితే చాలు పెళ్ళికి ముందు సంవత్సర కాలం పాటు తామిద్దరూ రాసుకున్న ఉత్తరాలు తీసి చదువుకోవడం, అతని లాలన గుర్తుకు తెచ్చుకోవడంతో ప్రభు మీద బెంగ మరింత పెరగసాగింది.

అక్కడి నించి ఫోను కాల్ బాగా ఖరీదవుతుందని వెళ్ళగానే మాత్రమే చేసేడు.

కాలేజీకి వెళ్లి రావడం, పిల్లల్ని చూసుకోవడం, పీ హెచ్ డీ పనులతో నెలరోజులు క్షణం తీరిక లేకుండా గడిచిపోయేయి. తను లేనప్పుడంతా ఇంట్లో తన్మయికీ, తల్లిదండ్రులకూ ఎటువంటి గొడవలూ లేకపోవడం బాగా సంతోషాన్నిచ్చినట్లుంది ప్రభుకి.

అక్కడి నించి బయలుదేరే ముందు ల్యాండ్ ఫోను చేసి సంతోషంగా మాట్లాడేడు.

★★★

కిందన ప్రభు వచ్చిన అలికిడి వినబడగానే తన్మయి కిందికి పరుగెత్తుకు వచ్చింది.

ప్రభుని చూడగానే అమాంతం కౌగిలించుకోవాలన్న ఆకాంక్షని బలవంతంగా ఆపుకుంది.

తన్మయి వైపు చూస్తూ పలకరింపుగా చిన్న నవ్వు నవ్వి చూపు తిప్పుకున్నాడు ప్రభు.

కానీ అతని కళ్ళల్లో గొప్ప ప్రేమ తొణికిసలాడింది తన్మయికి.

రాగానే కనీసం రిఫ్రెష్ అవకుండా సూట్ కేసులు తెరిచి తెచ్చిన బొమ్మలు, చాక్లెట్లు, గిఫ్ట్ లు తలా ఒకటీ ఇవ్వసాగేడు ప్రభు.

ఒక పక్కగా నిల్చుని చూస్తున్న బాబుని దగ్గిరికి పిలిచి టోపీ ఒకటి నెత్తిమీద పెడుతూ, చేతిలో చాక్లెట్టు పెడుతూ "ఇవి నీకు" అన్నాడు. అంత దానికే బాబు మురిసిపోతూ గెంతులు వేయసాగేడు. అందరికీ అన్నీ ఇచ్చినా వాళ్ల ముఖాల్లో ఆ ఒక్క విషయానికి చికాకు స్పష్టంగా కనిపించింది.

చివరిగా పెద్ద టెడ్డీ బేర్ బొమ్మతోబాటూ, బట్టలు, బూట్లు వంటివెన్నో వున్న చిన్న చిన్న వస్తువుల మధ్య పాపని తెరిచిన సూట్కేసులోనే కూర్చోబెట్టి "ఇవన్నీ నీకేరా బంగారం" అని ముద్దు చెయ్యసాగేడు ప్రభు.

బాబుని కూడా పట్టించుకున్నందుకు తన్మయికి ఎంతో సంతోషం వేసింది.

ఎక్కడో చదివింది "మనిషి తను ఉన్న ప్రాంతం నుంచి మరో ప్రదేశానికి వెళ్లి వస్తే దృక్పథం విశాలమవు తుందని".

పక్కనే ఇంకా తెరవని మరో సూట్కేసుని పైకి తీసుకెళ్లింది తన్మయి.

తెరవగానే "ప్రియమైన తనూ....." అంటూ చేతిరాతతో ప్రభు తన కోసం రాసిన ఉత్తరాల కట్టని చూసి పొంగిపోయింది. సరిగ్గా తనలాగే ప్రభు కూడా రోజూ తనకి ఉత్తరాలు రాసేవాడన్నమాట.

ఒక్కో పేజీ తిప్పి చూస్తూంటే అంతటి అవ్యాజమైన ప్రేమకు పాత్రమైనందుకు ఆనందబాష్పాలతో చెంపలు తడవసాగేయి తన్మయికి.

★★★★

మరో నెల్లాళ్లల్లో థీసిస్ రఫ్ కాపీని మాస్టారికి సబ్మిట్ చెయ్యడం కోసం పాపని, బాబుని తీసుకుని ప్రభుతో బాటూ విశాఖపట్నానికి ప్రయాణమయ్యింది తన్మయి.

మేరీ సాయంతో యూనివర్శిటీకి దగ్గర్లోని YMCA లో రెండు రోజులకు బస ఏర్పాటు చేసుకున్నారు.

పొద్దుట లేస్తూనే గది బాల్కనీ లో నుంచి ఎదురుగా కనిపిస్తున్న సుందర సాగర దృశ్యాన్ని కళ్లనింపుకుంటూ తన్మయత్వంలో మునిగితేలింది తన్మయి.

"ప్రభూ! సాయంత్రం బీచికి వెళ్దాం" అంది.

"అలాగే. నువ్వడిగింది ఏనాడైనా కాదన్నానా" అన్నాడు ప్రభు నవ్వుతూ.

పిల్లల్ని లేపి గబగబా తయారుచేసి తొమ్మిది గంట కల్లా డిపార్టుమెంటుకి చేరుకున్నారు.

డిపార్టుమెంటు ఆఫీసులో క్లర్క్ తన్మయిని చూస్తూనే "నమస్తే మేడం, రండి కూర్చోండి" అన్నాడు మర్యాద పూర్వకంగా. తనకి జే ఆర్ ఎఫ్ వచ్చినప్పటి నుంచి ఆఫీసు స్టాఫ్ అంతా ఇలా నమస్కారాలు చెప్పడం

మొదట్లో కొత్తగా ఉన్నా తర్వాత్తర్వాత అలవాటు అయిపోయింది తన్మయికి.

తన్మయి ప్రతిగా నమస్కరిస్తూ "మాస్టారిని కలవాలండి" అంది.

పక్కనే ఉన్న ప్రభుని, పిల్లల్ని చూస్తూ "నమస్తే సార్, పిల్లలా మేడం?" అని,

"మేస్టారిని కలవడానికి ఇక అప్పాయింటుమెంటు అవసరం లేదండి. ఇప్పుడు హెడ్డు కాదు కదా!" అన్నాడు.

అప్పటికే అక్కడ తచ్చాడుతున్న అటెండరు "నాతో రండి. మేస్టారి ఆఫీసు రూము తెరుస్తాను" అని వెంటబెట్టుకుని తీసుకెళ్లబోయేడు.

వెళ్లబోతున్న తన్మయితో క్లర్కు లోగొంతుకతో "మేడం, మనలో మన మాట. డిపార్టుమెంటులో సీనియర్ ప్రొఫెసర్లు ముగ్గురు రాబోయే సంవత్సరం రిటైర్ అవబోతున్నారు. ఈలోగా మీరు తొందరగా పీ ఎచ్ డీ పూర్తిచేసేరంటే, నోటిఫికేషన్ పడగానే మీకు తెలియజేస్తాను" అన్నాడు.

తన్మయి చిన్నగా నవ్వుతూ "అలాగేనండీ. ఈ లోగా పూర్తి చెయ్యడానికి ప్రయత్నిస్తాను, చాలా థాంక్స్" అని లేచి అటెండరును అనుసరించింది.

తన్మయికి ఎమ్మే సీటు వచ్చిన మొదటి రోజు నుంచి అనుక్షణం జరిగిన ప్రతీ ఒక్కటీ జ్ఞాపకం వచ్చేయి.

గంటల తరబడి డిపార్టుమెంటు బయట బెంచీ మీద చంటిపిల్లాణ్ణి ఎత్తుకుని కూచుని నోట్సులు

రాసుకున్న రోజులు, తినీ తినకా చెట్టు కింద కూచుని జే ఆర్ ఎఫ్ కోసం చదివిన పుస్తకాలు జ్ఞాపకం వచ్చేయి.

తనకి జే ఆర్ ఎఫ్ రాకపోతే తనని ఇలాగే గౌరవించేవారా?

తన జీవితంలో జే ఆర్ ఎఫ్ ఫెలోషిప్ రావడం ఎంత పెద్ద మార్పు తెచ్చిందో తలచుకుంటేనే ఆశ్చర్యం వేస్తుంది.

మొట్టమొదట అప్పటివరకూ ఉన్న ఆర్థిక కష్టాలు తొలగి, తనకు గొప్ప ఆత్మసైర్యం వచ్చింది.

పీ ఎచ్ డీ హాస్టల్ లో సీటు వచ్చి నిలువనీడ, కేంటీన్ నుంచి మూడు పూటలా భోజనం కొనుక్కోగలిగిన

ఆర్థిక స్థోమతా వచ్చేయి.

డిపార్టుమెంటులో తను ఎమ్మే చదివేటప్పుడు ఆఫీసు రూములోకి అడుగుపెడ్తే కసురుకునే క్లర్కులు, అటెండర్లు లేచి నిలబడి మరీ నమస్కారాలు చెప్పసాగేరు.

జీవితంలో నిలదొక్కుకోవడం, ఉన్నత స్థితికి చేరడం ఎంత విలువైనవో అర్థం కాసాగేయి.

పాపాయి ప్రభు ఒళ్ళో నుంచి కిందికి దూకుతూ నడవడానికి ప్రయత్నిస్తూండడంతో ఈ లోకంలోకి వచ్చిపడింది తన్మయి.

"మాస్టారు వచ్చే లోగా అలా కేంటీన్ వరకు వెళ్లొస్తాం" అంది లేస్తూ బయట ఉన్న అటెండరుతో.

వరండా చివర ఎదురుగా వస్తున్న మరో అటెండరు నమస్కరించేడు.

బాబు ఆశ్చర్యంగా చూస్తూ "అమ్మా! నువ్వు ఇక్కడ స్టూడెంటా? టీచరా?" అన్నాడు.

తన్మయి నవ్వుతూ ప్రభు వైపు చూస్తూ "అమ్మ కూడా ఒకప్పటికి ఇక్కడ టీచరయి పోతుందని వీళ్ల నమ్మకమేమో" అంది.

ప్రభు ప్రశంసా పూర్వకంగా చూస్తూ " నువ్వు తల్చుకోవాలే గానీ తప్పకుండా అవుతావు" అన్నాడు.

తన్మయికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయ్యింది ప్రభు మాటలకి. ప్రభు దగ్గిర తనకి బాగా నచ్చేదదే. తను నమ్మిన ప్రతిదీ సాధించగలదన్న గొప్ప ధైర్యాన్నిస్తాడు.

"ఇదిగో ఇది మా భాషాశాస్త్రం క్లాసురూము. ఇది ఆధునిక సాహిత్యం" అంటూ క్లాసురూములన్నీ తిప్పి చూపించింది.

డిపార్టుమెంటు బయట ప్రభు తన్మయిని మొదటిసారి చూసినప్పటి బెంచీ మీద కూచుని ఫోటోలు తీసుకుంది.

"మా కేంటీన్ లో పొగలు కక్కే ఇడ్లీ తినాలి" అంటూ కేంటీన్ వైపు హుషారుగా అడుగులు వేసింది.

68

కేంటీన్ లో టిఫిన్, కాఫీ అయ్యేక అమెరికా నుంచి తెచ్చిన కొత్త కేమేరాతో ఫోటో తీస్తూ

"కాబోయే డాక్టరు తన్మయి గారి "చరిత్రాత్మకమైన కేంటీన్" అంటూ కాప్షను వెయ్యాలి ఈ ఫోటో కింద" అని,

"అయినా ఏ మాట కామాటే చెప్పుకోవాలి నువ్వు చెప్పినంత గొప్పగా అయితే ఏవీ లేదిక్కడ ఇడ్లీ" అన్నాడు నవ్వుతూ ప్రభు.

మరలాంటప్పుడు "ఏ మాట కామాటే చెప్పుకోవాలి" అని పాజిటివ్ గా వాక్యాన్ని ప్రారంభించడం ఎందుకో" అంది ఉడుకుమోత్తనంగా.

"మీ అంత తెలుగు మాకు రాదు లెండి తన్మయి గారూ" అంటూ "నేను పాపని, మృదుల్ ని తీసుకుని రూం కి వెళ్లిపోతాను. నువ్వు మాస్టారు రాగానే అన్నీ చక్కబెట్టుకుని నేరుగా వచ్చేసెయ్యి. అక్కణ్ణించే అందరం కలిసి బయటికి వెళ్దాం. ఏమంటావ్" అన్నాడు.

అప్పటికే అలసటగా భుజమ్మీద నిద్రపోసాగింది పాప.

"సరే కానీ, అదుగో మాస్టారు వస్తు న్నట్టున్నారు. ఒక్కసారి పలకరించిన తర్వాత వెళ్లండి". అంది దూరంగా డిపార్టుమెంటు మలుపు తిరుగుతున్న మాస్టారి మారుతీ కారుని చూస్తూ.

★★★

మాస్టారు వస్తూనే "ఏమ్మా ఎలా ఉన్నావురా" అని పలకరించేరు.

తన్మయి ఎదురెళ్లి కాళ్లకి నమస్కరించింది.

"పిల్లాపాపలతో కలకాలం చల్లగా ఉండు" అంటూ

"కూర్చోండి ప్రభూ! మీ లాంటి గొప్ప యువకులే దేశానికి గర్వకారణం. తన్మయి మా అమ్మాయిలాంటిదే. తనకి మంచి జీవితాన్నిచ్చిన మీరంటే గొప్ప గౌరవం నాకు. తనెన్ని ఇబ్బందులు పడిందో నాకు తెలుసు. ఇప్పుడు మా అమ్మాయిని ఇలా సంతోషంగా చూడడం ఎంతో ఆనందంగా ఉంది" అంటూ తన్మయి పక్కనే నిల్చున్న బాబుని దగ్గరకు పిలిచి ఒళ్లో కూర్చోబెట్టుకుని "ఎంత పొడుగయ్యేడో!" అన్నారు.

"ఏమోయ్, మా పెరట్లో జామకాయలు జ్ఞాపకం ఉన్నాయా? ఇదో ఇలా మీ చెల్లిలాగే నిన్ను కూడా ఒళ్లో కూచోబెట్టుకుని అమ్మ ఆ చెట్టు కింద కూచుని చదువుకునేది. మా ఇంటికి ఎప్పుడొచ్చినా మనిద్దరం పెరట్లో ఆడుకునే వాళ్లం గుర్తుందా" అన్నారు బాబునుద్దేశించి.

బాబు నవ్వుతూ తలూపేడు.

ఆయన ఆప్యాయతకి కళ్లల్లో నీళ్లు వచ్చేయి తన్మయికి.

ఒక గొప్ప ఉపాధ్యాయుడి లక్షణాలేవిటో ఆయనని చూసినప్పుడల్లా అర్థం అవుతూ ఉంటాయి తన్మయికి.

అయిదు నిమిషాల తర్వాత ప్రభు లేవబోతూంటే "కూర్చోండి, టీ చెపుతాను. మధ్యాహ్నం భోజనానికి మా ఇంటికే వెళ్దాం" అన్నారు.

"అయ్యో వద్దండి. నా మిత్రుడొకాయనకి వస్తామని చెప్పేను. టీ కూడా వద్దండి. ఇప్పుడే కాఫీలు తాగేం. నేను పిల్లల్ని తీసుకుని వెళ్తాను. తన్మయి మీతో మాట్లాడేక తరువాత వస్తుంది" అంటూ లేచేడు ప్రభు.

బాబు తన్మయి దగ్గిరికొచ్చి "బై" అని చెప్పి, బుద్ధిగా పాపాయి చిన్న బ్యాగు పట్టుకుని ప్రభుని అనుసరించేడు.

"తన్మయీ! ఎంత అదృష్టవంతురాలివమ్మా! నీ కష్టం చూసి ఆ భగవంతుడే నీ కోసం ఇంత మంచి వ్యక్తిని పంపించేడు. అన్నట్టు ఏదీ రీసెర్చి నోట్సు తెచ్చేవా" అన్నారు.

ముఖ్యమైన విషయాలు చర్చించి మరో అరగంటలో "ఒక గంట క్లాసు ఉంది ఇప్పుడు. కాగానే వచ్చి వివరంగా చూస్తాను. నువ్వు కావాలంటే అలా వెళ్లిరా" అన్నారు లేస్తూ.

తన్మయి డిపార్టుమెంటు లోంచి బయటికొచ్చి మేరీ డిపార్ట్ మెంటు వైపు అడుగులేసింది.

త్రోవ పొడవునా ఎప్పటిలాగే నిల్చున్న ఎత్తైన చెట్ల మధ్య ఎండా నీడలు దోబూచులాడే సన్నని బాటకిరుప్రక్కలా కొత్తగా మొలిచిన పచ్చిక అక్కడక్కడా తడి మెరుస్తూన్న గడ్డిపూలతో ఆహ్వానించింది. చిరు చల్లని గాలి వీస్తూ ఆహ్లాదంగా ఉన్నా విశాఖ పట్నపు జిడ్డు వాతావరణం అలవాటు పోవడం వల్ల చెమటలు ధారాపాతంగా కారసాగేయి తన్మయికి. కర్చీపుతో తుడుచుకుంటూ పక్కనే ఉన్న లైబ్రరీ వైపు చూసింది. జే ఆర్ ఎఫ్ కి దీక్షగా చదువుతూ ఉన్నప్పటి సంఘటనలన్నీ కళ్ల ముందు కదలాడసాగేయి.

కరుణ, అనంత, రాజు, దివాకర్ జ్ఞాపకం వచ్చేరు.

“కరుణ ఎక్కడ ఉన్నాడో తనెప్పుడూ ఇక కనుక్కునే ప్రయత్నం చెయ్యలేదు. ఒకసారి మనుషులు జీవితంలోంచి తుడిచి పెట్టుకుపోయేక మళ్లీ గుర్తుకు తెచ్చుకోవడం అన్నది అర్థం లేనిది.

అనంత, రాజు ప్రభుత్వ స్కూళ్లల్లో టీచర్లుగా ఉద్యోగాలొచ్చి వాళ్ల జిల్లాలోనే స్థిరపడ్డారని ఆ మధ్య ఉత్తరం రాసింది అనంత. తను రిప్లై రాసినా ఇక ఎందుకో జవాబు రాలేదు అట్నుంచి.

ఇక దివాకర్ ఎక్కడ ఉన్నాడో. వాళ్లు మాస్టారింటికి దగ్గర్లోనే ఉంటారు కాబట్టి మాస్టారిని అడిగి తెలుసుకోవాలి.”

సాలోచనగా భుజం చుట్టూ కొంగు కప్పుకుని నడుస్తున్న తన్మయిని డిపార్టుమెంటు బయటే వేచి చూస్తున్న మేరీ గబగబా ఎదురొచ్చి సంతోషంగా కౌగిలించుకుంది.

"ఎంత బాగున్నావో తనూ నువ్వు. భలే అందం వచ్చింది నీకు" అంది నవ్వుతూ.

సంతోషంగా డిపార్టుమెంటులో ప్రత్యేకంగా ఉన్న తన రూముకి తీసుకెళ్లింది.

గుమ్మం బయట "డా|| మేరీ, అసిస్టెంట్ ప్రొఫెసర్" అన్న బోర్డు చూసి సంతోషంగా మేరీ చేతులు పట్టుకు ఊపింది తన్మయి.

"అబ్బ, నీ కష్టాలన్నీ తీరి నిన్ను ఇలా ఉన్నత స్థితిలో చూస్తుంటే ఎంత సంతోషంగా ఉందో తెలుసా మేరీ" అంది ఆనందంగా నవ్వుతూ.

"అందుకే ఏది జరిగినా మన మంచికే అంటారు పెద్దలు. నీకు అతిచిన్న ఎలిమెంటరీ టీచరు ఉద్యోగం రాలేదని నువ్వొకప్పుడు ఎంతో బాధపడ్డావు. అది రాక ఎంత మేలు జరిగిందో చూసావా?" అంది.

"అవును. నువ్వప్పుడు ధైర్యం చెప్పబట్టి సరిపోయింది. అదిసరే గానీ ప్రభు, పిల్లలు ఏరీ" అంది మేరీ.

"పాప అలిసిపోయి నిద్రపోయింది. లేస్తే పేచీ పెడుతుందని రూముకి తీసుకుని వెళ్లిపోయేడు. బాబుని కూడా తీసుకెళ్లేడు" అంది తన్మయి.

"నయమే బాబుని కూడా బాగా చూసుకుంటున్నాడు ప్రభు" అంది మేరీ.

తన్మయి చిన్న నవ్వు నవ్వింది. అందులో ఉన్న విషాదాన్ని వెంటనే పసిగట్టినట్టు "అంతా ఓకేనా?" అంది మేరీ.

"ఫర్వాలేదు" అంది మళ్లీ నవ్వబోతూ.

"దా.. అలా కేంటీన్ వరకూ వెళ్లి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం. ఇప్పుడు నాకు క్లాసులేవీ లేవులే" అంది మేరీ.

మేరీ ఎప్పుడూ తన మనసెరిగి నడుచుకోవడం తన్మయిని ఆశ్చర్యచకితురాల్ని చేస్తుంది.

తనకున్న సమస్యల్ని తల్చుకోగానే ఊపిరి సలపనట్టయ్యి తనకీ అలా బయటికి నడిస్తే బావుణ్ణనే అనిపించింది తన్మయికి.

"ఊఁ చెప్పు తనూ! నీ కష్టాల్ని నేనెప్పుడూ ఆర్చలేను, తీర్చలేను గానీ కనీసం పంచుకోగలను" అంది మేరీ తన్మయి చేతిని తన చేతిలోకి తీసుకుని నడుస్తూ.

తన్మయి చెప్పింది విని కాఫీ కప్పు పక్కకి పెడుతూ "ఊఁ.. మగవాళ్లు అందరూ ఒక్కటే తనూ! ఏదో ఒక లోపం తోనే ఉంటారు. అవి స్త్రీలు భరించగలిగిన శాతంలో ఉన్నప్పుడే సంసారాలు నిలబడతాయనుకుంటా. కొన్ని సార్లు అసలు భరించగలిగే అవకాశమే ఉండనంత వంద శాతం లోపాలున్నవాళ్లూ ఉంటారనుకో నా భర్తలాగా." అని నిట్టూర్చింది.

అంతలోనే "చిన్న వయసులో పెద్ద జీవితాన్ని చవి చూసిన నీకు చెప్పనే అవసరం లేదనుకో. కానీ ఎంతో అర్థం చేసుకుని పెళ్లి చేసుకున్న ప్రభు అతని తల్లిదండ్రులు నిన్ను, బాబుని ఏడిపిస్తుంటే ఎందుకు ఉపేక్షిస్తున్నాడో నాకు అర్థం కావడం లేదు. కలకాలం నిన్ను భద్రతగా చూసుకోవలసిన బాధ్యత అతనిదే కదా! వేధింపు మానసికమైనా క్షమార్హం మాత్రం కాదు. అతనికి అతని తల్లిదండ్రుల మీద ఎంత ప్రేమ ఉన్నా వాళ్లు నీ పట్ల సవ్యంగా నడచుకోనప్పుడు వాళ్ల ప్రవర్తన మార్చుకోమని చెప్పాల్సిన బాధ్యత కూడా అతనిదే. అలా కానప్పుడు నిన్ను పరిపూర్ణంగా ప్రేమిస్తున్నాడని అతను అనుకుంటున్నాడంటే అది సత్యం కాదు." అంది.

కాస్సేపు నిశ్శబ్దంగా ఉండి "ఎప్పుడూ నాకు మాత్రమే సమస్యలు ఎందుకు ఎదురవుతాయో అర్థం కావడం లేదు మేరీ. ప్రభుని పెళ్లి చేసుకోవడానికి సంవత్సరం పాటు ఆలోచించినది ఇందుకే. అయినా తప్పు ఎక్కడ జరిగిందో అర్థం కావడం లేదు. తల్లిదండ్రులు ఎదురుగా లేకపోతే అత్యంత ప్రేమ మూర్తిగా ఉండే ఇతను వాళ్ల ఎదురుగా ఒక విభిన్నమైన మనిషిగా ప్రవర్తిస్తాడు. అంతెందుకు ఇప్పుడు బాబుని చక్కగా కూడా తీసుకెళ్లేడా? వాళ్ల ఎదురుగా అసలు వీడి వైపు చూడడానిక్కూడా ఇష్టం లేనట్లు ప్రవర్తిస్తాడు.
వాళ్ల మీద తనకున్న ప్రేమని చాటుకోవడానికో, వాళ్లతో చెప్పాపెట్టకుండా పెళ్లి చేసుకున్నాడన్న గిల్టీ ఫీలింగుని తప్పించుకోవడానికో మరి. ఏదేమైనా వాళ్లు బాబుని, నన్ను నానా మాటలంటుంటే అతను ఉపేక్షించడమే కాకుండా, నన్ను కూడా భరించాల్సిందే అని చెప్పడం పరమ అన్యాయంగాను, చికాగ్గాను ఉంది నాకు. అసలు ఆ పసివాడి మనస్సు ఎంత గాయపడుతూందోనన్న ఇంగిత జ్ఞానం లేదు. ఆలోచిస్తూంటే మా జీవితాలు ఇలా గందరగోళంగా తయారు కావడానికి కారణం నేనే అన్న గిల్టీ ఫీలింగు నన్ను దహించేస్తూంది. ఒక పక్క ఒకరికి ఇద్దరైన పసిపిల్లలు. ఎటువంటి అడుగు వెయ్యాలన్నా ఎంతో ఆలోచించాల్సి వస్తూంది." అంది తన్మయి ఉద్విగ్నంగా.

"బాధ పడకు తనూ! ప్రభుతో నువ్వు మనసు విప్పి గట్టిగా మాట్లాడడమొక్కటే పరిష్కారంగా తోస్తూంది నాకు. అయినా వినలేదనుకో పిల్లలిద్దరినీ తీసుకుని ఇక్కడికి ట్రాన్స్ఫర్ పెట్టుకుని వచ్చెయ్యి. ఎలాగూ ఇప్పుడు 610 జీవో అమలుకాబోతూంది కదా! కష్టమో, నష్టమో మనమే పెంచుకోవచ్చు. పిల్లల్ని ఆరోగ్యకరమైన వాతావరణం లో పెంచడం అవసరం. నీకు ఇటువంటి మానసిక ఆందోళనలు అవసరం లేదు. అవునూ పిల్లల్ని చూసుకోవడానికి మీ ఊరి అమ్మాయిని తోడు తీసుకెళ్లావుగా. ఏమయ్యింది?" అంది.

"అమ్మాయి ఉంది మేరీ. తనుండబట్టే నేను ధైర్యంగా పాపని, బాబుని పెంచుకొస్తూ , ఉద్యోగం చెయ్యగలుగుతున్నాను. మేమిలా ఊరొస్తున్నామని ఇంటికి వెళ్లొస్తానంటే పంపించేం."

అని గట్టిగా ఊపిరి తీసుకుని

"నువ్వు చెప్పినట్టు మాట్లాడడమూ అయ్యింది మేరీ. 'నాకు సంతోషాన్నివ్వడానికే పెళ్లి చేసుకున్నానని, ఎప్పుడైనా సరే అతనితో నేను సంతోషంగా లేకపోతే నేను వెళ్లిపోవచ్చనీ' అన్నాడు. ఆక్షణంలో విడిపోయి వెళ్లిపోవాలనిపించినా కానీ కోపంలో అన్నాడని అనిపించి ఆగిపోయేను. అతని పట్ల పెంచుకున్న అవ్యాజమైన ప్రేమ కాళ్లకు సంకెళ్లలా అడ్డుతగులుతూంది. నిజానికి అతని మీద నేను ఆధారపడవల్సిన పని లేదు. ఇక అతని నుంచి విడిపోవడం అన్నది నాకు పెద్ద సమస్య కాదు. కలిసుండడమే సమస్య." అంది.

నిశ్శబ్దంగా తలూపింది మేరీ.

"అయినా ఒక్కసారి ఆలోచిస్తే అతన్నించి విడిపోవడం వల్ల నేను ఎన్నో కలలతో పునర్నిర్మించుకున్న

కుటుంబ జీవితానికి, వైవాహిక జీవితానికి దూరం అవుతాను. నా కూతురు తండ్రిని కోల్పోతుంది. మా ఇద్దరికీ తీరని నష్టం కలుగుతుంది. మరోపక్క ప్రభుకీ మానసిక క్షోభ తప్పదు. పైగా ఇందువల్ల లాభపడేది మొత్తం అతని తరఫు వాళ్లే. వాళ్లు ఆశిస్తున్నదీ అదే. నేను అతనిని వదిలెల్లిపోతే అతనికి వాళ్లకి నచ్చిన

అమ్మాయినిచ్చి పెళ్లి చెయ్యాలన్నదే వాళ్ల అభిమతం. వాళ్లు ఏం ఆశించి ఇదంతా చేస్తున్నారో అది నేనెందుకు నిజం చెయ్యాలి?" అంది సాలోచనగా తన్మయి.

"మరి బాబు సంగతి ఏవిటి? వాణ్ణి బాగా చూసుకోకపోతే అన్యాయం కదూ" అంది మేరీ.

"అదే నా బాధ కూడా మేరీ. మొదట్నుంచి అన్ని వైపుల నించి పసివాడు మధ్యలో నలిగిపోతున్నాడు. నా కడుపున పుట్టిన పాపానికి వాడు ఇంత దుఃఖాన్ని అనుభవించాల్సి వస్తోంది."

తన్మయి కళ్లు నిండుకున్నాయి

."పద, అలా బెంచీ మీద కూచుందాం" అంది నడక ఆపి మేరీ.

కళ్లు తుడుచుకుంటూ "నిజానికి ప్రభు తనంతట తనుగా చెడ్డవాడు కాదు. కానీ అతనిలో ఉన్న లోపమల్లా అతని వాళ్ల పట్ల అమితమైన ప్రేమ, బాబు పట్ల విముఖత. మొదటిది తప్పుకాదు నా ఉద్దేశ్యంలో. "A good son makes a good husband". రెండోదే అతనితో నాకున్న పెద్ద సమస్య . నేను మళ్లీ పెళ్లి చేసుకోవడానికి ఎందుకైతే భయపడ్డానో అదే జరుగుతూంది. మరోలా ఆలోచిస్తే బాబు విషయంలో అతనికి ప్రేమ ఉండాలన్నిది, ఉంటుందన్నదీ అర్థం లేని ఆలోచనేమో అనిపిస్తుంది. కన్న తండ్రికే లేదు, ఇతనికి ఎలా ఉంటుంది? కానీ పిల్లాడి మనసు గాయపరిచే పనులు చెయ్యడం క్షమించరాని నేరాలు. వాటిని నేను ఎప్పుడూ సహించబోనని గట్టిగా చెప్తూనే ఉన్నాను." అంది తన్మయి.

"ప్రేమించక్కరలేదు. కనీసం మనిషిలా చూస్తే చాలు కదా! అయినా లోకమెరుగని పసివాడి పట్ల విముఖత ఏవిటి? పెళ్ళికి ముందు "వాడు నీలో భాగం" అన్నాడు. ఇప్పుడేమయ్యింది?" అంది మేరీ.

"ఆ సంభాషణా అయ్యింది. 'వాడు నీలో భాగం, అన్నది వాడిని నీ నుంచి దూరం చెయ్యనని చెప్పడానికి. అంత మాత్రాన నేను నిన్ను ప్రేమించినట్టే వాణ్ణి ప్రేమించలేను. ప్రేమ లేకుండా ఉన్నట్టు నటించలేను' అన్నాడు.

"ఊ. అయితే మొదటినుంచి అతను స్థిరమైన అభిప్రాయాలతోనే ఉన్నాడన్నమాట. నువ్వు అర్థం చేసుకోవడంలోనే లోపం ఉంది. మరి అతను పెళ్లికి ముందు వాళ్ల "తల్లిదండ్రుల్ని చూడడం" అన్న చిన్న మాటలో "తెచ్చి ఇంట్లో పెట్టుకుని వాళ్లేమన్నా భరిస్తూ నోరు మూసుకుని పడుండడం" అన్నంత పెద్ద అర్థం ఉందా? అతను నిశ్చయంగా పరిస్థితుల్ని 'తనకి' అనుగుణంగా మార్చుకుంటున్న స్వార్థపరుడు. అంది మేరీ 'తనకి' అన్నమాటని ఒత్తిపలుకుతూ.

"బహుశా: ఒక్కొక్కరి జీవితమే ఇంత అనుకుంటా మేరీ. ప్రవేశించడమే కానీ వెనక్కి రాలేని అభిమన్యుడి పద్మవ్యూహంలాంటి బతుకు నాది. చివరికంటా పోరాడాల్సిందే తప్పదు" అంటూ లేచింది తన్మయి.

★★★

మధ్యాహ్నం భోజనానికి "దసపల్లా" కి వెళ్లేరు.

చేతులు కడుక్కుంటూ బాబుని అడిగింది.

"ఏం నాన్నా, ఏం చేసేవు పొద్దుట్నించి?" అంది తన్మయి.

"చెల్లితో ఆడుకున్నాను. తను మాకు దార్లో ఐస్ క్రీములు కొనిబెట్టేరు. రూమ్ లో కొంచెం సేపు టీవీ చూసేం" బాబు ఉత్సాహంగా మాట్లాడుకెళ్లిపోతున్నాడు.

తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

ప్రభు ఒళ్లో నుంచి పాపని తీసుకుని "నువ్వూ వెళ్లిరా చేతులు కడుక్కుందుకు" అంది.

భోజనాలయ్యేక అట్నుంచి అటే రామకృష్ణా బీచ్ కి వెళ్లి సాయంత్రం వరకూ గడిపేరు.

ఉవ్వెత్తున ఎగిసి పడ్తున్న కెరటాల్లో ఆనందంగా  ఆడసాగేరు ముగ్గురూ.

ఒడ్డున కూచుంది తన్మయి. ఆ క్షణం తన్మయికి జీవితమ్మీద  గొప్ప ఆశాభావం కలిగింది. ప్రభు ఈ మాత్రం చేరదీస్తే చాలు బాబుని. వాడిపట్ల ఉన్న విముఖత ఉన్నా అది వాడి  మొహమ్మీద చూపించకుండా ఉంటే చాలు.

దూరాన సముద్రం చివర వేళ్ళాడుతున్న దిగంతాన్ని చూస్తూ "మిత్రమా! నన్ను, నా పిల్లల్ని రక్షించు" అని వేడుకుంది.

రోడ్డుకవతల ఉన్న ఆలయంలో సాయంత్రపు ఆరాధన గంట మోగింది.

"సత్యం" అనుకుంటూ పక్కకి చూసింది.

అక్కడే ఇసుకలో పిల్లల్తో ఆడుతూన్న దివాకర్ ఆశ్చర్యంతో నోరు పెద్దది చేస్తూ "త...తన్మయా ..." అన్నాడు.

తన్మయి సంతోషంగా లేచి దగ్గిరికెళ్లింది.

అక్కడే దివాకర్ తో బాటూ ఉన్న దివాకర్ అక్క గబుక్కున తన్మయి చెయ్యి పట్టుకుని ఆనందంగా "అమ్మో మీరే! ఎన్ని సంవత్సరాలయిపోయింది!" అంది.

పిల్లల్ని ఆడుకోమని దివాకర్ వచ్చి "బ్బ బలే కనబడ్డారు. చాచాన్నాళ్ళకి " అన్నాడు.

పిల్లల్ని, ప్రభుని చూపించి తన్మయి చెప్పింది విని "చాచాలా సంతోషం. అమ్మ మి...మిమ్మల్ని చూస్తే ఎ...ఎంతో సంతోషపడుతుంది" అన్నాడు.

మొదటిసారి తనని చూసినప్పుడు తన గాథ విని కళ్లనీళ్లు పెట్టుకున్న దివాకర్ అక్కంటే తన్మయికి ఎంతో ఇష్టం.

ఆ విషయాన్నే చెప్పింది. "భలేవారు. మీరు మమ్మల్ని జ్ఞాపకం పెట్టుకున్నారు అంతే చాలు. మా తమ్ముడికి కూడా ఒక దారి చూపించారు. వాడిప్పుడు వివేకానందా పాఠశాలలో హాస్టలు సూపరింటెండెంటు గా చేస్తున్నాడు." అంది.

తన్మయి సంతోషంగా "అనంత, రాజు గవర్నమెంటు ఉద్యోగాలొచ్చి అక్కణ్ణించి వెళ్లేక మీరు కూడా మానేసేరనుకున్నాను. అయితే కంటిన్యూ చేస్తున్నారన్నమాట. వెరీగుడ్." అంది.

"మి...మీర్రే అడ్రసు లేకుండా వె...వెళ్ళిపోయేరు. మి...మీ అమ్మగారి అడ్రసుకి ఒ..కట్రెండు ఉ..ఉత్తరాలు రాసేను. మీ నించి ఎ...ఎప్పుడూ జవాబు లేదు" అన్నాడు నిష్టూరంగా  దివాకర్

"అయ్యో అవేవీ అందలేదు. అందితే అమ్మ తప్పకుండా చెప్పివుండేది. వెంకట్, మురళి ఎలా ఉన్నారు?" తన్మయి.

"వె ...వెంకట్, మురళి ఇ...ఇద్దరూ ఈ మధ్యే హ...హైదరాబాదు బ్రాంచికి వెళ్లిపోయేరు. వెంకట్ గారి స....స్థానంలోనే నన్ను ప్ర...ప్రమోట్ చేసేరు. దే...దేవుడి దయ వల్ల జీతం కూడా బా.. బాగా పెంచేరు. ప్ర..ప్రయివేటు ఉద్యోగం, ప...పనెక్కువైనా ప్రశాంతంగా ఉంది." అన్నాడు.

కబుర్లలోనే ప్రభు పిల్లల్ని తీసుకుని రాగానే అందర్నీ పరిచయం చేసింది తన్మయి.

దివాకర్ అక్క సంతోషంగా చూస్తూ "వెళ్ళేలోగా మా ఇంటికి తప్పకుండా రండి. నాన్నగారు రిటైరయ్యేక జగదాంబా సెంటరుకి దగ్గర్లోని మా తాత గారింట్లోకి మారిపోయేం. పైగా మా తమ్ముడికి పెళ్లయినా ఇబ్బంది లేకుండా ఉంటుందని" అంది సిగ్గు పడుతూ ఎటో చూస్తూన్న దివాకర్ వైపు చూస్తూ .

వాళ్ల దగ్గిర సెలవు తీసుకుంటూ "రేపు కైలాసగిరి, ఋషికొండ బీచ్ లకు ప్లాన్ పెట్టుకున్నాం. అయినా తప్పకుండా రావడానికి ప్రయత్నం చేస్తాను. మీ అమ్మగారిని అడిగేనని చెప్పండి" అంది తన్మయి.

దారి పొడవునా ప్రభుకి వాళ్ల గురించి చెబుతూనే ఉంది. "వాళ్ళమ్మ గారికి, అక్కకి చీరలు కొని పట్టుకెళదాం" అంది.

"తప్పకుండా. నిన్ను కష్టాలలో ఆదుకున్న వాళ్లంటే నాకెంతో గౌరవం" అన్నాడు ప్రభు.

తన్మయికి ప్రభు ఇలాంటి విషయాలలో ఎంతో నచ్చుతాడు. అసలెటువంటి అభ్యంతరమూ లేకుండా ఏదడిగినా వెంటనే "సరే" అంటాడు.

చదువు, ఉద్యోగ విషయాలకు ఎంతో ఎంకరేజ్ చేస్తాడు.

ఎటువంటి విషయంలోనూ తనని వెనక్కి లాగే కుటిలత్వం, ఆధిక్యత చూపించడం వంటివి అస్సలు లేవు.

ఏది చేసినా ఇద్దరం కలిసే చెయ్యాలని తననీ తనతో బాటుగా స్విమ్మింగు క్లబ్బులోను, డ్రైవింగ్ క్లాసులలోను జాయిన్ చేసేడు.

ఇంత చేసేవాడు బాబు విషయంలో తనని ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నాడో తెలియడం లేదు!

ఆటో చీకట్లోకి దూసుకు పోతూంది. తన మనస్సులో జవాబులేని ప్రశ్నలా.

69

మర్నాడు పొద్దున్న ముందుగా దివాకర్ ఇంటికి బయలుదేరేరు.
తన్మయి తమ స్కాలర్స్ హాస్టల్ దగ్గిర ఆగి వెళ్దామని పట్టుబట్టింది.

పిచ్చి మొక్కలు మొలిచిన ఆవరణలో గేటు నుంచి బిల్డింగు ఎంట్రెన్సు వరకు ఉన్న కాలి బాట కిరుపక్కల దట్టంగా మొలిచిన గడ్డిలోకి పరుగు తియ్యబోయిన బాబు చేతిని గట్టిగా పట్టుకుంది తన్మయి.
"వద్దు నాన్నా, పురుగూ పుట్రా ఉంటాయి" అంటూ.
మెట్లెక్కి రిసెప్షను హాలు లోకి అడుగుపెట్టగానే ఎప్పటిలాగే నైటీలు వేసుకుని స్కాలర్స్ టీవీలో నిమగ్నమై ఉన్నారు.

తన్మయికి నవ్వు వచ్చింది. సంవత్సరాలు మారినా హాస్టలు పరిస్థితి మారనందుకు.

ప్రశ్నార్థకంగా తన వైపు చూసిన అమ్మాయి తో "వార్డెను మేడంని కలవడానికొచ్చేం" అంది.

ఆ అమ్మాయి చిన్న నవ్వు కూడా లేని నిరాశ ముఖంతో "ఆవిడ లేదు, రేపు రండి" అని ముఖం తిప్పుకుంది.

ప్రభు అప్పటికే బయటికి తిరిగెళ్లిపోయేడు.

తన్మయి బాబు చెయ్యి పట్టుకుని "ఒక్కసారి మేం లోపలికెళ్లి చూసి రావొచ్చా? నేనిక్కడ ఒకప్పుడు రెసిడెంట్ స్కాలర్ని" అంది.

"ఏం చూస్తారూ?" అంది సాగదీస్తూ ఆ అమ్మాయి.

"మా రూము, ఇక్కడే పక్కనే ఉంటుంది. ఊరికే బయటి నించి చూసి వచ్చేస్తాను" అని ఆ అమ్మాయి సమాధానం కోసం ఎదురుచూడకుండా లోపలికి అడుగుపెట్టింది.

లోపల చుట్టూ గదులతో ఉన్న పెద్ద విశాలమైన రెండస్తుల భవనం చూసి నోరు తెరిచేడు బాబు "అమ్మా ఇంత పెద్దదా" అంటూ.

కానీ ఎక్కడికక్కడ మాసిపోయిన గోడలు, పెళ్లలు ఊడిన గచ్చులు.

తమ గది దాటి, పొడవాటి వరండా దాటి మెట్లెక్కి డైనింగు హాల్లోకి అడుగుపెట్టేరు.

పిల్లుల వాసనకి ముక్కు మూసుకున్నాడు బాబు. ఇదీ మారలేదు.

క్యాంటీను నించి వేళకి భోజనాన్ని గదికి తెచ్చి ఇచ్చే కొండమ్మ మనసులో మెదిలింది. అప్పటికే వయసైపోయి వంగిన నడుముతో అతికష్టంగా పనిచేసేది. ఇప్పుడు ఎలా ఉందో?

అప్పటికే పది దాటుతుండడంతో టిఫిన్ల వేళ అయిపోయినందున ఎవ్వరూ లేరు.

హాలు కిటికీ లోంచి ఒక వైపు విశాలమైన హాస్టలు ప్రాంగణం, మరోవైపు పిచ్చి మొక్కల రాళ్ల గుట్టతో అంగుళం కూడా మారలేదు ఆ స్థలం.

మేరీ, తను ఉన్న గది దాటి వస్తూండగా జ్ఞాపకాలు కిటికీలకు వేలాడుతున్న పరదాల్లా కదిలేయి.

మొదటిరోజే ప్రేమగా తనని తన గదిలోకి ఆహ్వానించిన మేరీ చిరునవ్వు ముఖం గుర్తుకు వచ్చింది.

గది తలుపు తడదామని అంతలోనే ఆగిపోయింది. తమ స్థానంలో వేరే ఎవరో ఉండి ఉంటారు. ఆ గదిలో తామిద్దరూ అలంకరించుకున్న ప్రత్యేక జ్ఞాపకాలు చెదిరిపోకుండా ఉండాలంటే చూడకపోవడమే మంచిది.

వరండాలో నుంచి నడుస్తుంటే ఆ గదిలో మేరీ ప్రతి రాత్రీ నిశ్శబ్ద ప్రార్థన చేస్తున్నట్టే ఉంది.

పది నిమిషాల్లో బయటికి వచ్చేరు.

పాపని మెట్ల మీద కూర్చొబెట్టి ఆడిస్తున్న ప్రభు నవ్వుతూ లేచి "జ్ఞాపకాల్ని వెంట తెచ్చుకోవడం అయ్యిందా పర్సు బరువుగా ఉంది" అన్నాడు నవ్వుతూ.

తన్మయి నిశ్శబ్దంగా బయటికి నడిచింది.

తన జీవితంలో అపురూపంగా దాచుకున్న క్షణాలు ఇక్కడివి.

ఇక్కడి నుంచి వెళ్లేక జీవితం ఎక్కడి నుంచి ఎక్కడికో ఊహించని మలుపులు తిరిగింది.

పదహారేళ్ళ వయసులో తన చుట్టూ ఉన్న వాళ్ళలాగే తన భావి జీవితం ఎప్పుడూ ఒక్కలాగే ఉంటుందని విశ్వసించేది తను.

నిజానికి తన చేతులారా తను ఎప్పుడూ ఉన్న జీవితాన్ని పాడు చేసుకునే ప్రయత్నం చెయ్యలేదు. మార్చుకునే ప్రయత్నమూ చెయ్యలేదు.

అయినా తనకి తెలియకుండానే జీవితం అస్తవ్యస్తం అయ్యింది. అయినా ఓటమిని, విజయాన్ని ఒక్కలాగే స్వీకరించింది.

శేఖర్ తనని మోసం చేసి మొత్తం జీవితాన్నంతా అల్లకల్లోలం చేసాడు.

అలిసిపోయిన జీవితానికి దొరికిన అరుదైన సాంత్వన ప్రభు అని మనస్ఫూర్తిగా నమ్మింది.

అయినా సమస్యలు అతని వాళ్ల వైపు నుంచి ముంచుకొచ్చాయి. మొత్తానికి బాధైతే తప్పడం లేదు.

తను మళ్లీ పెళ్లి చేసుకున్న పాపానికి చెయ్యని తప్పుకి పసివాడు శిక్ష అనుభవించాల్సి వస్తూంది.

హాస్టలు బయటికొచ్చి రోడ్డు దాటి చిన్న వినాయకుడి ఆలయం దగ్గర ఆటో కోసం నిలబడ్డారు.

సైడ్ వాక్ మీద గుడేవిటో అని ఒకప్పుడు నవ్వుకునేది.

ఎన్ని పూజలు చేసినా మనిషికి కష్టాలేవీ తీరకపోయినా, బహుశా: ఏ దేవుడో తీరుస్తాడనే నమ్మకం వల్ల కష్టాలు గట్టెక్కగలిగే ధైర్యం వస్తుందనుకుంటా.

రెండు చేతులూ జోడించి నమస్కరించింది.

"భగవంతుడా! నా కడుపున పుట్టిన పాపం అంటకుండా ఈ పసివాణ్ణి దయతో కాపాడు."

వినాయకుడికి వినబడిందో లేదో తెలియదు కానీ కనీసం ప్రభుకి వినబడితే బావుణ్ణు. కనీసం తన బాధ అర్థమైతే బావుణ్ణు.

నిట్టూర్పు విడిచి ఆటోలో ఎక్కింది తన్మయి.

జగదాంబా సెంటరు వైపు దూసుకుపోతున్న ఆటో లో నుంచి బయట కదిలిపోతున్న రోడ్ల వెంట, వీధుల వెంట జ్ఞాపకాలు చిందర వందరగా, రణగొణ ధ్వనులు చేసుకుంటూ పడీ, లేచీ దొర్లసాగేయి.

తను ఎన్నో కలలతో అడుగుపెట్టిన నగరం, తనని అనుభూతుల వెల్లువతో తడిపేసిన నగరం, తనకి విద్యతోబాటూ విజయాల్ని ఇచ్చిన నగరం. తనని నిలువునా దోచుకుని, దూరంగా విసిరేసిన నగరం. తనని దుఃఖపూరితురాల్ని చేసిన నగరం.

విజయాల్నీ, అపజయాలనీ సరిసమానంగా ఒకదానిమీదొకటి పేర్చుకుంటూ పోతున్న జీవితం తనకి వరమో, శాపమో.

ఆటో దివాకర్ వాళ్లిల్లు చేరే వరకు నిశ్శబ్దంగా ఆలోచించుకుంటూనే ఉండిపోయింది.

పాప ప్రభు ఒళ్లో నిద్రపోతూ ఉంది. బాబు మధ్యలో కూచుని తన్మయి భుజాన్నానుకుని బయటికి చూడసాగేడు.

దివాకర్ వాళ్లింట్లో అతని తల్లిదండ్రులు తన్మయిని చూసి ఎంతో సంతోషించేరు.

తమని చూస్తునే బయటికి పరుగెత్తుకెళ్ళి కూల్ డ్రింకులు తెచ్చేడు దివాకర్.

టిఫిన్లు చేసొచ్చేమన్నా వినకుండా వేడివేడిగా ఉప్పుడు పిండి పళ్లేల్లో వేసి పట్టుకొచ్చేరు దివాకర్ అమ్మగారు.

దివాకర్ అక్క బాబుని ప్రేమగా పిల్చుకెళ్లి పెరట్లో జామకాయలు తెంపి ఇచ్చింది. పాపని ఎత్తుకుని ముద్దాడింది.

వాళ్ల ఆప్యాయతకు ముగ్ధురాలయ్యింది తన్మయి.

ఇలా కొద్దిమందైనా ప్రేమపూరిత వ్యక్తులు లభించడం తనకి జీవితంలో ఇచ్చిన అరుదైన వరం. వాళ్ల సహృదయ ఆశీస్సుల వల్లే తనకి ప్రభు వంటి ప్రేమమూర్తి లభించేడు.

తిరిగి వస్తూ దివాకర్ తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించేరు తన్మయి, ప్రభు. మనసారా దీవించి వీధి చివరంటా వచ్చి మరీ సాగనంపేరు వాళ్లు.

★★★

అట్నించటే ఋషికొండ బీచ్ కి బయలుదేరేరు.

అప్పటికే కొద్దిగా నలతగా ఉన్న తన్మయికి బీచ్ కి చేరే సమయానికి పొంగుకుంటూ జ్వరం వచ్చేసింది.

ప్రభు వెనక్కి వెళ్లిపోదామని అన్నా పిల్లలు సరదా పడ్తుండడంతో వాళ్లు ముగ్గుర్నీ వెళ్లి రమ్మని ఒడ్డుకి కాస్త దూరంలో సరుగుడు చెట్ల నీడన దుప్పటీ పరుచుకుని ఇసుకలో పడుకుండిపోయింది తన్మయి.

అరగంటలో పిల్లలతోబాటూ వెనక్కి వచ్చేసి కొబ్బరి బొండాం తీసుకొచ్చి పట్టించేడు తన్మయికి ప్రభు.

దార్లో ఆటో మెడికల్ షాపు దగ్గిర ఆపి మాత్రలు, గ్లూకోజు కొన్నాడు.

రూముకి రాగానే తన్మయిని నిద్రపోమని పిల్లలకి స్నానాలు, భోజనాలు అన్నీ తనే చూసుకున్నాడు.

ప్రభు తన తల మీద తడి గుడ్డ వేసి తల పట్టడం, కాళ్లు పట్టడం వంటి సపర్యలు చేస్తున్నంతసేపూ "నువ్వు నన్ను వొదిలి ఎప్పుడూ వెళ్లద్దు, నేనెప్పుడూ నిన్నొదిలి వెళ్లను" అంటూ జ్వరంలో ఏవేవో మాట్లాడసాగింది.

"ఉష్... అలాగేలే. కళ్లు మూసుకుని నిద్రపో" అంటూ ఉన్నాడు ప్రభు.

రాత్రంతా జ్వరం మత్తులో ఏవేవో కలవరిస్తునే ఉంది తన్మయి.

తెల్లారి లేస్తూనే తల మీద అరచేయి వేసి చూస్తున్న ప్రభు చెయ్యి పట్టుకుని మౌనంగా రోదించసాగింది.

"ఏవిట్రా, కాస్త జొరానికే ఏడుస్తావా చిన్న పిల్లలాగా" అని "ఇవేళ సాయంత్రం రైలు టైము వరకూ ఎక్కడికీ వెళ్లొద్దు మనం. రెస్టు తీసుకో" అంటున్న ప్రభు చేతిని పట్టుకుని "ఈ చేతిని మాత్రం ఎప్పుడూ వదలను" స్థిరంగా మనసులో అనుకుంది.

★★★

హైదరాబాదు చేరగానే "ఏం బాబూ! ఆఫీసు ట్రిప్పు బాగా జరిగిందా?' అంటూ ఎదురొచ్చింది ప్రభు తల్లి బేబమ్మ.

ఆశ్చర్యపోయింది తన్మయి. అంటే తామెక్కడికి వెళ్లామో, ఎందుకు వెళ్లామో ఏమీ నిజం చెప్పలేదన్నమాట వాళ్లకి.

అంటే తను పీ.హెచ్. డీ వంటి పై చదువులు చదివితే వాళ్లకు నచ్చదనా? లేదా తనకి సాయంగా అతను రావడం వాళ్ళకి ఇష్టం ఉండదనా?

అసలు ఎందుకు వాళ్లకు ఇంత భయపడతాడు? ఇంత భయపడేవాడు వాళ్లకు తెలీకుండా తనని పెళ్లి ఎలా చేసుకోగలిగాడు?

బొత్తిగా అర్థం కాని ప్రభు ప్రవర్తనకి విసుగు వచ్చినా తమాయించుకుని నిశ్శబ్దంగా ఉండిపోయింది తన్మయి.

అయినా  అతని తల్లిదండ్రుల దగ్గిర అతనెలా నటిస్తే తనకెందుకు? తనకు కావలసిందల్లా మనశ్శాంతి.

బహుశా: అతనికే అదే అవసరమేమో. వాళ్లకు నిజాలు చెప్పి వాళ్ల ఏడుపులు, గోలలు, గొడవలు పడేకన్నా అబద్ధాలతో మనశ్శాంతి పొందుతున్నాడేమో.

కిందనే ఆగిపోయిన ప్రభుతో అతని తల్లి అంటున్న మాటలు మెట్లెక్కుతున్న తన్మయికి వెనకే చెవినపడుతూనే ఉన్నాయి.

"ఏం బాబూ, ఆ పిల్లోణ్ణి అటు నించటే ఆళ్ల అమ్మమ్మ కాడ దించేసి వత్తారనుకున్నాం. మళ్లీ తీసుకొచ్చేరేటి? ఆ మాత్రం దానికి ఆణ్ణి ఎంటెట్టుకుని ఎందుకు తీసుకెళ్ళేరు? ఆఫీసు మీటింగులుక్కూడా ఆడు ఎంట రావాలేటీ?"

వింటున్న తన్మయికి రక్తం మరగసాగింది. ప్రభు మౌనంగా వింటూ కూచోవడం మరింత చికాకు కలిగించసాగింది.

లాభం లేదు. ఇక వాళ్లకి, తనకి మధ్య ఉన్న సమస్యల్ని తనే పరిష్కరించుకోవాలి. ప్రభుతో  ఇటువంటి విషయాలు మాట్లాడడం కూడా అనవసరం.

ప్రయాణపు బడలిక వల్ల ఆ రోజు కూడా సెలవు పెట్టింది తన్మయి.

ప్రభు మాత్రం కాస్సేపట్లోనే హడావిడిగా ఆఫీసుకి బయలుదేరి వెళ్ళిపోయేడు. నిజంగా ఆఫీసు పని ఉన్నా లేకపోయినా ఇంట్లో గోల నుంచి బయట పడడానికి అతను ఎంచుకున్న మార్గమది.

బాల్కనీ లోంచి వీధి చివరి వరకూ ప్రభు వెళ్లిన వైపే చూసి నిట్టూర్చింది తన్మయి.

పిల్లలకి స్నానాలు చేయించి, తను కూడా తలారా స్నానం చేసింది.

పొడవైన జుట్టుకి సాంబ్రాణి పొగ వేసుకుంది.

వేడివేడిగా కాసిన్ని పాలు కాచుకుని తాగేసరికి నిద్ర ముంచుకు వచ్చింది.

అసలే ముందు రోజంతా జ్వరం పడి లేచిందేమో  మధ్యాహ్నం భోజనం సమయానికి రాణి వచ్చి లేపేవరకు నిద్రపోతూనే ఉంది.

కిందికి వెళ్లేసరికి అంతా అప్పటికే భోజనాలు కానిచ్చినట్టున్నారు.  టీవీ ముందు కూచున్నారు.

తన కోసం ఒక ప్లేటులో అన్నీ సర్దిపెట్టి మూతపెట్టిన భోజనాన్ని నిశ్శబ్దంగా తినసాగింది తన్మయి.

స్కాలర్స్ హాస్టలు గుర్తుకొచ్చింది. అక్కడ కూడా  ఇలాగే  ఎవరి భోజనం వాళ్లకి పళ్లేలు మూతలు పెట్టి ఉంచేవారు.

అక్కడికి ఇక్కడికి ఈ విషయంలో మాత్రం ఏవీ తేడా లేదు.

తనకీ, వాళ్లకి ఉన్న ఒకే ఒక్క సంబంధం ప్రభు. అంతే. తను ఎంత మామూలుగా ఉండాలనుకున్నా  వాళ్లకీ, తనకి ఏవీ సంబంధం లేనట్టే ప్రవర్తిస్తారు అందరూ.

పాపని మాత్రమే ముద్దు చేస్తూ, ఆ పిల్లతో మాత్రమే మాట్లాడుతూ ఉంటారు.

బాబు అప్పటికే అన్నం తిని బయటికి ఆడుకోవడానికి వెళ్ళిపోయేడు.

భోజనం చెయ్యగానే వెళ్లి వాళ్ళ దగ్గరగా కుర్చీ జరుపుకుని కూర్చుంది తన్మయి.

అంతా బిత్తరపోయి చూస్తుండగానే "ఆ టీ.వీ కట్టండి మీతో మాట్లాడాలి నేను" అంది సాధ్యమైనంత మామూలుగా.

ఏవిటన్నట్టు అంతా సర్దుక్కూర్చున్నారు.

తన్మయి ప్రభు తల్లిదండ్రుల వైపు సూటిగా చూస్తూ "ఇలా చూడండి. మీకు నాతో ఏ సమస్య ఉన్నా ఇకమీదట నాతోనే మాట్లాడండి. మీకు, నాకు మధ్య మీ అబ్బాయి రాయబారం అవసరం లేదు." అని "ఊ, చెప్పండి, బాబు విషయంలో మీకున్న ప్రాబ్లెమ్ ఏవిటి?" అంది.

ప్రభు తండ్రి వెంటనే తేరుకున్నట్టు "పిల్లోడితో పోబ్లమ్ అంటన్నావా? అసలు పిల్లోడే పోబ్లమ్ అని మేం అనుకుంటంటే" అన్నాడు గారపళ్లు బయటపెట్టి.

"వాడెందుకు ప్రాబ్లెమ్?" అంది సీరియస్ గా.

"ఎంతుకా? మా వోడు ఎండనకా, వాననకా ఎర్రని రత్తం మరిగిపోయి కరిగిపోయిలాగా కట్టపతన్నది నీ కొడుకుని పెంచటానికే సరిపోతంది గదా" అని అరిచింది ప్రభు తల్లి.

తన్మయి గొంతు పెంచి "నేను మీతో మాములుగా మాట్లాడుతున్నాను. మీరెందుకు అరుస్తున్నారు? మీ అబ్బాయే కాదు, నేను కూడా ఎర్రని రక్తం మరిగిపోయి కరిగిపోయిలాగా కష్టపడుతున్నాను. నా కష్టం, అతని కష్టం అంతా మిమ్మల్నందరినీ పోషించటానికే సరిపోతూవుందని నేనూ అనగలను. కానీ ప్రభు మాటకి విలువిచ్చి, అతని బాధ్యతలన్నీ నా బాధ్యతగా భావిస్తూ ఏనాడూ ఎటువంటి అడ్డు చెప్పలేదు. నేను, నాకొడుకు మీ కుటుంబంలో భాగమని మీరు అంగీకరించకపోయినా నేను మిమ్మల్నందరినీ నా కుటుంబంగా భావించాను...."

ఇంకా తన్మయి మాట పూర్తవకుండానే అందుకుంది బేబమ్మ. "నా కొడుకు సొమ్ము మాకే సెందుతాది. అది మా అక్కు. నువ్వెవరు అడ్డుసెప్పనీకి? సెప్పకపోనీకి? అందులో నీకన్నా వాటా ఉందేమో గానీ నీ కొడుక్కి లేదు. గుర్తెట్టుకో"

తన్మయి అడ్డొచ్చి "నా సహనాన్ని చాతగానితనంగా తీసుకోవద్దు. మీకు ఒక విషయం సీరియస్ గా చెపుతున్నాను. నా కొడుకుని కేవలం నా డబ్బులతో మాత్రమే పెంచుకొస్తున్నాను. మీ అబ్బాయి సొమ్ముతో కాదు. అయినా ఈ ఇంట్లో మీ అందరికంటే ఎక్కువ హక్కు ఉన్నది నాకు, నా కొడుక్కే. వాడిని ఈ ఇంట్లో నుంచి దూరంగా పంపడం అనే ఆలోచన మానెయ్యండి. వాడు ఎప్పుడూ నాతోనే ఉంటాడు. మీరు అనవసరంగా వాడిని, నన్ను మాటలని, ఇలా అయిన దానికి, కాని దానికీ గొడవలు చెయ్యడం, మమ్మల్ని హెరాస్ చెయ్యడం చేస్తే ప్రభు తల్లిదండ్రులని కూడా చూడను. పోలీస్ రిపోర్టు ఇచ్చి ఊసలు లెక్క పెట్టిస్తాను. మీతో బాటూ మీ అబ్బాయికి, మీ పిల్లలందరికీ కూడా అదే గతి పడుతుంది. పైగా మీ అబ్బాయి ఉద్యోగం కూడా ఊడుతుంది. నేనిన్నాళ్ళు ప్రభు మొహం చూసి ఊరుకున్నాను. మీ ఇష్టం నన్ను నా మానాన నన్ను ఉండనిస్తారో, లేదా నాతో గొడవ పడి జైలుకి వెళ్తారో తేల్చుకోండి." గబగబా అని అవాక్కయిన వాళ్ళ వైపు తీవ్రంగా చూస్తూ

"ఇదంతా మీ అబ్బాయి వచ్చేక చెప్పి నాకు అతనితో చెప్పించాలని ప్రయత్నం గానీ, మళ్లీ ఈ విషయంలో రాద్ధాంతం గానీ, లేదా నాకు మీ నించి ఏవిధంగానైనా హాని జరిగిందంటే ఇదిగో ఇది నేను కమిషనర్ ఆఫ్ పోలీసుకి రాసిన ఉత్తరం డూప్లికేట్ కాగితం. నేను కాలేజీకి రేపు మాములుగా వెళ్ళకపోతే పోస్టు చెయ్యమని నా స్నేహితురాలికి ఆల్రెడీ పంపించాను." అని వాళ్ల సమాధానం కోసం ఎదురుచూడకుండా మెట్లెక్కి గబగబా వెళ్లి తలుపేసుకుని చేతిలోని ఖాళీ కాగితాన్ని టేబులు మీద గిరాటేసి మంచమ్మీద వాలిపోయింది.

ఒక పక్క ఇలా వార్నింగ్ ఇవ్వడం వల్ల వాళ్లింకా రెచ్చి పోయే అవకాశం ఉన్నా, ఒక వార్నింగ్ ఇచ్చి చూడడం వల్ల నష్టమైతే ఏవీ లేదనిపించింది.

వాళ్లు తనని పోలీస్ రిపోర్టు వరకు తీసుకు రానిచ్చే మూర్ఖులే అయితే అసలు ఇంట్లో చేరేవారే కాదు.

మహా అయితే ఏం చేస్తారు? వాళ్ళబ్బాయి రాగానే విషయం చెప్పి మళ్లీ రాద్ధాంతం చేస్తారు.

ప్రభు ఈ విషయంలో ఏం గొడవ చేసినా ఎదిరించడానికి సిద్ధంగానే ఉంది తను.

కానీ తను మాత్రం ప్రభుతోనే ఉంటుంది ఏదేమైనా.

"తనది" అనే ఇంటిని నిలబెట్టుకుంటుంది. 'చూద్దాం ఎవరేం చేస్తారో' అని గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

ఒక పక్క ఎక్కడో కాస్త భయం వేస్తున్నా, పోరాడడానికి సిద్ధపడినపుడు పిరికితనం పనికిరాదని తనకి తాను ధైర్యం చెప్పుకుంది.

ఆ సాయంత్రం ప్రభు వచ్చే వరకూ గదిలోంచి బయటికి రాకుండా ఉండిపోయింది. బాబుని, పాపని కూడా కిందికి పంపడం మానేసింది.

ప్రభు వస్తూనే పాపని ఎత్తుకుని కిందికి తీసుకెళ్లి వాళ్లకిచ్చి వచ్చేడు. అప్పుడే అర్థం అయ్యింది. వాళ్లు ఆల్రెడీ ప్రభుతో ఫోను చేసి మాట్లాడేరని.

వాళ్లు ఏం చెప్పారో, తను ఏం మాట్లాడవలసి వస్తుందో అని ఆలోచిస్తున్న తన్మయితో ప్రభు యథావిధిగా ఆ ప్రసక్తి తీసుకురాలేదు.

వాళ్లు అసలు మొత్తం చెప్పేరో, లేదో కూడా తెలియదు.

ఒకవేళ వాళ్లు చెప్పి ఉంటే తనతో అనవసరమైన చర్చలు పెట్టని అతని మీద తన్మయికి గౌరవం కలిగింది. బహుశా: తన బాధ అతనికి అర్థమై, వాళ్ళకి ఆ మాత్రం తెలిసిరావాలని అర్థం చేసుకుని ఉండాలి.

వాళ్లు ప్రభుతో ఏమీ చెప్పి ఉండకపోతే కొంతైనా వాళ్లలో భయం, ఆలోచన కలిగిందని అనుకోవచ్చు. లేదా వాళ్లు తనని మరేదైనా విధంగా ఎదుర్కోవాలని ప్రణాళికలు వేస్తూ అయినా ఉండొచ్చు.

ఏదేమైనా తన్మయికి మొదటిసారి ఎంతో సంతోషం కలిగింది.

ఈ పని ఎప్పుడో చేసి ఉండవలసింది. వాళ్ళేమన్నా ఎదురు చెప్పవద్దన్న ప్రభు మాట విని ఇన్నాళ్లు అనవసరంగా ఉపేక్షించింది.

వాళ్లని ఎదిరించి ధైర్యంగా సమాధానం చెప్పినందుకు ఆ రాత్రి తన్మయికి ప్రశాంతంగా నిద్రపట్టింది.

★★★

ఇంట్లో ఆ తర్వాత ఎవరూ బాబుని, తనని ఏవీ అనకపోవడం స్థిమితాన్నిచ్చింది తన్మయికి.

త్వరత్వరగా పీ హెచ్ డీ పని పూర్తి చేసి మరో మూణ్ణెల్లలో సబ్మిట్ చేసింది.

థీసిస్ సబ్మిట్ చెయ్యడం కోసం విశాఖపట్నానికి వెళ్లి తిరిగి వచ్చిన వారానికి ప్రభుకి అనుకోకుండా ఉద్యోగం సంబంధిత కష్టమొచ్చిపడింది.

తను పనిచేస్తున్న ఆఫీసు మూతపడి కొత్త ఉద్యోగం వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిపడింది.

ఆఫీసు మూతపడే ముందు ఇచ్చిన గడువు పూర్తయిపోయినా మరో ఉద్యోగం రాలేదు ప్రభుకి.

ఎప్పటికప్పుడు ప్రభు జీతమంతా ఖర్చు పెట్టేస్తూ ఉండడం, సేవింగ్సు ఏవీ లేకపోవడం వల్ల ఇల్లు మొత్తం తన్మయి జీతమ్మీద ఆధారపడింది.

మొదట్లో ఇద్దరి జీతాలు మొత్తం ఇంటికే పూర్తిగా ఖర్చు పెట్టేసేవారు. ఎప్పుడైతే ప్రభు తరపు వాళ్ల ఖర్చులు బాగా అధికమై బొత్తిగా సేవింగ్స్ కూడా లేకుండా అయిపోతున్నాయో, పైగా ప్రభుకి ఇంటి ఖర్చులకి సరిపడా జీతం పెరగగానే ఇక తన్మయి జీతం ఇంట్లో ఖర్చు పెట్టవద్దని తనకి నచ్చినట్టు చేసుకోమని చెప్పేడు. ప్రభు ఒకసారి మాట అన్నాడంటే దానికి కట్టుబడి ఉంటాడు.

అప్పటి నుంచి మళ్లీ ఇదే మొదటిసారి తన్మయి ఇంటి కోసం ఖర్చు పెట్టాల్సి రావడం.

ప్రభు అడక్కుండానే తనే "ఉద్యోగం వెంటనే దొరక్కపోయినా టెన్షన్ పడొద్దు. ఇంటి ఖర్చులు నేను చూసుకుంటానని" ధైర్యం చెప్పింది తన్మయి.

హైదరాబాద్ వచ్చిన దగ్గరనించి ఇష్టం వచ్చినట్టు ఖర్చు పెట్టు కుంటూ విలాసవంతంగా బతకడానికి అలవాటు పడ్డ అందరికీ ఇప్పుడు ఖర్చుని నియంత్రించుకుని బతకడం గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయ్యింది.

" మాకు ఊరికే తిండి ఒకటీ పెడితే సరిపోయిందా? ఏం ఆవిడ మా ఖర్చులన్నీ ఎందుకు భరించదూ అంట?" అని అరుస్తున్న తల్లి మీద ఆ సాయంత్రం మొదటిసారి ప్రభు గట్టిగా అరవడం వింది.

"తను మనందరినీ ఆదుకుందని సంతోషించడం పోయి ఇంకా డబ్బు గురించి పీడించడం కూడానా? ఇన్నాళ్లూ మీరేం చేస్తున్నా నా కన్నవాళ్లని భరిస్తూ వస్తున్నాను. అసలే ఉద్యోగం దొరక్క నా వ్యథలో నేను ఉన్నాను. నన్ను ఇంతకంటే బాధకి గురిచెయ్యకండి అమ్మా...." ప్రభు గొంతు జీరబోయింది.

తన్మయికి బాధ కలిగింది. కొడుకు మీద ఇంత భారం మోపి చోద్యం చూస్తున్న ఆ తల్లితండ్రుల పట్ల కూడా అతనికి ఎంత ప్రేమ! చిన్న వయసులో పెద్ద కుటుంబభారం మోస్తున్న అతని పట్ల అట్నుంచి వాళ్లకి మాత్రం కించిత్ కూడా దయ లేదు.

ఆ రాత్రి తన్మయి ప్రభుని హత్తుకుని "బాధపడకు. అన్నీ సర్దుకుంటాయి. ఇంట్లో ఎవరికి ఏం కావాలన్నా నేను చూస్తాను" అంది మనస్ఫూర్తిగా.

తన్మయిని అలాగే కౌగలించుకుని మౌనంగా రోదించసాగేడు ప్రభు.

తన మీద ఆధారపడ్డ పసివాడిలా రోదిస్తున్న ప్రభు మీద అమితమైన ప్రేమానురాగాలు కలిగేయి తన్మయికి.

"మనం ఎవ్వరికీ అన్యాయం చెయ్యలేదు. మనకెప్పటికీ అన్యాయం జరగదు. చూస్తూ ఉండు నీకు ఇంత కంటే ఉన్నతమైన ఉద్యోగం తప్పకుండా లభిస్తుంది. అసలు అందుకే ఇదంతా జరిగింది" అని అతనికి ధైర్యం చెప్పసాగింది.

70

**తన చేతుల** మీద ఇల్లు నడవడం ప్రారంభించేక డబ్బు ఎంత వృథా అవుతుందో అర్థం కాసాగింది తన్మయికి. ఇంట్లో ప్రతి ఒక్కరినీ సరిదిద్దాల్సిన అవసరం కూడా అర్థమైంది.

ప్రభు చేసినట్టు జీతమంతా వాళ్ల చేతుల్లో పోసి, నచ్చినట్టు చేసుకోమనడం వంటివి తన్మయి చెయ్యకపోవడం వాళ్లకి కినుకగా ఉన్నా, డబ్బు సంపాదించే వ్యక్తిగా తను ఎలా ఇంటిని పొదుపుగా నడపాలనుకుంటుందో అలా నడపడం మొదలు పెట్టింది.

నిత్యావసర వస్తువులు, కరెంటు, ఇంటర్నెట్టు వంటి తప్పనిసరి బిల్లులు కాకుండా ప్రతి ఒక్కరి ఇతర ఖర్చుల లిస్టు రాసి పట్టుకు రమ్మని రాణిని పురమాయించింది.

ఆ సాయంత్రం రాణి తెచ్చిన చీటీలో "మందులు" అని ఉన్న ఒకే ఒక్క పదం, పక్కన ఉన్న నంబరు చూసి నవ్వొచ్చింది తన్మయికి.

మొత్తం ఇంటి ఖర్చు కంటే అధికమైన నంబరు అది.

నెలకు "ఇన్ని వేల మందులు ఎవరికి అవసరమవుతున్నాయి? ఎందుకు అవసరమవుతున్నాయి?

బ్యూటీ పార్లర్లు, సినిమాలు, చుట్టాలుపక్కాల ఇళ్లకి, ఊళ్లకి ఊరికే వెళ్లి రావడానికి ఛార్జీలు, అవసరం ఉన్నా లేకపోయినా కనబడ్డ వస్తువులు, బట్టలు కొనుక్కోవడం... ఇలా అన్ని ఖర్చులూ కలిపి మందులు అని వేస్తే ప్రభులా మాట్లాడకుండా వాళ్ల చేతుల్లో పెట్టెయ్యాలన్న వాళ్ల ఆలోచనని మొగ్గలోనే తుడిచెయ్యాలి. కానీ ఇలా అడ్డుకట్ట వెయ్యడం వల్ల వాళ్లకి తనపై ద్వేషం పెరగడం తప్ప డబ్బు ఎలా ఖర్చు చేయాలన్నది అర్థం కాదు." ఆలోచనలో పడింది తన్మయి.

"you will never come know the value of money unless you earn it"

“డబ్బు సంపాదించినప్పుడే దాని విలువ తెలుస్తుందని ఎవరో మహానుభావుడన్నట్టు ముందు ఇంట్లో అందరినీ తలా ఒక పనిలో కుదర్చి ఎవరికి వాళ్లు కనీసం వాళ్ల పాకెట్ మనీ అయినా సంపాదించుకునేలా చెయ్యాలి”. అనుకుంటూ

"ఎవరికి ఏం మందులు కావాలన్నా మందుల చీటీలు ఇస్తే తనే ఇక మీదట అన్నీ నేనే కొనుక్కొస్తాను"

అని రాణితో చెప్పింది తన్మయి.

అదెంత దుమారం లేపుతుందో తెలుసు తనకి. చేతిలో ఉన్న పరిమితమైన వనరులతో ఇంత పెద్ద సంసారాన్ని నడుపుకు వస్తానని ప్రభుకి మాట ఇచ్చింది తను. ఇక మిగతా వాళ్లు సహకరించడం, సహకరించకపోవడం అన్నది వాళ్ల విజ్ఞతకే వదిలేసింది.

కుట్టుపని నేర్చుకున్న రాణిని కాలనీ చివర ఉన్న జీన్స్ కంపెనీలో జాయిను చేసింది.

ప్రైవేటుగా చదువుతున్న రాణి తమ్ముడు దాసుని మెడికల్ షాపులో సహాయకుడిగా ఉద్యోగంలో చేర్చింది.

పిల్లల్ని, తల్లితండ్రుల్ని కనిపెట్టుకుంటూ ఇంట్లోనే ఉన్న రాణి తల్లి మంగకి వంట, కేరేజీల పని అప్పగించింది.

పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్లడం, తీసుకురావడం, కాయగూరలు, సామాన్లు వంటివి కొని తెచ్చే పనులన్నీ ప్రభు తల్లితండ్రుల వంతయ్యింది.

రోజల్లా కాలేజీకెళ్లొచ్చేసరికే అలిసిపోతున్నా, సాయంత్రం ఇంట్లో పిల్లలతో బాటూ, చుట్టుపక్కల ఉన్న వేరే వాళ్ల పిల్లలకీ ట్యూషన్లు చెప్పడం ప్రారంభించింది తన్మయి.

ప్రభు రోజల్లా ఇంట్లో ఉండి బిజీగా ఉద్యోగ ప్రయత్నాలకి చదువుకుంటూ ఉండడం వల్ల, సాయంత్రం ట్యూషన్లు కింది హాల్లో చెప్పడం ప్రారంభించడం వల్ల ఇరవై నాలుగ్గంటలూ మోగే టీవీకి మొదటగా చెక్ పడింది. ఇందువల్ల కరెంటు బిల్లు కొంతలో కొంత ఆదా అయ్యింది.

ఇక ఎప్పుడూ మంచానికి జేరబడి నిద్రపోవడానికి ప్రయత్నించే ప్రభు తల్లికి తప్ప మిగతా వారికి కాస్త పనికొచ్చే పనుల మీద దృష్టి మళ్లింది.

రెండు నెలల్లో ఇల్లు ఒక కొలిక్కి వచ్చింది.

సేవింగ్సు లేకపోయినా కనీసం ఇల్లు సక్రమంగా గడుస్తుందన్న ధైర్యం వచ్చింది తన్మయికి.

★★★

ఆ రోజు ఇంటర్వ్యూకి వెళ్ళిన ప్రభు సాయంత్రం వస్తూనే తన్మయిని బండెక్కమని రోడ్డు మీద ఐస్ క్రీం పార్లర్ కి తీసుకెళ్లేడు.

"ఎలా జరిగింది ఇంటర్వ్యూ" అంది.

"అదే నీతో మాట్లాడాలి" అన్నాడు నడుమ్మీది తన్మయి చేతిని తన చేత్తో ప్రేమగా పట్టుకుంటూ.

"ఇంట్లో చెప్పకూడదా" అంది నవ్వుతూ.

"ఐస్ క్రీం పార్లర్ కొత్తగా పెట్టేరు. మనిద్దరమే కొంచెం సేపు కబుర్లు చెప్పుకోవడానికి అదే మంచి స్థలం. అయినా మనిద్దరం కలిసి బయటికి వెళ్లి ఎన్నో రోజులయిపోయింది" అన్నాడు.

తన్మయికి ఎంతో సంతోషం వేసింది. తన మనస్సులో ఎన్నాళ్లుగానో ఉన్న కోరిక అది.

తన్మయికి ఇష్టమైన ట్రూటీఫ్రూటీ ఆర్డర్ చేసేడు.

"మరి నీకు?" అంది.

"నాకొద్దులే" అన్నాడు.

బిల్లు గురించి ఆలోచిస్తున్నాడని అర్థమై "సరే,ఇద్దరం ఇదే షేర్ షేసుకుందాం" అంది.

గ్లాస్ డోర్స్ లోపల కూర్చునే సరికి బయటి రణగొణ ధ్వని తగ్గింది.

మెల్లగా చెప్పేడు ప్రభు."ఉద్యోగం ఇస్తామన్నారు"

తన్మయి "ఇంత మెల్లగానా చెప్పడం. కంగ్రాట్స్. నాకు తెలుసు, నీకు వస్తుందని. హమ్మయ్య, ఇప్పుడు స్థిమితంగా ఉంది. ఇప్పటి వరకు చెప్పక పోతే ఏమైందో ఏవిటో అని ఖంగారు పడ్డాను " అంది నవ్వుతూ.

"కానీ..." అని ఆగి "నేనే ఆలోచిస్తున్నాను" అన్నాడు సంశయంగా.

ఎందుకన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది.

నీతో మాట్లాడేక నిర్ణయం తీసుకుందామని నా నిర్ణయం రేపు చెపుతానని చెప్పేను వాళ్లకి.

తన్మయి "అలాగే, నీకు నచ్చితేనే చేద్దువు, ఏవిటో చెప్పు" అంది.

"ఇదొక కన్సెల్టెన్సీ కంపెనీ. యూ. ఎస్ లోని చిన్న కంపెనీకి పనిచెయ్యాలి. జీతం ఇంతకు ముందులా ఎక్కువ ఉండదు. కానీ వచ్చే ఏడాది హెచ్ వన్ అప్లై చేస్తే అమెరికాలోనే ఉద్యోగం చేసే అవకాశం ఉండొచ్చు." అన్నాడు.

"జీతం తక్కువైనా అన్నీ బానే ఉన్నట్టున్నాయి కదా, మరి ఆలోచనెందుకు?" అంది.

"ఇందులో కొన్ని చిక్కులున్నాయి. మొదటిది ఏవిటంటే వాళ్ల బెంగుళూరు ఆఫీసు నుంచి పనిచెయ్యాలి. వచ్చే జీతంలో అక్కడ లివింగ్ ఎక్స్ పెన్సెస్ కి ఎక్కువ భాగం పోతుంది.ఇక రెండోది జీతం తక్కువైనా దొరికింది కదా అని జాయినయ్యినా, వచ్చే ఏడాది ప్రాసెసింగు ప్రారంభించినా హెచ్ వన్ లాటరీ సిస్టం కాబట్టి తగలొచ్చు, తగలక పోవచ్చు. అలా ప్రతీ ఏడాదీ ప్రయత్నిస్తూ పోవల్సిందే. పైగా ఆ ఖర్చులన్నీ మనం పెట్టుకోవాలి. ఇక మూడోదీ, అతి ముఖ్యమైందీ నిన్నూ, పాపని వదిలేసి మరో ఊళ్లో ఉద్యోగం అంటేనే బెంగగా ఉంది." అన్నాడు దిగులు నిండిన చూపులతో.

తన్మయి కూడా దిగులుతో ఆలోచనలో పడింది.

నిజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభు ఏదో ఒక ఉద్యోగంలో సత్వరంగా కుదురుకోవడం అవసరం. కానీ పైవన్నీ అననుకూల పరిస్థితులే.

పైకి మాత్రం "నీకేమనిపిస్తూ ఉంది?" అంది.

"ఇప్పటికే రెండు నెలలవుతూంది జాబ్ పోయి. ఇంటర్వ్యూలు చేసి చేసి విసుగ్గా ఉంది" అన్నాడు నిరాశగా.

"అలా నిరాశ పడకు. పోనీ జాయినవ్వు. అయితే జాయినయ్యే ముందు కొన్ని కండిషన్లు పెట్టి చూడు. ఒప్పుకుంటే కాస్తో కూస్తో మంచిది. మొదటిది వాళ్ల హైదరాబాదు బ్రాంచి నించి పని చెయ్యడానికి కుదురుతుందేమో కనుక్కో. ఒకవేళ టీంతో కలిసి తప్పనిసరిగా పనిచెయ్యాల్సి వస్తే, నెలకి ఒక వారం బెంగుళూరు వస్తానని చెప్పు. ఆ వారానికి, ఉండడానికి వాళ్లనే రెసిడెన్సు ఏర్పాట్లు చెయ్యమను. ఇక రెండోది హెచ్ వన్ ప్రాసెసింగు వెంటనే ప్రారంభించమని అడిగి చూడు. ఎలాగూ లాటరీ అంటున్నావు కాబట్టి ఈ సంవత్సరంలో వస్తే వస్తుంది, లేకపోతే లేదు. మళ్లీ వచ్చే ఏడాది ప్రయత్నించొచ్చు. ఇక ప్రాసెసింగు ఫీజులవీ వాళ్లనే భరించమని చెప్పు. ఇక అన్నిటికంటే ముఖ్యంగా జీతం ఇంతకు ముందు నీకు ఎంతొచ్చేదో అంతకన్నా కాస్త ఎక్కువే అడిగి చూడు" అంది.

"ఒకవేళ వాళ్లు వొప్పుకోకపోతే" అన్నాడు గట్టిగా నిట్టూర్పు విడుస్తూ.

"లేకపోయినా జాయినవ్వు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది మంచి ఆప్షన్ అనిపిస్తూ ఉంది నాకు. కానీ ఆ విషయం వాళ్లకి ముందే తెలియనివ్వకు" అంది మెల్లని గొంతుకతో.

"అంతేనంటావా?" అన్నాడు సాలోచనగా.

"భయపడకు. అన్నీ మన మంచికే జరుగుతాయి. ఈ ఉద్యోగం వల్ల మనకి మంచి జరిగేది ఉంటే తప్పకుండా అన్నీ అనుకున్నట్టు సక్రమంగా నెరవేరుతాయి. మొదట రెండు, మూడు నెలల్లో నీకు నచ్చకపోతే మరొక ఉద్యోగం కోసం వెతుక్కుంటావు. అంతే కదా." అంది అనునయంగా.

"హమ్మయ్య. నీతో మాట్లాడేక ఒక క్లారిటీ వచ్చింది తనూ. సాయంత్రం నుంచి ఏం చెయ్యాలా అని ఒకటే తల పగిలిపోతూందనుకో" అన్నాడు మనసు తేలికపడ్డవాడిలా మందహాసం చేస్తూ.

★★★

మర్నాడు సాయంత్రం తన్మయి ఇంటికి రాగానే సుడిగాలిలా చుట్టుకున్నాడు ప్రభు.

"ఏవిటిది?" అంది సంతోషంగా.

"అబ్బ, నీతో స్వయంగా చెప్పాలని గంట నించీ ఉవ్విళ్లూరుతున్నా. మనం అడిగినవన్నీ ఒప్పుకున్నారు. అయితే జీతం ఇంతకు ముందు ఎంత వస్తుందో ఇప్పుడూ అంతే. తక్కువా లేదు, ఎక్కువా లేదు. అయినా ఫర్వాలేదని ఒప్పేసుకున్నా" అన్నాడు హుషారుగా.

"వెరీగుడ్ , ఇక నువ్వు హాయిగా ఏ దిగులూ లేకుండా ఉద్యోగం చేసుకో" అంది తన్మయి హాయిగా నవ్వుతూ.

"ఇక మీదట కూడా ఇంటిని నువ్వే నడుపు తనూ" అన్నాడు ఏదో గుర్తుకొచ్చినవాడిలా.

"సేవింగ్సు లేక ఇబ్బందులు పడడం వల్ల జ్ఞానోదయం అయ్యిందో, తన సమర్థత గమనించి అంటున్నాడో తెలీదు కానీ, ఇప్పటికైనా తెలిసి వచ్చినందుకు సంతోషంగా అనిపించింది తన్మయికి.

అయితే ఒక షరతు "నాపై కంప్లైంట్లు ఏవున్నా నాకే చెప్పమని చెప్పు మీ వాళ్లకి" అంది.

"చిత్తం మహారాణీ" అన్నాడు భటుడిలా అభినయిస్తూ.

ప్రభు ఏం చెప్పేడో తెలీదు కానీ ఎప్పటిలా జీతం తనకే ఇమ్మని బేబమ్మ గొడవ పెట్టినట్టు వినిపించలేదు. ఒక్కొక్కటిగా సమస్యలు చక్కబడుతుండడంతో తన్మయికి కాస్త ఊరటగా ఉంది.

నెలకొకసారి ఇంటిల్లపాదినీ ఐస్క్రీము షాపుకనీ, సినిమాకనీ అందరినీ తీసుకు వెళ్లినా ఇల్లు తన్మయి నడుపుతూ ఉండడంతో మరసటి నెల నుంచి సేవింగ్సు కూడా మిగలసాగేయి.

తన్మయి పిల్లలందరి పేరునా కిడ్డీ బేంకు ఎకౌంట్లు ఓపెన్ చేసింది.

రాణి కూతురు బుజ్జితో సహా అందరికీ సమానంగా వెయ్యసాగింది.

అవసరమైనపుడల్లా అందరికీ కొత్త బట్టలు కొనడం దగ్గర్నించి ఎవరికి ఏం కావాలన్నా ముందే తెలుసుకుని అమర్చి పెట్టసాగింది.

అయినా వాళ్ల మొహాల్లో కళాకాంతీ లేకపోవడం గమనిస్తూనే ఉంది.

ఇదంతా ఎప్పుడో ఓ సారి తుఫానులా విరుచుకుపడుతుందని ఊహించింది.

అనుకున్నట్టుగానే ఓ రోజు ప్రభుని అర్థరాత్రి వరకూ మేడమీదికి రానివ్వకుండా పెద్ద గొంతులేసుకుని అతని తల్లితండ్రీ అరవడం వింది.

వాళ్లకంటూ ఖర్చు పెట్టుకోవడానికి నెలకు పదివేలు ఇచ్చెయ్యాలనీ, అవి వాళ్లేం చేసుకున్నా లెక్కా పత్రం అడగక్కూడదనీ సారాంశం.

"ఇక ఎప్పటికీ వీళ్లు మారరు" అనుకుంది.

ఎప్పటిలానే అన్నిటినీ మౌనంగా వింటూ కూచున్న ప్రభుని చూసి కోప్పడాలో, జాలి పడాలో అర్థం కాలేదు తన్మయికి.

ఇలా గొడవలు పెట్టీ, రాద్ధాంతం చేస్తే ఏదైనా చేస్తాడనే అలుసు బాగా ఇచ్చాడు ప్రభు.

మేడ మీదికి రాగానే ఆ విషయం మాట్లాడబోతున్న ప్రభుని మధ్యలోనే ఆపి

"ఇప్పుడిప్పుడే కష్టాల నించి గట్టెక్కుతున్నాం మనం. వాళ్లు అడిగినట్టు నెలకు పదివేలు ఇవ్వగలిగే స్థితిలో మనం ఉండాలని కోరుకుంటున్నాను. కానీ నువ్వే ఆలోచించు. మనం అంత స్థితిలో ఉన్నామా? పైగా ఇవేళ పదివేలు..రేపు పదిహేనువేలంటూ.. ఇలా లిమిట్ లేకుండా పోతే సంసారం నడపడం ఆ భగవంతుడి తరం కూడా కాదు." అంది.

"మన పరిస్థితి నాక్కూడా తెలుసు. కానీ వాళ్లు స్వతంత్రంగా ఉండాలని కోరుకోవడంలో తప్పు ఏవుంది?" అన్నాడు.

"వాళ్లు స్వతంత్రంగా ఉండాలని కోరుకోవడంలో తప్పులేకపోవచ్చు. కానీ ఇప్పుడు మనం ఉన్న పరిస్థితుల్లో వాళ్ల చేతికి అడిగినంతా ఇచ్చి, మిగతా సొమ్ముతో ఇల్లు నడపడం అసాధ్యం. మనం ఇంకా కొంత తేరుకునే వరకూ కొన్నాళ్లు అందరూ అడ్జస్టు కాక తప్పదు" అంది స్థిరంగా.

ఇక ప్రభు మళ్లీ ఎప్పుడూ ఆ టాపిక్ తీసుకురాలేదు.

తర్వాతి నెలలో ప్రభు ఇంటికి వస్తూనే "పదివేలు బోనసు ఇచ్చేరు తనూ ఇవేళ" అన్నాడు.

తన్మయి వెంటనే "ఆ పదివేలు మీ వాళ్లకే ఇచ్చెయ్యి" అంది.

సంతోషంగా తన్మయిని కౌగిలించుకున్నాడు ప్రభు.

★★★

ఆ మరుసటి వారంలోనే తన్మయికి పీ.హెచ్.డీ గోల్డు మెడలుకి సెలక్టు అయినట్టుగా ఉత్తరం వచ్చింది యూనివర్శిటీ నించి. మరో నెల రోజుల్లో పట్టా అందుకుందుకు కాన్వొకేషను వివరాలు కూడా పొందుపరచబడ్డాయి.

ఉత్తరం అందుకోగానే తన్మయికి గొంతుపూడుకుపోయినట్టు ఉద్వేగంతో దు:ఖం ప్రవాహమయ్యింది.

ఎన్నినాళ్ల కల ఇది!

అత్యుత్తమమైన ఈ చదువు కోసం అహర్నిశలూ కలలు కని, జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తింది. ఎన్నో కష్టాలకోర్చింది. సంయమనంతో అన్నిటినీ ఓర్చుకుంటూ వచ్చింది. ఎక్కడా ఓడిపోకూడదని పట్టుదలతో అడుగులు వేసింది.

అప్పటివరకూ పడ్డ కష్టాలన్నీ గిర్రున కళ్ల ముందు తిరిగేయి.

పీ.హెచ్.డీ పట్టా పుచ్చుకోవాలన్న తన లక్ష్యానికి ఎన్నెన్ని అవరోధాలు! కాలం అనుక్షణం తన లక్ష్య సాధనకు ఏదో విధంగా అడ్డుపడుతూనే ఉంది.

ఒకటా రెండా ఎన్నో ఊహలతో అల్లుకున్న జీవితంలో అడుగడుగునా మోచేతులు, మోకాళ్ళు కొట్టుకుపోయి లోయల్లోకి జారిపడ్డ ఎన్నో సందర్భాలు. అదేవిటో గానీ పడిన ప్రతిసారీ మళ్లీ లేవాలన్న కొత్త పట్టుదల కలిగేది.

ఆనందభాష్పాలు చెంపల్ని తడిపెయ్యసాగేయి.

"అరికాళ్లలో ముళ్ళతో శిఖరారోహణ చెయ్యాల్సి వచ్చిన నీ జీవితం నిరంతరం కన్నీళ్లమయమైనా నీ విజయం నీలాంటి ఎందరో దురదృష్టవంతులైన యువతులకు జీవితం పట్ల గొప్ప ఆశను, స్ఫూర్తిని ఇస్తుందమ్మా" అన్న మాస్టారి మాటలు జ్ఞాపకం వచ్చేయి.

ఎవరికైనా ఎంత స్ఫూర్తి కలుగుతుందో తెలియదు కానీ తన్మయికి మాత్రం ఆకాశాన్ని జయించిన అనుభూతి కలగసాగింది.

"మిత్రమా! నేను గెలిచాను" అని దిక్కులు పిక్కటిల్లేలా అరవాలని అనిపించింది.

పిల్లలిద్దర్నీ అక్కున చేర్చుకుని ముద్దులు కురిపించింది.

గదిలోనే గింగిరాలు కొట్టింది.

సమయానికి ప్రభు బెంగుళూరులో ఉండిపోయేడు.

ప్రభుకి, తల్లికి ఫోను చేసి చెప్పింది.

ఇంకా సంతోషం పట్టలేక రాణికి చెప్పింది ఇంట్లో అందరికీ చెప్పమని.

ఆ సాయంత్రం భోజనానికి కిందికి వెళ్ళినపుడు ఎవరైనా ఏవైనా మాట్లాడతారేమో అని చూసింది.

ఎవరికి ఎంత అర్థమయ్యిందో తెలియదు కానీ ఎవ్వరూ కనీసం చిన్నపాటి ఆనందం కూడా వ్యక్తపరచలేదు.

ఎప్పటిలా భోజనం పళ్లెం టేబుల్ మీద పెట్టి వాళ్ల టీ.వీ లో వాళ్లు మునిగిపోయి ఉన్నారు.

ఉండబట్టలేక ప్రభుకి మళ్లీ ఫోను చేసింది.

"నీకు ఎప్పుడూ చెప్పేదే, అయినా విను. వాళ్ల నించి నువ్వు ఎప్పుడూ ఏవీ ఎక్స్ పెక్టు చెయ్యకు" అన్నాడు.

ఆ రాత్రి డైరీలో "మనదనే ఇల్లు మనసులో మాత్రమే ఉంటుంది" అని రాసుకుంది తన్మయి.

తనదనే ఇల్లు, తన వాళ్లనే మనుషులు లేకపోవడం జీవితంలో ఎంత దురదృష్టమో బాగా అర్థం అయ్యింది.

వీళ్లని తనెలాగూ మార్చలేదు. కనీసం తనైనా "తన" అనే ప్రశాంతమైన ఇంట్లో జీవించడం ఎలా?

తీవ్రమైన ఆలోచనల్తో పొద్దుట్నించి ఉన్న సంతోషం స్థానంలో అంతులేని బాధ, దుఃఖం కలగసాగేయి.

71

తన్మయి కాన్వొకేషను కోసం సెలవు పెట్టేడు ప్రభు.

ప్రభుతో, పిల్లల్తో కలిసి స్నాతకోత్సవానికి వెళ్లడం ఎంతో సంతోషంగా అనిపించింది తన్మయికి.

రైలు రిజర్వేషన్లు కాగానే ఎందుకు వెళ్తున్నారో, ఎక్కడికి వెళ్తున్నారో ఈ సారి ఇంట్లో తనే చెప్పింది తన్మయి.

అంతే కాదు, తనెక్కడికి వెళ్లినా బాబు తన వెంటే వెంటాడన్న విషయమూ స్పష్టం చేసింది.

"అసలు వీళ్లందరికీ జవాబు చెప్పుకోవల్సిన అవసరం తనకేంటి? ఈ ఇంట్లో ప్రభుతో బాటూ తను కూడా సంపాదనపరురాలే. తన భర్త, పిల్లలతో తను తనకి నచ్చిన చోటికి, నచ్చిన పని మీద వెళ్లే హక్కు లేదా? అసలు తన జీవితమ్మీద, బాబు జీవితమ్మీద వీళ్ల పెత్తనం ఏవిటి?"

ఎంత వద్దనుకున్నా తలుచుకుంటుంటే గొప్ప విచారం కలుగుతూంది.

ఈ పెళ్లి అనే తప్పిదం వల్ల అప్పటిదాకా సాఫీగా సాగుతున్నవెన్నో విషయాలు తారుమారయ్యేయి.

ఒక విధంగా ఆలోచిస్తే మొదట్నించి మౌనంగా ఉండాలన్న ప్రభు అభ్యర్థనని మన్నించి తన జీవితమ్మీద, తనకి సంబంధించిన విషయాల మీద ప్రభు తరఫు వాళ్లు కలగజేసుకునే అవకాశం తనే ఇచ్చింది. మొదట్లోనే పరిధులు నిర్ణయించి ఉంటే తన విషయాలలో జోక్యం చేసుకునేవారు కాదు.

"అయినా ఇప్పటికీ మించిపోయింది లేదు. బెటర్ లేట్ దేన్ నెవ్వర్.

తనకి సంబంధించిన విషయాలు వాళ్లకు నచ్చుతాయా, నచ్చవా అన్నది తనకి ముఖ్యం కాదు. అయినా కుటుంబ విషయాలకి, తనకే సంబంధించిన విషయాలకి ఉన్న తేడా వాళ్లు అర్థం చేసుకోలేనప్పుడు విడమర్చి చెప్పాల్సిన బాధ్యత తనదే. అందుకే చెప్పింది. అయినా వింటారన్న నమ్మకం లేదు. కానీ ఎక్కడా తన ప్రయత్నలోపం ఉండకూడదు." స్థిరంగా అనుకుని గట్టిగా ఊపిరి తీసుకుంది తన్మయి.

కానీ ఒకటి మాత్రం బాగా అర్థమైంది. ప్రభు తన వాళ్ల ముందు జవాబుదారీగా నిలబడుతున్నంత కాలం తనకీ పీడన తప్పదు. అతనిలో "వాళ్లకు తెలీకుండా పెళ్లి చేసుకోవడమన్నది ఒక ఘోర అపరాధం" అనే భావన, గిల్టీ కాన్షస్ నెస్సే వీటన్నిటికీ కారణం. దానిని మాపుకోవడం కోసమే ప్రభు వీళ్లేదడిగినా చేస్తూ వస్తున్నాడనేది స్పష్టం అవుతూంది.

ఏదేమైనా అధైర్యపడకుండా ఒక్కొక్కటీ చక్కబెట్టుకు రావాలి.

తన దురదృష్టం ఏవిటంటే ఇటువంటి విషయాలు పంచుకోవడానికి, సలహా తీసుకోవడానికి ఎవరూ లేరు. అన్నీ స్వంతంగా చక్కబరచుకోవలసిందే.

వాళ్లు ప్రభు బాధ్యతే అయినా ప్రభు సంతోషం కోసమే వాళ్ల కోసం ఏదైనా చేస్తూ వస్తోంది. వాళ్లకు తన మీద ఉన్నట్టు , తనకు వాళ్ల పట్ల వ్యతిరేకతేమీ లేదు. నిజానికి వాళ్లు తన పరిస్థితిని అర్థం చేసుకుని, మంచిగా ప్రవర్తిస్తూ ఉండి ఉంటే తాను నెత్తిన పెట్టుకుని పూజించేది వాళ్లని. తనని బాధించడం ద్వారా చేజేతులా వాళ్లే తనని దూరం చేసుకుంటున్నారు. తనకి 'ఇల్లొక నరకం' అని అనిపించే పరిస్థితిని సృష్టిస్తున్నారు.

'జీవిత కాలంలో వాళ్ళు ఎప్పుడూ నాకు ఏమీ కారు' అనే భావన తనకి, విపరీతమైన ఏహ్యాభావన బాబుకి మనస్సుల్లో ముద్రపడిపోయేయి ఇప్పటికే. నిజానికి వాళ్ల వల్ల తాత్కాలికంగా తనకి కలిగే మనస్తాపం వల్ల తనకి వచ్చే నష్టం కన్నా, తన మనసులోనూ, పిల్లల మనస్సుల్లోనూ వాళ్ళ పట్ల పెరిగిపోతున్న దూరం వల్ల వాళ్లకు కలిగే నష్టమే ఎక్కువ.

★★★

స్నాతకోత్సవానికి ప్రసిద్ధిగాంచిన సినిమా హీరోని పిలవడంతో కాన్వొకేషను హాలు బయటంతా జనం ఇసకేస్తే రాలకుండా ఉన్నారు.

స్నాతకోత్సవంలో పాల్గొని పట్టా అందుకోబోయే వారు స్టేజీకి దగ్గర్లో కూర్చోవాలి కాబట్టి తన్మయి ప్రభుని, పిల్లలని వదిలి వెళ్లక తప్పలేదు. ఇక విపరీతమైన జనం తొక్కిసలాడుకుంటూ ఉండడంతో ఇలా తమతో వచ్చిన కుటుంబ సభ్యులకు గ్యాలరీలో కూచోవడానికి కూడా ఆహ్వాన పత్రిక ఉంటేనే లోపలికి పంపించసాగేరు.

తను లోపలికి వెళ్లకముందే విషయం గ్రహించి తన్మయి అప్పటికప్పుడు తెలుగు డిపార్టుమెంటుకి పరుగెత్తింది. అదృష్టం కొద్దీ డిపార్టుమెంటు కాన్వొకేషను హాలుకి పక్కనే ఉండడం వల్ల సరిపోయింది.

అప్పుడే బయటికి రాబోతున్న చిదంబరం మాస్టారు అప్పటికప్పుడు తన ఆహ్వాన పత్రికను తన్మయి చేతిలో పెట్టి, "అమ్మా! ఇదిగో నా ఇన్విటేషను పట్టుకెళ్లు. నేను కాన్వొకేషనుకి అటెండ్ కాకపోయినా వచ్చే నష్టం ఏవీ లేదు. దీనితో మీ వారిని, పిల్లలని తీసుకెళ్లు." అన్నారు.

తన్మయికి ఆలోచించే వ్యవధి కూడా లేదు.

అప్రయత్నంగా ఆయన కాళ్లకి నమస్కరించింది.

తన పట్ల అత్యంత దయగల చిదంబరం మాస్టారు తన జీవితంలో తనకి లభించిన ఒక గొప్ప వరం. ఆ ఋణం తీర్చుకునే అవకాశం తనకెప్పటికైనా లభిస్తుందో లేదో.

పరుగులాంటి నడకతో కాన్వొకేషను హాలుకి చేరుకుని ముందు ప్రభుని, పిల్లల్ని లోపలికి పంపించింది. చీర పైన వేసుకున్న కాన్వొకేషను ప్రత్యేక గౌనుని సరిచేసుకుంటూ లోపలికి అడుగుపెట్టింది. విశాలమైన హాల్లో కిక్కిరిసి ఉన్న వందలాది మంది జనాన్ని చూడగానే గుండె దడదడా కొట్టుకుంది.

అదే హాల్లో జే.ఆర్.ఎఫ్ రాసింది తను. అప్పుడెప్పుడూ అసలు గమనించలేదు ఆ హాలు అంత పెద్దదని.

పట్టా పుచ్చుకోబోతున్న తన వంటి విద్యార్థులు కూచున్న వరసల్లోకి నడిచి ఖాళీగా ఉన్న చోట కూచుంది. చుట్టూ విపరీతమైన గందరగోళంగా ఉంది.

వెనక్కి తిరిగి వరసల వైపు, పైన గాలరీ వైపు చూసింది, కానీ అంత మంది జనంలో ప్రభుని, పిల్లల్ని పోల్చుకోలేకపోయింది.

జీవితంలో ఎన్నో కష్ట నష్టాలకోర్చి చేరుకున్న అత్యుత్తమ స్థానమది. అయినా గర్వంగా కంటే సంతృప్తి అధికంగా కలుగుతూ ఉంది. తను జీవితంలో సాధించాలనుకున్నది దక్కించుకున్న గొప్ప సంతృప్తి అది.

నెరవేరిన చిరకాలపు కల! ఆ క్షణంలో గుండెల్లో పట్టరాని సంతోషం కళ్లల్లోంచి ఉబుకుతూంది. తన చుట్టూ ఇందరు పీ.హెచ్.డీ పట్టాలు పుచ్చుకునే వారి మధ్య తను కూర్చోవడమే ఎంతో గర్వకారణంగా ఉంది.

నిజానికి తల్లిని కూడా తమతో రమ్మని పిల్చింది. కానీ జ్యోతికి ప్రభుతో మాట్లాడడమే ఇష్టం ఉండదు. ఇక తమతో రమ్మన్నా రానని చెప్పింది. తల్లిని మించిన ఆప్యాయతని కురిపించే ప్రభు తనతోనే ఉన్నా, కానీ

ఆ క్షణం తల్లి తన పక్కనుంటే బావుణ్ణని ఎంతగానో అనిపించింది తన్మయికి.

ప్రభు, పిల్లలు మరెక్కడో కూర్చోవడం మనసుకి బాధ అనిపిస్తున్నా, యూనివర్సిటీ నిబంధనలకి తలవంచక తప్పలేదు.

స్టేజీ మీద ఒకరి తర్వాత ఒకరు ఇచ్చిన పది ప్రసంగాల తర్వాత డిపార్టుమెంటుల వారీగా అసలు స్నాతకోత్సవం మొదలయ్యింది.

మొదటి పది మందికి పట్టా ప్రదానం కాగానే ప్రధాన అతిథిగా వచ్చిన హీరో గారు షూటింగు సమయం అవుతుందని నిష్క్రమించడంతో హాలు సగానికి ఖాళీ అయ్యింది.

జనం గందరగోళం తప్పడంతో అన్ని డిపార్టుమెంట్ల నించి ప్రొఫెసర్లు కూడా మెల్లగా రావడం గమనించింది తన్మయి.

మాస్టారు కూడా వస్తే బావుణ్ణని మనసారా కోరుకుంది.

తమకిచ్చిన లిస్టు లోని పేరు ప్రకారం తన వంతుకి పదిహేను నిమిషాల ముందే స్టేజీ వెనక్కి చేరుకుంది.

గోల్డు మెడలిస్టు కావడం వల్ల తమ డిపార్టుమెంటు లిస్టు లో తన పేరే ముందు ఉంది.

స్టేజీ మీదికి అడుగుపెడుతూనే ముందు వరసల్లోనే ఉన్న మాస్టారిని చూసి సంతోషంగా నమస్కరించింది.

యూనివర్శిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ మొ.న వారు కొలువున్న స్టేజీ మీద గవర్నర్ చేతుల మీదుగా పట్టా, గోల్డు మెడలు అందుకుంది తన్మయి.

మరపురాని ఆ ఒక్క క్షణం ప్రపంచాన్ని గెలిచిన అద్వితీయమైన క్షణం! జీవితంతో అనుక్షణం పోరాడి గెలిచిన క్షణం!!

"మిత్రమా! నాతో నిరంతరం ఉండి నన్ను గెలిపించినందుకు మన:పూర్వక ధన్యవాదాలు"

అని మనస్సులోనే అజ్ఞాత మిత్రునికి ధన్యవాదాలు చెప్పుకుంది.

బయటికి రాగానే ప్రొఫెసర్లతో బాటూ, పరిచయస్తులు అనేకులు కంగ్రాట్యులేషన్సు చెప్పసాగేరు.

తనని ఒకప్పుడు పట్టించుకోని వాళ్లు, నిరుత్సాహపరిచిన వాళ్లు కూడా దగ్గిరికి వచ్చి కంగ్రాట్యులేషన్స్ చెప్పడం గమనించింది తన్మయి.

ఒక్కసారిగా గతమంతా గిర్రున కళ్ళముందు తిరిగింది.

చదువుకుంటే ఎక్కడ తనని అధిగమిస్తుందో అని అణగదొక్కడానికి అనుక్షణం ప్రయత్నించి, చదువు మానిపించడానికి విఫలయత్నాలు చేసి, అన్ని విధాలుగా వేధించి, నిందలు మోపి, చివరికి చేతిలో చిల్లిగవ్వ లేకుండా నడిరోడ్డుమీద వదిలేసి వెళ్ళిపోయిన శేఖర్ దుష్టత్వం జ్ఞాపకం వచ్చింది.

ఎక్కడో చదివింది తను "సక్సెస్ ఈజ్ ది ఓన్లీ రివెంజ్" అని.

"విజయం సాధించడం అనేది పగ సాధించడంతో సమానమవునో కాదో గానీ విజయం సాధించడం వల్ల వచ్చే ఆత్మస్థైర్యంతో పగ వల్ల మనసుని అనుక్షణం దహించి వేసే మానసిక వేదనని మాత్రం విజయవంతంగా దూరం చేసుకోవచ్చు!" అని ఆ క్షణాన అనిపించింది.

అంతలోనే మేరీ ఎదురుగా పూలగుత్తితో నడిచొస్తూ కనిపిస్తే అటుగా అడుగులు వేసింది తన్మయి.

మేరీ తన్మయిని అమాంతంగా కౌగిలించుకుని ఆత్మీయంగా తల నిమురుతూ

" అయామ్ సో ప్రౌడ్ ఆఫ్ యూ తన్మయీ! కంగ్రాట్యులేషన్స్. నీ గెలుపు ఎందరో యువతులకు స్ఫూర్తిదాయకం" అంటూ అభినందించసాగింది.

మరోవైపు నుంచి దివాకర్, అనంత, రాజులు చేతిలో స్వీటు బాక్సుతో తన వైపుగా రావడం చూసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యింది. చుట్టూ ఎన్ని కష్టాలున్నా తనని అన్నిటినించి ఆదుకుని మానసిక ధైర్యాన్నిచ్చిన ఇటువంటి మిత్రులే లేకపోతే తనేమైపోయేదో!

అనంత, రాజుల్ని ప్రభుకి పరిచయం చేసింది.

అనంత ప్రభు వైపు అభినందనపూర్వకంగా చూస్తూ "చాలా సంతోషంగా ఉంది తన్మయీ! మిమ్మల్ని, మీ పిల్లల్ని చూస్తూంటే" అంటూ

పాప వైపు చెయ్యి చాచగానే మీదికి దుమికిన పాపని ముద్దాడుతూ "అమ్మో అమ్మో.. ఎంత హుషారుగా ఉందో. అచ్చు నీ పోలికలే" అంది.

"అందర్నీ భోజనానికి దసపల్లాకి తీసుకువెళ్దాం" అంది తన్మయి ప్రభు దగ్గిరికి వచ్చి.

"అలాగే. నన్నడగాలా.." అని స్వయంగా తనే అందర్నీ ఆహ్వానిస్తున్న ప్రభుని, అతని వైపు మురిపెంగా చూస్తున్న తన్మయిని చూస్తూ

"నా దిష్టే తగిలేలా ఉంది. ఇద్దరూ ఇంటికెళ్ళగానే దిష్టి తీయించుకోండి. ఎంతో సంతోషంగా ఉంది తన్మయీ. అందుకే ఏది జరిగినా మన మంచికే అంటారు. ప్రభు లాంటి ఉత్తముడు నీ జీవితంలో అడుగుపెట్టడానికే ఎన్నో మలుపులు తిరిగింది నీ జీవితం. అయినా కష్టకాలంలో నిలదొక్కుకున్న నీ ధైర్యం మాత్రం అద్వితీయం. ఎందరో నిన్ను చూసి నేర్చుకోవాలి" అంది అనంత తన్మయి భుజం తడుతూ .

"నా సంగతి సరే గానీ ముందు మీ ఇద్దరికీ గవర్న్ మెంటు ఉద్యోగాలొచ్చినందుకు మన:పూర్వక అభినందనలు" అంది తన్మయి అనంత, రాజులని అభినందిస్తూ.

అంతసేపూ బుద్ధిగా తల్లి చెయ్యి పట్టుకుని నిలబడ్డ బాబుని, అటూ ఇటూ పరుగులెడుతున్న పాపాయిని శ్రద్ధగా చూసుకుంటున్న ప్రభుని చూస్తూ మేరీ "తన్మయీ! బంగారమంటి భర్త, రత్నాల్లాంటి పిల్లలు. ప్రభువు మిమ్మల్నెప్పుడూ కాపాడతాడు. మీరంతా చల్లగా పదికాలాల పాటు ఉండాలని రోజూ నేను ప్రార్థన చేస్తూ ఉంటాను" అంది.

తన్మయి కృతజ్ఞతా పూర్వకంగా రెండు చేతులతో స్నేహితురాళ్ళిద్దరి చేతులూ పట్టుకుంది.

"అ ...అంతా కలిసి కబుర్లతోనే క్క కడుపు నింపేసుకునేలా ఉన్నారు. న్నా నాకు ఆకలేస్తోంది" దివాకర్ మాటలకి నవ్వుతూ ఆటోలెక్కేరు.

ఆటోలో బాబుని ఒళ్ళో కూచోబెట్టుకుని స్నేహితురాళ్ళిద్దరి మధ్యా కూర్చుంది తన్మయి.

మగవాళ్ళందరూ మరో ఆటో ఎక్కేరు. పాపాయి ప్రభు ఒళ్ళో కూర్చుంది.

దారిలో అనంత "కరుణ ఎంత మారిపోయేడో తెలుసా నిజంగా! ఆమధ్య భార్యా, పిల్లలతో బీచ్ రోడ్డులో కనిపించేడు. కానీ మమ్మల్ని చూసి కూడా గుర్తుపట్టనట్టు తల తిప్పుకున్నాడు. రాజు దగ్గిరికెళ్ళి పలకరించబోతే మొహం తిప్పుకుని వెళ్ళిపోయేడు. మాకు గవర్నమెంటు ఉద్యోగాలొచ్చేయని ఏడ్చే వాళ్లలో ఇతనూ చేరేడని తిట్టుకుని ఊరుకున్నాం." అంది అనంత.

తన్మయి వినీ విననట్టు మౌనంగా ఉండిపోయింది.

"అందుకే కరుణ లాంటి కుసంస్కారులకు ఎక్కడా ఎదుగూ బొదుగూ ఉండదు. ఏదో ప్రైవేటు కాలేజీలో ఉద్యోగం వెలగబెడుతున్నాడట. అంతెందుకు దివాకర్ మమ్మల్ని పిలిచినట్టే అతన్నీ ఇవేళ రమ్మని పిలిస్తే రాను పొమ్మన్నాడట. ఏం చూసుకునే అంత పొగరు.." అని ఇంకేదో అంటున్న అనంతతో

"ఇంతకీ మీ పిల్లల గురించి చెప్పనే లేదు అనంతా" అంది మాటమారుస్తూ తన్మయి.

★★★

మరో రెణ్ణెల్లలో తన్మయికి డిగ్రీ కాలేజీ ప్రమోషన్ కి ఆర్డర్లు వచ్చేయి.

యూజీసీ నెట్ పాసయ్యిన వారికి డిగ్రీ కాలేజీ ప్రమోషన్ వస్తే అప్పటి వరకు ఉన్న స్టేట్ గవర్నమెంటు స్కేలు కాక యూజీసీ స్కేలు వర్తిస్తుంది. అంటే అప్పటివరకు వస్తున్న జీతంలో రెట్టింపు వస్తుంది.

తన్మయి ఆనందానికి అవధి లేదు.

కానీ కవరు విప్పి పోస్టింగు ఇచ్చిన ఊరి పేరు చూసేసరికి ఆ ఆనందం అట్టే సేపు నిలవలేదు.

610 జీవో ప్రకారం ఆంధ్ర ప్రాంతంలో వచ్చింది పోస్టింగు. అది కూడా ఒరిస్సా బోర్డర్సులో.

"అయ్యో! నేనెలాగూ బెంగుళూరులో కొన్నాళ్లు పనిచెయ్యాల్సి వస్తూ ఉంది కాబట్టి అదేదో కర్నాటక బోర్డర్సులో వచ్చినా బావుణ్ణు." అన్నాడు ప్రభు.

అయినా "ఏదో ఒక సొల్యూషన్ ఆలోచిద్దాంలే. ఇప్పుడా విషయం గురించి వర్రీ కాకు. వచ్చిన మంచి అవకాశాన్ని పోగొట్టుకోవద్దు. హార్టీ కంగ్రాట్యులేషన్స్ రా" అన్నాడు.

“తనని నిరుత్సాహపరచడం ఇష్టం లేనట్లు ప్రభు పైకి అలా అంటున్నా తను దూరమైతే ఎంత బాధపడతాడో తెలుసు.” ఆలోచనలో పడింది తన్మయి.

“కానీ ఇదీ ఒకందుకు మంచిదే. అనుకోని చోటికి మళ్లీ జీవితం మారడం వల్ల ఎన్నో విషయాలు మళ్లీ

చక్కబెట్టుకోవాల్సి వచ్చినా తనకి మళ్లీ మన:శాంతిగా బతికే అవకాశం వస్తుంది. పిల్లల్ని తనకి నచ్చినట్లు పెంచుకునే అవకాశమూ కలుగుతుంది. ఒక్క ప్రభు నించి దూరంగా ఉండాల్సి వసుందన్న బాధ తప్ప మరే బాధా

ఉండదు. అదీగాక ఇప్పుడు ప్రమోషన్ వదులుకున్నా 610 జీవో పూర్తిగా అమలుకాగానే తను ఎలాగూ ఆంధ్ర ప్రాంతానికి వెళ్లిపోవాల్సిందే. కాకపోతే అందుకు మరికొన్నాళ్లు సమయం పట్టొచ్చు. కానీ ఈ విషయంలో జాప్యం చెయ్యడం కుదరదు.

ప్రభు కొన్నాళ్లు హైదరాబాదులో, కొన్నాళ్లు బెంగుళూర్లో పనిచేస్తూ వారాంతాల్లోనో, సెలవుల్లోనో తన దగ్గిరికి రావాల్సి ఉంటుంది.

పిల్లల్ని చూసుకోవడానికి నాగ ఉంది కాబట్టి తనకి ఆ విషయంలో పెద్దగా ప్రాబ్లం లేదు." ఆలోచన్లు బుర్రని దొలిచేస్తున్నాయి.

కొలీగ్స్ సలహాతో బెంగుళూరికి దగ్గిరి ఆంధ్ర బోర్డర్ లో తనకు కావలసిన మరొక ప్లేస్ కు రిక్వెస్టు కోరుతూ అప్లికేషను పెట్టింది.

లెక్చరర్స్ యూనియన్ లో తెలిసిన వారితో మాట్లాడి ప్రయత్నం చెయ్యసాగింది.

ఈ విషయం ఇంట్లో చెప్పగానే అంతా పాపాయిని వొదిలి ఉండడానికి బాధపడడం మొదలుపెట్టేరు.

తను, బాబు మాత్రమే ఉండి ఉంటే ఈ విషయం విని సంతోషించే వాళ్లేమో. కనీసం ఈ విధంగానైనా తననించి దూరంగా ఉండగలిగినందుకు.

72

ఒక పక్కన తన్మయి తనకు వచ్చిన ప్రమోషన్ ని బెంగుళూరు దగ్గర్లోకి మార్చుకునే ప్రయత్నాల్లో ఉండగానే ఆ సాయంత్రం ప్రభు "గుడ్ న్యూస్" అంటూ పైకి పరుగెత్తుకొచ్చేడు. విషయం వినగానే తన్మయికి చెప్పరాని గొప్ప ఆనందం కలిగింది. ప్రభు సంగతైతే చెప్పనే అవసరం లేదు. పాపని భుజమ్మీద ఎక్కించుకుని గాల్లో తిప్పసాగేడు "అమెరికా వీసా ఎప్రూవ్ అయ్యిందిరా కన్నా" అంటూ. తండ్రి మాట్లాడేది అర్థం కాకపోయినా గాల్లో తిప్పడంతో కిలకిలా నవ్వసాగింది పాపాయి.

కనీసం రెండు మూడేళ్లు పడుతుందనుకున్నది అదే సంవత్సరంలో వస్తుందని అస్సలు అనుకోలేదు. ప్రభుకి హెచ్1 అప్రూవ్ అయ్యింది. అంటే ప్రభు ఇప్పటికే పనిచేస్తున్న కంపెనీ అమెరికాలోని తమ ఆఫీసులో పనిచేసేటందుకు ప్రభుని ఆహ్వానించింది. అందుకు కావలిసిన వీసా సమస్య కూడా ఇప్పుడు పరిష్కారం అయ్యింది. అంతేకాదు, తనతో బాటూ భార్యా పిల్లల్ని కూడా తీసుకేళ్లే అవకాశం కలిగింది. ఫామిలీకి కూడా వీసాలు అప్లై చేసుకోవడమే తరువాయి.
"కానీ ఎలారా? సరిగ్గా నీకు మంచి ప్రమోషను వచ్చిన సమయానికి వీసా వచ్చింది. ఇదంతా వదులుకుని మనం యూఎస్ వెళ్లిపోవడం నీకు ఇష్టమేనా మరి" అన్నాడు ప్రభు అంతలోనే తన్మయి వైపు సందేహంగా చూస్తూ. తన్మయికి తన కష్టాలు తీరే మార్గం ఒకటి ఇన్నాళ్లకు కనబడినందుకు మనసులో కలుగుతున్న ఆనందం ముందు అసలివేవీ గుర్తుకు రావడం లేదు.
"ఉహూ, నాకు నీతో ఉండడమే ముఖ్యం. అయినా అక్కడ ఉద్యోగాలు దొరకవా ఏంటి? ఇది కాకపోతే మరొక ఉద్యోగం" అని నవ్వుతూ "ఊ...నెక్స్ట్ స్టెప్స్ ఏవిటీ? అంది ఉత్సాహంగా.

"వీసా అప్రూవల్ లెటర్ రాగాన్, ముందు మా ఆఫీసు వాళ్లు వీసా స్టాంపింగు కోసం నా పేపర్ వర్కు పూర్తి చేస్తారనుకుంటా. నాతో బాటూ నీకు, పిల్లల క్కూడా వీసా ఆఫీసు వాళ్లతోనే అప్లై చెయ్యమని చెబుదాం. కాకపోతే ఫామిలీ వీసా ఫీజులు మనమే భరించాల్సి ఉంటుంది. అది పూర్తయ్యాకా మనం స్టాంపింగు కి మద్రాసు కాన్సొలేట్ కి వెళ్లి రావాల్సి ఉంటుంది. వీసా స్టాంపింగు ఏ అవాంతరం లేకుండా జరిగితే ఆ తర్వాత నేను ముందు బయలుదేరి వెళ్లి కాస్త కుదురుకుని, అక్కడ ఇల్లు వగైరా తీసుకున్నాక నువ్వూ, పిల్లలూ వస్తారన్నమాట" అన్నాడు.

గాల్లో తేలిపోతున్నట్లున్న మనసులోని సంతోషాన్ని అదిమిపట్టుకుని "ఇవన్నీ జరగడానికి ఎన్నాళ్లు పట్టొచ్చు?" అంది.
"బహుశా: మరో అయిదారు నెలలు" అన్నాడు సాలోచనగా.
తన్మయి గబగబా లెక్కేసుకుంది.
ఇప్పుడు ఇక్కడ వచ్చిన ప్రమోషను తీసుకుంటే తను ఎలా లేదన్నా మరో నెలరోజుల్లో ఎక్కడో ఒకచోట జాయిను కావలసిందే. ఆ తర్వాత అక్కడ పూర్తిగా సెటిల్ కావడానికి మరొక మూడు నెలలు పట్టొచ్చు. ఇంతలో ప్రభు యూ. ఎస్ వెళ్లి ఉద్యోగంలో కుదురుకుంటే ఇక తను, పిల్లలు వెళ్లడానికి మార్గం సుగమం అయినట్టే.
కానీ ఈ లోగా తను ప్రమోషను తీసుకుని వెళ్లాలా, వద్దా అనేది నిర్ణయించుకోవాలి. ఇప్పుడు ప్రమోషను తీసుకుంటే తను, పిల్లలు వెళ్లి ఆ ఊళ్లో మకాం పెట్టి ఉండవసిందే. ఎంత కాదనుకున్నా మళ్లీ మొత్తం ఒక కొత్త సంసారమే. అంతలోనే మరో రెండు, మూడు నెలల్లో యూ.ఎస్ ప్రయాణం కావాలి. మళ్లీ అక్కడా కొత్త ఇల్లు, ఉద్యోగంతో సహా మళ్లీ జీవితాన్ని పున: ప్రారంభించాలి.
అలాగని ప్రమోషను వదులుకుంటే, ఒకవేళ అమెరికా నుంచి వెనక్కి ఒక ఏడాదిలో వచ్చెయ్య వలసి వస్తేనో......ఆలోచనలో పడింది తన్మయి.
"శుభమా అంటూ ఇన్నాళ్లకి జీవితానికి ఒక కొత్త వెలుగు రాబోతూంటే తనకీ మీమాంస ఎందుకు? కానియ్యి, ఏది ఎలా జరగాలనుంటే అలా జరుగుతుంది. ఏది జరిగినా తన మంచికే అని ఎప్పుడూ విశ్వసిస్తూ వచ్చింది. ఇది కూడా తన మంచికే జరగబోతూంది." గుండెల నిండా ఊపిరి తీసుకుంది తన్మయి.

గవర్నమెంటు ఉద్యోగం వదులుకుంటే మళ్లీ దొరకక పోవచ్చు.

కానీ జీవితంలో అన్నిటికంటే ముఖ్యమైనది మనశ్శాంతిగా జీవించడం. అది కరువయ్యి ఇక్కడ జీవించడమా, లేదా ప్రభుతో కలిసి అమెరికా వెళ్లడమా అంటే తనెప్పుడూ రెండోదే ఎంచుకుంటుంది. ప్రభు లేకుండా పిల్లలు, తను ఇక్కడ ప్రభు తల్లిదండ్రులతో కలిసి జీవించడం అయ్యేపని కాదని ఇప్పటికే గట్టిగా అర్థం అయ్యింది. ఇక తను ప్రమోషను తీసుకుని ఇండిపెండెంట్ గా మరెక్కడో ఉండడం వల్ల వాళ్ల బాధ తప్పినా ప్రభు లేకుండా జీవించడమే అవుతుంది. పైగా మళ్లీ ఒంటరిగా కష్టాలు పడడమే. అమెరికా వెళితే ఉద్యోగం ఒక్కటే ఉండదు. మిగతా అన్నీ తన మనసుకి నచ్చే ఉంటాయి. అతి ముఖ్యంగా "తనది" అనే ఇల్లు మళ్లీ సాకారం అవుతుంది. అదృష్టం బావుంటే ఉద్యోగమూ దొరకచ్చు.

నిర్ణయం తీసుకున్నాక తల్లికి ఫోను చేసింది.

అట్నుంచి జ్యోతి చాలా సంతోషంగా "పోనీలెమ్మా, ఇప్పటికైనా నీ కష్టాలు తీరే మార్గం ఒకటి దొరికింది. నిశ్చింతగా, హాయిగా వెళ్లు. ఎప్పుడు చూడాలనిపించినా ఈ రోజుల్లో రావడం పెద్ద కష్టం ఏవీ కాదట. మన ఊళ్లో ఒకరిద్దరు అమెరికా వెళ్లిన వాళ్లు ఏడాదికోసారైనా ఇక్కడ కనిపిస్తుంటారు కదా, అవునూ.. బాబుని తీసుకెళ్లడానికి ఆ త్రాష్టుడు ఒప్పుకుంటాడంటావా?" అంది.

"ఆ దిగులేమీ లేదు లేమ్మా. బాబుకి పాసుపోర్టుకి అప్లై చేసినప్పుడే బాబుని ఏ దేశానికైనా, ఎన్నాళ్లయినా తీసుకెళ్లగలిగే లీగల్ అఫిడవిట్ సంతకం కూడా అతన్నించి తీసుకున్నారు లాయరు." అంది తన్మయి.

"చెయ్యకేంజేస్తాడు, ఉద్యోగం మాని చేసిన బిజినెస్సులన్నీ లాసులొచ్చి తిండానికే గతిలేకండా ఉన్నాడట. ఇంక పిల్లోడి విషయాలు వొదిలెయ్యకేంజేస్తాడు" అంది జ్యోతి.

అతని విషయాలు వినడం కూడా ఇష్టం లేని తన్మయి "అవన్నీ సరేగానీ ప్రభు వెళ్ళేకా సెలవులు రాగానే నేను పిల్లల్ని తీసుకుని వచ్చి నీ దగ్గిర వారం రోజులైనా ఉండివెళ్తాను" అంది.

"హమ్మయ్య, మొదటా పని చెయ్యమ్మా. నాకూ నిన్నూ పిల్లల్ని కాస్త చూసుకున్నట్టవుతుంది." అంది జ్యోతి.

★★★

తన జీవితం ఎటు నించి ఎటుకి కొట్టుకొచ్చిందో, ఎటు వెళ్లబోతుందో తలచుకుంటేనే ఎంతో ఆశ్చర్యంగా ఉంది!

ప్రభు తన జీవితానికి లభించిన గొప్ప వరం. తల్చుకోవడానికైనా తనకి దూరంగా బతకాల్సి రావడం అనేది అలవికాని బాధ కలిగించే విషయం. అలాంటి ప్రభు అమెరికా వెళ్తుంటే కూడా వెళ్లకుండా ఉద్యోగం పేరుతో తనిక్కడ ఉండిపోతే అనుక్షణం బాధాతప్తహృదయంతో బతకాల్సిందే. అసలు ప్రభు ప్రేమైక జీవన సాంగత్యం లేకుండా తనకి ధీమాగా బతకడం సాధ్యమేనా? తన పిచ్చిగాని. ఇంతవరకు ఎప్పుడూ ప్రభు కెరీర్ లో ఎదుగుదలని తను సంతోషంగా ప్రోత్సహించిందే కానీ, ఎప్పుడూ నిరుత్సాహపరిచింది లేదు. ప్రభు బెంగుళూరులో నెలకి ఒక వారం ఉండాల్సి రావడం తనకి బాధగా అనిపిస్తున్నా ఏదోలా మనసుకి సర్ది చెప్పుకుంటూంది అందుకే.

విషయం చెప్పడానికి కిందికి వెళ్లిన ప్రభుతో పెద్ద రణరంగం ప్రారంభమయ్యింది అప్పటికే.

"అంటే నీ పెళ్ళాన్ని, పిల్లల్ని తీసుకుని అమిరికా ఎల్లిపోడానికే నిచ్చయించీసుకున్నావన్న మాట, ఇక్కడ మేవందరం ఎలా పోయినా నీకవసరం లేదు" అన్నాడు ప్రభు తండ్రి గుమ్మం లోంచి బయటికి తుపుక్కున ఊస్తూ.

"మనోణ్ణి అనుకోటం ఎంతుకు? ఆ మామ్మారి మనోణ్ణి మన్నించి ఇడగొట్టనాకి ఏసిన పన్నాగం ఇది. ఈడు దాని వల్లో ఎప్పుడైతే పడ్డాడో అప్పుడే మనకి ఎప్పుడో ఒకప్పుడు ఈ గతి పడతాదని తెలుసు నాకు" అని బేబమ్మ గట్టిగా శోకాలు మొదలు పెట్టింది.

"ఇప్పుడేవైందని? మీకు ఇక్కడ ఏ లోటూ రాకుండా చూస్తాను కదామ్మా. మేం వెళ్లి అక్కడ పరిస్థితులు కాస్త కుదురుకున్నాక మిమ్మల్ని కూడా అక్కడికి రప్పించే ప్రయత్నం చేస్తాను కదా." అనునయంగా అంటున్న ప్రభు మాటలకి కాస్త మెత్తబడి

"మరిప్పుడే తీసుకెళ్లు అమిరికా. ఏం నీ పెళ్ళాం సాటి సెయ్యమా? ఆవిడి కొడుకు సాటి సెయ్యమా?" అంది బేబమ్మ.

"భార్యాపిల్లలకి తప్ప మరెవరికీ వీసా వెంటనే రాదమ్మా..."

కొడుకు మాటల్ని మధ్యలోనే ఆపి "ఎవడికో పుట్టిన ఆవిడి కొడుక్కి ఈసా ఎంటనే వచ్చేత్తాది గాని, మాకు రాదా?" అంది.

"మీకు వీసా వెంటనే వస్తే ఈ సరికే చేస్తాను కదా. అయినా నేను వెళ్లేలోగా మీ అందరికీ పాసుపోర్టులు అప్లై చేస్తాను. వచ్చే ఏడాదికైనా వీసాలు వచ్చేలా ఏర్పాటు చేస్తాను. నేనెక్కడున్నా మీ గురించే ఆలోచిస్తానమ్మా." అన్నాడు ప్రభు గద్గదంగా.

"అలాగైతే ఈ నెల నించి మామీద ఆవిడి పెత్తనం ఉన్నాకి ఈల్లేదు. మాకు నెలకి పాతిక యేలు ఇచ్చియాల. ఆవిడి అమిరికా ఎల్లీదాకా ఇంత ముద్ద పడెయ్యమంటే పడేస్తాం. నేపోతే పైనే పొయ్యేట్టుకుని సొయంగా వొండుకోమను........"

అప్పుడే పిల్లలకి అన్నాలు పెట్టడానికి కిందికి వచ్చిన తన్మయి మౌనంగా వింటున్న ప్రభుని, అదను చూసుకుని డిమాండ్ చేస్తూ , నోటికొచ్చినట్టల్లా మాట్లాడుతున్న అతని తల్లిదండ్రుల్ని కనీసం ముఖం ఎత్తి చూడాలని కూడా అనిపించక మాట్లాడకుండా మెట్లెక్కి వెళ్ళిపోయింది.

ఛీ... ఛీ...నోటికి హద్దూ పద్దూ లేని నీచమైన మనుషులు. ఇటువంటి వాళ్ల కడుపున రత్నం లాంటి ప్రభు ఎలా పుట్టేడో అస్సలు అర్థం కాదు. జన్మత: రాని సంస్కారం అతనికి చదువు వల్ల కలగడం ఎంతో మెచ్చుకోదగిన విషయం. కానీ అదీ వాళ్ళ ముందు బలాదూరే. ఇలాంటి మాటలు వినీ, వినీ అతనికున్న విచక్షణత, సంస్కారం కూడా క్రమంగా తగ్గిపోతాయేమో. అన్నిటికన్నా ముఖ్యంగా పిల్లల ముందర ఇలాంటి అనారోగ్యకరమైన సంభాషణలు వాళ్ళ మీద ప్రభావం చూపించకుండా ఉంటాయా?

ఇక ఆ క్షణం తన్మయికి మనసులో అమెరికా ప్రయాణం పట్ల ఉన్న కాస్త సందేహం కూడా తొలగిపోయింది.

పిల్లల్ని నిద్రపుచ్చుతూ "తన వైపు నించి ఎటువంటి ఆలస్యం కాకుండా వీలైనంత త్వరగా అమెరికా వెళ్లిపోవాలి. ఇకమీదటైనా పీడన లేని జీవితాన్ని గడపాలి. భూమ్మీద ఏదో ఓ చోట కాస్త కలోగంజో తాగైనా బతకడానికి తను సిద్ధమే. వీళ్ల మధ్య మాత్రం కాదు. అసలు ఎప్పుడూ తనకి కావాల్సిందల్లా మనశ్శాంతిగా బతకడం. అంతే. అదే దూరం అవుతుంటే జీవితానికి అర్థం ఏవుంది?

"మిత్రమా! ఇక్కడి నుండి వెళ్ళేలోగా నాకు బతకగలిగే ధైర్యాన్నివ్వు. అనుకున్నవన్నీ సక్రమంగా జరిగేలా నీ స్నేహ హస్తాన్ని అందించు" అని కళ్ళు మూసుకుని పదే పదే అనుకోసాగింది.

★★★

వీసా స్టాంపింగు సజావుగా జరిగే సరికి ఊపిరి పీల్చుకుంది తన్మయి.

"మరో నెల రోజుల్లో ప్రభుకి టిక్కెట్టు బుక్ చేసేరు వాళ్ల ఆఫీసు వాళ్ళు. మొదటి రెండు వారాలు నాకు అకామడేషను వాళ్ళే ఇస్తున్నారు. ఆ తర్వాత ఇల్లు వెతుక్కోవాల్సి ఉంటుంది. ఇల్లు తీసుకోగానే మీరు వద్దురు గాని..." అని అంటూనే ప్రభు సేవింగ్సు లెక్కవెయ్యసాగేడు.

"టిక్కెట్లు పోను సరిగ్గా మూడు నెలల వరకు ఇక్కడ మెయింటెనెన్సుకి సరిపోతాయి. ఇక అక్కడ వచ్చే జీతంలో సగం ఇంటద్దెకే పోతుందటున్నారు మా మిత్రులు. వెళ్ళగానే నీకూ ఉద్యోగం ఉండదు. అక్కడ కారు లేకపోతే కుదరదట. వెళ్ళగానే కారు కొనుక్కోవాలన్నా కనీసం ఆరు నెలలు పట్టేటట్టు ఉంది...." ఏవేవో అంటూ మథనపడుతున్న ప్రభుకి తన్మయి ధైర్యం చెప్పింది.

"అన్నీ ఇప్పుడే ఆలోచించి బాధ పడకు. నువ్వు ముందు వెళ్లి అక్కడ అన్నీ పరిస్థితులు అర్థం చేసుకో. అన్నీ కుదిరిన తర్వాతే నేను, పిల్లలు వస్తాం." అంది.

లోపల్లోపల బాధగా అనిపిస్తున్నా బాధ్యతలు ఒక్క భుజమ్మీద మోయడంలో ఉన్న కష్టం తను అర్థం చేసుకోగలదు.

ప్రమోషను గురించి, ఇక్కడ ఉద్యోగం వదిలి వెళ్లడం గురించి మళ్లీ ఆలోచనలో పడింది తన్మయి.

సిద్ధార్థకి ఫోను చేసింది.

"అంతా విని. కంగ్రాట్యులేషన్స్. ఇప్పుడు మీరున్న పరిస్థితుల్లో ప్రభు వెంట వీలైనంత త్వరగా మీరు వెళ్లడమే ఉత్తమైన పని. ఇక ఇక్కడ ఉద్యోగం మాట ఎక్కువ ఆలోచించకండి. కాకపోతే రిజైను చెయ్యకుండా దీర్ఘకాలపు సెలవులో వెళ్ళండి. ఒకవేళ అక్కడి నుంచి మీరు వెనక్కి రావాల్సి వస్తే ఇక్కడ ఉద్యోగ భద్రత ఉంటుంది. ఒకవేళ సెలవు అయిపోయినా మీరు రాలేకపోతే అక్కడ మీరు మంచి స్థితిలో ఉన్నారనేగా అర్థం. మీరు ఎంతో చురుకైన వారు, కష్టపడి ఏదైనా సాధించగలిగే పట్టుదల ఉన్నవారు. ఎక్కడికి వెళ్లినా ఉన్నత స్థితికి వెళ్లగలుగుతారు. మీ మీద మీరు నమ్మకముంచుకుని ముందడుగు వెయ్యండి. అంతా మంచి జరుగుతుంది" అన్నాడు.

సిద్దార్థ మాటలకి వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

ఉన్నత విద్య కోసమో, ఉద్యోగం కోసం మరేదైనా దేశానికి వెళ్ళడానికి గవర్నమెంటు ఉద్యోగ భద్రతతో సెలవు ఇస్తుందన్న విషయం జ్ఞాపకం వచ్చింది.

అయితే ఏదైనా యూనివర్సిటీలో ముందు అడ్మిషన్ సంపాదించే పనిలో పడాలి అర్జెంటుగా. కానీ కాలేజీ అడ్మిషన్లంటే డబ్బుతో కూడుకున్న వ్యవహారం.

అయినా వివరాలు కనుక్కోవడంలో తప్పులేదేమో.

అమెరికాలో స్థిరపడి, అంతకు ముందు ఒకసారి బస్సులో కనిపించి మాట్లాడిన లెక్చరరు గారు జ్ఞాపకం వచ్చేరు.

ఆయన ఫోను నంబరు, ఈ– మెయిలు కూడా ఇచ్చినట్టు జ్ఞాపకం.

అదే చెప్పింది సిద్దార్థతో.

"మరింకేం. ఆయన్ని అడిగి వివరాలు కనుక్కోండి. మీ కాలేజీ అడ్మిషన్ కి కావలసిన బ్యాంకు ష్యూరిటీ నేనిస్తాను" అన్నాడు.

తన్మయి ఒక్క క్షణం అసలేమీ మాట్లాడలేకపోయింది.

"సిద్ధూ..." అని మాత్రం అని గొంతు పూడుకుపోవడంతో ఆగిపోయింది. అడక్కుండానే సాయం చేసే ఇటువంటి గొప్ప మిత్రులు ఎవరికైనా ఉంటారా?

"కమాన్ తన్మయీ. ఒక్కమాట. మీరెంత ఎత్తుకి ఎదిగినా కుచేలుడి లాంటి ఈ మిత్రుణ్ణి మాత్రం మర్చిపోకండేం!" అని నవ్వేడు.

ఆ మరుసటి వారానికల్లా వివరాలన్నీ కనుక్కున్న తర్వాత తన్మయికి ఒక విషయం బాగా అర్థమయ్యింది.

***అమెరికా వెళ్లడమంటే జీవితాన్ని మళ్లీ మొదటి నించీ పునఃప్రారంభించడమే.***

అయినా వెనుతిరగకుండా ముందుకు అడుగు వెయ్యడానికే సిద్ధపడింది తన్మయి.

★★★★★★★★★★★★★

## ఉపసంహారం

అప్పటిదాకా తన్మయి కథను చెప్తున్న ఉదయిని కళ్ళల్లోని నీటి చెమ్మలో తన్మయి కనిపించింది సమీరకి.

దగ్గరికి వచ్చి ఉదయిని చేతిని తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా నిమిరింది.

అంతలోనే తేరుకుని చిర్నవ్వు నవ్వుతూ ఉదయిని ఏదో అనబోయేలోగా

"ఆగండి ఆంటీ! తన్మయి తర్వాతి జీవితం నేను కళ్లారా చూసినట్టు చెప్పగలను. తన్మయి అమెరికాలో ఎమ్మెస్ చేస్తూనే, ఉద్యోగంలో చేరి తన కాళ్ల మీద తను నిలబడింది. భర్తా పిల్లలతో "తనది" అనే ఇంట్లో హాయిగా జీవించడమే కాకుండా ఎందరికో సహాయం కూడా చేస్తూంది." అంది కొంటెగా నవ్వుతూ.

"ఊ. ఇంచుమించు అంతే. కానీ ఏ ఒక్క మెట్టూ అంత సులభం కాలేదు. ప్రభు వస్తూనే తన్మయి రావడానికి వీలుపడలేదు. అనుకున్నట్టే అతని జీతంలో సగానికి పైగా ఇంటద్దెకు పోతుందని అతను షేర్డ్ అకామడేషన్ లో గడిపాడు. వచ్చిన ప్రతి డాలరు అతి జాగ్రత్తగా ఖర్చు చేస్తూ వచ్చినా మొదటి ఏడాది కారు వంటివి సమకూర్చుకోవడానికి, కొద్దోగొప్పో నిలదొక్కుకోవడానికి, అతని తలిదండ్రుల గొంతెమ్మ కోరికలు తీర్చడానికి సరిపోయింది. ఆర్థిక కారణాలు వాళ్ళిద్దరినీ సంవత్సరం పాటు దూరం ఉంచాయి. ఇక తన్మయి ఆ సంవత్సర

కాలంలో ఒక పక్క వచ్చిన ప్రమోషను వదులుకుని, అదే ఉద్యోగంలో కొనసాగుతూ, ఒక పక్క ప్రత్యక్ష పీడనని అనుభవిస్తూ క్షణమొక యుగంలా దుర్భరంగా గడిపింది." అని ఒక్క క్షణం ఆగి ఊపిరి తీసుకుని

"తన్మయి అతి చిన్న వయసులో పది జీవితాల పోరాటాల్ని చెయ్యాల్సి వచ్చింది.

ఇక్కడికి రాగానే ఇద్దరు పిల్లలతో కాలేజీ అంత సులభం కాలేదు. పార్ట్ టైం చదువు, పార్ట్ టైం ఉద్యోగం, పిల్లల బాధ్యత, సెలవు దినాలు లేకుండా వారంలో ఏడురోజులూ కష్టపడడమే. అయినా బొటాబొటిగా కాలేజీ ఫీజుల వరకే సంపాదించగలిగేది. ఎటు చూసినా ఖర్చులే తప్ప ఆదా లేని జీవితం. అయితే నువ్వన్నట్లు "తనది" అనే ఇల్లు భూమికి ఇవతల మూలకి చేరాకే దక్కింది. ప్రభు ప్రేమైక సాంగత్యమూ తోడై ఉన్నంతలో మనశ్శాంతిగా బతకగలిగింది తన్మయి."

"అవునూ... అతని తల్లిదండ్రులు కూడా ఏడాదిలోనే ఇక్కడికి రాగలిగేరా?" అంది సమీర.

లేదన్నట్లు తల అడ్డంగా ఊపింది ఉదయిని.

"వాళ్లు రావడం మాట అటుంచు. వచ్చిన అయిదేళ్ల వరకు తన్మయి, ప్రభులకు వెనక్కి వెళ్ళడానికి కూడా సేవింగ్సు లేని కష్టాల్లో గడపవలసి వచ్చింది. అలా ఆర్థిక కష్టాలు రావడం కూడా అందుకు మంచిదే అయ్యింది. ఏదో రకంగా వాళ్ల టిక్కెట్లకు డబ్బులు సర్దిపెట్టి రప్పించేవాడే ప్రభు. కానీ ఉన్న చిన్న సింగిల్ బెడ్ రూమ్ అపార్ట్ మెంట్లో మరొక ఇద్దరు ఆర్నెల్ల పాటు ఉండడానికి సౌకర్యంగా ఉండదని ప్రభు ఆ ఆలోచనని వాయిదా వేసేడు."

"మరి వాళ్లు గొడవ పెట్టలేదూ?" అంది సమీర.

"ఎందుకు పెట్టరు? అయితే పగలు, రాత్రి తేడాల వల్ల క్రమంగా ప్రభు ఆఫీసులో బిజీ అయిపోయి ఫోను తియ్యడం కుదిరేది కాదు. క్రమంగా వాళ్లకు కొడుకు దూరం అవుతున్నాడనే భయం పట్టుకుంది. అందుకే మెల్లమెల్లగా, తెలివిగా తన్మయితో తేనెలొలుకుతున్నట్లు మాట్లాడ్డం మొదలు పెట్టేరు. పైగా ప్రభుకి ఆర్థిక విషయాలు పట్టించుకోవడం కూడా కుదరకపోవడంతో ఎప్పటికప్పుడు వాళ్ల ఖర్చులకి తన్మయే పంపుతూ వాళ్ళ బాగోగులన్నీ తనే పట్టించుకునేది. కాబట్టి వాళ్ళ కష్టనష్టాలన్నీ తన్మయికే చెప్పుకోవడం ప్రారంభించేరు. తన్మయి ఇప్పుడు వాళ్ళకొక బంగారుబాతే కాకుండా ఆరాధ్యదేవత అయ్యింది. అదంతా పైపై నాటకమే అని తన్మయికీ తెలిసినా ***తనని పీడించిన వాళ్లని కూడా గెలవడానికి ప్రేమని సాధనంగా ఎంచుకుంది*** తన్మయి. తనకి ఆనందదాయక జీవితాన్నిచ్చిన ప్రభు సంతోషం కోసం తను, తన పిల్లలు అనే స్వార్థం కూడా లేకుండా బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చసాగింది." అని ముగించింది ఉదయిని.

"ఎన్ని అడ్డంకులెదురైనా ఎక్కడా ఆగిపోకుండా లక్ష్యాన్ని చేరుకున్న తన్మయి గాథ గొప్ప స్ఫూర్తిని కలిగించింది ఆంటీ! తన్మయి సమస్యల ముందు నా సమస్య చిన్నదైనా, సమస్యల్ని సంయమనంతో ఎదుర్కోవడం ముఖ్యమనుకుంటా. అన్నిటికన్నా ముందు ధైర్యంగా నా కాళ్లమీద నేను నిలబడడం ఎంత ముఖ్యమో అర్థం అవుతూంది నాకు." అని ఆగి

"ఊహూ... సరైనదవునో, కాదో. ఒక విధంగా ఇప్పుడే జీవితం పట్ల సీరియస్ ఆలోచన మొదలయ్యింది నాకు. తన్మయి కథ ద్వారా విడాకుల తర్వాత కలిగే మానసిక క్షోభాలన్నీ అర్థం అయ్యాయి. అసలు విడాకులు తీసుకుని నా బిడ్డకి తండ్రి ప్రేమ లేకుండా ఎందుకు పెంచాలి? అనిపిస్తూంది అంది.

మళ్లీ తనే "నిజానికి నా అంతట నేనుగా నా బిడ్డని తండ్రికి దూరంగా బాగా పెంచగలిగినా, తండ్రిలాంటి వ్యక్తిని మాత్రం తీసుకురాలేను. అలాగే నేను మళ్లీ జీవితాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నంలో ఈ బిడ్డని కష్టాల పాలు చెయ్యకుండా ఉండగలనని గేరంటీ కూడా ఇవ్వలేను. అలాగని జీవితమంతా ఒంటరిగా గడిపే ఉద్దేశ్యం నాకు లేదు." అని

అద్దాల తలుపుల్లోంచి "సహాయ" అనే అక్షరాలతో అందంగా అమర్చి ఉన్న బయటి లాన్ వైపు చూస్తూ

"నిజానికి సాయి తన్మయి జీవితంలో ఎదురైన శేఖర్ వంటి దుర్మార్గుడు కాదు. ప్రభులా తల్లిదండ్రుల మాట జవదాటని వాడు. అయితే వాళ్ళు ప్రభు తల్లిదండ్రుల వంటి దారుణమైన మనుషులు కారు. ఏదేమైనా ప్రతి జీవితమూ ఒక పోరాటమే. సాయితో కలిసి ఉంటూనే పోరాటం చేస్తాను....." దృఢంగా అంటున్న సమీర వైపు ప్రశంసాపూర్వకంగా చూసింది ఉదయిని.

కాస్సేపట్లో సమీరని పికప్ చేసుకోవడానికి వచ్చిన సాయి లోపలికి వచ్చేలోగా

సమీర వెనక్కి వచ్చి ఉదయినిని కౌగలించుకుంటూ

"ఎన్నో ఓటముల మధ్య ధైర్యంగా నిలబడి గెలిచిన తన్మయి గాథ ఇప్పుడిప్పుడే జీవితం ప్రారంభిస్తున్న నాలాంటి ఎందరో యువతులకు స్ఫూర్తిదాయకం ఆంటీ! ఈ ఇతివృత్తంతో కథ రాయకూడదూ మీరు? అన్నట్టు మీ సహాయానికి ఏమివ్వగలను? మీ ప్రాణ స్నేహితురాలైన మా అమ్మ మీకు ఇమ్మని ఇచ్చిన ఇది తప్ప-" అని

పర్సులోనించి

"..--- ప్రియమైన రాజీకి సదా ప్రేమతో- నీ- దయ" అని అందంగా, ముత్యాల్లాంటి అక్షరాల్తో, మొదటిపేజీలో ఎన్నో ఏళ్ల నించి భద్రంగా దాచిన సన్నజాజి పూలమాలతో బాటు రాసి ఉన్న "గీతాంజలి" ని అందించింది.

ఉదయినికి రాజీ ఉరఫ్ వనజ గుర్తుకు వచ్చింది.

"తెలివెన్నెల వేకువ లో తానమాడీ
అడవి దారి మలుపుల్లో అదరి చూసీ
కొండ తిరిగి.. కోన తిరిగి గుసగుసలాడి..
గల గల మువ్వల నవ్వుల నాట్యమాడీ..
తిరనాళ్లకు తరలొచ్చె కన్నెపిల్లలా
మెరుపులతో మెరిసిందీ వానకారూ
నీలిమొయిలు వాలుజడకు చినుకే చేమంతీ
కట్టుకున్న పచ్చదనం పట్టుపరికిణీ..."

ఆన్ లైన్ మ్యూజిక్ ఛానెల్ లోంచి శ్రీరంగం గోపాల రత్నం గారి గొంతు లోంచి మంద్రంగా, అలల్లా కదిలివస్తూంది ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారి పాట.

కథకు తొలి వాక్యం స్ఫురించింది.